Literary Criticism - II

# సాహిత్య విమర్శ

## సాహిత్య సమాలోచనం

రెండో సంపుటం (1980 - 2025)




మాదిరాజు రంగారావు



2026

రసధుని సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

Literary Criticism - Vol. 2

# సాహిత్య విమర్శ

## సాహిత్య సమాలోచనం

**రెండో సంపుటం**

**రచనా కాలం 1980 - 2025**

**మాదిరాజు రంగారావు**

### నాన్నగారి జ్ఞాపకార్థం

మా నాన్నగారు, ఆచార్య మాదిరాజు రంగారావు గారి విశిష్ట సాహిత్య సేవలకు నివాళిగా, మాదిరాజు రంగారావు గారి సాహిత్య విమర్శ, సాహిత్య సమాలోచనం రెండో సంపుటం పునః ముద్రణ చేసి సాహితీ సహృదయులకు, శ్రేయోభిలాషులకు అందుబాటులోకి తీసుకొస్తున్నాము.

**మాదిరాజు సంతోష్ కుమార్**

**దేవులపల్లి హరిత**

**మాదిరాజు చరిత**

**రసధుని**

**సాహితీ పరిషత్తు**

**శాంతినగర్, హైదరాబాద్-28.**

Literary Criticism - Vol.2

**SAHITHYA VIMARSHA**
**SAHITHYA SAMALOCHANAM**

**by**
**Prof. Madiraju Ranga Rao**

© **Dr. M. Santhosh Kumar**

Edited by Madiraju Santhosh Kumar
Devulapally Haritha
Madiraju Charitha

Reprint 2026

ISBN : 978-93-5692-579-3

**Price : 1000/-**

*For Copies :*
Dr. Madiraju Santhosh Kumar
98499 79899

*Printed at :*
**Anupama Printers**
Shantinagar, Hyderabad - 28
Phone : 040-23391364
E-mail : anupamaprinters1978@gmail.com

# సాహిత్య విమర్శ

## సాహిత్య సమాలోచనం

### రెండో సంపుటం

### రచనా కాలం 1980 - 2025

## విషయ సూచిక


| | | పేజీలు |
|---|---|---|
| 10. | సృజన రూపం మానవీయ భావన | 112 |
| 11. | స్వేచ్ఛా కవిత్వతత్వం – 1 ప్రజాస్వామ్య భావన | 64 |
| 12. | స్వేచ్ఛా కవిత్వతత్వం – 2 మానవీయ భావన | 42 |
| 13. | స్వేచ్ఛా కవిత్వతత్వం – 3 సహృదయ స్పందన | 72 |
| 14&15. | స్వేచ్ఛా కవిత్వంలో భావనా రూపాలు– వివిధ పార్శ్వాలు– సమదర్శనం | 134 |
| 16. | Facets of Telugu Free – Verse | 44 |
| 17. | పరిశోధనా స్వరూపం | 50 |
| 18&19 | అధికార భాష & అనువాద కళ | 44 |
| 20. | ఆలోకనం – నవల సమాలోచనం | 68 |
| | స్వేచ్ఛా కవిత్వం | 62 |
| | దాశరథి కవితా సమాలోచనం | 64 |
| | శ్రీశ్రీ మహాప్రస్థానం | 42 |
| | నవల స్వరూపం | 102 |

సాహిత్య సమాలోచనం Literary Criticism -10

# సృజన రూపం మానవీయ భావన

మాదిరాజు రంగారావు

**2026**
రసధుని
సాహితీ పరిషత్తు
శాంతినగర్
హైదరాబాద్ – 500 028

**Literary Criticism - 10**

# SRUJANA ROOPAM - MANAVEEYA BHAVANA

(Sahithya Samalochanam)

by

Prof. Madiraju Ranga Rao

© Dr. M. Santhosh Kumar

First Edtion : 2006
Second Edition : 2014
Third Edition : 2026

Presented to
my son
Dr. M. Santhosh Kumar
with blessings
on his Birthday

# సృజన రూపం

# మానవీయ భావన

## సూచిక


I.1. స్వేచ్ఛా కవిత్వంలో కావ్యం .............................. 01

I.2. సృజన రూపం .............................. 03

I.3. సృజన వివేచనం .............................. 09

I.4. మానవీయం – నేటి ప్రాధాన్యం .............................. 15

I.5. మానవీయం – ప్రయోజన విస్తృతి .............................. 21

II.1. త్వమేవాఽహం – విమోచనోద్యమం .............................. 27

II.2. తెలంగాణ – విలీన భావం .............................. 34

II.3. ముక్తధాత్రి – అంతర్జాతీయ స్వాతంత్ర్యోద్యమం .............................. 40

II.4. వియత్నాం – అంతర్జాతీయ విప్లవోద్యమం .............................. 46

II.5. మానవీయం – మానవ సమాజ చిత్రణం .............................. 52

II.6. విశ్వంభర – మానవ వికాస రేఖా చిత్రం .............................. 59

II.7. నా దేశం నా ప్రజలు – విప్లవ సాంస్కృతిక బింబం .............................. 67

II.8. అగ్ని నుండి ఆనందానికి – సామాజిక తాత్త్విక స్పందనం .............................. 76

II.9. పడగెత్తిన ఉదయం – వర్తమాన స్థితి చిత్రణం .............................. 84

II.10. జీవన లిపి – సమకాలీన జీవన చిత్రణం .............................. 91

II.11. జీవ నది – ఆధ్యాత్మిక మానవతా లోకనం .............................. 96

II.12. అగ్ని పీఠం – వర్తమాన సమాజ మానవీయ దర్శనం...... 99–109

# I

## 1.1. స్వేచ్ఛాకవిత్వంలో కావ్యం

స్వాతంత్ర్యానంతరం స్వేచ్ఛా కవిత్వంలో కావ్యాల్ని పరిశీలిస్తే వాటి ప్రత్యేకతల్ని గుర్తు చేసే కొన్ని సాధారణాంశాలు సమాలోచనాదృష్టిని ఆకర్షిస్తాయి. (1) వస్తువు – మొదటి నుండి చివరి వరకూ ఏక సూత్రంగా ఉండవచ్చు / లేదా కొన్ని అంశాల సమాకలనంగానూ ఉండొచ్చు / లేదా విషయంలో పలు అంశాల పేటలా లేదా ఏదో ఒక విషయం కేంద్రంగా ప్రత్యక్షంగానో పరోక్షంగానో సంబంధం ఉన్న భావాలచే సంక్లిష్టమై ఉండొచ్చు. ఈ ప్రక్రియలో వస్తువు బహు వైవిధ్యోపేతంగా ఉండడంవల్ల దేనికది సృజన క్రియలో ప్రత్యేక రూపాల్ని పొందింది. వస్తువులో విషయ పరంపర ఉంటుంది. కావ్యంలో ఇది అనేక సంఘటనల చేత స్థితుల చేత పరిపుష్టమవుతుంది. దీనికి (2) జీవిత చలనం సమాజ గమనం తోడ్పడతాయి. ఇందులో వాస్తవికత ఉంటుంది. ఎంతోకొంత కాల్పనికతనూ వాస్తవ సాదృశ్యాన్ని (verisimilitude) పొందుతుంది. ఏదైనా ఎంత వాస్తవికతను కోరినా యథాతథంగా కవిత్వంలో నిర్వహించడం కుదరదు. ఆకర్షణీయతను నిలపడం కష్టం. అందువల్ల కల్పన అనివార్యమవుతుంది. విషయ పరంపర భౌతిక స్వరూపానికి కారణమవుతుంది. వస్తువు ఎన్నికలో కవికి సంపూర్ణమైన స్వేచ్ఛ ఉంది. ఇది సృజన రూపంలో అంతర్లీనమై అందుతుంది. సృజనక్రియలో అవగతికి వస్తుంది. త్వమేవాఽహంలో తెలంగాణలో వస్తువు కేంద్రస్థానాన్ని వహించింది. విశ్వంభరలో విషయసూత్రం పలు అంశాల శకలాల హారంలా ఉంది. మరి కొన్నిటిలో భావ సంశ్లిష్టత స్పష్టంగా కనిపిస్తుంది. 'అగ్ని నుండి ఆనందానికి', 'నాదేశం నా ప్రజలు'లో వస్తువు వివిధాంశాల సమాకలనంగా గోచరిస్తుంది. 'అగ్ని పీఠం'లో వస్తువు మూడు పేటలుగా నిర్మాణంలో విషయగుణం చేత నిర్వహణ కళను పొందింది. ఇట్లా దేనికది సమాలోచనార్హ మవుతున్నాయి. విషయంలో జీవిత చలనానికీ సమాజ గమనానికీ ప్రాముఖ్యం సిద్ధిస్తూంది. (3) ప్రకృతి నేపథ్యం – కావ్యంలో అభిన్నంగానూ, ప్రధానంగానూ, పోషకంగాను వివేచన కందుతుంది. దీని పాత్ర అనేక విధాలుగా గోచరిస్తుంది. కావ్యారంభం నుండి సమాప్తి వరకూ ఆయా సంఘటనల స్థితుల చిత్రణంలో ప్రకృతి రూపం కళాత్మకంగా రూపొందడం (నాదేశం నా ప్రజల్లో) జరుగుతుంది. ఇది కావ్య నిర్మాణంలో ఎన్ని విధాలుగానో ఉపకరిస్తుంది. ఆధార భూమిగానూ భావ రూపాల్లో ప్రతీకల్లో (మానవీయంలో) పరిపరివిధాలుగా విశ్లేషణ కందుతుంది.

ఏమైనప్పటికీ కాలం-స్థలం ప్రమేయంలో ప్రకృతి నేపథ్యం నిర్మాణంలో భాగంగా సృజన రూపంలో కలిసిపోతుంది. ఇది ప్రకృతికీ మనిషికీ - ప్రకృతికీ సమాజానికీ గల అనివార్య సంబంధాన్ని స్థాపిస్తూంది. (4) కళాత్మకత - కవిత్వానికి ప్రధానమైంది. కావ్యంలో శబ్దం నుండి అర్థాంతరం వరకూ ఎన్నో ముఖాలుగా వ్యాప్తమై ఉంటుంది. కావ్యానికి శీర్షిక - ఆరంభం నుండి చివరి మలుపు - కొసమెరుపు సమాప్తి వరకు అభివ్యక్తి రామణీయకతలో భాగంగా వర్తిస్తుంది. కవి సృజన శక్తి చేత సంకల్పితమైన కావ్యం కళాత్మకత చేత ఆకర్షణీయ రూపాన్ని పొందుతుంది. ఆయా కవుల వ్యక్తిత్వాలను బట్టి భేదించడం సహజం (5) తాత్త్వికత - మానవ జీవితంలో సారభూతమైన ఆలోచననూ విలువైన అనుభవాన్ని సంతరించుకుంది. సార్వజనీనమైన విలువలతో కూడింది. నైతికమైన ఆదర్శయుతమైన శ్రేయోరూపాన్ని ఆవిష్కరిస్తుంది. సర్వసమ్మతమైందీ. ఉదార లక్షణం కలిగిందీ. మానవ జీవితానికీ సమాజానికీ అవసరమైనట్లే, కావ్యంలోనూ అంతో ఇంతో చోటు చేసుకుటుంది. పరిపూర్ణతకు దారితీస్తుంది. (6) లక్ష్యం : ఆదర్శంతో కూడింది లేదా సిద్ధాంత నిబద్ధమైంది. స్వేచ్ఛా కవిత్వంలో కావ్య ప్రపంచంలో ఎన్నో చర్చలకూ అభిప్రాయ భేదాలకూ కారణమైంది. ఇది కావ్యంలో స్పష్టంగా ప్రతిపాదితం కావాలని కొందరూ, సూచనగా ఉండాలని కొందరూ. దీని అవసరం లేదని మరికొందరూ, శ్రోతలూ, పాఠకులూ అయిన సహృదయుల నిర్ణయానికి వదలివేయాలని కొందరూ భావించారు. ఈ విధంగానే పలు కావ్యాలు అవతరించాయి. జీవితంలో వలెనే సమాజానికి వలెనే కావ్యానికీ లక్ష్యం అవసరం. ఇది ఏ నిష్పత్తిలో ఏ మేరలో ఏ విధంగా ఎంతవరకు ఉండాలన్నదే చర్చనీయాంశం. లక్ష్యం సామాజికం కావచ్చు. రాజకీయం కావచ్చు, వైయక్తికం కావచ్చు. మరొకటి మరొకటి కావచ్చు. ప్రజాస్వామ్యంలో దేన్నీ ఒకరి అభిప్రాయ స్వేచ్ఛ నియమించడానికి వీల్లేదు. లక్ష్యసాధనలోనూ సృజనరూపాన్ని అడ్డుకోవడం గాని, సృజన దృష్టిని నిరోధించడం కాని జరగడానికి వీల్లేదు. ఇది మానవ వికాసానికీ సమాజ ప్రగతికీ దోహం చేసేదిగా ఉండడం మాత్రం అవసరం. లక్ష్యం ఎన్నుకున్న వస్తువును బట్టి కవి దృక్పథాన్ని బట్టి ఉంటుంది.

ఈ ఆరు లక్షణాలతో అవతరించిన కావ్యంలో సవ్యరూపం కవి ప్రతిభ చేత ఉపజ్ఞ చేత సృజన రూపం మరియు మానవీయ భావనతో సమాపూర్ణతను పొందుతుంది. ఎన్ని చెప్పినా చివరకు అన్నిటికీ కవి స్వేచ్ఛయే జీవభూతమైంది. దీని నుండి ఉద్భవించిన సృజన రూపమే యథాతథంగా ఆమోదనీయమైందీ. ఇది కవిలో సృజన ప్రతిభయొక్క ప్రకాశరూపం.

# 1.2 సృజన రూపం

భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందడంతో చరిత్రలో కొత్త యుగం ఆరంభమయింది. భారత రాజ్యాంగం (26 జనవరి 1950) ఆచరణలోకి రావడంతో ప్రజాస్వామ్య వ్యవస్థను అవలంబించడంతో సామాజిక రాజకీయ పాలనా స్వరూపం మారింది. అన్ని క్షేత్రాల్లో ప్రజాస్వామ్య చేతన ప్రధానమైన పాత్రను పోషించింది. వేల ఏండ్ల అస్తిత్వ పరంపరతో దేశానికి ప్రాతినిధ్యం వహించే సనాతన సమాజంలోని ప్రధానమైన సాంస్కృతిక జీవన మహా ప్రవాహానికి తోడుగా చారిత్రకమైన స్థితుల్ని బట్టి మరికొన్ని ధారలూ భాగస్వామ్యాన్ని పొందాయి. దేని ప్రత్యేకత దానిదే. భారత రాజ్యాంగాన్ని బట్టి లౌకిక తలంపై వ్యవహార స్థాయిలో అన్ని మతాలకూ సమానమైన గౌరవం ఉంది. అన్నీ ప్రేమ, సహనం, శాంతి భావనా దిశగానే కార్యకలాపాలు సాగించవలసి ఉంది. అన్నిటి లక్ష్యం – సమాజ శ్రేయస్సే. అయితే ముఖ్యంగా ప్రధానమైన సాంస్కృతిక ప్రవాహ రూపం ప్రాతినిధ్యం వహిస్తూ సంప్రదాయ చిహ్నాలతో కూడింది, ఆధునిక భావజాలంతో ప్రగతికి దోహదం చేయడమూ కనిపిస్తుంది. దీనితో ఒక సమన్వయ సహన దృక్పథమూ పెంపొందింది. అది స్థిర పడింది. ఎన్నిటినో విలీన పరచుకొని శక్తి సంపన్నమయింది.

దేశంలో స్వాతంత్ర్య వాతావరణం చేత ప్రజాస్వామ్య చేతనతో వైజ్ఞానిక స్పృహతో కొత్త ఉత్తేజమూ సరించింది. ఇది పూర్తి వికాసానికీ సామాజిక ప్రగతికీ సహకరించింది. దీనితో సమాజంలో వివిధ క్షేత్రాల్లో కార్య కలాపాలెక్కువయినాయి. బహుక్షేత్రాలు విస్తృతినీ పొందాయి. మానవ సంబంధాలు పెరిగాయి. సృజన రూపం మరియు మానవీయ భావనతో స్వేచ్ఛా కవిత్వం ప్రజాస్వామ్య ప్రభావంతో వైవిధ్యాన్ని వైశిష్ట్యాన్ని సంతరించుకుంది. మిగతా ప్రక్రియలూ ఈ దారినే పయనించాయి. ఈ సందర్భంలో సృజన రూపాల్లో స్వేచ్ఛా కవిత్వంలో కావ్యం బహు ముఖీనంగా వర్తించింది. బాగా ఆకర్షించింది.

సమాజంలో ప్రతి మార్పుకీ విశేషమైన కదలికకూ మొదట స్పందించే విశిష్టమైన సృజన రూపం కవిత్వం. ఆవేశం ఆవేగం అనుభూతి ఆలోచన దర్శనంతో అభివ్యక్తి రామణీయకతతో ఆకర్షణీయమైన స్థానాన్ని పొందింది. ఆయా సందర్భాల్లో స్వేచ్ఛా కవిత్వంలో కావ్యం ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం సముచితమైన పాత్రను నిర్వహించింది. సామాజికంగా సహేతుకమైన చారిత్రకావసరాన్ని సమంజసంగా

సమర్థవంతంగా నిర్వర్తించింది. దీనికి ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ సమానత్వం, సామాజిక న్యాయం, మానవతా గుణం ఎంతగానో తోడ్పడినాయి. వ్యక్తి వికాసంతో పాటు సమాజాభ్యున్నతి లక్ష్యంగానూ స్వేచ్ఛా కవిత్వంలో కావ్యం బలమైన అస్తిత్వాన్ని పొందింది. ఇదొక పరిహరింపరాని స్థానాన్ని పొందింది. భారతదేశంలో అన్ని భాషల్లోనూ ఇదే స్థితిలో ఈ ప్రక్రియ బాగా విస్తరిల్లింది. వస్తువు ఎన్నికలో విషయ ప్రతిపాదనంలో అభివ్యక్తి విధంలో లక్ష్యనిర్దేశంలో తనదైన నవ్యతను నిలుపుకుంది. బహు వైవిధ్యాన్ని పొందింది. ప్రదర్శించింది.

ప్రజాస్వామ్య చేతనలో సృజన రూపానికి మానవీయ భావన తోడయింది. జోడింపబడింది. స్వేచ్ఛా కవిత్వంలో కావ్యం, పూర్వం లేని పార్శ్వాల్ని సంతరించుకుంది. ఈ కారణంగా సృజన రూపం మరియు మానవీయ భావన అన్న అంశానికి ప్రాధాన్యం సిద్ధిస్తోంది. ఆధునిక యుగంలో ప్రపంచ స్థాయిలో వెలసిన కొత్త కొత్త సిద్ధాంతాలూ ఆదర్శాలూ ధోరణులూ అభిప్రాయాలూ వాదాలూ స్వేచ్ఛా కవిత్వంలో ప్రవేశించాయి. ఈ హేతువు చేత ఎంతో వైవిధ్యం విలసిల్లింది. సృజనదృష్టి ఎప్పటి కప్పుడు కొత్తను దర్శిస్తుంది. సృజన రూపం అపూర్వాన్ని అభిలషిస్తుంది. ఇది కవిలో ఉన్న అంతరమైన ప్రతిభను ప్రకాశమానం చేస్తుంది. మానవీయ భావన మనిషికి సంబంధించిన అంతర్బహిస్స్వరూపాల్ని ఆవిష్కరిస్తుంది. ఒక్కొక్క కావ్యంలో ఒక్కొక్క విధంగా వీటికి సంబంధించిన వివిధాంశాలు వివిధ నిష్పత్తుల్లో సమాకలితమవుతాయి. ఇవి కవి స్వతంత్రమైన మనో మూలంపై నిర్మితమవుతాయి. అన్నింటిలో కొన్ని సాధారణాంశాలు ఉంటాయి. ఆర్షం నుండి అభ్యుదయం దాకా అతీతం నుడి మార్మికం దాకా వ్యక్తి అనుభూతి నుండి సమాజ చింతనం దాకా పర్యాప్తమైన కావ్యాలనేకం వచ్చాయి. వీటిలో సృజనరూపం మరియు మానవీయ భావన గురించి వాటిలోని పేర్కోదగిన ప్రత్యేకతల్ని గుర్తించడం సాహిత్య సమాలోచనంలో అవసరం.

స్వేచ్ఛా కవిత్వంలో వెలువడిన కావ్యాల్లో సాధారణంగా విశ్లేషణకందే అంశాలు కొన్ని ప్రముఖమైనవి.

1. వస్తువు : ఇది ప్రతిపాదనంలో అనేకమైన స్థితులతో, సంఘటనలతో కూడింది. ఇవి విషయాన్ని ఆశ్రయించి ప్రవృత్తమవుతాయి. జీవిత చలనంతో సమాజ గమనంతో వాస్తవ సాదృశ్యాన్ని కలిగి ఉంటాయి. నిర్మాణ విధంలో సావయవ స్ఫూర్తి ఉంటుంది. ఇది ఏకసూత్రంగానో లేదా ఏదో ఒక విషయం కేంద్ర స్థానాన్ని పొందో లేదా

వివిధాంశాల సమాకలనంగానో ఉంటుంది. సమాకలనం సాధారణంగానూ సంశ్లిష్టంగానూ రెండువిధాలుగా ఉంటుంది.

2. ప్రకృతి రూపం : ఇది నేపథ్యంగానో, అంశంగానో, నిర్వహణంలో అంతర్లీన శిల్పంగానో ఉంటుంది. మానవ జీవితానికీ ప్రకృతికీ గల సంబంధం అనివార్యమయింది. సహజమైందీ. కాబట్టి కావ్యంలో ప్రకృతి గురించి ప్రసక్తి పరిపరి విధాలుగా ఉంటుంది. మొత్తం మీద సంవిధానంలో భాగంగా ప్రవర్తితమవడాన్ని గమనించవచ్చు.

3. నిర్మాణ రామణీయకత : ఇది కావ్యంలో వివిధాంశాలకు సంబంధించిన నిర్వహణ గుణానికి సంబంధించింది. అభివ్యక్తి విశేషంతో భావరూపాల ప్రతీకల వినియోగంతో రాణిస్తుంది. ఆవేశ స్థాయి అనుభూతి పరంపర మొదలుగా ఆవేశంతో ఆలోచనతో స్వేచ్ఛాధీనమయింది. ఇది కవి నైపుణీ ప్రకారానికి సంబంధించిన అంశంగా కనిపిస్తుంది.

4. తాత్త్వికత : ఇది మానవ జీవితంలో అనుభవసారమైన చింతనారూపం. ఉత్తమమైన ఉన్నతమైన విలువలకు ప్రాధాన్యమిస్తుంది. ప్రపంచం గురించి ఆలోచన కలిగింది. సార్వజనీనమైంది. విశేష ప్రతిపత్తిని కలిగింది. దార్శనికతను పొందిందీ సంకుచితమైన పరిధుల్ని దాటిన విశాలమైన భావనా జగంతో ఆకర్షిస్తుంది.

5. లక్ష్యం : ఇది వైయక్తిక తలంపై సామాజిక తలంపై శ్రేయోభావనతో ప్రయోజన దిశగా వర్తిస్తుంది. భవిష్యత్తు దర్శనంతో కూడింది. కావ్య ప్రయోజానాన్ని సూచిస్తుంది లేదా స్థాపిస్తుంది. ఈ అయిదు అంశాలు కావ్యంలో కవి ప్రతిభాధీనంగా స్వతంత్రమైన నిర్మాణ కళను పొందడం స్వేచ్ఛా కవిత్వంలో కావ్యాల్లో విశ్లేషణ కందుతుంది. అంటే దీనికో నమూనా అంటూ లేదని అర్థం. కవి తనకు తానుగా అవలంబించే కళా దృష్టితో సృజన రూపం అవతరిస్తుంది.

ఈ లక్షణాల్ని పరిపుష్టం చేసే విధంగా పరిణతిని కలిగించే విధంగా మానవీయ భావన సమాహితమవుతుంది. స్వేచ్ఛా కవిత్వంలో కావ్యాల విషయంలో ఇది చాలా ముఖ్యమైన విషయం. తప్పనిసరిగా కన్పించే అంశం. మనుషుల పరిచయం వ్యక్తి అస్తిత్వం మానవ సంబంధాలూ మానవతా స్పృహ మానవతా స్పందనం మానవ మనస్తత్వ రీతులూ కావ్యానికి ఆధునికత్వాన్ని సంతరింపజేస్తున్నాయి.

పూర్వపు పద్యగేయ కావ్యాల నుండి విభిన్నతనూ ప్రత్యేకతనూ స్థాపిస్తున్నాయి. ఒక విధంగా మానవీయమైన విశాల భూమికను సిద్ధం చేస్తూంది. విశేషమేమంటే కావ్యంలో సందర్భాన్ని బట్టి మరో అంశంతో కలిసిపోతుంది. ప్రవృత్తమవుతుంది, ఏకరూపతను పొందుతుంది.

"ప్రతాయన్తాం వాచో నిమిత వివిధార్థామృత రసాః
న సాదః కర్తవ్యః కవిభి రసవద్యే స్వవిషయే" (ధ్వన్యాలోకం 4-9)

కవుల చేత వాక్ స్వరూపం కవిత్వ నిర్మాణానికనుగుణంగా విస్తరింపబడు గావుత. స్వచ్ఛందంగా వివిధార్థాలతో నియతమైన మధురమైన శాశ్వతమైన రసాకృతిని పొందు గావుత. ఇది ధ్వన్యాలోకంలో ప్రసారమైన సుప్రసిద్ధ అలంకార శాస్త్రవేత్త ఆనంద వర్ధమని అభిప్రాయం. ఇది అన్ని కాలాలకూ అన్ని భాషల్లోని సాహిత్యాలకూ వర్తిస్తుంది. ఎందరో కవులు ఇదివరకే అంతా చెప్పేశారు. ఇది మిగిలింది ఏముంది? ఏమీ లేదని నిరాశ పడరాదు. ఏమాత్రం విషాదానికి గురి కారాదు. ఏ విధంగానూ నిరుత్సాహపడనవసరం లేనేలేదు. ప్రతిభ చేత సాధించవచ్చు.

ప్రతిభ చేత మాత్రమే సృజనశక్తి ఎప్పటికప్పుడు కొత్త రూపాన్ని దర్శింప జేస్తుంది. అయితే దీనికి కవిలో సృజన దృష్టి అవసరం. శబ్ద ప్రభావంతో అభివ్యక్తిలో ఆకర్షణను పొందుతుంది. కళాత్మకత చేత రామణీయకత సిద్ధిస్తుంది. సృజనదృష్టి ఉన్న మనస్సుకు వస్తువు విషయంలో ఏ కొరత లేదు. అది అక్షయమయింది. ఎప్పటికపుడు నవనవంగా దర్శనమిస్తుంది. అనుభవలోకాన్ని ప్రసాదిస్తుంది. ఆలోచనకు అవకాశమిస్తుంది. ప్రతిభా చక్షువుకు సృజన దృష్టికి కనిపించని స్థలం లేదు, కాలం లేదు. వస్తు దారిద్ర్యమూ ఉండదు. ప్రపంచంలో అమూల్యమైన విషయ సంపద ఎంతో ఉంది. జీవితంలో చూచే దృష్టి కావాలి. అంతే! దీన్ని సంపన్మయం చేసే మానవ జీవితంలోని మానవ సమాజంలోని క్రియాకలాపాలతో అభిన్నంగా ఉండడం ఈ కావ్యాల్లోని విశిష్టత. ఇది కవి వ్యక్తిత్వాన్ని బట్టి రూపొందుతుంది, సహజం కూడా. సృజనరూపం స్వేచ్ఛా కవిత్వంలో కావ్యాల్లో కొత్త విషయంతో కూడింది. దీన్ని అన్వేషించే దర్శించే ప్రతిభా కిరణంతో ప్రకాశిస్తుంది. పూర్వం చెప్పిన దానికన్నా భిన్నంగా కృతి మొత్తం మీద కొత్త సృజన రూప ప్రసారంతో ప్రత్యేకతను కలిగి ఉంటుంది. కవిలో సంస్కార గుణం చేత స్థాయి ఏర్పడుతుంది. దీనికే నియమ నిబంధనలూ లేవు. ఈ కావ్యాలు వస్తు పరంగానూ మరియు

భావమయంగానూ – మూర్త మరియు అమూర్త గుణాలతోనూ – అనుభూతి మరియు హేతు యుతంగాను పూర్వం నుండి వచ్చే నియమాలకు కట్టుబడే అవసరం లేకుండానూ – వాస్తవికత మరియు కాల్పనికతతోనూ – సౌందర్య భావన మరియు ఆధ్యాత్మికతతోనూ – విశ్లేషణకందుతాయి. కవి సమాజంలో విశిష్టుడూ ప్రతిభామూర్తి కళామయుడూ మానవతా హృదయుడూ అన్న భావనతో సాక్షాత్కరించడం కావ్య జగత్తుకు ఆనందాన్ని కలిగించే అంశం.

సృజన రూపమనేది కావ్యంలో వస్తువు ఎన్నిక మొదలుకొని సమాప్తి వరకూ అన్ని అంశాలకూ వర్తిస్తుంది. వాటి సంయోజనంలో ఉపజ్ఞ కనిపిస్తుంది. ఈ విధంగా మౌలికమైన జీవశక్తి ప్రసారంతో సృజనరూపం స్వేచ్ఛా కవిత్వంలో కావ్యాల్లో విశ్వరూపాన్ని పొందింది. కొత్త ప్రపంచాల్ని అవతరింపజేసింది. సృజనక్రియలో కవిలో ఉన్న అంతశ్చేతనా స్పర్శతో మహితమయిన స్థితీ అనుభవానికి వస్తుంది. ఇది పై స్థాయిలో జరిగే వివేచనకు మాత్రమే అందుతుంది. (1) మనోగతమైన ఆలోచనతో అనుభూతి దర్శనంతో భావ ప్రపంచం ప్రకాశిస్తూంది. సృజన రూపంలో ఇవి ఆశ్చర్యాన్ని కలిగించేవిగానూ రూపొందుతాయి. (2) భౌతికమైన స్థాయిలో అభివ్యక్తి శిల్పం శబ్ద విలసనం రామణీయకత ఆర్షణతో అలరించేవిగా వికాస రూపాన్ని పొందుతాయి. ఈ విశేషాంశాల కలయికతో ఏర్పడిన కావ్యం స్పందన గుణంతో మళ్ళీ మళ్ళీ వినాలనే చదవాలనే అభిలాష కలుగుతుంది. ఆసక్తి ఇనుమడిస్తుంది. సాధారణేతరమైన విశేషస్థితి సహృదయుల మనస్సుల్ని ఆవర్జిస్తుంది. ఇది కవిలోని అంతశ్శక్తిని భావింపజేస్తుంది. దాని ఎత్తునీ లోతునీ సాంద్రతనూ తీవ్రతనూ వేగాన్నీ వాడినీ వేదననూ సహృదయలోకం భిన్నభిన్నంగా అనుభవిస్తుంది. ఇది వారి వారి వ్యక్తిత్వ సంస్కార స్థాయి భేదాల్ని బట్టి ఉంటుంది.

కవితో సాధర్మ్యం పొందే సహృదయులకెన్నో విషయాలు సులభంగా అవగతమవుతాయి. ఎందరో సాహిత్యవేత్తలు వివిధ భాషల్లో దేశ కాలాలకతీతంగా సమాలోచనలు చేస్తూ వచ్చారు. సాధారణ బుద్ధికి కావ్యంలో సృజన రూపం ఒక అదృశ్యమైన దివ్యశక్తిగానో, ఒక అతీత లక్షణంగానో భావించే వీలుంది. ఇది వారికి సాధారణ స్థాయిని మీరి విశిష్టంగా ఉండడమే కారణం. ఈ అంశాలు కవి మనస్తత్వ పరిశీలనలో సృజన క్రియా వివేచనలో అవగతికి వచ్చే వీలుంది. అంతశ్చేతనకు సంబంధించిన అనుభవ స్పందనం, సౌందర్య భావన కళాభిమతి అర్థాంతర శక్తి మొదలైన విషయాలతో పాటు మానవ జీవితం మానవ సమాజం

గురించి స్పందనం, భావన, క్రియారూపం చోటుచేసుకుంటాయి. మానవేతరమైన చరాచరజగత్తు గురించీ కనిపిస్తుంది. ఇట్లా దీని పరిధి చాలా విస్తృతమయింది. గహనమైందీ. దీన్ని బట్టి సృజన దృష్టి కందనినీ సృజన రూపానికి హేతువు కానిదీ ఏదీ లేదనిపిస్తుంది. అయితే జీవిత చలనంలో భాగంగానూ సమాజ గమనంలో ఒకటిగానూ పరివర్తింపజేయడం కవి నైపుణీప్రకారానికి సంబంధించింది. సృజన క్రియలో మానసికమైన ఏకాగ్రత, స్తిమితత్వంతో కూడిన చింతన, ఉదారమైన తత్త్వమూ అవసరమవుతాయి. ఒక సమాహిత స్థితిలో శబ్దం భావం అభివ్యక్తి కలిసి అసాధారణమైన రూపాన్ని పొందుతాయి. కవి వ్యక్తిత్వం మిన్నగా కనిపిస్తుంది. కవులందరూ ఈ అనుభవ విశేషాన్ని స్థూలంగానైనా వెనక్కివెళ్ళి తమ కావ్యానుశీలన సందర్భంలో గుర్తించగలరు. సృజన సమయంతో పూర్వం తాము పొందిన మానసిక ప్రవాహ స్థితి వివేచన కందుతుంది.

స్వేచ్ఛా కవిత్వంలో కావ్యం ప్రధానంగా సమాజగతంగా వర్తిల్లింది. అనేక మానవ జీవిత శాఖలతో ఆపూర్ణమయింది. కృతి నిర్మాణంలో సజీవమైన శిల్పం లేదా చిత్ర పరంపరా స్థితితో విశేషంగా అనుభూతమవుతుంది. ఈ విధంగా సృజనరూపం కవిలో తనదయిన మానసిక భౌతిక ప్రపంచాల సమ్యక్ రూపంగా సమాలోచన కందుతుంది.

# 1.3 సృజన వివేచనం

స్వేచ్ఛా కవిత్వంలో కావ్యం సృజన దృష్టిలో విశాలమైన ప్రాతిపదిక కలిగింది. కారణం దీనికి నిర్మితిలో నిబంధనలు లేవు. ఛందోనియమాలూ లేవు. బాహ్యం కన్నా అంతరమైన నిర్మాణ రూపాన్ని పొందింది. దాదాపు చాలా కావ్యాల్లో కథారూపం ఉండదు. కేవలం వస్తువులోని మౌలికమైన అంశాలపై లేదా ప్రధాన భావ సూత్రంపై స్థితుల సంఘటనల చిత్రణంతో సమాకలన రూపాన్ని వహిస్తుంది. మానవీయం/ మానవతా భావన కేంద్రంగా జీవిత చలనంతో సమాజ గమనంతో మనస్తత్వ ప్రకాశనంతో ప్రత్యేకతను పొందుతుంది. ప్రతి కవి ఏదో ఒక నవ్యతకై ప్రయత్నించడం సహజం. అయితే ఇక్కడ వివిధాంశాల్ని ఒకచోట చక్కగా చముచితంగా చేర్చే సమాహిత లక్షణంలో అభివ్యక్తి కళతోనే కావ్యం ఆకర్షిస్తుంది. ఇది లోపించడం వల్ల కావ్యత్వం కుంఠితమవుతుంది. ఈ లోపం హద్దులు దాటితే ఆ ప్రయత్నం విఫలమయినట్లే! కావ్యం కనుమరుగైపోతుంది. ఈ ప్రక్రియలో కావ్య నిర్మాణానికి ఏ నియమ నిబంధనలూ ఉండవు. కాబట్టి కవి స్వయంప్రేరణతో ఏదో ఒక నిర్మాణ రూపాన్ని ఏర్పరచుకోవలసిందే. స్వతంత్రమైన నిర్మాణ పద్ధతి చేత కృతిలో ఉత్తమ స్థాయిలో సృజన రూపం అవసరమవుతుంది. కావ్యం కవిలో సృజన పూర్ణతకు చిహ్నమైన కవి అస్తిత్వానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. మానవ ప్రపంచానికి సంబంధించిన దృశ్య పరంపర విశేష రూపంలో అనుభూతికి వస్తుంది. ఇదీ దీని విశేషం.

ఈనాటి పరిస్థితుల్లో స్వేచ్ఛా కవిత్వం ఎక్కువగా మధ్య తరగతి మరియు మధ్య తరగతి నుండి పై స్థాయికి ఎదిగిన వారిలో బాగా వ్యాప్తిని పొందింది. యువతీ యువకులు శాస్త్ర సాంకేతిక విషయాల పట్ల ఆసక్తి చూపే మాట వాస్తవమే. జీవితంలో సత్వరంగా సమకూరే ఉపాధి తదితర ప్రయోజనాలపై దృష్టితో, అనుకోకుండా సాహిత్య కళా సాంస్కృతిక సంబంధాలకు దూరమవుతున్నారు. నిజమే, కాని వారిలో కొందరు ఉద్యోగాల్లో ప్రవేశించిన తరువాత సాహిత్య కళా సాంస్కృతిక విషయాల పట్ల అభిరుచినీ అభిమానాన్నీ రచనా వ్యాసంగాన్నీ కలిగి ఉండడమూ జరుగుతుంది. సాహిత్యాన్నీ కళల్నీ ప్రోత్సహించడానికీ సన్నద్ధులవుతున్నారు. ఇది చాలా మంచి పరిణామంగానే భావించాలి. ఇక కవిత్వానికి వస్తే ఈ వాస్తవం దీని సార్వజనీనత్వాన్నీ చిరంజీవత్వాన్ని నిరూపిస్తూంది. ఈ ప్రక్రియ అన్నిటికన్నా ఎక్కువ

ఆదరణనూ ప్రచారాన్నీ పొందింది. ఇది సమాజంలో ప్రజల ఆశయాలకూ అభిప్రాయాలకూ ఆకాంక్షలకూ ఆదర్శాలకూ సన్నిహితంగా ఉండడమే కారణం. వైవిధ్యంతోనూ విలసిస్తూంది. ఇది ప్రజాస్వామ్యంలో ఆహ్వానించదగిన పరిణామం. ఇందులో సమాజ వికాసాన్ని వ్యక్తి మానసికోన్నతిని కోరే లక్షణంతో పాటు, సమస్యల పట్ల స్పందననూ సామాజికాభ్యుదయాన్నీ అభిలషించే తత్త్వమూ కనిపిస్తుంది.

సమాజ ప్రగతి కనుగుణంగా మానవ వికాస ప్రతిఫలనంగా మార్పుల్ని ఆహ్వానించే కాలంతో పాటు, వేగాన్ని కూడా అవలంబించే మనో రూపం స్వేచ్ఛాకవిత్వం కావ్యాల్లో స్ఫుటంగా కనిపిస్తుంది. ఆధునిక యుగంలో ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యక్తికి లభించిన స్వేచ్ఛకు సంబంధించిన అవకాశాన్ని 'కవిగా, సంపూర్ణంగా వినియోగించుకోవడంలో తప్పులేదు. ఇది సహజం కూడా. సాధారణమైన పౌరుని స్థాయిలోనే కాక' కవి స్థాయిలోనూ తాను నమ్మిన సిద్ధాంతాలకూ విశ్వాసాలకూ తగిన విధంగా బాధ్యతల్ని నిర్వర్తించే క్రియాత్మకత కనిపిస్తుంది. పౌరుడూ కవీ వేరు వేరుగా కాక ఒకటిగా అందునా విశిష్టమయిన వ్యక్తిత్వమూ గోచరిస్తుంది. ఇది కొందరి విషయంలోనే జరుగుతుంది కూడా. ఎవరి మార్గం వారిది. ఎవరికైనా తమ మార్గాన్ని ఎన్నుకునే స్వేచ్ఛ ఉంది.

ఈ ప్రక్రియలో అన్ని విధాలైన భావాలకు చెందిన కవులున్నారు. భావ ప్రకటనా స్వాతంత్ర్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడమూ జరిగింది. ప్రజాస్వామ్యంలో ప్రతివ్యక్తికీ ప్రత్యక్షంగానో పరోక్షంగానో రాజకీయాలతో రాజకీయ పక్షాలతో సంబంధాలకవకాశం ఎక్కువగా ఉంటుంది. కవి దీనికి భిన్నం కాదు. సమాజంలో అనేక క్రియాకలాపాల మధ్య ఉన్నపుడు రాజకీయాలతో సంబంధం కలిగి ఉండడమో క్రియాశీలమైన పాత్రను నిర్వహించడమో ప్రేరణను పొందడమో ప్రభావానికి గురి కావడమో జరుగుతుంది. ఇది సహజం కూడా. ఇది తన కవిత్వానికి భూమికగానూ కొందరు గ్రహించడమూ ఉంది. కావ్య లక్ష్యానికి బాగా ఉపకరిస్తుందనీ భావించవచ్చు. దీని వల్ల కవిత్వంలో సైద్ధాంతికమైన రాజకీయ భావన కవకాశం హెచ్చుగా ఉంటుంది. ఒక్కొక్కపుడు సిద్ధాంతాలతో ఆదర్శాలతో అనుకోని సామీప్యం వల్లనూ జరగవచ్చు. అభిలాషతోనూ లేదా సంబంధం లేకుండానూ తాటస్థ్యంతోనూ వ్యాసంగం కలగవచ్చు. ఇది ఐచ్ఛికమయింది. దీనికి అనుకూలంగా కానీ ప్రతికూలంగా కానీ మరే విధంగానూ నియంత్రించే పద్ధతి కానీ శాసించే విధానం కానీ సృజన విషయంలో సరికాదు. అందునా కవిత్వ

విషయంలో పనిచేయదు. స్వతంత్ర ప్రవృత్తి సహజంగా అధికంగా కలిగి ఉండే కవుల విషయంలో తమ ఇష్టానికి భిన్నంగా ఏ నియమ నిబంధనలూ వ్యర్థమే.

స్వేచ్ఛా కవిత్వ ప్రక్రియ కావ్యాల్లో విస్తృతమైన బహుముఖమైన ప్రాతిపదిక కలిగింది. వ్యక్తిగా కవిగా పౌరుడుగా వివిధ స్థాయిల్లో కలిసీ విడిగానూ వర్తించడం జరుగుతుంది. అపుడు కావ్య ప్రపంచం వివిధ సిద్ధాంతాల ఆదర్శాల అభిప్రాయాల ప్రచలనంతో వైవిధ్యోపేతంగా విలసిల్లుతుంది. సృజన వివేచనలో ఎవరి ఇష్టాలకూ అనిష్టాలకూ లొంగని మనోరూపాన్ని గుర్తించడ మవసరం. ఈనాటి పరిస్థితుల్లో సమాజంలో రాజకీయాలనుండి పూర్తిగా దూరం కావడం లేదా తొలగడం కష్టమే. ఏదో సమస్యపై ఒక్కొక్క స్థితి అనుకూలంగానో ప్రతికూలంగానో అభిప్రాయ ప్రకటనకు దారితీస్తుంది. ఏ మేరలో ఏ సాంద్రతలో ప్రభావాన్ని నెరపుతుందనేది వేరే విషయం. దీనిపై కవుల్లో సూక్ష్మతలంపై అభిప్రాయభేదాలున్నాయి. స్థూల తలంపై మాత్రం ప్రత్యక్షంగానో పరోక్షంగానో రాజకీయ ప్రభావం లేదా ప్రమేయ రూపం దృష్టికి వస్తుంది. రాజ్యాంగ పరంగా లభించిన స్వేచ్ఛ మరియు కవిలో సహజంగానే ఉండే స్వతంత్ర ప్రవృత్తి కలిసి సృజన దృష్టిని మరింత బలోపేతం చేస్తాయి. ఇది కవి వ్యక్తిత్వంతో విడదీయరానిదిగానూ ఉంటుంది.

స్వంత జీవితమూ సామాజిక జీవితమూ కవి జీవితమూ మధ్య ప్రసార రేఖలే విధంగానైనా ఉండవచ్చు. ఏదో ఉండి ఉండకనూ పోవచ్చు కూడా. వీటిలో ఏది ఎట్లా దేనితో ఎంతవరకు పనిచేస్తాయన్నది వేరే విషయం. ఎంతో జాగ్రత్తగా చేసే సహేతుకమైన సృజన వివేచనకు మాత్రమే అందుతుంది. ఈ దిశలో సమాలోచనం జరగవలసి ఉంది. మనస్తత్వ పరమైన దృష్టి కోణమూ ఎంతో సహకరిస్తుందని వేరే చెప్పనవసరం లేదు. కావ్యకళ విషయంతో పాటు, దాని వెనుక నుండి పనిచేసే చారిత్రక రాజకీయ సామాజిక సాంస్కృతిక మనస్తత్వ గతమైన అంశాల వినియోగంతో సమాలోచనకు పరిపూర్ణత సిద్ధిస్తుంది. సృజన రూపానికి పుష్టినిచ్చే ఏ అంశాన్నీ విస్మరించడానికి వీలులేదు.

కావ్యం పూర్తి అయి వెలువడిన తరువాత, కాలం గడిచే కొద్దీ కవి ఇష్టానిష్టాలతో ప్రమేయం తగ్గుతూ పోతుంది. కవి అభిప్రాయం కూడా కొన్ని పరిమితుల్లోనే ఉపయోగపడుతుంది. పాఠకులూ శ్రోతలూ అయిన సహృదయులు మాత్రమే ప్రముఖమైన పాత్ర వహిస్తారు. కాలంపై కావ్యం చారిత్రకంగా సామాజికంగా

రికార్డు చేయబడిన భౌతికమైన మానసికమైన అనుభవరూపంగానే విలసిస్తుంది. కావ్యంలో సృజన దృష్టితో పరచిన వస్తుగతమైన విషయం, ముందుగా ఆలోచనలో దిగుతుంది. దీనికి సంబంధించిన భావ గతులపై దృష్టి ప్రవర్తిస్తుంది. భావచిత్రాలు ప్రతీకలు కళా సంయోజనలో పొందే విశిష్ట రూపాలు అనుభవానికి వస్తాయి. చివరకు అభిప్రాయం లక్ష్యం దర్శనం పరమార్థం చింతనలో ప్రకాశిస్తాయి.

ప్రతి కవికీ ఒక అభివ్యక్తి రూపం ఉంటుంది. ఇది స్వంతమైన ముద్రగా భాసిస్తుంది. ఎవరి వ్యక్తిత్వం వారిదే. సృజన దృష్టిలో ఈ ప్రత్యేకతను సహజమైన స్వతంత్రమైన అభివ్యక్తి కళగా పేర్కోవచ్చు. వివిధాంశాల యోజనతో శిల్పంగా మరింత ఆకర్షణీయతను పొందుతుంది. అంతశ్చేతన ప్రేరణతో కావ్యం సృజన రూపాన్ని పొందుతుంది. మానవీయ భావనతో జీవ ప్రసారాన్ని నిలుపుకుంటుంది. ఉత్తమ కావ్య సృజన సమయంలో కవిలో సహితమైన ఆత్మతేజం, ఏ వికారాలకూ మాలిన్యాలకూ గురికాకుండా ఉంటుంది. అట్లా ఉండడం అవసరం కూడా. ఉదాత్తమైన నిబద్ధమైన మనో రూపంతో సృజన ప్రక్రియ స్వచ్ఛంగా సాగుతుంది. ఇది ఏ భాషా కవికైనా వర్తిస్తుంది. వర్తమానం నుండి, గతంలోని చిహ్నాలతో భవిష్యత్తులోకి దారితీసే కావ్యం, మానవ ప్రస్థానంలో ఒక సృజన ప్రపంచం. విలువైందీ, చిరమైందీ, సజీవమైందిగా అవతరించడం ఒక తపఃఫలమే. తరాలను ప్రేరేపించేదీ, మనిషిలో అస్తిత్వానికి కొత్త శోభను చేకూర్చేదీ కావడం ఒక విశేషంగా గొప్ప విషయంగా సృజన వివేచన కందుతుంది.

కావ్యం మనిషిని గురించి మనిషి కోసం మనిషి చేత వ్రాయబడే సృజన క్రియాఫలం. మానవ సంపదలో భాగమవుతుంది. ఉన్నతమైన యానానికీ ఉత్తమమైన సంస్కారానికీ ఉదాత్త లక్ష్యానికీ ప్రేరేపిస్తుంది. కేవలం కృతికి మాత్రమే పరిమితమయినపుడు సమాలోచనం అనవసరమైన సంబంధంలేని విషయాలకు దూరంగా వర్తిస్తుంది. అసలు విషయంపై దృష్టి ప్రసరించడానికి అవకాశమెక్కువగా ఉంటుంది. కవి వ్యక్తిత్వంలో కనిపించీ కనిపించని, ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ పనిచేసే అంశాల్ని గ్రహించి, వాస్తవాన్వేషణ జరపడమూ సమంజసం. అన్వేషణతో కల్పనకే మాత్రం తావులేదు. ప్రతిదీ హేతుయుతంగా అనుభవ గుణంతో వివేకయుతమై ఉన్నపుడు, చక్కని ఫలితాల్ని ఇస్తుంది. కావ్యం కవిత్వ చరిత్రలో ఆ పరంపరకు ప్రవాహకతను సిద్ధింపజేస్తుంది. ఒక ఉత్తమ మార్గాన్ని పరంపరను కాపాడుతుంది.

దీని వెనుకనున్న చారిత్రక సామాజిక మనస్తత్వ పరమైన అనేకాంశాలను ముందు ముందు అధ్యయనం చేయడానికి మూలాధారంగా తోడ్పడుతుంది. ఒకొక్కప్పుడు సాహిత్యగతంగాను కొత్త పార్శ్వాల్ని గురించి ఆలోచనకు ఉపయోగపడుతుంది. స్వేచ్ఛా కవిత్వంలో కావ్యాల్లో చాలా భాగం వర్తమాన యుగాన్ని ప్రతిబింబించేవిగా ఉన్నాయి. సామాజిక వాస్తవికతను కలిగి ఉన్నాయి. ఆలోచన అనుభూతి అన్వేషణం దర్శనం గురించి సృజన దృష్టితో పూర్వ కావ్య ప్రపంచానికి భిన్నమైన విశేష స్వరూపం వివేచనకందుతుంది.

సృజన శక్తి కారణంగా ఒక్కొక్కప్పుడు హేతువు కతీతమైన గుణాలతో వర్తించడం వల్ల, బుద్ధి వికాసాన్ని దాటిన అంతఃప్రకాశ దశల్ని అందుకోవలసి ఉంటుంది. కావ్యంలో అపూర్వం అనితరం విశిష్టత ప్రత్యేకత అనేవి ఎప్పుడు బడితే అపుడు లభ్యమయ్యేవి కావు. ఈ లక్షణాలు కవిలో మానసికంగా నైర్మల్యం ఏకాగ్రత నిబద్ధత చిత్తశుద్ధితో కూడిన ప్రతిభ వల్లనే సాధ్యం. దీనితోపాటు అవసరమైంది మానవీయం అనీ వేరే చెప్పనవసరం లేదు. ఇది స్వేచ్ఛా కవిత్వం కావ్యంలో తగిన స్థాయిలో ఉండాలి. లేకపోతే ఆధునికత లోపిస్తుంది. కావ్య ప్రయోజనమూ కుంఠితమవుతుంది. సమాజంలో అనేకమైన వాస్తవ స్థితులతో సంఘటనలతో ఏర్పడే అనుభవాలతో ప్రవర్తనలతో ఆలోచనలతో కూడిన జీవితాలతో సమాజం – దీని వెనుక నున్న మనోరూపం – కలిసిన అస్తిత్వం మన ఎదుట సాక్షాత్కరిస్తుంది. ఎంతటి వాస్తవాలలోనూ కల్పన తప్పదు. దీన్ని వాస్తవ సాదృశ్యం గానూ పేర్కోవచ్చు – ఇది వాస్తవాల్ని పోలిన విధంగా లేదా జ్ఞాపకం చేసే విధంగా రూపొందుతుంది. కళాత్మకతతో పాటు సామాజిక ప్రయోజనమూ కలిగింది. నైతికమైన విలువలతో ప్రబోధాన్నీ ఆదర్శాన్నీ సూచిస్తుంది.

ప్రతి భాషా సాహిత్యంలోను పూర్వంనుండి వచ్చే పరంపరలోని కొన్ని అంశాలు ఆధునిక యుగంలోనూ ఎంతో కొంత ప్రభావాన్ని ప్రసరిస్తాయి. అయితే నవ్యత అనేది దీనికి భిన్నంగా సృజన రూపంలో భాసిస్తుంది. ఆధునికమైన అవసరాలకు తగిందీ, మార్పులకనుగుణమైందీ. దీనికిది ఒక సంపూర్ణ రూపంగానూ ఏర్పడుతుంది. స్వేచ్ఛా కవిత్వంలో కావ్యానికిది పూర్తిగా అన్వయిస్తుంది. సృజన దృష్టిచేత కవి వ్యక్తిత్వంతో రూపొందే కొత్త ప్రపంచం, ఒక్కొక్క కావ్యంలో ఒక్కొక్క ప్రతిభారూపంతో దర్శనమిస్తుంది.

“వాచస్పతి సహస్రాణాం సహస్రైరపి యత్నతః
నిబద్ధా సా క్షయం నైతి ప్రకృతిర్జగతామివ” (ధ్వన్యా 4-10)

జగత్తులో నిరంతరం ఉద్భవిస్తూ ఉండే, ఎప్పటికీ తరగని సంపదలా సృజన రూపానికి వస్తువు కొరత లేదు, ఉండదు. మన చుట్టూ ఎంతో వర్తిస్తూ ఉంటుంది. వేల వేల బృహస్పతులు వేల మార్లు (యత్నించినా) ఉపయోగించినా ఇంకా మిగిలే ఉంటుంది. ఎంత అక్షర బద్ధం అయినా, కావ్యంలో నిబంధితమయినా వస్తు ప్రపంచం ఇంకా ఎంతో మిగిలే ఉంటుంది. కవితా విర్భూతికి సృజన రూపానికీ ఏ విధమైన క్షతి ఏర్పడదు. వస్తువు లభ్యమానవుతూనే ఉంటుంది. ప్రకృతిలో సంపద నెంత ఉపయోగించినా మళ్ళీ మళ్ళీ, అంతలో కొత్తగా వెంటనే అవతరించినట్లే, కవిత్వ విషయంలోనూ విశాల సమాజంలో కొత్త వస్తువు దొరుకుతూనే ఉంటుంది. ఈ కారణంగా సృజన దృష్టిలో కవిత్వం నిర్వచనాల కతీతంగా రూపొందుతుంది. ఎప్పటికప్పుడు చిరంజీవ స్వరూపంతో అవిచ్ఛిన్నంగా కొనసాగుతూనే ఉంటుంది.

సృజన రూపంలో భాసించే వస్తువు సంవేదనతో అనుభూతి గుణంతో అభివ్యక్తి కళను పొందుతుంది. మానవీయ భావనతో అర్థవంతమవుతుంది. లక్ష్యంతో ప్రయోజన పరతను పొందుతుంది. కావ్యంలో సజీవమైన పాత్రను నిర్వర్తిస్తుంది. స్వేచ్ఛా కవిత్వంలో కావ్యం, సృజన భూమికపై బహు వైవిధ్యంతో విలసిస్తూ, ఆధునిక యుగ చేతనకు ప్రాతినిధ్యం వహిస్తూంది. పేర్కొదగిన ప్రత్యేకతలతో విశిష్టతలతో ఉల్లేఖనీయమైనవి మాత్రమే సృజన దృష్టితో వివేచనకర్హమవుతాయి.

# 1.4 మానవీయం - నేటి ప్రాధాన్యం

మానవీయ భావన ప్రపంచమంతటా ప్రాచీన కాలం నుండీ ప్రతి భాషా సాహిత్యాల్లో స్థూలంగా ప్రపంచితమయింది. భారతీయ సాహిత్యంలో ఉదార పరోపకార కరుణ భావజాలంతో స్ఫుటంగా కనిపిస్తుంది. ఆధునిక యుగంలో మానవీయ భావన / మానవతావాదం పేరుతో వెలిసింది. విశేషమైన ప్రాచుర్యాన్ని పొందింది. నిర్దిష్టమైన భావనతో సామాజిక లక్ష్యంతో పాశ్చాత్య ప్రభావ పర్యవసానంగా రూపొందింది. మనిషిలో స్వతంత్రమైన వ్యక్తిత్వంపై సామాజిక సంబంధంపై దృష్టిని ప్రసరిస్తుంది. సాధారణ జీవితంలో అన్నిటికీ మానవుడే అన్నిటికీ ప్రమాణం. కేంద్ర స్థానం. విశ్వం, సమాజం వ్యక్తి గురించి హేతు దృష్టితో అనుభవశీలంతో ఆలోచిస్తుంది. పునర్జన్మ మరియు విధి – దైవం గురించి కాక, ఈ జన్మలో మరియు ఈ జీవితంలో, స్వశక్తిపై ప్రత్యయంతో వర్తింప జేస్తుంది. నైతికమైన విలువలతో సామాజిక బాధ్యతనూ అడుగడుగునా గుర్తు చేస్తుంది. భౌతిక స్థాయిలో, మానసిక స్థాయిలో, మనిషి పాత్రకు పట్టం కడుతుంది. ప్రేమ శాంతి సహనం మొదలైన ఉదార గుణాలతో వసుధైక కుటుంబాన్ని కోరే వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్దుతుంది. మనిషిలో దాగి ఉన్న సృజన శక్తినీ నిర్మాణ ప్రతిభనూ గుర్తిస్తుంది.

ప్రజాస్వామ్య భావన మరియు మానవీయ భావన రెండూ పరస్పర సంబంధం కలిగినవి. ప్రజాస్వామ్యంలో మానవీయ భావనకు ప్రాముఖ్యం పెరిగింది. వ్యక్తి వికాసంతో పాటు సమాజ పురోగతికీ దారితీసేందుకూ వేగవంతం చేసేందుకు ఉపకరించే ఉత్తమ సాధనంగా పరిగణితమవుతూంది. అస్తిత్వ వాదం మొదలు బహు సిద్ధాంతాలకూ ఆదర్శాలకూ ఆధారతలంగా పనిచేస్తూంది. మనిషిపై ప్రత్యయం, మనిషితో సంబంధం, మనిషి గురించి ఆలోచన, మనిషిపట్ల ఉదారతతో మనిషియే వస్తువుగా లక్ష్యంగా కలిగిందీ మానవీయభావన.

స్వేచ్ఛా కవిత్వంలో మానవీయ భావన ఆధునిక భావజాలంతో ప్రకాశమాన రూపాన్ని పొందింది. లౌకిక ప్రపంచంలో వాస్తవతలంపై జీవితాన్ని బింబించింది. సమాజాన్ని చిత్రించింది. మనుషుల మధ్య సంబంధాల ఎగుడు దిగుళ్ళనూ కార్య కలాపాల తీరు తెన్నుల్నీ గురించి ఆలోచింపజేసింది. వీటివెనుక నుండి పనిచేసే మనోరూపాన్ని విశ్లేషణకు గురిచేసింది. స్వేచ్ఛా కవిత్వంలో కావ్యాల్లో విశాలమైన ప్రాతిపదికపై మానవీయ భావన సమాలోచనకందుతుంది. కవి సృజన దృష్టిలో

సూక్ష్మ విశ్లేషణతో స్థితిగతుల చిత్రణంతో అనుభవ వైవిధ్యంతో గోచరిస్తుంది. ఇదొక ప్రత్యేకమైన ఆకర్షణ గానూ నిలిచింది.

మానవీయం మానవ జాతి విలువల్నీ ఉన్నతినీ ఉదాత్తతనూ ఉత్తమంగా దర్శింప జేస్తుంది. ఎదురయ్యే బలహీనతల్ని గుర్తిస్తుంది. వాటిని వివిధ స్థాయిల్లో సరిచేసే ప్రయత్నమూ చేస్తుంది. లౌకిక స్థాయిలో జీవన సమస్యల్నీ స్థితి గతుల్నీ లక్ష్యాల్నీ చూపడంలో, కావ్యాల్లో గొప్ప పాత్రను నిర్వహించింది. ఇది ఇప్పటిది కాదు. ఎప్పటిదో? పూర్వ కవుల దృష్టిలో ఏ భేదాలు లేకుండా కృతుల్లో విశేష స్థానాన్ని పొందింది. కాని అది ఏ విధికో దేవతతో అతిలోక శక్తితో అనుబంధంగా వర్తించింది. ఆధునిక యుగంలో మానవీయం అట్లాకాదు. మనిషియే ప్రధానం. ఇది ఒక తాత్త్వికమైన ఆధారంతో కూడిన వాదంగా 1808లో జర్మన్ విద్యావేత్త ఎఫ్.జె.నైథమ్మర్‌చే ప్రతిపాదితమయింది. సమాజంలో వాడుకలో బాగా స్థిరపడింది. కాలక్రమేణ శాస్త్ర సాంకేతికమైన అధ్యయనాలకు భిన్నంగా, ప్రత్యేకమైన వాద స్థానాన్ని పొందింది. అటు ప్రకృతి మరియు విద్యా విజ్ఞానశాస్త్రాలతో పాటుగా వేరుగా, మానవుని గురించి ఆలోచింప దగిన మహా విషయంగానూగుర్తింపబడింది. మనవీయ భావన పూర్వం కావ్యాల్లో ప్రపంచితమయింది. అయితే ఇది ఆనాటి పరిస్థితులను బట్టి వాళ్ళ దృక్పథాలను బట్టి, చింతనలో పారలౌకిక తాత్త్విక దివ్యాతీత భావజాలంలో భాగమైంది. కొన్ని సందర్భాల్లో దూరమైపోయింది. తగిన ప్రాధాన్యం పొందలేదు.

ఇది దేనికీ అనుబంధం కాదు. దేనిలోనూ భాగం కాదు. భౌతిక స్థాయిలో వాస్తవ తలంపయి జీవిత విశ్లేషణలో కొత్త కొత్త కోణాల్ని చూపింది. ఆధునిక కవులు ముఖ్యంగా స్వేచ్ఛా కవిత్వం వ్రాసే కవుల సృజన కృతుల్లో విడదీయ రాని భాగంగాను వర్తించింది. మనిషిలో స్వార్థం అమానవీయమైన కార్యకలాపాలకు దారితీసిన మాట వాస్తవమే. అసాధారణమైన అనూహ్యామైన పరిస్థితుల్ని నెలకొనే మాట నిజం. జీవితాలను విచిత్రమైన మలుపులు త్రిప్పింది. సమాజాన్ని క్లిష్ట స్థితుల్లోను ప్రవేశింపజేసింది. అయినప్పటికీ ఈ స్థితుల్లో మానవీయం ఎన్నో విధాలుగా మానవ కార్యకలాపాలకు ప్రయోజనాలకూ దారితీసింది. జీవితాల్లో సుస్థితికీ సమాజంలో శాంతికీ ఉపకరించింది. మొత్తం మీద మానవ చరిత్రలో కీలకమైన పాత్రను నిర్వర్తించింది.

ఈ క్రమంలో మానవీయం పృథ్విపై ప్రకృతిపై సమాజంపై తన శక్తి

విలసనాన్నీ, యుక్తి సామర్థ్యాల్నీ ప్రదర్శించింది. ప్రకృతి నియంత్రణ పరిధుల్ని విస్తరింప జేసింది. మనిషిపై విశ్వాసంతో ఆశతో వ్యక్తిలో "విధి" కన్నా "బాధ్యత"ను గుర్తు చేసింది. మానవ శక్తితో పాటు మానవ హృదయ స్పందనమూ, సమాంతరంగా పరిగణింపబడింది. స్వేచ్ఛా కవిత్వం కావ్యాల్లో మానవీయం బహు విస్తృతంగా అనేక భూమికల్లో గోచరిస్తుంది. వస్తువును బట్టి వైవిధ్యాన్ని ప్రదర్శించింది.

స్వాతంత్ర్యానంతరం వెలువడిన "త్వమేవాహమ్", "తెలంగాణ", "ముక్తధాత్రి", "వియత్నాం", "విశ్వంభర", "మానవీయం", "నాదేశం నా ప్రజలు", "అగ్నినుండి ఆనందానికి", "పడగెత్తిన ఉదయం", "జీవన లిపి, జీవ నది", "అగ్నిపీఠం" మొదలైన కావ్యాల్లో విశ్వతోముఖంగా వర్ధిల్లింది. వస్తువు సామాజికమైనపుడు దర్శనం జీవితమయినపుడు వాస్తవకోణంలో మానవీయ భావన అనివార్యమవుతుంది. అందువల్ల మానవీయ వాదానికి సంబంధించినవి వాస్తవ శక్తులతో కూడినవి మాత్రమే అవుతాయి. ఇందులో కనిపించే అంశాలు : మానవుడు తనదైన మేధతో అనుభూతితో స్పందనతో కూడిన శక్తిరూపం. ఏ దైవ శక్తికీ ప్రతిరూపం కాదు. ప్రకృతి పరిణామంలో భాగం మాత్రమే. ఏ అతీత శక్తి కూడా శాసించలేదు, నియమించలేదు. దేనికీ భయపడనవసరం లేదు. విధేయతను ప్రకటించవలసి అవసరమూ లేదు. తన విశిష్టమైన శక్తి పట్ల విశ్వాసమే ముఖ్యం.

చరిత్రలో అవాంతరాలను అధిగమిస్తూ క్రమంగా ఓటములను విజయాలుగా తీర్చుకుంటూ పోవడమే మనిషిలో ఆలోచనలు హేతుయుతంగా ఉండాలి. అపుడే మేలైన ప్రయోజనమూ ఉత్తమ పర్యవసానమూ లభిస్తాయి. ప్రతి వ్యక్తికీ తన కిష్టమైన మతాన్ని విశ్వాసాన్ని అవలంబించే స్వేచ్ఛ ఉంది. ఆధునిక యుగంలో మరీ ముఖ్యంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇదో మానవ హక్కుగానూ పేర్కొబడింది. అంతర్జాతీయం గానూ ఐక్యరాజ్యసమితి చేతనూ మానవతాభావన మానవహక్కుల్లో ఒకటిగా నిర్ధారితమయింది. సాధారణ ప్రజల అభ్యున్నతికీ వికాసానికీ తోడ్పడే విధంగా ఉన్న, పౌర చట్టాలూ మానవీయ భావన విజయానికి తోడ్పడినాయి. ఏ వ్యవస్థ అయినా ఏ వాదమయినా ఏ ఆదర్శమయినా మానవీయ మార్గాన్నీ మానవతా పథాన్నీ తప్పితే విజయవంతం కాలేదు. ఏ ప్రయోజనమూ నెరవేరదు. ఇది భౌతిక వాస్తవ తలంపై నిర్మాణాత్మకమైంది. ఈ జీవిత కాలంలో వర్తమానం గురించి మాత్రమే ఆలోచన ముఖ్యమవుతూంది. గతాన్ని గురించి సమీక్షిస్తుంది.

హేతు దృష్టితో పరిశీలిస్తుంది. భవిష్యత్తు దర్శనంపై ప్రణాళికను కలిగి ఉంటుంది. తోటి మానవుని పట్ల సానుభూతి, ప్రేమ, గౌరవం, కరుణ, ఉదారత మొదలైన ఉత్తమ గుణాలతో పాటు విశ్వభావనా సమర్పకమైన సహనం శాంతి సౌభ్రాతృత్వం సమానత్వం కాంక్షిస్తుంది. మనిషిలో ఆలోచన, ప్రవర్తన చర్య ప్రతిచర్యల క్రియాకలాపాలు ఏవైనా సాధ్యమైనంతవరకు వ్యక్తి వికాసానికీ సమాజ శ్రేయస్సుకూ తగినవిగా ఉండడమే కోరుతుంది.

జాతి జీవన స్రవంతిలో సంప్రదాయ పరంపరలో భాగమైన విశ్వాసాలు ఆచారాలు కొన్ని సత్వరం అప్పటికపుడు తొలగించడం సాధ్యం కాదు కాబట్టి వాటిని పరిమితుల్లో ఉంచడంలో మేలును ప్రచారం చేస్తుంది. ఇతరులకు బాధ కలగని, హాని కలగని రీతిలో ప్రవర్తించడం న్యాయం. ఎందుకంటే ఏ విచిత్రమైన విపరీతమైన స్థితినీ ఒక్క మారు త్రెంచివేయడం కుదరదు. వాటిని అనుసరించేవారు అంగీకరించరు. దీనికి వారిలో హేతు దృష్టినీ అవలింబింపజేసే సంస్కరణ దిశగా మార్పుకై ప్రయత్నం సముచితం, అవసరం.

మానవీయం సమాజ తలంపైనే కాక వ్యక్తి స్థాయిలో నిర్మాణాత్మకమైన పాత్రనే అవలంబిస్తుంది. సమష్టిగా మానవజాతి పట్లనూ, వ్యష్టిగా వ్యక్తి పట్లనూ అచంచలమైన విశ్వాసంతో ఎప్పటికపుడు అవసరాలకూ ప్రయోజనాలకూ అనుగుణంగా, కొత్త రూపాన్ని పొందుతూ ఉంటుంది. శాస్త్ర సాంకేతిక ప్రగతి ప్రభావంలోనూ, రాజకీయ సామాజిక శక్తుల క్రియాకలాపాల్లోనూ, మానవీయం మానవతా రూపం విస్మృతం కాకూడదు. ఇది నిరంతరం ప్రకాశిస్తూ ఉండడం మానవజాతి మనుగడకే శ్రేయం. కాలాన్ని బట్టి పరిస్థితుల్ని బట్టి చారిత్రకమైనపాత్రను నిర్వహించడం సహజం. ఆదర్శ వాదాల్లో మానవీయానికి గల ప్రాధాన్యం గురించి వేరే చెప్పనవసరం లేదు. మార్క్సిజంలోను ఈ దిశలో ప్రోత్సాహకరమైన మాటల్ని గమనించవచ్చు. మార్క్స్ మాటల్లో "రాజ్యం హేతువుపై నిర్మితమవుతుంది. మతం పై కాదు". (మార్క్స్ మేనిఫెస్టో - 1848) ఈ అభిప్రాయం మానవీయ భావనకు బలాన్ని చేకూరుస్తోంది. దైవం కల్పనలో అవతరించింది. వ్యక్తికి మానసికమైన తృప్తికీ శాంతికీ ఆనందానికీ కష్టంలో నష్టంలో బాధలో వేదనలో రక్షణ కవచంగా ఉపకరించింది. ఆశారూపాన్ని నిలిపింది. క్రమంగా సమాజపరంగా వ్యవస్థీకృత మయింది. ఆ తరువాత స్వార్థ వలయంగా రూపొందింది. కాలం గడచేకొద్దీ

స్వప్రయోజనం గల శక్తుల వల్ల వికృత వేషాలకు దారి తీసింది. సంకుచితమైంది. మానవీయం మరుగునబడింది. కేవలం శుష్కమైన ఆచారాలు విశ్వాసాలు కార్యకలాపాలు మిగిలాయి. ఇవి పోగా పోగా మరీ ప్రబలిపోయాయి. బాహ్యామైన ఆడంబరాలు అలంకారాలు, బ్రతుకు తెరువుకు మార్గాలుగా మిగిలాయి. ఈ స్థితిలో ఎక్కడైనా ఎవరికైనా మానవీయాన్ని కాపాడవలసిన బాధ్యత గురించి వేరే చెప్పనవసరం లేదు. అయితే దైవ భావన ఎప్పటికీ స్వచ్ఛ స్థితిలో మానసికంగా జీవితంలో మహనీయమైందే. సేఫ్టీ వాల్వ్‌లా పనిచేసింది. మనస్తత్వ పరంగానూ బాగా ఉపకరిచింది.

సమాజం నిరంతరం పరివర్తన శీలం కలిగింది. దీని కనుగుణంగానే మానవీయం బాహ్య స్వరూపమూ మారుతూ పోతుంది. భావనలో లక్ష్యాన్ని బట్టి, గమ్యాన్ని చేర్చే సాధనాల్ని బట్టిచ జీవన ప్రయాణంలో సంబంధాల్ని బట్టి, వ్యవహార జగత్తులో స్థానాన్ని బట్టి, దీని స్వరూపం ఏర్పడుతుంది. సమాజంలో వచ్చే ఉపరితల నిర్మాణంలో మార్పులు దీన్ని ప్రభావితం చేస్తాయి. ఏ మార్పు అయినా నైతికమైన విలువలతో కూడిన మనోరూపం ముఖ్యం. ఇది ఎట్టి పరిస్థితుల్లోను చెదరకూడదు, ఛిన్నం కాకూడదు. అటువంటి చెదరని స్థితిలో దీర్ఘ కాలికమైన ప్రయోజనాన్ని సిద్ధింపజేస్తుంది. దీనికి విశాలమైన ప్రాతిపదికపై విశ్వ భావనా సమర్పకమయిన ఆలోచన అవసరమవుతుంది. వ్యక్తిలో వ్యక్తిత్వం మానవతా పూర్ణమై మానవీయమై విలసిల్లడం, గొప్ప సంస్కృతికి చిహ్నం.

ఆధునికమైన యుగావసరాల్ని బట్టి మానవీయం / మానవతావాదం పురోగమన తత్త్వంలో ఆదర్శ రూపాన్ని వహించింది. ఇది ప్రకృతి సూత్రాలకు ఒదిగి ఉంటూనే మానవ శక్తి ప్రసారకేంద్రంగా విలసిల్లింది. మానవజాతి ఆశయాలకు స్థానమయిన ఈ వాదంలో ఆదర్శాన్ని కాపాడుతూ నైతికమైన జీవితానికి దోహదం చేస్తూంది. ఈ అంశాలతో కూడిన మానవీయ భావన విశ్వజనీనమయిన అస్తిత్వాన్ని కలిగింది. ఇది మనిషితో మనిషి సంబంధం ఏర్పడినప్పటి నుండీ ఉంది. వివిధ దశల్లో పరిణామాన్ని పొందుతూ వచ్చింది. మానవ జీవితంలో విజ్ఞానం పెరిగే కొద్దీ, అనుభవం ఎక్కువయ్యే కొద్దీ, అవసరాలు పెరిగే కొద్దీ, కొత్త పార్శ్వాల్ని పొందడం అనివార్యమవుతుంది. ఎన్ని మార్పులు సంభవించినా మనిషి ప్రకృతి పరిణామంలో భాగమన్న విషయం మరిచిపోకూడదు. అయితే ఎక్కడయినా

మౌలికమైన మానవీయ మనోరూపం ఒకటిగానే ఉంటుంది. సామాజిక స్థితి గతుల్ని బట్టి పాయలు పాయలుగా ఏర్పడుతుంది. ఒక వైపు ప్రకృతితోపాటు మరో వైపు సమాజమూ దీన్ని ప్రభావితం చేస్తాయి. దీన్ని మానవీయ కోణంలో గమనించవచ్చు.

ప్రకృతిలో పరివర్తన దశలు సమాజంలో మార్పుల రూపాలు మానవ మనస్తత్వ రీతులు, మానవీయ భావనపై ప్రభావం నెరపుతాయి. మానవ సంబంధాల కోసం మనిషి ఆరాటపడతాడు. ఒంటరిగా మనలేడు. కనీస స్థాయిలోనైనా "సంబంధాలు" ఉండవలసిన అవసరం ఉంది. లేకపోతే మానసికమైన వికలత ఏర్పడుతుంది. మనిషిలో ఏకాంతాన్ని కోరే మనోరూపమూ లేకపోలేదు. స్వేచ్ఛను కోరే తత్త్వమూ ఉంది. ఇవి కొన్ని పరిమితుల్లోనే పనిచేస్తాయి. మొత్తం మీద మనిషి సంఘజీవి. కారణంగా మానవీయ భావన సమాజోన్ముఖంగా వర్తించే లక్షణం కలిగింది. మనిషి వ్యక్తి స్థాయిలో సుఖ సంతోషాలూ నిజ సౌభాగ్యాలూ కోరడం జరుగుతుంది. సమాజ స్థాయిలో వికాసమూ శాంతి శ్రేయస్సు కోరడం సహజం. మానవీయ భావన సహజంగా మనిషి వ్యక్తిత్వంలో అంతర్నిహితమై ఉంటుంది. ఇది బయటపడి చేసే ఉపకృతి, మానవ యత్నం చేతనే లభిస్తుంది.

స్వేచ్ఛా కవిత్వంలో ప్రకృతి నేపథ్యంలో సమాజ గమనంతో జీవిత చలనంతో కూడిన మానవీయ భావన ఉన్నతమైన మానవతా రూపం ఆదర్శంగా లక్ష్యంగా సమాలోచన కందుతుంది. ఆధునిక కవిత్వ సమాలోచనంలో అభిన్నమైన అంగంగానూ ఉంది. సృజన రూపంలో మానవీయ భావన వాస్తవ తలంపై కవి అంతర్వ్యక్తిత్వాన్ని బింబిస్తూనే వివిధ కోణాల్లో సామాజిక ప్రయోజనాన్ని నిర్వర్తిస్తూంది.

## 1.5 మానవీయం - ప్రయోజన విస్తృతి

స్వేచ్ఛా కవిత్వం ప్రక్రియలో – కావ్యంలో సృజన రూపంతోపాటు మానవీయ భావన ముఖ్యమైంది. సృజన రూపం కావ్యానికి జీవశక్తి మూలమైంది. మానవీయ భావన జీవిత చలనంతో సమాజ గమనంతో ప్రత్యక్షమైన అనుభవ రూపమైంది. సమాజంలో మనిషికి సంబంధించిన స్పందనలు, సంబంధాలు,మానవతా రూపాలూ వీటికి సంబంధించిన మనస్తత్వ రీతులూ దీని క్రిందికి వస్తాయి. ఇది మానవ జాతి అస్తిత్వాన్ని కలిగింది. వికాసాన్ని గురించి ఆలోచన చేస్తుంది. చరిత్రలో పొందే ఔన్నత్యాన్ని ఔదాత్త్యాన్ని ఆదర్శాన్ని బింబిస్తుంది. ఆధునిక యుగంలో వచ్చే మార్పులపై దృష్టితో మానవ నాగరికతపై సంస్కృతిపై వెలుగును ప్రసరిస్తుంది. హేతు దృష్టితో సమస్యల్ని పరిశీలిస్తుంది. పరిష్కారానికై అన్వేషణ సాగిస్తుంది. మానవ శక్తిపై అచంచలమైన విశ్వాసాన్ని కలిగి ఉంటుంది. సామాజికంగా పురోగమనశీలాన్ని వ్యక్తిపరంగా వికాస గుణాన్నీ అభిలషిస్తుంది. మానవుడు దేనికీ ప్రతిరూపం కాదు. ఆఖరికి ఏ దేవునికీ జవాబుదారు కాదు. తనపై దృఢ విశ్వాసంతో దీక్షతో ప్రయత్నించడమే ఇతని పని. దైవానికి భయపడనవసరం లేదు. సంకల్ప బలం ఆలోచనా గరిమ ప్రయత్న శీలం మానసిక శక్తితో జీవితంలో ఎంతో సాధించడం జరిగింది. మునముందు జరుగుతుందనే ఆశారూపం గోచరిస్తుంది. దీనికి మనిషిలో మానసికంగా సంపూర్ణమైన స్వేచ్ఛ ముఖ్యం. వెనుకటి జన్మ (ల) గురించీ, రాబోయే జన్మ(ల) గురించి ఆలోచనజరగదు. ఇపుడున్న జీవితంలో అనుభవంతో హేతువుతో వివేకంతో ముందుకు సాగడమే ప్రధాన కర్తవ్యం. దైవంపై భారం వేసి గడపడం మనిషిని అశక్తుణ్ణి చేస్తుంది. అదువల్ల దైవం స్థానంలో మానవ రూపమే ప్రతిష్ఠితమవుతూంది. వర్తమానంపై దృష్టితో భవిష్యత్తు గురించి హేతుబద్ధమయిన ప్రణాళిక ముఖ్యం. విధి గురించి కాక మనిషిలో నైతికమైన విలువల పట్ల శ్రద్ధతో, తోటి మనిషిపట్ల సానుభూతి కరుణ ప్రేమ గౌరవంతో ఎంతో సాధించవచ్చుననే అభిప్రాయం మానవీయ భావనలో స్పష్టంగా వివేచితమయింది.

మనిషిలో మరో పార్శ్వం ఉంది. ఇది మానసికమైన బలహీనతలకు సంబంధించింది. దీనికి కేంద్రం స్వార్థం. నిరాశతో నిస్పృహతో అనైతికతతో కూడిన తత్త్వం కలిగింది. ఒక స్థితిలో ఇది హింసకూ అశాంతికీ దారి తీసే ప్రమాదమూ ఉంది. ఈ విషమ పరిస్థితుల్ని అధిగమించేందుకు మనిషిలో తనపై

విశ్వాసంతో, తన శక్తిని గురించి ఆలోచనతో, దాన్ని వినియోగించే నేర్పులో గుణాత్మకమైన మార్పు అవసరం. సమాజంలో వ్యక్తిలో శాంతికి దోహదం చేసే సహనం ప్రేమ త్యాగం ఉదారతతో మనిషి "దైవ సమానమే" నన్న భావం సమాజంలో ఉంది. ఇది మనిషి మానవీయతనే చాటుతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ మనిషి చర్య బాధించేదిగా బంధించేదిగా సంకుచిత పరచేదిగా ఉండరాదు. మనిషికి సహాయపడేదిగా పరిష్కారం చూపేదిగా నిర్మాణ శీలంగానే ఉండాలి. ఎవరి అభిప్రాయాలూ సిద్ధాంతాలూ ఆదర్శాలు వారు అవలంబించవచ్చు.

ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ వల్ల ఎంతో సాధ్యమవుతూంది. అయితే ఇది మానవీయతను భగ్నం చేసేదిగా ఉండకూడదు. ఏ అభిప్రాయమయినా సిద్ధాంతమయినా ఆదర్శమయినా సాధారణ తలంపై మానవీయ కోణంలో మానవీయ స్పర్శతోనే విజయవంతమవుతాయి. విశేష తలంపై దేని విశిష్టత దానిదే. దేని లక్ష్యం దానిదే. నిఖిల మానవ చరిత్రలో ఎందరో తత్త్వవేత్తలు దార్శనికులు మానవీయ రూపాన్ని గురించి విలువైన ఆలోచనల్ని ప్రకాశింపజేసారు. వేద ఋషులు, ఉపనిషత్కర్తలు దార్శనికులు ప్లేటో అరిస్టాటిల్ నుండి బుద్ధుడు మార్క్సు రసెల్ వరకూ అనేకమంది తమ తమ ఆలోచనా దిశలతో మార్గదర్శకులయినారు.

ఆధునిక యుగంలో మానవీయ భావన సహేతుకమైన చర్యతో సమాజంలో ప్రత్యేక సందర్భాలకు తగిన విధంగా నిర్దిష్టమైన గమ్యాన్ని కలిగింది. ఇది ఒక కరుణ దయ ఉదారతతో కూడిందిగానే కాక, ఒక కర్తవ్య రూపంగా, జీవితంలో సుస్థితికి అనివార్య గుణంగానూ ఉంది. లక్ష్యాన్ని ఉద్దేశించి ప్రజాస్వామ్యచేతనకు ముఖ్యమైన అంగంగా విలసిల్లింది. స్వేచ్ఛా కవిత్వంలో కావ్యంలో దీని ప్రాధాన్యాన్ని విస్మరించడానికి వీలు లేదు. మనిషి సమాజంలోనే గుణాత్మకమైన జీవితం గడపగలడు. ఏకాంతం అసంపూర్ణమైంది. సమగ్రమైన వ్యక్తిత్వానికి ఆటంకమనే చెప్పొచ్చు. అందువల్ల మనిషీ–సమాజం అవిభాజ్యాలు. సమాజంతోనే మనిషిలో సంపూర్ణ వ్యక్తిత్వం సిద్ధిస్తుంది. అయితే మనిషి సమాజం నుండి రూపొందినప్పటికీ సమాజంతో సమగ్రతను పొందినప్పటికీ, లోపల "ఆంతర వ్యక్తిత్వ" స్ఫూర్తి ఉంటుంది, పనిచేస్తుంది. దీనివల్ల మనిషి నుండి మనిషి భేదించడం జరుగుతుంది. ఇది సృజన దృష్టిలో స్వతంత్రమైన భావంతో స్వతంత్రమైన గుణంతో గొప్ప పాత్రను నిర్వహిస్తూంది.

మానవీయ భావనలో మరో అంశం, నిఖిల మానవ జాతి సుఖాన్నీ

సౌభాగ్యాన్నీ శ్రేయస్సునూ కోరే తత్త్వం. మనిషిలో విజ్ఞానం పెరిగే కొద్దీ మంచికి సంబంధించిన పార్శ్వం ఉత్తమంగా బయటికి రావాలనీ ఉజ్జ్వలంగా వెలగాలనీ ఉంటుంది. మనిషికి మానవ సేవలో పాల్గొనడం వల్ల కలిగే తృప్తి ఆనందం విలక్షణమయింది. ఈ సామాజిక రూపం మానవ ప్రస్థానంలో అమూల్యమైంది. స్వేచ్ఛా కవిత్వం–కావ్యాల్లో ఈ విధమైన స్థూల రేఖలతో దర్శనమిస్తుంది.

ప్రకృతిలో భాగంగానూ, సమాజంతో చిరమైన బంధంతోనూ, వ్యక్తి వికాస శీలంగానూ, సమాజ శ్రేయోరూపంగానూ ఉంది. నియంతృత్వం నుండి స్వేచ్ఛకూ దౌర్భాగ్యం నుండి సౌభాగ్యానికీ పయనాన్ని కోరుతుంది. దీనికి ప్రకృతిలో వనరుల ఉపయోగం నుండి సమాజ గతిలో వికాసమూ వ్యక్తి శీలంలో సంస్కారమూ ఎంతో సహకరిస్తాయి. వైజ్ఞానిక వాతావరణమూ ప్రయాణాన్ని సుగమం చేస్తుంది. మానవ చరిత్ర–వికాసం ఈ సందర్భంలో నేపథ్యంగా ఉపకరిస్తుంది. మనిషి ప్రకృతిలో భాగం అయినట్లే సమాజంలో భాగమూ. ఈ రెండు లక్షణాల ప్రమేయం స్వేచ్ఛా కవిత్వం కావ్యాల్లో బహుధా కనిపిస్తుంది. మనుషుల అవసరాలూ ప్రయోజనాలూ అభిరుచులూ ఆకాంక్షలూ ఆదర్శాలూ లక్ష్యాలు కాలంపై ఎప్పటికపుడు పరీక్షకు గురి అవుతాయి. అపుడు సంకుచితమైన పరిధుల్ని అతిక్రమించవలసి వస్తుంది. విశాలమైన జగత్తుకు ఆహ్వానం పలక వలసి ఉంటుంది. కావ్యంలో దీని ప్రతిఫలనం మనిషి జీవితానికి వలె కవి కృతికీ ఉదాత్తతను చేకూరుస్తుంది.

సమాజంలో అనేకమైన స్వార్థ శక్తుల కార్యకలాపాల వల్ల అసమానతలతో అన్యాయాలతో అసహనం–ద్వేషం–పీడనం–ఘర్షణ–హింస–అశాంతి ప్రబలుతుంది. రోజు రోజుకీ బహు సంక్లిష్టతను పొందే జీవత చలనంలో ఏది న్యాయమో? ఏది అన్యాయమో గీత గీయలేకపోవడం ఉన్నదే. అధర్మాన్నీ అనౌచిత్యాన్నీ తేల్చి చెప్పడమూ కష్టతరమవుతుంది. ఒక్కొక్క బాధ వెనుక వేదన వెనుక ఎంతో చరిత్ర ఉంది. దీన్ని పట్టుకోవడమూ, సరి అయిన నిజ నిర్ధారణం చేయడమూ సులభం కాదు. ఈనాడు జీవితంలో సుఖ సాధనాలు పెరిగాయి. సంపాదనా మార్గాలూ ఎక్కువయినాయి. సౌభాగ్యస్థాయి పెరిగింది. అయితే దీనికి తగినట్లు నైతికస్థాయి పడిపోవడమూ జరిగింది. మానవతా స్పందనమూ సమాజగతంగా తగ్గింది. ద్వేషం హింస అరాజకం దమనకాండతో సమాజంలో అభద్రత సంక్షోభం ఎక్కువయింది. మరోవైపు నుండి మధ్య మధ్య ప్రకృతి వైపరీత్యాలతో అనుకోని విపత్తులూ బీభత్సాలూ బాధలూ

వేదనలూ తప్పడం లేదు. ఇటు సామాజిక క్లిష్ట సమస్యలతో పాటు అటు ప్రాకృతిక సమస్యలూ ఎదుర్కోవలసి వస్తూంది. వీటిని ఎదుర్కోవడానికి ప్రణాళికలు వేరుగా ఉండవలసిన అవసరముంది. మనస్తత్వపరంగా మానసిక స్థితులతో, క్రియాకలాపాలూ వేరుగా ఉండడం సహజం. మనిషిలో ధైర్యంతోపాటు స్వచ్ఛత ఉదారత నైతికత మానవత త్యాగంతో కూడిన మనోరూపం కనీస స్థాయిలో ఉండాలి. లేకపోతే సంక్షోభమే. ఈ దిశలో హేతు దృష్టితో సహజానుభూతితో కూడిన రూపమైన మానవీయ భావన అవసరమవుతూంది. ఇది మనిషిలో నిర్మాణ వైఖరిని ప్రోత్సహిస్తుంది. లక్ష్యసిద్ధికి ప్రేరేపిస్తుంది. సమస్యల పరిష్కారానికి భౌతిక మానసిక స్థాయిలో మానవ శక్తి రూపాన్ని ప్రయోగించవలసి ఉంటుంది. మానవుని అసిత్త్వం గుణాత్మకతను పొందవలసి ఉంది. ప్రయోజనభావమూ విస్తృతిని కలిగి ఉండవలసి ఉంది. మనిషిలో అంతశ్శక్తిని మేల్కొల్పి, ఉత్తమమైన విలువల వైపు పయనింపజేయడం అవసరం. ఇది గాఢమయిన నిబద్ధ మయిన మానవీయ భావనతోనే సాధ్యం.

మానవీయ భావనను సరియైన అవగాహనతో సముచితమైన హేతుదృష్టితో ప్రవర్తింపజేయడం వల్ల – మానవ సంబంధాలు ఉత్తమంగా పెరుగుతాయి. మానవతా స్పృహ నిలుస్తుంది. మానవత్వం ఇనుమడిస్తుంది. సమాజం బాగుపడుతుంది.

స్వేచ్ఛా కవిత్వంలో కావ్యాల్లో మనిషిపై విశ్వాసంతో మనిషిలో వివేకంతో విజయంకై ప్రయత్నం తప్పనిసరి అవుతుంది. లక్ష్యంపై ప్రత్యయం గురించి ఆలోచన మరవడానికి వీలులేదు. ఇది ఇట్లా ఉంచి స్వార్థంతో ఎదురయ్యే విషమ స్థితులూ, వీటిని అధిగమించే మానవ మహాగుణం అవసరమూ స్థాపితమయింది. సమాజంలో మెరుగైన జీవితాన్ని అందించే ఉద్దేశంతో ఎందరో మహానుభావులెన్నో మార్గాలు సూచించారు. అన్నిటికీ కేంద్రం మనిషే, అన్నిటి లక్ష్యం ఉత్తమ మానవ దర్శనం. సుస్థిర సౌభాగ్య సమాజం దీనికై మానవీయ భావన జీవితంలో స్పందనతో చేతనతో సక్రియతో ఆలోచనను పరిపుష్టం చేస్తుంది. ఇంతవరకూ సాగిన మానవ ప్రస్థానంలో అనేక విజయాలు మానవీయమైన ప్రగతినే దర్శింపచేస్తాయి. ఇవి వ్యక్తి స్వేచ్ఛతో పాటు సామాజిక బాధ్యతనూ గుర్తింపజేస్తాయి. మానవ జీవితమెంతో సంక్లిష్టమైందీ, గహనమైందీ, విచిత్రమైందీ కావడం చేత మనస్తత్వ విశ్లేషణమూ అవసరమవుతూంది. కావ్య పరిశీలనంలో వాస్తవికతతో పాటు మనస్తత్వ ప్రపంచాన్ని పరిగణనలోకి తీసుకోవలసి ఉంది.

ఈ కావ్యాల్లో మానవులకు సంబంధించిన నైతిక మానసిక తలాలపై పరిస్థితుల్ని వశం చేసుకొనే సంకల్ప శక్తి ఉంది. ఉత్సాహగుణం కన్పిస్తుంది. మనిషిలో 1. నిర్మాణశక్తి 2. విధ్వంసగుణం – రెండూ ఒకదానిపై మరొకటి ఆధిపత్యానికి ప్రయత్నించడమూ కనిపిస్తుంది. దీన్ని విశ్లేషిస్తే

1. సమాజ శ్రేయంపై ఆశతో వికాసాన్ని కోరేవారూ
2. సమస్యల్లో నిరాశతో నిలిచిపోయేవారు/వెనక్కి వెళ్ళేవారూ
3. ధైర్యంతో నిరాశ నుండి పైకి లేచి ప్రయాణాన్ని సాగించేవారు
4. వర్తమానంపై నిరాశతో విధ్వంసాన్ని కోరేవారూ
5. ఆశ–నిరాశల్ని జీవితంలో అనివార్యాలుగా భావించి సమన్వయ భావంతో వర్తించేవారూ కనిపిస్తారు.

మానవులంతా ఒకే మాదిరి ఉండరు. ఉండనవసరమూ లేదు. అట్లా ఉండడమూ సాధ్యం కాదు. స్థూలంగా అందరిలో ఉండవలసిన మానవతాగుణంతో ఉత్తమ మైన విలువల మనోరూపం మాత్రం అవసరం. ఇది సాధ్యమే. ఇది అందరినీ కలుపుతుంది. సౌభ్రాత్రాన్నీ సౌహార్ద్రాన్ని నెలకొల్పుతుంది. మానవుడు బుద్ధిజీవి, హేతుమూర్తి, అనుభవశీలి, మహా మనస్వి కావడం వల్ల చివరకు ఉత్తమమైన విలువల్ని కోరే నిర్మాణరూపంలో ఆశాభావానిదే గెలుపు! ఇది ఏదో రూపంలో సూచనగా కావ్యాల్లో సూచనగానో, ప్రకటనంగానో కన్పిస్తుంది! ఎప్పటికపుడు మారే జీవన పరిస్థితుల్లో కొత్త సమస్యల్ని ఎదుర్కొనే శక్తితో, కొత్త పరిష్కారాల్ని కనుగునే ప్రజ్ఞతో, మానవీయ చేతన పనిచేస్తుంది. స్వేచ్ఛ పేరుతో అనాగరకమైన వికారమైన విధ్వంస ధోరణుల్ని అవలంబించడం సముచితం కాదు. మానవుడింతకాలంగా సంపాదించిన సంస్కృతీ రూపానికి భంజకంగా ఉండరాదనే మానవీయ భావనలో అంతరార్థం.

ఈ సందర్భంలో మానవ – మానవేతర, ప్రకృతి–ప్రాణి, సంబంధాలతో సమాజం పొందే ప్రభావ రూపమూ దృష్టికి వస్తుంది. ఈ విషయంలో ప్రకృతి భూమిక అనిర్వచనీయమైంది. ఇవన్నీ దేనికది కాక కావ్యంలో వివిధ స్థానాల్లో బహు సందర్భాల్లో పరస్పర సంబంధంతో ఆవిష్కృతం కావడంచేత కావ్యానికి పూర్ణత చేకూరుతుంది. ప్రత్యేకత సిద్ధిస్తుంది. మానవీయ భావన కావ్యంలో మానవీయ చేతనతో మానవతా స్పృహతో మానవతా స్పందనతో సృజన రూపానికి అవసరమైన సావయవ పుష్టిని చేకూరుస్తుందనడంలో సందేహం లేదు.

స్వేచ్ఛా కవిత్వం ఒక విధంగా మనషి నడకవంటిది. మేల్కొన్నది మొదలు విరామం దాకా సాగే వివిధ స్థితుల్లో సందర్భాల్లో జీవితంలో సమయానికి తగినట్లుగా అడుగులతో గమనం సాగుతుంది. ఈ ప్రక్రియ స్థూలంగా అడుగుల కదలికలో వైవిధ్యంతో కూడిన సహజమైన మనిషి జీవిత యానాన్ని తలపిస్తుంది. ఇది మానవ జీవితానికి వాస్తవ సదృశమైన అనుభవ రూపంగా భావించవచ్చు. మరో విధంగా ఆకాశంలో విమాన యానం వంటిది. ఆకాశంలో అంటే భావనా ప్రధానంగా ఉండేదని భావించవచ్చు. ఇది ప్రక్రియకు సంబంధించిన విషయం. మానవీయ భావనకు వస్తే ప్రయాణంలో తటస్థపడే మానవుల్ని గురించి, భౌతిక మానసిక తలాలపై మానవతా గుణంతో వర్తిస్తుంది. మనిషికి తానున్న స్థితినీ పొందవలసిన గమ్యాన్ని గుర్తు చేస్తుంది. జీవితంలో అనివార్యమైందీ, అపరిహరణీయమైంది, కావ్యంలోనూ అదే విధంగా ఆకర్షణీయమైందీ మానవీయ భావనా రూపం.

# II

## II.1 త్వమేవాఽహమ్-విమోచనోద్యమం

దేశ స్వాతంత్ర్యానంతరం స్వేచ్ఛా కవిత్వంలో వెలువడిన తొలి విమోచనోద్యమ కావ్యం "త్వమేవాహమ్" (1949). ఇది హైదరాబాద్ సంస్థానంపై పోలీసు చర్యకు పూర్వం వ్రాసింది. ఒక జరగరాని సంఘటనను పురస్కరించుకొని, అది కేంద్రంగా పీడిత జన విమోచన దృష్టితో పరిధిని విస్తరించి కాలాన్ని జయించే మానవ శక్తిపై విశ్వాసం సూచితమయింది. వర్గభేదం అంతరించి సామ్యవాదం నిజమయ్యే మార్క్సు సిద్ధాంత ప్రతిపాదనమూ కలిగింది. కావ్యానికి మార్క్సీయ తాత్త్వికతను చేకూరుస్తూంది. పీడిత జనుల పక్షాన నిలబడి ఉద్యమ శక్తికి ప్రోత్సాహాన్ని లభింపజేస్తూంది. ఈ కారణంచేత విమోచనోద్యమ కావ్యంగా పరిగణితమయింది.

వస్తువు తెలంగాణ విమోచనం నుండి ఆరంభమై, ప్రపంచంలో పీడిత వర్గ విమోచన లక్ష్యంతో ప్రత్యేకతను పొందింది. తెలంగాణా ప్రజల బాధామయ దృశ్యంతో నిరంకుశత్వం నుండి విమోచన లక్ష్యం కలిగిన మనోరూపానికి అద్దం పడుతూంది. ఆధునికమైన అభివ్యక్తి విధానంతో విషయం నిర్వహింపబడింది. మానవీయ భావన బలంగాఉంది. కాలాన్ని జయించే మానవుని చిరంజీవత్వం కావ్యానికి ఆశారూపాన్ని ఇస్తూంది.

అడవిలో "చెట్లు" – "చిట్టెలుకలు" మొదలుగా ప్రకృతి నేపథ్యంలో వెనుకబడిన తెలంగాణా స్వరూపం, కృతిలో ప్రతీకాత్మకతను పొందింది. చిన్న చిన్న చీమలు సంఘటితమై అనితర శక్తితో, పెద్ద పామును చుట్టుముట్టి అంతం చేసిన విధంగా, సామాన్యులు బలమైన ధనస్వామ్యానికి చెందిన నిరంకుశమైన వర్గ శత్రువును జయించడమూ దృష్టికి వస్తుంది. కావ్యంలో విమోచనోద్యమం సామ్యవాద తాత్త్వికబలంతో శ్రామికుల తిరుగుబాటునుండి విజయరూపం చిత్రితమయింది. నూతన సంవిధానంతో ఈ కావ్యం దేనికిదే సాటిగా నిలిచింది.

కృష్ణా పత్రికలో 1948 జులై 10వ తేదీన వార్త ప్రచురితమయింది. అది రజాకార్ల దుశ్చర్యలకు బలి అయిన తెలంగాణాకు చెందిన ఒక స్త్రీ – హృదయ వేదన. కావ్యానికి ఆరంభ బిందువయింది. ఉజ్జ్వలమైన ప్రేరణ శక్తిగా ఉపకరించింది. ఈ వాస్తవ దృశ్యం సామాజిక దుస్థితికి కారణాల్ని అన్వేషించడానికి పురికొల్పింది.

విశాల ప్రాతిపదికపై సృజన బలంతో కవితా రూపాన్ని పొందింది. వాస్తవ క్రియాశీలంగల మానవీయంతో వెలసింది. సిద్ధాంత పరంగా మార్క్స్ గతి తార్కిక భౌతిక వాదంతో కూడింది. ఇందులో విశేషమేమంటే కేవలం వాస్తవ స్థితి చిత్రణతో సరిపెట్టుకోకుండా దీన్ని అధిగమించి చారిత్రక సామాజిక తలంపై ఆలోచనలో పీడిత జన విమోచనం కొత్త దనాన్ని పొందింది. నవ దృష్టిని భావింప జేస్తూంది. ఇందులో వర్తమాన స్థితి సంఘటనల వర్ణనం ఉంది. భవిష్యత్ దర్శనమూ ఉంది. సమస్యకు శాశ్వత పరిష్కారమూ సామ్యవాద లక్ష్యంగా కవి దృష్టిలో ఉచితమనుకున్నది ప్రకటితమయింది. ఈ విధంగా కావ్యం అభ్యుదయ శక్తుల్ని వేగవంతం చేసింది. రచనలో అభివ్యక్తినిబట్టి ప్రయోగ శీలంతో పాటు లక్ష్యంలో సామాజిక ప్రయోజన గుణం – ప్రగతిపథంలో ఆకర్షించింది.

హైదరాబాద్ సంస్థానంలో ఒక భాగం తెలుగు మాట్లాడే తెలంగాణా ప్రాంతం మిగతాది మరాఠీ మాట్లాడే మరాఠ్వాడా, కన్నడం మాట్లాడే కర్నాటక ప్రాంతాలు ఉన్నాయి. కావ్యానికి "తెలంగాణా" అని కాకుండా "త్వమేవాఽహమ్" అని పేరు పెట్టడమూ ప్రత్యేకతను కనబరుస్తూంది. ఇది శ్రీశ్రీ సూచన. పేదరికం వెనుకబడిన తనం ఎక్కడైనా ఉండవచ్చు. పీడితులందరూ ఒకే వర్గానికి చెందినవారు. పీడితులకూ తనకూ మధ్య సామాన్యులకూ ధనికులకూ మధ్య భేదాన్ని రూపుమాపి మానవులంతా ఒకటేనన్న సమానభావంతో "త్వమేవాఽహం", "నీవే నేను" రూపొందింది. బాధలో ఉన్నవారితో అభేదంగా ఒకటై పోయే విమోచనోద్యమంలో భాగంగా పరిణమించే కవి ఉద్దేశమూ స్పష్టం.

1948 రజాకార్ల ఆగడాలు మితిమీరాయి. అసలు రజాకార్ అంటే వాలంటీర్ (సేవకుడు) అని అర్థం. దీన్ని మరచి దుష్కృత్యాలకు పాల్పడడం వల్ల చెడు పేరు స్థిరపడింది. ఒక మానవతి రైల్లో ప్రయాణికుల మధ్య బట్టలు ఒలిచి నగ్నంగా నిలిచిన అవమాన దృశ్యం – కృష్ణా పత్రికలో ప్రచురితమయింది. ఇది నిరంకుశమైన రాజరికానికి వ్యతిరేకంగా సాగే స్వాతంత్ర్యోద్యమంలో ప్రజల స్థితికి అద్దం పడుతూంది. ప్రజల బాధలకు వెనుకబడిన తనంతో పాటు లోపించిన చైతన్యమూ అంటే, ఇంకా సంఘర్షణ చేరుకోవలసిన స్థాయి మిగిలే ఉందన్న భావంతో, ప్రజాబల సమీకరణను ప్రేరేపిస్తూంది. ఇటువంటి స్థితిలో ప్రజాబలంతో సంఘర్షణ విజయానికి దారిచూపేదిగా పరిణమించాలనే కవి అభిప్రాయం. మార్క్సీయ దృక్పథంతో

వాస్తవాన్ని సహేతుకంగా విశ్లేషించి చేసిన ఉద్యమ చిత్రణం, కావ్యానికి విశిష్టతను చేకూరుస్తోంది.

"త్వమేవాఽహం" అంటే "నీవే నేను" అని అర్థం. ప్రజలే తానూ కవీ, ప్రజలతో తానూ ఒకటే నన్న ఐక్య భావనతో కూడింది. ఆపైన విస్తరణ రూపంలో మానవులంతా ఒకటేనన్న మానవతా భావంతో విస్తరించింది. ఎక్కడైనా పీడిత జన సమస్య లొకటే! అన్న ఆలోచనకు సంబంధించింది. వీటికి స్పందించే మానవ హృదయమూ ఒకటే! కాలాన్ని శాసించే మానవ శక్తికి తుది విజయం చేకూరుతుందనే కవి విశ్వాసం.

మార్క్సియ సిద్ధాంత బలంతో తాత్త్వికతను పొందింది. విమోచనోద్యమం కేంద్ర స్థానాన్ని వహించింది. సాధారణ క్రమ పద్ధతిలో సాగే చిత్రణంగా కాక, ముఖ్యమైన స్థితుల్ని సంఘటల్ని గ్రహించి, వాటికి సామ్యవాద సిద్ధాంతపరమైన అంశాల్ని జోడించి విశాలమైన వాతావరణంలోకి ప్రవేశపెట్టడం జరిగింది. ఉద్యమం – మానవుడు – కాలం – సంఘర్షణ – పీడితులైన సామాన్యజన సమీకరణం – మహాశక్తిగా అవతరణం – పోరాటంతో మానవ విజయమన్న అంశాలతో సంశ్లిష్ట రూపాన్ని పొందింది. ఇదీ కావ్యం విశిష్టత. కావ్యంలో హైదరాబాద్ సంస్థానంలో ఉద్యమ సందర్భంలో అవమానితులు దుఃఖితులు పీడితులు బాధితులు అయిన ప్రజల గురించి వేదనా చిత్రం స్పష్టంగా కనిపిస్తుంది. విషమ పరిస్థితుల్లో చిక్కుకున్న ప్రజలూ వారి పోరాటం – విజయ సూచన స్ఫూర్తికి వస్తాయి. ఇది ప్రతీకాత్మకంగా నిర్వహింపబడింది.

కావ్యం పర్వత దశతో ఆరంభమయింది. తెలంగాణా బాగా వెనుకబడిన ప్రాంతం. పర్వతం జడమయమైంది. చైతన్యరహితమైంది. కదలలేదు. అక్కడక్కడా చెట్లు ఎదగవచ్చు. రాళ్ల సందులనుండి పచ్చదనం కనిపించవచ్చు. అంతా అడవిలో భాగమే. నైజాం పాలనలో సామాజిక చైతన్యంలేని వెనుకబడిన ప్రాంతాన్ని సూచిస్తోంది. ఒక్క ప్రధాన నగరంలో తప్ప మిగతాచోట్ల భూస్వాముల జాగీర్‌దార్ల పెత్తందార్ల పీడనలో గ్రామాల్లోని ప్రజలు బాధల్ని అనుభవిస్తున్నారు. ప్రగతి కోరే ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షతో ఉద్యమం మొదలైంది. భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందింది. కానీ కొన్ని సంస్థానాలు మిగిలాయి. అందులో ఇదొకటి. ప్రధాన స్రవంతిలో కలిసే ఉత్సుకతతో పోరాటం తీవ్రతరమయింది. ఇందులో అన్ని

సిద్ధాంతాల ఆదర్శాల అభిప్రాయాల ప్రజలూ పాల్గొన్నారు. కొండల చాటునుండి పొదల చాటునుండి పోరాటం చేసే ప్రజల క్రియాత్మకత చిత్రితమయింది. అరణ్యంలో ప్రకృతి నేపథ్యంతో కావ్యం నిర్మితమయింది. ఈ సంస్థానంలో నిరంకుశుల దౌర్జన్యాలు పెరిగాయి. హింస బాగా చోటు చేసుకుంది. దీనికి వ్యతిరేకంగా పోరాటం తీవ్రతరమయింది. ఈ భూమికలో ఉద్యమం ఈ ప్రాంతం ప్రజల బాధా ప్రపంచానికి ప్రాతినిథ్యం వహిస్తూంది.

రైలు ప్రయాణంలో పెట్టెలో ఒక వనిత కథనం. హఠాత్తుగా లేచి తన ఒంటిపై నున్న దుస్తుల్ని తొలగించి నగ్నంగా నిలబడింది. ఈ స్థితికి కారణం అమానుషం మానవ జాతి చరిత్రలో అత్యంత హేయమైందీ, నింద్యమైందీ. అంతా తలలు వంచుకున్నారు. ఒక వృద్ధుడు "ఇదే" మని ప్రశ్నించాడు. ఆమె "కిరాతకులు నన్ను అవమానించి వారం రోజులు చెట్టుకి కట్టేశారు. అపుడే నా సిగ్గు పోయింది. ఇంకా ఏమి మిగిలింది?" అని విలపించింది. బట్టలు ధరించి కూర్చుంది. ఈ వార్త చదివి కవి పొందిన స్పందన రూపమే ఈ కావ్యం. ఇది బాధ వేదన అవమానం పీడనతో కూడింది. అప్పటి జీవిత చలనంపై సమాజ గమనంపై "చెయిన్స్‌లో మగాళ్ళు చెరచబడ్డ ఆడవాళ్ళు, చెదపురుగులు మద మెక్కిన సోల్జర్లు" ఈ రచనలో అభివ్యక్తి సంపూర్ణ వాక్యంలో లేదు కవి పొందిన ఆవేశ స్థితికనుగుణంగా ఖండ ఖండంగా సాగింది. ఈ భాగం నియంతల మితిమీరిన ఆగడాలతో, సామాన్యుల దయనీయ స్థితులతో, ప్రతీకాత్మకంగా మలచబడింది. ఇదో బలవంతమైన సర్పంతో పోల్చబడింది. భయంకరమైన స్వప్నంగానూ భావితమయింది. సర్పం పీడకవర్గానికి ప్రతీక. పాలన నిరంకుశమైన రూపంతో వ్యవహరిస్తుంది. చలిచీమలు పీడిత వర్గానికి ప్రతీక. అనేక బాధలకు గురి అయిన చలిచీమలు సంఘటితమయినాయి. పోరాడాయి. సర్పాన్ని చుట్టుముట్టాయి. సర్పం అంతమయింది. బలం లేదనుకునే మనిషి సంఘటిత శక్తితో సంఘ బలంతో సామూహిక చేతనతో ఉద్యమ విజయాన్ని సాధించడం చరిత్ర దశను మార్చివేసింది.

"కాకిమెడ నుసిరంగు! స్నో తెలుపు ద్యూ తెలుపు" ఈ భావరూపం దుష్టమైన వ్యవస్థలో చీకటిలో మెరుపులాంటిది. మంచులాంటిది. సహజంగా ఎటువంటి విపత్కర పరిస్థితుల్లోను మనిషిలో వీడరాని ఆశా లక్షణాన్ని సూచిస్తూంది. ఉద్యమ తీవ్ర దశలో ప్రజలు అడవుల పాలయ్యారు. అడవి దృశ్యంతో కావ్యం మొదలైంది. ఈ ప్రకృతి నేపథ్యం కావ్యంలో వస్తువుకు పోషకంగా ఉంది. పాలకుల వారి

అనుయాయుల దుశర్చర్యలకు సామాన్య ప్రజలు చిట్టెలుకల వలె అడవిలో చెట్ల నాశ్రయించారు. స్నో తెలుపు, డ్యూ తెలుపు! రాబోయే మంచిరోజుల్ని ఆశా స్ఫూర్తిలో అవగతికి తెస్తూంది.

ఈ కావ్యంలో మొదటి అంశం, ప్రజల్లో సంఘటితమైన ఉద్యమశక్తి రెండో అంశం కాలం, ఇది మానవ జీవితంలో నిర్వహించే గొప్ప పాత్రగా తీర్చబడింది. మూడో అంశం దీన్ని అనుసరించి సామ్యవాద సైద్ధాంతిక ప్రతిపాదనం. ఇది తాత్త్వికతకు బలాన్ని చేకూరుస్తూంది. ఈ మూడింటి సంశ్లిష్టమైన సంవిధానంతో కవి అవలంబించిన నూత్నమైన అభివ్యక్తి విధం కావ్యానికి ప్రత్యేకతను చేకూర్చింది.

పర్వత దశ నుండి కావ్యంలో మార్పు కోరే ప్రజలతో, సమాజ వేగ గమనానికి ప్రతీకగా ప్రవాహం ఎన్నుకోబడింది. ఇంకా కాలానికి ప్రత్యక్ష భావరూపంగానూ నిలిచింది. అమూర్తమైన కాలానికి ప్రవాహం మూర్తరూపంగానూ అర్థాంతరాన్ని పొందింది. తప్పని మార్పులతో అవిచ్ఛిన్నంగా సాగే చారిత్రక వాస్తవాన్ని పొందిన సమాజం కవి సృజన దృష్టిలో అత్యంత ప్రధానమైందిగా కనిపిస్తుంది. మరొకటి కాలానికి సంకేతంగా గడియారం వెలసింది. ఇందులో (1) పెద్ద ముల్లు గంటల్ని అంటే శ్రీమంతుల్నీ, (2) చిన్న ముల్లు నిమిషాల్ని అంటే మధ్య తరగతి ప్రజల్నీ (3) మరో సన్నముల్లు సెకండ్లను అంటే క్రింది తరగతి ప్రజల్ని సూచించేవి. ఇంకా ఇసుక గడియారం, నీటి గడియారం, స్టాప్ వాచి మొదలైనవి సమాజ స్థితుల్ని సూచిస్తాయి. సమాజంలో నెలకొన్న ప్రజలకు సంబంధించిన మూడు శ్రేణులూ కావ్య నిర్మాణంలో మార్పు దర్శనంలో వర్గ భేద దృష్టితో భాగస్వామ్యాన్ని పొందాయి. (1) గంటల్ని చూపే ముల్లు పెట్టుబడిదారీ వర్గ జీవన సరళినీ (2) నిమిషాల్ని చూపే చిన్న ముల్లు సామాన్య జీవన గతినీ (3) సెకండ్లను చూపే ముల్లు శ్రామిక వర్గ జీవన స్థితినీ తెలుపుతాయి. గడియారం "కీ" విప్లవ ప్రేరణ శక్తిగా ఉంది. అలారం సమాజంలో విషమ పరిస్థితులకూ అసాధారణ సమయాలకూ హెచ్చరికగా పనిచేస్తూంది. ఇది ఆధునిక సాహిత్య ప్రపంచంతో స్వేచ్ఛా కవిత్వంలో అతి నవ్యమైందిగా రూపొందింది.

తెలంగాణా విషయానికి వస్తే ఇక్కడి స్వాతంత్ర్యోద్యమం విమోచన రూపంలో స్పెయిన్‌లో అంతర్యుద్ధాన్ని తలపించే విధంగా భావితమైంది. నియంతృత్వానికి వ్యతిరేకంగా సాగే ప్రజల పోరాటం అంతర్జాతీయమైన మానవీయ తలంపై ప్రగతి

రూపంలో చిత్రితమైంది. "ప్రగతి అనే స్వర్గానికి" అడ్డంగా నిలిచిన పెద్ద "కొండలా" ఇక్కడి నిరంకుశ స్థితి ఉంది. అయితే జడ సమాజమూ ఇపుడు మారుతుంది. ప్రజల స్వేచ్ఛను కోరే చలన శక్తులతో చైతన్య దశ నందుకుంది. ఇది ప్రవాహ దశను చేరుకోవాలనే కవి అభిలాష. ప్రజల్లో ముందుగా తామనుకున్న స్వాతంత్ర్యాన్ని సత్వరం సాధించాలనే కోరిక బలపడింది. ఈ ఉద్యమం ఒక దశ మాత్రమే. ఈ దశ తరువాత సాధించాలిసింది ఎంతో ఉంది. అది సామ్యవాద స్వర్గం! మార్క్స్ స్వప్నం.

ఈ కావ్యంలో మౌలికమైన ఆశయాలు నాలుగు. (1) నియంతృత్వ రాజరికం నుండి విమోచనం – స్వాతంత్ర్యం; (2) సమాజంలో ప్రగతి శీల చేతనను ప్రేరేపించడం; (3) శ్రామిక జన సామ్యవాద సమాజాన్ని నిర్మించడం; (4) మానవుని శక్తివంతమైన చిరంజీవత్వాన్ని ఆధిక్యాన్ని భాసింప జేయడం. దీనితో పాటు మానవతా భావన ప్రకాశమానమయింది. ఇది చాలా బలంగానూ ప్రకటితమయింది. "ఈ కాంతను చెరపట్టగ రాకాసులు తలపెట్టిరి" మానవత్వం నశించి బర్బర చర్యలకు పరాకాష్ఠ నందుకున్న సన్నివేశం లోది. ఈ దుస్థితి మానవ సంస్కృతికే పెద్ద ప్రమాదంగా పరిణమించింది. ఈ విషమ సమయంలో మానవతా స్పందనలో ప్రగతి భావ క్రియా శీలం జన చైతన్యాన్ని ఉద్బుద్ధం చేస్తూంది. కవి తన సైద్ధాంతిక కర్తవ్యాన్ని పాలిస్తాడు.

ఈ సందర్భంలో సమాజం నిరంతరం ప్రగతి పథంలో నడవడమే ప్రవాహ రూపంగానూ వివేచన కందుతుంది. ఎప్పటికప్పుడిది కొత్త శక్తులతో క్రొత్త నీరుతో కొత్త గతులతో సాగుతుంది. దీనికి అడ్డమైన కొండల్ని కోసుకొని ప్రవహించమని జ్ఞాపకం చేయనక్కరలేదు. ప్రజల చైతన్యంపై కవికి విశ్వాసం ఉంది. "ఈ సరిత్ ప్రవాహానికి ఆనకట్ట కట్టలేం" అని కవి అభిప్రాయాన్ని ప్రకటిస్తాడు. ఈ సవిత్ప్రకాశానాకి డార్క్‌రూం కట్టలేం" అంటాడు కవి. ఇది ఏ అడ్డూ లేని ఎవరూ ఆపలేని జనచైతన్యాన్ని ప్రతీకాత్మకంగా వ్యంజింప చేస్తూంది. ఏ ప్రాంతంలోనైనా అన్యాయాన్నీ పీడననూ నిరసించవలసిందే! ఎదుర్కోవలసిందేనన్న ప్రబోధమూ ఉంది. అప్పుడు ఒక రాజరిక నిరంకుశ పాలనమనేది, చాలా స్వల్ప విషయమై పోతుంది. కావ్యంలో వస్తువు సీమలు దాటి విస్తృతిని పొందుతూంది. ప్రయోజనం జగద్వ్యాప్తమవుతూంది.

సమాజంలో సామాన్యులూ శ్రామికులూ చిన్న చిన్న చీమల్లాంటివారు. అందరూ కలసి సుసంఘటిత శక్తితో బలవంతమైన సర్పంలాంటి బూర్జువా వ్యవస్థను నిర్మూలించేందుకు సామ్యవాద స్థాపనకు దిశా నిర్దేశం చేయబడింది. అడుగు భుజం లంబం నుండి, కర్ణం వలె అట్టడుగు జనంలోనుండి కొత్త సామ్యవాద వ్యవస్థ ఆవిర్భావం సైద్ధాంతిక దృష్టితో వర్ణితమైంది. మార్క్సు గతి తార్కిక వాద రూపం ప్రముఖంగా ప్రత్యక్షీకృతమైంది. ఇది ఇట్లా ఉంచి మృత్యువును కూడా జయించే కాలంతో ఏకత్వాన్నిపొందే దిశగా పురోగమించే, జీవిత స్వరూపమూ తాత్త్విక స్పర్శను పొందింది. దీనితో సార్వ జనీనత్వమూ సిద్ధిస్తూంది.

తెలంగాణా విమోచనోద్యమ ప్రేరణతో మొదలై "త్వమేవాఽ హమ్" (నీవే నేను) కావ్యం నిఖిల మానవీయ రూపాన్ని ఆవిష్కరిస్తూంది. తెలుగు మాట్లాడే తోటి సోదరుల పట్ల ఆపైన హృదయ భాష మాట్లాడే సమస్త మానవ సోదరులపట్ల ఆత్మీయతను స్పందింపజేస్తూంది. మనిషిలో ఆలోచన స్పందన ఆశ ధైర్యం పురోగమనం విజయం లక్షణాలతో, చరిత్ర నిర్మాణ శీలాన్ని గుర్తింపజేస్తూంది.

స్వేచ్ఛా కవిత్వంలో "త్వమేవాఽ హమ్" కావ్యం, సృజన నవ్యతనూ, ప్రయోజన దిశలో సామాజిక బాధ్యతనూ సంతరించుకుంది. కవి ఆరుద్ర లోని ఉద్యమ శీలమైన మానవీయమైన ప్రగతి వ్యక్తిత్వానికి సంపూర్ణంగా ప్రాతినిధ్యం వహిస్తూంది. అభ్యుదయ మార్గంలో విశిష్టమైన సామాజిక కృతిగాను నిలిచింది.

## II.2 తెలంగాణా - విలీన భావం

హైదరాబాద్ సంస్థానంతో తెలంగాణా విమోచనానంతరం వచ్చిన తొలి విలీన భావ కావ్యం కుందుర్తి ఆంజనేయులు 'తెలంగాణా'. ఈ ప్రాంతం నిజాం పాలనలో మరాట్వాడా కర్నాటక ప్రాంతాలతో కలిసి ఉంది. ఈ కావ్యం భారతదేశంలో సమైక్యం కోరే ఉద్యమ ప్రభావంతోనూ, తెలుగు ప్రజల అఖిలాంధ్ర లక్ష్యంతో, విలీన భావ ప్రధానంగానూ పర్యాప్తమయింది. నిజాం నియంతృత్వ పాలనలో స్వాతంత్ర్య చేతనతో సాగిన ఉద్యమం చివరకు విజయప్రాప్తి కలిగింది. అఖిలాంధ్ర నిర్మాణంలో విలీన సూచనతో తెలంగాణ కావ్యం సమావిష్కృత మయింది. ఇది పదునెనిమిది భాగాలుగానూ విభజింపబడింది.

ఒకరాజు, అతనిది కటిక గుండె. అధర్మపాలనతో రాజ్యం నడుస్తూంది. ప్రజలు తమ "కష్టాల కావ్యాలు" మాత్రమే "సంపుటాలుగా" చదువుతున్నారు. కావ్యంలో "సింహాసనం" నిరంకుశ రాజరికానికి చిహ్నం. ప్రకృతి నేపథ్యంతో వెనుకబడిన తెలంగాణ జీవన స్థితిని ఊహలో మెరస్తుంది. "గోదావరి జలాలు అభిషేకించిన కమ్మని పొలాలు" ఉన్నాయి. కాని "నిరంతర దరిద్ర జీవితాల"కు కొదవలేదు. దరిద్రానికి ప్రధాన కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే. ప్రకృతి నేపథ్యం అనేక సందర్భాల్లో తెలంగాణా భౌతిక స్థితికీ వస్తువుకూ సమన్వయ రూపంగా వర్తిల్లింది. "అరణ్య"లో ప్రధాన భూమికను నిర్వహించింది. సముద్రం అవతలి నుండి వచ్చిన విదేశీయుల పాలనలో ఏర్పడిన సంస్థానం నైజాం రాజ్యం. ఈ దేశ మనే "జలధి"లో హైదరాబాద్ సంస్థానం ఒక "లంక"లా ఉంది. ఇందులో ఒక భాగం తెలంగాణా. కష్టాలకు నిలయంగా పరిణమించింది. "పరిపాలనా వీణలు అప శబ్దాలు" పలికాయి. అది సంగీతం కాదు. ప్రజల జీవితాల్లో "శ్రుతి కటువు" లయ్యాయి. ప్రజలు "కాలిన బ్రతుకులకూ" "తప్పని చీకటికీ" తట్టుకోలేక పోయారు. అసంతృప్తి హెచ్చింది. తిరుగుబాటుకు దారితీసింది. క్రమంగా అగ్ని కీలారూపాన్ని వహించింది. రాజుల కోసం కాలం ఆలస్యంగా నడవదనీ కవి గుర్తు చేస్తాడు. కాలం వేగాన్ని అందుకుంది. అదే భారతదేశంలో సమైక్యమయ్యే ఆకాంక్షతో స్వాతంత్రోద్యమం తల ఎత్తింది. బీజం నుండి అంకురం వలె ప్రజల బాధల నుండి పోరాటం పల్లవించింది. దీని చరమ లక్ష్యం మానవ సౌభాగ్య దృష్టితో భారతదేశంలో సమైక్యమై స్వేచ్ఛను పొందడం.

ఈ ఆశయ సాధనలో రాజకీయ పక్షాలు తమ పాత్రల్ని చేపట్టాయి. నల్లగొండ కేంద్రంగా వామపక్షాలూ నగరంలోనూ అక్కడక్కడా కొన్ని చోట్ల ఆర్య సమాజ్ మరియు రాజధాని నగరం తదితర ప్రదేశాల్లో గ్రామ గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ విస్తరించాయి. అయితే కవిలో ఆదర్శంగా కుదురుకున్న మార్క్సియ సామ్యవాద విప్లవ భూమికపై కావ్యం నిర్మితమయింది. వామపక్షాలంటే ఈ సందర్భంలో మార్క్సిస్టులనే కవి అభిప్రాయం.

ఈ కృతిలో "సంఘం సూర్యుడు" అడవిలో పొడిచాడు. ఊళ్ళలో కర్ఫ్యూ నెలకొంది. ప్రజల "గుండెపై కుంపటి"లా నిజాం పాలన తయారయింది. రైళ్ళలో బస్సుల్లో వీధుల్లో ఇండ్లలో దురాగతాలు ఎక్కువయినాయి. హత్యలు ప్రబలాయి. గృహ దహనాలు మితి మీరాయి. "కాలుతూన్న చెట్ల కొమ్మలతో అసమ్మతి ప్రదర్శనలతో జనజీవనం స్తంభించింది. ప్రజల్లో పెరిగిన అలజడి అశాంతి క్రమంగా ఉద్యమ విస్తరణకు దోహదం చేసాయి. దీన్ని అడ్డుకునేందుకు రజాకార్లు నియమింపబడినారు. అసలు రజాకార్ అంటే వాలంటీర్ అని అర్థం. సహాయ పడే సేవాపరుడు. కాని క్రమంగా అనుభవంలో దుష్టులుగా హంతకులుగా మారి నిందార్థాన్ని పొందడం జరిగింది. ప్రజల వ్యతిరేక చర్యలతో పోలీసుల ఆగ్రహం హెచ్చింది. గాలింపులు కాల్పులు విధ్వంసతో ప్రజల్లో ప్రతిఘటన హెచ్చింది. పోరాటం ప్రబలింది. అశాంతి శిఖరస్థాయినందుకుంది. భద్రత కరువైంది. రక్షణ భక్షణగా మారింది. నిరంకుశత్వం పరాకాష్ఠనందుకుంది. దీన్ని అంతం చేసేందుకు భారత ప్రభుత్వం రంగంలోకి దిగవలసి వచ్చింది. నైజాం రాజు గాలి మేడలు కూలి పోయాయి. ఉద్యమం విజయ శిఖరాన్ని అందుకుంది. నాటకం సమాప్త మయింది. కవి మాటల్లో తెలంగాణ గురించి "మన శిశువు చిరంజీవి! మృత్యువును జయిస్తుంది". అన్నమాట సార్థకమయింది. "వెలుగు జయిస్తుంది" అన్న మాట సార్వజనీనమయింది. "తెలుగు జయిస్తుంది", ప్రాంతీయమయింది. కవిలో తన భాషా సంస్కృతులకు సంబంధించింది. స్వీయాభిమాన స్పందన పురస్కృత మయింది. కావ్యంలో విశాలమైన తెలుగు రాష్ట్రం కవి మనసులోని భాషా ప్రయుక్త రాష్ట్రావతరణేచ్ఛను సూచిస్తోంది.

## 2

"ఒక రాజు మొగాన్నే పొద్దు పొడిచిందా?" అన్న ప్రశ్నతో కావ్యం మొదలయింది. ఇది తాను ఏకైక శక్తిగా భావించే నిరంకుశ ప్రభువు పాలనా

సామర్థ్యం పై విసరిన చమత్కృతి. "ఈ నేల ఎవరిది"? అంటే కోటి (అప్పటి తెలంగాణ జనసంఖ్య 1948" ప్రజలదని సమాధానం. ఇది నిరంకుశపాలన నుండి ప్రజల పాలనకు పయనించే చారిత్రక స్థితిని ప్రతిఫలిస్తూంది. చరిత్ర గతిలో మంచికీ చెడుకీ ధర్మానికీ అధర్మానికీ నిర్మాణానికీ విధ్వంసానికీ స్వాంత్ర్యానికీ జరిగే సంఘర్షణ కేంద్రంగా ఉంది. పరిస్థితులు ప్రజల నుండి త్యాగాలను కోరుతుంది. జాతీయ భావనతో జీవభూతమైన కృతి సామ్యవాద సమాజ స్థాప లక్ష్యంగా నడచింది. తెలుగు కవితా ప్రపంచంలో ఒక ప్రముఖ పార్శ్వమైన అభ్యుదయ మార్గాన్ని పొందింది. మార్క్సియ భావనా ఛ్చాయలు జీవిత చలనం సమాజ గమనం పయి విశ్లేషణ ఆ సందర్భానికి చెందినవి. ఇది కవిలో పీడుతుల పక్షం వహించేట్లు చేసింది. అందువల్ల సృజన దృష్టి కవి విశ్వసించిన సామ్యవాద క్రియా కలాపాలకు పరిమితం కావడం జరిగింది.

ఈ ఉద్యమంలో అనేక శక్తులు ముఖ్యమైన పాత్రల్ని నిర్వహించిన మాట వాస్తవం. ఇది చరిత్ర కాదు. కావ్యం కాబట్టి వస్తువులో తనకిష్టమైన అంశాల్ని ఎన్నుకొనే స్వేచ్ఛ ఉంది. తన అభిప్రాయాలకనుగుణంగా తీర్చిదిద్దడం అనేది సిద్ధాంతం లేదా అభిప్రాయాలపట్ల నిబద్ధత కలిగిన వారి విషయంలో సముచితమే. వస్తువులోని తదితరమైనవి కూడా గ్రహించి వాటి వాటి స్థానాల్ని గుర్తించి తన దృక్పథానికి భంగం కలగకుండానూ నిర్వహించవచ్చు. కావ్యానికి పీఠిక "ఇది నా దారి"లో, తన దారిపై విశ్వాసం స్ఫుటంగా ప్రకటితమయింది. ఇది "అనాథ కథ" గా పేర్కొనబడింది. పీడితుల పట్ల శ్రద్ధకూ సానుభూతికీ కారణమైన సామాజిక సమస్యను "మార్క్స్ సామ్యవాదాని కనుగుణంగా పరిష్కరించుకోవాలనే, కవి దృఢ విశ్వాసం. హైదరాబాద్ సంస్థానంలోని మూడు భాషా ప్రాంతాలకు చెందిన నాయకులతో ఉద్యమం సాగింది. ఈ కృతిలో తెలుగుభాషా ప్రాంతం పరిమితుల్ని పొందింది. ఇది కవిలో తన భాషా ప్రాంతం పట్ల మానసికమయిన అనుబంధం ప్రీతి వల్ల వస్తువులో విషయం సీమితమయింది. మద్రాసు నుండి వేరయ్యే తెలుగు ప్రాంతాలూ తెలుగు మాట్లాడే తెలంగాణ కలిసి ఏర్పడే మహాంధ్ర లేదా విశాలాంధ్ర నిఖిలాంధ్రపై ఆలోచన జరిగింది. చివరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరణం స్పష్టం. ఈ రచన ఉద్యమం ముగిసాక సమస్యల వాతావరణంలో స్తిమితత్వం ఏర్పడిన తరువాత శాంతంగా వ్రాయబడింది. 1959లో వెలువడింది. ఇది సమస్త తెలుగు ప్రజల ఆశల్ని ఆకాంక్షల్ని ఒకే త్రాటిపై నడిపించే ప్రయత్నంలో భాగమైంది.

రచనలో వస్తు నిర్వహణంలో ప్రస్తావన, సింహాసన, బీజోత్పన్న, ప్రజోద్యమం, అజ్ఞాత, రజాకార, మానభంగ, గృహదహన, దండయాత్ర, స్వాగత, దిగ్విజయ, ఉపసంహార భాగాలు ముఖ్యమైనవి. ఇవి ఉద్యమంలో మలుపుల్ని పొందినవీ, విషయ దిశలో శిఖరాలుగానూ కనిపిస్తాయి. పాలనా పీడకుల చేత సాధారణ పీడితులు పడిన బాధలు కారణంగా ఇరువర్గాల మధ్య సంఘర్షణతో విజయలక్ష్యం చిత్రితమయింది. ప్రజల జీవిత చలనంతో సమాజ గమన స్వరూపం ఆనాటి తెలంగాణా ఉన్న రాజకీయ వాతావరణాన్ని స్పృశిస్తుంది. ఇది స్వేచ్ఛా కవిత్వంలో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలంగాణపై వెలువడిన తొలి జాతీయోద్యమ ప్రగతి శీల కావ్యం.

యుగే యుగే కవితా సంపుటికి వ్రాసిన పీఠికలో కవి “కొత్త కొత్త ప్రయోగాలు చేయడానికి ప్రయత్నించిన వాణ్ని. దీని ఫలితమే సంపూర్ణ కావ్యంగా చెప్పదగిన తెలంగాణ” అన్న మాట ప్రక్రియా పద్ధతికి సంబంధించింది. కావ్యంలో వస్తుపరంగా రజాకార్ల దుశ్చర్యల ఫలితంగా అనేక విషాద సంఘటనలు జరిగాయి. వీటిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన “ఉద్యమ విభాగం” – “విజయ పథ”లో సహృదయుల్ని ఆకర్షిస్తాయి. “ప్రజోద్యమం”లో “నల్లగొండ మీద కూర్చొని ప్రభుత్వం నెరపే సూర్యుడు ఏడు గుర్రాలను ఏడు జిల్లాలకు దవుడు మీద పంపించాడు. సూర్యుడు ఉద్యమ చేతనకు ప్రతీక. నల్లగొండ వామపక్ష ఉద్యమకారులకు కేంద్రస్థానం. ఇక్కడి నుండి కార్యకర్తలు వివిధ ప్రాంతాలకు పంపబడేవారు. ఏడు పాయల్ని ఏడు గుర్రాల దవుడుగా ఏడు జిల్లాలకు ప్రాతినిథ్యం వహింపజేయడం జరిగింది. విప్లవోద్యమంలో క్రియాత్మకతను వ్యంజింప జేస్తుంది. “అజ్ఞాతం”లో “సంఘం సూర్యుడు అడవిలో పొడిచాక ఊళ్ళోకి చీకటి వచ్చింది”. పాలకుల విపరీత కృత్యాలవల్ల ప్రజలు ఊళ్ళు వదలి పోయారు. విప్లవ మూర్తులు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. ఊళ్ళలోకి పీడించే వారి రూపంలో చీకటే ప్రవేశించింది. చీకటి నియంతృత్వానికి చిహ్నమైంది. సూర్యుడు విరమించిన సమయంలో వచ్చేది చీకటే! ప్రకృతిలో మార్పు ఆధారంగా వర్తమాన స్థితి చిత్రణం భావ గర్భితంగా ఉంది. ఎర్రని తేజస్సు విప్లవ స్వరూపానికి సంకేతింపబడింది. “దిగ్విజయ”లో “సూర్యుని అభిమానించిన” గ్రామం పట్టపగలే సభలు పెడుతూనే ఉంది. ఈ కాలం ఎవరిది? “ప్రజల సొత్తు”! విప్లవాన్ని అభిమానించేవారు, ఎవరికీ భయపడడం లేదు. ధైర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇది ప్రజల కెంతో ధైర్యాన్ని ఇస్తుంది. ఉద్యమ స్థాయిని

కాపాడుతూంది. కాలం స్వతంత్రమైంది. ఎవరి చెప్పుచేతల్లోనూ ఉండదు. అందరిదీ. చరిత్రను నడిపిస్తూంది. "దండయాత్ర"లో భారత ప్రభుత్వ సేవలు హైదరాబాద్‌లో సంస్థానంలోకి ప్రవేశించాయి. ప్రజలు స్వాగతం పలికారు. రాక రాక వచ్చిన చుట్టానికి "స్వాగత మిచ్చింది చరిత్ర". హైదరాబాద్ సంస్థానం నైజాం పాలనలో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్ పాలనలో సాధారణంగా సంస్థానంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం ఉండేది కాదు. స్వాతంత్ర్యానంతరమూ భారత ప్రభుత్వం ఇంతకాలం ఉపేక్షా భావంతోనే ఉంది. ఇక్కడ పరిస్థితులు చేయిజారి పోతూండటంతో కేంద్రం జోక్యం చేసుకోవలసి వచ్చింది. "తెలంగాణ" అనకుండా "చరిత్ర" అనడంలో విశాల ప్రాతిపదికపై విశేష ఘటనతో సామాజికగతిలో మలుపును సూచిస్తూంది. ప్రజల ప్రమేయం గల పరిస్థితిని భావింపజేస్తూంది. హైద్రాబాద్ సంస్థానానికీ భారత ప్రభుత్వానికీ మధ్య ఇంత వరకు చెప్పుకోదగిన మంచి సంబంధాలు లేవు. అది ఇపుడు చారిత్రకంగా చేకూరింది. భారత దేశంలో విలీనమయ్యే సమయం వచ్చింది. విలీన భావంపైనే కవి దృష్టి కేంద్రీకృతమయింది. ప్రజల కష్టాలు గట్టెక్కే రంగం సిద్ధమైంది. "చరిత్ర"యే స్వాగతమివ్వడంలో సంఘటనకు చారిత్రకంగా విశేష ప్రాధాన్య మొసగబడింది. "ఉపసంహారం"లో తెలంగాణ గురించి మన "శిశువు చిరంజీవి – మృత్యువును జయిస్తుంది" అన్న భావం అన్వర్థమయింది.

తెలుగు ప్రజల సమైక్య స్వరూపంపై దృష్టితో, ఆ తర్వాత హైదరాబాద్ సంస్థానం నుండి వేరుచేయబడిన తెలంగాణ ప్రాంతం, ఆంధ్ర రాష్ట్రంలో విలీనం చేయబడి భాషా ప్రయుక్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అవతరించింది. అలాగే మరాఠ్వాడా, కర్నాటక ప్రాంతాలు తమ తమ భాషా ప్రయుక్త రాష్ట్రాల్లో విలీనమయినాయి. కావ్యం మొదటి నుండి చివరి వరకూ ఉద్యమ చలనంలో మానవతా స్పందనతో విలీనోద్యమాన్ని చిత్రించింది.

ఇక ఈ కావ్యంలో మార్క్సిస్టు దృక్పథం గురించి పీఠికలో కవి "నేను మొదటి నుంచీ మార్క్సిస్టు అవగాహనా పరిధికి స్థూలంగా లోబడి కావ్య రచనా విధానాలను గురించి ఆలోచన చేసే వాణ్ణి" అంటాడు. కవి పాత్రను గురించి వివరిస్తూ "భావ విప్లవానికి కృషి చేయడం కవి బాధ్యత" అంటాడు. ఇందులో ఉద్యమం గురించి స్పష్టమైన అవగాహనతో పాటు, దిశా నిర్దేశంలో స్పష్టత కనిపిస్తుంది.

ఇది చారిత్రకమైన వేరే అంశాల గురించి ఆలోచనను నియంత్రిస్తూంది. వ్యవహార భాషకు దగ్గరగా తెలుగు నుడికారంతో "ప్రజలభాష" అని కవి మాటకు నిదర్శనంగా ఉంది. పద్యంలో కనిపించే విరుపూ విసరూ విచ్ఛిత్తి వాక్య విన్యాసం అలంకార ప్రయోగం పద్యం పట్ల కవి అభిమానం మేరల్లో రేఖా మాత్రంగా పరిశీలనకందుతాయి. ఇది కవి మనసులో పద్యం పట్ల ఉన్న గౌరవాన్ని భావింపజేస్తూంది.

ఈ వచన కవితా ప్రక్రియకు వేదికగా "ఫ్రీవర్స్ ఫ్రంట్" స్థాపించడమూ, నాయకత్వాన్ని వహించి ముందుకు నడిపించడమూ జరిగింది. ఈ కారణంగా "వచన కవితా పితామహుడన్న కీర్తి రెపరెప లాడింది. "ఫ్రీవర్స్" అన్న మాటకు "స్వేచ్ఛా కవిత్వం" అన్నమాట చక్కగా సరిపోతుందనే నా అభిప్రాయం. ఇది అన్ని విధాలా సముచితంగానూ ఉంది. మరో విషయం ఈ కవి రాజకీయ సిద్ధాంతాలకు కార్యకలాపాలకూ ప్రాధాన్యమివ్వడం కన్నా, సాహిత్య చర్చలనాహ్వానించే సాహిత్యమూర్తిగా కనిపిస్తాడు. సామ్యవాద నిబద్ధతతో పాటు కావ్య కళకూ ఆలోచనలో స్థానం ఇవ్వడం గమనించదగింది. సంప్రదాయ పథంలోని మేలిమిని గ్రహించాలనీ ఆధునిక యుగానికి తగిన మార్పుల్ని స్వీకరించాలనీ సమన్వ ధోరణి దృష్టి వస్తుంది. ఇరు మార్గాలకూ మధ్య వంతెనగా ఏర్పడిన విశాల మతిగా సాహిత్య చరిత్రలో కనిపిస్తాడు. మార్క్సియం పట్ల నిబద్ధతతో పాటు సంప్రదాయం పట్ల సహన భావమూ కవి దృక్పథంలో విశ్లేషణ కందుతాయి.

"తెలంగాణ" కావ్యం చివర పరిణామ ఫలాన్ని దృష్టిలో పెట్టుకొని "ప్రజాస్వామ్యమే నందనం, హృదయపూర్వక వందనం" అన్నమాట కవిలో "సంభవించిన పరిణతికి కొసమెరుపుగా స్వీకరించవచ్చు. ఇది కవిలో ప్రజాస్వామ్య సామ్యవాద చింతనకు అద్దం పడుతూంది. సమాజంలో పీడిత జన విజయంతో మానవతా భావనతో సంపన్నమయింది. స్వేచ్ఛా కవిత్వంలో విలీన భావ చిత్రణ కావ్యం "తెలంగాణ". ప్రజాస్వామ్య సామ్యవాద వ్యక్తిత్వానికి ప్రాతినిధ్యం వహిస్తూంది. ఆధునిక సమాజ కవిత్వంలో అభ్యుదయ పార్శ్వంలో ప్రముఖంగా నిలుస్తూంది.

## II.3 ముక్తధాత్రి : అంతర్జాతీయ స్వాతంత్రోద్యమం

"ముక్తధాత్రి" (1972) స్వేచ్ఛా కవిత్వంలో మొదటి అంతర్జాతీయ స్వాతంత్ర్యోద్యమ చిత్రణ కావ్యం. స్వాతంత్ర్యంకై బంగ్లాదేశ్ ప్రజల ఉద్యమం ప్రజాస్వామ్య విజయం వస్తువుగా ఉంది. 1947లో భారతదేశ విభజనతో పాకిస్థాన్ దేశంలో భాగంగా తూర్పు పాకిస్థాన్ ఏర్పడింది. మత ప్రాతిపదికపై బ్రిటీషు ప్రభుత్వం విభజన విధానం కారణంగా అవతరించింది. దీనికి పూర్వం బెంగాల్ విభజనతో తూర్పు బెంగాల్‌గా వ్యవహరింపబడింది. ఇస్లాం మతాన్ని అవలంబించిన అధిక సంఖ్యాకుల కారణంగా ఏర్పడిన తూర్పు పాకిస్థాన్‌లో, భాషా సాహిత్యాలు సంస్కృతీ జీవన వ్యవహారశైలి పశ్చిమ బెంగాల్‌కు దగ్గరగా ఉన్నాయి. ఈ విధంగా పశ్చిమ పాకిస్థాన్‌తో విభేదించడం మొదలైంది. క్రమంగా అంతరం పెరిగింది. పశ్చిమ పాకిస్థాన్ ఆధిపత్య విధానమూ ఎక్కువయింది. తూర్పు పాకిస్థాన్ ప్రజల్లో అసంతృప్తి అశాంతి వాతావరణం మొదలైంది. తమ ప్రత్యేకతల్ని కాపాడుకునే ఉద్దేశంతో స్వేచ్ఛను కోరే మనస్తత్వంతో స్వాతంత్ర్యం వైపు దృష్టి మరలింది. దీనికి తోడు కేంద్రాధిపత్యంగల పశ్చిమ పాకిస్థాన్ పాలకుల దమనకాండ ఎక్కువయింది. ఆత్మాభిమానం భాషా సాహిత్య సంస్కృతుల పట్ల తమ జీవన శైలి పట్ల గౌరవంతో కూడిన వ్యక్తిత్వం స్వాతంత్ర్య భావనను ప్రేరేపించింది. బంగ్లాదేశ్ అవతరణకు బీజావాహం జరిగింది.

పశ్చిమ పాకిస్థాన్ పాలకుల దమనకాండ హెచ్చింది. భాష సంస్కృతి విషయంలో తమ ప్రత్యేకతను రక్షించుకునే సంకల్పంతో తూర్పు పాకిస్థాన్‌లో ప్రజలు ఎదురు తిరగడంతో ఘర్షణ అనివార్యమయింది. ఈ పరిస్థితుల్లో ముజీబ్ ఉర్ రహమాన్ నాయకత్వంలో తూర్పు పాకిస్థాన్ క్రమంగా పశ్చిమ పాకిస్థాన్ నుండి విడిపోయే స్వతంత్ర దేశంగా రూపొందే దిశగా పరిస్థితులు బహువేగంగా కదిలాయి. "బంగ్లాదేశ్"కై ఉద్యమం శిఖర స్థాయి నందుకుంది. పశ్చిమ పాకిస్థాన్ పాలకులు దీన్ని సహించలేకపోయారు. అధికార బలప్రయోగం తీవ్రతర మయింది. ఇది అంతర్జాతీయ దృష్టి నాకర్షించింది. 1970–71లో తూర్పు పాకిస్థాన్ ప్రజలపై పశ్చిమ పాకిస్థాన్ నెరపిన సైనిక చర్యవల్ల పరిస్థితి మరీ విషమించింది. స్వతంత్రమైన బంగ్లాదేశ్ అవతరణకు రంగం సిద్ధమైంది. అక్కడి "ముక్తివాహిని" స్వతంత్రమైన సంస్థ తన కార్యకలాపాలను విస్తృత పరిచింది. స్వాతంత్ర్య సమరం ఉచ్ఛ స్థాయికి

చేరింది. దాదాపు యుద్ధ వాతావరణం నెలకొంది. కాందిశీకులై లక్షల సంఖ్యలో ప్రజలు తమ దేశం వీడి పొరుగు దేశాలకు వెళ్లవలసి వచ్చింది. భారతదేశానికి తాకిడి ఎక్కువయింది. ముజీబ్ నాయకత్వంలో ఉద్యమం నిర్ణాయక దశకు చేరుకుంది. భారతదేశం సహాయ సహకారాలతో "బంగ్లాదేశ్ స్వతంత్రమైన రాజ్యంగా ప్రపంచపటంలో స్థానాన్ని పొందింది.

ఈ భూమికపై "ముక్తధాత్రి" కావ్యం అవతరించింది. (1) అనల తోరణం; (2) జ్వాలా తరంగాలు; (3) విలయచక్రం; (4) విజయ పర్వం భాగాలుగా వర్గీకృత మయింది. అనల తోరణం-తూర్పు పాకిస్థాన్‌లో పరిస్థితులు తాల్చిన ఉగ్రరూపం చిత్రితమయింది. "ఈ గాలిలో అణువణువులో అమర్ బంగ్లా స్వరారకం ఈ భూమిలో కణకణంలో సోనార్ బంగ్లా శక్తి నాదం" "అమర్ బంగ్లా" "సోనార్‌బంగ్లా" అన్నవి ప్రజల నినాదాలు. స్వభాషా సంస్కృతుల పట్ల మానసికమైన అనుబంధాన్ని కలిగినవి. వాటిని కాపాడుకునే సంకల్ప శక్తితో నిండినవి. "స్వేచ్ఛ"ను అడ్డుకోవడమంటే "గాలిని" గదిలో బంధించాలనుకోవడమే. తన ప్రజల విషయంలో రాజ్యం కుటిల నీతినీ వక్ర మార్గాన్నీ అనుసరించవలసిన పనిలేదు. ప్రభుత్వం చేపట్టే అణచివేతకూ తీవ్ర చర్యలకూ ప్రజలు తమ స్థలాలనుండి కదలిపోయారు. ప్రాణాలరచేతుల్లో బంధించి భయంతో పరుగెత్తే "వీరెవరీ పరిశుష్కిత రూపులు పంగ్వంధులు కారు వీరు, అంతకంటే భిక్షువులూ కారు, ధనమానం కొల్లబోయి మిగిలి ఒకే ఒక ప్రాణం, పక్షుల వలె ఆకులవలె పరదేశ మతిక్రమించలేరు" ప్రాణ రక్షణ కోసం "పక్షుల్లా" దొరలిపోయే "ఆకుల్లా" వెడలిపోతున్నారు. ఎవరికీ బాధ్యతలేని విధంగా పరిస్థితి నెలకొంది. పాలకుల చులకన భావం నిర్లక్ష్యం వల్లనే ఇదంతా జరుగుతుంది.

ప్రజల్ని దయారహితంగా తరుముకొని వచ్చే సైనికుల నీడలు వెంటబడే మృత్యురూపాల్ని తలపిస్తున్నాయి. ప్రతి క్షణం "చీకటిలో అగ్ని గోళంలా" ఎదురవుతూంది. సమాజంలో "చెలరేగిన కల్లోలం, ఎగసిన అగ్ని ధూమం" ప్రభుత్వ చర్యల ప్రభావాన్ని వేలెత్తి చూపిస్తున్నాయి. ఇక్కడ ప్రభుత్వం "రణం కోసమే" నన్నట్లుంది. ప్రజల రక్షణకై అవసరాలకై ముఖ్యంగా శాంతి కోసం కాదన్నట్లుంది. అంతటా "పిడుగులు! మెరుపులు!" "మబ్బు ముక్క కన్పించడం లేదు". మబ్బు కరుణకూ ఆర్ద్రతకూ సంకేతం. ప్రజల్ని బాధపెట్టే భయపెట్టే స్థితి తప్ప! కాపాడే

ధైర్యమిచ్చే మానవతా రూపం లేదు. ఉదారత కరువై పోయింది. అక్కడి క్షితిజం ఎర్రదనం వహిస్తూంది. నేల పచ్చదనం లోపిస్తూంది. ఎరుపు హింసకూ విధ్వంసానికీ శత్రుతకూ ప్రతీకగా ఉంది. రాష్ట్రం అశాంతికి నిలయమైంది. ఈ విషమ సమయంలో రాజకీయ రంగంపై అవతరించి నిలబడిన సాహసి ముజీబ్!. "ఎవరితడు? విప్లవ సంకేతం నెత్తురు మడుగులో విరిసిన అనల పద్మం" ఇతడు నాయకుడుగా ఎదిగిన విచిత్ర పరిస్థితుల్ని స్వచ్ఛమైన వ్యక్తిత్వాన్నీ ప్రస్తుత పరిస్థితుల్లో అవసరమైన ఉజ్వలతనూ ప్రకాశింపజేస్తూంది.

జనంలో నిలిచింది. అతని పేరు, విప్లవం. అవనిపై వెలసింది, అతని ఊరు స్వాతంత్ర్యం" చెలరేగిన విప్లవం పీడకుల్ని అంతమొందించేది. స్వాతంత్ర్యం ప్రజాస్వామ్యాన్ని సాధించేది. ప్రజల సామాజిక వ్యక్తిత్వాన్ని కాపాడేది. ఈ రెండూ సంకుచిత సీమల్ని అధిగమించినవి. వీటికి ప్రతినిధిత్వం నెరపే "ముజీబ్" తన నాయకత్వంతో ప్రపంచాన్ని ఆకర్షించాడు.

ఈ భాగంలో యథార్థంగా జరిగిన అనేక సంఘటనల స్థితుల పరంపర విషాద చిహ్నాలతో ముద్రితమయింది. పాకిస్థాన్ దేశంలో భాగంగా ఇరవై నాలుగు సంవత్సరాలు గడిచాయి. కరువులతో కాటకాలతో బ్రతుకులు సాగాయి. దారిద్ర్యంతో నిండాయి. ప్రజల్ని పట్టించుకున్న నాథుడు లేడు. దేశ ప్రధాన రాజధానికీ తమకూ వందల మైళ్ళ దూరం. పైగా మారణకాండ ఆరంభమయింది. రాత్రి "ప్రశాంత పద్మాల వలె" నిదురపోయే ప్రజలపై మెషిన్‌గన్ ప్రేలింది. ఏ అనుమానంతో ఏది జరిగినా, పోయిన ప్రాణాల్ని ఎవరు తీసుకొని వస్తారు. సైనికుల చేతుల్లో "ఎక్కుపెట్టిన రైఫిళ్ళ నిశ్శబ్దం"తో సమయం స్తంభించింది". అంతలో "నెత్తురు చుక్కలవలె" క్షణాలు జారుతున్నాయి. చెలరేగిన హింస ప్రతి మనస్సులో "చిత్రార్పితం"లా నిలిచిపోయింది. అప్పటి స్థితి "ఎత్తిన కత్తి"లా భయావహంగా ఉంది. ముజీబ్ ప్రజలకు "చీకటిలో దీపశిఖలా" తోచాడు. వ్యతిరేక పరిస్థితుల్లో నుండి మంటల మధ్య సహజంగా ప్రత్యక్షమైన "వసంతం"లా కంటికి కన్పించాడు. ఇంకా పశ్చిమ పాకిస్థాన్ పాలకుల్లో మార్పు వస్తుందనే ఆశ మిగిలే ఉంది. నియంతృత్వానికీ ప్రజాస్వామ్యభావనకూ మధ్య చివరి పోరాటం అనివార్యంలా ఉంది. ఒక చారిత్రకమైన "పరివర్తన" పరిహరించరానిదిగా రాబోతున్నది.

జ్వాలా తరంగాలు, ఉన్నట్లుండి ఎగసి పొరలడం మొదలు పెట్టాయి. స్వేచ్ఛను కోరే సామాన్య ప్రజ "కట్టలు తెంచుకున్న ప్రవాహంలా" ముక్తివాహినితో

కలిసింది. లక్ష్యసాధనకు జ్వాలారూపాన్ని ధరించాయి. ఉద్యమ తరంగాలెగసాయి.

ఇంతకాలం "పాలించిన చీకటి బోర్ల పడింది" అయినప్పటికీ "తలపైకెత్తి శాసించాలనే" ఆరాట పడుతూంది. పూల వనంలో జ్వాలలు! విపరీత పరిస్థితుల్లో ఆశకు ప్రతిరూపంగా ప్రజతో ముక్తి వాహిని కదలింది. విప్లవ తేజంతో వెలిగింది. "నటదగ్ని తరంగ ధుని"ని తలపించింది. మండే వనంలో పక్షుల్లా ప్రజలు! సుఖ సంతోషాల్ని ఎప్పుడో కోల్పోయారు. ఏ రోజు కారోజు "విషమపరీక్ష"లా ఉంది. కొన్ని ఎగిరిపోగా మిగిలిన పక్షులు చెట్లు ఆకుల చాటున తలలు దాచుకున్నాయి. ఏడ్చి ఏడ్చి మనుషుల దేహాలు మొద్దు బారాయి. ఆటవిక రంగంపై "కిరాతకం నృత్యం" చేస్తూంది. ప్రజల్లో ఓపిక నశించింది. అలసిపోయిన హృదయాలు నిశ్శబ్దంగా రాలిపోతున్నాయి. ఇపుడు జనం కళ్లనుండి కన్నీటి చుక్కలు జారడం లేదు. నిప్పు రవ్వలు చెరగి పడుతున్నాయి. ప్రజలు జ్వాలా చలనాన్ని పొందారు. తుది సమరం తప్పనిదైంది. నిర్ణాయక దశకు చేరుకోబోతూంది. ఈ విశేషస్థితిలో "అనలం వలె కదలే కాల రూపం, అందుకుంది స్వేచ్ఛా కవితా చైతన్యం" అని వస్తువుతో కావ్యకళ సమన్వితమయింది.

పాలకుల దురధికారం అతిశయించింది. భార్య పిల్లల సమక్షంలో స్వాతంత్ర్యయోధుల్ని రాజద్రోహులుగా నెంచి చేతులు వెనక్కి వెరిచికట్టి కాల్చేశారు. సైనిక పాలనలో రాజ్యం ప్రజా వ్యతిరేక దుశ్చర్యలకే ప్రాధాన్యాన్ని ఇచ్చింది. వేదనా ధ్వనులు మిన్నుముట్టాయి. ఏ బండీ మోయలేని బాధలతో కష్టాలతో, ఏ క్షితిజమూ భరించలేని అన్యాయాలతో అవమానాలతో ప్రజల బ్రతుకులు "చావుమాటల"తో గడచిపోతున్నాయి. ప్రజతో ముక్తివాహిని విజృంభించింది. సైనిక పాలనపై వ్యూహాన్ని అవలంబించింది. రాజధాని ఢాకా నగరం విస్తుపోయింది. ఆపదలో పడింది. అప్పటి స్థితి పేక ముక్కల్ని వెదజల్లినట్లుంది. ఆట సాగుతూంటే ఓటమికి భయపడి ఛిన్నాభిన్నం చేయబడిన ముక్కల్లా "చెదరిన వాలకం"తో ఉంది. సైనికుల పదఘట్టన ఇనుమడించింది. సైనికులు మార్చ్ ఆన్ వెనుకే ప్రజల్లో బంగ్లా ముక్తి వాహిని తరంగ ధ్వనులు మిన్నుముట్టాయి. జ్వాలా తరంగ చలనం రణ గతితో వాస్తవ దృశ్యాన్ని పొందింది కళ్లను మెరిపించింది.

విలయ చక్ర వ్యూహం ఆరంభమయింది. ప్రక్కనే జరిగే మారణ కాండకు భారతదేశం చలించింది. వ్యూహాత్మకంగా కదిలింది. ప్రజతో కలిసిన ముక్తి

వాహిని సమరం భారత రాజనీతిలో భాగమైంది. ఉత్సాహాన్ని మరింత పుంజుకుంది. ఇది ఎంతో సహాయపడింది. పాకిస్థాన్ ప్రభుత్వమూ సర్వ శక్తుల్నీ ఒడ్డి ఎదుర్కొనేందుకు సంసిద్ధమయింది. ఇపుడు బాంబుల మ్రోతలూ రైఫిళ్ళ సంభాషణలూ టాంకుల ఉద్ఘోషణలూ మాత్రమే వినిపిస్తున్నాయి. ప్రజలు "ఇనుప పంజరంలో స్వర్ణ హంసలవలె" చిక్కుకొని పోయారు. పోరాటం "సాహస లయ"తో "మరణ ధ్వని" వినిపిస్తూంది. "చివరి దశకు చేరిన దీపం వత్తిలా" ప్రభుత్వం "భగ్గున" మండింది. సైరన్ మ్రోతలతో దిశలు ప్రతిధ్వనించాయి. రాత్రి చీకటిలో ఢాకా నగరం "సగం నిద్రలో హఠాత్తుగా మేల్కొన్న పర్వతం వలె" ఉంది. క్షణాల్లో సమాజంలో "విలయ" తాండవం మొదలయింది.

ఢాకా నగరం "పెను తుపానులో ఊగే చెట్టు కొమ్మ చివర కొన ప్రాణంతో వ్రేలాడే పక్షిలా" విల విలలాడింది. లైట్లు ఆరిపోయాయి. భయం నీడలో రాత్రి నగరం గడిలో, ముసుగులో ఏడ్చి ఏడ్చి సొక్కి నేలపై వాలిపోయిన స్త్రీ వలె ఉంది. ఉదయంతో మెలకువ వచ్చే లోపలే "ఊపిరి నిండుగా తీసుకునే లోపలే" పెనుగండంలో సర్వం శత్రువు హస్తగత మయ్యేట్లుంది. ప్రజలు ఆ చీకట్లోనే "ప్రతి హృదయం ఒక అగ్ని గోళ వర్తన"తో వీరోద్రేకాన్ని ప్రదర్శించారు. ఎక్కడ చూచినా స్వాతంత్ర్యోద్యమ విప్లవ ప్రభావమే. ఎరుపు! ఎరుపు! మంటలు! మంటలు! ప్రకాశించే విజయ సూచనలు! కథ అడ్డం తిరిగింది. క్షణాలు పాద రస కణాల్లా పాలకుల చేతి నుండి జారిపోయాయి. మహాగ్నులు ఆరే దెట్లా? కుంభవృష్టి కురిస్తేనే! శాంతి వార్త వినబడితేనే! అదే! సైనికులు లొంగిపోయిన వాస్తవంతోనే చల్లదనం! ఇది విజయ పర్వానికి అవసరమైన సోపానం! అలాగే జరిగింది.

పాకిస్థాన్ పాలకుల అదృష్టం "అష్ట దిగ్బంధనం"లో చిక్కుకుంది. శరణాగతితో పరిస్థితి మారింది. విజయ పర్వం క్షణాల్లో అవతరించింది. పాక్ సేనల లొంగుబాటుతో "జన శక్తి ఒకటై కదిలింది". రవి సాక్షిగా ఉదయ శిఖరంపై దేశభక్తుల త్యాగంతో "బంగ్లాదేశ్ పతాక గగన హృదిలో" రెప రెప లాడింది. చరిత్ర మలుపు తిరిగింది. ఒక విషాద ఘట్టం సమాప్తమయింది. స్వాతంత్ర్య పర్వం మొదలయింది. తూర్పు పాకిస్థాన్ అదృశ్యమయింది. దాని స్థానంలో స్వేచ్ఛా పథంలో బంగ్లాదేశ్ ఏర్పడింది. ప్రజాస్వామ్యాన్ని వరించింది. విజయ వర్షంతో "వైరానలం" శాంతించింది. పాక్ సేనల లొంగుబాటు ఒక ఆశ్చర్యకరమైన

చారిత్రక ఘటన! బంగ్లా దేశీయుల కిపు డెవరిపై ఆగ్రహం లేదు. తమ భవిష్యత్తును సుందరంగా తీర్చుకునే ఉత్సాహం తప్ప! ఈ గడ్డ ఇపుడు శాంతి నిలయం కావలసి ఉంది. నిరంతరం "మెడపై వ్రేలాడే మృత్యు హేతి" తొలగింది. ముఖంపై ఇంద్ర చాపం విరిసింది. గతంలో "లేచి క్రమ్మిన ధూళి ధూమం" శాంతి జల సేవనతో అణగాయి. తమలో ఉన్న క్షమాగుణం పాక్ సేనల్ని కాపాడింది. ఇది ఉత్తమమైన మానవ సంస్కృతికి నిదర్శనంగా ఉంది. మానవతా స్పందనకు పరాకాష్ఠ అయింది.

ఇంతవరకూ మండి మండి చల్లబడిన వాతావరణంలో "రాగం" మొలకెత్తుతూంది. సమతా "కిర్మీర సమాజం" వెలుగుతూంది. ఎక్కడ చూచినా ప్రజల ముఖాల్లో "మానవతా రూపమే" దేశం ప్రపంచ పటంలో పేర్కోదగినదై "దళమై కళయై" ప్రజాస్వామ్య దీప్తిని పొందింది. మానవ బాధారుణ గాధామయ చరిత్రలో "వికసించిన ప్రజా పద్మం అమర్ సోనార్ వంగదేశం" – బంగ్లాదేశ్ విప్లవ సంకల్పంతో ప్రజలు పొందిన అమూల్య వజ్రం! "నాయకుడు షేక్ ముజీబ్! ముక్త ధాత్రి బంగ్లాదేశ్ నసీబ్" నసీబ్ అంటే అదృష్టమని అర్థం. స్వాతంత్ర్యానికి పూర్వం స్వాతంత్ర్యం తరువాత అతడే దేశానికి అదృష్ట నేతగా నిలిచాడు. చరిత్రలో కొత్త అధ్యాయానికి కర్త అయినాడు.

అంతర్జాతీయమైన వస్తు గౌరవంతో స్వాతంత్రోద్యమంతో ఆవిష్కృతమయిన కావ్యం "ముక్తధాత్రి". విషయ కథనంలో సృజనరూపం ఉద్యమ స్ఫూర్తికి సంబంధించింది. సంవిధానంలో భావ రూపాలతో ప్రతీకలతో కళాత్మకమైన నిర్వహణ రూపాన్ని పొందింది. అనేక సంఘటనలూ స్థితులూ జీవిత చలనాన్ని సమాజ గమనాన్ని బట్టి వాస్తవ తలంపై రూపొందాయి. విషయ పరంపర వీర కరుణ రసాత్మకంగా సాగింది. చివరకు శాంత రసాకృతిని పొందింది. పూర్వం ఎగిరి పోయిన "శాంతి కపోతం" తిరిగి వచ్చింది. స్వేచ్ఛగా ఎగురుతూంది. నిర్భయంగా ప్రతి వ్యక్తి భుజాలపై వాలుతూంది. ముఖంలోకి తొంగి చూస్తూంది. కపోతం స్వేచ్ఛకూ శాంతికీ మానవతకూ సంకేతం.

వ్యక్తిలో స్వేచ్ఛ కోసం పోరాడే సంకల్పాన్నీ, విజయాన్ని సాధించే క్రియా శీలాన్నీ, స్థాపించే కావ్యం ముక్తధాత్రి. స్వేచ్ఛా కవిత్వంలో అంతర్జాతీయ తలంపై స్వాతంత్రోద్యమ చిత్రణంతో మాదిరాజు రంగారావు ప్రజాస్వామ్య వ్యక్తిత్వానికి అద్దం పట్టే తొలి సృజన రూపం!

## II.4 వియత్నాం : అంతర్జాతీయ విప్లవోద్యమం

"వియత్నాం" స్వేచ్ఛా కవిత్వంలో అంతర్జాతీయ విప్లవోద్యమ కావ్యం, ఉత్తర వియత్నాం ప్రజలూ అమెరికా ప్రభుత్వం మధ్య సంఘర్షణ చిత్రణం ఉత్తర వియత్నాంపై అమెరికా దాడిని పురస్కరించుకొని ఏర్పడిన సంక్షోభంతో వియత్నాం వీరుల పోరాటం – చివరకు విజయం వస్తువుగా విలసించింది. ఇది రెండు భాగాలుగా ఉంది. మొదటి భాగంలో వియత్నాం పోరాటంలో ప్రజల విషాద పర్వం, అమెరికా సేనల చర్యలతో ఏర్పడిన విలయ దృశ్యాల పరంపరా రూపం. రెండోభాగంలో అమెరికా సేనల నిష్క్రమణంతో ఏర్పడిన శాంతి పర్వం. స్నేహం శాంతితో ప్రగతి పథంలో కదలే ఆశారూపం. వస్తువు అంతర్జాతీయంగా రాజకీయ ప్రాధాన్యం కలిగింది.

ఉత్తర వియత్నాంలో ప్రజల స్వేచ్ఛకూ వాళ్ళ జీవితాల అస్తిత్వానికీ భంగం కలిగించే జటిలమైన సమస్యతో కూడిందీ వస్తువు. అక్కడి సమాజం ఎంతో కల్లోలానికి గురి అయింది. దీనితో శాంతి చెదిరింది. ఇదంతా అప్పటి అమెరికా ప్రభుత్వాన్ని నడిపే నాయకత్వంలో ప్రపంచంలో తమ ఆధిపత్యాన్ని ఋజువు చేసే ప్రయత్నంలో భాగంగా జరిగింది. తమ రాజనీతినీ విదేశాంగ విధానాన్నీ ఇతర రాజ్యాలు ఒప్పుకోవాలనే అనుసరించాలనే అభిప్రాయంతో కూడింది. అమెరికా సైనికులు ఉత్తర వియత్నాంలోకి "శాంతిసేన" పేరుతో ప్రవేశించారు. వ్యతిరేకమైన ఉద్యమం పెరగడానికి కారకులయ్యారు. ఇదో విరోధాభాస (paradox)గా మారింది. ఆనాటి పత్రికల్లో వెలువడిన వార్తలు ఆధారంగా వస్తువు కావ్యాకృతి పొందింది. వియత్నాం వీరుల పోరాట పటిమ అసాధారణమైంది. గెరిల్లా రణ తంత్రంలో సిద్ధహస్తుల ముందు, అమెరికా సైనికుల రణ వ్యూహం నిష్ఫలమయింది. ఎంతో పెద్ద దేశమైన అమెరికాను చాలా చిన్న దేశమయిన ఉత్తర వియత్నాం ఎదుర్కోవడానికి సిద్ధం కావడమే ఒక పెద్ద విశేషం. ఇదో పెద్ద సంఘర్షణగా దీర్ఘ కాలం సాగింది. వీర కృత్యాలతో ఉజ్వలితమయింది. వియత్నాం వీరులు ఉత్సాహంతో ధైర్యంతో ఎప్పటికపుడు రూపొందే క్రియాచరణ ప్రణాళికలతో ఉద్యమాన్ని నడపడం, చాలాకాలం దాన్ని స్థిరంగా నిలపడం అంతర్జాతీయ సమాజాన్ని ఆశ్చర్య పరచింది. ఉత్తర వియత్నాం పోరాటం – తుది విజయం మానవ చరిత్రలో పేర్కోదగిందిగా నిలిచిపోయింది. స్వేచ్ఛా గతంగా మనిషిలో నిక్షిప్తమైన వీర వ్యక్తిత్వాన్నీ అజేయత్వాన్నీ ప్రస్ఫుటం చేసింది. బహుకాలం యుద్ధ వాతావరణాన్ని నెలకొల్పి బీభత్సాన్ని సృష్టించిన

అగ్రరాజ్యం చివరకు శాంతి చర్చలకు సిద్ధం కావడం, మనిషిలో నిహితమైన శాంతి కామననూ పరిస్థితుల కనుగుణంగా మారే సరిపెట్టుకొనే రాజనీతి వివేకాన్ని బహిర్గతం చేసింది. సృజన దృష్టిలో వస్తువు కేవలం మానవతా గుణంతో నిఖిల మానవ సౌభాగ్య భావంతో శాంతి లక్ష్యంతో కావ్యాకృతిని పొందింది.

"ఆయుధాలు ప్రేలేను అహంకార గర్జాధ్వనితో, పాపం కొందరు! జలదమని తలచేరు, ఇదో శాంతి సేవలో భాగంగా ప్రచరించేరు." కొందరు అంటే అమెరికా మరియు దాని మిత్రపక్షాలు మారణాయుధాల్ని ప్రయోగిస్తూ ఇది ప్రజలకుపయోగకరమైన చర్య అని భావించడం రాజనీతి ప్రేరితమయింది. ఆయుధాలు ప్రేలడంతో ఎగసే ధూమం జలదమనీ ప్రచారం చేయడంలో ఉంది గడుసుదనం! రణ చర్యలు సేవా క్రియలని బాహాటంగా చెప్పడంలో ఉంది! చాకచక్యం! ఇది కేవలం పట్టుదలతో అహంకారంతో అనుసరించే అగ్ని పథం మాత్రమే! "నాగరకత పెరిగే కొద్దీ మారణ క్రియలో అభివృద్ధి చెందిన ఆయుధాల సమీకరణం అవసరం ఎక్కువవుతూంది. దీనికి కారణం స్వార్థం. ఈ దిశలో పయనించే మనిషిని చూస్తే మనిషికి అనుమానం భయభావం! ఆ భయం పోవాలి, విశ్వాసం కుదరాలి. దీనికి ప్రేమ ఉదారత మానవత సౌభ్రాతృత్వంతో కూడిన వాతావరణానికి కృషి జరగవలసి ఉంది. అమెరికా అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమే. అయినప్పటికీ ఆధిపత్య రాజనీతి ప్రోద్బలంతో, ప్రజాస్వామ్యాన్ని స్వప్రయోజనాలకై తప్పుదారి పట్టించడం మానవత్వాన్ని మంటగలపడం అసమంజసమైంది. ఇది ఎన్నో విపరీత పరిణామాలకు దారితీయడం సహజం. మనుషులంటే "మొక్కలు" కాదు. మ్యూజియంలో "శిల్పాలూ" కాదు. చరిత్రలో సాంస్కృతికమైన పరంపరలో భాగంగా వర్తించే వ్యక్తులు, ఆలోచన మరియు అనుభవమూ కలిగిన బుద్ధి జీవులు. స్పందన ఉన్నవారు. అయితే అడవి నుండి జనపదం ఆపైన పట్టణం నగరం వరకూ పయనించిన మనిషిలో ఆటవిక లక్షణం గుప్తంగా ఉండనే ఉంది. సంకుచితత్వమూ ఆక్రమణ తత్త్వమూ ఉద్రేక సాహస కృత్యాలతో కూడింది. ఎంత ఎత్తు ఎదిగినా ఆ ఎత్తు క్రింద లోయ ఉండనే ఉంటుంది. అయితే సంస్కారం – సంస్కృతి ఆలోచన వివేకం అనేవి వీటిని అదుపులో పెడతాయి. అందుకు సహకరిస్తాయి. ఈ దృష్టితో బాగా అభివృద్ధి చెందిన అగ్రరాజ్యాల బాధ్యత మరింత ఎక్కువగా ఉండవలసిన అవసరముంది.

ఉత్తర వియత్నాం, "నిద్ర ఎరగని రాత్రి"లా "శాంతి ఎరగని జ్వాల"లా వీర భూమికి ప్రతీకయైంది. అవిరామంగా పోరాడుతూనే ఉంది. స్వాభిమానంతో

చర్యకు ప్రతిచర్య నవలంబిస్తూంది. ఇది విప్లవచ్ఛాయల్లో ఉత్తర వియత్నాం పరిస్థితి. దీనికి కారణభూతులు పెద్ద కారులో పయనిస్తున్నారు. అడవుల్లో చొరబడి ఆధునికమైన ఆయుధాలతో వీరుల వేటకుపక్రమిస్తున్నారు. ఆకాశంలో విమానాల్నీ ఆశ్రయించారు. ఈ అభివృద్ధి ఎరగని నేలపై, చెట్ల చాటునుండి కొండల గుట్టల చాటు నుండి పెద్ద పెద్ద బండల చాటునుండి విప్లవ వీరుల గెరిల్లా యుద్ధం ప్రారంభించారు. పై నుండి బాంబులు పడుతున్నాయి. సామ్రాజ్య వాద విస్తరణ కాంక్ష నెరవేరలేదు. ఆ నేల తమ వశం కాలేదు. కారుకు రెండు వైపుల బెజ్జాల నుండి ఆయుధాలు ప్రేలుతున్నాయి. టాంకులు మొండిగా కదలుతున్నాయి. పైనున్న మెషిన్‌గన్ తన పని తాను చేస్తూంది. కారులో పయనించే వారు ఆ నేలకు కొత్త! ఈ పరిస్థితి “ఎవరి క్రాస్ వారు వహిస్తూ” పోతూన్నట్లుంది. ఎపుడేమి జరుగుతుందోనన్న “అపాయ భయం” లేకపోలేదు. “ఎయిర్ కండిషన్ కార్‌లో కూర్చొని ఉత్తర వియత్నాంను నియంత్రించాలనే ఉపాయంలో” ఉన్నవారికి ఇది సాధ్యం కాని విషయమని తెలియడానికి కొంత కాలం పడుతుంది. మనిషి కళ్ళనుండి ఒక సమయం (సంతోషం స్నేహంలో) పూలు పూస్తాయి. ఒక సమయం (కోపం వ్యతిరేకంలో) అగ్ని రాలుతుంది. ఇపుడు ఏది కావాలో నిర్ణయించుకోవలసింది అమెరికా ప్రభుత్వమే. సైనికుల బల ప్రదర్శనలో శాంతి ఎట్లా సాధ్యం? అన్ని హంగులతో అడవిలో లేటెస్ట్ మోడల్ కారు కదలుతూంది. అది పయనించి పయనించి చివరకు పూర్వం “ఎక్కడ మొదలయిందో అక్కడికే వచ్చి” చేరుతూంది. అమెరికా పథకం నిష్ఫలమై పోతూందన్న దానికి నిదర్శనంగా ఉంది. ఎంత గొప్ప దేశమైనా కేవలం సైనిక బలంతో ప్రజల్ని వశం చేసుకోవడం సాధ్యం కాని విషయం. స్థానిక ప్రజల ప్రమేయం సహకారం లేకుండా మరో దేశంలో వశం కాని పరిస్థితులు అనుకూలంగా మారడం కష్టం. కారును ముందుకు నడవకుండా నిలిపేయాలనే గెరిల్లాల సంకల్పం, గెరిల్లాలను తుదముట్టించాలనే అగ్రరాజ్యం సేనల ప్రయత్నం. రెండూ ఎదురెదురుగా ఘర్షణలో దిగిపోయాయి. ఒక్కొక్క ప్రజా వీరుడు సాక్షాత్కరిస్తున్నాడు. నివాసాలు బూది అవుతున్నాయి. అగ్ర రాజ్యానికి తుది విజయం లభించడం లేదు. అపజయాన్ని ఒప్పుకోనూలేదు. అకారణమైన అవసరం లేని హింస – వినాశనం ఎన్నటికీ ఏ దేశంలోనూ ఆమోదయోగ్యం కావు.

చరిత్రలో “మైలై” ఘటన, అత్యంత విషాదకరమైంది. “రణ నీతికీ, మానవతకూ గుడ్ బై” పలికిన సన్నివేశం! ఉత్తర వియత్నాంలో ఒక గ్రామం “మైలై”.

ఇది గెరిల్లాలకు పట్టుకొమ్మ. దీనిపై అగ్రరాజ్యం విషవాయువులతో దాడి చేసింది. అత్యంత హేయమైన అనాగరక చర్యగా ప్రపంచం అభిశంసించింది. "ఈ ఊరు ముఖాన మంటలతో పొగలతో కాలం చిత్రిస్తూంది బాధాకర చిత్రం" "అరుణ చిత్రం" ప్రజల దుస్థితికీ కోపానికీ ప్రతీకగా ఉంది. ఆ దేశంలోని ప్రజల వెనుకబడిన అభివృద్ధి లేని లక్షణాన్ని ఆసరాగా తీసుకొని అణచివేతకు పాశవిక చర్యల్ని అవలంబించడం న్యాయం కాదు అత్యాంతాధునికమైన రసాయనికాయుధాల్ని ప్రయోగించడం ఏ విధంగానూ క్షమార్హం కాదు. ధనంతో బహుమతులతో ప్రజల్ని వశం చేసుకునే ప్రయత్నమూ జరిగింది. ఈ క్రియా భూమిపై "స్వేచ్ఛా సంకల్పంతో దీక్షా కవచంతో కదిలేదీ, వెలిగేదీ మనిషే! నన్న విషయం మరచిపోకూడదు. స్వేచ్ఛగా ఎగిరే పక్షుల్ని బెదిరించినంత మాత్రాన "ఎగరడం మానవు" వాటిని పంజరంలో ''బంధించాల''నుకోవడం, రెక్కల్ని ''కత్తిరించాల''నుకోవడం ''ఎగరకూడద''ని శాసించడం మాటవినకపోతే తనకు చేత కాకపోతే చంపేయాలనుకోవడం అమానుషం. మానవ చరిత్రలో ''జరగకూడనిది జరిగిపోతూంది". అమెరికా అగ్రరాజ్యచర్యలకు సభ్య ప్రపంచం విస్తుపోయిన మాట కూడా వాస్తవం.

ఇరు పక్షాల మధ్య ఎగసిన అగ్ని రేఖ జ్వలిస్తూంది. ఆరడం లేదు. చరిత్ర ముఖాన కత్తి గంటులా ఉంది. స్మృతిలో మిగిలే హింసకు చిహ్నంగా ఉంది. పక్షికి ఎగిరే స్వేచ్ఛ ఎంత ముఖ్యమో, మనిషికి తన బ్రతుకు బ్రతికే స్వేచ్ఛ కూడా అంతే ముఖ్యం. మరో దేశం నుండి వచ్చి కొత్త దేశంలో ప్రజల్ని నియంత్రించే, స్వేచ్ఛను నిరాకరించే, బ్రతుకుల్ని శాసించే పద్ధతి ప్రజాస్వామ్యానికి విరుద్ధమైంది. అదీ బల ప్రయోగంతో రక్త సిక్తంతో సాధించాలనుకోవడం మానవ పరిణత సంస్కృతికి గొడ్డలి పెట్టు. మనిషిని గెలిచే పద్ధతి మానసికంగా జరగాలి. మానవతా స్పందనతో ఉండాలి. ఇక్కడ "శాంతి" ఎండిన సరస్సులా" ఉంది. నీరు శూన్యం. అంటే మానవత మచ్చుకైనా లేదని అర్థం. ఈ సంక్షుబ్ధం ఎన్నాళ్ళు? అంటే అగ్రరాజ్యం విసిగి పోయేంతవరకని సమాధానం వస్తుంది. వీరులు సాహసంతో తల ఎత్తి పోరాడే గెరిల్లా వ్యవస్థను, ఏ ఆధునిక శక్తి జయించ లేకుండా ఉంది.

"ఒక దీపం ఆరిపోతే", వెనువెంటనే "పది దీపాలు వెలుగుతున్నాయి". దీపం గెరిల్లాకు సంకేతం. వేదనా తంత్రులపై వియత్నాం క్రందిస్తూంది నేలపై

నడచే శత్రువు కాళ్ళ క్రింద, మొనదేరిన కత్తులు పరచబడీ, అడుగులు ముందుకు వేయనీయడం లేదు. అమెరికా విసిగిపోయింది. గెరిల్లా పోరాట పటిమ దిగ్భ్రాంతికి గురిచేసింది. చరమాంకానికి సూచనగా కావ్యంలో సన్నివేశం ప్రతీకాత్మకతను పొందింది. "ఈ జ్వాలా సందర్భం! రాత్రికి చరమాంకం కాబోతుంది". వార్తలో వాస్తవ మెంత వరకున్నదో! కాని, రణం తీవ్రత నందుకుంది. వీరుల శరీరాలు యుద్ధ యంత్రాలుగా మారాయి. పర సేనతో తలపడుతున్నాయి. పోరాటం ఆగలేదు. ప్రపంచంలో సభ్య దేశాలన్నీ ముక్త కంఠంతో యుద్ధాన్ని ఖండించాయి. వ్యతిరేకించాయి. అయినా అమెరికా ప్రభుత్వం ఇదొక ప్రతిష్ఠగా భావించి రణాన్ని సాగించింది. "నిశానియంత జ్వలన దళాల్ని" ఛేదించే లక్ష్యంతో వియత్నాం విప్లవిస్తూంది. చివరకు అమెరికా ప్రభుత్వం తన వ్యూహం నెరవేరక ప్రపంచాభిప్రాయం ఒత్తిడిలో, పోగా మిగిలిన కాస్త గౌరవాన్నీ నిలుపుకొనే నీతిలో భాగంగా రాజ్యతంత్రాన్ని మార్చింది. "రోట్లో తల దూర్చాక ఎంత పెద్ద తల అయితేనేం? చితికి పోక తప్పదన్న సూక్తిలోని వాస్తవాన్ని గ్రహించింది. క్లిష్ట పరిస్థితి నుండి బయటపడే మార్గాన్ని అన్వేషించడం మొదలైంది. గెరిల్లా యుద్ధ కళతో ఉత్తర వియత్నాం ధైర్యంతో ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ఆరితేరిన మతులను బెదరగొట్టింది. స్వేచ్ఛను కాపాడుకునే శక్తిని ప్రదర్శించింది. తమ భూమిని రక్షించుకునే వీరత్వాన్ని నిలుపుకుంది. శాంతి భయం భయంగానే నేలపై అడుగులు వేసింది. క్రమంగా ధైర్యాన్ని పుంజుకుంది. "విప్లవ ఘన చ్ఛాయల్లో" నుండి "క్రాంతి వియత్నాం"గా అవతరించింది. "అశాంతి చక్రం" నుండి బయటపడి "శాంతి వలయం"లోకి ప్రవేశించింది. ఇదో చారిత్రక ఘటనగా నిలిచిపోయింది.

రెండో భాగం – "శాంతి వెలుగులో" శాంతి బిందువుతో మొదలై సంతోష రూపాన్ని పొందింది. వాలిన శాంతి ఎగిరి పోకుండా కాపాడుకోవడం శాంతి ప్రియుల కర్తవ్యంగా భావితమయింది. సర్వం విధ్వంసమైన భస్మమైన స్థితి నుండి నిర్మాణాన్ని పచ్చదనాన్ని పొందవలసి ఉంది. దీని కోసం మనుషుల మధ్య గోడల నిర్మాణం కాదు, మనస్సు పెరిగి, ఉదారతను పొందడం మరీ ముఖ్యం. శాంతి నెలకొన్న తరువాత గతాన్ని సమీక్షిస్తే, ఆ దేశంలో ఊళ్ళకు ఊళ్ళు దగ్ధమైన దృశ్యాలు! కాళ్ళూ చేతులూ కాలీ, విరిగీ, ముఖాలు మాడీ చావు బ్రతుకుల మధ్య కొట్టు మిట్టాడే స్థితు లనేకం మనస్సును కలచివేస్తాయి. అయితే విజయోత్సాహం సమస్త

బాధల్నీ మరపిస్తూంది. జీవసంకల్పాన్ని ప్రసరింపజేస్తూంది. ప్రజల జీవితాల్లో చీకటి అంతరించింది. వెలుగు ప్రవేశించింది. కొత్త అధ్యాయం మొదలయింది. ఇంతవరకూ సాగిన మంటల ఆటలూ, నెత్తురు పాటలూ అంతమయినాయి. శాంతి వచనాలూ సౌభాగ్య చర్యలూ ఆరంభమయినాయి. మానవత ఇంకా మిగిలే ఉందనీ మానవీయ శక్తికి క్షతిలేదని చెబుతూంది. ఇక్కడి చరిత్రలో వీరభూమిపై "నలుపు పై ఎరుపు" "ఎరుపు నుండి తెలుపు"కు కాలం పరివర్తితమయింది. నలుపు ఆధిపత్యానికీ నిరంకుశత్వానికీ, ఎరుపు పోరాటానికీ వీరానికీ తెలుపు స్వేచ్ఛకూ శాంతికీ ప్రతీకలు. ఈ విధంగా కావ్యం ప్రతీకాత్మకతను పొందింది. మరో విధంగా నలుపు కష్టాలకూ బాధలకూ, ఎరుపు ఉత్సాహానికి వీరానికీ 'తెలుపు శాంతికీ సౌభాగ్యానికీ సంకేతాలుగా కనిపిస్తాయి. సుదీర్ఘమైన ఘోరమైన నిశారూపం గడచిపోయింది. ప్రభాతం అనుభవానికి వచ్చింది. గ్రీష్మం వలె మండే మంటలు జీవితాల్లో చివరకు చినికే వానజల్లుతో, దగ్ధమైన భూమిపై పచ్చదనంపై ఆశతో, శాంతి జల సేచన సూచనతో కావ్యం ముగిసింది. "ఎండిన కొమ్మలు, చివుళ్ళ నందుకుంటున్నాయి. మండిన బ్రతుకులు పచ్చదనం పొందుతున్నాయి". ఇంత వరకూ అడవుల్లో కొండల్లో పోరాటంలో నిమగ్నమైన వీరు లిపుడు ప్రశాంత ముఖాలతో పూచిన కళ్ళతో తమ దేశం ఉత్తర వియత్నాంను అలంకరిస్తున్నారు. బంధువుల్నీ మిత్రుల్నీ ప్రజల్నీ సంపదనూ కోల్పోయిన విషాదచ్ఛాయలూ లేకపోలేదు. అవి స్మృతిలో చరిత్ర చిహ్నాలుగా 'మిగిలి పోవడమూ సహజమే!

"పూల కోసం పండ్ల కోసం ఏండ్లుగా మొగం వాచిన చెట్లు! స్నేహ సుందరంగా స్వాగతానికి చేతులు చాచి నిలిచాయి" ప్రకృతి నేపథ్యంలో గెరిల్లా పోరాటం చివరకు శాంతి కావ్యంగా విలసిల్లింది. ఇది "వియత్నాం" కృతి, మానవ విజయ చిహ్నంగా ఆకర్షణీయమైన వస్తు బలంతో ప్రత్యేకతను పొందింది. అనేకమైన స్థితులూ సంఘటనలూ బీభత్స వీర కరుణ రసాలతో చివరకు శాంతి రస పర్యవసానంతో ప్రగతి రూపాన్ని సంతరించుకుంది. స్వేచ్ఛనూ సౌభ్రాతృత్వాన్నీ వరించింది.

ఇది వియత్నాం, మాదిరాజు రంగారావు సృజన రూపం. అంతర్జాతీయ విప్లవోద్యమ చిత్రణం. మనిషి అస్తిత్వంపై సృజన దృష్టితో మానవతా స్పందనకూ మానవ విజయానికీ ప్రాతినిధ్యం వహిస్తూంది. స్వేచ్ఛా కవిత్వంలో ప్రజాస్వామ్య హృదయాన్ని ఆవిష్కరిస్తూంది.

## II.5 మానవీయం : మానవ సమాజ చిత్రణం

స్వేచ్ఛా కవిత్వంలో మానవీయం మొట్ట మొదటి మానవ సమాజ చిత్రణ కావ్యం. ఇందులో వస్తువు నిఖిల మానవ సమాజం. మనిషిలో సహజ జ్ఞానం ఏర్పడినప్పటి నుండీ అనుభవంతో హేతువుతో నేటి వరకూ సాగిన జీవిత చలనంలో సమాజ గమనం బింబిస్తుంది. భౌతిక మానసిక భూమికలపై వర్తించే సమాజం సమీక్షితమయింది. ఇది రెండు భాగాలుగా ఉంది. మొదటి భాగం – జీవికకై మనిషి ప్రయత్నంలో ఉనికికై సంపదకై అధికారంకై రక్షణకై కీర్తికై సమాజ శ్రేయంకై సాగే క్రియా కలాపం. రెండో భాగం – 'అశాంతి నుండి శాంతికి' ప్రయాణంలో కష్టాలు బాధలూ సమస్యలూ విధ్వంసం నుండి నిర్మాణం దారిద్ర్యం నుండి సౌభాగ్యం దుఃఖం నుండి ఆనందం కోరే మనో రూపం – దాని పర్యవసానం కనిపిస్తాయి. మొదటి భాగం ప్రకృతి నేపథ్యంతో విలసిల్లింది. రెండో భాగం సామాజిక భూమికతో వర్తిల్లింది.

ప్రకృతి–సమాజం–వ్యక్తి పరస్పరం ప్రభావం కలిగిన అంశాలతో ఇందులో వస్తువు సమాకలనాన్ని పొందింది. కావ్యం ప్రకృతి నేపథ్యంతో ఉదయాన్ని చూచి మనిషి పొందిన అనుభవ చిత్రంతో ఆరంభమయింది. 'ఉదయ తరణి కెదురుగా నిలిచిన నాలో, కొండ కొమ్ము నుండి రసధుని పరుగిడినట్లు / ఇసుక తలంపై ప్రవాహం తళతళ లాడినట్లు, వెలుగు పొంగు వచ్చి ఎపుడు ముంచెత్తిందో తెలీదు' / ఇది జీవితంలో విడదీయరాని ప్రకృతి సంబంధం. మనస్సుపై దాని ప్రభావ రూపం చూపుతుంది. ఉదయించే సూర్యుడు పరిణతి చెందే జ్ఞానానికీ మార్పుకీ ప్రగతికీ సంకేతం. కొండ–ఇసుక–జడరూపాలు, కదలనివీ, ప్రవాహం చేతనకు ప్రతీక. ఉదయం బహువర్ణాలతో కూడిన 'కిర్మీర' రూపం బహుస్థితులతో అనుభవాలతో జీవితాన్ని వ్యంజింపజేస్తుంది. కాలగమనంలో జీవితం ఆయువుతో విరిసన పద్మంలా ఉంది. మొదటిసారి అనుభూతమయిన ఉషస్సు అనుభవంలో వాస్తవంపై కల్పనతో జీవన గుణ భాసురంగా చిత్రితమైంది. భూమి నుండి ఆకాశాని కెగసిన ఏడు రంగుల నిశ్రేణికవలె తోచే జీవితం, భౌతికం నుండి అతీతానికి సాగే ఆలోచనా గతి రూపాన్ని సూచిస్తుంది. సమయం గడుస్తున్న కొద్దీ బ్రతుకు గురించి ఆలోచన! మబ్బులో మెరపు వలె మనస్సులో స్మృతులు! మనిషిని వదలవు! ఉదయం తరువాత రేపు మరో ఉదయం ప్రత్యక్షమవుతుంది. ఉదయం వస్తుంది 'ఉదార చరితునివలె'

'అమృతలిప్త' వెలుగుతుంది 'ఆత్మప్రకాశం'వలె మనిషి సూత్రం సంకుచిత పరిధిలోనే గడుపుతాడు. మనిషిలో ఆ ప్రకాశం రవంతయినా కనిపించాలి. అపుడే సార్థకత చేకూరుతుంది. వాస్తవ తలంపై కఠోరమైన స్థితులెదురవుతాయి. బాధిస్తాయి. అపమార్గాన్ని చూపిస్తాయి. సమస్యల్ని తెచ్చి పెడతాయి. వీటి నుండి ముక్తమయ్యేందుకు మరో అపమార్గం కనిపిస్తుంది. ఇదీ వరస! ఏ ప్రయత్నమూ ఆగదు. మంచికైనా చెడుకైనా సాగుతూనే ఉంటుంది. ఇందులో స్మృతి దర్పణంలో బింబించే జీవిత దృశ్యాలనేకం, ఒకదాని తరువాత మరొకటి కదలిపోతాయి.

'బ్రతుకు వంతెనపై' ప్రయాణంలో ఇరువైపుల దృశ్యాలు! సామాజిక రూపాలతో కూడినవి. మానవతా గీతమూ వినిపిస్తుంది. పయనంలో మనిషిలోని ఆరాటం అన్వేషణతో కూడిన మనో రూపం చిత్రితమయింది. సీమల్ని ప్రాంతాల్ని దేశాల్ని దాటి విశాల పృథ్విపై విశ్వమానవ రూపమూ మెదలుతుంది. ఇరువైపుల జీవిత చలనం కొత్త భావ చిత్రాలతో ప్రతీకలతో కళాత్మకతను పొందింది. ప్రకృతి రూపం మరియు మానవ జీవితం పరస్పర సహభావ శీలంగా నిబంధితమయినాయి. ఉదాహరణకు జడానికీ నిదురకూ, నిశకూ విషాదానికీ, ఉదయానికీ మానసిక చేతనకూ, వెలుగుకూ సుఖానికీ ఇట్లా అనేకంగా ప్రతీకాత్మకమైన సంబంధం స్థాపితమయింది. అయితే పగలు దుఃఖం రాదనీ రాత్రి సుఖం ఉండదనీ కాదు. ఇట్లా ఊహ చేయడం జీవిత వాస్తవం. దీన్ని విస్మరించలేరు. వేదాల్లో ఋగ్వేదం అత్యంత ప్రాచీనమైంది. నిఖిల మానవ సంస్కృతికి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇందులో వర్ణింపబడిన దేవతల్లో ముఖ్యులు అగ్ని-ఇంద్ర-వరుణుల ప్రసక్తి ఆరంభంలో ప్రతీకాత్మకమైంది. అగ్ని పవిత్రమూర్తి దేవతలకూ మానవులకూ మధ్యలో దగ్గరి బంధువు. ఇంద్రుడు పుణ్య కర్మకూ దాని అనుభవ రూపానికీ సంపూర్ణ రూపం. వరుణుడు ధర్మానికీ శాసన శీలానికీ దాన రూపానికీ ప్రతిరూపం. ఉషస్సు చాలా సుందరమైన శుభమయిన హ్లాదకరమైన దేవత! స్త్రీమూర్తి! అత్యంత ప్రాచీనమయిన మహనీయమైన భారతీయ సంస్కృతి పట్ల మానసికమైన అనుబంధంతో కావ్యంలో ప్రసక్తమై ఔచితిని పొందాయి. మనిషికి కావలసింది ఆహారం నిలవడానికి నిలయం కట్టుకోవడానికి వస్త్రం – ఆ తరువాత మిగతావి. వీటిని పొందడంలో నిలపుకోవడంలో సహాయపడే అధికారంతో పాటు సంపద కీర్తి మొదలైనవి అవసరమవుతాయి. ఈ దిశలో ఆలోచన ఉపాయం సక్రియతో సాగే మానవ జీవితంలో స్థితుల చిత్రరూపాల వరుసలో వర్ణితమైనాయి.

'బ్రతుకు వంతెన' పై భాగం నూతన సంవిధానం కలిగింది. వంతెన కిరువైపుల అనేక స్థితుల దృశ్య పరంపర చిత్రమైంది. 'అగ్ని శిఖల వలె సంచరించే మనుషులూ' కన్పిస్తారు. 'ఎక్కడ ఎవరిని చూచినా వారిలో నా రూపమే ఎక్కడ ఎవరు పలికినా అందులో నా స్వరమే'. మనుషుల్లోని సారభూతమయిన మానవీయ ప్రియరూపం సూచితం.

ఈ మానవీయ రూపం సార్వజనీనమైంది. బాధలూ కష్టాలూ! అందరివీ! అనుభూతి! ఆలోచన ఒకటే అందరిదీ! మానవ జీవితం ప్రతి దేశంలోను సుఖం కోసం శాంతికోసం ఆనందం కోసం తహతహలాడుతూనే ఉంది. స్వార్థశక్తులూ దీనికి భిన్నంగా పనిచేస్తూనే ఉన్నాయి. రాజ్యం రాజనీతి అధికారం స్వప్రయోజనం వ్యాపారం పీడనం ప్రతారణం మొదలుగా సామాజిక జగత్తు అవ్యాహతంగా సాగిపోతూనే ఉంది.

'మనిషిని హత మార్చి క్రోధాగ్ని తనుపుకొనీ / మనిషిని భక్షించి క్షుధాగ్ని చల్లార్చుకొనీ / మనిషిని రక్షించి మానవత్వం నిలుపుకొనీ / మనిషిని క్షమించి దైవత్వం పొందే మనిషీ' / మనిషిలో నెలకొన్న బహువిధాలయిన పార్శ్వాలు ప్రకటితమయినాయి. ఎంత నాగరకత ఏర్పడినా సంస్కృతి సిద్ధించినా ఎప్పటికపుడు జారి పడిపోయే పరిస్థితులేర్పడుతూనే ఉన్నాయి. చరిత్రలో కలహాలతో ఘర్షణలతో యుద్ధాలతో వైషమ్యాలతో వైరాలతో విషమ గతుల్ని పొందిందీ. సహనము శాంతి ప్రేమ న్యాయం గురించి చింతనం ఆలోచన మరోవైపు నుండి ప్రసరిస్తూనే ఉంది. ఇప్పటి వరకూ జీవితం మొదటి చివర బిందువుల్ని కలిపే రేఖ – మానవీయమే! అంతర్గతమైన కనిపించని రేఖ దైవంగానూ ఊహించవచ్చు. మొదటిది రాగ బిందువుల్ని కలుపుతుంది. రెండోది శక్తి బిందువుల్ని కలుపుతుంది. ఈ కావ్యంలో ప్రాధాన్యం మాత్రం మానవీయానిదే.

బ్రతుకు వంతెనపై నడచే మనిషిని వెనక్కి లాగే ప్రయత్నమూ జరుగుతుంది. అయితే మనిషిలో గుప్తంగా దాన్ని నిలువరించి ముందుకు సాగే విశేష శక్తి కూడ ఉంది. అయితే దీన్ని గుర్తించి నిలుపుకోవలసి ఉంది. ఇది సామాన్య విషయం కాదు. జీవితంలో ఉత్తమమైనవీ మానసికంగా ఆనందాన్నీ శాంతినీ ప్రసాదించేవీ ఉన్నాయి. కవిత్వం కళలు సాహిత్యం తత్త్వం విజ్ఞానం మొదలైనవి. వీటి ననుసరించడానికి మౌలికంగా మనిషిలో సదభిలాష ఉండాలి. ఈ సత్ ప్రపంచమూ

సూచితమయింది. ఇందులో అక్కడక్కడా అవరోహణకు జరిగే ప్రయత్నమూ ఉంది. చరిత్రకు సంబంధించిన వాస్తవాలు ప్రదర్శితమయినాయి. ఇవి స్మృతి పటంపై చిత్రాకృతుల్ని పొందాయి. పురాస్మృతుల్ని కలల్ని కల్పనల్ని భద్రపరచుకొని పయనించే మనిషి ఒకవైపు నుండి కనిపిస్తాడు. మరో వైపున జల బిందువు కోసం తహతహాతో ఎడారిలో నడచే మనిషీ కనిపిస్తాడు. ఇంకా 'సుత్తెల మ్రోత ఎరగని కొండరాళ్ళు, వర్షపు చినుకు చవి చూడని మట్టి / ఇసుక దిబ్బలూ' మిగిలే ఉన్నాయి. దారిద్ర్యం అజ్ఞానం అవిద్యతో గడచే బ్రతుకులు సూచితం. కొండరాళ్ళను శిల్పాలుగా తీర్చిదిద్దే, మట్టి దిబ్బల్ని సస్యశ్యామలం చేసే కోరిక అట్లాగే ఉంది! ప్రయాణంలో లక్ష్యాన్ని సాధించే సంకల్పంతో పాటు నిరంతర ప్రయత్నమూ అవసరం.

రెండో భాగం 'అశాంతి నుండి' శాంతికి ప్రయాణంతో కూడింది. అశాంతి ఒకటి బాహ్యమైంది, సామాజికమైంది. రెండోది అంతరమైంది, మానసికమైంది. మొదటిది భౌతికమైన కష్టాలకు సంబంధించింది. కాలంతో నిమిత్తం లేకుండా దేశంతో సంబంధం లేకుండా సమాజంలో ఎదురవుతాయి. అయితే స్థితులూ సంఘటనలూ మాత్రం కాలానికి దేశానికీ సంబంధించినవై భిన్నంగా ఉంటాయి. కొన్ని కావ్యం సృజన రూపంలో, కొన్ని పరిమితుల్ని పొందింది. భిన్న కోణాల్ని కలిగి ఉంది. అశాంతి వలయంలో మనో భూమికలో 'హృదయానుభూతి బింబాలు' ప్రత్యేకంగా పేర్కొదగినవి. లక్ష్యమెంత ఉదాత్తమైనదైనా వెళ్ళే మార్గమూ చేపట్టే సాధనమూ వెళ్ళే మనిషి మనసు కూడా సరిగా ఉండాలి. వీటి సమన్వయంపైనే ప్రయాణ విజయం ఆధారపడి ఉంటుంది. కొత్త శక్తితో కొత్త సృష్టికై సమాజ పురోగమన లక్ష్యం మానవీయ మానవతా రూపమైంది. ఈ కావ్యానికి అన్వయిస్తుంది.

ఇందులో జీవిత గమనమూ సమాజ చలనమూ మానవీయ కళతో ఆవిష్కృత మయినాయి. నియంతృత్వం నుండి ప్రజాస్వామ్యానికి చేరే మధ్య అనేక చారిత్రక దశలు వర్ణితమయినాయి. మానవ జీవితంలో ప్రవేశించిన ఇహం నుండి పరం, భౌతికం నుండి ఆధ్యాత్మికం, అతీతం నుండి దివ్యత్వంతో కూడిన పార్శ్వాలు ఉల్లేఖితమయినాయి. ఈర్ష్య కోపం ద్వేషం వైరం ప్రతీకారం రణేచ్ఛ విజయాభిలాష అణచివేత పీడనంతో కూడిన మనోభూమికలూ వీటికి ప్రతిరూపంగా అనురాగం సహనం స్నేహం సహాయం సేవాభావం శాంతి ప్రియత్వం ఉదారత సమానత త్యాగంతో కూడిన మనోభూమికలూ కనిపిస్తాయి. ఇవి స్థితుల్ని సంఘటల్ని

పురస్కరించుకొని చిత్రితమయినాయి. అన్యాయం న్యాయం – అవినీతి నీతి – అసద్భావం సద్భావం – వివిధ క్షేత్రాల్లో ఎన్నెన్ని వలయాల్లో మనుషుల్ని భ్రమింపజేసిందీ చూపబడింది. ఈ ప్రపంచమంతా మానవుడు – మానవతా కేంద్రంగా రూపొందింది.

మానవ సంస్కృతిలో శిఖరాల్ని అందుకున్న వాఙ్మయకళా వైజ్ఞానిక తాత్త్విక వ్యక్తిత్వంపై వెలుగు ప్రసరించడం జరిగింది. ఇదే మానవుని అస్తిత్వాన్ని నిలిపేది, కాపాడేది. ఏ ప్రయత్నమయినా మానవ జీవితం సుగమం సుఖవంతం సౌభాగ్యవంతం ఆనందయుతం కావాలనే! ఎంత ప్రగతి చేకూరినా వికాసవంతమయినా చిత్రమేమంటే వెలుగును కప్పేసే చీకటికీ నీడలకూ వచ్చే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తాయి. వీటిని ఈ కావ్యంలో ఎత్తిచూపడం జరిగింది. సృజనదృష్టి నుండి ఏదీ తప్పించుకోలేదు.

మునుముందు భవిష్యత్తులో వైజ్ఞానిక శాస్త్ర పరిశోధనల్లో అవసరాల మేరకు కృత్రిమంగా మనుషుల ఉత్పత్తి జరిగే వార్తాంశమూ వర్ణితమయింది. మనుషుల్ని కృత్రిమంగా తత్కాల ప్రయోజనాల్ని బట్టి సృష్టించే విజ్ఞాన ప్రగతి ఎంతైనా, మానవీయ / మానవతా స్పందనల్ని మాత్రం పొందలేదనే కవి అభిప్రాయం. ఈ కృత్రిమమైన కార్యాలు విపరీతాలకూ అనర్థాలకూ దారితీయవచ్చు. దీన్ని వివేకంతో నియంత్రించవలసిన అవసరమూ సూచితమయింది. మేధాశక్తిని నిరూపించే ప్రయోగాలు, మనిషిలో జీవరూపానికి సంబంధించిన అనుభూతినీ సృజన శక్తినీ పొందలేవు. ఇది చేతనాత్మకమైన మనో రూపానికే సాధ్యం.

ఆల్డస్ హగ్జలె వ్రాసిన ఎ బ్రేవ్ న్యూవరల్డ్ (Aldous Huxley - A brave new world) గ్రంథంలో రూపాలే, 'రసాయన సముద్భూత మానవ మూర్తులు' మనిషి కల్పనలో తట్టిన విషయాలు ఒకనాటికి వాస్తవాకృతి ధరిస్తాయన్న మాటలో వాస్తవమూ లేకపోలేదు. ఈ సందర్భంలో గుర్తుకు రాక మానదు. 'అంతరిక్ష గోళాల్లో ఆవాసానికై సంరంభం' – ఒక ప్రక్క జరుగుతూంది 'భూమిపై తిండికి బట్టక మనిషి అఘోరించే అభాగ్యం' – మరో ప్రక్క నెలకొని ఉంది సామాజిక యథార్థ్యాన్ని చిత్రిస్తూంది. ఈ భాగంలో సమాజంలో గుణాత్మకమైన పరివర్తనతో, ప్రతి వ్యక్తి కనీసపు అవసరాలకు బాధపడకుండా, సాధారణమైన ప్రగతి స్థాయిని అనుభవించే స్థితిని ఆశించడం జరిగింది. సభ్య సమాజం మేధావి వర్గం నాయకులు పాలకులు స్పందించవలసిన అవసరమూ వ్యంజితమయింది.

ఇంకా కనిపించే 'రాసులు రాసులుగా రాళ్ళూ గుట్టల వలె / మట్టి దిబ్బల వలె బండల వలె మొద్దుల వలె / ఎండ కెండి వానకు తడిసి చలికి బిగిసి / ఒక్కచోట జడ భరిత సమాజస్థితి రూపాలు / చిత్రితమైనాయి. ఈ దుస్థితిని సరిదిద్దే దిశగా మానవీయం భావితమయింది. మానవ మనస్తత్వంపై వెలుగు ప్రసరించడం జరిగింది. 'నా కాలి సవ్వడి నాకే భయంగా, నా ఊహ పడగ విప్పిన పాములా, వాంఛా సహితంగా, నా ఆకృతి నాకే రెండు రంగులుగా' కనిపించే మనో రూపం భయ ముద్ర కలిగింది. ఎగసే కోర్కెలతో కూడింది. ద్విధా రూపం కలిగింది. ఇది ఎట్లా ప్రగతికి విరోధంగా ఉందీ నిరోధంగా పరిణమించేదీ ధ్వనితమయింది. ఒక మనిషిలో మనసులో వెలుగుతో పాటు చీకటి రూపమూ ఎట్లా ప్రవర్తించేదీ గమనించవచ్చు. ఈ విధంగా మనస్తత్వపరమైన అంశాలపై ఆలోచన రచనలో కవితా రూపాన్ని సంతరించుకుంది.

మరోవైపు నుండి తాత్త్వికం ఆధ్యాత్మికం మనిషిని ప్రభావితం చేసాయి. సమాజ స్వరూపాన్ని మార్చి వేసాయి. మానవ చరిత్రలో సమాజ పరిణామంలో దీన్ని సులభంగా గుర్తించవచ్చు. కావ్యంలో ఈ విషయ ప్రసక్తి ఉంది. ఇవి జీవన స్థితులు ఆధారంగా చిత్రితమయినాయి. మనస్సు ఒకపుడు నీతిని అనుసరిస్తుంది, ఉపదేశిస్తుంది. మరొకపుడు దాన్ని అతిక్రమిస్తుంది, హేతువును ప్రదర్శిస్తుంది. ఒకే మనిషిలో సంభవిస్తుంది. ప్రయోజనపరంగా 'స్వార్థం' కేంద్రంగా ఉపక్రమించడం వల్లనే ఈ స్థితి ఏర్పడుతుంది. స్థిరత్వం కోల్పోవడం జరుగుతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ భూమిలో ఒక చెట్టు వేరు వలె నిలిచి ఉండే 'మానవీయ ప్రగతి భావన' ప్రపంచితమయింది.

కావ్యంలో సూచనగానో సూటిగానో 'నవలోకం' స్ఫూర్తికి వస్తుంది. కావ్యం చివరిభాగం 'దర్శనం'లో ఆవిష్కృతమయింది. ఈ దుస్థితికి 'మనిషే బాధ్యత వహించాలా?' అన్న ప్రశ్నకు 'అవును' అనే సమాధానం లభిస్తుంది. ఎడారి జీవితాల్ని పచ్చదనంతో నింపవలసి ఉంది. చీకటి గుహల జీవితాల్ని కనీసం నివాస యోగ్యాలుగా మార్చవలసి ఉంది. ఇక ప్రజల మనోజగత్తును వివేకంతో విజ్ఞానంతో మానవతా భావంతో ప్రకాశింపజేయవలసి ఉంది. ఇదో 'పునర్భవం' లాంటిది.

కావ్యం చివర భౌతిక వికాసంతో పాటు మానసిక ప్రకాశానికీ స్థానం ఇవ్వబడింది. ఇదీ దీని ప్రత్యేకత. మానవుణ్ణి సంబోధిస్తూ "దుఃఖంలో మ్రగ్గిపోక,

కష్టంతో నిల్చిపోక పతనంతో పారిపోక మరో ప్రయాణ రూపాన్ని కల్పించుకునే" అవసరం సూచితమయింది. అనుకూలంగా లేని పరిస్థితుల్ని ఎదుర్కొనే ఉత్సాహ శక్తిని ప్రేరేపిస్తూంది, ఆశారూపాన్ని అవతరింపజేస్తూంది. ఇది క్రమంగా ఆత్మోన్నతితో పరిపూర్ణత పొందడం జరిగింది. ప్రకృతి నేపథ్యంలో ఈ సామాజిక స్థితి చిత్రణకావ్యం, మొదటినుండి చివరి వరకూ మానవ భావంతో పరిపుష్టం కావడం చేత "మానవీయ కావ్యం"గా ప్రసిద్ధి వహించడం సహజం. వాస్తవ తలంపై జీవిత చలనంలో సమాజ గమనంలోని వైరుధ్యాలను అవసరమైన భవిష్యత్తు దర్శనరూపాన్ని అవిష్కరిస్తూంది.

ఇందులో దయనీయమైన జీవన చిత్రణమే తప్ప 'నిరాకరణ దృష్టికి' తావు లేదు. స్వేచ్ఛా కవిత్వంలో స్వయం ప్రేరితమైన 'నిర్మాణ' స్వరూపానికి ప్రాధాన్య మొసగబడింది. స్థూలంగా సమాజంలో సమానత్వం సమ న్యాయం స్వేచ్ఛ సౌభ్రాతృత్వం మానవతా స్పందనంతో 'ప్రజాస్వామ్య' నిబద్ధమైంది. మాదిరాజు రంగారావు కృతి 'మానవీయం', స్వేచ్ఛాకవిత్వంలో మానవ సమాజ కేంద్రంగా మానవీయ భావనతో వెలువడిన తొలి కావ్యం.

# II.6 విశ్వంభర : మానవ వికాస రేఖా చిత్రం

మానవ వికాస రేఖా చిత్రం విశ్వంభర. మానవ జీవితంలో తొలిదశ నుండీ భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందిన దశ వరకూ మానవ వికాసం అంచెలు అంచెలుగా స్థూల తలంపై వర్ణితమయింది. ఇది మొత్తం మీద భారతీయ చింతన కనుగుణంగా సంస్కృతికి ప్రతిఫలనంగా సృజన రూపం సిద్ధించింది. అక్కడక్కడా విశ్వతలంపై వెలసిన ఆలోచనా గతులతో అనుభవ స్పృహ అద్దంలో రూపం వలె వెలిసింది. మానవీయ తలంపై 1) కళాత్మక 2) వైజ్ఞానిక 3) ఆధ్యాత్మిక పార్శ్వాల్ని ఎన్నుకొని కవిత్వాకృతి నివ్వడం జరిగింది. ఈ విధంగా మానవ వికాస విషయం ఏక సూత్రతను పొందింది. మనిషి శక్తినీ యుక్తినీ ప్రదర్శించే అనేకాంశాలు కవి సృజన రూపంలో ప్రయోజనాత్మకమైన పాత్రను నిర్వహించాయి. వీటి కవితాత్మకమైన అభివ్యక్తి సుందరతతో కావ్యం విలసించింది.

మానవ నాగరకతకూ సంస్కృతికీ కేంద్ర భూమిగా మానవ జీవిత ప్రపంచాన్ని నడిపే మనస్సు కీలకమైన పాత్రగా భావితమయింది. మనస్సు అనేక సంస్కారాల సంపుటి. ఎన్నో భావాల నిలయం. దీని ప్రమేయం అనితరమైంది. కావ్యంపేరు విశ్వంభర ఆలోచనల అనుభూతుల సంకలనం. ఈ లోకాన్ని సమస్తాన్ని భరించేది భూమి. ఈ భూమిపై అత్యుత్తమమైన జీవ శక్తి రూపం మానవుడు. మానవుడు పొందిన వికాస రూపమే ఈ కృతి. భూమికీ మనిషికీ ఉన్న సంబంధం విడదీయరానిది. ఇది అనేక స్థాయిల్లో పర్యాప్తమయింది. దీని ప్రభావ పర్యవసాన రూపమే జీవితం. ఎన్నో ప్రగతి స్థితుల్ని పొందింది. విశాలమైన భూమిపై సుదీర్ఘ చరిత్రలో వికాస దశలకు చెందిన కొన్ని అంశాలు ఎన్నిక చేసినవి కన్పిస్తాయి. ఇవి కవి సృజన దృష్టి ప్రసరించినంత మేరల్లో వర్ణితమయినాయి. తొలి సమాజం ఆరంభం నుండి ఆధునిక సమాజం దాకా భారతీయ సాంస్కృతిక జగత్తునూ శాస్త్ర తాత్త్విక ప్రపంచాన్నీ స్పృశిస్తూంది. అక్కడక్కడా విశ్వ జనీనమైన అంశాలతో సర్వమానవ ప్రసక్తినీ పొందింది. ఇది కళాత్మక వైజ్ఞానిక ఆధ్యాత్మిక విశ్లేషణతో రూపొందింది. మానవ వికాస స్థితుల్ని మెరపు తీగెల్లా మెరపిస్తూ రచన అనితర శిల్పంతో కావ్యత్వాన్ని పొందింది.

ఈ కావ్యం మనిషి పుట్టుకకు పూర్వం ఏర్పడిన ప్రకృతి విలసనంతో ఆరంభమయింది. ప్రకృతి నేపథ్యంలో ప్రవృత్తమయింది. ప్రకృతిలో ప్రధానమైన

భాగాల్లో భూమి ఒకటి. ఆ తరువాత వ్యవధానం లేకుండా భూమిపై మనిషి గురించి మదిలో మెదలడం సహజం. "నేను పుట్టక ముందే నెత్తి మీద నీలి తెర, కాళ్ళక్రింద ధూళిపొర" ఉంది. ఆకాశం ఆలోచనకూ, భూమి ప్రత్యక్షానుభవానికీ ఆధారంగా కవి భావన సాగింది. ఇది కవి సృజన రూపం కోణాన్ని పట్టిస్తూంది. విశ్వాన్ని భరించే అంటే సమస్తాన్ని వహించేది విశ్వంభర. చేతనా చేతన లోకాన్ని ధరించే అవనిపై నాయకుడు మానవుడు! ప్రకృతితో అనుబంధం శాశ్వతమైంది. అపూర్వమైన వ్యక్తిత్వం వల్ల మనిషి స్థానం విశిష్టమైంది. మనిషి చుట్టూ ఉన్న ఆకాశం చెట్లూ పక్షులూ సూర్య చంద్రులూ చుక్కలూ కొండలూ నదులూ లోయలూ మైదానాలూ మబ్బులూ విలసించే ప్రకృతి నేపథ్యం కావ్యంలో ప్రత్యేక స్థానాన్ని పొందింది. కవి సృజన దృష్టి ప్రసరించిన మొదటి వస్తువు ప్రకృతి – దీన్ని అనుసరించి మానవుడు, ప్రకృతి శక్తికి సమాంతరంగా మానవ శక్తి వర్ణితమైంది. మానవ జీవితాని కొక వైపున ప్రకృతీ మరో వైపున సమాజమూ రెండూ బింబ ప్రతిబింబ భావ సదృశంగా పరస్పరాను బంధంగా భావితమైనాయి. మనిషి ఒక విధంగా ప్రకృతిలో భాగమయినా బుద్ధి విశేషం చేత విడిగా అస్తిత్వాన్ని కలిగి ఉండడం కనిపిస్తుంది. కావ్యంలో ప్రకృతిని వశం చేసుకొనే సంకల్పంతో పాటు మృత్యువును కూడా వశం చేసుకునే ప్రయత్నం కనిపిస్తాయి. ఈ క్రమంలో మానవ సంస్కృతిలో దీప్తి రేఖ లెన్నో చిత్రితమయినాయి. కావ్య ప్రణాళికలో మానవ వికాసం కళా వైజ్ఞానిక ఆధ్యాత్మిక పార్శ్వాల్లో ప్రకాశించింది. మనిషి జీవన యాత్ర సహచరితో బంధువులతో మొదలైంది. ఆపైన సుఖమయమైన స్థితుల్నీ ఆపేక్షించింది. సౌభాగ్యవంతమైన జీవితాన్ని లక్షించింది. మధ్య ఎన్నో ఒడుదొడుకులతో విషమ పరిస్థితులతో కూడుకున్న సందర్భాల్ని అధిగమించే ప్రయత్నం జరిగింది. కావలసింది ప్రాప్తించిన తరువాత, మరొక దానికై గవేషణ మరింతగా సాగింది. ఈ పరంపర అవిచ్ఛిన్నంగా ఈనాటికీ సాగుతూంది. మునుముందు మానవుడున్నంత వరకూ ఉంటుంది. ఇది మనిషిలో నిహితమై జిజ్ఞాస, అన్వేషణ ఆశయంతో కూడిన నిర్మాణ శక్తికి నిదర్శనంగా ఉంది.

1. కళాత్మకం : కావ్యంలో మానవ వికాస వర్ణనంలో మొదటిది. ఈ పార్శ్వం కవికి బహు ప్రీతికరమైందిగానూ కనిపిస్తుంది. కవి చాల ఇష్టమైంది పాట. దీనికి సంబంధించిన సంగీత విషయ వాతావరణం నిర్మితమయింది. శబ్దం నాదం సప్త స్వరాలు రాగం తాళం గానం లయ పాట మొదలగొ కళా ప్రపంచం ప్రసక్తమయింది.

దీని చారిత్రక దశలూ వికాస స్థితులూ వర్తమాన తలంపై దృష్టితో సాక్షాత్కరిస్తాయి. ఈ పార్శ్వం పాటతో ఆటతో చిత్రలేఖనంతో శిల్పంతో కవిత్వంతో స్వర్గ ఖండాన్ని అందుకోవాలనుకునే మనిషి మానసిక స్థితినీ అవగాహనకు తెస్తూంది. కళా హృదయం సమాజంలో ఆకర్షణీయమైన సౌందర్యంతో అనుభూతి గుణంతో మానవ సంస్కృతికి దోహదం చేసిన అంశం ప్రకాశితమయింది.

2. వైజ్ఞానికం : మనిషిలో సహజంగా ఉండే జిజ్ఞాస అన్వేషణ పరిశోధన వివేచన ప్రయోజనం లక్ష్య ప్రాప్తితో ఆలోచనా రూపాన్ని బింబిస్తూంది. అనుభవ రీతుల్నీ వివరిస్తూంది. నక్షత్రాల జాడలూ గ్రహాల గతులూ తెలుసుకునే విషయంలో శాస్త్ర పరిజ్ఞాన దశలతో ప్రముఖంగా ఆకట్టుకుంటుంది. మనిషిలో ఎప్పటికప్పుడు కొత్త విషయాన్ని కనుగొనే ఇచ్ఛతో కూడిన ప్రయోగ బుద్ధితో పాటు, వాటి ప్రయోజనాల్ని సమాజాని కందించే వికాస దశలు ప్రధానంగా కవిత్వ కళతో వర్ణితమయినాయి. దీన్ని అందుకొని వివిధ దశల్లో విస్తరిల్లిన వైజ్ఞాని విజయాలూ వివృతమయినాయి. వినిర్మాణంతో పాటు విధ్వంసానికి దారితీసే క్రియా కలాపాల ప్రసక్తీ ఉంది. మనిషిలో వెలుగు చిహ్నాలతో పాటు చీకటి ముద్రలూ, ఈ క్షేత్రంలో మనిషి పొందిన అభివృద్ధి రూపాల్ని పరిగణిస్తూనే అతనిలో బలహీనతల్ని ఆశ్రయించి, పొంచి ఉండే ముప్పును పేర్కొనడం కనిపిస్తుంది. ఇది కవిలో వస్తుపరమైన వివేచనకు తార్కాణం.

3. ఆధ్యాత్మికం : జీవితాని కవసరమైన నైతికం అతీతంతో విషయ చింతనం అంతర్దృష్టి మొదలైన ఆలోచనా ప్రపంచం ప్రసక్తమయింది. మానవ వికాసంలో ఇదో విస్మరించరాని ప్రపంచం. సమాజంలో గొప్ప పాత్రను నిర్వహించింది. వ్యక్తిలోను సంపూర్ణతకు దారి తీసింది. అన్ని దేశాల్లో ప్రతి జాతిలో, ఈ పార్శ్వం విలసిల్లింది. భౌతిక భౌతికాతీతమైన శక్తుల గురించి సూచితమయింది. వీటి అవసరం ప్రయోజనం గురించి సిద్ధాంత పరంగా సాధనా పరంగా అనుభవ పరంగా ఆధ్యాత్మిక ప్రపంచం మహనీయతను పొందింది. కనిపించే వెలుగుకూ చీకటికీ అతీతమైన చైతన్యాన్ని దర్శించే ప్రయత్నంలో ఋషుల దృష్టి తత్త్వవేత్తల కృషి సమీక్షితమయింది. ఈ మార్గం సులభమైంది కాదు. దీన్ని అనుసరించడం, సత్ఫలితాల్ని పొందడం చాలా కష్టతరమైంది. ఇదొక తపస్సుగా భావితమైంది. కావ్యంలో ఈ విషయం ప్రసన్న సుందరంగా ఆవిష్కృతమయింది.

గుహ నుండి బయటికి వచ్చి గుడిలోకి ప్రవేశించిన మనిషి పొందిన వికాస దశలు, జీవితాన్ని సమాజాన్ని సంస్కృతీ శిఖరాలకు చేర్చాయి. ఎంతో కాలం మీద భౌతిక అభౌతిక అతీత చింతన ఫలితంగా ఉన్నతి సిద్ధించింది. మనిషి ధ్యానంతో జ్వలించాడు. క్రమంగా సాధన చేత అధిరోహణలో జ్ఞాన స్వరూపాన్ని పొందాడు. జ్ఞానమూర్తి అయి జ్ఞానాన్ని వర్షించాడు. ప్రపంచాన్ని అజ్ఞానం నుండి కాపాడి జ్ఞానవంతం చేసాడు. చీకటిని రూపుమాపి మనస్సుకు ప్రకాశ రూపాన్ని ప్రసాదించడం కన్న గొప్ప విషయం లేదు. ఇది మానవ వికాస చరిత్రలో అత్యంత విశిష్టమైంది. మనిషి తనలో ఇతర జీవుల కన్నా విశిష్టంగా ఉన్న బుద్ధినీ బుద్ధి వలన వివేకాన్ని వివేకం చేత జ్ఞానాన్ని నిలుపుకోలేకపోతే పతనం సంభవిస్తుంది. కావ్యంలో వస్తుపరమైన స్పష్టత, కవితాపరమైన కళాత్మకత సాహిత్య గౌరవాన్ని ఇనుమడింప జేస్తున్నాయి.

కళా వైజ్ఞానికాధ్యాత్మికాలతో ఏర్పడిన మానవ వికాస రూపం, భారతదేశం స్వాతంత్ర్యం పొందిన చారిత్రక సందర్భ సూచనతో ముగిసింది. దేశం "దాస్య గ్రీష్మం"తో తప్తమైంది. శాంతమూర్తి సహనశీలి గాంధీజీ నాయకత్వంలో చల్లదనాన్నీ ఆర్ద్రతనూ పొందింది. భౌతికంగా మానసికంగా ఒక దుస్థితి తొలగింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. ఇది కృతిలో జాతీయ భావనతోనూ విశ్వమానవ సౌభ్రాతృత్వంతోనూ రెండు స్థాయిల్లో ప్రకాశించింది. అర్థరాత్రి ఉషోదయం దేశంలో ఆరంభమయిన మహత్తర యుగారంభం భవిష్యత్తుకు ఆశారూపంగా దర్శితమయింది. జాతి దశ మారింది. దిశ మారింది. గమ్యం మారింది. ఇది మొదలైన తొలిరోజు సర్వదా జ్ఞాపకం పెట్టుకోదగిందిగా చరిత్రలో నిలచిపోయింది. ఇంతకాలం ఎదురు చూచిన భాను హృదయం సరికొత్తగా మూడు వన్నెలతో రెపరెపలాడింది. "ఇది అపూర్వోదయం! అర్థరాత్రి ఉషోదయం! ఎగిరింది మూడు వన్నెలతో ఎదురుచూస్తున్న భాను హృదయం" ఇక్కడితో ప్రయాణం ఆగినట్టు కాదు, ఆగదు కూడా. ఎగుడు దిగుళ్ళతో కొత్త అనుభవాలతో సాగే అనంత యాత్ర! ఎదురు దెబ్బలు తప్పవు. అవి సవరించుకొని సాగే నిత్య ప్రస్థానం! వాస్తవతలంపై వివృతమయింది. ఈ అనంత సత్యం కావ్యంలో విశ్వంభరా తత్త్వంగా స్థాపితమయింది. మనస్సు కేంద్రంగా సాగే జ్ఞాన రూపంతో అనుభవ మార్గంలో అనేక సంఘటనల్ని స్థితుల్ని పురస్కరించుకొని వివేచితమయినాయి. ఈ దృష్టితో (1) కవి వస్తువును పరిపుష్టం చేసిన విషయ సంపదలో, వికాస భావన స్ఫూర్తికి వస్తుంది. (2) వస్తువుకు సమార్థంగా కావ్య నిర్వహణంలో నిర్మాణ కళాత్మకత భాసిస్తుంది.

2

కావ్యంలో మనసులో తలఎత్తే ప్రశ్నతో సన్నివేశాన్ని కల్పించే విధం, నిర్వహణ శిల్పలో భాగంగా పర్యవసితమయింది. వివిధ సందర్భాల్లో ఈ సంవిధానం సహృదయునిలో ఉత్సుకతను ప్రవేశపెడుతూంది. ఆకర్షణీయతను కలిగిస్తూంది. ప్రకృతి నేపథ్యంతో అధ్యాయం ఆరంభం కావడం వస్తువుకు భావ బంధురతను చేకూరుస్తూంది. మనిషి మనసులో మొదట మెదలింది ప్రభాతం! ఆ తరువాత కనిపించింది జలపాతం! ఇవి మౌనాన్ని చీల్చుకొని, మగతను దూసికొని, పైకి ఎగసే నాదంగా పర్యవసితమయినాయి. ఈ నాదం ఎక్కడిదని ప్రశ్న! దీనికి సమాధానమంత సులభం కాదు. దీనికెంతో చింతన మవసరం. అనుభవమూ కావాలి. అపుడు లభ్యమవుతుంది. ఈ స్థితిని నిలుపుకొని ముందుకు సాగవలసి ఉంటుంది. అపుడే దీని తత్త్వం సంపూర్ణంగా అవగతమవుతుంది. ఈ నాదం నాభి నుండి నిర్గమించింది. నరాల్లో తీగెలు తీగెలుగా చుట్టుకుంది. గుండె లోయలో ఘూర్ణిల్లింది. మస్తిష్కం అంచుల్లో మార్మోగింది. కళారూపం సాక్షాత్కరించింది. సంగీత పారమ్యానికి దారితీసింది. దీనికి శబ్దం తోడయింది. మరో విశిష్ట రూపాన్ని పొందింది. నాదానికి శబ్దం తోడై సంగీతానికి పరిపూర్ణత సాధింపబడింది. ఈ భాగం కవి వ్యక్తిత్వంలో అంతర్గతమై ఉన్న సంగీత కళకు అద్దం పడుతూంది. అదే విధంగా నాట్యం చిత్రలేఖనం మొదలుగా కళా విభాగం అవతరించింది. కళాత్మకమైన విలువలతో పాటు పరమార్థమూ గుర్తింపబడింది. కవి కత్యంత ప్రియమైన కళాపరమైన సంగీత నాట్య ప్రపంచం కావ్యానికి కమనీయతను చేకూర్చింది. ఉదాత్తతను వరించింది.

దీని తరువాత జైత్ర యాత్ర ఎన్నో ఆక్రమణలూ పోరాటాలూ విధ్వంసాలూ సంఘర్షణలూ యుద్ధాలూ కలిగింది. మనిషి తాను విజేత కావాలన్న ఆరాటం వల్ల విలయ విహారం జరిగింది. ఉత్సాహం విజృంభించింది. వీర కృత్యాలు అతిశయించాయి. మనిషిలో నెలకొన్న రణోన్మాదానికి పరాకాష్ఠగా శిథిల దృశ్యాలు సాక్షాత్కరిస్తాయి. మనిషిలో విజయ తృష్ణ హద్దులు మీరినపుడు జరిగే విపరీత పరిణామాల్ని, హద్దుల్లో ఉన్నప్పుడు కలిగే ఉపయోగరూపాల్ని చిత్రించడంలో మానవీయ భావన కనిపిస్తుంది. కవి మాటల్లో "వేయి తోటలను నరికిన చేయి, పూయిస్తుందా? ఒక పూవును!" అన్న ప్రశ్న సృష్టి నిర్మాణం అనేవి ఎంతటి కష్టసాధ్యాలో

సూచిస్తూంది. విలయం విధ్వంసం తేలికైన పని. సృజనకూ నిర్మాణానికీ సత్సంకల్పం కావాలి. సృజనశక్తి ఉడాలి. నిర్మాణ దక్షత చేకూరాలి. ఈ భేదాన్ని చిత్రించే అనేక సంఘటనలు కావ్యంలో వెలసాయి. మారణ హోమాన్ని సాగించిన అశోకుడు యుద్ధంలో జరిగిన విధ్వంస కాండ చూచాక అతనిలో చిత్రంగా గొప్పమార్పుకు కారణమయింది. సమర విముఖుని గావించింది. శాంతిని వరింపజేసింది. మానవ చరిత్రలోనే ఇదో గొప్ప మలుపు! జీవిత లక్ష్యానికి కొత్త భాష్యం చెప్పింది. చరిత్ర గతికొక సుస్థిరతను చేకూర్చింది. దిశను మార్చింది. ఈ సందర్భంలో దయా గుణమే ప్రియతమంగా ఎల్లలు దాటింది. “ధర్మపథం” గొప్ప ప్రభావాన్ని నెరపింది. బౌద్ధంలో దయా గుణం దాని విశ్వ వ్యాపకత్వం మానవతా గుణం దాని హృదయావర్జకత్వం గల మానవ చరిత్ర ఈ కావ్యంలో ప్రవచనాల రూపంలో కాకుండా వివిధ సంఘటనల్ని పురస్కరించుకొని సారభూతంగా రమణీయార్థ భాసురంగా ఆవిష్కృతమయినాయి.

కావ్యంలో ప్రకృతికి గల స్థానం అనితరమైంది. ప్రకృతిలో చలన శీలానికి పరిణామం మనిషి అన్నభావనతో అనివార్య సంబంధం స్థాపితమయింది. కాల చలనంతో రోజులు పక్షాలు ఋతువులు వత్సరాలు గడచిపోతూ ప్రకృతిలో పరివర్తనం మానవ జీవితంపై ప్రభావాన్ని నెరపుతాయి. మనిషి కూడా భద్రతకయి రక్షణకయి ప్రకృతి శక్తులపై అదుపుకు ప్రయత్నించడమూ ఆధిపత్యానికి ఉద్యమించడమూ జరుగుతుంది.

కావ్యంలో తాత్త్వికమైన అంశాలు కవితాత్మకంగా మలచబడినాయి. ఆధ్యాత్మిక ప్రపంచంలో ఆయా పథ ప్రవర్తకుల సందేశాలు సోక్రటీస్, క్రీస్తు, బుద్ధుడు మొదలుగా ఎందరో మహానుభావుల ప్రవచనాలు దీప్త స్తంభాల్లా నిలపబడినాయి. మానవ జీవితంలో అన్ని సమస్యలకూ కారణం “కాంక్ష”గా గుర్తింపబడింది. ఇది అన్నిటికీ మూలమైంది. చెట్టుకు వేరు వంటిది. ఇది ముదిరితే ఆశగా మారుతుంది. ఇది పెరిగితే లోభంగా పరిణమిస్తుంది. ఇట్లా కీలకమైన తాత్త్వికాంశాలు శాఖోపశాఖలుగా విస్తరించాయి. జీవితంలో అన్ని దుశ్చర్యలకూ లోభం కారణమయింది. చరిత్రలో చీకటినీ మాలిన్యాన్నీ నింపేసింది. బాధల్ని కష్టాల్ని కలిగించింది. అంత మాత్రాన క్రుంగిపోనవసరం లేదు. నిరాశతో నిస్తేజస్కం కానవసరం లేదు. వీటిని అధిగమించి ముందుకు వెళ్ళే శక్తి మనస్సుకు ఉందనే కవి

నిశ్చయం. ఈ భావన నిరాశనుండి నిస్పృహ నుండి అడ్డంకుల నుండి పైకి ఉద్గమింపజేస్తూంది. మానవ ప్రస్థానాన్ని ముందుకు సాగిస్తుంది. వెలుగునూ శుభ్రతనూ స్వచ్ఛతనూ పొందేందుకు కవాటాలు తెరుస్తుంది. ఇక "ఆ మనసుకు ఏకైక శరణం అతిలోక శక్తుల స్మరణం" అన్నమాట రక్షణ కవచాన్ని స్మరింపజేస్తూంది. అతిలోకశక్తి భౌతికేతరమయింది. అనేక క్లిష్ట సమస్యల్ని అధిగమించడానికి సమాశ్రయంగా పరిణమిస్తుంది. ఇది స్థూలం నుండి సూక్ష్మానికి పయనింపజేసేది కూడా. ఇది సాధన చేత బాగా సిద్ధిస్తుంది. దివ్యమైన స్థితికీ దోహదం చేస్తుంది. అతిలోకమంటే ఈ లోకాన్ని అతిశయించిన లేదా అధిగమించిన లేదా అతిక్రమించిన ఆలోచన మరియు అనుభవ విశేషం. కవి అభిప్రాయంలో మనస్సు పట్టు తప్పిన స్థితుల్లో అంతశ్చేతన ఆలంబంగా, మనిషి పురోగమనం అతిలోక శక్తి హేతువుగా సాగుతుంది. సుపథాన్వేషణలో ఎందరో ఆధ్యాత్మిక శక్తి సంపన్నులు అతిలోక మార్గంలో పయనించారు. లోకానికి ఆదర్శ మార్గాన్ని చూపారు. కళాత్మక వైజ్ఞానికి దశలకు దీటుగా ఆధ్యాత్మిక దశలు కూడా ప్రజ్ఞావిభవంగా తీర్చబడినాయి. ఈ సందర్భంలో 'ఆత్మసాక్షి'నీ 'పథనిర్దేశ' లక్షణాన్నీ 'పరమ ప్రయోజన' లక్ష్యాన్నీ గుర్తించడమూ జరిగింది. ఇది ఏదో ఏ కొందరికో సంబంధించే అంశంగా కాకుండా సామాజిక శ్రేయోపరంగా ఉపకరించేదిగానూ భావితమయింది. ఈ భాగం కాంతివంతమైన రూపాన్ని దర్శింపజేస్తూంది. కళా వైజ్ఞానిక ఆధ్యాత్మిక పార్శ్వాల సంపుటి – మానవ వికాసాన్ని శబ్ద దర్పణంలో అర్థవంతంగా బింబించే కృతిగా దర్శనమిస్తుంది.

ఆరోహణ క్రమంలో మనిషి కాల గతిలో ఎన్నెన్ని ప్రస్థానాలో చవి చూడవలసి ఉంటుంది. అన్నిటిని పేర్కోవడం సాధ్యం కాదు. అందువల్ల మానవ వికాస భావన సూత్రాకృతిని పొందింది. వికాస చరిత్రలో ఎన్ని మసక సందెలు క్రమ్ముకున్నా మనసు 'కాంతి చక్షువు' దారి చూపుతుంది. ఏదీ ఆగదు. ఆగినట్లు కనిపిస్తుంది. ఇది తాత్కాలికం మాత్రమే. 'ఎన్ని మంచు గడ్డలు పేరుకున్నా' ఆ మేరలో 'జ్వలన ధాతువే' వాటిని కరగిస్తుంది. దారిని స్పష్టం చేస్తుంది. ప్రయాణాన్ని సుగమం చేస్తుంది. 'జ్వలన ధాతువు' చాలా శక్తివంతమయింది. వెలుగై పరిణమిస్తుంది. చీకటి పన్నిన వ్యూహాన్ని ఛేదిస్తుంది. ఇది చల్లదనాన్ని నిరుత్సాహాన్ని పోగొడుతుంది. వేడితో ఉత్సాహాన్ని నింపుతుంది. మనిషిని నిరాశ నుండి నిస్పృహ నుండి విషాదం నుండి ఉద్ధరించేదిగాను అర్థాంతర స్ఫూర్తిని కలిగిస్తూంది. నిత్యమైన వెలుగును

గురించి ఆలోచింపచేస్తుంది. మానవీయ భావనలో మానవతారూపాలు మానవ సంబంధాలు జీవితాన్నీ సమాజాన్నీ ప్రభావితం చేసే దృశ్యాలు చిత్రితమయినాయి. సాధారణ తలంపైనే కాక విశేషతలంపై ప్రవర్తిల్లే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవడం ఇందులో విశేషమనీ చెప్పొచ్చు. 'విశ్వాన్ని ఆత్మీకరించుకొని విస్తరించిన మనిషి చరిత్రలో జీవితాన్ని పిడికిలించుకొని ఆరోహించే మనిషి ప్రస్థానం' మానవీయ శోభను పొందింది. కృతిలో స్థానికం దేశీయంతో పాటు సీమల్ని అధిగమించిన విశ్వభావన ఆలోచనకందుతుంది. మనిషి వికాసంలోని అంతరువులను జ్ఞాపకం చేస్తుంది.

మొత్తం మీద కావ్యం శబ్ద విలననంలో వాక్య విన్యాసంలో అభివ్యక్తి రామణీయకతను పొందింది. అర్థాంతర దీప్తిని కలిగింది. శబ్దమూ అర్థమూ సమభావంతో కలిసి ఆకర్షణీయ రూపాన్ని పొందాయి. అంతంలేని జీవన సత్యాన్ని ఆవిష్కరించే విశ్వంభరలో 'అంతస్తత్వ' దర్శనమూ బింబితమయింది. ఇది సంవిధానంలో కవి సాధించిన సృజన విజయం.

'మనసుకు తొడుగు మనిషి, మనిషికి ఉపుడు జగతి! ఇదే విశ్వంభరా తత్త్వం, ఇదే అనంత జీవన సత్యం' మనస్సుకు దుస్తులుగా మనిషిని భావించడంతో పాటు మనిషికి దుస్తులుగా జగత్తును ఊహించడం జరిగింది. దుస్తులు అవసరమైన ఆచ్ఛాదనంగానూ సంఘంలో గౌరవ చిహ్నంగానూ అలంకార పరంగానూ అభిరుచి స్ఫోరకంగానూ విశేషతలంపై మానవీయ రూపంలో తాత్త్విక జగత్తును భాసింపజేస్తాయి. 'తొడుగు' 'ఉడుపు' అనేవి పొరలుగా స్థితులుగా తత్కాల ప్రయోజనరూపాలుగా దృష్టికి వస్తాయి. వీటితోనే జీవితం అస్తిత్వాన్ని పొందుతుంది. ఇవి అనేకం. సి.నారాయణరెడ్డి 'విశ్వంభర' కావ్యం స్వేచ్ఛా కవిత్వంలో సృజనకళతో మానవ వికాస రేఖా చిత్రం.

## II.7 నా దేశం నా ప్రజలు : విప్లవ సాంస్కృతిక బింబం

'నా దేశం నా ప్రజలు' విప్లవ భావనతో దేశ సాంస్కృతిక భూమికపై సామాజిక బింబం. స్వేచ్ఛా కవిత్వంలో అనుభూతి కళతో ఆకర్షణ శక్తి కలిగిన కావ్యం. కవి ఆరంభించిన వైజ్ఞానికోద్యమానికి ప్రాతినిధ్యం వహిస్తూంది. ఆర్థిక సామాజిక సమానతల సాధనలో మార్క్సీయ దృక్పథాన్ని వరించింది. ఈ దిశలో కవి బాధ్యతను గుర్తు చేస్తుంది. సమస్త మానవ సౌభాగ్యాన్ని కాంక్షిస్తుంది. దేశ తలం నుండి ప్రపంచ తలానికి మానవతా భావనతో ఉపక్రమించింది. కవి మాటల్లో 'ఏ తరానికాతరం కొత్త కవుల్నీ కొత్త భాషనీ కొత్త విలువల్నీ కొత్త ప్రపంచాన్నీ సృష్టించుకుంటుంది'. ఇవి సంపూర్ణంగా ఈ కావ్యానికీ అన్వయిస్తాయి. ఈ కొత్తదనాన్ని విశ్లేషిస్తే సమాలోచనకందే అంశాలు కావ్య వివేచనకు బాగా ఉపకరిస్తాయి. దీనికి వైజ్ఞానిక ఉద్యమంగా ప్రకటితమైన గుంటూరు శేషేంద్ర శర్మ "కవిసేన మేనిఫెస్టో" ఆధారంగానూ స్వీకరించవచ్చు. దీన్ని బట్టి అనుభూతిని కళగా అభ్యాసం చేసే ప్రక్రియ కవిత్వం. సృజనరూపంలో కళా సిద్ధి నుండి దర్శనానికి పయనించడం జరిగింది. దీనికి తోడు సమాజంలో నెలకొన్న సమస్యలకు కనీస పరిష్కారమార్గంగా మార్క్సు గతి తార్కిక భౌతిక వాదాన్ని స్వీకరించడం జరిగింది. అనుభూతి కళ సామ్యవాదం రెండింటి సమన్వయం కవి సాహిత్య వ్యక్తిత్వంలో అవగతికి వస్తుంది. విప్లవభావ ప్రతిఫలనం స్ఫుటంగా కనిపిస్తుంది. కవిత్వ కళ పట్ల శ్రద్ధతో పాటు కవికీ సమాజానికీ ఉండవలసిన సంబంధం పట్ల అభిలాష గమనించవచ్చు. ఇది ఏదో ఒక రాజకీయ పార్టీకి మాత్రమే పరిమితం కాదు, కవి మానవ జాతికి బాధ్యుడన్న విశాల దృక్పథంతో కూడింది. మానవ సమాజ క్షేమం కోసం వైజ్ఞానిక నాయకత్వాన్ని నెలకొల్పేందుకు 'కవిసేన' స్థాపితమయింది. రాజకీయాలు సమాజంలో భాగం కాబట్టి కవి రాజకీయాలతో సంబంధం కలిగి ఉండవచ్చు. రాజకీయ పార్టీలతో ప్రత్యక్ష సంబంధం పెట్టుకోరాదనే దీని ఉద్దేశం. కవి ముఖ్యంగా కుల మత భాషా దేశాల కతీతంగా ఉండాలనే నిశ్చయం. కవిత్వానికి వస్తే ఒక స్థాయిలో కళాత్మకతను కలిగి ఉండడం అవసరం. దీనికి అనుభూతి విశేషం కేంద్ర స్థానం వహిస్తుంది. అదీ విలక్షణంగా ఉండాలి. కమనీయతను సంతరించుకోవాలి.

సామాజిక స్పృహ కానీ ప్రయోజనం కానీ ప్రబోధం కానీ మరేదైనా కవిత్వీకరింపబడాలి. కవిత్వ భాష వేరు. భావరూపం ప్రతీక మరియు ధ్వని మొదలైన

వాటితో ఆకర్షణ సిద్ధిస్తుంది. మొత్తం మీద ఒక కొత్త ఆలోచన కొత్త అభివ్యక్తి కొత్త అనుభవంతో విలసించినపుడే విశిష్టత చేకూరుతుంది. సృజన సమయంలో కవిలో అసాధారణమైన స్థితి వల్ల ఆత్మకళాసిద్ధికి మార్గమేర్పడుతుంది. ఇంద్రియాల నావరించిన ధూళి క్షాళితమవుతుంది. ఇదొక విశిష్ట స్థితి. దీని ప్రకాశ స్పర్శ చేతనే శబ్దం చేతనను పొందుతుంది.

కవిత్వ దర్శనంలో కవి (1)మొదట అనుభూతిని కళగా అభ్యాసం చేయడం (2) ఆ తరువాత ఆత్మీకరణను అభ్యాసం చేయడం (3) ఆపైన అభివ్యక్తిని కళగా మార్పు చేయడంతో 'కావ్యతంత్రం' విశిష్టంగా ఆవిష్కృతమవుతుంది. జీవితంలో ఈ సమయం ఒక తపస్సుగా మారుతుంది. కవిత్వం కేవలమొక శబ్ద రచనా వ్యాపారం కాదు. ఒక జీవనపరమైన కళతో ముడిపడింది. దీనికి అధ్యయనం హేతుదృష్టి ఆలోచన అనుభూతి గుణం అవసరం. వీటి ఆధారంగా ఆత్మకళతో కవితాసిద్ధి కుపక్రమించాలి. ఇది కవి దృక్పథం. కవిసేన మేనిఫెస్టోలో ప్రతిపాదితమయింది. కవిత్వానికే ఇతర ప్రక్రియకూ లేని సత్వరాకర్షణ శక్తి ఉంది. మానవ నాగరకతా వికాసంలో మానవీయ తలపై ప్రముఖమైన పాత్రను నిర్వహించింది. కవిసేన (1) వైజ్ఞానిక వర్గాన్ని సంఘటితం చేయడం (2) ప్రజల్లో స్వతంత్రమైన భయ రహితమైన శక్తిని పెంపొందించడం (3) ప్రజల్లో సచేతనమైన క్రియాత్మకమైన స్థితిని ప్రోత్సహించడం (4) అనుభూతి కళ ప్రయోజనం లక్ష్యం గురించి అవగాహన కలిగించడం అనేవి గుర్తించి, దృష్టిని ప్రసరించింది. రాజకీయ పక్షాలకతీతంగా బృహన్మానవ చైతన్య భావనతో ఉపక్రమించింది. కవితా చైతన్య విరాట్ స్వరూపాన్ని దర్శించే ఆవిష్కరించే ప్రయత్నానికి దోహదం చేసింది. ఈ మహా కార్యానికి 'నాదేశం నా ప్రజలు' ఆదర్శ స్థాయిని పొందుతూంది..

భారతీయ జీవిత స్వరూపాన్ని ప్రతిఫలించే కర్షక ప్రధానమైన గ్రామీణ వాతావరణంతో కావ్యం ఆరంభమయింది. ఇందులో ఎనిమిది సర్గలున్నాయి. ఈ దేశంలో సాంస్కృతిక చేతనతో ప్రజల జీవన స్థితులు స్థూల సూక్ష్మస్థాయిల్లో మానవీయ భావనతో ఆవిష్కృతమయినాయి. "లేస్తోంది ఉషః కాంతుల్లోంచి ఒక హస్తం! అది శ్రామికుని సమస్తం". ప్రకృతి నేపథ్యంతో శ్రామిక జీవన చిత్రం ప్రవృత్తమయింది. కవి ఆలోచనలో "కర్షకుడు" ప్రధానపాత్రగా రూపొందాడు. దీనితో వ్యవసాయ వాతావరణంతో కూడిన గ్రామీణ జీవన స్థితిగతులతో వస్తువు ప్రకాశించింది.

మార్క్సీయపథంలో ప్రధానంగా ఉండే కార్మికుని స్థానంలో కర్షకుని నిలపడం – శ్రమ శక్తిని విస్తరించడం, కార్మికునితో పాటు ఇతర శ్రమ శక్తులకూ సముచితమైన స్థానాన్ని ఇవ్వడం గమనించదగిన అంశం. కర్షకులూ, కార్మికులూ ఇరువురూ శ్రామికులే వ్యవసాయిక భారతదేశంలో కర్షకులే అధిక సంఖ్యలో ఉన్న శ్రమ జీవులు! ఎక్కువమంది ప్రజలున్నది గ్రామాల్లోనే. కావ్యంలో వస్తువు భారతదేశ సాంస్కృతిక సమాజానికి దగ్గరగా ఉంది. గ్రామీణార్థిక వ్యవస్థ ఈనాటికీ దేశానికి ఆయువు పట్టుగా ఉంది. దేశం మొత్తం మీద పారిశ్రామిక ప్రగతి ఇంకా ఆయా చోట్ల మొదటి దశ రెండో దశలోనే ఉంది. ఉత్పత్తి సాధనాలు మొదలుకొని మానవ సంబంధాల వరకూ ఇంకా పూర్వ సంస్కృతికి చెందిన ముద్రతోనే ఉన్నాయి. ఈ భూమికలో ఆలోచనకు భావరూపాల ప్రతీకల పరంపరతో అభివ్యక్తి సౌందర్యం కావ్యానికి కళాకృతినిస్తుంది. కర్షక జీవితం ఎదుర్కొనే దారిద్ర్యం అజ్ఞానం అనారోగ్యం మొదలుగా అనేక దయనీయ రూపాలు సామాజిక తలంపై సాక్షాత్కరిస్తాయి.

"నేను ధాన్యంలోంచి పుట్టాను! ధాన్యం కోసమే బ్రతుకుతాను. మరణించి ధాన్యంలోకి వెళ్ళిపోతాను" – అన్న మాటలు "సస్యమివ జాయతే, సస్యమివ పచ్యతే" – అన్న ఉపనిషద్వాక్యాలకు దగ్గరగా ఉన్నాయి. శ్రమించే వ్యక్తికి ఆధారం వ్యవసాయం. అతని కృషి ఫలం ధాన్యం. ఈ వస్తువులో ఐక్యమయ్యే కవి ఆలోచనా ప్రపంచం గ్రామీణ జీవితానికి సన్నిహితమైన ప్రకృతి స్వరూపం వైపు దృష్టిని ప్రసరింపజేస్తుంది. గ్రీష్మం – మేఘాగమనం – వర్షం, నీటితో నిండిన జలాశయాలు – చెట్లు పూలతో పండ్లతో శోభిల్లే పచ్చదనం – పంటలు – వసంతం మొదలుగా ఋతువుల ప్రభావ పాత్ర స్పష్టంగా కనిపిస్తుంది. ఇంతకూ భూమిని నమ్ముకున్న వాడి జీవితం శూన్యంగానే ఉంది. దారిద్ర్యం తాండవిస్తూనే ఉంది. వారి జీవితాల పట్ల సానుభూతి ప్రకటనమూ బహుధా కనిపిస్తుంది. శ్రామికుని చేత్తో సృజింపబడిన వస్తువులెన్నో! ఆ చేయి శాశ్వతంగా ఖాళీగానే ఉండిపోయింది. ఎంత కష్టపడినా చివర కేమీ మిగలని స్థితిలో అన్నిటికీ కొరతే! దీన్ని కవి "చెట్టుగా ఉన్నా ఏడాదికొక సారి వసంతమైనా దక్కేది. మనిషినై అన్ని వసంతాలూ కోల్పోయాను" అంటాడు.

సమాజంలో శ్రామికుని బ్రతుకులో లేని స్థితి కళాత్మకంగా రూపితమయింది. గ్రామీణ వాతావరణంలో ప్రకృతికీ మనిషికీ గల గాఢమైన అనుబంధాన్ని సూచిస్తుంది. "సూర్యుడు కిరణాల బండ్లు తోలుకొని వస్తున్నాడు" – మరో దృశ్యం! పల్లెలో ప్రయాణ సాధనం బండి. ఇది ఉదయం ప్రకృతి దృశ్యంలో భావితమయింది. శ్రామికుని

శ్రమ జీవనంలో సాధనాలు శ్రమ రూపంలో వాస్తవాలు భావ రూపంలో పొదగబడినాయి. స్వదేశ భావన స్వసంస్కృతి పట్ల గౌరవం వస్తువుకు దేశ సాంస్కృతిక జీవన కోణాన్ని ప్రసాదిస్తూంది. “నేనెప్పుడు గొంతెత్తినా నాకోసం కాదు, యాభైకోట్ల మంది కోసం” తాను పడుతూన్న బాధలే, తన “దేశమంతా పడుతూంది” అంటాడు. భారతదేశంలో ఇప్పటికీ గ్రామాలు దారిద్ర్యంలోనే మగ్గుతున్నాయి. గ్రామీణ జీవితంలో ముఖ్యమైంది భూమి. భూమికి సంబంధించిన పొలాలు, పంటలు, తోటలు వర్ణితమైనాయి. ఈ సందర్భంలో కోతలకు పనికి వచ్చే కొడవలి పంటకోతకూ గడ్డి కోతకూ పనికి వచ్చే సాధనం. పంటల కోతల్ని పురస్కరించుకొని వచ్చే పండుగ ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. తొలకరిలో దున్నడం విత్తడం నాటడం కోయడం దశలన్నీ ఉత్సాహభరితమైనవి. ఈ ప్రక్రియలో ‘నాగలి’ పాత్ర ప్రముఖమైంది. ‘నాగలి పట్టిన రైతే నా కావ్యానికి నాయకుడ”ంటాడు కవి. ఈ దృష్టితో ఒక సందర్భంలో భారతదేశాన్ని నాగలితో పోల్చడమూ జరిగింది. గ్రామీణ సాంస్కృతిక జీవన స్వరూపంతో కవి తాదాత్మ్యం చెందిన అనుభూతి చిత్రాలు కృతిలో పరంపరగా సాగాయి.

కవి దృష్టికి నగరమొక భయంకరమైన విష వలయంగా దర్శనమిస్తుంది. దీన్ని వదలి పల్లెల్లోకి చెట్లలోకి కొండల్లోకి వెళ్ళమడం మహా ఇష్టం. కృత్రిమత్వాన్ని వీడి సహజమైన వాతావరణాన్ని ప్రేమించే తత్త్వం గోచరిస్తుంది. హైదరాబాద్ నగరం రోడ్‌పై అగ్ని పర్వత భావన – విషమ స్థితిలో ‘బాంబు’ను కోరే ఆలోచన ప్రమాదకరమైన వాతావరణాన్ని సూచిస్తాయి. కవిలో అలజడినీ ఆవేశాన్నీ ఉద్రేకాన్నీ తీవ్ర చర్యకు పూనుకునే ఆలోచననూ కలిగించే స్థితు లనేకం ఈనాటికి సామాజిక దుస్థితిని బింబిస్తాయి. నగరంలో మనిషి జీవితం పరుగెత్తడమే. ఎక్కడా స్తిమితత్వం లేదు. నడవడం లేదు. కాలానిదే పై చేయి. కాలం చేతుల్లో మనిషి జీవితం బందీ అయింది. మానవ సంబంధాలు పరిమితుల్ని పొందడంతో అనుభవాలు సంకుచితమైన ఆలోచనలు హద్దుల్ని పొందుతున్నాయి. ఇక్కడ మనిషి గొంతుకన్నా కాలం గొంతే బాగా వినిపిస్తుంది. ఇది ఒక్కొక్కపుడు పెద్ద ఇనుప గద్దలా మనిషి గుండెపై కూర్చుంటుంది. ఆ బరువుకు గుండె ఆగిపోవచ్చు. చితికిపోవచ్చు. గుండె భయంతో వణకే ప్రమాదం అనునిత్యమూ ఉంది. ఏదీ ఆగదు. అన్నీ జరిగిపోతూనే ఉంటాయి. వ్యాపార సరళికి మనిషి అలవాటు పడుతూనే ఉన్నాడు. తాను కోల్పోయింది గుర్తుకు రాదు. దాన్ని గురించి ఆలోచనకు తీరిక లేదు.

తరం నుండి మరో తరం అనుక్రమం ఆగదు. సాగుతూనే ఉంటుంది. బీజం నుండి మొలక వస్తుంది. రాగంతో పెరుగుతుంది. విత్తనాలేర్పడతాయి కొత్త ముఖాలేర్పడతాయి. కొత్త తరంలో పిల్లలుగా ఎదుగుతాయి. ప్రకృతి – మనిషి అనుబంధం అవిచ్ఛిన్నంగా తర తరానికీ మార్పు లేకుండా సాగుతుంది. ఇది శాశ్వతమయింది. ఇదీ కావ్యంలో ఆయువు సూత్రం. తరం తరం పిల్లల పెద్ద అయి మార్పుల్ని కోరతారు. పొందుతారు. కొత్త జీవితాన్ని కొత్త నాగరకతను అల్లుతారు. చరిత్రలో కొత్త పేజీల్ని చేరుస్తారు. అందులో కొత్త కొత్త విషయాలుంటాయి. వీటికి తగినట్లుగా మారిన ఆలోచనలు, అవలంబించే పనులు పొందే అనుభవాలు వేరుగా ఉంటాయి. ఎన్ని మార్పులు చేర్పులు జరిగినప్పటికీ ప్రతి యుగమూ ఒక "వెర్రి ఆకాంక్ష" కలిగి ఉంటుంది. ఏదో ఆకలిగా అరుస్తుంది. ఆ "ఆకాంక్ష నెరవేరే దెప్పుడు?" "ఆ ఆకలి తీరే దెప్పుడు?" అంటే కొత్త తరంలోనే! మళ్లీ ఆతరంలో నుండి వచ్చే కొత్త తరంలో తీర్చబడుతుంది. ఇదో పరంపర ఒక దానిపై మరొకటి సాధిస్తూ అవ్యాహతంగా సమాజం సాగిపోతూంటుంది.

## II

ఈ కావ్యంలో విషయానికాధారం రెండు విధాలుగా ఉంది. ఒకటి మానవేతరమైంది, రెండు మానవాత్మకమైంది. మొదటి దానిలో ప్రకృతి – పశు పక్షి క్రిమి కీటక జంతువులు మృగాలతో కూడిన ప్రపంచం ఉంది. రెండో దానిలో మానవుడూ సమాజంతో కూడిన ప్రపంచం ఉంది. దీనికి సంబంధించిన ప్రభుత్వం మతం న్యాయ స్థానాలూ రాజకీయాలూ వివిధ వృత్తులూ వ్యాపకాలూ ఆలోచనలో దిగుతాయి. మానవేతర మానవ ప్రపంచాలతో కూడిన మహా జగత్తు – కావ్యంలో వివిధ సందర్భాల్లో ప్రసక్త మయింది. నేపథ్యం నుండి వస్తువుకు బలాన్ని చేకూరుస్తూంది. స్థూల దృష్టిలో ప్రకృతి సమాజం మార్పులతో కన్పిస్తాయి. ఇవి మనిషి జీవితంలో సూక్ష్మమైన అంశాలతో తీర్చబడినాయి. ఇవి అనుభూతి యుతంగా కళాత్మకతను పొందాయి. మహా జగత్తులో క్షణాలు రక రకాల కొత్త కొత్త ముఖాలతో గంతులేస్తూ వస్తాయి. ఒక్కొక్కటి ఒక్కొక్క రూపంలో దర్శనమిస్తాయి. కవితగానూ శిల్పంగానూ అవతరిస్తాయి. ఈ రూపాల ఆగమనాన్ని ఎవరూ ఆపలేరు. వీటిని గురించి చింతనం కావ్యంలో తాత్త్విక శోభను సంతరించుకుంది. ఆఖరికి ఏ పెద్ద కొండ అయినా, ఎంతటి పర్వత శ్రేణులయినా ప్రభాతాన్ని ఆపలేనట్లు కొత్త ముఖాల్ని

నియంత్రించలేరు. ఎంతటి ఎత్తైనా శిఖరాలపై నుండి అయినా అవలీలగా దూకి సూర్యుడు పైపైకి ఎదిగి వస్తాడు. వేయి ఖడ్గాలతో తనకు అడ్డంగా ఉన్న వాటిని ఛేదిస్తున్నట్లనిపిస్తుంది. తన విజయానికి చిహ్నంగా అన్ని కొండల మీద ఎర్రని కాంతుల జెండాలు నాటుతాడు. సమాజంలో ప్రగతికి అడ్డుగా ఉన్న వాటిని తొలగిస్తూ ముందుకు సాగే విప్లవ భావనా రూపం వ్యంజితమవుతూంది. ఎర్ర జెండా మార్పు విప్లవ భావ సంకేతం. కవిలో సామ్యవాద భావనా రూపానికి చెందింది.

ఈ కావ్యంలో ఈ దేశంలో ఉన్న పేదలు దీనులు ఉన్న సామాజిక స్థితి చిత్రణం మరో విశేష పార్శ్వం. "వసంతం లేని చెట్టు ఎక్కడికి పోతుంది? వేళ్ళతో ధరిత్రిని అంటి పెట్టుకొనే ఉంటుంది". ప్రకృతిలో ఈ వాస్తవాన్ని సమాజంలో పేద వర్గాని కన్వయించవచ్చు. ఒక సెంటు భూమి కూడా లేని "దేశాభిమాని కవి కూడా" దేశాన్ని "అంటిపెట్టుకునే" ఉంటాడు. చెట్టూ భూమికీ గల దృఢమైన సంబంధం దేశాభిమాని కవికీ దేశానికి గల అవినాభావ సంబంధం సహజమైందీ, అనపాయమైందీ. ఇదేదో సంపదతోనో అధికారంతోనో ముడిపడింది కాదు. ప్రపంచ స్థాయిలో ఆలోచన జరిగినప్పటికీ, వ్యక్తి తన దేశాన్ని విస్మరించరాదనే కవి అభిప్రాయం. ఆ నేలనూ గాలినీ నీటినీ అడవుల్నీ పశువుల్నీ పక్షుల్నీ ప్రజల్నీ ప్రేమించడంలో అనిర్వచనీయమైన మానసికానుభూతి పొందడం కనిపిస్తుంది. ఇదే విధంగా ఆ దేశ గతమైన ఆలోచనానుభవ జీవితంతో పాటు పొందిన వారసత్వం సంస్కారం కలిసిన సాంస్కృతిక ప్రత్యయమూ దృష్టికి వస్తుంది. ఈ దృష్టితో సాంస్కృతిక సామాజిక చిత్రణం ప్రాధాన్యాన్ని వహిస్తూంది.

మరో అంశం ఉంది. సమాజంలో స్త్రీ పురుషుల పరస్పరానుభవంతో సమాన గౌరవ స్థాయిలో ప్రేమను మన్నించడం స్వీకరించడమనేది ప్రత్యేకంగా పేర్కోదగింది. మానవ సమాజంలో శ్రామిక జీవనంతో పాటు, ప్రేమ జీవితమూ ముఖ్యమే. జీవితంలో మానసికంగా శక్తివంతమైన పాత్రను నిర్వర్తిస్తుంది. మహాకవి దాశరథి కూడా ఇదే అభిప్రాయాన్ని కలిగిన కవి. సామాజికాదర్శానికీ స్త్రీ పురుషుల స్వచ్ఛమైన ప్రేమకూ మధ్య వైరుధ్యం లేదనే వీరి అభిప్రాయం. పైగా ఆరోగ్యకరమైన మానసిక స్థితికి తోడ్పడుతుందనే విశ్వాసం ప్రకటితమయింది. కవికి అనురాగవతియైన ప్రేయసితో కలిసి జాతి అభ్యుదయం కోసం మానవాళి శ్రేయస్సు కోసం శ్రమించడం బలికావడం ఇష్టం. సామాజిక సేవలో దేశభక్తికి సంబంధించిన త్యాగ భూమికలో ప్రేయసితో కలిసి పనిచేయడం ఆదర్శవంతమైన సహజీవనంగానూ ప్రకాశిత

మయింది. భౌతికాన్ని అధిగమించి మానసికమైన రాగ ప్రభావాన్ని చాటుతూంది. ప్రజల కాంక్షలలో కలలలో ఆశయాలలో ప్రయత్నాలలో ఒకటై హితాన్ని కోరే మనోరూపం గల స్త్రీ పురుష ప్రేమను సంకుచితం చేయడం న్యాయం కాదు. ఈ సందర్భంలో ప్రేయసిగానే కాక స్నేహశీలిగానూ అస్తిత్వం కలిగిన వ్యక్తిగానూ అనేక పార్శ్వాల్ని గౌరవించడం కనిపిస్తుంది. స్త్రీ పురుషుల అనురాగంతో జీవితం 'నాజూకు నూలు పోగుల దుకూలం'గా ప్రయోజనంతో పాటు కళాత్మకత కూడా భావితమయింది.

మానవ జీవితం సమాజ గతిలో ఎత్తులతో పై ఎత్తులతో వ్యూహాలతో ప్రతి వ్యూహాలతో గెలుపుపై దృష్టితో ప్రయోజనపరంగా సాగుతుంది. అనేక జీవితాల కలయికతో చారిత్రక సంబంధాలతో వర్తమాన ప్రమేయంతో సమాజం వీడరాని దవుతుంది. ఒక ప్రక్క కఠోర వాస్తవాలు మరో ప్రక్క అలరించే కాల్పనికాలు విలసిస్తాయి. జీవితంలో ఎదురయ్యే క్లిష్ట పరిస్థితుల్లో బాధలూ బాధల్లో కోపం ద్వేషం శత్రుతతో ఆయుధం చేపట్టే అవసరం కలగడం జరుగుతుంది. వీటిలో కొన్ని ఆదర్శానికి కట్టుబడి సాగుతాయి. ఈ దృష్టితో మార్క్సిస్టు విప్లవ మార్గాన్ని విశ్వసించే ఆలోచనా రూపం కృతిలో చోటుచేసుకుంది.

ప్రజలు "ఆకలి" అని ఏడిస్తే పాలకులు "పొలాల బదులు ఫుట్‌పాత్" చూపిస్తారు. ఈ స్థితిలో "ఎర్రనక్క" మనస్సులో మెదలుతుంది. అది రెపరెపలాడే "ఎర్రగుడ్డ పేలిక"లా ముందుకు వస్తుంది. దట్టమైన పొదల్లోంచి "రెండు నిప్పు కణికల" రాలుతూ నిర్గమిస్తుంది. ఎర్ర నక్క విప్లవ రూపానికి సంకేతమైంది. మిగతావి దాన్ని అనుసరించిన కార్యకలాపాలు. ఎక్కడినుండో ఒక పక్షి వచ్చి బాటసారి చెవిలో పాట పడేసి వెళ్ళిపోతుంది. పక్షి స్వేచ్ఛకు ప్రతీకగా ఉంది. విప్లవం – స్వేచ్ఛ అనేవి కావ్యంలో కీలకాంశాలు. ప్రధానంగా విప్లవం సామాజికమైన అవసరాలలో లక్ష్యానికి సంబంధించింది. స్వేచ్ఛ వ్యక్తి ఆలోచనకూ వికాసానికీ సంబంధించింది. మార్క్సిజం మరియు కళ రెండూ ఒకదానికొకటి వ్యతిరేకం కావనీ పరస్పరం సహకారులనీ కవి అభిప్రాయం. కవిసేన మేనిఫెస్టోలో మార్క్సిజాన్ని కవిత్వంలో అనుభూతి కళ కనుగుణంగా సమన్వయించే ప్రయత్నం జరిగింది. విప్లవ సంస్కృతి కళా పార్శ్వాన్ని భావింపచేస్తూంది.

ఈ దేశంలో దున్నేవాడికి మిగిలేది, ఒక్క గుడిసె మాత్రమే! "ఒక సున్న" అంతకన్నా ఏమీలేదు. అతనికెలా బ్రతుకు గడపాలో తెలీకుండా ఉంది. ఉదయం

నుండి సాయంత్రం వరకు శ్రమిస్తూ దేశ సంపదకు హేతువైన శ్రమ జీవి నిశ్శబ్దంగా చీకటిలోకి వెళ్ళిపోతాడు. ఏమీ మాట్లాడడు. అతని జీవితం శాశ్వతంగా నేల కంకితమయింది. అతని పక్షాన నిలబడడం కవి బాధ్యత అని పదే పదే చెప్పబడింది. కవి ప్రేమించే వస్తువులు! పొలాలు! తోటలు! నాగలి! పంట! ఒక విధమైనవి. చెట్టు పూవు పండు! మరో విధమైనవి. ఒకమాట! పాట! ఇంకో విధమయినవి. ఈ మూడు విధాలకూ మనిషి అందునా శ్రమజీవి కేంద్ర బిందువు.

బిందువు నుండి రేఖలెన్నైనా అవతరిస్తాయి. ఇవి హృదయాన్ని స్పృశించే అనుభూతి గుణంతో కవిత్వ కళతో సాగుతాయి. పగలు! రాత్రి! వెలుగూ! చీకటి! అనే ప్రకృతిలో పరివర్తన రూపాలే వివిధ భావస్థానాల్లో చోటు చేసుకొని జీవితంలో కనిపిస్తాయి. అనేక విషమ స్థితులు తటస్థ పడతాయి! తుపానులు! యుద్ధాలు! ఎన్నెన్నో! కాలం ఆగదు! చరిత్ర నిలవదు! జీవితం ప్రవాహం వలె సాగుతూనే ఉంటుంది. ప్రకృతి – కాలం – జీవితం – సమాజం – చరిత్రతో కూడిన భావ జగత్తులో విశాలమైన ప్రాతిపదికపై దేశ సాంస్కృతిక తలంపై సామాజిక దృశ్య పరంపరతో కావ్య నిర్వహింపబడింది. గాలితో విమానంతో పక్షి పోటీ పడుతూంది. గాలి ప్రకృతి సంబంధమైంది. పంచభూతాల్లో ఒకటి విమానం. భౌతిక వస్తు సంబంధమైంది. లోహ నిర్మితమయింది. ప్రకృతి రూపంలో భౌతిక రూపంతో పక్షి పోటీపడడం విశేషం! ఇది మామూలు పక్షి కాదు. ప్రాచీన పక్షి! అంతరంగ పక్షి! సాక్షీభూతమయింది! మానవ నాగరికతను పరిశీలిస్తూంది. ఇదొక తాత్త్విక ప్రపంచం.

ఇక కావ్యంలో వస్తు విషయానికి వస్తే శ్రమజీవి చేతికి నాగలి "ఒక నాగు పాము" అయింది. పొలం "పనులు కాళ్ళకు సంకెళ్ళ"యినాయి. బాధలు తప్ప సౌఖ్యం లేదు. దరిద్రం తప్ప ఆనందం లేదు. ఇదీ ఈనాటి శ్రామికుల దుస్థితి. దీన్ని తొలగించేందుకు "కొడవళ్ళు" దాల్చిన చేతులతో విప్లవాభిముఖంగా నడవడమే శరణ్యంగా భావితమయింది. తాము పడే కష్ట ఫలాన్ని మరొకరు లాక్కొని అనుభవించడం వల్ల వీరి జీవితాలు శూన్యంగానే మిగిలాయి. దీన్ని సాధారణ పద్ధతిలో ఎదుర్కోవడం కుదరదు. అందువల్ల విశేష పద్ధతి ననుసరించవలసి వస్తూంది. కష్ట ఫలాన్ని దోచుకునేవారి పై ఆగ్రహంతో విజృంభించి తుద ముట్టించి విజయం సాధించే జన చేతనకు ఆహ్వానం పలుక బడింది.

కవిలో మార్క్సిజంలోని సమ సమాజ స్థాపనకై పోరాటం చేసే శక్తులకు

ప్రోత్సాహమిచ్చే వైజ్ఞానిక భూమికను ప్రదర్శిస్తూంది. స్వదేశ భావన కేంద్రంగా సాగిన ఈ కావ్యంలో ఈ దేశం భౌతిక స్వరూపం నాగలిలో రూపితమయింది. ఇది కర్షక జీవితానికి సంకేతంగా నిలిచింది. భూమిని నమ్ముకొని బ్రతికే శ్రమజీవి చుట్టూ ఉన్నది ప్రకృతి రూపమే! చెట్లు చెరువులు కొండలు నదులు పశువులూ పక్షులూ! ఈ వాతావరణం కావ్యానికి పుష్టిని చేకూరుస్తూంది. కవి ఎన్నుకున్న వస్తువు దృష్ట్యా ఔచిత్యాన్నీ పొందుతూంది.

కావ్యం చివరలో పురుషుడూ స్త్రీ – ప్రియుడూ ప్రేయసిగా చేసే ప్రయాణమూ ప్రసక్తమైంది. ప్రేయసి నుద్దేశించి కవి "నా దేవం నా ధరిత్రి అన్నీ నీలో దర్శిస్తున్నా" నంటాడు. ప్రేయసిలో ప్రేమ ఫలం మాతృత్వ లక్ష్యంగా కొత్త తరం ఆవిర్భావంగా భావన సాగింది. స్త్రీ అస్తిత్వంలో బహుముఖీనమైన పార్శ్వాలతో ఆకర్షించే వ్యక్తిత్వాన్ని గుర్తించడమూ జరిగింది. ప్రేయసిని సంబోధిస్తూ ఆమె ప్రియమైన రూపంలో తన దేశం ప్రజలు ధరిత్రి సర్వం దర్శిస్తాడు. ప్రేమకు స్థానమైన మనోరూపం నుండి మానవీయ రూపమూ ఆవిష్కృతమయింది. స్త్రీ పురుషుల ప్రేమ బంధంతో, సమైక్యంగా సమాజ ప్రగతిని సాధించే సంకల్పమూ సూచితమయింది. ఈ శతాబ్ది "క్రూరమైన సవాళ్ళను ఎదుర్కొనేందుకు లోపలి నుండి పిలుపు"ను గ్రహించడమే కాక, వాటిని జయించే నిశ్చయమూ ప్రకాశితమయింది.

కవి గుంటూరు శేషేంద్ర శర్మ "నా దేశం నా ప్రజలు" కావ్యం స్వేచ్ఛా కవిత్వంలో విశిష్టమైంది. వైజ్ఞానికోద్యమ స్ఫూర్తితో గాఢమైన అనుభూతి కళతో ఆకర్షణీయమైన భావరూపాల ప్రతీకల సంవిధానం కలిగింది. సామ్యవాద లక్ష్యంతో విప్లవ పథంలో ఈ దేశ సాంస్కృతిక సామాజిక చిత్రణ బింబంగా సమాలోచనకు ప్రేరేపిస్తుంది.

# II.8 అగ్ని నుండి ఆనందానికి : సామాజిక తాత్త్విక స్పందనం

"అగ్ని నుండి ఆనందానికి" కావ్యం ప్రతీకాత్మకమైంది. భౌతిక మానసిక అంతరంగ స్థాయిల్లో ప్రవర్తితమయింది. అగ్ని ఒకవైపున బహిరంతశ్శక్తి రూపాలకూ చేతనకూ పావిత్ర్యానికీ విశుద్ధికీ, మరోవైపున వినాశానికీ బాధకూ వేదనకూ తాపానికీ కోపానికీ వివిధ స్థాయిల్లో ప్రతీకగా ఉంది. కావ్యంలో అగ్నిమయం నుండి అధిగమించి భౌతికంగా వైయక్తిక సామాజిక క్షేత్రాలు దాటి మానసికంగా ఆనందమయం లక్ష్యంగా సృజనరూపం సమావిష్కృతమయింది. వస్తువు బహు విస్తృతమైన ప్రాతిపదిక కలిగింది. వివిధాంశాలతో సంశ్లిష్టమైంది. మానవ జీవితంలో పరిణమించిన భౌతిక మానసిక తాత్త్విక ఆధ్యాత్మిక విషయాలు ప్రసక్తమయినాయి. వాస్తవం మరియు కాల్పనిక తలాలపై వాటి ప్రభావమూ చిత్రితమయింది. జీవితంలో ఒక దానితో మరొకటి సంబంధం కలిగి ఉంటాయి. ఒకదానిపై మరొకటి ప్రభావాన్నీ నెరపుతాయి. అయితే కవిత్వంలో సంక్షిప్తతకూ గుప్తతకూ ప్రాధాన్యం ఉండడం వల్ల వివిధాంశాల సమాకలనంలో సంక్లిష్టత కవకాశముంది. సృజనదృష్టితో చూస్తే ఈ విధమైన వస్తు నిర్వహణానికి ఉపజ్ఞ అవసరమవుతుంది. "అగ్ని" వివిధ సందర్భాల్లో పలు అర్థచ్ఛాయల్ని పొందింది. అదే విధంగా "ఆనందమూ" వివిధ స్థాయిల్లో గుణాత్మకమైన భావరూపాల్ని కలిగింది. మనిషికీ జగత్తుకూ గల సహజమైన అనుబంధం నాగరక ప్రస్థానంలో విలువల్ని స్థాపించింది. మానవ జీవితం తనదైన విశిష్ట లక్షణాలతో పూర్ణతను పొందే దిశగా క్రమిస్తూనే ఉంది. మనస్సు కారణంగా ఇతర జీవుల నుండి ప్రత్యేకతను కలిగిన మానవుడు ప్రాధాన్యాన్ని కలిగి ఉండడం సహజం.

మానవునికి సంబంధించినంత వరకు భౌతికం – అభౌతికం, ఆంతరం – అతీతం, అధ్యాత్మికం – దివ్యం దశల్లో జీవితం ఒక పూర్ణం నుండి మరో పూర్ణానికి చేరుతూ వచ్చింది. మునుముందూ సాగుతుంది. దీని సమాప్తి ఆలోచన కతీతమైంది. సంకల్పం, హేతువు, అనుభవం, వివేకంతో ప్రయాణం ఎప్పటికీ ఉంటుంది. ఎప్పటికపు డెన్నో అవరోధాల్ని ఆటంకాల్ని అధిగమిస్తూ పోవడమూ జరుగుతుంది. ప్రతి వ్యక్తికీ వ్యక్తికీ భేదిస్తుంది. ఒకరి ప్రయాణం వలె మరొకరి ప్రయాణం ఉండదు. అందరి ప్రయాణోద్దేశం ఒకటే. ఇదే! అగ్ని నుండి ఆనందానికి. వ్యక్తి వికాసంతో సమాజ శ్రేయానికి, ఈ అగ్ని యొక్క స్థాయి స్థితి రూపాలు వేరు వేరుగా ఉంటాయి. ఆ ఆనందం యొక్క స్థాయి స్థితి రూపాలూ వేరు వేరుగా ఉంటాయి.

ఇది తొమ్మిది సర్గల కావ్యం అనేకమైన స్థితుల సంఘటనల దృశ్యాల సమాకలనం! ఇవి స్థూలంగా తాత్త్విక రేఖలతో సామాజిక రూపాన్ని పొందాయి. ఉపనిషత్తుల్లోని శాంతి మంత్రమో, ధర్మచక్రమో, శిలువో శాంతిని జ్ఞాపకం చేస్తూ ఉంటాయి. మనసును నిర్మలం చేయడానికీ జీవితాన్ని కాంతిమయం చేయడానికీ చరిత్రలో జరిగిన ప్రయత్నం ఎంతో! ఈ విధమైన తాత్త్విక స్పర్శ కావ్యానికి ప్రత్యేకతనిస్తూంది. సామాజిక తలంపై వర్తించే తొమ్మిది సర్గలలోనూ ఒక అంశాన్ని మరో అంశంతో కలిపే సూత్రం మానవీయ తాత్త్విక సామాజికతను పొందింది.

కావ్యం – ప్రకృతి నేపథ్యంతో సామాజిక గతి విశేషాలతో రూపొందింది. తాత్త్విక శోభనూ పొందింది. ప్రకృతి – జీవిత చలనం – సమాజగతి – తాత్త్వికతకు సంబంధించిన వివిధాంశాల సమాకలనం దృష్టికి వస్తుంది. ఇక సంవిధానానికి వస్తే (1) స్మృతి తలంపై దృశ్య చిత్రణం (2) వర్తమానంలోని అనుభవ తలంపై దృశ్య పరంపర సామాజిక కోణంలో రూపొందాయి. వాస్తవ సాదృశ్యంతోపాటు భావరూపాల ప్రతీకల నిర్వహణలో కాల్పనికతతోనూ కళాత్మకతను సంతరించుకుంది. విస్తృతమైన వస్తువులో వివిధాంశాల వల్ల బృహద్రూపాన్ని పొందింది. (1) సృజనోన్ముఖం (2) ప్రకృతి – జీవనబింబం (3) పురాభూమికలో (4) చరిత్ర శిఖరాల నుండి (5) కార్నివాల్‌లో (6) అభియానం (7) జీవన చలనం (8) సినేరియో (9) ఆతోన్మీలనంతో తొమ్మిది భాగాలు కలిగింది.

మొదటి సర్గ : పృథ్విపై "సృజనరూపం" – ఉన్మీలనంతో కావ్యం ఆరంభమవుతుంది. సంకల్ప బిందువు నుండి రేఖాచిత్రం వలె సాగింది. ప్రకృతితో మనిషి అనుబంధం స్థాపితమయింది. ప్రకృతిలో చైతన్య విలసనం! ఇదొక అద్భుత ప్రక్రియ! భౌతికమయిన జడరూపాన్ని చేతనతో అర్థవంతం చేస్తుంది. సృజనోన్ముఖం విస్తరిల్లింది.

"ధరణీ వదనం మౌనవ్రతం సడలింది

గగన నిటలంపై రహస్యం వెలిగింది" ఉదయ శక్తి మేల్కొంది. దివ్య కిరణం ప్రసరించింది. నలువైపుల ప్రవేశించింది. ప్రాణులూ మనుషులూ ఉన్న సోపాన క్రమంలో శిఖరభూతమైన మనిషి అస్తిత్వం వర్ణితమైంది. వాస్తవం నుండి కల్పనకూ అక్కడినుండి ఆత్మ దర్శనానికీ మానవ జీవితం మహనీయ ప్రస్థానాన్ని అభిలషించింది. "సంకల్పం ఉదయ పుష్పం వలె" వికసించింది. దీన్ని వహించే శక్తి మనసుకే ఉంది. భౌతికమైన మానసికమైన ఆత్మగతమైన స్థితులు క్రమంగా సంపూర్ణత వైపు

ప్రయాణింపజేసాయి. సంపూర్ణ సిద్ధికై ఆలోచన అన్వేషణ అనుభూతి దర్శనంతో ప్రయత్నమూ సాగింది. ఇది సాధారణమైన మనిషిలో కొత్త రూపాన్ని ఆవిష్కరించింది. సమాజమూ వ్యక్తిత్వమూ పెనవేసుకున్న స్థితి లక్ష్యానికి విస్తృతిని చేకూర్చింది. వ్యక్తి సాంస్కృతిక పరంపరలో భాగమై పోవడమూ జరిగింది.

రెండో సర్గ : ప్రకృతి గతమైన బంధంతో ప్రభావంతో విలసిల్లే మానవ జీవితం గురించి చింతన కలిగింది. "ప్రకృతీ జీవన బింబం." ప్రకృతిలో మార్పులూ జీవితంలో పరివర్తనమూ ప్రతి ఋతువు ఆవశ్యకత వర్ణితమయింది. గ్రీష్మంలో ఎండలకు నీరు ఆవిరి అవుతుంది. మార్పుతో మేఘమై పైకి లేస్తుంది. ప్రయాణం చేస్తూ భూమిని రసమయం చేస్తుంది. గ్రీష్మం లేకపోతే వర్షం లేదు. ఇది ప్రతి ఋతువుకీ వర్తిస్తుంది. పూర్వ స్థితిలో మార్పుతోనే మరో స్థితి ఏర్పడుతుంది. అలాగే జీవితమూ. ఇదో వరుస. ఈ క్రమంలో దేన్నీ తప్పించే ప్రసక్తి లేదు. ఇది భౌతిక తలంపై జరిగేది. మానసిక తలంపై మనిషిలో గుప్తగా అదృశ్యంగా ప్రభావం నెరపుతుంది. బయటి రానిది అవచేతన (sub-conscious) లో రహస్యంగా దాగి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఏదో కొంత బయట పడుతుంది.

మనోభూమిక స్వరూపం వేరు. చలిలో ఆలోచన చల్లబడదు, ఆరిపోదు. శక్తి అనేది భౌతికంగానే కాక ఆలోచనలోనూ క్రియలోనూ ఉంది. శక్తికి పరిమితి నియతి విరామం ప్రసరణం ఉంటుంది. లేకపోతే ప్రమాదం వాటిల్లుతుంది. సముద్రం చలిస్తుంది. మునుముందుకు వెళ్ళబోతున్నట్లుంటుంది. కాని ఒడ్డునే ఆగిపోతుంది. వెనక్కు తగ్గుతుంది. లేకపోతే సర్వం బీభత్స దృశ్యమే. అదే విధంగా సమాజమూ. రాత్రి విశ్రాంతికీ, పగలు సక్రియకూ ప్రతీకలుగా మలచబడినాయి. చారిత్రక సామాజిక పరంపరతో విశాలమైన జీవితం మహా ప్రకృతికి బింబంగా సమాంతరంగా ఆలోచనకందుతుంది. ప్రకృతికీ మనిషికీ బంధం శాశ్వతమైంది. అయినప్పటికీ ప్రాధాన్యంలో మనిషిలో స్వతంత్రమైన అస్తిత్వ సూచనతో సర్గముగుస్తుంది.

మూడో సర్గ చారిత్రక మానవ మనస్తత్వ పరమైన విషయాలపై నిర్మితమయింది. "పురా భూమిక"తో విలసిల్లింది. కాలి బాటన మొదలైన జీవితం అడవులూ కొండలూ నదులూ మైదానాలూ సముద్రమూ దాటింది. వీటి విశేషానుభవముద్రలు పురారూపాలుగా నిలిచాయి. మనో జగత్తులో నిలిచి

ప్రభావాన్ని నెరపడమూ గమనించవచ్చు. ఆకు రాలి ఎండి పోయిన చెట్టు సమయంకై వేచి ఉంటుంది. పురానుభవ రూపమూ స్మృతి నిలయంలో నిలిచే ఉంటుంది. కాలంపై సమయం సమయంపై వీలును పునర్దర్శితవుతుంది. కొత్త ప్రయోజనాన్ని కలిగిస్తుంది. వ్యక్తి స్థాయినుండి సమాజమూ మానవ జాతి వరకూ విస్తరిల్లి నిలుస్తుంది. జీవన రుచికి ఉగాది సంకేతం. ఉగాది ఆగమనంతో పరివర్తనం సృజన గతిని సూచిస్తుంది. ఈభాగంలో మనిషిలో పురా భూమికను తలపింపజేయడమే కాక మరో రూపంలో ప్రత్యక్షాన్నీ ఉపయోగాన్నీ దృష్టికి తేవడం జరిగింది. శుష్కమైన భస్మమైన రూపం నుడి రాగంతో అలరించే పునర్నవం. ఈ భాగం భౌతిక మానసిక పురాబూమికల దృశ్యాలతో కూడింది.

నాలుగో సర్గ : "చరిత్ర శిఖరాల నుండి" మనిషితో మనిషి సంబంధాలు సామాజికావసరాలతో ప్రయోజనాలతో ఎటువంటి పరిణామాలకు దారి తీసేదీ చిత్రిమైంది. సామాజిక తలంపై ఆవిష్కృతమయింది. నదీ తీరాల్లో మొదలయిన మానవ చరిత్రలో రూపుదిద్దుకున్న సంస్కృతి మైదానాలకు విస్తరిల్లింది. ఆ తరువాత మెట్ట ప్రాంతాలకు చేరింది. మానవ ప్రగతిలో ఒక్కొక్క శిఖరారోహణం సామాజిక ప్రత్యేకతలతో చారిత్రకమైంది. మనిషిలో నిలిచే ఉంటుంది. స్మృతిలో గాథల్లో గ్రంథాల్లో కళల్లో ఆచార వ్యవహారాల్లో దైనందిన జీవితంలో శిఖరాలు విశ్లేషణకందుతాయి. (1) అరణ్యంలో నివాసం శత్రువుపై ఉద్రేకంతో చేసే సాహసకృత్యం. (2) జనపదంలో ఆవాసం శత్రువుపై వెనుకముందు ఆలోచనతో చేసే వీరకృత్యం, (3) నగరంలో నివాసం శత్రువుపై వివేచనతో ప్రయోజనంతో చేసే రణవ్యూహకృత్యం నాగరకతలో మార్పుల్ని సూచిస్తాయి. ఈ లక్షణాలు నేటి సమాజంలోను మిగిలే ఉన్నాయి.

మానవ జీవితంలో ప్రవేశించిన మతం – భౌతికమైన అవసరాలతో పాటు ఆధ్యాత్మికమైన శాంతికీ ఆనందానికీ హేతువయింది. ఒకే వస్తువు అవసరాల్ని బట్టి వేరు వేరు ప్రయోజనాల్ని వహిస్తుంది.

> "చీల్చబడిన వెదురు నిశితముఖంతో బాణమై వీర విహారం చేస్తుంది
> ఖండితమయిన వెదురు నవయోగంతో వేణువై స్వనిస్తుంది"

"వీర విహారం" క్షాత్ర జగత్తునూ "వేణు స్వనం" కళా ప్రపంచాన్ని స్మరింపజేస్తాయి. ఈ శిఖరాల్లో సామాజికాంశాలూ సామన్య జన గళమూ విస్కృతం

కాలేదు. చరిత్ర స్థూలంగా పునరావృతమైనట్లు కనిపించినా సూక్ష్మంగా పరిశీలిస్తే ఎన్నో కొత్త స్థితులూ కొత్త సమస్యలూ కొత్త సాధనాలూ కొత్త పరిష్కారాలూ దృష్టికి వస్తాయి. వివిధ దశల్లో ప్రత్యేకతల్ని కలిగిన దృశ్యాలనేకం కన్పిస్తాయి. ఈ పరిణామంలో "ఆయుధం"పై శాంతి చిహ్నంతో మొదలయిన "జైత్రయాత్ర"లూ కనిపిస్తాయి. రమణీయ దృశ్యాలూ ఉన్నాయి. రక్షణతో పాటు శిక్షకూ పరిస్థితులేర్పడినాయి. క్షాత్రం ఘనీభవించిన కోటలూ రక్షణ నిలయాలయినాయి. రాజనీతిని ప్రదర్శించే వ్యూహ ప్రతివ్యూహాలూ ఏర్పడినాయి. చరిత్రలో విషాద ఖండం సైతం స్మృతిలో మధుర బింబంగానే నిలుస్తుంది.

కాలం గడచిన కొద్దీ చరిత్ర పాతబడి కల్పనతో పురాణ రూపాన్ని పొందుతుంది. కల్పనలో చరిత్ర గోరంతలుగానే మిగులుతుంది. యుగం నుండి యుగానికి రణ పతాకతో మానవుడు శాంతికై అన్వేషణ సాగించడం ఉన్నదే! ఏ చరిత్ర అయినా సామాన్యుడు విస్మరింపబడడం విచిత్రం. జనావళికి ప్రజాస్వామ్యం స్వేచ్ఛ సమానత్వం సామాజిక న్యాయం విషయంలో కొత్త యుగం ఆరంభమయింది. ప్రభుత్వ కర్తవ్యం ఎవరినో శిక్షించడానికో మసి చేయడానికో కాక అన్ని విధాలా వ్యక్తిని కాపాడే దిశలో ప్రవర్తమాన కావడం అవసరం. లోహంతో చేయబడినా స్వర్ణంతో చేయబడినా శృంఖల ప్రయోజనం ఒకటే! స్వేచ్ఛను బంధించడానికే! అందువల్ల "స్వేచ్ఛ"కు ప్రాధాన్యంతో ప్రజాస్వామ్య భావన కొత్త సమాజాన్ని దర్శింప జేసింది. ఇది గొప్ప చారిత్రక పరిణామంగా చెప్పొచ్చు.

ఐదోసర్గ : "మ్యూజియంలోకి" ఇది గత స్మృతుల నిలయంలోకి ప్రవేశాన్ని చిత్రిస్తూంది. చరిత్రనూ సంస్కృతినీ తలపించే వస్తువులు భద్ర పరచిన "మ్యూజియం", గతంతో సంబంధాన్ని స్థాపిస్తుంది. మనిషిలో యుగాల తరాల అనుబంధాన్ని మేల్కొలుపుతుంది. ఒక విధంగా మానవ జీవితాన్ని సమాజాన్ని స్పందనతో ఆలోచనలో పునర్నిర్మిస్తుంది. మ్యూజియంలో కన్పించే వస్తు జాలం ఒక అద్భుత ప్రపంచాన్ని అనుభూతిలో భ్రమింపజేస్తుంది.

"ఎక్కడెక్కడివో బొమ్మలు! వస్తువులు మ్యూజియంలో
ఎప్పుడెప్పుడో జారిపోయిన మనుషుల గుర్తులు"

వీటి ఆధారంగా హేతు దృష్టితో పూర్వ రూపాన్ని దిద్దుకోవడం జరుగుతుంది. ఎంతో కోల్పోయిన చెదరిన మిగిలిపోయిన చిహ్నాలతో వివిధాంశాల్ని సమకూర్చుకొని

ఊహాలో రూపం సిద్ధం చేసుకొని తృప్తిపడవలసి ఉంటుంది. “ఇది ఎన్నటికీ సమాప్తికానిది”. కాలం గడచే కొద్దీ కొత్తవి చేరుతూ ఉంటాయి. అన్వేషణ సాగే కొద్దీ కొత్తవి లభిస్తూ ఉంటాయి. ఈ సర్గ గతంలోని ముక్కలు ముక్కలుగా దొరకే చారిత్రకమైన విశేషాలయిన అంశాల్ని ఒకచోట చేర్చి వర్తమాన కోణంలో వివిధ పార్శ్వాల్ని దర్శింపజేస్తూంది. ఇది చాలా విలువైంది. మనిషి శక్తినీ యుక్తినీ తలపుకు తెస్తుంది. మ్యూజియం మెట్లు దిగగానే ఎదురుగా సంపూర్ణమైన వాస్తవ ప్రపంచం అనుభవానికి వస్తుంది. మ్యూజియం వెనకబడుతుంది.

ఆరోసర్గ : “అభియానం” మానవ జాతి ప్రస్థానాన్ని చిత్రిస్తూంది. స్నేహంతో ఎదురైపోవడమూ వైరంతో దండెత్తడమూ పూర్వం నుండి వస్తూన్నదే. ఈనాటికీ ఉన్నది. ఈ చర్యలలో ఎన్నో నిర్మాణాలు తలెత్తాయి. మరెన్నో విధ్వంసమయ్యాయి. రాజ్యాలు ప్రభవించాయి, వినాశనమయ్యాయి. అభియానం మానవ జీవితంలో క్రియాత్మక రూపం. “ఆశా స్తంభాలపై కథా నిర్మాణాల్ని” గావించింది. మనుషుల్ని మట్టి నుండి కల్పనలో నడిపించింది. లక్ష్యాలవైపు పయనింపజేసింది. అభియానంలో బలం ధనం విజయం కీర్తి అన్నీ కొత్త ప్రపంచాన్ని చూపాయి.

అర్ధరాత్రి అన్వేషణలో బుద్ధుని నిష్క్రమణం, రాళ్ళ వర్షంలో క్రీస్తు ముఖంలో ఉత్ఫుల్లమైన ప్రకాశం, ఎందరివో త్యాగాలు ప్రేమ ఉదారత శాంతి మార్గాలు తటస్థపడతాయి. ఏ దేవత బొమ్మ గీసినా మానవ రూపంతో, ఏ ఊహ చేసినా మానవనైజంతో అడుగు వేసినా మానవ యానంతో, సర్వం మానవీయమై గోచరిస్తుంది. దేవతా ప్రపంచమంతా మానవ మనోరూపబింబమే. ఏకాంతం నుండి సమష్టికీ వ్యక్తి నుండి సమాజానికీ పయనింపజేసింది. వివిధోద్యమాలూ, హక్కులు, డిమాండ్లూ విభిన్న పతాకల రెపరెపల మధ్య “బ్లేడ్ అంచు పదునుతో ఎగసే నినాదాలె” దురవుతాయి. వీటి వెనుకనే ఉగ్రవాద చలనమూ కనిపిస్తుంది. రాజ్యాన్ని శాసనాన్ని వ్యవస్థను బద్దలు చేసే ఉద్రేకంతో హింసకు దారితీసే కృత్యాలూ లేకపోలేదు. ఎవరికి వారు తాము “వేసే అడుగులే గమ్యానికి చేరుస్తాయ”ని విశ్వసింపజేస్తారు. దారిలో పదచిహ్నాలు! ఒక దానిలో మరొకరివి కలిసిపోయి వాటిని విడదీయడం కష్టం. సూర్యుడు పై నుండి మనిషిలో అంతరంగాన్ని వివేకాన్ని మానవతను జ్ఞాపకం చేస్తూనే ఉన్నాడు. ఎప్పటికీ అందరిలో నిలిచే సత్యం ఒకటే! దాన్ని గుర్తించడంలోనే ఉంది భేదం. రాత్రి చంద్రుడు “టేబిల్‌పై ఐస్‌క్రీం కప్పు”లా ఆకర్షిస్తాడు! ఇది

అందని కోరికకు ప్రతీక. అభియానం ఆగదు. జీవితంపై అభిలాష మాయదు. అంతరంగం అదృశ్యం కాదు.

ఏడో సర్గ : "జీవన చలనం" అభియానాన్ని బట్టి స్పందమానమయింది. ఏదో ఉన్నంతలో కాస్త సుఖంగా గడుస్తుందనుకుంటే అర్ధరాత్రి భూకంపం, ఉదయం లేచే సరికి తుఫాను! పట్టపగలు వీధిలో విస్ఫోటం! మనిషిని దిగ్భ్రాంతికి గురి చేస్తున్నాయి. అటు ప్రకృతికి సంబంధించినవీ ఇటు సమాజగతమైనవీ విపత్తులు! విషాద దృశ్యాలతో కదలిస్తున్నాయి. ఎక్కడ లేని భయం – "పగలు తలపై వెనక నుండి దెబ్బతో రాత్రి గుండెలో దిగిన కత్తి"తో కళ్ళ ముందు తాండవిస్తోంది. అశాంతి మధ్య అందమైన "ప్రభాత పద్మం – అనల గుచ్ఛాన్ని" తలపిస్తోంది. ఎత్తిన చేతులతో బాధా రవంతో ప్రజలు! ఎవరికి వారు స్వార్థంతో "పంజరంలో చిక్కిన చిలుక భాష" మాట్లాడేరు. ప్రతి పంజరానికొక ప్రపంచం! ఇందులోనే జీవన చలనం! పంజరం నుండి స్వేచ్ఛను పొందే ఆలోచనయే లేదు. ఆ ఆలోచన రావడం ఒక అదృష్టమే! ఈ స్థితిలో సంక్షుబ్ధ చిత్రం తప్ప! ఏముంటుంది. ఎంతటి ఆర్తిలోను బాధలోను మానవత ఆశారూపం మసకబారి కూడా కనిపిస్తూనే ఉంటుంది. ప్రజాస్వామ్యం ఆశా పుంజంగా ఉన్నా దీని విజయం జనుల వివేకంపై చైతన్య స్థాయిపై ఆధారపడింది. జన చలనం మహా సముద్రాన్ని తలపిస్తోంది. మథనంతో సముద్రం నుండి రావలసినవి ఇంకా మిగిలే ఉన్నాయి. సమాజ చలనం ఆగదు. మానవ ప్రగతికి సమాప్తి లేదు. మానవతకు మరణం లేదు.

ఎనిమిదో సర్గ : "మనోభూమి సినేరియో" జీవితంలో మనోరూప ప్రాధాన్యాన్ని సూచిస్తోంది. కావ్యం మొదటి నుండి చివరి వరకూ మనస్తత్వ విశ్లేషణం అంశంగా ఉన్నా ఈ భాగంలో వివిధ కోణాల్లో ప్రసారితమయింది. ఇందులో భావరూపాలు ప్రతీకలు వస్తువుకు కళాత్మకతను చేకూరుస్తున్నాయి. శరీరం మట్టిలో కలిసేదయినా ప్రాణమున్నంతవరకూ ఆసక్తి ఏదో ఒక రూపంలో బంధిస్తూనే ఉంటుంది. ఏ ఋతువు ప్రభావం లేకుండా ప్రకృతి లేనట్లే, ఏ మనోనుభవ స్థితి లేకుండా జీవితమూ లేదు.

పక్షి రెక్కల ధ్వని కోసం ఆకాశం, మానవతా గంధం కోసం ఆలోచన సుమదళం కోసం విగ్రహాలూ ఎదురు చూస్తాయి. మనిషి జీవితమంతా మనస్సుతోనే రూపొందుతుంది. మనోభూమిలో సినేరియో మనిషిలో ఉన్న మానసిక దృశ్య

జగత్తు చిత్రణ మనవచ్చు. ఎంతటి భయ శిఖరమైనా పైన ధైర్య పతాక ఎగరడం ఇందులో విశేషం! ఇది సినేరియోకు ఎక్కడలేని సంకల్ప శక్తిని ప్రసాదిస్తూంది.

తొమ్మిదో సర్గ : "ఆత్మోన్మీలనం" ఈ కావ్యానికి చివరి తేజోరేఖ. జడమైన వస్తువు సృజనశక్తితో ఉన్మీలితం కావడం ఒక విశేషమైతే అది భౌతిక మానసిక దశలు దాటి ఆత్మ వికాసాన్ని పొందం ఒక మహనీయదశా విశేషం. సృజన పరంపర ఆగి పోకూడదు. నిష్క్రియత్వం రాకూడదు. పరిణామచరిత్రలో ఒక మజిలీ నుండి మరో మజిలీకి ప్రయాణం సాగవలసిందే. చేతనతో జీవిత చలనం సమాజ గమనం అవసరమే. అది ఆత్మాభిముఖంగా అంతరంగ ప్రకాశంతో అనుభవానికి రావడం ముఖ్యం. ఇదీ కావ్యంలోని ఆంతర్యం. ప్రతి క్షణం కిరణం కత్తిలా కాకుండా ప్రతి మనిషినీ పుష్పమై అలరించాలనే! పరిపూర్ణతలోకి వ్యక్తీ సమాజమూ అధిగమించాలనే! శాంతిని వరించాలనే, కావ్యం తాత్త్విక స్పందనతో సామాజిక చిత్రణంతో ప్రేమ కరుణ శాంతి లక్ష్యంతో మానవీయ భావనతో సమాపూర్ణమయింది.

కావ్యం చివర "కెమెరా ఫోకస్"లో "ఇదొక టెలిస్కోప్ దృశ్యాల ఆల్బం"గానూ "టెక్నికళతో రూపొందిన కావ్యం"గానూ అభివర్ణితమయింది. కవి దీన్ని "నిఖిల మానవ క్రాంతి పుంజం"గానూ జనసమూహ "మనోబింబంగా"నూ పేర్కొన్నమాట విశ్వజనీనత్వాన్ని స్థాపిస్తూంది. మాదిరాజు రంగారావు "అగ్ని నుండి ఆనందానికి" భౌతికం నుండి మానసికాన్ని ఆవరించి ఆత్మవైపు పయనించిన కావ్యం స్వేచ్ఛా కవిత్వంలో తాత్త్విక స్పర్శతో సామాజిక చిత్రణంతో పేర్కోదగిన విశిష్టమైన కృతి.

## II.9 పడగెత్తిన ఉదయం : వర్తమాన స్థితి చిత్రణం

ఒక వ్యక్తి జీవితంలో ఒక రోజు జీవితానుభవ స్థితుల చిత్రణం "పడగెత్తిన ఉదయం". స్వేచ్ఛా కవిత్వంలో వస్తుపరమైన ప్రయోగాత్మక సృజన రూపం. ఇరవై నాలుగు గంటల కాలం (ఉదయం నుండి మరునాడు ఉదయమయ్యేంత వరకు) లో ఎదురైన సమాజ రూపం. సమాజం గురించి చింతనం ప్రకృతి నేపథ్యంలో వెలసింది. సర్వ సాధారణమైన అంశాల్ని మాత్రమే కలిగింది, ఇదీ దీని ప్రత్యేకత. జీవిత చలనంలో వ్యక్తి కేంద్రంగా అనుభవ వలయాలు ఒకదాని తరువాత మరొకటి స్థితి చిత్రణంలో తరలుతాయి.

కాల గమనం మానవ క్రియా సహితమైంది. జీవితంలో జరిగే స్థితులు కాలం చేతనే నిర్ణీతమవుతాయి. కాల విభజనలో మార్పులు జీవితాని కన్వయించడం జరిగింది. ఒక రోజు కాల విభజనలో చిన్న విభాగం. దానికది సంపూర్ణమైంది. ఇకపోతే సృజన రూపంలో భౌతికమైన భూమికలో నుండి మానసికమైన భూమికలోకి క్రమించే సూత్రాకృతి జీవితంలో వాస్తవానికి సంబంధించింది మాత్రమే. అభివ్యక్తి విధం ప్రత్యక్ష పద్ధతిలో ఉంది. భావరూపాలు (images) నిజ జీవితానికి సన్నిహితంగా తీర్చబడినాయి. ప్రతీకల (symbols) ప్రమేయం ఉంది. ఇవి భావ సాంద్రతపై దృష్టితో నిర్వహణ కళలో భాగంగా విలసిల్లాయి.

కాలం అనేది ప్రకృతికి సంబంధించిన రూపం. మానవ జీవితంలో భౌతికంగానూ మానసికంగానూ అనుభవానికి వస్తుంది. ఒక జీవిత కాలంలో రోజు స్వల్పమైన విభాగం. అన్ని రోజుల్లోనూ చాలవరకు ఉమ్మడి సాధారణాంశా లుంటాయి. కొన్ని మాత్రం దేనికదిగా పేర్కోదగిన విశేషాంశాలుంటాయి. కావ్యం సామాన్య తలంపై నడచింది. సృజన దృష్టితో అవసరమైన కవితా ముద్రల్ని పొందింది. (1) ఉదయం (2) మధ్యాహ్నం (3) సాయంకాలం (4) రాత్రి రూపాలుగా విభాజితమయింది. రాత్రి అనంతరం ఉదయ స్ఫూర్తితో కావ్యం ముగుస్తుంది. నాలుగు రూపాలూ నాలుగు ఋతువుల ప్రభావ సూచనతో మానవ జీవితంలో స్థితిగతుల సంవిధానాన్ని పొందాయి. ఇదీ వస్తు నిర్వహణంలోని శిల్ప విశేషం. ఇది కాల రూపాలూ ప్రకృతి నేపథ్యంతో జీవిత చలనం సమాజంతో కలసి ఏర్పడిన సృజన రూపం. మానవతా స్పందనతో పరిపూర్ణతను పొందింది.

(1) ఉదయం ఆశల్ని విప్పుతుంది. వసంతస్ఫూర్తిని పొందింది. ఆనందానికి హేతువయింది. ప్రతి ఉదయం "ఒక తెల్లని కొత్త పుటను" ఆరంభిస్తుంది. ప్రకృతిలో మెత్తని వెలుగుతో మనస్సులో వెచ్చని ఊహ కదలుతుంది. (2) మధ్యాహ్నం శ్రమ జీవనంతో శిఖరాకృతి పొందుతుంది. వేడెక్కిన ఉత్సాహ శక్తితో క్రియాత్మకతకు పదును పెడుతుంది. ఇది "గ్రీష్మ స్పర్శ"ను పొందింది. జీవితానికి వేగాన్ని సంతరింపజేస్తుంది. ధైర్యాన్ని నిలుపుతుంది. (3) సాయంకాలం వాతావరణాకి చల్లదాన్ని ఇస్తుంది. "మేఘాగమన" స్ఫూర్తినిస్తుంది. విరామానికి ప్రేరేపిస్తుంది. శ్రమను మరచి ఇంటివైపు దారి తీస్తుంది. పగలు వెలిగి వెలిగి సూర్యుడు కూడా విశ్రాంతి నభిలషిస్తున్నట్లుంది. కష్టాన్ని మరిపించేదిగా ఉంటుంది. (4) రాత్రి–పూర్తిగా విశ్రాంతి నిలయం, నిద్రా సమయం. శరత్ స్పృహనిస్తుంది. స్వప్న జగత్తుకు దారులు తీస్తుంది. ఈ సమయం మనోరూపం పగలు సూర్యుని వెలుగులో కన్నా చీకటిలో చంద్రుని వెలుగులో భిన్నంగా ఉంటుంది. మనిషిలో ఆలోచనకు పురికొల్పుతుంది. అతీతంవైపు ఆలోచన మరలుతుంది. ఈ నాలుగు స్థితుల స్థూలమైన అనుభవం వెనుక నుండి అంతర్విశేషాలూ దృష్టికి వస్తాయి. స్వేచ్ఛా కవితా యుగం తొలి నాళ్ళలో విశిష్ట సంవిధానంతో వెలువడిన కావ్యం.

మొదటి భాగం "భూమి మేల్కొంది" – ఉదయ సంకేతంతో ఆరంభమయింది. జనచేతన కలిగింది. "నిన్నటి రాజరికం నుండి నేటి ప్రజాస్వామ్యం వలె" దేశ స్వాతంత్ర్యానంతర స్వేచ్ఛా యుగాన్ని సూచిస్తూంది. వెలుగు స్వేచ్ఛకు సంకేతం. గాలులు వడి వడిగా "ప్రజా ప్రతినిధుల వలె" కదలుతున్నాయి. నదులు "యువ చైతన్యం వలె" పరుగులు తీస్తున్నాయి. ఈరోజు పై మమత "వికసించిన మందారం వలె" ఉంది. ఉదయంతో ఏర్పడిన జీవిత చలనం సామాజిక గమనం మానసికమైన అనుభూతితో కాల్పనికతను పొందాయి. ప్రతి భావ రూపంలో ఆధారం వాస్తవమే. ఇది హ్లాదంగా ఎదురు కావచ్చు. కఠోరంగాను తటస్థ పడవచ్చు. సమయాన్ని బట్టి అంటే ఉదయం సంతోషకరమైందని స్థితులు సంతోషకరమైనవే ఉండవు. బాధ వేదన విషాదం కలిగించేవీ ఉండవచ్చు. జీవితంలో ఏదైనా ఎప్పుడైనా సంభవించవచ్చు. ఇంతకు ముందే చీకటి "దోషి"లా తప్పుకుంది.

ఈ ఉదయం ఏం జరిగేదీ చెప్పలేం. ఉదయం మెట్లెక్కుతూంది. నీడలు "డిఫెక్టర్ల వలె" తలెత్తుతున్నాయి. ఇది ప్రస్తుత రాజకీయ వ్యవస్థలోని అనిబద్ధతనూ అనైతికతనూ వ్రేలెత్తి చూపిస్తూంది. నిజానికి వెలుగు కొత్తదేమీ కాదు, ఈనాటిదీ

కాదు. కాని సమయ స్థితి భేదం వల్ల అనుభవంలో విశేషాన్నీ కొత్తదనాన్నీ పొందుతూంది. "మృత్యువు చాచిన చేతుల్లా ఎదురుగా ఎండిన చెట్టు కొమ్మలు", "ఆకు రాలిన నేలపై, నీరులేని బావి ప్రక్కగా పయనించే వ్యక్తి" – దృశ్యంలో కఠోరమైన వాస్తవం కనిపిస్తుంది. "స్టీలు చెంచా నోట కరచుకొని పైకెగిరిన కాకి కొరుకుడు పడక ప్రక్క ఇంటి కప్పుపై వదలి"వేయడం. పిల్లలు మూగడం, పెద్దలు చేసే ప్రయత్నం అన్నీ జీవితంలో జరిగేవే. కాలం గడవదనే ప్రశ్నలేదు. ఎవరి కోసమూ ఆగదు. ఉదయం అపుడే "అంటించిన సిగరెట్‌వలె ఉంది". ఇదో కొత్త ఉపమానం, ఆధునికమైంది. జీవిత చలనంలోది. ఒక వ్యక్తి నిరుద్యోగి. తీరిక బాగా ఉన్నట్లే కనిపిస్తుంది. కానీ ఉద్యోగంకోసం తీరిక లేకుండా తిరుగుతాడు. చిన్న హోటల్‌లోకి ప్రవేశిస్తాడు. ప్రక్కనే తేనీరు సేవించే శ్రమజీవి రిక్షావాలా, పైన అక్కడక్కడా "చిన్ని చిన్ని మబ్బు ముక్కలు సూర్యుణ్ణి హరించే" ప్రయత్నమూ లేకపోలేదు. ఇది నిష్ఫలమవుతుందని అందరికీ తెలుసు. జీవితంలో ఇదే జరుగుతుంది. సూర్యుడు మనిషిలో పైస్థాయిలో అంతరంగానికీ చేతనకూ క్రింది స్థాయిలో మానవతా రూపానికీ ప్రతీక.

"పడగెత్తిన ఉదయం" – కావ్యం పేరు. మనిషిలో క్రియాత్మక రూపానికీ ఉత్సాహ రూపానికీ గమన రూపానికీ వెలుగులతో విలసిల్లే కాలానికీ వివిధ సందర్భాల్లో ప్రతీకగా విశ్లేషణకందుతుంది. జీవితమెంత ఆకర్షణీయమో అపుడపుడూ అంత భయావహంగానూ దృశ్యమానమవుతుంది. జీవితంలో అనుకున్నది జరగకపోతే కాలాన్ని నిందించడం పరిపాటి. కాలతో పాటు ఏదో విధంగా పయనించాలనే ప్రతి వ్యక్తి అనుకొనో అనుకోకుండానో ప్రవర్తించడం జరుగుతుంది.

నలుగురూ కలిసేచోట హోటల్‌లో ప్లాట్‌ఫార్మ్‌పై రైల్లో బస్‌లో మరో చోట. "న్యూస్‌పేపర్ ఇటు ఇస్తారా?" మాట వినిపిస్తుంది. కదలే జనం నొసళ్ళపై ప్రశ్నలు! ఎవరికీ తీరిక లేని సమయం. ఎవరితో ప్రత్యక్ష పరిచయం లేకపోయినా అందరూ తెలిసినట్లే ఉంటుంది. కారణం అందరిలో కన్పించే మానవీయం ఒకటే. భయ భయంగా రోడ్ క్రాస్ చేసే వ్యక్తీ! బస్ ఫుట్‌బోర్డ్‌పై పయనించే మనుషులూ! బస్ కోసం విసుగుతో వేచి ఉన్న పెద్ద మనిషీ! హాస్యప్రియులు మిత్రులూ! అంతా కోలాహల ప్రపంచం! ఉద్యోగానికి బయలుదేరిన యువకుడూ! అతడు "ధరించిన సూట్‌లా ఎండ రెపరెప"లాడుతూంది. మెడలో "నెక్‌టై"లా గగనంలో మబ్బుముక్క వ్రేలాడుతూంది. ప్రతి వ్యక్తికీ కనీస స్థాయిలో తిండి, గుడ్డ, నివాసం – ఏర్పాటు

తప్పనిసరిగా జరగాలన్న కోరిక పెద్ద పెద్ద విషయాల ముందు ఇది చాలా చిన్నదే. అయినా జీవితంలో సమాజంలో దీని అవసరం అన్నిటికన్నా ముఖ్యమైంది. ఇతర పార్శ్వాలపై దీని ప్రభావం ఎంతో ఉంటుందన్న వాస్తవమూ మరచి పోకూడదు. ఏమయినా మానవత లోపించిన సమాజం ఎన్నటికీ పరిపూర్ణత సాధించలేదు. చూస్తూ చూస్తూ ఉండగానే ప్రొద్దెక్కింది. "దేశంలో ప్రణాళికల అంకెల సైజులో" అన్నమాట దేశంలో అభివృద్ధి ఏ ప్రమాణాల్ని చేరుకుందో చతురంగా సూచితమయింది.

2. రెండో భాగం : "చెలరేగే గ్రీష్మం" – మధ్యాహ్నం. "తిరగబడిన ప్రజ వలె ఉంది. వర్తమాన సమాజంలో సమస్యల పరిష్కారానికై హక్కులకై సంఘర్షించే ప్రజా చైతన్యాన్ని బింబిస్తుంది. బయటికి వస్తే "కళ్ళు బయర్లు క్రమ్మే" క్షితిజం! "అగ్ని చిత్రంలా ఉన్న ఆకాశం!" – భావరూపాల్లో అప్పుడున్న స్థితి వ్యజ్యమానమవుతూంది. నివాసం లేని బీద ప్రజలు దొరకిన నీడనాశ్రయిస్తున్నారు! రోడ్ ప్రక్కన "పాతిన గొడుగు క్రింద చెప్పులు కుట్టే ముసలి మొగం!" ప్రక్కనే "నీటిచుక్కకై మొగం వాచి ఉన్న చెట్టూ", ఇలా ప్రకృతి భూమికపై సాధారణ జీవితం చిత్రితం కావడం ఇందులో విశేషం.

ఎండ "లక్షాధికారి నాయకుని మెడలో జరీ కండువా వలె" ఉంది. పేదవాడికెంత కష్టానికి కారణమో బాగా ఉన్న వాడికంత అలంకార యోగ్యంగా పరిణమిస్తుంది. ఇది ధన స్వామ్యం తీరుకు అద్దం పడుతూంది. గాలి మాత్రం ఏదో ఒక విధంగా వీస్తుంది. ఒక్క నీలి మబ్బు ముక్కను తరలించుకొని రాలేక పోతూంది. ఇదీ స్థితి. ఆశలో అవసరాలు ముఖ్యమైనవీ ఉన్నాయి. దీనికి సమాప్తి లేనట్లుంది. ఒక్కొకపుడు నగ్న సత్యం ముందు ఔచితిని కూడ మరవచ్చు. "పేకాటలో తురుఫ్ ముక్కల్లా రాజకీయ చలన్మతులూ" ఎండుటాకుల వలె" గల గల రాలే మాటలూ ప్రసంగాలూ ఉపదేశాలూ ప్రతిధ్వనించే దిశలూ! ఎండ రెపరెపలాడుతూంది. సమయం దాహంతో అలమటిస్తుంది. పగలు ఉద్రేకంతో ఊగిపోతూంది.

ఉద్యమం నుండి ఉగ్రవాదం దాకా వ్యవహారం ఉరకలెత్తుతూంది. "నీరు" దొరకని "చలని స్థితి" "కరువు స్థితి" – ఎదురవుతూంది. కావ్యంలో నీరు ఆర్ద్రతకూ మానవతకూ సంకేతితమయింది. అగ్ని పర్వతం బ్రద్దలయ్యే వాతావణమూ ఉంది. ఈటెల వలె బాకుల వలె పోటీపడి దూసుకుపోయే మనుషులూ! గతిలో రాకెట్‌తో మతితో బులెట్‌తో కదలిపోయేరు. గొంతులో తడి ఆరి దాహంలో నీరు దొరక్క కథ

ఆగిన బ్రతుకులూ! పరివర్తన కోరడంలో తప్పులేదు, న్యాయం కూడా. పగలంతా ఎండకొట్టి దుమ్ము విసరి అలసిన బ్రతుకులు! విరామాన్ని శాంతినీ కోరడం సహజం. మార్పు కావాలనే అందరి కోరిక! వేగంగా రావాలనీ కొందరి ఆరాటం! మార్పు చీకటికి అవకాశం కారాదు స్వార్థానికి నిలయం కారాదు. ప్రజల్లో భౌతికమైన పరివర్తనతో పాటు మానసికమైన చేతన కూడా అవసరం. ఆనందం కోసం మనస్సు వేచి ఉంది! అదే చంద్ర బింబ! హ్లాద రూపం! మెల్లగా రావడమూ జరుగుతుంది.

(3) ఇక్కడి నుండి మూడో భాగం – సాయం సంధ్య మొదలవుతుంది. ఆకాశం ఎరుపు నుండి నలుపులోకి దిగుతూంది. పడమటి దిశ "పండు వృద్ధు ముఖం" వలె ఉంది. ఉన్నట్లుండి మనిషిలో అలజడి తగ్గింది. తాత్త్విక దృష్టి విప్పారుతూంది. సాయం కాల సమాప్తిలో పడమటి తలుపులు మూతబడుతున్నాయి. చుక్కలు తళుకు చూపులతో తొంగి చూస్తున్నాయి. సూర్యుని వెలుగు కనిపించకుండా పోయేదాకా ఓపికలేని చీకట్లు దూకుతున్నాయి.

అనాథ శిశువుల వలె నీడలక్కడక్కడా పడి ఉన్నాయి. నేల చల్ల బడింది. సందుల్లో నుండి చీమలు బయటికి వెడలుతున్నాయి. కంచె ప్రక్క తొండలు పరుగిడుతున్నాయి. నేలపై నెరయల్లో ఉండి పాము తలెత్తుతూంది. బయటికి వచ్చే కదలికలో ఉంది. పొలాల్లో నుండి కర్మాగారాల్లో నుండి శ్రామికులూ నెత్తిపై గడ్డి మోపులతో స్త్రీలు నివాసాలకు మరలుతున్నారు. ఇంతసేపూ చిరు మబ్బుల్ని తలపించిన ఫ్యాక్టరీ పొగ ఆగింది. కాలం ధూళి క్రమ్మిన అద్దంలో బింబం వలె ఉంది. ఎదురులేని వీరుని వలె విజృంభించిన సూర్యుని అస్తమయంతో ఒక దశ ముగిసింది.

సాయంకాల కళతో కాలం కొత్త అర్థాన్ని పొందుతూంది. విషాదముద్రలో ఆశాబింబం చంద్రుడు! మనిషిలో ఉత్సాహాన్ని వీడిపోకుండా నిలుపుతున్నాడు. మొదటి తేదీ కోసం ప్రతినెల ఎదురుచూచే జీవితాల్లో, సినిమా చూడాలనే కోరిక! ఆ సమయాన్ని పార్కులో ఎదురుచూచే చెట్ల మధ్య గడపాలనే ఆలోచన! బయటి చల్లదనం కోరి స్క్వేర్‌లో నిలబడి కాలక్షేపం చేసే మనుషులూ! కాళ్ళ క్రింద సిమెంట్ రోడ్ ఎంతవరకంటే? నేటి సమాజంలో ప్రగతిరూపం పొందినంత వరకనీ సమాధానం! ఇంతలో వెలిగిన వీథి దీపాలు! సూర్యుడు లేని స్థితికి ఆశాముఖాన్ని ఇచ్చాయి. ధైర్య కవచాన్ని తొడిగాయి.

4. నాలుగో భాగం – రాత్రి: మానవ చరిత్రలో భయ రూపానికి ప్రతీక. చేతిలో మాయలాంతరుతో వచ్చింది. చుక్కలు స్వతంత్రంగా బ్రతికేందుకు ప్రయత్నిస్తున్నాయి.

"తండ్రి మెడ చుట్టుకొని వ్రేలాడే శిశువు వలె చంద్రరేఖ
తల్లి కొంగు పట్టుకొని తిరిగే శిశువుల వలె చుక్కలు"

మనుషుల మధ్య వాత్సల్య బంధంతో కుటుంబ వాతావరణం కల్పిత మయింది. ఈ రాత్రి తలుపుకు వేసిన తాళం – దాని 'కీ' ఎక్కడుందో ఎవరికీ తెలీదు. కాల గమనంలో వచ్చే సమయ ముఖమే చెప్పాలి. ఒక చెట్టు క్రింద కూర్చొని కథలు చెప్పుకునే పిల్లల వలె చుక్కలు – ఇది రాబోయే తరాలపై ఆశారూపాన్ని సూచిస్తుంది. అక్కడక్కడ వినిపించే "శబ్దాలు నిశ్శబ్దానికి పదును" పెడుతూన్నట్లుంది. చీకటి రూపం మాయలేడి వలె ఉంది. "చీకటి రైలు" మారి "వెలుగు రైలు" ఎక్కడాని కింకా సమయముంది. రాత్రి కొత్త జీవిత చిత్రాల్ని గీస్తూంది. ఏదో కదలిక! అంతలో నిశ్శబ్దం! ఇంతలో ధ్వని! ఎక్కడో మేల్కొన్న మనిషి కూడా ఉన్నాడు అంతా నిద్రాజగం! సమస్యలూ ప్రశ్నలూ తాత్కాలికంగా వాయిదా వేయబడినాయి. అడ్రసు పారేసుకొనీ ఎవరి కోసమో వెదకుతూ ఒంటరిగా నడచే "ఎవరది? చంద్రబింబం" అదే "మనిషి మనోరూపమూ", వీధి దీపాలు కునికి పాట్లు పడుతున్నాయి.

దీపాల వెలుగుల్లో రాత్రి "స్వప్న కాసారం వలె" ఉంది. సమయం "మహావృద్ధువలె" అడుగులు వేస్తున్నట్లుంది. నిశ్శబ్దం! గడియారం లయ! గుండెలయ! రెండూ ఒకటిగానే ఉన్నాయి. లయ శబ్దం మధ్య నుండి నిశ్శబ్దం సుకుమారంగా తప్పుకుంటూంది. ఇదో ఆటలా ఉంది. మేల్కొన్న మనసుకు చీకటి ఎక్కడ లేని పని కల్పిస్తూంది. చీకటి నీలమేఘంలా సౌందర్య కళ వహించింది. మెరపులా వెన్నెలతో మనిషిలో వివేకాన్ని తలపిస్తూంది. పక్షుల కలరవంతో నేడు కదలిపోయి రేపు అయ్యే సూచన!

మనిషి మనసులో వేకువ! జడంలో చైతన్యస్ఫూర్తినిస్తూంది. తల్లి కొంగు చాటున పిల్లవలె వెలుగులు! చంద్రుడు చూపు నుండి తొలగే సమయం! ముళ్ళ కొమ్మ నుండి గులాబిలా ఉదయం! శుచియైన శుభ్రమైన ఉషస్సు! చీకటి కోటపై నుండి కాంతి బింబం! పడగెత్తిన ఉదయం! నవనవోన్మేష సృజన రూపం! కోట రాజరిక వ్యవస్థకూ ఉదయం ప్రజాస్వామ్య స్వేచ్ఛా రూపానికీ ప్రతీకలు! సామాజిక సందర్భంలో అర్థాంతరాన్ని సూచిస్తాయి.

ఏ రోజూ క్రితం రోజుకు డిటో కాదు! కొత్త అనుభవంతో కొత్త రూపాన్ని పొందుతుంది. మానవ సంబంధాలు భిన్నమవుతాయి. మానసిక ప్రపంచం వేరుగా రూపొందుతుంది. సమాజ సరస్సులో మానవీయ పద్మం వలె సూర్యుడు! మనిషిలో అంతరంగ చేతనకు ప్రతీక! ఉదాత్తమైన ఉన్నతమైన వ్యక్తిత్వానికి హేతుమూర్తి. సూర్యుణ్ణి చూస్తూ కూర్చుంటే అంధత్వం వస్తుంది. ఆ తేజాన్ని మనస్సులో ఆవాహన చేసుకున్నపుడే పరమ ప్రయోజనం సిద్ధిస్తుంది. ఇది మనోభూమికలో జరిగిన ప్రయాణం! మరో ఉదయం! మార్పుతో "రైలు మాని విమానం అందుకు"న్నట్లుంది. వేగాన్ని కోరే సామాజిక పరివర్తనం సూచితం.

వ్యక్తి స్థాయి నుండి సమాజ స్థాయిలో ప్రకృతి నేపథ్యంతో ఒకరోజు కాల పరిమితితో వర్తమాన జీవితానుభవాన్ని చిత్రించే కావ్యం "పడగెత్తిన ఉదయం". మానవ వ్యక్తిత్వంలోని భౌతిక మానసిక ప్రపంచాల సృజన రూపం. భావరూపాలతో ప్రతీకలతో స్వేచ్ఛా కవిత్వంలో కొత్త సంవిధానంతో ఆవిష్కృతమైందీ. వాస్తవ సదృశమైందీ. ప్రజాస్వామ్య పథ సూచన కలిగిందీ.

# II.10 జీవనలిపి - సమకాలీన జీవన చిత్రణం

'జీవన లిపి' స్వేచ్ఛా కవిత్వంలో సమకాలీన జీవన చిత్రణ కృతి. ప్రగతి దృష్టి దృష్టి కలిగిన సృజనరూపం. అక్కడక్కడా మార్క్సియ భావ జాల ప్రకటనం కవి సిద్ధాంత నిబద్ధతను జ్ఞాపకం చేస్తూంది. ఒక రోజు పరిమితి కాలంలో అయిదు సమయ విభాగాలుగా నిర్మిత మయింది. ఉదయం నుండి నిశాంతం వరకు పరచిన విషయం ప్రకృతి నేపథ్యంతో జీవిత రూపం భావ పుష్టిని పొందుతూంది. కావ్యంలో (1) ఉదయం (2) మధ్యాహ్నం (3) సాయంత్రం (4) అర్ధరాత్రి (5) నిశాంతం - పేర్లతో అయిదు అంకాలు సమయ సూచికలుగానే కాక విషయస్ఫూర్తికి దోహదం చేసేవి గానూ ఉన్నాయి. ఉదయంతో ఒక రోజు ఆవృత్తం మొదలువుతంది. నిశాంతంతో అంతమవుతుంది. ఇది చక్ర నేమి క్రమణంలా జరుగుతూనే ఉంటుంది. ప్రకృతి నేపథ్యంతో సామాజిక జీవితంలో దృశ్యాల పరంపర అభ్యుదయ కోణంలో సమ సమాజ లక్ష్యంగా నిబద్ధమైంది. సృజన దృష్టితో ఉత్తమ మానవుణ్ణి 'పురుషోత్తమ' భావనతో కవితాత్మకంగా తీర్చడం జరిగింది. జీవన లిపికి ప్రేరణ ప్రసిద్ధ వంగకవి బుద్ధదేవ్‌బోస్ 'పాండుర లిపి' అని కవి ప్రస్తావనలో పేర్కొనడం జరిగింది. కవి స్వీయ ముద్రతో 'జీవన లిపి'గా అవతరించింది.

కవి మాట బాల్కనీలో "ఆసీనులైన సుశబ్ద" సుందరాంగుల్ని ఉద్దేశించి "లేచి, నర్తించవలసిందిగా" "జీవన లిపి" ధరించవలసిందిగా కోరడంతో ఉదయం ఆరంభమవుతుంది. "సుశబ్ద సుందరాంగరూపం ప్రకృత కావ్యానికీ వర్తిస్తుంది అయితే ఇది కాల్పనికమైంది. ఇపుడున్న స్థితి కూడ దీనికనుకూలంగా లేదు. నాగ జెముడు డొంకల బ్రతుకులతో "పాములు తిరిగే పొదల"తో ఉంది. కోమల గంధర్వాని కవకాశం లేదనీ కవి అభిప్రాయం. కాల్పనికం నుండి వాస్తవానికి తిరిగే మలుపు రచనా శిల్పంలో భాగమవుతూంది.

ఈ సమయం "నీడ"లతో భయపెడుతూంది. హత్య యుద్ధం ఆక్రోశం! నితాంత శోకం! దీనాలాపం విషాదాంతం కలవర పెడుతున్నారు. కవి నిరుపేద నివాసంలోకి సప్త స్వర భామినుల్ని ఆహ్వానిస్తాడు. వారూ ఈ అనుభవాన్ని పొందాలనే కవి ఆకాంక్ష. ఎందురుగా కాంతి సాగరముంది! సాగరంలో భయపెట్టే మొసళ్ళూ ఉన్నాయి. ఇదో దృశ్యం. ఉదయమైందన్న సంతోషంతో పాటు గుండె గాయం నుండి సలసలా కవోష్ణ సంగీతం ప్రవహించడమూ వాస్తవమే! నీల మేఘం తరలిపోయింది.

పంచమంలో కోకిల గానం మనస్సుకు కాస్త ఊరట కలిగిస్తూంది. ఇదో దృశ్యం! మృషాన్వేషణం! లో శాంతికి దూరమై తిరుగుతూన్న స్థితి! నడుస్తున్న చరిత్రలో కొత్త ధన స్వాములతో భూ స్వాములతో చక్ర నాట్యం! ఈ సందర్భంలో కవి శాస్త్రీయమైన సామ్యవాదాన్ని కోరతాడు! ఈ ఉదయం సుఖ మయమైన మానవ వ్యవస్థతో వర్ధిల్లాలనీ కవి ఆశ!

మధ్యాహ్నం సూర్యుని మిట మిటలతో మండుతూంది. వాతావరణం చిరంతన దారిద్ర్యంలా ఉంది! చాల వేడిగా ఉంది! గోడలపై నెత్తురు మరకలు! భీతావహదృశ్యాలు! పగలు స్థితి, "ఆటవిక జీవితానికి ఆధునిక ఛాయాచిత్రం"లా ఉంది. అనాథలు, అన్నార్తులు! తప్పిపోతూన్న మానవత్వం! విస్తృతమవుతూన్న ఊషర క్షేత్రాలు! గుండెల్ని క్రుంగదీసే బరువులతో జీవితం నడుస్తూంది. "దురాశాపరుని హృదయం లా" మధ్యాహ్నం భగ భగ లాడుతూంది.

మిట్ట మధ్యాహ్నపు టెండలో ప్రేమతో వచ్చే మిత్రులూ ఉన్నారు. దాహం పెరిగి పోతూంది. ఆశల చల్లని వాన జల్లు కరువైంది. మండుటెండలో ఎదురుగా నిల్చిన మొదటి ముద్దాయి కాలం! అయితే రెండో ముద్దాయి అహంకారం! కర్మసాక్షికీ కాల దోషం పట్టింది. "విషమయ గంధక ధూమం" క్రమ్ముకొంది! కాలుష్యం వ్యాపించి వాతావరణం దుస్సహంగా ఉంది. పూర్వాహ్ణం నేరాల చరిత్రతో "ఉన్మత్త కాకోలంగా" తృణచ్ఛన్న కూపంగా తయారయింది.

అపరాహ్ణం రానే వచ్చింది. ఎవరి పీక ఎందుకు తెగుతుందో తెలీని స్థితిలో వేషం మార్చిన పెత్తందారీ రూపంతో ఎదురైంది. దిగంతనేత్ర భయంకరంగా జ్వలిస్తూ "రౌద్రాయణం"లా ఉంది. "కణ కణమండే రక్త సిక్త నేత్రాలు" సమాజంలో నెలకొన్న భయావహ స్థితిని సూచిస్తున్నాయి. ఈ స్థితి ఉపశమించి కాలం చల్లని అభయ హస్తమందించేనా? అన్న ప్రశ్నకు సమాధానం సాయంత్రంగాని పొడసూపదు. ఈ స్థితి ఈలాగే ఉండిపోదనీ కవి ఆశ!

సాయంత్రం సూర్యుని అస్తమయంతో నీడలు దీర్ఘ దీర్ఘ మయినాయి. చీకట్ల కవకాశం లభించింది. యంత్రాలకు విరామం లభించింది. సాయం సమీరం వీస్తోంది, దుమ్ముతో దుమారంతోనూ చెలరేగుతూంది. దొంగ తుపాకి తూటాకి అప్పుడెవరో ఒరిగిన నిజాన్ని దాచింది. ఈ సమయంలో నైనా సంజగాలి కనికరించి రవంత జాలి చల్లుతుందనే ఆశ! ఉదారంగా ప్రవర్తిస్తుందనే! ప్రస్తుత సమాజస్థితిలో

నెలకొన్న హింస అశాంతి రహస్య వర్తనం నిర్దయ మొదలైన లక్షణాల్ని భావ చిత్రాల పరంపరలో గమనించవచ్చు. ఎన్ని విప్లవ వ్యాఖ్యానాలు చేసినా కాలం దారి కాలానిదే! అన్నట్లుంది!

అస్త్రాద్రి వెనుక నీడలు! సూర్యుని హత్యకు దిగిన అనుమానం! చూస్తూ చూస్తూ ఉండగానే సూర్యుడు అస్తమించడం వాస్తవ మయింది. పగటి హత్యల దుఃఖ వార్తలతో దగ్ధమైన మాల పల్లెల విషాద గాథలతో వాతావణం సంక్షుబ్ధ చిత్రం వలె ఉంది. సాయంత్రం అంకం రాత్రి పూర్వార్ధం దాకా పర్యాప్తమయింది. బహు ముఖీనమైన అజ్ఞాన రూపానికి చిహ్నంగానూ ఉంది. నిజమైన దైవభక్తి నిజమైన దేశ భక్తి లోపించిన స్వార్థశక్తుల విడంబనం చిత్రిత మయింది. కుక్షింభరులతో పరాన్న భుక్కులతో నిండిన స్వార్థ స్థితికి కారణం ధనస్వామ్య వ్యవస్థయే! అని కవి విశ్వాసమూ ప్రకటితమయింది. అయితే కర్మ క్షేత్రంలో ఎటువంటి విషమ విపరీత విషాద పరిస్థితుల్లోనూ నీరసత్వానికీ నిరీహకూ తావులేదన్న దృఢమైన సూచన కూడ చేయబడింది. దీని కొకటే పరిష్కారం! ప్రజల్లో ప్రగతి చైతన్యం!

ఎండలో మాడుతూ వానలో తడుస్తూ మంచులో వణుకుతూ దోపిడీకి గురి అయ్యే పాలికాపు పక్షం వహించే కవి స్వరం వినిపిస్తుంది. అంత మందికీ భూమిని పంచి, దరిద్రం తలను వంచి ప్రతి బ్రతుకునూ సంపన్మయం చేయాలనే కవి అభిలాష. సమాజంలో నెలకొన్న దుస్థితి దౌర్భాగ్యం దుర్నీతి సాయం సంధ్య నుండి సాగిన చీకటి చిత్రంలో ప్రత్యక్షీకృతమయినాయి. రాత్రి! పిచ్చి రాత్రి! విషమ కాళ రాత్రి! అయినా ఈ రోడ్‌ను గడవక తప్పదు. ఎటువంటి పరిస్థితుల్లోనూ ప్రయాణం సాగవలసిందే!

అర్ధరాత్రి! మహా భయద రూపంగా వర్ణిత మయింది. ఈ వేళ "నిద్రాజగం"తో పాటు "దుస్సాహసాల దుష్కృత్యాల ప్రపంచమూ" ఉంది. ఇది "అవిశ్రాంత తమస్సముద్రం" వలె ఉంది. అసుర సంధ్యలో కార్కశ్యం అర్ధరాత్రి హింసగా మారుతూంది. అద్దమ రేయి కాల కూటమై పొంగుతూంది. ఉన్మత్త కైశికి నాలాపిస్తుంది. ఇది మత దురంతాల మహమ్మారికీ, కూలిపోయిన గత కాలపు వంతెనలకూ ఛాయా గ్రహాల వికటాట్ట హాసాలకూ చిహ్నంగా నిలిచింది. కడుపుకు గంజి లేక ఒంటికి గుడ్డలేక నిలువ గుడిసెలేక అలమటించే జన సమాహంతో కాలం ఘనీభవించినట్లుంది. మార్పుకు కదలికలేని పురోగమన సూచనలేని స్థితి సూచితం.

చీకటి సముద్రంలా ఉంది. ఎన్ని ప్రశ్నలు వేసినా ప్రతి ధ్వనులు తప్ప సమాధానాలు లేవు. సమస్యలు అట్లాగే ఉన్నాయి. భయద రాత్రం "పరభాగ్యోప జీవులకు" మాత్రం ఆనందాన్నే ఇస్తూంది. అంధకారంలో అజ్ఞానమే జ్ఞానంగా భాసించే విచిత్ర స్థితిలో కాలం జడస్థితిని పొందింది. అర్ధరాత్రికి సరియైన ముక్కూ మొగమూ లేనే లేదు. వికృతంగా మితిమీరిన స్వార్థంతో ఉంది. చీకటిలో కవి కంఠం హెచ్చరిస్తూనే ఉంది. పాకే మెట్లతో పొంచిన విపత్తులతో విషపు కత్తులతో ఉన్న ఈ చీకటి రాత్రి జాగ్రత్తగా అడుగులు వేయవలసి ఉంది. ఈ దుర్భర విషాద నిశకు అంతం పలకడానికి, సన్నద్ధం కావడానికి ప్రజలకు ఆహ్వానంతో చతుర్థాంకం ముగిసింది. కవి స్వరంలో మార్బ్రియమైన అభ్యుదయ శక్తి ప్రసారం, ప్రజల్ని అన్యాయానికీ అక్రమానికీ దోపిడీకి దౌర్జన్యానికీ వ్యతిరేకంగా ఉద్యమింపజేసేదిగా ఉంది. ఇది కవి సైద్ధాంతిక క్రియా నిబద్ధను ప్రకటిస్తూంద.ఇ

చివరది నిశాంతం. ప్రస్తుతమున్న పీడనం బాధలు పోయి కొత్త వ్యవస్థ రావాలనే కోరిక. నిశాంతంతో కాలచక్రంలో ఒక రోజు భ్రమణం పూర్తి అయింది. తమస్సుకు అంతం ఉంది. ఆశకు అవకాశం దొరకుతుంది. నిశ యొక్క అంతంలో అమానుషాలు జరగడం ఉంది. మనిషి పురోగమనం విజయ ముఖం చూచే దిశ సూచితమవుతూంది. మనిషిలో పురుషోత్తముని అవతారానికి సుందరమైన అవకాశం, ఈ సూర్యోదయ సమయం. ఈ భాగంలో తూరుపు మొగసాలలో చీకట్లు విరిగిపోతూ ప్రత్యూషః పవనాలతో కలనాదంతో వాతావరణం సిద్ధమయింది. విజేతగా విధాతగా సాక్షాత్కరించడం జరిగింది. దానవత్వం తొలగి మానవత్వం ఉదయించే క్షణాలు! భవిష్యత్తు ప్రభా చక్రవర్తికై నిరీక్షిస్తున్నాయి. స్వప్నాలు చిగురించిన చెట్టులా మనిషి! వసంత శోభను పొందడం! ఆనందాన్ని కలిగించే విషయం!

చెట్టుకు మతం లేదు. కులం లేదు. కలహాలు లేవు. కుట్రలు లేవు. ఇది సమాజానికాదర్శంగా రూపొందింది. ఈ భావ చిత్రం భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రబోధిస్తూంది. "శ్రమ ఫలితాలందరివీ సంతోషాలందరికీ అయిన సమ ధర్మం కల్పించే నిశాంతాన్ని" కవి కోరడం సహజం. "ఈ వెన్నెలలందరివీ, ఈ సుగంధాలందరివీ" ఏ ఒక్కర్తి సొత్తు కాదన్న సామాజిక న్యాయాన్ని కలిగింది. గతకాలపు గబ్బిలాలు ఇంకా అక్కడక్కడా వ్రేలాడుతూనే ఉన్నాయి. వసంతం గిట్టని వాళ్ళూ, సుమ సౌరభం పడని వాళ్ళూ ఇంకా ఉన్నారు. అయినా భయం లేదు.

నిశాంతానికిపుడొక వినూత్న రంగం సిద్ధమైంది "సర్వేజనాః సుఖినోభవన్తు" అన్న ఉదార భావనతో కూడింది.

రమణీయ పదాలతో రాగ రంజితంగా ఉదయించే కవిత శ్వేతపత్రమైంది. ప్రజల్ని మేల్కొల్పుతూంది. ఇది మానవ కర్తవ్యాన్ని ఉపదేశిస్తూంది. "లే! నా సోదరా!" అని పురుషోత్తమాగమనానికి స్వాగతం పలుకుతూంది. మానవత్వాన్ని స్థాపిస్తూంది. ఉదయరూపంలో ఉదారమైన ఉత్తమమైన విలువలతో కూడినమానవతా తేజో రూపాన్ని ఆవిష్కరిస్తూందీ, జీవన లిపి కావ్యం.

కావ్యం ఆరంభం నుండి సమాప్తి వరకూ ప్రకృతి నేపథ్యంలో సమకాలీన జీవన వస్తువుతో జీవిత చలన వాస్తవం చిత్రితమయింది. సమాజ గమన దిశ రూపిత మయింది. లక్ష్యంలో స్పష్టమైన ప్రగతి దృక్పథం స్థాపితమయింది. అక్కడక్కడా కాల్పనిక భావ బంధురంగా మొత్తం మీద ప్రగతి తత్త్వంలో సమ సమాజ స్థాపనం నిశ్చయమైంది. ఉదయం నుండి మరో ఉదయం వరకూ అలజడికీ అశాంతికీ అసమానతలకూ ఘర్షణలకూ నిలయమైన స్థితి గతుల పరం పర సృజన రూపాన్ని పొందింది.

ఈ మరో ఉదయం ఉత్తమమైన ఉదాత్తమైన ఆదర్శయుతమైన మానవోదయ దర్శనంతో అవతరించింది. సుశబ్ద నర్తనం గల శోభారూపం సువ్యవస్థ లక్ష్యం గల ఆదర్శంతో సమాజాన్ని గురించి ఆలోచింప జేస్తూంది. లక్ష్యాన్ని చేరువలో నిలుపుతూంది. స్వేచ్ఛా కవిత్వంలో "జీవన లిపి కావ్యం సమకాలీన మానవ జీవన చిత్రణంతో సోమసుందర్ సామ్యవాద ప్రగతిశీల వ్యక్తిత్వానికి ప్రాతినిధ్యం వహిస్తూంది. ఒక రోజు సమయ ప్రతీకలతో సమకాలీన సమాజ చిత్రణం కలిగిన సృజన రూపం, నిర్మాణ కళ చేత విశిష్ట మైందిగా విశ్లేషణ కందుతుంది.

# II.11 జీవనది - ఆధ్యాత్మిక మానవతా లోకనం

'జీవనది' స్వేచ్ఛా కవిత్వంలో ఆధ్యాత్మిక స్పృహతో మానవతా విషయం ప్రధానమైన కృతి. మానవీయ తలంపై మానవతా సందేశం ఆధ్యాత్మికంగా యోగ సాధనా దశలతో యోజితమయింది. చివరకు మహా మానవాత్మ – ఆత్మాన్వేషణంలో సామాజిక శక్తిగా ఆవిష్కృతమయింది. మూలాధారంలో సుప్తంగా ఉన్న సహస్రారంలో శివ తత్త్వంతో కలిసి ఏకమయి ఆనంద సిద్ధిని పొందడం సూత్రంగా ఉంది. మూలాధారం నుండి స్వాధిష్టాన మణిపూరక అనాహత విశుద్ధ ఆజ్ఞా చక్రాలతో వీటిపైన సహస్రారంలో (శివమయమైన) కనుల వికాస స్వరూపంతోపాటు మానవతా స్వరూపమూ అనుసంధిత మయింది. చివర మహా మానవాత్మ దర్శిత మయింది. ఇది ఎనిమిది సర్గల కావ్యం. అష్టదళ పద్మంగా వెలసింది.

మొదటి సర్గ చివర "మానవతా సూర్యుడు, తరువాత సర్గల చివర కుండిలినీ యోగ సాధనా దశల్లోని చక్రాలు – ప్రసక్తం కావడంలో మానవీయ ఆధ్యాత్మిక భావ సమన్వయ ప్రయత్నం కనిపిస్తుంది. ఇదొక విశేష ప్రయోగం. భారతీయ సాంస్కృతిక సంపదపై దృష్టిని ప్రసరింపజేస్తుంది. ఇది ఆర్షరూపంలో ప్రత్యక్ష మవుతూంది. మానవీయాన్ని భావింపజేస్తుంది.

కృతి విషయానికి వస్తే ఇది ఉపనిషత్తులోని తాత్త్విక భావ స్ఫూర్తితో మొదలయింది. సృజన దృష్టితో మానవతా వికాస పరిణతులతో పరిపుష్టమయింది. మహాచైతన్యం – మానవాత్మ అన్వేషణలో అంతిమ గమ్యాన్ని చేరే ప్రవాహ రూపంతో ఆంతర సిద్ధి స్థాపితమయింది. "నా అంతరంగం ఫలాల నారగిస్తున్న పక్షి, ఈ లోకమనే మరో పక్షి అందుకు సాక్షి". ఉపనిషత్తుల్లో కనిపించే జీవుడు – పరమాత్మ స్థానంలో 'జీవనది' కావ్యంలో అంతరంగమూ లోకమూ చోటుచేసుకున్నాయి. ఇందులో పక్షులు వాలిన కొమ్మ ఏకైక ప్రవాహం. జీవ నదిగా నిలిచింది. మహా మానవాత్మ చైతన్య విలసితమై అమృత సిద్ధి పొందడం పరమార్థంగా ఉంది. మానవీయ తలంపై మానవతాన్వేషణంతో మానవతా వికాస లబ్ధి సూచితమయింది. ఈ భావన సృజన రూపంలో ఆధ్యాత్మిక దిశగా (కుండలినీ యోగ మార్గంలో) వ్యక్తి పరంగా ఉంది. మానవతా వికాస సిద్ధి దిశగా సమాజ పరంగా ఉంది. "ఈ రాత్రి దాటడానికి ఒక్క తార చాలదు. హృదయ గర్త పురుల్లోని మానవతా సూర్యుడే కావాలి", ఇది ఆత్మాన్వేషణంలో మానవతా సిద్ధిలో మొదటి చింతన దశ. ఉన్నతమైన అభిలాష

కలిగింది. జడమయమైన చీకటి స్థితిని పోగొట్టడానికీ అధిగమించడానికీ రాగమయమైన స్థితి అవసరం. ఈ పని సూర్యుని కాంతి వల్లనే సాధ్యం. ఇది ఈ కావ్యంలో మానవతా రూపంలో చైతన్యాకృతిని పొందింది.

ప్రవాహానికి ఆరంభం అనేక ప్రశ్నలతో ఆలోచింప జేస్తుంది. మేధస్సు మరియు హృదయమనే రెండు గట్ల మధ్య "ఏకం సత్" భావనతో పురోగమనం సాగింది. ఇది వేద ప్రతిపాదితమయింది. మొదటి సర్గలో మనిషిలో ద్వేషాగ్నిని రూపుమాపడానికి సమాజంలో అశాంతిని పోగొట్టడానికీ – రాత్రిని దాటే ప్రయత్నం చిత్రిత మయింది. రెండో సర్గలో కుయుక్తులూ కుతంత్రాలూ నినాదాలూ ఘర్షణలూ యుద్ధం నిరాశ భయం బీభత్సం స్వార్థంతో విపరీత స్థితుల్ని పొందిన ఆధునిక జీవన గతులెదురవుతాయి. తాత్త్వికంగా మూలాధారంలో చివర శక్తి రూపం కన్ను తెరుస్తుంది. అవిద్యకు చరమ క్షణం ప్రకటితమవుతుంది మూడో సర్గలో విచిత్ర విషాద ఘటనలతో వినాశానికి మలుపు తిరిగే ప్రయాణంలో విపరీత దృశ్యాల చిత్రణం కనిపిస్తుంది. చివర స్వాధిష్ఠానంలో మానవతా లత చక్ర యానం చేస్తుంది. నాలుగో సర్గలో కృత్రిమ జలపాతాలకు స్వస్తి చెప్పి, ఇంధన వాతావరణాన్ని వదలిపెట్టి, కాలుష్యాన్ని దరికి రానీయకుండా, పెట్టుబడుల విషయమైన విక్రయ గతుల్ని నిలిపే స్థితి ఆలోచనకు వస్తుంది. బిందువుకూ సింధువుకూ మధ్యనున్న వ్యత్యాసాన్ని గుర్తించే వివేకాన్ని కోరుతుంది. ప్రపంచాన్ని ప్రేమించే లక్ష్యం కలిగింది. మణిపూరకంలో చివర మానవతా లత మొగ్గతొడగుతుంది. ఏడో సర్గలో విరిగిన వెలుతురు బొమ్మల ఆల్బం చిత్రాలతో అగాధమైన గాయాల బ్రతుకులతో దృశ్యం పరిక్రమిస్తుంది. అనాహతంలో చివర మానవతా లత రెండు పుష్పాల్ని పూస్తుంది. ప్రజా తంతువు సాగుతుంది. ప్రజా తంతువు విచ్ఛిన్నం కారాదన్న వైదిక భావనా విలసితమైంది. ఆరో సర్గలో ఓడలో ప్రయాణంలో తీరంపై దృష్టితో ప్రవాహ మార్గం చిత్రితమయింది. విశుద్ధిలో చివర ఇంద్రియాల అగ్ని కీలల్లో, దేహి విశుద్ధుడయి మహితాత్ముడు కావడం ప్రకాశితమయింది. ఏడవ సర్గలో అన్వేషణ క్రమంలో మూసిన తలుపులు తెరవబడీ రహస్య సంకేతాలు తెలిసీ విశ్వపు తలుపులు విచ్చుకొనీ దాచుకోడానికి మిగలని రహస్యప్రకాశనం వర్ణితమయింది. ఆజ్ఞా చక్రంలో చివర ఘటాకాశాలన్నీ స్వస్థానికి చేరే విశాలమైన అనంతమైన ఆత్మభావన దర్శితమయింది. ఎనిమిదో సర్గలో నిర్వేదంలో వేదనలో క్రమించే జీవితం పొందే కాల ప్రవాహ దర్శనం అద్వైత ముఖంగా తీర్చబడింది. మస్తిష్కంలో వికసించిన వేయి రేకుల కమలం రెండు అమృత బిందువుల్ని

ఆస్వాదించిన మహా మానవాత్మ నిరవధికంగా సాగే ప్రవాహం క్రమంగా ఆధ్యాత్మికాన్నీ మరియు వాస్తవ జీవితగతినీ సూచిస్తాయి.

ఉషోదయాన వేయి రేకుల కమలం వికసిస్తుంది. ఇది సహస్రార పద్మం. శివశక్తి నిలయం. చైతన్య యుతం. మూలాధారంలోని చీకటి క్షేత్రానికి పూర్తిగా వ్యతిరేకమైంది. జ్యోతిర్మయమైంది. సాదాఖ్య కళ గానూ వివేచితమయింది. కావ్యంలో కాంతి వంతమైన మానవతా భవిష్యత్తును ప్రకాశమానం చేస్తూంది.

"జీవనది"లో కథ లేదు. కాని భావ సమూహ సమాకలనం ఉంది. ఇది ఆధ్యాత్మిక భౌతిక జీవిత తలాలపై నిర్మాణ రూపాన్ని పొందింది. కావ్యంలో విషయానికీ లక్ష్యానికీ సంబంధించిన సూత్రం అంతర్గతమైన ప్రవాహ గుణంతో ఉంది. జీవితానుభవంతో మానవతామయంగా చిత్రితమయింది. ఆత్మాన్వేషణంతో సదభిముఖంగా సంసిద్ధిని దర్శింపజేస్తూంది. భారతీయ సాంస్కృతిక చింతనతో వాస్తవానుభవ జీవన విశ్లేషణతో ప్రవృత్తమయింది. ఇందులో ప్రకృతి నేపథ్యం చెట్టు కొమ్మపై రెండు పక్షులు వాలిన దృశ్యంతో ఆరంభమై ప్రవాహ భూమికపై సంపన్నమయింది. జీవిత చలనమూ సమాజ గమనమూ వాస్తవ సాదృశ్యాన్ని పొందాయి. మహా మానవాత్మ దర్శనం లక్ష్యంగా తాత్త్విక ప్రపంచమూ గోచరిస్తుంది.

"జీవనది" కావ్యం స్వేచ్ఛా కవిత్వంలో ఆధ్యాత్మిక మానవతా చిత్రణంతో ప్రత్యేకతను కలిగింది. పెన్నా శివరామకృష్ణ అంతర్బహిర్వ్యక్తిత్వంలోని తాత్త్వికమైన భౌతికమైన ఉన్నత శిఖరరూపాల్ని బింబిస్తూంది.

# II.12 అగ్ని పీఠం - వర్తమాన సమాజ మానవీయ దర్శనం

'అగ్ని పీఠం' కావ్యం (1) క్రాస్ ఫైర్ (2) సీజ్ ఫైర్ (3) నేడూ రేపూ మధ్య మూడు పేటల సృజన రూపం. ఇందులో వస్తువు వర్తమాన సమాజానికి సంబంధించింది. మానవ మానవేతర కారణాలవల్ల కలిగే అశాంతి సంక్షోభం వినాశ స్థితి గతులతో పూర్ణమైంది. 'క్రాస్‌ఫైర్', 'సీజ్‌ఫైర్' సామాజికమైనవీ, "నేడు రేపుమధ్య"లో ప్రకంపనం, ప్రకృతి కారణమైందీ, 'క్రాస్‌ఫైర్' ఉగ్రవాదానికి సంబంధించింది. రణ సదృశమైన స్థితుల్ని చిత్రించింది. 'సీజ్‌ఫైర్' – శాంతికి దారి తీసే స్థితుల్ని చిత్రించింది. 'ప్రకంపనం' – మానవేతరమైంది ప్రకృతిగతమైంది. 'భూకంపం వల్ల కలిగిన బీభత్స దృశ్య చిత్రణంతో వేదనావహమైంది.

'అగ్ని' ఉత్సాహానికి చేతనకూ అంతరమైన శక్తికీ విధ్వంసానికీ విలయానికి ప్రతీక. "పీఠం" ఆలోచనా స్థానాన్నీ ఆపైన అనుభవ శిఖరాన్నీ భావింప జేస్తుంది. "అగ్నిపీఠం" మనిషిలో శక్తికి స్థానం అటు మంచికైనా ఇటు చెడుకైనా ఉపయోగింపబడే మూల రూపంగా ఉంది. నిజానికి అగ్ని లేంది జీవితం లేదు. ఇంకా లోతుకు వెళ్ళితే అంతర్నిహితమైన అగ్ని రూపం చేతనే శక్తి ప్రసారంతో ఆయువు సార్థకమవుతూంది. "అగ్ని", జీవితంలో సృజనకు దారి తీస్తుంది. వినాశనానికీ దారి తీస్తుంది. దీన్ని మనిషి ఉపయోగించుకునే విధం, లక్ష్యంపై ఆధారపడి ఉంది. సమాజ సంబంధమైన ప్రకృతి పరమైన సమస్యలతో పరీక్షా వేదికగా నిలిచిన కాలం, ఈ సందర్భంలో అగ్ని పీఠంగా సంకేతింపబడింది. ఎటువంటి విషమ పరిస్థితుల్ని అయినా అధిగమించి పొందవలసిం దొక్కటే అది 'శాంతి'! దీనికై మనిషి తన విధుల్ని బాధ్యతల్ని సామాజిక సౌభాగ్యంకై ప్రగతికై నిర్వర్తించడ మొక్కటే, చేయవలసిన పని అన్న ఆదర్శమూ స్థాపితమయింది. వస్తువు సృజన దృష్టితో మానవీయ తలంపై కవితా రూపాన్ని పొందింది.

ఇరు వర్గాల మధ్య అటు ఉగ్రవాదులూ ఇటు ప్రభుత్వమూ హద్దుల్ని మీరి సాగే సంఘర్షణలో కాల్పుల వరకూ వెళ్ళిన అసాధారణ స్థితియే క్రాస్‌ఫైర్. వర్తమాన సమాజంలో ఉగ్రవాదానికీ ప్రజాస్వామ్య వ్యవస్థకూ మధ్య ఏర్పడిన విషమ వాతావరణ చిత్రణం కలిగింది. మిత్ర బృందం సమావేశమైన డ్రాయింగ్ రూమ్‌లోకి చేతిలో వార్తా పత్రికతో అడుగు వేసిన 'స్నేహ', పాత్ర ప్రవేశంతో కావ్యం ఆరంభమయింది. ఏ ఆదర్శానికో ప్రాణం పోయిన మనిషి చిత్రంతో మరణ వార్త ప్రచురితమయింది. ఇది క్రాస్‌ఫైర్ పర్యవసానం. ఆ సమయం "పగిలిన అద్దంలా" ఉంది. ఏ శకలంలో

ఏ నిజం ప్రతి ఫలించేదీ తెలీకుండా ఉంది. విషయాన్ని ఒక్కొక్కరు వేరు వేరు దృష్టికోణాల్లో చూడడం జరుగుతుంది. ఏ పక్షమైనా ఎంతటి వారైనా న్యాయమో చట్టమో ప్రతీకారమో ఆదర్శమో దేని క్రిందికి తెచ్చినా, హింస – మారణంతో కూడిన ఏ చర్య కూడా మనిషిలో 'జీవించే హక్కు'ను తొలగించేదిగా ఉండకూడదు.

మనిషి స్వేచ్ఛను ఇనుప పాదంతో అణచే చర్యకానీ మనిషి జీవితాన్ని బీభత్సం చేసే కృత్యంగానీ నాగరక సమాజంలో ఉండకూడదు. ఆ చనిపోయిన వ్యక్తి ఎవరైనా బంధువు లెవరో? మిత్రులెవరో? కాని "మానవతా బంధం" కరుణలో ముంచి పైకి తీసి చూపుతూన్నట్లుంది. తెల్లకాగితంవలె వచ్చిన ఆ రోజు కాలి ఎర్రబడి భస్మమై పోవలసిందేనా? అన్న ప్రశ్న! ఎదురుగా వర్తమాన దారుణ మారణ దృశ్యం! "ఈ కాల్పులెంత వరకు? సూర్యబింబం నల్లబడేంత వరకా? చంద్ర కళలు ఎర్ర బడేంత వరకా? మనిషి మసి అయ్యేంత వరకా?" ఇది నిరంతరం ఇట్లా కొనసాగకూడదు! క్రాస్ ఫైర్‌లో ఇరుపక్షాలూ నిత్యం సన్నద్ధమై ఉంటాయి! హింస సాగుతూనే ఉంటుంది. తప్పిపోయిన శాంతిని పట్టుకోవడం సమాజానికి అవసరం. ఇరు పక్షాలకూ అసమానతల్లో అన్యాయాల్లో ఎక్కడో అభిప్రాయాలు కలిసే అవకాశముంది. దీని ఆధారంగా శాంతి కోసం ప్రయత్నించవచ్చు.

రాత్రి జరిగిన క్రాస్ ఫైర్‌తో ఉదయం బూదిలా ఎగసే మంచులో ఎర్రెర్రని నవ్వు జారుతున్నట్లుంది! నిరాశకూ నిరీక్షణకూ మధ్య రోజులు ఊగిసలాడుతున్నాయి. యంత్రాల వలె తిరిగే శరీరాలు! మనస్సు మానుషాన్ని మరచినట్లుంది! మృత్యు వొకటే నిజంలా ఉంది. ఈ స్థితిలో మనిషి హృదయం తీగెలు తెగి మూల పడిన వయొలిన్‌లా ఉంది. తెగిన తీగెల్ని సరిచేయవలసి ఉంది. సుస్వర గతుల్ని అనుసంధించవలసి ఉంది. అంతర్జాతీయ వ్యాప్తి చేత ఉగ్రవాదాన్ని అంతరింపజేయడం బహు కష్టమైన పనే! విప్లవ చర్యలు పూల వనం పయి నిప్పుల్ని నృత్యం చేయించేవిగా ఉన్నాయి. సమాజంలో ఎపుడు ఘర్షణ చెలరేగేది తెలీకుండా ఉంది. ఇది ఇట్లా ఉంచి, దీని పరిష్కారంలో వ్యక్తులు బహు పాత్రల్ని ధరించడం, పాత్ర నుండి పాత్రకు అవలీలగా మారడం సమస్యను జటిలం చేస్తున్నాయి. రాళ్ళలో ముళ్ళలో చిక్కుకున్న బ్రతుకులు తిరిగి స్వేచ్ఛగా సంచరించవలసి ఉంది. పయనంలో గమ్యం చేరడం సులభంగా కన్పించడం లేదు. సమాజంలో "శుక్ల పక్ష మొకరి వంతూ", "కృష్ణ పక్ష మొకరి వంతూ" అవకూడదు. దీనికి కిరణం వంటి ఆలోచన అవసరం. ఇది వివేకానికి దారి తీస్తుంది. పరిష్కారానికి ప్రయత్నిస్తుంది.

కావ్యంలో కిరణం స్వేచ్ఛకూ చేతనకూ మానవతకూ భిన్న సందర్భాల్లో ప్రతీకగా ఉంది. ప్రజాస్వామ్యంలో స్వార్థం వీడి సంకుచితత్వాన్ని వదలి త్యాగాన్ని ఉదారతనూ పొందినపుడే సరియైన ఫలితాలు అందుతాయి. కేవలం సిద్ధాంతాలకు మాత్రమే పరిమితం కాకుండా అనుభవంలో హృదయ స్పర్శనూ మానవతా స్పృహనూ పొందాలనే కవి ఆకాంక్ష – ఏ జీవితమయినా "మృగ సంచారం"తో "అరణ్యాన్ని" తలపించకూడదు. స్వార్థం తాత్కాలికంగా "మెడలో పూలదండ" కావచ్చు. అది క్రమంగా సమాజానికి "ఉరి" అయ్యే ప్రమాదం ఉంది. దీని వెనుక "ఖడ్గ నృత్యమూ" జరుగుతుంది. వస్తువును కవిత్వీకరించే భావ చిత్రాలతో క్రాస్‌ఫైర్ ప్రభావ స్థితులు కళాత్మకతను పొందాయి.

ఇంట్లో నుండి బయటికి రాగానే రాజకీయ ధూళి ధూమం కళ్ళకు అడ్డంగా కదలుతుంది. "కర్మ సాక్షి సూర్యుడు గాజు కేస్‌లో వజ్రంలా మిగిలి పోయాడు. కర్మ సాక్షి మనిషిలో అంతరంగానికి మంచినీ చెడునూ విశ్లేషించి చూపే వివేకానికీ ప్రతీక. ప్రజాస్వామ్యం, ఉదార లక్షణంతో పీడిత జనుల ఆర్తిని తీర్చే మేఘంలా భావిత మయింది. ప్రజాస్వామ్యం సరియైన దిశలో నైతికమైన విలువలపై ప్రజోపయోగ విధంగా నడపబడాలి. దీనికి బాధ్యత ప్రజ లందరిదీ, ముఖ్యంగా నేతలదీ మేధావులదీ పాలకులదీ విద్యావంతులదీ. అపుడే సమాజం ఇంద్ర ధనుస్సును మరపించే శోభను పొందుతుంది. మనుషుల్ని చక్కదిద్దవలసిన అవసరమూ ఉంది. ఇది పాలకుల పని.

యుగాల పరిణామ దశలతో మనిషీ – సమాజమూ గొప్ప నాగరక దశకు చేరుకుంది. ఇంకా సమస్యల పరిష్కారానికి ఆటవిక చర్యల్ని అవలంబించడం దారుణం, వాటిని కొందరు సమర్థించడం క్షమించరానిది. ఉత్తమ సంస్కారంతో ప్రగతి చేతనతో హేతుయుతమైన మానవతా దృష్టితో పయనించవలసి ఉంది. మనిషితో అనుబంధం, మనిషి పట్ల గౌరవం, మనిషిలో విశ్వాసం మనిషి నుండి ఉదారత ఉన్నత స్థాయినిస్తాయి.

"నీలి మబ్బు రాకతో జల సేచనంతో కంటక జీవితం చివురిస్తుంది. మొగ్గ తొడుగుతుంది, పుష్పిస్తుంది, ఫలిస్తుంది". "మందేకొర కంచు ముఖం శాంతి పాఠం" వల్లిస్తుంది. దాహంతో అలమటించే అవని పచ్చని కళతో పరవశిస్తుంది. కావ్యానికీ భావనను సమన్వయిస్తే క్రాస్‌ఫైర్‌లో దగ్ధమైన జీవితాలు పచ్చదనాన్ని పొందవలసిన అవసరాన్ని సూచిస్తూంది. కావ్యంలో ప్రకృతి పరంగా నున్నవి వర్తమాన స్థితిలో సమాజానికన్వయించే భావచిత్రాలతో కావ్యకళ ఇనుమడిస్తూంది. భయం వీడి

ప్రతీకారం వదలి హింస మాని అశాంతికి వీడ్కోలు పలకడం అవసరం. తక్షణం కావలసింది చేతిలో ఆయుధం కాదు. "ఒక చేతిలో శాంతి పుష్పం" మరో చేతిలో "ప్రజాస్వామ్య కేతనం" మాత్రమే. స్థైర్యంతో స్నేహంతో సహనంతో శాంతికి స్వాగతం పలకవలసి ఉంది. ఈ ప్రయాణంలో "క్రాస్‌ఫైర్" స్థానంలో "సీజ్‌ఫైర్" అనివార్యమైంది. ఇది విరామ సమయంలా కాకుండా శాశ్వత శాంతికి దోహదం చేసేదిగా ప్రయత్నించడం మానవ ధర్మం.

## II

"క్రాస్‌ఫైర్"కు విస్తరణ రూపమే "సీజ్‌ఫైర్" కృతి. ఇరు వర్గాల మధ్య పక్షాల మధ్య ఆయుధ ప్రయోగాల విరమణం శాంతి ప్రక్రియలో భాగమైంది. సమస్య పరిష్కారానికి మంచి అవకాశం లభిస్తుంది. ఇది శాంతి కయి ఇరు పక్షాల మానసిక సంసిద్ధతను బలపరుస్తుంది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఇరువైపుల నుండీ పట్టు వీడే ధోరణి అబ్బుతుంది. ఇతరుల అభిప్రాయాల్ని మన్నించే లక్షణంతో విశాల ప్రాతిపదికపై ఆలోచన చేసే మనస్తత్వం ఏర్పడుతుంది. రణ మారణ స్థితికి బదులు నవ నిర్మాణ స్థితికి వీలు కల్పిస్తుంది. "సీజ్‌ఫైర్" కావ్యంలో వివిధ స్థితులు సన్నివేశాలు ఆధారంగా వర్తమాన సమాజం చిత్రిత మయింది.

మొదటిది "గది కిటికీ నుండి" ప్రతీకాత్మకమయింది. 'గది' పరిమితిలో పనిచేసే మానసిక రూపాన్ని సూచిస్తుంది. తెరచిన కిటికీ బయట నుండి గాలి వెలుతురు ఆగమనంతో స్వేచ్ఛా సంచారాన్నీ భావింప జేస్తుంది. క్రమంగా మనిషి మానసికంగా గది గోడలు దాటి, బయటి ప్రపంచంలో కలిసిపోతూ విశ్వ హృదయాన్ని పొందుతూ అంతర్జాతీయ మానవీయ భావనతో పర్యాప్తం కావడాన్నీ కావ్యంలో గమనించవచ్చు. ఒక్కొక్క ఖండికలో వస్తుగతమైన సూత్రం చెదరకుండా భావ చిత్రాలు కదలుతాయి. కొత్త శతాబ్దిపై ఆశాముఖంతో ఎదురుచూచే మనస్సు వేయిపూలను మన్నించడానికి సిద్ధం కావడం విశేషం. ఈ సందర్భంలో సమయం "శాంతి కవచం ధరించిన సింహం"లా ఉన్న మాట కూడా యధార్థమే. కాంతి కళికలు అగ్ని కణికలు కాకూడదు. వివేకంతో శాంతిని సాధించుకోవలసి ఉంది. ఒక స్వప్నం నిజం కావడానికి ఒక ఆదర్శాన్ని అందుకోడానికి ఉగ్రవాదంతో హింస అనుసరణీయం కాదనే కవి విశ్వాసం.

"సీజ్‌ఫైర్" తో అంతా చక్కబడని మాట కూడ నిజమే. "మేఘ గర్జనం వినబడినంత మాత్రాన ఆకలి తీరదు". "మెరపు తీగె మెరసినంత మాత్రాన ఆశలు

కాంతి మయం కావు” వీటి మధ్య ఎంతో జరగవలసి ఉంది. సీజ్‌ఫైర్ సఫలమయితే శాంతికి తలుపులు తెరచినట్లే! సమాజంలో లయ తప్పిన జీవితాలు అరణ్యంలోకి ప్రవేశిస్తున్నాయి. ఆయుధం వైపు మొగ్గు చూపుతున్నాయి. దీన్ని నివారించే సామాజిక చర్యలు తీసుకోవలసి ఉంది. ఇది పాలకుల తక్షణ కర్తవ్యం.

అంధకారంలో చిక్కుకున్న సూర్యుడు సమయ రాగంతో ఉదయించాలనే, నిన్న విస్ఫోటానికి గురి అయిన సమయం నేడు సీజ్ ఫైర్‌తో “మానవతా ఘన రాగానికి” ట్యూన్ చేయబడితే అంతకన్నా ఇంకా ఏం కావాలి? ఏది ఏమైనా మనుషుల మధ్య ట్రాన్స్‌పరెంట్ హృదయం ముఖ్యం. హృదయం ధూళితో పొగతో కప్పబడితే సంప్రసారశక్తి కోల్పోతుంది. పేరు ఊరు కులం మతం వర్గం ప్రాంతం కన్నా మనిషీ ప్రాణం అనేవి మిన్నగా ప్రతిపాదితమయినాయి.

ప్రయాణంలో ప్రతి మజిలీ జీవితంలో భాగమే! ఏదీ తొలగించేది కాదు. వీటి మధ్య సంబంధం ఉండి తీరుతుంది. దీన్ని సరియైన పద్ధతిలో పరిశీలించవలసి ఉంది. యుగాలుగా వినిపించే ఉపదేశాలూ నీతులూ అంతరంగాన్ని కాకపోయినా మనస్సునైనా స్పృశిస్తే మంచిది. అందరి చేత వల్లింపబడుతున్నాయి. ఇసుకపై అక్షరాలవలె గాలిలో ఎగిరిపోతున్నాయి. నిత్య జీవితంలో అనుభవంలో ప్రయోజనానికి దూరమవుతున్నాయి. ఒకరిపై “విసరేందుకు రాళ్ళు ఏరుకునే చేతులు”, ఆ పని మానాలి. పూలగుత్తుల్ని గ్రహించాలి. స్వాగతానికి సిద్ధం కావాలి. దీని కిప్పుడున్న స్థితిలో కొంత సమయం పడుతుంది. ఆ సమయమే, కోరిన విరామం, సీజ్‌ఫైర్. ఉగ్రవాదంలో మానవ బాంబులూ చేరాయి. భయంకరమైన హనన కృత్యం క్షమార్హం కాదు. అలాగని శాంతికి శాశ్వతంగా తలుపులు మూసివేయకూడదు కూడా. సమాజంలో శాంతి కిరణాల్నీ స్వేచ్ఛా వాయువుల్నీ ప్రసరించే ప్రతి చర్య ఆహ్వానించదగిందే. ఇందులో అనుమానం లేదు, అస్పష్టత లేదు. జీవితం గురించి సమాజ శ్రేయస్సు గురించి ఈ కృతిలో చేసిన ఆలోచన మానవీయమైందీ.

మానవ జగత్తులో ఎక్కడి కక్కడ ఎప్పటికపుడు వెలుగు ముఖం కోసం అన్వేషణ సాగుతూనే ఉంది. అది కన్పించే అంతలో మాయమవుతూంది. అంతలో మానవేతర విశేషణాలతో అడుగు పెడుతుంది. హేతు దృష్టీ విశ్వమానవ భావన. అన్వేషణకు సార్థకతను చేకూర్చడమూ కనిపించకపోదు. ప్రేమ – మానవతతో ‘సీజ్‌ఫైర్’ సఫలం కావాలనే కవి అభిలాష.

‘సీజ్‌ఫైర్’లో స్థితి “బూది డ్రెస్‌లో అనలం వలె” నున్న మాట వాస్తవమే. ఏ క్షణంలోనైనా గాలికి బూది ఎగసి పోయి అనల కణం జ్వలించవచ్చు. ఆ స్థితి

రాకూడదనే శాంతి ప్రియుల ఆరాటం, ఆవేదనతో పాటు అంతరంగ ప్రకాశమూ అవసరం. శాంతికి తెరచిన తలుపులు వెలుగును ఆహ్వానించాలనే ప్రజల కోరిక. "గాయంపై మంచు ముక్కలా ఉంది సీజ్‌ఫైర్". గాయం బయటపడి అగ్నిమయం కాకూడదు. గాయం మానాలి. ప్రజాస్వామ్యం అన్వర్థం కావాలి. మనిషి మనోరూపం మానవీయ భావనతో విలసించడమే ఒక పెద్ద సమస్యగా మారింది. ఈ సమస్యకు పరిష్కారమెక్కడో లేదు, మనిషిలోనే ఉంది.

"మనిషిలో నీలి సముద్రం వెలుగుతో రాగ సముద్రమో పాల సముద్రమో" అవడంలో ఆశ్చర్యం లేదు, ఇందులో అయోమయం లేదు, అవాస్తవం లేదు మానవతా స్పర్శతో అన్నీ సాధ్యమే" ఈ రచన మనిషిలో చెడు మంచిగా మారే విధంతో సమాజ శ్రేయస్సును కోరుతూంది. నీలి రంగు చెడుకే కాక నిరాశకూ నిస్పృహకూ చిహ్నం. రాగం క్షీరం స్నేహానికీ ప్రేమకూ చిహ్నాలు. "క్రాస్‌ఫైర్" తరువాత "సీజ్‌ఫైర్" వెలువడింది. వీటిలో వస్తువు ఒకటే. అది పొందే గతిరూపం వేరు. లక్ష్యం వేరు. ఈ కృతుల్లో వర్తమాన సమాజ చిత్రణంతో శాంతి సందేశంతో మానవీయ భావనకు పట్టం గడుతూ ప్రజాస్వామ్య చేతనకు ప్రాతినిథ్యం వహించడం విశ్లేషణ కందుతూంది.

## III

"నేడూ రేపూ మధ్య" పేరుతో వెలసిన 'ప్రకంపనం' కావ్యం గుజరాత్ భూకంపంలో జరిగిన విధ్వంస కాండనూ ప్రజలు బాధారూపాన్నీ చిత్రించే కృతి. క్రాస్‌ఫైర్ మరియు సీజ్‌ఫైర్ సామాజికమైతే "ప్రకంపనం" ప్రకృతి గతమైంది. ఇది అగ్నిపీఠంలో మూడో భాగం ప్రకృతి విలయాన్ని మానవశక్తి కొంతవరకే పరిమితం చేయగలదు. హఠాత్తుగా వచ్చి పడిన ప్రకృతి బీభత్సం మానవశక్తిని మించింది. (1) గుజరాత్‌లో సంభవించిన భూకంపం కారణంగా జరిగిన విధ్వంస బీభత్స దృశ్యాలతో; (2) ఈ విషమ స్థితిలో మనిషిలో చెలరేగే నలుపూ, తల ఎత్తే తెలుపూతో నిరాశ ఆశ, మరియు విషాదంలో ఆపదనెదుర్కొనే ఉత్సాహశక్తితో పొందే క్రియారూపాలతో; (3) మనిషిలో ఆ సమయాన అవసరమైన ఆశాస్ఫోరకమైన నిర్మాణగుణంతో; (4) ఉదారత త్యాగశీలత మానవతతో ప్రదర్శితమైన మానవ వ్యక్తిత్వంతో రూపొందిందీ సృజనరూపం. దీనికి తగిన భావ చిత్రాల ప్రతీకల నిర్వహణ కళతో మానవీయ స్పందనతో ప్రత్యేకతను పొందింది.

మనిషిలో స్థిర సంకల్పం, ఉత్సాహ చలనం ప్రకృతి వైపరీత్యాన్ని ఎదుర్కొంటుంది. విషాదం నుండి తిరిగి ఉత్సాహాన్ని పొంది సాధారణ స్థితికి

చేరుకునే సమాజమూ స్ఫూర్తికి వస్తుంది. ప్రకంపనం జన జీవితానికి బీభత్స దృశ్యమైంది. మొదటి భాగంలో ఈ దేశం రిపబ్లిక్ రోజున ఉదయం గుజరాత్‌పై విధి ఇనుపపాదం మోపింది. క్షణాల్లో మృత్యువు నీలి ముసుగు విసరింది. దారుణ మారణ భీభత్స దృశ్యాలతో మానవ శక్తికి అతీతమైన ప్రకృతి వైపరీత్యం తన ప్రభావాన్ని నెరపింది. విషాద వార్తతో సమాజం చకితమయింది. కూలిన కట్టడాల శిథిలాల్లో నలిగి విరిగి చెదరి కూరుకపోయి క్షతమయిన మానవ రూపాలు! హృదయాన్ని కలచి వేసాయి! దిగ్భ్రాంతికి గురి చేసాయి. వాతావరణం హాహాకారాలతో విషాదమయమైంది. మందిరాన్ని మసీదును చర్చినీ ఒకే మానవతా సూత్రంపైకి తీసుకొని వచ్చింది. ప్రాణంతో బయట పడిన ఒక కుక్క విశ్వాసంతో శిథిలాల్లో చిక్కుకున్న మనిషికి కాపలా కాస్తూంది.

"కచ్" హృదయం బ్రద్దలయింది. "భుజ్" భుజం ముక్కలయింది. "అంజార్" స్కూలు ఆ పిల్లల సజీవ సమాధితో నిశ్శబ్దాకృతి పొందింది. విషాదంలో మాట పెకలని స్థితిలో ఆయా ప్రాంతాలు కఠిన శిలారూపాన్ని వహించాయి. భూప్రకంపనం వార్త భారత దేశాన్నే కాదు సర్వ ప్రపంచాన్ని కుదిపేసింది. ఆశ్రయమిచ్చే ఆధారమయ్యే భూమి బ్రద్దలై మృత్యు హేతువు కావడం ప్రకృతి వైపరీత్యానికి విలయ పరాకాష్ఠ అయింది. "కాండ్లా" లో కూలీల కార్మికుల హాహాకారాలు మిన్ను ముట్టాయి. "మోచి"లో ప్రేమకు చిహ్నామయిన 'మణిమందిరం' భూకంపం వల్ల చెలరేగిన వరదలకు వన్నె మాసి నిలిచింది. దానిచుట్టూ కఠోరమైన విధి విషాద ప్రభావాన్ని నెరపింది. ఈ విషాదం నుండి మృత్యు వలయం నుండి మనిషిలో నుండి కొత్తరూపం పునర్నవంగా వెలసింది. పరీక్షకు నిలిచింది. నిర్మాణాన్ని పూనుకోవడం జరిగింది. ఇతర జీవులకన్నా మిన్నయైన మనిషి శక్తికి సార్థకత చేకూరింది.

విషాదచ్ఛాయలు క్రమ్మిన జనావాసాల్లో "ఇక్కడో దీపం అక్కడో దీపం", సూత్రం తెగి జారిన ముత్యాల్లా ఉన్నాయి. మిగిలిన ప్రజ కరుణ స్పర్శ కోసం ఎదురుచూస్తూంది. ఆ ప్రక్కనే నిద్రించే కొందరూ, కొన ప్రాణంతో మరి కొందరూ నెలవంకల్లా పాలిపోయి పడి ఉన్నారు.

దెబ్బతిన్న నేల తల్లి గుండెపై శిశువులా ఉదయం! అన్నీ పోయి మనిషికి తరతరాలు చెప్పుకునే విషాద గాథ మాత్రం మిగిలింది! ఈ దుస్థితికి చలించి "ధ్యానంలో ఉన్న బుద్ధుడు కళ్ళు తెరచినట్లుంది. క్రీస్తు కనురెప్పలెత్తినట్లుంది. తోటి ప్రజల సహాయ సహకారాలు ప్రేమ దయ సేవ కొత్త ఆశ్వాసాన్ని కలిగించాయి. ఇవి ఏ మూలకు రాకపోయినా హృదయ స్పందనం మాత్రం విలువకట్ట రానిదిగానే

ఉంది. వాక్యాల్లో నుండి చెదరిన పదాల్లా ఎక్కడెక్కడో విసరబడిన మనుషులు! అంతా కోల్పోయి ఆరు బయట తల క్రింద కలల మూటతో కొందరూ, తలపై బాధల ఆకాశంతో మరి కొందరూ పోయినంత మేర ఊరు తరువాత ఊరు బీభత్స సముద్ర తటాల్లా ఉన్నాయి. పై నుండి ప్రాణం లేని విమానం క్రింద నున్న ప్రాణులకు బుద్ధి జీవులకు ప్రాణాధారాల్ని చేరవేస్తూంది. శిథిలాల్లో మూలిగే 'ఒక మహిళను పైకి తీసే జవాన్!' అతని 'మెడపై వాలిన రెండు చేతులూ కృతజ్ఞత నిండిన పూల దండల వలె' ఉన్నాయి. రాళ్ళ మధ్య నుండి 'మొగ్గ'లా పదిలంగా ఉన్న 'పసి పాపను పైకి తీసే అరచేతులు పచ్చని ఆకుల వలె' కదలాయి. అక్కడక్కడా శిథిలాల్లో కదలికలు! అణగారిన ఆశల్ని మెరపించేవి కొన్ని, వెలిగించేవి కొన్ని! కళ్ళముందు చీకటి వదలిపోలేదు! ఈ ప్రాంతం 'స్నేహ హస్తం' కోసం ఎదురుచూస్తుంది. "త్యాగరూపం" కోసం వేచి ఉంది. ఆదుకొనే మానవతా బింబంకై దిక్కులు చూస్తూంది. ఇదొక విషాద పర్వంలా ఉంది. ప్రకంపనం భూమిని కత్తిరించినంత మేర, ముక్కలైన బొమ్మల్లా క్షతగాత్రులు! బ్రతికి బయటపడిన మనుషులు, మరో చోటికి తరలిపోతున్నారు. తన శక్తికి మించిన స్థితిలోనూ జిగీషా సంకల్పంతో ప్రజ్ఞతో మనిషి ఎదిగి తన కాళ్ళపై నిలబడాలనే! వజ్ర సంకల్పం కనిపిస్తుంది.

సౌరాష్ట్ర దిగ్భ్రమలో మునిగింది. "రెక్కలు విరిగిన పక్షిలా" విలవిలలాడింది. ఇపుడు కావలసింది ఉపదేశాలు కాదు. భూమిపై పునర్నిర్మాణం. విధి పేరిట ఉపేక్ష ఉపసంహృతి వైరాగ్యం మాటలు కాదు. వాస్తవమైన ఆలోచనతో ఉత్సాహ శక్తితో జీవితేచ్ఛ! కావాలి. కూలిన శిథిలాల్లో తిరిగే కుక్క హఠాత్తుగా కనబడిన మనిషి కాళ్ళను పెనవేసుకుంది. కృతజ్ఞతను ఋజువు చేసుకుంటూంది. ఏ శత్రువు విజృంభణం లేకుండా ఏ ఆయుధ ప్రయోగం జరగకుండా మారణ దృశ్యం అవతరించింది. ఈ సందర్భంలో 'పునర్నిర్మాణ' లక్ష్యంతో మనిషిలో 'మహాబోధి చివురించింది' 'శాంతి శిలువ' ప్రకాశించింది. సద్భావన వికసించింది. ఇది మంచి పరిణామం.

రెండో భాగంలో ప్రకంపనం, తరువాత ఇతర విపత్కరమైన దారుణ స్థితుల పర్యాలోకనం చేయబడింది. జీవితంలో ప్రకంపనంతో దాదాపు సమానమైన విషాద స్థితు లెన్నో ఎదురవుతాయి. తుపాను వచ్చి ఊళ్ళు వరదల్లో కొట్టుకు పోయినా ఇదే స్థితి! ఏ విషమ స్థితిలోనూ మానవతా సూత్రం తెగిపోకూడదనే! ప్రకృతి వైపరీత్యం ఎపుడో ఒక మారు తటస్థపడుతుంది. దాన్ని ఎదుర్కొని నిలవాలనే.

మరో విధంగా మానవ వైపరీత్యం దైనందినంగా ఎదురవుతుంది. ఇది శిఖర స్థాయి నందుకునే దశలూ లేకపోలేదు. వీటికి కారణం మనిషిలో స్వార్థం. రోజు రోడ్‌పై పగిలిన అద్దాలతో కాలిన వాహనాలు! ఆస్తుల విధ్వంసం! మనుషుల హననం! వినాశన మారణ పరాభవ దృశ్యాల గ్యాలరీ ప్రత్యక్షమవుతుంది. అద్దంలో కనుల నుండి బాష్ప కణం స్మృతి శాలను తెరుస్తోంది. మరపురాని బాధా దృశ్యాలు స్మృతి శాలనలంకరిస్తున్నాయి. ఒక్కొక్కచోట పాలనా యంత్రాంగం జడమవుతుంది. మనుషులు ప్రతిమలవుతారు. స్వార్థంతో మరో మానవ వైపరీత్యం ఎదురవుతూంది. ప్రకృతి వైపరీత్యంతో పాటు సమాజ మానసిక వికృతత్వమూ ఈ సందర్భంలో మానవ సంస్కృతికి ప్రమాదంగా మారే హెచ్చరిక కూడా వినిపిస్తుంది. "అంతరంగం లేని మనిషి జడంతో సమానం మానవత లేని మనిషి శవంతో సమానం" ఒక స్థితి నుండి ఏ శవమూ సహనీయం కాదు. ఏ సిద్ధాంతమైనా ఏ వ్యవస్థ అయినా ఏ ఆదర్శమైనా మనిషిలో అంతరంగ చేతన – మానవతా స్పందనంతోనే సఫలమవుతుంది. సామాజిక తత్పరత ఈ సందర్భాల్లో మరీ ముఖ్యం.

మూడో భాగం సామాజికం, ప్రజల జీవన గతులపై వెలుగు ప్రసరిస్తుంది. ఈ భాగం కొన్ని భావ చిత్రాలతో 'అంబులెన్స్‌లో సూర్యుడు' 'కాలం విసరే జోక్' మొదలుగా కవితాత్మకమైన ప్రతీకలతో నిర్వహింపబడింది. సమాజంలో రోజు రోజుకీ ప్రబలే హింస అశాంతి స్థితి గతులు కావ్యంలో ప్రత్యేకతంగా చోటు చేసుకున్నాయి. ఇవి ఒక సిద్ధాంతం లేదా ఆదర్శం బట్టి కాక వైయక్తిక సామాజిక దృష్టితో విశేషతలంపై పరిశీలించవలసి ఉంది. అందులో ఒకటి, విషాద సంఘటనతో పరాభవ స్థితిలో దారం తెగిన పతంగంలా అర్థరాత్రి ముగిసిన యువతి జీవితం! ఆమె ఆయువు అర్థాంతరంగా ముగిసింది. మసి బారిన చంద్రబింబ మయింది. దీని కెవరు సాక్షి! అంతరంగంలో వెలుగు మాత్రమే! ఉదయం పత్రికల్లో వార్త! రంగు రంగుల దుస్తులు ధరించి వెలువడింది. ఆ రహస్య ఘటన విషయానికి వస్తే "సూర్యుడు అంబులెన్స్‌లో ఉలిపిరి మంచులో కదలుతూన్నట్లుంది". సూర్యుడు అంతరంగానికీ వివేకానికీ ప్రతీక. ఎవరూ చూడని స్థితిలో క్షతమైన విషాద సందర్భం కవితాత్మను పొందింది. ఇదొక ఉదాహరణ మాత్రమే.

సమాజంలో విషాదంతో సంవేదనతో వాతావరణంలో ప్లాస్టిక్ బొమ్మల మధ్య సూది మొనంత పచ్చదనంతో మనసులు గగనమంత ఆనందాన్ని పొందే క్షణాలు లేకపోలేదు. ఆ వస్తువు వేరు. బ్రతికే హక్కును కోల్పోయే స్థితులూ క్షుదా వ్యథితులై ఆయుధాన్ని ఆశ్రయించే సందర్భాలూ ఉన్నాయి. తాను చంపబడితే

అన్యాయం గానూ తాను చంపితే విజయం గానూ తలచే మనస్తత్వరీతులూ ఆయా వ్యక్తుల్ని బట్టి, స్థితుల్ని బట్టి కనిపిస్తాయి. ఈ రచనలో మారే దృష్టికోణాలూ తప్పే లక్ష్యాలూ అనేకం వాస్తవసాదృశ్యాన్ని పొందాయి. "మొగ్గలు కోరే ఇనుప చువ్వలూ" కదలిస్తే "నిప్పుకణాలురాలే చెట్లూ" సమాజంలో ఎదురవుతాయి. "నేడు రేపు మధ్య" కదలే కాల పటంపై సమాజ దృశ్య పరంపర ఆతంకం నుండి ప్రకంపనం దాకా పర్యాప్తమయింది.

ఇంకా జీవితంలో సంఘటిల్లే సంక్లిష్ట భావ వర్ణ రేఖలతోనూ చిత్రితమయింది. "కాలం విసరేజోక్" ఒక సమాజ కఠోర వాస్తవం. మానవ హృదయం వయోలిన్ వంటిది. మానవతా తంత్రులపై మీటే భావ రాగాన్ని బట్టి ఆకర్షిస్తుంది. దీనికి వ్యక్తిలో అంతరంగ శక్తి మూల ప్రేరణం. అశాంతి ప్రశ్న ఎప్పటికీ ఉన్నదే!

కిటికీ నుండి చూస్తే దూరం నుండి అందంగా కనిపించే ప్రకృతి దృశ్యం దగ్గరికి వెళ్ళితే శిఖర శిఖరానికీ మధ్య లోయలూ! విషమ తలాలూ! ఎదురవుతాయి. పయనం సులభం కాదు. అతీతంపై దృష్టి ప్రసరిస్తుంది. భౌతికేతరమైన ఆలోచనలోకి దిగుతుంది. అదే విధంగా సమాజ స్వరూపమూ. "నేడు రేపు మధ్య" కృతి, ప్రకృతి నేపథ్యం కలిగింది. సూక్ష్మ సూక్ష్మంగా స్థితి గతుల్లో జీవిత చలనమూ సమాజ గమనమూ చిత్రితమయింది. మనస్తత్వ ప్రకాశనమూ సత్ సంకల్పంతో పాటు కలిగింది. ప్రతి పయనానికీ ప్రయోజన లక్ష్యం ముఖ్యం. విధ్వంసానికయితే స్వేచ్ఛలో సాహసం సరిపోతుంది. నిర్మాణానికి స్వేచ్ఛలో సృజన శక్తి అవసరం.

ఈనాటి పరిస్థితుల్లో ఉత్తమమైన మానవ భవిష్యత్తుకు సమాజ ప్రవేశ ద్వార మొకటే! అది ప్రజాస్వామ్యం. "నేడు రేపు మధ్య" కృతి, కనిపించని సూక్ష్మాలతో క్లిష్టమైన కాలాన్ని దాని ప్రభావాన్ని కవితా మయం చేస్తూంది. స్వేచ్ఛా కవిత్వంలో మాదిరాజు రంగారావు "అగ్ని పీఠం" కావ్యం "క్రాస్ ఫైర్", "సీజ్ ఫైర్", "నేడు రేపు మధ్య" తో సమాకలితమయింది. వర్తమాన సామాజిక మానవీయ దర్శనం కలిగిన సృజన రూపం. నేటి సమాజానికీ ప్రకృతికి చెందిన స్థితి గతులతో వాస్తవ సదృశ మైన సంశ్లిష్ట కళాకృతిగా సమాలోచనంలో నిలుస్తుంది.

సృజనరూపం – మానవీయ భావనతో సమాలోచనాన్ని పొందిన ఈ కావ్యాలూ ఒక్కొక్కటీ ఒక్కొక్క ప్రత్యేకతను కలిగినవీ. స్వేచ్ఛా కవిత్వానికి వైవిధ్యాన్నీ వైశిష్ట్యాన్నీ చేకూర్చాయి. ఒక విధంగా విషయ దృష్టితో ఆయా క్షేత్రాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. ఇవి కవిలో సృజన ప్రతిభ యొక్క ప్రకాశ రూపాలు.

సాహిత్య సమాలోచనం

Literary Criticism -11

స్వేచ్ఛా కవిత్వ తత్త్వం – I

# ప్రజాస్వామ్య భావన

(మేనిఫెస్టో)


మాదిరాజు రంగారావు



2026

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ – 500 028

Literary Criticism -11

**Prajaswamya Bhavana**
**(Manifesto)**
(Sahithya Samalochanam)

by
*Prof. Madiraju Ranga Rao*

© : Dr. M. Santhosh Kumar

First Edition : 1992
Second Edition : 2002-2003
Third Edition : 2011
Fourth Edition 2026

# అంకితం

ఉదార ప్రజాస్వామ్య మనస్వి

రాజనీతివేత్త

రచయిత

పూర్వ ప్రధానమంత్రి

## మాన్యశ్రీ పి.వి.నరసింహారావు గారికి

హృదయ పూర్వకంగా.

# ప్రజాస్వామ్య భావన

## సూచిక


| | | పుట |
|---|---|---|
| 1. | స్వేచ్ఛా కవిత్వం – పరిచయం | 1 |
| 2. | ప్రజాస్వామ్య కవిత్వం | 8 |
| 3. | కవిత్వమూ – సృజనశక్తి | 12 |
| 4. | కవిత్వమూ – అనుభవమూ | 16 |
| 5. | స్వేచ్ఛా కవిత్వం – ఆధునిక పరిణామం | 22 |
| 6. | ఆధునిక కవిత్వంలో వస్తు రేఖలు | 26 |
| 7. | స్వేచ్ఛా కవిత్వం – కొన్ని సమస్యలు | 29 |
| 8. | ప్రజాస్వామ్య కవిత్వం | 36 |
| 9. | స్వేచ్ఛా కవిత్వం – ఆధునికత | 40 |
| 10. | మానవతావాదం – అవసరం | 43 |
| 11. | వర్తమాన కవిత్వం – స్వేచ్ఛా సమాజం | 47 |
| 12. | ప్రజాస్వామ్య యుగం – స్వేచ్ఛా కవిత్వం | 51 |
| 13. | స్వేచ్ఛకు అవకాశం – స్వేచ్ఛా కవిత్వం | 54 |

# 1. స్వేచ్ఛా కవిత్వం - పరిచయం

మరీ ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య ప్రభావంతో స్వేచ్ఛా కవిత్వం బహు విస్తృతంగా వెలువడింది. కాలం గడిచేకొద్దీ స్వేచ్ఛా స్పందనలతో దీని అస్తిత్వం ఎంతో వైవిధ్యంతో బలపడుతూ వచ్చింది. కవిత్వంలో సృజన స్వేచ్ఛకు కొత్త కవాటాలు తెరచినట్లయింది. సామాజిక స్పృహ, రాజకీయదృష్టి, మనస్తత్వ విశ్లేషణం, ఆధునిక ప్రకాశనంతో నిరంతరం కొత్తదనంకై అన్వేషణతో తెలుగులో కొత్త ప్రక్రియగా వెలసింది. విశిష్టమైన రూపాన్ని పొందింది. సహృదయుల ఆదరణనూ పొందింది. ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ దీని స్వేచ్ఛా స్థితిగతులకు ప్రేరకమయింది. సాహిత్య చరిత్రలో ఈ కాలాన్ని ప్రజాస్వామ్యయుగంగా లేదా స్వేచ్ఛాయుగంగా పేర్కోడం, భిన్న సిద్ధాంతాల్నీ, వివిధ దృక్పథాల్నీ గౌరవించే అనుకూల్యాన్ని గుర్తించడమే.

సమాజంలో ఆశించే ప్రతి ఉద్యమమూ ప్రతి ధోరణీ స్వేచ్ఛా కవిత్వంలో మునుముందుగా ప్రతిఫలించింది. ఒక విధంగా కాలానుగుణమైన బాధ్యతను వహించిందని చెప్పొచ్చు. ఈ స్థితి సాహిత్యంలో దీని అవసరాన్నీ అనివార్యతనూ సూచిస్తుంది. చారిత్రకంగానూ సామాజికమైన అవసరాలకనుగుణంగా నిశితనిశితంగా తీవ్రతీవ్రంగా చండచండంగానే కాక సూక్ష్మసూక్ష్మంగానూ స్పందించింది. వైయక్తికమైన అస్తిత్వరూపాల్నీ చిత్రించింది. ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని లీనం చేసుకొని పరిణమించింది. స్వతంత్రమైన నిర్మాణరూపంతో ప్రజల్ని ఆకర్షించింది. అన్నిటికీ అభివ్యక్తి వేదికగా స్థిరపడింది.

ఇందులో ప్రజాస్వామ్య స్వేచ్ఛా కవిత్వంలో శ్రామికవర్గానికే కాక ప్రగతి దృష్టితో సమాజంలో అన్ని వర్గాలకూ శ్రేణులకూ తరగతులకూ భేదరూపాలకూ ప్రాతినిధ్యం ఉంది. అంతకుముందీ చిహ్నాలు లేవని కాదు. ప్రజాస్వామ్యం సంప్రదాయ ప్రగతి సిద్ధాంతాల ప్రసారానికీ సమాలోచనకూ ఎంతో అనువైంది. ఈ కారణంగా స్వాతంత్ర్యానంతరం కాలం గడిచేకొద్దీ స్వేచ్ఛాకవిత్వం నైకముఖంగా వికసించింది.

1) ప్రజాస్వామ్యం, 2) మార్క్సియం, 3) సమన్వయం, 4) సమకాలిక సంప్రదాయం, 5) మావోపథం, సిద్ధాంతాలే కాక, 6) అనుభూతి, 7) అస్తిత్వవాదాలూ, 8) దిగంబర, 9) చేతనావర్త, 10) పైగంబర ధోరణులు కవిసేన, దళిత స్పృహ స్త్రీవాదాలతో సంపన్నమయింది. ఈ బహుముఖ వికాసం ప్రజాస్వామ్యంలో సహనంతో సమన్వయంతో ఇతరుల అభిప్రాయాల్ని మన్నించే గుణంతో, చర్చలతో సమాధానాల్ని అన్వేషించే శాంతి వర్తనంతో స్వేచ్ఛ కేంద్రంగా ప్రగతి వాతావరణం ఉండడంవల్లనే జరిగింది. మౌలికమైన

సంప్రదాయతలాలకూ ప్రగతి భావాలకూ సమాజంలో సంపూర్ణంగా అవకాశాలు లభించడమే, దీనికి కారణం.

స్వేచ్ఛా కవిత్వం పద్యం కన్నా భిన్నమైన విస్తృతమయిన పాత్రను నిర్వహించింది. దీని నిర్మాణ స్వరూపం ఇందుకనువైందిగాను రాణించింది. కొత్త సామాజిక సంస్కృతిని ప్రతిబింబించింది. దీన్ని సమీక్షిస్తే 1) సమాజపరంగా స్వేచ్ఛ సౌభ్రాతృత్వం, సమానత్వం, సామాజిక న్యాయం, లౌకికత, ప్రగతి భావనతోనూ, 2) వ్యక్తిపరంగా సంస్కరణరూపం అనుభూతిగుణం మనస్తత్వచిత్రణంతో, మౌలికమైన సంప్రదాయతలాలతో ప్రజాస్వామ్య ప్రభావశక్తి విశ్లేషణకందుతుంది.

విశ్వమానవ దర్శనంతో అంతర్జాతీయ భావనతో జాతీయ మరియు స్థానీయ స్పందనలతో వర్తించింది. ఎప్పటికపుడు సామాజిక పాత్రను నిర్వర్తించింది. సమాజంలో తటస్థపడే బహుజాతుల్ని గురించి, బృందాల్ని గురించి, సమూహాల్ని గురించి, భేదరూపాల్ని గురించి వృత్తుల్ని గురించి ఆలోచన జరిపింది. పీడనం నుండి ముక్తం చేసే క్రియాత్మకతను ప్రోత్సహించింది. ఎప్పటికప్పుడు ఈ దిశలో కులం మతం వృత్తి ఉద్యోగం రాజకీయం పాలన ప్రాంతం జెండర్‌కు సంబంధించిన విషమ సమస్యల్నీ బాధాస్థితుల్నీ చిత్రించింది. వీటిని ఎదుర్కొనే శక్తినీ ప్రేరేపించింది. విశాలమైన మానవీయ ప్రాతిపదికపై నిలిచింది. ప్రజాస్వామ్య వేదికగా నిలిచింది. ఇది ప్రక్రియలోని గొప్పదనాన్నీ, ఎన్నిటికో సరిపడే, ఎన్నిటినో తనలో ఇముడ్చుకునే రూపాన్నీ భావింపజేస్తూంది. వీటిని అనేకమైన ఉదాహరణలతో సంపన్నం చేయొచ్చు.

ఇందులో అంతర్జాతీయ తలంపై ప్రచలితమయ్యే మానవ హక్కుల్ని గురించే కాక, ఉదార తత్త్వస్థాయినీ, జీవితంలో బాధ వేదన పీడన వెనుకనుండి సామాజిక లక్ష్యనిర్దేశాన్నీ గమనించవచ్చు. ఇది ప్రజాస్వామ్యం మొదలుకొని, సంప్రదాయ భావన విప్లవం, సమన్వయం, మొదలుగా అనేక సిద్ధాంతాలలో ఆదర్శాలతో ప్రచలితమయింది. ఇది ఆధునిక కవిత్వంలో మరీ ముఖ్యంగా స్వేచ్ఛాకవిత్వంలో ప్రధానంగా ఉంది. ఖండఖండంగా ఎదురయ్యే మానవీయ తలంపై మానవతా స్పందనం, ఎప్పటికీ ఉండనే ఉంది. ఎక్కడికక్కడ ఎదురయ్యే సంఘటనలు సూక్ష్మసూక్ష్మ రేఖలతో చిత్రించడమూ కనిపిస్తుంది. సమాజంలో ఏదో సందర్భంలో పీడనో, బాధో, అలజడో, అపాయమో, హింసో, విద్రోహమో ఏదైనా కావచ్చు. సమాజంలో బాధలకుగురై, కారుణ్యాన్ని ఒలికే అనుభవాలు, భావసాంద్రతతో జీవితంలో దుస్థితి చిత్రితమవుతుంది. ఇవి ప్రతీకాత్మకంగానూ నిర్వహింపబడవచ్చు. వీటిలో, ప్రకృతి విపరీతాలతో పాటు సామాజిక

రాజకీయ వైయక్తిక తలాలపైనా, అనేకమైన దుస్థితుల దుర్ఘటనల చిత్రణం ఉంది. ఇది వర్తమాన స్థితిగతులకు కవి స్పందనరూపంగా కన్పిస్తుంది.

**2**

స్వేచ్ఛా కవిత్వంలో ప్రజాస్వామ్య వ్యవస్థలోని రాజ్యాంగ రూపాలపట్ల విశ్వాసంతో, సంప్రదాయ మూలాల్ని గుర్తిస్తూ ప్రగతి లక్ష్యాన్ని నిర్మాణాత్మకంగా దర్శించే కవిత్వాన్ని ప్రజాస్వామ్య కవిత్వంగా భావించడం సముచితం. ఈ సమాలోచనంలో సాహిత్యపరమైన అంశాలే కాకుండా అనుషంగికంగా, సామాజిక రాజకీయ మనస్తత్వపరమైనవీ చోటుచేసుకోడం జరుగుతుంది. ఇంకా స్వేచ్ఛా కవిత్వంలో భావరూపాలూ ప్రతీకలూ, మనస్తత్వ రీతులూ పురాబింబాలూ కవిత్వకళలో ఉపస్కరకంగా సముచితమైన పాత్రల్ని నిర్వహిస్తున్నాయి. ఈ వెలుగులో సమాలోచనం చేస్తే రోజురోజుకీ పెరిగే విస్తృతికీ వైవిధ్యానికీ ఆధునికకాలంలో వర్తమాన "ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ" మూలంగా కనిపిస్తుంది. కాబట్టి దీన్ని సాహిత్య చరిత్రలో ప్రజాస్వామ్యయుగంగానో, స్వేచ్ఛాయుగంగానో పేర్కోవచ్చు.

భావకవిత్వంలో స్వేచ్ఛ వ్యక్తినాశ్రయించింది. స్వేచ్ఛాకవిత్వంలో స్వేచ్ఛ, 1) వ్యక్తితోపాటు 2) ప్రధానంగా సమాజాన్ని ఆశ్రయించింది. ఇంకా, 3) ప్రక్రియాగతమూ అయింది. ఇందులో వ్యక్తి స్థాయినుండి సమాజస్థాయికి పెరిగే విస్తరించే రూపం స్పష్టంగా కన్పిస్తుంది. దీని ఫోకల్ (focal) కేంద్రం వేరు. కవి ఫోకస్ (focus)లో కన్పించే స్థితిగతులూ, వాటి అవగాహన, పరిశీలన, దర్శనం పూర్తిగా భిన్నం. భావ కవిత్వంలో స్వేచ్ఛకు సంబంధించిన 1) దిశ, 2) పరిధి, 3) ప్రయోజనం చాలా పరిమితమైనవీ. భావనలో కళాత్మకమైన సాంద్రతకు ఆధిపత్యం ఎక్కువ. అయితే స్వేచ్ఛా కవిత్వంలో దిశ, పరిధి, ప్రయోజనం చాలా విస్తృతమైనవీ. భావనలో మానవతా పూర్ణమైన సామాజిక స్పందనతో ప్రగతి లక్ష్యం ముఖ్యం. ఇది జీవిత చలనంలో జాతీయపరంపరా చేతనతో సామాజిక స్పందనతో ఎప్పటికపుడు దిశదిశనుండీ కొత్తను ఆహ్వానించే కళాత్మక గుణంతో ప్రవృత్తమయింది. సాహిత్య సమాలోచనంలో ఈ భేదాన్ని గుర్తించవలసిన అవసరం ఉంది.

**3**

స్వేచ్ఛా కవిత్వం ఆధునిక కాలంలో 1) సులభమైన ఉత్తమమమైన అభివ్యక్తి సాధనంగా స్థిరపడింది. 2) సంపూర్ణమైన స్వేచ్ఛకు అంటే నిర్మాణం మొదలుకొని వ్యక్తిగతమైన అభిప్రాయం సామాజిక దర్శనం దాకా నిలయమైంది, కావడంచేత

బహుత్వరలో వ్యాప్తిని పొందింది. 3) వర్తమాన సమస్యలు కేంద్రంగా సామాజిక రాజకీయ మానసిక స్థితిగతుల్ని చిత్రించే అవకాశం బాగా ఉండడంచేత యువగణాన్ని ఆకర్షించింది. 4) పరిధి చాలా విస్తృతమైంది కావడంచేత లక్ష్య నిర్దేశంతో పాటు ఆధునిక భావజాలానికి తగిందిగానూ రూపితమయింది. ఈనాడు పద్యంలో ఈ అంశాలు అక్కడక్కడా క్వాచిత్కంగా మెరపుతీగెల్లా కన్పిస్తాయి. పద్యంలో వివిధ శక్తిమంతమైన స్థానాల్ని ఆధునికావసరాలకు పూర్తిగా వినియోగించుకో వలసి ఉంది. దీనికి పద్యరచనా ప్రావీణ్యంతోపాటు, ఆధునిక సామాజిక తత్పరత కూడా అవసరం. పైగా దీని నిర్మాణ రూపమూ సులభం కాదు. నిర్మాణ సౌలభ్యం కలిగిన స్వేచ్ఛా కవిత్వంపట్ల మొగ్గు కవుల్లో సహజంగా ప్రవర్తిల్లింది. ఇది ఆధునిక సమాజావసరాలకు తగిన మానసిక వాతావరణాన్ని కల్పించింది. దీనికి కారణం కవుల్లో ఆధునిక సామాజిక తత్పరతయే. ఇదీనాడు నవమానవచరిత్రకూ, ఆధునిక జీవన సంస్కృతికీ ప్రాతినిధ్యం వహిస్తూంది. ఇది సహజమైన పరిణామం.

వర్తమానానికీ గతానికీ అనుబంధం వివిధ విషయాల్లో తప్పనిసరిగా కొనసాగుతూంటుంది. సాహిత్యానికి వస్తే గతంలోని భారతీయ పాశ్చాత్య సిద్ధాంతాలకు సంబంధించిన మౌలికమైన ఆలోచనల్ని విస్మరించడానికి వీల్లేదు. వీటి ఉపయోగమూ ఎంతో ఉంది. ఈ అంశాల్ని ప్రదర్శనశాల్లో శిల్పాల్లా కాకుండా, సహేతుకంగా ప్రయోజనపరంగా అన్వయించుకోని ఉపయోగించుకోవలసి ఉంది. వీటిని ఆధునిక కవిత్వంలో కళాత్మకమైన విలువలపై దృష్టితో సమన్వయం చేసుకోవడం సముచితం. దీనికి విమర్శకుల్లో గ్రహణగుణం వ్యాఖ్యానకౌశలం సమయపరివర్తనం గురించి విజ్ఞత, దర్శనశక్తీ అవసరం.

ఆధునికకాలంలో ప్రజాస్వామ్య సమాజంలో స్వతంత్రమైన ఆలోచనతోపాటు, కొత్తకొత్త నిర్మాణ రీతులతోపాటు, ఎన్నో వాదాలూ ధోరణులూ సిద్ధాంతాలూ ప్రకాశమానమవు తున్నాయి. దేనికది ఒక ప్రత్యేకమైన అధ్యయనపద్ధతి నపేక్షిస్తుంది. అందువల్ల కవిత్వ సమాలోచనమూ, ఒకే మూసలో పోసినట్లు జరపడం కుదరదు. దీనినుండి ముక్తమయి నప్పుడే, మంచి విమర్శ, ఉపయోగకరమయిన విమర్శ, హేతువుతో విజ్ఞతతో కూడిన విమర్శ ఆవిర్భవిస్తుంది. కవిత్వానికి సృజనశక్తి ఎంత ముఖ్యమో, ఈనాడు దీని వికాసానికీ ప్రశస్తికీ వ్యాఖ్యానమూ సమాలోచనమూ అంతే ముఖ్యం. ఈ ప్రక్రియ సమాజంలో ఉత్తమ సాహిత్య సంస్కారస్థాయిని పెంచుతుంది. సముచితమైన విలువల్ని కాపాడడమే కాక సాహిత్య వాతావరణాన్ని కొత్తదనంచేత ప్రకాశింపజేస్తుంది.

**4**

స్వేచ్ఛాకవిత్వానికి నియతమైన లక్షణం లేదు. కవి తనకుతానుగా ఏర్పరచుకొన్న నిర్మాణరూపం సద్యఃస్ఫూర్తితో ఏర్పడేదే. ఇది ఒక విధంగా దీని లక్షణపరిధిని విశాలతరం చేస్తోంది. ఇదో కట్టులో, చట్రంలో ఛందోగతంగా ఒదిగిఉండకపోవడంవల్ల, స్వేచ్ఛాగుణం చేత, కొత్త కొత్త నిర్మాణ రీతుల్ని పొందడమూ గమనించవచ్చు. స్థూలంగా, 1) శబ్దంలహరి వలె మరో శబ్దాన్ని అందుకొనీ వర్తిస్తుంది. 2) శబ్దం తరంగంవలె ఎగసి మరో శబ్దాన్ని పట్టుకొనీ కదలుతుంది. 3) వాక్యం మరో వ్యాక్యాన్ని అందుకొనీ, 4) మరోవాక్యంతో కలిసీ చరిస్తుంది. 5) లయచలనంతో, ప్రసారగమనంతో ఆకర్షిస్తుంది. 6) ధారాగతితో ప్రవహిస్తుంది. 7) ఇట్లా ఎక్కడికక్కడ ఆవేశస్థితిననుసరించి ఒకే స్థాయిలో లేదా వివిధ స్థాయిల్లో పై అంశాల సమాకలనం జరగవచ్చు. 8) ఆవేశ స్థాయిని బట్టి, భావ స్వరూపాన్నిబట్టి నిర్మాణ రీతినిబట్టి ఉద్గమన రూపం సిద్ధిస్తుంది. ఇది రచనలో ఖండఖండంగానూ సమూహాలు సమూహాలుగానూ, ఏకధారగానూ, సూత్రసదృశంగానూ వివిధ శిల్పాకృతుల్ని పొందేవీలుంది. 9) ఒక్కొక్కపుడు శబ్దం, శబ్దసమూహం, వాక్యం, దాని కదలికల్ని బట్టి, అక్కడక్కడా గుణరూపాలూ, మాత్రారూపాలూ చోటుచేసుకోనూవచ్చు. దీన్ని కవి ఉద్దేశించకనూ పోవచ్చు. అయితే పూర్వప్రక్రియల ప్రభావంవల్ల, గతంతో వీడని అనుబంధంవల్ల, ఈ స్థితి ఏర్పడుతుంది. దీన్ని నివారించనూవచ్చు. ఏమైనప్పటికీ సమాలోచనతో కవిత్వంలో పలు అంశాల్ని విశ్లేషించడం, చర్చకు నిలపడం, నిగ్గుతేలిన అంశాలతో లక్షణ స్వరూపాన్ని గుర్తించడం మునుముందు బాగా జరగవచ్చు. ఇది సమాలోచనా ప్రక్రియలో భాగం. 10) రచనలో సంభాషణ పద్ధతులూ, వచనరీతులూ, వచోవిన్యాసాలూ చోటుచేసు కుంటాయి. ఇవి వ్యవహారంలో ఉన్న భాషా సహజమైనవీ, వీటిలో పరంపరా ప్రభావం, ప్రయోగనవ్యత రెండూ దృష్టికి వస్తాయి. ప్రతి కాలంలోనూ మార్పులు వచ్చేప్పుడు అంతకు పూర్వం ఉన్న, పరంపరకు సంబంధించిన అంశాలు కొన్ని చోటు చేసుకుంటాయి. కొన్ని అపరిహరణీయాలుగానూ కన్పిస్తాయి. ఏదైనా చివరకు సృజనరూపం కవి బహిరంతర్వ్యక్తిత్వం పైనే సర్వం ఆధారపడి ఉంటుంది.

స్వేచ్ఛా కవిత్వం నిర్మాణంలో "షోపీస్" కాదు. ఏదో ఒక పోతలో ఒదిగిపోయే, "ముద్రాకృతి" అసలే కాదు. దీనికి "మోడల్" అనేది లేదు. కాబట్టి కవి నిర్మాణదృష్టినీ, కౌశల్యాన్నీ సృజనరూపంలో సిద్ధించే ప్రత్యేకతనూ బట్టి విభేదిస్తుంది. ఇది సంపూర్ణంగా కవి స్వేచ్ఛా మనోగతమయింది. ఏ సృజన రూపం అస్తిత్వాన్ని గురించీ, ఆవిష్కారం గురించీ, హేతురహితంగా సందర్భ శూన్యంగా ప్రశ్నించడం సమంజసం కాదు.

1) సామాజిక వాస్తవికత, 2) వేదనాస్పందనం ఈనాటి స్వేచ్ఛా కవిత్వంలో బాహ్యాంతర్విధాలు, రచనలో ఏకాకృతి పొందుతాయి. 1) సామాజిక వాస్తవికత అనేది ఒక్కొక్క కవిలో ఒక్కొక్కవిధంగా వ్యక్తిత్వ వికాసంతో అవగతికి వస్తుంది. 2) వేదనా స్పందనం అనేది రచన వెనుక నుండి పనిచేసే మానసికమైన విశ్లేషణం, పరిశీలనం చిత్రణంతో సంయుతమైందీ. చారిత్రక సాంస్కృతికభావ ప్రసారమూస్ఫూర్తికి వస్తుంది. వీటితో పాటు మానవీయమైన విలువల ప్రతిపాదనమూ ముఖ్యం. స్వేచ్ఛా కవిత్వం సహేతుకమైన మార్పులకు నిబద్ధమైందీ, లక్ష్యనిర్దేశం కలిగిందీ అవడంచేత వివిధాంశాల చక్కని సమ్మేళనంచేత కొత్తతరాల్ని బాగా ఆకర్షించడం సహజం.

**5**

మనిషిపై ఆశతో మనిషిలో శక్తిపట్ల విశ్వాసంతో, యుక్తిపట్ల ప్రత్యయంతో, మనిషి మనిషితో సంబంధం కోరే గుణంతో, మానవతా మనోజ్ఞంగా ప్రకాశించే స్వరూపం స్వేచ్ఛా కవిత్వంలో దర్శనమిస్తుంది. ఎప్పటికపుడు కొత్తను కోరే, మార్పుకు ప్రేరేపిస్తుంది. మార్పుకు సహకరిస్తుంది. మార్పును లక్షిస్తుంది. సమాజగమనంలో సముచితమైన పాత్రను నిర్వర్తిస్తూండడంవల్ల, చారిత్రక ప్రాధాన్యాన్ని సంతరించుకుని, కవిత్వమంటే ఈనాడు 'స్వేచ్ఛాకవిత్వం'గా అర్థస్ఫూర్తిని పొందింది.

మరో విషయం, సమాజ గమన చిత్రణంతోపాటు, మనిషి లోలోపలి వ్యక్తిత్వాన్ని గురించి ఆలోచనకు గురిచేస్తూంది. ఈ రెండింటి అనుబంధాన్నీ, సంబంధాన్నీ గురించి చింతనకు దారితీస్తూంది. కొత్తఊపిరితో, కొత్త ఆయువుతో, కొత్త ఆలోచనతో, ప్రగతి శీలంతో, ప్రజాస్వామ్య చేతనకు సంకేతంగా నిలిచిందీ స్వేచ్ఛా కవిత్వం. సాహిత్యపరంగా ఈనాడిది కొత్త సంస్కారంతో ఏర్పడిన వాతావరణానికనుగుణమైన తరం కవులతో నిండిపోయింది.

దీన్ని సమీక్షిస్తే, 1) స్వయంప్రేరణయుతమయిందీ, 2) కవి వ్యక్తిత్వంలో సంప్రదాయ సంస్కృతీ తేజంతో పాటు ఆధునిక సంస్కారం, మానవీయ స్పందన శక్తీ, సామాజిక తత్పరత, హేతుదృష్టితో వస్తు నవ్యత ఇట్లా అనేకాంశాల సమాహారంగా ఆవిష్కృతమయ్యే సద్యోరూపంగా గోచరిస్తుంది. ఇందులో 1) కథా పద్ధతికన్నా భావ విన్యాసానికే ప్రాధాన్యం, 2) కథన రీతులకన్నా భావయోజనకే ప్రాధాన్యం, కథ–కథనం అనగానే వచనత్వం చోటుచేసుకునే వీలెక్కువ. అయితే స్థూలంగా కథాసూత్రం ఉండవచ్చు. కథాంశం ఉండవచ్చు. కాని నిర్వహణం మాత్రం భావ స్థానాలపై భావగతులపై దృష్టితోనే సాగుతుంది. ఇవి వర్తమాన స్వేచ్ఛా కవిత్వంలో స్ఫుటంగా కన్పించే అంశాలు.

ప్రస్తుత సమాజంలో, పై వర్గాల నుండి క్రింది వర్గాల దాకా, అందరినీ కలుపుకొనీ, వారి జీవిత సమస్యలకూ సమాధానాలకూ ప్రాధాన్యమిస్తూందీ ప్రక్రియ. ఇది చాలా తక్కువ సమయంలో బహుముఖీనంగా విస్తరించడానికి కారణమిదే. ఆధునిక సాహిత్య చరిత్రలో స్వేచ్ఛా కవిత్వం, ప్రజాస్వామ్య యుగంలో కొత్త దిశకూ స్వతంత్రమైన అభివ్యక్తికీ సాధనంగా నిలిచింది. సామాజిక తత్పరతతో వ్యక్తి స్ఫూర్తితో, ఆధునిక సాహిత్య సంస్కృతిలో చారిత్రకమైన పాత్రను నిర్వహిస్తూంది. ప్రజాస్వామ్య సంవిధానం భూమికపై, సాహిత్య చరిత్రలో ప్రజాస్వామ్య యుగంగానూ / కవితా ప్రస్థానంలో స్వేచ్ఛాయుగంగానూ పరిగణించడానికి వీలైన అస్తిత్వాన్ని పొందింది.

**"అరుణకిరణం గుండెలో నిలిచి మనిషీ కదలిరా**
**మానవీయ సూర్యునితో ప్రజాస్వామ్య పతాకతో"**

# 2. ప్రజాస్వామ్య కవిత్వం

ఆధునిక స్వేచ్ఛా కవిత్వం ఈనాడు సమాజంలో ప్రచలితంగా ఉన్న ప్రజాస్వామ్య తత్త్వానికి ప్రాతినిథ్యం వహిస్తోంది. ఈ ఆధారతలంపై జీవితంలో భౌతిక చిత్రణంతో, మానసిక విలోకనంతో విశిష్టంగా ఉంది. నిరసన ప్రతిఘటన నినాదం సంఘర్షణ మొదలుగా ప్రస్తుత వ్యవస్థను వ్యతిరేకించే పద్ధతులు ప్రజాస్వామ్యంలో అనుమతించేవే. ఇటీవల విప్లవవాదులు అందునా రచయితలు తమ ఆదర్శాల్నీ అభిప్రాయాల్నీ ప్రకటించే స్వేచ్ఛా వాతావరణం ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసింది.

సాహిత్య ప్రపంచంలో ఈ ధోరణి వైవిధ్యంతోపాటు విలువలకీ దారితీసేది. సమాజంలో ఎప్పుడూ యథాస్థితికి ప్రగతి తత్త్వానికీ మధ్య సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. ఇది తప్పనిసరి, ఇది ఒక వ్యవస్థీకృతమై జరగడంవల్ల ఒక పద్ధతి అవలంబింప బడుతుంది. గతిలో వేగం వస్తుంది. ప్రయోజన విస్తృతి ఉంటుంది. గుణాత్మకమైన మార్పు వస్తుంది. దీని ఫలితం అందరికీ (అంటే ఎక్కువమందికి) అందుతుంది. ఇది వ్యక్తి నిష్ఠం కాక సమాజనిష్ఠంగా తన పాత్రను నిర్వర్తిస్తుంది. కాలం గడుస్తూన్నకొద్దీ కొత్త అనుభవాలు అవసరాలు ఎదురయ్యే కొద్దీ యథాస్థితి క్రమంగా ప్రగతికి దారి ఇస్తుంది. ఒకప్పుడు తప్పుకుంటుంది. ప్రగతి తత్త్వమూ కొంత సరిపెట్టుకొని పురోగమిస్తుంది. ఇది ఒకనాటితో ముగిసేది కాదు. తరం తరువాత తరం వచ్చేకొద్ది అనూహ్యమైన ప్రభావాలకు లోనై పరివర్తన కోరడం సహజం. సాహిత్యంలో మార్పు ప్రతిఫలనం అనివార్యం. ఈ మార్పు మిగతా ప్రక్రియల్లో కన్నా కవిత్వంలో ముందుగా వస్తుంది.

సాహిత్యంలో ముఖ్యంగా కవిత్వంలో ఇప్పుడున్న వాతావరణాన్ని బట్టి సంప్రదాయ చ్ఛాయలు, కాల్పనిక రీతులు అభ్యుదయధోరణి విప్లవదృష్టితోపాటు ప్రజాస్వామ్య దృక్పథం విమర్శకుల విశ్లేషణకందుతుంది. ఈ కాలం ఎన్నెన్నో ఆదర్శాలతో సిద్ధాంతాలతో అభిప్రాయాలతో సమాజంలో ఉన్న అన్నివిధాలైన జీవిత దిశల్ని స్పృశిస్తూ కన్పిస్తుంది. ఇది కాలం గడిచేకొద్దీ సంకుచితసీమల్ని అధిగమిస్తూ అంతర్జాతీయతను పొందుతూంది. ఇటీవల ఈ దృష్టితో ఇతర భారతీయ భాషల్లోను ప్రపంచ భాషల్లోను వచ్చిన మంచి కవిత్వాన్ని వెలుగులోకి తెచ్చే ప్రయత్నం జరుగుతూంది. ఆయా భాషల్లోని కవిత్వశక్తినీ మంచి స్థితిని పొందిన దిశను, ప్రదర్శిస్తూంది. తెలుగులో వచ్చే కవిత్వంలో శక్తినీ సుస్థితిని దిశనూ తులనాత్మకంగా పరిశీలిచేందు కుపకరిస్తుంది.

ఇప్పుడు తెలుగు సంప్రదాయం కాల్పనికం అభ్యుదయ విప్లవం ప్రసరించే వెలుగులతోపాటు వివిధ దృక్పథాల సమన్వయంతో ప్రజాస్వామ్య తత్త్వం ప్రధానంగా కవిత్వం వెలువడుతూంది. ఇటీవల కమ్యూనిస్టు దేశాల్లో ప్రజాస్వామ్యనికభిముఖంగా వచ్చే మార్పులు కూడ ఈ సందర్భంలో పరిశీలించవలసి ఉంది. తీవ్రవాదానికి కారణాలు దానిలోని ఉత్తమ గుణాలతోపాటు సత్త్వరం ఇతర వాదాల్లోని ఉత్తమ కోణాలను ప్రోత్సహించే వ్యవస్థ అవడంవల్ల ఈనాడు ప్రజాస్వామ్యం అవసరమౌతూంది. ఇది సమాజశ్రేయస్సు సౌభాగ్యం సమానత్వంపై దృష్టితో సంప్రదాయంనుండి సామ్యవాదం వరకు చారిత్రక పరిణామంలో భాగాలైన అన్ని ఆలోచనా ధోరణులకు తమతమ పాత్ర నిర్వహించే అవకాశం కలిగిస్తూంది. దేనికీ క్షతి ఏర్పడదు. వ్యతిరేకం ప్రతిపక్షం నిరసనం ప్రతిఘటన సంఘర్షణ అనేవి సామాజికంగా చూస్తే నాగరికత – సంస్కృతి వికాసంలో అనివార్యాలుగా చరిత్రలో కన్పిస్తాయి.

ఇవి వ్యక్తి స్వేచ్ఛకవకాశంతో పాటు సాంఘిక న్యాయానికి మానవజాతి సౌభాగ్యానికీ క్రమంగా దారితీసాయి. అయితే ఇవి అప్పుడప్పుడు అవసరం మేరకు వచ్చేవే కాని ఎల్లప్పుడు తీవ్రస్థాయిలో ఉండడం కుదరదు. కొంతకాలం విరామాన్ని పొందే స్థితి వస్తుంది. లేదా కాలంపై ఇతర శక్తులతో సమన్వయాన్ని పొందే స్థితి ఏర్పడుతుంది. ఈ దశలో ఉత్పన్నమయ్యే సాహిత్యం ప్రత్యేకంగా ఉండడం సహజం. కాబట్టి దేన్నీ సంపూర్ణంగా వేరుచేసి చూడడం కుదరదు. ఇతర విషయాలను కూడ పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ఏ వ్యక్తి ఇష్టానిష్టాలతో పనిలేకుండా సామాజిక తలంపై తమ తమ క్రియాత్మకమైన పాత్రల్ని నిర్వహిస్తాయి. ఈ విధమైన విభిన్న భావధోరణుల స్థితికీ క్రియాత్మకమైన పాత్ర నిర్వహణకూ ఆధారభూమి ప్రజాస్వామ్యం కావడం విశేషం. ఈ విధంగా చారిత్రక దృష్టితో సమన్వయ ధోరణిని అవలంబించే ఈనాటి ప్రజాస్వామ్య కవిత్వంలో ఈ క్రింది అంశాలు పరిశీలనకు వస్తాయి.

1) వ్యక్తిస్వేచ్ఛ, 2) సామాజిక న్యాయం, 3) కుటుంబ వ్యవస్థ నుండి అనేక కారణాలవల్ల దూరమై కొత్త అనుబంధాలేర్పడిన స్థితి, 4) నగర జీవనంలోని ఏకాంత ధోరణి, 5) మానసికమైన ఒత్తిడి–స్పందనం, 6) ఏకాంత ధోరణిని పోగొట్టే కార్యక్రమాల పట్ల కొత్తగా శ్రద్ధ, 7) సామాజిక శక్తులపట్ల ఆకర్షణ, వాటిని గురించిన ఆలోచన, 8) అస్థిరమైన స్థితి – అస్పష్టమైన అంచుల్లో భావ ధోరణి, 9) అన్నివైపులనుండి వచ్చే మార్పులకాహ్వానం – ప్రతిస్పందనం, 10) స్థానికం నుండి అంతర్జాతీయం దాకా ఆలోచనా ప్రభావాలతో రూపొందిన స్వీయవ్యక్తిత్వ వికాసం, 11) ప్రాచీనం నుండి ఆధునికం వరకు సంప్రదాయం నుండి విప్లవం దాకా మానవుని ప్రస్థానంలో వివిధ

సోపానాల అవగాహన, 12) హేతు దృష్టి–సంస్కరణం–పరివర్తనంతో నిత్యం మానవ ప్రగతిని సమాజశాంతిని కోరే ఆదర్శరూపం అనేవీ సందర్భంలో ప్రజాస్వామ్య యుగ కవిత్వ విశ్లేషణలో దృష్టికి వచ్చేవి.

ఒక విధమైన కవిత్వం నుండి మరో విధమైన కవిత్వాన్ని గుర్తించేందుకు 1) మూల వస్తువు ఎన్నిక, 2) స్థితి యోజనం, 3) భావప్రసారం, 4) నిర్వహణంపై దృష్టితో పాటు నిర్మాణరూపం, 5) అభిప్రాయ ప్రకాశనం – సిద్ధాంత ప్రతిపాదనం అనేవి గ్రహింపవలసినవి. వీటి ఉపయోగంలో కవికి స్వేచ్ఛ ముఖ్యం. ఇది అభివ్యక్తి శిల్పం మొదలుకొని సిద్ధాంత ప్రకటనం – ఆదర్శాల ఆవిష్కారం వరకు వ్యాప్తమైంది. ఇవి ఈనాటి ప్రజాస్వామ్య కవిత్వరూపంలో కన్పించే సాధారణాంశాలు. ఈ దృష్టితో దీన్ని వివేచింపవలసి ఉంది.

సమాజంలో పీడితులు తాడితులు గురించి సానుభూతితో వాళ్ళ పక్షం వహించి మాట్లాడడం ఈనాడు సర్వసాధారణమైంది. ఈ కారణంగా ఎప్పుడో కొత్తగా ప్రత్యేకంగా కన్పించిన ప్రగతి భావ పదబంధాలు, విప్లవ ప్రతీకలు భావరూపాలు ఇప్పుడు పడికట్టు రాళ్ళుగా పరిణమించడం సహజం. ఇవి స్థిరపడినాయి. సాధారణ స్థితిని పొందినాయి. ఒక వాతావరణాన్ని పురస్కరించుకొని ఒక కాలంలో దానికి తగిన విధంగా యోజితమైన ఈ పదబంధాలు ప్రతీకలు భావరూపాలు మొదలైని ఎప్పటికీ ఎవరో కొందరి సొత్తుగా పరిమితంగా ఉండిపోవు, ఇవి సాధారణ్యాన్ని పొందుతాయి. దానికి సంబంధించిన వాతావరణాన్ని చిత్రించేప్పుడు, సూచించేప్పుడు భేదభావం లేకుండా అంతా నిస్సంకోచంగా ఉపయోగించడం జరుగుతుంది.

ఇక ఈనాటి స్వేచ్ఛా కవిత్వానికి వస్తే ఇందులో సామాజికంగా వైయక్తికంగా సంఘర్షణకు సంక్లిష్టస్థితికి దారితీసే భౌతిక శక్తుల్ని మనోరీతులను చిత్రించడం కన్పిస్తుంది. జీవితంలో సమస్యలపట్ల సందర్భాలపట్ల అవగాహన ఆలోచన స్పందనం, దృష్టిలో భేదం, లక్ష్యంలో భేదం ఒక రచయిత నుండి మరో రచయితను విభేదిస్తుంది. ప్రతి వ్యక్తి తనదైన ప్రత్యేక పద్ధతితో స్పందించడానికి ప్రతిక్రియ నెరపడానికి సృజనశక్తి వికాసానికి స్వేచ్ఛ ముఖ్యం. అవకాశం అవసరం. ఒక సిద్ధాంతంపట్ల ఆదర్శం పట్ల అభిలాష ఆలోచనా పథం ఉండడం వేరు. దానికాచరణ రూపమివ్వడం వేరు. దాన్ని ఆచరణలో పెట్టే స్థితి వేరు. దీన్ని కవిత్వంలో నిబంధించడానికి కావలసిన శిల్పకళావిభాగం వేరు. ప్రత్యేకమైన దృష్టి అవసరమౌతుంది. దీన్ని చిత్తశుద్ధితో అనుసరించడమే నిబద్ధత. ఇందులో కష్టాలు సైతం ఎదుర్కొనే సంకల్పశక్తి ఉంది. కార్యరూపంలోకి పరివర్తింపజేసే క్రియాశక్తి ఉంది. ఇది రచయిత సంపూర్ణ వ్యక్తిత్వాన్ని

కవిత్వంస్థాయిని పెంచేందుకుపకరిస్తుంది. సమాజంలో కవి తానే వ్యక్తిత్వ నిర్మాణం కలిగి ఉన్నాడో దాని కనుగుణంగానే కవిత్వ మావిర్భవిస్తుంది. ఇది సహజం కూడా.

ప్రజాస్వామ్యం మానవజాతి శ్రేయస్సు కుపకరించే అన్ని సిద్ధాంతాల్లోని గుణాల్ని మన్నిస్తుంది. వేల వ్యక్తిత్వాల్ని వేయి విధాలుగా వికసింపజేసి సమాజానికి సంపూర్ణతను సిద్ధింపజేస్తుంది. అనంతకాలంపై ఒక్కొక్కటి ఒక్కొక్క విధంగా ఉపకరించవచ్చు. ఒక్కొక్కదాని ప్రయోజనం ఒక్కొక్క విధంగా పరిణమించవచ్చు. ఈ దృష్టితో ఆలోచనల్ని ప్రతిబింబింపజేస్తూ ప్రగతిని కాంక్షించేదే ప్రజాస్వామ్య కవిత్వం. దీని పరిధి ఎంతో విస్తృతమైంది, స్వరూపంలో వైవిధ్యం కలిగింది. ఆచరణీయమైన స్థితిని పొందింది, మానవజాతి సౌభాగ్య భవిష్యత్తుకు ఆవశ్యకమైంది. ఈనాటి తెలుగు సాహిత్యంలో 1) స్వేచ్ఛ–స్వాతంత్ర్యం, 2) సంస్కరణ–పరివర్తనం, 3) ప్రగతి – మానవతాభావన, 4) శాంతి–సౌభాగ్యం, 5) సౌందర్యం–సమానత్వం, 6) సంప్రదాయమూలాలు– విశ్వభావన పట్ల ఆకాంక్షతో అవతరిస్తూంది ప్రజాస్వామ్య కవిత్వం.

**"నాలో మానవతా మేఘం**
**ప్రజాస్వామ్య సందేశంతో"**

# 3. కవిత్వమూ - సృజనశక్తీ

ఒక స్థితి గురించి ఆవేశం, ఒక సంఘటన గురించి ఆవేదన, ఒక వస్తువు గురించి ఆలోచన ఒక్కొక్క కవి మనస్సులో ఒక్కొక్క విధంగా ప్రసారమౌతాయి. ఒక్కొక్కరొక్కొక్క విధంగా స్పందిస్తారు. వివేచన చేస్తారు. ప్రతిక్రియ నెరపుతారు. విశిష్టమైన దృష్టినవలంబిస్తారు. ఆదర్శాన్ని కలిగి ఉంటారు. ఇది వాక్ దశకు పూర్వస్థితి. దీన్ని అనుసరించి శబ్దం అర్థసహితమైన వాక్యవిన్యాసంతో నిర్మాణరూపం పొందుతుంది. సమాహారంగా కవి వ్యక్తిత్వం సిద్ధిస్తుంది. ఎన్ని అభిప్రాయభేదాలున్నా దానికి కారణమైన సృజన శక్తి మాత్రం ఎటువంటి అభిప్రాయ భేదాలతో నిమిత్తం లేనిది, అందరికీ ఆమోదయోగ్యమైందీ, అందరినీ ఆకర్షించేదీ.

ఏది కవిత్వం? ఏది కవిత్వం కాదు? అనే ప్రశ్నలు తరువాత ఉత్పన్నమయ్యేవి. సామాన్యస్థాయి నుండి పై విశేషస్థాయికి పోయే కొద్దీ అభిప్రాయ భేదాలనేకం ఉత్పన్నమౌతాయి. సాధారణ పాఠకులు, అభిమానులు, విమర్శకులు, సహృదయులు, కవులు వీరు సమకాలీనంగా ఎట్లా ఉన్నా కాలం గడిచేకొద్దీ ఆపైన దీన్ని గురించి ఆదరించడమో ఆలోచన చేయడమో నిజంగా జరుగుతుంది.

కవితా ప్రస్థానంలో అన్ని విధాలైన కవిత్వమూ పరిణామదశల్లో వివిధ రూపాలుగా వచ్చినా మొత్తం మీద మానవ సంస్కృతీ రూపంతో నిబద్ధమైనవే. ఆయా భాషా సాహిత్య శక్తుల విస్తృతినీ వైవిధ్యాన్నీ కలిగించే మాట వాస్తవం. ఎటువంటి గొప్ప సృజనశక్తిని ఆవిష్కరించేదైనా ఎంతటి ప్రభావ సంపన్నమైనదైనా దానితో తృప్తిపడి సాహిత్య ప్రపంచం ఊరకనే ఉండిపోదు. ఉండలేదు కూడా. తర్క వితర్కాలు సాగుతూనే ఉంటాయి. ప్రశ్నలు వెలువడుతూనే ఉంటాయి. ఏవో సమధానాలు వస్తూనే ఉంటాయి. ఇవి ఎప్పటికపుడేదో తృప్తిని కలిగిస్తూ ఉంటాయి. తిరిగి సందేహాలు తలెత్తుతూంటయి. మరో సృజనాత్మక కృతి వస్తుంది. కొత్త సమస్యలుత్పన్నమౌతూనే ఉంటాయి. అసలు కవిత్వమంటే ఇట్లా ఉండాలన్న అభిప్రాయం ఎప్పటికపుడు కొత్తకొత్తగా పాఠకుల విమర్శకుల కవుల హృదయాల్లో ఉద్యమిస్తూనే ఉంటుంది. ఇది ఒకనాటితో ఒకచోట ఒక ఆలోచనా పరిమితిలో నిలిచేది కాదు. అలంకార శాస్త్రమంతా ఇట్లా వివిధ దశల్లో అవతరించిందే. సాహిత్య విమర్శ అంతా ఇట్లా వివిధ పద్ధతుల్లో వెలసిందే. ఈ కారణంవల్ల పోనుపోను ఒకే కాలంలో ఒకే యుగంలో భిన్నభిన్నంగా కవిత్వం వెలువడుతుంది.

ఒకే కవి వివిధ సందర్భాల్లో భిన్నభిన్నంగానూ కవిత్వాన్ని సృజించడమూ కన్పిస్తుంది. ఈ యుగాన్నే తీసుకుంటే ఒకే కాలంలో ఇంచుమించుగా కాల్పనికం అభ్యుదయం ప్రజాస్వామ్యం విప్లవం సంప్రదాయం నవ్యసంప్రదాయ పద్ధతుల్లో వివిధ గుణాలతో వాటి కలయికతో కవిత్వాలు వచ్చాయి. ఒకే కవికి సంబంధించినవి ఈ లక్షణాలతో రచనల్ని చూడవచ్చు.

శ్రీశ్రీ కవిత్వాన్ని తీసుకుంటే ప్రభవ వ్రాసిన సమయం వేరు. అప్పుడాతని కవిత్వస్ఫూర్తి వేరు. ఆయన భావించిన కవిత్వ నిర్వచనం వేరు. కాలం మారింది. ఆయన ఆలోచనలు మారాయి. జీవిత దృక్పథం వేరైంది. ప్రయోజనం మారింది. కవిత్వం భిన్నమైంది. దీనికనుగుణంగా రూపం నిర్వీమణం లక్ష్యం మారడం సహజం. ఇదేకాలంలో ఇటువంటి స్థితిలో ఇంకొకరిలో ఈ మార్పు రాకపోవచ్చు. ఒకవేళ వచ్చినా ఈ విధంగా ఉండకపోవచ్చు. సృజనశక్తిలోని విశిష్టత ఇదే. శ్రీశ్రీలో ప్రభవ తరువాత వచ్చిన మార్పును బింబించే మహాప్రస్థానం ఆ తరువాత మరో మహాప్రస్థానం అవతరించాయి. పద్యం నుండి మాత్రాఛందస్సు ఆపైన వచన కవిత్వం ఆ తరువాత జానపద ఛందోఫణితుల్లో రచనల్ని గమనిస్తే సంప్రదాయం కాల్పనికం అభ్యుదయం విప్లవం మార్గాల్ని సూచించే విభిన్న లక్షణాల్ని గుర్తించవచ్చు. రచనల్లో బహిస్స్వరూపంలో అంతస్స్వరూపంలో లక్ష్యనిర్దేశంలో మార్పు స్పష్టం.

దీన్ని బట్టి భిన్న కవులతోపాటు ఒకే కవిలోను కాలంపై వచ్చే మార్పుల్ని బట్టి కలిగే దృష్టిభేదం వల్ల కవిత్వ నిర్వచనమూ మారుతుందన్న విషయం ఆలోచనకు వస్తుంది. కాలం గడిచేకొద్దీ అన్నిటిలోను మూలభూతమైన కవితాస్పర్శలో సృజనశక్తి గుర్తింపబడి నిలిచిపోతుంది. దాశరథి రచనల్లో పద్యం గేయం స్వేచ్ఛా కవిత్వ రూపాల్ని ఈ సందర్భంలో గమనించవచ్చు. పాఠకులు అభిమానులచేత ప్రచారాన్ని పొందుతుంది. కవులచేత పరంపరగా కొనసాగింపబడుతుంది. ఈ అంశం సమకాలీన పరిస్థితుల్లో అతివ్యాప్తి అవ్యాప్తి దోషయుతమైనా ఎన్నో వ్యవహారకారణాలవల్ల లౌకికదశలో ఎక్కడికక్కడ విడివిడిగా ప్రచారరూపంలో ఉన్నా ఆపైన సందేహాలకు ప్రశ్నలకు చర్చలకు స్థానీయమై కాలాన్ని అధిగమించిన మరో రూపంతో ఆలోచనకు వస్తుంది.

కవిత్వంతో సంబంధం ఉన్నవాళ్లు సమాజంలో సాధారణ పాఠకులు అభిమానులు విమర్శకులు సహృదయులు పండితులు కవులు. వీళ్ళవల్ల వేదసూక్తాల నుండి ఈనాటి కవిత్వం దాకా కవిత్వం ప్రత్యేకమైన స్థానాన్ని పొందింది. ఎవరికివారు చదువుకోడం అట్లా ఉంచి ఒకరు వినిపిస్తే మరొకరు వినే స్థితి ప్రాచీనకాలం నుండి వస్తూంది. లవకుశుల రామాయణ గానం అంతకుపూర్వం ప్రాచీనకాలం నుండి వచ్చే వేదపఠనం

మన దృష్టికి వస్తాయి. ఒక్కరే చదువుకునే కంటే ఈ విధంగా శ్రోతగా ఆనందించే అవకాశంవల్ల కలిగే ప్రయోజనం వేరు. స్వల్పసంఖ్యలో ఉన్న సమావేశాల్లోను బహుళ సంఖ్యలో ఉన్న సభల్లోను ఈ పద్ధతి బాగా రాణింపుకు వచ్చింది. ఇదే కావ్యపఠనం కావ్యగానం కావ్యగోష్ఠి కవిసమ్మేళనం అనీ ప్రముఖంగా వ్యాప్తిలో ఉంది. కవి సమ్మేళనం ఇటీవల బాగా ప్రచారంలో ఉంది.

ఆధునిక యుగంలో నలభై యాభై ఏండ్ల క్రితం భావ కవితోద్యమ నాయకుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి తన కృతులనే కాకుండా సమకాలికులైన ఇతర కవుల కృతుల్ని గానంచేస్తూ ఊరూరు తిరుగుతూ ఆధునిక కవిత్వానికి విశేష ప్రచారాన్ని కలిగించిన విషయం అందరికీ తెలిసిందే. పాఠకులు తాము చదివేప్పుడు స్థితిని ఆలోచనాత్మకంగా మలచుకుంటారు. అదే తాము వినేప్పుడు ఆవేశాత్మకంగా తీర్చబడుతుంది. కృష్ణశాస్త్రి చేసిన కవితాగానం ఎక్కడా రికార్డు చేయబడకపోవడం మన దురదృష్టం. విశ్వనాథ కావ్యపఠనం మధ్య మధ్య వ్యాఖ్యాన సుందరంగా చిన్న చిన్న కథలతో ఆవేశ భాసురంగా ఎంతో ప్రభావోపేతంగా ఉండేది. ఎంతసేపైనా మహనీయమైన ఆకర్షణస్థాయి తగ్గేది కాదు. ఇక దాశరథి నారాయణరెడ్డి ఇరువురు భిన్నరీతుల్లో కావ్యగానం చేస్తూ ఆంధ్రదేశంలో ముఖ్యంగా తెలంగాణాలో ఆధునిక కవిత్వాన్ని ప్రజల దగ్గరికి తీసికెళ్ళి సమాజంలో సాహిత్య చైతన్యం కలిగించిన సంగతి అందరికీ తెలిసిందే. ఇట్లా ఎందరో! వీరంతా తమ కృతుల్ని మాత్రమే చక్కగా గానం చేసేవారు లేదా పఠనం చేసేవారు. కేవలం కావ్యగానం లక్ష్యంతో వివిధ కవుల కృతుల్ని ప్రజల మధ్యకు తీసుకొని వెళ్ళే సాహిత్యయత్నం కృష్ణశాస్త్రి తరువాత జరగలేదనే చెప్పాలి. దీనికెంతో ఉదార హృదయం అవసరం. అయితే బెంగాల్‌లో ఈ పరంపర ఉంది. ఇక్కడ ఉదార హృదయం అట్లా ఉంచి కవిత్వ ప్రచారంతో పాటు ధన సంపాదనంపై దృష్టి అధికం. అంతో ఇంతో శ్రమించి వివిధ కృతుల్ని అభ్యసించి వివిధ కవుల కవిత్వాల్ని ఆకర్షణీయంగా గానంచేసి ధన సంపాదనం చేసే సంచార బృందాలు సుమారు నలభైదాకా ఉన్నట్లు చెబుతారు. ఇటీవల బెంగాల్‌లో గౌరీ ఘోష్ ఆమె భర్త పార్థఘోష్ ఇరువురు ఆధునిక కవిత్వాన్ని గానం చేస్తూ ప్రజలను ఆనందపరవశుల్ని ఆలోచనా నిమగ్నుల్ని చేసే కార్యక్రమాలు చేపట్టారు. ఇక్కడ ధనార్జనతోపాటు సాహిత్యాభిలాష ప్రచార తత్పరత ఉంది. బెంగాలీయులకు సాహిత్యమన్నా కళలన్నా అందునా కవిత్వమంటే ఎక్కువ ప్రీతి కావడంచేత ఈలాంటి కార్యక్రమాలు విజయవంతమే అవుతాయి.

ఈ కార్యక్రమాల్లో వివిధ దృక్పథాల కవిత్వం వినబడుతుంది, ముందు మాటలతో ఆరంభించి మధ్య మధ్య సందర్భోచిత వ్యాఖ్యలతో వివరణలతో సాగుతుంది. కావ్యగానం

వివిధ గతి విశేషాలతో భావస్ఫూర్తితో మంచి స్వరసంయుతంగా నిర్వహించడం వీరి ప్రత్యేకత. ఖాజా నజ్రుల్ ఇస్లాం కుమారుడు ఖాజా సవ్యసాచి ప్రత్యేక పద్ధతిలో చేసే కావ్యగానం జనామోదాన్ని పొందింది. ఈ సందర్భంలో హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ్‌నూ పేర్కొనవచ్చు. ఆయన పఠనం భవస్ఫోరకంగా ఉంటుంది.

కావ్యపఠనం, కావ్యగానం ఒక కళ. కవి వ్రాసింది అర్థం చేసుకొని అందులోని భావానికి తగినట్లుగా ఉద్రేకాన్ని పొంది ఆలోచనను గుర్తించి తగినస్థాయిలో స్వరాల్ని పలుకుతూ అందులోని గతిభేదాల్ని వైవిధ్యాన్ని మధ్యమధ్య ప్రదర్శిస్తూ గానం చేయడం ఒక కళే. హిందీలో నీరజ్ కవి ఈ విధానంలో శ్రోతల్ని ఆకర్షించే శక్తిసంపన్నుడు. అయితే స్వయంగా తన కృతిని మాత్రమే కవి గానం చేయడం వేరు. ఇతర కృతుల్ని కళాత్మకంగా గానం చేయడం వేరు. బెంగాల్‌లో ఈ విధమైన కావ్యగానంలో శిక్షణనిచ్చే పాఠశాలలున్నట్లు వినబడుతుంది.

ఈ విషయం ఎందుకు ప్రసక్తమైందంటే కవిత్వానికి ప్రకాశమాన స్థితి కూడ అవసరమే. కావ్యగానం లేదా కావ్యపఠనం ఈ అవసరాన్ని చాలావరకు తీరుస్తుంది. దీనివల్ల ప్రజల్లో సాహిత్యాభిలాషను పెంపొందించే ప్రయోజనం సిద్ధిస్తుంది. యువతరంలో ఉత్సాహం వెలుగుతుంది. సాహిత్య వాతావరణాన్ని నిర్మిస్తుంది.

స్వేచ్ఛాకవిత్వం వచ్చాక కవిత్వాన్ని గానంచేసే పద్ధతి కవకాశం లేకుండా పోయింది. అయితే భావవ్యంజకంగా గతి విశేషస్ఫూర్తితో ప్రత్యేక పద్ధతుల్ని అనుసరించి చదివే వీలు లేకపోలేదు. కవిత్వం వినేప్పుడు ఏది కవిత్వం? అన్న ప్రశ్న జనించదు. ఆ తరువాతనే చర్చకు రావచ్చు. కవిత్వం చదివేప్పుడు ఉత్పన్నం కావచ్చు. ఎందుకంటే ఆలోచనకు సమయం ఉండాలి మెల్లగా వీలు చేసుకోవచ్చు. మానవునిలో జిజ్ఞాస ఆలోచనా శక్తి అన్వేషణ హేతుదృష్టి ఉన్నంతవరకీ చర్చలు ఉంటూనే ఉంటాయి. కవిత్వం దారిన కవిత్వం – స్పందన శక్తి సృజనగుణం ఉన్నంతవరకు వస్తూనే ఉంటుంది. కవిత్వం ఎవరికోసం? ఎందుకు? అనే ప్రశ్నకు సమాధానం, "వ్యక్తి జీవితం ఎవరికోసం? ఎందుకు జీవించడం?" అన్న ప్రశ్నలకు దొరికే సమాధానంలోని భాగమే కాని వేరు కాదు. జీవితంలో ప్రత్యేకత వైవిధ్యం ప్రయోజనమే కవిత్వంలోనూ తప్పనిసరిగా ఉంటుంది. జీవితంలోని అస్తిత్వమే కవిత్వం పొందే రూపం.

# 4. కవిత్వమూ - అనుభవమూ

కవిత్వం చదివేప్పుడు లేదా వినేప్పుడు మొదట పరిచయానికి వచ్చేది శబ్దం. శబ్దాల క్రమ విన్యాసంలో అర్థం – భాగాలుగా వాక్యం, ఆపైన విభాగంతో ఖండాలుగా భావం ఆపైన సమాహారంగా అవగతికి వస్తుంది. సామాన్యార్థానికతీతమైన ఆలోచన మన సంస్కారాన్ని బట్టి, భావనాస్థాయిని బట్టి విశిష్టమైన సౌందర్యం స్ఫూర్తి వస్తుంది. ఈ స్ఫూర్తి విశేషం మనస్సుకు ఒక ఆలోచనను ఒక తాదాత్మ్యాన్ని లేదా విలీనత్వాన్నీ కలిగింపజేస్తుంది.

ఇది స్వేచ్ఛా కవిత్వంలో తరంగసదృశంగానూ, ప్రవాహసదృశంగానూ మనస్సును స్పృశిస్తుంది. ముంచెత్తుతుంది. ఈ పరిస్థితిలో మనస్సు ఆలోచనకూ పరివర్తనకు లోనవుతుంది. ఆనందానికి దారితీస్తుంది. ఆపైన అనుభవముద్ర బలమైన ఆకర్షణ కేంద్రంగా మనస్సులో నిలుస్తుంది. ఒకదాని తర్వాత మరొకటి కలిగే అనుభవ ముద్రలన్నీ ఆ తర్వాత కలిగే అనుభవానికి దోహదం చేసేవిగా ఉంటాయి. ఇది సాహిత్యాభిలాషను విస్తృతం చేస్తుంది. ప్రవేశ సౌలభ్యానికి దారితీస్తుంది. వైవిధ్యాన్ని సంతరింపజేస్తుంది. వివేచనను పెంపొందింపజేస్తుంది. సౌక్ష్మ్యాన్ని దర్శింపజేస్తుంది ఈ కవిత్వానుభవం ఒక ప్రమాణస్థాయిని అందుకోవడంతో పరిణతమైన మనస్థితి చేకూరుతుంది. పద్యానుభవం కన్నా ఈ క్రమం భిన్నమైంది. పద్యరచనలో సాధారణంగా ఏ పద్యానికది పూర్ణమైతే స్వేచ్ఛా కవిత్వంలో ఒక స్థితి లేదా ఒక భావాన్ని బట్టి వాక్యం లేదా వాక్యసముదాయం పూర్ణభాగంగా విభాజితమవుతుంది.

పాఠకుల లేదా శ్రోతల సంస్కారాన్నిబట్టీ భావనా శక్తినిబట్టీ, ఆర్ద్రమైన మనోలక్షణాన్ని బట్టీ ఉత్తమ కవిత్వంలోని విలువలు ప్రకాశమానమౌతాయి. ఇక్కడ కొన్ని దిశలు ఒకదానితో మరొకటి అనుబంధంతో క్రమించడం గమనించవచ్చు. 1) శబ్దాలు గ్రహించడం, 2) అవయవార్థం అవగతికి రావడం, 3) భావన ప్రసరించడం, 4) పరివర్తనకు లోనుకావడం, 5) తాదాత్మ్యం పొందడం, 6) అనుభవంగా నిలిచిపోవడం, 7) విమర్శనాత్మకత కలగడం, 8) ప్రభావకేంద్రంగా రూపొందడం, 9) ఇది మరో అనుభవాన్ని విస్తృతం చేయడం లేదా గాఢతరం చేయడం, 10) సమాహారంగా విశిష్టమైన వ్యక్తిత్వ నిర్మితి జరగడం. ఈ అంశాలు క్రమంలో దశదశలుగా, స్పష్టంగా మన అవగతికి వచ్చేవి. ఈ పరిణామం ప్రతీ రచన గురించి ఉంటుంది. అయితే ఉత్తమ రచనలవల్ల కలిగేది గాఢమైందీ సూక్ష్మమైందీ, నిశితమైందీ. ఒక రచన చదవకముందూ,

చదివాకా ఆ తరువాత తరువాత ఉండే తారతమ్యం స్పష్టంగా అనుభవానికి వస్తాయి. ఒక కొత్త వెలుగులో, ఒక కొత్త ప్రపంచంలోకి చేరి కొత్త కొత్త దృశ్యాలను చూస్తూ, కొత్త కొత్త లక్ష్యాలను అందుకున్నట్లుంటుందీ అనుభవం.

స్వేచ్ఛా కవిత్వంలో ఆలోచన, అనుభవం రెండూ సంయోచితమై కల్పించే భావరూపాలు సాధారనంగా ఏదో ఒక భావకేంద్రాన్ని, లేదా కొన్ని భావస్థానాలనో ఆశ్రయించి ఉంటాయి. ఇందులో కథ ఉండదు. కాని స్థితి ఉంటుంది. కొన్ని స్థితుల యోజనం ఉండవచ్చు. అది వస్తుగతం కావచ్చు. మనస్తత్వయుతం కావచ్చు, కేవలం భావవిన్యాసం కావచ్చు. ఈ సృష్టిలో మనఃప్రపంచం, అందులోని రహస్యాలు – స్మృతులు – వీటిని వెలికితీసే ప్రయత్నం, వర్తమాన చిత్రణం – ఎక్కువగా కన్పిస్తాయి.

ఈ సమాజంలోని వాస్తవం, జీవితంలోని అనుభవం రెండూ దీన్ని ప్రభావితం చేస్తాయి. వాస్తవికత జీవితానికి సంబంధించింది. అనుభవం మనోగతికి సంబంధించింది. కవిత్వంలో రెండింటినీ వేరుచేసి చూడలేం. వీటి సహభావం ఒక స్థాయి చేరినపుడు ఉదాత్తతను సంతరించుకుంటుంది. ఇది దర్శనశక్తి వికాసంతో లేదా తేజంతో, అసాధారణమైన తాత్త్వికతను సంతరించుకుంటుంది.

ప్రతి వ్యక్తిలోనూ "అహం" ఉంటుంది. ఇది ఒక్కొక్కపుడు క్రియాశీలాన్ని వేగవంతం చేస్తుంది. ఇది రూపానికీ గాఢత్వాన్నీ నైశిత్యాన్నీ కలిగింపజేస్తుంది. అయితే ఇది ఉత్తమ కార్యాల్లో స్వార్థాన్ని వీడి నిర్మలినత్వాన్ని పొందుతుంది. అపుడు ఉజ్జ్వలతను పొందుతుంది. ప్రేరకశక్తిగా నిలుస్తుంది. ఇది క్షణాల్లో జరిగేది కాదు. దీనికి కొంత సమయం పడుతుంది. దీనికి కొంత సహనం కావాలి. స్పందనతో వేదనతో ఆలోచనతో ఏర్పడిన ఒక తీరులో మనస్సు ప్రవహించాలి. ఒక క్రమంలో మనస్సు మలినరహితం అయ్యేకొద్దీ తేజోవంతంగా ప్రకాశించేకొద్దీ "అహం" స్థానంలో దార్శనికత సిద్ధిస్తుంది.

కవిత్వంలో కథా ప్రణాళిక లేనపుడు ఉద్వేగం పాలు తగ్గినపుడు, ఆలోచనానుభవం ప్రధానంగా వివిధ భావకేంద్రాల సంయోజనంతో, భావస్థానాల సంపుటితో, ఏర్పడిన స్వేచ్ఛా కవిత్వాన్ని అర్థం చేసుకోడానికి, ఆయత్తమయ్యేసరికి కొంత సమయం పడుతుంది. దీనితో పరిచయం అయ్యాక, ఏర్పడిన రూపంలోని తీరు తెలిసాక, శిల్పంలోని ఒడుపు చిక్కాక, ఒక తెన్ను దొరికి – అర్థం చేసుకోవడంలో క్రమంగా కష్టం తొలగుతూ ఉంటుంది. ఇది క్షుణ్ణమై ఆ తరువాత సుగమత్వాన్ని పొందుతుంది.

ఉత్తమ కవిత్వంలో ఆలోచన లేదా ఉద్వేగం రెండిటిలో ఏదైనా ప్రధానంగా ఉండవచ్చు. ఈ రెండూ దేనికదే విడివిడిగా గాక, ఒక్కొక్క రచనలో ఒక్కొక్క కవి

వ్యక్తిత్వంలో ఒక విధమైన హెచ్చుతగ్గుల్లో విచిత్రమైన సమ్మేళనాన్ని పొందుతుంది. ఒకే కవి వివిధ సందర్భాల్లో వెలువరించిన కవిత్వంలో ఈ లక్షణం వేరువేరుగా ఉండవచ్చు. అప్పటి అనుభవరూపాన్ని బట్టి ఆ వేగస్థాయి, వస్తు విన్యాసం, భావస్థానాల తీరు, ఆలోచనాశక్తి మొదలైన అంశాలను బట్టి ఉంటుంది. అయితే ఒక కవి కవితా వ్యక్తిత్వం, లేదా రచనా స్వరూపం గురించి ఒకమారు చదివి స్థూలంగా నిర్ణయం చేయవచ్చు. దీన్ని వివేచిస్తూపోతేగాని వెనుక దాగిన అనేకమైన సూక్ష్మ రహస్యాలు వెల్లడికావు.

స్వేచ్ఛా కవిత్వంలో చాలా సందర్భాల్లో ఏర్పడే క్లిష్టత, భావరూపాలకు ప్రతీకలకూ సంబంధించింది. వివిధ భావరూపాలతో ప్రతీకలతో విశిష్టమైన స్వరూపాన్ని యోజితం చేసేప్పుడు వాని సమీకరణ పద్ధతిలో క్లిష్టత కనపడవచ్చు. భావరూపం ఆలోచనాగతమైంది. అవ్యక్తచేతన యొక్క స్పందనరూపంగానూ, ఆవిష్కృతం అవుతుంది. దీనికీ, ప్రతీకకూ భౌతికాతీతమైన రూపాన్ని అనుభవానికి తెచ్చే శక్తి ఉంది. ఏ కవీ పాఠకుల్ని లేదా శ్రోతల్ని కష్టపెట్టే ఉద్దేశంతో భావరూపాల్నీ ప్రతీకల్నీ నిర్మించడు. కాని అనుకోకుండా ఇది సంభవించవచ్చు అతని ఉద్దేశం గ్రహించి ఆలోచనతో స్పందించి అనుభవించవలసిన అవసరం ఉంది. భావంతో గాఢత్వంవల్ల లేదా భావం బాగా కుదింపబడడంవల్ల క్లిష్టత చోటుచేసుకునే అవకాశం ఉంది.

కథాభాగం లేదా వస్తువుపై దృష్టి లేకపోవడంవల్ల కేవలం భావకేంద్రం చుట్టూ ఆలోచన అల్లబడడం, లేదా విస్తరించడంవల్లనూ క్లిష్టత ఏర్పడుతుంది. దీనికి ప్రత్యేకంగా అనుభవదృష్టిలో వ్యాఖ్యానాత్మకమైన ఆలోచనా వైఖరి అవసరం. ఇది ఒక్కమారు పరిచయమైతే క్రమంగా ఒక పద్ధతి కలవాటు పడడం, ఆ తరువాత ఏర్పడిన దారిలో సుగమంగా ప్రయాణించడానికి మనస్సు సిద్ధమై ఉంటుంది. ఈనాటి స్వేచ్ఛా కవిత్వంలో భావరూపం, ప్రతీక ప్రాముఖ్యం గురించి వేరే చెప్పనక్కరలేదు.

కవిత్వం విషయంలో చిత్రమేమంటే, ఏది ఔనో చెప్పడంకంటే ఏది కాదో చెప్పడం సులభం. అందునా వ్యక్తీ సమాజం ఎన్నో ప్రభావాలకు గురౌతున్న తరుణంలో దీని నిర్ణయం మరీ క్లిష్టతరమైంది. ఈనాడు రూపం గురించీ అభిప్రాయభేదం ఉంది. ఛందస్సులో వ్రాసేవాళ్ళూ, దాన్ని వదిలేసినవాళ్ళూ ఉన్నారు. అనేక విధాలుగా సమాజంలో స్వేచ్ఛ – భిన్నాభిప్రాయాలు కలిగి ఉండే స్వాతంత్ర్యం అనుభవంలో ఉన్నపుడు భిన్న మార్గాలకూ భిన్న పద్ధతులకూ ఎంతో అవకాశం ఉంటుంది. ప్రజాస్వామ్యం యొక్క గొప్ప ప్రయోజనాలను బాగా ఉపయోగించుకొనే ప్రధాన క్షేత్రాల్లో సాహిత్యం కూడా ఒకటి. లక్ష్యంలోనూ అనేక దర్శనరూపాలు కన్పిస్తాయి. ఇవన్నీ సాహిత్యాన్ని

సంపన్నం చేసేవి, సంస్కృతీ రూపాన్ని విస్తృతపరచేవి. అయితే ఏది స్వీకార్యం ఏది అత్యంతావసరం అన్నవి ఎవరికివారు నిర్ణయించుకోవలసిందే. స్వయంనిర్ణయం కవి వ్యక్తిత్వానికి నిదర్శనం. మొత్తంమీద వ్యక్తిలోని ఆలోచన, అనుభవం, అభిలాష, పాండిత్యాలను సూచిస్తుంది.

కొత్తను అన్వేషించే లక్షణం – మార్పును కోరే తత్త్వంతోపాటు పాతలో ఒక విధంగా ఏర్పడిన స్తబ్దత, కొత్త ప్రయోగాలకు దారితీస్తుంది. సమాజంలోని స్వేచ్ఛా వాతావరణ రచనలో స్వేచ్ఛను అవలంబించే ధోరణికి దారితీస్తుంది. ఒక్కొక్కమారు సమాజంలోని కఠోరమైన నిబంధనలు, పనికిమాలిన కట్టుబాట్ల నుండి విముక్తం కోరే మనస్సు స్వేచ్ఛవైపు ఉత్క్రమిస్తుంది.

ఈనాడు ఛందస్సు విషయంలో ముక్త ఛందోధోరణిలో ఈ అంశాల్ని చూడవచ్చు. ఇదే చరమావధి అవదు. కఠినమైన పాత నియమాల నుండి విముక్తం కోరే స్వేచ్ఛా తత్త్వంలోని తీవ్రత, ఈ పద్ధతినవలంబింప జేసిందన్నప్పుడు, దీని చారిత్రకమైన పరిశీలనం చేయవలసి ఉంటుంది. కొంతకాలానికి మరో క్రొత్త ఛందస్సులోనో కొత్త విధంలోనో కవిత్వం వ్రాయబడవచ్చు. ఇందులో పరిమితంగా నియమాలుండవచ్చు. ఛందస్సువల్ల సంక్షిప్తత చేకూరుతుంది. అస్పష్టత తొలగే అవకాశం ఉంది. విశిష్టమైన గతి, ఒక ఆకర్షణ సిద్ధిస్తుంది. రచనలో శిల్ప ప్రదర్శనకు ఆస్కారం ఉంది. ఇలా ఛందస్సు కవిత్వానికి ఏ విధంగానూ భంజకం కాదు. మన తెలుగులో మొదటినుండీ వచ్చే చంపకోత్పల శార్దూల సీసాదులే ఛందస్సు అనుకోకూడదు. ఈనాడు స్వేచ్ఛా కవిత్వంలోనూ, విశ్లేషించి చూస్తే, తెలిసో తెలియకో ఛందస్సుకు సంబంధించిన అంశాలు అక్కడక్కడా చోటుచేసుకోవడం గమనించవచ్చు. వైవిధ్యాన్ని కోరే తత్త్వం, కొత్తను అన్వేషించే స్వభావం అనేకమైన ప్రయోగాలకు దారితీస్తుంది.

కవిత్వం ఎప్పుడూ సాధారణ వచనం కన్నా భిన్నమైన పద్ధతిలోనే ఆవిష్కృత మౌతుంది. సాధారణ వచనం కొన్ని సందర్భాల్లో యథాతథంగా ఒక ప్రభావం ఉద్దేశించి ఉపయోక్తమౌతుంది. అయితే కొందరి స్వేచ్ఛా కవిత్వంలో చందస్సు విషయంలో ఒక సంకీర్ణత కన్పిస్తుంది. ఎక్కడో లయ అందుతూ, కొన్నిచోట్ల మాత్రాగతి చేకూరుతూనో, అంతలో యతి, ప్రాస అక్కడక్కడా కుదురుతూనో ఏదో ఛందో రూపానికి దగ్గరగా పాదాల్లో పాదఖండాల్లో మెదలుతోనో, ఒక ఊపు ఒక గతిలో అంతలో మారుతుంది. ఆరోహణంతోనో అవరోహణంతోనో మనస్సులో విచిత్రమైన విన్యాసంతో ఛందోగతమైన అనుభవ ప్రభావాన్ని స్థూలంగా కలిగించే లక్షణం చూడవచ్చు. ఇది

ఛందస్సు ప్రభావం నుండి తప్పించుకోలేని స్థితిని సూచిస్తుంది. ఛందస్సు అంటే, మౌలికంగా గణాల ఏర్పాటు, మాత్రల పంపకం – ఉన్నా ఒక విశిష్టమైన గతితో ఆరోహణావరోహణం ఉన్న పద విన్యాస శిల్పం ముఖ్యం. దీన్ని ఎంత రమణీయంగా సాధిస్తే, రచనకంత ప్రభావశక్తి చేకూరుతుంది. ఇది కేవల శాస్త్రాన్ని మించిన పరిధిలోనిది. ఈ పరిధిలో స్వేచ్ఛా కవిత్వం వ్రాసే ప్రయత్నం జరిగింది. పద్యరచనా శిల్పం తెలిసిన వాళ్ళలో బాగా కన్పిస్తుంది.

ఇకపోతే మౌలికమైన విషయానికి వస్తే, వివిధ భాషల్లో భిన్న విధానాలవలంబించడం జరిగింది. అన్నింటిలోనూ ఏదో యాంత్రికంగా లాక్కొనిపోయే గుణం తప్పనిసరిగా ఉంటుంది. ఇందులో కవి ప్రవేశపెట్టే ప్రతిభాపూర్వకమైన విన్యాస శిల్పం, సాధారణ పాఠకుడు ఆనందించడానికీ, విశేషంగా భావకుడు వ్యాఖ్యానించడానికీ, విమర్శకులు వివేచించడానికీ అవకాశం కలిగిస్తుంది. దీన్ని బట్టిచూస్తే ఆలోచనాభివ్యక్తిలో భావరూపమైన స్పష్టతనూ, రూపావిష్కరణలో ఆకర్షణీయమైన గతిని సాధించేంతవరకు, కవిత్వంలో ఏ కాలమైనా ఛందస్సుయొక్క ప్రమేయంవల్ల నష్టం లేదు. ఈ ప్రమేయం మరీ ఎక్కువై అసలు కవిత్వంపై దృష్టిపోయి, ఛందశ్శిల్పం కవిత్వాన్ని మ్రింగేసి మొత్తం మీద పీటవేసుకోవడాన్ని ఎవరూ సమర్థించరు, సమంజసమూ కాదు. కవికి తెలిసీ తెలీకుండానే స్వేచ్ఛా కవిత్వంలో, ఛందస్సు నెరపిన అనివార్యమైన ప్రభావం గురించి ఛందస్ సంప్రదాయ మనస్తత్వపరమైన అంశాలపై దృష్టితో పరిశీలనం జరగవలసి ఉంది.

ఈ సందర్భంలో మరో విషయం – కవిత్వం పైకి చదివేట్టు చేసేది ఒక విధం – లోలోపల చదవుకునేట్టు చేసేది మరోవిధం, మొదటిదానిలో మొదలుపెట్టగానే వేగం అందుకొనే రచనా శిల్పంతో, ముందుకు త్రోసుకొనివచ్చే ఆ వేగంతో గతి విశేషం అనుభవానికి వస్తుంది. ఇక్కడ చందస్సు ప్రమేయం అధికం. రెండోదానిలో మొదలు పెట్టగానే మనస్సు ఆలోచనాయుతం చేసేది. గతివిశేషంపై కన్నా భావప్రసారం అనుభవానికి వస్తుంది గతి తావన్మాత్రంగా ఉంటుంది.

వ్యక్తినుండి వ్యక్తికి జీవితం భేదించినట్లే ప్రతి సృజనరూపం రచయితనుండి రచయితకు భేదిస్తుంది. జీవితంలో పరిచయాలు, పరిస్థితులు, అభిరుచులు, అనుబంధాలు, ప్రయోజనం మాదిరే రచనపట్ల అన్వయించుకోవచ్చు. అభిప్రాయ భేదాలూ తరచు ఏర్పడడం సహజం. ఒక్కొక్కపుడు సవ్యాజంగా, మరొకపుడు నిర్వ్యాజంగా బాహ్యమైన అంతరమైన హేతువులనుబట్టి ఇవి ప్రకటితం అవుతూంటాయి. వీటి

సంకలన రూపమే విమర్శనా ప్రపంచం. పాఠకుడు ఆగినచోటునుండి పండితుడు, అతడు నిలిచినచోటునుండి వ్యాఖ్యాత, వ్యాఖ్యాత కదలని చోటునుండి విమర్శకుడు ప్రయాణం ఆరంభిస్తారు. విమర్శకుడు ఎరుగని చోట్ల సహృదయుడు లేదా భావుకుడు అనుభూతి శీలంలో ప్రవర్తిస్తాడు. సాహిత్య విద్యా ప్రపంచంలో వివిధ వలయాలున్నాయి కాబట్టి వీటిని బట్టి స్థాయిలో తరగతులు తప్పనిసరి. వీరంతా వివిధ రూపాల్లో అనుబంధాల్ని స్థాపిస్తూ పరస్పర ప్రభావంతో సాహిత్యాభిలాషను సంపన్నం చేసేవారు. వీరిలో ముఖ్యంగా విమర్శకులు, భావుకులవల్ల ఆలోచనాగతిలోనే మార్పు రావచ్చు. ఎంతోకాలంగా నిర్లక్ష్యం చేయబడిన రచనలపై ఆదరం పెరగవచ్చు. చాలాబాగా ప్రచారంలో ఉన్నవాటిపై పునఃపరిశీలనం జరగవచ్చు. అందువల్ల వీరి బాధ్యత అనితరమైంది. గ్రహణశక్తితోపాటు పరిశీలనం, వివేచనం ఉంటే సరిపోదు. ఉదారత కూడా అవసరం. ఒక్కొక్కపుడు దారి తప్పడమూ జరుగుతుంది. వివేకవంతమైన హేతుదృష్టి దీన్ని నియమిస్తుంది.

ఈనాటి స్వేచ్ఛా కవిత్వం విషయంలో ఇంకా క్షుణ్ణమైన సమాలోచనా పథరూపం ఏర్పడలేదు కాబట్టి, ఈ విషయంపై శ్రద్ధ తప్పనిసరిగా అవసరం. ఇందులో వివిధ భావస్థానాల సంవిధానం, వివిధ భావరూపాల సహయోగంతో జరిగే నిర్మాణం గురించి, పరిచయంతో సరిపోదు. పరిశీలన అవసరం. ఈ అనుభవం క్రొత్త ప్రపంచంలో ప్రవేశించడం వంటిది. ఇందులో అన్నీ తెలుసుకోవాలనే కోరిక, తెలిసినదాన్ని గురించిన ఆలోచన జరిగినపుడు, బాధ్యతను నిర్వర్తించినవాళ్ళమౌతాం. ఎంతో వైవిధ్యం కలిగిన ఆధునిక వాతరణంతో సుస్వరతను పొందే స్పందన శక్తి కలిగి ఉండడం సామాన్య విషయం కాదు. ప్రవహించే కాలంలో కదలుతూన్న వాస్తవాన్ని గుర్తించి, అందులో ప్రయాణం చేయడంతో విశిష్టమైన అనుభవ సంపాదనం ఒక విశేషమే. ఈ అనుభవాన్నీ, ఆలోచననూ తక్కినవారికీ అవగతికి తెచ్చే కళారూపమే సమాలోచనం.

“ఒక చేతిలో శాంతి పుష్పం
మరో చేతిలో ప్రజాస్వామ్య కేతనం
సృజన కిరణ హృదయంతో
మనిషి అమృత యానం!”

# 5. స్వేచ్ఛా కవిత్వం - ఆధునిక పరిణామం

స్వచ్ఛంద నిర్మాణ శిల్పమే స్వేచ్ఛా కవిత్వం. ఈనాడు విస్తారంగా ప్రచారంలో ఉంది. ఈ సందర్భంలో కనీసం పది పదిహేనుగురు కవులు వ్రాసిన ఉత్తమశ్రేణికి చెందిన కవిత్వం స్ఫురణకు వస్తుంది. ఇది ఈనాడు సమాజంలో వ్యక్తి ఎదుర్కొనే జీవితం మారుతూన్న విలువలు అందుకునే లక్ష్యాల దృష్ట్యా వస్తువుతోపాటు రూపమూ మార్పు చెంది అవతరించింది. ఇప్పుడు వస్తూన్న ఈ కవిత్వంలో ఎంతో వైవిధ్యం ఉంది. ప్రాచీన తేజాన్ని నిలుపుకుంటూ ఆధునిక వికాసాన్ని సంతరించుకుంటూ పరివర్తనశీలంతో పరంపరా బంధంతో అభ్యుదయ కాంక్షతోనూ, విప్లవస్ఫూర్తితోనూ సమన్వయ గుణంతోనూ అనేక జీవిత పార్శ్వాలను బింబిస్తోంది. ఈ విధమైన వైవిధ్యం పూర్వం ఏ దశలోనూ కన్పించదు. సాహిత్య చరిత్రలో విశిష్టమైన స్థానాన్నీ స్థితినీ పొందింది. స్వేచ్ఛా కవిత్వంలో ఈనాడు కన్పించే వైవిధ్యాన్ని గుర్తించవలసిన అవసరం ఉంది. ఈ వైవిధ్యానికి వ్యక్తి స్వేచ్ఛతో పాటు వివృతమైన జీవిత సందర్భాలూ, వ్యక్తిత్వంలో ఎవరికివారు ప్రత్యేకత కోసం ఆరాటం కారణాలనవచ్చు. ఇది వారి ఇచ్ఛ కనుగుణమైందీ, స్వేచ్ఛతో కూడిందీ. ప్రస్తుత సమాజంలో స్వేచ్ఛా వాతావరణంలో పరివర్తనా శీలంతో వేగాకులమైన సంశ్లిష్ట జీవితం ప్రభావం దీనిపై ఉన్నమాట నిజం. ఈ విధంగా ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య వ్యవస్థ నంగీకరించిన సమాజంలో దీని పరిణామం ఎంతో సహజమైందీ, చారిత్రక గతియుతమైందీ. ఇందులో ప్రజాస్వామ్య భావప్రసారం స్పష్టంగా కనిపిస్తుంది. వస్తువులో రూపంలో అభివ్యక్తిలో లక్ష్యంలో దీనికనుణమైన స్థితిని స్పష్టంగా గమనించవచ్చు.

స్వేచ్ఛా స్పందనతో ప్రాణితమయ్యే ప్రజాస్వామ్య వ్యవస్థ రచయితల స్వయం వ్యక్తిత్వ వికాసానికెంతో అవకాశం ఇచ్చేదిగా ఉండడం మరచిపోవడానికి వీల్లేదు. సామాజిక స్పృహ రాజకీయ చైతన్యం, కొత్తపట్ల అభిలాష, జీవితం గురించి గుణాత్మకమైన ఆలోచన, పాత విలువల్ని వర్తమాన స్థితి కనుగుణంగా మలచుకొనే దృష్టీ, అన్వేషణతో పాటు అంతర్జాతీయ ప్రభావ సంపత్తీ అన్నీ కలిసి ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధమైన మూల వ్యక్తిత్వరూపం ఏర్పడుతూంది. బహు నియమబద్ధమైన పురాతన రూపమైన, పద్యం నుండి విముక్తమైంది. అనవసరమనుకున్నవి వదిలించుకొనీ, తప్పనిసరివి అవలంబిస్తూ స్వేచ్ఛను పొంది ఆవిర్భవించిందీ కవిత్వం. పద్యం ఒక విధమైన పూర్వపు సామాజిక వాతావరణాన్ని భావింపజేస్తే, స్వేచ్ఛా కవిత్వం మరో విధంగా ఆధునిక వాతావరణాన్ని భావింపజేస్తూంది. వేగంగా పరివర్తనకు లోనయ్యే సామాజిక రూపంతో పాటు,

విశిష్టంగా రూపొందే వ్యక్తి అస్తిత్వ ప్రపంచాన్నీ చిత్రించగలిగింది.

ఆధునిక సమాజంలో భావజాలానికీ, ఆలోచనా సరణికీ పద్యం ఎంతవరకు వాహికగా ఉపయోగపడుతోందనేది చర్చింపదగిన అంశమే. ఒక దశలో కొందరు ఆధునికకవులు ప్రయత్నించారు. కాని కృషి ఆరంభంలోనే నిలిచిపోయింది. ఈ సందర్భంలో విస్మరించరాని అంశం ఒకటి ఉంది. అది పద్యం పట్ల ఎవరికి ద్వేషమూ నిరసనమూ లేకపోవడం. పద్యం అందుకున్న శిల్ప శిఖరాలూ అట్లాంటివి. చరిత్రలో పద్యానికి ఉన్న గౌరవస్థితికి ఏ క్షతీ లేదు. కాని అది ప్రస్తుత సామాజిక స్థితిలో అవసరాలదృష్ట్యా ఎంతవరకు తన పాత్రను నిర్వహించగలదనేది వేరే ప్రశ్న. పద్యరచన కళాక్షేత్రం వలె నిలచే ఉంటుంది. పూర్వం వలె విరివిగా వ్రాయబడకపోవచ్చు. అదేవిధంగా పద్యానికి పూర్వం ఉన్న స్థితి ఈనాడూ కొనసాగేది మాత్రం అనుమానస్పదమే. ఆధునిక జీవితంలో నేడు ఎదురయ్యే సామాజిక అవసరాలకూ, కోరే లక్ష్యాలకూ సరిగా నప్పకపోవడం వల్లనే పద్యం తన స్థానాన్ని కోల్పోతూందన్న విషయం మన విశ్లేషణకందుతుంది. ఇప్పుడున్న పద్యం కన్నా సులభమైన ఛందరీతి నాశ్రయించి లేదా స్వల్పమైన నియమాలు కలిగే గతిలో లయలో కొత్త విధానాలతోనో ఆధునిక జీవితానికనుగుణంగా మరొక విధం రావచ్చు.

ఈ మరోవిధం స్వయం ప్రేరితంగాను, ఇతర భారతీయ లేదా అంతర్జాతీయ ప్రేరణతోను ఆవిష్కృతం కావచ్చు. కవి అన్వేషణలో భాగంగా నిర్మితం కావచ్చు. సృజనాత్మక శక్తిలో భాగమై అప్పటి అవసరాలను బట్టి వీలునుబట్టి ఉంటుంది. ఇది పొందే కొత్తదనం ఇచ్చే ప్రయోజనం వల్ల చారిత్రక ప్రాముఖ్యాన్ని కలిగి ఉంటుంది. ఈ సందర్భంలో వెనక్కివెళితే గురజాడ ముత్యాలసరాలు పేర్కోవచ్చు. ఈ వెలుగులో చూస్తే పద్యానికి వేయి ఏండ్ల చరిత్ర ఉన్నా సమాజంలో ఇంతకంటే ఎక్కువరెట్లు చరిత్ర కలిగినవే. మార్పులవల్ల ప్రాధాన్యాన్ని కోల్పోయాయి. కొంత గతం గురించి చెప్పుకోడానికి వర్తమానానికి ప్రేరణనిచ్చే సుదూర స్థానాలుగాను నిలచాయి. అనుభవంలో మాత్రం అవి వాస్తవమైన క్రియాత్మక పాత్రను కోల్పోవడం జరిగింది. ఈ స్థితిలో సామాజిక గతిలో కొత్త పరిణామ సూచకంగా, పద్యానికి భిన్నంగా అంతర్నిహితమైన గతి లయ నిర్మాణ సూక్ష్మాలతో స్వచ్ఛందమైన విన్యాస శిల్పంతో ఆవిర్భవించిందే స్వేచ్ఛాకవిత్వం.

ఆస్తిరూపమైన భూమీ జీవనహేతువైన వ్యవసాయం నుండి క్రమంగా పోనుపోను ఈనాడు మారిన ఆస్తిరూపాలతో వృత్తులతో జీవికలతో జీవితం ఎంతో వైవిధ్యాన్ని

పొందింది. సంపద, పెట్టుబడి, ఉత్పాదనం, వినిమయం, రాబడి, వ్యాపకం, ఉపయోగం తీరులో భిన్నత్వాన్ని ప్రత్యేకతను విస్తృతిని పొందింది. క్రియాకలాపాలూ ఎక్కువైనాయి. జీవితం సంశ్లిష్టమైంది, వైవిధ్యం పొందింది. అంతగా ముఖ్యంకానివీ అవసరం అనిపించనివీ, ఉపయోగం లేనివీ వదలుకోవడమో లేదా దూరం కావడమో అదృశ్యమైపోవడమో జరుగుతూంది. అప్పటి అవసరాల్ని బట్టి ఉండే సామాజిక స్థితినిబట్టి కొత్త కొత్త సంబంధాలు ఏర్పడడం ఎక్కువైంది. ఇదేవిధంగా జీవితం నుండి వేరు కాని సాహిత్యంలో ప్రస్తుతానికి కవిత్వంలో అనేక స్థితుల పర్యవసానంగా మార్పులు రావడం సహజమైంది. ఈ సందర్భంలో అనివార్యమైన సామాజిక ప్రభావశక్తులు, వైయక్తిక రీతులు మనదృష్టికి వచ్చి తీరుతాయి.

ఈ విశేషస్థితికి దోహదం చేసే మరో అంశం ఉంది. తెలుగులో మంచి పద్యం రాయడానికి పూర్వ కావ్యాలతో మంచి పరిచయం అవసరం. పద్యరచనకు తెలుగులో నెలకొన్న నిర్మాణరీతుల్లో ముఖ్యంగా యతి, ప్రాస స్థానాల్లో సహజత్వంతోపాటు, పనితనమూ, ఒకపాదం నుండి మరో పాదానికి క్రమించడంలో ప్రవాహకత్వం లేదా గోలుసులో మలపుల వంటి శిల్పమూ, ఇట్లా ఎన్ని విధాలుగానో మొత్తంమీద శిల్పజ్ఞత అవసరం. పూర్వకవుల రచనాశక్తిని మించకపోయినా దానితో సమానంగానైనా ఉండాలని భావుకప్రపంచం కోరుతుంది. దీనికి ప్రాచీన కావ్య సంస్కారంతో పాటు అభ్యాసం శిల్పజ్ఞత ఎంతో ముఖ్యం. వర్తమాన జీవితంలో తప్పనిసరియైన ఇతర వ్యాపకాలవల్ల ఈ విధమైన కృషికి అవకాశం దొరకదు, తీరికా లేదు. పైగా అధీతి బోధనా పద్ధతులు వేరైనాయి.

పద్యం అర్థం చేసుకునేందుకే భాషలో చక్కని ప్రవేశం ఉండాలి. నిర్మాణంలో మెలకువలు తెలిస్తే మంచిది. ఇది నేర్చుకునేందుకు వ్యక్తిలో అభిలాష, చెప్పే విశేషజ్ఞులు ఉంటేనే సాధ్యం. అభిలాష ఉన్నా లక్ష్యానికి చేర్చే సామాజిక స్థితుల ఆనుకూల్యం ఉండాలి. పైగా ఇది అవసరమూ, ఆధునికతను బింబించలేదు. కృతకం అనుకుంటే వేరే చెప్పనవసరమే లేదు. ఈ విధమైన వాతావరణం పద్యరచనపట్ల ఉత్సాహాన్ని పెంపొందించేదిగా ఉండదు, ఉన్నది నిలిచే స్థితీ చేకూరదు.

ఆధునిక సమాజంలో స్వేచ్ఛా వాతావరణంలో లభ్యమయ్యే అవకాశాలను బట్టి స్వేచ్ఛా కవిత్వం ఆధునికమైన సహజ పరిణామ రూపంగా ప్రవర్తిల్లుతూంది. పద్యం ఒక విధమైన సమాజ వ్యవస్థకూ ఆలోచనా విధానానికీ నిర్దిష్టమైన లక్ష్యానికీ ప్రాతినిధ్యం వహిస్తూంది. భావకవిత్వంలో ఇది కొంత మార్పుల్ని పొందినమాట నిజం. అయితే

ఇది చాలా పరిమితంగానే జరిగింది. అభ్యుదయ కవిత్వంతో సంపూర్ణంగా విడివడింది. ప్రస్తుతానికి వస్తే వేగంగా పరివర్తనకు లోనైన ప్రజాస్వామ్య స్వేచ్ఛా వ్యవస్థకూ, దీనికనుగుణంగా రూపొందే సంశ్లిష్ట జీవితానికీ వ్యక్తి లక్షణానికీ గుణాత్మకంగా సరిపడకపోవడంవల్లనే పద్యం తప్పుకుంది వెనువెంటనే స్వేచ్ఛా కవిత్వానికి చోటు ఇచ్చింది. పూర్వ సాహిత్యంలో మంచి పరిచయంతో చక్కని పద్యరచన చేయగలవారూ స్వేచ్ఛాకవిత్వం వ్రాసేవారిలోనూ ఉన్నారు. వీరు స్వేచ్ఛా కవిత్వాన్ని ఎన్నుకోవడంలో ప్రస్తుత వాతావరణంలో ఆధునికతను కోరే వీరి స్వచ్ఛమైన లక్ష్యమూ అభిమతీ స్పష్టం. స్వేచ్ఛా జీవనంలో ప్రజాస్వామ్య భావనతో పరిహరింపరాని కొత్త పట్ల అభిలాష, అన్వేషణ పట్ల ఉత్సాహం సామాజిక స్పృహతో పాటు వ్యక్తిత్వ వికాసం అనేవి, వీరినాకర్షించాయి. స్వేచ్ఛా కవిత్వానికి ఆధారగుణాలుగానూ ఉన్నాయి. ఇవి అఖండ కవితా ప్రవాహంలో మలుపులే కాని సమాప్తిరేఖలు కావు. పద్యానికీ స్వేచ్ఛా కవిత్వానికీ మౌలికంగా అంతస్స్వరూపంలో వైరుధ్యం లేదు. బాహ్యదృష్టితో దాని స్థానం దానిదే దీని స్థానం దీనిదే. జాతి ఉత్తమ సంస్కృతిలో భాగంగా నిలిచిపోయిన పద్యం ఆకర్షణ తగ్గదు, అదే చివరిదీ కాదు. దాని తరువాతగా వెంటనే ఆధునికతను ప్రాతినిధ్యం వహిస్తూ చారిత్రక పరిణమంలో భాగంగా వచ్చిందే ఈనాటి స్వేచ్ఛా కవిత్వం.

**"మానవులంతా ఒకటే**
**మానవతా రాగం ఒకటే**
**ఇది మరచిన ఉదయం**
**ఒక విషాద కావ్యం"**

# 6. స్వేచ్ఛా కవిత్వంలో వస్తురేఖలు

చుట్టూ ఉన్న ప్రకృతీ రోజూ అనుభవానికి వచ్చే సమాజం, మానవ సంబంధాలు, భావాదర్శం అనేవి ఆధునిక కవిత్వంలో కన్పించే వస్తురేఖలు. ఇవి రచనలో ఏ భావసూత్రాన్నో ఏ సంఘటననో ఏ స్థితిరూపాన్నో ఏ ఆదర్శగుణాన్నో ఆధారం చేసుకొని వర్తిస్తాయి. ఇవి వేటికవి విడివిడిగా కాక ఒకదానితో మరొకటి ప్రత్యక్షంగానో పరోక్షంగానో అనుబంధం కలిగి ఉన్నవి. ప్రాధాన్య వివక్షచేత తరతమ భావంతో నిర్మాణరూపంలో భాగాలుగా విశ్లేషణకందుతాయి. వీటితో పాటు అతీత భావన గురించి ఆలోచన కూడా లేకపోలేదు.

స్వేచ్ఛా కవిత్వంలో ప్రకృతి ప్రమేయం కేవలం వర్ణనాత్మకంగానే కన్పించదు. ఏ సామాజిక స్థితినో ఘటననో ఏ మానవ సంబంధ రూపాన్నో ఏ ఆదర్శభావాన్నో స్ఫూర్తికి తెచ్చే విధంగా అంతర్గత గుణంతో యోజితమైంది. ఇదేవిధంగా మిగతావీ. దీనికి ఉదాహరణ లనేకం ఇవ్వొచ్చు. దాశరథి ఆధునిక కవితా సంకలనం పేరు పునర్నవం. పునర్నవం అంటే తిరిగి కొత్తదనాన్ని పొందే ప్రకృతిరూపం తలపుకు వస్తుంది. దీనితో వసంతభావన స్ఫూర్తికి రావడం సహజం. ఇంకా పాత వ్యవస్థ పోయి దాని స్థానంలో కొత్త వ్యవస్థ అవతరించే సామాజిక రూపమూ ధ్వనిస్తుంది. ఇదేవిధంగా తిమిరంతో సమరం, తిమిరం ప్రకృతికి సంబంధించింది. సమరం జీవితానికి సంబంధించింది. తిమిరం చెడుకీ నిరంకుశత్వానికీ మౌఢ్యానికీ ప్రతీక. చెడు నశించి నిరంకుశత్వం రూపుమాసి మౌఢ్యం అంతరించిపోయేందుకు భౌతికదశలో మనోదశలో ప్రకృతిస్థాయిలో ఆదర్శ స్థాయిలో జరిగే నిరంతర సంఘర్షణ చివరకు మానవుని ఆశారూపం విజయ శక్తీ సూచితం. ఇందులో ప్రకృతీ సమాజం ఆదర్శం అనేవి ముప్పిరిగొని ఉన్నాయి.

మనచుట్టూ ఉన్న సమాజం నిరంతరం మానవ సంబంధాలతో ఏర్పడేది. వ్యక్తినుండి అంతర్జాతీయ స్థాయివరకు అనేక సంబంధాల ప్రభావాల పర్యవసాన రూపం, సాంఘిక రాజకీయార్థిక సాంస్కృతికమైన వివిధ గతి-రేఖలతో రూపొందుతుంది. వ్యక్తి జీవితంపై సమాజం ప్రత్యక్ష ప్రభావాన్ని నెరపినట్లే వ్యక్తి మనస్తత్వం మానవసంబంధాల్లో కీలకమైన పాత్రను నిర్వర్తిస్తుంది.

మనస్సు ప్రసక్తితో జ్ఞాపకానికి వచ్చే మరో అంశం అతీత భావన. మనిషి కంటికి కన్పించనీ భౌతికస్థితికందనిదాన్నీ గురించి ఆలోచింపజేసే, ఏదో సమాధానం కోరేదీ ఎంత ఆశ్చర్యపరచే ఆదర్శం గురించి ఆలోచనకు దారితీసేది. స్వేచ్ఛా కవిత్వంలో ఈ

అంశం చాల పరిమిత స్థితిలోనే ఉంది. ఒక్కొక్కరి రచనలో ఒక్కొక్క విధంగా ప్రసక్తమైంది. "ఆ సకలాతీత శక్తి ఉన్నట్లా? లేనట్టా?" శ్రీశ్రీ సంశయాస్పదమైన మాటలీ సందర్భంలో జ్ఞప్తికి వస్తాయి.

ఆధునిక యుగంలో మానవుని శక్తిపై ఉండే సంపూర్ణ విశ్వాసం హేతుదృక్పథం వల్ల ఈ అతీత భావన చుట్టూ అల్లుకున్న మూఢప్రపంచం అదృశ్యమైంది కాని అందని చైతన్యం మాత్రం మిగిలేఉంది. దీన్ని గురించి ఏదో విధంగా ఆలోచన చింతన అనివార్యం.

భావాదర్శం సిద్ధాంతాలకూ ఆదర్శాలకూ సంబంధించింది. ఉత్తమ రచనకు లక్ష్యమైంది, తప్పనిసరియైంది. ఈ నాలుగైదు వస్తురేఖలతో పొందే ఉపయోగం, నిర్మాణంలో అవలంబించే సంవిధానాన్ని బట్టి ఉంటుంది. ఇది పైన పేర్కొన్న విధంగా ఘటననో స్థితినో భావాన్నో అనుభూతినో ఆలోచననో ఆదర్శాన్నో ఆధారం చేసుకొని సావయవ రూపాన్ని పొందుతుంది.

ప్రకృతి అనగానే మనకు మొట్టమొదట వాఙ్మయంలో స్ఫురించేది ఋగ్వేదంలోని ఉషస్సూక్తం. ఇందులో ఉషస్సు భౌతికమైన ఆకృతితో ఎంతో రమణీయంగా వర్ణితమైంది. ఇది మానసికమైన ఆనందరూపానికి ప్రతీకగా దర్శనమిస్తుంది. రోజు చూసే ప్రకృతే ఏ రోజు కారోజు మార్పులతో కొత్త అనుభవానికి వస్తుంది. జీవితంపై ప్రభావం నెరపుతుంది. సామాజిక స్థితికీ మానసిక స్థాయికీ ఒక విధంగా హేతువౌతుంది. ఆధునిక కవిత్వంలో ఏ అమానుష స్థితికీ ఏ ఆశ్చర్యానికీ అవకాశం ఇవ్వకుండా మానవుని కృషీ ప్రజ్ఞ విజయంపై సంపూర్ణ విశ్వాసంతో ప్రవర్తిల్లే ధోరణి స్పష్టం. అయితే కల్పనకు స్థానం ఉండనే ఉంటుంది.

"అడవులు! కొండలు! ఎడారులా మన కడ్డంకి" – శ్రీశ్రీ. మానవుని ప్రస్థానంలో ఎదురయ్యే ఆటంకాలు అవరోధాలు కష్టాలు అడవులు కొండలు ఏడారులుగా ప్రకృతి రూపంలో సంకేతింపబడినాయి. ప్రకృతితలంపైనుండి జీవితరూపం బింబితమైంది. దీన్ని మానవ సంబంధాలతో ఏర్పడే సామూహిక శక్తితోనే జీవితంలో ఎదుర్కోవలసి ఉంది.

"రగిలి రగిలి మంటలతో కదలుతూంది ఈ క్షణం
వెనుక నుండి ఏ జలదమొ! కరుణ చూచు ఆశతో"

ఈనాడు ద్వేషంతో అసహనంతో హింసతో సంక్షుభితమైన సామాజిక స్థితి చిత్రితం. కరుణ వర్షించి ప్రేమ పల్లవించి శాంతితో హ్లాదసమయం కోరే మనోరూపం ధ్వనితం.

ఎంతో ప్రభావశీలమైన ప్రకృతి మధ్య చుట్టూ ఉన్న సమాజంలో వివిధ వ్యక్తుల మధ్య ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ ఏర్పడే మానవ సంబంధాలతో అస్తిత్వం పొందే జీవితం, భావాదర్శంతో పరిపూర్ణత నందుకుంటుంది. ఈ సమాలోచనం స్వేచ్ఛాకవిత్వంలో కేవలం వస్తురేఖలకు మాత్రమే పరిమితమైంది.

ప్రకృతి సమాజం జీవితం ఈ మూడింటి సంకలనం స్వేచ్ఛాకవిత్వం, మానవీయ సూత్రం పయి పరోగమనశీలంతో వర్తిస్తూంది.

**"ఆశా కిరణంతో వర్తమానాన్ని నడిపిస్తూ<br>భవిష్య దర్శనంతో మనిషిని బ్రతికిస్తూ<br>సమాజ నిర్మితిలో ప్రజాస్వామ్యం<br>మనిషి మనిషినీ కలిపే నిలయం"**

# 7. స్వేచ్ఛా కవిత్వం - కొన్ని సమస్యలు

స్వేచ్ఛాకవిత్వం సంప్రదాయ ఛందస్సునుండి ముక్తమైన ఆధునిక ప్రక్రియ. ఒక నిర్ణీతమైన నియమబద్ధత లేనిదీ యతిప్రాసలు లేనిదీ లయబద్ధం కానిదీ సంప్రదాయ ఛ్ఛందోరీతికి చెందినదీ. భిన్నమైందీ ఈ ప్రక్రియలో ముఖ్యంగా స్వతంత్రానంతరం చెప్పుకోదగ్గ ప్రయోగాలు జరుగుతున్నాయి. శ్రీశ్రీ, నారాయణబాబు, పఠాభి ప్రయోగశీలాన్ని అందిపుచ్చుకొని ఆరుద్ర, బైరాగి, దాశరథి, సోమసుందర్, సి.నారాయణరెడ్డి, తిలక్, కుందుర్తి మొదలగు కవుల రచనలీ మార్గాన్ని పరిపుష్టం గావించాయి. ఈ మధ్య పలువురు శక్తివంతులైన కవులు శేషేంద్ర, సంపత్కుమార, సుప్రసన్న, వేగుంట, పేర్వారం, శివారెడ్డి తమతమ ప్రత్యేకతలతో ఈ ప్రవాహ రూపాన్ని అవిచ్ఛిన్నం కొనసాగిస్తున్నారు.

మంచి స్వేచ్ఛా కవిత్వం వ్రాయడం సులభం కాదు. ఛందస్సు మొదలగు ఏ సంప్రదాయ సామగ్రీ ఆధారం లేకుండా! అయితే గాలిలో తేలడమా? అని ప్రశ్నించవచ్చు. అవును విమానంలో వలెనని సమాధానం. విమానం అన్నమాట ఆధునికతకు సంకేతంగా గ్రహిస్తే సమాధానం ఎంత ఉచితమైందో సులభంగా తెలుస్తుంది. ఈనాటి కవిత్వంలో కొంత క్లిష్టత, అయోమయమూ ఉందనే అభిప్రాయముంది. ఇందులో కొంత నిజం లేకపోలేదు. దీన్ని గురించి ఆలోచిస్తే ఇందులో చాలాభాగం బాహ్యస్వరూపాన్ని గురించి ఎక్కువ పట్టింపు లేక అంతస్స్వరూపాన్ని గాఢంగా, అధికంగా చిత్రించే ఉబలాటంవల్ల ఏర్పడిందని తెలుస్తుంది. మానసిక స్థితి చిత్రణలో భావనల సహయోగం విరామం లేకుండా దట్టంగా ఉండడంవల్ల క్లిష్టత, అయోమయం కలుగుతుంది. దీనికీనాటి కవిత్వం నుండి అనేక ఉదాహరణలీయవచ్చు. ఇది కొంత ప్రయోగదశకూ, కొంత రచనా శిల్పం తెలీని స్థితికీ బరువైన చెందింది. పూర్వం భాషాగతమైన కాఠిన్యం, శైలీ బంధురత్వం ఎదురైనట్లు ఈనాడు భావగతమైన క్లిష్టత అయోమయం ఎదురౌతుంది. దానిమాదిరే ఇందులోనూ కొంత నిలచేది మిగతాది పోయేదీ ఎప్పుడూ జరిగేదే.

ఈనాటి స్వేచ్ఛాకవిత్వం ముఖ్యం వ్యక్తి జాగృతి లేదా సామాజిక చైతన్యం వెన్నెముకగా స్వేచ్ఛా శిల్ప మర్యాదలతో, మానసిక దృక్పథం కలిగింది. విషయ భావరూప విన్యాసంలోని అభివ్యక్తి లోపం సంప్రదాయమార్గంలో ఛందస్సు మొదలైన వాటివల్ల కప్పబడుతుంది. ఇక్కడ అలాంటి అవకాశం లేకపోవడంవల్ల లోపం కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది. అందుకే స్వేచ్ఛాకవిత్వం వ్రాయడం చాలా కష్టం. దీన్ని అర్థం చేసుకోవడానికి

పాఠకులకు కొంత సహనం కావాలి. రచనను సానుభూతితో వివేచించవలసి ఉంటుంది.

స్వేచ్ఛా కవిత్వాన్ని కొందరు కవిత్వం బాహ్యమైన బంధనల నుండి పొందే చిట్టచివరి విముక్త రూపమనీ, కొందరు ఒకచోట పేర్చికూర్చిన వచనపు తుంటలని అంటారు. రెండూ అతివాదాలే. నా దృష్టిలో కవితా పరిణామంలో స్వేచ్ఛా కవిత్వం ఒక ముఖ్యమైన దశ. పురాణం ప్రబంధం భావ అభ్యుదయ కవిత్వాలు ఒకటి శిఖరస్థితినందుకోగా మరొకటి తరువాత తరువాత ఉద్గమించినట్టివే. పూర్వపుదాని ప్రభావం తరువాతి దానిపై స్పష్టం, పూర్వపూర్వ ప్రభావం పోనుపోను తక్కువౌతుంది. స్వేచ్ఛాకవిత్వం కూడా కొంతకాలానికి బాగా పరిణతి చెంది, మొగం మొత్తి మరొకటి అవతరించవచ్చు. ఈ మార్పు అనివార్యం కావచ్చు.

కవుల్లో సోమరులు, శక్తిరహితులూ ఉన్నట్లే పాఠకులలోనూ ఉంటారు. కవిత్వం గురించి ముందుగా మనస్సునొక చట్రంలో బిగించుకొని దానికి దూరమైనవానిపట్ల జడభరితంగా ఉంటారు. కవిత్వాన్ని చదవడానికి ముందు మనస్సు స్వచ్ఛమైన గాలి స్ఫుటమైన వెలుతురు లేని ఇరుకునుండి ముందు బయటపడాలి. మనస్సు నిర్మలమైన దర్పణమవాలి. మొత్తంమీద పాఠకుని బాధ్యత తక్కువేమి కాద. ఇది గమనించకపోవడం వల్ల ఎక్కువ అయోమయం ఏర్పడుతుంది. మునుముందే ఏర్పడే అభిప్రాయం కారణం అవుతుంది.

జీవితంలో అనేక వస్తువుల్ని చూస్తూ ఉంటాం. అందులో కొన్ని మనకవసరమయ్యేవి, కొన్ని ఊరకే చూచి ఆనందించదగ్గవి. కొన్ని ఆలోచింపజేసేవి. ఇందులో చాలా విలువైనవి ఉన్నాయి. ఉదాహరణకు వెలుగు, దీన్ని నిర్వచించడం సులభం కావచ్చు. మనస్సు గాఢమైన అనుభూతి పొందినపుడు నోటమాటరాదు. అది వాక్కున కతీతమైన స్థితి. ఈ స్థితిని వివరించడం చాలా కష్టం. అంటే విలువైనదాన్నీ గాఢమైన అనుభూతి దశనూ నోటిమాటలతో చెప్పడం కష్టమన్నమాట. ఇది ఒకరకంగా అయోమయమే. ఇలాంటిదే కవిత్వమూ. దీని వైవిధ్యం చెప్పరానంతగా ఉంటుంది. సమయం సందర్భం పాత్రను బట్టి భేదిస్తుంది. దీన్ని వ్యక్తం చేయడంలో అసమగ్రతే, అయోమయం అస్పష్టత.

ఎంతమందో సాహిత్యవేత్తలు ప్రపంచంలో వివిధ భాషల్లో ఎంత కాలంనుండో కవిత్వాన్ని నిర్వచించడానికి ప్రయత్నించారు. ఎక్కడికక్కడ ఏకదేశంగానే ఉండిపోయింది. ఈనాడు వివిధ భాషల, జాతుల సంస్కృతుల కలయిక త్వరితగతిని జరుగుతూన్నపుడొకదాని ప్రభావం నుండి మరొకటి తప్పించుకోలేని స్థితి ఏర్పడుతూంది. అయినపుడు ఇంతకు పూర్వమున్న దృష్టిలో మార్పు తప్పదు. దీన్ని గురించి నిష్కర్షగా

చెప్పలేం. సరిగా స్వేచ్ఛా కవిత్వంలోనూ ఈనాడు జరుగుతూన్నదిదే, కవిత్వమూ అతి నవ్యమైన భిన్నత్వాన్ని, వైవిధ్యాన్ని పొందుతూంది. ఇదంతా ఒక దృష్టితో చూస్తే అయోమయమే. ఏ నిర్వచనానికి ఒదగని రచన ఎక్కడో హఠాత్తుగా కనబడుతుంది. అందుకనే ఏ నిర్వచనమూ ఈనాటి దృష్టితో సమగ్రం కాదు. దీని సౌందర్యం మాటలకొదుగందీ, అనుభూతి వివేచన కందనిదీ, ఎంత చెప్పినా ఇంకా మిగిలి ఉండేదీ కావడమే దీనికి కారణం. ఇది కవిత్వం ఉత్తమత్వమే. దీనితో పాటు బహుక్లిష్టమైన సామాజిక సంస్థితిపై ప్రభావాన్ని నెరవుతూంది.

**2**

స్థూలంగా కవిత్వాన్ని బాహ్యస్వరూపం, అంతస్స్వరూపం అని విభజించవచ్చు. రూపం అనగానే నిశ్చయరేఖలతో కూడిన అవయవస్ఫూర్తి కడుతుంది. బాహ్యస్వరూపం దృష్టికొదిగిందీ, అంతస్స్వరూపం ఊహకొదిగిందీ. బ్రతుకమ్మ పండుగకి పూలుతెచ్చి అందంగా వివిధరీతుల్లో గుండ్రంగా ఎత్తుగా పేరుస్తారు. వీటిని పూజించిన స్త్రీలు, కొంతసేపు చుట్టూచేరి ఆడి తరువాత తీసికెళ్ళి నదిలో వదలుతారు. అవి వరుసగా తేలిపోతుంటాయి, మొదటినుండీ చివరివరకూ దృష్టినాకర్షిస్తుంది. అలాగే ఒక అమర్చిన గది, ఒక మాటతీరు, ఇవన్నీ బాహ్య స్వరూపానికి చెందినవే అయినా వాటి వెనుక అంతస్స్వరూపం దాగి ఉంది. అది మన భావనలో వీటిని చూచినపుడు ఆకర్షణవల్ల మనస్సు అనుభూతి పొంది, వివేచన మొదలౌతుంది. మొదటిది ఆనందానికి రెండవది ఆలోచనకు స్థానం. ఈ రెండింటి పర్యవసానమే సమాలోచనం. అది వ్యక్తినిష్ఠమైంది. మరొక ఉదాహరణ, వెలుగు, చీకటి మొదలైనవి – వీటి రూపం మొదటివాటికన్న సూక్ష్మసూక్ష్మ మయింది. వ్యక్తిలో అభిరుచి, సంస్కారంతో కూడిన అనుభూతిపొందే శక్తి వస్తు సౌందర్య భావనకు మూల హేతువు.

కవిత్వానికి వస్తే బాహ్య స్వరూపం స్థూలమైంది. అంతస్స్వరూపం సూక్షసూక్ష్మమైంది. ఈరెండూ ఎప్పుడూ దేనికది విడివిడిగా ఉండవు. రెండింటి మధ్య గీత గీయలేం. ఒక్కొక్క స్థితిలో ఒక్కొక్కటి ప్రాధాన్యం వహించి ఉంటుంది. ఎంత బాహ్య సౌందర్య ప్రధానమయిన కవిత్వంలోనూ అంతో ఇంతో అంతస్సౌందర్యం ఉంటుంది. ఇది ఉత్తమత్వానికి చాలదు. ఒక ప్రమాణంలో ఇది కుదిరి, పాఠకుల పరిశీలనకు నిలవడమన్నది ఎంతచెప్పినా పాఠకుల స్థాయినిబట్టీ ఉంటుంది. లేకపోతే అంతమంది వివిధ రకాల కవులు, అంతమంది వివిధరకాల పాఠకులు, అంటే ఒకటి నచ్చితే మరొకటి నచ్చనివారు ఉండరు. కవిత్వం అన్ని సాహిత్య ప్రక్రియల్లోకి గాఢమైందీ,

అందమైందీ. గొప్ప కవిత్వం ఎన్నోసార్లు చదివించడంతోనే పని పూర్తి చేసుకోక, చదివినకొద్దీ పారవశ్యంతో పాటు ఆలోచనకు పదనుపెట్టేది కావటంవల్ల చివరిమాటగా ఎవరి అభిప్రాయమూ నిలవకుండా పోతుంది. ఈ దృష్టితో నేటి స్వేచ్ఛా కవిత్వంలోని అయోమయం క్లిష్టతను విచారించవలసి ఉంది. ఈ విచారణ హేతుబద్ధంగా ఉండడం అవసరం. నిలిచే గుణం లేంది అదృశ్యమవుతుంది అంతే.

చాలామంది పాఠకులు, శ్రోతలు లయబద్ధమయిన పాదాలపట్ల ఆసక్తి చూపడం కద్దు. ఈ రచనల్లో సంగీత గుణంచేత బహుళ ప్రచారమూ పొందడమూ జరుగుతూంది, ఇది సహజం. సామాన్యులకెపుడూ విశేషాన్ని గురించి పట్టదు, ఎవరన్నా దృష్టికి తీసుకొస్తే తప్ప. లయాత్మక రచన, భౌతికరూపాన్ని ఎక్కువగా ఆశ్రయించింది. కవితా ప్రపంచంలో మొదటి శ్రేణికి చెందింది కాదు. లయ, ఛందస్సు రెండూ వేరు. శబ్దాల బరువూ తూగుతో క్రమమయిన పొందిక లయ, స్వేచ్ఛా కవిత్వ రచనలు అన్ని బరువూ తూగూ కలిగి భిన్నభిన్న రీతుల్లో అంతర్లయతోనూ ఉన్నాయి. ఎక్కువగా 'అంతర్నాదం' ప్రధానంగా వస్తున్నాయి. అంతర్లయలో లయచ్ఛాయ ఉంటుంది. అంతర్నాదంలో లయచ్ఛాయ ఉండదు. కాని అనుస్యూతమయిన ప్రవాహగుణం అలలు అలలుగా, ధారలు ధారలుగా, ఖండఖండాలుగా లేదా మరొక మరొక రీతిగా ఉండి, నాద సాంతత్యం ధ్వనిస్తూంటుంది. శబ్దయోజనం, ఉన్నతావనత సమరీతుల్లో భావోపస్కృతంగా ద్రవస్థితిలో మలపులు తిరుగుతూంటుంది. లయ ఉండడంలో దోషం లేదు. అది భావదీప్తికుపకరించే మేర ఉంటే చాలు. పాదాలు లయబద్ధం చేసి టకటక నడిపితే చెవికి సరదాగా ఉంటుంది. కాని దీని అమేయ ప్రమేయంవల్ల మనస్సుకు రచనలో సృజనశక్తి ప్రసారాన్ని పంపవలసినంతగా పంపడానికంతరాయ మేర్పడుతుంది. అక్కడక్కడ మెరపులు కన్పించవచ్చు. గాఢమయిన భావన లేనివారు దీన్ని ఆశ్రయించడం కద్దు. గాఢమయిన భావనతో శిల్పమతులు దీన్ని సంవిధానానికుపయోగించు కుంటారు. కేవలం గాఢ భావన కలవారు దీనిపట్ల శ్రద్ధ చూపరు. కవులు ప్రధానంగా నేడు ఈ మూడు తరగతుల క్రిందికి వస్తారు.

స్వేచ్ఛా కవిత్వాన్ని పోతపోసినట్లు వ్రాస్తూ పోతే విసుగు కలుగుతుంది. అందుకని దీన్ని పరిహరించడానికి, సృజనశక్తి ప్రసారానికంతరాయం కలగకుండా 'అంతర్లయ' – ఇంకా శ్రద్ధ ఉంటే – 'అంతర్నాదం'పై దృష్టి ఉండాలి. ఈ లక్షణం కొన్ని పద్యాల్లో కొంత కన్పిస్తూంది. ఈ పోలికచేత కొందరికి తెలిసో తెలియకో మనస్సుకు స్వేచ్ఛా కవిత్వాన్ని వచనపద్యమంటే బాగుంటుందనిపిస్తుంది. మనస్సులో పొరలో పద్యంపట్ల అభిమానం చేత, ఆకర్షణ కారణంగాను ఈ పోలికను పేర్కోవచ్చు. కొట్టవచ్చినట్లు

టకటకసాగే పద్యంలో అంతర్నాదం కన్పించదు. పద్యం కవులుకానివాళ్ళు పద్యం వ్రాస్తే ఇలా పట్టేయవచ్చు. మనకది పద్యకవిత్వమనిపించదు, ఛందోవేత్తలకు తప్ప! కవిత్వానికి వ్యాకరణం ఛందస్సు, పూర్వకావ్య పఠనమూ, అలంకార శాస్త్ర పరిచయమూ చాలన్న భాషావేత్తల కావ్యాలన్నీ దీనికుదహరణలే. అలాగే స్వేచ్ఛా కవిత్వాన్ని కవులు కానివాళ్ళు వ్రాసేది వచనం. స్వేచ్ఛకవిత్వాన్ని రూళ్ళ కర్ర గీతల్లా వ్రాసేవాళ్ళూ ఉన్నారు. గంటల గణగణలా, సైనికుల కవాతులా వ్రాసేవాళ్ళూ ఉన్నారు. నిజమైన స్వేచ్ఛా కవిత్వంలో పల్స్‌బీట్‌లాంటి జీవస్పందనం తప్ప ఏ ఆర్భాటమూ ఉండకూడదు. ఒక్క ఉదాహరణ తీసుకుందాం. ప్రాస ఉన్నది. ఇది ఎఫెక్ట్ కోసం ఉపకరించేది. ప్రతిపాదంలో తప్పనిసరిగా ఉండాలనడంలో కవికి బంధమయింది. అతడు కొన్ని శబ్దాల నాశ్రయించవలసి వస్తోంది. భావం పరిమితత్వాన్ని పొందుతుంది లేదా కొన్నిచోట్ల అనవసరంగా విస్తృతి పొంది శరీరం పెరుగుతుంది. తెలుగు కావ్యాల్లో భావ సంక్షిప్తత కొరవడడానికి కారణం ఇదే. శిల్ప మర్యాద పొందిన మాట నిజం. ఇలాంటి అనేక బంధాల నుండి స్వేచ్ఛ పొందిన రచన స్వేచ్ఛాకవిత్వం. దీన్ని మళ్ళీ వలయంలో బంధించకూడదు. ఇందాక కవులు కానివాళ్ళు వ్రాస్తే స్వేచ్ఛాకవిత్వం వచనమన్నాను. పద్యానికి, వచనానికి భేదం సులభంగా గుర్తించవచ్చు. కవిత్వానికి వచనానికి భేదం ఎక్కడుందో తెలియాలి. అనుభూతి సాంద్రతలో, ఉద్రేకస్థాయిలో, ఆలోచనల ఎత్తులోతులో, దీనికనుగుణంగా ఒదిగిన శబ్దసంయోజనంలో వాక్య సహయోగంలోనని సమాధానం. దీని నాశ్రయించి శిల్పభాగం ఉంటుంది. అంతర్గతమయిన లయ, నాదం ఈ స్థితిలో ప్రతిభచేత సిద్ధిస్తుంది. ఈలాంటి పాదాలు గొప్ప వచన రచయితల గ్రంథాల్లో అక్కడక్కడా కన్పిస్తాయి. ఇది ఒక స్థితిలో ఆ రచయితల కవితాత్మ ప్రకాశనం అనుకోవాలి. ఉదాహరణకు చలం రచనల్లో ఈలాంటి పాదాలు కన్పిస్తాయి.

**3**

అంతస్స్వరూపం ఊహైక గమ్యమయింది. విషయం, భావరూపం, ఆవిష్కరణ మూడింటిలో ఆవిష్కరణ చాలావరకు బాహ్యరూపంలోని భాగమే. సామాజిక ప్రయోజనాన్ని గుర్తించినవారు విషయంపట్ల ఎక్కువ శ్రద్ధవహిస్తారు. దీనివల్ల సిద్ధాంతాలు, విశ్వాసాలు, ప్రవచనాలు, వ్యాఖ్యానాలు అవసరమౌతాయి. ఇది కావ్యకళకు భంజకమని ఒకరూ, ఇది లేనిది కళాప్రయోజనం శూన్యమని మరొకరూ అంటారు. భావరూపం సృజనశక్తిపై ఆధారపడి ఉంటుంది. ఉత్తమ కవిగా నిలచేది దీనిపైనే. కవిత్వంపట్ల నిజమయిన ప్రశంస అందులోని మౌలిక విషయాన్ని గుర్తించే శక్తివల్ల వస్తుంది. విషయ ప్రశంసలో దాని రూపాభిజ్ఞత సమాజ వాతావరణం పరిజ్ఞానం వల్ల

కలుగుతుంది. పౌరాణిక వాతావరణంలో ఉన్నవారికీ ప్రబంధ వాతావరణం క్రొత్త. ప్రబంధ వాతావరణంలో ఉన్నవారికి ఆధునిక వాతావరణం క్రొత్త. ఆధునికులలోనూ మళ్ళీ తరగతులు. ఇంకా పోతే ఒక కవి రచన మెచ్చినవారికి మరొక మరొక కవి రచన నచ్చదు. దీనికి కారణం ఊహిస్తే, శబ్దయోజనం. ఊహావైఖరి, రచనారీతి, సిద్ధాంతాలపై విశ్వాసం. వీటికి అలవాటుపడి ఉండడమే. దీనికీ భిన్నమైంది, ఒకరికి నచ్చదు. ఇందులో కొందరు తమకు నచ్చంది ఏదో ఒక విధంగా వినీ చదివీ, ఆ తరువాత కొంత దగ్గరకు వచ్చేవారు ఉన్నారు. చాలామంది మర్యాదకోసం నటించేవారే. ఒకరకమైన వాతావరణానికలవాటుపడి మిగతా వాటికి వెలిఅయ్యే మనస్తత్వాన్ని సాధ్యమైనంతవరకు ఛేదించుకునే శక్తి కలవారు చాలా తక్కువ, వీరే సహృదయులు.

ప్రతి కవిలో ఒక విధమైన వాతావరణముంటుంది. ఇది తప్పదు. అతనికి కొన్ని సంకేతాలు, భావసహయోగాలు, శబ్దాలు, మానసిక రూపాలు పరిచయమై వుంటాయి. కొందరీ విషయంలో పూర్వకవులపై అభివృద్ధి సాధిస్తారు. మరికొందరు, ఇతరులకు లేని గుణాలు సంతరిస్తారు. ఇవి కవికి ప్రత్యేకతను సిద్ధింపజేస్తాయి. స్థూలంగా చూస్తే 'ప్రేమ' అన్నమాట భావకవికిచ్చే ప్రేరణ వేరు, అభ్యుదయ కవికిచ్చే ప్రేరణ వేరు. అలాగే భావసంకేతాలూ, శబ్దాల ఎన్నిక, వాటి సంయోజనమూ భేదిస్తాయి. వీరు పొందే వైయక్తిక, సామాజిక స్ఫూర్తి వేరు. అందుకని కవిత్వమూ భిన్నంగా ఉండడం సహజం ఉత్తమ కవిత్వం చాలావరకు బాహ్య మర్యాదల్ని అతిక్రమించిన వివేకం కోరుతుంది. వివేకంతోపాటు కళాదృష్టి అవసరం. అపుడే ఏ వాతావరణానికి చెందిన కవిత్వమైనా పాఠకులు ఆనందించగలరు. నేటి స్వేచ్ఛా కవిత్వం ఈ బాహ్య స్వరూపాన్ని అతిక్రమించి, అంతస్స్వరూపాన్ని ఎక్కువగా ఆవిష్కరిస్తుంది.

ఒక స్వేచ్ఛా కవిత కొన్ని స్థితుల సంకలనం కావచ్చు. ఒక స్థితి వ్యక్తీకరణం కావచ్చు. అందునా ఒక స్థితి ఎన్నో మానసిక రూపాల కూడలి కావచ్చు. మొత్తం ఒకే మానసిక చిత్రణముండవచ్చు. ఇవన్నీ నేడు కన్పించేవీ – ఈ పద్ధతులు కథాత్వాన్ని ప్రక్కకు నెట్టేవి. భావకవిత్వం నుండి ఆరంభమయిన రూపం నేడు వేరే లక్షణాలతో పరిణతకు చేరుకుంటూందని చెప్పవచ్చు. భావకవిత్వంలో, అందునా స్వేచ్ఛాకవిత్వంలో నేడు మానసిక రూప చిత్రణలకు ప్రాధాన్యం యివ్వబడుతూంది కాబట్టి కవి ఎంతో జాగరూకతతో వ్యవహరిస్తే తప్ప 'క్లిష్టత', 'అయోమయం' ఏర్పడడానికవకాశమెక్కువ. ఒక దీర్ఘకవితలో మానసిక రూపాలు ఏకధారగా ఏర్పడడంవల్ల విసుగు పుట్టడానికవకాశముంది. ఇది బాహ్యస్వరూపాన్ని పూర్తిగా నిరాకరించడానికి వీలులేదన్న ఊహని ఋజువు చేస్తూంది. ఈ స్థితిలో కవి అంతస్స్వరూప వైవిధ్యం కోసం

ప్రయత్నించాలి. బహిస్స్వరూపం ఆశ్రయమూ చక్కబరచు కోవాలి. ఇక్కడే శిల్పం చోటుచేసుకుంటుంది కాబట్టి కవి జాగరూకతతో ఉండవలసి ఉంటుంది. ఈ లోపం కలిగిన రచనలు ఉత్తమశ్రేణికి చెందినవిగా పరిగణింపబడవు. దీనికి బహు కావ్యపరిచయం, సంస్కారం, కొంత శిల్ప వైవిధ్యం ఎంతగానో అవసరం.

పూర్వ సంప్రదాయ రీతులపట్ల ద్వేషం పెంచుకొని ముడుచుకొనిపోయేకన్నా, వాటిని సహనంతో మననం చేసుకొని మనస్సు వికసింపజేసుకోవడం నేడెంతగానో అవసరం. కథ ఉన్నచోట రూపానికెక్కువ ప్రాధాన్యం ఉంటుంది. కథలేనిచోట మూడ్ (మానసిక స్థితి) ప్రాధాన్యం వహిస్తుంది. ఇది ఫోటో–టెక్నిక్ వంటిది. ఇందులో కవి దృష్టి చిత్రలేఖనానికుపకరించే కుంచెవలెగాక, కెమెరా మూవ్‌మెంట్‌లా ప్రసరిస్తుంది. ఏ ప్రగతీ ఒకరి ఇష్టానిష్టాలపై ఉండదు. అప్పటి శక్తుల ప్రాబల్యం, పరిస్థితుల పరిణామంపై ఆధారపడి ఉంటుంది.

ఈనాటి స్వేచ్ఛా కవిత్వంలో అభ్యుదయ కవుల భౌతికం, భావకవుల కాల్పనికం, సంప్రదాయ కవుల భౌతికాతీత ప్రభావ తీవ్రతలు తగ్గి – నేటి సామాజిక జీవనానుభవంతో నిగ్గుతేలిన వాస్తవం దృశ్యమానవమవుతూంది. వివిధ సిద్ధాంతాలూ, అభిప్రాయాలూ జీవితంలో సమన్వయం పొందుతూన్న సమయం. ఈ పరిణామానికి ప్రతిబింబమే నేటి స్వేచ్ఛా కవిత్వం.

**"రారా నీ ! రవి హర్షం!**
**మానవతా కిరణంతో**
**స్వేచ్ఛా సమ సమాజమై."**

# 8. ప్రజాస్వామ్య కవిత్వం

ఈనాటి స్వేచ్ఛా కవిత్వంలో ఆధునికత ప్రధానంగా 1) సామాజిక చరిత్రగతికీ, 2) అభిప్రాయాల సిద్ధాంతాల ప్రకటనకు, దార్శనికతకు, 3) జీవితంలో భౌతిక మానసిక స్థితి చిత్రీకరణకు, 4) కళాత్మకమైన నవ్యతకు అన్వేషణకు పర్యాప్తమైంది. ఇది వేరు వేరు స్థాయిల్లో పనిచేస్తూన్నట్లు కన్పించినా మొత్తంమీద కవిత్వానికి పరిపూర్ణతను చేకూర్చేవి. వర్తమాన కాలంలో కవిత్వం, 1) ప్రజాస్వామ్య భావనతో, 2) మార్క్సీయ విప్లవ దృష్టితో, 3) కాల్పనిక అనుభూతి రేఖలతో, 4) చేతనాత్మక రూపంతో ప్రధానంగా నాలుగు ముఖాలుగా పర్యాప్తమై కన్పిస్తుంది.

కవి తనకు తాను సృజన సమయంలో ఏర్పరచుకొన్న నియమాలచేత ఆవిష్కృతమౌతుందీ స్వేచ్ఛా కవిత్వం. స్వేచ్ఛ ఎక్కువగా ఉండడంతో బాధ్యత కూడా అధికంగానే ఉంటుంది. ఇది సమయసమయానికి కొత్త కొత్త మార్పుల్ని రచనలో సులభంగా ప్రవేశ పెట్టేందుకు బహు విస్తృతమైన అవకాశాన్ని ఇస్తోంది. ఈనాటి ఆధునికతకు సంపూర్ణంగా ప్రాతినిథ్యం వహిస్తోంది. ఇది జీవితాన్ని స్వేచ్ఛగా రూపొందించుకునే స్వాతంత్ర్యంతో గతిక్రమాన్ని నిర్ణయించుకొనే అవకాశం కలిగిన సామాజిక రూపానికి ప్రతిబింబం అనవచ్చు. రాజకీయమైన ఆధరతలం, సమాజంలో జీవితచలనం, వ్యక్తి ఆలోచనల స్వేచ్ఛాసంచారం, క్రియాశక్తుల స్వతంత్ర వికాసం దీని అస్తిత్వానికెంతగానో ఉపకరిస్తున్నాయి.

మానవ సమాజం పరివర్తనాశీలమైంది. ఈ మార్పు నిరంతరం జరుగుతూ ఉంటుంది. సాధారణంగా మంద్రమంద్రంగా సాగుతూ విశేష పరిస్థితుల్లో వేగాన్ని అందుకుంటుంది. ఉన్న స్థితికీ, రాబోయే మార్పుకీ మధ్య ఎన్నో విధాలుగా సంఘర్షణ అనివార్యమౌతుంది. అప్పటి పరిస్థితుల అవసరం మేరకు మార్పు వచ్చి తీరుతుంది. ప్రస్తుతం సాహిత్యంలో అనేక చారిత్రక కారణాలవల్ల రాజకీయ ప్రభావంచేత ఎన్నో మౌలికమైన మార్పులు చాలా వేగంగా వచ్చాయి. భారతదేశంలో వలస పాలనవల్ల పైనుండి యూరోపియన్ దేశాల్లోని సాంస్కృతిక పునరుజ్జీవనం ప్రభావంవల్ల క్రమంగా తదితర రాజకీయ సాంఘిక ఆర్థిక సిద్ధాంతాల కారణంగా కొత్తగాలులు వీచడం ఆరంభమైంది. నిఖిల మానవీయ తలంపై మానవతా స్పందనతో ఆధునిక శక్తి క్రియారూపం ధరించింది. కొన్ని దశాబ్దాలుగా జరుగుతూ వచ్చే మార్పులవల్ల ఆస్తిరూపంలో, సంపద వినిమయంలో ఉత్పత్తి సాధనాల్లో ఆలోచనా విధానంలో అభిరుచిలో అనుభవ స్పందన రీతుల్లో పరస్పర సంబంధాల్లో లక్ష్యాల్లో ఇంకా వివిధ

కార్యకలాపాల్లోను ఇట్లా జీవితంలో అనేక క్షేత్రాల్లో సంచలనం మొదలైంది, పరివర్తనం కలిగింది.

ఆధునికత అనేది అప్పటికప్పుడు ఏదో పరిమితమైన సమయంలో హఠాత్తుగా వచ్చేది కాదు. ఇది క్రమించే స్థితులూ స్పృశించే అంశాలూ రూపొందే పార్శ్వాలూ అనేకం ఉంటాయి. స్థూలంగా విశ్లేషిస్తే ఇది చారిత్రకంగా సాంఘికమైన సంస్కరణం, రాజకీయమైన పరివర్తనం, శాస్త్ర సాంకేతికమైన అభివృద్ధి, ఆధునిక భావనకవకాశం ఇస్తున్నాయి. జీవితంలో వీటివల్ల వచ్చిన గుణాత్మకమైన వికాస వైవిధ్యం పరస్పరం ఎంతో సంబంధం కలిగి అన్యోన్య ప్రభావాలతో కాలంగడిచే కొద్దీ సమాజంలో సంస్కరణంతో నవ్యతతో పరివర్తనంతో ఆధునిక రూపాన్ని ఆవిష్కరిస్తూ పోయాయి. దీని పర్యవసానమే ఆధునిక సమాజంలో ఆధునిక మానవుడూ, అతని గురించి ఆధునిక కవిత్వం.

మార్పు కోరే సమాజంలో ఆధునికత పోనుపోను క్షేత్రవిస్తృతిని పొందింది. ప్రగతిశీల వ్యక్తిత్వాన్ని పొందుతూ వచ్చింది. మౌలికమైన సంస్కృతి పునర్విలోకితమవుతూ వచ్చింది. అటు ప్రగతి, ఇటు మౌలిక సంస్కృతీ సమాజ ప్రవాహానికి రెండు తీరాలుగా వెలసాయి.

1. సంప్రదాయ తత్త్వాన్ని ప్రస్తు సమాజానికన్వయించడంలో ప్రయోజన తత్పరత.
2. సంకుచితమైన ధోరణి వదలి, ఎక్కువమంది ప్రజల ఆమోద యోగ్యతకు విలువ.
3. సమస్యలను హేతుదృష్టితో చర్చించి, సమాజశ్రేయస్సు దృష్ట్యా పరిష్కారం ఉపయుక్తం కానివాటి నిరాకరణం.
4. ప్రజల ఆలోచనల్లో స్పందనలో పరస్పర సంబంధాల్లో మార్పు.
5. కొత్త అనుభవ క్షేత్రాల్లో కొత్త కొత్త అన్వేషణలతో క్రియా కలాపాలు ఎక్కువ కావడం జీవితం సౌఖ్యం సౌభాగ్యం కోసం యత్నం.
6. ప్రత్యర్థుల అభిప్రాయాల ప్రకటనం, సమస్యలపై చర్చలకు అవకాశంతో తగిన స్థానానికి సౌముఖ్యం.
7. గతంపై కన్నా వర్తమాన సుస్థితికీ, భవిష్యత్ దర్శనంతో ప్రజాస్వామ్య భావనకు ప్రచార వ్యాప్తి.
8. మానవుని ఉన్నతిపై విశ్వాసంతో, ప్రాంతాల్నీ దేశాల్నీ దాటి ప్రపంచ స్థాయిలో అన్ని రంగాల్లో పరస్పరం సంబంధాలు నెలకొని ఆదాన ప్రదానం జరగడం.

9. కేవలం భగవంతుని చేరుకోవడం లేదా పొందడం కన్నా ముక్తిపై దృష్టికన్నా సమాజశ్రేయస్సుకు నైతికమైన వ్యక్తిత్వానికీ ఆదర్శరూపానికీ ప్రాధాన్యం.

10. శాస్త్ర సాంకేతిక విద్యా ప్రగతితో న్యాయం, సంపదలో అవకాశం అందరికీ సమానంగా లభించే ప్రయత్నం.

11. ప్రాచీన సంస్కృతిలోని వారసత్వ సంపదను నిఖిల మానవ సంస్కృతిలోని భాగంగా కొత్త దృష్టితో పరిశీలనం.

12. స్త్రీ పురుషుల సంబంధాల స్థాయిలో మార్పు – సమాజంలో స్త్రీ వ్యక్తిత్వ వికాసానికి ముఖ్యంగా ఆర్థిక స్వాతంత్ర్యానికి ఉపకరించే విధానంతో పాటు సమాజ స్థితి పరికల్పనం.

సమాజప్రగతికి వేగంతోపాటు సుస్థితినీ కలిగించడానికి ఉపకరించే పై అంశాలతో ఏర్పడిన క్షేత్ర విస్తృతీ, కార్యకలాపాల వైవిధ్యం ఆధునిక సమాజ పరిణామక్రమంలో ముఖ్యమైనవి. (స్వేచ్ఛా) ప్రజాస్వామ్య కవిత్వంలో దీని స్వరూపం ఆధునికతా రేఖలతో స్పష్టంగా బింబిస్తుంది. అన్ని రంగాల్లో కొత్తను అన్వేషించే ప్రయోగ పరంపర సాగుతూంది. జీవిత ప్రమాణాల్ని పెంపొందిస్తూ, సమాజాన్ని సౌభాగ్యవంతం చేసేందుకు ఉపకరిస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఈ స్థితికి ఎక్కువ అనుకూల్యం ఉంది.

**2**

ప్రస్తుతం స్వేచ్ఛా కవిత్వానికి వస్తే రాజకీయమైన అవగాహనతో సైద్ధాంతికమైన అభిప్రాయ మూలకమైన నిబద్ధత పట్ల అభిలాష ఈనాటి కవుల్లో ఎక్కువగా కన్పిస్తుంది. ఇది ఒక్కొక్కప్పుడు కళాత్మకతను, రచనా శిల్పాన్ని పక్కకు నెట్టేసి ఆధిక్యత నెరపేంతటి శక్తివంతంగాను పనిచేస్తోంది. ప్రజాస్వామ్య కవిత్వంలో సామాజిక స్పందనతో పాటు వైయక్తికమైన అన్వేషణం ఉంటుంది. సమష్టి మరియు వ్యష్టి స్థాయిలో ఉండే భేదాన్ని గుర్తిస్తుంది. వైవిధ్యాన్ని అనుమతిస్తుంది. ప్రయోజనాన్ని మరవదు. కళాత్మకతకు భంగం కలిగించే స్థితి రానీయదు. సమాజంలో సమభావాన్ని సృజిస్తుంది. దీని సుస్థితికీ సుస్వరతకు దోహదం చేస్తుంది. సమాజ ప్రగతికెంత ప్రోత్సాహం ఉంటుందో వ్యక్తి వికాసానికీ అంతటి ప్రోత్సాహం ఉంటుంది. సామాజిక చైతన్యం వ్యక్తిపై ఎంతటి ప్రభావాన్ని నెరపుతుందో, వైయక్తికమైన ప్రేరణ కూడా సమాజంపై అంతే గుణాత్మకమైన స్థితిని నెలకొల్పుతుంది. కార్మికలోక కల్యాణంతో పాటు సమాజంలో వివిధ రంగాల్లో వారి వారి శక్తులను బట్టి పనిచేసే వివిధ వర్గాల ఆరోగ్యకరమైన అభ్యున్నతినీ కాంక్షిస్తుంది. సాంస్కృతిక మూలాల్లోని చేతనను గౌరవిస్తుంది. ఇది ప్రజాస్వామ్య కవిత్వానికి ప్రాతిపదిక.

స్వేచ్ఛా కవిత్వంలో ఈ సామాజిక తత్త్వం ముఖ్యంగా ప్రజాస్వామ్య భావనతో వ్రాసే రచనల్లో స్ఫుటంగా కనిపిస్తుంది. భౌతిక మానసిక తలాలపై అన్వేషణంతో పరిశీలనంతో కొత్తరూపం ఆవిష్కృతమౌతుంది. ఇది చేతనలో పై స్థాయికి సంబంధించి విశేషంగా మనస్తత్వ సమర్పకంగా ఉంటూంది. దీనికి వేరే సమాలోచనం అవసరమౌతుంది. ఈ రచనల్లో పారిశ్రామికంగానేకాక పరిపాలనాపరంగాను రాజకీయ వ్యవస్థాగతంగాను నిత్యజీవితంలోను విభిన్న పరిస్థితులూ వాటి ఒత్తిడులకు గురిఅయ్యే మానసిక రీతుల చిత్రణం, విశ్లేషణం ఉండటం సహజం.

ఈ వెలుగులో కవిత్వంలో ఆధునికత, 1) చరిత్రగతిలో పరివర్తనా పార్శ్వాలనూ, 2) వాస్తవతలంకై జీవితంలో వస్తుస్థితుల్నీ, భావింపజేసే శక్తివంతమైన ప్రసారరూపంగానూ కన్పిస్తుంది. ప్రస్తుత పరిధిలోకి రాకపోయినా కవిత్వంలో వీటితోపాటు ఉల్లేఖనీయమైనవీ అనివార్యమైనవీ. 1) పైకి అవిదితంగా ఉండే మానసిక రీతులూ మనస్తత్వ ధోరణులూ, 2) అవిష్కార శిల్పమూ – కళాత్మకత అనేవి. మొదటిది ప్రత్యక్షంగానో పరోక్షంగానో అనుభవాత్మకమైన జీవితంలో వాస్తవతలంపై ఏర్పడే సూక్ష్మస్థితులు వివిధ సంఘటనలు, ప్రవర్తనలు ఆధారంగా చిత్రితమౌతుంది. రెండోది అభిరుచిని నిలిపేందుకు ఆకర్షణను కలిగించేందుకు కొత్త కొత్త సంవిధాన రీతులతో యోజితమై ఆధునిక రూపాన్ని ధరిస్తూ ఉంటుంది.

సాహిత్య చరిత్ర గతిలో అభ్యుదయ కవిత్వం పొందిన విస్తరణ రూపమే విప్లవ కవిత్వం. అభ్యుదయ విప్లవ కవిత్వాలకు మధ్య వచ్చిన దిగంబర కవిత్వం సమాజంలో నైరశ్యాన్నీ వైకల్యాన్నీ విషాదస్థితినీ ఎత్తిచూపుతూ మానసికమైన దుస్థితిని భౌతికతలంపై జుగుప్సా భీభత్స దృశ్యాలతో చిత్రించింది. సామాజిక పరివర్తనకు తీవ్రమైన చర్యల్ని అభిలషించింది. దీనిలో విధ్వంసక ధోరణితోపాటు నిర్మాణాత్మకమైన భావన ఉంటే బాగుండేదే కాని ఆ కవుల లక్ష్యం మార్పు మాత్రమే. దీని వెంటనే వచ్చిన చేతనావర్త కవిత్వం సంప్రదాయశక్తికి వర్తమాన స్థితికీ మధ్య చేతనాను బంధాన్ని స్థాపిస్తూంది. లక్ష్యంలో దివ్యభూమికల్ని దర్శిస్తూంది.

ప్రజాస్వామ్య కవిత్వం భౌతిక రూపాన్ని విడనాడకుండా ఉదాత్తమైన విలువలకు ప్రాధాన్యం ఇస్తోంది. మార్క్సీయభావనతో సమాజంలో వర్గపోరాటాన్ని తీవ్రతరం చేసే ఉగ్రశక్తిగా విప్లవకవిత్వం ఆయుధయుత పాత్రను వహించింది. వీటికి సమాంతరంగా అపుడపుడూ తలెత్తే అనుభూతి కవిత్వం కాల్పనికతను సంతరించుకుంది. వీటికి భిన్నంగా విశిష్టంగా సామాజిక ప్రగతి లక్ష్యంతో, వ్యక్తి వికాసంపై దృష్టితో భౌతిక మానసిక తలాలకు సమానమైన ప్రాధాన్యంతో చిర సంప్రదాయ సంపద పట్ల గౌరవంతో వెలువడింది ప్రజాస్వామ్య (స్వేచ్ఛా) కవిత్వం.

# 9. ఆధునికత

కవీ పాఠకులు; కవిత్వమూ సమాజమూ అనేవి పరస్పరం ఆధార సంబంధం కలిగినవి. ఆధునికయుగంలో బాగా విస్తరించిన క్రియాకలాపాల క్షేత్రంలో, కవి తనకు తాను ఏర్పరచుకున్న నియమాలతో ఏ 'రెఫరీ' అవసరం లేకుండా ఆడే ఆటవంటిది స్వేచ్ఛా కవిత్వం. దీనితో ప్రత్యేకమైన బాధ్యతలూ ఏర్పడతాయి. ఒకవైపు కవీ మరొకవైపు పాఠకులు సమాలోచకులు ఉంటారు. పాఠకునిలో ప్రతిదాన్ని ప్రశ్నించి పరీక్షకు నిలిపి విమర్శించే ధోరణి ఆధునికయుగ ప్రభావంవల్ల ఏర్పడిందే. అతనిలో హేతుబుద్ధి, చర్చాలక్షణం ఆలోచనాత్మకంగా పనిచేయడమే దీనికి కారణం. ఇరువురికీ అభిరుచి ఉన్న సాధారణక్షేత్రం కవిత్వం. అయితే వీరు చెరి ఒకవైపు నుండి ఉపక్రమిస్తారు.

రచన చేసేప్పుడు కవిలో ఉండే విమర్శనాశక్తి నిర్వహించే పాత్ర వేరు. రచన వెలువడిన తరువాత స్థితివేరు. రచనాక్రియ సమాప్తి కావడంతో రచయిత ప్రమేయంలో ప్రధానమైన దశ పూర్తి ఐనట్లే. సృజనశీలంగల పాత్ర అదృశ్యమౌతుంది, మరోపాత్ర మొదలౌతుంది. తాను వ్రాసిన దాన్ని విమర్శకుల విమర్శలనుండి సమర్థించుకోవడమో వివరించడమో వ్యాఖ్యానించడమో లేదా దీనికి ప్రాతిపదికగానో మార్గదర్శకంగానో ఆధారవిషయాన్ని నిర్మించడమో జరుగుతుంది. సమాలోచనా రూపం అవతరిస్తుంది. రచనతో రచయిత ప్రత్యక్ష సంబంధం తెగిపోతుంది. పరోక్షసంబంధం ఉండనే ఉంటుంది. ఇక్కడినుండి రచనతో పాఠకుని ప్రత్యక్ష సంబంధం మొదలౌతుంది. రచయిత, పాఠకులు ఇరువురు చేరుకునే శిఖరాలు ఉన్నాయి. అవి అనుభవస్థితి, ఆలోచన, ఆదర్శం అనేవి, క్రమంగా పాఠకునిలోనుండి సమాలోచన రూపం తన కర్తవ్యాన్ని నెరవేర్చడం మొదలు పెడుతుంది. అనుభవ శీలం కలిగిన సహృదయ లక్షణంతో నిశితమైన విమర్శనంతో పాఠకుని వ్యక్తిత్వంలో ఏర్పడే వికాస రూపం సమాలోచనం. కర్తవ్యంలో విస్మరించరాని బాధ్యత నిక్షిప్తమై ఉంది.

స్వేచ్ఛా కవిత్వంలో అస్పష్టత గురించి ఒకటి రెండు మాటలు ముచ్చటించవలసి ఉంది. ఇక్కడ అస్పష్టత అనేది కొన్ని ప్రత్యేక స్థితులకు సంబంధించింది. ఒక విధం రచనలో వాక్యాలమధ్య, విభాగాలమధ్య భావ పరంపర మధ్య పూర్తి చేయవలసిన స్థానాలు మిగిలి ఉంటాయి. ఒక్కొక్కపుడు శబ్దాలకు సంబంధించింది అయి ఉండవచ్చు. పాఠకులు చదివేప్పుడు వీటిని ఆలోచనతో పూర్తి చేసుకోవలసి ఉంటుంది. కొన్ని సందర్భాన్ని బట్టి వాటి అంతట అవే సహజంగా ఏ శ్రమ లేకుండా పూర్తి అవుతాయి. అవి సంక్షిప్తత, గుప్తతపై దృష్టితో పరిష్కరించుకోవలసి ఉంటుంది. మరికొన్ని భావ

చిత్రణలకూ వాటి అభివ్యక్తికీ సంబంధించిని. ఇవి కవి మనోరూపానికిచ్చే స్థానాన్ని బట్టి అస్పష్టత కవకాశం లభిస్తుంది.

ఇంకా ప్రతీకల ప్రయోగం సంశ్లిష్ట భావరూపాల విన్యాసం చైతన్యప్రవంతి సంవిధానం మొదలైనవి ఉండనే ఉన్నాయి. వీటివల్లనూ అస్పష్టత కవకాశం ఉంది.

ప్రజాస్వామ్య (స్వేచ్ఛా) కవిత్వంలో ఆధునికతకు మరో ముఖ్యభాగమైన ఆవిష్కార రూపాన్ని ఈ విధంగా పరిశీలనలోకి తీసుకొనిరావచ్చు.

1. కథ ఉండదు కాబట్టి వస్తువును స్థితియోజనంతో, భావవిన్యాసక్రమంతో నిర్వహించడం.

2. వస్తువు లేదా కథను సూక్ష్మస్థితిలో భావించి లేదా మధ్యమధ్య సూత్రప్రాయమైన రూపాన్ని ఇస్తూ సంఘటన చర్య ప్రతిచర్యలతో తీర్చడం.

3. ఎన్నికచేసిన అంశాల క్రమంలో పరిణామ దృష్టికన్న హేతుదృష్టిని అవలంబించడం లేదా ప్రయోజన దృష్టితో ఏకముఖంగా తీర్చడం.

4. శబ్దాడంబరానికీ సమాస విన్యాసానికి స్థానం లేకపోవడం.

5. కవికి నచ్చినవిధంగా సమయానికి తగినట్లుగా గతి విశేషాన్ని ఏర్పాటు చేసుకోవడం, లయవిన్యాసాల్ని సాధించడం.

6. రచనలో, వాక్యాల ఆరంభం, విన్యాసం, ముగింపులో విసుగుదల కలగకుండా వైవిధ్యం కలిగి ఉండడం. వాక్యం మరో వాక్యాన్ని అందిపుచ్చుకోవడంలో నేర్పుతో మొత్తంమీద లహరి లేదా తరంగ విన్యాసమో ప్రవాహ ప్రసారమో మరో సూత్ర విధమో కలిగి ఉండడం.

7. భావనలో లోతు ఔన్నత్యం ఉదాత్తత కోసం ప్రతీకల్ని భావచిత్రాలను ఆశ్రయించడం, చైతన్యప్రవంతి వంటి నూత్న సంవిధానాలను అనుసరించడం.

8. ఆవేశస్థాయిని ఆలోచనా గతిని నిలిపే విధంగా భావం యొక్క ఉచ్చలనం, నిశ్చలనం, అవతరణం స్థితుల్ని నేరుగా జాగ్రత్తగా అవిచ్ఛిన్నతకు భంగం రాకుండా నిర్వహించడం.

9. ప్రతి సంఘటనకూ ప్రవర్తనకు ఆలోచనకు వెనుక ఉన్న శక్తివంతమైన భావం లేదా అభిప్రాయం గురించి పాత్ర మనస్తతచిత్రణంపై వెలుగు ప్రసరించడం.

10. సైద్ధాంతిక లేదా తాత్త్వికమైన లక్షణాన్ని కళాత్మకమైన రూపంతో సంయోజించి రచనకు రామణీయకతను ఉదాత్తతను కలిగించడం.

ఈ విధంగా కవి తాను జీవించే యుగాన్ని ప్రతిబింబిస్తూ తనదైన స్వతంత్ర వ్యక్తిత్వంచేత రచన ప్రత్యేకతను పొంది విశిష్టతను కలిగి ఉంటుంది.

ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛా కవిత్వం ఎప్పటికప్పుడు ఆధునికతను సంతరించుకొని ఎంతో వైవిధ్యంతో వెలువడుతోంది. విప్లవలక్ష్యం ఉంటేనే ఆధునికత ఉంటుందనుకోవడం ఉచితం కాదు. ప్రజాస్వామ్య స్వేచ్ఛా కవిత్వంలోను సమాజంలోని సంక్షోభం, నిరసన, ప్రతిఘటన, సంఘర్షణతో క్లిష్టస్థితులు తిరస్కృతాలు కావు. పైగా వాటి మూలకారణాల్ని గుర్తించి పరిష్కార యోజన జరుగుతుంది.

మరో ప్రక్క నుండి ఆర్థిక రాజకీయ సాంఘిక వలయాలనుండి సమాజం ముందుకు క్రమిస్తున్నపుడు సంక్షోభం సంఘర్షణ ఏదో ఒక రూపంలో తప్పనిసరి అవుతాయి. ఈ క్లిష్టస్థితుల్ని వివిధ దశల్లో పరస్పరం సహకారభావంతో సమన్వయపరచే నిర్మాణాత్మకమైన వ్యవస్థకు ప్రాతినిధ్యం వహిస్తుంది ప్రజాస్వామ్యం. దీన్ని "సంపూర్ణంగా ప్రతిఫలింపజేసుకొని సమాజప్రగతికి దోహదం చేస్తూ వ్యక్తి వికాసానికి స్వేచ్ఛను కలిగిస్తుంది ప్రజాస్వామ్య కవిత్వం". ఇది ప్రజాస్వామ్య (స్వేచ్ఛా) కవిత్వయుగం అని వ్యవహరించే స్థాయిలో ఆధునికతను సంతరించుకొని ఆవిష్కృతమౌతుంది.

**"నిన్నటి మానవ సంకల్పం మేఘమై పిడుగులతో మెరపులతో,**
**నేడు కాంతి జలం వర్షిస్తూంది - ప్రజాస్వామ్య బంధువై".**

# 10. మానవతావాదం - అవసరం

మానవత్వం మానవునితో పాటే పుట్టింది. సమాజంలో వ్యక్తి పుట్టింది మొదలు మరణం వరకు అన్ని యుగాల్లోను అవిచ్ఛిన్నంగా వస్తూన్నది, అన్నిరకాల సామాజిక వ్యవస్థల్లోను అవశ్యం ఉండేది. ఏ రాజకీయ సిద్ధాంతమైనా ఏ తరగతికి చెందిన సంఘమైనా దీన్ని ఆశ్రయించి ఉన్నతమైన విలువల్ని పొందడం చూడవచ్చు. ప్రతి ఆదర్శంలో దీని స్పృహ తప్పనిసరిగా ఉంటుంది. ఇది ఏదో ఒక రూపంలో ఆటవిక సమాజం నుండి అత్యంతాధునికమైన వ్యవస్థ దాకా గుర్తింపబడింది. వివిధ దశల్లో దీని ఆవిష్కృతి సహజధోరణిలో సాగుతూ మనల్ని ఆకర్షిస్తూంది. జీవితాన్ని గురించి ఆలోచన చేసే, జీవితానుభవాన్ని చిత్రించే సాహిత్యంలోనూ దీన్ని స్పష్టంగా చూడవచ్చు. మనిషిలో ఆర్ద్రత స్పందన కారుణ్యం ఉదారత మొదలుగా విశాలమైన భావనతో పలువిధాలైన రంగు, జాతి, కులం, మతం గల ప్రజల్ని దగ్గరికి తెస్తుంది. ఒక్క మనుషుల్నే కాదు ప్రాణికోటిని, ప్రకృతిని సన్నిహితమైన స్నిగ్ధబంధంతో గుండెకు హత్తుకునేట్లు చేస్తుంది. ఒకరిపట్ల మరొకరికి నిర్వ్యాజమైన సానుబంధాన్ని సాన్నిహిత్యాన్ని కలిగిస్తూ మానసికంగా తృప్తిని శాంతిని ప్రసాదిస్తూ, సమాజంలో అనేకమైన చారిత్రక కారణాలవల్ల ఏర్పడిన కృత్రిమమైన అవరోధాలనూ అఖాతాలను అధిగమించే ఉదారసూత్రంతో మనల్ని అందరిని ఎల్లవేళలా బంధించే శక్తి కలిగింది.

“Man is the measure of all things” “మానవుడే అన్ని విషయాలకు ప్రమాణం” అన్న గ్రీక్ దార్శనికుడు ప్రోటాగరస్ సూత్రం ఈ వాదానికి మూలస్తంభం, మానవుని వివిధ శక్తులను గురించి ఆలోచన చేసి ప్రపంచంలో అతని పరమోత్కృష్టమైన స్థానాన్ని దృష్టిలో పెట్టుకొని మానవత్వాన్ని మొట్టమొదట ఒక తత్త్వంగా వివేచన చేసిన ప్రసిద్ధాచార్యుడితడు. భారతీయులు దీన్ని గురించి ప్రకటించిన అభిప్రాయాలు మనకు అక్కడక్కడా కన్పిస్తాయి. మానవతా భావం వీరి దృష్టిని ఎంతగానో ఆకర్షించింది. అయితే పాశ్చాత్యులు దీన్ని ఒక పద్ధతిలో ఆలోచన చేస్తూ క్రమంగా ఒక తత్త్వంగా రూపొందించిన మాట వాస్తవం. మానవుని అస్తిత్వానికీ అతని జీవన స్వరూపానికీ, ప్రపంచంలో ఉన్న విశిష్టత, దీనికి సంబంధించిన అనేక రహస్యాలను తెలుసుకునేందుకు జరిగే జిజ్ఞాస, అన్వేషణ ఇందులో కనిపిస్తుంది. దీని పర్యవసానంగా మానవుని సర్వశక్తి సమర్థకత్వం నిరూపితం చేయబడింది. ఇతడు ప్రపంచంలోని సర్వ విషయాలకూ ప్రమాణకేంద్రంగా శక్తిస్థానంగా నిర్ధారణ చేయబడి ఆలోచన సాగడం, వివేచన జరగడం ఇందులోని విశేషం.

ఈ దృష్టితో సమాజంలో పరంపరాగతంగా, సమాజంలో ఏ కారణాలవల్లనైతేనేం వస్తూన్న దేవతల సర్వశక్తి లక్షణం అంగీకరయోగ్యం కాదు. ఈ విధంగా జరిగితే మానవుని ఔన్నత్యం తగ్గిపోతుంది. దేవతల విషయంలో మనలో అజ్ఞానానికి కారణాలనేకం. దీనికెక్కడలేని స్థానాన్ని ఇచ్చి ముందుగా ఒక నిర్ణయంతో వ్యవహరించకూడదని ఈ వాదం అభిప్రాయం. ఇందులో మానవుని బుద్ధి విలసనంతో ప్రవర్తనారూపంతో కూడిన శక్తి ప్రయత్నం ముఖ్యం. అనుభవం విజయం ఆనందం అన్నీ మనిషి బహుముఖీనమైన వ్యక్తిత్వ వికాసాన్ని మన దృష్టిపథంలో ఉన్నతంగా ప్రవర్తింపజేయడమే ముఖ్యం. దీన్ని విశ్లేషిస్తే మానవుని జీవితం ప్రకృతి సహజమైందీ, ఒక లక్ష్యం కలిగిందీ, అతని బుద్ధి విశ్వ రహస్యాలను కనుగొనే మేధాశక్తి సంపన్నమైందీ. అతని ప్రవృత్తిపై శ్రమపైనే జీవితం ఆధారపడి ఉంది. స్వేచ్ఛా లక్షణం వివేకస్ఫూర్తీ భౌతిక మానసిక స్థితిని రూపొందింపజేస్తాయి. జీవితానికి ఒక గమనాన్ని కలిగింపజేస్తాయి. మానవునిలో నిక్షిప్తమై ఉన్న ఎన్నో నిగూఢ శక్తులు ఒక్కొక్క పరిస్థితిలో ఒక్కొక్క విధంగా ప్రకాశమానవుతాయి.

మానవుని స్థితికి మానవుడే బాధ్యుడు. అతడు ప్రకృతిని వశం చేసుకోగల దక్షుడు. తనలో నిహితమైన శక్తిని గుర్తించి సమీకరించి వ్యక్తిత్వాన్ని నిర్మించుకోగల వివేకి. జీవితంపై చెదరని ఆశ, తోటి మానవులపై విశ్వాసం, సంబంధాలు అతని పురోగమనానికి దారితీస్తాయి. వీటి అన్నిటికీ మూలం అతనిలో అణగని స్వేచ్ఛాతత్త్వం అన్న విషయం మరచిపోకూడదు. ఇది మానవ వాదానికి కీలకమైంది. ఈ విషయంలో మానవ వాదానికీ అస్తిత్వవాదానికీ చాలా దగ్గరి సంబంధం ఉంది. అయితే ఈ స్వేచ్ఛకూ కొన్ని పరిమితులు లేకపోలేదు. వీటిని, ఎన్నో విషయాలను దృష్టిలో పెట్టుకొని వివేకంతో గర్తించవలసి ఉంటుంది.

మానవునికీ ఇతర శక్తులకూ జరిగే సంఘర్షణలో ఎప్పటికైనా విజయం అతనిదే నన్న నిశ్చయభావం మానవుణ్ణి ఎన్నో మహాకార్యాలకు ప్రేరేపిస్తుంది. దీని పర్యవసానంగా సాధారణ స్థితినుండి విశిష్టస్థితికి చేరుకోగలడు. కొన్ని సందర్భాల్లో దైవరూపంగానూ భావింపబడి ఆరాధనా యోగ్యతను పొందడం జరిగింది. ఇది మానవుని ప్రస్థానంలో గొప్ప మలుపుగా పేర్కొనవచ్చు. గొప్ప చారిత్రక వ్యక్తులెందరో కాలంపై దేవతలస్థాయికి చేరుకున్నారు. మావుని విశిష్టత గురించి వివేచనకు పునరుజ్జీవం పోసి ప్రాతినిధ్యం వహించే మరొక ఆచార్యుడు పికొడెలా మిరాన్డోలో. ఇతని దృష్టిలో మానవుడు వాస్తవంగా విశ్వానికి సూక్ష్మమైన ప్రతిబింబం. ఇది భౌతికమూ ఐన మూర్తి కలిగింది. కాలక్రమేణ ఈ అభిప్రాయాన్ని గురించి ఎంతో జిజ్ఞాసతో ఆలోచన సాగింది.

ఆధునిక సాహిత్యంలో మరీముఖ్యంగా స్వేచ్ఛా కవిత్వంలో, మానవుని శక్తినీ ప్రజ్ఞనూ ఆవిష్కరించే ఉత్కృష్టమైన భావన విస్తారంగా కన్పిస్తుంది. ఆధునికయుగంలో వైజ్ఞానికమైన విజయ పరంపర జీవితంపై ఎంతో ప్రభావాన్ని నెరపింది. దీనితో జీవిత స్వరూపమే మారింది. జీవితంపట్ల వైఖరి, దాన్ని గురించి ఆలోచనలో పరివర్తనం వచ్చింది. మానవుని ఔన్నత్యంపై అధికమైన విశ్వాసం కుదిరింది. విధి-దైవం అన్ని రంగాల్లో పక్కకు నెట్టివేయబడినాయి. ఈనాటి అవసరాలను బట్టి జీవితక్షేత్రంలో వివిధ కార్యకలాపాల విస్తృతిలో మానవత్వం ప్రధానంగా మానవతావాదం సాహిత్యంలో ఏ అభిప్రాయానికైనా సిద్ధాంతానికైనా అనివార్యంగా కనిపిస్తుంది. ఇది స్వేచ్ఛా కవిత్వంలో తప్పనిసరియైన మానవత్వంతో పాటు సంస్కరణపట్ల అభిలాష వైజ్ఞానికమైన దృక్పథమూ పురోగమన లక్షణంతో ప్రయోజన విస్తృతిని పొందింది. ఇది ఈనాడు ఎంత సాధారణమై సార్వజనీనంగా పరిణమించిందంటే, ఏ ఆదర్శంలోనైనా, ఏ వ్యవస్థా నిర్మాణంలోనైనా ఆధునికతత్వంతో చక్కగా ఇమిడిపోవడమే కాకుండా, దాన్ని ఎంతో ప్రకాశమానం చేస్తోంది. కాబట్టి ఈనాడు సాహిత్య వివేచనలో ముఖ్యమైన అంశంగా పరిగణనకు వస్తోంది. స్వేచ్ఛాకవిత్వంలో రాజకీయ సాంఘిక తాత్త్విక మానసిక దృక్పథాల ప్రవేశంవల్ల ఏర్పడే వివిధ వలయాల్లో కన్పించే మానవతా వాదం పరిశీలనంచేత సమలోచనం కూడా పరిపుష్టమౌతుంది.

మానవత్వంపేరిట పేర్కొనే ఉదారవాదం వేరు, మానవతావాదం వేరు అన్న విషయాన్ని ఈ సందర్భంలో గుర్తించవలసి ఉంటుంది. మానవునిలోని ఆర్ద్రతను స్పందనను ఉదారలక్షణంతో జీవితలక్ష్యాన్ని భావింపజేసి కొన్ని విలువల్ని ప్రత్యేకంగా సంతరింప జేయడంలో దీని ప్రత్యేకత ఉంది. వైజ్ఞానిక పరిశోధనం ఆధారంగా రాజకీయమైన విభేదాలతో మారణహోమానికి దారితీసే క్లిష్టపరిస్థితుల్లో మానవత్వం హృదయంగా గల మానవతావాదం ఒక్కటే ప్రపంచాన్ని రక్షిస్తుంది. పురోగమింపజేస్తుంది.

స్థానికమైన వివిధ జాతి మత వర్ణ భాషా సంస్కృతులతో రూపొందించిన విచిత్రమైన పరిస్థితుల్లోను వీటినధిగమించి మానవతారూపం ఉజ్జ్వలంగా ప్రకాశిస్తూ సమాజంలో, సమన్వయ వాతావరణానికీ, సమరసభావానికీ మార్గాన్ని సృష్టిస్తుంది. ఆకలితో దారిద్ర్యంతో బాధతో దుఃఖంతో ఉన్న తోటి మానవుని కింత కూడు గుడ్డ జాలి సానుభూతితో తోడ్పడడమే కాకుండా, అతని వ్యక్తిత్వ వికాసానికి, హేతుయుతమైన ఆలోచనతో సంస్కరణాభిలాషతో విశ్వైక్య భావనతో విస్తృతమైన ప్రాతిపదికను రూపొందించడం మానవతావాదంలోని ప్రధాన లక్షణం. ఇది ఒక సామాజికమైన ఆదర్శంతో వ్యవస్థా నిర్మాణంలో ప్రజాస్వామ్యమైనా సామ్యవాదమైనా మరే వాదమైనా గొప్ప ప్రయోజనాన్ని

సఫలంజేసి నిఖిల మానవాళి సౌభాగ్యానికి సహాయభూతమవుతుంది. ఈ కార్యంలో ఇది నెరపే పాత్ర సమాజంలో కొందరికి అభిమతం కాకపోవచ్చు. ఉదాహరణకి సంప్రదాయ మౌఢ్యాన్ని నిరసిస్తుంది. వ్యర్థమైన ఆచారాలను ఆడంబరాలను ప్రశ్నిస్తుంది. ఆయుధబలంతో మోహరించే మౌర్ఖ్యాన్ని తిరస్కరిస్తుంది. మానవులలోని మంచికీ, నిర్మాణశక్తికీ, మేధాగుణానికీ, వివేకస్ఫూర్తికీ, హృదయస్పందనకూ ప్రాముఖ్యాన్నిస్తుంది.

ఇది మానవులందరినీ మానవీయ భావనతో మానవతా సూత్రబద్ధం చేయడంలో వైజ్ఞానిక స్పృహ అంతర్జాతీయ భావన కలిగింది. సౌహార్దగుణంతో స్వేచ్ఛా వాతావరణంలో జీవిత స్వరూపాన్ని తీర్చిదిద్దేందుకు ప్రయత్నించడంవల్ల దీనికి కాలదోషం పట్టడం అంటూ ఉండదు. మానవత్వం సహజంగా అంతర్నిహితమై ఆకర్షించే ఈ మానవతావాదం ప్రగతిశీల రాజకీయ సిద్ధాంతంతో తీర్చిన వ్యవస్థలోను గుణవంతమైన ప్రయోజనాన్నే నిర్వహిస్తుంది.

వైయక్తికమైన మానవీయ సంబంధాలకు సామూహిక లేదా సామాజిక మానవీయ సంబంధాలకు మధ్య ఘర్షణ లేదు. అయితే రెండింటికీ మధ్య అంతరం ఉంది. సాధారణంగా మానవత్వంపై దృష్టి ఉన్న రచయిత వైయక్తికమైన సంబంధాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాడు. మానవతావాదంపై అభిలాష ఉన్న రచయిత దీన్ని కలుపుకొని సామూహిక లేదా సామాజిక మానవీయ సంబంధాలకు ప్రాముఖ్యాన్ని ఇస్తాడు. ఇది సామాజిక చైతన్యాన్ని వేగవంతం చేసేందుకే ఉపకరిస్తుంది. వేగవంతమైన సామాజిక ప్రగతికి దారితీస్తుంది. ఉత్తమశ్రేణికి చెందిన సృజనాత్మక రచనల్లో ముఖ్యంగా కవిత్వం నవల కథలో అవశ్యంగా కన్పిస్తుంది. ఈనాడు సాంఘికంగాను దీని అవసరం జీవితంలో అనివార్యమైంది. స్వేచ్ఛాకవిత్వంలో మానవతా వాద ప్రభావం ఆకర్షణీయమైన ప్రయోజనకరమైన స్థానాన్ని వహించింది.

"సమస్యల కాప్తరూపం
పీడిత జన సందేశం
ప్రజా స్వామ్య బింబం
జీవిత ప్రకాశ చిహ్నం"

# 11. స్వేచ్ఛా కవిత్వం - స్వేచ్ఛా సమాజం

సాహిత్యంలో సమాజమూ వ్యక్తి ఒకదానికొకటి పోషకంగా ఉన్నతికీ వికాసానికీ దోహదం చేసేవి. సమాజం లేంది వ్యక్తి వికాసం లేదు. వ్యక్తుల సమూహమే సమాజం. వ్యక్తులు లేంది సమాజం లేదు. వ్యక్తులు వస్తూ పోతుంటారు. నిజమే! సమాజానికీ ఇది వర్తిస్తుంది. యాభై సంవత్సరాల క్రితం వున్న సమాజస్వరూపం ఇప్పుడు లేదు. ఈ మార్పు ఒకప్పుడు నెమ్మదిగా అసలే జరగనట్లూ మరొకపుడు వేగంగానూ జరుగుతూంటుంది. దీనికి చారిత్రక రాజకీయ మత సాంఘిక ఆర్థిక కారణాలనేకం. సమాజంలో వివిధ వలయాలు అంతస్థులూ వుంటాయి. వ్యక్తులూ అనేక విధాలు. ఎవరి వ్యక్తిత్వం వారిదే. సామాజిక పరివర్తనంతో వ్యక్తుల్లో మార్పు వస్తుంది. వ్యక్తుల వికాసంతో సమాజం అభ్యున్నతీ పొందుతుంది. వ్యక్తుల విశిష్టతతో సమాజం ప్రత్యేకంగానూ నిలుస్తుంది. ఈ పరస్పరానుబంధం అనివార్యం, అభిలషణీయం.

స్వేచ్ఛా కవిత్వంలో సమాజం - వ్యక్తి ప్రమేయం విస్తారంగా దృష్టికి వస్తుంది. చారిత్రకంగా ఇది నిర్వహించే పాత్ర వ్యవస్థాగతమైన ఆదర్శాలూ, అభిప్రాయాలూ, వ్యక్తి పరమైన అనుభవాలూ ఆలోచనలూ కారణంగా ప్రాముఖ్యాన్ని వహిస్తోంది. సామాజిక భావన విస్మరించరానిదైనట్లే వ్యక్తి స్వరూపమూ మనస్తత్వ ధోరణీ పరిహరింపరానిది. ఇవి రచనలో వివిధ నిష్పత్తుల్లో రూపొంది ప్రత్యేక రూపాన్ని పొందుతాయి. ఇది ఇట్లా వుంచి ఏ దేశమైనా ఏ సాహిత్యమైనా పరంపరగా వచ్చే సంస్కృతీ భావన ఒకటి వుంది. ఈనాటి జీవన వ్యవస్థలో నిరసనకు గురైన దురాచారాల్ని చెల్లని నియమాల్ని అహేతుకమైన దోరణుల్ని తీసివేస్తే సారభూతమైందీ సంస్కృతీ ప్రస్థానంలో శిఖరంగా నిలచే సంప్రదాయ పరంపర ఉంది. ఇది సుదీర్ఘ సమాజ చరిత్రతో ముడిపడింది. మార్పు పేరిట దీన్ని విస్మరిస్తే సంపూర్ణత లోపిస్తుంది. ఇది ప్రతి భాషా సాహిత్యానికి వర్తిస్తుంది. ఇది జాతీయ స్థాయిలోనూ, కొన్ని సందర్భాల్లో దీన్ని అధిగమించి విశ్వభావనాత్మకంగానూ విలసిస్తుంది.

ఆధునిక యుగంలో పరిణమించిన సమాజ స్వరూపంతో కవిత్వమూ స్వాతంత్ర్యోద్యమం, సమాజ పునరుజ్జీవనంతో ప్రవృత్తమై, స్వాతంత్ర్యం సిద్ధించాక ఆలోచనలో ప్రజాస్వామ్య వ్యవస్థాగతమైన స్వేచ్ఛా సంచారంతో నిర్మితమైంది. వర్తమాన కవిత్వస్థితిపై, వ్యక్తి వికాసంపై దీని ప్రభావం వుంది. ఈ దృష్టితో, స్వాతంత్ర్యం పొందిన కాలంనుండీ ఆధునిక కవిత్వాన్ని ఒక భాగంగా తీసుకొని పరిశీలన జరపడం

అన్నివిధాల సమంజసమూ హేతుయుతమూ.

భారతదేశం స్వాతంత్ర్యం పొందాక రాజ్యాంగంలో ప్రజాస్వామ్య వ్యవస్థను అంగీకరించడంతో జాతీయ దృష్టీ సాంఘిక రాజకీయ ధోరణీ పరివర్తనకు లోనయ్యాయి. ఇది భారతదేశ చరిత్రలో అపూర్వమైంది. జాతి భవిష్యత్తును తీర్చే అసాధారణమైన మలుపు. చరిత్రలో సామాజిక రాజకీయ ఆర్థిక స్వరూపంతో పాటు సాహిత్యమూ మారిన విలువలతో, ఎదురైన కొత్త పరిస్థితుల్లో అంతర్జాతీయ ప్రభావానికి గురైంది. సామ్యవాద సిద్ధాంతమూ ప్రబలంగా పనిచేసింది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతూన్న దేశాల్లో దీని ఆకర్షణ విపరీతంగానూ వుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో లభించిన అవకాశాలను బట్టి వివిధాభిప్రాయాలు సిద్ధాంతాలూ వివిధ లక్ష్యాలు కవితా ప్రపంచంలోనూ ప్రచలితం కావడం జరిగింది. జాతి అంగీకరించిన ప్రజాస్వామ్య వ్యవస్థలోని స్వేచ్ఛా వాతావరణమే ఈ వైవిధ్యానికి కారణమైంది. ప్రజాస్వామ్యం వల్ల సిద్ధించే ఉత్తమ ప్రయోజనాల్లో ఇదొకటి.

ఈనాటి సమాజంలో వున్న పరిస్థితులకు ప్రతిరూపంగా కవిత్వమూ వివిధ భావ ధోరణులతో కన్పిస్తుంది. విశ్వనాథ రామాయణ కల్పవృక్షం పూర్తి ఐంది వందేమాతరం నినదించింది. మానవీయం వెలసింది మరో మహాప్రస్థానం, ఖడ్గసృష్టి ప్రభవించాయి. శివప్రసాద్ మహాసర్గ అవతరించింది. పునర్నవం ఆవిష్కృతమైంది. విశ్వంభర ఉదయించింది. దిగంబరం – చేతనావర్తనం – విప్లవం ఇట్లా అనేకం – భావావేశంతో లక్ష్యశుద్ధితో తెలుగులో కవిత్వం స్వేచ్ఛావాయువుల్ని పీలుస్తూంది. జాతీయ భావన, సంస్కరణం పరివర్తనం ప్రజాస్వామ్యం సామ్యవాదం విప్లవం సంప్రదాయ పరంపరా పార్శ్వాలతో గోచరిస్తూంది. వీటిలో ఒక్కొక్క రచయిత వ్యక్తిత్వంలో ఒక్కొక్క పార్శ్వం ఆధిక్యం వహిస్తూ లేదా కొన్నిటి కలయికచేత విశిష్ట రూపాన్ని పొందుతూ పరిశీలనలో గోచరిస్తాయి. వీటితోపాటు చేర్చవలసింది మరొకటి వుంది మనస్తత్వ ధోరణి. రచయితలో అంతర్నిహితమై చేతనలో నుండి రచనపై ప్రభావాన్ని నెరపేది, మనస్తత్వ పరిశీలనం ఇటీవలిది కావడం. ఈ శాస్త్రంతో ఎక్కువ పరిచయం లేకపోవడంవల్ల దీన్ని గురించి ఆలోచన జరగవలసినంతగా జరగడం లేదు. సృజనాత్మక సాహిత్యంలో ముఖ్యంగా కవిత్వంలో ఇది నిర్వహించే పాత్ర అమూల్యమైంది. దీనికి అభిప్రాయాల సిద్ధాంతాల భేదం లేదు. మనిషీ – మనస్తత్వం ముఖ్యం.

ఇకపోతే విశ్వజనీనత, మానవతా లక్షణం ఎప్పుడూ ఉండనే ఉన్నవి. పురోగమన తిరోగమన యథాస్థితి సంస్కరణ పరివర్తన విప్లవ సాహిత్యాల్లో ఇది అపరిహరణీయమైంది.

ఐనప్పటికీ ఇది ఇటీవల పురోగమన హేతుదృష్టితో ఒక సిద్ధాంతంగా రచయితలను ఎంతగానో ఆకర్షించింది. ఏ స్థాయిలో ఏ ఆదర్శంతో ఏ విధమైన చర్య ప్రతిచర్యలతో సంబంధమైనప్పటికీ మానవ జీవితం నైతికమైన తాత్త్వికమైన విలువలతో ఆర్ద్రత ఉదారత హిత భావనతో రచన ప్రసారితం కావాలనే అపేక్ష సహజం, వాస్తవతలంపై భిన్న అస్తిత్వాలతో ఎంతో వైవిధ్యం కలిగిందీ.

మానవజీవితంపై పరిసరాల ప్రభావం తప్పనిసరి. అందువల్ల పరిసరాలు ఆరోగ్యవంతంగా వుండవలసిన అవసరమూ వుంది. ఇది గుణాత్మకమైన స్థితికి ఎంతో దోహదం చేస్తుంది. చారిత్రకంగా ఆలోచిస్తే వివిధ ధోరణులు ఉత్తమ లక్ష్యాలతోనే వచ్చాయి. ఎప్పటికప్పుడు సమాజంలో ఏర్పడే నిష్క్రియతనూ కాలుష్యాన్నీ పోగొట్టేందుకూ బంధనల్ని ఛేదించి చైతన్యవంతం చేసేందుకూ ప్రయత్నం జరుగుతుంది. స్వేచ్ఛా వ్యవస్థ, వివిధ భావ ప్రసారాలకు దోహదం చేస్తుందనడంలో సందేహం లేదు. ఏ భావప్రసారానికీ లోను కాకుండా ఏ రచయిత దూరంగా ఉండలేడు. అట్లా అయితే వ్యక్తిత్వానికి సంపూర్ణత చేకూరదు. చారిత్రక పరిణామంలో సందర్భోచితినీ కోల్పోతుంది. ఇప్పుడే కాదు మునుముందూ జీవితంలో ఏర్పడే అనుచితమైన స్థితులనుండీ, కఠోరమైన బంధనాలనుండీ విముక్తం చేసే ప్రయత్నం జరుగుతూనే వుంటుంది. నిరంతరం అరాజక స్థితికీ గందరగోళానికీ భయావహ మృత్యు స్థితికీ దారితీసే విధ్వంసక ధోరణి ఏమాత్రమూ ఏ విధంగానూ సమర్థనీయం కాదు.

ఈనాడు మనచుట్టూ నెలకొని వున్న సమాజం నిస్సందేహంగా కొత్త ప్రపంచం. స్వాతంత్ర్యానికి పూర్వస్థితికీ నేటి స్థితికీ ఏ విధంగానూ పోలిక లేదు. జీవితాన్ని సంపన్నం చేసే సౌభాగ్యమయం చేసే శాస్త్ర సాంకేతిక పారిశ్రామిక పురోగతి సమాజంలో సంస్కృతీపరమైన గొప్ప విలువల స్థితికి ఏ విధంగానూ విరుద్ధం కాదు. పైగా జీవితంలో గుణాత్మకమైన మార్పుకు దారితీసే ఆలోచనా శక్తుల్ని కళాత్మక ధోరణుల్నీ ఆధునికత ప్రకాశవంతం చేస్తుంది. దీనికి భిన్నంగా స్వేచ్ఛ లేని వ్యవస్థలో వ్యక్తి ఆలోచననూ, అభిప్రాయాన్నీ అరికట్టే నిరంకుశ దోరణులు సృజనశక్తిని వికసింపనీయవు. వివిధ స్థాయిల్లో వ్యక్తిత్వాన్ని కుంఠితం చేస్తాయి. సామాజికమైన పరిపూర్ణతను ఖండితం చేస్తాయి. మానవుని సంపూర్ణమైన అభివృద్ధికీ సమభావంతో సమాజ వికాసానికీ వివిధ భావ ప్రసారానికీ వేదికయైన ప్రజాస్వామ్య విధానం ఒక్కటే అభిలషణీయమూ, అనుసరణీయమూ ఐంది.

కవిత్వం ఎటువంటి జీవిత వాస్తవ దృశ్యాలనుండి ప్రయాణం చేసినా, అభిప్రాయాల

వివరణం, ప్రకటనం, ఆవిష్కారం మాత్రమే కవిత్వం అవదు. ఇవి కవిత్వం కావడానికి అర్హమైన కళాత్మకతను కనీస స్థాయిలో అవలంబించవలసి ఉంటుంది. స్వేచ్ఛా సమాజంలో వెలువడుతూన్న నేటి స్వేచ్ఛా కవిత్వాన్ని విశాలమైన అవగాహనతో ఈ దృష్టితో సమాలోచనం జరుపవలసి ఉంది. అప్పుడు కాని చారిత్రక సంప్రదాయ రాజకీయ సాంఘిక మనస్తత్వ ప్రభావ శక్తుల ప్రత్యేకతలు గుర్తింపబడి కవిత్వంలోని మౌలికత, విశిష్టత, అనుభవానికి రాదు. సౌభాగ్యం కుసుమించే సామాజిక చేతనతో ఆలోచన అన్వేషణ అనుభవం పరివర్తనతో "గమ్యమైన స్వేచ్ఛాసమ సమాజం, రానీ కొత్త యుగం వాస్తవమై".

**"బాధ్యతలో ప్రజాస్వామ్యం**
**ఉద్యమాన్ని నిలిపే ఊపిరి**
**ఏ ప్రార్థననూ కోరదు**
**ఒక స్వాగత కుసుమం తప్ప!"**

# 12. ప్రజాస్వామ్యయుగం - స్వేచ్ఛా కవిత్వం

ఈనాటి ఆధునిక కవిత్వాన్ని ప్రభావితం చేసే ముఖ్యమైన అంశం ప్రజాస్వామ్యం. ఈ వ్యవస్థలో తీవ్రవాదం మొదలుకొని పూర్వ సంప్రదాయ నిరతి వరకూ ఎన్నో ప్రచలితమై కన్పించే అభిప్రాయాలు దృక్పథాలు ఉన్నాయి. ఒక సిద్ధాంతాన్ని విశ్వసించేవారు కొన్ని నిశ్చయమైన భావాలు కలవారు తదితర రచనల్ని నిరసించడం విమర్శించడం సాహిత్య జగత్తులో పరిపాటే. ఇది సహేతుకమైన సీమల్ని అతిక్రమించనంతవరకు విషయ ప్రాధాన్యం దృష్ట్యా అభిప్రాయాల ప్రసారానికీ వికాసానికీ ఎంతగానో తోడ్పడుతుంది. సృజనశక్తికి పయనించే దిశను సూచిస్తుంది. ఒక విధంగా ఈ విమర్శ తత్త్వపరమైన అనుమానాల్ని తొలగించి ప్రశ్నత్ని నిలిపి అన్వేషణను వివృతం చేస్తుంది. సమాధానాలకై అభిలాషను కలిగించి లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. సాహిత్య ప్రపంచంలో సిద్ధాంతపరమైన తత్త్వగతమైన ప్రేరకశక్తుల్ని గురించి ఆలోచింపజేయడం కన్పిస్తుంది. మరికొందరు సమన్వయ భావంతో విమర్శ చేసేవారూ ఉన్నారు. వీరివల్ల సదవగాహన సహిష్ణుత పరస్పరం అభిప్రాయాల ఆదాన ప్రదానంతో సాహిత్య వాతావరణానికి వినూత్నత చేకూరుతుంది. మరికొందరు వ్యవహారదక్షులూ ఉన్నారు. వీరి వ్యవహార దక్షత సాహిత్య వికాసానికి ఉపకరించేంత వరకూ ఫరవాలేదు.

సమన్వయ భావం వల్ల భిన్నాభిప్రాయాలు కలిగినవారైనప్పటికి విషయంపై అభిలాషతో ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం వాటిలో గుణాల్ని గుర్తించడం జరుగుతుంది. ఎవరైనా సరే తమ అభిప్రాయాల్ని సిద్ధాంతాల్ని స్పష్టం చేసేందుకు ప్రకటించేందుకవకాశ మిస్తుంది ప్రజాస్వామ్యం. అందునా స్వేచ్ఛా శీలానికవకాశం ఎక్కువగా ఉన్న సాహిత్యంలోనూ ముఖ్యంగా సృజనాత్మక ప్రక్రియల్లో ఈ స్వాతంత్ర్యం అవసరమెంతైనా ఉంది. ఎన్ని అనుకూల ప్రతికూల పవనాలు వీచినా అలంకారాన్నో భీభత్సాన్నో కల్పించినా సంభావనమో నిరాకరణమో నెరపినా ఉపేక్షించినా విస్మరించినా సృజనాత్మకమైన మనీషకే కళాత్మకమైన శక్తికే ఎప్పటికైనా విలువ, గౌరవమూ. దీని కనుకూలమైంది ప్రజాస్వామ్యం.

సిద్ధాంతాలు అభిప్రాయాలు సృజనశక్తికి ప్రేరకశక్తినిస్తే ఆవిష్కారరీతులు ఆకర్షణ విధానాలు రూపంలో కళాత్మకతను సంతరించిపెడతాయి. వైవిధ్యానికి దారితీస్తాయి. ఈ కారణంచేత ఒకే కాలంలో ఒకే సిద్ధాంత మౌలికతను కలిగిన రచనలైనా భిన్న వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటాయి. సామాజిక తలంపై సిద్ధాంతాలకు అభిప్రాయాలకుండే విలువలతోపాటు తాత్తికతలంపై ఆలోచనా రూపానికీ అస్తిత్వం ఉంది.

ప్రజాస్వామ్యంలో వివిధ సంప్రదాయాలకు దృక్పథాలకు సమాన గౌరవంతో

పాటు సాహిత్యానికి చెందిన వివిధ శక్తుల వికాసానికీ ఎంతో అవకాశముంది. దేశం స్వాతంత్ర్యం పొందాక వికసించిన వివిధ భారతీయ భాషా సాహిత్యాల్లో ఈ మార్పును వైవిధ్యరూపాన్ని గుర్తించవచ్చు. ముఖ్యంగా కవిత్వంలో మార్పు రూపం అంతర్జాతీయ ప్రమాణాల్ని అందుకుంది. ఒక్కొక్క రచయితనుబట్టి ఈ మార్పు మూలరూపంతో ఒక్కొక్క విధమైన నిష్పత్తిని సమీకరించుకొంది. ఆర్థిక మత రాజకీయ సాంఘిక తాత్త్విక కళాత్మక వాతావరణంతో మానసికమైన స్థితి రీతులతో నిర్మితమైన వ్యక్తిత్వం ప్రత్యేకతను పొందుతుంది. ఇది ప్రతిభచేత అపూరమై విలసిస్తుంది. పాండిత్యం చేత విశిష్టత చేకూరుతుంది. సౌందర్యదృష్టీ కళాత్మకత చేత ఆకర్షణ సిద్ధిస్తుంది. ఒకే సిద్ధాంత లక్ష్యం దృక్పథం కలిగిన రచయితల్లోను అంతరమైన వ్యక్తిత్వ నిర్మాణం ఒక్కొక్క విధంగా విలసిస్తుంది. స్వేచ్ఛా కవిత్వంలో ఎంతో వైవిధ్యోపేతంగా ఉంది.

వర్తమాన కాలంలో వచ్చే స్వేచ్ఛా కవిత్వాన్ని పరిశీలిస్తే సామాజిక స్పందన వెనుకనుండి ఈ వైయక్తికమైన రూపం స్పష్టంగా ప్రతిఫలిస్తుంది. ఇది ఈనాటి స్వేచ్ఛా సామాజిక ప్రభావ పర్యవసానం. ఏ వాదానికి చెందిన రచయిత ఐనా అంతో ఇంతో ఈ అంశం చోటుచేసుకుంటుంది. వ్యక్తులపై ముఖ్యంగా యువతరంపై పనిచేసే సామాజికమైన అనుభవ భూమికను పరిశీలించవలసి వుంది. ఆర్థికంగా అవసరాలనుబట్టి కుటుంబ విధానానికి దూరం కావడం, వ్యక్తిత్వ వికాసంలో స్వేచ్ఛను కోరడం, అన్వేషణనభిలషించడం ఏకాంత ధోరణిలో నిర్మితమైన మానసిక స్థితీ పరిస్థితుల ఒత్తిడీ మానసికంగా సంశ్లిష్టమైన ఆలోచనా రూపం పేర్కోవచ్చు. ఇంకా ఎప్పటికపుడు కొత్త కొత్త సామాజిక సంబంధాలతో అనుభవ వైవిధ్యంతో జీవన శైలిలో మార్పు వచ్చింది. స్వయంగా తమకు తామై ఎదుర్కొనే సమస్యలూ మనసులో నిలచిన ఆదర్శరూపమూ ఒకదాని తరువాత మరొకటి విశ్లేషణకందుతాయి. పాతబడినవి సరిపడవనుకున్నవీ వదిలేసి కొత్తవీ అవసరమనుకున్నవీ వాటిస్థానంలో ప్రవేశించి ఇంకా స్థిరపడకపోవడం ఒకరమైన మానసిక శూన్యస్థితీ కన్పిస్తుంది. కుటుంబానికి దూరమై ఒంటరితనం ఆవహించిన జీవితంలో ఆదర్శాన్ని అందుకునే ఆలోచన, ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధంగా పరిణమిస్తుంది.

స్వాతంత్ర్యం తరువాత వ్యక్తీ సమాజానికీ గల చారిత్రకమైన సంబంధం మారింది. వ్యక్తిలో అన్వేషణకూ సామాజికమైన చింతనకూ అవకాశం హెచ్చింది. రాజకీయ వ్యవస్థ మార్పు స్వేచ్ఛకు బాటవేసింది. సామాజికంగా పరివర్తన గుణంతో శాస్త్రీయ దృష్టితో సంస్కరణాలాభిలాషతో మారిన స్థితిలో సాహిత్య వ్యక్తిత్వం ఎన్నడూలేని వైశాల్యాన్ని పొందింది. గతిలో వేగాన్ని పుంజుకుంది. వ్యక్తిలో అపూర్వమైన స్వేచ్ఛాతత్త్వం సృజనశక్తి వికాసానికన్ని విధాలా అవకాశం కలిగింది.

15 ఆగష్టు 1947 అర్ధరాత్రి నుండి దేశచరిత్రలో కొత్తయుగం ఆరంభమైతే 26 జనవరి 1950 నుండి దేశ సమాజ చరిత్రలో కొత్తదశ మొదలైంది. ఈనాటి నుండి భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిష్కృతమైంది. ఆదర్శాల్ని అందుకునే లక్ష్యంతో చారిత్రకంగా జాతీయాంతర్జాతీయ దృక్పథాల మేళనంతో రాజకీయ శక్తులతోపాటు ఆధునికమైన సాంస్కృతిక వాతావరణం రూపొందింది. భారత రాజ్యాంగానుసరణతో ప్రజాస్వామ్య భావన సాహిత్య ప్రపంచానికి ప్రత్యక్షంగాను పరోక్షంగాను కొత్తశక్తినీ దీప్తినీ చేకూర్చింది. కవిత్వంలో ఈ మార్పు స్పష్టం. కేవలం సాహిత్యశాస్త్రంతో పరిమితం కాక రాజకీయ ఆర్థిక సాంఘిక మానసిక శాస్త్రాలతో పరిచయం కొత్తసీమల్ని చూపింది. ఈ విశిష్టమైన ధోరణిలో వర్తమాన స్వేచ్ఛా కవిత్వం ప్రవర్తిల్లింది. ప్రగతిశీల స్వభావంతో సాహిత్యం ఉండాలనడంలో ఇప్పుడే అభిప్రాయ భేదం లేదు. కాని ఏ గతిశీలంలో అందునా నిరంతరం ఘర్షణ హింసలో ఏ దిశలో ఏ మేరకన్న అంశంపై మాత్రం విభేదం అనివార్యం. సిద్ధాంత ప్రకటనలు అభిప్రాయభేదాలు చర్యలు ప్రతిచర్యకు కలిగే అవకాశాలు నిరసన ప్రతిఘటనలూ ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ మూలంగానే నన్నమాట మరచిపోకూడదు. ఇవి ఒకమేరవరకు అంగీకరింపదగినవే.

సామాజికమైన సంబంధాల్లో మార్పు కొత్త కొత్త అనుభవాల ప్రభావం భౌతికమైన జీవన ప్రయత్నంతో పాటు మానసికమైన వ్యక్తిత్వం ప్రతి స్వేచ్ఛాకవిత్వ రచనలో అంతో ఇంతో విశ్లేషణకందుతుంది. ఈనాటి స్వేచ్ఛా కవిత్వంలో తప్పనిసరిగా మనదృష్టికి వస్తుంది. ఈ కాలాన్ని ప్రజాస్వామ్య సాహిత్యయుగంగా కవిత్వంలో స్వేచ్ఛాయుగంగా భావించవచ్చు.

ఈ కాలంలో వచ్చిన సాహిత్యంలో రచయిత స్వీయ వ్యక్తిత్వం గుర్తింపు ఉంది. జాతిలో నిక్షిప్తమైన శక్తిసామర్థ్యాలను బయటికి తీసి వెలుక్కితెచ్చే ధోరణి ఉంది. విశ్వజనీన దృక్పథంతో ప్రగతి శక్తుల సమీకరణం ఉంది. జాతి సంప్రదాయ మౌలిక లక్షణాలతో ఆధునికతను ఆవిష్కరించడం ఉంది. సామాజిక తత్త్వంలో స్వేచ్ఛా స్పందన ముఖ్యం. వ్యక్తిత్వ వికాసంలో స్వేచ్ఛాగుణం అవసరం. ప్రజాస్వామ్యతత్త్వంతో రూపొందిన వ్యక్తిత్వ ప్రతిఫలనమే వర్తమాన సాహిత్యం. కాబట్టి స్వాతంత్ర్యానంతరం రూపొందిన సాహిత్యదశను ప్రజాస్వామ్య స్వేచ్ఛాయుగంగా పేర్కోడం సమంజసం.

"వ్యక్తి పౌర హక్కులతో బ్రతకడం
మానవీయ ప్రజా స్వామ్య చిహ్నం"

# 13. స్వేచ్ఛకు అవకాశం - స్వేచ్ఛా కవిత్వం

**1**

ఆధునిక సాహిత్య చరిత్రలో స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య ప్రభావంతో స్వేచ్ఛాయుగం అవతరించింది. క్రమంగా కాలం గడిచేకొద్దీ, దీని అస్తిత్వం బలపడింది. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛాగుణం సాహిత్యంలో వివిధ ప్రక్రియల వికాసానికెంతో దోహదం చేసింది. ప్రస్తుత విషయమైన స్వేచ్ఛా కవిత్వంలో దీని ప్రభావం సంపూర్ణంగా గోచరిస్తుంది. సృజన స్వేచ్ఛకు కవాటాలు తెరచే స్వేచ్ఛాయుగంలో ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ ప్రజాస్వామ్యానుభవం కీలకమైంది. కాలానుగుణమైన మార్పులతోను కొత్తదనంతోను, స్వతంత్రమైన నిర్మాణరూపం కలిగిన స్వేచ్ఛా కవిత్వం సమాజంలో వచ్చే ప్రతి ఉద్యమాన్నీ, ధోరణినీ, మొట్టమొదట స్వీకరించింది. వాటికి ప్రేరణగా ఉపకరించింది. వేదికగానూ నిలిచింది. ప్రాతినిధ్యం వహించింది.

ఆధునిక కాలంలో ప్రజాస్వామ్య స్వేచ్ఛాయుగంలో సామాజిక రాజకీయ కారణాలవల్ల అనేకమైన వాదాలు దృక్పథాలూ సమాజంలో చారిత్రకమైన మలుపుల్నీ మానవీయమైన పాత్రల్ని నిర్వహించడం జరిగింది. ఈ దిశలో మొట్టమొదట వేగంగా స్పందించే కవిత్వంలో మార్పు సహజం. అయితే ఈ మార్పులకు దోహదం చేసే విధంగానో, ప్రాతినిధ్యం వహించే విధంగానో పద్యం ఉపయోగితం కాలేదు. కారణం ఈ భావజాలాన్ని ఆవిష్కరించేందుకు 1) సంప్రదాయబంధురమైన పద్యసంస్కృతి, 2) దాని నిర్మాణరూపమూ అవరోధంగా నిలిచాయి. ఇంకా పద్యానికున్న వాతావరణంలోని బాహ్యాంతర స్థితుల ప్రత్యేకతలు పరిమితులు కారణంగానూ, కొన్ని సందర్భాల్లో అవసరాల్ని బట్టి కొత్త ప్రక్రియ దానంతటదే సహజంగా ఆవిర్భవిస్తుంది. అట్లా ఏర్పడిందే స్వేచ్ఛా కవిత్వం. ఇదో అనివార్యమైన పరిణామంగా విశ్లేషణ కందుతుంది. ఈ మాట వేయేండ్ల కాలక్రమంలో విరాట్ రూపాన్నీ, మహనీయమైన శిల్ప సౌందర్యాన్నీ పొందిన పద్యాన్ని ఏ మాత్రం తక్కువ చేయడం కాదు. ఆధునిక కాలంలో స్వేచ్ఛా కవిత్వం 1) బాహ్య నియమాలకతీత లక్షణంచేత, 2) కొత్త అవసరాలకు తగిన స్వేచ్ఛాగుణం చేత, 3) అంతర నిర్మాణ సౌలభ్యం చేత, 4) ఆవిష్కారంలో కొత్త అభివ్యక్తికి అవకాశం చేత కవుల హృదయాల్ని ఆకర్షించింది. ముఖ్యంగా యువతను ప్రేరేపించింది. విస్తృతంగా వర్ధిల్లింది. ఆధునికతకు సాధనంగానూ విలసిల్లింది. కొత్త ఆలోచనకూ, అనుభూతికీ చుట్టూ తలుపులు తెరిచినట్లయింది.

మూడు నాలుగు దశాబ్దాల తెలుగు కవిత్వంలో పద్యం ఆధునిక భావజాలాన్ని సంపూర్ణంగా ప్రతిబింబించలేకపోయింది. ఈ శూన్యస్థితిని స్వేచ్ఛాకవిత్వం పూరించింది. కవిత్వమంటే స్వేచ్ఛా కవిత్వానికి మాత్రమే పరిమితమైన దశ ఏర్పడింది. మునుముందు పద్యం నిర్వహించే పాత్ర చాలా ముఖ్యమైంది.

1980 తరువాత వచ్చిన స్వేచ్ఛాకవిత్వంలో మార్క్సిజం వెనుకబడింది. శ్రామిక వర్గానికే కాక ఇతర వర్గాలకూ ప్రాధాన్యం హెచ్చింది. అంతకుముందీ అంశం చిహ్నాలు లేవని కాదు. 1975 నుండి మొదలై 1980 నాటికి స్పష్టమైన దిశను పొందింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వేచ్ఛా కవిత్వం వివిధ సిద్ధాంతాల వికాసానికీ పరిణామానికీ ప్రభావాలకూ వీలైంది. కాబట్టి దీని పరిధి త్వరలో అతి విస్తృతమైంది. ప్రజాస్వామ్య భావనలో నిహితమైన, సహనం సమన్వయం ఎదుటి అభిప్రాయాన్ని మన్నించే లక్షణం, చర్చ, ప్రజాభిప్రాయం మొదలైన లక్షణాలవల్ల కొత్త సామాజిక సంస్కృతికి దారి ఏర్పడింది. ఇది స్వేచ్ఛా కవిత్వ వాతావరణానికి ఎంతో బలం చేకూర్చింది.

1. స్వేచ్ఛా కవిత్వంలో 1980 నుండి క్రమంగా మార్క్సియం వెనుకబడుతూ వచ్చింది. సమన్వయ ప్రజాస్వామ్య దళిత, స్త్రీ వాద మైనారిటీ అనుభూతి వాదులూ హైకూ వంటి ధోరణులూ వచ్చాయి. వీటి లక్ష్యం 1) సమాజపరంగా సమానత్వం, న్యాయం, ఉన్నతీ, శాంతీ, 2) వ్యక్తిపరంగా సంస్కారం, ఆనందంగానూ పరిశీలనకందుతుంది. వీటికి ప్రజాస్వామ్య వ్యవస్థ కేంద్రతలంగా వర్తించింది. స్వేచ్ఛాకవిత్వానికి గౌరవమూ ప్రశస్తీ విస్తృతీ సిద్ధించాయి.

2) మరో విశేషం, విశ్వభావన విశ్వమానవుడు మొదలైన విశాలమైన భావజాలంతో పాటు జాతీయ భావనకూ స్థానీయమైన అవసరాల్ని బట్టి దేశీయతకూ ప్రాముఖ్యం లభించింది. వర్తమాన జీవితంలో వైవిధ్యంతో తటస్థపడే వివిధ బృందాల్నీ సమూహాల్నీ గురించీ వర్గాల్నీ వృత్తుల్నీ గురించీ వాస్తవ దృక్పతంతో ఆలోచన మొదలైంది. దీనితో మార్క్సిజం వెనకబడింది. కొత్త శక్తులు సమాజతలంపైకి వచ్చాయి.

3) ముఖ్యంగా 1975 నుండి ఎక్కడికక్కడ సమాజంలో ఎదురయ్యే కులం, మతం, వృత్తి, ఉద్యోగం, ప్రాంతం జెండర్‌కు సంబంధించిన బాధాస్థితుల్నీ విషమ సమస్యల్నీ అసమానతలతో ఏర్పడిన వైరుధ్యాల్నీ ఎదుర్కొనే శక్తితోపాటు, పరిష్కార సాధనంగాను ప్రజాస్వామ్యం పనిచేసింది.

4) నిరంతరం వ్యతిరేకత, ఘర్షణ, హింసకు బదులు స్నేహం, సామరస్యం, శాంతి,

విశాల దృక్పథంతో సమాజ హితం కోరింది. దీనికి సంబంధించిన కోణాలు అటూ ఇటూ స్వేచ్ఛా కవిత్వంలో సంపూర్ణంగా ప్రతిఫలించిన మాట వాస్తవం. వీటి స్పృహకూ స్పందనకూ ఆలోచనకూ వివేచనకూ స్వేచ్ఛా కవిత్వం సాధనమైన విధం అపూర్వమైంది. ఇది ప్రజాస్వామ్య శక్తికి నిదర్శనం.

5) ఈ సందర్భంలో అంతర్జాతీయ స్థాయిలో మానవహక్కుల్ని గురించే కాక, జాతీయ దేశీయ స్థానీయ స్థాయిలోను సమస్యలూ, పరిష్కారాలతో నిర్మాణాత్మకమైన పురోగమన దృక్పథం అలవడింది. అయితే పరిణామంలో స్వేచ్ఛా కవిత్వంలో వర్తమాన విషయము స్థితులవల్ల పొందే బాధ, వేదన, తపన, చింతన వెనుకనుండి లక్ష్య నిర్దేశమూ స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సందర్భంలో మానవీయ దళిత స్త్రీవాదాల్ని పేర్కోవచ్చు.

6) వీటితోపాటు సామాజిక పార్శ్వమూ నిశితమైన పరిశీలనతో స్పందనగుణంతో చిత్రించడమూ గమనించవచ్చు. ఇంకా వైయక్తిక మానవీయ పార్శ్వాల్ని గురించి చిత్రణలూ పరిశీలన కందుతాయి. ఈ కాలంలో వచ్చిన స్వేచ్ఛా కవిత్వలో హేతుదృష్టీ మరోవైపు నుండి అనుభూతి 'స్పందనకూ' ప్రాధాన్యం లభించింది. హైకూలు దీనికి బలమైన ఉదాహరణ. కేవలానుభూతి చిత్రణలూ కన్పిస్తాయి.

7) ఈ కాలంలో ఖండఖండంగా అక్కడి పరిస్థితుల్ని బట్టి స్వల్ప సంఘటనలు కూడా సూక్ష్మతలపై చిత్రితం కావడం విశేషం. ఏదో అపాయమో విపరీతమో విషాదమో ఏదైనా కావచ్చు. సామాజిక స్థితిగతులకు సంబంధించినవి ఎన్నో సామాజికత – స్పందన కవిత్వకళ అనుభూతి అన్వేషణ – ప్రస్థానం మొదలుగా దృష్టికి వస్తాయి.

8) 1980 తరువాత స్వేచ్ఛా కవిత్వంలో చాలాభాగం రాజ్యాంగ రూపాలను ప్రజాస్వామ్య సంబంధాల్ని కాపాడే నిర్మాణాత్మక ధోరణి స్పష్టంగా కన్పిస్తుంది. దీనికి వ్యతిరేకమైన ఆలోచన లేక పోలేదు.

9) ఈ సందర్భంగా కేవలం సాహిత్యపరమైన అంశాలకే కాక సాహిత్యేతరమైన సామాజిక రాజకీయ మనస్తత్వపరమైన అంశాలు కూడా చోటుచేసుకోవడం విశేషం. ఇక్కడే స్వేచ్ఛా కవిత్వంలో విశాల ప్రాతిపదికపై సామాజిక కవిలో కళా సమాన్వయాల్ని కోరతాయి.

10) ఇకపోతే వస్తు నిర్వహణంలో సమావిష్కారంలో భావరూపాలు (ఇమేజెస్), ప్రతీకలు (సింబల్స్) పురాబింబాలు (ఆర్కిటైప్స్) మనస్తత్వరీతులు (సైకాలజికల్ మోడ్స్)

(పాటరన్స్) మొదలైనవి విరివిగా కళారూపంలో భాగం కావడం బహుధా కన్పిస్తుంది.

ఈ ప్రత్యేకమైన అంశాల్ని పురస్కరించుకొని చూస్తే స్వేచ్ఛయుగంలో స్వేచ్ఛా కవిత్వం ప్రజాస్వామ్య భావజాలంతో ప్రేరితమయినట్లు స్పష్టం. సుమారు 1980 నుండి మార్క్సియం స్థానంలో ప్రజాస్వామ్యం – స్వేచ్ఛ ప్రవేశించే స్థితీ బాగా కన్పిస్తుంది. అయినప్పటికీ గతానికీ వర్తమానానికీ సంబంధం తప్పనిసరి, దీన్ని విస్మరించడం సాహిత్యానికే లోపం, స్వేచ్ఛా కవిత్వ సమాలోచనంలో సాహిత్య శాస్త్రంలో భారతీయ పాశ్చాత్య సిద్ధాంత వ్యాక్యాల్ని ప్రదర్శనశాలలో శిల్పాల్లో కాకుండా, సహేతుకంగా ప్రయోజనయుతంగా సమన్వయం చేసుకోవడం అవసరం. ఈకాలంలో వచ్చిన స్వేచ్ఛా కవిత్వం 'పూర్వం కన్నా, స్వతంత్ర్యమైన నిర్మాణంపై ప్రత్యయం కలిగిందీ ఎన్నో వాదాల ధోరణులు ప్రభావాలతో, దేనికది ఒక ప్రత్యేకమైన అధ్యయన మార్గాన్ని అపేక్షించడం సహజం. పద్యం, గేయం, గీతం, వచనం, ముద్రలు వీడిన మనోరూపంతో, స్వేచ్ఛా కవిత్వాన్ని దర్శించడం అవసరం, అపుడే సమాలోచనకు సరియైన స్థితి ఏర్పడుతుంది.

**2**

స్వేచ్ఛా కవిత్వం ఆధునికయుగంలో సులభమైన ఉత్తమమైన అభివ్యక్తి సాధనం. రచనలో సంపూర్ణమైన స్వేచ్ఛకు వీలైంది. స్వతంత్రమైన ఆలోచనలతో ఎన్నో ఒత్తిడుల్లో, పనుల్లో తీరిక తక్కువగా ఉన్న ఆధునిక సమాజంలో వర్తమాన బిందువు కేంద్రంగా సామాజిక స్థితిగతుల్ని ఆవిష్కరించేందుకు కనువైందిగాను కన్పిస్తుంది. కవిత్వాని కవసరమైన మూలధాతువుకు భంగం రాకుండా, ఆధునిక భావజాలానికి తగిన కళారూపగా నిరూపితమయింది. దీని స్వరూపం అంతర్నియమాలతో కూడింది. దీనికి ఛందస్సు లేదు. నిర్దిష్టమైన నియమాలు లేవు, కేవల వచనమూ కాదు, సమయ సందర్భాల్ని అనుసరించి, వాక్య ప్రసారాలతో సంభాషరీతులతో ఆవేశ సంస్థితుల్నిబట్టి, కవి స్వయంనిర్ణయాలపై ఏర్పడే నిర్మాణరూపం కలిగింది. వివిధ సిద్ధాంతాల్నీ అభిప్రాయాల్నీ ప్రకటించేందుకు విస్తృతమైన అవకాశాలవల్ల, ప్రజాస్వామ్యానికీ, స్వేచ్ఛా కవిత్వానికీ అనుబంధం సహజమైంది. ఇది ఆధునికతకు ప్రాతినిధ్యం వహిస్తున్నమాట నిజం!

స్వేచ్ఛా కవిత్వంలో శబ్దం తరంగసమంగా వర్తిస్తుంది. వాక్యం ప్రవాహ సదృశంగాను కదులుతుంది. సూత్రసమంగానూ సాగుతుంది. ఇది వాక్యం కదలికను బట్టి సరిస్తుంది. ఛందస్సులో గుణరూపాలు మాత్రా రూపాలు సంభాషణ వచన రూపాలు గీతరూపాలు

నిర్మాణంలో చోటుచేసుకోవచ్చు. ఇవి వైవిధ్యాన్ని ప్రకాశమానం చేసేవి మాత్రమే గౌణంగానే వర్తిస్తాయి.

ఈ స్థితి స్వేచ్ఛా కవిత్వం తొలిదశల్లోది. ఇపుడు మారింది పాతిక సంవత్సరాలనుండీ ఇంచుమించు అట్లాకాదు. రచనలో పరిణత రూపాన్ని సాధించింది. పద్యం, గేయం, గీతం, వచనం కన్నా భిన్నమైన అనుభవాన్ని కలిగించే నిర్మాణరూపం పట్టుబడింది. రూపమూ కాదు, దీని నిర్మాణానికి మాదిరి (మోడల్) అనేది లేదు, పదవాక్య చలన విన్యాస గమనాల్లో స్వయం ప్రేరణాయుతమైంది. కవి సంస్కార మూలం చేత ప్రభావాల పర్యవసానంచేత తత్కాలంలో ఆలోచనా గతిలో ఆవేశస్థాయిల్లో వస్తువు భావోద్గమనాన్ని మానసిక స్థితినీబట్టి కళాకృతిని పొందుతూంది. ఇది కవి ప్రతిభచేత రూపొందే నిర్మాణ వ్యక్తిత్వానికి సంబంధించింది. రచనలో స్వయం ప్రేరణ కలిగిన స్వతంత్ర నిర్మాణ విధానం చేత సృజన పరిణామంలో ఏర్పడే భాగాలే, గతీ, లయ, విన్యాసం ప్రసారాలుగా సమాలోచనలో విశ్లేషణకందుతాయి. ఏ అనుకరణతోనూ దీని ఆకృతిని సాధించడానికి వీల్లేదు. స్వతంత్రమైన అభివ్యక్తి గుణం కలిగింది. కవి స్వేచ్ఛాసంకల్పాన్ని సంపూర్ణంగా ప్రతిఫలించే ప్రక్రియ కావడంచేత అందరినీ ముఖ్యంగా ముఖ్యంగా యువకుల్నీ ఆకర్షించడం సహజం.

ఇందులో కథ చెప్పడంపై కన్నా, భావం, స్థితీ, యోజనకే ప్రాధాన్యం. ఇది భౌతిక మానసిక చిత్రణలతో అపూర్ణమైందీ. భౌతికమంటే సామాజిక సంపాదనం, మానసికమంటే అంతర చేతన, బాహ్యాంతర్విధాలుగా కన్పిస్తాయి. ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధంగా వారి ఆదర్శాల్ని బట్టి సామాజిక వాస్తవికత భిన్న భిన్న కోణాల్ని పొందుతూంది. దర్శనమూ విబేదించడం జరిగింది. స్థాయీ బేదాలనేకం ఏర్పడినాయి. ఈ కారణంగా కవుల్లో వ్యక్తిత్వ వైవిధ్యాలతో అస్తిత్వాలూ స్పష్టంగా కన్పిస్తాయి. 1980 తరువాత ఈ వైవిధ్యం బాగా ఏర్పడింది. కవి భావనలో 1) సామాజిక, 2) రాజకీయ, 3) కళా, 4) మనస్తత్వ రీతులు వివిధ నిష్పత్తుల్లో ఆకృతిని పొందడం జరుగుతుంది. కాబట్టి కవిలో సంస్కార మూలానికి హేతువులైన అంశాలు, ప్రయోజనోద్దేశాలు స్వేచ్ఛాకవిత్వంలో విశ్లేషణకందుతాయి.

స్వేచ్ఛాకవిత్వం 1) మానవీయమైన విలువలకీ సహేతుకమైన మార్పుకీ నిబద్ధమైంది. మనిషిపై ఆశతో శక్తీ యుక్తీ పట్ల విశ్వాసంతో మనిషితో సబంధంతో మానవతా గుణంతో మానవీయ పార్శ్వాన్ని కలిగింది. 2) ప్రతి మార్పుకీ మొట్టమొదట స్పందించే ఈ ప్రక్రియ, ఎప్పటికప్పుడు సముచితమైన పాత్రను నిర్వహిస్తుంది. సమాజ స్థితిగతులతో

పాటు మనిషి వ్యక్తిత్వాన్ని గురించి ఆలోచన చేస్తుంది. 3) కవిత్వంలో కోరే సహజమైన అనుభవ గుణంతో ఏ సిద్ధాంతమైనా అభిప్రాయమైన ఆవిష్కరించే సౌలభ్యంతో, ప్రజాస్వామ్య చేతనకు ప్రాతినిధ్యం వహించడం జరిగింది. సాహిత్య చరిత్రలో ఏ యుగంలోనూ కన్పించని వైవిధ్యమూ విస్తృతీ బహు స్వల్పకాలంలో స్వేచ్ఛా కవిత్వంలో ప్రకాశించింది.

**3**

స్వేచ్ఛా కవిత్వంలో (ఛందస్సులో నియతమైన నిర్మాణగతికి లయకూ ప్రత్యామ్నాయంగా) 1) పదచలనంతో వాక్య విన్యాసంతో స్వతంత్ర నిర్మాణం కన్పిస్తుంది. 2) కళాత్మకతకు లోపం రానీయని విధంగా ఆవేగంతో ఆలోచనతో అభివ్యక్తి విధం రూపొందుతుంది. 3) మధ్యలో సంభాషణ పద్ధతి సహజతను చేకూర్చేదిగాను యోజితమవుతుంది. 4) భావ ప్రమాణాన్ని బట్టి పదవాక్యోపవాక్యప్రసారం జరుగుతుంది. స్పందన రీతుల్ని దీనికనుగునంగా ఆవేశస్థాయిననుసరించి వైవిధ్యాన్ని పొందుతుంది. 5) నిర్మాణ రూపంలో ఒక చలనాన్ని మరో చలనం, ఒక గమనాన్ని మరో గమనం, ఒక ప్రసారాన్ని మరో ప్రసారం అందుకొని నైరంతర్యాన్ని కలిగి ఉంటుంది. 6) మొదటినుండి చివరిదాకా ఏర్పడే క్రమంలో శైలిని ఏర్పరచుకొని మూర్తిమత్వాన్ని పొందుతుంది. ఈ విధంగా రచనకొక నిర్దిష్టమైన ఆకృతి సిద్ధిస్తుంది. ఇది కవి అంతరమైన నిర్మాణ శక్తికి సంబంధించి మాత్రమే. స్వతంత్రమైన ప్రతిపత్తి కలిగిందీ, స్వేచ్ఛా ప్రేరితమయిందీ.

ఒకమాట! ఏదైనా ఒక ప్రక్రియకు సంబంధించినది ఆస్వాదించేప్పుడు మనస్సు దానికి తగిన వాతావరణంతో సిద్ధం కావాలి, అవసరం కూడా. ఈ మానసిక స్థితి కవి అలవర్చుకున్న సాహిత్య సంస్కృతివల్ల కలుగుతుంది. ఇది సజీవమైన సహృదయ చేతనకు సంబంధించింది. దీనికి స్వేచ్ఛాకవిత్వం పట్ల అభిలాష, తత్పరత, సహృదయత, ఆలోచన అనేవి సాహిత్య సంస్కృతిని దీప్తిమంతం చేస్తాయి.

స్వేచ్ఛా కవిత్వానికి ప్రేరకశక్తియైన స్వేచ్ఛా లక్షణం ఎక్కువమంది కవుల్లో దీన్ని అనుసరించేందుకు ఉత్సాహాన్ని కలిగించింది. కవి తనదైన స్వేచ్ఛా వ్యక్తిత్వంతో అవతరించే సృజన రూపంలో, ఆధునికమైన భావనకు తగిన ప్రజాస్వామ్యంలో నిహితమైన స్వేచ్ఛానుభవాన్నీ దర్శించడం జరుగుతూంది. ఇదో విశిష్టమైన అనుభవం. సిద్ధాంత వైరుధ్యాలుండవచ్చు. అభిప్రాయ భేదాలుండవచ్చు. కాని సాహిత్య ప్రపంచంలో ప్రజాస్వ్యాంలో చారిత్రక పాత్రను నిర్వహింపే సృజన రూపాన్ని గుర్తించడం దాని అస్తిత్వాన్ని, ఇదీ ప్రధాన ప్రవాహంలో కలుపుకోవడమూ జరిగింది.

ఎప్పటికపుడు కొత్త ఊపిరితో, కొత్త ఆయువుతో, కొత్త ఆలోచనలతో, కొత్త అనుభవాలతో సమాజంలో వచ్చే ప్రతి మార్పుకీ స్పందనశక్తిగా ప్రత్యక్షమయ్యే స్వేచ్ఛా కవిత్వం ముఖ్యంగా కాలానికి సరియైన సామాజిక వేదికగా నిలిచింది. ప్రతి వ్గానికీ, ప్రతి సిద్ధాంతానికి ప్రతి దృక్పథానికి బలమైన అభివ్యక్తి సాధనంగా పరిణమించడం, ప్రజాస్వ్యాం వల్లనే సాధ్యమయింది. ఇది ప్రజాస్వామ్య భావనలో కీలకమైంది. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛకు సంకేతమయింది.

"భవిష్యత్తుకు ప్రవేశ ద్వార మొకటే
ఉదార ప్రజా స్వామ్య వాస్తవం".

స్వేచ్ఛా కవిత్వ తత్త్వం - II

# మానవీయ భావన

(మేనిఫెస్టో)

మాదిరాజు రంగారావు

**2026**
రసధుని
సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ – 500 028

Literary Criticism -12

**Manaveeya Bhavana**
**(Manifesto)**
(Sahithya Samalochanam)

by
*Prof. Madiraju Ranga Rao*

© : Dr. M. Santhosh Kumar

First Edition : 2011
Second Edition : 2026

*Presented to*

**Smt. HARITHA**

M.A. (Lit)

with

*affection and blessings*
*on her Birthday*

# మానవీయ భావన

## సూచిక


| | | పుట |
|---|---|---|
| 1. | స్వేచ్ఛా కవిత్వం – విస్తృతి, పూర్ణత | 5 |
| 2. | సజీవ చిహ్నం | 8 |
| 3. | కవిత్వంలో కామనీయకం | 10 |
| 4. | సమాన ధర్మం | 12 |
| 5. | సమాలోచనం – స్థాయి రూపాలు | 15 |
| 6. | ప్రతీయమానం – కావ్యశాస్త్రావసరం | 18 |
| 7. | నిబద్ధత – ప్రజాస్వామ్య భావన | 20 |
| 8. | స్వేచ్ఛా కవిత్వం – ఒక ఆలోచనా రూపం | 23 |
| 9. | స్వేచ్ఛా కవిత్వం – ప్రజాస్వామ్య ప్రకాశం | 27 |
| 10. | స్వేచ్ఛా కవిత్వం – మానవీయ యుగం | 35 |

# సమాలోచనం

## 1. స్వేచ్ఛా కవిత్వం - విస్తృతి, పూర్ణత

స్వేచ్ఛా కవిత్వంలో స్వేచ్ఛా రూపం వ్యక్తి నిష్ఠం అయినప్పటికీ సమాజ నిష్ఠానికి ప్రాధాన్యం ఉంటుంది. ఇది ప్రజాస్వామ్య భావ ప్రేరితమయిందీ. ప్రక్రియా పరంగా నిర్మాణ స్వేచ్ఛ కలిగింది. సమాజ పరంగా అన్ని వాదాల్నీ ఆదర్శాల్నీ సిద్ధాంతాల్నీ అభిప్రాయాల్నీ ఆహ్వానిస్తుంది. ప్రవేశ స్వేచ్ఛను ప్రసాదిస్తుంది. ఈ దృష్టితో, ఈ ప్రక్రియకు "వచన కవిత్వం" అన్న పేరు కన్నా 'స్వేచ్ఛా కవిత్వం' అన్న పేరు అన్వర్థమవుతూంది. భావ కవిత్వంలోనూ "స్వేచ్ఛ" అన్న మాట కనిపిస్తుంది. అందులో ఇది ప్రధానంగా వ్యక్తి స్థాయిలో అనుభూతి విశిష్టమయింది మాత్రమే. అక్కడక్కడా సామాజిక స్ఫూర్తి మాత్రం ఉండవచ్చు. ఇంకా గేయాన్ని పాటనూ వీటికి దగ్గరగా ఉండే పద్యాన్నీ అందులోనూ ఎక్కువగా ఆట వెలది తేట గీతి నాశ్రయించిందీ. ఆయా అంశాల సహయోజనంతో ప్రభావం రచనలో వేరు వేరుగానూ కళాత్మకతను పొందుతాయి.

వచన కవిత్వం అన్న మాట ఛందస్సుకు సంబంధించిన నియమ నిబంధనల్ని పాటించే తెలుగు పద్యం నుండి భిన్నమయిన రూపాన్ని సూచించేందుకు ఉద్దిష్టమయింది. ఈ ప్రక్రియలో బహు సాధారణమైన అభివ్యక్తి విధాన్ని ఆమోదించడం జరిగింది. ముఖ్యంగా పద్యంపై దృష్టితో దీనికి ప్రత్యామ్నాయంగా సులభమయిన పద్ధతికి చెందిన మార్గాన్ని ప్రజలకు అర్థమయ్యే అభిప్రాయంతో ప్రతిపాదింపబడింది. అయితే కాలం గడచేకొద్దీ ఈ స్థితి సాగలేదు. అనేక కవుల భిన్న భిన్న వ్యక్తిత్వాల్ని బట్టి మార్పులు చోటు చేసుకున్నాయి, వైవిధ్యం చేకూరింది. స్వచ్ఛమయిన వచన కవిత్వమన్నది ఒక భాగమైంది, ఈ మార్పును బింబించే పూర్ణంగా స్వేచ్ఛా కవిత్వంగా ఆలోచన కలగాడనికి అవకాశం లభించింది. ప్రస్తుతం స్వేచ్ఛా కవిత్వానికీ వచన కవిత్వానికీ గల భేదాన్ని స్థూలంగా గుర్తించి ఈ ప్రక్రియకు స్వేచ్ఛా కవిత్వమన్న మాట ఎట్లా సముచితమో పరిపూర్ణమో ప్రతిపాదించడమే ప్రధానోద్దేశం. ఈనాడు వస్తూన్న స్వేచ్ఛా కవిత్వం మొత్తాన్ని దృష్టిలో పెట్టుకొని పరిశీలిస్తే ఈ అంశం స్పష్టమవుతుంది.

ఒక విధంగా ఈ ప్రక్రియ విషయంలో 1. క్రమంగా వచన కవిత్వం కన్నా భిన్నంగా వివిధ శాఖలతో విస్తరించి సంపన్నమయిన పరిణామ గుణం చేత స్వేచ్ఛా కవిత్వంగానూ 2. కొన్ని పరిమితులు గల వచన కవిత్వాన్ని అనేక పార్శ్వాలతో విశాలమైన రూపం ఏర్పడుతూ అన్నిటికీ ప్రాతినిధ్య వహించే గుణం చేత స్వేచ్ఛా కవిత్వంలో అంతర్భాగంగానూ అంగీకరింపవచ్చు.

వచన కవిత్వమన్న మాట, దీని మొదట ప్రచారం చేసిన ప్రముఖుల అభిప్రాయాల్ని బట్టి 1. సామాన్య పద్ధతిలో సూటిగా సులభంగా సాధారణ స్థాయిలో అందరికీ అర్థమయ్యే విధంగా అభివ్యక్తి పరిమితుల్ని భావింప జేస్తుంది. ఈ కారణంగా రచనలో అభివ్యక్తి కళకూ శైలీ రామణీయూతకూ భావ గభీరతకూ అర్థ విశిష్టతకూ అవకాశాలు తగ్గుతాయి. సృజన వికాసాన్ని సంకుచితం చేసే ప్రమాదమూ ఉంది. కళాత్మకతకు దోహదం చేయలేని స్థితి ప్రాబల్యమూ ఉండవచ్చు, ఏర్పడింది కూడా.

2. మరో అంశం ముఖ్యమైంది. ఆదర్శానికీ / దార్శనికతకూ సంబంధించింది. ఇది సృజనకృతికి ఆధునిక యుగంలో వెన్నెముక లాంటిది. వచన కవిత్వాన్ని సమర్థించే కవుల్లో ఫ్రీవర్స్ ఫ్రంట్‌పేరుతో నడుం కట్టిన ప్రముఖుల ఆదర్శం / దార్శనికత మార్క్సిజానికి సన్నిహితమయింది. ఆలాంటి నిబద్ధత ఏమీ లేదన్నప్పటికీ ఆచరణలో మొగ్గు స్పష్టంగా కనిపిస్తుంది. కవిగా ఈ స్వేచ్ఛ ఉంది. ఎవరూ కాదనరు, ఇది ప్రక్రియ గతమయేప్పటికి దాని పరిధి పరిమితిని పొందుతుంది. ఇక్కడే స్వేచ్ఛా కవిత్వం, ప్రజాస్వామ్య పద్ధతిలో స్వేచ్ఛ సమానత్వం సామాజిక న్యాయం మానవ హక్కులూ బాధ్యతలూ వ్యక్తి వికాసం సమాజ ప్రగతి దృష్టితో విశాలమైన వేదికగా అవతరించింది.

ఈ విధంగా స్వేచ్ఛా కవిత్వం సామాజిక పరిణామంలో పరివర్తన దిశగా ఆధునిక చేతనతో భౌతిక మానసిక వికాసాన్ని కోరే ప్రజాస్వామ్య లక్షణంతో విస్తృతిని పొందింది. అన్నిటినీ అంటే సంప్రదాయానికి చెందిన ఉత్తమమైన విలువల నుండి మార్క్సు సామ్యంవాదంతో కలుపుకొని అన్ని వాదాల ఛాయలతో విలువలతో లక్ష్యాల ప్రాతినిధ్యంతో సమగ్రతనూ కలిగింది అవుతూంది.

1. వచన కవిత్వం – దానికి సంబంధించిన పరిమితులు కారణంగా విశాలమైన ప్రాతిపదిక గల స్వేచ్ఛా కవిత్వంలో అవలీలగా అంతర్భాగమవుతూంది.

2. స్వేచ్ఛా కవిత్వం తన స్వరూపంతో ఉద్దేశంతో ప్రయోజనంతో విశాల దృష్టితోనూ బహు వైవిధ్యభరితమైన పాత్రకు అర్హమైందవుతూంది.

సూటిగా సులభంగా సామాన్యస్థాయిలో వచన కవిత్వం అనేది కాలక్రమేణ సంవేదన ఆవేశం ఆలోచనకు తగిన విధంగా అభివ్యక్తి కళతో భిన్న భిన్నమైన వ్యక్తిత్వాలు కలిగిన స్వేచ్ఛా రూపాలకు ప్రేరణ స్థానమైన స్వేచ్ఛా కవిత్వంలో ఒక భాగమవుతూంది. స్వేచ్ఛా కవిత్వం వైయక్తిక సామాజిక స్థాయిల్లో విస్తృతికీ పూర్ణతకూ ప్రాతినిధ్యం వహిస్తూంది.

# 2. సజీవ చిహ్నం

ఏ కవినీ ఒక చట్రంలో బిగించి కృతిని సమాలోచనం జరపడం కుదరదు. ఒకే సిద్ధాంతం ఆదర్శం కళాతత్త్వం కలిగిన వారయినా కృతుల్లో ఆయా కవుల వ్యక్తిత్వాలు వేరు వేరుగా ఉంటాయి. ఇది ప్రత్యేకతల్ని సూచిస్తుంది. మనుషులు ఎందరో వారి వారి మనో జగత్తుల్ని బట్టి సామాజిక ప్రభావాన్ని దర్శనాన్నీ బట్టి కవులుంటారు. ఆలాగే సమాలోచకులూ.

స్వేచ్ఛా కవిత్వంలో నియమ నిబంధనలు లేకపోవడం చేత ఆధునిక యుగంలో జీవన వికాస వైవిధ్యాల వల్ల స్వతంత్రమైన వ్యక్తిత్వాలకు అవకాశాలతో భిన్నత్వం గోచరిస్తూంది. మరొకరి ఇష్టానిష్టాల్ని బట్టి సృజన కృతి ఏర్పడదు. వారు రచనకు ప్రేరకులు కావచ్చు. కాని దాని మూల రూపాన్నీ జీవ శాఖల్నీ నిర్దేశించలేరు. ఎంత వారయినా ఆ గుణాధానానికి సమ్మతం కావలసిందే! అందువల్ల ఒక ఉత్తమ కృతి సమాలోచనం అనుకున్నంత సులభం కాదు. విశ్లేషణతో వివేచనతోపాటు విశేషమైన అంశాల్ని గుర్తించి వాటిని సమన్వయపరచి చూచే సూక్ష్మ దృష్టి అవసరం. ఇది సమాలోచనానికి ప్రధానాంశాల్లో ఒకటి.

కవిత్వ విషయంలో సృజనకు సంబంధించిన ముఖ్యమైన దశలున్నాయి. ఏదో ఒక వస్తువు లేదా స్థితి లేదా భావం ప్రేరణతో కలిగే ఊహ లేదా ఆలోచన అనేది కవికే కాకుండా మరెందరికో కలగవచ్చు. అయితే వారిలో స్థిరంగా ఉండదు. సాకారాన్ని పొందదు. అనుభవంలోకి వచ్చి వెళ్ళిపోతుంది. కవిలో అయితే అది చింతనలో వికసిస్తుంది. ప్రతిభ చేత నవత్వాన్ని పొందుతుంది. ఇది కవిలో మానసికంగా ఆవిష్కార దశ అనవచ్చు. ఇది మొదటిది. దీని తరువాత శబ్ద జగత్తుతో ప్రవర్తమానమవుతుంది. కవి నుండి కవిత్వంగా ప్రకటితమవుతుంది. విశేష స్థితి చేత అవతరిస్తుంది అనడం సముచితం. ఇది రెండోది. ఇక వ్యక్తి స్థితి నుండి సమాజ స్థితికి చేరుకునే సందర్భం ఉటుంది. ఇది పాఠకుడు లేదా శ్రోతలో సాక్షాత్కారాన్ని పొందుతుంది. ఇది మూడోది. రూపసౌందర్యంతో అనుభవ చైతన్యంతో లోకోత్తరత్వాన్ని భావింపజేస్తుంది. ఇంతకు పూర్వం ఎరగని విశిష్టమయిన ప్రభావ ముద్రను వేస్తుంది. కృతి 1. కవి మనోజగత్తులో ఆవిష్కారం 2. శబ్ద జగత్తులో అవతరణం, 3. పాఠక / శ్రోత, సమాజ జగత్తుతో ప్రత్యక్ష, లేదా పరోక్ష బంధం అనే మూడు దశలతో త్రిదశత్వాన్ని పొందుతూంది. అవతరణ దశలో పాఠకుల / శ్రోతల సంస్కారాన్నీ పరిణతినీ దృక్పథాన్ని ఉద్దేశాన్ని

బట్టి అవగతికి వస్తుంది. "రుచి" భేదాలెన్నో! కృతి విషయంలోనూ, పాఠక / శ్రోతల విషయంలోనూ! కూడా. ఇది ఇష్టం అనిష్టం విషయంలో ప్రభావాన్ని నెరపుతుంది.

ఒక్కొక్క కవి కృతిలో ఆంతర వ్యక్తిత్వం 1. సంవేదన స్థాయి 2. భావ నవ్యత 3. అభివ్యక్తి సౌందర్యం 4. అభిప్రాయ ప్రకాశనంతో ఏకాకృతిని పొందుతుంది. వీటిలో ఒకటి ఎక్కువ మరొకటి తక్కువగానూ ఉండవచ్చు. నిర్మాణ కళలో ఒక దాని లోటును మరొకటి పూరిస్తూ క్రమ్మేస్తూంటుంది. మొత్తం మీద వీటి సమాకలనంతో ఒక స్థాయికి చేరిన కృతి, ప్రమాణాల్ని బట్టి జీవిస్తుంది. మరొక మారు చదవాలనిపిస్తుంది. భద్రపరచుకోవాలనిపిస్తుంది. మరొకరికి వినిపించాలనిపిస్తుంది. ఇదే గీటు రాయి. ఏ కృతి అయినా ప్రధానంగా స్వేచ్ఛా కవిత్వంలో మానవ జీవితంలోని సామాజిక వాస్తవాల్నీ మానసిక రీతుల్నీ చిత్రిస్తుంది. వీటి నుండి నీతినో లక్ష్యాన్నో ఆదర్శాన్నో సూచించవచ్చు, ప్రకటించవచ్చు. ఈ కేంద్ర స్థానాల్ని ఆశ్రయించి మాత్రమే రచన క్రమిస్తుంది, మిగతావి ఆనుషంగికాలుగా వర్తిస్తాయి.

చాలా మంది కవుల్లో మనోజగత్తులో ఆవిష్కారం నుండి శబ్ద జగత్తులోకి సరిగ్గా అవతరణ గుణం లేకపోవడం వల్ల, పాఠకునిలో ప్రత్యక్షీకృతం లేదా సాక్షాత్కృతం చేసే మూర్తిత్వంలో లోపం వల్ల, అస్పష్టత ఏర్పడుతూంది. ఇది కొత్త ప్రక్రియ విషయంలో బాగా వర్తిస్తుంది. కళాత్మకతలోపిస్తూంది. రూపంలో సంపూర్ణతకు క్షతి కలుగుతుంది. ప్రమాణాల్ని కోల్పోతుంది. పై స్థాయికి చేరుకోలేకపోతూంది. ఈ విషయంలో ఎంత చెప్పినప్పటికీ ఇంకా మిగిలే ఉండే అనిర్వాచ్యమయిన "కామనీయకత"ను ఎంతో కొంత సాధించడంలో సఫలమైన కృతి – కవి ప్రతిభ చేత సాధ్యమయింది మాత్రమే నిలుస్తుంది. ఇది సహృదయునిలో వేసే గాఢమైన ముద్ర, సజీవ చిహ్నంగా మిగులుతుంది.

# 3. కవిత్వంలో కామనీయకం

కవిత్వంలో కామనీయకం అంటే కోరదగిందీ, అందమయిందీ, ఇష్టపడజేసేదీ. రామణీయకం అన్నమాట కూడా ఉంది, ప్రసిద్ధమయింది. రామణీయకం కన్నా కామనీయకం అర్థ విస్తృతి కలిగింది. ఇది కవిత్వంలో సహృదయుడు కోరదగిన అందమయిన ఇష్టపడజేసే జ్ఞానానికి లేదా భావానికి హేతువుగా గుర్తింపబడింది. కవిత్వ సమాలోచనంలో బాగా ఉపకరిస్తుంది. కావ్యంలో కవి ప్రతిభ చేత కళాత్మకంగానూ హిత రూపంగానూ సౌందర్య దర్శనంతో, సమాహితమయిన సృజన శక్తిని రూపిస్తుంది. క్షణ క్షణం నవత్వాన్ని భావింపజేసే లక్షణం చేత ఆకర్షణ కలిగింది. కవిత్వంలో అందానికి సంబంధించింది రామణీయకంగా రూఢమయింది. జగన్నాథ పండితరాయల రమణీయార్థ ప్రతిపాదక శబ్దం కావ్యమన్న మాట చేత మరీ ప్రసిద్ధిని పొందింది. ఇది శోభకు ఆకరమయింది. ఈ లక్షణం కామనీయకంలోను అంతర్భవిస్తుంది. అర్థ బోధక రూపమయిన శబ్దం మొదలుకొని ధ్వనించబడే అర్థమయిన ప్రతీయమానం దాకా బహువిధాలుగా వ్యాప్తమయింది. దీనికి తోడుగా ప్రత్యక్షంగానో పరోక్షంగానో కనిపించే దార్శనికం కూడా అంతర్విషయమవుతూంది. ఇది కోరదగిన దానిలో భాగమవుతూంది. ఇష్టపడజేసే అంశాన్నీ సూచిస్తూంది. దార్శనికం ఆదర్శానికి నిలయమయింది. వ్యక్తిలో చింతన మొదలుకొని తాత్త్విక స్పర్శతోనూ సమాజ లక్ష్యం దాకా పర్యాప్తమయింది. రామణీయకం దార్శనికం రెండూ కామనీయకతలో అంశాలుగా సమాలోచన కందుతాయి. ఇవి కవిత్వంలో సందర్భాన్ని బట్టి కవి వ్యక్తిత్వాన్ని బట్టి ఒక దానికొకటి పోషకంగానూ, ప్రధానమయిన మొదటి దానికి విస్తరణ పూర్ణంగానూ విలసిస్తాయి. వీటి సహయోజనంతో కృతికి స్థాయి పెరుగుతుంది. ఉన్నత రూపమూ ఏర్పడుతుంది. వీటి లక్ష్యం వైయక్తిమైన ఆనందరూపమూ సామాజికమయిన ఆలోచనా హితరూపమూ అందించడం. వ్యష్టి మరియు సమష్టి బాధ్యతా పూర్ణంగా వివేచన కందుతుంది.

ఈ విధంగా 'కామనీయకం' ప్రీతికరమయిన హ్లాద కళతో రామణీయకతనూ, సమాజ ప్రయోజనపరమయిన హిత గుణంతో దార్శనికతనూ కలిగింది వీటి సమన్వయ భూమికను నిర్వహిస్తుంది. ఇది కవి సంస్కారాన్ని బట్టీ ఆశయాన్ని బట్టీ దృష్టి కోణాన్ని బట్టి కవిత్వానికి ప్రత్యేకతను కలిగిస్తుంది.

కవిత్వంలో కీలకమైంది స్వీయమైన అనుభవం. ఈ కారణం చేతనే ఒకే కావ్యం గురించి ఎన్నో అభిప్రాయాలు ఏర్పడడం జరుగుతూంది. చేతనమూ అచేతనమూ కలిగిన జగత్తులో ప్రాణీ – చెట్టూ వికాసానికీ, ఒక సౌధ నిర్మాణానికీ మూలం అవసరమయినట్లే కవిత్వానికీ అర్థపరమయిన శబ్దం ఆధారం. దీనిపై అపూర్వమయిన భావ జగత్తు కవి ప్రతిభ చేత ప్రభవిస్తుంది. ఇది స్వతంత్రమయింది. అయినప్పటికీ ఇష్టం వచ్చినట్లు వర్తించే అవకాశం లేదు. ఈ పని అర్థవంతంగా శోభాకరంగా చేయవలసి ఉంటుంది. అపుడు స్వతంత్రత నియతమవుతుంది. ఆలాగే అనుభూతినీ సామాజికతనూ విస్మరించడానికి వీల్లేనిది అవుతుంది.

కవిత్వం మౌఖికంగానూ లిఖిత రూపంగానూ ఉండవచ్చు. కవుల పేర్లు తెలిసినా తెలీకపోయినా, ఎన్నో కవితలు ముక్తకాలు చాటువులు ముఖతః పరంపరగా ప్రచారంలో ఉన్నాయి. కవిత్వం స్థిరమయిన కళ. సమయ సందర్భాన్ని బట్టి శబ్ద శక్తీ భావ ప్రసారమూ వైవిధ్యాన్నీ విస్తృతిని పొందుతుంది, కాని మౌలికంగా మార్పును పొందదు. బాహ్యమయిన సౌందర్య రూపం ఎంత కాలమయినా ఆలాగే నిలిచి ఉంటుంది. ఇది శబ్ద గతమయింది. ఆంతరమయిన సౌందర్య రూపం భావగతమయింది. కొత్త అర్థాల్ని వివరణల్ని అనుభూతి సాంద్రతల్నీ ఆలోచనా సీమల్నీ పొందవచ్చు. కాలక్రమంలో వచ్చే వ్యాఖ్యానాలు విమర్శలూ ఇందుకు నిదర్శనం. దేశ / జాతి సాంస్కృతిక జీవితంలో భాగమయిపోతుంది. దీనికి ప్రత్యేకంగా ఉదాహరణలతో పనిలేదు. ఇంతవరకూ నిలిచిన కవిత్వమంతా ఉదాహరణీయమే.

ఈ క్రమంలో స్వేచ్ఛా కవిత్వానికి వస్తే నిర్మాణ స్వేచ్ఛలో 'కామనీయకం' అనేది బాహ్య సౌందర్యాన్ని గుర్తు చేసే వాక్య నిర్మాణంలోనూ అంత స్సౌందర్యాన్ని తలిపించే భావ ప్రసారంలోనూ ప్రయోజనాన్ని ఉద్దేశించిన విషయ గుణంతో సామాజిక స్పృహలో ఎంతో వైవిధ్యంతో విశ్లేషణ కందుతుంది. కామనీయకంగా ఒక స్థాయికి చెందినవి, ఏ గుణం చేతనైనా సరే నిలిచాయి, నిలుస్తాయి. తత్కాలంలో ప్రచార భాగాన్ని ప్రమాణంగా తీసుకోవడం జరగదు. సంవేదన, భావ సాంద్రత, అభివ్యక్తి నైపుణి, ప్రయోజన పరతతో కూడిందీ కవిత్వాన్ని చిరకాలం నిలిపే సహృదయుల్ని ఆకర్షించే "కామనీయకం" అన్నమాట ధ్వన్యాలోకంలో ఆనంద వర్ధనునిచే ప్రసక్తమయిందీ. లోచనంలో అభినవ గుప్తుని చేత వ్యాఖ్యాత మయిందీ. ఈనాటికీ నూత్న విధంలోనూ దీని అవసరాన్ని చెప్పడమే ప్రస్తుతోద్దేశం.

# 4. సమాన ధర్మం

ఒక వస్తువో ప్రకృతి దృశ్యమో వ్యక్తో నిర్దిష్టమయిన నియమాల్ని అనుసరించని స్వేచ్ఛా కవిత్వమో పరిచయంతో స్థూలంగా భావ రేఖలతో ఒక ముద్ర ఏర్పడుతుంది. ఇది ఆ తరువాత మధ్య మధ్య అనుభవంలో దానికి సంబంధించిన అనుబంధ రేఖలతో రంగులతో కళాబింబం రూపొందుతుంది. సాధారణమైన తొలి పరచయంతో ఏర్పడిన ఆకర్షణ స్థిరపడి ఇంకా తెలుసుకోవాలనే లోతులు చూడాలనీ కోరిక కలుగుతుంది. స్పందన ప్రభావం గాఢంగా ప్రసరిస్తే అభిమానం పెరుగుతుంది. క్రమంగా పరిచయాధిక్యం వల్ల కోరిక ఆపైన  లాలసగా మారుతుంది. ఇది ఆ కవిత్వం పట్ల బహు ఇష్టానికీ ప్రశంసాభావానికీ దారి తీస్తుంది. ఈనాడు ఒక కావ్యం లేదా కవిత్వం పట్ల అభిప్రాయ ప్రకాశనానికెన్నో కారణాలు తటస్థపడుతున్నాయి. ఇవి సాహిత్య పరిశీలనలో సహజమైన ఉత్సుకతతో వెలువడినవి కావచ్చు. లౌకికమైన వ్యవహార వర్తనంలో భాగాలు కావచ్చు. అప్పటి అవసరాల్ని బట్టీ మునుముందు ప్రయోజనాల్ని బట్టీ చోటు చేసుకోవచ్చు. ఏమయినప్పటికీ పరిస్థితుల్ని బట్టి చూచే దృష్టీ పొందే అనుభవమూ ప్రకటించే అభిప్రాయం తీసుకునే నిర్ణయం కేవలం సాహిత్యపరమైన విలువలకు సంబంధించింది కావడం అవసరం కాని ఇది లభించడం క్వాచిత్కంగా ఉంది.

ఈనాడు ఏ స్థాయి విమర్శకులయినా సమాలోచనంలో కొన్ని పరిమితులూ గోడలూ  తప్పడం లేదు. వీటిని అధిగమించినపుడే పరిణతమైన సమాలోచనం సుగమమవుతుంది. సమాలోచనంలో దృష్టి విశాలతరం కావలసి ఉంది. పాత విలువల్లో అవసరమైనవీ కొత్త విలువల్లో అనివార్యమయినవీ కలిసి ముఖ్యంగా స్వేచ్ఛా కవిత్వ విషయంలో కొత్త మార్గం అవతరించవలసి ఉంది. ఎందుకంటే ఏ కవిత్వ ప్రక్రియలోనూ లేని వైవిధ్యంతో విశాలమైన స్వరూపాన్ని పొందుతూంది. అడ్డంకుల్ని అధిగమిస్తూ జీవన వ్యవహారాలతో సంశ్లిష్టమైన సమాజంలో భాగంగా స్వీకరించి ముందుకు అడుగు వేయవలసి ఉంది. ఎవరికి వారు గుణాధానంపైనే దృష్టితో ఉపక్రమిస్తున్నామను కోవడం ఉన్నదే. ఇందులోనే చిత్రమేమంటే జీవితంలోని అవసరాల కఠోరమయిన వాస్తవం ఉంది. దీని నుండి తప్పించుకోవడం సామాన్యవిషయం కాదు. ఏదయినా చివరకు

నిలిచేది ఉత్తమయిందీ విలువల్ని కాపాడేది పరిణతమయిన సమాలోచనమే.

తాను అనుకున్నదీ విశ్వసించిందీ తనకు ఇష్టమైందీ కృతిలో కనిపించక పోవడం వల్ల అననుకూల భావం ఏర్పడవచ్చు. మరో విధం, తాను అనుకోనివీ విశ్వాసంలేనివీ, తనకు ఇష్టం కానివీ కృతిలో కన్పించడం వల్లనూ వ్యతిరేక భావాన్ని పొందవచ్చు. ఒక్కొక్కపుడు ఇవి సాధారణ భావాల నుండి విశేషమైన మనోభావాలకూ సిద్ధాంతాలకూ ఆదర్శాలకూ చెందినవి కావచ్చు. అపుడు విభేదం తప్పని సరి అవుతుంది.

ఇవికాక కవిత్వంలో వివిధాంశాల పరస్పర సహయోజనంలో పరిపూర్ణత పొందవలసిన కళారూపం గురించి కావచ్చు. ఏవి అయినప్పటికీ సహేతుకంగా ఔచితీవంతంగా ఉండడం అవసరం. దీనికి 1. ఆయా విషయాల పరిజ్ఞానం ఉండాలి. 2. సమకాలిక స్పృహ ఉండాలి. 3. కవి భావ జగత్తుతో సాన్నిహిత్యం పెంచుకోవాలి. 4. ముఖ్యంగా స్పందనం ఉండాలి. 5. వివేచనం ఉండాలి. 6. లౌకికమైన వ్యవహారాల స్థాయిలో తత్కాల ప్రయోజనపరమైన వైయక్తిమమైన అంశాల్ని సాధ్యమయినంత వరకు పరిహరించాలి. కళాత్మక భావంతో తాదాత్మ్యం పొందుతూ దార్శనిక దృష్టితో విశ్లేషణం చేయవలసి ఉంటుంది. సహృదయుల హృదయాల్లోకి ఈనాటి స్వేచ్ఛా కవిత్వం ప్రవేశించడం ఎంత కష్టమో సహృదయ లక్షణాన్ని పొందడమూ అంత సులభం కాదు. కాబట్టి కవి మనో రూపంతోనూ కృతి స్వరూపంతోనూ సమానమైన స్థితినీ ధర్మాన్నీ ఆశించడం సహజం అయితే ఇది సర్వసాధారణం కాదు, విశేషమైన గుణోపేతమయింది.

అభిలాష అనేది కవిత్వ విషయంలో ఒకరి ఇష్టానిష్టాల్ని బట్టి ఉండదు. మౌలికంగా సమాన ధర్మంతో కవిత్వాన్ని ఆనందించగల, వివేచన చేసి అనుభవ పూర్వకమైన నిర్ణయానికి రాగల శక్తి, బీజ భూతంగా ఉండాలి. కవి హృదయంతో సంవదించగల కవిత్వ స్పృహతో ఉదాత్తగుణంతోనే సాధ్యమవుతుంది. ఈ సమాన ధర్మంలో కవీ సహృదయుడూ ఇరువురి స్పందన రేఖ. సూక్ష్మంగా ఇంచు మించు సమాన స్థాయిలో ఉంటుంది. మనఃపరంగా భావ ప్రసారంలో అంతరాయం ఉండకూడదు. ఇది కవిత్వ విషయంలో బాగా వర్తిస్తుంది. కవిత్వం వివిధాంశాల సహభావంలో సహయోజనంలో మనోరూపం ఒక స్థాయికి చేరినపుడే ఇది సాధ్యం.

ఈ సందర్భంలో ఏ నియమ నిబంధనలూ పాటించని స్వేచ్ఛాకవిత్వ విషయంలో సమగ్రతను సాధించడం సులభం కాదు. ఏదో తక్కువ అయినట్లు ఉంటుంది. దీన్ని

కప్పేసే  ఆయా అంశాల ప్రమేయం తక్కువ ఉండడం వల్ల బయటికి స్పష్టంగా కన్పిస్తుంది. 1. వాస్తవికత 2. భావాత్మకత 3. కళాత్మకత 4. సామాజికత 5. వైయక్తికత 6. దార్శనికత అనే అంశాలు సర్వసాధారణంగా కన్పిస్తాయి. వీటిలో కొన్ని ప్రాముఖ్యంతోనూ ప్రచరిస్తాయి. ఏ కవిలోనూ ఈ ఆరు సరి సమానంగా కవిత్వంలో ఉండవు. వస్తువూ, కవి దృష్టీ సంస్కార సంపుటి, లక్ష్యంతో కలిసి రూపాంతరాన్ని పొందుతాయి.

రుచి సామ్యం ఒక కవి కవిత్వాన్ని ఇష్టపడే వారి నందరినీ కలుపుతుంది. ఏక ముఖీనంగాను బహుముఖీనంగా విలసిస్తుంది. బహు ముఖీనంలో ఇతర కవుల కవిత్వాల్లోని రుచి సామ్యం గుర్తింపబడుతుంది. "సమాన ధర్మమ"నేది స్పందన శక్తీ కవి మనో రూపంతో సమైక్య గుణంతో లౌకికమైన పరిమితుల్ని అధిగమించే విశాల బుద్ధితో కవిత్వ స్పృహతో స్థాపితమవుతూంది. దీనికి ముఖ్యంగా ఈనాటి స్వేచ్ఛా కవిత్వానికి సంబంధించినంతవరకు పరివర్తన యుగ ప్రభావాన్నీ ప్రత్యేకంగా కవి సృజన శీల వ్యక్తిత్వాన్నీ గుర్తించవలసిన అవసరం ఉంది.

# 5. సమాలోచనం - స్థాయి రూపాలు

ఆధునికమైన మార్పుల పర్యవసానంగా ఈనాడు స్వేచ్ఛా కవిత్వంలో వస్తు పరిధులు ఎక్కు అయినాయి. దృష్టి కోణాలూ పెరిగాయి. లక్ష్యాలూ భిన్న భిన్నంగా దృష్టికి వస్తాయి. అన్నిటినీ తనలో చేర్చుకొని పోయే విలక్షణ రూపంతో పరిణామ శిఖరాల్ని అందుకుంది. స్వేచ్ఛాత్వం అన్వర్థమవుతూ ఈ స్థితిలో సమాలోచనంలో నవ్య దృష్టీ అన్వేషణ గుణం విశాల భావన అవసరమవుతాయి. సమాలోచనం కనీస స్థాయిలో ప్రమాణాల్ని పొందినపుడే ఉత్తమత్వాన్ని పొందుతుంది. దీన్ని సాధించే వివిధ స్థాయి రూపాలు విశ్లేషణ కందుతాయి. ఇవి సందర్భాన్ని బట్టి వివిధాంశాల సమాకలనంతో సమాలోచనానికి పరిపూర్ణత చేకూరుతుంది.

1. కవి స్థాయి రూపం, – కవి తన కృతి విషయంలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో వెలువరించే భావనకు సంబంధించింది. ఇది కవి దృష్టిలో అతని కావ్య స్వరూపాన్నీ ఆశయాన్నీ ఆంతర్వ్యక్తిత్వాన్నీ అవగాహ చేసుకోడానికి ఉపకరిస్తుంది. ఇతర సందర్భాల్లో దీన్ని గురించి వెలువరించినవీ సహాయపడతాయి. వీటిని గ్రహించి సమాలోచనానికి ఆధార తలంగా స్వీకరించడం వల్ల కొంత విశ్వసనీయతను సాధించవచ్చు. ఇవి సమాలోచనానికి జీవరేఖగా ఉపకరిస్తుంది.

దాశరథి 'పునర్నవం – "మస్తిష్కంలో లేబొరేటరీ"లో గమనించవచ్చు. 'పునర్నవం' అంటే తిరిగి కొత్తదనాన్ని పొందడం. పాతది నిష్క్రమించి కొత్తది రూపొందడం. కవిత్వంలో కవి ప్రతిభాస్పర్శ చేత నవత సిద్ధిస్తుంది. పునర్నవం ప్రకృతి పరంగానే కాక జీవితపరంగానూ దర్శించవచ్చు "శిశిరంలో గుడ్డలూడిన పెద్ద పెద్ద మోదుగ వృక్షాలకు నిప్పుబట్ట కట్టించిన రీతి" కవిలో పరుగిడే ఊహలు! వీటిని దండించడమా? "రండి రండి!" అని పిలిచి "పండు టెరుపు చేలాలనందించడమా"? అన్న విచికిత్స చివరకు కొత్తదనాన్నే వరించింది. "రెడిమేడ్ దుస్తులు" లేవు. అంటే ఏ నియమ నిబంధనలకూ ఒదిగిపోయే కవిత్వరూపం లేదని అర్థం. కవిలో సహజ సుందరంగా అవతరించే స్వేచ్ఛా సృజన రూపం అన్వయశోభను పొందుతూంది. కవిలో సృజనేచ్ఛ కొత్త రూపాన్ని అవతరింపజేసింది. " నిప్పు బట్ట" దహించే లక్షణంతో కాక, ఎరుపుదనం ఉత్సాహానికీ వేడి మారే శక్తికీ చిహ్నంగా నిలుస్తాయి. శిశిరదృశ్యం అంతరించి ఎర్రనిపూలతో వసంత సౌభాగ్యం అవతరించడం 'పునర్నవ' సూచకం. ఈ రూపకం ఎరుపు వర్ణభావనలో

ప్రగతిశీలమైన ఆదర్శంతో కవిత్వపరమైన అర్థచ్ఛాయా సౌందర్యం కలిగింది. భావార్థం ప్రతీయ మానత్వాన్ని పొందుతూంది. ధ్వన్యాలోకంలో ఆనంద వర్ధనుడు, ఒక మాట అంటాడు. "ఇతరులు చెప్పిన దాన్ని పొందాలనే గ్రహించాలనే కోరికలేని, స్వతంత్రమైన మనోరూపం గల కవిని, సరస్వతి అనుగ్రహిస్తుంది!" అతని "ఇష్టానికి అనుగుణం"గా నవం నవ రూపాన్ని "సమకూరుస్తుంది", అనుగ్రహిస్తుంది. "పరస్వాదానేచ్ఛా విరత మనసో వస్తు సుకవేః సరస్వత్యేవైషా ఘటయతి యథేష్టం భగవతీ" కవికి, స్వతంత్రమైన మనోరూపం ముఖ్యం. దాన్ని బట్టి సృజన సంకల్పం ఉంటుంది, ఇది ప్రస్తుతానికి బాగా అన్వయిస్తుంది.

2. సహృదయ స్థాయి రూపం – అనేక కావ్యాల పరిశీలనం చేత ఏర్పడే పరిజ్ఞానంతో సహజంగా ఉన్న గాఢమైన అనుభూతి శీలంతో సూక్ష్మమైన పరిశీలనానుభవంతో భావుక స్పందనం ప్రధానమయింది. కావ్యానికి సంబంధించింది మాత్రమే ముఖ్యమవుతుంది. ఇతర విషయాలు ప్రధానం కావు ఆఖరికి కవి జీవితం కూడా. అనుభవ పారమ్యం. దృష్టితో సమాలోచనం జరుగుతుంది. కావ్యంలో నిహితమైన ఉత్తమ గుణాల్ని ప్రకాశమానం చేయడం పరమార్థంగా సాగుతుంది. ఒక విధంగా సజీవమయిన కావ్య ప్రశస్తికి దోహదం చేసే మాట కూడ వాస్తవం. మరొకటి దీనికి అనుబంధంగా భావింపజేసేది.

3. అభిమాన స్థాయి సామాన్యులైన కవిత్వాభిమానులూ అభిలాష కలిగిన వారూ అభినివేశంతో కవిత్వ వాతావరణానికి తోడ్పడుతూ అభిప్రాయ ప్రకాశనం జరిపే సమాలోచం ఒక్కొక్కపుడు స్థూలమైన సమీక్షా రూపంలోనూ ఉంటుంది. ఇతర భాషా సాహిత్యాలకు చెందిన సాహితీ వేత్తల అనుభవజ్ఞుల అభిప్రాయాలతో వ్యాఖ్యలతో సంపన్నమవుతుంది. కావ్యల గురించి పెద్దల పీఠికలూ వ్యాఖ్యలూ అభిమానస్థాయిని నిలుపుతాయి.

4. సమాలోచన స్థాయి – ఇది సమాలోచనం చేసే వ్యక్తి దృష్టి కోణంలో వెలుగును ప్రసరించేది. అతడు నమ్మిన సిద్ధాంతం / ఆదర్శం/ అభిప్రాయం / దృక్పథం /తో విశ్లేషితమవుతుంది వివేచితమవుతుంది. సామాజిక రాజకీయ సాహిత్య పథంలో ఏది ఉండకూడదో, ఏది ఎట్లా ఉన్నదో, ఏది ఎట్లా ఉండాలో, ఏది లోపించిందో సహేతుకమైన చర్చకు నిలయమైంది. ఇది చాలా విస్తృతమైన పరిధి కలిగింది. సంప్రదాయం, నవ్య ఉదార సంప్రదాయం ప్రజాస్వామ్యం మానవీయం సామ్యవాదం ఉదారవాదం కళావాదం

మార్క్సిజం ఇట్లా అనేకమైన దృష్టి కోణాల శిఖరాల పయి నుండి కవిత్వాన్ని దర్శించడం జరుగుతుంది. పరస్పర భేదాభిప్రాయాలతో తప్పని వాస్తవాంశాల సమన్వయ భావంతోనూ సమాలోచనం అనేక వివాదాలకూ ప్రయోజన పథాలకూ దారి తీయడం జరుగుతుంది.

5. పరిశోధనా స్థాయి – విషయచర్చతో పూర్వ పక్షం విశదీకరణం ప్రతిపాదనం మొదలుగా హేతుదృష్టితో ప్రణాళికాబద్ధంగా పరిశోధనా స్వరూపానికీ దారి తీస్తుంది.

ఈ అయిదు విధాలయిన స్థాయి రూపాలతో ఈనాడు సమాలోచనం స్వేచ్ఛా గుణంతో గొప్ప పాత్రను నిర్వర్తిస్తూంది.

ఏమైనప్పటికీ కవి సృజన రూపానికి సముచితమయిన విశ్లేషణం వివరణం వివేచనంతో మూల్యాంకనంతో కూడిన కళానుభూతి ప్రధానమైంది, సమాలోచనం. ఇందుకు అవసరమైనవీ ఉపయోగకరమైనవీ అన్నీ దృష్టికి రావడం, చర్చకు నిలపడం సహజం. సమాలోచనానికి పరిపూర్ణత చేకూర్చే అంశమేదైనా స్వీకారానికి తగిందే!

“తరువు పుష్పాల్ని ప్రభవిస్తుంది. వాటి సౌరభాన్ని గాలి వహిస్తూ ప్రసరిస్తూ పయనిస్తుంది.” అన్న మాటలో ఆంతర్యం సృజన రూపమయిన కవిత్వానికీ సమాలోచనానికీ గల విడదీయరాని సంబంధాన్నీ సూచిస్తూంది. సమాలోచనంలో వివిధ స్థాయి రూపాలుంటాయనీ వాటి సమన్వయంతోనే సమాలోచనకు పరిపూర్ణత సిద్ధిస్తుందనీ భావించవచ్చు.

“ప్రతాయన్తాం వాచో నిమిత వివిధార్థామృత రసా
న సాదః కర్తవ్యః కవిభి రనవద్యే స్వవిషయే” ధ్వన్యాలోకం

స్తిమితంగా ఆలోచన చేసి అనేకమైన అర్థాలు అనే అమృత రసాన్ని పంచే వాక్కులు కవుల చేత విస్తరింపబడుగావుత! కావ్య వస్తువు విషయంలో విచార పడనక్కర లేదు. ఎంతో మంది ఎంతో చెప్పేసారని విషాదాన్ని పొందనవసరం లేదు. ఇతరులు చెప్పినవే చెప్పడంలో కవి సృజన రూపం గోచరించదు. ప్రకృతిలో సమాజంలో మనోలోకంలో కవి ప్రతిభను బట్టి దృష్టిని బట్టి ఎన్నో వస్తువులు కన్పిస్తాయి.

# 6. ప్రతీయమానం - కావ్యశాస్త్రావసరం

ఆధునిక కవిత్వ సమాలోచనంలోనూ పాశ్చాత్య కావ్య శాస్త్రంతోపాటు ప్రాచీన భారతీయ కావ్య శాస్త్రానికి సంబంధించిన అంశాల్ని వర్తింప చేయవచ్చు. ఇది సమాలోచనం పరిపుష్టికి అవసరం కూడా. దీని వల్ల సమాలోచనం పరిధి పెరుగుతుంది. అనుభవ వైశాల్యం ఏర్పడుతుంది. మూల్యాంకనంలో పరిపూర్ణతకు దారితీస్తుంది. ఇవీ కవిత్వం గురించి చింతనలో సిద్ధించినవే. ఇందులో ముఖ్యమైన వాటిలో 'ప్రతీయమానం' ఒకటి.

ప్రతీయమానం అనే మరొక విషయం ఉంది. అది మహాకవుల వాక్కుల్లో భాసిస్తుంది అని ధ్వన్యాలోకంలో ఆనందవర్ధనుని ప్రతిపాదనం ఇది కావ్య జగత్తును బాగా ఆకర్షించింది. ఇది విశిష్టమైన రామణీయకతతో లోకోత్తరమైన ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. వ్యంగ్యవిలసితమయింది. వ్యంగ్య విలసనమే ధ్వని. లోచనకారుడు అభినవగుప్తుడు "ప్రతీయమానం ఆత్మా" అని దీని సర్వశ్రేష్ఠత్వాన్ని సహేతుకంగా వివరించాడు. కవిత్వంలో ప్రతీయమానం సార్వకాలికమయింది. సార్వజనీనమయింది. కాబట్టి ప్రాచీనమూ ఆధునికమూ ప్రసక్తిలేదు. పైగా ఏ భాషలోని ఏ కవిత్వానికయినా వర్తిస్తుంది. ఇందులో జీవశక్తి ఏమంటే సామాన్యమైన శబ్దమూ అర్థమూ ప్రధానం కావు. వీటికి అతీతంగా విశేషమైన అర్థాంతరం సహృదయుల ఆలోచనలో అనుభవానికి వస్తుంది. ఉదాత్తత మరియు కామనీయకత అనే రెండు రెక్కలతో వచ్చి వాలుతుంది. "వ్యంజనావ్యాపారం"లో విశేషమే ప్రతీయమానం. మిగతా లక్షణాలన్నీ దీనికి సహాయకాలుగానే పరిణమిస్తాయి. ఆత్మయైన ధ్వనిని / ప్రతీయమానాన్ని శోభిల్లచేస్తాయి. ఇది శబ్దానికీ దాని అర్థానికీ సంబంధించి నంతవరకే పరిమితం కాదు, అక్కడే ఆగిపోదు. కొత్త భావన వైపు దారితీస్తుంది. దీని అనుభవం అలౌకికం. అంటే ఇంతకుముందులేనిది. కొత్తగా అవతరించింది. హేతువు కతీతమైంది. కవి సృజన శీలం చేత భావనా విశిష్టమయింది. రామణీయకత చేత సహృదయ జగత్తును ఆకర్షిస్తు,ది. ఇది చాలా ప్రభావం శీలం కలిగింది. ఒక్కొక్క కవి రచనలో ఒక్కొక్క విధంగా ఆవిష్కారాన్ని పొందుతూంది. స్వేచ్ఛా కవిత్వంలో "ప్రతీయమానం", బహు విధాలుగా అనుభవానికి వచ్చేమాట వాస్తవం. కామనీయకతకు బదులుగా 'రామణీయకత'ను వాడడం కనిపిస్తుంది.

సంస్కృత సాహిత్యంలో వెలువడిన అనేకమైన కావ్య శాస్త్ర గ్రంథాలకు ఎన్నో వ్యాఖ్యానాలూ వివరణలూ వెలువడినాయి. ఇవి ఎంతే మేలు చేశాయి కూడా. అయితే ఈ పని అక్కడితో ఆగిపోకుండా తెలుగులో వెలువడే కవిత్వానికీ అవసరమనుకున్న

చోట సమన్వయం చేయవలసి ఉంది. ప్రాచీనంతోపాటు ఆధునికానికీ ఇది వర్తిస్తుంది. ప్రాచీన కవిత్వ విషయంలోనూ ఈ కృషి అంతంత మాత్రంగానే జరిగింది. చిలక పలుకుల వల్లనూ ఉపయోగం లేకపోలేదు. దీనివల్ల పరంపర కొనసాగుతుంది. ప్రతిభ చేతనే కొత్తదనం పల్లవిస్తుంధి. ఇది సమాలోచన ప్రక్రియకూ వర్తిస్తుంది. ప్రతిభ చేతనే నవ్యత అవతరిస్తుంది. "నూతనమేవ సృజతి" అని లోచనకారుడు. ఈ కారణంగా ప్రతిభావంతులయిన సృజన శక్తి గల కవుల కృతులు మరొకరి రచనలకు మూసపోసినట్లు ఉండవు. వాటికి భిన్నంగా విశిష్టంగా ఉండడం సహజం. ఈ విశిష్టతన గుర్తించి విశ్లేషించి వివేచించడం సమాలోచకుని కర్తవ్యం.

ఆధునిక కవిత్వానికి వస్తే "ప్రతీయమానం" అనేక విధాలుగా వివేచన కందుతుంది. విషయం సందర్భం స్థితి సంఘటన పాత్ర సన్నివేశం మొదలుగా కల్పన వాస్తవికత ఆదర్శంపరంగానూ సామాజికం మానవ మనస్తత్వం మానవీయ భావనతోనూ సజీవమైన రూపంతో విశ్లేషణ కందుతుంది. ఒక ప్రమాణంలో ఉదాత్తతతో రామణీయకతను కలిగి ఉన్నప్పుడే 'ప్రతీయమానం' గౌరవ స్థానాన్ని పొందుతూంది. సహృదయ ప్రీతి పాత్ర మవుతుంది.

స్వేచ్ఛా కవిత్వానికి చెందిన ప్రజాస్వామ్య నిబద్ధమయిన 'హృదయ మేఘం'లో, మరో విధం "నుదురు పయి తళ తళ జారే, నాలుగు చినుకులతో, తలపులో కదలే నేరాన్ని మాయం చేస్తుంది. తలపయి జల జల రాలే పది చినుకులతో, చేతిలో ఆయుధానికి శాంతి తొడుగుతుంది." ఇది కృతిసమాప్తిలో సమాజ ప్రయోజన పరమయింది. మనిషిలో హృదయ మేఘంచేత కరుణ ఉదారత త్యాగంతో వర్తించే స్వరూపం, దాని ప్రభావం చిత్రితమయింది, పదాల సామాన్యమయిన అర్థం వెనుకనుండి ప్రస్తుత బీభత్స స్థితుల్లో, 'శాంతి' అవసరం దీని కనుగుణమైన పరివర్తనం అర్థాంతరాన్ని పొందుతుంది. ఆలోచనలో నేర భావన స్థానంలో స్నేహభావన, చేతిలో ఆయుధ చర్య అయిన హింస స్థానంలో ప్రేమకు దారితీసే హృదయంలో లేదా హృదయమనే లేదా హృదయమున్న మేఘ ప్రభావంతో శాంతికి మార్పు ప్రతీయ మానవత్వాన్ని కలిగింది. ఇది వ్యక్తి స్థాయిలోను సమాజ స్థాయిలోనూ ప్రజాస్వామ్య భావనతో స్వేచ్ఛాగుణంతోనూ ప్రతీయమానం కావడం విశేషం.

ప్రాచీన కావ్య శాస్త్ర విషయాల్ని ఆధునిక కవిత్వ సమాలోచనకు అన్వయించడం కుదురుతుందనీ, బాగా ఉపకరిస్తుందనీ, పరిపూర్ణతకు దారి తీస్తుందనీ చెప్పవచ్చు.

# 7. నిబద్ధత - ప్రజాస్వామ్య భావన

సాహిత్యంలో సృజన విషయంలో రచయితల నిబద్ధత బహువిధాలుగా ఉంటుంది. సామాజిక పరమయిందీ. రాజకీయపరమయిందీ. రెండూ కలిసిందీ. ఇంకా కళకు సంబంధించిందీ. అంతరంగానికి సంబధించిందీ. రచనలో అంతర్నిహితంగా ప్రభావాన్నీ కలిగి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో బహిఃప్రకాశాన్ని పొందుతుంది. ఇంకా బహిః ప్రకటన రూపంగానూ ఉండవచ్చు. ఇది ఇటీవల మరీ ప్రచారంలో ఉంది. అయితే సాహిత్యంలో కళాత్మక దృష్టితో మరీ గుప్తంగా కాకపోయినా సూచనగానయినా ఉంటేనే మంచిదనే అభిప్రాయమూ ఉంది. ఏమయినప్పటికీ కళాకృతికి క్షతి కలగనంతవరకు ఆమోదయోగ్యమే. సామాజిక / రాజకీయ ప్రయోజన పరిధుల్ని బాగా పెంచడం వల్ల "ప్రకటన" స్థితి ఏర్పడుతూంది. సామాజికంగా తీసుకుంటే ఉదాహరణకు "నిబద్ధత" ఈనాడు స్థానికమయిన సాధారణమయిన స్థాయి నుండి ప్రాపంచికమయిన విశ్వభావనా స్థాయి వరకూ వివిధ రచనల్లో ప్రాధాన్యం వహించే మాట యథార్థం.

పూర్వ సంప్రదాయ మార్గంలో దైవం – విధి – కర్మ – ముక్తి మొదలయిన భావ స్థానాల పట్ల నిబద్ధత ఉండేది. నేటి ఆధునిక మార్గంలో సమాజం శ్రమ పరివర్తనం ప్రగతి మానవ శ్రేయం మొదలయిన భావస్థానాల పట్ల నిబద్ధత స్పష్టంగా కనిపిస్తుంది. జీవిత చలనాన్ని బట్టి, సామాజిక గమనంలోని వివిధ స్థితిగతులూ, మానవీయ రూపాలూ, మానవ హక్కులూ, రాజకీయ ప్రభావాలూ మనిషి భవిష్యత్తు పట్ల ఆలోచన స్పష్టంగా పరిశీలనకు అందుతాయి.

అయితే స్థూలంగా చూస్తే అత్యంత ప్రభావ శీలం గల మార్క్సిజంతోపాటు ఆధునిక యుగంలో ప్రజాస్వామ్యం పట్ల నిబద్ధతా భావం రెండు ప్రవాహాలుగా వివేచనలో దర్శనమిస్తుంది. మార్క్సిజం ప్రభావాన్ని విస్మరించడానికి వీల్లేదు. ప్రజాస్వామ్యం అవసరాన్ని గుర్తు చేసుకోవలసి ఉంటుంది. ఈ రెండు భావధారలూ ఇప్పుడున్న స్థితిని బట్టి పరస్పరం సహకరించే శక్తులుగా ప్రజల అభ్యుదయ భావనతో విశ్వ శ్రేయస్సు లక్ష్యంతో వ్యవహరించడం మన లౌకికమయిన అనుభవంలో గమనించవచ్చు మంచి ఫలితాల్ని ఇస్తూన్న మాట కూడా వాస్తవమే. వర్తమానంలో అంతర్జాతీయ ప్రభావం నుండి తప్పించుకొని వేరుగా ఆలోచన చేయడమూ సాధ్యం కాని విషయం.

ప్రజాస్వామ్యం ముఖ్యంగా స్వేచ్ఛ – సమానత్వం సామాజిక న్యాయం – మనిషి పట్ల గౌరవం – ప్రగతి లక్ష్యంతో అనితరమయిన పాత్రను నిర్వర్తిస్తూంది మరీ ముఖ్యంగా భిన్న జాతులూ మతాలూ సంస్కృతులూ జీవన రీతులూ ఉన్న దేశాల్లో విజయవంతమవుతూంది – భిన్న భిన్నమయిన అభిప్రాయాల పట్ల మన్నన గుణంతో చర్చలూ పరస్పర సహకారమూ సహనమూ సమన్వయమూ వ్యవహార సరళిలో, సహేతుకమయిన పట్టు విడుపులూ ఉదారత విశ్వభావన మొదలయిన లక్షణాలతో కూడిన మనోరూపం నిస్సందేహంగా "శాంతి"కి సోపానాన్ని నిర్మిస్తుంది. అందరి అభిప్రాయాల్నీ గౌరవిస్తూ కలుపుకొనిపోయే "వ్యవహార కళ" ముఖ్యంగా సహకార సంవిలీన దృష్టీ, విశాల భావనతో సమస్యల పరిష్కారానికి దోహదం చేస్తుంది.

మార్క్సిజంలోని కఠోరమయిన భౌతిక వాస్తవ రూపాన్నీ, పరిగణనలోకి తీసుకోవడం వల్ల పరిష్కారానికి వైశాల్యం ఏర్పడుతూంది. దారి సుగమమవుతూంది. ప్రజాస్వామ్యంలో ఉండే Flexibility కారణంగానూ ప్రాధాన్య విషయంలో అధిక సంఖ్యాకుల ఆమోదాన్ని పొందుతూంది. పీడితుల పట్ల కేవలం సానుభూతిని కనబరచడమే కాక సక్రియతనూ చూపడం అవసరం. స్వేచ్ఛా స్వాతంత్ర్యాల పట్ల తత్పరత, మనిషి పట్ల గౌరవం, మానవ హక్కుల పట్ల శ్రద్ధ సామాజిక న్యాయం సమానవత్వం గురించి చింతనం ప్రజాస్వామ్యాన్ని అనుసరింపజేస్తూంది.

ఈనాడు రచయితకు నిబద్ధత అవసరం. ఇది నిర్వివాదమయిన విషయం. అయితే దాని ప్రయోజనం సంకుచితమయిన పరిధుల్ని దాటి విశ్వజనీనమయిన స్థాయిలో సమరసత్వానికీ శాంతికీ దారి తీయాలి. సంఘర్షణ తాత్కాలికం మాత్రమే. శాంతి ఒక్కటే చరమ లక్ష్యంగా ఉన్నపుడే సృజన రూపానికి ఉదాత్తత, ప్రయోజన విస్తృతి లభిస్తాయి.

పండిట్ జవాహర్‌లాల్ నెహ్రూను కలిసినపుడు ఒక అమెరికన్ ప్రొఫెసర్ ఒక అమూల్య వస్తువును బహుకరించాడు. అది నెహ్రూను బాగా ఆకర్షించింది. వెంటనే నెహ్రూ టేబిల్‌ను అలంకరించింది. నెహ్రూ రోజూ దాన్ని తదేకంగా చూచేవాడు. మానసికంగా గొప్ప ప్రేరణను పొందేవాడు. ఈ విషయాన్ని పండిట్ నెహ్రూ 19 డిసెంబర్ 1956న ఒక అమెరికన్ టెలివిజన్ ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు.

ఆ బహుమానం బ్రాస్‌తో మలచి చేసింది. అది అబ్రాహం లింకన్ కుడి చేయి.

నెహ్రూ మాటల్లో "చాల అందమయిందీ. బలమయిందీ. స్థిరమయిందీ. అయినప్పటికీ మర్యాదా రూపం కలిగిందీ సంస్కార శీలమయిందీ. నెహ్రూకు మానసికంగా ప్రేరణగా నిలిచింది. "It is a beautiful hand, strong and firm and yet gentle"-

ఇది నెహ్రూ మనస్సులో "Liberty, equality, dignity of Individual and freedom of human spirit": కు ప్రతీకగా ప్రజాస్వామ్య ప్రేరణ శక్తిగా నిలచింది.

భిన్న భిన్నమయిన అభిప్రాయాల్ని వివిధ జీవన స్థితుల్నీ ఆదర్శ పథాల్నీ కలుపుకొనిపోయే ప్రజాస్వామ్య నిబద్ధత – ఈనాడు రచయితకు సృజన కృతిలో ఆధునిక యుగ శక్తికి ప్రేరణ రూపంగా మరీ అవసరం. ఇది ప్రజాస్వామ్య దర్శనంతో స్వేచ్ఛా కవిత్వానికి అనితరమయిన శక్తినిస్తూంది, అన్వేషణకూ కొత్తదనంతో వైవిధ్యానికీ దారి తీస్తూంది. విశాల ప్రాతిపదికపై సమాజ ప్రయోజనాలకు తోడ్పడుతూంది.

# 8. స్వేచ్ఛా కవిత్వం - ఒక ఆలోచనా రూపం

స్వేచ్ఛా కవిత్వం ఆధునిక మయిన నూతన ప్రక్రియా విశేషంగా ఖ్యాత మయింది. స్వతంత్రమయిన అస్తిత్వంతో స్వేచ్ఛా పూర్ణమయిన కవుల వ్యక్తిత్వాలతో బహు దిశా నిర్దేశాలతో ప్రతిపాదనలతో సూచనలతో సంపన్న మయింది. ప్రజాస్వామ్య సమాజంలో వివిధ సామాజిక రాజకీయ సాంస్కృతిక తాత్త్విక పార్శ్వాల ఆలోచనా రూపాల్నీ క్రియా కలాపాల్నీ బింబిస్తూంది. ఈ ప్రక్రియలో సర్వత్ర స్వేచ్ఛ ఉంది. పాదాల నిడివిలోను సంఖ్యలోను మొదలుకొని విభాగాల (Units) విభజన వరకూ రూప పరంగా కవి అభిప్రాయానికి అనుగుణంగా నిబంధనలకతీతంగా ఆవిష్కృతమవుతుంది. తనదైన గతి విశేషంతో అభివ్యక్తి విధంతో నిర్మాణ గుణంతో కవి స్వయం ప్రేరితమయిన సృజన రూపాన్ని పొందడం దీని ప్రత్యేకత. ప్రేవెర్స్‌లో ప్రాసకు స్థానం లేదు. కాని 'వచన కవిత్వం'లో కొందరు దీన్ని పాటించడం జరిగింది. దేనిని కాదని వ్యతిరేకంగా ఉద్యమించిందో కొన్ని సందర్భాల్లో దానిలోని నియతమయిన ఒక ఆకర్షణకు లోను కావడం ఆశ్చర్యంగానే తోస్తుంది. (కుందుర్తి 'తెలంగాణా', తదితర కృతుల్లో కనిపిస్తుంది) ఇది ఆయా సందర్భాల్లో ప్రత్యేకమైన ప్రభావంకోసం అనుకోకుండా సహజంగా నప్పితే పరవాలేదు. కాని ముందుగా అనుకొనీ దానికోసం కొన్ని చోట్ల పడే పాట్లూ "వచన కవిత్వ" స్ఫూర్తికి క్షతి కలిగించేవిగా అవుతాయి. వీటి నుండి క్రమంగా ముక్తం కావడమూ స్వేచ్ఛా కవిత్వంలో జరుగుతూంది.

స్వేచ్ఛా కవిత్వం స్వయం ప్రేరిత మయిన సృజన రూపం. ఇపుడు విశాలమయిన క్షేత్రంగా పరిణమించింది. ఎన్నో భావ ధారలకు అవకాశంతో ప్రజాస్వామ్య భావనకు సంపూర్ణంగా ప్రాతినిధ్యం వహిస్తూంది.

1) దీని అంతర్లక్షణాన్ని గురించి మూల భూతమయిన అభిప్రాయం – నియమాలకూ నిబంధనలకూ అతీతంగా మానవ సంకల్ప శక్తితో ఉత్తమ మయిన ప్రయోజన తత్పరతతో విలసిల్లింది. కవిలో సృజన గతినీ నిర్మాణ శీలాన్నీ బట్టి స్వేచ్ఛామయంగా పరిణమించింది. ఈ కారణంగా సువిశాల మయిన దృష్టితో స్వేచ్ఛా కవిత్వ మన్న మాట సార్థకమవుతూంది.

2) దీని బాహ్య లక్షణాన్ని గురించి వివేచనంలో ఆధునిక యుగీనమయిన సామాజిక రాజకీయ స్థితి గతులకు ఆధార భూమిగా పనిచేస్తూంది. సృజన ప్రపంచంలో స్వేచ్ఛా

వాతావరణం పూర్వం నుండీ ఉన్నదే. కాలక్రమాన మార్పుల్ని పొందడం సహజం దేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత నెలకొన్న ప్రజాస్వామ్య వ్యవస్థలో అవకాశాలతో అవసరాల్ని బట్టీ వేగాన్ని అందుకుంది. ఎంతో వైవిధ్యాన్నీ పొందింది. సమాజంలో వచ్చే అనూహ్యమయిన మార్పుల్ని బట్టి; పూర్వం నుండీ సంక్రమించిన అక్కర లేని బరువుల్నీ, ప్రయోజనం లేని ఉపయోగం కాని విధానాల్నీ నియమాల్నీ, హేతు దృష్టితో వివేచన చేసి, పరిహరింపచడం జరిగింది. వీటిని అంటే బంధాలుగా మారిన వాటిని అతిక్రమించీ వదలేసీ ఉపక్రమించే మనో రూపం కవుల్లో సహజంగా ఉండేదే. ఇక్కడ మౌలికంగా పని చేసింది. వేగవంతంగానూ ప్రసరించింది. స్వతంత్రమయిన మార్గాన్నీ ఎన్నుకొనీ ప్రజాస్వామ్య వాతావరణంలో సహజమయిన ఆవిష్కారాన్ని కోరే స్వేచ్ఛలో "నిర్నిబంధ వ్యక్తిత్వ" వికాసం బాహ్య భూమిక పయి బాగా పని చేసింది.

3) ఇక అంతస్తత్వాన్ని గురించి – ఆలోచన చేస్తే అంతర్ బాహ్య లక్షణాలకు పై స్థాయిలో జీవవంతమయిన గుణం దృష్టికి వస్తుంది. దీనికి కవిలో సమాజ పరిణామంలో యథార్థ మయిన జీవన స్థితి గతుల పట్ల అభిలాషతో అనుభూతితో ఆలోచన అన్వేషణ దర్శనంతో కూడిన ఆంతర వ్యక్తిత్వమూ తోడయింది. సద్యోజాత మయిన ఆవిష్కారానికి ప్రాధాన్యం కలిగింది. కళాత్మకతకూ కామనీయకతకూ దారి తీసింది. ఈ అంశాలు "వచన కవిత్వ" పద్ధతికి విరుద్ధమైనవి. ఇలా విశిష్టమయిన 'అస్మిత' పై ప్రత్యయం ఆధార శక్తిగా పని చేసింది. కవిలో అంతస్తత్వాన్ని గ్రహించి, ముఖ్యంగా కృతిలో జీవ ప్రసారాన్ని పొందిన విధాన్ని జాగ్రత్తగా పరిశీలించవలసి ఉంది.

1) అంతర్ 2) బహిర్ 3) అంతస్తత్వ స్థాయిల్లో – సమాలోచనం, ఈనాడు సామాజిక రాజకీయ తాత్త్విక సాంస్కృతిక చింతనతో వెలువడుతూన్న స్వేచ్ఛా కవిత్వానికి అత్యంతమూ అవసరమయింది.

ఏ ఆ కవికి ఆ కవి తనలో ఆవేశానికి గురిచేసిన లేదా తాను ఎన్నుకొన్న సందర్భాల్ని బట్టీ ఏర్పడే మానసిక స్థాయిలో సృజనావిష్కారం జరగడం ఉన్నదే. ఇదో సామాన్య విషయంగా పైకి కన్పించినప్పటికీ వస్తువూ – కళాత్మకత – ప్రయోజనమూ – దిశానిర్దేశమూ పరంగా సంపూర్ణ స్థితిలో స్వేచ్ఛా కవిత్వానికెంతో వైవిధ్యాన్ని సమకూరుస్తూంది. కవుల్లో ఎవరికి వారు ఏ రచనకు ఆ రచన లోనూ తాము కోరే విలువలపై శ్రద్ధతో ప్రయోజనాత్మకమయిన పాత్రను నిర్వహించడం పేర్కోదగింది.

సాధారణంగా సృజన సమయాల్లో ఉద్గమించే కవి వ్యక్తిత్వం వేరు. మిగతా సమయాల్లో ప్రవర్తించే ఆ మనిషి వ్యక్తిత్వం వేరుగా ఉంటుంది. రెండింటికి మధ్య విభజన రేఖ అనివార్యమవుతూంది. ఎక్కడన్నా లేదా అక్కడక్కడా రెండింటికీ మధ్య ఎక్కువ తక్కువ ప్రసార రేఖలు ఉంటే ఉండవచ్చు. అలా ఉండడమూ కొన్ని సందర్భాల్లో సహజం కూడా ఇది అంతర్ బహిర్ వ్యక్తిత్వాల్ని బట్టి ఏర్పడుతుంది. ఒకవేళ లేని పక్షంలో కనీస స్థాయిలో దీన్ని విస్మరించడం సముచితం. సరియైన సమాలోచనకిది ఒకటే మార్గం. అంటే కృతి పైనే దృష్టిని కేంద్రీకరించ వలసి ఉంటుంది. కవి జీవితం దైనందిన వ్యవహారాలూ సృజన రూపమూ వాటి ప్రభావ పర్యవసానాలూ చర్చా సందర్భంలో పరిశీలనకు వచ్చే అంశాలు. ఈ వెలుగులో అంతర్ బహిర్ లక్షణాలతో అంతస్తత్వ చైతన్యంతో వర్తించే జీవిత రూపానికి సజీవమయిన సృజన బింబంగా స్వేచ్ఛా కవిత్వం గోచరిస్తుంది. ఉత్తమమైన ప్రక్రియ గానూ నిలిచింది.

ఈ చివరి అంశాన్ని ప్రస్తుత పరిస్థితులకు అన్వయిస్తే “వచన కవిత్వం” అన్న మాట కన్నా “ స్వేచ్ఛా కవిత్వం” అన్న మాట సుసంగతంగా కనిపిస్తుంది. ఎన్నో అభిప్రాయ విభేదాల్ని మన్నిస్తూ, వైవిధ్యాన్ని గౌరవిస్తూ వైశాల్యాన్నీ ఔన్నత్యాన్నీ లోతునూ సంతరించుకుంది. అనేకమైన సిద్ధాంతాల స్ఫూర్తినీ దార్శనిక తేజాన్నీ ఇముడ్చుకుంది. ఈ ప్రకాశంలో “వచన కవిత్వం” పరిధి దాని వ్యవస్థాపకుల అభిప్రాయాల్ని బట్టీ ఆచరణలో ఉన్న దాన్ని బట్టీ వారు పరిగణించే దాన్ని బట్టీ సామ్యవాద భావ జాలానికి మాత్రమే వేదిక అయింది. ప్రేరణ శక్తిగా పని చేసింది. ఈ విధంగా “వచన కవిత్వ”మన్న మాట పరిమితమయిన ప్రయోజన రూపాన్ని పొందడం పరిశీలనకందుతుంది.

తనలో బహు విధాలయిన భావ జాల రూపాల్ని సంవిలీనం చేసుకోనే శక్తితో ప్రేరక స్థానంగా నిలిచే “స్వేచ్ఛా కవిత్వం”లో ప్రాధాన్య వివక్షచేత పరిశీలనకు అర్హమయిన దార్శనిక దిశా రూపాలు ఈ సందర్భంలో గుర్తించడం అవసరం.

1) నిర్దిష్ట మయిన ఉదార ప్రజా స్వామ్య లక్షణం కలిగిందీ.

2) మార్క్స్ మరియు ఎంగెల్స్ (విప్లవ) సామ్యవాదం ఆదర్శంగా లక్షిత మయిందీ.

3) సాంస్కృతిక మయిన కళాత్మకతతో సామ్యవాద సిద్ధాంత సమాకలనాన్ని పొందిందీ.

4) పలు సిద్ధాంతాల్లో తనకు నచ్చినవీ అవసరమనుకున్నవీ కొన్ని అంశాల సమీకరణంతో సమన్వయాన్ని కోరేదీ.

5) భారతీయ సాంస్కృతిక చేతనతో ఆత్మ గుణంతో సర్వశ్రేయో భావనతో కళాత్మకమయిన విలువల్ని ప్రతిపాదించేదీ.

6) "అనుభూతి" కేంద్రంగా సామాజిక చిత్రణాన్ని సూచనగానో నేపథ్యంగానో ప్రవృత్తమయిందీ.

7) సామాజిక పరివర్తనలో దళిత – ముస్లిం – మైనారిటీ వాదాల్ని ప్రతిఫలించేదీ.

8) స్థానికం నుండి అంతర్జాతీయం దాకా పర్యాప్తమయిన స్త్రీ వాదాన్ని, తత్వాన్నీ ప్రకాశ మానం చేసేదీ

9) ప్రకృతి – మార్మికత – వ్యక్తి జీవితంతో ముప్పిరిగొన్న చింతనా ప్రసారాన్ని పొందిందీ.

10) కేవలం మానవుడూ – మానవత పై దృష్టితో సామాజిక వాస్తవికతల్ని సూక్ష్మంగా స్పందించేదీ.

అయితే దేనికదిగా కాక వీటిలో కొన్ని అంశాల కలయికతో ఏర్పడే స్వరూపమూ ఆయా కవుల కృతుల్లో స్పష్టంగా కన్పిస్తుంది. జీవితంలో వివిధ సందర్భాల్లో స్పందించే కవి నుండి, వివిధ పార్శ్వాలకు సంబంధించిన అంశాలు అవతరించడమూ జరుగుతుంది స్వేచ్ఛా కవిత్వంలో వీటిలో అన్నిటికీ అవకాశం ఉంది. విస్తరించే విశాలమైన స్వరూపంలో 1) ప్రక్రియా రూపం 2) విషయ ప్రాధాన్యం 3) కళాత్మకత 4) దిశా నిర్దేశం అన్న విషయాల్లో స్పష్టమయిన అవగాహనతో ఉపక్రమించడం దీని లక్షణం. ఈ విశ్లేషణం మునుముందు సమాలోచనానికి ఎంతో ఉపకరిస్తుంది కూడా.

ఈ కారణంగా ఎ) వివిధ దిశా రూపాల్ని మన్నించడం బి) సముచిత మయిన అర్థమయిన స్థానాల్ని కల్పించడం సి) వివేచనకు ప్రోత్సహించడం డి) కొత్త సమాలోచనానికి దారి తీయడం ఇ) ఉదార ప్రజా స్వామ్య భావనతో స్వేచ్ఛా స్పందనలకు ప్రాధాన్యం ఇవ్వడం – అనేవి "స్వేచ్ఛా కవిత్వం" అన్న మాటకు అనితరమయిన విలువనూ ప్రయోజనాన్నీ చేకూరుస్తున్నాయి.

సాహిత్య చరిత్రలో మును ముందు దీన్ని గురించి సమాలోచనానికి అర్హతను కలిగించడమే కాక, దీని సామంజస్యాన్నీ సహేతుకంగా స్థిరపరచే ప్రయత్నాన్నీ ప్రతిపాదించడమే ప్రస్తుతోద్దేశం.

# 9. స్వేచ్ఛా కవిత్వం - ప్రజాస్వామ్య ప్రకాశం

స్వేచ్ఛా కవిత్వం ప్రధానంగా సామాజిక మానవీయ వస్తు గౌరవం కలిగింది. దీనికి తోడుగా కవి దృష్టితో రాజకీయ స్పృహనో పరిచయాన్నో అవగాహననో సంబంధాన్నో కలిగిన ప్రమేయాన్ని అనుమతిస్తుంది. ఇంకా తాత్త్విక ఛాయలకూ అవకాశం లభిస్తుంది. ఇవి కవి అభిలాషను బట్టీ ఉద్దేశాన్ని బట్టీ ప్రభావ రూపాల్ని పొందుతాయి. ఇదీ స్వేచ్ఛా కవిత్వంలోని విశాలమయిన ప్రాతిపదిక. కవి హృదయం సమాజానికి సంబంధించిన ఏ విషయానికీ దూరంగా ఉండదు. ఇవి సంపూర్ణ మయిన కవి అస్తిత్వంలో భాగాలు. అన్నీ ఒకే చోట తటస్థపడక పోవచ్చు. అవసరాన్ని బట్టి తగిన విధంగా ఉపయోగం లోకి రావడం జరుగుతుంది. కవిలో అనేక మయిన కారణాల వల్ల కొన్నిటిపట్ల ఒక్కొక్క స్థాయిలో ప్రత్యేకమయిన శ్రద్ధ ఉండడం జరుగుతుంది. వీటిలో రాజకీయాలకు సంబంధించిన ఆలోచన కూడా ఉండవచ్చు. ఒక ఆదర్శమో, సిద్ధాంతమో వాదమో దేనికి సంబంధించిన విషయమయినా ముఖ్యంగా రాజకీయాలకు సంబంధించిన అంశాలు సృజన కళను మీరకుండా పరిమితుల్లో ఉండడం అవసరం. కవిత్వ స్థాయికి భంగం కలగ నంతవరకు ఆమోదయోగ్యాలే. ఇది నిర్వహణ శిల్పంలో భాగం కావలసి ఉంటుంది. ఏకాకృతిలో సముచితంగా ఇమిడి పోవలసి వస్తుంది. ఇది కవి ప్రజ్ఞపై ఆధారపడి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఇవి ప్రత్యక్షంగానో పరోక్షంగానో సామాజికమయిన మానవీయమయిన ప్రధాన విషయానికి బలాన్ని చేకూరుస్తాయి. అలాగే తాత్త్వికమూ, గభీరతను ప్రసాదిస్తుంది. దీన్ని నిర్వహణ కళలో అంతర్భవింప జేయడమొక రచనా శిల్పం. రాజకీయం గమ్యానికి భౌతికమయిన ఆదర్శ స్ఫుటతను చేకూరుస్తుంది. తాత్త్వికం ఉద్దేశానికి ఆంతరమయిన విశాలతను సిద్ధింపజేస్తుంది. ఒక ఆదర్శం లేదా సిద్ధాంతం లేదా వాదం పట్ల నిబద్ధతతో కవి తన జీవితంలో క్రియాత్మకమయిన పాత్రనూ పోషించవచ్చు. రాజకీయమూ తాత్త్వికమూ రెండూ సమాజంలో వ్యక్తి ఉన్నతికీ ఉదాత్తతకూ అవసరమయినవీ. కవికి రాజకీయాలతో సంబంధం ఉండవచ్చా? ఉండకూడదా? అన్న ప్రశ్నకు ఆస్కారం లేదు. ఇది కవిలో సృజన స్వేచ్ఛతో పాటు వ్యక్తి స్వాతంత్ర్యానికీ సంబంధించింది. ప్రజాస్వామ్య భావ రూపానికి (concept) ప్రాతినిధ్యం వహించే స్వేచ్ఛా కవిత్వంలో ఏ విధమయిన ఆలోచన కయినా తలుపులు తెరచే ఉంటాయి. అందునా సమాజానికి సంబంధించింది సులభంగా ప్రవేశిస్తుంది.

ఆధునిక సమాజంలో జీవితం వలెనే అవసరాల దృష్ట్యా సామాజిక మానవీయ చింతనలో కొత్త అంశాల కలయికతో కొత్త పార్శ్వాలేర్పడతాయి. దీన్ని కాదనేందుకు వీలు లేదు. వ్యక్తి స్థాయిలో పరిమితిలోనూ సమాజ స్థాయిలో విస్తృత రూపంలోనూ ఉంటుంది. అందువల్ల దీని స్వరూప స్వభావాలు ప్రభావ కారణాలు ప్రయోజనాలు గురించి ఆలోచన జరగవలసి ఉంది. ఇలాంటిదే తాత్త్వికత, ఒకటీ. కవిత్వంలో ఇవి పరిమితమయిన స్థాయిలో ఉపకారంగానే పరిణమిస్తాయి. ఆలోచనలకు పూర్ణత చేకూరుస్తూ కవిత్వ క్షేత్ర పరిధిని పెంచడం జరుగుతుంది. పరిమితుల్ని అధిగమించినపుడే దీని పట్ల వ్యతిరేకత ఏర్పడుతుంది.

ప్రజాస్వామ్య దార్శనికత సమాజంలో ఎప్పటికపుడు వచ్చే కొత్త భావజాలానికి స్వేచ్ఛా కవిత్వంలో వీలు కల్పిస్తుంది. జీవిత వికాసాన్నీ సమాజ పురోగమనాన్నీ ప్రోత్సహిస్తుంది. ప్రజాస్వామ్య దార్శనికత చేత భౌతిక భావ వాదాలు దేనికదిగా కాక సమన్వయంతో రాణిస్తాయి. ఆధునిక యుగంలో అన్నిటికీ విశాల వేదికగా స్వేచ్ఛా కవిత్వం ఉపయోగ పడుతుంది. ఇది గణనీయమయింది. ఎప్పటినుండో చారిత్రక నేపథ్యంతో నేటి సమాజంలో తటస్థ పడేవీ సమస్యలెన్నో! కవి సామాజిక దృష్టి నుండి తొలగించే వీలు లేనివీ, వీటికి సంంధించిన పరిష్కారంలో అభిప్రాయభేదాలూ! సహజం. వర్గ విభేదాలూ సమస్యలు ప్రకోపించే స్థితులూ! కలహం విధ్వంసం హింస కల్లోలం సందర్భాలకు దారి తీయకుండా సహనం సమన్వయం నిర్మాణం మానవత శాంతి ఛ్చాయల్లో పరివర్తన ప్రజాస్వామ్య విధానం. ఈ ప్రక్రియ అనుకున్నంత సులభం కాదు. అయినప్పటికీ ఈ శాంతి మార్గంలో సమాజం పయనించవలసి ఉంది. "నా న్యః పన్థా అయనాయ విద్యతే", మరో ఉత్తమ మార్గం లేదు. దీనివల్ల తక్కువ నష్టం, దీర్ఘకాలంపై ఎక్కువ లాభం కలుగుతుంది. సమస్యల పరిణామంలో గుర్తింపు పరిశీలనం చర్చ ఏకాభిప్రాయం మెజారిటీ అభిమతం మొదలయిన పద్ధతుల్ని అనుసరించి పరిష్కార ప్రయత్నం జరుగుతుంది. సమస్యపట్ల అవగాహన వివేచన శాంతి సంకల్పం అవసరమవుతాయి. అభిప్రాయ భేదాల్ని తగ్గించేందుకూ సమస్యను తీర్చేందుకూ చేసే ప్రయత్నంలో ఉదారత మానవత బలంతో ప్రజాస్వామ్యం ఉత్తమ సాధనంగా నిలుస్తుంది. సమాజంలో వ్యక్తి స్వాతంత్ర్యం సమభావం సమన్యాయంతోనూ స్వతంత్రమయిన న్యాయవ్యవస్థతోనూ తృప్తికరమయిన ఫలితాల్ని పొందడం జరుగుతుంది. ఎక్కడయినా పొరపాటు జరిగితే సరి చేయడానికి మానవ హక్కుల కమిషన్ మొదలయిన ఉపాంగాలు క్రియాత్మక (active) మయిన పాత్రను పోషించడమూ జరుగుతుంది.

ఇవి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే సహకార (complimentary) వేదికలు గానూ రాణిస్తున్నాయి. ప్రజాస్వామ్య విలువల్ని కాపాడే రాజనీతితో పాటు రూల్ ఆఫ్ లా (rule of law) కూ ప్రాథమిక హక్కుల (fundemental rights) కూ భంగం కలగకుండా చూచే పాలనా నీతి అవసరం. అయితే వ్యక్తి బాధ్యతనూ విస్మరించడానికి వీలులేదు. ఇది ఎంతో గురుతరమయిందీ. దీని విజయానికి ప్రజాస్వామ్య మనోరూపం (democratic mind) చేతన (democratic spirit) చాలా అవసరం. ఈ ప్రాతిపదికపై నిలిచిందీ స్వేచ్ఛా కవిత్వం. ప్రజాస్వామ్య హృదయాన్ని స్పందిస్తుంది. సమాజ హితమూ ప్రయోజనముతో పాటుగా ప్రగతిశీల లక్ష్యం కలిగిందీ. ఆధునిక కవిత్వ చరిత్రలో బలమైన ఆధారతలంతో ఆకర్షిస్తుంది.

స్వేచ్ఛా కవిత్వంలో భావ రూపాలూ ప్రతీకలూ అభివ్యక్తిలో చేతన మరియు ఉపచేతన స్థితులనుండి ఆవిష్కారాన్ని పొందడం ఒక ప్రత్యేకత. ఇవి రచనలో పొరలుగా స్థాయి భేదాల్ని కలిగి ఉంటాయి. బాహ్యమయిన వర్ణనంతో పాటు ఆంతరమయిన మనోభావ చిత్రణకు ప్రాధాన్యం ఉంటుంది. శబ్దానికుండే నిఘంటువు అర్థాన్ని దాటి భావ ప్రకాశాన్ని పొందుతుంది. ఈ ప్రకాశంలో స్మృతులు దృశ్యాలు ఆలోచనలు కదలుతాయి. ఉత్తమ కవిత్వంలో శబ్దార్థాన్ని అధిగమించే భావ ప్రసారానికి చివరిమాట అంటూ లేదు. ఆ తరువాత కాలంలో సహృదయుల స్పందనతో కొత్త అభిప్రాయాలూ వివరణలూ వెలువడుతాయి. ఇంకా సంభాషణం ఆంతర భాషణం కథనంలో సంక్షిప్తత, భావ సాంద్రతతో మనస్తత్వ పరమయిన అంశాల విస్తరణమూ కనిపిస్తుంది. కాలం గడిచే కొద్దీ ఈ లక్షణం అభినవత్వాన్ని పొందుతుంది. విశ్వ హృదయాన్ని స్పృశిస్తుంది. తరం తరువాత తరం పైన క్రమక్రమంగా కవి తెర వెనక్కి వెళ్ళడం జరుగుతుంది. కృతి తెరముందుకు వస్తుంది, అదే మిగులుతుంది. కొత్త దారుల్ని చూపిస్తుంది. కొత్త స్థితుల్ని ప్రేరేపిస్తుంది. ప్రయోజన విస్తృతి క్షేత్రం పెరుగుతుంది. విషయం ఎట్లా ఉన్నా సృజన కళలో సమగ్రత ఉదాత్తత చేతనే కాలంపై నిలిచే సజీవత్వాన్ని పొందుతుంది. ఇది సృజన స్వేచ్ఛ వల్లనే సాధ్యమవుతుంది. దీనికి దార్శనికత అవసరం. అది ఆధునిక యుగంలో ప్రస్తుతం అవసరాల దృష్ట్యా ప్రయోజనాల్ని బట్టి ప్రజాస్వామ్యం కావడం, స్వేచ్ఛా కవిత్వంలో విశేషం.

భౌతిక భావ వాదాల సమన్వయంతో పాటు స్వేచ్ఛా కవిత్వంలో తాత్త్విక ఆధ్యాత్మిక ఛాయలకూ కొంత అవకాశం (space) లభించడం కవి దృష్టిని బట్టి ఉంటుంది. సమాజ సమగ్రతనూ మానవ పరిపూర్ణతనూ భావింపజేస్తుంది. అయితే ఇవి ఎట్టి

పరిస్థితుల్లోనూ కవితా స్వరూపాన్ని కప్పేయ కూడదు. కవిత్వ కళకు ఏ విధంగానూ భంజకం కారాదు, ప్రాధాన్యం తగ్గేదిగా ఉండరాదు. అపుడే కవిత్వంగా ఉత్తమ స్థాయికి చేరుతుంది. మన్ననల్ని పొందుతుంది, రాణిస్తుంది.

ప్రజాస్వామ్య దార్శనికతకు ప్రాతినిధ్యం వహించే స్వేచ్ఛా కవిత్వం (1) కవిదృష్టి – వ్యక్తిత్వం – కృతి; (2) సమాజం ఆదర్శం; (3) మానవీయం – విశ్వభావన; (4) ప్రకృతి నేపథ్యం; (5) మనస్తత్వ ప్రకాశనం; (6) అభివ్యక్తి కళ – నిర్వహణ శిల్పంతో కూడిన సృజన రూపం సమాలోచనా స్థాయినీ పరిధినీ ప్రయోజనాన్నీ పెంచుతూంది. ఈ అంశాలు అవసరమయిన స్థాయిలో తగిన పాళ్ళలో కలిసి కవి వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి. దాని కనుగుణంగా కవిత్వం అవతరిస్తుంది. ఒక్కొక్క కవిని వేరువేరుగా గుర్తించే ఆనవాలు (Identity) ఈ అంశాల సమీకరణ రూపంతోనే సిద్ధిస్తుంది.

స్వేచ్ఛకు అవకాశాన్ని ఇస్తూ వ్యక్తి స్వాతంత్ర్యాన్ని మరీ ముఖ్యంగా సామాజిక మానవీయ వస్తు ప్రాధాన్యంలో వీలును బట్టి తాత్త్విక రాజకీయ భావ స్పర్శతో ప్రజాస్వామ్య ప్రకాశ రూపం, స్వేచ్ఛా కవిత్వం.

"ఎద ఎదను స్పృశిస్తూ విశ్వ తలంపయి
అస్తమయం లేని ప్రజాస్వామ్య బింబం"

సమాజంలో ప్రజాస్వామ్య ప్రవేశం మానసికంగా వీడదు. దాని ఆకర్షణ అటువంటిది. అది స్వేచ్ఛ, సమభావం, సమన్యాయం మొదలైన గుణాల చేత ఏర్పడింది. ఈ తేజో రూపానికి విరామం లేదు. స్వేచ్ఛా కిరణాలతో ప్రకాశిస్తూ ప్రతి వ్యక్తికీ వెలుగునందిస్తుంది.

"చీకటి రాజ్యానికి అస్తమయంతో పనిలేదు
మనిషినుండి చిమ్మే నీలి చిత్రం చాలు"

ప్రకృతి నేపథ్యంతో ఇది ఈనాటి సామాజిక స్థితి రూపం. చీకటి రెండు విధాలు. ఒకటి బాహ్యమయింది... కళ్ళకు కనిపించేదీ, సూర్యుని అస్తమయంతో ఏర్పడేది. ఇంకొకటి ఆంతరమయిందీ, మనసుకు కనిపించేదీ... దీనికి ప్రకృతి గతమయిన సూర్యాస్తమయంతో పని లేదు. మనిషిలో ఉన్న క్రౌర్యం దౌష్ట్యం నైచ్యంతో కూడిందీ. ఇది చాల ప్రమాద కరమయిందీ. ఇది నీలిరంగులో చిత్రం! పైకి చిమ్ముతుంది. ఎప్పుడు బయటికి చిమ్మేదీ తెలియదు. దీని నుండి బయట పడడానికి, దీన్ని పైకి రాకుండా చేయడానికి నైతికమైన భావ పరివర్తనం అవసరం. ఇది దయ ఉపకృతి

ఉదారత మొదలైన ఉత్తమ గుణాలచేత సాధ్యమవుతుంది. ఇది మనిషి లోపల జరిగే మార్పుతో సత్ఫలితాన్ని ఇస్తుంది.

> "ఆగని స్వేచ్ఛతో హక్కుల కయి వీథులలో
> వంచితులూ పీడితులూ! జనసందోహం!"

ఇదొక వర్తమాన బాధాకరమైన దృశ్యం. సమాజంలో మోసాలకు గురి అయినవారూ కష్టాల పాలయిన వారూ స్వేచ్ఛలో సమానమైన హక్కులకై వీధుల్లోకి రావడం జరిగింది. సమాజంలో బలరహితులయినా మానసికంగా బల సహితులుగా ఉద్యమించడం కనిపిస్తుంది.

> "దేశం నుండి దేశానికి
> జీరాడే కోర్కెల అంచులతో
> జరుగుబాటుకో! మెరుగుబాటకో
> తరలే జీవన పదయుగళం"

పూట గడవడం కష్టంగా ఉన్న వారూ ఉన్నారు. ఎక్కువ సుఖ సంతోషాల్ని పొందగోరేవారూ ఉన్నారు. ఒక చోటునుండి మరోచోటికి! ఒక దేశం నుండి మరో దేశానికి కోర్కెలు తీరేందుకు! పయనం ఎప్పటినుండో మానవ చరిత్రలో! జరుగుతూంది. జీవిక ముఖ్యమవుతూంది.

సమాజంలో ప్రతి ఒక్కరూ వెలుగు గురించి మంచితనంపై కోరికతో మాట్లాడేవారే! కానీ అనుభవంలో స్వార్థ చింతనతో చీకటినే వరించేరు! చీకటిలో చేరేరు! చీకటిని కప్పుకునేరు! దీనినుండి విమోచనానికి ఉపదేశాలెన్నో వినేరు!

> "వెలుగు అవసరం గురించి మాట్లాడే వ్యక్తి
> చీకటిని వరించేను, తెలిసో తెలియకో"

ఒకపుడు తెలిసీ స్వార్థంతో, ఒకపుడు తెలియక ఆలోచన లేక దూరదృష్టి లేక వివేకం లేక చెడును ఆశ్రయించడం జరుగుతూంది. ఇది వ్యక్తి జీవితంలోనే కాకుండా సమాజానికీ హాని చేకూరుస్తూంది.

"డబ్బు" జీవితంలో అన్నిటికీ ముఖ్యమైంది. దీని కోసం మనిషి చేసే పనులు ఎన్నో! మంచివీ, చెడువీ! ప్రకృతి దృశ్యాన్ని అనుభవించి సంతోషంలో ఇంటి ముందు బయట కుర్చీలో కూర్చొని పైకి చూస్తే, కఠోర వాస్తవం! కనిపిస్తుంది.

"పర్సునుండి జారిన నాణాల్లా చుక్కలు
టార్చ్‌లైట్ ఫోకస్‌లో వెదకే చంద్రుడు"

రాత్రి దారిద్ర్యానికి చిహ్నం. చంద్రుడంతటి వాడు! డబ్బు కోసం! చేసే ప్రయత్నం భావరూపాన్ని పొందింది. ప్రకృతి భూమికలో జీవిత వాస్తవం కవితాకృతి కలిగిందీ దృశ్యం.

"ప్రతి ఇంట్లో దీపం వెలగాలనీ కోరిక
అసలు ఇల్లు అనేది అంటేగా!"

అత్యంతమూ సహజమైన అవసరమయిన కోరిక తీరని వారూ ఉన్నారు. కనీస స్థాయిలో జీవితం ఎరగని వారూ ఉన్నారు. దారిద్ర్యం యొక్క పరాకాష్టలో పాలకుల బాధ్యతనూ సమాజం అనాసక్తినీ సూచిస్తూంది.

"గురి పెట్టిన ఆయుధాన్ని దించడం
అది ఎత్తినంత సులభం కాదు"

మనిషిలో రణభావం శత్రుచర్య ఎప్పటిదో! ఇప్పటికీ, ఒక విషమ స్థితిలో ఆశ్రయించిన ఆయుధాన్ని వదలం కష్టమవుతూంది. దానివల్ల అపాయభయం పీడిస్తుంది, అభిమానం అడ్డు వస్తుంది. మనోరూపం శాంతి చర్యకు సిద్ధం కాదు.

"జీవితంలో ఎన్నిసార్లు పూల దండ ధరించినా
ఒకసారి గుచ్చుకున్న ముల్లు బాగా
జ్ఞాపకముంటుంది"

జీవితంలో ఎన్ని సుఖాలో! సంతోషాలో వచ్చి పోతూ ఉంటాయి. ఈ మధ్య పడిన కష్టం బాధ మనస్సుపై గాఢమైన ముద్ర వేస్తుంది. అది సులభంగా చెరగిపోదు. మరపున బడదు. జ్ఞాపకంలో నిలుస్తుంది. దీనివల్ల గుణపాఠమూ లభించవచ్చు.

"అక్షరమెపుడూ గెలుపునే నిలుపుతుంది
మెలకువలో సజీవ రూపాన్ని ప్రసరిస్తుంది"

అక్షరం మనిషి ఉన్నతినీ విజయాన్నీ స్థాపిస్తుంది. పురోగమనాన్ని లక్షిస్తుంది. భౌతిక మానసిక స్థాయిల్లో అక్షరం ప్రభావం అనితర మయింది. ఎప్పుడూ జీవవంతమైన రూపాన్ని లోపల అవతరింప జేస్తుంది. శక్తివంతమైన జీవితాన్ని బయట నడిపిస్తుంది.

"కృతిలో కవి బింబం కాలాని కతీతం"

కవిరూపం అక్షర పంక్తికే పరిమితం కాదు. ఆ పంక్తిని దాటి భావ జగత్తును పొందుతుంది. ఇది కాలానికతీతమైన తేజో రూపం. ప్రతి హృదిలో దిగుతుంది. తరంనుండి తరానికి సృజన రూపాన్ని అవ్యయంగా ప్రసాదిస్తుంది. ఇది మెలకువలో జరిగే పని. స్వేచ్ఛావాతావరణంలో అస్తిత్వంతో ప్రజాస్వామ్య ప్రభావంతో సామాజిక పురోగమనం మానవీయ వికాసం కోరేదీ. స్వేచ్ఛా కవిత్వానికి ప్రకాశ రూపాన్ని ఇస్తూంది.

ఈ సందర్భంలో స్వేచ్ఛా కవిత్వంలో గమనించ దగిన ఒక విషయం (1) ప్రజాస్వామ్య దార్శనికత పట్ల నిబద్ధత కలిగింది, ఒక విధం; (2) ప్రజాస్వామ్యంలో లభించే అవకాశాలతో స్వేచ్ఛా కలిగింది మరో విధం. మొదటి దానిలో ప్రజాస్వామ్య పథంలో ఆదర్శం స్ఫుటంగా ఉంటుంది. లక్ష్యం స్పష్టంగానూ ఉంటుంది. రెండోదానిలో ప్రజాస్వామ్య ప్రభావంతో స్వేచ్ఛా చలనం కనిపిస్తుంది.

ముఖ్యంగా కవిత్వంలో ఒక స్థితికి శీఘ్రమైన స్పందనం, ప్రతిక్రియ, అనుభూతి, ఆవేశం, ప్రేరణం, లక్ష్యంతో కూడిన తత్వం వల్ల ఇతర ప్రక్రియల కన్నా ముందుగా ఎక్కువమందిలో రచన అవతరిస్తుంది. ఎంతో వైవిధ్యంగా విలసిస్తుంది. ఈ రోజుల్లో పత్రికలూ ఎంతో సహకరించడం జరుగుతూంది. ఎప్పటికప్పుడూ వార్తా ప్రాధాన్యం కలిగిన స్థితిగతులకు స్పందన చిత్రణం కలిగిన కవిత్వానికి వేదికనూ కల్పిస్తున్నాయి. ఇవి మానవీయం, మానవత, జీవితం, సమాజం, వాస్తవికం, ఆదర్శంతో ఏర్పడే విశాలమైన వస్తు, భావ, రూపాలకు సంబంధించిన ప్రధానమైన ప్రవాహధారకు సమాంతరంగా చరిస్తూ కనిపిస్తాయి.

(1) సామాజికం (2) రాజకీయం (3) తత్కాల విషాద స్థితిగతులు, రైతుల కార్మికుల పేదల కష్టాలు, నష్టాలు, సమస్యలు, ఆత్మహత్యలు (4) స్త్రీల దళితుల వాదాలు, వివాదాలు, (5) ప్రాంతీయమైన ఉద్యమాలు, అనేకం ప్రత్యేకంగా వస్తువైవిధ్యాన్ని కలిగిస్తున్నాయి. అయితే ఇవి ప్రధానమైన ప్రవాహధారకు చెందిన కవిత్వంలో భాగంగానూ ఉండవచ్చు. మొత్తం మీద అవయవిలో అవయవ స్ఫూర్తిని కలిగించేవిగా కావ్య నిర్మాణంలో అంతర్భవిస్తాయి. ఏ కవిత్వానికయినా సృజన చేతనతో పాటు అభివ్యక్తి కళను పొందిన రూపం సాధారణ విషయమైనప్పటికీ (1) దృష్టికోణం (Point of view); (2) ప్రకటన (projection) రూపం; (3) ప్రభావ విధం; (4) ప్రయోజన దిశ; (5) సామాజిక వాస్తవికత; (6) జీవితచిత్రణం అంశాలతో కూడిన సముచితమైన విశిష్టత కవిత్వంలో ప్రత్యేకతలకు దారితీస్తుంది.

సమాలోచనా ప్రక్రియలో స్వేచ్ఛాకవిత్వంలో ఇప్పటికీ జరిగిందీ జరుగుతోంది చాలాభాగం browse criticism (పైపైన sample పద్ధతిలో జరిగే సమాలోచనం) మాత్రమే. స్వేచ్ఛా కవిత్వంలో (1) ప్రజాస్వామ్య లక్ష్యం కలిగిందైనా; (2) ప్రజాస్వామ్య ప్రభావం లోనిదైనా వివిధాంశాల్ని గుర్తించి విశ్లేషించి సహేతుకంగా వివరించే సమన్వయంతో వ్యాఖ్యానించే సమాలోచనం బాగా జరగవలసి వుంది. ఇది ఒక ప్రతిపాదనం మాత్రమే.

# 10. స్వేచ్ఛా కవిత్వం - మానవీయ యుగం

**ఏ కాలమయినా** ఏ దేశమయినా ఏ జాతి వ్యక్తి అయినా కవిత్వానికి జీవ భూతమయింది సృజన చేతన మాత్రమే. సృజన చేతన వెనుక నుండి అనేకమయిన అంశాలు పనిచేస్తాయి. ప్రతిభ సంకల్పం అనుభవం అనుభూతి సాధన లక్ష్యం మొదలయిన అంశాలు వివిధ నిష్పత్తుల్లో కలిసి ప్రత్యేకమైన వ్యక్తిత్వం అవతరిస్తుంది. యుగాలు గడచిపోతాయి. తరాలు వస్తూ పోతాయి. ఎప్పటికప్పుడు కవిత్వం అభినవంగా అవతరిస్తుంది, ఇదీ సృజన చేతన విశిష్టత. ఇంతకు ముందే ఎవరో వ్రాసారు, ఎంతో చెప్పారు. మన మేమి వ్రాయగలమన్న మాట కవకాశం లేదు. దీన్ని గురించి ఆలోచనకూ ఆస్కారం లేదు. కవిత్వ మనేది, ప్రేరణ విషయంలో, సామాజికమయినా వైయక్తికమయినా, మరొకటి అయినా అంతర్విషయం. ఇది అక్షరరూపంలో బయటికి రాగానే సమాజగత మవుతుంది. కవి ప్రమేయం ఉండదు. ప్రపంచ పరమవుతుంది. విశ్వమయమవుతుంది. విశాలమయిన సమాజంలో వివిధ జీవితాల కలయికతో ఏర్పడే స్థితులతో, అగాథమయిన మనస్తత్వ రూపాలు గల వ్యక్తులతో ఎంతో విషయం అపారమయింది. ఎవరెంతగా ఉపయోగించినా తరగనిదీ, అక్షయమయిందీ, అయితే దీన్ని కనుగొనే కవిదృష్టే అవసరం. బయటికి తీసే ఆలోచన పని చేయాలి. వివిధ భావాలతో కూడిన స్వేచ్ఛా మనోరూపం నుండి కవిత్వం ఆవిర్భవిస్తుంది. ఎవరి ప్రత్యేక వారిదిగా అనుభవ ముద్రను పొందుతుంది. కవులూ కవిత్వమూ ఎన్ని విధాలో సహృదయులూ సమాలోచనమూ అన్ని విధాలూ

"ఎవరి లిప్త వారికి ప్రియం
ఎవరి పాత్ర వారికి నిజం
ఎవరి విలువ వారిది విపణిలో
ఎవరి నీడ వారికి సన్మిత్రం"

ఏ కవిత్వమయినా లక్ష్యం మనిషి ఉన్నతిలో వికాసం గురించే. సజీవమయిన సమాజ దర్శనమే. మానవ ప్రగతికి అడ్డుపడే విపరీత విధ్వంస ప్రకారాల్ని గురించీ, సజీవత్వానికి క్షతి కలిగించే అనాగరక ప్రవర్తనల్ని గురించి ఎవరయినా కానీ చోటు చేసుకోవచ్చు –

"ప్రజాస్వామ్య దార్శనికంలో
కుటిల పన్నగాల భయానికి
ఆయుధ మవసర మవుతూంది
జీవిత చలనంలో భాగంగా.

స్వేచ్ఛా కవిత్వంలో వస్తువు ప్రధానంగా సామాజికం. విషయం అనేకమయిన జీవిత స్థితులతో గతులతో విస్తారమయిన క్షేత్ర పరిధి కలిగింది. విశ్వ నరుడు మొదలుకొని పరిణామ వికాసాల్లోని ఎన్నో ముఖ్యమయిన అంశాలు కలిగిందీ, జీవన చలనంలో ఎదురయ్యే అనేకమైన సన్నివేశాల చిత్రణంతో కూడిందీ. స్థూలం నుండి సూక్ష్మం వరకూ భౌతికం నుండి మానసికం దాకా, ఎన్ని దశలో! ఎన్ని పార్శ్వాలో! ఎన్ని అనుభవాల పొరలో! ఇది బహు విషయాలతో సంశ్లిష్టమయింది. ఎప్పటికపుడు కవి అభిప్రాయాని కనుగుణంగా కొత్త సమాకలానాన్ని పొందుతుంది, దృష్టి భేదాన్ని బట్టి దీనికొక స్వరూపం ఏర్పడుతుంది. ఒక్కొక్క కవి రచనలో ఒక్కొక్క విధంగా ఆవిష్కారాన్ని పొందడం జరుగుతుంది. ఈ విధంగా ఆధునిక యుగంలో సామాజికమయిన రాజకీయమయిన సాంస్కృతికమయిన ఇష్టాలతో అభిప్రాయాలతో స్వేచ్ఛా కవిత్వం ప్రత్యేకతల్ని కలిగింది. వస్తువు విశాలతరమయింది. విషయం బహు ముఖీనమయింది. మానవీయ దళిత స్త్రీవాదాలతో అల్ప సంఖ్యాకుల భావాలతో సామ్యవాద, ప్రజాస్వామ్యం, దార్శనిక రూపాలతో కవిత్వం, పరిణామ దశల్లో భాగమయింది. వికాస రూపానికి బాగా ఉపకరించింది. పద్యం గేయం నుండి వేరయిన ప్రత్యేకతలతో సాహిత్య జగత్తును ఆకర్షించింది. ఇది మార్పును సూచిస్తుంది. ప్రతి మార్పులోనూ పూర్వం నుండి వచ్చేది ఉందీ కొంత నిలుస్తుంది. కొత్తదీ రావలసిందీ చేరుతుంది. ఈ సంధి దశలో పాతది పూర్తిగా వైదొలగదు. అభిప్రాయభేదాలూ అనివార్యాలవుతాయి. కొత్తది పూర్తిగా చేరడమూ జరగదు. దీనితో కొన్ని వైరుధ్యాలు చోటు చేసుకొనే అవకాశమూ ఉంది. ఇది సహజమయిన పరిణామ దశలో భాగంగానే గుర్తించవలసి ఉంటుంది. అయితే కాలం గడిచే కొద్దీ పోను పోను పాతది తగ్గుతూ పోతుంది. పూర్తిగా అంతరించదు. కొత్తది బలపడుతూ ఉంటుంది. కొన్ని పరిమితుల్నీ పొందుతుంది. నియతం కాని కారణంగా ఒక్కొక్కపుడు అస్పష్టతకూ అయోమయానికీ దారితీస్తుంది. ఇది కాలక్రమంలో నియతమై పోను పోను స్పష్టతకూ ప్రకాశానికీ వీలు కలుగుతుంది. ఈ కారణంగా ఏర్పడే వైరుధ్యాలు సహజంగా పరిశీలన కందుతాయి.

స్వేచ్ఛా కవిత్వంలో కవి స్వయం ప్రతిభతో రచన పరిష్కృత మవుతుంది. ఏ కఠిన నియమాలకూ శాసన పద్ధతులకూ తల ఒగ్గదు. ఇదీ దీని ప్రత్యేకత. ఇది రూప పరిణామంలో ఒక దశగా వికాసంలో ఒక భాగంగా జీవిస్తుంది. స్వేచ్ఛా కవిత్వమూ పద్యమూ, దేనికది ప్రత్యేకమయిన అస్తిత్వాల్ని కలిగినవి ఏదీ దేనికీ ప్రత్యామ్నాయం కాదు, కాలక్రమంలో సామాజికమయిన మార్పుల్ని బట్టి ముందు వెనుకలుగా అనివార్యాలుగా కనిపిస్తాయి. పద్యానికి ఉండే సాంస్కృతిక మూలాన్నీ స్వేచ్ఛా కవిత్వానికి ఉండే ఆధునిక భావనా ఈ సందర్భంలో ఉదహరించవచ్చు. దేని స్థానం దానిదే, దేని ప్రయోజనం దానిదే, దేని అవసరం దానిదే. దేని కేదీ బదులుగా ఉపయోగపడదు. రెండూ సమాజంలో తమ పాత్రల్ని నిర్వహిస్తాయి. ఇప్పటి వరకూ జరుగుతూంది. పద్యాన్ని గౌరవించడం, స్వేచ్ఛా కవిత్వాన్ని స్వాగతించం, సాహిత్య సంస్కృతిలో భాగమయింది. పద్యం జాతి చింతనలో ఒకటయింది. స్వేచ్ఛా కవిత్వం ఆధునికమైన అవసరాలకు సాధనమయింది. వేదికగానూ నిలిచింది.

పద్య రచనా విషయంలో కొన్ని విధానాలూ పద్ధతులూ ఏర్పడి ఉన్నాయి. ఇవి కళాత్మకతను పొందే విధంగా ఉపయోగించుకోవడం కవి నిపుణతను బట్టి ఉంటుంది. దీనికి భాష పయి పట్టు అవసరం. నిఘంటువు పరిచయం తప్పనిసరి. పూర్వ కావ్యాల పరిచయంతో నిపుణతలో పరిణతి సిద్ధిస్తుంది. పద్య రచనకు సంబంధించి వస్తుపరంగా విషయగతంగా అభివ్యక్తి విధంగా, ఇదివరకే క్షుణ్ణమయిన మార్గం ఏర్పడింది. నిర్దిష్టమయిన పద్ధతిలో నియమ నిబంధనల్లో కవి తన ప్రత్యేకతను కనబరచే ప్రతిభ అవసరం. స్వేచ్ఛా కవిత్వం దీనికి భిన్నమయింది. ఇది స్వేచ్ఛా ప్రధానమయిన ఇటీవలి ప్రక్రియ కావడం చేత, సమస్తమూ కవి నిర్వహణ ప్రజ్ఞపయి ఆధారపడింది. ప్రతిభ ఏమాత్రం కొరవడినా, కొరతను కప్పి పుచ్చే పద్ధతులేవీ లేకపోవడం వల్ల రచన తేలిపోతుంది. అందువల్ల జాగరూకత చాలా అవసరం.

స్వేచ్ఛా కవిత్వంలో (1) రచనా విషయంలో స్వేచ్ఛా తత్త్వంతో నిరంతరం కొత్తదనాన్ని అన్వేషించే ప్రయత్నం నిరంతరం జరుగుతుంది. (2) వస్తువులో వైవిధ్యంతో పాటు విషయంలో నవ్యత చూపడానికీ అవకాశం ఉంది. (3) మానవ జీవితం గురించీ సమాజ స్వరూపం గురించి శ్రద్ధ బాగా కనిపిస్తుంది. (4) భాషా విషయంలో పరిమితులు గోచరిస్తాయి. నియమ నిబంధనలెంత తక్కువగా ఉంటే భాష అవసరం అంత తక్కువగా ఉంటుంది. పైగా అభివ్యక్తిలో సౌలభ్యాన్ని ఆశించడమూ మరొక

కారణం. (5) అభివ్యక్తిలో సంపూర్ణమయిన స్వేచ్ఛ – వైవిధ్యానికి వీలు కల్పిస్తుంది. (6) ఛందస్సుకు సంబంధించిన కవిత్వ పరిచయం రచనలో కళాత్మకతకు వీలు చేకూరుస్తుంది. శ్రీశ్రీ "ఓ కవితా!" గీతంలో అక్షరగణ మాత్రా ఛందస్సు శకలాల పద విన్యాసాలు ఈ సందర్భంలో జ్ఞాపకం వస్తాయి. (7) భాషా విన్యాసం భావ ప్రకాశం అభివ్యక్తి కళలో, కొత్తదనం చూపే అవకాశం బాగా ఉంటుంది. (8) లక్ష్యంలో వర్తమాన జీవన వాస్తవికతకూ మానవ సమాజ చింతనకూ ప్రాముఖ్యం ఉండనే ఉంది. (9) రాజకీయ నిబద్ధత లేదా స్పృహ స్పందన కలిగీ ఉంటుంది. (10) వివిధ స్థాయిల్లో పాఠకుల / సహృదయుల మనో రూపాల కనుగుణంగా వైవిధ్యాన్ని కలిగిందీ, క్షేత్ర విస్తృతిని పొందిందీ.

ఆధునిక యుగం అవసరాలకు తగినట్లుగా విశాలమయిన ప్రాతిపదిక పయి అవతరించింది కావడం వల్ల స్వేచ్ఛా కవిత్వం సాహిత్య లోకం యొక్క అభిమానానికీ ఆదరణకూ పాత్ర మయింది. సమాజంలో వచ్చే మార్పుల కనుగుణంగా స్వేచ్ఛా వాతావరణానికి సంబంధించిన ప్రభావ సహజ పర్యవసానమే స్వేచ్ఛా కవిత్వం. సామాజిక చిత్రణంలో శాంతిలో సౌభాగ్యం కోరేదీ ఘర్షణలో హింసనుండి సహనానికి దారితీసేదీ, ఇరువైపుల నుండి సన్నివేశ రామణీయకతను పొందింది. స్వతంత్రమైన సజీవమైన సృజన శక్తితో స్థిరపడింది.

## II

ఇది సాహిత్యంలో మానవీయ యుగం. ఎందరో దీనికి సంపూర్ణత చేకూర్చే అనేక పార్శ్వాల్లో రచనలు చేసారు. ముఖ్యంగా కవిత్వంలో వారి కృషి రూపమే ఈ మానవీయ యుగం.

ఎంత గొప్ప కవి అయినా ఎంత మంచి విమర్శకుడయినా తన అభిప్రాయం చివరి మాట కాదు. సమగ్రం అసలే కాదు. దీనికి దృష్టికోణం పరిమితం, అందువల్ల వివిధ కవుల నుండి విమర్శకులనుండి తమ ఆలోచనతో అనుభవంతో పరిమితుల్లో ఎన్నో సిద్ధాంతాలూ వాదాలూ అభిప్రాయాలూ మానవీయ యుగంలో అంతర్భవించాయి. స్వేచ్ఛా వాతావరణం వల్ల ఏర్పడతాయి. ఇంకా చెప్పవలసిందీ మిగిలే ఉంటుంది. సాహిత్య సమాలోచన మంటేనే వివిధ సిద్ధాంతాల వాదాల పరంపరా రూపం. ఇది

గడచిన కాలంలో వెలువడిన సమాలోచనా సంపదను ముందుంచుతుంది. దీనికి నడుస్తూన్న కాలం నుండి కొంత చేరుతుంది. ఆధునిక యుగంలో సామాజిక మయిన వైయక్తిక మయిన జీవన శైలికి సంబంధించిన అనేకమయిన మార్పులు మానవీయ భావనా ప్రధానమైనవి. ఈ కారణంగా రూపొందే కవిత్వానికి కొత్త ప్రమాణాలతో సమాలోచనం అవసరం. మంచి చెడు గుణమూ దోషం వివేచనతో మూల్యాంకనం ఎంతో తోడ్పడుతుంది.

కవితా రచన ఒక విశిష్టమయిన మానసిక ప్రక్రియ. ఇది ప్రతిభ చేత మనోమూలం నుండి ఉద్భవిస్తుంది. సామాజిక వైయక్తిక ప్రభావాల ప్రసారాల చేత తనదయిన పూర్ణ రూపాన్ని పొందుతుంది.

వర్తమాన యుగంలో సమాజంలో సమస్యలెన్ని విధాలో! వ్యక్తుల అవసరాలెన్ని విధాలో! కవిత్వమన్ని విధాలుగా ఆవిష్కృతమవుతూంది. దీనికి సమాప్తి రేఖ లేదు. లౌకికమయిన కార్యసాధనాల్లో నిరసనమూ సంఘర్షణ ప్రతిఘటన కొన్ని సందర్భాల్లో అవసరమవుతాయి. ఇవి లేంది, చరిత్రలో ఆధునిక మానవీయ సమాజం లేదు. అయితే ఇరువైపుల నుండీ 'పాయింట్ ఆఫ్ రిటర్న్'కు మాత్రం రాకూడదు. దీనికి చిత్తశుద్ధితో కూడిన ప్రజాస్వామ్య విధానాల ఆచరణం బాగా ఉపకరిస్తుంది. ఇందుకు వివేక దృష్టి చాలా అవసరం. ఉదారతతో నైతికతతో ఎంతో సాధించవచ్చు. ఏ సిద్ధాంతమూ వాదమూ అయినా మంచి ఫలితాలకీ రెండూ అవసరం.

ఈనాటి స్వేచ్ఛా కవిత్వం మానవీయ యుగం ప్రధానంగా అనివార్యంగా ఆవిర్భవించింది. దీని అస్తిత్వం (1) సిద్ధాంతం / లేదా వాదం / లేదా అభిప్రాయం; (2) సామాజికమైన వస్తువూ – వాస్తవ జీవన స్థితి విషయం; (3) అభివ్యక్తిలో స్వేచ్ఛా విధానంతో కూడింది. సమాజ పురోగమనాన్నీ వ్యక్తి వికాసాన్నీ ఆపేక్షిస్తుంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధిని బట్టీ మానవీయ క్షేత్రాల విస్తృతిని బట్టీ కార్యకలాపాల్ని బట్టీ కవుల్లో పాఠకుల్లో వివిధ స్థాయిలో పరిమితుల్లో కవితా ప్రపంచం కొత్త కొత్త పార్శ్వాల్ని పొందుతూంది. ఈ సమాజ వ్యవస్థలో మారుతూన్న జీవన విధానంలో లక్ష్యాల్లో వచ్చే మార్పుల్ని గమనిస్తూ, సమాలోచనమూ సరిఅయిన అవగాహనతో తన పాత్రను నిర్వహించవలసి ఉంటుంది. ఈ ప్రక్రియకు ఈ దిశలో కొన్ని ఆరంభ సూచనలూ కన్పిస్తున్నాయి. మానవీయ యుగ స్వరూపంపై విశ్లేషణతో కూడిన సమాలోచనం ఇంకా సాగవలసి ఉంది.

మానవీయమయిన జీవన విస్తృతిలో అనుభవమూ మానసిక వికాసంలో చింతనమూ కారణంగా కవిత్వం ఏ సిద్ధాంతానికీ, వాదానికీ అభిప్రాయానికీ చెందినా, వీటిని తనలో అంతర్విలీనం చేసుకొనే విశాలమైన వేదిక కారణంగా ఇది, సాహిత్య చరిత్రలో "మానవీయయుగం"గా నిర్ణయానికి రావడంలో ఏ అనుమానం లేదు. విప్రతిపత్తి లేదు. చారిత్రక సామాజిక పరిణామాల్ని బట్టి చూస్తే సముచితమూ, సహేతుకమూ.

## III

ఆధునిక కవిత్వ చరిత్రలో ఇపుడు నడుస్తూంది 'మానవీయ యుగం'గా భావించవచ్చు. 1) వస్తువూ - విషయ గౌరవం; 2) లక్ష్యమూ - సాధనా మార్గాలూ దృష్ట్యా ఈ మాట సమంజసమూ హేతు యుతమూ. ఏ కాలానికి చెందిన స్థితిలో ఏ లక్షణం ప్రాధాన్యం వహిస్తుందో ఏ భావధార ప్రముఖంగా కనిపిస్తుందో, బలమయిన పాత్రను వహిస్తుందో, దానికి సంబంధించిన పేరుతో ఆ యుగం పరిగణింపబడుతుంది. ఇది సహజమైన పద్ధతి. మానవ చరిత్రలో పరిణామం వికాసం ఆలోచనలు అనుభవాలు సమస్యలు స్థితిగతులు మార్గాలు పరిష్కారాలు సాధనాలు లక్ష్యాలు మొదలయిన అనేకమైన అంశాలతో కూడిందీ. ఇపుడొక సంపూర్ణమైన ప్రపంచంగా నిలిచింది. ఈ లక్షణం పూర్వ రచనల్లోనూ లేదని కాదు, ఉంది. అయితే ఇది అక్కడక్కడా లేదా ఖండఖండంగా లేదా ఒకటి రెండు అంశాలకు సంబంధించిగా కనిపిస్తుంది. ఈ యుగంలో సమగ్రంగా ఉంది. సంపూర్ణమయిన స్వరూపంతో వివేచన కందుతుంది.

ఆదిమ కాలం నుండీ ఇప్పటివరకూ కవిత్వం నిరంతరంగా వెలువడుతూనే ఉంది. భౌగోళిక చారిత్రక భూమికలో, ఆయా ప్రాంతాల సభ్యత సంస్కృతి ఆలోచనా వైఖరి భావజాలం అనుభూతుల ప్రభావాలతో ఎన్నో తీరులుగా వెలువడింది. శాశ్వతమయిన విశ్వ జీవనమయిన విలువలతో రాణించింది, తెలుగులో ఒక్కొక్క లక్షణంతో ఒక్కొక్క యుగం దానికి సంబంధించిన పేరుతో పిలవబడుతూంది.

ప్రతి కవీ అంతిమంగా, ప్రేమనూ కరుణనూ రాగాన్నీ శాంతినే లక్షిస్తాడు. జీవితంలో దీనికి అవరోధాలెన్నో! సమాజంలో దీని అవసరమూ ఎంతో ఉంది. వీటిని అధిగమించేందుకూ సాధించేందుకూ సంకల్పమూ ప్రయత్నమూ జరుగుతుంది. దీని ఫలితమే దార్శనికం. ఇది కవిత్వంలో భౌతికాన్నీ మానసికాన్నీ దాటి అంతశ్చేతనను

స్పృశిస్తుంది. ఉత్తమమైన కవిత్వంలో ఉదాత్త స్థాయిలో భావనా జగత్తునూ అనుభవ రూపాల్నీ మీరిన దర్శనరూపం సూక్ష్మ స్థాయిలో బింబిస్తుంది. సూత్ర ప్రాయంగానో స్థూలరూపంగానో విలసిస్తుంది. స్వేచ్ఛా కవిత్వంలో మానవీయ దర్శన స్వరూపాన్ని సులభంగా గుర్తించవచ్చు.

కవితా ప్రపంచంలో అన్నిటా స్వేచ్ఛా భావనతో ఇపుడు నడుస్తూంది. "మానవీయ యుగం" ఇంకా ఇతర మయినవీ ఉండొచ్చు. వీటిలో శిఖరాయమాణమయిన ప్రాధాన్యంతో వర్తమాన కాలంలో ప్రముఖంగా ఆకర్షించే వాస్తవం మాత్రం ఇదే.

స్వేచ్ఛా కవిత్వ తత్త్వం - III

# సహృదయ స్పందనం

మాదిరాజు రంగారావు

**2026**
రసధుని
సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్ - 500 028

Literary Criticism -13

**Sahrudaya Spandanam**

(Sahithya Samalochanam)

by

*Prof. Madiraju Ranga Rao*

Copyright : Dr. M. Santhosh Kumar

First Edition : 2012

Second Edition : 2026

*Presented to*

*my wife*

*Smt. Indira*

*on*

*her birthday*

# పరిచయం

స్వేచ్ఛా కవిత్వ ప్రక్రియ పై సమాలోచనం గురించి వెలువడిన (1) మొదటిది  స్వేచ్ఛా కవిత్వం – ప్రజాస్వామ్య భావన (2002); (2) రెండోది స్వేచ్ఛా కవిత్వం – మానవీయ భావన  (2011); (3) మూడోది  స్వేచ్ఛా కవిత్వం సహృదయ స్పందనం (2012); ఈ మూడూ కలిపి స్వేచ్ఛా కవిత్వ సమాలోచనా త్రయం (trilogy) గా భావింపవచ్చు. వస్తువు ఒకటే. ఇది ఈ ప్రక్రియ పై సంపూర్ణమైన అవగాహనకు తోడ్పడుతుంది.

దీని స్వరూప స్వభావాలూ – లక్షణాలు – ఈనాటి అవసరమూ ముఖ్యంగా ఆధునిక యుగంలో నిర్వహించే పాత్ర, ప్రయోజనం విస్తృతి సామాజిక లక్ష్యం, అభివ్యక్తి కళ మొదలుగా అనేకమయిన విషయాల పరిశీలనా వివేచనా గ్రంథం. ఈ మూడు భాగాలూ కలిసిన సమాలోచనా త్రయం, స్వేచ్ఛా కవిత్వం గురించి సైద్ధాంతిక ప్రతిపాదనంలో వివరణంతో సమర్థనంతో ప్రత్యేకతను కలిగింది.

తెలుగులో సాహిత్య సమాలోచనా (literary criticism) ప్రక్రియను, సిద్ధాంతపరం (theoritical) గా అనుభవపరం (practical) గా ఒక స్థాయిని కల్పించి పరిపుష్టం చేసే దిశలో జరిగిన ప్రయత్నమే, ఈ మూడు భాగాలతో సంపన్నమయిన సంపూర్ణ గ్రంథం, స్వేచ్ఛా కవిత్వ సమాలోచనా త్రయం.

సహృదయలోకం ఆమోదంతో ఆధునిక తెలుగు సాహిత్యంలో విమర్శనా ప్రక్రియలో పేర్కొదగిన సిద్ధాంత ప్రతిపాదనా సమావిష్కార గ్రంథంగా భావిస్తాను.

23–3–2012

**–మాదిరాజు రంగారావు**

# సూచిక


1. స్వేచ్ఛా కవిత్వం ........................................................ 1
2. కవిత్వ కళ – పద్యం – స్వేచ్ఛా కవిత్వం ......................... 5
3. స్వేచ్ఛా కవిత్వం – సమాలోచనా ప్రణాళిక ....................... 8
4. సృజన స్వేచ్ఛ – రూప భేదాలూ................................. 11
5. స్వేచ్ఛా కవిత్వం – విమర్శనం – పారదర్శకత .................. 14
6. వర్తమాన స్వేచ్ఛా కవిత్వం – వ్యక్తిత్వ ప్రకాశం ................. 18
7. సృజన క్రియ – కవిత్వం ........................................... 21
8. కవిలో విమర్శనం పాత్ర ........................................... 24
9. విమర్శనం – సహృదయ హృదయత – స్ఫురణ విశేషం ...... 27
10. వాద వివాద విమర్శనం.............................................. 29
11. స్వేచ్ఛా కవిత్వం – ప్రత్యేకత ...................................... 32
12. సృజన స్వేచ్ఛ – సామాజిక లక్ష్యం.................................. 35
13. స్వేచ్ఛా కవిత్వం – విరాట్ రూపం.................................. 38
14. 'రూప పిచ్చి'–వ్యవహారిక హిత పదం–రూపభేదాల నేపథ్యం.. 43
15. కవి మనో లోక ప్రకటనం కవిత్వం .............................. 45
16. స్వేచ్ఛా కవిత్వం – ఈనాటి రూప విశేషం ....................... 48
17. ప్రభావ ముద్రలు – ఆకర్షణీయత................................. 53
18. స్వేచ్ఛా కవిత్వం – ప్రభావ ముద్రలు ........................... 55
19. కవి మనోరూపం – సృజన బింబం ............................. 59
20. స్వేచ్ఛా కవిత్వం – ప్రతిపాదనం.................................. 62

# 1. స్వేచ్ఛా కవిత్వం - ప్రజాస్వామ్యభావన

సృజన క్రియలో నిర్మాణ స్వేచ్ఛ కలిగింది స్వేచ్ఛా కవిత్వం. కవిత్వమనగానే సాధారణంగా పూర్వం ఒక నియతమైన ఛందోరూపం ఉన్న ప్రక్రియగానే భావితమైంది. ఒక్కక్క భాషలో ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క విధంగా నిర్మాణ రూపం ప్రవర్తిల్లింది. ఇది దీని వైవిధ్యాన్ని ప్రకటిస్తూంది. ఆధునిక యుగంలో జీవితం వలెనే, కవిత్వం కూడా పూర్వం నెలకొన్న నియమాల్ని అతిక్రమించింది. నిర్మాణంలో స్వేచ్ఛను పొందింది. దీని కారణంగా పరిణమించిందే స్వేచ్ఛాకవిత్వం, అక్షర లేదా గణ మాత్రా నియమాల నుండీ, పాదాల సంఖ్య నియమాల నుండీ, ఇతర నియత స్థానాల నుండీ స్వేచ్ఛను కలిగి, తనదైన అంటే కవిని బట్టి పాదాల సంఖ్య, పాద విభజనంతో స్వేచ్ఛారూపం ఆవిష్కృతమయింది.

ఏ కవికి ఆకవి రచనా సందర్భాన్ని బట్టి ఆవేశ విధాన్ని బట్టి భావ విభాగాన్ని బట్టి, వాక్య ప్రసారాన్ని ఏర్పరచుకోవడం కన్పిస్తుంది. దీన్ని వచన గేయమనీ, వచన పద్యమనీ, వచన కవిత్వమనీ ఒక్కొక్క విధంగా పేర్కొన్నారు. ఈ పేర్లలో ఒక్కో విధాన్ని తెలిపే లక్షణం ఉంది. గేయ ప్రభావం, పద్య ప్రభావం ఇట్లా ఒక్కొక్క ప్రక్రియా విశేషం విశ్లేషణ కందుతుంది. వచన కవిత్వం అన్న మాటలో వచన భావం కవిత్వానికి భంజకంగా తోస్తుంది. అందువల్ల కవిత్వంలో పరిణామక్రమంలో వివిధ ప్రభావాలతో పరిహరింపరాని, ఆ కవులకు ఇష్టమైన లక్షణాల్ని కూడా కలిగి ఉన్న పద్యేతరమైన రూపాన్ని స్వేచ్ఛా కవిత్వమనడం సమంజసంగా కన్పిస్తుంది. ఇందులో అన్నిటినీ అంతర్భవించుకున్న విశాల రూపంగానూ దృష్టికి వస్తుంది. వచన సాన్నిహిత్య దోషమూ పరిహరింపబడుతూంది. ఒక వేళ దోషం కాదనుకున్నా వచనమన్నమాట చాలా పరిమితమైన లక్షణాల్ని మాత్రమే భావింపజేస్తుంది. ఈనాడు ప్రవాహ సదృశంగా వస్తున్న స్వేచ్ఛా కవిత్వాన్ని విశ్లేషిస్తే పరిణామ క్రమంలో పూర్వ ప్రభావాల్ని రచనా సందర్భంలో ఉపయోగించుకుని, తనదైన ప్రత్యేకతల్ని పొందిన మనోలక్షణం ప్రధాన సూత్రంగా కన్పిస్తుంది.

అక్కడక్కడా గేయ ప్రభావమో, పద్య ప్రభావమో, వచన ప్రభావమో ఉన్నంత మాత్రాన లోపం కన్నా దీన్ని తత్కాల స్థితికీ ఆవేశానికీ భావ ప్రసారానికీ అనుగుణంగా మలచుకోవడం లోని గుణాన్ని గుర్తించవలసిన అవసరం ఉంది.

ఆధునిక భావజాలంతో జీవిత వాస్తవాన్ని, సామాజిక స్పందనల్ని ఆవిష్కరించడం లో స్వేచ్ఛా కవిత్వం సంపూర్ణంగా విజయవంతమైంది. దీనికి ప్రత్యామ్నాయం లేదన్న మాట కూడా ఋజువైంది. పద్యంలో వస్తు విషయ రూపం కొన్ని పరిమితుల్లో మాత్రమే వ్యక్తమైంది, కొందరు ప్రయత్నించారు. కానీ అవి ఉదాహరణగానే నిలిచాయి. ఒక ఆధునిక ప్రపంచానికి ప్రాతినిధ్యం వహించేవిగా మాత్రం ఇంతవరకూ పరిణమించ లేదు. స్వేచ్ఛా కవిత్వం కవిలో సృజనేచ్ఛను బట్టి పొందే అభివ్యక్తి రూపం. ఏ నియమ నిబంధనలను పాటించకుండా తనదైన అంతర్నియమ స్వేచ్ఛతో, కేవల వచనానికి భిన్నమైన ఆకర్షణ శక్తి కలిగింది. కవి భావనలో స్థితి సందర్భాన్ని బట్టి ఆకృతిని పొందే ప్రక్రియగా స్థిరపడింది. అందువల్ల ఈ ప్రక్రియ విస్తారంగా సుదీర్ఘంగా ప్రవర్తిల్లిన కాలాన్ని చరిత్రలో స్వేచ్ఛా యుగ మనవచ్చు.

ఆధునిక కాలంలోనూ విస్మరించడానికి వీల్లేని జీవితానికవసరమైన సాంస్కృతిక మూలాల మూల్యాంకనంతో పాటు, హేతు దృష్టితో సామాజిక పరివర్తనం, భవిష్యద్దర్శనంతో ప్రజాస్వామ్య భావన – వివిధ పార్శ్వాలతో విస్తరిల్లింది. సమాజంలో ఎప్పటికప్పుడు ప్రవేశించే కొత్త సిద్ధాంతాలకూ ఉద్యమాలకూ, ధోరణులకూ, ఇదివరకున్న వాటిని పునరుజ్జీవనం, పునర్విలోకనం, చేసే ఆలోచనలకూ దర్పణంగా ఉంది. ఈ కారణంగా ఎంతో పటిష్ఠమైన వ్యవస్థతో వేయి యేళ్ళ చరిత్ర కలిగిన పద్య ప్రక్రియకు సమానంగా బాధ్యతల్ని నిర్వర్తించే శక్తితో ఆధునిక కాలంలో వేదికగా నిలచింది.

పద్యంలో కన్పించే ఛందోగతమైన అభివ్యక్తి సౌందర్యానికీ, భాషా శక్తి విలసనానికీ, సంక్షిప్త గుణానికీ, రచనల్లో ఆకర్షణ శిల్ప ధోరణికీ దూరమైనప్పటికీ, స్వేచ్ఛా కవిత్వం, కేవల వచనం కన్నా భిన్నమైన విశిష్టమైన అభివ్యక్తితో ప్రత్యేకతలతో తనదైన స్వతంత్ర నిర్మాణ వ్యక్తిత్వంతో సహజమైన ఆకర్షణతో నిలబడింది.

మునుముందీ ప్రక్రియ ఈవిధంగా కొనసాగకపోవచ్చు, కొత్త రూపాన్ని పొందచ్చు. భాషాగతంగానే కాక భావగతంగాను, అభివ్యక్తిగతంగానూ పరిమితుల్ని ఆక్రమించేందుకు 'మొనాటనీ'ని ఛేదించేందుకు కొత్త పద్ధతిలో కనీస స్థాయిలో నియమ గుణంలోనే మార్పు రావచ్చు. ఇది కవి సృజనశక్తిలోని అభిలాష, ప్రేరణ,

లక్ష్యంలో అవకాశాల్ని బట్టి ఉంటుందనడంలో సందేహం లేదు. మార్పు లక్షణంలో సృజన ఒకటి.

## II

స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వేచ్ఛా వాతావరణం వల్ల స్వేచ్ఛా కవిత్వంలో ఆయా కవుల్లో విభిన్న వ్యక్తిత్వాలకూ కృతుల్లో విభిన్న ప్రకారాలకూ అవకాశం లభించింది. సమకాలీన కవిత్వ స్థితిని విశ్లేషిస్తే; కవిలో (1) మదటి నుండి చివరి వరకూ ఒకే ఆదర్శం కలిగిందీ ఏక స్థిత రూపంగానూ (2) మధ్యలో మార్పులతో మలుపులు తిరిగేదీ పరిణామ రూపంగానూ (3) పలు ఆదర్శాల్లోని ఇష్టమయిన అవసరమయిన అంశాల్ని గ్రహించిందీ సమన్వయ రూపంగానూ (4) కల్పనకూ అనుభూతికీ ప్రాధాన్యమిచ్చే కళాభావనతో మనోరూపం గానూ (5) ఉదారమయిన భావజాలంతోనూ (a) సంస్కరణనూ పరివర్తననూ కోరే సామాజిక దృష్టితో (b) సంప్రదాయ చేతనతో తాత్త్వికతనూ ఆధ్యాత్మికంతనూ కోరే సాంస్కృతిక దృష్టితో వీటి సమీకరణలతో శ్లిష్ట రూపంగానూ ఆలోచనకందుతాయి.

సృజనక్రియలో ఒక వైపున సంప్రదాయ మార్గంలో విస్మరించరానివీ స్థిరపడిన మూల్యాల్నీ మరోవైపున ఆధునిక జీవనంలో అవసరమైనవీ మేలైనవీ ఎదుర్కొనే వాస్తవాల్నీ కలిగిన సమాజ పరిణామ చరిత్రను వివిధ కోణాల్లో ఎంతో జాగ్రత్తగా పరిశీలించవలసి ఉంటుంది.

'కవి దృష్టి – అభిప్రాయం కృతిలో ఏవిధంగా ప్రకాశితమయిందో దాని కనుగుణం గా సమాలోచనం సముచితం. దీనికి పరిమితులున్నాయి. ఒక్కొక్కపుడు సమాలోచన సందర్భంలో సవరణలూ వివరణలూ అవసరమవుతాయి. దీన్ని సమాలోచనంలో సాహిత్యపరంగానూ పరిశోధనా పరంగానూ ఎదుర్కోవలసి ఉంటుంది.

ఎటువంటి వ్యక్తిత్వమయినా ఏ విధమయిన రచనా ప్రకారమయినా స్పందనకూ ఆనందానికీ వివేచనకూ ఒక స్థాయి అవసరమవుతుంది. ఇది ప్రత్యేకంగా పేర్కోదగిన ప్రేరణ రూపసమనవచ్చు. క్రమంగా అనుభవ పూర్ణతను సిద్ధింపజేసే సాధనమవు తుంది. సహృదయుల్లో అభినందనకూ ప్రశంసకూ దారితీస్తుంది. కృతిలో బింబించే కవి వ్యక్తిత్వంతో సమానమైన స్థితి చేత శిఖరాల్ని సమీపిస్తుంది. దీనికి ప్రాతిపదికగా

సహృదయుల్లో అభిలాష అభిరుచి సంస్కార బంధురమయిన అభిమతి అవసరమనేది స్పష్టం. కవిత్వానుభవానికి కావలసిన రంగాన్ని సిద్ధం అయ్యేందుకు ఉపకరిస్తాయి.

కవీ రచన గురించి ఆలోచనలో ఏర్పడే మానసిక రూపంతోపాటు అనుభవ స్థితి – స్థాయి ననుసరించి వివిధ ప్రసారాల్ని ఆస్వాదించడం జరుగుతుంది. సహృదయ ప్రపంచంలో ఒక అవగాహనతో ఆ కృతికి ప్రాచుర్యమూ యశస్సు లభిస్తాయి.

ఇక "స్వేచ్ఛా కవిత్వం" అన్న పదరూపం గురించి ఒక మాట. ఈనాడు బహు వైవిధ్యంతో ప్రవర్తిల్లే ఈ ప్రక్రియకీ పేరు సముచితంగా ఉంది. ఇది 1) ప్రజాస్వామ్య భావనలో స్వేచ్ఛనూ 2) వ్యక్తిలో సహజమయిన స్వేచ్ఛనూ వీటితో ఏ కఠిన నిబంధనలకూ తల ఒగ్గని లక్షణంతో బాధ్యతనూ 3) ప్రక్రియా పరంగా బాహ్యమయిన ఏ నియమాల్లేని అంతర ప్రేరణ చేత ఏర్పడే రూపాన్నీ 4) సంప్రదాయానికి సంబంధించిన గతానుగతికమైన స్థితి నుండి స్వేచ్ఛావాతావరణాన్నీ సూచిస్తూంది. "స్వేచ్ఛా కవిత్వ"మన్న పదరూపం అన్ని విధాలా సమంజసంగా ఉంది. "వచన కవిత్వ"మన్న పదరూపంలో 1. కవిత్వానికి అవసరమయిన జీవధాతువును (activise) (క్రియాత్మకం) చేసే శక్తిలేదు. 2. కవిత్వ భాషకు అనుకూల స్థితిని ఇచ్చేలక్షణం లేదు. 3. పైగా కవిత్వంలో అభివ్యక్తి క్షేత్రాన్ని సంకుచితం చేసే సీమల్ని తలపిస్తుంది.

అందువల్ల "స్వేచ్ఛా కవిత్వం" అన్న పద రూపం ఈనాడు స్వేచ్ఛా కవిత్వం వ్రాసే కవుల విభిన్న వ్యక్తిత్వాలనూ వివిధ ప్రకారాలనూ కలుపుకొని ప్రధానమైన ఉద్దేశ స్వరూపానికి సంపూర్ణతను భావింపజేస్తూంది. ఒక పదరూపం ఏవో కారణాల వల్ల 'రూఢి' అయినంత మాత్రన మరో పదరూపం అంతకన్నా ఉత్తమమైందీ, పెరిగిన క్షేత్రాల్ని సూచించేదీ, ప్రయోజన పరిధుల్ని విస్తృతం చేసేదీ ప్రత్యామ్నాయంగా, సమాంతరంగా ఉపయోగంలోకి రావడంలో, ఎవరికీ విప్రతిపత్తి ఉండనవసరం లేదు. ప్రజాస్వామ్య ప్రపంచంలో స్వేచ్ఛాయుగం స్వేచ్ఛా కవిత్వానికి ప్రేరణ భూమి అనవచ్చు.

# ౨. కవిత్వ కళ - పద్యం - స్వేచ్ఛా కవిత్వం

తెలుగు భాషలో కవిత్వ కళకు సంబంధించిన విషయానికి వస్తే పద్యానిది అగ్రతాంబూలం, పరంపరాగత స్థిర రూపం చేత సాంస్కృతిక చిహ్నంగా ఎప్పటికీ నిలిచి ఉండేదీ. జాతికి కావ్య సంపద చేత సత్ప్రేరణ నిచ్చేదీ. ఇటీవల స్వేచ్ఛా కవిత్వం దీనికి సమాంతరంగా ఉపయోగంలోకి వచ్చింది. ఇప్పుడు ఇది పద్యం తరువాతనే చారిత్రకంగానూ కళాత్మకంగానూ పరిగణనంలోకి తీసుకోవడం జరుగుతుంది. భాషాశక్తి (power of language) అభివ్యక్తి సౌందర్యం శిల్ప వైవిధ్యం చేత పద్యం అవిచ్ఛిన్నంగా శతాబ్దాల వికాసం చేత ప్రకాశం చేత గౌరవ స్థానాన్ని పొందుతూంది. అయినప్పటికీ ప్రక్రియల్లో దేని ప్రత్యేకత దానిదే, దేని ప్రయోజన గుణం దానిదే. సమాజంలో వచ్చే మార్పులు కారణంగా కొత్త మార్గాలేర్పడతాయి. కొత్త ప్రక్రియ లవతరిస్తాయి. అందులో జీవశక్తీ ప్రయోజన గుణమూ ఉన్నది, కొత్తదయినప్పటికీ సహృదయుల్ని ఆకట్టుకోవడం సహజం. ప్రచారంలోకీ వస్తుంది. స్వేచ్ఛా కవిత్వం ఇలాంటిదే. ఏ పేరుతో ఉన్నా, స్థూలంగా సామాజిక రాజకీయ వాద ప్రయోజనాలకు సంబంధించీ, సూక్ష్మంగా కవిత్వ కళ అభివ్యక్తి సుందరతకు సంబంధించీ వివిధ స్థాయిల్లో ప్రత్యేకతల్ని పొందుతూ పెరుగుతూంది. విశ్లేషణలో ఈ పరిణామాలు అనివార్యంగానూ గోచరిస్తాయి.

వేయి ఏండ్ల చరిత్ర కలిగిన పద్యం నన్నయ మహాభారత రచనతో మహాకావ్య నిర్మాణ కళాసౌందర్యంతో లోక హిత తత్పరతతో ఆవిర్భవించింది. ఒక ఆదర్శ రూపాన్ని వహించింది. పద్యం యతి ప్రాస రెండింటితో పద్యకళ - శిల్పంలో సుసంపన్నమయిన స్థాయిని పొందింది. ఇది అవ్యాహతంగా పరంపరగా ఈనాటికీ సాగుతూ వస్తూంది. కాలాంతరాన అభిరుచులు మారీ అవసరాల్ని బట్టి లక్ష్యం వేరయి, మరో ప్రక్రియ స్వేచ్ఛా రూపం చోటుచేసుకుంది. దీనివల్ల పద్యం అస్తిత్వానికి క్షతి కలగలేదు. రెండూ సమాంతరంగా తమ తమ పద్ధతుల్లో మార్గాల్లో ప్రయోజనాల్ని నిర్వర్తిస్తూ కవిత్వానికి వైవిధ్యాన్ని సంతరింపజేస్తున్నాయి. ఇపుడు నడుస్తున్న కాలంలో కవిత్వ క్షేత్రంలో పద్య రచన విస్తృతి తగ్గినమాట నిజం. స్వేచ్ఛా కవితా రచన విస్తరించినమాట వాస్తవం. దీనికి కారణాలేమిటి? పద్యంలో ఆకర్షణ ఎక్కడుంది? ఇపుడెందువల్ల పద్యరచన మందగించింది?

ఈ అంశాలపట్ల కవిత్వాభిలాషులకు ఉత్సుకత సహజం. వీటిని గురించి సరి అయిన అవగాహన కూడా అవసరం. ఇది కవిత్వ సమాలోచనంలో భాగం. మంచి పద్యం వ్రాయడానికి యతి భేదాలూ ప్రాసభేదాలూ గణాలు తెలిసి ఉంటే సరిపోదు. ఇవి మౌలికమయినవి ఎట్లాగో అవసరం. అయితే దీనితో పాటుగా మరొక నైపుణి కూడా అవసరం. గణాల పంపకం పదాల కలయికతో ముందుకు సునాయాసంగా సహజంగా నడిపించే శిల్పం పద్యానికి విశేష శోభనిస్తుంది. దీనికి పర్యాయ పదాలు తెలియాలి. అపుడు రచన సులభతరమవుతుంది. దీనికయి పర్యాయ పదాలున్న నిఘంటువును సంప్రదించడం ఒక పద్ధతి. ఇది అనుకున్నంత సులభం కాదు. అన్నీ జ్ఞాపకం పెట్టుకోవలసి ఉంటుంది. పూర్వమయితే అమరకోశం చదివేవారు. కంఠస్థమయ్యేవి. అపుడు పర్యాయపదాలు జిహ్వాగ్రం పయి నర్తిస్తాయి. రచన సులభతరమవుతుంది. ఈ పద్ధతి వల్ల రచన కుపక్రమించడానికి ముందే ఈ విషయంలో అంతా సిద్ధమయి ఉంటుంది. దీనికి తోడుగా భావ నిర్మాణ దృష్టి అవసరం. గణాల కనుగుణంగా శబ్దమూ దీని వెనక నుండి భావ ప్రసారమూ పద్య గతి విశేషమూ, పద్యానికి కళాత్మకత నిస్తాయి. ముఖ్యంగా యతిప్రాసలు హత్తుకొనే విధంగా పొదగబడే సహజమైన సుస్థితిని పొందడం అవసరం. దీనికి పద్య కావ్యాల పరిచయమూ అధ్యయనమూ బాగా లాభిస్తుంది.

"చిక్కనగు తోక పైకెత్తి చివర మడచి / శిరసు పైన పతాకగా చెంగలింప
ఆపదుద్ధార కుండయి నట్టి స్వామి / పంచ భూత మనోహర ప్రతిభుడగుచు!"

యతి స్థానంలో రచన చాల సులభ సుందరంగా సాగింది. "చన చన అంత నిష్క్రియుల సాదుల అచ్చపు కర్మవాదులన్ తిన తిన నాకు నెంతయు" యతితో పాటు ప్రాస చాల సుఖకరంగా నప్పింది. ఇవి చాల సులభమయినవి. ఇంకా ఎన్నో విశేష గుణ సంపదతో శిల్ప రామణీయకతను సిద్ధింప జేసేవి పద్య రచనలో అనేకం తటస్థపడతాయి. పద్య రచనకు శబ్దంపై పట్టు ఉంటే చాల సులభమని చెప్పడానికే పై ఉదాహరణలు.

యతి స్థానంలో అక్షరమైత్రి భావ ప్రసార ప్రభావం కలిగింది. ప్రాస స్థానంలో అక్షరం శిల్ప నైపుణికి పరీక్షలాంటిది. ఈ రెండింటిలో కవి చూపే కళా ప్రతిభ తెలుగు పద్య రచనకు ప్రత్యేకతను సిద్ధింపజేసింది. ప్రసాదగుణం మొదలుకొని

ఓజో గుణం వరకూ అన్నిటినీ స్ఫురింప జేసే ఆయతి (రేంజ్) కలిగింది. కింది నుండి పై స్థాయి వరకూ ఆవేశం, ఉద్రేకం, ఉత్సాహంతో స్పందనల్ని ధ్వనింపజేయ గలిగిన పద్యం సంపూర్ణంగా మనోధర్మంతో జీవితానుభవాన్ని పలికిస్తుంది.

ఈ రోజుల్లో పద్యం వ్రాయడానికి కావలసిన మౌలికమయిన విషయాలతో మనస్సు సిద్ధం కాకపోవడం వల్ల కొంతమంది సాహసించలేకపోతున్నారు. ఇది కష్టంతో కూడుకొని ఉందన్న భావంతోనూ కొందరున్నారు. మరికొందరు ఆధునిక భావజాలానికి పద్యం సరిపడదన్న అభిప్రాయమూ కలిగి ఉన్నారు. స్వయంగా కవి ఏర్పరచుకున్న పద్ధతిలో స్వేచ్ఛగా ఏ ఆటంకాలూ పరిమితులూ నియమాలూ లేకుండా తనలో కలిగిన భావానుభవాన్ని ఆవిష్కరిచడం స్వేచ్ఛా కవిత్వ మార్గంగా రూపొందింది. సామాజిక వాస్తవ స్థితుల పట్ల సత్వరం స్పందించే గుణంతో ఈ ప్రక్రియ సహజమయిన సులభమయిన వాహికగా / సాధనంగా స్థిరపడింది. అయితే ఇందులో శబ్ద విస్తృతి తగ్గింది. అభివ్యక్తిలో శిల్ప ప్రకారాలు లోపించాయి. భావ ప్రసార నిర్మాణంలో కళాత్మకత కన్నా సామాజిక విషయ వైవిధ్యం పెరిగింది. ఇవి చిన్న ఖండికల్లో గుణాత్మకంగా పర్యవసించడం జరుగుతూంది. మానవీయమైన వస్తు గౌరవంతో కళాత్మకత కన్నా సామాజిక స్పందన హృదయంతో, పద్యానికి తీసిపోని ఆకర్షణతో రాణిస్తూంది. ఇవి ఏవీ పద్యం లేని లోటును తీర్చేవి కావు. దేని అస్తిత్వం దానిదే అన్న నిర్ణయానికి దారి తీస్తుంది. ఏ ప్రక్రియ అయినా కవిత్వంలో కవి తన లక్ష్యంతో పాటు అనుభవంలో పొందే భావ విశేషాన్నీ శబ్దంలో సాక్షాత్కరింపజేసే కళా హృదయాన్ని మాత్రమే గుర్తించవలసి వుంటుంది. దీనికే ప్రాధాన్యం.

ఈనాటి కవిత్వ జగత్తులో 1) ఒక శ్రేణిలో ఒక పొరలో వైయక్తికమూ (Individual) రెండో పొరలో సామూహికం (Collective) – రెండూ కలిసిన మనో రూపమూ 2) మరో శ్రేణిలో ఒక పొరలో సమాజహిత భావన మరో పొరలో సమాజ ప్రగతి చింతన – రెండూ కలిసిన మనో రూపమూ దర్శనమిస్తాయి. వీటి పట్ల స్పందనల్ని బట్టి ఆలోచనల్ని బట్టి భేదా లేర్పడుతున్నాయి. ఇది సృజన ప్రపంచంలో అవసరమైన పరిణామ రూపాలు మాత్రమే. వీటి అవతరణం ప్రజాస్వామ్య సహజమూ.

కాలాన్ని బట్టి పద్యం బలమయిన సామాజిక సంస్పృహతో విషయ వైవిధ్యంతో

మరింత వేగంగా తన శక్తిని ప్రదర్శిస్తుందనీ ఆశించవచ్చు. స్వేచ్ఛా కవిత్వమూ తనలో వచనత్వం వీడి కళాత్మకమయిన అభివ్యక్తి సుందరతకు అవసరమైన పద్ధతిలో జీవవంతమయిన భవిష్యత్తును పొందుతుందనీ విశ్వసించవచ్చు. ప్రజాస్వామ్య సమాజంలో బహువిధాలయిన వైవిధ్యం కవిత్వంలోనూ అనివార్యమయిందీ దీనికి తార్కాణం స్వేచ్ఛా కవిత్వం.

## 3. స్వేచ్ఛా కవిత్వం - సమాలోచనా ప్రణాళిక

ఆధునిక కాలంలో పద్యానికి సమాంతరంగా స్వేచ్ఛా కవిత్వం ఈ రోజుల్లో బాగా వ్యాప్తిలో ఉంది. ఎంతో విస్తృతినీ పొందింది. ఈ ప్రక్రియ సమాజంలో అన్ని తరగతులకూ చెందిన వారినీ వయోభేదం లేకుండా స్వేచ్ఛా పథంలో కవితా రచనకు ప్రేరేపిస్తూంది. దీని అస్తితకు సంబంధించిన ప్రధానమయిన లక్షణాల్ని సమాలోచనానికి ఉపకరించే పద్ధతిలో ఒక ప్రణాళిక అవసరం. ఇది ఈ ప్రక్రియ గురించి అభిమానులకూ అభిలాషులకూ అవగాహనకెంతో తోడ్పడుతుంది. ఇది నిస్సందేహంగా సమాలోచనా ప్రక్రియను సమృద్ధం చేస్తుంది.

స్వేచ్ఛా కవిత్వానికి సంబంధించిన సమాలోచనా ప్రణాళికలో మొదట పేర్కో దగింది, సృజన క్రియలో 'భావస్థానం' మౌలికమయింది. ఆరంభ మనోదశకు చెందింది. దీనికి ఆలంబనం సమాజం. కవి ముందున్న సమాజ స్థితిగతులూ, ఎదుర్కొనే జీవిత సమస్యలూ, వ్యక్తి వికాసం, విశ్వభావనా రూపాలూ ప్రేరణ భూమికలుగా పనిచేస్తాయి. వీటికి సంబంధించిన ఆవిష్కారాలతో భావస్థానం ప్రత్యేకతను కలిగింది. దీనికి సంబంధించిన భావానుభవం భావ ప్రసారం భావ ప్రకాశం రచనకు జీవశక్తి నిస్తూంది.

ఈ భావ ప్రపంచంలో (1) ఒక విధం – భావనల్లో దేని కది ప్రత్యేకతను కలిగి ఉండడం. విషయం సూత్ర రూపంలో ఉంటుంది. ఇది సూచనగానో అంతర్నిహితంగానో అదృశ్యంగానో ఉండడం వల్ల పాఠకులకు అందని స్థితి ఏర్పడుతూంది. అస్పష్టత అనిపిస్తుంది. (2) మరో విధం – వివిధ భావనలు పరంపరగా ఏర్పడతాయి. ఒకదాని తరువాత మరొకటి సూక్ష్మ మయిన సంబంధం కలిగి ఉంటాయి. ఈ విషయం పయి దృష్టి పడకపోవడం వల్ల పాఠకులకు

అన్వయలోపంగా కనిపిస్తుంది. ఈ రెండు విధాలూ భావపరంగా అస్పష్టతగా లోపంగా ఎత్తి చూపడం జరుగుతూంది. అయితే ఈ పద్ధతి పరిచయంతో కవి ఉద్దేశాన్ని గ్రహించడం కష్టమేమీ కాదు. ఇది అభివ్యక్తితోనూ సంబంధం కలిగింది. రచనలో సంక్షిప్తత గుప్తత వ్యంజకత చేతనే కవిత్వం ఉత్తమ స్థాయిని పొందుతుంది. (3) ఇంకొక విధం వివిధ భావనలు ఒకదానితో మరొకటి కూడుకొని ఒకదానిలో మరొకటి చొచ్చుకొని కలిసిపోయే సాంద్రత వల్ల 'భావ సంశ్లిష్టత' లోనూ క్లిష్టత కవకాశం ఉంది. ఇది సృజన క్రియలో భావగతంగా అత్యంత వేగ తీవ్రతలవల్ల ఏర్పడుతుంది. అయితే కవులు సృజన దశలో సంయమనంతో వివేచనంతో దీన్ని నియతం చేయవచ్చు. ఇవి ఈనాడు స్వేచ్ఛా కవిత్వం ఎదుర్కొనే సమస్యలు.

మరో విషయ మేమంటే ఈ ప్రక్రియలో నియమ నిబంధనలు లేని కారణంగా విస్తరణం చోటు చేసుకునే అవకాశం కలుగుతూంది. అందువల్ల కవి రచనా సందర్భంలో చాల మెలకువతో వర్తించవలసి ఉంటుంది. దీనికి సంయమనంతో కూడిన 'శిల్పదృష్టి' అవసరం. కొన్ని సందర్భాల్లో అనుకోకుండా సహజంగా సృజన రూపంలో భాగమయి కవి ప్రతిభచేత దానికది సంక్లిష్ట గుణంతో శిల్పవంతంగా సిద్ధిస్తుంది. కొన్ని సందర్భాలలో కవి నిపుణతచేత రాబోయే స్థితిని కనిపెట్టి అనుకొనీ శిల్పత్వాన్ని సాధించడమూ జరుగుతూంది.

ఏదయినా ఈ విస్తృతి భావస్థానాన్ని ఆశ్రయించి మాత్రమే జరుగుతుంది. దృశ్యానికీ సన్నివేశానికీ దారి తీస్తుంది. వర్ణనతో చిత్రణతో వివరణతో ప్రకటనతో ఆవిష్కృత మవుతుంది. ప్రతిభ చేత స్థాయి భేదం ఏర్పడుతుంది. ఇది విశ్వజనీన మయింది. ఏ భాషలో నయినా అనువాదానికి వీలయింది. ఈ భావ ప్రసార ప్రకాశ రూపాలు వీటికివిగా ఆకర్షిస్తాయి, అలరిస్తాయి.

రెండోది 'అభివ్యక్తి విశేషం'. ఇది భావ ప్రపంచాన్ని వహించే భాషలో శబ్ద శక్తికి సంబంధించింది. దీని పాత్ర ప్రత్యక్షంగా అమేయమయింది. భాషా విషయంలో జాగ్రత్తగా లేకపోతే స్వేచ్ఛా కవిత్వంలో విస్తరణగుణం పెరుగుతుంది. ప్రకటన విధం అధికమవుతుంది. సంక్షిప్తత గుప్తత వ్యంజకతకు క్షతి ఏర్పడుతుంది. కవిత్వంలో స్థాయి క్రిందికి జారుతుంది. శబ్ద శక్తి మయ మయిన భాష కవిత్వానికి ప్రవేశద్వారం వంటిది. ఇది దాటగానే లోపల నున్న అర్థ నిలయంతో భావ రూపాలతో పరిచయ మేర్పడుతుంది. అభివ్యక్తి సుందరత ఒక కళ. అభివ్యక్తి ప్రత్యేకత ఒక నిపుణత.

ఇది సృజన రూపానికి ఆకర్షణీయతను ఇస్తుంది. దీనికొక స్థిర రూపమంటూ లేదు. ఇది స్వేచ్ఛా కవిత్వంలో కవి కళాత్మక దృష్టిపయి నిర్వహణ శిల్పం పయి ఆధారపడింది.

ఒక్కొక కవిలో ఒక్కొక విధమయిన అభివ్యక్తి విశేషం సమాలోచనంలో కనిపిస్తుంది. ఏ కవి కృతీ మరొకరి కృతిలా ఉండదు. ఒక కవి కవిత్వం వెనుక నుండి ఎన్నో విషయాలతో కూడిన సృజన శక్తి పని చేస్తుంది. ఈ అంశాలన్నీ మరో కవిలో సమకూడడం జరగదు. ఆశించడమూ సమంజసం కాదు. పైగా ఏ నియమ నిబంధనల్ని ఆశ్రయించని స్వేచ్ఛా కవిత్వంలో ప్రతి కవి రచన ఒక స్వతంత్ర రూపం.

భావ స్థానంలో అమూర్తం నుండి మూర్తానికి పరిణమింప జేసే అభివ్యక్తి విశేషం రచనలో కళాత్మక మయిన పూర్ణతకు దోహదం చేస్తుంది. ఇందులో విషయంతో వివరణంతో సంభాషణతో వర్ణనలో చిత్రణలో ప్రకటనలో ప్రత్యేక గుణంతో అలరిస్తుంది. ఈ సమాలోచనం సూక్ష్మస్థాయికి చెందింది. దీని వివేచనకు మరో సందర్భం అవసరమవుతూంది.

మూడోది 'సామాజిక రాజకీయ సాంస్కృతిక దార్శనికతకు చెందింది. ఇది ఎంతో విశాలమయిన నేపథ్యంగా ఉపయోగపడుతూంది. స్వేచ్ఛా కవిత్వంలో జాతీయ అంతర్జాతీయ ప్రాంతీయ స్థానీయ భూమికల్ని ఈనాడు వస్తూన్న రచనల్లో స్పష్టంగా గుర్తించవచ్చు. ప్రజాస్వామ్య వ్యవస్థలో లభించే అవకాశాలు కారణంగా వైవిధ్యం ఏర్పడుతూంది. వివిధ వాదాలూ అభిప్రాయాలూ పార్టీల వైఖరులూ సిద్ధాంతాలూ విరివిగా కనిపిస్తాయి. ఈ లక్షణం కొందరిలో నిబద్ధతగా కొందరిలో తటస్థంగా కొందరిలో మద్దతుగా కొందరిలో సానుభూతిగా వివిధ స్థాయిల్లో పనిచేసే పాత్రలు, ఆయా కవిత్వాల్లో చలన శీలతను నిలుపుతున్నాయి. ఇది కవుల ప్రత్యక్ష సంబంధం మొదలుకొని ఆదర్శాల ప్రకటనం వరకూ వ్యాప్తమయింది.

ప్రజాస్వామ్య ప్రక్రియకు అనుబంధంగా మానవ హక్కుల వేదికలూ పౌర సంఘాలూ సంస్కరణ ప్రగతి సమితులూ స్వేచ్ఛా కవిత్వంలో పరోక్షంగానూ ప్రత్యక్షంగానూ మలుపులకు కారణమయినాయి. సామాజిక రాజకీయ సాంస్కృతిక దార్శనికత స్వేచ్ఛా కవిత్వాన్ని కొత్త ప్రభావ శక్తితో నడిపించింది.

నాలుగోది "జీవిత వాస్తవం – మానవీయ భావన" స్వేచ్ఛా కవిత్వంలో విశిష్టమయిన స్థానాన్ని కలిగింది. స్వేచ్ఛా కవిత్వం అస్తిత్వానికి కీలకమయింది. వస్తు విషయాల గౌరవంతో శిఖరాయమాణమయింది. ఇందులో లౌకిక జీవితంలో

వాస్తవ స్థితులకు ప్రాధాన్యం ఉంటుంది. వ్యక్తి వికాసంతో పాటు సమాజ ప్రగతి గుణం ఉంటుంది. విశ్వ హృదయంతో మానవీయ భావన వివిధ స్థాయిల్లో వర్తిస్తుంది. ఈ లక్షణంచేత జీవిత గమనంలో తాత్త్విక దర్శనం విశ్వమయంగా ఉంటుంది.

మానవ చరిత్ర పరిణామం వికాసం - పురోగమనం స్థానాలపై వెలుగు ప్రసరించడం జరుగుతుంది. 1. వ్యక్తి స్థాయి నుండి సమాజ స్థాయి వరకూ; 2. ప్రాక్ జీవనం నుండి ఆధునిక జీవితం వరకూ; 3. జీవితంలో మానవీయమయిన స్థూల సూక్ష్మభేదాల వివేచనమూ; 4. హేతువూ వివేకమూ జోడించిన ఆలోచనతో వ్యక్తి జీవితమూ మానవ స్వరూపమూ కవిత్వంలో చోటు చేసుకోవడం జరుగుతూంది.

పద్యం నుండి భిన్నమైన ప్రత్యేకతను పొందిన అస్తిత్వాన్ని భావింపజేసేవిగా, ఈ నాలుగు లక్షణాలూ ఒక్కొక్క విధంగా స్వేచ్ఛా కవిత్వంలో పరిశీలన కందుతాయి. 1. భావ స్థానం; 2. అభివ్యక్తి విశేషం; 3. సామాజిక రాజకీయ సాంస్కృతిక దార్శనికత; 4. జీవిత వాస్తవం - మానవీయ భావన తో ఏర్పడిన ప్రణాళిక, ఈ సమాలోచనా ప్రక్రియను సమృద్ధం చేసేందుకు బాగా ఉపకరిస్తూంది.

## 4. సృజన స్వేచ్ఛ - రూప భేదాలూ

సృజన స్వేచ్ఛ చాలా విచిత్రమయింది. ఎవరూ నిర్వచించ లేనిదీ. ఉపదేశాల్ని పట్టించుకోదు, నీతుల్ని వినిపించుకోదు, ఆజ్ఞల్ని పాటించదు, నియమాల్ని అనుసరించక పోవచ్చు. నిబంధనల్ని ఉల్లంఘించవచ్చు. సృజనకు సంబంధించిన కవిత్వంలో ఈ స్థితి సర్వ సాధారణం. యథా స్థితిని కోరేవారు ఈ మార్పులకు ఇష్ట పడరు. వీరిలో కొందరు కొన్నిటిని అంగీకరిస్తారు. కొన్నిటిని వ్యతిరేకిస్తారు. ఒక్కొక్కరూ ఒక్కొక కోణంలో అంగీకరించడమో తిరస్కరించడమో! జరుగుతూ ఉంటుంది. కవిలో విమర్శ గుణమూ విమర్శకునిలో విమర్శనాతిశయమూ ఈ దిశలో పనిచేస్తాయి. సృజన క్రియ సందర్భంలో కవి మనోరూపం సాధారణేతర మయిన ప్రత్యేకతను కలిగి ఉంటుంది. రచన చేసిన తరువాత స్థితి వేరు. సాధారణమయిన స్థాయికి చేరుతుంది. రచన జరిగే వేళ ఒక ఆవేశస్థితిలో ఆలోచనా క్షేత్రం ఉంటుంది. ఆ సమయం బాహ్యమైన లౌకిక ప్రభావం కన్నా, ఆంతరమయిన భావ స్పందనంతో

ఏర్పడే స్థితికి ప్రాధాన్యం ఉంటుంది. కవు లందరూ స్థూలంగానూ సూక్ష్మంగానూ ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క విధమయిన అనుభవ రూపాన్ని పొందుతారు. విశ్లేషణకూ పరిశీలనకూ సమయం ఉండదు. రచనా వేగంలో సృజన రూపాన్ని పొందే ఉత్సుకతతో మనస్సు చరిస్తుంది. అయినప్పటికీ కొందరిలో ఈ విశ్లేషణకూ పరిశీలనకూ సంబంధించిన శిల్పదృష్టి సచేతనంగా ఉంటుంది. కొందరిలో అప్రకటితంగా ఉంటుంది. అందువల్ల కవిలో సృజన స్వేచ్ఛ – సర్వ స్వతంత్ర మయిందిగా కనిపిస్తుంది.

సమాలోచనంలో విమర్శ ప్రత్యేకంగా తన పని తాను చేసుకుంటూ పోతుంది. ఏ పని అయినా అంటే సూచన ఉపదేశం ప్రోత్సాహం ప్రేరణంతో సున్నితమయిన పద్ధతి నుండీ, విభేదం వ్యతిరేకం తిరస్కరణం ఖండనంతో కర్కశం వరకూ, ఎన్ని విధాలో! ఇవి విమర్శనా స్వేచ్ఛను ప్రతిఫలిస్తాయి. సృజన స్వేచ్ఛకు విమర్శనా స్వేచ్ఛ పోషకమవుతుంది. చైతన్యవంతమయిన సాహిత్య వాతావరణానికి దారితీస్తుంది. ఇది ప్రజాస్వామ్యాని కనుగుణమయిన చర్చారూపాన్ని అర్థవంతం చేస్తుంది కూడా. కొన్ని సందర్భాల్లో హద్దులు దాటనూ వచ్చు, ఏమయినా వాస్తవానికి కాలం పయి సారవంతమయింది మాత్రమే నిలుస్తుంది.

ఈనాటి స్వేచ్ఛా కవిత్వంలో రూప భేదాలు కనిపిస్తాయి, ఇది నేటి సమాజంలో భేద రూపాల్ని తలపిస్తుంది. సమాజంలో ఉన్నదే కవిత్వంలో రూపంలోను చోటు చేసుకోవడం సహజం. సూక్ష్మ దృష్టికి ప్రజాస్వామ్యంలోని స్వేచ్ఛకు, కవి స్వతంత్రమయిన ప్రవృత్తి తోడయిన పరిస్థితులవల్లనే అనిపిస్తుంది. ప్రతి క్షేత్రంలోనూ స్పెషలైజేషన్ విధానం అమలులోకి వస్తూంది. ఇందులో అవసరమయితే మరొక క్షేత్రంతో సంప్రదించే వెసులుబాటూ ఉంది. ఈ విధంగానే కవిలోనూ (1) విషయ సూక్ష్మత; (2) అభివ్యక్తి సంక్షిప్తత; (3) ఝటితి స్ఫూర్తి అనుభవం; (4) మెరపులా ఆలోచనతో ఏర్పడే చిన్న రూపంలో భేదం పట్ల అభిలాష ఏర్పడుతూంది. కవుల దృష్టిలో ప్రత్యేకతల వల్లనే రూపభేదాలు అవతరిస్తున్నాయి. ఈ పరంపర ఆగనిదీ, ఎవరూ ఆపలేనిదీ. మూలం ముక్తక రూపం. ఇది ఎన్నో పాయలుగా దర్శనమిస్తూంది. ఇది సృజనలో పరిణామ సహజమయింది.

ముక్తకం, మినీ, నానీ, నానొ, లిరికా, హైకూ, రెక్కలు, లిమరిక్కులు, చమత్కారికలు ఇట్లా చిన్న చిన్ని కవితలు – ఒక్కొక విధం. దేనికది సజీవ రూపం. తృప్తి పూర్ణంగా ఆకర్షిస్తుంది. కనీస స్థాయిలో అలరిస్తుంది. దీని ప్రయోజనం పరిమితం. విశేష సందర్భాల్లో అవసరానికి వాడే బ్యాటరీ ఫోకస్ చేసే పనిని ఏ దీపంతోనో ఏ సూర్యునితోనో పోల్చే వీలులేదు. చిన్న కవితలయినా శక్తి సారం కలిగినవి నిలుస్తాయి. దీర్ఘ కవితల్లో కావ్యాల్లో మధ్య మధ్య కనిపించే కొన్ని ప్రసిద్ధమయిన పంక్తులు ఇలాంటివే!

తాను కవిత్వాన్ని వ్రాసే భాషలోనూ, పరిచయమున్న భాషలలోనూ రచనల్ని చదివి, ఆలోచనా క్షేత్రాన్నీ అనుభవాల లోతునీ పెంచుకోవడమనేది, నిరంతరమూ సాగే ప్రయత్నం! ఇది ఒక నాటితో ముగిసేది కాదు. ఈ పని ఏదో అది ముగిసాకనే కవిత్వం వ్రాయాలనుకోవడం కుదరదు. ఒకే కవి చేసిన అన్ని రచనలూ ఒకే స్థాయిలో ఉండవు. నేటి స్వేచ్ఛా కవిత్వం విషయంలో (1) కవి ఉన్న కాలమూ; (2) సమాజ వాతావరణమూ; (3) విషయ ప్రాధాన్యం; (4) పాఠకుల ప్రమేయంతో అభిలాష, అభిప్రాయం; (5) కళాత్మక మయిన విలువలు – ఇవి ఆలోచనకు పురి కొల్పుతాయి. చిన్న చిన్న కవితల్లో వీటిని ఆశించడం న్యాయం కాదు. వీటి స్పృహ ఒక్కొక్క రూపం వాటి భేదాల్లో ఒక్కొక్క విధంగా ఉంటుంది.

కవిత్వంలో సృజన రూపం, ఎంత చిన్నదో, కాస్త పెద్దదో, ఏదయినా దాని కదిగా ఒక సజీవమయిన పూర్ణాకృతిని పొందడం వరకే. పుష్పమూ, ఫలమూ, బీజమూ దేనికదే పూర్ణమైందీ, ప్రత్యేకమైందీ, ఆలాగే కవిత్వంలో రూప భేదాలూ. నవ్యతను సాధించే ప్రయత్నంలో భాగాలూ, వీటిని కవిదృష్టితోనూ చూడవలసి ఉంటుంది. స్పందనలో సూక్ష్మతనూ, అభివ్యక్తిలో గాఢతనూ, భావనలో వ్యంజకతనూ స్పర్శామాత్రంగా ఈ చిన్ని చిన్న కవితల్లో గమనించవచ్చు. ఎన్నో పేర్లతో వచ్చే చిన్ని చిన్న కవిత్వ విధానాలన్నిటిని కలిపి, ఒక రూప విభాగంగా మునుముందు సమాలోచనా లోకంలో స్థిరపడుతుందనీ విశ్వసించవచ్చు. నేటి కవిత్వంలో వచ్చే ఈ మార్పులు అభిలషణీయాలే కాదు, కాలాన్ని బట్టి అభినందనీయాలు కూడా.

# 5. స్వేచ్ఛా కవిత్వం - విమర్శనం పారదర్శకత (ట్రాన్స్‌పెరెన్సీ)

ఒకవైపు నుండి కవిత్వమూ మరో వైపు నుండి విమర్శనమూ రెండింటికీ మధ్య కొన్ని సందర్భాల్లో పారదర్శకత (ట్రాన్స్‌పెరెన్సీ) చాలా అవసరం. ఈ రెండూ భిన్న స్థానాల నుండి ఒక దాని కొకటి ఎదురెదురుగా మొదలయి కదలుతాయి. కొన్ని అంశాల్లో విభేదాలతో ఏర్పడే తెరలు పలచగానో దళసరిగానో ఉండవచ్చు. గోడలానో నిలిచే అవకాశం ఉంది. కవిత్వం ఎప్పటికీ ఎందరు సమాలోచనం జరిపినా ఐస్‌బెర్గ్ కొనలానే కనిపిస్తుంది. దీనికి సంబంధించిన అన్వేషణం వివేచనం సమాలోచనంలో భాగాలు. కవిత్వమూ విమర్శనమూ ఈ రెండింటికీ కేంద్ర బిందువుల మధ్య దూరం ఇంత అని ఎవరూ చెప్పలేరు. కృతికీ కృతికీ విమర్శకునికీ మారుతుంది. కృతిలో సృజన రూపాన్ని అందుకునే ప్రయత్నం కొన్ని చోట్ల సుగమంగానూ కొన్ని చోట్ల అవరోధాలతోనూ సాగుతుంది. ఈ విభేదాల తెరల విషయంలో పారదర్శకత అవసరం. కాంతి ప్రసారాని కవకాశం వల్ల వస్తువు లేదా విషయం ఆవల నున్న దేదో కనిపిస్తుంది. కాంతి ప్రసార గుణం కలిగిన పాదర్శకత ఈ సందర్భంలో ఎన్నో సందేహాలను తీరుస్తుంది. ప్రశ్నలకు సమాధానాలూ లభిస్తాయి. ఇది పయనాన్ని ముందుకు సాగిస్తుంది.

సృజన కృతి ఆవిష్కార రూపం ఎప్పటికీ ఒకటే! దీన్ని గురించి అభిప్రాయాలెన్నో! ఆలోచన లెన్నో! దృష్టి కోణా లెన్నో! కోరే విషయా లెన్నో! వెళ్ళే మార్గాలెన్నో! ఒక్కొక్క విమర్శకుని అభిలాషను బట్టి అవగాహనను బట్టి వివేచనను బట్టీ, తాను విశ్వసించే ఆదర్శాన్ని బట్టి భేదిస్తాయి. ఇది సహజం. ఈ సందర్భంలో కవి దృష్టినీ అభిప్రాయాన్నీ పరిగణనలోకి తీసుకో వలసి ఉంటుంది. ఆ తరువాత విమర్శకుని స్వతంత్ర మయిన సమాలోచనా ప్రపంచం మొదలవుతుంది. కవి ఉద్దేశించని అభిలషించని వాటిని గురించీ, తాను కోరే ఆదర్శాలకూ అభిప్రాయాలకూ అవి భిన్నమయిన కారణంగానూ విభేదించడం విమర్శించడం జరుగుతుంది. సాధారణ విమర్శనా స్థాయిని అధిగమించడమూ ఆవేశంలో సంయమనాన్ని కోల్పోవడమూ కనిపిస్తుంది. కృతి విషయంలో కవిని రక్షణలో పడేస్తుంది. చాలా సందర్భాల్లో కవులు వేదనకు గురి కావడమూ ఉంది. వీటిలో చాలా వరకు తాత్కాలికాలుగానే పని చేస్తాయి. కొన్ని

జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. కొంత కాలానికి చాలావరకు వాటి ప్రభావమూ అదృశ్యమవుతుంది. పూర్వం "కృష్ణపక్షం" గురించీ, తరువాత "మహాప్రస్థానం" గురించీ, ఆ మధ్య "రామాయణ కల్పవృక్షం" గురించీ విమర్శనా ఘట్టాలు! ఇంకా ఎన్నో ఇలాంటివి స్వేచ్ఛా కవిత్వానికి సంబంధించివీ! సృజన కృతిలో జీవశక్తి ముందు తేలిపోతాయి!

కృతిని ప్రధానంగా కవి దృష్టితో మొదట చూడవలసి ఉంటుంది, ఇది అవసరం. దీనికి చేర్పుగా విమర్శకుల సాహిత్య విదుల అభిప్రాయాల్నీ స్వీకరించ వచ్చు. దీని చేత సమాలోచనానికి సమగ్రత ఏర్పడుతుంది. కవి అంతగా పట్టించుకోనివీ ఇష్టం లేనివీ నచ్చనివీ ఆ స్థితికి సరిపడవనీ అనుకున్నవీ, సంవిధానంలో నప్పనివీ, అంశాల్ని గురించి, తన దృష్టితో జరిపే విమర్శకుని విమర్శతో సమస్య మొదలవుతుంది. కవి సృజన స్వేచ్ఛలోకి ప్రవేశించి తీర్పు లివ్వడం వల్ల ప్రయోజనం లేదు. కొన్ని సందర్భాల్లో కటు కఠోర తీవ్ర నిశిత విమర్శల ప్రభావం నుండి కవిలో తాత్త్విక మయిన కవచం కాపాడుతుంది. ఈ "విశాల పృథ్వి పయి" సరి అయిన అవగాహనతో "అర్థం చేసుకొనే సహృదయులు" ఉంటారనే ఆశాభావం మానసికంగా తృప్తి నిస్తుంది. సమస్థితికి ఉపకరిస్తుంది. చిత్త శాంతికి తోడ్పడుతుంది. పాశ్చాత్య దేశాల్లో ఇలాంటి సందర్భాల్లో వేదనకు గురి అయి ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ ఉన్నాయి. సమాలోచనంలో మోదాన్ని కలిగించే దయినా వేదనను కలిగించేదయినా, నెరపే ప్రభావం చాల బలమయింది.

ఈనాటి స్వేచ్ఛా కవిత్వంలో కృతీ–విమర్శ మధ్య అనేకమయిన విభేదాలతో నిరోధాల తెరలు కనిపిస్తాయి! వీటిలో చాలా వరకు పట్టించుకోనవసరం లేనివీ, కొన్ని అంతవరకూ కొన్ని అంశాల్లో సమంజసమయినవి గానూ దృష్టికి వస్తాయి. ఎంతో వైవిధ్యంతో ముందుకు సాగే ప్రజాస్వామ్య సమాజంలో, అంతే వైవిధ్యంతో విస్తరించే స్వేచ్ఛా కవిత్వ విషయంలో ప్రామాణిక మయిన విమర్శనా వికాసానికి పారదర్శకత ముఖ్యం.

## II

స్వేచ్ఛా కవిత్వానికీ విమర్శనకూ మధ్య పారదర్శకత అవసర మయ్యే అంశాల్లో (ఎ) మొదటిది, దార్శనికతకు సంబంధించింది. కవులూ విమర్శకులూ విశ్వసించే

ఆదర్శాలతో సిద్ధాంతాలతో వాదాలతో అభిప్రాయాలతో కూడింది. ఈనాటి కవిత్వంలో మరీ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. దార్శనికత కవిత్వానికి వెన్నెముక లాంటిది. ఆధునిక యుగంలో సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరివర్తన దశల్లో కవీ విమర్శకుడూ తాము కూడా భాగస్వాములు కావడం ప్రజాసామ్య సహజమైంది. తెలిసో తెలియ కుండానో ప్రభావాన్ని నెరపుతూంది. కవిలో సామాజిక రాజకీయ సంస్పృహతో, కవిత్వంతో విడదీయ రానిదిగానూ పరిణమిస్తూంది. ఈ అంశంలో పద్యం ఈ స్థితిని అందుకోలేదు. దీన్ని స్వేచ్ఛా కవిత్వం అందుకుంది. ఆధునికమైన శూన్యా (వాక్యూమ్)న్ని పూరించింది. పద్యం ఈ విషయంలో నిశ్శబ్దంగా ఉండడం వల్ల లేదా క్రియాత్మకతను ఉండవలసినంత చూపకపోవడం వల్ల మరో ప్రక్రియ స్వేచ్ఛా కవిత్వానికి అవకాశం లభించింది. ఆ పని నిది సమర్థవంతంగా నిర్వహించింది.

దార్శనికం నాలుగు పాయలుగా ప్రయోజన దిశల్ని విస్తరించింది. 1) మొదటి పాయ – పరంపరగా వచ్చే మార్గంలో యథాస్థితిలో అవసర మయిన మార్పుల్ని కోరుతూంది. పురోగమనాన్ని ఆహ్వానిస్తుంది. మూలాల్ని నిలుపుకుంటూ శాంతి యుత మయిన పరివర్తనతో సమాజ హిత లక్ష్యానికి ఉపక్రమిస్తూ పోతూంది. 2) రెండో పాయ – ఉదార ప్రజాస్వామ్య దార్శనికతను కలిగింది. సత్వర ప్రగతినీ, సమాన వికాసాన్నీ, శాంతి మార్గంలో సాధించే ప్రయత్నమూ చేస్తుంది. సహనంలో సమన్వయంతో పరివర్తనను ప్రోత్సహిస్తుంది. 3) మూడో పాయ – మార్క్సిజం సిద్ధాంతాన్ని అనుసరించింది. దీనిలో అంతర్భేధాలున్నాయి. ఒక విధం, లెనిన్ సామ్యవాద దృక్పథంతో ప్రజాస్వామ్య పద్ధతిని అంగీకరించింది. మరో విధం, హింసా మార్గంలో తీవ్రవాదాన్ని అవలంబించింది. మావో ఆలోచనా పద్ధతిలో కార్యాచరణకు పూనుకుంది. 4) నాలుగో పాయ – ఉపశాఖల (sub–alterns) తో కూడుకుంది. (1) స్త్రీ; (2) దళిత; (3) మైనార్టీ; (4) ప్రాంతీయ వాదాలతో తత్కాలంలో సామాజికావసరాలను సమస్యలనూ తీర్చడానికీ ఆ సమూహాల ఆకాంక్షల్ని నెరవేర్చడానికి ఉద్భవించింది. ఈనాలుగు పాయలూ పద్యం నిలిచిపోయిన బిందువు నుండి ఉపక్రమించాయి. స్వేచ్ఛా కవిత్వానికి వైవిధ్యాన్నీ విస్తృతినీ చేకూర్చాయి.

స్వేచ్ఛా కవిత్వానికీ విమర్శనకూ మధ్య పారదర్శకత అవసరమయ్యే అంశాల్లో

(బి) రెండోది, వస్తు ప్రతిపాదనం – విషయ భావనకు సంబంధించింది. ఇది భావగతమయిన దార్శనికతకు భౌతిక రూపాన్ని ఇస్తూంది. వీటి ఎన్నిక – నిర్వహణం కవి ఇష్టానికి సంబంధించింది. వెనుక నుండి దార్శనికత ప్రేరణ శక్తిగా పనిచేస్తుంది. నేటి స్వేచ్ఛా కవిత్వంలో వస్తు ప్రతిపాదనం – విషయ భావన వర్తమాన జీవన చలన రూపాలకు చెందిందిగా ప్రసిద్ధ మయింది. సామాజిక మయిన స్థితిగతుల పట్ల అవగాహనతోనే దీని నిర్వహణం సాధ్యం, ఈ విభాగం కవి స్వేచ్ఛాధీనమయింది. ఏ వస్తువునయినా ప్రతిపాదించ వచ్చు. ఏ విషయాన్నయినా స్వీకరించవచ్చు. అందువల్ల సంశయ వేళలో ఆనుకూల్యం (బెనిఫిట్ ఆఫ్ డవుట్) కవి పక్షమే. ఈ విధంగా స్వేచ్ఛా కవిత్వం అమూల్యమయిన వాహికగా సాధనంగా బాగా ఉపకరించింది. పద్యం పూర్తి స్థాయిలో అందుకోని స్థితుల్ని వహించింది. విశాల మయిన మానవీయ వేదిక పయి స్థిర పడింది. పద్యం నుండి ప్రత్యేక మయిన అస్తిత్వానికి కారణ మయిందీ ఈ అంశం. ఇందులో కవి ఫోకస్ చేసే క్షేత్రాల్ని గురించి దృష్టి కోణం గురించీ అభిప్రాయ భేదాలుండవచ్చు. సహేతుక మయిన పారదర్శకతతో మాత్రమే సమాలోచనాన్ని సమర్థవంతంగా నడిపించవచ్చు. కవిత్వానికి యశస్సునూ తీసుకొని రావచ్చు.

స్వేచ్ఛా కవిత్వానికీ విమర్శనకూ మధ్య పారదర్శకత అవసరమయ్యే అంశాల్లో (సి) మూడోది సృజన మనో రూపం – కవిత్వ కళకు సంబంధించింది. సాహిత్య సంస్కారంతో స్పందన గుణంతో అనుభూతి ప్రకాశంతో అభివ్యక్తి ప్రత్యేకతలతో కూడింది. ప్రేరణశక్తితో కవి అస్తిత్వానికి మూల మయింది. దీనిలో అభిప్రాయ భేదాల కెక్కువ ఆస్కారం లేదు. కానీ దీని పరిమితులూ ప్రాధాన్యాలూ మొత్తం మీద కవిత్వంలో విలువలకు సంబంధించిన స్థానం విషయంలో, రెండో ఆలోచనకు దారి తీస్తుంది. ఏమయినా ఇది కవికి వలెనే విమర్శకుని పరిణత వ్యక్తిత్వానికి పరీక్ష లాంటిది. ఇక్కడ నెగ్గితేనే శాశ్వతంగా నిలిచేది. శబ్ద ప్రయోగం ఔచిత్యం సంవిధానం అభివ్యక్తి రామణీయకత భావ ప్రసారం మొదలయిన అంశాలపయి చర్చకు నిలిపే అవకాశం ఉంది. ఈ విషయంలో పారదర్శకత చేత విమర్శకు ఆకర్షణ సిద్ధిస్తుంది. కొన్ని సందర్భాల్లో దీని ప్రశస్తి మిగతా రెండు అంశాలతోనూ ముడివడి రాణిస్తుంది.

కవిత్వం / కృతి అనేది మొత్తం మీద పూర్ణమయిన సజీవ సృజన రూపంతో దర్శన మిస్తుంది. కాబట్టి మూడు ప్రధానాంశాలూ అవసరమయిన పాళ్ళలో

సమాలోచనంలోకి వస్తాయి. పారదర్శకత (ట్రాన్‌పెరన్సీ) చేత విభేదాలకు గౌరవ ప్రదమ మయిన పరిష్కారం లభిస్తుంది. సమాలోచనా స్థాయి పెరుగుతుంది. అన్ని దిశల నుండీ వచ్చే విలువయిన భావాలకు నిలయంగా మనోరూపం ఏర్పడుతుంది. కవీ – విమర్శకుల అస్తిత్వానికి ప్రకాశవంతమయిన రూపాన్ని ప్రసాదిస్తుంది. కార్య కారణ సంబంధంతో పాటు దీన్ని అధిగమించిన విశేష స్థితులతో సృజన రూపం ఉంటుంది. కార్యకారణ సంబంధాన్ని అనుసరించి సమాలోచనం సాగుతుంది.

ఒకే సమయంలో ఒకే ప్రాంతంలో భిన్న మయిన ఆదర్శాలతో భిన్నమయిన మార్గాలలో వెలువడే విస్తారమయిన స్వేచ్ఛా కవిత్వం, ప్రజాస్వామ్య సమాజానికి చలన క్రియా రూపంగా కనిపిస్తుంది. పారదర్శకత (ట్రాన్స్‌పెరన్సీ) ప్రజాస్వామ్య విధాన స్థితుల్లో ఒకటి, అత్యంతమూ అవసరమయిందీ. కవిత్వమూ – విమర్శనమూ విషయంలోనూ వర్తిస్తుంది.

## 6. వర్తమాన కవిత్వం - వ్యక్తిత్వ ప్రకాశం

ఇపుడు వస్తూ ఉన్న స్వేచ్ఛా కవిత్వం వర్తమాన సామాజిక స్పందనలతో వెలువడుతూంది. జీవితంలో మనిషి ఎదుర్కొనే సమస్యల్ని గురించి ఆలోచన చేస్తుంది. లోనుండి తాత్త్వికత మెరపులా అపుడపుడూ బయట పడుతూంది. ప్రతి కవీ తన దయిన ప్రత్యేక ముద్రతో ఆకట్టుకునే ప్రయత్నమూ కనిపిస్తుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో లభించే బహు విధాలయిన అవకాశాలతో కవితా క్షేత్రం వైవిధ్యంతో పాటు విశాలతనూ పొందుతూంది. సమూహాలు సమూహాలుగా కవితా వేదికలు చిన్న చిన్న రాజ్యాల్ని తలపిస్తున్నాయి. దీనికి ముఖ్యంగా పత్రికలూ కొంత వరకు వివిధ సాహిత్య సంస్థలూ ఎంతో ప్రోత్సహిస్తున్నాయి. కవులూ కవిత్వమూ, పరిచయాలు సంబంధాలూ ఎక్కువయిన వాతావరణంలో కార్యకలాపాలూ ఎక్కువ అవడం సహజం. జీవితంలో అనేక సమస్యల్ని గురించి భావనా బలంతో కవితలు పత్రికల్లో ప్రచురిత మవుతున్నాయి. సంకలనాలు గానూ వెలువడుతున్నాయి. ఎప్పటికపుడు అంచనాల్ని మించి నిర్వచనాల పరిధులు పెరుగుతున్నాయి. విలువలు ప్రమాణాలు మారుతున్నాయి. ఇపుడు వస్తూన్న కవితా ప్రపంచాన్ని పరిశీలిస్తే స్థూలంగా విశ్లేషణలో నాలుగు దృష్టికోణాలు కనిపిస్తాయి.

1) వర్తమాన స్థితిలో గతం నుండి పూర్తిగా ముక్తమయి ఎప్పటికపుడు ప్రయోగశీలంతో స్వేచ్ఛా వర్తనం కలిగిందీ. 2) తాము నమ్మే సిద్ధాంతాలకు పూర్తిగా కట్టువడి పరివర్తన లక్ష్యాన్నీ చూపేదీ. 3) గతానికి సంబంధించిన ప్రభావాన్ని అవసరమయినత వరకు స్వీకరిస్తూ మార్పుల్ని కోరేదీ. 4) గతంలోని పరంపరా రూపానికీ ఈనాటి కొత్త దనానికీ మధ్య సమన్వయ భావంతో రెండిటి అవసరాన్ని భావించేదీ. ఈనాలుగు విధాలూ కవుల వ్యక్తిత్వాలతో వివిధ స్థాయిల్లో వస్తున్నాయి.

ఏ కవి కయినా కవిత్వంలో తన దయిన ప్రత్యేకమయిన వ్యక్తిత్వ ప్రకాశం ముఖ్యం. ఇది ఇతరుల నుండి వేరు చేసి చూపిస్తుంది. తమ దయిన భావనా పద్ధతిలో రచనా వైఖరి అభిప్రాయ విధంతో ఏర్పడిన వ్యక్తిత్వం చేతనే ప్రత్యేకత సాధ్యం. ఏ కవిత్వ మయినా కొన్ని పరిమితుల్లోనే తన ప్రభావాన్ని ప్రసరిస్తుంది. కవితా క్షేత్రాలలో కొన్ని మేరల్లో పని చేస్తుంది, మిగతా భాగాల్లో ఇతర ప్రత్యేకతలు పని చేస్తూ పోతాయి. వీటిచేత ఆపూర్ణమయిందీ వర్తమాన స్వేచ్ఛా కవిత్వం ముఖ్యంగా యువతరాల్ని విశేషంగా ఆకర్షిస్తూంది.

ఈ ప్రక్రియలో రూప భేదాలు నాలుగు రకాలుగా ఉన్నాయి.

1. ఒక వస్తువు కేంద్రంగా దానికి సంబంధించిన విషయ పరంపరతో దీర్ఘకావ్యంగా ఉంది; 2. ఒక భావ సూత్రం పయి అనేక మయిన దృశ్య విభాగాలతో అవతరించింది, దీర్ఘ మయిన ఆకృతి కలిగింది; 3. సమాజంలో ఒక స్థితినో సంఘటననో తీసుకొని భావనామయంగా కవితలూ; 4. పలు పేర్లతో చిన్ని చిన్ని కవితలు రూప భేదాల్ని పొందినవీ. ఈ నాలుగు రకాలూ ఆయా కవుల వ్యక్తిత్వ ప్రత్యేకతలతో కొత్త కవితా లోకాన్ని సంపన్నం చేశాయి.

సృజన క్రియలో కవిత్వం కవి వ్యక్తిత్వం నుండి వేరు కాదు. స్వతంత్ర ప్రవృత్తితో పాటు ప్రత్యేకతపై అభిలాష దీనికి మరింత బలాన్ని ఇస్తాయి. వ్యక్తిలో సూక్ష్మ సూక్ష్మంగా ఉన్నవి, కవితలో సందర్భోచితంగా ప్రతిఫలిస్తాయ. కవుల వ్యక్తిత్వాల్లో ప్రత్యేకతలు సమాలోచనంలో వేరు వేరుగా అనేకమయిన విశేషాలకు అవకాశాన్ని ఇస్తాయి. వీటిచేత సమాలోచనా ప్రక్రియకు విస్తృతి విశిష్టత లభిస్తుంది. కవిత్వంలో ముఖ్యంగా దీర్ఘ కావ్యంలో ఎక్కువగా ఒకచోట దృశ్యాదృశ్యంగా అంతర్లీనంగా అనుభవానికి వస్తుంది. కవి లౌకికమయిన వ్యక్తిత్వం ప్రతి కవితలో గుప్తంగానో సూచనగానో ఆలోచన కందుతుంది.

కవితావేశ స్థితిలో రచనా సందర్భానికి బయట లౌకిక స్థాయిలో కవి అందరు మనుషుల వంటి వాడే, అందరి వలెనే గుణాలతో అవగుణాలతో బలహీనతలతో వర్తిస్తాడు. ఎక్కడో ఒకటి రెండు విశేషాలు ఉండవచ్చు. సమాజ సంబంధాలతో పరిచయాలతో ఏర్పడేవీ. జీవితంలో మలుపును తెచ్చేవీ. కవిత్వంలో బాహ్యసౌందర్యంతో పాటు ఆంతరమయిన గుణ సంపద పయినా దృష్టి పెట్ట వలసిన అవసరాన్ని కలిగిస్తూంది. సమాలోచనంలో దీనికి మనస్తత్వ శాస్త్ర పరిచయం అవసరం. లోకానుభవ పరిశీలనమూ బాగా తోడ్పడుతుంది.

మరో విషయం, సామాజిక రాజకీయ ప్రభావమూ, కవి వ్యక్తిత్వంలో పని చేస్తుంది. స్వేచ్ఛకు అవకాశమున్న ప్రజాస్వామ్య స్పృహ ప్రేరకంగానూ ఉంటుంది. ప్రజాస్వామ్య భావన సృజనేచ్ఛ పయి ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ చాలా బలంగా పని చేస్తుంది. ఈ అంశం వర్తమాన కవిత్వంలో గతంనుండి వేరు చేస్తూంది. ఈ స్థితిలో శిల్పాల్లా నమూనాలలో కవిత్వ రచన జరిగే వీలు లేదు నిరంతర గమన శీలం గల వర్తమాన చేతనతో సామాజిక రాజకీయ ప్రభావాలతో సంపన్నమయిన వాతావరణం కవిత్వంలో ప్రవేశించడం జరుగుతుంది. కవి వ్యక్తిత్వంలోనూ దీని ప్రతిఫలనం కృతిలో ఆధునికతను చేకూరుస్తూంది.

ఇక వ్యక్తిత్వ విషయంలో కవిలో శీలానికీ కవిత్వానికీ మధ్య అవగాహన సమన్వయం అభిలషణీయమే కాదు ఆదర్శం దృష్ట్యా అవసరమూ. ఇది కవి అస్తిత్వానికి దీప్తి నిస్తుంది, పూర్ణతను చేకూరుస్తుంది.

ఏ విధమయిన ప్రత్యేకత లేని కవిత్వానికి గుర్తింపు ఉండదు. ఆత్మ ప్రత్యయంతో 'నేను' అన్న భావనా బీజం నుండి ఉద్భవించిన సృజన రూపం ఎదిగి విస్తరించి ఉన్నత శిఖరాన్ని పొందడం జరుగుతుంది. దీనికి 1) కొత్త దనాన్ని అన్వేషించడమూ; 2) అమూల్యమయిన దాన్ని పొందడమూ; 3) శక్తివంతమయిన అభివ్యక్తి రామణీయకతను / ఆకర్షణనూ కలిగి ఉండడమూ జరగవలసి ఉంటుంది.

ఈ దశలు స్థూలంగా ప్రతి కవి వ్యక్తిత్వంలోనూ, సూక్ష్మంగా ఆ వ్యక్తిత్వ శక్తి రూపమయిన కవిత్వంలోనూ విశ్లేషణ కందుతాయి.

కవిత్వంలో మొదటి పదం నుండి చివరి పదం దాకా పర్యాప్తమయి, కృతి మొత్తం మీద వ్యక్తిత్వం నిలిచి ఉంటుంది. ఇది ఒక పక్షం వైపు మాట్లాడుతున్నట్లు

ఉండవచ్చు. ఒక సిద్ధాంతానికో వాదానికో కట్టు బడి ఉండవచ్చు. ఒక ఆదర్శానికి ప్రాతినిధ్యం వహించవచ్చు. ఇది దార్శనికతలో సూటిగా స్ఫుటంగా ఉండవచ్చు. కళాత్మకతతో గుప్తంగానూ ఉండవచ్చు.

కాలాంతరాన వర్తమానం గతమవుతుంది. సమాజ సంస్కృతిలో భాగమవుతుంది. విశేషం చిహ్నమై నిలిచిపోతుంది. వర్తమాన స్వేచ్ఛా కవిత్వం కవి స్వేచ్ఛా వ్యక్తిత్వానికీ, కొత్తదనం కోరే సంకల్పానికీ, మానవీయ స్పందనకూ, సమాజ హిత భావనకూ నిలయమయిందీ, ఆదరణీయమయిందిగానూ స్థిరపడింది.

## 7. సృజన క్రియ - కవిత్వం

కవిత్వం అవతరణంలో సృజన క్రియ వివిధ దశల్లో నుండి సాగుతుంది. వీటిలో మొదటి దశ స్పందనం. ఆధునిక యుగంలో కవిత్వానికి ప్రధానమయిన ప్రేరణం సామాజికం. వస్తువు మానవీయమయిందీ. విషయం వాస్తవ జీవన స్థితిగతుల్ని పొందిందీ. ఈ ఆలోచనా ప్రపంచానికి స్వేచ్ఛా కవిత్వం బలమయిన వేదికగా నిలిచింది. ఈ నేపథ్యంలో ఈనాటి సామాజిక మయిన వస్తు సూత్రంతోనో విషయ విశేషంతోనో ఒక స్థితిలో అనుభవంతోనో దాన్ని గురించి ఆలోచనతోనో కవి మనసులో కదలికయే స్పందనం. ఇది సృజన ప్రక్రియలో మొదటి దశ. ఈ కదలిక ఎప్పటికపుడు కొత్తగా సహజంగా పైకి లేచే / ఎగసే / ఉబికే / చిమ్మే స్థితి కలిగిందీ. స్థూలమయిన ఆకృతి రేఖల్ని వహిస్తుంది. ఇది సృజన ప్రక్రియలో రెండోదశ. ఏ రూప భేదాలకు చెందిందయినా కవులందరిలో మూలతః జరిగే సృజన ప్రసార రేఖలొకటే. వీటి కేంద్ర బిందువు స్థానం వేరు కావచ్చు. కవి ఒకరే అయిన ఒక్కొక్క కవిత ఒక్కొక్క విధమైన ప్రసారాల్ని కలిగి ఉంటుంది. ఇది భావమయ మయింది. తొలిగా ఏర్పడిన రేఖల మధ్య ఖాళీలను పూరిస్తుంది. మానస క్రియకు చెందింది. ఈ రూప విశేషం సృజన క్రియలో మూడో దశ. ఉద్వేగ మయిన స్థితిలో శబ్దం ఒక దాని వెంట మరొకటి చేరుతూ అర్థవంత మయిన వాక్య నిర్మాణ దిశగా సాగే రచనా యానం, సృజన క్రియలో నాలుగోది. ఇది కవిత్వంలో భావ జగత్తును వహించే భౌతిక రూపం శరీరం లాంటిది. వాహనం లాంటిది. ప్రధాన మయిన ఈ నాలుగు దశలూ మొదటి నుండి చివరి వరకూ ఒక క్రమంలో ఉంటాయి.

ఇది పరంపరగా కృతిలో సాగుతూ పోతుంది. కవి మనసులో ఒక యోజనతో / పథకంతో / వ్యూహంతో వివిధ సందర్భాల్లో పనిచేస్తుంది. కవిలో స్పందనతో మొదలయిందీ, సృజనక్రియ విభాగాలుగా (units) తీర్చబడుతుంది. క్రమంగా నిర్మాణ రూపాన్ని పొందుతుంది. అభివ్యక్తి ప్రత్యేకతలతో కవిత్వంగా ఆకర్షిస్తుంది. చాలా వరకు ఈ నాలుగు దశలతోనే రచన సిద్ధించి నప్పటికీ శిల్ప దృష్టితో కళాత్మక మయిన యత్నం చివరిదిగా చోటు చేసుకుంటుంది. సృజన క్రియలో ఇది అయిదో దశ. ఈ సందర్భంలో ఉద్వేగం ఉండదు. శాంతంగా ఆలోచనతో సరిదిద్దే చర్యకు దిగుతుంది. ఇది కాన్షస్ ఆర్టిస్ట్ (conscious artist) అయిన కవిలో ఎక్కువగా ఉంటుంది. ఇది పేపర్ పయి జరగాలని లేదు. మనసులో జరుగుతుంది. ఆ రచన చివరలోనూ జరగవచ్చు. ఎపుడో ఆ తరువాతనూ జరగవచ్చు.

ఈ సృజన క్రియలో లీనమయిన / మగ్నమయిన సమయంలో క్షణాలు లౌకికేతర మయిన అనుభవ గుణంతో గడుస్తాయి. ఆ సమయం దాటాక సామాన్య మవుతుంది. లోక సహజమయి పోతుంది. వ్యక్తి జీవితంలో అనుభవాలూ ఆలోచనలూ సంబంధాలూ విద్యా సంస్కార రీతులూ సాంస్కృతిక సాహిత్య వాతావరణం తో ఏర్పడిన వ్యక్తిత్వంలో ఉన్నది కవిత్వంలోను ప్రతిఫలిస్తుంది. దీని వెనుక నుండి తాను నమ్మిన సిద్ధాంతాల విశ్వాసాల దార్శనిక ప్రేరణమూ పరిస్థితుల ప్రోత్సాహం దృష్టికోణాల కవకాశాలూ సృజన రూపానికెంతో ఉపకరిస్తాయి.

కవుల్లో మానసిక మయిన సృజన ప్రక్రియకు మూలం రెండు విధాలుగా గోచరిస్తుంది. ఒకటి అప్పటికపుడు ఇన్‌స్టంట్ గా స్పందించే స్థితి నుండి వెలువడేది. రెండోది కాస్త విరామం తరువాత స్తిమితంగా హేతువుతో / లేదా యుక్తాయుక్త వివేచనతో వెలువడేది. ఇవి కవిలో అప్పటి ఉద్రేక స్థాయిని బట్టీ ఉద్వేగ రీతిని బట్టీ – ఏర్పడే మానసిక సంసిద్ధత ననుసరించి ముందుకు కదలుతాయి.

## II

కవిత్వం చదవగానే లేదా వినగానే దాని ప్రతిరూపం పాఠకుల శ్రోతల మనసులో బింబిస్తుంది ముద్రవేస్తుంది. ప్రతి స్పందనమూ మనసులో నిశ్శబ్దంగానూ బయటికి సశబ్దంగానూ ధ్వనిస్తుంది. కవిత్వ శాఖ పయి చేరిన మనస్సు లౌకికమయిన స్థితి నుండి పైకి ఉత్క్రమిస్తుంది. ఆ కాసేపు మనస్సు ఉత్పథంలో చరిస్తుంది. ఆ

తరువాత కిందికి దిగుతుంది. ఇక్కడ అభిప్రాయ భేదాలూ గుణ దోష విచారణలూ మొదలయిన సమాలోచనం మొదలవుతుంది. ఇది సృజన రూపానికి అనుబంధంగా చేరుతుంది.

దేశానికీ కాలానికీ స్థితులకూ చెందిన పరిమితుల్లో సాగిన సృజన రూపం సారభూతంగా సార్వజనీన మయిన భావాన్నీ సార్వకాలిక మయిన నిజాన్నీ అందిస్తుంది. సృజన కృతి ప్రభావాన్ని ఖచ్చితంగా తేల్చి చెప్పడం కష్టం. ఏ కారణంచేతనో సానుకూల వ్యతిరేక దృష్టి భేదాలకు దారి తీయవచ్చు. ఏమయినా పాఠకుడు లేదా శ్రోత మనస్సు పునర్జవాన్ని పొందుతుంది. పునర్వి లోకనానికవకాశమూ దొరకుతుంది.

సృజన క్రియలో ఈ నాలుగు అయిదు దశలు దేనికదిగా కాక సామూహిక ప్రభావాన్ని నెరపుతాయి. ఇది బయటికి స్పష్టంగా తెలియనంత సూక్ష్మ స్థాయిలో ఉంటుంది. సృజన కృతికి మూల ప్రేరణ శక్తి తెలియకపోవచ్చు. నేపథ్యం తెలియక పోవచ్చు. ప్రభావాలు తెలియక పోవచ్చు. కవి హృదయంతో ఒకటయి సాధారణ లోకాన్ని మరపించే అపూర్వమయిన అనుభవ విశేషం చేత జీవిస్తాయి. అయితే పాఠకుడు లేదా శ్రోతలో స్పందన గుణంతో పాటు అవగాహనకు కావలసిన సుస్థితీ అవసరం. దీనితో పాటుగా అనుశీలనం వివేచనం ఎంతగానో ఉపకరిస్తాయి. వీరిలో మూల్యాంకనమూ జరుగుతుంది. తాము నమ్మే వాటికి దగ్గర చేయవచ్చు. దూరమూ చేయవచ్చు. ఈ విధమయిన కృతులతో పోలికలూ మొదలుతాయి. విశేషాలూ అలరిస్తాయి. అంతా బహిరంగమే. రహస్యమేమీ లేదు. ఇది దీపంలా వర్తిస్తుంది. మనసు మనసుకూ వెలుగును ప్రసరిస్తుంది. కృతి అవ్యయంగా యథాస్థితిలోనే ఉంటుంది, ఎప్పటికీ. పెరిగేదీ లేదు, తరిగేదీ లేదు. ఇది ఎన్ని విధాలుగా చూడబడుతుందో ఎవరూ చెప్పలేరు. అంతశ్శక్తి ఉన్నది మాత్రం ఆమోదయోగ్యంగా ఆకర్షణీయంగా నిలుస్తుంది. వ్యక్తి పరంగానే కాక సమాజ పరంగానూ సాహిత్య సంస్కృతిలో భాగమవుతుంది.

కవిలో అనివార్యంగా ఉండే బహిర్ముఖమూ అంతర్ముఖమూ ప్రతి కవితలో అంతో ఇంతో ఎక్కువ తక్కువలుగా స్పష్టంగానో సూచన గానో ఏర్పడతాయి. ఇరువైపుల హత్తుకొనీ పొరలు పొరలుగా రూపొందుతాయి. పొరలు ఒలిచేస్తే మిగిలేది ఏమీ ఉండదు. అందువల్ల బాహ్యమయిన ఆకర్షణతో పాటు ఆంతర మయిన సౌందర్యం

పయి దృష్టిఅవసరం. వీటి సహయోగంతో సృజన రూపానికి ఉదాత్తమయిన లోతయిన స్థితులు ఏర్పడతాయి.

మన చుట్టూ ఉన్న సమాజంతోపాటు, ప్రకృతినీ అనేక విధాలుగా భావ రూపాల్లో ప్రతీకల్లో మరవడానికి వీలు లేనిది గానూ, వీటి పైన పలు భూమికల్ని నిర్వహించే మనో రూపాన్నీ సృజన రూపంలో దర్శించవచ్చు. సహేతుకమయిన సమాలోచనానికీ అందుతాయి. ఇదంతా వివిధ దశలలో నుండి క్రమించి సాగిన సృజన క్రియా ఫల స్వరూపం అయిన కవిత్వం, క్రొత్త ప్రపంచాన్ని దర్శింప జేస్తుంది.

## 8. కవిలో విమర్శనం పాత్ర

ప్రతి కవిలో ఒక విమర్శనం పాత్ర తప్పని సరిగా ఉంటుంది. సృజన భావన శబ్దంలోకి సంపరివర్తనం (ట్రాన్స్‌ఫార్మ్) చెందే క్షణం నుండీ పని చేయడం మొదలు పెడుతుంది. ఇది లోపల నిశ్శబ్దంగా సాగుతుంది. తత్కాలంలోనూ అవసరమయితే కొంత సమయం పైన సృజన కృతిని నియంత్రిస్తుంది. ఆ దారిని చక్క పరుస్తుంది. విస్తృతం చేస్తుంది. ఒక స్థితి లేదా ఘటన లేదా విషయం ప్రేరణగా నిస్తుంది. దీనికి ముందుగానో ఆ తరువాతనో దాన్ని గురించి మంచి చెడూ అవసరం ప్రయోజనం మొదలుగా ఆలోచన నిలుస్తుంది. ఈ ఆలోచనా రూపమే కవిలో విమర్శనకు ఆధారం. కవి అయిన ప్రతి ఒక్కరిలో తనతో పాటు తన చుట్టూ ఉన్న జీవితాన్ని గురించీ సమాజాన్ని గురించీ పరిశీలనాసక్తి ఉంటుంది. దీని కారణంగా ఒక విశేష మయిన స్థితిలో తత్కాలంలో సద్యః స్పందనతో ఆవేశస్థితి నుండి భావం భాషలో వాగ్రూపాన్ని పొందుతుంది.

కవిత్వంలో శీర్షిక నుండి ముగింపు వరకూ ఏదో ఒక స్థానంలో కవిలో విమర్శన పాత్ర పని చేస్తూనే ఉంటుంది. ఏదో ఒక స్థానం అంటే రచనలో భాష వస్తువు విషయం భావం అభివ్యక్తి మొదలయిన అంశాల్లో ఏది ఎంత వరకు అవసరం? సముచితం? ప్రయోజనం? అన్న ఆలోచనలో విమర్శనం చోటు చేసుకుంటుంది. కవిత్వానికీ లేదా కృతికీ నిలిపే శీర్షిక / పేరు, ఏ వస్తువునో భావాన్నో లక్ష్యాన్నోరచనకు తగిన విధంగా సూచించేదిగా ఉండడం జరుగుతుంది. ఇదే విధంగా రచనలో

సంవిధానానికి సంబంధించిన వివిధాంశాల నిర్మాణంలోనూ దృష్టికి వస్తుంది. ఇది సృజన సమయంలో ఒక క్రమంలో ఉంటుంది. దీన్ని బట్టి రచన సుగమంగా తన దయిన వ్యక్తిత్వంతో ముందుకు వెళ్ళుతుంది. ఇది ఎప్పటి కప్పుడు రూపొందుతూ ఉంటుంది. అపుడపుడూ విరామ సమయంలో పునరాలోచన కవకాశం దొరకుతుంది. ముందు మానసికంగా భావ స్థానం నుండి శబ్ద స్థానానికి పరివర్తన చెందుతూ పోతుంది. దీనికి ముందుగా కవిలో ఒక స్పందన గుణంతో ఉద్వేగ స్థాయి నందు కున్న స్థితి ఉంటుంది. ఆ వెనుకనే సృజన రచనలో వస్తువు నుండి విషయం దాన్ని నిర్వహణం కవిత్వ కళతో పాటుగా జీవితం – సమాజం గురించి ఆలోచనా దృష్టి కలిగిన కవిలో విమర్శన పాత్ర సంసిద్ధంగా ఉంటుంది. ఇది వ్యక్తిలో సంస్కారమూ విద్య మొదలయిన వాటి చేత ఏర్పడింది. పూర్తిగా శబ్ద ప్రపంచంలోకి మారిన తరువాత కూడ కొందరిలో రెండో ఆలోచన (సెకండ్ థాట్) తో అనుశీలనం జరుగుతూ ఉంటుంది. మార్పులు జరుగుతూ ఉంటాయి.

కవిత్వం ఒక వాక్యం నుండి దీర్ఘమవుతూ పోయే కొద్దీ కవిలో విమర్శనా దృష్టి విస్తరిస్తూ పోతుంది. కొందరు కవులు ఈ సందర్భంలో ఆ స్థితికి బలాన్ని దీప్తిని కలిగించడానికి కవిత్వం గురించి నిర్వచనాలు అభిప్రాయాలు ప్రకటించడమూ జరుగుతుంది. ఇవి చాలా సంక్షిప్తంగానూ సారభూతంగానూ ఏర్పడతాయి. కృతిని గురించి సహృదయులకూ పాఠకులకూ శ్రోతలకూ ఒక దారి సూచిస్తున్నట్లు ఉంటాయి. ఆపైన వ్యాఖ్యానాన్ని ఆశిస్తూ ఉన్నట్లుగానూ ఉంటాయి. ఇవి నిస్సందేహంగా కవిలో విమర్శన పాత్ర ప్రభావాలే. ఒక విధంగా కవిత్వం గురించి కవి ఆదర్శాన్ని బింబిస్తాయి. కవి దృష్టిలో ఆలోచనకు పురికొల్పుతాయి. సమాలోచనా సందర్భంలో విమర్శకులు అంగీకరించవచ్చు అంగీకరించక పోవచ్చు. మరో దృష్టితోనూ పరిశీలించవచ్చు. ఇది వేరే విషయం.

కృతి ప్రకటిత మయిన తరువాత అది ఆ మూల కృతి (టెక్స్ట్) కి స్థిర రూపం ఏర్పడుతుంది. కవి ప్రమేయం ఉండదు. బయటి విమర్శకునికి ప్రవేశం లభిస్తుంది. సమాలోచనం అతని స్వేచ్ఛా పరిధిలోనిది అవుతుంది. అయితే కవి దృష్టితో పాటు (స్పష్టంగా చెప్పినా చెప్పక పోయినా) కృతిని బట్టీ, సూచనలో కవి దృష్టితో పాటు బయటి విమర్శక దృష్టితో సమాలోచనం జరగడం పూర్ణతను చేకూరుస్తుంది. కవిలో

విమర్శన పాత్రకు సమంగా అంతకన్నా ఎక్కువగానూ విమర్శకుల సమాలోచనం ఉంటుంది. విశ్లేషణం వివరణం వ్యాఖ్యానం గుణ దోష విచారణం మూల్యాంకనం నిర్ణయం మొదలయిన అంశాలతో విస్తరించి నిలుస్తుంది. ఈ ప్రక్రియకు కవిత్వం నుండి భిన్నమయిన అస్తిత్వాన్ని చేకూరుస్తుంది.

**2**

కవిలో అంతర్నిహిత మయిన మూల మనో భావాల (బేసిక్ ఫీలింగ్స్)కు సంబంధించిన సంప్రేరణతో ఉద్భవించిన కవిత్వాన్ని గురించి సమాజానికి పరిచయం చేయడం సందేహాలు తీర్చడం మొదలుగా కావ్యప్రశస్తికీ, ప్రకాశవంతమయిన ఆలోచనకూ కారణమయిందీ విమర్శకుల సమాలోచనం. కవి అయినా విమర్శకుడయినా వ్యక్తిగత మయిన అభిప్రాయం వేరు, కావ్యగత మయిన అభిప్రాయం వేరు. రెండింటిలో ఆలోచనకు ఆరంభ బిందువులు వేరు వేరుగా ఉంటాయి. ఎక్కడో కలిస్తే కలుస్తాయి.

కవిలో విమర్శకుడు కవి దృష్టి వలయానికి పరిమిత మవుతాడు. బయటి విమర్శకుడు కొంతవరకు కవిదృష్టిని పరిగణన లోకి తీసుకొనీ, తన దృష్టి వలయానికి పరిమిత మవుతాడు. కవి సంవేదన పట్ల సానుభూతితో కృతి పట్ల అవగాహనతో బయట నుండి విమర్శనం, ఏ స్వలాభాపేక్ష లేకుండా ఉత్తమమయిన ఆలోచనా పథంలో నడుస్తుంది. సార్వజనీనమయిన విలువలకు ప్రయత్నిస్తుంది. ఈ సందర్భంలో మారుతున్న కాలంతో సమాజమూ అభిరుచిలో తేడాలూ లక్ష్యాల్లో భేదాలూ గమనించవలసిన అవసరమూ బాగా ఉంటుంది.

గతం స్మృతిలో నిలుస్తుంది. వర్తమానం జీవన గతిలో ఉంటుంది. ఈ రెండింటినీ కలుపుతూ పోయే ఉత్తమ సాధనంగా కవిలో విమర్శన పాత్ర నిలిచి ఉంటుంది. కవిలో మును ముందూ సృజన పార్శ్వమూ, వెనుకనుండి విమర్శనా పార్శ్వమూ ఒకే ఒక ఉత్తమ కవిత్వ లక్ష్యంతో పనిచేస్తాయి. సమాజంలో వచ్చే మార్పులూ వ్యక్తిలో ఉండే ఆదర్శాలూ అంతర్భేధాలూ కావు. విజ్ఞానశాస్త్రం అభివృద్ధి చెందే కొద్దీ మనిషి జీవితం సుఖమయ మవుతుంది. సమాజం సుసంపన్నమవుతుంది. ఆర్థిక సామాజిక స్థితుల్లోనూ మార్పులు సహజం. వీటిపట్ల అవగాహనతో వివేకంతో కవిలో విమర్శన పాత్ర ఉపయోగకరంగా వర్తించ వలసి ఉంటుంది. ఏ మార్పూ

ఎవరి కోసమో ఆగదు. ఉదారీకరణం ప్రపంచీకరణం మొదలయినవి ఈ కోవలోవే. కవిలో సృజన రూపం ఏ దారినయినా వరిస్తుంది. కవిలో విమర్శన పాత్ర దేనికయినా సంసిద్ధమవుతుంది. రెండింటి లక్ష్యం కవిత్వంలో సజీవమయిన పూర్ణతయే.

ఏమయినా కవిలో పరోక్షంగా పనిచేసే విమర్శన పాత్ర ప్రాధాన్యాన్ని ఎత్తి చూపడమే ప్రస్తుతోద్దేశం.

## 9. విమర్శనం - సహృదయ హృదయత - స్ఫురణ విశేషం

విమర్శనంలో – సహృదయత అనేది శరీరంలో హృదయ స్థానీయ మయింది. హేతువు కతీత మయింది. ఉదాత్త స్థాయిలో వర్తిస్తుంది. "నిరంతరం కావ్యాల అనుశీలనం చేత" ('నిరంతర కావ్యాను శీలనయా ముకురీభూతే మనసి') – ఆ అనుభవంతో ఆలోచనతో ఏర్పడే సంస్కారం వల్ల మనసు అద్దంలా భాసిస్తుంది. స్ఫురణ చేత ప్రతిఫలన శక్తిని పొందుతుంది. ఇది భారతీయాలంకార శాస్త్ర సమ్మతమయింది. ప్రసిద్ధ మయిందీ. ఇది హృదయ సంవేద్యమయింది. ఈ మాట ఇప్పటికీ ఎప్పటికీ వర్తిస్తుంది. పూర్వమూ ఇప్పుడూ కవుల కవిత్వం సహృదయ సమాజం చేతనే చిర మయిన ప్రశస్తినీ స్థిరతనూ పొందుతూంది. 'సహృదయ' హృదయత అన్న మాట ఎంతో నేపథ్యం కలిగింది. వివిధ కవుల కావ్యాలతో పరిచయానుభవమూ సద్యః స్పందన గుణమూ గ్రహణ పారీణతతో పాటు స్ఫురణ ప్రకాశంతో ఉత్తమ సంస్కారంతో కూడింది. ఈ కేంద్ర వలయం నుండి ఇతరమైన అంశాలతో విస్తరించిన విశాల క్షేత్రం విమర్శనం. ఇది సమాలోచనాత్మకమయింది. స్వేచ్ఛా కవిత్వంలో ఆధునిక దృష్టితో కవి జీవితం వ్యక్తిత్వం మొదలుకొని సామాజిక ప్రభావం నుండి అభిప్రాయాల్నీ ఆదర్శాల్నీ కవిత్వ కళకు సంబంధించిన వివేచనంతో మూల్యాంకనం నిర్ణయంతో అవసరమయిన ప్రక్రియగా రూపొందుతూంది. ఇందులో సిద్ధాంత భాగం వేరు, అన్వయ భాగం వేరు. ఈ సహృదయ హృదయత రెండో భాగానికి సమీపంగా వర్తిస్తుంది. క్షుణ్ణంగా అధ్యయనం చేయవలసి ఉంటుంది. అయితే సహృదయ హృదయతకు రమ్యమయిన స్ఫురణం ('రమ్యమ్ స్ఫురణమ్') ముఖ్యం. పరంపరగా వచ్చే ప్రక్రియకు సంబంధించిన మర్యాదలతో పాటు

ఎప్పటికపుడు వచ్చే మార్పుల్నీ గమనిస్తూ జరిపే సమాలోచనం ఈనాడు చాలా అవసరం.

సహృదయ హృదయతకు గభీర మయిన చింతనమూ (సీరియస్ థాట్) రచన పయి ఆసక్తీ అవగాహనతో పాటు వివేచనమూ తప్పనిసరి. దీని విస్తృతిలో జరిగే సమాలోచనం విమర్శనా ప్రక్రియకు పుష్టినీ పూర్ణతనూ చేకూరుస్తుంది. విమర్శనంలో కీలకమయిన పాత్రను పోషించే సహృదయత, హద్దులు దాటితే స్తుతి క్రిందికి వస్తుంది. ఈ స్థితిలో విమర్శ ప్రవేశిస్తుంది. నిర్ణయం మూల్యాంకనంతో తనదయిన ప్రత్యేకతను ప్రదర్శిస్తుంది. సహృదయత తత్కాలంలో అప్పటికపుడు స్పందించే గుణంతో, 'స్ఫురణ' విశేషంతో కేవలం అనుభవ స్థాయిలో కృతిని మాత్రమే ఆశ్రయించి ఉంటుంది. వేరే బయటి విషయాలతో ఏ మాత్రం సంబంధం పెట్టుకోదు. పూర్వం కొన్ని కృతులపయి సాధారణ స్థాయిలో అర్థ తాత్పర్యాలతో అక్కడక్కడా విశేష సూచనలతో వ్యాఖ్యానాలు వెలసాయి. ఇది కృతి పరిచయానికీ ప్రవేశానికీ అవగాహనకూ బాగా తోడ్పడతాయి. విమర్శనా లోకానికిది చాలదు.

ఈనాడు స్వేచ్ఛా కవిత్వం పయి 'సహృదయత' కోల్పోకుండా ఖండిక అయితే దాని కదిగానూ కావ్యమయితే మొత్తంమీద సమగ్రమైన సమాలోచనంతో విమర్శ రావలసి ఉంది. దీనివల్ల దోషాలు పునరావృతం కాకుండా గుణాలు మనసుకు పట్టేట్లు గానూ, హ్లాదానికీ వికాసానికీ ప్రబోధానికీ బాగా అవకాశం కలుగుతుంది. సమగ్రత సిద్ధిస్తుంది.

విమర్శనంలో సహృదయతకు చేర్పుగా, సామాజిక దృష్టీ దార్శనిక పరిచయం మానవీయ భావన వైజ్ఞానిక ప్రగతి స్పృహతో పాటుగా వచ్చే మార్పుల పట్ల అవగాహన చాలా అవసరమవుతాయి. ఇది సాహిత్యంలో ఎంతో బాధ్యతతో కూడింది. ఏ లాభమూ లేని మనో రూపంతో కర్తవ్యాన్ని పాలిస్తుంది. స్వల్ప విషయం నుండి మహా విషయం వరకూ అన్నిటినీ స్వీకరించే ఆలోచనా విశాలతను కలిగింది, ఈనాడు ఏవేవో అభిప్రాయభేదాలు కారణంగాను అల్పమయిన విషయాలు ప్రవేశించి సహనాన్ని కోల్పోవడం, సంస్కారాన్ని మరచిపోవడం జరుగుతూంది. మనిషిలో సాధారణ స్థాయిలో ఇలాంటివి అపుడపుడూ జరగడమూ సహజం. కాలాంతరాన విలువలతో కూడిన రూపమే స్థిరపడుతుంది. స్వేచ్ఛా కవిత్వంలో

మారిన దృష్టికోణాల్లో వ్యక్తీ – సమాజమూ, జీవితమూ, దార్శనికత, ఆదర్శమూ – ప్రవర్తనం, మానవత – విశ్వశాంతి – కి సంబంధించిన సంబంధాలతో వాతావరణం విశాలతరమైంది స్పష్టంగా కనిపిస్తుంది. సాన్నిహిత్యంతో పాటు వైరుధ్యమూ లేకపోలేదు. ఇవి కవిత్వ కళగా శబ్ద ప్రపంచంలోకి ట్రాన్స్‌ఫర్ (మారే) అయ్యే స్థితి ప్రత్యేకమయింది. ఈ స్థితుల్లో భేదాలే గుర్తింపునకు కారణాలవుతాయి. మాథ్యూ ఆర్నాల్ట్ పేర్కొన్నట్లు కవిలో ఉండే లోహాన్ని బంగారంగా మార్చే అపూర్వ మయిన స్పర్శవేది – ప్రభావాన్ని గుర్తించగలిగిన శక్తి ఒక సహృదయ హృదయానికే ఉంది. ఇది 'రమ్య' మయిన 'స్ఫురణ' చేత వశమవుతుంది. హేతువు కతీత మయిన స్పందనగుణంతో ప్రకాశిస్తుంది. ఇది కేంద్రంగా విమర్శనం వివరణకూ వివేచనకూ హేతుదృష్టికీ నిర్ణయానికీ నిలయమవుతూంది. కవిత్వానికి ఆలోకన కాంతిగా ఉపకరిస్తుంది. సహజమయిన ప్రతిభతో పాటుగా, కవి తాను పొందే సంస్కార సంపదతో సృజన రూపం సిద్ధిస్తుంది. కవిత్వం శబ్దమయమై కళాకృతిలో దర్శనమిస్తుంది. సహృదయత మరియు విమర్శనం రెండూ సమాలోచనానికి చక్రాల వంటివి.

సహృదయతకు వెలుపల నుండి సంప్రదాయ చ్ఛాయలూ చారిత్రక నేపథ్యమూ కవి వ్యక్తిత్వమూ మార్పులతో మానసికంగా నవ్యత గురించి ఆలోచన జ్ఞానోపలబ్ధికి తోడ్పడుతాయి. హ్లాదకరమయిన స్థాయిలో అనుభవాన్ని కలిగించేదీ, ప్రబోధకరమయిన స్థాయిలో వికాసాన్ని కలిగించేదీ కవిత్వం, సహృదయత ప్రధానంగా స్పందన గుణంతో 'స్ఫురణ' రమ్యమయిందీ. వీటిని గుర్తిస్తూ వివరణంతో విస్తరణ రూపం కలిగిందీ విమర్శనం. సహృదయ హృదయత సమాలోచనంలో కీలకమయిన స్థానం కలిగిందీ, ప్రాణవంతమయిందీ. శాశ్వత మయిన యశోరూపాన్ని కృతికి సంతరింప జేసేదీ.

## 10. వాద వివాద విమర్శనం

కవి సృజన ప్రతిభకు వశమయి సాహిత్య ప్రియులు హ్లాదాన్ని పొందడం మానసికమయిన ఉన్నతికి చేరడం సహృదయ లక్షణం. తాను పొందే అనితరమయిన ప్రభావాన్ని మరొకరికి అందించే సత్ప్రయత్నం సమాలోచనం. ఇది కృతిలోని బహిరంతస్సౌందర్యాన్నీ విశేషతనూ ప్రకాశింపజేయడమే ప్రధాన లక్ష్యంగా కలిగిందీ. దీన్ని సహేతుకమయిన చర్చకు నిలిపి గుణ దోష నిర్ణయాలతో విలువలతో

మూల్యాంకనం చేయడం విమర్శనం కర్తవ్యం. ఒక విషయాన్ని గురించి పలువురి అభిప్రాయాల ప్రకటనంతో విభిన్న కోణాలతో చర్చకు నిలయమయిందీ, వాద వివాద విమర్శనం. ఒకరిలో తాము అనుకున్నదానికి అనుగుణంగా లేదని భావించి కృతి విమర్శకు పూనుకునే వ్యతిరేక దృష్టినుండి మొదలవుతుంది. దీనికి అనుగుణంగా సమర్థించేవారూ, అనుకూలంగా కృతిని సమర్థించేవారూ ఇరు పక్షాలుగా వ్యవహరించడం జరుగుతుంది. వాదానికి దిగీ వివాదానికి దారితీసే చర్చాగతమైన మనోరూపం స్పష్టమవుతుంది. వీటిలో ప్రాధాన్యం కలిగినవి సాహిత్య చరిత్రలో ఆయా సందర్భాల్లో పేర్కొనబడతాయి కూడా. వీటి ప్రయోజనమూ ఉంది. మొత్తం మీద ఇతర రచయితలు తీసుకోవలసిన జాగ్రత్తల్ని సూచిస్తాయి. ముందుగా దోషాల్ని గురించి హెచ్చరిస్తాయి. ఆయా క్షేత్రాల్లో కొంత పరిజ్ఞానాభివృద్ధికీ తోడ్పడతాయి. తరువాతి కాలంలో ఆయా విషయాలకు సంబంధించిన జ్ఞాపకాల్ని అలరిస్తాయి. విషయంపై ఆసక్తిని నిలుపుతాయి. తుది నిర్ణయం మాత్రం 'సహృదయ హృదయా'లదే.

వాద వివాద విమర్శలు సాహిత్య ప్రపంచంలో ప్రతియుగంలో చెలరేగుతాయి. స్పందన తీవ్రతతో తమ ఆలోచనయే సరి అయిందన్న విశ్వాసబలంతో ప్రకటిత మవుతాయి. పట్టు అతిశయిస్తుంది. ఉద్రేకం ప్రబలుతుంది. కొన్ని సందర్భాల్లో అసహిష్ణుత చోటు చేసుకుంటుంది. తాననుసరించే మార్గం పట్ల దృఢ విశ్వాసం, తన విధానం పట్ల అభిమానం, తన దార్శనికత పట్ల ప్రత్యయంతో ప్రవర్తించడమూ కనిపిస్తుంది. ఎవరికి వారు దీన్ని నిలబెట్టుకునే యత్నంలో ఇరువైపుల నుండీ వాద వివాద పర్వం మొదలువుతుంది. వ్యక్తిగతమయిన విమర్శలకూ దారి తీయవచ్చు. ఆగిపోయి మళ్ళీ ఎపుడో తల ఎత్తనూ వచ్చు. సమాజంలో మానవ జీవితం వలెనే సాహిత్యంలో వాద ప్రతివాద విమర్శ సర్వ సాధారణమయింది. తత్కాలంలో ఆవేశానికీ అసహనానికీ గురి అయినా, దీని ప్రభావం అంతో ఇంతో చెప్పుకోడానికి మిగులుతుంది. ఆ కాలంలో ఉన్నవారితో పాటు, వచ్చే కొత్త తరాలకూ విషయ పరిజ్ఞానంతోపాటు, గుణ దోషణ విచారణలో వివేచనం అవసరాన్నీ గుర్తింపజేస్తుంది. కాలం గడచే కొద్దీ దీనిలో బలమూ బలహీనత అవగతికి వస్తాయి.

వాద వివాద విమర్శ ప్రతి యుగంలోనూ కవి జీవితం – దార్శనికత మొదలుకొని, కృతీ – శబ్ద ప్రయోగం వరకూ అనేకాంశాల పయి జరుగుతుంది.

ఇది స్పృశించని అంశం లేదు. ఒక విధంగా లోపల అణగి ఉన్న సందేహాల ప్రశ్నల వ్యతిరేకతల విభిన్నతల వైరుధ్యాల భావ జగత్తు. ఇది బయటపడే అవుట్‌లెట్ మార్గంగా మనస్తత్వ పరమయిన మానవ సహజత్వాన్ని రూపిస్తుంది. ఇదొక విమర్శనా పార్శ్వం. విమర్శనా ప్రక్రియకు అనుబంధంగా నిలుస్తుంది. ఇరుపక్షాలూ తమకు అనుకూల మయిన ప్రతికూల మయిన స్థితుల్ని అవలంబించడం వల్ల సాహిత్య వాతావరణం వేడెక్కుతుంది. మొత్తంగా ఈ వాద వివాద స్వరూపాన్ని సమీక్షిస్తే అభిప్రాయ భేదాలకూ అసమ్మతికీ వ్యతిరేకతకూ కారణమయిన ముఖ్యాంశాలు ముందుకొస్తాయి.

(1) రచన ఆవిర్భవించిన భూమిక / నేపథ్యం పయి చారిత్రక దృష్టి లేక పోవడం, లేదా అవగాహన లోపించడం, ఇది కృతి వెనుక నున్న సామాజిక స్థితిలో ఆ స్థితిని బట్టి కవిలో వచ్చే మార్పునీ/వేగాన్నీ అందుకోలేక పోవడం/తట్టులేక పోవడం వల్ల – (2) కవి సృజన స్వేచ్ఛ గురించి ఆలోచన చేయకపోవడం, తమకు తెలిసిన / ఉన్న పరిమితుల్లోనే కృతీ ఉండాలనుకోవడం వల్ల – (3) కవి లేదా కృతిలో అభిప్రాయం / దార్శనికత గురించి ఏకీభావం / అంగీకారం / సమ్మతి / కుదరక పోవడమూ కనీసం మరొకరి అభిప్రాయాన్నీ దర్శనికతనూ గౌరవించే తత్త్వం లేకపోవడం వల్ల. దీన్ని ఎవరూ వదలుకోరు కూడా. (4) తత్కాలంలో అవసరమయిన స్పందన స్థాయి లేక పోవడం, కృతికి తగిన 'స్ఫురణ' దీప్తి లేకపోవడం వల్ల – ఇది ఉత్తమ మయిన కవిత్వానుభవానికి ముఖ్యమయింది. ఆధునిక స్వేచ్ఛా కవిత్వంలో ఒక్కొక్క దానికి ఒక్కొక్క విధమయిన ప్రేరక స్థానముంటుంది. దీన్ని కనీస స్థాయిలో అందుకోవలసి ఉంటుంది. లేకపోతే సంపూర్ణంగా అర్థం కాదు, నచ్చదు, విముఖత ఏర్పడుతుంది. (5) సాహిత్యేతర కారణాల వల్ల నచ్చకపోవడం – కుల మత ప్రాంతీయ వర్గ విభేదాలతో పాటు వ్యక్తిగత మయిన స్పర్థ ఈర్ష్య మొదలయిన మనోభావాలు విజృంభించడం వల్ల – (6) సహేతుకమయిన ఎవరికీ విప్రతిపత్తిలేని లోపం దోషం చోటు చేసుకోవడం వల్ల దీన్ని గుర్తింపజేసే అభిలాష వల్లనని స్పష్టమవుతుంది.

ఖలీల్ జిబ్రాన్ 'ప్రాఫెట్' (ఇంగ్లీషు) కు అనువాదం 'జీవన గీత' (తెలుగు)లో 'ఆల్ ఈజ్ వెల్' అన్న వాక్యంలో 'వెల్' అన్న ఇంగ్లీషు పదానికి 'బావి' అన్న తెలుగు పదం వాడబడింది. ఆ సందర్భాన్ని బట్టి 'అంతా బాగుంది' అన్న అర్థచ్ఛాయ కలిగింది. కాబట్టి 'బావి' అన్న పదం కుదరదు. అర్థ స్ఫురణలో పొరపాటు వల్లనో భావాన్ని అందుకోలేకపోవడం వల్లనో జరిగింది. దీనికి తాత్త్విక మయిన

దూరాన్వయమూ నప్పదు. ఈ రచన చాల కటువయిన విమర్శకు గురి అయింది.

'వర్షం కురిసిన రాత్రి'లో ఒక కవితను వివరిస్తూ ఒకరు కవీ విమర్శకులూ, 'ప్రతిసీర' అన్న పదానికి అర్థంలో దూరాన్వయం లోకి వెళ్ళడం జరిగింది. 'ప్రతి' నుండి 'సీర'ను విడదీసి 'సీర' అంటే 'నాగలి' అర్థంతో, అక్కడి నుండి నాగలి ఆయుధంగా కలవాడు బలరాముని దాకా వెళ్ళి – అక్కడ ఆగిపోయి – వెనక్కి మరలి – ప్రశ్నా చిహ్నం నిలపడమూ జరిగింది. యథార్థానికి ప్రతిసీర అన్నది ఒకే పదం. ప్రతిసీర అంటే యవనిక / తెర అని అర్థం. 'ప్రతిసీరస్తు యవనికా' అని అమరం. ఇలాంటి వెన్నో, పేర్కొన్న ఆరు అంశాలకు సంబంధించినవి తటస్థపడతాయి.

ఈ ఆరు అంశాలూ వాద వివాద విమర్శనకు ఆరంభ స్థానాలుగా భావించ వచ్చు. ఇవి వేరు వేరుగానూ కలిసీ అలజడిని రేపడం జరుగుతూంది. ఇది వాద వివాద విమర్శనా క్రీడా జగత్తుగా మిగులుతుంది.

ఒకటి మాత్రం జరుగుతుంది, కొన్ని ఎవరూ ప్రశ్నించలేని యధార్థంగా ఉన్న దోషాల్ని లోపాల్ని వదలి, మిగతా వాటి విషయంలో చాలాభాగం, కాల నిర్ణయం మాత్రం కవి సృజన రూపం పక్షమే. జీవవంతమయిన సృజన స్వేచ్ఛతో రూపొందిన ప్రతి ఉత్తమ కృతికీ వర్తిస్తుంది. మరీ ముఖ్యంగా ఎన్నో ప్రభావాల పర్యవసానంగా ఆవిర్భవించే స్వేచ్ఛా కవిత్వానికి బాగా వర్తిస్తుంది.

## 11. స్వేచ్ఛా కవిత్వం – ప్రత్యేకత

ఇప్పటి వరకూ వెలువడిన స్వేచ్ఛా కవిత్వంలో వర్తమాన జీవితాలకు సంబంధించిన విషయాలకు ప్రాధాన్యం ఉంది. మానవీయ చింతనతో వివిధ స్థితులకూ సంఘటనలకూ స్పందించే విధం సూక్ష్మ (మైక్రో) స్థాయిలో వేదనాశీలంగా కవితాకృతిని పొందింది. ప్రధానమయిన కవితా ప్రవాహానికి ఉపశాఖలుగా స్త్రీ దళిత మైనార్టి వాదాలు వెలసాయి. ఇవి తమ తమ నియతమయిన పరిమిత వలయాల్లో చారిత్రకంగా సామాజిక పాత్రను నిర్వహించాయి. ఇవికాక వృత్తికారుల సమస్యలూ కష్టాలూ బాధలూ ఎత్తి చూపేవీ వచ్చాయి. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేసేవిగా సామాజిక చేతనకు ప్రేరకాలుగా నిలిచాయి. ఆయా సందర్భాల్లో

అవసరమయిన మానవతా స్పందనల్ని వేగవంతం చేసాయి.

మరో విషయమేమంటే ఇంతవరకూ చరిత్రలో కనుమరుగయి పోయినవీ పైకి రానివీ ఊహలలో కల్పనలో అణగిపోయినవీ నిజాలు కనుగొనే అభిలాష కవుల్లో ఎక్కువయింది. దీనితో కొత్త కారణాలు పయికి రావడమూ జరిగింది. అందువల్ల సరికొత్త కోణాల్లో సమస్యనూ విషయాన్ని దర్శించడం సహేతుకంగా ప్రదర్శించడం – ప్రత్యేకతను కలిగించేవీ. ఈనాటి కవుల్లో తమ ప్రత్యేకతల్ని నిలుపుకునే స్వతంత్ర మయిన ధోరణి బాగా కనిపిస్తూంది. దీని వల్ల వస్తువుకు బలం చేకూరుతూంది. విషయానికి కొత్త పార్శ్వం ఏర్పడుతూంది. కేవలం కవిత్వ కళకు సంబంధించిన అంశాలతో పాటు వేరే అంశాలకు కూడా ఏదో ఒక విధంగా అవకాశ మేర్పడుతూంది. ఇది అంతర్గత మయిన కవిలో ఆలోచన అన్వేషణ తనదయిన నిర్ణయం అనే మూడు దశల్లో పర్యాప్తమయింది. మానవ జీవితంలో పరిస్థితుల ప్రభావాల వల్ల ఏర్పడే మనస్తత్వ పరమయిన అంశాల పయి కూడా దృష్టిని ప్రసరింప జేయడమూ జరుగుతూంది.

సమాజ చరిత్రలో ఒక విషయం వెనుక ఎన్నో చర్యలు ప్రతిచర్యలు అనుచర్యలు పనిచేస్తాయి. ఇవి చాలా సందర్భాల్లో సరి అయిన పరిశోధనా విధానం లేక పోవడం వల్లనో, వాటిని సరిగా అధ్యయనం చేయకపోవడం వల్లనో, విషయ సంచయనంలో అసంపూర్ణత వల్లనో పొరపాటు వల్లనో, ఇతర కారణాల వల్లనో – ఇవి వెనుకనుండి పనిచేసిన అంశాలు జారిపోవడం, వదలివేయడం, జరుగుతూంది. ఇవి కవి దృష్టికి రావడం విశేషం. మనసులో స్పందనతో ఆలోచనకు పురి కొల్పుతాయి. మూల్యాంకనం లోను మార్పుల కవకాశం కలగడం సహజం.

ఈనాడు సాధారణ శ్రేణుల్లోనూ విద్యతో పాటు అనేక విషయాల పరిజ్ఞానాని కవకాశాలు బాగా లభించడం వల్ల సామాజిక రాజకీయ భావాలకు ప్రాధాన్యం పెరిగింది. కవిత్వానికి సంబంధించిన అంశాల్లో నిష్పత్తులు మారాయి. ఒక్కొక్క కవిలో ఒక్కొక్క విధమయిన కలయిక చేత ప్రత్యేకతలు కలుగుతున్నాయి. ప్రజాస్వామ్య వాతావరణంలో స్వతంత్ర మయిన భావనా జగత్తులో భాష భావం శిల్పం సుందరత మొదలయిన కళాత్మక భాగంతో పాటు ప్రగతిశీల దార్శనికత – వస్తువును చూచే దృష్టికోణం – సమస్యల చిత్రణం – పరిష్కార లక్ష్యం కలిగిన మరోభాగం ప్రత్యేకమైన

పాత్రను నిర్వర్తిస్తూంది. ఇదీనాటి స్వేచ్ఛా కవిత్వంలో బహు స్పష్టంగా సమాలోచనాని కందుతూంది.

కవిత్వమూ సమాలోచనమూ రెండూ ఒకదాని తరువాత మరొకటీ, ఒకదానికి మరొకటి సహాయ కరాలుగా ఉంటాయి. కవిత్వ విషయంలో మానసిక స్థాయిలో అనుభవ పూర్ణతకు హ్లాదాన్నీ వికాసాన్నీ ఉత్సాహాన్ని ఉన్నతినీ పొందడానికి "అంతర్ దృష్టి" అవసరం. ఇది పై స్థాయిలో ప్రామాణికంగా సహృదయ హృదయానికి అస్తిత్వమూ చేకూరుస్తూంది.

పద్యానికి సమంగా తనదయిన ప్రగతి దర్శనంతో పురోగమించే స్వేచ్ఛా కవిత్వం విషయంలో సరి అయిన అవగాహనకు – (1) ఈ యుగ చేతన గురించీ (2) ప్రజాస్వామ్య భావన గురించీ (3) ప్రయోగశీలం – నవ్యదృష్టి గురించీ (4) మానవతాలయ – ప్రగతి స్వరం గురించి పరిచయమూ – సదభిలాష, (5) నేటి అవసరాలకు సమన్వయ పరచే వివేచన బాగా ఉపకరిస్తాయి. ఛందస్సులేని కారణంగా కవిత్వంలోని అంతర్లయను వినగలగాలి. భావ ప్రసార రీతుల్ని గ్రహించ గలగాలి. దీనికి ప్రతిభ కన్నా వివేచన అవసరం, సమాలోచనా విషయంలో అనివార్యమయిందీ.

దాశరథి మస్తిష్కంలో 'లేబొరేటరీ' దీర్ఘ కవిత. చైతన్యంతో కూడిన మేధకు భౌతిక మయిన ఆధారం మస్తిష్కం. కొత్త విషయాన్ని కనుగొనే పరిశోధనా నిలయం 'లేబోరేటరీ'. ఈ భావన ఈ సందర్భంలో హేతు దృష్టితో సమాజ హితం కయి ప్రగతి కయి ప్రజల సమస్యలకు ఒక పరిష్కారం చూపే ప్రజాస్వామ్య దార్శనికానికి ప్రతీకగా ఉంది. విజ్ఞాన శాస్త్ర పరమయిన ఆలోచన సామాజిక శ్రేయో రూపాని కన్వయంగా పరిణమిస్తూంది. ఇలా మరెన్నో! ఇదే విధంగా సంప్రదాయ మూల భావన ప్రగతి రూపానికన్వయ శోభనూ పొందుతూంది. "ఓం ప్రజాయై నమః" అన్న దాశరథి కవిత ప్రజాస్వామ్యంలో ప్రధానమైన "ప్రజ" అధిష్ఠాన దేవతా స్థానాన్ని పొందుతూంది. ప్రజతో సంపన్నమయిన సమాజ ప్రాముఖ్యాన్ని వ్యంజింప జేస్తూంది.

స్వేచ్ఛా కవిత్వంలో ఇటీవలి 1) ఆల్బంలో ప్రజాస్వామ్యం; 2) అద్దంలో ప్రజాస్వాం; 3) ప్రవాహంలో ప్రజాస్వామ్యం మూడు కృతులూ కలిసి, ఒకే భావ సూత్రం చేత 'ట్రైలొజీ' (trilogy) గా మూడు కోణాల్లో నిర్మాణ రూపాన్ని కలిగింది. 1) ఆల్బంలో నయితే కదలికలేని దృశ్య ఖండాలుగా చిత్రరూపాల్ని స్మృతిలోకి తెచ్చేవీ;

2) అద్దంలో నయితే ఎదురుగా వస్తువు ఉన్నంత వరకే – తాత్కాలికాలు – ఆపై తొలగేవీ; 3) ప్రవాహంలో నయితే నిరంతరమూ కదలుతూ పోయేవీ – వర్తమాన ప్రజాస్వామ్య గమనంలో స్థితిగతులూ వాటి విలువలూ ప్రయాణ లక్ష్యాలూ స్ఫూర్తికి వస్తాయి. ఇపుడు కావలసింది శక్తివంతమయిన ప్రజాస్వామ్య మన్న భావం వ్యంగ్య శోభను కలిగింది. ఈనాడు వస్తూన్న స్వేచ్ఛా కవిత్వం అనేకాంశాల సమాకలనంతో పరణతమయిన రూపంగానూ, ప్రయోజనాత్మకంగానూ ఉన్నతమయిన ప్రమాణాల్ని కలిగిన సృజన కళారూపంగానూ దర్శనమిస్తుంది.

## 12. సృజన స్వేచ్ఛ - సామాజిక లక్ష్యం

వర్తమాన ప్రజాస్వామ్య యుగంలో స్వేచ్ఛా కవిత్వంలో సామాజిక లక్ష్యం విస్తారంగా దృష్టికి వస్తుంది. ఇది వస్తు వైవిధ్యానికీ దారి తీసింది. స్వేచ్ఛా కవిత్వంలో ప్రధాన మయిన స్రవంతి సామ్యవాద ప్రజాస్వామ్య దార్శనికంతో సామాజిక రాజకీయ మానవీయ భావనతో ఉంది. దీనికి సమయ సమయంలో దిగంబర స్త్రీవాద దళిత మైనార్టీ ప్రాంతీయ ధోరణులూ వెలసాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పయి విశ్వాసం లేని తీవ్రవాద విప్లవ కవిత్వమూ వచ్చింది. ఇవన్నీ ఈ ప్రక్రియ విస్తృతికీ వికాసానికీ దోహదం చేసాయి. సామాజిక పార్శ్వానికి వివిధ కారణాలేర్పడినాయి. ఏవి ఎన్ని చేరినా కవిత్వ కళ ప్రాణ మన్నది అందరూ అంగీకరించే ఏక వాక్యం. దీని చేతనే రచన జీవిస్తుంది దాని శక్తి ప్రమాణాల్ని బట్టి స్థాయి భేదాన్ని పొందడమూ జరుగుతూంది. స్చేచ్ఛా కవిత్వం అర్థ శతాబ్ది పైగా అవిచ్ఛిన్నంగా ప్రవహిస్తూంది.

పద్యం ఉత్తమ కళాకృతిగా గౌరవ పదంలో ఉంది. రానురాను ప్రస్తుత స్థితిలో మ్యూజియంలో భద్రంగా ఉండే ఆదర్శ స్థానాన్ని అలంకరిస్తూంది. ఈ ఆదర్శ రూపానికి ప్రతిరూపాలుగా అపుడపుడూ పద్యరచన కనిపిస్తూంది. తాను ఉన్నానని పిస్తూంది. ఈ కాలంలో రామాయణ కల్పవృక్షం పద్య విద్యలో చిట్టచివరి విరాట్ రూపం. ఇపుడు మాత్రం పద్య రచనా పరంపరలో విచ్ఛిన్నత గోచరిస్తూంది. ప్రబలమయిన స్థానాన్ని కోల్పోయింది. అంతంతమాత్రంగా ఉన్నదీ కళ తరిగీ కనిపిస్తూంది. ఈ వాతావరణంలో పద్య రచనకు ప్రోత్సాహకాలు ముందుకు

వస్తున్నాయి. ప్రత్యేక వేదికలూ ఏర్పడుతున్నాయి. ఈ అవకాశాలతో దీని ఉనికిని నిలపాలనే ఆవేదన కనిపిస్తుంది. ఈ దిశలో కృషీ జరుగుతూంది. ఆధునిక యుగంలో తొలి దశల్లో పద్యం సామాజిక బాధ్యతను తన లక్ష్యంలో నిర్వహించింది మారుతున్న కాలంలో ఏ కారణంచేత నయితేనేం కొన్ని పరిమితుల్లో వర్తించింది. ఆధునిక యుగంలో మార్పులకు సంబంధించిన మలుపుల్లో సంస్కరణ పథం – నవ్యత దిశగా ప్రయాణం మొదలయింది. రాయప్రోలు కృతులు దీనికి ప్రాతినిధ్యం వహిస్తాయి. ఇది కొంతకాలం సాగింది. ఆ తరువాత కూడ పద్యం ఉన్నాననిపించింది కాని మార్పుల వేగాన్ని అందుకోలేక పోయింది, పైగా మందగించింది. ప్రస్తుత స్థితిలో పద్య రచన తానందుకున్న కళాత్మక మయిన శిఖర స్థాయిలో సాగే అవకాశం కనిపించడం లేదు. దీనికి కారణాలనేకం. వాటిలో కొన్ని (1) వస్తూన్న తరాలలో పద్య రచన కవసరమయిన అభిలాషతో పాటు తగినంత స్థాయిలో భాషా పరిజ్ఞానం లేకపోవడం (2) కనీస స్థాయిలో పూర్వ పద్య కావ్యాలతో పరిచయం లేకపోవడం (3) తన చుట్టూ పద్య సాహిత్య వాతావరణం లేకపోవడం (4) తనలో పద్య సాహిత్య నేపథ్యం లేకపోవడం (5) ఎక్కువ శ్రమ లేకుండా గమ్యాన్ని చేరే సంకల్పం (6) ఆధునికమైన సామాజిక జీవన రీతుల్ని పద్య రచనలో స్పందింప జేసే ఉపజ్ఞ లేకపోవడం (7) నప్పదన్న అభిప్రాయం. ఇవన్నీ కలిసిన (8) భిన్నమయిన మనోరూపం కవితా సృజనశక్తిని పద్యం నుండి వేరు చేసింది. మారుతున్న సమాజంలో వర్తమాన సాహిత్య వాతావరణంలో ఏర్పడిన సమాజ పరిణామ రూపం స్వేచ్ఛా కవిత్వం. ఆధునిక భావ జాల ప్రకటనకు ఉత్తమ సాధనంగా నిలిచింది, స్థిరపడింది. కొత్త ప్రపంచాన్ని దర్శింప చేస్తూంది, సాహిత్య వాతావరణానికి సంబంధించినంత వరకు సాధారణ స్థాయి నుండి విశేష స్థాయి వకూ తెరచిన అవకాశ ద్వారం లాగా ఉపకరిస్తూంది. సృజన స్వేచ్ఛలో స్వయం నియంత్రణంతో రచనా రూపమూ సులభంగా తోచింది, ఒక్కొక్క కవిలో ఒక్కొక్క విధంగా తనదయిన భావ ప్రకటనకూ వ్యక్తిత్వ వికాసానికీ బాగా తోడ్పడింది.

ఈనాడు వస్తూన్న స్వేచ్ఛా కవిత్వాన్ని విశ్లేషిస్తే మొత్తం మీద రూప విధానంలో అంశాలు; 1) వచన పద్ధతితో; 2) మాత్రల, గణాల, అక్షరాల వినిమయ గుణంతో; 3) బాహ్య లయ అంతర్లయలో శబ్ద భావ గతి రీతులతో; 4) సంకీర్ణం (మిక్స్‌డ్) గానూ భేదాలు బహువిధాలుగా గోచరిస్తాయి. స్వయం నియంత్రణ విధానంతో

సౌలభ్యంగా సౌగమ్యంగా అందుబాటులో ఉండే విధం ఎవరికయినా ఏ స్థాయిలో నున్న కవి నయినా ఆకర్షిస్తూంది. ఇది విజయవంత మయింది. ఈ మార్గంలో ఎన్నో రచనలు ఉత్తమ కవిత్వానికి ఉదాహరణీయాలయినాయి. సహృదయుల ప్రశంసల్ని పొందాయి. పద్యానికి భిన్నమయిన ఉత్తమ సాధనంగా స్థిరపడింది.

**2**

స్వేచ్ఛా కవిత్వంలో సామాజిక లక్ష్యం మానవీయంతో స్పందిస్తూ ప్రగతి దిశగా నిర్దిష్టమయింది. ఈ ప్రధాన స్రవంతితో పాటుగా ఆయా సందర్భాలకూ అవసరాలకూ తగిన విధంగా దిగంబర, స్త్రీవాద, దళిత, మైనార్టీ, ప్రాంతీయ ధోరణులూ ఉద్భవించాయి. అంతర్జాతీయ ప్రాతిపదిక పయి తీవ్రవాద విప్లవ రచనలూ కవిత్వానికి అసాధారణ స్థితినీ చేకూర్చాయి. దేనికది తమ వంతు ప్రయోజనకరమయిన పాత్రను నిర్వహించడం ముఖ్యమయింది. ఈ వాదాలూ ధోరణులూ వివిధ స్థానాల నుండి బయలుదేరి ప్రపంచ స్థాయినుండి స్థానిక తలం దాకా – వివిధ సమస్యలకు నిధానంగా పరిష్కారానికి ప్రేరణగా నిలిచాయి. దిగంబర కవిత్వంలో సామాజిక దార్శనిక లక్ష్యం స్పష్టంగా లేనప్పటికీ ఆ పరిస్థితుల్లో నెలకొన్న సామాజిక రాజకీయ సాంస్కృతిక మనస్తత్వ పరమయిన పతనాన్ని సంక్షోభాన్ని చిత్రిస్తూ, ఏ ముసుగూ ఏ తొడుగూ లేని స్వచ్ఛమయిన శుభ్రమయిన మనుషుల సమాజాన్ని ఆశించే కవి హృదయం సూచితమయింది. అయితే అభివ్యక్తిలో అశ్లీల దూషణ పదజాలం మర్యాదా రేఖల్ని దాటింది. ఇవి గాలిలో ఎగిరిపడే నిప్పు కణికల్లా మండి ఆరిపోయాయి, కవి సామాజిక చేతనా లక్ష్యం నిర్వచితం కాలేదు. అక్కడక్కడా సూక్ష్మంగా సూచితమయిందే కాని నిర్దిష్టంగా లేదు. చాలా స్వల్పమయిన కాల పరిమితిలో వెలుగు వెలిగింది. స్త్రీవాదం అంతర్జాతీయ స్థాయిలోనిదీ. స్త్రీ పట్ల సమ భావాన్నీ సమన్యాయాన్నీ గౌరవాన్నీ స్వేచ్ఛకు అవకాశాల్నీ కోరే దిశలో వర్తించింది. ఇందులో రాజకీయ సిద్ధాంతాల కోణాల్లో అభిప్రాయ భేదాలతో, కవితాశక్తిని ప్రదర్శించింది. దళితవాదమూ శతాబ్దాలుగా తిరస్కారాలతో అవమానాలతో అసమానతలతో పీడనకు గురి అయిన సమూహాల్ని గురించి చింతనతో మొదలయింది. ఆపైన ఉన్నతికీ వికాసానికీ కార్య రూపాన్ని ధరించింది. మైనార్టీవాదమూ – దేశంలో మెజార్టీ బలం వల్ల తాము కోల్పోయే అవకాశాలకయి ప్రయత్నించింది. ప్రాంతీయ వాదం ఇటీవల బాగా ప్రచారాన్ని పొందింది. వెనుకబాటుతనంతో నిర్లక్ష్యానికి గురి అయిన

స్థితులూ తమ ప్రత్యేకతను కాపాడుకొనే అభిలాషతో ఉద్యమరూపాన్ని వహించింది. ఈ వాదాలన్నిటిలో తీవ్రమయిన నిశిత మయిన అవాంఛనీయ మయిన వ్యతిరేక ధోరణుల్ని స్పష్టంగా గుర్తించవచ్చు. ఆవేశంలో ఆవేదనలో అతృప్తిలో ఆవేశంతో పారుష్యం మర్యాదా సీమల్ని అతిక్రమించడం జరిగింది. ఇది మానవ సహజంగా భావించే వీలుంది. కళ్ళలో నలుసుల్లాగా ప్రభావం నెరపినా సమాజ లక్ష్యంలో స్పష్టతను పొందాయి. ఆ దిశలో సత్వర చర్యలకూ ఉపకరింప జేసాయి.

దేశంలో నెలకొన్న ప్రజాస్వామ్య సామ్యవాద వ్యవస్థలో పార్లమెంటరీ విధానంలో ఒక పౌరస్థాయిలో రావలసిన అవకాశాల్నీ పొందాల్సిన హక్కుల్నీ గుర్తు చేస్తూ, వాటికై గళమెత్తి పోరాడే స్థితి చిత్రణం ఆకర్షిస్తుంది. వీటిని సాధించేందుకు విశాలమైన ప్రాతిపదిక పయి మార్క్సిజం ఆదర్శ ప్రయత్నం – సమాజానికి ఎప్పటికీ అవసరమయింది. భారత రాజ్యాంగంలో ప్రజాస్వామ్య పదానికి చేర్చిన సామ్యవాద పదంతో దీని అవసరం ఎంతగా అనివార్యమయిందో స్పష్టమవుతూంది.

సృజన స్వేచ్ఛతో తెలుగులో స్వేచ్ఛా కవిత్వంలో సామాజిక లక్ష్యం వివిధ కోణాల్లో రూపొందింది. వివిధ కోణాల్లో ప్రసరించే దృష్టి భేదాల వల్ల అభిప్రాయాలు వేరయి వాదోపవాదాలకూ చర్చలకూ దారి తీయడం జరుగుతుంది. సృజన రూపాన్ని అనుసరించి ఇవి రూపొందుతాయి. విమర్శ పేరుతో సాహిత్య వాతావరణాన్ని ఉత్సాహ పరుస్తాయి.

అభిప్రాయ విభేదాలతో చర్చల నుండి విషయం పరిక్షుణ్ణం కావడం ప్రజాస్వామ్యంలో సహజం. కవిత్వ విషయంలో సహృదయ హృదయ వివేకంతో మూల్యాంకనం సమాలోచనంలో సహజం.

## 13. స్వేచ్ఛా కవిత్వం - విరాట్ రూపం

వర్తమాన మానవీయ యుగంలో స్వేచ్ఛా కవిత్వం ప్రజాస్వామ్య చేతనతో లభించే అవకాశాలతో బహు వాదాల అభిప్రాయాల ఆదర్శాల దృష్టి కోణాలతో, కావ్యం నుండి చిన్న చిన్న కవితల దాకా రూప భేదాలతో, వైవిధ్యాన్నీ విశాలతనూ ఉన్నతినీ పొందుతూ విరాట్ రూపాన్ని భావింప జేస్తూంది. వస్తువూ విషయం

అభివ్యక్తి లక్ష్యం మొదలయిన లక్షణాల్లో ప్రత్యేకతలతో పాటు, ఉన్న స్వరూపానికి పుష్టి నిచ్చే శోభ కూర్చే పటిష్టం చేసే అంశాలు కొన్ని ఆలోచనీయాలుగా కనిపిస్తాయి. పూర్వం స్థూలమైన దృష్టితో ఉన్నవి, ఇపుడు కవి దృష్టిలో సూక్ష్మ సూక్ష్మ విభాగాల్ని సంతరించుకున్నాయి. ఒక్కొక్క అంశం ప్రత్యేక స్థానాన్ని వహించింది. వర్గ వైరుధ్యంతో మంచి చెడు భావనా రూపాలతో నేటి సామాజిక రాజకీయ సాంస్కృతిక జీవన కోణాల్లో ఎన్నో పాయ లేర్పడినాయి.

కవికీ సామాన్య వ్యక్తి లాగే స్పందన గుణం ఉంటుంది. అయితే ఇది సత్వర భావ చలనంతో సాంద్రమయిన అనుభూతి బలంతో, భాషలో నలుగురికీ తెలియ జేసే సంకల్పంతో అభివ్యక్తి సుందరతను పొందుతూంది. ఈ అనుభవ ప్రకటన రూపానికి స్వేచ్ఛా కవిత్వ మొక బలమయిన ఆమోదయోగ్య మయిన సాధన మయింది. ఇందులో వస్తు – విషయ భాగంలో కవి దృష్టిలో సూక్ష్మ సూక్ష్మ విభాగ దశల్నీ పొందింది. ఇది మూడు కేంద్ర బిందువులతో, జీవ వంతమయిన ప్రసార స్థానాలుగా ఉన్నాయి. ఇవి సూక్ష్మతలంపై ప్రేరకాలు (మోటివేషన్స్) గానూ చలన కారణాలుగానూ పనిచేస్తున్నాయి. ఇవి వెంటనే స్పందింపజేసేవీ, ఉత్సాహ పరచేవీ, ఆచరణకు పురికొల్పేవీ. ఇవి 1) వ్యక్తి కేంద్రంగా ఉన్నవీ; 2) సమూహాల వర్గ/కుల/మత/ప్రాంత/వర్ణ/వృత్తి/శ్రేణి/జెండర్/ఉపాధికి సంబంధించినవీ, సమాజ కేంద్రంగా ఉన్నవీ. 3) సర్వ మానవీయ విశ్వభావనా కేంద్రంగా ఉన్నవీ. ఇవి క్రమంగా ఒక దానినుండి మరొకటి క్రమిస్తూ, ఈ మూడూ ఈనాడు వచ్చే స్వేచ్ఛా కవిత్వంలో కొత్త ప్రపంచ నిర్మాణానికి కారణ మవుతున్నాయి. ఈ మూడిటితో కవి తన దయిన దృక్పథంతో తన కిష్టమయిన స్వతంత్ర ముద్రతో మలచిన కవిత్వాన్ని సులభంగా గుర్తించవచ్చు.

మొదటిది – వ్యక్తి కేంద్రంగా ఉన్నవి, ప్రధానంగా వ్యక్తి జీవితంలో అవలంబించే విధానాలూ, అనుసరించే విలువలూ కలిగిన నైతికమైన ప్రకాశంతో మానసికోన్నతినీ పొందిందీ. కవిత్వంలో కవి ముఖతః కానీ పాత్ర గతంగా కానీ ఏలాగయినా ఉండవచ్చు. కవి సృజన మూలంతో బలమయిన సంబంధం కలిగి ఉంటుంది. కృతిలో విడదీయరాని భాగమయి కవి స్థాయినీ ఏర్పరుస్తూంది. ఈ స్థితి నుండే కవి కోరే ఆదర్శంలో దార్శనికత స్ఫుటమవుతుంది. మూలం నుండి మహా తరువులా సమాజ రూపాన్ని పొందుతూంది. ఈ సంప్రవర్తనం (ట్రాన్స్‌ఫర్‌మేషన్) చాలా సహజంగా సృజన క్రియ (ప్రాసెస్)లో జరిగి పోతుంది. కవి మనోరూపంతో పాటు బాహ్యమయిన అవసరాల రూపమూ బహిర్గత మవుతుంది. ఇవి కవి

నిబద్ధతనూ అంకితభావాన్నీ కొన్ని అనివార్యాల్నీ సూచిస్తుంది కూడా. అంతిమంగా మానవీయ మయిన విలువల్నీ ప్రయోజనాన్నీ అభిలషిస్తుంది. వ్యక్తిలో ఆలోచన ప్రవర్తన లక్ష్యంతో హేతుయుతమయిన నైతికత అవసరమయినట్లే, కవిగానూ కృతి ప్రయోజనాన్ని బట్టి జాగరూకత అవసరం. ఈ దిశలో కవి తన బాధ్యతను కోల్పోకూడదు. కొందరు రచనా రూపాన్నీ జీవిత రూపాన్నీ వ్యక్తి స్థాయిలో వేరు చేసి చూడడమూ జరుగుతూంది. దీనివల్ల సంపూర్ణ వ్యక్తిత్వానికి (టోటల్ పర్సెనాలిటీ) క్షతి ఏర్పడుతుంది. కృతి ఉద్దేశానికి భంజక మవుతుంది. దీనికి ఏ కవీ మినహాయింపు కాదు. ఈ విధంగా వ్యక్తి కేంద్రం బలమయిన ప్రభావాన్ని నెరపుతుందనడంలో సందేహం లేదు.

> ప్రతి హృదిలో ఆంతర భాషణం / ఏదో ఒక విశేష క్షణంలో
> ఆ సమయానికి సూచనగానో / ఆ తదుపరి ఉపదేశంగానో
> ఎవరికి వినిపించినా వినిపించకపోయినా / కవికి మాత్రం తప్పక వినిపిస్తుంది.
>
> "అద్దంలో ప్రజాస్వామ్యం"

రెండోది – సమూహాల – వర్గ కుల మత ప్రాంత వర్గ వృత్తి శ్రేణి జెండర్ ఉపాధికి సంబంధించినవీ, సమాజం కేంద్రంగా వర్తిస్తాయి. ప్రాపంచిక మయిన సాధారణ మయిన వ్యవహారాలతోనూ లౌకిక మయిన వ్యవహారాలతోనూ ఏర్పడేవి. బాహ్యమయిన జీవితావసరాలకూ ఉనికికీ ప్రయోజనాలకూ సంబంధించినవీ. నియంతల ముందు సామాన్యులూ, ధనికుల ఎదుట పేదవాళ్ళూ, రాజ్యాధికారం ముందు అశక్తులూ, బడుగు బతుకుల్ని ఈడ్చుకుంటూ వెళ్ళే తమ హక్కుల స్పృహ లేని వాళ్ళూ, కులాల వారూ మతాల వారూ వృత్తి కారులూ, పురుషాధిక్యం ముందు తలవంచే స్త్రీ సమాజం, మెజార్టీ ప్రక్కన మైనార్టీలు, వెనుకబాటు తనంతో ప్రాంతీయ వాదులూ, సేద్యంలో అనిశ్చిత జీవన రూపాలూ, శ్రమ జీవనంలో ఉక్కిరి బిక్కిరిగా బ్రతికేవాళ్ళూ, అసమానతలతో క్రింద ఉన్న వాళ్ళూ, సమన్యాయంకై ఎదురుచూచే వాళ్ళూ, అణచివేతలో తలలెత్తలేని వాళ్ళూ – ఇదొక మరోవైపు ప్రపంచం. ఈనాటి స్వేచ్ఛా కవిత్వంలో ఎందరో కవుల్ని సృజించింది. ఇది నిత్య జీవితంలో అనేక మయిన స్థితుల్ని ఎత్తిచూపుతూంది. ఇవి తిండి తిప్పలు వ్యాపకం ఉద్యోగం ఉనికీ, ప్రయోజనం మొదలుగా అనేక కారణాలతో ఏర్పడతాయి. అనుమానాలతో భయాలతో ప్రతికూలాలతో నివారణోపాయాలతో ప్రతిచర్యలతో వర్తిస్తాయి. ఇది ఒక దృష్టితో

సంకుచిత మనిపించవచ్చు. స్వార్థంగానూ తోచవచ్చు. కాని ఆ స్థితిలో అనివార్యాలవు తాయన్నమాట మరచి పోకూడదు. ఎన్నో సందర్భాల్లో వ్యతిరేకం నిరసన ఘర్షణతో విభేదాలకూ వేర్పాటుకూ దారి తీయడమూ జరుగుతుంది.

"హక్కుల భంగం జరిగీ నినాదం వెడలుతుంది,
కావలసింది పొందాలనీ, రావలసింది చేరాలనీ" "ఆల్బంలో ప్రజాస్వామ్యం"

వీటికి ఒక విధంగా దుర్వినియోగాలు (ఎక్స్‌ప్లాయిటేషన్స్) ఆర్థికం కావచ్చు, బౌద్ధికం కావచ్చు, సామాజికం కావచ్చు, రాజకీయం కావచ్చు, మరొకటి కావచ్చు.

సామాజిక రాజకీయ పరిస్థితుల్లో ఏదయినా కవి ఏ కేంద్రం స్థానంగా యథార్థాన్ని ఆవిష్కరించినా, అంతిమంగా శాంతికీ సమరసతకూ దారి తీసే మార్గమే చూపవలసి ఉంటుంది. కవి చిర లక్ష్యం ఎప్పటికీ శాంతి వైపే.

"మేల్కొన్న మానవీయ చేతనకు సాకారం/ఆదర్శ రూపానికి చిహ్నం విగ్రహం
ప్రజాస్వామ్య పతాక ఛాయలో/విగ్రహాల విధ్వంసం చిర సంస్కృతి హననం"
"అద్దంలో ప్రజాస్వామ్యం"

కవి బాధ్యత సామాన్యేతర మయింది, విశిష్టమయిందీ

"ఉద్యమం పని విధ్వంసం కాదు / జడంలో నవ తేజం నింపడం"
"ఆల్బంలో ప్రజాస్వామ్యం"

సమస్యల పరిష్కార నిర్ణయాలకు పూర్వ చరిత్ర తెలియడ మవసరం. వర్తమాన స్థితిగతుల పట్ల సంపూర్ణ మయిన అవగాహన తప్పని సరి. భవిష్యత్తు గురించి ఒక ప్రణాళిక అవసరం. ఈనాడు స్వేచ్ఛా కవిత్వంలో ఈ కేంద్ర స్థానం చాలావరకు ఆవరించింది, ఈ ప్రక్రియకు పూర్వంలేని ప్రత్యేకతను సంతరింప జేస్తూంది.

మూడోది – మానవీయ విశ్వభావనా కేంద్రంగా ఉంది. మహనీయ మయిన పరిణామ చరిత్ర కలిగిన మానవీయ భావనను శిఖర స్థానంలో నిలుపుతూంది. దేశ జాతి మత వర్ణ విభేదాల కతీతంగా ఆధునిక ప్రపంచ సమాజాన్ని కోరేదీ. ఆచరణంలో కొన్ని ఇబ్బందులెదురయినా, ఆదర్శంలో ఎప్పటికీ నిలిచీ, దాన్ని అందుకునే ప్రయత్నం జరుగుతూనే ఉంటుంది. అంతర్మానవ సంబంధాలతో సౌభ్రాత్రం సౌహార్దం శాంతి భావనతో విశ్వమయ మయిందీ. ఇది కవి దృష్టినీ దర్శనాన్ని

లక్ష్యాన్ని బట్టి ఆవిష్కృత మవుతుంది. కవిత్వానికి చరమ సీమ కావడం వల్ల కవులకు ఏదో ఒక స్థాయిలో అనివార్య మవుతూంది. జీవితమూ – సమాజం వలెనే కవీ – కవిత్వానికీ సంపూర్ణతను చేకూరుస్తూంది.

స్వేచ్ఛా కవిత్వంలో ఈ మూడు (1) వ్యక్తి కేంద్రంగా (2) సమూహాల సమాజ కేంద్రంగా (3) మానవీయ విశ్వభావనా కేంద్రంగా విభాగాలతో కూడిన భాగం ప్రత్యేకతను సిద్ధింప జేస్తూంది. ఏ కేంద్ర స్థానం నుండి అయినా, ఏ దేశంలోనూ ఏ కాలంలోనూ ఉనికిని కాపాడు కోడానికీ ఆశలు నెరవేరడానికీ లక్ష్యాన్ని సాధించడానికీ చరిత్రలో విభేదాలు నిరసనలూ ప్రతిఘటనలూ ఘర్షణలూ అనివార్యాలు. ప్రజాస్వామ్యంలో వీటి పరిష్కారం సహనంతో అవగాహనతో పరస్పరం ఆదాన ప్రదానాలతో జరుగుతుంది, జరగాలిసి ఉంటుంది. సమాజంలో మనిషికీ మనిషికీ గల సంబంధం, మనిషికీ సమూహాలకూ సమాజానికీ గల సంబంధం, సమాజానికీ ప్రపంచానికీ గల సంబంధం గురించి స్వేచ్ఛా కవిత్వంలో విస్తారంగా చోటు చేసుకోవడమూ కొత్త విషయం.

> "హద్దు లేని ప్రపంచ మొకటే మనిషిలో/స్వేచ్ఛా యానంలో స్వతంత్రమయిన వ్యక్తిత్వం,
> ఉత్సాహంతో ముందుకు సాగి పోవడమే!/ ముందున్న కర్తవ్యం"
>
> "ప్రవాహంలో ప్రజాస్వామ్యం"

ఈ విధంగా సంప్రేరణం, ఉపశమనం, ఆహ్లాదం, ప్రయోజనంతో ఈ ప్రక్రియ సార్వకాలికమవుతూంది, విశ్వమయ మవుతూంది. స్తబ్ధతను తొలగించి స్పందింపజేసే ఆలోచింప జేసే కార్యాచరణకు పురికొల్పే పాత్రను నిర్వర్తిస్తూంది. మానవీయ యుగంలో ప్రజాస్వామ్య చేతనతో విరాట్ రూపాన్ని భావింప జేస్తూంది.

# 14. 'రూప పిచ్చి' - వ్యావహారిక హితపదం - రూప భేదాల నేపథ్యం

ఎంత పెద్ద కావ్య మయినా ఎంత చిన్న కవిత అయినా సాహిత్య ప్రియులు అభిమానించేదీ, జ్ఞాపకం పెట్టుకునేదీ, ఉదాహరించేదీ, కొన్ని పంక్తులూ, పంక్తుల సముదాయాలూ మాత్రమే. మిగతావి వివిధ ఘట్టాలుగా సన్నివేశాలుగా కథన రూపాలుగా మిగులుతాయి. సందర్భ వశాలుగా రాణిస్తాయి. ఇది అన్ని భాషలలో కవిత్వాలకూ వర్తిస్తుంది. అనుభవంలో నిలిచేది మాత్రం, కవిత్వ కళ కలిగిన సృజన రూపం మాత్రమే. అది చిన్న కవితకు సంబంధించింది కావచ్చు. పెద్ద కావ్యానికి సంబంధించింది కావచ్చు. కవితా ప్రపంచంలో అన్నిటికీ చోటు ఉంది.

సమాలోచనా ప్రక్రియలో వస్తువును బట్టీ, విషయాన్ని బట్టీ, లక్ష్యాన్ని బట్టీ, దార్శనికతను బట్టీ, విభాగాలుగా విశ్లేషిత మవుతాయి. ఈనాటి ప్రజాస్వామ్య సమాజంలో రచనల విషయంలో స్వేచ్ఛకు బాగా అవకాశం ఉంది. కవిత్వ విషయంలో ఆనాడూ ఈనాడూ ఏనాడు అయినా తెలిసీ తెలియనిదీ, ఎప్పటికీ ఇంకా విప్పాలిసిన అరలతో రహస్య పేటిక – తెలుసుకో వలసీ ఉన్న మార్మిక గుణమూ – కలిగింది ఒకటే, అది కవిత్వ సృజన హృదయం. ఇది కవిలో అంతో ఇంతో ఉన్నపుడే కవిత్వం వెలువడుతుంది. అంత ఉంటే కావ్యంగా, ఇంత ఉంటే చిన్న కవితగా, నిలబడుతుంది.

వైజ్ఞానికం – భౌతికానికి పరిమిత మయింది. కవిత్వం – భౌతికం ఆధారంగా మానసికానికి విస్తరించింది. ఇది మనః ప్రవృత్తులకూ మానసిక రీతులకూ సంబంధించింది. ప్రతి కవిలో స్థాయిని బట్టి, భావావేగ స్థితుల చేత, ప్రేరితమవుతుంది. కవిత్వంలో సులభంగా గుర్తించవచ్చు. వీటి పరిమితుల్ని బట్టీ అభిలాషను బట్టీ ప్రయోజన గుణాన్ని బట్టీ, రూప భేదాలేర్పడతాయి.

ఛందస్సు స్పృహ కూడా లేని మనోరూపంతో ఆవిర్భవించే స్వేచ్ఛా కవిత్వం (1) కేవలం మాటల వచన పద్ధతిలో ఉందీ (2) ఉక్తి భేద రీతులతో ఉందీ (3) గతి విశేషాల్ని కలిగిందీ (4) వాక్య విన్యాస వైచిత్రిని పొందిందీ (5) ప్రవాహకత కలిగిందీ, ఐదు విధాలుగా విశ్లేషణకు అందుతుంది. ఈ స్వేచ్ఛా ప్రపంచం రూపంలో స్వయం నిహిత నిర్మాణాన్ని కలిగిందీ, కావడం వల్ల, కవుల మనః ప్రవృత్తుల్ని బట్టీ మానసిక రీతుల్ని బట్టీ, అనేకమైన రూప భేదాలకు వీలవుతూంది.

చిన్న కవితల విషయంలో, పద పంక్తుల్ని తగ్గిస్తూ, భావాన్ని సారభూతం చేస్తూ, సంక్షిప్తంగా అభివ్యక్తం చేసే ఆకాంక్ష, కీలకమయింది. దీనికి (1) స్థూలంగా, శబ్ద గుణ ప్రభావంతో, (2) సూక్ష్మంగా భావ గతి ప్రసారంతో నడిపించే నైపుణి అవసరం. ఇది కవి ప్రజ్ఞ చేతనే సాధ్యం. దీనిపైన అన్వేషణతో కొత్తదన మనేది కవి ఉపజ్ఞ చేత సిద్ధిస్తుంది. విశాల క్షేత్రంలో ఉన్నత శిఖరాలతో, సాధారణ దృష్టి కందని లోతులతో కావ్య రూపాన్ని పొందుతూంది. మొదటిది కవి వ్యక్తిత్వాన్ని ప్రకాశింప జేస్తుంది. రెండోది కవి అస్తిత్వాన్ని భావింప జేస్తుంది. మనసులో ఉదయించిన భావ రూపాన్ని, ఒక స్థాయిలో తనకు నచ్చిన పద్ధతిలో, చక్కగా ఆవిష్కరించే అభివ్యక్తి సుందరత చేతనే కవిత్వానికి మొదటి ఆకర్షణ ఏర్పడుతుంది. ఇది వాదానికీ సిద్ధాంతానికీ దార్శనికతకూ ప్రత్యక్ష సంబంధం కలిగి లేదు. కానీ పరోక్షంగా వివిధ సందర్భాల్ని బట్టి ప్రాధాన్యం ఏర్పడుతూంది. ఆధార తలంగానో అవకాశ దిశగానో వికాస హేతువు గానో ప్రేరణ మూలంగానో దోహదపడతాయి. ఆధునిక స్వేచ్ఛా కవిత్వంలో ఈ లక్షణం విస్తృత మయిన సమాలోచనకు అవకాశం కలిగిస్తూంది. రూప భేదా లేవయినా వస్తువు – విషయం – పాత్ర – దార్శనికత ప్రభావాలతో రచనలో విస్తృతికీ పరిమాణానికీ అవకాశం హెచ్చుతూంది.

రూప భేదాల్లో కావ్యంతో పోలిస్తే, చాలా చిన్న దయిన కొద్దీ కవితకు రచనలో, జాగ్రత్త అవసరం. చాలా స్వల్ప పరిమితిలో మంచి అనుభవాన్ని కలిగించేందుకు పద ప్రయోగంలో వాక్య నిర్వహణంలో కౌశలం అవసరం. కవికి ఒక విధంగా ఇన్‌స్టాంట్ (సద్యః) మౌఖిక పరీక్ష లాంటిది. తృప్తి కరమయిన అనుభవాల్ని గుళికల్లా అందించ వలసి ఉంటుంది. భావ వేగంతో ఝటితి స్ఫూర్తిగా మనస్సును మెరపించడం, ఆ వెలుగులో విశేషస్ఫూర్తి కలగడం జరుగుతుంది. ఇన్ని రూపభేదాలెందుకు వస్తున్నాయి? అంటే – స్వేచ్ఛా సమాజంలో అవకాశాల్ని బట్టీ, కవి ప్రవృత్తినీ మనో విధాన్నీ బట్టీ, మార్పు పయి అభిలాషను బట్టీ అని సమాధానం. దీనికి భిన్న మయిన దీర్ఘ మహా కావ్యాల్లో విరాట్ రూపం అవగతికి వస్తుంది. జీవితమూ సమాజమూ – / భౌతికమూ భౌతికేతరమయిన మానసికమూ – / ప్రాదేశికం ప్రాపంచికం – / తత్కాలీనం సార్వకాలికం / పరిమితీ విస్తృతీ / ఇట్లా ఆయా అంశాల ప్రవేశాన్ని బట్టి రూపొందుతూంది. ఇందులో కవిత్వ కళ నిర్మాణ విధానాన్ని బట్టి పరచ బడి ఉంటుంది.

ఏదైనా కొత్త రూపభేదం అప్పటికే ఉన్న వాటి ప్రక్కన చేరుతుంది. కవితా ప్రపంచంలో ఒకటవుతుంది. ఇది ఎవరూ సందేహించరాని విషయం.

ఇక "రూప పిచ్చి" అన్న మాట ద్వానాశాస్త్రి గారి సాహిత్య హృదయాన్ని బట్టి, సాధారణ మయిన వ్యవహార రూపానికి చెందింది. ఎవరయినా కలసీ లేదా ఇంటికి దయ చేసినపుడో, మీ అబ్బాయి ఏమి చేస్తున్నాడని ప్రశ్నిస్తే, అబ్బాయి బాగా చదివే వాడయితే, "ఒకటే చదువు పిచ్చి" (లేదా మరొకటి సంగీతమో ఆటలో); "మరో ధ్యాస లేదు" అని సమాధానం వస్తుంది. అంటే చదువుపైనే దృష్టితో నిమగ్నుడై ఉన్నాడన్న మాట. పరోక్షంగా చదువు పట్ల శ్రద్ధనూ, ప్రేమనూ సూచిస్తూంది. సమాధానం చెప్పిన వ్యక్తి మనసులో ఉన్న వాత్సల్యాన్నీ తలపిస్తుంది. ఇందులో తప్పు పట్టే దోషమేమీ లేదు. లోక వ్యవహారంలో హితకరమయిన పదంగానే తెలుగు భాషలో వ్యాప్తిలో ఉంది, దీనికి దూరాన్వయంతో విపరీతమైన అర్థాలు ఉచితం కావు. శాస్త్రిగారి సమీక్షల్లో విమర్శనా వ్యాసాల్లో 'సహృదయ' హృదయం ప్రతిఫలిస్తూంది, కూడా. రూపభేదాల ప్రవేశం కావ్య జగత్తులో అనివార్యమనీ ముఖ్యంగా ప్రజాస్వామ్యంతో, కవి సృజన స్వేచ్ఛకు తార్కాణమనీ, పరిణామ వికాస సహజమనీ చెప్పడం ప్రధానోద్దేశం. ఇందులో ఏ సందేహానికీ తావు లేదు.

## 15. కవి మనో లోక ప్రకటనం కవిత్వం

కవి మనో లోక ప్రకటనం కవిత్వం. ఇది మనః ప్రధాన మయింది. అక్షర సాధనం కలిగింది. భాషా శక్తి విలసిత మయింది. ఏదో ఒక సందర్భంలో సంకల్పం నుండి విషయానికి సంబంధించిన 1) స్పందనం; 2) సంవేదన; 3) అనుభూతి; 4) ఆలోచన; 5) ఆవిష్కారంతో ఆకర్షక మయిందీ. ఇది బహు ముఖీన మయిందీ. శబ్ద మయమైన భావాకృతిని కలిగింది. చేతన లోని అనుభవ వాస్తవికతనూ, అవచేతన లోని కామననూ కల్పననూ, అచేతనలోని సామూహిక స్మృతి విశేషాలతో బయటికి స్పష్టంగా కన్పించకుండా, లోన సంశ్లిష్ట మయిన (కాంప్లెక్స్) రూపాన్ని కలిగింది. కవిలో ఏర్పడే ప్రత్యేకమయిన వ్యక్తిత్వానికి కారణ మయింది.

స్వేచ్ఛా కవిత్వం స్థూలంగా వస్తువు విషయం ఉద్దేశం (అభిప్రాయం) లక్ష్యం అనే మౌలిక మయిన కోణాల్లో మానవ జీవితానికీ సమాజ రూపానికీ సంబంధించిన

భావ నిర్మాణంతో ఆలోచన కందుతూంది. ఆరంభం నుండి సమాప్తి వరకూ ఎక్కడయినా కవి దృష్టిని బట్టి వీటికి సంబంధించిన అంశాల వివిధ సమీకరణాలతో విడదీయ రానివిగా పరిణమిస్తాయి. ఈ స్థితి ఒక విధంగా రచనకు ఉదాత్తతనూ గభీరతను సిద్ధింప జేస్తూంది. కవిలో వ్యక్తిగా విద్యా సంస్కార ప్రజ్ఞా ప్రభావాల్ని బట్టి నిర్వహణ రూపాన్ని పొందుతూంది. ఈ విధంగా కవి మనో లోక ప్రకటనం కవిత్వంలో సృజన కళతో అవతరిస్తుంది.

ముఖ్యంగా ఈ ప్రక్రియలో 1) జీవితమూ – సమాజమూ; 2) మానవీయమూ – మానవత; 3) ప్రగతి శీలమూ – దార్శనికత; 4) సంస్కృతీ పరంపర – వికాస రూపం అనే నాలుగు అంశాలు క్రమంగా రచనలో 1) వర్తమాన స్పందనలో; 2) మానవ సంబంధాలలో; 3) లక్ష్య నిర్దేశంలో; 4) చారిత్రక హేతు దృష్టిలో ఒకదానితో మరొకటి ప్రభావిత మవుతూ పోతాయి. రచన విశేష రూపాన్ని పొందుతుంది. ఈ విధంగా ఒక్కొక విధమయిన సమాశ్లిష్టత వల్ల, ప్రతి కవి స్వేచ్ఛా కవిత్వంలో తనదయిన వ్యక్తిత్వం ఏర్పడుతూంది. సమాలోచనానికి అర్హతను పొందుతూంది. దీన్ని సహృదయులూ సమాలోచకులూ గుర్తించడం అవసరం. దీని వల్ల సమాలోచనా క్షేత్ర పరిధి పెరుగుతుంది. వైవిధ్యమూ ఏర్పడుతుంది.

ఈ సందర్భంలో ఒక మాట, గతానికి చెందింది అయినా వర్తమానానికి చెందింది అయినా, సమాలోచనంలో ముందుగా కవి దృష్టినీ / అభిప్రాయాన్నీ కాల ప్రభావాన్నీ వస్తువులో పరిమితుల్నీ విషయంలో ప్రత్యేకతల్నీ లక్ష్యంలో దిశనూ గుర్తించడం అవసరం. విమర్శకునిలో మెదలే సమస్యలూ వాదాలూ అభిప్రాయాలూ ఉద్యమాలూ మరొకటీ, ఒక రచనలో చోటు చేసుకోలేదనడం న్యాయం కాదు. సృజన విశ్లేషణకు హేతు దృష్టి చాలా అవసరం. దీనితో కవిని గురించి కృతిని గురించి సరి అయిన అవగాహన ఏర్పడుతుంది. మంచి వాతావరణాన్ని నిర్మిస్తుంది. సమాలోచనా ప్రక్రియ సంపన్న మవుతుంది.

కృతిలో కీలక మయిన కవిత్వ కళ మనిషికి గుండెలా, జీవ వంత మయిన స్పందన గుణంతో కృతిని జీవింప జేస్తుంది. కవి ప్రతిభ చేత కవితా రూపాన్నీ, ఉపజ్ఞ చేత నవ్యతనూ, దార్శనికత చేత లక్ష్య నిర్దేశాన్నీ, హేతువు చేత సదవగాహననూ పొందడం జరుగుతుంది. స్వేచ్ఛా కవిత్వంలో పూర్వంలేని సృజన లోకం ప్రకటితం

కావడం వల్ల, అన్నీ మూసలో పోసిన విధంగా సమాలోచనం జరపడం పనికి రాదు. కృతి అస్తిత్వాన్నీ కవి వ్యక్తిత్వాన్నీ స్థాపించవలసి ఉంటుంది.

మనో లోక ప్రకటనంలో సృజన రూపానికి కవిలో 'అహంకారం' ప్రభావ శక్తిగా పని చేస్తుంది. ఇది సూటిగానూ సూచనగానూ సాంద్రంగానూ నిశితంగానూ ఉజ్వలంగానూ ఎన్ని విధాలుగానో ప్రేరకంగా నిలుస్తూంది. ఇది సృజన గతికి తోడ్పడుతుంది. సృజన క్రియను వేగవంతం చేస్తుంది. కవిలో ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది. ఈ విధంగా సానుకూలమైన (పాజిటివ్) పాత్రతో పాటుగా లౌకిక వ్యవహారాల్లో, వ్యతిరేక (నెగటివ్) మైన పాత్ర కూడా నిర్వర్తిస్తుంది. ఇది సృజనేతర మయింది. కవిత్వానికి సంబంధించినంత వరకు సృజన కళ విషయంలో ఏ రహస్యమూ లేదు. ఏ కిటుకూ లేదు. ఇది శబ్దంలో మనో లోకాన్ని ఆవిష్కరించే ప్రతిభకూ నైపుణికీ సంబంధించింది. కవి వ్యక్తిత్వంలో రెండు స్థాయిల్లో పని చేస్తుంది. మొదటిది వ్యక్తి పరంగా భావనలో అభిలాషకూ అభిరుచికీ సంబంధించిందీ, రెండోది సమాజ పరంగా లక్ష్యంలో ప్రమేయానికీ ప్రయోజనానికీ సంబంధించింది. ఈ రెండింటి కలయికను ఇపుడు వస్తూన్న స్వేచ్ఛా కవిత్వంలో స్పష్టంగా గుర్తించవచ్చు. ఈ కారణంగా కవి మనోలోక ప్రతిఫలనాన్ని సహేతుకంగా పరిశీలించడం అవసరం.

"ధరా ప్రకృతి జగం పాతది/ నిజానుభవం లిప్తలు కొత్తవి" – అభిషేకం

ఈ భూమి ఈ ప్రకృతి ఈ జగత్తు ఎపుడూ చూచేవీ మారనివీ; కానీ మనిషి జీవితంలో అనుభవ స్థితులు మారతాయి. కొత్తవి రూపొందుతాయి.

"అల్మెరా సొరగులో ఉన్న చెక్‌బుక్‌తో కన్నా
చేతిలో కరెన్సీతో ప్రయాణ మర్థవంత మవుతూంది"

అందుబాటులో లేనిదీ, సమయానికి పనికి రానిదాని కన్నా, అందుబాటులో ఉన్నదీ, సమయానికి పనికి వచ్చేదీ ముఖ్యం. 'అర్థవంత'మన్న మాటలో అవసరానికి ఉపయోగంలో సాఫల్యంతో పాటు ధనమూ శ్లేషితమయి రచనకు శోభ నిస్తూంది.

"దహనంలో ఎరుపెక్కిన వార్తలో కశ్మీర్ పండితులూ
వదలిన విష వాయువుతో సమాధులయిన ఖుర్దులూ
రాత్రి బాంబింగ్‌తో మెలకువకు దూరమయిన ఇరాకీలు"

ఇవి అశాంతి వేదిక పయి, మండే చరిత్రలో విషాద దృశ్యాలు. ప్రపంచంలో ప్రతి దేశంలో హింస అశాంతి వినాశనం సర్వ సాధరణమయింది. వాస్తవ స్థితుల చిత్రణం మనిషి బాధ్యతను గుర్తు చేస్తూంది. కశ్మీర్‌లో జరిగిన దహనం, 'వార్త'కు ఎరుపెక్కిస్తూంది. ఇది సమస్య తీవ్రతను సూచిస్తూంది. ఇరాక్–కువైట్ మధ్య వైరంలో ఖుర్దులపై వదలిన విష వాయువు ఎందరినో మృత్యు దశకు చేర్చింది. అమెరికా – మిత్రబృందమూ కలిసి రాత్రి చేసిన బాంబింగ్‌లో ఇరాకీయు లెందరో నిద్రలో ప్రాణాలు వదలారు. మళ్ళీ మెలకువను పొందలేదు. రాత్రి వేళ బాంబింగ్ నిషిద్ధ మన్న రణనీతికి భిన్నంగా అమానుష మయిన ప్రవర్తనం చకితుల్ని చేస్తూంది.

ఇపుడు కావలసింది, మానవ చరిత్రలో మరో పర్వం మొదలు కావలసి ఉంది. "ఎగిరే శాంతి హంస"తో హృదిలో "కదలే ప్రేమ లహరి"తో, "మానవతా రసధుని" ప్రవహించ వలసి ఉంది.

ఊహకు ఎల్లలు లేవు / సృజనకు చివరల్లేవు
పాత్రకు మితం లేదు / కవితకు సమయమంటూ లేదు.

వర్తమాన సంక్షుబ్ధ జీవితాన్ని యథార్థ ఘటనలు ఆధారంగా స్వేచ్ఛా కవిత్వం, శాంతి కోరే కవి మనోలోకాన్ని బింబిస్తూంది.

## 16. స్వేచ్ఛా కవిత్వం - ఈనాటి రూప విశేషం

స్వేచ్ఛా కవిత్వంలో మనిషి జీవితంలో – ఒకవైపు నుండి మానవ సంబంధాలతో సమాజమూ, మరొకవైపు నుండి రుతువుల ప్రభావాలతో ప్రకృతీ, తనలో వ్యక్తిత్వ వికాసంతో మనో రూపమూ ఈ మూడింటితో త్రిభుజాకార స్థితిలో అస్తిత్వాన్ని పొందుతూంది. జీవనాధార తలంనుండి ఉద్గమనంతో పైపైకి ఉత్సాహ శీలంతో ఆశాముఖంతో శిఖర రూపాల్ని ప్రకటిస్తూంది. ఇది కోరికలో ప్రయత్నం ప్రాప్తితో పర్యాప్తమవుతూంది. సృజన రూపంలో దీని ప్రతిఫలనం స్పష్టంగా గుర్తించ వచ్చు. అందునా సద్యః స్పందన గుణంతో మానవ సమాజ సంస్కృతికి ప్రాతినిధ్యం వహించే కవిత్వంతో పూర్వం నుండీ ఇప్పటి వరకూ విశ్లేషణకు నిలుస్తూంది. ఈ అస్తిత్వానికి వ్యక్తిలో నైతిక వైజ్ఞానిక వివేక దార్శనిక అనుభవాల పరంపరా స్థితులు పనిచేస్తాయి. ఈ క్రమంలో సామాజిక మనస్తత్వ సమస్యల్ని ఎదుర్కొంటూ అధిగమిస్తూ పరిష్కరిస్తూ పోవడం జరుగుతూంది. ఇది నాగరకత – సంస్కృతి ప్రపంచంలో భాగమవుతూంది.

ఈ మౌలికం నుండి ప్రత్యేకతల వరకూ వివిధ క్షేత్రాలకు సంబంధించిన వాటిపయి ఆయా రంగాల్లో ఫోకస్ చేయడం ఈనాటి అవసరం. స్వేచ్ఛా కవిత్వ విషయంలో ఈనాటి రూప విశేషం పరిణామ శీలమైందీ, సహజమయిందీ, జీవవంతమయిందీ.

సమాజంలో మనిషి సాధించే విజయాలతో పాటు ఆ ప్రక్కనే పతన స్థితులూ సంభవిస్తాయి. విజయాలకు సానుకూలతతో పాటు, పతనాలకు వ్యతిరేకత సమాజంలో ఏర్పడుతుంది. ఇది చర్య ప్రతిచర్య అనుచర్యలకు సంబంధించింది. సామాజికంగా రాజకీయంగా నైతికంగా ఎంతో ప్రాధాన్యం కలిగింది. కాలక్రమంలో చారిత్రకతనూ సంతరించుకుంటుంది. ఒక యుద్ధం ఒక ఉద్యమంలో విజయ దశలతో పాటు అలజడి విధ్వంసం కారణంగా ప్రజలు పడే బాధలూ మరవడానికి వీలు లేదు. ఇవి కొన్ని సందర్భాల్లో అమానుషాలుగానూ మనిషి అస్తిత్వాన్ని ప్రశ్నించేవిగానూ దృష్టికి వస్తాయి. వర్తమాన కాలంలో మనిషి ఉన్నతినీ విలువల్నీ ఆదర్శాన్నీ సమాజ వికాసాన్నీ ప్రగతినీ ప్రతిఫలించే పనులెన్నో జరుగుతూన్న మాట నిజమే! వీటితో పాటుగా గ్రహణం పట్టిన స్థితులూ వాస్తవమే. ఉపదేశాలకూ సిద్ధాంతాలకూ ఉన్న ప్రాధాన్యం నైతికమైన విలువలకూ ఆచరణ రూపాలకూ లేక పోవడమే. ప్రజాస్వామ్య స్వేచ్ఛలో స్వయం నియంత్రణ మవసరం. సామ్యవాద భావనలో వివేక వర్తనమూ ముఖ్యం. ఎటువంటి పరిస్థితుల్లోనూ నడిపే స్వచ్ఛమయిన మనో రూపాన్ని విస్మరించడానికి వీలులేదు.

భారతదేశంలో పాశ్చాత్య దేశాల భావజాల ప్రభావంతో రాజారామ్ మోహన్ రాయ్ సామాజిక సంస్కరణం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ రాజకీయ దార్శనిక నిర్దేశం, గాంధీజీ నైతిక భూమిక ఆధునిక యుగానికి అస్తిత్వ రేఖల్ని ప్రసాదించాయి. తెలుగులో సామాజికంగా కందుకూరి సాహిత్యంగా గురజాడ భాషా పరంగా గిడుగూ ఈ ప్రగతి త్రయం ఆధునిక యుగానికి పరివర్తన శక్తిని ఇచ్చారు. ఈనాడు జరుగుతూన్న పరిణామాలీ పరంపరలో భాగాలే. ప్రగతిని ముందుకు సాగిస్తూ వేగాన్ని నిలిపే ప్రయత్నమూ జరుగుతూంది. ఈ దార్శనిక స్పందనలతో స్వేచ్ఛా కవిత్వం వికాసాన్ని పొందుతూంది. ఇది సహజ మయిన పరిణామం. విస్తృత మయిన ప్రయోజనాన్ని సంతరింప జేస్తూంది. అంతవరకూ నిరాకరింప బడిన మరచి పోయిన బయటపడని దృష్టికి రాని అనేక మయిన విషయాలు కొత్త కోణాల్లో విశ్లేషితమవుతున్నాయి. కొత్త తరాలకు మెరుగయిన వాతావరణం ఏర్పడుతూంది. ఈ నేపథ్యంలో స్వేచ్ఛా కవిత్వం మానవ వికాసానికీ ప్రజా హితానికీ సమాజ

ప్రగతికీ మానసిక స్వచ్ఛతకూ కట్టువడిన తత్త్వంతో ప్రజాస్వామ్య సామ్యవాద దార్శనికత కలిగిందీ, గురుతర మయిన బాధ్యతల్ని నిర్వర్తిస్తూంది.

కవి మనసులో ఉద్భవించిన భావ ప్రపంచం భాషలోకి పరివర్తితం కావడం కవి ప్రతిభకు సంబంధించిన వ్యక్తిత్వంలో ప్రత్యేకతను బట్టి అభివ్యక్తి విశేషాన్ని పొందుతూంది. ఇది మనస్సుకు చేతనతో ప్రకాశింప జేస్తూంది. చింతనకు ప్రేరేపిస్తూంది. ఉన్నతికి దారితీస్తూంది. కవి మనోధర్మం కీలక మయిన పాత్రను వహిస్తుంది. ఈ ప్రక్రియలో సృజన రూపం సమాజంలో ప్రగతి శీలమయిన మార్పులకూ వ్యక్తిలో స్వతంత్రమయిన భావనకూ ప్రాతినిధ్యం వహిస్తూంది. పూర్వం ఉన్న కవిత్వంతో పోలిస్తే కొన్ని ఉమ్మడి అంశాలున్నా ఈ సందర్భంలో పేర్కోదగిన ప్రత్యేకతలతో రాణించడం జరుగుతూంది. ఒక సృజన రూపం అందునా సద్యః స్పందన గుణం కలిగిన కవిత్వ విషయంలో సాధారణ పాఠకుల దృష్టి వేరు, సాహిత్య సమాలోచనా పరుల దృష్టి వేరు. అనేక స్థాయిల్లో కోణాల్లో అధ్యయనం సమాలోచనా ప్రక్రియకు పుష్టినీ వృద్ధినీ కలిగిస్తుంది. పూర్ణతకు దారి తీస్తుంది. ప్రాధాన్య విశేష ప్రతిపత్తిచేత ప్రత్యేకతను నిలబెట్టే అంశాలు ఈ ప్రక్రియకు అస్తిత్వ బలాన్ని చేకూరుస్తున్నాయి. (1) మొదటిది – సమాజంలో మనిషి బాధల్ని వేదనల్ని గురించి సద్యః స్పందనం పూర్తిగా సామాజిక తలాన్ని ఆశ్రయించిందీ, మానసిక తలాన్ని కలిగిందీ. అతీతమయిన విశ్వాసాలకూ వీటికి సంబంధించిన ఆలోచనా ప్రపంచానికీ దూరంగా ఉంటుంది. (2) రెండోది – వ్యక్తి స్థాయి నుండి సమాజ స్థాయి వరకూ మానవ జీవితాన్ని గురించి మాత్రమే, అదీ వాస్తవ స్థితి పరిశీలనంతో చింతనం కలిగిందీ. (3) మూడోది – కవి తనలో ఉత్పన్న మయిన భావ జాలాన్ని ప్రేరణ స్థితితో కార్య కారణ సంబంధంలో అభిప్రాయం లేదా వాదం లేదా ఆదర్శంతో విలసిస్తుంది. (4) నాలుగోది – బాహ్య దృష్టికి అందని విషయం గురించి హేతుదృష్టితో ఆంతర పరిశీలనానికి ప్రాధాన్యం కలిగిందీ. (5) ఐదోది – వ్యక్తి స్వేచ్ఛతో పాటు నిఖిల మానవీయ భావన కేంద్ర స్థానం వహిస్తుంది. (6) ఆరోది – ఏ నిర్దిష్ట మయిన నియమ నిబంధనలకూ సాహిత్య శాస్త్ర నిర్వచనాలకూ కట్టువడని స్వతంత్ర మయిన సంవిధానం పట్ల అభిలాష కనిపిస్తుంది. (7) ఏడోది – విశ్వమూ ప్రకృతీ నేపథ్యంతో సన్నివేశ సందర్భ స్థితులకు తాత్త్విక స్ఫూర్తి నందిస్తుంది. (8) ఎనిమిదోది – సమాజంలో సమస్యల్ని ఎదుర్కొనే ధోరణిలో పరిష్కార సాధనంలో పోరాట ధోరణి నవలంబించ వచ్చు. (9) తొమ్మిదోది – శాంతి మార్గంలో సమన్వయ

ధోరణి నవలంబించ వచ్చు. రెండింటికీ చాలా అంతరం ఉంది. ఇక్కడే దార్శనిక సిద్ధాంత వాద రూపాలు భేదిస్తాయి. అందువల్ల రెండిటినీ వేరు వేరుగా చూడవలసి ఉంటుంది. (10) పదోది – రచనలో లక్ష్యంలో, వ్యక్తి వికాసం – ఉన్నతీ, మానవ హితమూ కలిగిన గమనమూ, సమాజ సందర్భాన్ని బట్టి – అవసరమయిన మార్పు కోరేది. (11) పదకొండోది – రచనలో మధ్య మధ్య కవి వాక్యం ప్రకటనం వ్యాఖ్యానం వివరణమూ వాద వివాదాలకు సంబంధించిన అభిప్రాయం, కాస్త మోతాదును మించి కనిపిస్తాయి. ఇది కవి తన విశ్వాసాన్ని నిబద్ధతనూ బలంగా చెప్పాలనే ఆకాంక్ష వల్లనే జరుగుతూంది. చాలా సందర్భాల్లో కవి అనుకొనో అనుకోకుండానో చోటు చేసుకొంటూంది. అయితే ఇది పరిమితుల్ని మీరి కవిత్వ కళకు భంజకంగానూ పరిణమించే అవకాశం ఉంది. ఈ కారణంగా విమర్శలకు గురి చేయడమూ జరుగుతుంది. ఇది రాజకీయ దృష్టి కోణంలో ఈనాడు బాగా కనిపిస్తుంది. (12) పన్నెండోది – కవిలో విమర్శకుని ప్రమేయం, ప్రతిపక్ష పాత్ర స్ఫుటంగా కనిపిస్తుంది. సామాజిక రుగ్మతుల్ని పోగొట్టేందుకూ రాజకీయ కాలుష్యాన్ని తుడిచేసేందుకూ నైతిక పతనాన్ని అరికట్టేందుకూ ఉపయోగించడంలో దోషం లేదు. కవి తన బాధ్యతను నిర్వర్తించే భాగంగానే నిలుస్తుంది.

ఏ సృజన రూపమూ అందునా కవిత్వం జీరో పాయింట్ నుండి ఆవిర్భవించదు. ఆధునిక భావ గతికి సాధన మయిన స్వేచ్ఛా కవిత్వం అనేక ప్రభావాల పర్యవసానంగా అవతరించింది, వాటికి దూరంగా ఉండలేదు. ఈ కారణంగా ప్రత్యేకతను చూపే అంశాలతో నిరంతర చింతనమూ అన్వేషణమూ సద్యః స్పందనమూ నవ్యత కోరే మనోధర్మంతో స్వేచ్ఛా కవిత్వం స్థిరపడింది. తన దయిన అస్తిత్వాన్ని పొందింది.

"బీజం నుండి తరు వనంలా / బ్రతికే బహు జాతులతో మానవ సమాజం" (ఆల్బంలో ప్రజాస్వామ్యం). విత్తులో ఎదగబోయే చెట్టు లక్షణాలు దాగి ఉంటాయి. ఎదిగే కొద్దీ అవి బయట పడతాయి. మనుషులూ అంతే, బహు విధాల వ్యక్తిత్వాలతో సమాజ శక్తి ఏర్పడుతూంది.

"దిన మణి బింబంతో మస్తిష్కంలో / గగన మెత్తు ఎదగాలని మనిషిలో" – వ్యక్తి పెరిగే అస్తిత్వం పయి ఆకాంక్షను సూచిస్తూంది. సమస్య పరిష్కృతిలో తీర్పుకు / చిట్ట చివరి మాటలేదు / "అది గాలిలో బెలూన్ కావచ్చు / చేతికో కాలికో సంకెల కావచ్చు" సమస్యకు పరిష్కారంలో తీర్పు పయి మరో మరో తీర్పులతో ఒక్కొక్కరు

ఒక్కొక్క కోణంలో చేసే పరిశీలనాన్ని భావింప జేస్తుంది. అన్నీ కలిసీ సమగ్రత ఏర్పడుతూంది. "ఆయుధ మయ్యే మనసుకు వాద్య విశేష మవడం ఇష్టం" భయానకి గురిచేసే పని కన్నా సంతోషాన్ని కలిగించే పని పట్ల మనిషి ఆసక్తి – మనిషిలో 'పాజిటివ్' లక్షణం – మౌలిక మయిన గుణం – ఆవిష్కృత మయింది.

"ఓటమి జ్వలనంతో నిష్క్రమించే సూర్యుడు / గెలుపు వెలుగు ముఖంతో తిరిగి వస్తాడు" (అద్దంలో ప్రజాస్వామ్యం) – మనిషిలో ఆశాభావంతో ఆత్మ ప్రత్యయంతో కూడిన మనో రూపం సూచితం – సూర్యుడు ప్రతీక ద్వారా క్షతి ఎరగని స్థితి వ్యంజితం. "పగలు వెలుగు వలలో / రాత్రి వెన్నెల వలలో / మధ్య మధ్య చీకటి బోనులో / ఏదో బంధనలో జీవితం" స్వేచ్ఛకోరే మనిషి జీవితం ఎప్పటి కపుడు ఎట్లా స్వేచ్ఛను కోల్పోయే స్థితికి చేరేదీ సూచితం. "సూర్యునికి స్వాగతం తో పని లేదు / చంద్రునికి ఆహ్వానంతో పని లేదు" – సమాజంలో తన విధిని నిర్వర్తించేందుకు వ్యక్తికి ఏ బాహ్యమయిన మర్యాదలతో పని లేదు. ఆంతరమయిన బాధ్యతా స్ఫూర్తికి ప్రాధాన్యం స్పష్టం. "గ్రీష్మం వేసే ప్రశ్నకు సమాధానం మేఘం / రాలే చినుకులతో ఆర్ద్రతలో పరిష్కారం" (ప్రవాహంలో ప్రజాస్వామ్యం) ప్రకృతి భూమికతో – సమాజ భావన ఆవిష్కృత మయింది. జీవితంలో వేరు చేయడానికి వీలులేని ప్రకృతి ప్రభావ శక్తిని స్మరింప జేస్తూంది.

"రవి శశి జలదాలకు చిరునామాతో పనిలేదు" ప్రజాస్వామ్యం – "పిల్లల చేతిలో ఆటబొమ్మలా" ఉంది. "పెద్దలకందని ద్రాక్షలా" ఉంది. నేటి కళా ప్రదర్శనంలా, "షోకేస్"లో – ఉంది. వాస్తవంగా ఉపయోగపడని ధోరణి కనిపిస్తుంది. ఈనాడు ప్రజాస్వామ్యం నుండి పూర్తిగా ప్రయోజనాల్ని పొందలేని దుస్థితి సూచితం.

"కాలమూ సమాజమూ మధ్య కవి బింబం

ఇరువైపుల వెలుగులు ప్రసరించే కవి కర్మ కావ్యం". కవి స్థానం – ప్రభావం – బాధ్యత – ప్రయోజనం వ్యంజితం.

(1) ఆల్బంలో ప్రజాస్వామ్యం; (2) అద్దంలో ప్రజాస్వామ్యం; (3) ప్రవాహంలో ప్రజాస్వామ్యం. ఈ మూడు కృతులూ కలిసీ కావ్యత్రయం, వర్తమాన సమాజ చిత్రణ రూపం.

# 17. ప్రభావ ముద్రలు - ఆకర్షణీయత

కవి తాను దర్శించే భావనా జగత్తునూ సౌందర్య కళా దృష్టినీ దార్శనికతనూ మరొకరికి అనుభవంలోకి తెచ్చే శబ్దావిష్కారంలో సృజన రూపం కవిత్వం. ప్రభావ ముద్రలో కవి వ్యక్తిత్వం విదితమవుతుంది. కవుల కవిత్వ వ్యక్తిత్వాలెన్ని విధాలో ప్రభావ ముద్రలూ అన్ని విధాలు. ఇది రచనలో భాషా ప్రత్యేకత భావ రూపాలూ సంవిధాన పద్ధతులూ అభిప్రాయ దృక్పథాలూ కలసి ఏర్పడుతుంది. ప్రభావ ముద్రలో ఆకర్షణీయత కృతిని ఆయువు నిస్తుంది. ప్రశస్తికి కారణ మవుతుంది. ఆకర్షణీయత అంటే తన వైపుకు లాగే / తిప్పుకొనే గుణాన్ని కలిగి ఉండడం. ఇది కవుల్ని బట్టీ కృతుల్ని బట్టీ భేదిస్తుంది. ఇది అనివార్యం. వీటిని గుర్తించడం సమాలోచనా కర్తవ్యం. ఇది రెండు స్థాయిల్లో పని చేస్తుంది. ఒకటి బయటి నుండి అనుభవానికి వస్తుంది. మరొకటి లోపలి నుండి అనుభవానికి వస్తుంది. రెండిటి కలయికతో కళాత్మకమైన సుస్థితి చేత ప్రభావ ముద్ర ఏర్పడుతుంది. దీన్ని సిద్ధింపజేయడం సామాన్య విషయం కాదు. దీని ప్రకాశ రూపం కాలాన్ని జయిస్తుంది. కవి వ్రాసిన రచన లన్నిటికీ ఈ యోగ్యత లభించక పోవచ్చు. ఆ నిలిచిన దానితో మిగతావీ పేర్కొబడతాయి.

బయటి మరియు లోపలి విధాలు విశ్లేషణలో ఏర్పడేవీ. అనువంలో కలిసే ఉంటాయి. ఒక విధం – పైకి ఉచ్చరింపబడేవీ. పదమూ పద సమూహమూ వాక్యవిన్యాసమూ ముఖయంత్రం నుండి వెలువడే ధ్వని ప్రసారాలతో కూడింది. మరో విధం – పైకి ఉచ్చరింపబడనివీ మనసులో నెలకొనేవీ, అందేవీ నిలిచేవీ, భావమూ, భావనా రూపాలూ ప్రతీకలూ మొదలైనవి. పైకి నిశ్శబ్దంగా ఉన్నా భావ ప్రసారంలో స్వనితమవుతాయి. ఈ రెండూ కలిసి ఉత్సాహకాలుగా ప్రేరకాలుగా వర్తిస్తాయి.

ఇవి అంతిమంగా రస స్ఫూర్తికి దోహద పడతాయి లోన తనలో చదివితే ముఖ యంత్రానికి ఉచ్చారణ శ్రమ ఉండదు. ఇది ఒకరికే పరిమితం. పైకి చదవడం వల్ల స్ఫుటతతో పాటు ఇతరులతో అభిప్రాయాల్ని పంచుకొనే అవకాశమూ కలుగుతుంది. కొత్త అంశాలు ముందుకు వస్తాయి. ప్రభావముద్ర ఎట్లా మరొకరిపై పని చేసేదీ తెలుస్తుంది.

ప్రభావ ముద్ర స్థూలంగా కవిత్వానుభవంలో శరీరంలో అణువణువూ

కదలికతో మొదలవుతుంది. మొదట శరీరంపై చర్మాన్ని స్పృశిస్తుంది. వెంటనే క్రింది పొరలోకి దిగుతుంది. కండరాలు అస్థి రూపాల్లోకి క్రమంగా వేగంగా ప్రవేశిస్తుంది. మానసికమైన సంకేతాలతో సూక్ష్మానుభవానికి దారితీస్తుంది. మూలాధారం నుండి శరీరమూ మేధ వరకూ శక్తి కేంద్రాల్లో నుండి ప్రసరిస్తుంది. ఈ ప్రక్రియ అంతా విద్యుత్తులా క్షణంలో జరిగి పోతుంది. అపుడు ఆర్ద్రత, ఉద్వేగం, ఉపశమనం, శాంతం, ఉల్లాసం, ఉత్సాహం రచనలో విషయాన్ని బట్టి ఏర్పడతాయి. ఇది ప్రభావ ముద్రగా పరిణమింపజేస్తుంది. ఇదొక ప్రక్రియ. ఇది సాంద్రమయిన అనుభూతితోనూ ప్రకాశవంతమయిన ఆలోచన తోనూ సంస్కారాన్ని సంపన్నం చేస్తుంది. ఇదివరకు తనలో ఉన్న దాని కన్నా అదనంగా మరికొంత చేరినట్లు ఉంటుంది. ఇవి గ్రహణ పటుత్వాన్ని బట్టీ పట్టుబడుతాయి, మనసులో నిలుస్తాయి.

కవిత్వంలో పదాల ఎన్నిక – అమరిక, పద సమూహాల నడక వాక్య విన్యాసాల ప్రత్యేకతలు అభివ్యక్తి విశేషాలూ బయటివి ఒక భాగం. కవిలో తనదయిన భావనా జగత్తు – జీవన వాస్తవికత – సమాజ దర్శనం, అభిప్రాయాల – ఆదర్శాల ప్రకటనం లోపలిదీ మరో భాగం. ఈ రెండు భాగాలతో ఏర్పడే రూపం ఒకటే. మొత్తం మీద బాహ్యమూ ఆంతరమూ కలిసి ఉదాత్తత గభీరత ఉన్నతి ఉత్తమ లక్ష్యం అనేవి ప్రభావ ముద్రకు బలాన్ని చేకూరుస్తాయి. విలువల్ని సంతరింపజేస్తాయి. ఇది కవి అస్తిత్వానికి కారణమైనవీ. సాహిత్య చరిత్రలో రచనా స్థానాన్ని నిర్ణయించేవీ.

స్వేచ్ఛా కవిత్వ విశయంలో కవిత్వ ప్రక్రియలో పద్యం గేయం పాట ప్రభావ ముద్రలు వేరు వేరుగా ఉండడం సహజం. పద్యం విశాలమైన క్షేత్రంతో ఎంతో వైవిధ్యానికీ బహుముఖీన మయిన శిల్పానికీ అవకాశం కలిగిందీ, కళాత్మకంగా శిఖరాల నందుకున్నదీ. గేయం పరిమితమయిన అవకాశాన్ని కలిగిందీ. పాట సరళంగా సంక్షిప్తంగా ఒక వలయంలో తిరిగేదీ. ఈనాడు స్వేచ్ఛా కవిత్వం కవిత్వంలో ప్రధాన మయిన స్రవంతిగా ప్రవహిస్తూంది. పద్యానికి దీటుగా ప్రయోజనాన్ని సాధిస్తూంది. ఇది నిర్ణీత మయిన బంధాలకు దూరంగా, కవి స్వేచ్ఛా భావనతో స్వయం ప్రేరిత మయిన నిర్మాణ రూపం కలిగిందీ. దేనికీ పోటీకాదు. అన్నిటికీ సంపూర్ణ మయిన అవకాశాలు కలిగిన ప్రజాస్వామ్యంలో దేని ప్రత్యేకత దానిదే. దేని అవసరం దానిదే. దేనికది సాటిగా జీవవంతమయిన పాత్రను నిర్వహిస్తూంది. జీవించే ఆలోచనతో ప్రకటించే హక్కుకు నిదర్శనంగా ఉంది.

ప్రభావ శక్తి కలిగిన ముద్రతోనే కవి వ్యక్తిత్వానికి స్థిరత ప్రత్యేకత ఏర్పడతాయి. భౌతిక మానసిక స్థాయిల్లో పనిచేసే ప్రభావ ముద్రల్ని విస్మరించడానికి వీలులేని విషయం. దీని ప్రకాశ రూపాన్ని దర్శించడానికి అభిలాష సంస్కారం ప్రయత్నంతో పాటు సూక్ష్మమైన స్పందన శీలమూ అవసరం. ఇది సిద్ధాంతాలకూ వాదాలకూ అభిప్రాయాల భేదాలకూ అతీతం. కవి తాను పొందే స్పందనమూ సంవేదన అనుభూతి విశేషాల్ని ఇతరులకు ఆస్వాదించే అవకాశం కలుగుతూంది. కళాత్మకత తోపాటు సామాజిక స్పృహకూ మానసిక సుందరతకూ నిలయమవుతూంది. ప్రభావ ముద్ర మనసులో సృజన రామణీయకతతో పాటు ఆతలోచనా కమనీయకతకూ చిహ్నం.

*"ప్రజాస్వామ్య చేతన తో సృజన లోక హృదయం*
*ప్రవాహంలో ప్రజాస్వామ్యం, తీరం చేర్చే సాధనం"*

## 18. స్వేచ్ఛా కవిత్వం - ప్రభావ ముద్రలు

కవిత్వం పాఠకుల హృదయం పై వేసే ప్రభావ ముద్రల్ని బట్టి దాని అస్తిత ప్రశస్తి ప్రయోజన దిశ ఏర్పడతాయి. వర్తమాన స్వేచ్ఛా కవిత్వంలో బహు ప్రభావరూపాలు వివిధ క్షేత్రాల్లో తత్కాలంలో అవసరాల్ని బట్టి ప్రవేశించాయి. ఒకరు పొందిన విధంగా ప్రభావ ముద్రలు మరొకరు పొందలేరు. సాధారణ స్థాయిలో కొంతవరకు సరిపడవచ్చు. సూక్ష్మంగా వెళ్ళే కొద్దీ అనుభవ క్రమంలో వేరవుతూ విభేదిస్తాయి. ఇవి పాఠకులు కోరే దాన్ని బట్టీ, ఇష్టపడే దాన్ని బట్టీ ఉంటుంది. అందువల్ల ఎవరి ప్రత్యేకత వారిది అన్నట్లుగా పరిణమిస్తుంది. అన్వయ శోభను పెంచే వివరణ లెన్ని చేసినా, చివరకు జరిగే వాస్తవం, ఎవరి అస్తిత్వాన్ని బట్టి వారిది గానే. స్పందన గుణంతో అనుభవ క్రమంలో ఏర్పడే ప్రభావ ముద్రలు, ప్రతి కవిలో తనదయిన మనోభూమికను ఆశ్రయించి చిరత్వాన్ని పొందుతాయి.

ఈ ప్రభావ ముద్ర లెటువంటివి? ఏ మేరల్లో ఉన్నాయి? ఏ స్థాయిలో ఉన్నాయి. వీటి ఉద్దేశమేమిటి? ప్రయోజన మేమిటి? వీటి సమాధానాలకు సాక్ష్యం కృతియే. ప్రధానంగా కృతి ఆధారంగానే కావలసింది పొందవలసి ఉంటుంది. ఇది ఎన్నో అభిప్రాయ భేదాలకూ వాద వివాదాలకూ మూలమయిందీ. చర్చాగోష్ఠులకూ పురస్కార తిరస్కారాలకూ నిలయమయిందీ. వివేచనలో ఒక పరీక్ష లాంటిది. చాల

సంక్లిష్ట మయిందీ. పైకి కనిపించేటంత సులభంకాదు. ఈ నాటి స్వేచ్ఛా కవిత్వం సమాలోచనంలో సామాజిక రాజకీయ పార్శ్వాల సంరంభం ఎక్కువగా కనిపిస్తుంది. కళా తాత్త్విక మనోవైజ్ఞానిక పార్శ్వాల్నీ విస్మరించడానికి వీల్లేదు. వీటి అవసరం ఎప్పటికీ ఉంటుంది. కృతికి నిండుదనాన్ని పెంచుతాయి. విలువల్ని అధికం చేస్తాయి. ఇవి అటు కృతిలోనూ ఇటు సమాలోచనంలోనూ పరిణత రూపానికి సహకరించే మాట వాస్తవం. ఒక్కొక్క కృతిలో పూర్వంలేని తనదయిన వ్యక్తిత్వంతో కవి మనోరూపం కీలకమయింది. ప్రభావ ముద్రల్ని విడుదల చేస్తుంది. ఇది పలు అంశాలు వివిధ నిష్పత్తుల్లో కలిసి ఒకటై పనిచేస్తుంది. (1) తాము పెరిగిన వాతావరణం (2) చదివిన చదువూ ఎదిగిన స్థితులూ (3) మానసిక స్థాయి స్పందన విధమూ (4) అనుభవ సూక్ష్మత (5) మానవీయ చింతనమూ స్పష్టంగా వివేచనలో నిలుస్తాయి.

ప్రజాస్వామ్య వ్యవస్థలో వ్యక్తి స్వేచ్ఛతోపాటు వ్యక్తిత్వ వికాసానకీ, ఆచరణ ప్రకాశానికీ అవకాశాలెక్కువ. అందువల్ల విషయ విభేదాలతో కొత్త క్షేత్రాలేర్పడడమూ ఉన్నవి విస్తరించడమూ జరుగుతుంది. ఇటీవల ప్రాంతీయ కుల వృత్తి జెండర్ వర్గాలకు సంబంధించిన కవిత్వం విస్తృతంగా రావడం, వాటి అవసరమైన ప్రాధాన్యాన్ని భావింపజేస్తూంది. ప్రగతి లక్ష్యంతో సమస్యలతో పాటు రాజకీయ దృష్టి కోణాలూ చోటు చేసుకోవడం అనివార్యమవుతూంది. కృతిలో ప్రభావముద్ర లనేకం ఉండవచ్చు. ప్రాధాన్య దృష్టితో ఆ పేరుతో పిలవబడడం సహజం. ఆయా క్షేత్రాల ప్రభావ ముద్రలే కృతికి ప్రత్యేకతను ఇస్తాయి. దళిత మైనారిటీ జెండర్ మొదలుగా ఉపక్షేత్రాలూ ప్రధాన భూమికల్ని నిర్వహించడం జరుగుతూంది. ఈ మౌలిక సూత్రంపై సమాలోచనం చాలా అవసరం. ఇందులో (1) కవిత్వం నెరపే ప్రభావ ముద్రల్ని ముందుగా గుర్తించడం (2) కవిలో ప్రత్యక్షంగా పరోక్షంగా పనిచేసే, రచనలో ప్రతిఫలించే సామాజిక రాజకీయ విషయాలతోపాటు కళా తాత్త్విక మనోవైజ్ఞానికాంశాలపై వెలుగును ప్రసరించడం (3) కవీ–కృతీ, సహృదయుడూ–సమాజం, దృక్పథం–లక్ష్యం గురించి సమాలోచనమనేది, ఒక బాధ్యతాయుత మయిన కర్తవ్యంగా నిర్వహించడం అవసరం. ఇవి ప్రభావ ముద్రల వివేచనలో అనుసరించవలసినవీ. దీనికి సంబంధించిన క్షేత్రాల్లో ఉద్యమ మొకటీ.

ప్రజాస్వామ్యంలో ఉద్యమం వ్యక్తి హక్కు. వ్యక్తిగానే కాక సృజన శీలిగా కవిలో అదనపు బాధ్యత ఉంది. దీనికి లక్ష్యంలో స్పష్టత అవసరం. స్వేచ్ఛా కవిత్వంలో

విషయ క్షేత్రాల్లో ఇటీవల బాగా వినిపించే వాటిలో ఉద్యమాలు ఒకటి. సామాజికంగా రాజకీయంగా ప్రధాన మయిందీ. ప్రపంచ స్థాయి నుండి దేశం ప్రాంతం స్థానికం వరకూ వైవిధ్యాన్ని కలిగిందీ. ఇది చారిత్రక గతిలో భాగంగానూ వర్తిస్తుంది. సమాజంలో కొత్త సమీకరణాలకు దారి తీస్తుంది. ఉద్యమాల్లో లక్ష్యాన్ని సాధించినవి కొన్నీ, మధ్యలో ఆగినవి కొన్నీ, ఇంకా ఆశల్ని నిలిపి ఉన్నవి కొన్నీ కనుమరుగై పోయినవి కొన్నీ తటస్థ పడతాయి. పర్యవసానమేదయినా సమాజంలో జరిగే స్థితులకూ ఘటనలకూ, అందునా ఒక లక్ష్యంతో సాగే వాటి పట్ల స్పందించడం, ముఖ్యంగా ఆ విషయంతో ఏకీభవించిన కవులకు సహజం. ఉద్రేక ప్రకృతిలో ఉద్యమంతో కలిసిన వర్తనంలో సానుభూతిలో మనస్సు సద్యః ప్రేరణ వశమవుతుంది. ఈ సందర్భాల్లో కళా తాత్త్విక మనోవైజ్ఞానిక సంబంధమయిన అంశాల ప్రవేశమూ అవసరం. ఉద్యమానికి కావలసిన హంగులన్నీ సహేతుకంగా సాగవలసి ఉంటుంది. దృఢ మయిన సంకల్పం చిత్తశుద్ధీ అవిచ్ఛిన్నమయిన ప్రయత్నంతోపాటు సంఘటన శక్తీ ముఖ్యం. అంకిత భావంతో పాటు కార్యనిర్వహణ నీతి కూడా అవసరం. వీటిలో ఏది లోపించినా ఉద్యమం కుంటుపడుతుంది.

ఈ నేపథ్యంలో ఉద్యమ క్షేత్రం ప్రధానంగా అవతరించిన కావ్యం ఈ కవి 'ఉద్యమ చరణం'. స్థూలంగా తెలంగాణా ప్రత్యేక రాష్ట్రోద్యమం భావ స్ఫూర్తి ఉందీ. మరో లక్ష్యం కలిగిన ఉద్యమానికీ వర్తించే విషయాలతోనూ కూడిందీ. ఏమయినప్పటికీ మానవీయ భావనతో మానవతా సూత్రంతో, మనిషిలో ఉండవలసిన విలుల్ని ఆవిష్కరిస్తోంది. 'చేతనలో భవిష్యత్తు' ను దర్శించే ఆశారూపంతో మొదలయింది. కొన్ని సందర్భాల్లో నిరసన ప్రతిఘటన ఘర్షణలో హింసకూ అశాంతికీ దారి తీయవచ్చు. ఇది శాంతి భద్రతల్ని కాపాడే అంశంగానో మారవచ్చు. సామాన్య ప్రజలు ఇబ్బందులకూ గురి కావచ్చు. ఉద్యమనేతలూ ఎంతో సంయమనంతో జాగరూకతతో చతురతతో వ్యవహరించ వలసి ఉంటుంది. స్వార్థపరుల చేత 'హైజాక్' చేయబడనూ వచ్చు. సమాజ మహా గ్రంథంలో 'లౌకిక పర్వం'లో కొత్త సమాకలనంతో, ప్రతి ఉద్యమంలో వివిధ కారణాల వల్ల లోక సహజ మయిన ఎత్తుగడల్లో కొత్త వారు రావచ్చు / పాతవారిలో కొందరు నిష్క్రమించవచ్చు. కొత్త ఆలోచనలతో క్రియా కలాపాల్లో మార్పులూ జరగే అవకాశంతో ఉద్యమం మలుపులు తిరుగుతుంది. ఉద్యమాన్ని నడిపించే నేతల కార్యనీతిపై ఆధారపడి ఉంటుంది. రచనలో తెలుపు

రంగు సహనానికీ శాంతికీ ఎరుపు రంగు ఉత్సాహానికీ క్రియాశక్తికీ ప్రతీకలుగా కావ్య కళను స్ఫురింపజేస్తాయి.

'ప్రజాస్వామ్య సమాజంలో / మానవ హక్కుల పరికల్పన /

ప్రదర్శనలో వస్తువు కాదు / ప్రచార రథం బ్యానర్ కాదు' – ఇందులో మానవహక్కుల అవసరం వాస్తవ జీవితంలో ఎంత ఉపయోగకరమో, సూచితం సమాజంలో శిఖరంపై ఉన్న సంపన్న వర్గం మొదలుకొని అట్టడుగున ఉన్న పేద వర్గం వరకూ, సమన్వయంకై దారులు తెరచే అవకాశాల్ని కలిగించే ప్రజాస్వామ్యంలో, ఉద్యమాలు జనహితం కోసం సమాజ శ్రేయస్సు కోసం అన్న భావనతో నిండిందీ కావ్యం.

'బాధ్యతలో ప్రజాస్వామ్యం / ఉద్యమాన్ని నిలిపే ఊపిరి /

ఏ ప్రార్థననూ కోరదు / ఒక స్వాగత వచనం తప్ప' – ఈ పంక్తులు! ప్రజాస్వామ్యాన్ని సద్వినియోగ పరచుకొనే మనోరూపాన్ని ఆశిస్తాయి, ప్రజాస్వామ్యానికి ఉపకరించే వేదికల ఏర్పాటూ ఈ సందర్భంలో ప్రసక్త మయింది.

'సేవాశయ పాలనలో విశ్వబంధు హృదయంతో మనిషి! మనిషే! మనిషితో మనిషి! సమాజంలో మనిషి' మనిషి పాత్రలు వ్యక్తిగా సమాజ గతంగా ఇవి ఎన్నివిధాలో! ఎక్కడో ఒక చోట! కలుషితం కావడం జరుగుతుంది. మనిషితో మనిషి సంబంధం! చిరమయిందీ, నిరంతరమయిందీ!

'మండే సూర్యుని తేజంతోనే / పగలు వెలుగు సాధ్యం!

అది! పొరలెన్నో! దాటి కిరణాలయి దిగితేనే శ్రేయం!' ఉద్యమం దాని కదిగా ఉజ్వల మయింది! ఇది సూర్యుని తేజస్సుతో పోల్చబడింది. అయితే తేజస్సు ఎన్ని పొరలో దాటి భూమికి చేరడంలో ఉజ్వలత తగ్గుతుంది. అలాగే ఉద్యమమూ. ఇది ఎన్ని స్థితుల్నో సహనంతో కూడిన వివేకంతో దాటవలసి ఉంటుంది. ఆచరణలో రాజనీతితో క్రమించవలసి ఉంది. అపుడే అందరికీ ఆమోదయోగ్యమయిన ఫలితం దక్కుతుంది.

'ఉద్యమ చరణం' కృతి వర్తమానంలో ప్రాంతీయ వాదంలోని సామంజస్యాన్ని గుర్తించి పరిష్కరంచవలసిన బాధ్యతనూ సమస్యల తీవ్రతనూ గుర్తు చేస్తూంది. పరిష్కార యత్నంలో ఎదురయ్యే ఆదర్శమూ – వాస్తవమూ; దుర్భర స్థితులూ –

ప్రగతిలక్ష్యమూ, సామాజిక రాజకీయ జీవితమూ – నైతిక జనహిత దర్శనమూ అనుభవానికి వస్తుంది.

ఉద్యమ క్షేత్రం స్వేచ్ఛా కవిత్వంలో ఒక అంశం. దీని ప్రభావ ముద్రల నుండి కాలమే కాదు కవిత్వమూ సహృదయ లోకమూ తప్పించుకోలేదు. ప్రజాస్వామ్య భావనతో రూపొందిన 'ఉద్యమ చరణం' వర్తమాన సామాజిక శక్తుల గతి రూపానికి దర్పణం.

## 19. కవి మనోరూపం - సృజన బింబం

ఒక రచన బాగుంటుంది? గొప్పగా ఉంది ఎందుకని? ఎవరికి? అన్న ప్రశ్న సహజం. కొన్ని కొందరికి బాగనిపిస్తాయి మరి కొన్ని బాగనిపించవు. ఏవో కొన్ని అన్ని స్థాయిల వారికీ నచ్చుతాయి. కాలం గడిచే కొద్దీ, ఈ అభిప్రాయాలు స్థిరపడిపోతాయి. కాలం మీద పునఃపరిశీలనం జరిగి అభిప్రాయాల్లో మార్పులు రావడమూ చూస్తూనే ఉన్నాం. ఇది మన అనుభంలో ఉన్నదే. కవిత్వం నవల కథానక నాటకం ఏదైతేనేం? భాష–శైలితోనో, అభివ్యక్తి సంవిధానంతోనో, ఆదర్శం–లక్ష్యశుద్ధితోనో ఆకర్షిస్తాయి వీటితో పాటు వీటి కతీతమైన గుణం, రమణీయమైన శక్తి రూపం దృష్టినాకర్షించే బింబం. ఒక వ్యక్తిత్వం నుండి మరో వ్యక్తిత్వాన్ని వేరు చేసేది. మనస్సుకు మాత్రమే అవగతికి వస్తుంది. అది చాల సూక్ష్మ రేఖలతో విభజంపబడి ఉంటుంది. ఎవరెంత చెప్పినా సంపూర్ణంగా వ్యక్తం చేయరాని స్థితి కలిగింది. ఆధునిక యుగ కవిత్వానికి వస్తే, శ్రీశ్రీ మహాప్రస్థానం మార్క్సు సామ్యవాద సామాజిక దర్శనంతో ప్రవృత్తమైంది. పీడితుల పక్షం వహించింది. ధైర్యాన్ని ఇచ్చింది. వాళ్ళ బాధను ఆర్తినీ చిత్రించింది – భావరూపాల పరంపరతో అక్షరాకృతిని పొందిన ఉత్తేజరూపం! రచనా శిల్పంలోనూ అనితరమైంది. ఆరుద్ర దాశరథి ఎవరి ప్రత్యేకత వారిది. మరోవిధం బోయిభీమన్న "దీపసభ" ప్రతీకాత్మకమైన వస్తు సంవిధానంలో అపూర్వమైంది. అనేక కారణాల వల్ల ప్రతి కవి మనోరూపం వేరుగా ఉంటుంది. దానికి తగినట్లుగా సృజనబింబమూ వేరుగా ఉంటుంది. సాహిత్యంలో ఒక రచన సృజన శక్తితో కళాత్మకతతో రచయిత స్వయంగా సిద్ధింపజేసుకున్న ఆవిష్కార విధానం చేత రూపొందుతుంది. లక్ష్యం అనేది రచయిత సిద్ధాంతాల వల్ల ఆదర్శాల వల్ల విశ్వాసాల వల్ల నిర్దిష్టమౌతుంది. రచనలో సృజనశక్తి

ఎప్పటికపుడు కొత్తగా వీటి కనుగుణంగా పరివర్తితమౌతుంది. ఇది ఏ సూత్రానికీ కట్టుపడదు. ఏ నియమాలకూ లొంగదు. ఏ ఆదేశాన్ని పాటించదు. సర్వస్వతంత్ర మైందీ! బహు స్వేచ్ఛాశీలమైందీ.

సృజన రూపానికి ప్రేరణ సామాజికం కావచ్చు, వైయక్తికం కావచ్చు, ఒక్కొక్క నిష్పత్తిలో కలిసి పరిణమించవచ్చు. ఒక సిద్ధాంతమో ఆదర్శమో ఆలంబనం కావచ్చు, ఇది స్ఫుటంగానో అస్ఫుటంగానో అదృశ్యంగానో ఉండవచ్చు. భౌతికం నుండి అభౌతికానికీ, వాస్తవం నుండి ఆదర్శానికీ దీని నుండి అతీతానికీ దారితీసే ప్రసార రూపం కలిగింది. భౌతికం నుండి అభౌతికం ఆదర్శం అతీతం అనేవి దేని కది విడివిడిగా కాక ప్రధాన వివక్ష చేత మాత్రమే పరిగణనకు వస్తాయన్న మాట మరచిపోకూడదు. ఈ దృష్టితో ఇలియట్ వేస్ట్‌లాండ్, రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలి, అరవిందుల సావిత్రి మొదలుగా అనేకమైన ఉదాహరణలతో సంపన్నం చేయవచ్చు. ఇది చేతన (కాన్షియస్‌నెస్) లో సోపాన క్రమాన్ని పొంది ఉంటుంది. సృజనాత్మకమైన మనీష (క్రియేటివ్ జీనియస్) ఉన్నతమైన సంకల్పంతో ఏర్పడిందీ, నవంనవమైందీ. అనేకమైన పార్శ్వాలతో సంశ్లిష్ట (కాంప్లెక్స్) మైందీ. కవి మనోరూపాన్ని ప్రాచ్య పాశ్చాత్య సాహిత్య ప్రస్థానాల్లో ఎందరో గుర్తించేందుకూ విశ్లేషించేందుకూ వివరించేందుకూ ప్రయత్నించారు.

మనస్సులో నిక్షిప్తమైన సృజన బీజం. పై పైన ఆకార సౌందర్యంతో పాటు, ఆంతురతత్త్వాన్నీ భావించారు. భూమి గాలీ వెలుతరూ నీరూ వాతావరణం ఏవిధంగానైతే, బీజం నుండి జీవభూతమైన ప్రాణశక్తి ఉద్గమించడానికి కారణమౌతాయో, అదే విధంగా సమాజమూ ఆలోచనా రీతులూ అనుభవస్థితీ స్పందనమూ ప్రతిక్రియ మొదలైనవన్నీ, సృజనరూపం ఉద్భాసించడానికి హేతువులౌ తాయి. ఒకే విధమైన పరిస్థితుల్లో ఒక్కొక్క బీజం, ఒక్కొక్క విధమైన మొక్కను వేస్తుంది. దానికి తగిన ఆకుల్ని తొడుగుతుంది. పూలతో పండ్లతో ప్రత్యేక సౌందర్యాన్ని ప్రదర్శిస్తుంది. ఈ వాస్తవం సాహిత్యానికీ వర్తిస్తుంది. అయితే సాహిత్యంలో ఈ ప్రత్యేకతల్ని గుర్తించడం అంత సులభం కాదు. ఇది సహృదయుడు విమర్శకుడు పాఠకుడు లేదా శ్రోత ముగ్గురికీ మూడు విధాలైన మానసిక స్థితుల్లో వేరువేరు రీతుల్లో అనుభవానికి వస్తుంది. ఇక వాటిలో స్థాయి భేదాలనంతం. ఈ కారణంగానే ఎంతమంది ఎన్ని విధాలుగా అభిప్రాయపడినా, ఆలోచన చేసినా సృజన రూపంలో దాగిన జీవప్రసారాన్నీ, దీనికి కారణమైన చైతన్య రూపాన్నీ, వైయక్తిక సామాజిక

శక్తుల ప్రభావరూపాన్నీ ఇదమిత్థమని చివరి మాటగా చెప్పడం జరగలేదు. ఒకరు చూచిన విధంగా మరొకరు చూడలేరు. ఒకరికి కన్పించిన విధంగా మరొకరికి కన్పించదు. ఒకరికి తోచిన విధంగా మరొకరికి తోచదు.

*"ఎవరి లిప్త వారికి నిజం*
*ఎవరి పాత్ర వారికి ప్రియం*
*ఎవరి విలువ వారిది విపణిలో*
*ఎవరి నీడ వారికి సన్మిత్రం"*

సమాజంలో క్రియ ప్రతిక్రియ. అంతర్జగత్తులో, ఆవేశం సంఘర్షణ ఒక్కొక్కరి, ఒక్కొక్క విధంగా అనురణిస్తుంది ప్రతి ప్రసారానికీ స్వేచ్ఛను అనుమతించే వేదిక ప్రజాస్వామ్యం. ప్రజాస్వామ్య వాతావరణంలో ఈ వ్యవస్థలో స్వేచ్ఛా కవిత్వానికి అవకాశాలు ఎక్కువ. అందువల్ల పద్యంతో పాటు స్వేచ్ఛా కవిత్వమూ మానవీయ దర్శనంతో బహుముఖాలుగా విస్తరిస్తూంది. పద్యం ప్రవేశించని క్షేత్రాల్లో అనేక విషయాలతో సంపన్నమౌతుంది. ఆధునికమైన సామాజిక రాజకీయ సాంస్కృ తిక మనో రూపాల్ని ప్రతిఫలిస్తూ, అవసరాలను తీరుస్తూంది. ఈ కారణంగా దీనికి ప్రాముఖ్యం ఏర్పడడం సహజం. సాహిత్యం గురించి మేధావి ఆలోచనలో, సహృదయుని స్పందనంలో శ్రోత లేదా పాఠకుని సానుభూతిలో, ఒకే ఒక సాధారణ సూత్రవాహిని (flux) అనుభవానికి వస్తుంది. ఇది నిర్వచనాలకందదు. ఏ నిర్వచనానికందక పోవడంలోనే కవిత్వం విశిష్టత ఉంది.

*"సృజన శక్తి ప్రేరణతో ఆలోచనలో*
*స్వయం నిహిత స్వేచ్ఛా సంచరణ పదంతో*
*జనజీవన రచనలో మానవతాగంధంతో*
*ప్రజాస్వామ్య పథంలో నవ కవితాయానం"*

ఒక రచన ఎందుకు బాగుంది? అన్నదానికి సమాధానం! సాహిత్య ప్రపంచంలో ఆలోచనా శిఖరాల మధ్య నుండి ఆకాశంలో ఎగసిన భావ బింబం అనుభవానికైతే వస్తుంది. కాని పూర్తిగా వశంకాకుండానే మిగిలిపోయే ప్రశ్నారూపం మాత్రం నిజం. దీనికి సమాధానం కయి కాలాంతరాన నిజాన్వేషణం ఎప్పటికీ జరుగుతూనే ఉంటుంది.

*"వర్తమానం నా రూపం / స్వేచ్ఛా సృజనమయం"*

# ౨౦. స్వేచ్ఛా కవిత్వం - ప్రతిపాదనం

ఆధునిక యుగంలో స్వేచ్ఛా కవిత్వం ప్రక్రియ ప్రయోజనాత్మకమయిన పాత్రను నిర్వర్తిస్తూంది. ఈనాడు తెలుగులో కవిత్వం వ్రాసే వారికీ వినేవారికీ చదివే వారికీ విశాలమైన అవకాశ వేదిక అయింది. ఏ యుగంలోనూ పూర్వం లేని విధంగా వివిధ సిద్ధాంతాలకూ ఆదర్శాలకూ అభిప్రాయాలకూ వాదాలకూ నిలయమైంది. స్థానిక సమస్యల నుండి ప్రపంచ స్థితి గతుల వరకూ అన్ని విషయాల్ని స్పృశిస్తూంది. అభిప్రాయ స్వరాలూ బలంగా వినిపిస్తున్నాయి. జీవితంలో వివిధ సందర్భాల్లో ఎదురయ్యే తాత్కాలికమైన అంశాలూ శాశ్వతమయిన విలువలతో కూడిన విషయాలూ ఆవిష్కారాన్ని పొందుతున్నాయి. సానుభూతీ కరుణనూ, క్రోధమూ వైరాన్నీ, రాగమూ ద్వేషాన్నీ, వైరుధ్యమూ సౌభ్రాత్రాన్నీ, యుద్ధమూ శాంతినీ సంపూర్ణంగా చిత్రిస్తూంది. వీటి దృష్టి కోణాలూ మారాయి. ఇంతేకాకుండా మానవ వికాసానికి సంబంధించినవీ భౌతికం నుండి మానసికం మరియు ఆధ్యాత్మికం వరకూ వివిధాంశాలు దృష్టికి వస్తాయి. ఈ విశాలమైన క్షేత్ర పరిధి కారణంగా దీనిలో స్వతంత్రమయిన స్వేచ్ఛా నిర్మాణ దృష్టి వల్ల 'స్వేచ్ఛా కవిత్వం' అన్నమాట ఈ ప్రక్రియకు ఆమోదయోగ్యతను కలిగిస్తూంది.

మరో విధంగా ఛందో నియమాలకు చెందిన పద్య రచనకు భిన్నంగానే కాక కేవల వచన పద్ధతికి భిన్నంగానూ స్వేచ్ఛా సంచారాన్ని పొందింది. కవిలో సృజన గుణం మానసికమైన ఉద్వేగ స్థాయితో స్పందన రీతితో అభివ్యక్తి నైపుణితో మానవీయ హృదయాన్ని కలిగింది. ఆ సమయంలో కవికి నచ్చిందీ, ఇష్టమైందీ, ఉచిత మనుకుందీ, విశ్వసించిందీ, సరికొత్త నిర్మాణ రూపాన్ని పొందడం ఈ ప్రక్రియ ప్రత్యేకత. కవిలో సంపూర్ణమైన సృజన శక్తి స్వేచ్ఛతో అంతర్ బహిర్ నిర్మాణ రూపానికి సిద్ధమవుతుంది. 'స్వేచ్ఛా కవిత్వ' మన్న ప్రక్రియా వాదానికి కావలసిన అర్హతలూ ఉన్నాయి. దీనికొక ఆధారతలం ఉంది. వికాస గుణం ఉంది. దిశారూపం ఉంది. దర్శన శక్తి ఉంది. వీటిలో అన్నిటినీ తనలో లీనం చేసుకొనే (అబ్జార్బింగ్) శక్తీ ఉంది, విశాలమైన దృష్టీ ఉంది. అంటే స్వేచ్ఛకు తగిన అవకాశం బాగా ఉందన్న మాట. ఈ కారణం చేత ఎంతో విషయ వైవిధ్యంతో వివిధ దృక్పథాల భిన్నత్వంతో స్వల్ప కాలంలో పరిహరింపరాని అస్తిత్వాన్ని పొందింది. స్వేచ్ఛా కవిత్వం అయిదు ముఖాల (ఫేసెట్స్) వ్యూహ (ప్లానింగ్) సమాకలనంగా విశ్లేషణ కందుతుంది. 1. ప్రక్రియకు చెందిన రూప (ఫార్మ్) పరమైనది. 2. వస్తు–విషయపరమైంది. 3. దిశా లక్ష్యపరమైంది. 4.

మానవీయ – మానవతా పరమైంది. 5. వీటితోపాటు సృజన కళ మరియు అభివ్యక్తి శిల్పంలో ఎప్పటికప్పుడు కవి ప్రతిభను బట్టి ప్రయోగమూ నవ్యతతో ఆకర్షించే ఆవిష్కారపరమైంది.

1. ప్రక్రియకు చెందిన రూప పరంగా, బాహ్యమైన ప్రయోగ శీలం కలిగిందీ. ఏ నియమాలనూ అనుసరించని స్వతంత్రమైన నిర్మాణ రూపం కలిగింది. స్వేచ్ఛా గుణం కలిగింది. ఈ సందర్భంలో గుర్తు పెట్టుకోవలసిన విషయం, ఇది వచనానికి భిన్న మయింది. అటు పద్యమూ ఇటు వచనమూ రెండింటికీ అతీతమయిందీ, విశిష్టమయిందీ. ఆధునిక భావ ప్రపంచానికి ప్రాతినిధ్యం వహించే ప్రక్రియకు 'స్వేచ్ఛ' ప్రాణం కావడం సహజం. ఏదో సందర్భాన్ని బట్టి సంభాషణలో కథనంలో సాధారణమైన భావ ప్రకటనంలో 'వచనం' చోటు చేసుకోవచ్చు. కాని కవిత్వమన్న మాటకు ముందుగా నియతంగా 'వచన' మన్న మాటతో 'వచన' స్పృహ పనికిరాదు. అదొక విశ్వాసమూ కారాదు. ఇంతవరకూ వచ్చిన స్వేచ్ఛా కవిత్వం పయి వివిధ కోణాల్లో పలు అంశాలపై సశాస్త్రీయమైన విశ్లేషణ జరుగవలసి ఉంది. ఈ కవిత్వానికి 'వచన' మన్న పూర్వ పదం ప్రక్రియకు చెందిన పరిధిని చాలా పరిమితం చేస్తుంది. ఇప్పుడు వస్తున్న కవిత్వాన్ని పరిశీలిస్తూ పోతే ఈ 'వచన' వలయాన్ని ఛేదించడం, విస్తృతమయిన పరిధిని స్ఫురింపజేయడం, వికాస రూపాన్ని భావింప జేయడం, వైవిధ్యాన్ని గుర్తింప జేయడం చాలా అవసరమనిపిస్తుంది. ఈ మహా కార్యం "స్వేచ్ఛా కవిత్వ" మన్న మాట చేతనే సాధ్యం. మరో విషయం పద్యానికి వ్యతిరేకమయిన ఛందోనియమాలకు భిన్నమైన భావనా మయమయిన మానసిక స్థితితో "వచన" మనడం జరిగింది. ఇది అనవసరం. వికాస స్థితిలో రాణించిన పద్యాన్ని విస్మరించడానికి వీలేలేదు. ఏదైనా కవితా ప్రపంచంలో సృజన రూపం నిలిచేది సానుకూల (పాజిటివ్) గుణాల చేతనే, అందువల్ల ప్రస్తుత కాలంలో ఈ పాజిటివ్ గుణాలకు బాగా అవకాశాన్ని ఇవ్వగలిగింది స్వేచ్ఛారూపమే.

ఫ్రెంచి నుండి "వెర్స్ లిబర్" అనీ, దీనికి ఇంగ్లీషులో 'ఫ్రీవెర్స్' అనీ. అయితే ఇంగ్లీషులోని పద క్రమంలో స్థితి 'స్వేచ్ఛా కవిత్వ' మన్న మాటకు అనుకూలంగా ఉంది. 'వెర్స్' అంటే పద్యం, ఇది నియమాలకూ కట్టుబాటుకీ సంబంధించింది. ఏ నియమమూ కట్టుబాటూ లేని 'స్థితిలో ప్రకృతం పద్యం బదులు లక్షణార్థంలో 'కవిత్వ' మన్న మాటను స్వీకరించడం సహేతుకంగా ఉంది. ఈ కారణం చేత స్వేచ్ఛా కవిత్వమన్న మాట సమంజసంగా ఉంది. ఈ ప్రక్రియ తెలుగులో అవతరించిన

విధంలో ముఖ్యమైన ఉద్దేశానికీ చాలా సన్నిహితంగానూ ఉంది. ఇది పద్యమూ వచనమూ పరిధుల్ని అధిగమించిన స్వరూపం చేత చక్కగా నప్పుతూంది. ఈ స్థితిలో "స్వేచ్ఛ" కేంద్రంగా 1. భావపూర్ణత 2. ప్రయోజన విస్తృతి కలుగుతున్నాయి. రూప గతంగానూ అభిప్రాయ పరంగానూ 'కొత్త' ప్రక్రియగా ప్రవేశించింది. పోను పోను ఎంతో పరిణతినీ వికాసాన్నీ పొందడం జరిగింది. ఆధునిక యుగంలో అందునా ప్రజాస్వామ్యంలో 'స్వేచ్ఛ' కీలకమైన పాత్రను పోషిస్తూంది. అటువంటి వాతావణంలో వైయక్తిక సామాజిక స్థాయిల్లో కవిత్వానికి సంబంధించినంతవరకు సరియైన సాధనంగా నిలిచింది, 'స్వేచ్ఛా కవిత్వం' 2. వస్తు విషయపరమైంది. ఇది స్వేచ్ఛా కవిత్వంలో ప్రత్యేకంగా అధ్యయనం చేయవలసిన అంశం. స్వేచ్ఛా కవిత్వానికి ఎంతో పుష్టిని చేకూరుస్తుంది. 1. వ్యక్తి జీవితం 2. సమాజ స్వరూపం. 3. ప్రకృతి ప్రభావం 4. మనస్తత్వ వర్తనం వీటి సంబంధాల్ని బట్టీ పరస్పర ప్రసారాల్ని బట్టీ ఏర్పడే అనేకమైన జీవిత ఘటనలూ విశేష స్థితులూ దృష్టికి వస్తాయి.

ప్రపంచ స్థాయిలో సంస్పందనలతో మానవీయ దర్శనంతో కన్పిస్తుంది. ఈ మహా పరివర్తనం 'స్వేచ్ఛ' వల్లనే నన్న విషయం వేరే చెప్పనవసరం లేదు. మానవుని సంబంధించిందీ సమాజానికి సంబంధించిందీ, ఏ విషయానికయినా మొదటి ప్రాధాన్యం కలిగింది. కొన్ని సందర్భాల్లో వస్తువు ప్రాచీనమయినా నవ్యమైన దృష్టితో సామాజిక ప్రయోజనంతో కవిత్వాన్ని అవసరమయిన ప్రేరణ స్థానాల్ని బట్టి గ్రహించడమూ జరుగుతూంది. సంప్రదాయ పరంపరలోని సారభూతమైన గుణ రూపంతో పాటు పరివర్తన భావనలోని ఉత్తమమైన గుణజాలమూ కన్పిస్తుంది. మరోమాట మానవ జాతి వికాస దశలకూ ఒక స్థాయిలో వైయక్తిక సామాజిక సమస్యల పరిష్కారాలకు దోహదం చేసిన తాత్త్విక ఆధ్యాత్మిక ప్రపంచాల్ని స్పృశించడమూ జరుగుతూంది. ఈ సందర్భంలో చెప్పేదేమంటే వస్తువులో విషయాన్ని మలచే సామాజిక దృక్పథం ముఖ్యమవుతూందన్నమాట. లేకపోతే మొత్తాన్ని తుడిచి వేయవలసి ఉంటుంది. ఇది అసాధ్యం. జరగని పని. మానవుడు ఇతవరకూ సాధించిన వికాస దశల్ని మరచిపోవడంలో ఏ ఉపయోగమూ లేదు, పైగా నెగెటివ్ ప్రభావమూ పడవచ్చు. కేవలం ఏ అభ్యుదయ/విప్లవ భావజాలాన్ని మాత్రమే అంగీకరించే మనోరూపం, ఈ విశాల ప్రక్రియ ఉద్దేశాన్ని కుంఠితం చేస్తూంది. ఈ విధమైన సంకుచితమైన పరిధుల నుండి బయట పడవేసేది, స్వేచ్ఛయే, అందువల్ల విశాలమైన ప్రాతిపదికపై 'స్వేచ్ఛా కవిత్వ' మన్న మాట సంభావింపదగింది అవుతూంది. వస్తు

– విషయ పరంగా సమాజగతమైన ప్రయోజనాన్ని అభిలషించడం జరుగుతూంది. 3. దిశా లక్ష్యపరమైందీ. ప్రజాస్వామ్య బద్ధమయిందీ స్వేచ్ఛా కవిత్వం.

"స్వేచ్ఛ" అన్నమాట ప్రజాస్వామ్యంలో అతి ముఖ్యమైన స్వేచ్ఛా లక్షణాన్ని కూడా భావింపజేస్తూంది. ఈ కారణంగా లభించే అవకాశాలతో సమాజంలో అనేక సిద్ధాంతాలకూ ఆదర్శాలకూ అభిప్రాయాలకూ వాదాలకూ తమ తమ అస్తిత్వాల్ని కాపాడుకునే వీలు ఉంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో భావాల్లో స్వేచ్ఛ, అనుసరించే స్వేచ్ఛ, ప్రకటనలో స్వేచ్ఛ సామాజికంగా ఎన్నో మార్పులకు కారణమవుతూన్న మాట వాస్తవం. మరో విశేషమేమంటే ప్రజాస్వామ్య వ్యతిరేకులకూ వేదికగా పరిణమిస్తూంది. నిరసనకూ ప్రతిఘటనకూ చివరకు సంఘర్షణకు కూడా ఎంతో కొంత అవకాశం కలుగుతూంది. ఈ వ్యవస్థలో ముఖ్యంగా ఇతరుల అభిప్రాయాల్ని గుర్తించడం, వీటిపై వారితో చర్చలు జరపడం, మెజారిటీ అభిప్రాయాన్ని గౌరవించడం, సాధారణమైన అభిమతానికీ అంతరంగానికీ, వివేకానికీ సామరస్యంపై దృష్టితో అవకాశాల్ని కల్పించడం, హింసను వదలి పరిష్కారానికి సహాయపడతాయనే! వీటికి కీలకమైంది స్వేచ్ఛ! సమాజ శాంతికీ పురోగమనానికీ దోహదం చేసే విధంగా ఫ్లెక్సిబిలిటీ తో వ్యవహరించడం ప్రధానమైన లక్షణం! ఈ స్వేచ్ఛా తత్త్వం కవిత్వ విషయంలో స్వేచ్ఛ కేంద్రంగా దీన్ని అన్వర్థం చేసేందుకు సహకరిస్తూంది.

4. మానవీయం – మానవతాభావ పరమైంది. మానవ సమాజానికీ వ్యక్తికీ సంబంధించిన అనేక విషయాలు భౌతిక మానసిక ఆధ్యాత్మిక తలాలపై ప్రభావ ప్రసారాలు ప్రాధాన్యం వహిస్తాయి. వ్యక్తి జీవితంలో సమాజ చలనంలో మానవ సంబంధాలూ గతి విశేషాలూ ఉద్వేగాలూ ప్రవర్తనలూ ఆలోచనలూ అనుభవాలూ ప్రసక్తం కావడం సహజం. ఇవి స్వేచ్ఛా కవిత్వంలో బహు విస్తారంగా దృష్టికి రావడం కావడం విశేషం.

ఒక్కమాట, ఇది మానవ జాతి విశిష్టత మానవుని ప్రత్యేకతతో పాటు వివిధ వికాస దశల్లో పొందిన ఉన్నతమైన శిఖరాల్లో పొందే అమూర్తమయిన అనుభూతి పూర్వకమయిన దివ్య దశల ప్రసక్తికీ వ్యతిరేకం కాదు. అయితే జన్మల బంధం, విధి మొదలయిన వాటితో దైవం మతం పేరుతో మానవ ప్రతిభా సామర్థ్యాల్ని తగ్గించి చూపడం జరగదు. మనిషిలో విశ్వాసాన్ని పురోగమనతత్త్వాన్నీ విజయ భావననూ స్థాపించడానికి ప్రయత్నిస్తూంది. మనిషికి 1 తన అస్తిత్వంపై అభిలాష, విశ్వాసం 2. జీవితంలో వాస్తవాల్ని గుర్తించడం 3. హేతు దృష్టి కలిగి ఉండడం అనివార్యంగానూ

భావిస్తుంది. స్వేచ్ఛా కవిత్వంలో ఈ అంశం చాలా స్ఫుటంగా దర్శనమిస్తుంది. 4. మనిషిలో ఏ మానవేతరమైన అద్భుతాలకీ కట్టుబడని హేతు సహితమయిన స్వేచ్ఛా రూపాన్ని సూచించడం చేతనూ 'స్వేచ్ఛా కవిత్వ' మన్న మాటను బలపరుస్తూంది. 5. రమణీయమైన ఆకర్షణరూపం బాహ్యంగానూ ఆంతరంగానూ వివేచన కందుతుంది. ఇందులో సాధారణంగా కవిత్వ కళ కన్వయించే లక్షణాలు తటస్థ పడతాయి. పద్యం పట్ల వైముఖ్యం వదలి దీనిపై ఎంతోకొంత సౌముఖ్యంతో దీని లక్షణం పట్ల అవగాహనతో స్వేచ్ఛా కవిత్వ పరిధి (రేంజ్) పెరిగే అవకాశం ఉంది. వచన భావన వదలేసి దీని అవసరం ఎంతవరకో అంతవరకే గుర్తించడం వల్ల వైవిధ్యం పెరుగుతుంది. గుణాత్మకత సిద్ధిస్తుంది. కళాత్మకతకు హాని చేకూరదు. ఈ విధంగా వీటిని ఎన్నుకోవడంలో వివేకవంతమయిన స్వేచ్ఛ, ఆ కవిలో పద్యానికీ వచనానికీ భిన్నమైన విశిష్టమయిన రూపాన్ని అవతరింపజేస్తూంది. రామణీయకమైన ఆకర్షణ రూపమే స్వేచ్ఛా కవిత్వాన్ని నిలుపుతూంది, యశోరూపాన్ని ఇస్తూంది. ఈ దృష్టితో ఉత్తమ మయిన ప్రయోజనమూ సాధ్యమవుతుంది.

ఇక భాషా విషయంలో స్వేచ్ఛ అవసరమే. శబ్ద విస్తృతి చేత భావ ప్రకటనంలో వైవిధ్యమూ ప్రత్యేకత ఏర్పడతాయి. అభివ్యక్తి సౌందర్యానికి కొత్త దారులేర్పడతాయి. ప్రాచ్య పాశ్చాత్య కావ్య శాస్త్రాల్లోని అంశాలు అన్ని కాలాలకూ వర్తించేవి. విషయ వివేచనంతో వీటిని ఉపయోగించుకోవడం వల్ల సృజనకూ సమాలోచనకూ ఎంతో మేలు చేస్తుంది. వీటి ఎన్నికలో కవికి స్వేచ్ఛ ఉంది. ఇది గుణాన్ని పొందడానికి ఉపయోగించడం వల్ల కవిత్వానికి 'కామనీయకత' సిద్ధిస్తుంది. అయితే ఈ 'స్వేచ్ఛ' సంకుచితమైన ఆలోచనలో అనుమానాల నీడలతో కప్పివేయబడకూడదు, ఈ లక్షణాల్ని వ్యంజితం చేస్తూందీ వర్తమాన 'స్వేచ్ఛా కవిత్వం'.

ఈనాడు బహు విస్తృతంగా వస్తూన్న 'స్వేచ్ఛా కవిత్వం' 1. కవిత్వంలో సహజమైన పరిణామమనీ 2. 'ఫ్రీవర్స్' అన్న మాటకు సమంగా అన్వర్థమవుతుందనీ 3. రోజురోజుకీ పొందుతూన్న వైవిధ్యం చేత విస్తృతి చేత నవ్యతాకాంక్ష చేత ఈ ప్రక్రియకు స్వేచ్ఛా కవిత్వమన్న మాట, సమంజసమూ సహేతుకమూ అనీ 4. ప్రజాస్వామ్య భావన ఒక ప్రేరణగా రూపొందిందనీ 5. కవిలో స్వేచ్ఛాసృజన శక్తికి ప్రాధాన్యమిస్తుందనీ "స్వేచ్ఛా కవిత్వం" ప్రక్రియా సిద్ధాంత వాదాన్ని ప్రతిపాదించడమే ప్రస్తుతోద్దేశం.

# స్వేచ్ఛా కవిత్వంలో భావనా రూపాలు - పార్శ్వాలు సమదర్శనం

మాదిరాజు రంగారావు

2026

రసధుని - సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ - 500 028.

Literary Criticism - 14 & 15

# SWECHHA KAVITHVAMLO
# BHAVANA ROOPALU - PARSHVALU
# SAMADARSHANAM

(Sahithya Samalochanam)

by

Prof. Madiraju Ranga Rao

© : Dr. M. Santhosh Kumar

Editor :
Smt. Haritha Devulapally

First Edition : 2004
Second Edition: 2013
Third Edition : 2026

Smt. Haritha Devulapally
M.A. (Litt.)

# వీక్షణం

స్వాతంత్ర్యానంతరం ఆధునిక యుగంలో వచ్చిన స్వేచ్ఛాకవిత్వంలో భిన్న భావనా రూపాలు, వివిధ పార్శ్వాలులో రూపొందిన సిద్ధాంతాలు, ఆదర్శాలు, లక్ష్యాలు. ధోరణుల పట్ల సమదృష్టితో జరిపిన సమాలోచనం ఈ సమదర్శనం. వస్తు విశ్లేషణలోను, విషయ ప్రాధాన్యంలోను సమభావంతో వర్తిల్లింది. ఇందులో రెండు భాగాలున్నాయి. ఒకటి వస్తుపరంగా approaches కు సంబంధించింది 1) జాతీయ, 2) అంతర్జాతీయ, 3) మానవతా భావనా ప్రభావాల్ని గురించి ఉంది. రెండోది ఆదర్శాలు సిద్ధాంతాలు లక్ష్యాలు ధోరణులు ప్రధానంగా పార్శ్వాలకు (facets) కు సంబంధించింది. ఇందులో 1) అనుభూతి, 2) అభ్యుదయ, 3) ఉగ్రవాద, 4) సమన్వయ, 5) ప్రజాస్వామ్య, 6) సామ్యవాద కళాభావ, 7) దిగంబర, 8) చేతనావర్త, 9) దళిత, 10) స్త్రీ వాద విభాగాలుగా వర్గీకృతమైన ఆధునిక కవితా సమాలోచనం.

ఈ రెండూ సమాలోచనకు వైవిధ్యాన్ని విస్తృతినీ కలిగించేవిగా ఉన్నాయి. అర్హమైన వాటిని విస్మరించకుండా పరిగణనలోకి తీసుకొనే సమభావం దృష్టికి వస్తుంది. ఇందులో కవుల సృజన ప్రతిభతోపాటు లక్ష్యానికి ప్రాధాన్యం ఇవ్వబడింది. Concept ను ప్రతిపాదించడంతో theoritical సూత్రాన్ని ప్రవేశపెట్టిన తరువాత వాటికి ప్రాతినిధ్యం వహించేవాటిని కవిత్వపరంగా పేర్కోదగినవి ఉదాహరణలుగా కొన్ని మాత్రమే తీసుకోవడం జరిగింది. ఇది సాహిత్య చరిత్రకాదు. సాహిత్య చరిత్ర రచనకు ఉపకరించవచ్చు, సమాలోచనా దిశల్ని చూపిస్తుంది. కాలక్రమంలో కాకుండా, విషయం దాని లక్ష్యం, అవసరమైన హేతుదృష్టి ఇందులో అవలంబింపబడింది.

మొదటిభాగంలో – 1) జాతీయ భావన ఎ) బయటి నుండి వచ్చే విపత్తు, దేశ రక్షణం, బి) లోపలి నుండి ఏర్పడే విషమస్థితులు, అశాంతి – వీటి నెదుర్కొనే ఉత్సాహ శక్తి, సమైక్య రూపంతో పురోగమనం, సి) జాతి మూలాల్ని కాపాడుకుంటూ సంస్కరణతో పరివర్తనంతో పునర్నవం కోరే మనోరూపం. డి) జాతి సంపూర్ణ వికాసంలో దళితోద్యమం – సామాజిక బాధ్యత. 2) అంతర్జాతీయ భావన ఎ) అంతర్జాతీయంగా

ప్రధానమైన సంఘటనలపై స్థితులపై కవుల ప్రతిస్పందనం, బి) అంతర్జాతీయ ప్రభావ పర్యవసానంగా ప్రవేశించిన హ్యూమనిజం, లిబరలిజమ్, డెమోక్రసీ, సామ్యవాదం ఫెమినిజమ్ మొదలుగా ఆధునిక చేతనతో కూడింది. 3) మానవతా భావన ఎ) సూక్ష్మ తలం (Micro level) పై అనేక స్థితుల్ని సంఘటనల్ని సందర్భాల్ని పురస్కరించుకొని వెలువడినవి. బి) స్థూలతలం (Macro level) పై మానవ వికాసం, ఉన్నతి, అస్తిత్వం, విజయాలు మొదలుగా విశాల ప్రాతిపదికపై వెలువడినవి. మానవీయం, ముక్తధాత్రి పడగెత్తిన ఉదయం, తెలంగాణ, అగ్ని నుండి ఆనందానికి, కొయ్యగుర్రం, ఆసుపత్రి గీతం, విశ్వంభర, జీవనలిపి, నా దేశం నా ప్రజలు, అగ్నిపీఠం మొదలైన కావ్యాలు ప్రసక్తమయినాయి.

రెండో భాగంలో స్వాతంత్ర్యానంతరం బహు వైవిధ్యాన్ని, విస్తృతినీ పొందిన స్వేచ్ఛా కవిత్వంలో విశిష్టమైన పాత్రల్ని నిర్వహించిన, 1) అనుభూతి, 2) అభ్యుదయ, 3) ఉగ్రవాద, 4) సమన్వయ, 5) ప్రజాస్వామ్య, 6) సామ్యవాద కళాత్మక, 7) దిగంబర, 8) చేతనావర్త, 9) దళిత, 10) స్త్రీ వాద పార్శ్వాలలో ఆదర్శాలు లక్ష్యాలు ధోరణులు సమాలోచిత మయినాయి. ఇంకా జరగాలిసీ ఉంది. ఈ రెండు భాగాలూ ఆధునిక యుగంలో విస్తృతమైన ప్రయోజన క్షేత్రాల్నీ భిన్న భిన్న దిశల్నీ బింబించే స్వేచ్ఛా కవిత్వం పొందిన విరాట్ రూపాన్ని భావింపజేస్తాయి. నాన్నగారి మాటల్లో – "గొప్ప చరిత్ర ఉన్న పద్యం ఇంకా ఆధునిక యుగంలో సమాజ చరిత్రగతిలో కాల స్పృహనూ సందర్భ స్పందననూ ప్రయోజన విస్తృతినీ వాస్తవ సంబంధాన్ని ఎక్కడ పెంచుకోవలసిందీ ఈ సమాలోచనాల్ని బట్టి మనస్సులో మెదలుతుంది". అందువల్ల దేని పాత్ర దానిదే. ఒకదానికి మరొకటి సహ రూపంగా భావించాలి.

రచయిత ప్రజాస్వామ్యం పట్ల నిబద్ధత కలిగిన కవి, అయినప్పటికీ మిగతా వాదాలకూ ధోరణులకూ సమానమైన గౌరవాన్ని ఇవ్వడం, వాటి విలువల్ని గుర్తించడం, సమాలోచనంలో సమతౌల్యాన్ని పాటించడం కన్పిస్తుంది. ఇవి స్వేచ్ఛా కవిత్వం గురించి సమాలోచనంలోని సమగ్రతను బింబిస్తాయి. దేని ప్రత్యేకత దానిదే, దేని ప్రయోజనం దానిదే.

నాన్నగారి రచనల్ని ఎడిట్ చేసి, ప్రకాశితం చేసే కార్యక్రమంలో భాగంగా వెలువడే ఆధునిక స్వేచ్ఛా కవిత్వంలో భావనా రూపాలు – పార్శ్వాలు సమదర్శనం సమాలోచనా గ్రంథం సహృదయుల ఆమోదాన్ని పొందుతుందనీ విశ్వసిస్తున్నాను.

# అంకితం

స్వాతంత్ర్య సమర యశస్వి

రచయిత

ప్రజాస్వామ్య బంధువు

శ్రీ ఎం.ఎల్. నరసింహారావు అన్నగారికి

సగౌరవంగా

# స్వేచ్ఛా కవిత్వంలో భావనా రూపాలు - పార్శ్వాలు

# సమదర్శనం

మొదటి భాగం

## భావనా రూపాలు


1. జాతీయ భావన....................................................07
2. అంతర్జాతీయ భావన..............................................29
3. మానవీయ భావన ............................................... 50


రెండో భాగం

## వివిధ పార్శ్వాలు


1. అనుభూతి ....................................................73
2. అభ్యుదయ.................................................... 82
3. ఉగ్ర ........................................................... 90
4. సమన్వయ.................................................... 95
5. ప్రజాస్వామ్య ................................................101
6. సామ్యవాద కళాభావ....................................... 104
7. దిగంబర.......................................................107
8. చేతనావర్త.....................................................115
9. దళిత..........................................................119
10. స్త్రీ వాద ................................................... 125

# స్వేచ్ఛా కవిత్వంలో

# భావనా రూపాలు - పార్శ్వాలు

# సమదర్శనం

### మొదటి భాగం

## భావనా రూపాలు

## 1. జాతీయ భావన

(1)

జాతి అనేది చారిత్రక సాంస్కృతిక మానసిక సామీప్యాలు గల ప్రజా సమూహం. దీనికి సంబంధించింది జాతీయం. ఇది కొన్ని మౌలికమైన అంశాలతో కూడింది. మానసిక తలంపై శక్తివంతంగా పనిచేసేది. అయితే భారతదేశంలో అనేక చారిత్రక కారణాలవల్ల భిన్నమతాలు సంస్కృతీ భేదాలు విలసిల్లాయి. ఒక విధమైన సంశ్లిష్ట రూపం దృశ్యమానమవుతూంది. దేశ స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగం (26 జనవరి, 1950) అనుభవంలోకి రావడంతో జాతీయ భావన విస్తృతిని పొందింది, వైవిధ్య రూపాన్ని సంతరించుకుంది. సరికొత్త కోణాన్ని పొందింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో "పౌర" భావం, లౌకికత్వాన్ని పొందింది. మతానికీ, ప్రాంతానికీ, వర్గానికీ అతీతమైన భావన జాతీయ భావనకు ఆధునిక రూపాన్ని కలిగించడం గమనించదగింది. దీనికితోడు సంస్కరణ, పరివర్తన దశలు దీనికో నిర్దిష్టమైన అస్తిత్వాన్ని కలిగించాయి.

సాహిత్యానికి వస్తే సామాజికం సాంస్కృతికం ఆధునికం రాజ్యం కుటుంబం వృత్తులు పరిశ్రమలు కలిసి మొత్తం మీద జాతి స్వరూపాన్ని తీర్చిదిద్దుతాయి. ఆధునికం పేరుతో ప్రాచీన సాంస్కృతిక సంపదను విస్మరించడం కుదరదు. ఇది ఆధునికానికి పూర్వరూపంగానూ ఆధారతలంగానూ వర్తిస్తుంది. ఇది సహజం. ఇదో అవిచ్ఛిన్నమైన పరంపరారూపంగా పరిణమిస్తుంది. జాతి ప్రత్యేకతను నిలుపుతుంది.

ఈ దృష్టితో జాతికి సంబంధించిన జాతీయ భావనలో రెండు స్థితులు విశ్లేషణ కందుతాయి. 1. చారిత్రకంగా దేశప్రజల సాంస్కృతికమైన ప్రాచీన మూలాలకు విలువలకు సంబంధించింది. భారతదేశాన్ని తీసుకుంటే ఈజిప్షియన్ హెలెనిక్, బాబిలోనిక్, సుమేరియన్, హిట్టైట్ నాగరికత లెన్నో నశించాయి. శాంతి, సహనం, సహకారం, అహింస, ఉదారత మొదలైన లక్షణాలతో సంపన్నమయిన భారతీయ నాగరకత – సంస్కృతి, ఇప్పటికీ నిలచే ఉంది. దీనికి కారణం ఎప్పటి కపుడు చారిత్రకంగా రాజకీయంగా, సామాజికంగా, మానసికంగా దేశంలో వచ్చే మార్పులకు తట్టుకొనీ, తనలో కొన్ని ఇముడ్చుకొని వర్ధిల్లే స్థిర లక్షణమే. దీని ననుసరించిందే రెండోది.

2. వర్తమాన జీవనగతుల్ని చిత్రించే దృక్పథం, ఇది కాలానుగుణమైన మార్పులతో కూడింది. వివిధ మతాల జీవన పద్ధతుల భేదాల సమాకలనంతో వర్తించే స్థితి అనవచ్చు. ఇది ప్రజాస్వామ్య రాజ్యానికి తగిన విధంగా ఉండేది.

స్వాతంత్ర్యానంతరం సర్వసత్తాక లౌకిక ప్రజాస్వామ్య రిపబ్లిక్ (Sovereign Secular Democratic Republic) గా (26 జనవరి, 1949 ఆమోదింపబడి), 26 జనవరి 1950 నుండి ప్రజాస్వామ్య రాజ్య పాలనా నిర్వహణ రూపంగా రాజ్యాంగం అనుభవాత్మకం కావడం చారిత్రకంగా గొప్ప మలుపు. ఇది జాతికి లౌకికత్వాన్ని సాధించింది. బహు విస్తృత రూపాన్ని ఇచ్చింది.

జాతీయత అనేది అమూర్తమైన భావన కాదు. స్వాతంత్ర్యానంతరం, రాజ్యాంగం అమలుతో దీని పరిధి విస్తృతమయింది. జీవితంలో సంశ్లిష్టరూపాన్ని పొందిన సామాజికత ప్రవేశించింది. నెహ్రూ మాటలు ఈ సందర్భంలో "Nationalism does not mean Hindu Nationalism, Muslim Nationalism, Christian or Sikh Nationalism, these ideas belong to the petty and backward minds" జ్ఞాపకం వస్తాయి. జాతీయత అనేది, ఒక మానసికమైన ఉద్వేగానికీ, అనుబంధ గుణానికీ సంబంధించింది. దేశంలో ఉన్న పౌరులందరూ వివిధ మతాలూ, విశ్వాసాలూ, ప్రాంతీయతలూ కలిగి ఉన్నప్పటికీ అందరూ ఒకటేనన్న విశాలమైన సమైక్యభావనతో పర్యాప్తమయింది. గత కాలానికి

సంబంధించిన చారిత్రక సంపదతో, వర్తమాన కాలానికి సంబంధించిన ఉమ్మడి సామాజిక ధ్యేయంతో విలసిస్తుంది. దీనికి ప్రజాస్వామ్యంలోని సహనం, శాంతి లక్షణాలతో విభేదాల్ని చర్చల ద్వారా సమన్వయం ద్వారా పరిష్కరించుకునే అవకాశం మరింత పుష్టిని కలిగిస్తోంది. వ్యక్తిగతంగానూ, బృందాలుగానూ ప్రత్యేకతలు కలిగి ఉన్నప్పటికీ దేశగతంగానూ, సామాజికంగానూ ఐక్యభావన, ఆధునిక భావజాలంతో తీర్చబడిన స్వరూపం జాతికి ప్రాణభూతమైంది.

సాహిత్య జగత్తుకు వస్తే, సాంస్కృతికమైన ప్రాచీన మూలాలతో, ఆధునికమైన సంస్కరణలతో పరివర్తన ముఖాలతో, పునరుజ్జీవన గతులతో పునర్వికాసదశలతో సామాజికార్థిక రాజకీయ పార్శ్వాలతో జాతీయభావన కొత్త రూపాన్ని పొందిన మాట వాస్తవం.

భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుల (Fundamental Rights) తో నిర్దేశక సూత్రాలతో (Directive Principles) స్వేచ్ఛ, సమానత్వం సామాజిక న్యాయం, లౌకికతత్త్వం మొదలుగా ప్రజాస్వామ్య స్వరూపానికో నిర్మాణ రూపాన్ని కలిగించడంలో తోడ్పడినయి. దేశ సమైక్యతకు భంగం కలిగినపుడు, జాతీయ భావన వికసిస్తుంది, క్రియాత్మకతను పొందుతుంది. అవసరంపై దృష్టి ప్రసరిస్తుంది. తెలుగు స్వేచ్ఛా కవిత్వంలో జాతీయ భావన ఈ పృష్ఠ భూమికపై, కవుల ప్రత్యేక వ్యక్తిత్వాల్నిబట్టి ఆదర్శ భావాలకనుగుణంగా ఆయా సందర్భాల్లో ఆవిష్కృతమయింది. కొంచెం వెనక్కి వెళితే జాతీయ భావన అంతవరకూ ప్రసుప్తంగా ఉంది. గాంధీజీ స్వాతంత్ర్యోద్యమ నాయకత్వంలో బలమైన ప్రేరణశక్తిగా అవతరించింది. ప్రజాస్వామ్య వ్యవస్థకు సూచనగా మతం వర్ణం ప్రాంతం వర్గం భేదాలకతీతంగా విశాలమైన ప్రజారూపంతో లౌకికత్వాన్ని పొందింది. స్వాతంత్ర్యానంతరం దీన్ని కాపాడే విధంగా రాజ్యాంగం వర్తిల్లింది. దేశచరిత్రలో స్వాతంత్ర్యం ఒక చారిత్రకమైన మలుపు అయితే, ఈ మలుపుకు భారత రాజ్యాంగం దిశను నిర్దేశించింది. స్థిరతను కలిగించింది.

జాతీయ భావనకు ఇరవై శతాబ్దిలో స్వాతంత్ర్యోద్యమ దశలో ప్రాముఖ్యం వచ్చింది. వలస ప్రభుత్వాలపై పోరాటంతో దేశప్రజల్ని అందరినీ కూడగట్టుకొని

ఉద్యమించే స్వరూపాన్ని పొందింది. ఈ కారణంగా పౌరులందరూ సమానమేనన్న ఆలోచనకు బలమేర్పడింది. దేశ సాంస్కృతిక మూలాలతో పాటు సంస్కరణపథంలో పరివర్తన దశలో సామాజిక వాస్తవాల్ని గుర్తిస్తూ జాతీయ భావన చారిత్రక సామాజిక అవసరాలతో అనివార్యాలతో విస్తృతిని పొందింది. లౌకిక (Secular) త్వాన్ని పొందింది.

అందువల్ల జాతీయభావన అంతర్ బహిర్ దశలుగా రెండు స్థాయిల్లో దృష్టికి వస్తుంది. భారతదేశంలో సనాతనమైన హైందవమతంతోపాటు స్థానిక సంస్కృతుల ప్రభావంతో దేశీయమైన రీతులూ, చారిత్రక కారణాలవల్ల ఇస్లాం, క్రిష్టియన్, జొరాష్ట్రియన్ ఇంకా బౌద్ధం, జైనం, సిఖ్ మొదలైన మతాలు అస్తిత్వాల్ని పొందాయి. భారత రాజ్యాంగాన్ని అనుసరించి అన్ని మతాలకూ సమానమైన ప్రాధాన్యం ఉంది. ప్రతి పౌరునికీ ఏ మతాన్ని అయినా స్వేచ్ఛగా అవలంబించే హక్కు ఉంది. ప్రభుత్వం ఏ మతాన్నీ కావాలని ప్రోత్సహించదు, నిరాకరించదు.

స్వాతంత్ర్యానికి పూర్వం హిందువులు, ముస్లింలు మత ప్రాతిపదికపై సంఘర్షణలకు దిగడం జరిగింది. బ్రిటిషు పాలకులు ముస్లింలకు ప్రత్యేకంగా 'ఎలక్టోరేట్'ను ఏర్పాటుచేయడంతో మత విభేదాలకు ప్రోత్సాహం లభించింది. క్రమంగా రాజీపడని లక్ష్యాలు దేశవిభజనకు దారితీసాయి. గాంధీ, నెహ్రూ, పటేల్, ఆజాద్ మొదలైన అగ్రనాయకులు సర్వమత సహనాన్నీ, లౌకిక భావజాలాన్నీ ప్రోత్సహించారు. రాజ్యాంగం అమలుతో ప్రజాస్వామ్య రాజ్యంలో జాతీయభావన విశాలతరమైన రూపాన్ని పొందింది. ఇది 1) దేశ ప్రాచీన సాంస్కృతిక మూలాల్ని గౌరవిస్తూ, 2) సంస్కరణ పరివర్తన గుణాల్ని మన్నిస్తూ, 3) సమాన ప్రాతిపదికపై పౌరులందరినీ గుర్తిస్తూ, 4) దేశ సమగ్రతను కాపాడే సమైక్య రూపాన్ని ప్రోత్సహిస్తూ, ప్రజాస్వామ్యదశలో సరికొత్త రూపాన్ని సంతరించుకుంది. గతాన్ని సంస్కరించి, వర్తమానంపై దృష్టితో జాతినిర్మాణం జరగాలనే ఆకాంక్ష వికసించింది. ఇది కుల మత వర్ణ వర్గ ప్రాంత భేదాలు లేని స్వేచ్ఛా సమాజానికి దారితీసే జాతీయ భావనను ప్రకటితం చేసింది. భారతదేశ చరిత్రలో ఇది విస్మరించరాని వాస్తవం. మతం వ్యక్తిగతం, మతాలపట్ల పరస్పర గౌరవం సమాజావసరం, అన్న ఆలోచన ప్రజ్వామ్యయుతమై జాతీయ భావనకు విస్తృతమైన పరిధిని చేకూర్చింది.

(2)

స్వేచ్ఛా కవిత్వంలో జాతీయ భావన ప్రధానంగా రెండు విధాలుగా కన్పిస్తుంది.

**1) సంప్రేరితం :** 1) దేశం బయటి నుండి వచ్చే యుద్ధాల సందర్భంలో పొందే మానసికమైన ఉద్రేకభరితమైన జాతీయ చేతనతో కూడింది. 2) దేశంలోపల ఎదురయ్యే అనేక విషమ స్థితుల సందర్భంలో పొందే మానసికమైన స్పందనతో నిర్మాణాత్మకమైన ఆలోచనతో కూడింది.

**2) నవాలోకనం :** కొత్త ఆలోచనతో ఎప్పటికపుడు సంస్కరణ పరివర్తన దశలతో రూపొందేది. సంస్కృతీ మూలాల ప్రకాశనంతో, జాతి వికాసాన్ని కాంక్షించేది, జాతి సంస్కృతిని కొత్త దృష్టితో చూడడమే కాకుండా, సహేతుకమైన మార్పుల్ని స్వీకరిస్తూ సమాజాన్ని పునర్నవం చేసే విధంగా ఉన్నదీ, 'దళితోద్యమం' జాతీయ భావనలో ఈ దిశగా వర్తించిందే. దళితులు, ఈ దేశంలో వారు, వారి సమస్య ఈ దేశానికి సంబంధించింది, అంతరమైంది. ఇదే విధంగా అన్ని స్థాయిల్లో కొత్త దృష్టితో మార్పును కోరే భావన కన్పిస్తుంది.

## 1. సంప్రేరితం

**బహిర్గత విపత్తులు :** జాతీయ భావనను ఉద్వేగంతో సంప్రేరితం చేసిన సంఘటనల్లో, బయటి నుంచి వచ్చినవి, ఒకటి చైనా దండయాత్ర, రెండోది పాకిస్తాన్ యుద్ధం. ఈ రెండు విపత్తులూ హఠాత్తుగా ఆపతితమయినవి. ఈ సందర్భంలో జాతిలో శక్తినీ సమైక్యతనూ ఉద్బోధించే 'స్వేచ్ఛాకవిత్వం' జాతీయ కోణంలో పేర్కోదగింది అవతరించింది.

1962 అక్టోబర్‌లో చైనాతో భారతదేశానికి సరిహద్దు యుద్ధం సంభవించింది. ఇండియా చైనా మధ్య ఏర్పడిన పంచశీల ఒప్పందాన్ని కాదని, చైనా మెక్‌మోహన్ రేఖను ఉల్లంఘించింది. పశ్చిమాన జమ్ము కాశ్మీర్ ప్రాంతంలో లడక్ భాగాల్నీ, ఈశాన్యంలో టిబెట్ ప్రాంతంలో నీఫా భాగాల్నీ ఆక్రమించింది. ఇది హఠాత్ పరిణామం. దీనితో శాంతిప్రియుడైన నెహ్రూ కలత చెందాడు. చైనా గురించి పురిపండా

అప్పలస్వామి "రణభేరి" కవిత "ఎక్కడిదీ రణాహ్వానం – మిత్రద్రోహపు హుంకారం! అమృతంలో హలాహలం కలిపి ఆలాపనలో కోలాహలం లేవదీస్తోంది" చైనా ద్రోహాన్ని దుష్ట మనోరూపాన్ని నిరసిస్తూ "ఓహో జనులారా! రండి! రండి రణభూమికి! ప్రళయకాల రుద్రులై, వీరభద్రులై" అని దేశవాసుల్ని ఆహ్వానించే జాతీయ భావన వీరత్యాగంతో రంజితమయింది. "హిమశిఖరంపై రక్తం చిందిస్తున్న ఘాతకుడు – తపోవనంలో చిచ్చు రగులుస్తున్న దానవుడు" అని శాంతి అహింస ప్రేమ మూర్తీభవించిన దేశంపై అకారణంగా యుద్ధానికి దిగడంలోని ఘాతుకత్వం చిత్రితమయింది. భారతీయ మూలసంస్కృతీ పరమైన 'తపోవన' రూపంలో ఉత్సాహపరమైన పిలుపుతో జాతీయ భావన సంప్రేరితమయింది.

బాలగంగాధర తిలక్ "త్రిశూలం" కవితలో "నమ్మకు చైనావాడిని, పువ్వులు చిదిమేవాడిని, బరిమీద వదలిన పామునీ, గోతులున్న బాటనీ, భోగందాని మాటనీ, చౌ ఎన్ లై మాటనీ" ఇందులో చైనా విశ్వాస ఘాతుక చర్య తీవ్రంగా నిరసింపబడింది. 'పంచశీల' ఒప్పందానికీ, 'శాంతి సమావేశాల'కూ భిన్నంగా భారతదేశంపై అనూహ్యంగా నెరపిన దాడి ప్రపంచాన్నే దిగ్భ్రాంతికి గురిచేసింది. 'చై ఎన్ లై' కృతఘ్నుతనూ, మోసాన్నీ, క్రౌర్యాన్నీ తలపింపజేసే పంక్తులివి. సి. నారాయణరెడ్డి ఈ యుద్ధ వాతావరణంలో జాతిపై దృష్టితో – "గుండె గుండెకొక దీప కరండం వెలిగింది నేడు – శిరముశిరమునకొక హిమాద్రి శిఖరం పెరిగింది నేడు" అంటాడు. ప్రతి పౌరునిలో వెలిగిన ఉత్సాహంతో అభిమానం చిత్రితమయింది. తుది "విజయం మనది" అన్న కవితలో "మొదటి గెలుపు పగవానిది, తుది విజయం మనది" అంటాడు. దండయాత్ర చేసిన చైనా, కొంత భారత భూభాగాన్ని ఆక్రమించడం జరిగింది. భారతదేశం దాన్ని తిరిగి పొందే ప్రయత్నమే మనం చేసే యుద్ధం. ఇందులో "విజయం" సాధించగలమనే ఆత్మవిశ్వాసం 'వీరభావన'తో సూచితమవుతూంది.

మాదిరాజు రంగారావు, "కదలండి శతఘ్నులవలె"లో "పొద్దు పొడవడానికి బదులు" ఈ రోజు "యుద్ధం వచ్చిపడింద"ని హఠాత్తుగా జరిగిన సంఘటనను స్ఫురింప జేస్తూ జాతిని ఉత్సాహంతో ప్రేరేపించే పంక్తులూ కన్పిస్తాయి. "ప్రతిజ్ఞ వీడకండి, సమర సన్నాహం మానకండి" అని జాతిని ఉద్బోధిస్తాడు. "పోరాడే

సోదర సైనికబృందం, జాతి ప్రతిష్ఠకు ప్రతిరూపం”గా వారి జిగిషా మనోరూపం చిత్రితమయింది. “భరతజాతి హృదయం శాంతి కపోత నివాసం, దీనిపై తుపాకులు పేల్చే హంతకుణ్ణి మరవకండి, మనం పీల్చే గాలి అప్పుడే బరువెక్కింది. లేవండి మహోగ్నులవలె, కదలండి శతఘ్నులవలె” ప్రధాని నెహ్రూ శాంతిప్రియత్వంతో గాంధీజీ అహింసావాదంతో స్నేహభావంతో విలసిల్లే ప్రజాస్వామ్య హృదయంపై చైనా పేల్చింది. ఇది సహింపరాని కృత్యం. దీన్ని ఎదుర్కొనేందుకు శాంతి ప్రవచనాలకు స్వస్తి చెప్పి వీరకృత్యానికుపక్రమించేందుకు పిలుపు ఇవ్వబడింది. “రుణవ్యూహ నవమతితో ప్రజాస్వామ్య చరణంతో కదలండి నీఫా ప్రాంతం, తరలండి లడక్ భాగం” మనది ప్రజాస్వామ్యదేశం. మనపై జరిగే దాడిని తిప్పికొట్టేంత వరకే పరిమితమైంది, మరో దేశాన్ని ఆక్రమించే తత్త్వం కలిగింది కాదన్న సూచనతో పాటు తక్షణ కర్తవ్యమూ వర్ణితమైంది.

1965లో భారత్‌పై పాకిస్తాన్ జరిపిన యుద్ధం జాతీయ భావనను ప్రేరేపించింది. దేశభక్తిపూరితమైన వాతావరణం నిర్మితమైంది. 1947 ఆగస్టు 15వ తేదీన ద్విజాతి సిద్ధాంతంతో మతప్రాతిపదికపై భారతదేశం నుండి విడగొట్టబడి ‘పాకిస్తాన్’ అవతరించింది. స్వాతంత్ర్యానంతరం ఆపైన పాకిస్తాన్ కాశ్మీర్‌పై దాడిచేసి భారతదేశంలో భాగమైన కొంత ప్రాంతాన్ని ఆక్రమించింది. దాన్ని ఆజాద్ కాశ్మీర్‌గానూ పేర్కొంది. భారత్‌పై చైనా యుద్ధంతో పాకిస్తాన్ ఉత్సాహపడి, ఈ దుస్సాహసానికి తలపడింది. అప్పటికి చైనా కారణంగా సైనికంగా సర్వసన్నద్ధంగా ఉన్న భారత్ ఈ స్థితిని ఎదుర్కొంది, విజయాన్ని సాధించింది. 1966 జనవరిలో కోసిగిన్ పర్యవేక్షణలో తాష్కెంట్‌లో కుదిరిన ఒప్పందం ఉభయ దేశాలమధ్య తిరిగి స్నేహ వాతావరణాన్ని నెలకొల్పింది. భారత పాకిస్తానుల మధ్య యుద్ధసమయంలో జాతీయ భావనతో ఉజ్వలించింది. రణంలో అబ్దుల్ హమీద్ పాకిస్తాన్‌పై విజృంభించి పాటన్ టాంకును ధ్వంసం చేసిన వీరకృత్యం మరువరానిది.

కాళోజి హమీద్ సైనిక వ్యక్తిత్వాన్ని పౌరాణిక కథా పాత్రలైన ఇంద్రుడు, భీముడు, హనుమడు, గరుడుడుతో పోల్చి చూపాడు. హమీద్ ముస్లిం మతస్థుడు అయినా దేశం కోసం ప్రాణాలర్పించిన భారతీయుడుగానే ప్రకాశించాడు. బాలగంగాధర

తిలక్ "అమ్మా! నాన్న! ఎక్కడికి వెళ్ళాడు" అన్న కవితలో భావనా స్వాతంత్ర్యం, వ్యక్తిగౌరవం, వర్ణ వర్గ మత భేద రాహిత్యం దీనికి పునాది అని భారతీయ స్వాతంత్ర్యానంతర సమాజానికి మౌలికమైన ఆధారాన్ని గుర్తుచేస్తాడు. ప్రతి భారతీయుడు "ఒక సోల్జర్‌గా, ప్రతి భారతీయుడు ఒక శతఘ్నిగా" భావించడం, లౌకిక తత్త్వాన్ని భావింపజేస్తూ యుద్ధానికి సన్నద్ధం చేయడమే! క్రిస్టియన్ మతస్థుడు కీలర్. ముస్లిం మతస్థుడు అబ్దుల్ హమీద్, సిఖ్ మతస్థుడు గురుబక్ష్‌సింగ్, హిందూ మతస్థుడు పోతరాజు, ఇట్లా ఎందరో బహుమతాల సైనికులు ఏకమై భారతీయ భావనతో దేశం కోసం పోరాడారు, ప్రాణాలర్పించారు. పాకిస్థాన్ అంటే పవిత్రమైన స్థానం, దేశం అని అర్థం. అయితే ప్రస్తుత పరిస్థితిలో కాళోజీ నారాయణరావు తన కవితలో "తిమిరానికి తేజోనామం"గా భావించాడు. ఇందులో మతప్రాతిపదికపై ద్వేషం, కలహం, హింస, అశాంతి వాతావరణం నుండి బలవంతంగా ఏర్పడిన 'పాకిస్తాన్' నియంతృత్వ రాజ్యం చీకటిని స్ఫురింపజేస్తూంది. ఆ పేరు కేవలం ఔపచారిక చిహ్నంగానూ ఉంది. వరవరరావు ఈ సందర్భంలో "పంజాబు నదులు హిమాంశు వులకు బదులు నెత్తురుతో తలంటి పోసుకుంటున్నాయి" అంటాడు. పంజాబ్ ఎత్తైన ప్రదేశంలో ఉంది. అక్కడ మంచు ఎక్కువ. పై నుండి పడే మంచు ఉదయ కిరణాల్లో నదులు స్నానం చేస్తున్నట్లుంది. అయితే ప్రస్తుత రణ వాతావరణంలో నదులు వీరుల నెత్తురుతో తలంటిపోసుకున్నట్లుందన్న సుందరమైన భావ చిత్రం, రణ భీభత్సాన్ని రక్తసిక్త దృశ్యాన్ని బింబిస్తూంది.

పాకిస్థాన్ మరో సాహస ప్రయత్నం 'కార్గిల్' చొరబాటు. మాదిరాజు రంగారావు 'కార్గిల్ కవితలు' (2000) జాతీయ భావనాత్మకాలు. పాకిస్తాన్ కాశ్మీర్‌లో కార్గిల్ కొండ ప్రాంతంలో సైనికుల్ని దింపింది. ఇది అక్కడ శాంతిని భగ్నం చేసి భీభత్సం సృష్టించే ప్రయత్నంలో భాగం. భారతసేనలు ఈ వ్యూహాన్ని ఎంతో సాహసంతో వీరోచితంగా భగ్నం చేసారు. పాకిస్తాన్ చేసిన ఈ ప్రయత్నం భారత్‌పై అప్రకిత యుద్ధంగానూ పేర్కొనడం జరిగింది. ఉదయం కొండలు మారణాయుధాల ధ్వనులతో దద్దరిల్లాయి. ఈ సైనికచర్యలో మొత్తం 460 మంది భారత సైనికులు ప్రాణాలు కోల్పోయారు. కవి మాటల్లో, "కాశ్మీర్ సుందరస్వప్నం, ఇపుడు ద్వేషఫలంగా

మారుతూంది హిమగిరి. వీర తనూ స్పర్శతో అనల గర్భ అవుతూంది." ప్రజల్లో మతపరంగా ద్వేషాన్ని రగుల్కొల్పే ప్రయత్నం విఫలం చేయడానికి వీరసైనికుల ప్రయత్నంలో త్యాగం అసాధారణమైంది. "కొండల్లో శతఘ్ని శబ్దాన్ని కవి హృదయమనువదిస్తూంది". జాతీయ విపత్కర స్థితుల్లో కవుల స్పందించిన తీరు చిత్రితమైంది. "టైగర్" హిల్, కార్గిల్ ప్రాంతంలో ఎత్తైన శిఖర ప్రదేశం, యుద్ధ నిలయాని కనువైంది. దాన్ని ఆక్రమించిన పాక్ సైనికుల్ని తరిమేసి తిరిగి వశం చేసుకొన్న సందర్భంలో కవి దానిపై (గిరిశిఖరంపై) సైనిక బృందం, భారత 'యశస్తోరణం'గా భావించడం జరిగింది. ఇది చారిత్రకమైన ఆనంద సమయం. జాతి గౌరవాన్ని కీర్తిమయం చేసే సన్నివేశం. "వీరుల ఉత్సాహ తేజంపై జాతి లేచి కదలుతూంది. వీరుల ఉద్వేగ రాగంతో జాతి గుండె పలుకుతూంది." "ఉత్సాహ తేజం"లో "ఉద్వేగరాగం"లో వీరంతో పాటు దేశభక్తితో కూడిన జాతీయ శక్తి బింబిస్తూంది. రణం తాత్కాలికం. రాగం, శాశ్వతమైంది, భారతదేశం శాంతికాముకమైంది. అనివార్యమైన రణంలో గెలిచాక ఉదారతనూ, శాంతి ప్రియత్వాన్ని ప్రకటించే జాతి శక్తి ప్రతిపాదితమైంది.

**అంతర్గత విపత్తులు :** బయటి నుండి వచ్చే ఆపదనూ ఆక్రమణనూ ఎదుర్కొనే యుద్ధానికి సిద్ధమయ్యే స్థితిలో జాతీయ భావన ఒక విధం అయితే, లోపలినుండి తల ఎత్తే విచ్ఛిన్నకర శక్తుల విజృంభణంతో అవినీతి హింస మొదలైన దుశ్చర్యలతో కూడిన ప్రవర్తనంతో వాటిల్లే దుష్ప్రభావాన్ని చిత్రించే, జాతిలో చేతనను కోరే భావన మరోవిధం. అయితే అంతర్గతమైన విపత్తులు మరీ దారుణమైనవి. బయటి విపత్తులు తత్కాలమైనవి. యుద్ధంతోనో సంధితోనే సమసిపోతాయి. అంతర్గత విపత్తులు నిరంతరం జాతిని పీడించేవి. అభివృద్ధిని జరగనీయకుండా చేసేవి. సమాజానికి క్షతి కలిగించేవి. ఎందరో కవులు ఈ దుస్థితుల పట్ల ఎంతో ఆవేదనతో స్పందించారు.

దాశరథి "తోటలో పూలు యుద్ధం చేస్తే తోటంతా రణరంగంగా మారుతుంది" అంటాడు. తోట భారతదేశానికి ప్రతీక. అందులో ఉండే రకరకాల పూలు, ఈ దేశంలోని రకరకాల మనుషులు వివిధ మతాల భాషల ప్రాంతాల వర్ణాల ప్రత్యేకతలతో జీవించేవారు. మతం పేరుతోనో భాష పేరుతోనో ప్రాంతం పేరుతోనో వర్ణం పేరుతోనో

కలహానికి దిగితే ఏముంది? సర్వం రణ సదృశం! సర్వనాశనమే అవుతుంది. తోటలో సౌందర్యం నశిస్తుంది. పరిమళమంటే సంస్కారం లుప్తమవుతుంది. పొందిక చెడిపోతుంది. ఎన్ని భేదాలున్నా సహజీవన సూత్రంతో జాతీయ భావన ప్రధానంగా విలసించడం ముఖ్యమన్న ఆలోచన దృష్టికి వస్తుంది. "తోట వంటి దేశాన్ని ఎడారి"గా మార్చవద్దని కవి విజ్ఞప్తి! ఎడారిలో ఏముంది? నీరు కూడా సరిగా దొరకదు! జీవనస్థితికీ కష్టమే!

చరిత్రలో ఎపుడో ఏదో జరిగిన దుశ్చర్యలకు ప్రతీకారంగా ఉత్తరప్రదేశ్‌లో బాబ్రి మస్జిద్ విధ్వంసమైన సందర్భంలో సోమసుందర్, "చేతావనీ" అన్న దీర్ఘకవితలో, "ఆటవిక జీవన వారసత్వాలు", "రక్తోత్సవాలు" జరుపుకుంటాయి అంటూ, "మీ మతం పేరు తమం" అని నిరసిస్తాడు. ఇది "మంచి పని" అని అనుకునేవారి "మతం" గురించి దాన్ని "తమం" అంటే చీకటిగా భావించడంలో కవి తీవ్రనిరసనం వ్యక్తమవుతూంది. "మతాల మత్తు, ధాత్రిపై గాఢంగా నల్లగా వికారంగా పడుతూంది" అంటాడు. భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యాన్ని ప్రతిపాదించింది. దేశంలో దీన్ని అనుసరించి పాలనా నిర్వహణం సాగవలసి ఉంది. ఇది మత రాజ్యం (Theocratic) కాదు, లౌకిక (Secular) వ్యవస్థ కలిగింది. ఇక్కడ మతశక్తుల దుశ్చర్యలు, వాటి దుష్పరిణామాలు "చీకట్ల"తో పోల్చబడినాయి. ఈ స్థితి దేశ భవిష్యత్తుకు మంచిది కాదన్న భావం సువ్యక్తం.

మాదిరాజు రంగారావు, అశాంతిలో ద్వేషంతో హింసతో కూడిన వాతావరణంలో కావలసింది "ఒక చేతిలో సుత్తీ, మరో చేతిలో గొడ్డలీ కాదు, ఒక చేతిలో ప్రేమ పుష్పం, మరో చేతిలో ప్రజాస్వామ్య కేతనం" అంటాడు. ప్రస్తుత విషమ స్థితుల్లో అవసరమైంది స్నేహం, ప్రేమ, శాంతి మాత్రమే. విధ్వంసానికి దారితీసే ద్వేషం, శత్రుత్వం కాదు. దేశ నిర్మాణ రూపానికి దోహదం చేసే సాధనాలు కావాలి. వీటిని ప్రోత్సహించే భౌతిక మానసిక సాధనాల్ని గుర్తు చేసే ఆలోచన కనిపిస్తుంది.

కాళోజీ "సామరస్యం"లో, నీ నా మధ్య మైత్రి లేకుంటే, "రక్తం లోని అణువణువు రణరణమని అరుస్తుంది శరీరంలోని కణకణం గరళమై కురుస్తుంది"

అంటాడు. మనిషికీ మనిషికీ మధ్య ఏకాలంలోనూ ఏ వ్యవస్థలోనూ స్నేహం అత్యవసరం. ఇది లోపిస్తే సర్వం శుష్కీభూత స్థితి మాత్రమే. ఈ విషమ స్థితి నుండి దూరం చేయడమే కవి అభిప్రాయం. "రణ" "గరళ" స్థితుల నుండి "శాంతి," "అమృత" స్థితుల్ని భావించే ఉదార మనస్కత స్పందిస్తూంది. బాహ్య మరియు అంతర్గతమైన విపత్తులపై కవుల స్పందనం జాతీయ సమైక్యభావనా మహితమైంది.

# 2. నవాలోకనం

జాతీయ భావనలో రెండో విధం నవాలోకనం. భారతీయ సంస్కృతిలోని శాశ్వతమైన విలువలకు సంబంధించిన అంశాల్ని, వర్తమానంలో అనుభవ దృష్టితో, సమయోచితంగా ఆవిష్కరింపబడింది. రాజకీయ సిద్ధాంతం, సామాజికాదర్శం వేరైనప్పటికీ ఆయా సందర్భాల్లో అవసరమైన జాతీయ భావన ప్రసరిస్తుంది. ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రసరించే సంప్రదాయ ప్రభావంతో ఆధునికమైన చూపును నవాలోకనం అనవచ్చు. దీన్ని ఆయా కవులు తమ వ్యక్తిత్వాల్ని బట్టి మలచుకొన్న తీరు ఎంతో వైవిధ్యంతో కూడింది. దీనితోపాటు మరో అంశం ఉంది. అది వర్తమాన స్థితి సమీక్షణంతో సమస్యల్ని దుస్థితుల్ని గమనిస్తూ ఆవేదనతో, ఆక్రోశంతో భవిష్యద్దర్శనమూ కలిగింది. అయితే మూలసూత్రం మాత్రం భారతీయ సమైక్యత. దేశ సంప్రదాయ శక్తి, మూలచింతన అనేవి కొత్త దృష్టితో జాతీయ భావనతో స్పష్టంగా కనిపిస్తాయి.

గాంధీజీ శతజయంతిని పురస్కరించుకొని శ్రీశ్రీ, "సకల భారతీయ జనత ఒకటేనని ప్రకటిస్తా వినిపిస్తా నీవొసగిన సామరస్య సందేశం" (19-3-1969) గాంధీజీ ఆశయాలకు అర్పణమైన ఈ కవితలో భారతదేశ 'సమైక్య' రూపం శాంతి తలంపై దర్శితమయింది. ఇది కుల మత భేదం లేని సహజీవన సూత్రంపై నిలిచింది. నవాలోకనంతో ఈనాటి అవసరాల కనుగుణంగా మలచబడింది. శేషేంద్రశర్మ, ఆధునిక మహాభారతం ఆద్మీపర్వంలో "నా దేహమే గంగోత్రి, నా స్వరమే భాగీరథి" అని తన బాహ్య రూపానికీ దేశంలో పవిత్ర స్థల జల రూపాలకూ అభేదాన్ని భావిస్తాడు. భారతదేశంలో వ్యవసాయం, గ్రామీణ జీవనం ప్రధానమైన జీవిత రూపాలు. ఈ దృష్టితో "ఈ దేశపు ఆకృతి నాగలి" అని దేశ స్వరూపానికీ వ్యవసాయానికి ముఖ్యసాధనమైన నాగలికీ అభేద వర్ణనంతో జాతీయ జీవన భావనను ఆవిష్కరించడమూ గమనించవచ్చు. "నేను ధాన్యంలోంచి పుట్టాను, మరణించి ధాన్యంలోకి వెళ్ళిపోతాను" అన్నమాట "సస్యమివ జాయతే సస్యమివ పచ్యతే" అన్న ఉపనిషద్భావనకు సమీపంగా వర్తిస్తూంది. ధాన్యం వ్యవసాయఫలం. వ్యవసాయ

కృషి, దాని ఫలంతో ప్రవృత్తమైంది. జాతి జీవనంతో సంప్రదాయ భావన (ఉపనిషన్మూలకమైంది) అనుసంధిత మయింది.

కోవెల సుప్రసన్నాచార్య "శతాంకుర"లో 1) కాలస్వరూపం, 2) సృష్టి మూలాల అన్వేషణ, దైవాసుర సంఘర్షణతో భారతీయ తాత్త్వికచింతనకు సంబంధించిన భావజాలం చిత్రితమయింది. ఇది నవయుగంలో ఈ జాతి సాంస్కృతికమైన జాగృతిని ఆపేక్షిస్తూంది. కోవెల సంపత్కుమారాచార్య భారతీయ చేతన – ప్రధానంగా సాంస్కృతికమైన విలువల్ని జీవితానికి అనుసంధించి చూపడంలో కృతకృత్యులయిన కవి. లౌకికస్థాయితో పాటు తాత్త్వికస్థాయినీ కవితాత్మకంగా రూపొందిన కవి.

పెన్నా శివరామకృష్ణ "జీవనది" మరో విధంగా తాత్త్విక మూలంతో సాంస్కృతిక చేతనను బింబిస్తూంది. ''ద్వాసుపర్ణా'' మొదలైన ఉపనిషద్భావజాలంతో ప్రతీకాత్మకంగానూ నిర్వహింపబడింది.

నవలోకనాన్ని వివేచిస్తే జాతీయభావనలో 1) బాహ్యప్రపంచానికీ, ఆంతర ప్రపంచానికీ సామరస్యాన్ని సాధించే ప్రయత్నం, 2) సిద్ధాంతాలకతీతమైన జీవితానుభవ లక్షణం, 3) జీవితంలో అంతర్వివేచనం, 4) మానవజాతి సమగ్ర వికాసం అనేవి విశ్లేషణకందుతాయి.

ఈ దిశలో సుప్రసన్నాచార్య, సంపత్కుమారాచార్య చేతనావర్తకవులు. చేతనావర్త కవిత్వంలో ఆదర్శానికి కర్తలూ వ్యాఖ్యాతలూ, ఆ కవుల్లో వీరిరువురూ ప్రముఖులు! స్వేచ్ఛా కవిత్వంలో వీరు ఐహిక మనోమయ ఆధ్యాత్మిక వలయాలతో కూడిన చేతనా స్వరూపాన్ని భారతీయ సాంస్కృతిక తేజంతో ఆవిష్కరించిన కవిత్వం, దీని పరిధి పెరగడానికి తోడ్పడింది. కోవెల సుప్రసన్నాచార్య "మమ్ము మాకు చూపించు తల్లీ! మాకొక చరిత్ర నిర్మించు తల్లీ!" అని జాతి పునర్నిర్మాణేచ్ఛను ప్రకటించే విధం, నవాలోకనాన్ని స్ఫురింప జేస్తుంది. ఈ పునర్నిర్మాణంలో సుప్రసన్నాచార్యలో తాత్త్వికత సంపత్కుమారాచార్యలో తాత్త్వికత భిన్న భిన్న కోణాల్లో దర్శనమిస్తాయి.

శివారెడ్డి "ఆసుపత్రి గీతం"లో ఆసుపత్రి రోగులతో నిండింది, ఇది దేశ స్థితిని సూచిస్తూంది. అనారోగ్యం నుండి అస్వస్థత నుండి జాతి ఆరోగ్యంగా స్వస్థతతో

ఉండేందుకు కొత్త అవసరాన్ని భావింపజేస్తూంది. పైకి 'న'కారాత్మక దృష్టిలో సర్వం కన్పింపజేసినప్పటికీ, కవిలో ఆశాభావంతో సకారాత్మక రేఖల్ని సూచిస్తుంది. ప్రసిద్ధ కవి సోమసుందర్, "కాలం వీలునామా"లో స్వాతంత్ర్యం సమకూడి (ఈ కవిత వ్రాసేనాటికి) ముప్ఫై ఏండ్లైనా వీడని అంత:కలహాల్ని చిత్రిస్తూ "ఈ ముప్ఫై ఏండ్ల స్వాతంత్ర్య భారతి సమైక్య సంగీతంలో క్రమానుగతంగా వికటించింది (1977 జనవరి) భారత రాజ్యాంగం భారతీయులందరూ సమానమని చెప్పినా ఇంకా పాత కుల మత వర్ణ వైరుధ్యాలు పనిచేస్తూనే ఉన్నాయి. విభేదాలు హింసకూ అశాంతికీ దారి తీస్తూనే ఉన్నాయి. "పచ్చని చెట్టు క్రింద కూచొని మరీ పచ్చని కలలు కంటున్నాను" అంటాడు. పచ్చని చెట్టు సస్యశ్యామల భారత దేశానికి ప్రతీక, తమ్ములూ చెల్లెళ్ళ భవిష్యత్తులో మంచిని కోరే ఆలోచనలు! పచ్చని కలలుగా భావితమైనాయి. కలలు యథార్థం కావు. వాళ్ళ భవిష్యత్తూ చింతాజనకమైంది. అయినా కవిలో ఆశావహమైన అభిలాష సూచితమవుతూంది. "అరిచే లోయలు"లో ఈ కవి, "నా దేశాన్ని దండెత్తిన దురాశలు, దారి దోపిడి చేస్తున్నాయి. పిడికిళ్ళన్నీ బిగిసి ఖడ్గ ధారులయినపుడు దురాశలన్నీ బదాబదలవుతాయి, నా శిరాన్ని హిమాలయోన్నతం కావిస్తాను" అంటాడు. దేశవాసుల్లో దురాశయే ఈ దుస్థితికి కారణమవుతూంది. దీన్ని నిర్మూలించడం అవసరం. దీనికి ప్రజలు ఖడ్గధారులు కావలసిన అవసరాన్ని మరో దృష్టితో చెప్పడం జరిగింది. అపుడు కాని దురాశలు అంతం కావు. అపుడు శిరస్సు హిమాలయంలా ఉన్నతంగా నిలుస్తుందని కవి అభిప్రాయం. హిమాలయం స్వచ్ఛతకూ ఉన్నతికీ ప్రతీక. కవిలో 'జాతీయ భావన' జాతి శుభ్రతనూ అభివృద్ధిని కోరేదిగా దృష్టికి వస్తుంది. పేర్వారం జగన్నాథం అధిక్షేప ధోరణిలో ఈ దేశం దుస్థితి నుండి సుస్థితికి చేరుకోవాలనే ఆకాంక్షా తత్పరుడు. "మూలుగుతున్నది మరేదో కాదు, గాంధిగారి పవిత్రాత్మ" ఈ దేశంలో మహాత్ముని ఆదర్శాలు ఎంత పనికిరానివైపోయాయో చిత్రించే పంక్తులివి! పవిత్రమైన ఆత్మకు పట్టిన రుజాగ్రస్తదశ సూచితం. పల్లెలు మన దేశానికి పట్టుగొమ్మలు. అక్కడి స్థితి! "ఆరునెలలకొకమారు పిలవకుండా వచ్చే అతిథులు ప్రజల కష్టాల్ని బస్తాల్లో కుట్టి పట్నం చేరుకుంటారు" నాయకులు, అధికారులు ప్రజల కష్టాల్ని భద్రంగా విని, పదిలంగా వాటిని యథాతథంగా ఉంచే బాధ్యతారహితమైన ప్రవర్తనం స్పష్టం! "కాలిపోయిన బ్రతుకు బల్బులు ససేమిరా వెలగడం లేదు" సాధారణ ప్రజల

బ్రతుకులు చీకట్లోనే ఎండిపోయి ఉన్నాయి! కాలిపోయినట్లున్నాయి! అవి వెలుగుల్ని ఎలా ఇవ్వగలవు? బ్రతుకును వెలుగులేని బల్బుగా భావించిన భావరూపం ఈ దేశ ప్రజలు చేరిన విషాద స్థితిని వ్యంజింపజేస్తుంది.

దేశ స్వాతంత్ర్యదినం సందర్భంగా మాదిరాజు రంగారావు "వెలుగులో ఈ నేలపై" (1975) జాతీయ భావనా కేంద్రంగా సామాజిక చిత్రణం కనిపిస్తుంది. "దేశ స్వాతంత్ర్యం ఆయువు బంగరురేకులు తొడిగింది"తో మొదలైంది. ఇది స్వర్ణోత్సవ భావాన్ని సూచిస్తుంది. సిద్ధాంత భేదాలుండవచ్చు, అభిప్రాయాల్లో విభేదించవచ్చు. కాని దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పండుదినం అందరికీ సమానమే! అభిమానార్హమైందీ. జాతీయ పతాకాన్ని ఈ సందర్భంలో అవమానించిన కొందరు ఉగ్రవాద తీవ్రమూర్తుల్ని పురస్కరించుకొని వ్రాసింది. చుట్టూ ప్రబలిన చీకట్లను తిడుతూ కూచుంటే సరిపోదు. ప్రతి వ్యక్తీ దేశంలో "మృదుల సూర్యబింబమై వెలగాలనే" కవి ఆశయం త్యాగభూమి నుండి జన్మించిందీ స్వాతంత్ర్య మహావృక్షం! దీన్ని స్వల్పమైన సంకుచితమైన ఊహలతో గొడ్డలితో నరకరాదనే కవి హితవు. హిమాలయం నుండి సాగర పర్యంతం సామాన్యుని ఆలోచనలతో జీవితాన్ని వ్యాఖ్యానించే కావ్యరూపంలో భారతదేశం భావితమైంది. ప్రస్తుతం అంతా సరిగానే ఉందనీ కాదు. జీవితంలో వాస్తవానుభవంలో పగిలిన అద్దాలూ, కాలిన వస్తువులూ, సైనికుల బూట్ల చప్పుడూ బులెట్ల ధ్వనీ భాష పేరిట మతం పేరిట ప్రాంతం పేరిట చెలరేగే విధ్వంసకాండ, బీభత్స దృశ్యమూ చిత్రితమైంది. మార్పు అనివార్యం, అవసరం కూడా. అయితే హింసతో రక్తంతో జీవనభూమిని పండించలేం. జాతిలో ప్రేమ, శాంతి, అహింస, ఉదారతతో కూడిన భావన తప్పనిసరి. ఈ కావ్యం పేరులో "వెలుగు" దేశ స్వాతంత్ర్యానికీ ప్రజాస్వామ్య భావనకూ ప్రతీక. "ఈ నేలపై" ప్రకృతార్థంలో వర్తమాన స్థితిగతులకు నిలయమైన సమాజం సూచితం. దేశ స్వాతంత్ర్య స్వర్ణోత్సవ సందర్భంగా మిరియాల రామకృష్ణ సువర్ణస్వప్నం (1997) కావ్యం "ఊహల్లో బయలుదేరినా వాస్తవంలోకి రావలసిందే"నన్న కఠోర వాస్తవాన్ని చాటుతూంది. "వెళ్ళిపోండి! స్వతంత్ర దేశాకాశ నీలిమల్లో దోపిడీ చేస్తున్న చోర భక్తులారా!" – ఈ దేశంలో అంతర్గతంగా బలహీనపరచే శక్తుల్ని గురించి కవి హెచ్చరిస్తున్నాడు. "దేహమే దేశంగా కన్పిస్తున్న నాకు మనసున్న మనిషికే సుమా

సందేశం" అంటాడు "మనస్సు"ను మరచిపోవడం వల్ల లేదా దాన్ని స్వార్థంతో కప్పేయడం వల్ల జాతిలో అంత:కలహాలు అధికమయినాయి. మనస్సును జ్ఞప్తికి పెట్టుకొని, దాన్ని ఏదీ కప్పేయకుండా చూచుకోవాలి. స్వచ్ఛతను నిలుపుకోవాలి. అపుడే నవాలోకనం సాధ్యం! మనస్సు కోల్పోయినపుడు, ఏ సందేశంతోనూ ప్రయోజనం లేదు. ఈ రచనలో ఆంధ్రప్రదేశంలోని వివిధ స్థలాలు శ్రీకాకుళం నుండి హైదరాబాద్ మెదక్ వరకూ ఊహావాహ్యాళి సాగింది. ఎన్నో చారిత్రక సాంస్కృతిక సాహిత్య కేంద్రాల దర్శనమూ జరిగింది. దిలావర్ ''వెలుగుపూలు''లో స్వాతంత్ర్య జ్యోతిని "మృత్యుంజయం"గా భావించడం జరిగింది. దేశంలో నెలకొన్న 'నిర్లిప్త తిమిరాల్లో ఉత్సాహ భానుణ్ణి" దర్శించడం విశేషం. ఆయా కవుల జాతీయ భావనలో నూతనమైన ఆలోకనా కిరణాలు కన్పిస్తాయి.

బాలగంగాధర తిలక్ 'ఆర్తగీతం'లో "నా దేశాన్ని గూర్చి పాడలేను" అని తన నిస్సహాయ స్థితిని ప్రకటిస్తాడు. "ఈ దేశాన్ని రక్షించు ప్రభూ! పెద్ద మనుషులనుండీ" "పెద్దపులుల నుండీ" అని భగవంతుని ప్రార్థిస్తాడు. విషమ స్థితుల్లో మనిషి కవసరమైన "మనశ్శక్తిని" గుర్తిస్తాడు. జాతీయ భావనలో లోపించిన నీతి, స్వచ్ఛత గురించి ఆలోచన ప్రకృతస్థితిని భావింపజేస్తుంది. "ప్రార్థన" కవితలో తిలక్, "నలభై కోట్ల మనుష్యులు ప్రాణం ఉన్న నిజమైన మనుష్యులతో నిండిన దేశం నాది, ఆకలి బాధలూ, ఆందోళనలూ, సమస్యలు విరివిగా ఉన్న విచిత్ర సౌధం మాది" అయితే "కడుపు నిండుగా ఆహారం, గుండె నిండుగా ఆశ్లేషం, బ్రతుకు పొడుగునా స్వతంత్రం చాలు మాకు తండ్రీ!" అంటాడు. ఇందులో ప్రస్తుతం ఉన్న విషమ స్థితుల్లో కావలసిన కనీసావసరాలు చెప్పబడినాయి. జాతీయ భావనలో, మార్పునే కోరే సామాజిక తత్పరత, యుగాలుగా సంప్రదాయంలో భౌతిక వికాసం లేని దుస్థితి నుండి ముక్తం చేసే నవాలోకనాన్ని గమనించవచ్చు.

శేషేంద్రశర్మ జాతీయ భావనకు సంబంధించిన మూలాల్ని పుంజీభవింపజేసుకున్న కవి. "నేను పిడికెడు మట్టినే కావచ్చు, కాని కలమెత్తితే ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది". ఈ దేశంతో ఒకటైన వ్యక్తిత్వ స్ఫూర్తి స్పష్టం. ఇది వ్యక్తి రూపంతో సంవదించడంలో శేషేంద్రశర్మలో జాతీయభావన ఔన్నత్యాన్ని

పొందుతూంది. దాశరథి, "లేలెండి కృషీవలులారా! తే తెండి! పలుగూ పారా!" అని ఈ దేశానికి కర్మవీరులైన కృషీవలుల్ని ఉద్బోధిస్తాడు. "మన భూముల మృత్స్నాగంధం ఏ నాటికి విడవని బంధం" ఈ దేశంతో ఈ నేలతో తనకున్న బంధం అవిచ్ఛిన్నమైంది. ఇది అనేక యుగాల సంస్కారంతో విలసిల్లింది. దీన్ని గంధంగా కవి భావించడంలో జాతి ఉత్తమ సంస్కృతి సూచితం. ఇది ప్రధానంగా వ్యవసాయ దేశం కాబట్టి ఈ రేఖా చిత్రంలో జాతీయభావనను వికాసవంతమైన సుస్థితికి ఒక ఆధారతలంగా గ్రహించడం కన్పిస్తుంది. స్వాతంత్ర్యానంతరం వివిధ కవుల స్వేచ్ఛా కవిత్వంలో జాతీయభావన భిన్న భిన్న దృక్పథాల్లో దర్శనమిస్తుంది. ఇది వర్తమాన తలంపై మార్పును కోరే నవాలోకనంతో ప్రవృత్తమైందీ. జాతి విస్తృతమైన ప్రయోజనపరత్వాన్ని పొందిందీ.

# దళిత దృక్పథం

దళిత సమస్య - దళితోద్యమం - దళిత వికాసం జాతీయ భావనలో భాగంగానే విశ్లేషణ కందుతాయి. ప్రాచీన వాఙ్మయాన్ని పరిశీలిస్తే వేద కాలంలో కుల వివక్ష లేదు. సమాజంలో చేసే కర్మల్నిబట్టి పురాణ కాలంలో ఏర్పడింది. ఆధునిక కాలంలో దీన్ని వ్యతిరేకించే ఉద్యమాలనేకం వచ్చాయి. స్వాతంత్ర్యానంతరం, స్వాతంత్ర్యోద్యమ కాలం నుండి సాగిన సర్వ సమానత్వ భావన వేగవంతమయింది. ఇపుడు రాజ్యాంగ రీత్యా భారతదేశంలో కులవివక్ష శిక్షార్హమూ అయింది. ఆధునిక యుగంలో గాంధీజీ హరిజనోద్యమం ఈ దిశలో గణనీయమైన మార్పుకు హేతువయింది. మార్క్స్ వర్గ విభేదాన్ని రూపుమాపే ఆదర్శమూ పనిచేసింది. అంబేద్కర్ ఉద్యమం దీన్ని మరింత చురుగ్గా ప్రవర్తింప జేసింది. ఇవి ఇట్లా ఉంచి, ప్రజాస్వామ్యంలో సామాజిక న్యాయం, స్వేచ్ఛ సమానత్వం ఒక్కొక్కటి ఒక్కొక్క విధంగా దళితుల్లో చైతన్యానికి ఉపకరించాయి. జాతీయ తలంపై వచ్చిన గొప్ప మార్పు దళిత స్పందనం. ఇది దేశంలో సంస్కరణ దిశగా పరివర్తనగుణంగా వికాస రూపంగా భావించవచ్చు.

భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 17 ద్వారా అంటరానితనం నిషేధింపబడింది. సమయ సమయం అనేకమైన చట్టాలతో దళితులకు న్యాయం చేకూర్చే రాజనీతి అవలంబింపబడింది. ఇవి కాక మానసిక తలంపై దళితుల పట్ల గౌరవ భావన, దళితుల భద్రత, దళితులకు మెరుగైన అవకాశాలు, దళితుల ప్రగతికి దోహదం చేసాయి. ఈ దళితుల సమస్య కులవ్యవస్థకు సంబంధించింది. భారతదేశానికి మాత్రమే పరిమితమయింది. అంతర్గతమైన సమస్యగా జాతీయ భావనలో పర్యవసితమయిన స్థితి స్పష్టంగా కనిపిస్తుంది. గాంధీజీ, జ్యోతిరావు ఫూలే, అంబేద్కర్ మొదలైన మహనీయుల నాయకత్వ ప్రత్యేకతలు పరిష్కరించే విధానాల్ని ఎక్కువ చేసాయి. ప్రధాన జనజీవన స్రవంతి నుండి దూరమై, వెనుకబడి అవమానాలకు గురియైనవారిపట్ల సానుభూతితో పాటు దళితుల్లోను కలిగిన చేతన సామాజికంగా ఎంతో మేలు చేసింది. ఇదొక సంఘటిత శక్తిగా రూపొందింది. తమ హక్కుల్ని పొందేందుకు కృషి చేస్తూంది.

భారతీయ భాషా సాహిత్యాలకు వస్తే 1960 నుండి దళిత చైతన్య కవిత్వం కన్పిస్తుంది. మహారాష్ట్రలో మొదలైంది. అంబేద్కర్, జ్యోతిరావుపూలే, నారాయణ్ సర్వే, బాబూరావుల ఉద్యమ భావనతో అర్జున్ కాంబ్లే, దయాపావర్, వామన్ నింబాల్కర్, నామ్‌దేశ్ దాశల్ మొదలగు క్రియాశీల స్పందనలతో దళితచేతన పరిపుష్టమయింది. దీని ప్రభావం వెనువెంటనే ప్రక్కనే గుజరాత్‌పై పడింది. 1970 నుండి కన్నడంలో 1980 నుండి తెలుగులో దళితస్వరం ప్రతిధ్వనించింది. ఈ సమస్య జాతీయమైంది. వివిధ భాషా కవిత్వాల్లో ఒకే "దళితచేతన" సూత్రంపై నిర్దిష్టమైన "దళిత వికాస" లక్ష్యంతో స్పందించింది.

తెలుగు స్వేచ్ఛాకవిత్వంలో నిరసన ప్రతిఘటన చర్యలతో సంస్కరణ పరివర్తన గుణంతో ఉజ్జీవన వికాస లక్ష్యంగా ప్రవర్తిల్లింది. దళితుల వెలివేత, అణచివేత, అవమానం నుండి కొందరిలో ఆగ్రహ పథం మరికొందరిలో శాంతిపథం నెలకొన్నాయి. స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య వ్యవస్థలో సహజంగా ఉండే అవకాశాలవల్ల, నాయకుల ప్రయత్నాలవల్ల విద్య ఉపాధి వికాసం న్యాయం గౌరవం మొదలుగా సమాజంలో దళితుల అస్తిత్వ స్థాయి పెరిగింది. ఇది 1) దళిత చరిత్ర – జీవితం, 2) దళిత సమస్య – అనుభవం, 3) దళిత ప్రయోజనం – లక్ష్యం, 4) దళిత వికాసం – గౌరవం మొదలైన అంశాలతో వెలసింది. ఆంధ్రప్రదేశ్‌లో కారంచేడు సంఘటన 17 జులై 1985, పదిరి కుప్పం – నీరుకొండ (1987) సంఘటన, చుండూరు సంఘటన (ఆగస్టు 1991)తో పల్లెల్లో అగ్రకులాల వల్ల చేదు అనుభవాలు, దళితుల్లో అనూహ్యమైన చేతనతో ఉద్యమాన్ని తీవ్రతరం చేసాయి. మొదటిసారిగా 105గురు ఎస్.సి., ఎస్.టి. పార్లమెంటు సభ్యులతో ఫోరం ఏర్పడింది. ఎస్.సి. ఎస్.టి.లపై అత్యాచార నిరోధక చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. దళిత చైతన్యం, సామాజిక రాజకీయ న్యాయ క్షేత్రాల్లో రాజ్యాంగ బద్ధమైన ప్రజాస్వామ్యయుతమైన హక్కుల్ని పొందే కృషి అఖిల భారత స్థాయిలో ఊపందుకుంది. "మాదిగ దండోరా" (1994–2000) పేరుతో ఉద్యమం దళితుల అభ్యున్నతికై సాగింది.

"దళిత" పదం, చారిత్రకంగా దేశంలో అట్టడుగుననున్న అంటరానివారి సామాజిక వేదనకూ స్పృహకూ ప్రతీకగా నిలిచింది. దీనికి సంబంధించిన అంశాలతో

స్వేచ్ఛా కవిత్వంలో ఒక ఉద్యమలక్ష్యంతో ప్రయోజనాత్మకమైన కళాకృతి అవతరించింది. 1985లో కారంచేడు అమానుష సంఘటనతో ఉద్యమం బలాన్ని పొందింది. చుందూరు ఉద్వేగ సంఘటనతో ఉద్యమం బలాన్ని పొందింది. చుందూరు ఉద్వేగ సంఘటనతో ఉద్యమం స్థిరరూపం పొందింది. దళిత కవిత్వానికీ అభ్యుదయ కవిత్వానికీ గల భేదాన్ని ఎత్తిచూపుతూ సతీష్‌చందర్, "ఆకలికీ ఆత్మ గౌరవానికీ ఉన్న వ్యత్యాసం"గా పేర్కొన్నాడు. అభ్యుదయ కవిత్వం అంతర్జాతీయ తలంపై మార్క్స్ ఎంగెల్స్ సిద్ధాంతంపై నిర్మితమైంది. ఎక్కువగా అంతర్జాతీయ సమస్యలతో స్పందనలతో వ్యవహరించడం పరిపాటి. స్థానికమైన ప్రాంతీయమైన జాతీయమైన సమస్య పట్ల అంతగా శ్రద్ధ లేకపోవడం వల్ల సక్రియాత్మకంగా ప్రవర్తించకపోవడంవల్ల, వీటికోసం మరో వేదిక అవసరమైంది. అదే దళితోద్యమం. మార్క్సిజం వదలినవీ పూరించినవీ ఖాళీలను పూరించే ప్రయత్నంలో భాగాలుగా దళితోద్యమం మొదలైనవి దృష్టికి వస్తాయి.

స్వేచ్ఛాకవిత్వంలో దళిత రచనల్లో గాంధీజీ శాంతి అహింస సమన్వయవాదం, అంబేద్కర్ ఉద్యమశీలం మార్క్స్ వర్గ సంఘర్షణ మరోటి ప్రజాస్వామ్య పథం, ఇంకోటి మానవతా వాదం ఇట్లా అనేకమైన దిశల్లో నుండి ప్రేరకశక్తులు పనిచేసాయి.

గాంధేయ మార్గంలో బోయి భీమన్న "గుడిసెలు కాలిపోతున్నాయి" "వన్యవ్యవస్థ" స్థానంలో 'సవ్యవ్యవస్థ' ను కోరుతూంది. ఇది ప్రజాస్వామ్య దృక్పథానికి సన్నిహితమైంది కూడా. కొలకనూరి ఇనాక్ మొదలైన కవులు అంబేద్కర్ ఉద్యమశీలంతో పోరాట తత్త్వాన్ని ప్రోత్సహించడం కన్పిస్తుంది. 1995లో వెలువడిన దళిత మానిఫెస్టో 'విస్ఫోటనం' దళితుల కవిత్వోద్దేశాన్ని నిర్దేశిస్తూంది. ఎడ్లూరి సుధాకర్, మరో దళిత కవి "నేనిపుడు కొత్త భారతావనికి కొత్త తల" నవుతున్నానంటాడు. ఇందులో దళితుల్లో సృజనశక్తి, మేధావిత్వం మొదలైన ఉత్తమ లక్షణాలతో దూసుకపోయే వైఖరి స్పష్టంగా చిత్రితమయింది. "నా జెండా రంగూ నా తల్లి రంగూ ఒకటే" నంటాడు. దళితుల్లో స్పందనం జాతీయ భావనతో ఒకటిగా శబ్దించిందే తప్ప వేరుగా కాదు. నెత్తుటి ప్రశ్నలో "మాకు కావలసింది మాకేం కావాలో కోరుకునే స్వేచ్ఛ" అంటాడు. దళితులకీ స్వేచ్ఛ కూడా పూర్వం లేదు, ఇపుడు అది లభిస్తే వాళ్ళ భవిష్యత్తును వాళ్ళే నిర్ణయించుకునే

శక్తియుక్తిపై విశ్వాసం కన్పిస్తుంది. 'పాదముద్ర'లో జూలూరి గౌరీశంకర్ "వంచబడ్డ శిరస్సు"తో నడుస్తూ అరుస్తూ సహిస్తూ, దొరా! బాంచను దొరా! కాల్మొక్తాలమీంచి కొత్త దారులు పడుతున్నాయ"ని చారిత్రకంగా సమాజంలో వచ్చిన గొప్ప మార్పును దళితుల్లో ప్రగతిశీల తత్త్వాన్ని సూటిగా చిత్రిస్తాడు. కుల వివక్ష అణచివేత వెలివేత అవమానాల నుండి స్వేచ్ఛగా సమభావంతో నిర్దిష్ట లక్ష్యంతో పాతదారిని వదలి కొత్త దారిన సాగే దళిత భావన, జాతీయ భావనకు నవవిస్తృతిని కలిగిస్తూంది.

పదునెక్కిన పాట (1990), చిక్కనవుతూన్న పాట (1991) మొదలైన కవితా సంకలనాలు, మరొకటి 'బహువచనం' ఇట్లా దళితుల్లో సృజనశక్తికీ, ప్రయోజనపరమైన లక్ష్యానికీ ప్రాతినిధ్యం వహిస్తాయి. బన్న ఐలయ్య బాబా సాహెబ్ అంబేద్కర్ పథంలో జాతీయ పునర్నిర్మాణం పట్ల ఆశాభావంతో రూపొందిన కవి. ఈయన "నిప్పు కణిక", దళితుల్లో నెలకొన్న అసంతృప్తినీ అసహనాన్నీ చిత్రిస్తూ వారిలో నిక్షిప్తమైన అంగార తేజాన్నీ భావింపజేస్తూంది. దళితుల స్వేచ్ఛా కవిత్వం మార్పును వేగవంతం చేసింది. సనాతన సంస్కృతిని హేతుదృష్టితో వర్తమాన స్థితిగతులకనుగుణంగా ఆధునికతతో కొత్త దిశలో నడిపించింది. 'వామపక్ష' వాదులు మొదట్లో చేసిన 'మేలు'ను గుర్తిస్తూనే, తమకు తాముగా ప్రజాస్వామ్యంలోని అవకాశాల్ని పూర్తిగా వినియోగించుకొనే ఉద్యమశీలంతో జాతీయ భావనను ప్రకాశమానం చేసిందీ కవిత్వం. స్వేచ్ఛాకవిత్వంలో దళిత రచనలు జాతీయ భావనకు విశాలమైన, ప్రకాశవంతమైన పార్శ్వాన్ని సంతరింపజేసాయి.

## మైనారిటీ కవిత్వం

ఇటీవల కాలంలో జాతీయ భావనతో లౌకిక తత్త్వ రూపంలో ఒదిగే మైనారిటీ కవిత్వం విశ్లేషణకందుతుంది. ఈ దేశంలో తాము నిర్లక్ష్యం చేయబడుతూన్న బాధతో, వేదనతో ఉద్యమించడం జరిగింది. ఈ దిశలో 1994 నుండి విరివిగా ముస్లింల స్థితిగతుల్ని చిత్రిస్తూ స్వేచ్ఛా కవిత్వం వెలువడింది. ఖాజా స్కైబాబాలాంటివారు ఈ మార్గంలో మొదలుపెట్టారు. 'జీహాద్', 'జల్‌జళ్‌లా' మొదలైనవి ఈ సందర్భంలో

గుర్తుకు వస్తాయి. ఇవి ముస్లిం కవుల హృదయ వేదనను జాతీయ స్రవంతిలో భగంగా వర్తిల్లే ఆలోచనను పట్టిస్తాయి. వీటికి పూర్వం ఖాజా మొహినుద్దీన్ పుట్టుమచ్చ (1991) ముస్లిం చేతనను ప్రవేశపెట్టిందని చెప్పొచ్చు. జబీన్ మహై, షాజహాన్, యాకూబ్, ఖాజా స్కైబాబా (భవర్), మహమ్మద్ ఖాదర్ కరీంమాయి మొదలైనవారు మైనారిటీ ముస్లిం సమస్యల్ని చిత్రించారు. జబీన్ మహై, "ఆకురాలు కాలం", యాకూబ్ "ప్రవహించే జ్ఞాపకం", ఖాజా "ఫత్వా", "షరాత్", "జిహాద్", కరీంబాయి "నూర్‌చష్మే" స్థూలంగా 1) సమాజంలో ముస్లింల పట్ల భేదభావాన్ని రూపుమాపడం 2) ముస్లింల హక్కుల్ని కాపాడడం, 3) ఇస్లాం మతంలో ఆధునికావసరాలకనుగుణంగా మార్పుల్ని కోరడం. 4) స్థానిక పరిస్థితుల్ని బట్టి నడచుకొనే స్వేచ్ఛ కోరడం, 5) ముస్లిం స్త్రీల స్వేచ్ఛకు పిలుపునివ్వడం అనేవి లౌకిక వ్యవస్థను బలోపేతం చేసేవిగానే ఉన్నాయి.

షాజహాన్ "ఖబడ్దార్" కవితలో "పరదాల పిరమిడ్లలో ప్రాణం లేని మమ్మీలుగా చేసి మమ్మల్ని మౌన మాంసాలుగా ఉత్పత్తి యంత్రాలుగా బతకమ్న మీ సంప్రదాయాలకో సవాల్" అని ఎలుగెత్తింది. ఇది ముస్లిం సమాజంలో నెలకొన్న మూఢాచారాల్ని నిరసిస్తూ హేతుదృష్టితో సమస్యను పరిశీలించే విధం. ఈ కవిత్వం ఏ విధంగా చూచినా ప్రజాస్వామ్యయుతమైందే కాక జాతీయ భావనను లౌకిక శక్తుల సమీకృత చర్యతో పురోగతిని పరిపుష్టం చేసేదిగానూ ఉంది.

# 2. అంతర్జాతీయ భావన

ఇరవయ్యో శతాబ్దిలో ముఖ్యంగా అనేక అంతర్జాతీయ సిద్ధాంతాలు వాదాలు ఉద్యమాలు కొంత ఆలస్యంగానూ భారతదేశంపై ప్రభావం నెరపాయి. అంతర్జాతీయ ప్రభావాలతో భారతీయ సమాజం తన పాత్రను నిర్వహించింది. స్వాతంత్ర్యానంతరం స్వేచ్ఛా కవిత్వంపై ఈ ప్రభావ రూపాన్ని గుర్తించడమే ప్రధానోద్దేశం. ఇందులో లిబరలిజమ్ (ప్రగతి భావన), మార్క్సిజం, ప్రజాస్వామ్యం, స్త్రీ వాదం మొదలైనవి ప్రధానంగా వస్తాయి. స్వేచ్ఛా కవిత్వంలో ఇవి రెండు విధాలుగా విశ్లేషితమయినాయి.

1. వివిధ సంఘటనలకు స్పందనం. 2. అంతర్జాతీయ సిద్ధాంతాల వాదాల ప్రభావం.

## వివిధ సంఘటనల స్పందనం :

అంతర్జాతీయ తలంపై వివిధ దేశాల్లో వలస పాలన నుండి నిరంకుశత్వం నుండి విముక్తికై పోరాటాలు జరిగాయి. ఈ కారణంగా అనేక సంఘటనలు చోటు చేసుకున్నాయి. కవులు స్వేచ్ఛా కవిత్వంలో వాటికి స్పందించిన తీరు పరిశీలింపదగింది. శ్రీశ్రీ 'మున్నుడి'లో అప్పటి అమెరికా అధ్యక్షుడు కెనడీని సంబోధిస్తూ, ఆఫ్రికా ఆసియా క్యూబా లావోస్ కాంగోలో అమెరికా విధానాన్ని నిరసిస్తూ, "చెవులు విప్పి మనసు విప్పి, కనులు వచ్చి వినవయ్యా" అని ఆరంభించి "నీ హిట్లరు పాతదనం భావాలను కసరుతాం! విన్నావా! కెన్నెడీ శ్రీశ్రీ మున్నుడి" అని అగ్రరాజ్యాధిపత్యాన్ని నిరసించడం జరిగింది. జానణ పిట్జగరాల్డ్ కెనెడి, (1917-63) అమెరికా అధ్యక్షుడు 1961లో క్యూబాపై దండయాత్రకు కారకుడయినాడు. అయితే క్యూబా దీన్ని ఎంతో ధైర్యంగా ఎదుర్కొంది. క్యూబా అధ్యక్షుడుగా ఫిడెల్ కాస్ట్రో 1959 నుండి పదవిలో ఉన్నాడు. ఇతడు అమెరికా సామ్రాజ్యాధిపత్యానికి వ్యతిరేకి. ప్రపంచశాంతి కోసమని చెప్పి తన చర్యల్ని సమర్థించుకునే అమెరికాను ఉద్దేశించి - శ్రీశ్రీ "నీ టాంకులు నీ బాంబులు విమానాలు విధానాలు శ్మశనాలు చూపిస్తాయి, ప్రశాంతినే హరిస్తాయి" అమెరికా చర్యల అంతిమ ఫలితం శాంతి కాదు, అశాంతియే అన్న అభిప్రాయం సామ్యవాద సిద్ధాంతానికి కట్టువడిన మరో పక్షాన్ని సమర్థిస్తాయి.

ఆఫ్రికా జాతీయ నాయకుడు లుముండా (1925-61) ఈతని హత్య (1961)ను పురస్కరించుకొని శ్రీశ్రీ స్పందించిన విధం అంతర్జాతీయ రాజకీయ గతికీ వైఖరికీ సంబంధించిందిగా కనిపిస్తుంది. పాట్రిక్ ఎవర్జి, పి.ఏ. లుముంబా ఆఫ్రికా ప్రజల స్వాతంత్ర్యోద్యమాలకు సంకేతంగా నిలిచాడు. 1960లో కాంగో ప్రదాని అయినాడు. కాంగో దేశాధ్యక్షుడు 'కసవూబూ' చేత ప్రధాని పదవి నుండి తొలగింపబడి చెరసాల పాలయినాడు. 1961లో హత్య చేయబడినాడు. ఈ విషాద స్థితి అంతర్జాతీయ రాజకీయ ప్రపంచాన్ని కలచి వేసింది. ఈ సంఘటనను పురస్కరించుకొని, "ఆఫ్రికా! ఓ నా ఆఫ్రికా! నీ కొమ్ముల మొనగాడు చచ్చిపోలేదు ఒక 'యల్' పోతే లక్షోపలక్షల 'యల్'లు మొలుస్తాయి. యల్ ఫర్ లెనిన్! యల్ ఫర్ లుముంబా!" .... శ్రీశ్రీ సంతాప కవిత, అంతర్జాతీయ భావనతో తెలుగు సాహిత్యంలో అభ్యుదయ శక్తుల్ని ఆకర్షించింది. అమెరికాలో దక్షిణాఫ్రికాలో వర్ణ విచక్షణకు నిరసగా కె.వి. రమణారెడ్డి "జైలు కోకిల"లో "ఎగురుతున్నై ఎగురుతున్నై నల్లగుండెల ఎర్రమంటలు! నిప్పురవ్వలు! అని నల్లజాతి వారిలో చైతన్యాన్ని అగ్నిగా సంకేతించి ఉద్యమానికి చేయూత నివ్వడం నిఖిల మానవజాతి పట్ల అంతర్జాతీయ భావన కన్పిస్తుంది. "పరుగెత్తు ప్రపంచంలోకి, బానిస సంకెళ్ళు తెంచే లెనిన్‌లాగ, మావొ లాగ, గువేరా లాగ" - ఇది సాయుధ పోరాటంతో ఉద్యమించే మార్క్సీయ విప్లవోత్సాహాన్ని బింబిస్తూంది. ఇజ్రాయిల్ దురాక్రమణను నిరసిస్తూ నందిని సిద్ధారెడ్డి "భూమి స్వప్నం"లో - "ప్రపంచ హృదయం కంఠనాళం విప్పి, పాలస్తీనా విముక్తి గీతానికి పల్లవి పాడుతూంది" అంటాడు. ఈ సమస్య ఒకచోటుది కాదు. ప్రపంచంలో అనేక చోట్ల ఉంది. విమోచనకై జరిగే పోరాటాల్ని ఎక్కడ జరిగినా స్వేచ్ఛకై పోరాడే ప్రపంచం ఆహ్వానిస్తుంది. వియత్నాం వీరోచిత పోరాటం గురించి చెరబండరాజు 'గమ్యం'లో ఆ ప్రజల్ని ఉద్దేశించి "మీరు మీ దేశంలో, మేము మా దేశంలో ఏ మేరలో ఉన్నా సామ్రాజ్యవాద సర్వనాశనం కోరుతూ విప్లవ పోరాటాలు నడపడమే" అని అంతర్జాతీయ స్పందనతో సమైక్యతను కనబరుస్తాడు. ఇదే అంశంపై "అరణ్యనేత్రం"లో జయధీర్ తిరుమలరావు "వియత్నాం వీరుని ఆఖరు గాయం స్రవించిన రక్తం నాకే చెబుతోంది" అంటాడు. వస్తువు విప్లవ ప్రేరణయుతంగా తీర్చబడింది. ఈ కవితల్లో కవి సిద్ధాంత ప్రమేయమూ ప్రాముఖ్యం వహిస్తూంది. కవిలో నిలిచిన మానవుడూ ఈ సందర్భంలో ప్రసక్తమవుతాడు.

ఆఫ్ఘనిస్తాన్‌లో రష్యన్ సేనల ప్రవేశాన్ని గురించి స్పందిస్తూ హెచ్.ఆర్.కె. "రివజనిస్టు రాకాసి కూన"గనషా రష్యాను పేర్కోవడం, "కొండల్లో కోనల్లో చాలీచాలని ఆయుధాలతో పోరాడే ఆఫ్ఘన్ గొరిల్లాల పట్ల సానుభూతిలో కవిలో నిహితమైన అంతర్జాతీయ కమ్యూనిష్టు ఉద్యమంలో వచ్చిన చీలిక కారణంగా రష్యాపట్ల వ్యతిరేకత, చైనా విప్లవ నాయకుడు మావో పంథా అనుసరించిన సానుకూలత స్పష్టం. ఇందులో సామ్రాజ్యవాద వ్యతిరేకత కన్నా, వామపక్షంలో ఒక చీలికపై ప్రధానంగా దృష్టి కనిపిస్తుంది.

అజంతా అంతర్జాతీయ విషాదఘటన అమెరికా అధ్యక్షుడు కెన్నెడీ హత్యపై స్పందిస్తూ "మానవుడు ఎక్కడ ఉన్నా ఒక్కటే, పుట్టుకతోనే అతడు స్వతంత్రుడు" మనసారా ఆ మాట అన్నందుకు ప్రెసిడెంట్ కెన్నెడీని నడివీధిలో హత్యచేశారు. అమెరికా నెన్నొసట నిప్పులు చెరుగుతూన్న ఈ పుండు ఎన్నటికీ మానదు కదా!" అంటాడు. జెండాలకు కన్నీళ్ళు లేవు" "హార్రర్ కామిక్స్ నాగరకతలో మానవుడే మృత్యువు" అని స్పందిస్తాడు. వర్ణ భేదానికి వ్యతిరేకంగా ముఖ్యంగా చట్టపరంగా కెన్నెడీ అమెరికాలో ఎంతో ప్రగతి శీల పాత్రను నిర్వహించాడు. ప్రజాస్వామ్యానికి నిజమైన ప్రతినిధిగా తన కార్యకలాపాల్ని నిర్వర్తించాడు. ఈ గొప్ప కృషికి ప్రతిఫలం "హత్య" రూపంలో లభించింది. పుట్టుకతో మానవులంతా ఒకటే. మనుషుల్లో భేదాలు స్వార్థంతో పీడనతో ద్వేషంతో ప్రవర్తించే విధంగా ఉండకూడదనే కవి అంతర్యం. ప్రజాస్వామ్యవ్యవస్థలో వర్ణభేదం పనికిరాదు. కెన్నెడీ హత్య మానవ చరిత్రలో పరమ దారుణమైంది. అమెరికాలో జీవితశైలినీ, అపరిమితమైన స్వేచ్ఛనీ పురస్కరించుకొని, ఈ సంఘటన 'హార్రర్ కామిక్'గా అభివర్ణితమైంది. ఇది ఆమెరికా చరిత్రలో "నిప్పులు చెరగే పుండులా" ఎప్పటికీ కలచివేసేది. చర్యకు ప్రతిచర్య రూపంలో మండుతూనే ఉంటుంది.

ఈ దిశలో తెలుగు స్వేచ్ఛా కవిత్వంలో ఈ సంఘటనల తరువాత పేర్కోదగిన అంశం దేశ స్వాతంత్ర్యాలకూ స్వేచ్ఛకూ సంబంధించింది. బంగ్లాదేశ్‌కై పోరాటం, బంగ్లాదేశ్ అవతరణం సందర్భంలో వెలువడిన కవిత్వం, చెప్పుకోదగిందిగా ఉంది. దాశరథి "తిమిరంతో సమరం"లో "బంగ్లా జాతి విజయం" మానవజాతికి "శుభోదర్కం"గా అభివర్ణితమైంది. చివరకు కవి సహజమైన శాంతిపై కోరిక,

నియంతృత్వంపై ప్రజల విజయం భావితమైంది. “తుపాకీల హతం చేసి కృపాకీల వెలిగించు, తిమిరంతో సమరం జరిపిన బ్రతుకే అమరం”, “అవని శాంతికది నిలయం”, చెడుపై సమరం జీవితంలో అనివార్యం. ఇదో విధంగా విశాల ప్రాతిపదికపై సమాజ శాంతికి దారితీస్తుంది. ఈ యుద్ధం ప్రజాస్వామ్యదిశగా సాగింది. అంతర్జాతీయత్వాన్ని పొందింది. కాళోజీ వర్తమాన సమస్యలకు స్పందించే కవి. “ముజీబంటే ఒకడు కాడు, ఏడున్నర కోట్లవాడు, ప్రజల తిరుగుబాటువాడు” అని బంగ్లా జాతీయోద్యమాన్ని సమర్థిస్తూ చివరిదశను, “మానవతా మర్యాదలను కాపాడిన ఘన విజయం”గా పేర్కొంటాడు. ఇందులో పాకిస్తాన్ నెరపిన అమానుషచర్యలు సూచితం. బంగ్లా దేశీయుల తిరుగుబాటులో పోరాట పటిమ ధ్వనితం. సి. నారాయణరెడ్డి ‘జయహే! బంగ్లాదేశ్’లో బంగ్లావాసుల ప్రతిఘటన శక్తినీ, పురోగమన తత్త్వాన్నీ వర్ణిస్తాడు. “జయహే! బంగ్లాదేశ్! విముక్తి కోసం పోరాడుతున్న వీరధాత్రి బంగ్లాదేశ్! జయహే బంగ్లాదేశ్! ముజీబ్ నీ ఊపిరి, ప్రజాబలం నీ పిడికిలి” అంటాడు. నియంతృత్వ చర్యలపై ప్రజల పోరాటం, విజయ వర్ణితమైంది. ‘వీర’ శబ్దంలో విజయసూచన ఉంది.

‘ముక్తధాత్రి’, మాదిరాజు రంగారావు, బంగ్లాదేశ్ విమోచన (1971) కావ్యం స్వేచ్ఛా కవిత్వంలో పేర్కోదగింది. 1971లో వెస్ట్ పాకిస్థాన్ ఆధికారికంగా ఈస్ట్ పాకిస్థాన్‌పై నెరపుతూ వచ్చే నిరంకుశ ప్రవర్తన కారణంగా ఈస్ట్ పాకిస్థాన్, స్వతంత్రదేశంగా ‘బంగ్లాదేశ్’పేరుతో అవతరించింది. ఈస్ట్ పాకిస్తాన్ సాంస్కృతికంగా వెస్ట్ పాకిస్థాన్‌కన్నా భిన్నమైంది. ఇది స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటం. పాకిస్థాన్ సైనికుల దుశ్చర్యలు, చివరకు బంగ్లాదేశ్ ఏర్పాటు – ఈ క్రమ పరిణామాలకు ‘ముజీబ్’ నాయకత్వం – వస్తురేఖలతో ఈ కావ్యం నిర్వహింపబడింది. పాక్ సేనల దుష్ప్రవర్తనకు ప్రజల దుస్థితి ఎంతో దయనీయంగా మారింది. ఈ పరిస్థితుల్లో ముజీబ్ ఉల్ రహమాన్ విప్లవమూర్తిగా స్వాతంత్ర్యోద్యమ నాయకుడుగా అవతరించాడు. ఈ కావ్యంలో ‘జ్వాల’ స్వాతంత్ర్య చైతన్యశక్తికి ప్రతీక. ప్రజల స్వేచ్ఛా సంకల్పం తుదకు కార్యరూపం దాల్చింది. “వంగపిత షేక్ ముజీబ్/ ముక్తధాత్రి బంగ్లా నసీబ్” ‘నసీబ్’ అంటే అదృష్టం. ముజీబ్ బంగ్లాదేశ్ పోరాట పర్యవసానికి అదృష్టమూర్తే!

సందేహం లేదు. వెస్ట్ పాకిస్థాన్ – "బోర్ల పడిన చీకటిగా, ఈస్ట్ పాకిస్థాన్ మేల్కొన్న తూర్పుగా వర్ణితమైనాయి. బోర్లపడడం ఓడిపోవటంగానూ, మేల్కోవడం స్వాతంత్ర్యాన్ని పొందడంగానూ గ్రహించవచ్చు. ఈ ఖండంలో నియంతృత్వ తిరోగమనం, ప్రజాస్వామ్య పురోగమనం ఒక చారిత్రకమైన ప్రాధాన్యాన్ని కలిగిన విషయం. అంతర్జాతీయ తలంపై ప్రభావాన్ని కలిగింది. కవిలో వర్తమాన ప్రజాస్వామ్య స్పందనకు ప్రతీక ఈ కావ్యం. మాదిరాజు రంగారావు మరోకృతి "ఇది వియత్నాం!" (1973) అంతర్జాతీయ భావనకు సంబంధించిన స్పందన విషయంలో ఎన్నదగింది. ఇది రెండు భాగాలుగా ఉంది. 1) విప్లవచ్ఛాయల్లో వియత్నాం, 2) శాంతి వెలుగులో! వియత్నాంలో శాంతిదిశలో ఏర్పడే స్థితి చిత్రణం. వస్తువు అంతర్జాతీయంగా ప్రాధాన్యాన్ని పొందింది. ప్రజల స్వేచ్ఛను హరించేందుకు ప్రయత్నించిన అమెరికన్ సేనల పరాజయం! వియత్నాం వీరుల విజయంతో కూడింది. ఎక్కడో ఉన్న వియత్నాంపై తమ అదుపునూ, ఆజ్ఞనూ నిర్వర్తించాలనే తహతహతో అమెరికా ఉపక్రమించిన మనోరూపం, రణయత్నం, సాహసంతో ధైర్యంతో ఎదుర్కొన్న వియత్నాం వీరుల జయరూపంతో సంపన్నమైందీ కావ్యం. వియత్నాంలో "మైలై" అమెరికన్ సేనల దాడికీ, బాంబుల ధాటికీ, విషవాయు ప్రసారానికీ, మారణాస్త్రాల మంటలకూ కమిలిపోయింది. ఇది నాగరక చరిత్రలో అమావాస్య రాత్రిగా అభివర్ణితమయింది. "ఈ చిన్నిదేశం నుండి బయటపడలేదు అమెరికా. రోట్లో తలదూర్చాక ఎంత పెద్ద తల అయితేనేం, అపుడున్న దణదశలో పెద్ద దేశమైన అమెరికా విషమ పరిస్థితి ఎంతో సహజసుందరంగా వర్ణితమైంది. గ్రీష్మంవలె తీవ్ర పరిస్థితులున్న సమయంలో వర్షాసేచనవలె శాంతి సూచన కలగడం మొదలుగా రచన ప్రతీకాత్మకతను పొందింది. ఇది వియత్నాం! అభ్యుదయ పథంలో వీరాంగణం "స్వేచ్ఛలో రెపరెపలాడే సమాజ కేతనం"గా సంభావితమైంది. ప్రజల చైతన్యశీలంతో పొందిన విజయభావన శాంతి కాముక శక్తుల విజయంగా చిత్రితమైంది. అంతర్జాతీయతలంపై సంఘటనకు స్పందించే కవి సృజనరూపం ఇది వియత్నాం! స్వేచ్ఛాకవిత్వంలో అంతర్జాతీయ వర్తమాన స్పందనకు ప్రాతినిధ్యం వహిస్తోంది. స్వేచ్ఛా కవిత్వంలో అంతర్జాతీయ భావనకు సంబంధించిన కోణాల్లో ఈ కవి "ముక్తధాత్రి" "ఇది వియత్నాం!" దీర్ఘకవితలు పేర్కోదగినవి. తెలుగు స్వేచ్ఛా కవిత్వంలో కవుల అంతర్జాతీయ సంఘటనలకు స్పందనం ప్రత్యేకంగా సమాలోచనార్హమైంది.

## అంతర్జాతీయ సిద్ధాంతాలు - వాదాలు

స్వేచ్ఛా కవిత్వంపై ప్రభావాన్ని నెరపిన ముఖ్యమైన సిద్ధాంతాలు వాదాల్లో లిబరలిజమ్, ప్రజాస్వామ్యం, మార్క్సిజం, ఫెమినిజమ్ (స్త్రీవాదం) ప్రముఖంగా పేర్కోదగినవి. స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వేచ్ఛా సమాజంలో ఈ సిద్ధాంతాల వాదాల కార్యకలాపాలు విస్తృతమయ్యాయి. కవులు వీటిని గురించి ఎంతో పరిజ్ఞానంతో నిబద్ధ దృష్టితో రచనలు చేసారు కూడా.

### 1) లిబరలిజమ్ - (ఉదారవాదం)

లిబరలిజమ్ ప్రగతిభావనతో విశాల దృక్పథంతో కూడిందీ, పురోగమన శీలం కలిగిందీ. ఇది ప్రజాస్వామ్యానికి సన్నిహితమైంది. స్వేచ్ఛా కవిత్వ ప్రక్రియ, సహజంగా సంపూర్ణమైన స్వేచ్ఛా లక్షణం కలిగింది కాబట్టి, లిబరలిజమ్ ఎంతో అనువైందిగా రాణించింది. ఆదర్శాలకు సిద్ధాంతపరమైన ఆధారతలం ఉంటుంది. సృజనాత్మక సాహిత్యంలో కవులు నిర్దిష్టమైన లక్ష్యాల్ని పురస్కరించుకొని ఆదర్శాల్ని ఎన్నుకోవడం జరుగుతుంది. ఇవి కవిత్వంలోను వ్యాఖ్యానానికీ వివరణకు అవకాశాన్నిస్తాయి. ఒక ఆదర్శం క్రియాత్మకమైన పాత్రలో ఉద్యమరూపాన్ని పొందుతుంది. అంకితభావంతో ఆకర్షిస్తుంది. ఏదైనా మానవజాతి జీవితాన్ని దిద్దడానికీ ఉత్తమంగా ఉన్నతంగా తీర్చడానికీ మనస్సుకు ఆలోచనను ఆనందాన్ని కలిగించడానికే. లిబరలిజమ్ ప్రగతిభావనతో ఆధునిక యుగంలో సృజనాత్మక జగత్తును బాగా ఆకర్షించడం సహజం. ఇది సర్వామోదకమైంది. ఏ మాత్రం సామాజిక పురోగమనాన్ని కోరేవారికైనా ఇష్టం కలుగుతుంది. ఇది సంస్కరణల్ని కోరుతుంది. పరివర్తననభిలషిస్తుంది. ఉదారవైఖరిని కలిగి ఉంటుంది. వైయక్తిక, మత, సామాజిక, రాజకీయ తలాలపై నైతికమైన విలువల్ని కోరుతుంది. ఇవి ఒక ప్రమాణంలో ఉండేందుకు కృషి చేస్తుంది. స్వేచ్ఛాకవిత్వంలో ఈ కోవకు చెందిన కవులు బోయి భీమన్న, బాలగంగాధర తిలక్, దాశరథి, కాళోజీ నారాయణరావు, సి. నారాయణరెడ్డి, వి. మోహనప్రసాద్, పేర్వారం జగన్నాథం మొదలైనవారు. బోయి భీమన్న లిబరల్ భావాలతో ప్రగతిదృష్టి కలిగిన కవి. మతంలోను సామాజిక స్థితుల్లో మార్పును

కోరతాడు. విశాల దృక్పథంతో సహేతుకమైన దృష్టితో పరిశీలిస్తాడు. భీమన్న "సరస్వతి నిన్న కంచిపట్టుచీర కట్టింది, నేడు ఓణీ ధరిస్తూందం"టాడు. మారుతూన్న పరిస్థితులకనుగుణంగా మారడంలో తప్పు లేదు. ఇవి నష్టం కలిగించకపోతే, హేతువుకు నిలిస్తే అంగీకరించడంలో తప్పు లేదు, అంగీకరించాలి అన్న ఆలోచన కలిగిన కవి.

బాలగంగాధర తిలక్, లిబరలిజమ్ దృష్టితో నిలిచే ప్రముఖ కవి. ఈయన స్వేచ్ఛా కవిత్వం దీన్ని సంపూర్ణంగా బింబిస్తూంది. ఇతడు కేవల సంప్రదాయవాది కాదు, మార్క్సిస్టు కాదు, లిబరల్ దృక్పథంతో సమాజంలో అన్ని తలాలపై మార్పును కోరే కవి. అయితే సంప్రదాయంలోని మౌలికమైన సార్వజనీనమైన అంశాల్ని గౌరవిస్తాడు. సంప్రదాయంలో మార్పుల్ని కాలానుగుణంగా కోరతాడు. ఇతని మాటల్లో "వర్తమానంలో బ్రతుకు, ఈనాటి ప్రపంచాన్ని ప్రతిబింబించు ఇంటి కిటికీలు తెలుపు, అన్ని గాలుల్ని ఆహ్వానించు" అన్న భావన సంపూర్ణంగా లిబరలిజమ్‌ను సాక్షాత్కరింపజేస్తుంది. మరోకవిత "శిఖరారోహణం"లో "షేక్స్పియర్, డాంటే, కాళిదాసు, శంకరుడు, మార్క్సు, మహాత్ముడు, పికాసో, సాత్రై" ఎవరైనా అవిచ్ఛిన్నమైన అనుభవ" పరంపరలో భాగస్వాములేనంటాడు. వీరంతా "సత్యసౌందర్యాన్వేషణ"లో శిఖరాన్ని అధిరోహించినవారే. మార్క్సునూ మహాత్ముణ్ణీ ఇరువుర్నీ మన్నిస్తాడు. ఇరువురిలో కొంత కొంత సత్యం ఉందనే అభిప్రాయం. సంపూర్ణ సత్యంకై ఇంకా ఇంకా ప్రయాణించవలసింది, ఎపుడు అందుతుందో, అందదో తెలీదు. మార్క్సు బాహ్యజగత్తు సౌభాగ్యాన్ని కాంక్షించాడు. మహాత్ముడు అంతరజగత్తు వికాసాన్ని కాంక్షించాడు. తిలక్ స్వేచ్ఛా కవిత్వం లిబరలిజానికి పూర్తిగా నప్పింది. ఈ దిశలో ఎంతో ఆలోచన అనుభవం ఆనందం దర్శనంతో కూడిన గొప్ప రచనలు వచ్చాయి.

దాశరథి మరో గొప్ప కవి. "గతంలో విలువల్ని నేర్చుకోవాలి. కాని గతానికి తాకట్టు పడగూడ"దంటాడు. "మనిష్కంలో లేబొరేటరి" అన్న కవిత ఆధునికమైన ఆలోచనలో అన్వేషణ అనుభవంతో కూడిన జీవిత వాస్తవాన్ని దర్శింపజేస్తుంది. సమస్యను హేతుదృష్టితో విశ్లేషించి, పరిష్కారాన్ని కనుగొనే అభిలాష కూడా కన్పిస్తుంది. ఇది లిబరిజంలో భాగం. సిద్ధాంతాలకూ మూఢ విశ్వాసాలకు భిన్నమైన అతీతమైన స్వేచ్ఛాశీలమైన మనోరూపాన్ని కలిగినకవి. సమన్వయగుణంతో శాంతియుతంగా సమాజ పరివర్తనం పురోగమనం జరగాలని ఆకాంక్షించే శాంతిప్రియుడు.

సి. నారాయణరెడ్డి మరో ఉత్తమకవి. సమన్వయవాదినని అభిప్రాయం వ్యక్తం చేసాడు. ఈ సమన్వయ గుణం సాధారణమైన కొన్ని అంశాల్లో లిబరలిజమ్‌లో అంతర్భవిస్తుంది కూడా. "మంటలు మానవుడు"లో "పాతముఖాల"కు స్వస్తి చెప్పి కొత్త ముఖాల్ని ఆహ్వానించే హృదయం విశాలమైన విశ్వభావనతో ప్రత్యక్షమవుతుంది. "రావలసిన ఉదయం" వస్తుంది. "నవధర్మం" ఏర్పడుతుందని విశ్వసిస్తాడు. "ఉదయం నా హృదయం"లో కవి, "ఉదయం నా హృదయం, హృదయం నా సంగీతం" అంటాడు. ఉదయం సమాజపరంగా చేరుకునే లక్ష్యాన్ని సూచిస్తుంది. సంగీతం అనుభవాత్మకమైన రాగమయ స్థితుల్ని భావింపజేస్తుంది. తాను సమన్వయవాదిగా పేర్కొన్నా లిబరలిజంలోను ఇమిడే కవితామూర్తి, సి.నారాయణరెడ్డి. రెండింటికీ కొన్ని సామాన్య లక్షణాలు తప్పవు.

వేగుంట మోహనప్రసాద్, లిబరలిజమ్‌కు సంబందించి అభిప్రాయాల్ని చాలా సూక్ష్మ,గా భావింపజేసే కవి "రహస్తంత్రి"లో కష్టాలు సహింపరానివే, కాని "శ్రమ శక్తినీ, జీవిత పరిణామాన్ని తెలుసుకో" మంటాడు. ఇతడు లిబరలిజాన్ని తాత్త్వికధోరణిలో ఆవిష్కరిస్తాడు. ఒక మనిషి ఏ భాషలో ఏడ్చాడన్నది ముఖ్యం కాదంటాడు. ఒక ఏడుపు ఎన్నో స్థాయిల్లో ఉండొచ్చు. వైయక్తికం కావచ్చు, సామాజికం కావచ్చు. ఇది ఏ ప్రత్యేక సిద్ధాంత నిబద్ధతకు చెందింది కాకపోవడం ఇక్కడ విశేషం. ఇలాంటివి ఎన్నో ఉదాహరణలతో ఈ అంశాన్ని పరిపుష్టం చేయవచ్చు. పేర్వారం జగన్నాథం కవిత్వంలో ఏ సిద్ధాంతానికీ అంకితం కాని కేవలం స్పందనశీలమైన లిబరలిజమ్‌కు సన్నిహితమైన లక్షణం గమనించవచ్చు. అనేక సందర్భాల్లో ప్రస్తుత స్థితిగతుల్ని చిత్రిస్తూ అడుగు వేయడం స్పష్టంగా కనిపిస్తుంది. వృషభపురాణం అధిక్షేప పద్ధతిలో వర్తమాన దేశ స్థితి చిత్రణం.

# 2) ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్యం ఒక సంక్లిష్టమైన, బహు సంశ్లిష్టమైన రూపం. ఇది ఏ ఇతరమైన దానికన్నా ఎక్కువగా ప్రజల అభిమతాన్ని పొందింది. దీనిలో అన్నిటినీ ఇముడ్చుకొనే గుణం పరిస్థితుల కొదిగిపోయే లక్షణం పరిస్థితుల్ని సహేతుకంగా పరిశీలించి న్యాయ చేసే లక్షణం ఉంది. ఇది ప్రజల, ప్రజలచేత, ప్రజలకొరకు ఉన్న ప్రభుత్వ పాలనా వ్యవస్థ కాబట్టి, అటు సంప్రదాయానికి పనికివచ్చే స్థాయిలో మన్నిస్తూనే ఇటు ప్రగతి ఆదర్శాన్ని అవసరమైన స్థాయిలో స్వీకరిస్తుంది కాబట్టి మేలైందిగా గుర్తింపబడింది.

స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం దీని ప్రధాన లక్షణాలు. వ్యక్తి స్వేచ్ఛను కోరే వారికే కాక సామాజిక న్యాయం, వికాసం కోరేవారికీ నచ్చింది. భారతదేశంలో అంగీకరింపబడిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో వివిధ క్షేత్రాల నుండి ప్రజలు తమ ప్రతినిధుల ద్వారా పార్లమెంటులో శాసన సభల్లో అభిప్రాయాల్ని ప్రతిబింబిస్తారు. తమ భవిష్యత్తును నిర్ణయించుకుంటారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు 1) వోటింగ్ ద్వారా అధికారాన్ని కలిగి ఉంటారు. 2) పార్టీల ద్వారా రాజకీయ తలాలపై విధానాలు కార్యక్రమాలు ఆరంభింపబడతాయి. చర్చింపబడతాయి. 3) పౌరహక్కులకు భద్రత చేకూర్చబడుతుంది. 4) ప్రజల సంక్షేమం, వాళ్ళ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఉంటుంది. 5) శాసన పాలనా న్యాయ క్షేత్రాలు తమ కార్య నిర్వహణలో స్వతంత్ర లక్షణాలు కలిగినప్పటికీ న్యాయపాలనా ఒక విధంగా అదుపులో పెట్టే యంత్రాంగంగా ఎప్పటికప్పుడు సమస్థితిని కాపాడే విధానం కలిగింది. 6) ప్రజలకిష్టంలేని ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో శాంతియుతంగా మార్చే వీలుంది. 7) సహజీవనం, వివిధ వర్గాల మధ్య చర్చలద్వారా సమస్యల పరిష్కారం అందరి అభిప్రాయాల్ని మన్నించే పరిగణనలోకి తీసుకొనే ప్రజాహితైకదృష్టికీ ప్రాముఖ్యం ఉంది. అందువల్ల భారతదేశానికి తగిన ఉత్తమ వ్యవస్థగా భావితమైంది. మానవ హక్కులూ ప్రజాస్వామ్యమూ రెండు పరస్పరం సహకారభావం కలిగినవి. అన్ని మానవ హక్కులు అందరికీ వర్తించేవి. భిన్న స్వరాల్ని వినిపించడానికి భిన్నవాదాలు ఆలోచనలు కలిగినవారు పార్లమెంటులో

ప్రతి సమస్యను గురించి క్షుణ్ణంగా చర్చించవచ్చు, సమస్యకు పరిష్కారాల్ని సూచించవచ్చు. ఈ అవకాశం ప్రజాస్వామ్యంలో చాలా మంచి అంశం. నిరసనం, ప్రతిఘటనంతో మాట్లాడే హక్కు వ్యతిరేకించే హక్కు ఉండడం వల్ల ఇవి ప్రజాస్వామ్యాన్ని పరిపుష్టం చేస్తాయనే భావించాలి. దీనికై కొన్ని సూత్రాలు నియమాలు నిబంధనలు ఉంటాయి. అయితే బాధ్యత మాత్రం సభ్యులందరిదీ, ప్రజలదీ.

దాదాపు అందరు కవులూ స్వేచ్ఛా కవిత్వంలో ప్రజాస్వామ్యచేతనను ప్రత్యక్షంగానో పరోక్షంగానో అభిలషించినవారే, ప్రతిబింబించినవారే. ప్రస్తుతానికి ప్రజాస్వామ్యం పట్ల అంకితభావంతో, విశ్వాసంతో ప్రవర్తించినవారిలో మాదిరాజు రంగారావు పేర్కోదగిన కవి. ఈయన ఉదార ప్రజాస్వామ్యం (Liberal Democracy) పై విశ్వాసంతో ఉన్న రచయిత. ఫ్రీవర్స్‌కు సమంగా స్వేచ్ఛా కవిత్వమన్న Conceptను ప్రవేశపెట్టి ఈ యుగాన్ని ప్రజాస్వామ్యయుగం లేదా స్వేచ్ఛా యుగం అని దీనికోసం సహేతుకమైన ప్రతిపాదనం చేసిన రచయిత. అలాగే “Criticism” అన్న మాటకు సమానార్థకంగా “సమాలోచనం” అన్న మాటను ఉపయోగంలోకి తెచ్చే అభిప్రాయం కలిగిన సమాలోచకుడు.

అవాహనలో “శ్వేతేతర విహంగాలు” అన్న కవితలో ‘శ్వేత’ అన్న మాట ప్రజాస్వామ్యాన్ని సూచిస్తుంది. “వెలుగులో ఈ నేలపై” అన్న కృతిలో “వెలుగు” ప్రజాస్వామ్యానికి ప్రతీక “ఈనేల” స్వాతంత్ర్యం పొందిన వర్తమాన భారతదేశాన్ని భావింపజేస్తూంది. “రావాలి ప్రజాస్వామ్య మనోవికాసం అభినవ సంస్కారంతో సమా మానవతా ప్రగతి భావ వర్తనతో దర్శనమై” ప్రజాస్వామ్యం ఒక దర్శనం. ఇది ఎప్పటికప్పుడు మార్పుల్ని కోరేదీ. దీనికై మానసికంగా సిద్ధమయ్యే స్థితికీ దోహదం చేస్తుంది. ప్రజల విషయంలో స్వేచ్ఛ సమానత్వం, మానవత్వం ప్రాధాన్యాన్ని కలిగింది. సామాజిక న్యాయం కోరేది. “మానవ సంకల్పం మేఘమై శాంతిజలం వర్షిస్తూంది. ప్రజాస్వామ్య బంధువై”. ఇందులో గతంలో జరిగిన పోరాటాలు సూచితం. వాటి ఫలితంగా స్వేచ్ఛ సమానత్వం కలిగిన సమాజం, ఇది ప్రజాస్వామ్యానికి బంధువుగానూ వర్ణితమైంది. “జీవితచలనంలో సంఘర్షణ సమయసమయం నవచరిత్ర సృజిస్తూంది”

ఇది సమాజంలో పరివర్తనచిహ్నంగా "ప్రజాస్వామ్యపథ" సూచనగా గుర్తింపబడింది. "ఈ శతాబ్ది నిరంకుశ ముఖం స్మృతిపథం నుండి విస్మృతమై ప్రజాసంకల్పం ప్రజాస్వామ్య రమణీయమవుతూంది." వలసపాలన, సామ్రాజ్యాలు, నియంతృత్వాల నుండి ప్రజలు బలంతో ప్రజాస్వామ్యానికి చేసే ప్రయాణం చిత్రితమైంది. "సమస్యల కాష్ఠరూపం, పీడితజనసందేశం, ప్రజాస్వామ్యబింబం" ఇందులో ప్రజాస్వామ్యంలోని వెలుగురూపం సమస్యల్ని శాంతిమార్గాన పరిష్కరించే ధోరణి పీడితజనుల్ని ఉత్తేజపరచే న్యాయం చేకూర్చే నీతి సూచితం. ఈనాటి అశాంతి, అసహనం, ద్వేషం, శత్రుభావం, అవినీతి ఆందోళనలతో సతమత మయ్యే సమాజంలో అన్ని స్థాయిల్లో అన్ని శ్రేణుల్లో న్యాయం కూర్చే ప్రజాస్వామ్య భావనతో ఆవిష్కృతమయిన కృతులు. "క్రాస్‌ఫైర్, సీజ్‌ఫైర్, నేడురేపు మధ్య" అనేవి "అగ్నిపీఠం – కావ్యత్రయం"లో భాగాలు. "ఒకచేతిలో శాంతిపుష్పం మరోచేతిలో ప్రజాస్వామ్యకేతనం సృజన కిరణహృదయంతో మనిషి అమృతయానం ఆశించే కవి మాదిరాజు రంగారావు. శాంతి – ప్రజాస్వామ్యం రెండూ పరస్పరం సంబంధం కలిగినవి. సమాజంలో ఈనాటి పరిస్థితుల్లో అవసరంగా భావితమైనాయి.

# 3. సామ్యవాదం

తెలుగు స్వేచ్ఛా కవిత్వంలో మార్క్సు సిద్ధాంతాల ప్రాతిపదికపై అంతర్జాతీయ స్పందనలతో అభ్యుదయ కవిత్వం, ఆ తరువాత మావో పథంలో ఉగ్రవాద కవిత్వం ప్రధానమైన భూమికల్ని పోషించాయి. శ్రీశ్రీ ఈ రెండింటికీ అధినేతగా నిలిచాడు. లిబరలిజమ్ ప్రగతిరూపానికి ప్రాతినిధ్యం వహించే గురజాడ మార్గంలో సంస్కరణ పరివర్తన దిశగా అభ్యుదయ విప్లవ కవిత్వాలు ప్రయోజనాత్మకమైన పాత్రను నిర్వహించాయి. అంతర్జాతీయ భావనలో ప్రధానమైన మార్క్సిజం సామాజిక వాస్తవికత – వర్గరహిత సమసమాజం, శ్రామిక శ్రేయస్సుపై దృష్టితో సమాజాన్ని అన్యాయం నుండి పీడననుండి అసమానతల నుండి ముక్తం చేసే ఆలోచనతో పాటు కార్యాచరణమూ కలిగింది. మార్క్సిజం ఉత్పత్తి వాణిజ్యాల ప్రభావం నుండి రూపొందే సాంఘిక వ్యవస్థ పునాదిగా ముఖ్యంగా రాజ్యాన్నీ దీనికి సంబంధించిన ఉపరితల నిర్మాణాన్నీ నియంత్రిస్తుంది. వ్యక్తులు లేకుండా సమాజంలేదు, వ్యక్తుల సమాహారమే అయినా వ్యక్తుల కలయికే సమాజం కాదు. దీని వెనుకనున్న చారిత్రక సామాజిక రాజకీయ సాంస్కృతిక శక్తుల సంచలనం సమీకరణం సహయోగం పురోగమనవిధం తప్పనిసరిగా పనిచేస్తాయి. వీటి గతిశీలంగల చైతన్యరూపమే సమాజం. సమాజ కార్యకలాపాల్లో భాగమైన కవిత్వం వ్యక్తి నిష్ఠమైనా దీనివెనుక నుండి అనేక శక్తులు వివిధ రీతుల్లో వర్తిస్తాయి. వర్తమాన స్థితిగతులకు ప్రాధాన్యంతో, సైద్ధాంతికబలంతో సమసమాజ శ్రామిక శ్రేయోరాజ్యం కోసం పోరాడే తత్త్వం స్వేచ్ఛా కవిత్వంలో సామ్యవాద పార్శ్వంలో కన్పిస్తుంది.

అభ్యుదయ స్వేచ్ఛాకవిత్వంలో శ్రీశ్రీతోపాటు ఆరుద్ర, సోమసుందర్, కుందుర్తి మొదలైన కవులు స్వాతంత్ర్యానంతరం 1950 తరువాత నిర్వహించిన పాత్ర ప్రజాస్వామ్యంలో చారిత్రక ప్రాధాన్యాన్ని కలిగింది. 1966లో వెలువడిన శ్రీశ్రీ ఖడ్గసృష్టి, 1950కి పూర్వం వెలువడిన మహాప్రస్థానానికి విస్తరణ రూపం. ఇది పీడిత పక్షం వహించి పోరాడే సంకల్పాన్ని బలపరుస్తూంది. "ఈ కత్తి అధర్మ నిధనం" చేస్తుంది, "సమానధర్మాన్ని" స్థాపిస్తుంది, "నవీన మార్గాన్ని" చూపిస్తుంది అంటాడు.

ఇందులో ఉగ్రవాదం స్పష్టం. విప్లవమార్గాన్ని ఆచరణలో సంఘర్షణయుతం చేసే అభిప్రాయంతో కూడిందీ "ఖడ్గసృష్టి".

1960లో అంతర్జాతీయ కమ్యూనిస్టు దేశాల మధ్య విభేదాల కారణంగా చీలిక ఏర్పడింది. 1964లో దీని ప్రభావం భారతదేశంపై పడింది. కమ్యూనిష్టు పార్టీ చీలింది. అటు రష్యా ఇటు చైనా నాయకత్వంలో రెండు పక్షాలు వెలసాయి. 1970లో విరసం (విప్లవ రచయితల సంఘం) ఆవిర్భవించింది. శ్రీశ్రీ మాటల్లో "ఈనాడు పీడిత ప్రపంచానికి ఆశాజ్యోతి విప్లవకేంద్రం – పీకింగ్" అన్న మాటలో విరసం పయనించింది. దీనికి అధినేత శ్రీశ్రీయే. మావో సాంస్కృతిక విప్లవాన్ని ఆదర్శంగా గ్రహించే ఈ పక్షం సాయుధ సంఘర్షణకు ప్రేరేపించే భావజాలంతో కవిత్వాన్ని వెలువరించింది. ఖడ్గసృష్టి తరువాత "మరో మహాప్రస్థానం", తీవ్రవాద విప్లవభావాలకు ప్రాతినిధ్యం వహిస్తాయి. తెలుగు స్వేచ్ఛా కవిత్వచరిత్రలో సిద్ధాంతబలంతో రాజకీయ ప్రమేయంతో అంతర్జాతీయ స్పందనలతో సామాజిక శక్తిగా రూపొందిందీ మార్క్సియ కవిత్వం. ఖడ్గసృష్టిలో లెనిన్ శతజయంతి సందర్భంలో (14 జనవరి 1970) శ్రీశ్రీ "లెనినిజం, కమ్యూనిజం, హ్యూమనిజం నిజంగా నిజాలు. నిజానికి నిజమైన అర్థం లెనిన్, అందుకే అతనికి నా శాల్యూట్". స్పష్టమైన మార్క్సు సిద్ధాంత నిబద్ధత కలిగిన శ్రీశ్రీ లెనిన్ సామాజిక ప్రయోజనశక్తిని వర్ణిస్తూ – "ప్రపంచ కావ్యానికి ప్రతిపదార్థం లెనిన్ – బ్రతుకనే చిక్కు సమస్యకి పరిష్కారం లెనిన్" – ప్రపంచాన్ని అధ్యయనం చేసిన అనుభవజ్ఞుడుగా, బ్రతుకును సవివరంగా పరిశీలించిన ఆలోచనామూర్తిగా లెనిన్‌ను – అతని సిద్ధాంతాల్ని మార్క్సుకు ఏ విధంగానూ భాష్యం చేసిందీ ఆపైన సూచిస్తాడు. ఖడ్గసృష్టి ఔచిత్యాన్ని వివరిస్తూ, ఉగ్రవాద "కలంతో స్వప్నిస్తున్న ఖడ్గం ఇది, జనంతో నిర్మిస్తున్న స్వర్గం ఇది" అంటాడు. కవి దృష్టిలో కలానికీ, జనజీవితానికీ గల సంబంధాన్ని స్థాపిస్తూందీ కవిత. సమానధర్మంతో కూడిన నవీన మార్గాన్ని నిర్దేశించే శ్రీశ్రీ కవిత్వం స్వేచ్ఛాకవిత్వంలో మార్క్సిజంకు నిబద్ధమైందీ, దాన్ని ప్రబోధించేదీ.

చైతన్యం నుండి జగత్తు అస్తిత్వం ఏర్పడిందన్న భావవాదానికి భిన్నంగా, జగత్తు అస్త్విం నుండి చైతన్యం సిద్ధించిందన్న భౌతికవాదం మార్క్సియానికి ముఖ్యాంశం.

ప్రకృతికీ సమాజానికీ సంబంధం ఉంది. ఇది అనేక విధాలుగా వర్తిస్తుంది. అయితే ఇది పూర్తిగా వస్తువుకు సంబంధించింది మాత్రమే. భౌతికతలంపైనే వర్తించేది, మనిషి జీవితంలో సుఖసౌభాగ్య సంపాదకై పరిపూర్ణతకై భౌతిక మానసిక తలాలపై ప్రయత్నిస్తాడు. ఎన్నో కార్యకలాపాలు సాగిస్తాడు. ఎన్నో మార్పులు చేర్పులు జరుగుతూపోతాయి. అయితే వీటికి పునాది ఉత్పత్తి సంబంధాలు మాత్రమే. ఉత్పత్తి సంబంధాల మార్పుతో సమాజ సంబంధాలూ మారతాయి. కొన్ని సందర్భాల్లో ఇది వేగవంతంగా జరుగుతుంది. మార్క్సిజం దీన్ని మరింత వేగవంతం చేస్తుంది. సంఘర్షణను ప్రేరేపిస్తుంది. విప్లవమార్గాన్ని అనుసరిస్తుంది. శ్రామిక రాజ్యంకై కృషి చేస్తుంది. ఈ క్రమంలో సమాజాన్ని పీడనం నుండి అన్యాయం నుండి అసమానతల నుండి ముక్తం చేసి 'సమానధర్మం', 'నవీనధర్మం' స్థాపించేందుకు చేసే కృషిలో మార్క్సిజంపై విశ్వాసమున్న కవులూ క్రియాశీలమైన పాత్రను నిర్వహించారు. రాజకీయాలూ సాహిత్యమూ వేరుకాదు. ఒకటేనన్న భావం వీరిని ప్రేరేపించింది. ఈ దిశలో ఆరుద్రతోపాటు సోమసుందర్ కుందుర్తి మొదలైన కవులూ అభ్యుదయ మార్గంలో పయనిస్తూ కన్పిస్తారు. వీరు తొలిదశకు చెందినవారు.

మలి దశలో మావో సాంస్కృతిక విప్లవం వైపు మరలిన శ్రీశ్రీతో పాటు రమణారెడ్డి వరవరరావు, చెరబండరాజు, శివసాగర్ మొదలైన కవులు కన్పిస్తారు. వీరిని ఉగ్రవాద కవులుగా పేర్కోవచ్చు. ఉగ్రవాద విప్లవ కవిత్వం చైనా విప్లవమార్గాన్ని అనుసరించింది. మావో సాంస్కృతిక విప్లవాన్ని కోరేదీ. వరవరరావు 'సముద్రం' కవితలో జనవిప్లవచేతనను స్పందిస్తూ "సముద్రానికి తుపాను భయం లేదు, తీరానికే తుపానుభయం, నేను సముద్రం హెూరును" అంటాడు. తనకూ విప్లవానికీ అభేదాన్ని వర్ణిస్తూ విప్లవ సంకేతాన్ని సూచిస్తాడు. ఈ కవిత్వంలో విప్లవస్థావరాలు సమస్యలు నగరం నుండి కార్మికుల నుండి పల్లెలకు అరణ్యాలకు భూమికి సంబంధించిన విషయం వైపు మారాయి. అందువల్ల కవిత్వంలో వాతావరణమూ వీటికి సంబంధించిందే ప్రవృత్తం కావడం సహజం. ఈ దిశలో 'రాత్రి', 'తిరగబడు', 'మార్చ్', 'ఝంఝ', 'లే' మొదలైన విప్లవ ప్రబోధక సంకలనాలు వెలువడినాయి. ఇంకా కె.వి. రమణారెడ్డి, ఎర్ర 'పిడికిలి – నగ్నముని "తూర్పుగాలి" – జ్వాలాముఖి

"తిరుగుబాటు" – వరవరరావు "జీవనాడి", నిఖిలేశ్వర్ "మండుతూన్న తరం" – శివారెడ్డి "నేత్రధనుస్సు", "రక్తం సూర్యుడు" – నందిని సిద్ధారెడ్డి "భూమి స్వప్నం" – ఇట్లా అనేక మంది కవుల రచనలు నక్సల్‌బరి ప్రేరణతో, నక్సలిజంను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సమర్థించేవిగా కన్పిస్తాయి. ఉద్యమం 'నెలబాలుడు'లో శివసాగర్ ఉద్యమం తొలిదశను భావిస్తూ, దీని విజయానికి – కార్మికుల్ని కర్షకుల్ని పీడితుల్ని తాడితుల్ని 'కదం త్రొక్కి కదలిరండి' అని పిలుపునిస్తాడు.

శివారెడ్డి అడవుల్లో స్థావరాల్లో నిలిచీ ప్రస్తుత వ్యవస్థతో తలపడే విప్లవమూర్తుల్ని చిత్రిస్తూ – "రక్తం ఓడుతూ గాయపడిన సింహంలా అడవంతా పరుగెత్తడానికి నాకేమీ అభ్యంతరం లేదు" అంటాడు. అడవిలో ఏ బుల్లెట్ గాయానికో నెత్తురు కారుతూ పరుగెత్తే విప్లవ వీరునితో తాను ఒకటైపోవడానికి సంసిద్ధం అవుతాడు – ఇది ఆ సిద్ధాంతం పట్ల కార్యాచరణ పట్ల గల నిబద్ధతను సూచిస్తూంది. ఈ సాయుధ హింస మావో ఆలోచనా స్ఫూర్తినందుకొని సాగింది. దీన్ని చారిత్రక క్రమంలో ఈ కవి వ్యక్తిత్వంలో భాగంగానే చూడవలసి ఉంది. శ్రీశ్రీ ప్రభావ రూపం స్పష్టంగా కన్పిస్తుంది. వీరంతా శ్రీశ్రీ గొడుగు నీడన నడుస్తూన్నవారుగానే పరిశీలనకందుతారు. కవిత్వానికి సంబంధించి నంతవరకు స్వేచ్ఛాకవిత్వంలో మార్క్సిజం పార్శ్వానికి వీరి రచనలు ప్రత్యేకతను కలిగింపజేసిన మాట వాస్తవం.

అభ్యుదయ పథానికి వస్తే మార్క్సిజంపై విశ్వాసంతో రష్యా నాయకత్వంపై విశ్వాసమున్న కవుల స్వేచ్ఛాకవిత్వం ఎంతో విశిష్టతను కలిగిన మాట కూడా నిజం. ఈ పార్శ్వంలో ఆరుద్ర ప్రముఖంగా కన్పిస్తాడు. మొదటి నుండి చివరిదాకా స్థిరంగా నిలిచిన కవి. "త్వమేవాహం" తరువాత "సినీవాలి" అభ్యుదయ మార్గంలో పేర్కొనదగిన రచన. కుందుర్తి 'యుగేయుగే' కవితా సంకలనం పేర్కోదగింది. అంతర్జాతీయమైన భావస్పందనలో మార్క్సిజాన్ని పొందినా, వస్తువులో దేశీయమైన దృష్టితో మార్పును కోరేదిగా ఉంది. సోమసుందర్ అభ్యుదయ ప్రస్థానంలో స్వేచ్ఛాకవిత్వాన్ని సుసంపన్నం చేసిన కవి. "అదృశ్యమానంగా ఒక ఉక్కుపంజరం సమస్త శేముషీ విభవాన్ని నిర్బంధిస్తే", "భూ హృదయంలో సమరం నా హృదయంలో ప్రళయం" అంటాడు. (అక్షయ తరంగిణి 1973) ఉక్కుపంజరం నిరంకుశమైన దోపిడి తత్త్వంగల వ్యవస్థకు

సంబంధించింది. 'సమర' భావం విప్లవచర్యకు సంకేతం. ఒక విశేషస్థితిలో "స్వార్థపరుల్ని నాశనం చేసేందుకు" తండోపతండాలుగా జనక్రోధ భయార్భటిగా విప్పారిన ఎర్రని కనులు"లో తిరుగబడిన జనసమూహ చేతనా దృశ్యంలో మార్క్సీయమైన ఆదర్శం బింబిస్తూంది. ఈ చర్యల ఫలితంగా "సుదీర్ఘ శిశిరం నీడ" వదలిపోయి, "నూత్న వసంత జీవన సమీరం" మేల్కోడం జరిగింది. ఇందులో పాతవ్యవస్థ నశించి కొత్త వ్యవస్థ అవతరించే చేతన సూచితమయింది. "అరచే లోయలు"లో "సూర్యుడు కర్మసాక్షి, వాడు సదా కార్మిక పక్షపాతి, ఉదయిస్తూనే చెమటగా మారి వాళ్ళ నొసళ్ళెక్కుతాడు, వర్గచైతన్యం బోధిస్తాడు". సూర్యుడు మార్క్సీయ భావనామూర్తికి చిహ్నం. మార్క్సిజం కార్మిక వర్గ శ్రేయస్సును కోరేది. ఇట్లా మార్క్సిజం లోని వర్గ చైతన్య స్పృహను స్ఫురింపజేసే రచనా రూపం కవిలో నిహితమైన ఆదర్శ నిబద్ధతను సూచిస్తూంది. అడిగోపుల వేంకటరత్నం, అభ్యుదయపథంలో సిద్ధాంత నిబద్ధతతో వ్రాస్తూన్న కవి. సామ్యవాద సమాజాన్ని భవిష్యత్తులో దర్శిస్తూ, అనివార్యాన్ని భావిస్తూ "అదృశ్యకుడ్యం"లో "రాలిన సోషలిజం విత్తులు, నారుమళ్ళమవుతాయి. విశ్వాంబర వీధిలో అరుణ పతాకలవుతాయి". మార్క్సిజం అంతర్జాతీయత్వాన్ని భవిష్యత్తులో ఫలస్వరూపాన్ని చిత్రిస్తూంది. సమాజంలో నెలకొన్న పీడితులూ, పీడకులూ వర్గభేదాన్ని దృష్టిలో పెట్టుకొని, "శ్రామికుని చూపు సౌరశక్తి, పిడికిలి శ్రమశక్తి, సమస్తం దోచిన ఒకడిది చోరశక్తి" – ఒక వర్గానిది 'శ్రమశక్తి' అయితే మరో వర్గానికి 'చోరశక్తి'గా ఎంతో సుందరంగా శ్రమజీవుల్ని దోచుకొనే సామాజిక దురన్యాయాన్ని చిత్రించడం కన్పిస్తుంది. విప్లవం తప్పదు, అది ఏ సందర్భంలో అనివార్యమవుతుందో పేర్కోడమూ జరిగింది. "దేగలు కూనల్ని తన్నుక పోతున్నపుడు, ధనుస్సు సంధించక తప్పదు" – తిరగబడే జనచైతన్యం చేసే పోరాట రూపం వ్యంజితమయింది. ఈ పోరాట సమయంలో "పలాయనానికి తావు లేదని" బోధిస్తాడు. సమాజానికి మార్క్సిజం భవిష్యత్తు మహాపథం అన్న దృష్టితో నిర్దేశితమయింది.

మార్క్సిజంపై విశ్వాసంతో పార్టీ కార్యకలాపాలతో కవికి నేరుగా ప్రమేయం ఉండరాదన్న అభిప్రాయంతో ఉపక్రమించిన కవి శేషేంద్రశర్మ! తాను మార్క్సిస్టునని ఘంటాపథంగా ప్రకటిస్తాడు. అయితే మార్క్సిజంలో కవి నిష్ప్రమేయంగా రాజకీయంగా

నిష్క్రియంగా ఉండే అవకాశముందా? అన్నదే వేరే ప్రశ్న! ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని కవి "ఈ శతాబ్ది అంగీకరించిన మార్క్సు సిద్ధాంతాన్ని కనీసావిష్కారంగా స్వీకరించాలి" అంటాడు. ఇది "ఆర్థిక సామాజిక సమస్యలవరకు" అని పరిమితమూ చేయడం జరిగింది. ప్రజల సమస్యల్ని తీర్చడానికి మార్క్సిజాన్ని పరిష్కారరూపంగా గ్రహించడం స్పష్టం. అయితే కవి ఆ రాజకీయాలపట్ల ప్రమేయాన్ని సక్రియతను గురించి, "నేను దారిచూపే సైడ్‌బోర్డు మాత్రమే, ఆ గమ్యం చేరుకోవలసింది ప్రజలే" – శ్రీశ్రీకి శేషేంద్రకూ భేదం ఇక్కడే ఉంది. శ్రీశ్రీ ప్రజల్ని "పదండి ముందుకు" అని లీడ్ చేయడం, ఉత్సాహపరచడం, గమ్యం వైపు పయనింపజేయడం చేస్తే, శేషేంద్ర ఒకచోట నిలచి తాను దారిచూపే సైన్‌బోర్డ్‌గా మాత్రమే భావిస్తాడు. గమ్యానికి వెళ్ళవలసిన బాధ్యత ప్రజలదేనని విశ్వసిస్తాడు. ప్రజలను గమ్యానికి చేర్చవలసిన బాధ్యత తనదని శ్రీశ్రీ విశ్వసిస్తాడు. ఇక్కడ ఈ పోలిక విషయ స్పష్టతకోసం మాత్రమే. రాజకీయాల పాత్ర గురించి, తన అభిప్రాయాన్ని దాని పరిమితుల్ని గుర్తిస్తూనే శేషేంద్ర జీవితంలో రాజకీయం ఒక భాగం మాత్రమే, కవి మానవజాతికి బాధ్యుడు" అంటాడు. రాజకీయాలు జీవితంలో ప్రధానం కాదనీ, నిఖిల మానవ తలంపై ఆలోచన ప్రసరించడంతో శేషేంద్ర దృక్పథం మార్క్సిజం పట్ల పరిమితత్వాన్ని పొందుతూంది. అయితే విప్లవాన్ని సమర్థిస్తూ మరోచోట "నేను జేబుల్లో కోకలల్ని వేసుకరాలేదు, పిడికిళ్ళలో బాంబులు బిగించుకొని వచ్చా"నంటాడు. "గర్జించు శేషేంద్ర నిర్భయంగా గర్జించు" అని ప్రస్తుత వ్యవస్థపై బాహాటంగా తిరుగుబాటును ప్రోత్సహిస్తాడు. కవి కవిత్వపరంగా అక్కడక్కడా మార్క్సిజం పట్ల అంకిత స్ఫూర్తిని కనబరచడం జరిగింది.

ముఖ్యంగా సామ్యవాద సామాజిక లక్ష్యంతో కళాత్మకతకు ప్రాధాన్యం ఇచ్చే కవిగా గోచరిస్తాడు. ఈ సందర్భంలో శ్రీశ్రీ మాటలు, రచనాపరంగా కొన్ని పరిమితుల్లో అన్వయించు కోవడం సముచితం. "సామ్యవాద సమాజమే అభ్యుదయ రచయితల ధ్యేయం. అందుచేత అభ్యుదయ రచయితలందరూ సామ్యవాదులే". స్థూలంగా చూస్తే శేషేంద్ర, తనవైన కొన్ని పరిమితుల్లో మార్క్సిస్టు కవిగా విశ్లేషణకందుతాడు. స్వేచ్ఛా కవిత్వంపై మార్క్సిజం అభ్యుదయ – ఉగ్రవాద పార్శ్వాలతో అనితరమైన ప్రభావాన్ని నెరపింది. చాలామంది కవులు తాము ఈ ముద్రను వేసుకొని మరీ, కాల మహాశ్వంపై ప్రయాణించడానికి సంసిద్ధులయినారు.

# 4. స్త్రీవాదం

అంతర్జాతీయ భావనలో భాగమైంది 'స్త్రీవాదం'. 1975కు పూర్వం స్త్రీ వికాస చరిత్ర సామాజికంగా సంస్కరణ పరివర్తన రూపాల్లో ఉంది. కాని స్త్రీవాదం స్త్రీ దృక్పథంతో మాత్రమే స్త్రీ వ్యక్తిత్వాన్ని పరిశీలిస్తుంది. అస్తిత్వాన్ని నిర్మిస్తుంది.

స్త్రీవాద స్వేచ్ఛా కవిత్వం స్త్రీ దృక్పథంతో పితృస్వామ్య వ్యవస్థలో ఎదుర్కొనే స్త్రీల సమస్యల్నీ పొందే అవమానాల్నీ పీడనల్నీ అన్యాయాన్నీ అసమానతల్నీ నిరసన ప్రతిఘటన సంఘర్షణ పథంలో ఎదుర్కొనే స్వరూపాన్ని చిత్రిస్తుంది. స్త్రీవాదం అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖమైన పాత్రను నిర్వహించింది. స్త్రీవాద చరిత్రను దిజ్మాత్రంగా విలోకిస్తే, 1920–60 మధ్యకాలంలో ఉద్యమాలు వెలసాయి. స్త్రీ స్వేచ్ఛ విషయంలో సంస్కరణలు తీసుకొని రాబడినాయి. 1920లో స్త్రీలు ఓటుహక్కును పొందడం స్త్రీల ఘనవిజయంగా పేర్కొబడింది. 1920–60 మధ్యకాలంలో వివిధ దేశాల్లో అనేక ఉద్యమాలు వెలసాయి. అయితే 1960 నుండి స్త్రీవాద దృష్టితో స్త్రీ స్వేచ్ఛ – స్వాతంత్ర్యం – సమానత్వం – వ్యక్తిత్వం – వికాసం గురించి ఉద్యమం తీవ్రతరమయింది. ఈ కాలం నుండి "స్త్రీ వాద" మన్న మాట కూడా బహుళ ప్రాచుర్యాన్నీ ప్రచారాన్నీ పొందింది. స్త్రీవాదం, ఇప్పటివరకూ నెలకొన్న పురుష సంస్కృతీ స్వరూపాన్ని సమూలంగా మార్చివేసే లక్ష్యం కలిగింది. స్త్రీ స్వేచ్ఛ – సర్వస్వతంత్ర (Free and autonomous) భావనా సూత్రంపై ఆధారపడిందీ. స్త్రీ వాదం స్త్రీల హక్కుల మేరకే పరిమితం కాదు. జెండర్ పట్ల అభేదాన్ని కోరుతుంది, జెండర్ సమానత్వాన్ని అపేక్షిస్తుంది. అందువల్ల స్త్రీవాదం రాకముందు 1960కి పూర్వం జరిగిన స్త్రీ వికాస చరిత్రకూ స్త్రీవాద చరిత్రకూ భేదం ఉంది. స్త్రీవాదం – 1) చరిత్రలో స్త్రీ అణచివేతను ప్రధానమైన సామాజిక వాస్తవంగా గ్రహిస్తుంది. 2) స్త్రీ స్వేచ్ఛ – హక్కుల్ని గురించి పోరాడుతుంది. 3) సంప్రదాయ మూల నిర్మాణరూపాన్ని సహేతుకంగా చర్చించి మార్చే దిశలో ఉద్యమిస్తుంది. 4) వైయక్తికకౌటుంబిక సామాజిక కార్యకలాపాల గురించి ఇంతవరకు నెలకొన్న సంప్రదాయ విధానాల్ని పద్ధతుల్ని సహేతుకంగా చర్చించి పరిష్కారాన్ని సూచిస్తుంది. కొత్త విధానాన్ని పద్ధతుల్ని గ్రహించడానికి ప్రోత్సహిస్తుంది. ఈ లక్ష్యాల్ని సాధించేందుకు ఒక్కొక్కచోట అక్కడి

పరిస్థితుల్నిబట్టి, దీన్ని చేపట్టిన వారి నాయకత్వం వ్యక్తిత్వాన్ని బట్టి స్త్రీవాదం – 1) ఉదార (లిబరల్), 2) మార్క్సిస్టు, 3) మానవతా, 4) రాడికల్, 5) ప్రజాస్వామ్యం మొదలుగా ఆవిర్భవించాయి.

సృజనాత్మక సాహిత్యంలో అందునా స్వేచ్ఛా కవిత్వంలో స్త్రీవాదం ఎంతో బలమైన ప్రభావాన్ని కలిగిన పార్శ్వంగా నిలిచింది. తెలుగు స్వేచ్ఛా కవిత్వంలో వస్తువును విశ్లేషిస్తే –

1) స్త్రీ ఒంటరితనం, పరాధీనత, అస్వతంత్రత, అణచివేత, హింస, పీడనం, అవమానం, అభద్రత, భయస్థితీ, భేదభావం అనేవి. ఇది ఒక్క తెలుగు రాష్ట్రానికే పరిమితమైనవి కావు, విశ్వవ్యాప్తమైనవి.

2) జెండర్ వివక్షను నిర్మూలించడం, పితృస్వామ్యగతమైన పురుషాహంకారాన్ని రూపుమాపడం, స్త్రీ స్వేచ్ఛకు ఎదురయ్యే అనేకమైన సామాజికమైన వైయక్తికమైన ఆటంకాల్ని తొలగించడం.

3) స్వతంత్రమైన స్త్రీ అస్తిత్వాన్ని ప్రోత్సాహాన్ని కోరడం – ఇందుకు అవసరమైన చట్టాల్ని రూపొందించేందుకు ఉద్యమించడం, ఆర్థిక రాజకీయ సామాజిక తలాల్లో స్త్రీ వ్యక్తిత్వాన్ని వికసింపజేసే వాతావరణాన్ని నిర్మించడం –

4) స్త్రీవాదాని కనుగుణమైన నిర్మాణాత్మకమైన సామాజిక స్వరూపాన్ని నెలకొల్పేందుకు కృషి సలపడం కన్పిస్తాయి.

ఈ అంశాలపై దృష్టితో తెలుగు స్వేచ్ఛా కవిత్వంలో స్త్రీవాదం ప్రతిధ్వనించింది. సావిత్రి, జయప్రభ, ఓల్గా, కొండెపూడి నిర్మల, పాడిబండ్ల రజని, మందవరపు హైమావతి, రేవతీదేవి, సి. వేదవతి, శీల సుభద్రాదేవి, ఆదూరి సత్యవతీదేవి, శారదా అశోక్‌వర్ధన్, శరత్‌జ్యోత్స్నారాణి, చిల్లర భవానీదేవి, వాసా ప్రభావతిదేవి మొదలుగా ఎందరో కవులీ దిశలో పయనించారు. స్వేచ్ఛాకవిత్వంలో స్త్రీవాదం అవతరణకు 1970లో ఆరంభసూచన కన్పిస్తే, 1980లో దీనికొక విస్పష్టమైన ఆకృతి కన్పించింది. 1990 నుండి ప్రాముఖ్యాన్ని పొందింది. 1993లో 'నీలిమేఘాలు' స్త్రీవాద కవితా సంపుటి స్త్రీల సృజనాత్మక వ్యక్తిత్వానికీ ఉద్యమశక్తికీ దర్పణంగా నిలిచింది.

ఐక్యరాజ్యసమితి సూచన మేరకు 1975లో అంతర్జాతీయ 'నారీ దినోత్సవం'తో అంతర్జాతీయ నారీ దశాబ్దం ప్రకటితమైంది. స్త్రీచైతన్య వికాసాన్ని గురించి అంతర్జాతీయ తలంపై చర్చలు గోష్ఠులు సమావేశాలు కార్యక్రమాలు జరిగాయి. ప్రస్తుతం తెలుగులో స్త్రీవాద స్వేచ్ఛా కవిత్వానికి మాత్రమే ఈ అంశం పరిమితమైంది. ఈ సందర్భంలో జెండర్ భేదం లేకుండా 'కవి' శబ్దం ప్రయుక్తమైంది. స్త్రీవాద కవుల్లో ప్రతి ఒక్కరు తమదైన సమస్యల సంస్థితుల వ్యక్తిత్వంతో స్వేచ్ఛాకవిత్వాన్ని వెలువరించారు. ఇందులో ఉదార (లిబరల్), రాడికల్, మార్క్సియ ప్రజాస్వామ్య మానవతా దృక్పథాలు విలసించాయి. తెలుగు స్వేచ్ఛాకవిత్వంలో జెండర్ భేదం, అగౌరవం, అవమానం, హింస, ఇంటిపని, పరాధీనత, అస్తిత్వలోపం, వ్యక్తిత్వ వికాసానికి వీలులేకపోవడం, ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం స్వేచ్ఛా రాహిత్యం మొదలైన అంశాలు వీటిని ఎదుర్కొనే ధైర్యం, ప్రయత్నం, అభిలాష, లక్ష్యం, అంకితభావం మొదలైన లక్షణాలతో పరివ్యాప్తంగా కన్పిస్తాయి.

ఒక విషాదపాత్ర సావిత్రి, రాజమండి నివాసి. 'బందిపోట్లు' అన్న కవితలో "పాఠం ఒప్పజెప్పక పోతే, పెళ్ళి చేస్తానని పంతులుగారన్నపుడే భయం వేసింది". పెళ్ళి చేస్తానన్న మాట శిక్షించే అర్థంలో పలుకుబడి కలిగింది. జీవితంలో బాధలతో, కష్టాలతో క్రుంగిన ఈమె, పురుషసమాజాన్ని ఉద్దేశించి "నీతులు వల్లించకండి! నిక్కమైన అర్థమేదో తేలిపోయింద"ని అంటుంది. నీతులకు చేతలకూ ఉన్న భేదాన్ని గుర్తుచేస్తుంది. చివరకు శారీరకంగా క్రుంగిపోయి అనారోగ్యంతో, మానసికంగా వ్యధ చెంది వేదనతో "నే కోరింది! పిడికెడు బ్రతుకు! చిటికెడు గాలి! గుక్కెడు నీళ్ళు! కనీస నిశ్శబ్దం! నాకు దక్కినవి హోరుగాలి! వికారపు నిందలు! దుర్గంధపు జలపాతాలు! అవహేళనలు! అనవసరపు జోక్యం! ఖచ్చితంగా హత్య!" ఇదీ ఆమె పొందింది. జీవితంలో ఎంతో ఆవేశపూరితంగా కవితాత్మకంగా వెలువడిన ఈ కవిత స్త్రీవాద స్వేచ్ఛా కవిత్వానికి శ్రీకారంగా నిలిచింది.

కొండెపూడి నిర్మల "ఎంతగా అణచివేయబడ్డామో అంతగా భూమిని తన్నుకొని పైకెగసే జలోత్సాహం ధారకడుతూన్నద"ని స్త్రీల్లో ఆగని ఉత్సాహం వేగవంతమయ్యే క్రియాశీలతను స్పష్టంగా చిత్రించింది. వసంతా కన్నాభిరామన్ "నిను హింసించే

క్రూరమృగాలపై ఎదురుదాడి మొదలుపెట్టు"మని – పురుషుల్లో క్రౌర్యాన్ని ఎదుర్కొనే శక్తిని పుంజీవభవింపజేసే దిశగా ప్రేరేపిస్తుంది. జయప్రభ – "మీ స్వేచ్ఛను దోచుకున్న సంఘపు దౌర్జన్యంపై తిరుగుబాటు చేయండ"ని పిలుపుతో "తలెత్తుక నడవండి" అని ధైర్యాన్ని ఇస్తూంది. రెవరెండ్ ఎంజెలా గురించి కొండెపూడి నిర్మల "చందనచర్చల్లో అలసి సొలసిన స్త్రీలు నేడు చర్చిలో అడుగుపెట్టార"ని, ఫిబ్రవరి 1994లో ఇంగ్లండులో చరిరతలో ఒక స్త్రీ పూజారి కావడంపై పురుషవ్యతిరేకత ప్రదర్శించిన సందర్భాన్ని పురస్కరించుకొని వ్రాసింది. ఇది పురుషుల్లో ఆరని అహంకారాన్ని చిత్రిస్తూంది.

బోస్నియాలో సెర్బ్‌లు హెర్జిగోవినాలోని క్రోషియన్‌లను హతమార్చేదిశలో స్రీతలను చిత్రహింసలకు గురిచేసిన సందర్భంలో, నిర్మల, "కామంలోతనో క్రోధంతోనో ఆడదాన్ని అవమానపరచే" తీరును నిరసిస్తూ "కుటిలనీతికోసం, అమాయక స్త్రీలపై వీరత్వాన్ని నిరూపించే" దుస్థితిని గురించి మంచి కవిత వ్రాసింది.

జయప్రభ – యుద్ధోన్ముఖంగా సమాజంలో పాతుకుపోయిన దోపిడీకి దౌర్జన్యాలకూ గురియైన స్త్రీ సమాజం సాగించే పోరాటాన్ని సమర్థిస్తుంది. ప్రయోజనం లేని పూజలు, వెట్టిచాకిరి, వ్రతాలు చేసి చేసి అలసిపోయిన స్త్రీలో 'చైతన్యాన్ని' కోరుతుంది. ఈ ముళ్ళను పెకలించడానికి "విచ్చుకత్తి"ని కోరుతుంది. ఈ చీకటిని చెండాడడానికి ముందుగా మా కలాలు యుద్ధోన్ముఖంగా కదులుతున్నాయని ధైర్యసాహసాల్ని ప్రదర్శిస్తుంది.

ఇట్లా ఇంతకుముందు పేర్కొన్న స్త్రీ కవులు స్త్రీవాదాన్ని వారివారి వ్యక్తిత్వాల కనుగుణంగా అర్థం చేసుకునీ మలచుకొని స్త్రీ కవులు స్త్రీ వాదాన్ని వారివారి వ్యక్తిత్వాల కోరే లక్ష్యాలకు సరిపోయేట్లుగా స్వేచ్ఛాకవితారచన చేసారు. ఈ కృషి ప్రత్యేకంగా అధ్యయనం చేయదగిన విషయం. స్త్రీల ఆవేదన, ఆవేశం, ఆలోచన, అనుభూతి, అభిప్రాయం, ఆదర్శం ప్రకటించడానికి స్వేచ్ఛాకవిత్వ ప్రక్రియ తగిన సాధనంగా ఉపకరించింది. స్వేచ్ఛా కవిత్వంలో తమ చరిత్రను నిర్మించుకునే సంకల్పశక్తీ, తమ అస్తిత్వాన్ని కాపాడుకొనే ఉత్సాహమూ, వివిధ సిద్ధాంతాల అభిప్రాయాల సమాకలనంతో స్త్రీవాదం అంతర్జాతీయ స్పందనలతో అవతరించింది. చాలా కొద్ది సమయంలో బలమైన

# 3. మానవీయ భావన

స్వేచ్ఛా కవిత్వంలో మానవీయ భావన మనిషి జీవితం గురించి భౌతిక మానసిక తలాలపై స్థూల సూక్ష్మ దశల్లో వివిధ స్థితుల్ని సంఘటనల్ని పురస్కరించుకొని వివిధాంశాల చిత్రణం, వివరణం వర్ణనం, 2) విశాల ప్రాతిపదికపై మనిషికి సంబంధించిన చరిత్ర, వికాసం, ఉన్నతి, దర్శనం విశ్లేషణతో రెండు విధాలుగా పేర్కోవచ్చు. ప్రపంచంలో ఏ ఉన్నతికైనా మనిషి మాత్రమే ప్రమాణరూపం. ఎంతో పూర్వ చరిత్రతో అనుభవ పరంపరతో ఎప్పటికపుడు అభివృద్ధిని కోరే, సాధించే మనిషి గురించి ఇందులో ప్రసక్తమవుతుంది. ప్లేటో మనిషిలో అత్యుత్తమమైన అత్యున్నతమైన గుణాలపైన అభివృద్ధిపైన విశ్వాసాన్ని ప్రకటించాడు. మనిషిలో హేతుదృష్టి, మనిషిని సంపూర్ణ వికాసం వైపు ప్రయాణించడానికుపకరిస్తుంది. మనిషిని ఎప్పటికీ మనీషిగానే గుర్తించడం మానవీయ భావనలో ప్రధానాంశమవుతూంది. మానవుడు కేంద్రంగా సమస్తం పరిభ్రమిస్తుంది. మనిషిలో ఉత్తమ గుణాలకు, ప్రేమ, దయ, సానుభూతి, క్షమ, వివేకం మొదలుగా ప్రాధాన్యం ఉంటుంది. ఇవి మనిషి సంపూర్ణమైన వికాసానికి దోహదం చేస్తాయనే విశ్వాసం ప్రబలంగా పనిచేస్తుంది. వ్యక్తితో పాటు వ్యక్తుల సమాహారమైన చరిత్ర – సంస్కృతితో పరంపరా రూపాన్ని కలిగిన సమాజాన్ని గురించీ ఆలోచన చేస్తుంది. మనిషికి సంబంధించిన ఆలోచనలో స్థానికం మొదలుకొని విశ్వవ్యాప్తంగా మానవజాతి గురించి చింతన సాగుతుంది.

మనిషి చరిత్రలో శక్తివంతుడుగా దర్శనమిస్తాడు. అదే మనిషి ఎన్నో బలహీనతలతో ఎంతో కోల్పోయినట్లు కన్పిస్తాడు. ఒకవైపు నిర్మాణశీలం, మరోవైపు విధ్వంసన గుణం దృష్టికి వస్తాయి. మనిషినీ మనిషినీ ఎక్కడున్నా ఎట్లా ఉన్నా స్నేహంతో ప్రేమతో బంధించే మానవతా రూపంతో విలసించేదే మానవీయ భావన. ఆధునిక యుగంలో మానవీయ భావన అపారమైన ప్రగతితో విజ్ఞాన వికాసంతో ప్రకాశమానవుతూంది. దీనితో పాటు హేతుదృష్టి వివేకస్ఫూర్తితో జీవిత స్వరూపం సుగుణాత్మకతను పొందుతూంది. మానవీయ భావనలో మనిషి కేంద్రం, ఇది మనిషిలో

ఉన్నతినీ ఉదాత్తతనూ గుర్తిస్తుంది. హేతుగుణంతో వర్తిస్తుంది. వివేకంతో విలసిస్తుంది. చిత్రమేమంటే సృష్టికర్తతోపాటు మనిషే విధ్వంసకర్త కావడం! క్రింది నుండి పైపైకి ఎదిగే శక్తితోపాటు, పైనుండి క్రిందికి జారే బలహీనతలూ ఉన్నాయి. ఇవి ఆ సందర్భంలో బలహీనతలుగా మతికి తోచవు, విశేషస్థితులట్లా ఉంచి, ఒకవేళ తోచినా ఒప్పుకొనే పరిస్థితీ ఉండదు. దీనితో జీవితం సంక్లిష్టత్వాన్ని పొందుతుంది.

మానవత మనిషిని పతనం నుండి కాపాడుతుంది. ద్వేషం దురాశ దుష్టత్వం నుండి ముక్తం చేస్తుంది. ప్రజాస్వామ్యంలో మానవత ఆ ఆదర్శంలోని స్వేచ్ఛ సమానత్వం సమానన్యాయం సౌభ్రాతృత్వం మొదలైన ఉత్తమ లక్షణాలకు వైయక్తిక స్థితిలో దీప్తినిస్తుంది. మానవీయాన్ని సామాజిక స్థాయిలో అన్వర్థం చేస్తుంది. మానవీయంలో కుల మత వర్ణ ప్రాంత దేశ సంకుచిత సీమలకు ఆస్కారం లేదు. ఆధునిక యుగంలో సమాజంలో శాంతికి దీని అవసరం చెప్పనవసరం లేదు. మానవ హక్కులు ఈ దిశలో పనిచేస్తాయి. భద్రతను కలిగిస్తాయి. చెడును నియమించే ప్రయత్నం చేస్తాయి. అంటే మానుషేతరమైన చర్యల్ని అదుపులో పెట్టేందుకు నివారించేందుకు ఉపకరిస్తాయి. మానవీయమైన విలువల్ని కాపాడడం నాగరక సమాజ కర్తవ్యం. అంతర్జాతీయ సమితి (United Nations Organization) మానవ హక్కుల కమీషన్ పత్రంపై 1993లో భారతదేశం సిగ్నెటరీ కావడం (సంతకం చేసింది) ఈ దేశం, మానవ హక్కుల (Human Rights) అవసరాన్ని గుర్తించినట్లయింది. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజ్యాంగాన్ని అంగీకరించి వ్యవహరించే భారతదేశానికి తన బాధ్యతను గుర్తు చేసింది. మానవ హక్కుల్ని గురించి పరిజ్ఞానం ఒక స్థాయికి చెందింది. మానవ జీవితంలోని వాస్తవాల్ని తెలుసుకోవడం మరో స్థాయికి చెందింది. మనిషిలో అనేక కారణాలవల్ల ఏర్పడే విచిత్ర పరిస్థితుల్లో క్లిష్ట సమయాల్లో కేవలం సానుభూతిని ప్రకటించడమే కాక, సహాయపడే కార్యాచరణ కర్తవ్యమూ అవసరం. దీన్ని మానవ హక్కులు కాపాడతాయి, నిర్దేశిస్తాయి.

భారత రాజ్యాంగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులు, ఆదేశ సూత్రాల (Fundamental rights & Directive principles) మంచి పౌరులతో

రాజ్యవ్యవస్థకు దోహదం చేసేవి. 1. ప్రాథమిక హక్కులు : దేశప్రజల భద్రతను క్షేమాన్ని దృష్టిలో పెట్టుకొన్నవి. 2. ఆదేశ సూత్రాలు : రాజ్యానికీ ప్రజలకూ మధ్య సంబంధాన్ని సూచించేవి.

ప్రాథమిక హక్కులు వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ ఆశయాల్ని సాధించుకునేందుకు దేశ సమున్నతికి దోహదం చేసేవి. ఇవి వ్యక్తి సమాజంలో గౌరవ ప్రదమైన సంస్కారవంతమైన జీవితాన్ని గడిపేందుకు ఉపకరిస్తాయి. స్వేచ్ఛ సమానత్వం సామాజిక న్యాయం ప్రాథమిక హక్కుల్లో పేర్కొబడడంతో కుల మత వర్గ వర్ణ ప్రాంతాల కతీతమైన పౌరులతో రాజ్య స్వరూపాలు తీర్చబడినాయి. మానవ హక్కులు సమాజంలో ప్రాథమిక హక్కులు సరిగా పనిచేసేందుకుపయోగపడతాయి. మానవ హక్కులు అంతర్జాతీయ వేదికతో ముఖ్యంగా యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ (U.N.O.) చేత ఏర్పాటు చేయబడన మానవ హక్కుల కమీషన్ సాధనంతో, ఆయా దేశాల్లో రాష్ట్రాల్లో ప్రభుత్వాల చేత ఏర్పాటు చేయబడిన మానవ హక్కుల కమీషన్‌లు పర్యవేక్షణతో, హక్కుల ఉల్లంఘనంపై పర్యవేక్షణ ఉండడటంతో ఇది ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. ప్రపంచ వ్యాప్తంగా దీని అమలుకూ దీనిపట్ల అవగాహనకూ ఆచరణ రూపమైన వ్యవస్థలు ఏర్పడినాయి. ఇవి ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్ఠం చేయడమే కాక మానవీయమైన విలువల్ని కాపాడడానికీ దోహదం చేస్తున్నాయి. మానవీయ భావన ఈ నేపథ్యంలో తెలుగు స్వేచ్ఛా కవిత్వంలో గొప్ప ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఈ అంశాన్ని గ్రహించనీ, దీనిపై వెలుగు ప్రసరించనీ ఆధునిక కవి లేడనే అనవచ్చు.

## 1) స్థితులు - సంఘటనలు :

శ్రీశ్రీ 'శరశ్చంద్రిక' కవితలో చంద్రుణ్ణి ఉద్దేశించి "అభాగ్యుల్ని పలకరించు! జైల్లో ఉన్నవాళ్ళను ఓదార్చు! మురికి గుడిసెల్లో నివసించే పరమదరిద్రుల నుదుటిమీద ఏ కన్నంలోంచో జాగా చేసుకొని ఎలాగైనా పరామర్శ చేస్తావు కదూ!" అంటాడు. చల్లని కిరణాలతో అభాగ్యుల్ని ఆదుకునే మానవీయ భావన చిత్రితమయింది. మనిషి చేయలేనిదీ మరచినదీ, చంద్రునితో చేయించాలనుకోవడం మనిషికి తన కర్తవ్యాన్ని సూచించడమే. నేరం చేసినవాళ్ళైనా, తప్పు చేసినవాళ్ళైనా వారి పట్ల మానవతా దృక్పథంలో ఆర్ద్రమైన హృదయాన్ని కలిగి ఉండడంలో తప్పు లేదు, అవసరం కూడా. "అంతరంగం అట్టడుగున మాత్రం అంత మంది మీ మానవులమే" నంటాడు. సిద్ధాంతాలూ, అభిప్రాయభేదాలూ, సంప్రదాయాలూ, ప్రగతిరూపాలూ, మంచి, చెడు అన్నిటికీ "మానవీయ సూత్రం ఒకటే. అందరూ ఒకటే!" నన్న విశాల దృక్పథం భావితమైంది. "ఇది నిజం నవధర్మం, మానవధర్మం, అణవ శక్తికన్నా మానవ శక్తి మిన్న" అంటాడు. మనిషి శక్తి చెడు కూడా చేయొచ్చు కాని మంచికీ ఉపయోగించుకునే వీలుంది. కాని ఆణవ శక్తి వినాశనానికి దారితీస్తుంది. దాన్ని మంచికి ఉపయోగించుకొనే విషయం మనిషిపైనే ఆధారపడింది. దీన్ని నియతం చేసే శక్తి మనిషిలోనే ఉంది. కాబట్టి మనిషి శక్తి గొప్పది. అందువల్ల "మనుష్యుడే నా సందేశం, మనుష్యుడే నా సంగీతం" అంటాడు. మనిషి శక్తితో, మనిషిలో మానవీయంతో కవి తాదాత్మ్యం పొందుతాడు. ఇది శ్రీశ్రీ మానవీయ పార్శ్వాన్ని స్ఫుటంగా బింబిస్తూంది. ఆరుద్ర "సినీవాలి' వర్తమాన జీవితంలో స్థితుల సంకలనం. అమావాస్య నిశిలో కన్పించే సన్నని చంద్రకళలా మానవత స్ఫూర్తికి వస్తుంది.

బాలగంగాధరతిలక్, "వసుధైకగీతం" సంకుచితమైన జాతి మతాల సరిహద్దుల్ని చెరపేస్తూ నేడు ఆకుంఠిత "మానవీయ పతాక నెగుర వేస్తున్నాను చూడ!" అంటాడు. ఇతని ఆలోచన విశ్వజనీనమైన భావనతో స్పందిస్తుంది. వేరువేరుగా పతాకలెగురవేసే రాజకీయ పక్షాల్ని ఇతర వర్గాల్ని సంఘాల్ని అతిక్రమించి ఒకే ఒక "మానవీయ పతాక" ను "ఎగురవేసే" తత్త్వం కవిలో మానవీయ భావనకు గల

ప్రాధాన్యాన్ని, శాంతికై విశ్వతలంపై దీని అవసరాన్ని భావింపజేస్తూంది. తిలక్‌లో హేతుదృష్టి గల మానవతావాది స్వరూపమూ కన్పిస్తుంది. ఆర్తగీతంలో "మానవత లేని లోకాన్ని స్తుతింపలే"నంటాడు. ఈ "నాగరకతారణ్య వాసం భరింపలే" నంటాడు, మానవత లేని సమాజం అరణ్యసదృశ్యమైంది. అడవిలో ఏముంటాయో అందరికీ తెలుసు. నాగరకత పేరుతో లోపల అమానుష ప్రవర్తనతో ఎదురయ్యే కపట స్వార్థమనస్కుల్ని నిరసిస్తాడు. అన్ని పోయినా ఫరవాలేదు "మంచి గంధం లాంటి మానవత'' మాత్రం ఒకే ఒక ''అలంకారం మనకు ఉంది, దాన్ని పోగొట్టుకోరా"దంటాడు. అది లోపిస్తే మిగిలేది శుష్కమైన కఠోర మనోరూపమే! మానవుడు మానవుడిగా బ్రతికితే చాలు!" నంటాడు.

కుందుర్తి యుగేయుగే దీర్ఘకావ్యంలో "మనుషులంటే ఇష్టం నాకు, దేవుని కంటే మనిషి ఇష్టం" అంటాడు. సాధారణంగా ప్రజలు దేవుడంటేనే ఇష్టపడతారు. ఈ కవి మాత్రం మనిషి అంటేనే ఇష్టపడతాడు. మనిషి తరువాతనే ఎంతో పెద్దదైనా! దీనివల్ల ముందు మనిషి అతని సమస్యలపై దృష్టి ప్రసరించడానికి వీలవుతుంది. అతీత శక్తులపై కన్నా సహజమైన మనిషి శక్తిపై విశ్వాసం సూచితమైంది. ఈ మనిషిలో శక్తే దేవుణ్ణి కల్పించింది అన్న విషయమూ జ్ఞాపకం చేస్తూంది.

కాళోజి – 'నాగొడవ'లో, అసమానతల్ని అన్యాయాల్ని నిరసిస్తూ ఏ సిద్ధాంతాలకు ఆదర్శాలకూ కట్టుబడని "మానవధర్మాన్ని" కోరతాడు. దీనికోసమే తపిస్తాడు. సమాజంలో దేవునికన్నా అతీతశక్తి కన్నా మనిషి ఇతనికి మిన్న. కష్టంలో దు:ఖంలో ఉన్న మనిషిని గురించి ఆలోచనకే ప్రాధాన్యమిస్తాడు.

అజంతా సంపూర్ణంగా 'మానవీయ కవితామూర్తి!' "స్వప్నలిపి"లో – మనిషిలో బలయుతాలతో పాటు బలహీనతల్నీ గుర్తిస్తాడు. ఆధునిక మానవుడీవాడు అనల నేత్రు"డంటాడు. మారణాయుధాల విజ్ఞానంతో అశాంతి కారకుడవుతున్నాడు, విధ్వంసానికి దారితీస్తున్నాడు. "హతుడూ, హంతకుడూ అతడే" చంపేవాడూ, చంపబడేవాడూ ఇరువురూ మానవుడే! ఏ మరో శక్తి కానేకాదు. ఇపుడున్న మనిషి బాధలచేత కష్టాలచేత మరో మనిషిగా మారే స్థితిని సూచిస్తూ "అగ్ని వృక్షం క్రింద

రేపు మరో మనిషిని కాగల" నంటాడు. అగ్ని వృక్షం బాధలకూ, వ్యధలకూ సంకేతం. ఈ మరో మనిషి రూపం మన ఊహకు వదిలేయబడింది. అనుభవంతో మనిషిలో మార్పు సూచితం. ఈ కలుషిత ప్రపంచంలో "స్వచ్ఛమైన మనిషి ఒక్క క్షణం సాక్షత్కరించినా చాలు''నంటాడు. రోజురోజుకీ సమాజం దుష్ప్రవర్తనతో దురాలోచనలతో అశాంతి, ఆక్రందన, అలజడి, వ్యధ, బాధ, ఆవేదనలతో నిండిపోతూంది. దీనికి మనిషే కారణం. ఈ వాతావరణంలో స్వచ్ఛమైన మనిషి కోసం పరితపించే కవి హృదయం నిర్మలమైందీ. ఇది మానవీయ భావనా మయమైందీ. పుట్టుకతో మానవులంతా ఒకటే కాని ఒక్కొక్కరు గురి అయ్యే వివిధ పరిస్థితులవల్ల దొరికే అవకాశాల తీరులవల్ల మానసిక తలంపై పనిచేసే స్వార్థ శక్తులవల్ల మనిషి మానవతను కోల్పోతూన్న దుస్థితి చిత్రితమైంది.

సోమసుందర్ "కాలం వీలునామా" (1971)లో "కుహనారాజకీయాల అమానుషత్వాలు, శ్మశానంలో మంటల్ని" తలపిస్తున్నాయంటాడు. సమాజంలో ఏ కారణంచేతనైతేనేం పెరిగిపోయే అమానుషత్వం, ఎంతటి విపరీతి స్థితికి దారితీసేదీ చిత్రితమయింది. మిరియాల రామకృష్ణ "విద్యుద్వీణలూ వెన్నెల తీగెలూ"లో ప్రస్తుత సంక్లిష్టమైన సంవేదనమయమైన సమాజంలో మార్పుకు ఆహ్వానం పలుకుతాడు. ఈ మార్పును "మానవీయ ముఖం"తో ఆవిష్కరించే ప్రయత్నం కన్పిస్తుంది.

పేర్వారం జగన్నాథం అధిక్షేప ధోరణిలో మానవీయమైన విలువల్ని అడుగడుగునా స్పందింపజేస్తాడు. వృషభపురాణం, "గరుడపురాణం"లో దైనందిన జీవనగతిలో సమాజ వాస్తవ చిత్రణలో "మానవత" దృష్టికి వస్తుంది. "మంచికైనా చెడుకైనా మానవుడే కేంద్రబిందువు''గా భావిస్తాడు. మనుషుల్లో ''మానవత గుబాళించా''లని కోరతాడు. సమాజంలో ఎదురయ్యే ఆటవికమైన దుర్నీతినీ, దుష్ప్రవర్తననూ నిరసిస్తాడు. "మనిషి వికాసం"లోనే "మానవీయం" ఉందని విశ్వసించే మానవీయ భావనా మనస్కుడీ కవి.

కోవెల సుప్రసన్నాచార్య "ఏ రంగూ ఏ ఒక్కరి సొమ్ము కాదు, తెలుపు అంతటిలోనూ ప్రసరిస్తుంది" అని పై పై రంగులకు అతీతమైన తెలుపును, స్వచ్ఛతను

కోరతాడు. ఇక్కడ తెలుపు కవటం లేని నిజమైన మానవతా రూపానికి ప్రతీక. కోవెల సంపత్కుమాచార్య "చూచే కంటికి అడ్డం లేదు" అంటాడు. విశాలమైన మానవతా దృష్టి సూచితం. "అరణ్యాల్ని చీలుస్తూ" మనిషి "ప్రయాణం" సాగాలని కోరతాడు. ఈ ప్రయాణం ఎల్లలులేని భూమిపై అంతా ఎక్కడికైనా సాగేది, మానవీయ భావనతో సంపన్నమైంది.

సి.వి. కృష్ణారావు, "వైతరణి", "కిల్లారి" కవితా సంకలనాల్లో, మానవతా స్పృహ కన్పిస్తుంది. "కిల్లారి"లో మనిషి శక్తికి మించిన స్థాయిలో ప్రకృతి విధ్వంస స్థితి భూకంపం ప్రభావంతో, మహారాష్ట్రలో "లాతూర్" మరియు "ఉస్మానాబాద్" ప్రాంతాల్లో ప్రజల దుస్థితి చిత్రణంలో ఇది మరీ హృదయవిదారకంగా కన్పిస్తుంది. "లాతూర్" పునరావాస కార్యక్రమంలో పాల్గొన్న ఈ కవి అనుభవ సాంద్రత మానవతా స్పర్శతో ఆకర్షిస్తుంది. "దెబ్బతిన్న" జీవితాలు "భూస్థాపితమయిన" మనుషులూ, వేలాది "ప్రజల శవాల" సంకీర్ణ స్థితి, కరుణ నిండిన మానవీయ భావనతో వర్ణితమయినాయి.

అడిగోపుల వేంకటరత్నం, మహాపథంలో "మమతారాగచేతన నా గేయం, మానవతా కల్యాణానికి సమైక్యతా రాగం" అంటాడు. ఏ సిద్ధాంతమయినా, దాని విజయానికి మమతతో కూడిన మానవత అవసరం దీన్ని గురించి చెప్పబడింది. "కులం మతం మరచి" సాగితే, "ఉషోదయం" ఎదురయ్యే మహత్తరమైన అవకాశాన్ని, సర్వమానవ తలంపై మానవీయ స్పృహతో దర్శిస్తాడు. పాపినేని శివశంకర్ "ఆకుపచ్చని కలలో మానవతను స్వప్నించే మానవుడు"గా కన్పిస్తాడు. ఇతని దృష్టిలో మనిషి కూలిన విశ్వాసాలతో, చెదరిన ఆశలతో ఎదురవుతాడు. అతణ్ణి సానుభూతితో వీక్షించే మానవతా వాదిగా కన్పించడం ఇందులో విశేషం. అడిగోపుల వేంకటరత్నం, పాపినేని శివశంకర్ కవితలో వామపక్ష భావజాలానికి మానవీయ భావన హత్తబడి కన్పిస్తాయి.

దిగంబరకవులు ఆరుగురు, సరికొత్త పేర్లతో 1) నగ్నముని, 2) నిఖిలేశ్వర్, 3) జ్వాలాముఖి, 4) చెరబండరాజు, 5) భైరవయ్య, 6) మహాస్వప్న. కొత్త శకాన్ని "దిగంబరశకం" పేరుతో నిర్మించుకున్న కవులు. ఏ ముసుగూ లేని మనస్సును

కోరేవారు. కశ్మలంతో కాలుష్యంతో నిండిన సమాజాన్ని నిర్మలంగా స్వచ్ఛంగా మార్చే ఉద్దేశం కలిగినవారు. దీనికి వీరు ఏ సిద్ధాంతాన్ని ఆశ్రయించలేదు. ఒకే ఒక మానవతా దృష్టినీ మానవ భావనతో కూడిన వెలుగును మాత్రమే కోరారు. అయితే వీరు అభివ్యక్తిలో అవలంబించిన విధానం అశ్లీలమైంది. వీరు కోరే సమాజం పట్ల ఉన్ముఖమైన మనోరూపమాన్ని మాత్రం శకించనవసరం లేదు. "దిగంబర" అంటే ఏ ఆచ్ఛాదన లేని కపటం కాలుష్యం లేని మనోరూపాన్ని ఆవిష్కరించే ప్రయత్నం, మానవీయ భావనతో ప్రకాశమానమైంది.

రుద్రశ్రీ (చిట్టిమల్లె శంకరయ్య), "రూపాయి ఆత్మకథ"లో "కులం పోయి నీ గుణం మిగిలి, మతం పోయి నీ మంచి మిగిలి, విశ్వమానవాళి మతంగా వెలిసేది, లోకంలో ఎన్నడో! మానవా! ఓ మానవా!" అంటాడు. మానవుణ్ణి గుణం ప్రధానంగా, మంచికి మాత్రమే ప్రతినిధిగా గ్రహించే లక్షణం స్పష్టం. ఇది విశ్వమానవ తలంపై ప్రకాశించాలనే కోరిక సూచితం. సార్వకాలికమైన మానవీయ భావనపై ఆశ ప్రకాశిస్తోంది.

ఇస్మాయిల్ "చెట్టు నా ఆదర్శం!" – శ్రీ కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ "వెలుతురు పిట్టలు", ప్రకృతి భూమికపై ప్రతీకలతో మానవీయ స్పందనల్ని శబ్దించే కవులు.

ప్రసేన్, సీతారాం, అప్సర్, ముగ్గురు కవులూ కలిసి "రక్తస్పర్శ" ప్రకటించారు. ఇది మానవీయ స్పర్శతో ఆధునికానంతర ధోరణిలో ప్రవృత్తమైంది. వంశీకృష్ణ, సిద్ధార్థరాణి శివశంకర్ ఈ మార్గాన పయనించే కవులు మనిషిలోని మానుషత్వాన్ని పెంచే ప్రయత్నంలో సృజన, ఆస్వాదనల్ని గుర్తించారు. సమాజ దృష్టికన్నా వ్యక్తి దృష్టి ప్రధానంగా మానవీయ భావనను ఆవిష్కరించారు. "సృజన ఆస్వాదన రెండు శక్తివంతమైన రబ్బర్లు" అంటాడు ప్రసేన్. ఇవి మనిషిని మనిషితో కలిపి కుట్టే దారంగా కవిత్వాన్ని భావించారు. మనిషిని మనిషిగా చూడడం మనిషి పరిపూర్ణతను మనిషి శక్తిపై ఆధారపడినదిగా గుర్తించడం జరిగింది. ఆధునికోత్తర కవిత్వంలో ఈ ముగ్గురు కవుల స్వేచ్ఛా కవిత్వంలో మానవీయ భావన వ్యక్తినిష్ఠమైందీ, విశ్వభావనా సమర్పకమైందీ.

వేగుంట మోహనప్రసాద్, "సాంధ్యకవిత్వం"లో మానవీయం, సుఖదు:ఖాలు మోదఖేదాలు మొదలైన ద్వంద్వాల సాంధ్యస్థితిలో సూచితమవుతూంది. మానసికమైన అనుభూతిప్రదమైన ఒక అస్పష్టమైన స్థితి వెనుకనుండి మనిషిలో బాధ, కరుణ, వేదన, విషాదం, వెలుగు , చీకటీ ప్రేమ, ద్వేషం, హింస, శాంతి చ్ఛాయలతో మనోరూపం రేఖామాత్రంగా కన్పిస్తుంది. ఈ విధమైన విశిష్టమైన అభివ్యక్తి పద్ధతిలో మానవతా స్ఫూర్తి ఆవిష్కృతమైంది.

శివారెడ్డి కవిత మార్క్స ప్రగతి భావజాలానికి హత్తిన మానవీయ స్పర్శతో ఉపక్రమించేది. "మనిషి మహా సౌందర్యం ముందు మరేదీ గుర్తుకురాదు" అంటాడు. మనిషిలో ఎన్ని విధాలుగానో అందం ప్రకాశిస్తుంది. భౌతికంగానే కాక గుణపరంపరా కర్మపరంగా ఎన్నో సందర్భాల్లో కన్పిస్తుంది. "గాయపడ్డ సింహంలా బ్రతకడానికి", తనకేమీ "అభ్యంతరం లేదు" అంటాడు. సింహం ధైర్యానికీ, సాహసానికీ ప్రతీక. గాయపడడం బ్రతుకులో తగిలిన దెబ్బ! దీన్ని మనిషికి అన్వయిస్తే మనిషిలో గొప్ప శక్తి అవగతమవుతుంది. మనిషిలో ఎలాంటి పరిస్థితుల్లోనైనా జీవించాలనే ఆశ, బ్రతుకుపై విశ్వాసం మానవీయ భావనతో మెరుస్తోంది.

ఎన్. గోపి – చిత్రదీపాలు, తంగెడుపూలు, మైలురాయి, వంతెన కాలాన్ని నిద్రపోనివ్వను మొదలుగా అనేక కృతుల్లో "లిబరలిజమ్"లో మానవీయ స్పర్శ కన్పిస్తుంది. మనిషిలో ఒక పార్శ్వంలో సన్మార్గం, పరోపకారం, పరార్థం, సౌశీల్యం. మరోపార్శ్వంలో దుర్మార్గం, పరపీడనం, స్వార్థం, దౌష్ట్యం కన్పిస్తాయి. మొదటిది మానవత్వాన్ని నిలబెట్టడానికి దోహదం చేస్తుంది. రెండోది మానవత్వాన్ని ధ్వంసం చేయడానికి ఉపకరిస్తుంది. "అరె! ముందుగా మనం మనుషులం" అంటాడు. "తర్వాతే ఏదయినా! మనిషితనాన్ని ప్రతిఫలించే ప్రిజం జీవితం"గా భావిస్తాడు. జీవితంలో మానవీయానికి గల కాంతి ప్రాధాన్యాన్ని గుర్తించిన రూపం స్పష్టం.

మాదిరాజు రంగారావు, స్వేచ్ఛా కవిత్వం ప్రక్రియ గురించి సిద్ధాంతపరమైన సమాలోచన చేసిన కవి. మానవీయ పార్శ్వాన్ని సూక్ష్మతలంపై నిర్వహించడం జరిగింది. "శబ్దమై కావ్యమై"లో "మానవీయ రక్తికి ఏ సమాజమైనా ఒకటే" నంటాడు. మానవతాంశను విశ్వతలంపై దర్శించడం కన్పిస్తుంది.

"ప్రయాణం నుండి ప్రయాణంలో", "పయనించే రైలు కిటికీ నుండి చూస్తే మరచిందేదో అందుకొనేందుకు శాంతి పరుగెత్తుతున్నట్లుంది. మనిషి నిరీక్షిస్తున్నట్లుంది" అంటాడు. ఈ కవితలో "పరుగెత్తే రైలు" కదులుతూన్న జీవితాన్ని తలపిస్తుంది. "మరచింది" ఆ వస్తువు మానవతను ప్రకాశింపజేస్తుంది. దీని కోసం మనిషి నిరీక్షణం సహజం. "మానవతా పుష్పమై"లో కవి, మనిషిలో "రాతి కొండపై అక్కడక్కడా చెట్లు మొలిస్తే చాలదు", అణువణువున చేతనతో హరిత హృదయం స్పందించాలి" అంటాడు. ఈ కవితలో మానవతారూపం ప్రకృతి నుండి తీసుకున్న భావరూపంతో నిర్మితమైంది. కొండపై రాతి నేలపై వచ్చే పచ్చదనం – భావ రూపంలో మనిషిలో ఆర్ద్రత ఎరుగని అనుభవ తలం, స్ఫూర్తికి వస్తుంది. అణువణువున ఆర్ద్రత ఉన్నపుడే సర్వం పచ్చదనంతో పుష్పమయమై సంస్కార శోభను పొందుతుంది. ఇది మనిషిలో మానవీయ భావనతోనే సాధ్యం.

"క్రాస్‌ఫైర్"లో "వార్తకెక్కిన వ్యక్తి.... ఎవరో కానీ, "మానవతా బంధం మాత్రం కరుణతో ముంచి పైకి తీసి చూపుతుంది" అంటాడు. ఇదో వ్యక్తి పొందిన మరణదృశ్యం. అతడెవరో ఏ నేరమో చేసి ఉండవచ్చు, చేయకపోవచ్చు! కాని ఎవరైనా కరుణలో ముంచిన మానవతా భావనకు ప్రాధాన్యం ఇవ్వబడింది. ఇది విశ్వజనీనమైంది. ఒక దేశానికీ జాతికీ మతానికీ ఆదర్శానికీ చెందింది కాదు, సార్వజనీనమైంది. మానవీయ భావన అంతర్జాతీయ తలంపై నిఖిల మానవాళికి చెందినదిగా చిత్రితమైంది.

దాశరథి "పునర్నవం" స్వేచ్ఛా కవిత్వంలో సమన్వయస్ఫూర్తితో 'లిబరల్' ఆదర్శానికి చెందింది. మానవీయ భావనతో స్పందించడం సహజం. ఇతడు మనిషికీ మనిషికీ మధ్య కలిపే రాగబంధాన్ని ఆపేక్షిస్తాడు. రాగబంధం నుండే మంచి జీవితం, మంచి కవిత్వం వస్తుందని అభిలషిస్తాడు. ఈ రెండు ఒక స్థాయిలో ఉత్తమమైన అనుభవం వల్ల కలిగేవే. నిఖిల మానవజాతి భవిష్యత్తు కోసం, సమాజంలో శాంతి సౌభాగ్యంకోసం "రాక్షసుని"తోనూ మైత్రిని వాంఛిస్తాడు. ఇది గొప్ప మానవతావాదిగా నిరూపిస్తుంది. "మస్తిష్కంలో లేబొరేటరీ"లో మనిషిలో వివేక దృష్టినీ, విజ్ఞాన దృష్టినీ ప్రశంసిస్తూనే, మానవుడు నిజమైన మానవుడుగా రూపొందే, బ్రతికే సుస్థితినీ, స్వభావాన్నీ

తప్పనిసరగా అవసరమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తాడు. "కొడవళ్ళ నుండి కోతయంత్రం దాకా" సాగిన నాగరకత, మనిషిని సంపూర్ణంగా మనిషిగా ఎదగడానికి దోహదం చేయాలనే ఈతని దృఢమైన భావన. మనిషి కృషిలో "నాగ జెముడు" కూడా "పూలు పూసే" యత్నం జరగాలనే వాంఛిస్తాడు.

"తిమరంతో సమరం"లో "ఇది ఎప్పటికపుడు సమాజంలో ఎన్నో ముఖాలతో ఎన్నో రూపాలతో ఎదురయ్యే, మనిషిలోనూ ఎక్కడో చీకటితో సమరం సాగించే, సంకల్పాన్ని గుర్తించడాన్ని గమనించవచ్చు. "మనిషి మనిషి ద్వేషించని మార్గం వెతకాలి, జగతిని సుఖశాంతులు గల స్వర్గం చేయాలి" అంటాడు. మనిషి మనిషిని చంపే దౌర్భాగ్యుడు కారాదని ఈతని అభిప్రాయం. ఇది భౌతికంగానే కాక మానసికంగానూ జరగవచ్చు. ద్వేషం స్వార్థంలోంచి పుడుతుంది. ద్వేషం అసహనానికీ, అసహనం అశాంతికీ, రణానికీ, హింసకూ దారితీస్తుంది. దీనికొక్కటే ఉపాయముంది. అది ఉదారతతో మానవీయ భావనతో ఉపక్రమించడమే. "హింసనుండి సమసమాజ హంస" ఉద్భవించదని గట్టి నమ్మకం ఉన్న కవి, శాంతిప్రియుడు! మనిషిని "హంతకుడవు కాబోకు!" అని హెచ్చరిస్తాడు. మనిషిని "మానవుడవు కావాలి" అని కాంక్షిస్తాడు.

ప్రపంచ వాణిజ్య సంస్థ, అమెరికాపై సెప్టెంబర్ 11, 2001న ఉగ్రవాద భీభత్స చర్యను చిత్రిస్తూ, స్వేచ్ఛకు సిగ్నెల్ కావ్యంలో "ఈ శతాబ్ది ఆరంనం రణనీతి చరిత్రలో బాంబింగ్ వ్యూహంతో గగనతలం నుండి వేటకు శ్రీకారం జరుగుతూంది" దాడితో కొత్త పద్ధతిలో రణచరిత్రలో కొత్త వ్యూహం మొదలైంది. "నిటారుగా నిల్చిన నవ మానవ వికాస చిహ్నం – తలతీసిన గాయంతో క్రుంగి శిథిలమయింది" – "ఎట్టెదుట మానవ వికాసచిహ్నం చెదరినా తొలగినా – ఎదలో మానవత చివురిస్తేనే, సుమిస్తే భవిత్యం". ఉగ్రవాద చర్యతో అమెరికా తలతీసినట్లయింది. అవమానం జరిగింది. మానవత చివురించాలనే, సుమించాలనే ఆశ సహజం. దీనితోనే సమాజ భవితవ్యం అన్న కవి ఆలోచన మానవ జాతి అస్తిత్వానికీ, ప్రపంచశాంతికీ దోహదం చేసే ఆశాస్ఫూర్తి కలిగింది.

"కిరణం ప్రగతికి వాహం, కిరణం స్వేచ్ఛకు సిగ్నెల్" కిరణం ఇక్కడ వివేకానికి సంకేతం. మనిషి మనుగడకూ సమాజ భవితవ్యానికీ వివేకం అవసరమన్న సూచన

ఉంది. "కిరణపథంలో" (కిరణం స్వేచ్ఛకు, వివేకానికీ సంకేతం). "వెండిపళ్ళెంలో బహుమానంగా మానవత ఎదురవదు, దీనికెన్ని అవరోధాలో, విరోధాలో, వెలుగువలె దొరికినట్లే దొరక్కుండా పోతుంది". చరిత్రలో వివిధ దశల్లో ఎన్నో విపరీతమైన భయంకరమైన స్థితులెదురవుతాయి. వీటికి స్వార్థం బీజభూతమైంది. మానవతను సాధించడం సామాన్యం కాదు. ఇదో వెలుగు. ఇది చేతికి అందేది కాదు. అనుభవానికి వచ్చేది మాత్రమే. ఎన్ని సదుపాయాలేర్పడినా, ఎన్ని శిఖరాలు అధిరోహించినా సమాజంలో ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛతో పాటు మానవత కూడా ప్రధానమైంది. ఇది మనిషిలో సంస్కృతికి విలువనిచ్చేదీ, మనిషి పురోగమనాన్ని సార్థం చేసేదీ, మనిషిని మనస్విగా నిలిపేదీ, ఇది నాగరికతతో, దీప్తిని పొందుతుంది. నాగరకత దీనికి సహకరిస్తే సమాజ భవితవ్యం, నిజమయ్యే సుందరస్వప్నమే. ఇది అనుభవాత్మకం మాత్రమే.

స్వేచ్ఛా కవిత్వంలో సూక్ష్మతలంపైన, పరిమితమైన పరిధుల్లో అనేకమైన సంఘటనల్ని, స్థితుల్ని పురస్కరించుకొని వెలువడిన మానవతా భావన, బహుకోణాల్లో విస్తరిల్లింది. ఇది ప్రధానంగా వర్తమాన సమాజంలో వాస్తవికతకు దర్పణం పదుతూంది. దర్పణ దృశ్యాల్లో మానవీయ భావనా రూపాల్ని ఆలోచింపజేస్తూంది.

## 2) విశాల ప్రాతిపదికపై దీర్ఘకావ్యాలు

మానవీయ భావనలో స్థూల (Macro) తలంపై మానవ చరిత్ర వికాసం సంస్కృతి జీవితం దర్శనం మొదలైన అంశాలతో కూడిన రచనలు స్వేచ్ఛా కవిత్వంలో వెలసాయి. మానవుడు ప్రధానంగా ఉన్న వస్తువు బహుముఖాలుగా తీర్చబడి కన్పిస్తుంది. వీటిలో పేర్కొదగినవి - 1) మానవీయం - మాదిరాజు రంగారావు, 2) ముక్త ధాత్రి - మాదిరాజు రంగారావు 3) పడగెత్తిన ఉదయం - మాదిరాజు రంగారావు, 4) తెలంగాణ - కుందుర్తి, 5) కొయ్యగుర్రం - నగ్నముని, 6) ఆసుపత్రి గీతం - కె. శివారెడ్డి, 7) విశ్వంభర - సి. నారాయణరెడ్డి, 8) నా దేశం నా ప్రజలు - శేషేంద్రశర్మ, 9) జీవనలిపి - ఆవంత్య సోమసుందర్, 10) అగ్నిపీఠం - మాదిరాజు రంగారావు మొదలైనవి కన్పిస్తాయి.

మానవీయం (1970) స్వేచ్ఛా కవిత్వంలో వెలువడిన తొలి దీర్ఘ కావ్యం మానవ సంబంధమైన భావనతో పర్యాప్తమైంది. విశాలమైన మానవ జీవిత ప్రాతిపదికమై నిర్మితమైంది. స్థూలంగా పరామర్శనం చేస్తే మానవ వికాస చరిత్రలో పురాయగం నుండి ఈనాటి వరకు ప్రధానమైన జీవిత పథాల్ని, వాస్తవాల్ని, ఆదర్శాల్ని చిత్రిస్తూంది.

మొదటి భాగంలో మనిషి మొట్టమొదటి ఉదయాన్ని చూచి పొంది అనుభూతితో మొదలవుతుంది. తరం నుండి మరోతరం యుగం నుండి మరోయుగం పొందే సోపాన క్రమం వర్ణితమైంది. రెండోభాగంలో అశాంతి సీమలతో మొదలై ఆగని పరిభ్రమణంతో వివిధ శ్రేణులుగా సమాజం అవతరించిన విధం, అవిద్య అజ్ఞానం అసమానతలు పెరిగిన తీరు, శాంతి ఆనందం కోసం అన్వేషణ మొదలుగా చిత్రితమయినాయి.

మొత్తం మీద జీవన చలనం, దేవతల కల్పన, జీవికకై ప్రయత్నం, లౌకికమైన పోకడలు, ఆధ్యాత్మిక చింతన, మనిషి తన అస్తిత్వంకై పడే పాట్లు బ్రతుకు వంతెనపై నుండి దృశ్య పరంపరలు చిత్రితమయినాయి. వాస్తవ జీవితం వెనుక నుండి ప్రకృతి పరివర్తనదశలు భూమికగా నిలపడం ఇందులో ఒక ప్రత్యేకత. మనిషిలో ఉదారత,

శాంతిభావన, ప్రేమ, కరుణ మొదలైన ఉత్తమగుణాల అవసరమూ, వాటి ప్రభావమూ ప్రసక్తమైనాయి. అడుగడుగునా సమస్యలు తిండికీ బట్టకూ నివాసానికై పాట్లు, నాగరక దశ, సంస్కార సంపన్నత – తృప్తీ, ఆనందం, శాంతికై ఆరాటం వివృతమయినాయి. "బ్రతుకు వంతెనపై అంకితమైన పాదముద్రలు చరిత్రలో నిల్చిన స్మృతులు కాలానికాభరణాలు"గా భావితమయినాయి. భవిష్యత్తులో ఒక గొప్ప ఆదర్శ సమాజాన్ని భావిస్తూ కొత్త యుగం స్పందనకై నిరీక్షణమూ ఉంది. కొత్త శక్తులతో కొత్త సామజం శాంతి పదంలో ప్రేమగుణంతో, త్యాగలక్షణంతో పునారూపాన్ని పొందే ఆకాంక్షతో ముగస్తుంది. "దు:ఖంతో ద్రుగ్గిపోక, కష్టంలో నిల్చిపోక" మరో లోకాన్ని గొప్ప సమాజాన్ని భావించే కవి ఆశారూపాన్ని బింబిస్తూంది. ఈ కావ్యం మానవీయ భావన కేంద్రంగా ఉంది. వాస్తవ జీవిత చిత్రణంతో వెనుకనుండి ప్రకృతి స్థితి వర్ణనం యోజితమైంది. తాత్త్విక స్పర్శను కలిగిందీ, సామాజిక స్పందనం పొందిందీ. మానవతా హృదయంతో పురోగమన లక్ష్యంతో నేటి మనిషి ఎత్తక తప్పదు "మరో మనోజ్ఞరూపం".

ఇందులో "పదపదంలో కొత్త శక్తి ధ్వనిస్తూ – ఎదఎదలో కొత్త సృష్టి స్పందిస్తూ" – విశ్వతలంపై తీర్చబడిన మానవీయ భావన స్పష్టం. ఒక విషయం గమనార్హమయింది. ఈ కావ్యంలో చిత్రితమైన మానవుడు ఏ విధి పేరిటో, దైవం పేరిటో ప్రవర్తించడు, ప్రతి వ్యక్తీ తన కార్యకలాపాలు నిర్వర్తించడానికి స్వతంత్రుడూ, వాటికి బాధ్యుడు తానే అన్న సూత్రం ప్రధానంగా ఉంది. ఇందులో అస్తిత్వ ధోరణి ఛాయలూ కన్పిస్తాయి. 1) వ్యక్తి తనలో తాను, 2) తనకై తాను, 3) తనకన్న భిన్నమైన ఇతరుల కొరకు తాను అన్న మూడు స్థాయిల్లో మనిషి స్వరూపం విశ్లేషణకందుతుంది. ఇవి క్రమంగా 1) వివేకం, విజ్ఞానం, తాత్త్వికం, సృజన నిర్మాణరూపాలుగాను, 2) సాధారణ జీవితానికి సంబంధించిన కార్యకలాపాలుగానూ కొంచెం స్వార్థం కూడిన అనేకానేక ప్రయత్నాలుగానూ, 3) సేవా భావంతో త్యాగనిరతితో ఉదార గుణంతో వర్తించే లక్షణంగానూ దృష్టికి వస్తాయి.

మనిషి అంటే స్వతంత్రప్రవృత్తి కలిగినవాడు, బాధ్యతను గుర్తించినవాడు. తన నిర్ణయాలకు తనే కర్త. ఇంతవరకు అస్తివాదచ్ఛాయలు కన్పిస్తాయి. ఇక్కడి నుండి తాను ఒక భాగమైన సామాజిక చేతనతో సామాజిక చరిత్ర సంస్కృతితో ప్రభావితమయ్యే

అంశాలు కలిసిన రూపం ఈ కావ్యాన్ని మరో తలంపై నిలుపుతూంది. అస్తిత్వవాదచ్ఛాయా రూపం ప్రధానంగా మానవతా సమర్పకమైన మానవీయ భావనచే ఆవృతమైంది. ప్రజాస్వామ్య లక్ష్యం కలిగిందీ.

తెలంగాణ కావ్యం సామ్యవాదానికి లోబడి కావ్య రచనా విధానాల్ని రూపొందించుకున్న అభ్యుదయ కావ్యం, ఇందులో నిజాం నిరంకుశ పాలనే వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో వివిధ ఘట్టాల్ని స్పృశిస్తూ వ్రాసింది. చారిత్రాత్మకమైన సంఘటనల వాస్తవిక చిత్రణంతో ప్రజల బాధల్ని జీవన గాథల్ని కవితాత్మకంగా చిత్రితమైనాయి. ఇది వచన కవిత్వంలో సామ్యవాద భావ జాలానికి ప్రాతినిధ్యం వహిస్తూంది. సామాజిక స్పందనతో ఆధునిక కవిత్వంలో విస్తృతికి తోడ్పడింది.

కొయ్యగుర్రం (1977) దివిసీమలో తుపాను భీభత్సం వల్ల వేలాది ప్రజలు కష్టాలపాలయిన సందర్భంలో వెలువడింది. బీభత్సదృశ్యాలు వర్ణనాతీతం. మృత్యువు తాండవించింది. ఈ ప్రకృతి దుస్థితి భూమికగా దయనీయమైన ప్రజల కష్టనష్టాలు హృదయ విదారకమైన బాధ వేదన ప్రధానంగా ఉందీ కావ్యం. మానవీయమైన విలువల్ని పునరుజ్జీవితం చేసే దృష్టి కలిగిందీ. ఈ కావ్యం పేరు కొయ్యగుర్రం. ఇది జడమైన, చలనం లేని, ప్రాణం లేని పాలనా వ్యవస్థకు ప్రతీకగా నిర్వహింపబడింది. దీన్ని తగలబెట్టడానికి ఇంధనం కనిపించడం లేదంటాడు కవి. ఈ కొయ్యగుర్రం రాజకీయపు ఇనుప డెక్కలతో విహరిస్తూంది. నేలపై ఉన్న ప్రజల్ని చూడదు. గగనంలో సంచరిస్తుంది. అయితే గుర్రం వేగానికీ ప్రతీక. కొన్ని మార్లు విజయానికి ప్రతీక. ప్రయాణానికి చిహ్నం. ఇది కొయ్యతో నిర్మితమైంది. దీనికి ప్రాణమెక్కడిది? ఎవరైనా కదిలిస్తే తప్ప కదలదు. అది అక్కడక్కడే కదులుతుంది. సమాజంలో అవినీతి అన్యాయం తాండవిస్తూంది. కార్యక్రమాలు సరిగా జరగడంలేదు. ఈ దుర్దశనెదుర్కునేందుకు అవసరమైన చైతన్యస్ఫూర్తిని వ్యంజింపజేస్తుందీ కావ్యం. మనిషిలో చీకటివెలుగూ రెండూ ఉంటాయి. అయితే మనిషిలోని చీకటి పార్శ్వాన్ని ఎత్తి చూపుతుంది. మనిషిలో వెలుగు పార్శ్వం ప్రస్తుత స్థితిలో మరుగున పడింది. చీకటి పార్శ్వాన్ని అంతం చేయాలనే కవి కోరిక. దిగంబర కవుల్లో ఒకరు నగ్నముని. దిగంబర కవిత్వంలోని మనసుపై

ఏర్పడే తొడుక్కునే ముసుగును మోసాన్ని కాపట్యాన్ని తొలగించి సహజమైన శుభ్రమైన రూపాన్ని ఆవిష్కరించాలనే ప్రయత్నంలో భాగమే ఈ కృతి. ఇది దాని విస్తృత రూపమనవచ్చు.

సామాజిక విషాద చిత్రాలు దయనీయ స్థితిని స్ఫురిస్తాయి. "నాగలి బుజాన వేసుకొని పొలం వెళ్ళే ప్రతి రైతూ నాకు శిలువ మోస్తున్న జీసస్‌లా కనిపిస్తాడంటాడు. ప్రకృతి విషాద గాథలో రైతు స్థితి మరీ అన్యాయమయి పోయింది. పొలాలన్నీ మునిగిపోయాయి. ఇండ్లు కూలిపోయాయి. కరుణరసపూరితమైన దృశ్యం. మానవీయ స్పృహను ఆవిష్కరిస్తుంది. మానవతా గుణంతో, మానవీయ భావనకు అద్దం పట్టే ఈ కృతి స్వేచ్ఛా కవిత్వంలో ప్రముఖంగా పేర్కోదగింది.

"విశ్వంభర" మరో ఉత్తమ దీర్ఘ కావ్యం. స్వేచ్ఛా కవిత్వంలో వెలువడిన కృతి, విశ్వభావనా సమర్పకమైంది. ఇందులో నాయకుడు మనిషి, రంగస్థలం విశాలమైన విశ్వంభర. నేపథ్యం ప్రకృతి. ఇందులో జీవితంలో మనిషి ధరించే వివిధ భూమికలు చిత్రితమయినాయి. 1) కళాత్మకం, 2) వైజ్ఞానికం, 3) ఆధ్యాత్మికం, 4) సామాజికం అనేవి దృష్టికి వస్తాయి. మనిషిలో నుండి ఉద్భవించిన రూపాలే. అలెగ్జాండర్, క్రీస్తు అశోకుడు, సోక్రటీస్, బుద్ధుడు, లింకన్, లెనిన్, గాంధి ఎందరో మహానుభావులు. ఇందులో తేదీలలో నిమిత్తం లేదు. ప్రాంతాలతో నిమిత్తం లేదు.

స్థూలంగా ఆదిమ యుగం నుండి ఆధునిక సమాజం వరకు కామం క్రోధం లోభం మదం ఆత్మశోధనం ప్రకృతి వశీకరణం అన్న ప్రవృత్తులతో మానవుని మహాప్రస్థానం చిత్రితమయింది. ఎన్నెన్నో ఎదురుదెబ్బలు తగిలినా పురోగమనం వీడని మానవీయ భావరూపాలు ఇందులో ప్రత్యక్షమవుతాయి. ఓటముల మధ్య గణనీయమైన గెలుపులతో ఆకర్షిస్తాయి. మనిషి మధ్యమధ్య పంచేంద్రియాల మాయకు వశమై తన చిరునామా మానవీయమైన ఉనికినీ కోల్పోయే స్థితి వస్తుంది. అయితే అంతలో తేరుకొని ముందుకు ఉపక్రమిస్తాడు. మధ్యలో భ్రాంతికీ యథార్థానికీ మధ్య ఊగిసలాట లేకపోలేదు. ఇక్కడ తనలో నిహితమైన హేతువును జీవధాతువుగా చేసుకొని ప్రస్థానం సాగించడం ఒక్క మనిషికే చెల్లుతుంది.

"నిత్యం చైతన్యంతో నిలిచే మనిషి నిష్క్రమణం లేని పాత్రధారి" – "నిఖిల విశ్వంభరా పురోగతుల నియతిని కాపాడే సూత్రధారి"గా నిలుస్తాడు. ఆశ శ్వాసగా, నిత్య పరిణామశీలిగా మానవుడు తీర్చబడినాడు. మనిషికి మరణం లేదు. ఉంది అతని శరీరానికే. ఆలోచనకు కాదు. కాలాన్ని జయించే శక్తి ఉన్నవాడు. ఉపనిషద్భావనాచ్ఛాయలతో తాత్త్వికత వెలుగుతూంది. ఇందులో శరీరేతరమైన మానసిక (ఉపనిషత్తుల్లో ఆత్మగా ఉంది) భూమిక "విశ్వంభర"లో సమావిష్కృతమైంది. "మనసుకు తొడుగు మనిషి, మనిషికి, ఉడుపు జగతి" ఇది విశ్వంభరా తత్త్వం, "ఇదే అనంత జీవిత సత్యం". మనసుకూ మనిషికీ తొడుగులు వర్ణిస్తూ, అవి క్రమంగా మనిషీ, జగతిగా నిర్దేశిస్తూ తనదైన అస్తిత్వంలో విశ్వంభరలో పరిణామతత్త్వాన్ని, జీవిత సత్యాన్ని ఆవిష్కరించే కృతి "విశ్వంభర" కావ్యం.

మరో కావ్యం "మట్టి మనిషి ఆకాశం" ఎక్కడ కన్నీరు తొణకినా తుడిచేయాలనే తహతహ వేళ్ళకు – ఎక్కడ హృదిలో చితి రగిలినా ఆర్పేయాలనే తపన కన్నీళ్ళకు" అంటాడు. ఇది ఈ కృతిలో కరుణ రసాత్మకమైన జీవన తత్త్వంతో ప్రకాశించే కృతి. ఇది కూడా ప్రకృతి భూమికపై మానవుని విశిష్టతను ఆవిష్కరిస్తూంది. మానవీయ భావనకు అద్దం పడుతూంది.

శేషేంద్రశర్మ "నా దేశం నా ప్రజలు" మరో ఉత్తమ దీర్ఘ కావ్యం. మానవీయ భావ రూపాలతో సంపన్నమయింది. ఈయన కవిసేన "వైజ్ఞానికోద్యమ" నాయకుడు. కవిసేన 'మానిఫెస్టో', ఆధునిక కావ్యశాస్త్రం అన్న పేరుతో వెలువడింది. ఇదీ ఉద్యమానికి సిద్ధాంతపరమైన రూపాన్ని నిర్మిస్తూంది. మార్క్సిజాన్ని భారతదేశంలో సమస్యలకు కనీస పరిష్కార సాధనంగా భావించిన మానవతావాది. రాజకీయాలతో ప్రమేయం లేకుండా కేవలం మానవీయమైన "అనుభూతి కళ"తో స్వేచ్ఛా కవిత్వాన్ని విప్లవ ప్రతిధ్వనులతో నడిపిన కవి. మానవీయ భావనలో ప్రముఖంగా దృష్టికి వచ్చే సంవేదన సహానుభూతి స్పందనతో కవిత్వం ఆకర్షిస్తుంది. "సమస్త మానవజాతికి బాధ్యత వహించే కవి, ఏ అధికారపక్షంతో, ఏ రాజకీయ పక్షంతోను ఐక్యం చెందని వ్యక్తిత్వంతో" కొత్త విలువలతో కొత్త ప్రపంచాన్ని సృష్టించే ప్రయత్నం, నిఖిల మానవ

జాతిపై దృష్టితో సాగింది. ఇందులో మనిషి మేధ, కృషి, సామర్థ్యం, సౌభ్రాత్రం, స్వేచ్ఛ, బాధ్యత కలిగిన అనుభూతి ప్రపంచం దర్శనమిస్తుంది. 'నా దేశం నా ప్రజ'ల్లో, వస్తువు భారతీయ జీవనంలోని గ్రామీణ వాతావరణం, ప్రకృతి దృశ్యంతో నిర్మితమయింది. నదులూ, కొండలూ, చెట్లూ, కొడవళ్ళూ, నాగళ్ళూ, పొలాలూ, తోటలూ, పక్షులూ మొదలుగా ప్రకృతిగతమైన వస్తు సముదాయం పాత్రలుగా వెలసాయి. వీటి ద్వారానూ జీవితానుభవం ద్వారానూ బాధ, దు:ఖం, పీడనం, దారిద్ర్యం, వేదన, మృత్యువు, స్నేహం, ఆశ, ప్రేమ, శాంతి, స్వేచ్ఛ, న్యాయం, ఉదారత మొదలైన భావరూపాల మెరపులతో కావ్యం నిబంధితమయింది. నా కవిత్వం మనిషికి "డిఫెన్స్" అంటాడు కవి. "మానవ దేహాలయ దేవత మనిషిని దర్శించుకో" మయిడు. మనుషలు మనుషులుగా మనుగడ సాగించే ఒక వినూత్న ప్రపంచం కోసం ఆవేదనపడే కవి శేషేంద్ర, కావ్యం "మనదేశం మన ప్రజలు" మానవ భావనా సమర్పకమైంది.

మరో కావ్యం "గొరిల్లా" మనిషిలో నిద్రాణమైన క్రియాశక్తికి ప్రతీకగా ఉంది. సమాజంలో నెలకొన్న అన్యాయాల్ని అసమానతల్ని అంతమొందించే లక్ష్యంగా ఆవిష్కృతమయింది.

"జీవనలిపి" సోమసుందర్ దీర్ఘ కావ్యం. ఐదు భాగాలుగా ఉంది.

**1) మొదటి భాగం – ఉదయం :** సుఖమయమైన మానవ వ్యవస్థను సుందరమైన ఉదయంగా సహస్రాబ్దాలు వర్ధిల్లాలనే ఆకాంక్ష కలిగింది.

**2) రెండో భాగం – మధ్యాహ్నం:** వర్తమానంలో సామాజిక స్థితి – మానవ వికాస వైభవం – మానవజాతి అధిరోహించిన శిఖరాలతో కూడింది.

**3) మూడో భాగం – సాయంత్రం :** గతవైభవ నిష్క్రమణంతో ప్రవృత్తమైంది.

**4) నాలుగో భాగం – అర్ధరాత్రి :** తోడు నీడ కాని పిచ్చి రాత్రి! అంధధాత్రిగా ఉంది. నిరంకుశం, కార్కశ్యం, అంధత్వంతో బ్రతికేది.

**5) ఐదో భాగం – నిశాంతం :** రాత్రి అంతమయ్యే దశ : చీకటికి విరుగుడుగా శుక్రతార దర్శనం – విశ్వాసాన్ని కలిగించే వెలుగు! శుభోదయ సాక్షాత్కరం తథ్యమన్న భావనకు సూచనగా ఉంది.

ఇట్లా ఒక కొత్త పద్ధతిలో కాలానికీ, మనిషి జీవిత చక్రానికీ సామాజికమైన వికాస చరిత్రకూ చక్కని అనుసంధానాన్ని కలిగిస్తూ ఆవిష్కృతమైన రచన "జీవనలిపి".

కవి "మనిషిలోని మనీషా ధీరత్వాలను మేళవించు! ఉద్బుద్ధం చేయి మానవత్వాన్నీ జీవచ్ఛక్తినీ" అని మనిషిని ప్రేరేపిస్తాడు. జీవితంలో, "ఉదార తత్త్వాన్ని ప్రతిష్ఠించి పురుషోత్తమ గమ్యాన్ని" చేరుకోవలసిందిగా మనిషిని సంబోధిస్తాడు. ఈ ఉత్తమత్వం అనేక సద్గుణాల పరిపూర్ణతచేతనే సాధ్యం. ఇది మానవీయ భావనా రూపంతోనే అస్తిత్వాన్ని పొందుతుంది.

"పడగెత్తిన ఉదయం" – మాదిరాజు రంగారావు మరో దీర్ఘకావ్యం. వ్యక్తి జీవితంలో ఒక రోజులో జరిగిన సంఘటనల స్థితుల అనుభవ పరంపరా రూపం. ఇరవైనాలుగు గంటల కాలంలో అనుభవ పరంపరను పొందింది. చైతన్యస్రవంతి ధోరణిలో ఆవిష్కృతమయింది. "నిన్నటి రాజరికం నుండి నేటి ప్రజాస్వామ్యంవలె" ఉదయం మేల్కొనడం ఆధునిక భావరూపాన్నీ కవి ప్రజాస్వామ్య నిబద్ధతనూ భావింపజేస్తూంది. వాస్తవ జీవిత స్థితులకు వెనుక నుండి ప్రకృతి వర్ణనమూ కొన్ని సందర్భాల్లో కన్పిస్తుంది. ఇవి మనిషి జీవితానికీ ప్రకృతికీ గల విడదీయరాని బంధాన్ని స్థాపిస్తూంది.

రోజు ఉదయం మొదలుకొని మళ్ళీ ఉదయం అయ్యే దాకా సమాజ జీవిత గమనంలో వ్యక్తి స్థితులతో, మానసిక చిత్రణంతో మానవీయ స్పర్శ ఆకర్షిస్తుంది. ఎదుగూ బొదుగూ లేని రాతిబొమ్మ కాదు మనిషి" అంటాడు కవి. మనిషికి మనస్సు, అది ఎట్లా ఎప్పుడు ప్రవర్తించేదీ, ఏయే స్థితుల్ని ఎదుర్కొనేదీ తెలియదు కాబట్టి జీవితమూ ఊహకందని రూపాన్ని పొందుతుంది, మలుపులు తిరుగుతుంది. "చెమట బిందువులు రాలుతూ చెప్పులు కుట్టే ముసలి మొగం, ప్రక్కనే తోడుగా నీటిచుక్కకై మొగం వాచిన చెట్టూ" – ఇలా బింబ ప్రతిబింబ భావంతో మనిషి జీవితం ప్రకృతి

స్థితీ సంయోజితమైనాయి. కష్టంలో తాపంలో వేదనలో మానవీయ భావన ప్రకాశిస్తూంది. సాధారణ జీవితంలో ఎదురయ్యే కఠోరమైన వాస్తవ దృశ్యాలు ఎన్నో! దృష్టికి వస్తాయి.

ఈ కావ్యం ప్రణాళికను విశ్లేషిస్తే –

**1) ఉదయం – పైకెక్కే ఎండ :** జీవవితంలో ఆశావహస్థితీ పైకి వెళ్ళగోరే మనిషి ఆలోచన.

**2) పగలు – పైకెక్కిన ఎండ :** జీవితంలో క్రియాకలాపాల ఉచ్ఛస్థితీ – శిఖరాల్ని అందుకోగోరే మనిషి ప్రయత్నం.

**3) వాలే ఎండ – సాయం సమయం :** విషాదస్థితీ – రాబోయే చీకట్లు పొంచి ఉన్న అనుభవం – ఎండ కాస్త చల్లబడిన వాతావరణంలో మనిషిలో తగ్గే ఉత్సాహదశలూ.

**4) చీకటిరాక – రాత్రిసమయం :** విరామస్థితీ – కలలుగనే సమయం. భయావహస్థితీ, దీన్ని మరచే అవకాశం నిద్ర!

**5) చివరిజాము – మంచుతెర :** సన్నని వెలుగు! ఉదయస్ఫూర్తితో మెలకువతో మళ్ళీ మరో జీవితవలయం ఆరంభానికి రంగం సిద్ధం.

మరో ఉదయానికి అవకాశం ఏర్పడిన స్థితితో అంతమవుతుంది. "పడగెత్తిన ఉదయం", మనిషి తనలో ఉన్న శక్తిని సమీకరించుకొని ఉద్యమించే ఉపక్రమించే జీవిత స్వరూపాన్ని భావింపజేస్తూంది. ఇది ప్రతీకాత్మకమైంది. తెలుగు స్వేచ్ఛా కవిత్వంలో ఇదొక కొత్త ప్రయోగం. ఉదయం నుండి మళ్ళీ ఉదయమయ్యే దాకా మనిషి కేంద్రంగా సమాజ జీవన వలయంలో వివిధ స్థానాల్లో మానవీయ భావన ఉన్ముఖీకృతమయింది. ఇది వాస్తవ చిత్రణలో ఆకర్షిస్తుంది.

"అగ్నిపీఠం" మరో సుదీర్ఘ కృతి ఇది "క్రాస్‌ఫైర్", "సీజ్‌ఫైర్", "నేడు రేపు మధ్య" దీర్ఘ కావ్యత్రయం సంపుటి. ఇది సంపూర్ణంగా మానవీయ పార్శ్వాల్ని

బింబిస్తూంది. "క్రాస్‌ఫైర్" సైద్ధాంతికంగా లేదా అభిప్రాయ భేదాలవల్ల ఇరుపక్షాలుగా చీలిపోయి, సాధారణ రేఖనతిక్రమించి రణోత్సాహాన్ని ప్రదర్శించే సామాజిక స్థితిగతికి సంబంధించిందీ. "సీజ్‌ఫైర్" ఇరువురి మధ్య రణోద్రేక విరమణం "సీజ్‌ఫైర్". "నేడు రేపు మధ్య" ప్రకృతి విలయతాండవం, భూకంప ప్రభావ పర్యవసాన విషాద చిత్రణం.

క్రాస్ ఫైర్‌లో ఏదో కారణంగా మరణించిన ఎవరో వ్యక్తి నేరస్థుడే కావచ్చు. దానికి సంబంధించిన వార్తపై స్పందిస్తూ కవి, "ఏమైనా జీవించే హక్కును మనిషి నుండి మాయం చేసే లోహ పదం కారాదు" న్యాయం చట్టం ఏదైనా ఏమైనా మనిషిలో జీవించే హక్కును మాత్రం నిరాకరించే కాఠిన్యం కూడదన్న భావం "మానవతా బంధాన్ని" నెలకొల్పేది. ఈ విషాద స్థితి – "కరుణలో ముంచి పైకి తీసి చూపుతున్న"ట్లుంది. ఎవరైనా సరే స్పందించే మానవీయ హృదయానికి భేదాల్లేవనే విశేషార్థాన్ని భావింపజేస్తూంది. ఏ సమాజమైన మనిషిపై గౌరవం, మానవతపై అభిలాష సంస్కార సమాజాన్ని శోభనిస్తాయి. "క్రాస్‌ఫైర్" సమాజంలో జాలి, కరుణ, సహనం, ఉదారత, ఏ విధంగా నలిగిపోయేదీ ఇరు పక్షాల్ని దృష్టిలో పెట్టుకొని వర్ణితమైంది. చివరకు "ఒక చేతిలో శాంతిపుష్పం, మరోచేతిలో ప్రజాస్వామ్య పతాకతో" దృశ్యం – అవతరించాలనే అకాంక్ష మానవతా బంధురమైంది.

"సీజ్ ఫైర్" కావ్యం నిఖిల మానవ శ్రేయోభావనతో సంపన్నమైంది. ఇందులో "పేరూ ఊరూ కలం మతం కన్నా, మనిషీ ప్రాణమూ జీవితం ముఖ్యం అన్న నిజం నిప్పులా వెలుగుతూంది! ట్రాన్స్‌పరెంట్ హృదయంతో" అన్న వాక్యం సమాజంలో ఏది ముఖ్యమో, మనిషికేది ప్రధానమో గమనించవచ్చు. ప్రాణం – హృదయం రెండూ అవసరం ప్రాణం భౌతిక రూపానికి అస్తిత్వాన్ని ఇస్తే హృదయం మానవ జీవితానికి సార్థకతనిస్తుంది. ఈ కావ్యంలో తరచుగా కన్పించే "గది" వివిధ సిద్ధాంతాలకూ ఆలోచనలకూ నిలయమైన మనస్సుకూ, "తెరచిన కిటికీ" బయటి నుండి వెలుగూ గాలివలె స్వేచ్ఛగా వచ్చే వివేక ప్రసారాన్నీ సూచిస్తాయి, మానవతా గంధాన్నీ, భావింపజేస్తాయి. "నేడు రేపు మధ్య ప్రకృతి వైపరీత్య ప్రభావరూపమైంది. ఈ కృతి తెలుగు స్వేచ్ఛాకవిత్వంలో మానవీయ భావనకు సంఘర్షణ మరియు విరామతలాలపై వైపరీత్యం బాధల స్థితులను ఎత్తిన ముఖాలుగా దర్శనమిస్తుంది.

ఈ రచన తెలుగు సాహిత్యంలో స్వేచ్ఛా కవిత్వంలో జాతీయ, అంతర్జాతీయ కోణాల సమీక్ష. ఆధునిక అవసరాలతోపాటు సమాజం పొందే అనేకమైన ఆలోచనల అనుభవాల చిత్రణంతో స్వాతంత్ర్యానంతరం తెలుగులో స్వేచ్ఛా కవిత్వం, ప్రజాస్వామ్యంలో ఏర్పడే అవకాశాల్ని పూర్తిగా వినియోగించుకుంది. దాని పర్యవసానమే ఈ వైవిధ్యం. స్వాతంత్ర్యానంతరం తెలుగు స్వేచ్ఛా కవిత్వం పొందిన విస్తృతి, లోతు, వైవిధ్యం యొక్క ప్రాతినిధ్యపూర్వక సమాలోచనమే ఈ ప్రయత్నం. జాతీయ, అంతర్జాతీయ, మానవీయ భావన దేనికది స్వేచ్ఛా కవిత్వంలో అధ్యయన యోగ్యతను పొందాయి. ఇవి రచనల్లో పరస్పర సహయోగాన్ని పొందాయి. ఒక్కో సందర్భంలో ఒక్కో నిష్పత్తిలో ఇవి రూపొందడం జరుగుతుంది. ప్రాధాన్య వివక్షచేత వర్గీకృతమవుతాయి. ఇవి తమ తమ ప్రత్యేకతలతో వస్తువు, ప్రేరణ, ప్రయోజనం దృష్ట్యా ఆకర్షిస్తాయి. ఈ విధంగా తెలుగులో స్వేచ్ఛా కవిత్వాన్ని వేరే వేరే కోణాల్లో చూచే అవకావాన్ని కలిగిస్తుంది. ఇది కవిత్వ సమాలోచనాన్ని వైవిధ్య విలసితం చేయడమే కాక, విశాలయుతమూ సంపన్మయమూ చేస్తుంది.

# స్వేచ్ఛా కవిత్వంలో వివిధ పార్శ్వాలు

# సమదర్శనం

### రెండో భాగం

## వివిధ పార్శ్వాలు

స్వేచ్ఛా కవిత్వంలో స్వాతంత్ర్యం తరువాత, దేశంలోను అంతర్జాతీయంగాను వచ్చిన మార్పుల్ని పురస్కరించుకొనీ, వాటి ప్రభావ పర్యవసానంగానూ, కొన్ని కవిత్వ పార్శ్వాలవతరించాయి. ఇవి దేశంలో నెలకొన్న ప్రజాస్వామ్య స్వరూపాన్ని సూచిస్తాయి. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛకు అవకాశం వీటి ఆవిర్భావానికీ, దారితీసింది. వికాసానికెంతో దోహదం చేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో అనివార్యమైన స్వేచ్ఛ లోపిస్తే, ఈ వైవిధ్యమింతగా కనిపించేది కాదు. వీటి వికాసమూ అంతంత మాత్రంగానే ఉండేది. వీటిలో కొన్నింటిలో ప్రయోజనాంశాల్లో సామ్యం చేత ఉమ్మడి లక్షణాలు కొన్ని కన్పించవచ్చు. విప్లవకవిత్వంలోను, దిగంబర కవిత్వంలోనూ, భౌతికత్వం, విధ్వంసకత్వం ఒక ఉమ్మడి లక్షణం. ఇంకా కొన్నింటిలో మానవతాభావం, మరికొన్నింటిలో ఇంకొన్నింటిలో ప్రగతిభావన, ఇట్లా అనేకం గమనించవచ్చు. మొత్తం మీద ఈ వైవిధ్యం స్వేచ్ఛాకవిత్వాన్ని సుసంపన్నం చేసిన మాట వాస్తవం. ఇది స్వేచ్ఛాకవిత్వం ఉపయోగితను భావింపజేస్తుంది.

దీన్ని విశ్లేషిస్తే సమాలోచనానికి నిలిచే పార్శ్వాలు సుమారు పది కన్పిస్తాయి. 1. అనుభూతి పార్శ్వం, 2. దిగంబర పార్శ్వం, 3. చేతనావర్త పార్శ్వం, 4. అభ్యుదయ పార్శ్వం, 5. విప్లవ పార్శ్వం, 6. సామ్యవాద కళాత్మక పార్శ్వం, 7. సమన్వయ పార్శ్వం, 8. ప్రజాస్వామ్య పార్శ్వం, 9. దళిత పార్శ్వం, 10. స్త్రీవాద పార్శ్వం.

# 1. అనుభూతి పార్శ్వం

ఇది వైయక్తికతలంపై అనుభూతి ప్రధానంగా రూపొందింది. కళాత్మకంగానో, మనోవిశ్లేషణగానో, అనుభూతి గుణంతో ప్రత్యేకతను కలిగింది. దీనిలో ఒక విధం, ప్రాధాన్య వివక్షచేత తాత్త్వికస్పర్శతో మానసిక ప్రపంచాన్ని బింబించేదిగా కన్పిస్తుంది. వేగుంట మోహనప్రసాద్ కవిత్వంలో దీన్ని గమనించవచ్చు. మనోభూమికతో మానసిక చిత్రణం కలిగింది. దీనికి ఇస్మాయిల్, కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ, అజంతా సుమనశ్రీ, ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, సౌభాగ్య మొదలైన కవుల కవిత్వంలో ఒక్కొక్క ప్రత్యేకతతో కన్పిస్తుంది. మరో విధం సాధారణమైన సామాజిక స్పర్శతో, కేవలం కాల్పనికమైన భావజగత్తును కలిగింది. దీనిలో స్పందనం వివిధ స్థాయిల్లో భావరూపం ఆధారంగా రూపొందుతుంది. బాలగంగాధర తిలక్ కవిత్వం స్థూలంగా ఈ విధానికి చెందిందిగా కన్పిస్తుంది. వైయక్తికతలం నుండి కళాత్మక రూపానికి ప్రాధాన్యం ఇచ్చే అనుభూతి సాంద్రత వల్ల ప్రత్యేకమైన ఆకర్షణ కలిగింది. ఈ కారణంగా భావకవిత్వచ్ఛాయలు కన్పిస్తాయి.

వైయక్తిక పార్శ్వంలో వ్యక్తి స్వేచ్ఛ కేంద్ర బిందువు. నిర్నిరోధమైన స్వేచ్ఛాగుణంతో భావరూపాలు సూక్ష్మదశల్లో అర్థాంతరాన్ని అనుభవంలోకి తెస్తాయి. పదపదంలో, వాక్యవాక్యంలో సాధారణేతరమైన అర్థస్ఫూర్తి అనుభూతమవుతుంది. ఒక్కొక్కపుడు మార్మికతనూ పొందడం జరుగుతుంది. జీవితంలో వాస్తవాంశం, సూత్రప్రాయంగానో స్పర్శామాత్రంగానో ఉంటుంది. అంతరమైన వేదన అనుభవానికి వస్తుంది. ఇది సమాజం గురించి కావచ్చు. వ్యక్తి జీవితంలోది కావచ్చు. మానసిక స్థితి గురించి కావచ్చు. కవుల వ్యక్తిత్వాలవల్ల వివిధ ప్రత్యేకతలతో ఒక్కొక్కరినుండి ఒక్కొక్క విధంగా, ఒకే కవిదయినప్పటికీ సమయసందర్భాల్నిబట్టి వైవిధ్యంతో ఆవిష్కృతం కావడం గమనించవచ్చు. తెలుగు స్వేచ్ఛాకవిత్వంలో అతినవ్యతను పొందిన సోపానక్రమంలో ఈ పార్శ్వం పేర్కోదగిందే కాక, ఇంకా విపులంగా సమాలోచన చేయదగింది. కొందరు ఒకటికన్న ఎక్కువ పార్శ్వాల్లో విశ్లేషణకందే కవిత్వం వ్రాసినవారూ ఉన్నారు.

అనుభూతి పార్శ్వంలో ఆధునిక జీవిత గమనంలో, యాంత్రిక వాతావరణానికి భిన్నంగా, కాల్పనిక వాతావరణం సృజింపబడుతుంది. మానసికమైన మూలరూపం గుర్తుకు వస్తుంది. రాజకీయధోరణులూ, సామాజిక స్థితిగతుల విశ్లేషణం, వాటి చిత్రణం కన్నా వైయక్తికమైన అనుభూతిదశలు కళాత్మకంగా మలచబడి కవితారూపం సిద్ధిస్తుంది. ఇందులో ఏకాంత ధోరణి సూత్రప్రాయంగా ఉండేమాట నిజమే. కాని ఇది వ్యక్తిలో బలహీనతలవల్ల ఏర్పడింది కాదు. సామాజికస్పృహ కూడా అంతో ఇంతో ఉంటుంది. అయితే ప్రధానమైన పాత్రను నిర్వహించదు.

ఈ కవుల దృష్టిలో, కవిత్వంలో ప్రధానమైన పాత్రను నిర్వహించే అంశాలు వేరు. సిద్ధాంతాలకూ, రాజకీయమైన, సామాజికమైన అభిప్రాయధోరణులకూ, భిన్నమైన ఆలోచనా రూపం కన్పిస్తుంది. మనోగతమైన అనుభూతి స్పందనతో భౌతికేతరలైన ప్రపంచంలోకి తీసుకెళ్ళే భావరూపనిర్మితి కన్పిస్తుంది. అజంతా మాటల్లో "సాహిత్యానికి సిద్ధాంతపరమైన కాలుష్యం అంటరాదు. ఈ సిద్ధాంతం ఏ సామాజిక, రాజకీయ సాహిత్య మార్గాలకు చెందిందైనా కావచ్చు. ఈ పార్శ్వం, కవిలో ప్రసరించే స్వేచ్ఛను పురస్కరించుకొని ప్రవృత్తమైంది. వ్యక్తిగతమైన అనుభూతి ప్రపంచం సాధారణీకృతమై, రచనలో విశ్వజనీనత్వాన్ని పొందుతూంది. మనిషీ, ప్రకృతితో స్పందన అనుభూతిగుణంతో పాటు సౌందర్యభావన ఇందులో కళాత్మకతను పొందుతుంది. సృజనరూపం, వేదన, చింతన అంచుల్ని స్పృశిస్తుంది. ఒక్కొక్క అనుభూతి కవిలో ఒక్కొక్కవిధంగా ఆవిష్కృతం కావడం సహజం. ఈ కవుల్లో ఆత్మప్రత్యయంతోపాటు, తమ అస్తిత్వం పట్ల శ్రద్ధ కూడా కన్పిస్తుంది. కొందరు కవుల వ్యక్తిత్వాల్లో వైయక్తిక పార్శ్వంతో పాటు, సామాజిక పార్శ్వమూ లేకపోలేదు. అయితే వైయక్తిక ప్రభావం సామాజిక పార్శ్వాన్ని కప్పేస్తుంది. బాల గంగాధర్ వ్రాసిన కొన్ని రచనల్లో సామాజిక పార్శ్వం స్ఫుటత్వాన్ని పొందడమూ కన్పిస్తుంది.

ఈ కవుల్లో మొత్తం మీద వస్తువుపై కన్నా దాని విస్తరణరూపంపై కన్నా అభివ్యక్తిపై మనోజగత్తుపై శ్రద్ధ గమనించవచ్చు. శబ్దార్థ ప్రపంచం నుండి, భావనారూపం వరకూ అనుభూతి ప్రత్యేకతను కలిగి ఉంటుంది. వ్యక్తి చైతన్యం రెండు దిశలుగా

ప్రసరిస్తుంది. ఒకటి బహిర్ముఖం, రెండు అంతర్ముఖం. అయితే, ఈ కవిత్వంలో అంతర్ముఖం రూపుదిద్దుకుంటుంది. జీవితంలో సమస్యను భౌతికేతర దృష్టితో పరిశీలిస్తుంది. ఆదర్శం మానసిక స్థాయిలో అనుభూతిగతంగా నిలుస్తుంది. కొన్నిటిలో ప్రకృతిని భూమికగా చేసుకున్న జీవిత చిత్రణం కనిపిస్తుంది. కొన్నిటిలో ప్రకృతిని భూమికగా చేసుకున్న జీవిత చిత్రణం కనిపిస్తుంది. కొన్నిటిలో సంస్కరణమూ, జాతీయవాదమూ జోడింపబడి కాల్పనిక కవిత్వచ్ఛాయల్ని స్మరింపజేస్తుంది. కొన్నిటిలో జీవితంలో మానసికమైన బాధ, చింతన, వేదన, విషాదముద్రలతో చిత్రపరంపర దృష్టికి వస్తుంది. కేవలం "కళ కళకోసమే" అన్న వాదానికీ దీనికీ సంబంధం లేదు. తెలుగులో ఈ కవిత్వంలో మనస్తత్వ చిత్రణం, సౌందర్యభావన, కళాదృక్పథం, మానవతాస్పృహ మొదలైన వివిధాంశాల మేళనంతో రూపొందిన వైవిధ్యంతో ఈ కవుల ప్రత్యేకతల కద్దం పడుతూంది. స్థిరమైన అస్తిత్వమూలాన్ని భావింపజేస్తూంది. మొదట్లో ప్రయోగాత్మకాలుగా కన్పించినా, ఆ తరువాత కవుల ప్రతిభచేత ఒక పరంపరగా ఏర్పడింది.

వ్యక్తి స్వేచ్ఛ కీలకమైన పాత్ర వహించే ఈ కవిత్వంలో భావరూపం ఒక ఆకర్షణ. అభివ్యక్తిలో మానసిక ప్రపంచం విశ్లేషితమవుతుంది. బింబితమవుతుంది. చిత్రితమవుతుంది. వివృతమవుతుంది. ఆధునిక కవిత్వంలో ఈ ధోరణి అంతరమైన రూపాన్ని సంతరింపజేసింది. మనస్తత్వశాస్త్రానికీ కళాసౌందర్యశాస్త్రానికి పని కల్పించింది. వేగుంట మోహనప్రసాద్ 'చితి – చింత', 'రహస్తంత్రి' మొదలైనవి జ్ఞాపకం వస్తాయి. 'ఎక్కడ మాత్రమేముంది? హృదయం లేని పర్వతాలూ, నదులూ, అరణ్యాలూ,' సమాజంలో నెలకొన్న దుస్థితి ప్రకృతిపరమైన దృశ్యభూమికలో సూచితం. తాత్త్వికస్పర్శనూ కలిగింది. "ఈ ఆనందాలు నాకోసం కాదు". వ్యక్తిస్థాయి నుండి సామాజిక వలయాన్ని స్పృశిస్తూ విశ్వజనీనస్థాయిని భావింపజేస్తూంది. ఒక్కొక్కప్పుడు ఈ కవిత్వం మార్మికతను పొందుతుంది. వాస్తవరేఖ మరొకపుడు తాత్త్వికస్పర్శతో ఉన్నతీకృతమవుతుంది. ఆంతరమైన అన్వేషణ కన్పిస్తుంది. ఈ కారణంగా అస్పష్టతకు అవకాశం ఏర్పడుతూంది కూడా. స్వప్నం లేదా స్వప్నతుల్యమైన స్థితుల్లో దు:ఖం,

సంతోషం, నిరాశ, ఆశ, వేదన, శాంతి ఇట్లా విడివిడిగానూ, సంకీర్ణంగానూ మానసికస్థితులెదురౌతాయి. వస్తువు కన్నా శక్తి వంతమైన భావం, భావం కన్నా భౌతికేతరమైన స్థితి అనుభూతికి వస్తుంది. అక్కడక్కడా ఇది అధివాస్తవికధోరణికి సమీపంగానూ వర్తిస్తుంది. ఇది ప్రతీక, భావరూపం సహాయంతో కళాత్మకతను పొందడమూ కన్పిస్తుంది. ఈనాటి సమాజంలో ఎదురయ్యే భౌతిక జీవనసంక్లిష్టతను ప్రతిఫలిస్తూ, వ్యక్తిలోని తాత్త్వికతను స్పృశిస్తూ, వ్యక్తిస్వేచ్ఛకు పట్టంగట్టే అస్తిత్వకళాత్మకమైన అనుభూతి పార్శ్వం, వేగుంట రచనల్లో ఆలోచన కందుతుంది.

ఇస్మాయిల్ 'చెట్టు నా ఆదర్శం', 'మృత్యువృక్షం', 'చిలుకలు వాలిన చెట్టు', 'రాత్రివచ్చిన రహస్యపువాన', 'బాల్చిలో చంద్రుడు' కృతులు, అనుభూతి పార్శ్వంలో రెండో విధానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. సత్యశ్రీమన్నారాయణ, సుమనశ్రీ, సౌభాగ్య, శ్రీకాంతశర్మ, గోదావరిశర్మ మొదలైన కవులీ మార్గంలో తమతమ ప్రత్యేకతలతో ఎదురౌతారు. వీరి కవిత్వంలో మానసిక ప్రపంచం, ప్రకృతిపరమైన భౌమికలో, సుకుమారమైన భావస్పందనలతో సాక్షాత్కరిస్తుంది. ఇది వీరు పుట్టి పెరిగిన వాతావరణాన్ని విశ్లేషణలో తలపుకు తెస్తుంది. బాహ్యాజగత్తులోని జీవనవాస్తవం వెనుకనుండి, తాత్త్విక రేఖలు అవగతికి వస్తాయి. ఇస్మాయిల్, 'నాకు కావలసింది హృదయస్పర్శి అయిన కవిత్వం, ఇది ఎవరు వ్రాసినా ఆనందిస్తాను. నాకు మార్క్సిజంపై కోపం లేదు' – ఈ కవి మాటలు, సహనాన్నీ ఆత్మప్రత్యయాన్ని సూచిస్తాయి. ఇది ప్రజాస్వామ్యానికనుగుణమైన వ్యక్తిత్వాన్ని బింబిస్తుంది. సాధారణతలం నుండి పైకెదిగిన మానసిక శిఖర రూపం ఈ కవుల్లో దర్శనమిస్తుంది. ఇక ఇస్మాయిల్ కవిత్వానికి వస్తే, "గడియేని ఆగని సూర్యుణ్ణి గడియారపు బాహువులు బంధిస్తాయి/ దివిలో ఊగే విహంగాన్నీ, భువిలోపాకే పురుగు బంధిస్తుంది/ ఈ మనిషి ఆ మనిషిని బంధిస్తాడు, ఇవన్నీ కలిపి బంధిస్తుంది మనీష' ఈ భావ చిత్ర పరంపర కాలాన్నీ, జీవనగమనాన్నీ, స్వేచ్ఛనూ, దాని పరిమితుల్నీ రూపిస్తూ మనిషి విశిష్టతనూ 'మనీష' ప్రాముఖ్యాన్నీ ప్రకటిస్తుంది. సూర్యుడు కాలానికి సంకేతం. కాలం ఆగేది కాదు. కాని వ్యవహారదశలో గడియారం ముళ్ళు దీన్ని నిలిపేస్తాయి. ఆకాశంలో పక్షి ఎంత

ఎత్తులో, ఎంతసేపు ఎగిరినా ఆహారంకై నేలపైకి రావలసిందే, విశ్రాంతికై క్రిందికి దిగవలసిందే. తన ఇష్టంతో నిమిత్తం లేకుండానే కాలం నిలపబడుతుంది, అవసరాలకు పక్షి క్రిందికి దిగక తప్పదు. ఎన్నో పరిమితులు కలిగిన వాస్తవరేఖపైకి రాక తప్పదు. అయితే మనిషిలో 'మనీష' పరిధి దీనికన్న విస్తృతమయింది. ఇట్లా కొన్ని అంతరువుల పరంపరతో, భావన, తాత్త్వికస్పర్శనను పొందుతూంది. స్థూలంగా జీవనరూపం వస్తువుగా మెదలుతుంది. అమూర్తస్థితి నుండి మూర్తస్థితికి తీసుకొని రావడంలో కవి ప్రత్యేకత ఉంది.

ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛా మనోజగత్తుకు ప్రతీక అజంతా కవిత్వం. ఈ విధమైన కవిత్వంలో కేంద్రభూమి జీవితంలో విషమగతులకూ, అశాంతి స్థితులకూ స్పందించే మానసిక ప్రపంచం. ఇది జీవితంలో బాధ, భయం, దు:ఖం, వేదన, అశాంతి, ఆలోచనలను సంబంధించిన రేఖపై నిలుస్తుంది. విషాదస్థితి నుండి శబ్దతరంగాలు ప్రసరిస్తాయి. ఇది ఆధునిక జీవితంలో అశాంతినీ, ఆవేదననూ ప్రతిఫలింపజేస్తూంది. 'బాధలో, దు:ఖంలో మండుతున్న గాయాలవలె ఉంటానంటాడు' కవి. ఇతని చుట్టూ కన్నీళ్ళతో మెరుస్తూన్న మనుషులు కన్పిస్తారు.

కవిత్వాన్ని ఒక స్వప్న క్రియగా, రహస్యక్రీడగా, మర్మక్రీడగా భావించే మనోరూప కవి అజంతా. ఇతని కృతి 'స్వప్నలిపి' మనోగర్భం నుండి ఉద్గమించింది. అంతర్జగత్తులోని రహస్యరూపాల్ని ఆవిష్కరిస్తుంది. ఇది అధివాస్తవకగుణంతోను చిత్రితమై కనిపిస్తుంది. తాత్త్వికస్పర్శతో ఉన్నతమై, అందని జీవితాన్ని భావింపజేస్తుంది. ఈ కవిత్వానికి ఒక చివర నుండి జీవిత వాస్తవరూపం, మరో చివర నుండి జీవిత రహస్య రూపం నెలకొన్నాయి. ఇది నైరూప్యంగా ఆకర్షిస్తుంది. ఇవి ఒక చోట కలిసిన రూపం అనుభూతి పార్శ్వం, ప్రత్యేకతను కలిగింది. భౌతిక స్థితి వెనుక నుండి మనోదర్శనానికి ప్రాధాన్యమివ్వడం ఇందులోని ప్రత్యేకత అనవచ్చు. ఇదో కొత్తలోకంగా అనుభవానికి వస్తుంది. ఎప్పటికప్పుడు అడుగడుగునా అగమ్యంగా, అస్పష్టంగా, అగోచరంగా, అర్థరహితంగా, అజేయంగా కన్పించే జీవితాన్ని, మానసికమైన మెరుపు తీగెల వెలుగులో దర్శింపజేయడం ఇందులో విశేషం. ప్రతి మనిషిలో తన్ను అద్దంలో బింబంలా

చూచుకోవడం ఈ కవికి మరీ ఇష్టం. ఇది సార్వజనీనమైన మానవదృక్పథంవైపు మరలిస్తుంది. 'చెట్లు కూలుతున్న దృశ్యంలో ఆశ లేదు, ఆస్కారం లేదు. ఫలానా రోడ్డు గమ్యం చేరుస్తుందనే సూచన ఎక్కడా కన్పించడంలేదు'. నిరుద్యోగి వెంకటరావు నడుస్తూన్నంతమేర అందమైన సాయంత్రం వేళ, నగరం అంతటా అపస్వరాలు, చెట్లు కూలుతున్న దృశ్యాలు కన్పిస్తాయి.

ఇందులో ఆధునిక జీవితం వ్యంగ్యగర్భితంగా చిత్రితమైంది. వాస్తవానుభవానికి కవితాత్మకమైన భావరూపాలు జోడింపబడినాయి. ఇది బాధతో, విషాదంతో అలముకున్న యథార్థ ప్రపంచం. అజంతా కవిత్వం, దైనందిన జీవితంలో విషాద భీభత్సాల్ని చిత్రిస్తుంది. ఇది మానసికమైన భావవిన్యాసంతో అనుభూతి ప్రకంపనల్ని సృజించే శక్తి కలిగింది. ఇందులో, ఎడారిలో ఒంటరిమనిషే కన్పిస్తాడు. దు:ఖంలో మండుతున్న గాయం కన్పిస్తుంది. పతితుల ఆక్రందనమూ వినిపిస్తుంది. అంతటో ఎట్టెదురుగా ప్రేమతో పైకి లేవనెత్తే కారుణ్యహస్తమూ కన్పిస్తుంది. ఇది విశ్వమానవరేఖలతో మనిషి బలహీనతల వెనుక నుండి బలమైనరూపమూ స్ఫురిస్తుంది. చివరి లక్ష్యం ఆర్ద్రత, అనురాగం, అన్వేషణ, శాంతి, ప్రేమ ఆనందంగా పర్యవసించడం కన్పిస్తుంది. కవి సృజనశక్తిలో నిర్మాణాత్మక రక్తినీ స్ఫూర్తికి తెస్తుంది.

ఇంద్రగంటి శ్రీకాంతశర్మ మనస్సు 'రంగులచేప లోకపు ఉపరితలంపైకి మక్కువగా గిరికీలు కొట్టబోతే వాస్తవికత వలమీద పడుతుంది'. జీవితంలో తప్పించుకోరాని యథార్థానుభవం చిత్రితం. చేపకు చిరనివాసం జలం. ఇది సరస్సు కావచ్చు, నది కావచ్చు, సముద్రం కావచ్చు. అది అనుభూతిలో అస్తిత్వరూపానికి ప్రతీక. సుమనశ్రీ, 'నా కవితాసామగ్రి అంతా ఒక మేఘశకలంలో నిక్షిప్తమై ఉంది' అంటాడు. మేఘశకలం ఆర్ద్రమైన, చైతన్యకారణమైన గతిశీలానికీ, గగనం మనోరూపానికీ ప్రతీకలు. ఈయన కవిత్వంలో అప్పుడపుడు అవచేతనలో పడియున్న వస్తువుల్ని పైకి తీసి చూపడమూ కన్పిస్తుంది. ఇది స్వప్నం లేదా స్వప్నతుల్యమైన స్థితినీ పొంది ఉండడం కద్దు. సుమనశ్రీ విశిష్టమైన కృతి 'మహాస్వప్న', స్వేచ్ఛాకవిత్వంలో అనితరమైంది. ఇది స్త్రీభావన కేంద్రంగా, సౌందర్యం, వివశత్వం, రహస్యం, అద్భుతమనే

దృక్కోణాల్లో దర్శితమైన అనుభూతికావ్యం. ఇందులో భౌతికమైన మూర్తి తలం నుండి ఎగసి విస్తరించిన అనుభూతి పరంపర ఆవిష్కృతమైంది. భౌతికం, మానసికం, ఆత్మతలాలపై ఒక వలయం నుండి మరో వలయంలోకి భ్రమిస్తూ సాగింది. ఇది జీవితంలో వాస్తవ స్పర్శతో, కళారూపంతో, తాత్త్వికచ్ఛాయతో ప్రత్యేకతను పొందింది. పై మూడు తలాలపై స్త్రీ భావన ఒక దాని నుండి మరొకటి ఉన్నతీకృతమైంది. ఇందులో మనిషితో మనిషి చేసే ఆత్మ సంభాషణ మనస్సు లోతుల్ని స్పృశిస్తుంది. వైయక్తిక పార్శ్వంలోని సౌందర్యానుభవం, సాధారణీకృతమై విశ్వజనీనత్వాన్ని పొందుతూంది. 'నేత్రం నా సంకేతం', 'రెప్పల మధ్య ఆకాశం' పేర్కొనదగినవి. నేత్రం నా సంకేతం – లో నేత్రం, అసాధారణమైన వస్తు ప్రపంచాన్ని సమీపానికి తెచ్చే అనుభవ సాధనం. చెదరిపోతున్న మనసులోనుండి కరగిపోతూన్న మనిషిలో నుండి 'నిశ్శబ్దంలోకి ప్రవహింపజేసే' స్వప్నపరిమళ సరోరూపం మహాస్వప్న కావ్యం.

కొత్తపల్లి సత్యశ్రీమన్నారాయణ 'వెలుతురు పిట్టలు'; వై. శ్రీరాములు 'రంగులపక్షి' ఈ సందర్భంలో పేర్కొనదగినవి. వీటిలో ప్రతీకల వినియోగంతో నిర్మించిన అస్తిత్వంలో జీవితం దర్శితమైంది. ప్రకృతిపరమైన భూమికపై నిర్వహింపబడిన వస్తువు భావ రూపాల ప్రతీకల పరంపరలో వ్యాప్తమైంది. అనుభూతి కవిత్వంలో ఈ కృతులు రెండూ మైలురాళ్ళు. 'వెలుతురుపిట్టలు'లో 'అడవి, ఆకాశం, చెరువు ఒక దాని సౌందర్యం ఒకటి ఆస్వాదిస్తాయి'. ప్రకృతిపరమైన మూడు అంశాలు పరస్పర ప్రభావంతో ఏకరూపాన్ని పొంది, సౌందర్యానుభూతి కలిగిస్తాయి. 'నీటి ఆవిరిలా కొందరు పైకి లేస్తుంటారు. వర్షపుచినుకులా కొందరు కిందపడుతూంటారు'. ఇవి మనిషి పొందే ఉత్థానమూ, పతనమూ ప్రకృతిలోని సాదృశ్య రూపాలతో సూచించే పద చిత్రాల్లో జీవితంలో భిన్న దశలూ స్ఫూర్తికి వస్తాయి. 'పైకిలేస్తున్నా, పతనమవుతున్నా, గుండెలోంచి అద్భుతమైన పాట బయటికి వస్తుంది'. జీవితంలో ఎటువంటి అనివార్య పరిస్థితులైనా ఎదుర్కొనే, అన్నింటినీ సమంగా తీసుకొనే, మనోరూపం పొందే అనుభూతి విశేషమే ఈ పాట. అనుభూతి పార్శ్వంలో కవిత్వం, అందరిలో ఒకే విధంగా ఉండదు. ఇది సహజం కూడా. ఇది వాళ్ళ సృజనాత్మక శక్తినీ, అభివ్యక్తి శిల్పాన్నీ, ముఖ్యంగా

జీవితాన్ని దర్శించే మానసిక వ్యక్తిత్వాన్ని బట్టీ భేదిస్తుంది. కవిత్వంలో వివిధాంశాలకిచ్చే ప్రాధాన్యాన్ని బట్టీ రూపొందుతుంది. భావకవిత్వానికీ, అనుభూతి కవిత్వానికీ తేడా వుంది. భావకవిత్వం ఆత్మాశ్రయం, కాల్పనికం. అనుభూతి కవిత్వంలో మానవీయ స్పందనంతో పాటు మానసిక చిత్రణంతో, ప్రతీకలతో రంజితమౌతుంది. అంతర్ముఖీనమైందీ, తాత్త్విక స్పర్శనను కలిగిందీ. ఇందులో సమాజం విస్మృతం కాదు. ఇది స్థూలమైన ఆకృతిరూపం మాత్రమే. తెలుగులో, ప్రజాస్వామ్యంలోని మానసిక స్వేచ్ఛ పొందిన కళారూపమే అనుభూతి పార్శ్వం. వెలుతురుతోపాటు చీకటినీ ప్రేమిస్తుంది. ఇది వ్యక్తి అస్తిత్వ మూలంగా వికాసరూపాన్ని పొందింది.

తిలక్ 'అమృతం కురిసిన రాత్రి' ఈ సందర్భంలో ప్రత్యేకంగా మనముందు నిలుస్తుంది. తిలక్ మానసికంగా అనుభూతివాది, సామాజికంగా మానవతావాది. 'నేనో మరి సమాజంలో స్థూలమైన ఆకృతిని ఊహా మరుత్తుని, ఏకాకిని' – ఇందులో ఏకాంతధోరణి ఉంది. దీనితోపాటు స్థూలతలంపై సామాజికావగాహన ఉంది. ఈతని కవిత్వం అస్తిత్వవాద ఛాయలతో భావకవిత్వ స్పందనలతో ఆకర్షిస్తుంది. కవిత్వ ప్రయోజనాన్ని గురించి చెబుతూ 'అగ్నిచల్లినా అమృతం కురిసినా అందం ఆనందం దాని పరమావధి' అంటాడు. ఇందులో కళాత్మకమైన అనుభూతి పార్శ్వం స్పష్టం. మధ్యమధ్య, ముఖ్యంగా చివరిదశలో వెలువడిన రచనల్లో గాఢమైన సౌందర్యభావనతో పాటు సామాజికదృష్టి చోటు చేసుకుంది. ఇది మానవీయమైన విలువల్ని ప్రతిపాదిస్తుంది. 'నా అక్షరాలు ప్రజాశక్తులు వహించే విజయ ఐరావతాలు, వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడ పిల్లలు'. ఇందులో స్థూలమైన సామాజిక తత్పరత ఉంది. సౌందర్యభావన ఉంది. ఈ రెండూ అనుభూతిగుణంతో కళాత్మకతను పొంది శైలీరామణీయతతో ఆకర్షిస్తాయి.

దీన్ని మరోవిధంగా సాధారణీకృతం చేస్తే తిలక్ కవిత్వంలో రెండు పార్శ్వాలు 1) కాల్పనికం, 2) సామాజికం కన్పిస్తాయి. మొదటిదానికి 'అమృతం కురిసిన రాత్రి', 'నువ్వు లేక నీ పాట ఉంది', రెండోదానికి 'ఆర్తగీతం', 'ప్రార్థన', 'గొంగళీపురుగులు', 'తపాలాబంట్రోతు' మొదలైనవి నిలుస్తాయి. ఈ రెండో విధానికి చెందినవి, ప్రగతిశీల

గుణంతో కూడిన మానవీయ చేతన కలిగినవి. కవి సామాజిక స్పృహకు ప్రాతినిధ్యం వహిస్తాయి. 'నా కవిత్వం కాదొక తత్త్వం మరికాదు మీరనుకునే మనస్తత్వం, కాదు ధనికవాదం, సామ్యవాదం; కాదయ్యా, అయోమయం, జరామయం' ఇట్లా వాదాలకూ, వివాదాలకూ, సిద్ధాంతాలకూ, తత్త్వాలకూ, ధోరణులకూ అతీతమైన అస్తిత్వాన్ని భావింపజేస్తుంది. ఈయన కవిత్వంలో ఆర్తి, బాధ, కరుణ, రసప్లావితంగా హృదయాన్ని స్పృశిస్తుంది. 'వర్ణ వర్గ మతభేద రాహిత్యం పునాదిగా' భావనా స్వాతంత్ర్యం, వ్యక్తిగౌరవం ప్రధానంగా ప్రజాస్వామ్యంలోని స్వేచ్ఛా సమానత్వాల్ని ఆకాంక్షించిన వైఖరి, తిలక్ అనుభూతి పార్శ్వానికాలంబమైన సామాజిక తలాన్ని భావింపజేస్తుంది. వ్యక్తి స్వేచ్ఛ పట్ల ఆదరంతో మానవతను ప్రకాశమానం చేస్తూ కళాత్మకమైన తిలక్ అనుభూతి పార్శ్వం, స్వేచ్ఛాకవిత్వానికి ఎనలేని ప్రతిష్ఠను చేకూర్చింది. అక్కడక్కడా కాల్పనికయుగానికి చెందిన భాష, శైలి, మర్యాద కన్పిస్తుంది. ఈయన కవిత్వం చిరంగా గుర్తుపెట్టుకోదగిందేకాక, స్థిరంగా నిలిచి ఉండేది. ఉదాత్తమైన స్థాయిలో అనుభూతి పార్శ్వంలో విశిష్టమైందీ, స్వేచ్ఛా కవిత్వానికి కీర్తికిరీటంగా వెలిసిందీ, మానవతా భావనతో కారుణ్యగుణంతో, అంతర్జాతీయ దృష్టితో కూడిన వ్యక్తిత్వం అనుభూతి హృదయానికి ప్రయోజన విస్తృతిని కలిగించింది. ఇదీ గొప్ప కవిలో అనుభూతి పార్శ్వంలో ప్రత్యేకంగా పేర్కోదగిన అంశం. ఇది స్వేచ్ఛాకవిత్వంలో అనుభూతి పార్శ్వానికి వైవిధ్యాన్ని చేకూరుస్తుంది.

స్వేచ్ఛా కవిత్వంలో అనుభూతి పార్శ్వం, సమాజ వలయంలో వ్యక్తి బీజం నుండి ఉద్గమించింది. కాల్పనిక కళా తాత్త్విక మనోభావప్రపంచాల్ని దర్శింపజేస్తుంది. స్వేచ్ఛా కవిత్వంలో ఆకర్షణీయమైన పార్శ్వంగా స్థిరపడింది.

# 2. అభ్యుదయ పార్శ్వం

## మార్పు పథం - 1

ప్రధానంగా మార్పు సిద్ధాంతం పట్ల నిబద్ధతతో సమసమాజ లక్ష్యంతో చారిత్రక క్రమంలో అవతరించిన సామ్యవాద కవిత్వం 1) అభ్యుదయ 2) ఉగ్రవాద పార్శ్వాలుగా విశ్లేషణకందుతుంది. ఈ రెండింటి భావస్థానాలు ఒకటే. కాలాంతరాన చారిత్రకావసరాల్ని బట్టి అభ్యుదయ కవిత్వానంతర పరిణామంగా, ఉగ్రవాద కవిత్వం క్రియాత్మకమైన పాత్రను నిర్వహించింది. ఈ రెండింటిని కలిపి పరిశీలించడంలో సిద్ధాంతపరంగా సౌలభ్యం ఉంది. కాలాంతరాన ఆచరణ ముఖంలో మానసిక రూపంలో మాత్రమే భేదం ఉంది. ఇది ఉగ్రవాద కవిత్వంలో శ్రీశ్రీ మాటల్లో "ఆగ్రహోదగ్ర" మూర్తిత్వాన్ని పొందింది.

అభ్యుదయ పార్శ్వం తెలుగు కవిత్వానికీ వస్తే ప్రగతి శక్తులకు వేదికగా ఆరంభమైంది. 'భౌతిక శక్తులపై విశ్వాసంతో, మార్పు గతి చారిత్రక భౌతిక వాదంపై ప్రత్యయంతో, ఆదర్శాన్ని కలిగింది. ఏది ఎట్లా ఉన్నా హేతుదృష్టిలో సమాజంలో మార్పుకు సహకరించిన మాట వాస్తవం. ఇంతకుముందు కొందరు మహనీయుల సంస్కరణ పరివర్తనల్ని తగిన చర్యల్ని వేగవంతం చేసిన మాట కూడ నిజం. అందువల్ల సమాజం పైన సాహిత్యం పైన అందునా కవిత్వంలో దీని ప్రభావాన్ని విస్మరించడానికి వీల్లేదు.

1962-64 నుండి కమ్యూనిష్టు ఉద్యమంలో వచ్చిన చీలిక, మార్పు సామ్యవాద సిద్ధాంతాన్ని విశ్వసించే సమాజంలో, ప్రస్తుత సందర్భంలో సాహిత్య ప్రపంచంలో భిన్న మార్గాలకు దారితీసింది. స్థూలంగా సాహిత్యపరంగా ఒకటి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం ఉందీ, రెండోది పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం లేనిది, వ్యతిరేకతను తీవ్రతరం చేసే ఉద్యమోపేతమైందీ. దీని పరిణామభాగం ఉగ్రవాద నక్సలైట్ రూపంగాను విశ్లేషణ కందుతుంది. మావో ఆలోచనా విధానాన్ని అవలంబించింది. రాజకీయ శక్తులకు దేశీయ సాంస్కృతిక విప్లవాన్ని అనుసందించింది. కాలక్రమంలో మొదటిది అభ్యుదయ పార్శ్వంగా

నిలిచింది. సిద్ధాంత బలంతో నిరంకుశ వైఖరుల్ని ఫ్యూడల్ విధానాల్ని వ్యతిరేకించింది. శ్రామిక శ్రేయస్సు ప్రధానంగా ఉందీ. శ్రామిక రాజ్యాన్ని చివరి లక్ష్యంగా కోరేదీ, సామాన్యుల మధ్యతరగతి ప్రజల సమస్యలపట్ల సానుభూతి కలిగిందీ, సమస్యల పరిష్కార పద్ధతిలో ప్రజాస్వామ్యయుతంగా పోరాటాన్ని నిర్వహించే ప్రణాళిక కలిగిందీ. మార్పు సిద్ధాంతాల పట్ల విశ్వాసం నిబద్ధత స్పష్టంగా రచనల్లో కన్పిస్తాయి.

స్వాతంత్ర్యానంతరం, అభ్యుదయ పార్శ్వంలో శ్రీశ్రీ ఆరుద్ర, సోమసుందర్ తరువాత పేర్కోదగిన నయాగరా కవి కుందుర్తి, ఫ్రీవెర్స్‌ఫ్రెంట్ వ్యవస్థాపకుడూ, 'వచన కవిత్వం' పేరుతో స్వేచ్ఛాకవిత్వాన్ని ప్రచారం చేసి, దాని బహుముఖ వికాసానికి కృషి చేసాడు. అటు సంప్రదాయంలో విలువల్ని గుర్తిస్తూ ఇటు సామ్యవాద ప్రభావాన్ని మన్నిస్తూ, సమన్వయ వ్యక్తిత్వంతో నాయకత్వం వహించడం స్థూలంగా ప్రజాస్వామ్యంలో విశ్వాసమున్న వారందరికీ ఆమోదయోగ్యమైంది. అయితే ప్రజాస్వామ్యం పేరిట సాగే చెడురీతుల్నీ అవకతవకల్నీ ఎండగట్టక పోలేదు. సామాన్యుల మధ్య తరగతి ప్రజల సమాజంలో మంచీ నీతీ న్యాయమూ ముందుచూపూ గెలుస్తాయనే ఈ కవి విశ్వాసం.

సామ్యవాద భావనతో ఇప్పుడున్న బాధల్లో నుండి ప్రజలు బయట పడతారనే ఆశ ఉంది. "చీకటి లోయల్లో చిందులు తొక్కే చంద్రుడు గెలవడు, ఏనాటికైనా పర్వతాగ్రాల మీద మెరసే లోక బంధువే గెలుస్తాడు" అంటాడు. చీకటి చెడుకీ, చంద్రుడు స్వత:కాకుండా పరోక్షంగా మరోవిధంగా సంక్రమించిన తాత్కాలికమైన ప్రభావ కాంతికీ సంకేతాలు. లోకానికంటే ప్రజలకు బంధువైన శక్తి సూర్యుడు, స్వయంప్రకాశం కలిగిన సహజమైన ప్రభావ కాంతికి సంకేతం. ప్రకృతినిష్ఠంగా భావచిత్రం రూపొందింది. కుందుర్తి కవిత్వంలో దైనందిన జీవితంలో సామాన్యులు పడే కష్టాలూ బాధలూ సహజమైన వాస్తవ చిత్రాలుగా కన్పిస్తాయి. "ఫ్రీ వెర్స్ ఫ్రంట్" పేరుతో వేదికను ఆరంభించి, దీని అస్తిత్వానికై జనుల ఆమోదంకై అహరహం కృషి చేసిన మనీషి. వచన కవితాపితామహుడుగా గౌరవస్థానాన్ని పొందడం సముచితంగా ఉంది. కవిత్వంలో బాహ్యమైన ఆకర్షణల కన్నా జీవవంతమైన స్పర్శతో సామాజిక చిత్రణకు ప్రాముఖ్యం ఉంది. జీవితంలో ఎదురయ్యే వాస్తవ స్థితిగతుల్ని సామ్యవాద దృక్పథంతో ఆలోచించి స్పష్టంగా ఆవిష్కరించడం ఈయన ప్రత్యేకత. శ్రీశ్రీ అభ్యుదయ

కవిత్వ ప్రభావం నుండి బయటపడి తనదైన వ్యక్తిత్వాన్ని పొందిన కవి. సూటిదనాన్నీ సహజత్వాన్నీ అక్కడక్కడా వ్యంగ్యశోభనూ కలిగిన కవిత్వం, సమాజంలో వివిధ స్థాయిల్లోని సహృదయుల మెప్పును పొందింది. అభిప్రాయ భేదాల్ని మన్నించే సహజగుణంతో సంప్రదాయ మార్గాన్ని గౌరవిస్తూ, గతంలోంచి సమాజానికవసరమైన విలువల్ని స్వీకరిస్తూ, భవిష్యత్తుపై లక్ష్యంతో, వర్తమాన స్థితిగతులకనివార్యమైన చర్యల్ని విశ్వసిస్తూ, ప్రగతిపథంలో సాగిన ప్రయాణం స్వేచ్ఛాకవిత్వంలో అనితరమైంది. పెద్దల్ని అంగీకరింపజేసింది, యువకుల్ని ఆకర్షించింది. వాస్తవికత స్పష్టత ముఖ్యమనీ, ఈ లక్షణం కవిత్వాన్ని ప్రజలకు చేరువగా వర్తింపజేస్తుందని ఈయన అభిప్రాయం.

"కూచొని తినే వారంటే, లోకం మారదని చెప్పేవారంటే, నాకు మంట" అని తనలో నిగూఢమైన కోపాన్ని ప్రదర్శిస్తాడు. ఈ కోపం సమాజశ్రేయస్సును కోరేది, ప్రజల బాధల్ని కష్టాల్ని తీర్చే ఉద్దేశం కలిగింది. సమాజంలో పనిచేసేవాళ్ళూ, శ్రామికులూ, పీడితులూ వీరి కెదురుగా పనిచేయనివాళ్ళూ సంపన్నులూ పీడకులూ ఉన్నారు. ఈ వర్గభేదాన్ని దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపుమాపే ఉద్దేశంలో ప్రగతిభావన సమసమాజ స్థాపన లక్ష్యంతో వర్తిల్లింది.

తెలంగాణా, యుగేయుగే మొదలైన కృతుల్లో సామాన్య జనజీవన స్పందనం చిత్రణం ప్రధానంగా సాక్షాత్కరిస్తుంది. కవిత్వాన్ని ప్రజల దగ్గరికి తీసుకొని వెళ్ళాలనే ఉత్సుకతతోపాటు వారి సమస్యల పట్ల అవగాహనను దృష్టిలో పెట్టుకొని గోపీచంద్, "శ్రీశ్రీ బుజాలపై నుండి లోకాన్ని పరికించే కవి"గా కుందుర్తిని పేర్కోవడం జరిగింది. ఇది శ్రీశ్రీ నుండి భిన్నమైన కవిత్వ వ్యక్తిత్వాన్ని భావింపజేస్తూంది. "ప్రజల కోసం, ప్రజల గురించి, ప్రజల్లోకి" కవిత్వం వెళ్ళాలనే భావన కుందుర్తి ప్రజాస్వామ్య తత్పరతకు అద్దం పడుతూంది. మళ్ళీ నరజన్మ కోరతాడు, ముక్తిని కోరడు. ఎందుకంటే? "మనిషి ఇష్టం" అంటాడు. దేవుని స్థానంలో మనిషిని నిలిపే తత్త్వం. 'తెలంగాణా' కృతి తెలంగాణా విమోచనాన్ని చిత్రించే కృతి. నిరంకుశత్వానికెదురు తిరిగి పోరాడిన, ప్రజల స్వాతంత్ర్య కాంక్షను, ప్రజల పోరాటాన్ని, ప్రజల విజయాన్ని చారిత్రక సూత్రంపై నిర్మించిన వాస్తవ జీవన రూపం. మొత్తం మీద ఈ కవి అభ్యుదయ కవితా స్వరూపం సంభాషణ పద్ధతిలో సులభమైన వచన కథన రూపంలో, సూటిదనం, స్పష్టత కలిగిన

అభివ్యక్తితో, మధ్య మధ్య వ్యంగ్య శోభతో స్వేచ్ఛాకవిత్వానికి ప్రశస్తినీ, ప్రచారాన్ని చేకూర్చింది. ప్రజాస్వామ్య ప్రయోజనాన్ని సంపూర్ణంగా ఆకళించుకున్న లక్షణం, కవిత్వానికి విశాలతను కలిగిస్తూంది.

అభ్యుదయ పార్శ్వంలో మరో గొప్ప కవి సోమసుందర్ అవంత్స. స్వేచ్ఛా కవిత్వానికి వైవిధ్యాన్నీ పరంపరగా ప్రవాహ రూపాన్నీ సంతరింపజేసిన సృజనశీలి. ఈయన కవిత్వం మార్క్సు సామ్యవాద సిద్ధాంతం బీజభూతంగా తన చుట్టూ ఉన్న సామాజిక సాంస్కృతిక సమాజం శాఖాకీర్ణంగా, ప్రగతిశక్తుల చేతనతో జీవవంతంగా నిలిచింది. స్థూలంగా అవసరానికీ, తప్పనివేళలోను పోరాటం, సంఘర్షణతో సాధారణంగా ప్రేమ శాంతితో సంపన్నమయింది. సుదీర్ఘ సాహిత్య ప్రస్థానంలో సుందరకాండ, మేఘరంజని, అనలకిరీటం, వెన్నెల్లో కోనసీమ, మా ఊరు మారింది, ఆగతానికి శుభారంభం, ఒక కండలో వేయి శిల్పాలు, ఆంగ్లసీమలో ఆమనవీణలు, చేతావనీ ఇట్లా ఎన్నో మైలు రాళ్ళు పలకరిస్తాయి. ఇవి సోమసుందర్ అభ్యుదయ వ్యక్తిత్వానికి అద్దం పడతాయి.

"వజ్రాయుధం" తరువాత వెలువడిన కృతుల్లో క్రమక్రమంగా పరిణత సమన్వయ వ్యక్తిత్వం ప్రస్ఫుటమవుతుంది. నిరంకుశత్వాన్ని ఫ్యూడల్ వ్యవస్థనూ నిరసిస్తుంది. సంప్రదాయ పరంపరలోని సారభూతమైన విశ్వజనీనమైన విలువల్ని గౌరవిస్తుంది. శ్రామికజన సౌభాగ్యాన్ని ఆకాంక్షిస్తుంది. మానవుణ్ణి ప్రేమిస్తుంది. మానవతను గుండెకు హత్తుకుంటుంది. కరుణను కురిపిస్తుంది. సౌందర్యాన్ని ఆరాధిస్తుంది. సామాజిక న్యాయంకై సాహసాన్ని ప్రదర్శిస్తుంది. వర్తమాన సమాజంలో నెలకొన్న అశాంతినీ నిరాశనూ అసమానతల్ని ఆక్రోశాన్ని గుర్తిస్తుంది. దారితప్పిన వాళ్ళనూ దగాపడినవాళ్ళనూ కాపాడే బాధ్యతను స్వీకరించడానికి వెనుదీయదు. తాను నమ్మిన సిద్ధాంతాలపట్ల అకుంఠితమైన మనోరూపంలో నిబద్ధతనూ నిర్మోహమాటాన్నీ కలిగిన సమాజ దర్శనం మార్క్సు సామ్యవాద సిద్ధాంత బంధురమైంది. వర్ణ వర్గ విభేదాల కతీతమైన విశ్వభావన ఆకర్షిస్తుంది. "ఎదలో ప్రసరించిందీ అరుణారుణ పుంజం – నా శిఖలో పొడిచిందట అరుణతార తేజం" అరుణశబ్దంలో మార్క్సు సామ్యవాద చేతన, పొడిచిన శిఖలో ఉద్యమించే ప్రగతితత్త్వం, ఊహలో నిలుస్తాయి.

"నా ధ్యానం సమధర్మం, నా లక్ష్యం సమధర్మం" అంటూ తన కవిత్వస్థితినీ, ప్రయోజనాన్ని ప్రకటిస్తూ, ప్రజల "కవిని నేను, నేనాశాజీవిని" అని తనలో నిర్మాణ రూపాన్ని సూచిస్తాడు. అభ్యుదయ భావన మార్పు సిద్ధాంత తలంపై ప్రయాణించే చలనశక్తితో ఆకర్షిస్తుంది.

మరొక కవి, మిరియాల రామకృష్ణ ఈయన విశిష్టకృతి, "విద్యుద్వీణెలూ, వెన్నెల తీగెలూ, ఈ కృతి అటు వస్త్వాశ్రయధోరణి, ఇటు ఆత్మాశ్రయ ధోరణి సముచితంగా ఎన్నుకున్న సంవిధానంతో రూపొందింది. అయితే ఆదర్శతలంపై సామ్యవాద లక్ష్యానికి సన్నిహితమైన వ్యక్తిత్వం ప్రపంచితమయింది. కవి మాటల్లో "బూర్జువా వ్యక్తివాద ఛాయలు మాత్రం ఇందులో లేవు", "గతి తార్కిక భౌతికవాద సూత్రాలకు భిన్నంగా నా కవితలు లేవు" అని నిష్కర్షగా తన కవిత్వాన్ని గురించి సమాలోచనకు పథనిర్దేశం చేయడమూ కన్పిస్తుంది. ఈ కృతిని గురించి చెబుతూ "ఫ్యూడల్ భావాల ఆముదపు దీపాలు వదలి, సామ్యవాద భావాల విద్యుత్తంత్రులు మీటుకుందామ"ని సామ్యవాద కవిత్వానికి మేనిఫెస్టో గీతం పాడుకుందామని, తన కవిత్వ స్వరూపాన్ని ఆవిష్కరిస్తాడు. కవిత్వంలో జీవితంలో వాస్తవదృశ్యాల్ని "భావనా పత్రాల మీద" ఆవిష్కరిస్తాడు. "అర్థసముద్రాన్ని చేరుకునే, "ఆవేశ నదుల"తో, అనుభవాత్మకమైన ప్రయాణ రూపాన్ని భావింపజేస్తాడు. ప్రయాణంలో "విద్యుద్వీణల్ని మ్రోగించడం", "చైతన్య సంగీతాన్ని వినిపించడం" చేస్తాడు. శ్రామిక వర్గంతో పాటు, మధ్యతరగతి ప్రజల్ని ఉద్దేశించిన, ఈ కవిత్వంలో "జన విప్లవాన్ని వికసింపజేసే" లక్ష్యం, అభ్యుదయ పార్శ్వంలో భాగంగా నిలుపుతూంది. మానవతనూ, విశ్వశాంతినీ హత్తుకొంది. కవిత్వ ప్రయోజనానికి విస్తృతిని కలిగిస్తూంది. ఈ కవిత్వంలో కాల్పనిక సౌందర్యం, జీవితంలో సామాజిక వాస్తవికతకు కళాకృతిని సంతరింపజేస్తూంది.

స్వాతంత్ర్యానంతరం అభ్యుదయ పార్శ్వం, స్వేచ్ఛా కవిత్వంలో 1960 వరకు నిర్ద్వంద్వంగా ఆ తరువాత ప్రభావచ్ఛాయలతోను ఈనాటివరకూ సామాజిక పాత్రను నిర్వహిస్తూంది. బలమైన సామాజిక శక్తి స్థానంగా ఉంది, ఉగ్రవాద పార్శ్వంతో క్రమంగా పూర్వస్థానంగా పరిణమించింది. సాహిత్య చరిత్రలో జ్ఞాపకాల్ని మిగిల్చింది.

విప్లవ పథ నేపథ్యాన్ని గురించి రెండు మాటలు ఈ సందర్భంలో అవసరం. సమాజంలో నెలకొనే పేదరికం వెనుకబడితనం అనేవి శ్రమశక్తుల్ని తమ వశం

చేసుకొని స్వార్థంతో ప్రవర్తించే ఒక వర్గం ప్రభావం వల్లనే ఏర్పడతాయి. వీటిని రూపుమాపడానికి విశేషమైన మార్పు అవసరం. ఈ మార్పు వర్గభేదాల్ని తొలగించడం వల్లనే సాధ్యమవుతుంది. దీనికి వర్గరహిత సమాజ స్థాపనమొకటే శరణ్యం. ఇది విప్లవం వల్ల సిద్ధిస్తుందన్న ఆదర్శభావనతో అవతరించిందీ విప్లవపథం. ఇందులో మొదటి దశ అభ్యుదయ పార్శ్వంగానూ, రెండోదశ ఉగ్రవాద పార్శ్వంగానూ సాహిత్యంలో స్థిరపడినాయి. మొదటిది మార్క్స్ ఎంగెల్స్ ఆలోచనా విధానాన్ని అనుసరించింది. రెండోది మార్క్సును అంగీకరిస్తూ మావో ఆలోచనా పథాన్ని అవలంబించింది. మొదటిదాని విస్తరణం చారిత్రకమైన అవసరాల్ని బట్టి ఏర్పడిందే రెండోది. రెండింటికీ మూల ప్రేరణ శక్తి ఒకటే, తత్కాల దేశ సమస్యల ప్రయోజనాల పరిమితులలోనే భేదం.

విప్లవపథంలో అభ్యుదయ పార్శ్వం శ్రీశ్రీ మహాప్రస్థానంతో స్పష్టమైన రూపురేఖల్ని పొందింది. సూటియైన దిశానిర్దేశాన్ని అవలంబించింది. సాహిత్యం సమాజం వేరు వేరు కావు, రెండింటికీ విడదీయరాని సంబంధం ఉంది. వీటి అస్తిత్వం భౌతిక శక్తులపై జీవిత వాస్తవ చలనంపై ఆధారపడింది. ప్రకృతిలో సమయ సమయం మార్పులూ, జీవితంలో అవసరాలూ అనుభవాలూ సమాజాన్ని దానితోపాటు సాహిత్యాన్ని తీర్చిదిద్దుతాయి. ఇవి భౌతిక మానసిక తలాలపై ఎన్ని విధాలుగా ఎప్పటికప్పుడు కొత్త కొత్త సమీకరణతలతో ఎదురవుతాయి. అయితే ఈ ఆదర్శంలో స్థూలంగా పరంపరగా వస్తున్న ఆలోచనకన్న భిన్నమైన వాదం ఆకర్షిస్తుంది. భౌతిక వాస్తవిక హేతుదృష్టితో ఏర్పడింది.

జగత్తు వస్తుమయం, భౌతికం. శరీరంతో పాటు మనస్సూ భౌతికమే. మస్తిష్కంలోని శక్తి కేంద్రమే మనస్సు. ఇది శక్తివంతమైంది. మనిషి జీవితంలో ప్రధానమైన పాత్ర వహిస్తుంది. ఇది భౌతికమైన అనుభవనస్మృతి. వాస్తవ కాల్పనిక ప్రపంచాన్ని బింబిస్తుంది. ఈ సిద్ధాంతంలో దైవప్రసక్తి లేదు. అతీతమైన దివ్యశక్తుల ప్రమేయమసలే లేదు. మార్క్సీయం భౌతిక జగత్తుకే ప్రాధాన్యమిస్తుంది. జీవితాన్ని వాస్తవమైన అనుభవ తలంపై నిలిపి పరిశీలిస్తుంది. ఇది జీవితానికి కొత్త లక్ష్యాన్ని నిర్దేశించింది. కొత్త దృష్టిని చూపింది, కొత్త విలువల్ని స్థాపించింది. పూర్వం నుండి

వచ్చే పరలోకం, ముక్తి, మోక్షం మొదలైన భావజాలానికి స్వస్తి పలికింది. ఇవన్నీ మనస్సు కల్పించుకున్న ప్రపంచంలో భాగాలే. దీన్ని అనుసరించి సమాజంలో పీడితులూ పీడకులూ రెండే వర్గాలు. పీడింపబడేవారు ఎక్కువ సంఖ్యలో ఉంటారు. పీడించేవారు తక్కువ సంఖ్యలో ఉంటారు. పీడకులకు స్వార్థం ప్రధానం. దీనివల్ల కాలక్రమంలో, వివిధ శక్తుల చలనంతో అసమానతలెక్కువ అయ్యాయి. పీడనం వివిధ స్థాయిల్లో బహువిధాలుగా జరిగింది, విస్తరించింది. పీడితుల్లో వెనుకబడినతనం, దారిద్ర్యం పెరిగింది. పీడకుల సంపద పెరిగింది. ఈ వర్గభేదం ఎన్నో అన్యాయాలకూ, ఆక్రమాలకూ, హింసకూ దారితీసింది. చరిత్రగతుల్ని నడిపించింది, ఎన్నో మార్పులకు కారణమయింది. వర్గభేదం ఉన్నంతవరకు సమాన న్యాయం జరుగదు. దీని నిర్మూలనం అవసరం. దీనికై అన్ని స్థాయిల్లో పోరాటానికి, సమాన న్యాయానికి ప్రేరేపిస్తుంది మార్క్సిజం.

ఇది గతి తార్కిక భౌతికవాదంగా సిద్ధాంతీకృతమయింది. ఈ సమాజ వ్యవస్థకు మూలం ఆర్థికమనే. ఇందులో సమూలమైన మార్పులు రావాలి, వస్తేనే సర్వజన సమానత్వం, సర్వసమాజ సౌభాగ్యం సాధ్యమవుతుంది. ఆర్థిక ప్రపంచంలో సమూలంగా మార్పుల్ని కోరుతుంది. ముందు ఆర్థిక సంబంధాలపై దృష్టిని ప్రేరేపిస్తుంది. దీని ఆర్థిక స్వరూపానికి ప్రధానాంశాలైన ఉత్పత్తి సాధానాలపై శ్రామికుల ఆధిపత్యాన్ని అభిలషిస్తుంది. ఇది సులభంగా నెరవేరదు, దీనికెన్నో అడ్డంకులున్నాయి. అందువల్ల పోరాటం తప్పదు. దీనికి ప్రతిఘటన, సంఘర్షణ, పోరాటంతో విప్లవ పథం అనివార్యమవుతుంది. మార్క్సు ప్రతిపాదించిన వర్గరహిత సమసమాజం, పరస్పర విరుద్ధశక్తుల మధ్య జరిగే సంఘర్షణ పర్యవసానంగా అవతరిస్తుంది.

ప్రతి వస్తువులో రెండు వ్యతిరేక శక్తులుంటాయి. దీన్ని శ్రీశ్రీ "పరస్పరం సంఘర్షించే శక్తులతో చరిత్ర పుట్టిన" విధంలో ఎత్తి చూపాడు. వ్యతిరేకశక్తులు, వాటివాటి అస్తిత్వం, ప్రయోజనం, పరిమితులు, లక్ష్యం వేరువేరుగా ఉంటాయి కాబట్టి పరస్పరం ఘర్షణ అనివార్యమవుతుంది. ఇది పరిస్థితుల్ని బట్టి అధికమవుతుంది. ఒకటి మరోదాని వశమవుతుంది. ఇట్లా ఒక్కొక్కదశలో ఒక్కొక్క విధంగా ఇది నిరంతరం కొనసాగుతుంది. ప్రపంచంలో సమాజం జీవితంతోపాటు ప్రకృతీ నిరంతరం మార్పులకు

లోనవుతుంది. ఒక విధంగా ప్రకృతీ సమాజం మానవ జీవితం పరస్పరం ప్రభావంతో పరివర్తితమవుతూ పోతాయి. మార్పు ఒక్కొక్కప్పుడు పైకి స్ఫుటంగా కన్పించకపోవచ్చు. ప్రతి వస్తువులోని చలనశక్తి ఉంది. మందంగా ఉండవచ్చు. ఇది గతిలక్షణం కలిగింది. అయితే ప్రకృతినీ, సమాజాన్నీ, జీవితాన్నీ ప్రభావితం చేసే శక్తులన్నీ భౌతికాలే! దీన్ని గుర్తించడం మరీ అవసరం. ప్రతి వస్తువులో అంతర్వైరుధ్యం ఉంటుంది. ఈ కారణంగా కాలం గడిచేకొద్దీ, పరిస్థితుల ప్రభావం వల్ల ప్రతి వస్తువు పాతబడి శిథిలమవుతుంది, వినష్టమవుతుంది, మరో వస్తువుగా రూపొందుతుంది.

ఇక సమాజంలో అయితే అంతర్గతంగా ఉన్న శక్తులు పైకి లేస్తాయి. ఒక స్థితిలో వివిధ దశల్లో పరస్పరం సంఘర్షిస్తాయి. బలమైంది నిలుస్తుంది, కొత్తది ఆవిర్భవిస్తుంది. ఇది అనేక కారణాల్ని పురస్కరించుకొని సాగుతుంది. కొత్తసృష్టికి సంక్షోభం, సంఘర్షణ అవసరమవుతుంది. "పుడమితల్లికి పురిటినొప్పులు కొత్తసృష్టిని స్ఫురిస్తాయి'' అన్న శ్రీశ్రీ మాటల్లో నవ్యసమాజం సామ్యవాద రూపం వ్యంజితమవుతూంది.

ప్రకృతిలోను దీన్ని గమనించవచ్చు. చండప్రచండంగా విజృంభించే ఎండలకు సముద్రంలో నీరు ఆవిరై పైకి లేం మేఘమై జలధారా వర్షం, వర్షంతో అవనిపై మార్పు ఇట్లా విరుద్ధ శక్తుల సంచలనం, సంసర్గం, సంఘర్షణ, సంచరణం, కొత్త శక్తుల సమావిష్కారం దృష్టికి వస్తాయి. మార్పులో వేగం తీవ్రదశలో చరమస్థాయి నందుకుంటుంది. చివరకు ఉత్పత్తి సాధనాలు ప్రజల వశమవుతాయి. శ్రామిక రాజ్యం ఏర్పడుతుందని ఈ సిద్ధాంతవాదుల విశ్వాసం. ఇందులో కొన్ని స్థితులు ఉగ్రవాద పార్శ్వంలోనూ కన్పిస్తాయి. సమాజగతంగా పీడనమున్నంతవరకూ సాధారణ జీవనతలంపై అసమానతలున్నంతవరకూ ఈ భావజాల ప్రభావం ఉంటుంది. పాతస్థానంలో కొత్తకు ప్రవేశం అంత సులభం కాదు. అంత త్వరగా చేకూరదు. వీటి మధ్య ఘర్షణ అనివార్యమవుతుంది. ఇదంతా భౌతిక పరిణామదశల్లో భాగమేనని ఈ సిద్ధాంతం అభిప్రాయం.

ఇక ప్రస్తుతానికి వస్తే అభ్యుదయ పార్శ్వంలో సమాజంలో నిరసన ప్రతిఘటన ఘర్షణ పోరాటంతో విప్లవం వర్థిల్లే భావస్ఫూర్తికి శ్రీశ్రీ కవిత్వం ప్రాతినిధ్యం వహిస్తుంది.

# 3. ఉగ్రవాద పార్శ్వం

## మావో పథం - 2

చారిత్రకంగా 1960 నాటికి అంతర్జాతీయ తలంపై కమ్యూనిష్టు ఉద్యమంలో రష్యా చైనాల మధ్య చీలిక ప్రపంచవ్యాప్తంగా గొప్ప ప్రభావాన్ని నెరపింది. 1964లో భారతదేశంలో కమ్యూనిష్టు పార్టీ కూడా చీలిపోయింది. ఒక పక్షం పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై విశ్వాసం కలదిగానూ, మరో పక్షం దీనికి వ్యతిరేకత కలదిగానూ రూపొందాయి. 1966 నుండి మార్క్సిస్టులు విస్తృతంగా స్థానిక దేశ సమస్యలపై దృష్టి నిలపడం జరిగింది. దీని పరిణామ రూపమే నక్సలిజం. మావో ఆలోచనా కేంద్రంగా వర్తించింది. బెంగాల్‌లో నక్సల్‌బరి గ్రామంలో చారు మోజుందార్ నాయకత్వంలో 1967లో జరిగిన భూమికి సంబంధించిన పోరాటం, నక్సల్‌బరి ఉద్యమంగా ఖ్యాతమయింది. 'ఆకలితో చావడం కన్నా పోరాటమే మేలు" అన్న చారు మొజుందార్ నినాదం క్రమంగా తెలుగుదేశంలో శ్రీకాకుళం గిరిజన ప్రాంతాల్లో ప్రతిధ్వనించింది. గిరిజనుల ప్రాంతాల్లో వారి వెనుకబడితనాన్నీ అమాయకత్వాన్నీ ఆసరాగా వారి భూముల్ని ఆక్రమించే వర్గానికి వ్యతిరేకంగా ఇది ఆరంభమయింది. ఇది మావో అడుగుజాడల్లో తీవ్రతీవ్ర దశలతో ఉగ్రవాదంగా పరిణమించింది. నిరసన ప్రతిఘటన దశల్ని దాటి ఉద్యమాన్ని విధ్వంసదశకు తీసుకెళ్ళే విధంలో "తుపాకి గొట్టం ద్వారా విప్లవాన్ని సాధించే లక్ష్యాన్ని" ఎంచుకుంది. చైనాలో మావో సాంస్కృతిక విప్లవవిధం ఆదర్శమైంది. శ్రీశ్రీ మాటల్లో "ఈనాడు పీడిత ప్రపంచానికి ఆశాజ్యోతి, విప్లవకేంద్రం, పీకింగ్", ఈ దిశలో ఉగ్రవాద సంకేతాలతో విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. సాహిత్యంలో రాజకీయాల ప్రాబల్యాన్ని విశ్వసించే బలపరచే విరసం మావో సాంస్కృతిక లక్ష్యంతో క్రమంగా సాయుధ పోరాటాన్ని బలపరిచింది. స్వేచ్ఛా కవిత్వంలో దీన్ని మార్చు విప్లవపథంలో ఉగ్రవాద పార్శ్వంగా పేర్కోవచ్చు. ఇది విప్లవ పథంలో అభ్యుదయ పార్శ్వానికి మూలరూపంతో భిన్నం కాని తీవ్రతీవ్రమైన పరిణామ రూపం అనవచ్చు. నక్సలిజంతో ఐక్యమయిన విప్లవ రచయితల సంఘం సాయుధ పోరాటం ద్వారా భూస్వామ్య సంస్కృతినీ పెట్టుబడి విధానాన్ని అంతం చేయాలనే లక్ష్యంతో ఉ

ద్యమించింది. తెలుగు సాహిత్యంలో చారిత్రకమైన పాత్రను చేపట్టింది. మార్క్సిజంపై విశ్వాసంతో శ్రామిక రాజ్యాన్ని కోరుతూ మావో ఆలోచనా విధానంతో సామాజిక సాహిత్య సాంస్కృతిక కళాక్షేత్రాల్లో మార్పును ఆహ్వానిస్తూ, క్రియాశీలమైన పాత్రను నిర్వర్తించింది. "ప్రజల నుండి ప్రజల్లోకి" అన్న మావో సూత్రానికనుగుణంగా జానపద బాణిని ఎన్నుకొని కవిత్వాన్ని ఆవిష్కరించే ప్రయత్నమూ జరిగింది.

ఇక వస్తుపరమైన విషయానికి వస్తే పేదల పట్ల కృషికుల పట్ల సామాజిక న్యాయాన్ని కోరే ఆదర్శంతో భూమిలేని వాళ్ళకు భూమిని సంక్రమింపజేయడం పీడితుల్ని కాపాడే చర్యల్ని చేపట్టడం – మొదలైన సామాజిక స్పృహనూ స్పందననూ వరించింది. ఆర్థికమైన అసమానతల్ని తొలగించే ప్రయత్నంలో భూమికి సంబంధించిన సమస్య ఉగ్రవాద పార్శ్వంలో కేంద్రస్థానాన్ని పొందింది. ఆచరణలో హింస భీభత్సం అశాంతికి దారితీయడమూ జరిగింది.

విశాఖలో శ్రీశ్రీ షష్టిపూర్తి సందర్భంగా విశాఖలో తలెత్తిన అభిప్రాయ భేదాలు ఆ తరువాత జులై 4వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన అభ్యుదయ రచయితల సదస్సులో కార్యరూపాన్ని ధరించాయి. ఖమ్మంలో 1970లో జరిగిన సమావేశాలు ఉగ్రవాద భావజాలంతో విప్లవ రచయితల సంఘం అస్తిత్వానికి దారితీసాయి. విరసం ఆవిర్భవించిన అక్టోబర్ 8,9 తేదీల్ని శ్రీశ్రీ "రెడ్ లెటర్ డేస్"గా పేర్కొన్నాడు. శ్రీశ్రీ ఖడ్గసృష్టిలో కొన్ని కవితలు, మరో మహాప్రస్థానం ఈ పార్శ్వానికి ప్రాతినిధ్యం వహిస్తాయి.

వీరి దృష్టిలో భారతదేశంలో బ్రిటిషు పాలన అంతమయ్యాక, ఆర్థిక వ్యవస్థ పెట్టుబడి దారుల వశమైందనీ, దీన్ని తిరుగుబాటు ద్వారా కూలద్రోసే సంకల్పంతో, వర్గరహిత సామ్యవాద శ్రామిక వ్యవస్థను సాధించే లక్ష్యం కవిత్వానికి ఆదర్శమైంది.

హైదరాబాద్‌లో సెవెన్ స్టార్స్ సిండికేట్ సాహిత్య సమావేశాల ఫలితంగా శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, రమణారెడ్డి, వరవరరావుతో పాటు దిగంబర కవులు శివసాగర్ మొదలుగా శ్రీశ్రీ అధ్యక్షతన విరసం – ఉగ్రవాద కవిత్వానికి వేదిక అయింది. సిద్ధాంత బలంతో నిర్దిష్టమైన లక్ష్యంతో వస్తువులో, అభివ్యక్తిలో మార్పులతో స్వేచ్ఛా కవిత్వలో కొత్త పార్శ్వం అవతరించింది. శ్రీశ్రీ మాటల్లో "పోయేదారి కంటక

భూయిష్ఠం! దాని రసం భీభత్సం! దాని పునాది సాంఘిక యాథార్థ్యం దాని ఆదర్శం వర్గరాహిత్యం" అని దీని స్వరూపం, మార్గం, సాధనం, లక్ష్యం స్పష్టంగా పేర్కోబడినాయి.

ఖమ్మంలో జరిగిన సమావేశంలో నిర్ణయాలు ఉగ్రవాద పార్శ్వంలో ప్రధాన తత్త్వాన్ని పట్టిస్తాయి. భారతదేశం స్వాతంత్ర్యాన్ని (ఆగస్టు 15, 1947 అర్ధరాత్రి) నిజంగా పొందలేదు. విదేశీయుల స్థానంలో దేశీయ పెత్తందార్లకు, దోపిడీదార్లకు మార్పిడి జరిగింది. దీనికి వ్యతిరేకం పోరాటం అవసరం. శ్రామికజన విముక్తికై ఆయుధం "అలీనం" కాదు. రాజకీయాలకూ సాహిత్యానికీ సంబంధం, అనివార్యమే కాక అవసరం కూడా. ఇక సమాజ తలంప ఆచరణ క్రియలోను మార్పు కనిపిస్తుంది. ఇది కవిత్వంలో స్ఫుటంగా గోచరిస్తుంది. నగరం నుండి పల్లెలకు కేంద్రాల్ని తరలించడం, పరిశ్రమల నుండి భూమి సమస్యకు దృష్టి ప్రసరించడం, అంతర్జాతీయ సమస్యలతో పాటు వాటికన్నా దేశీయ స్థానీయ సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వడం, నాయకత్వంలో వికేంద్రీకరణం, కిందిస్థాయికి ప్రాముఖ్యం ఇవ్వడం, సిద్ధాంతపరమైన ఆదర్శం కన్నా అనుభవాత్మకమైన ఆచరణ ప్రయోజనాన్ని కోరడం, కార్యాచరణలో ఉగ్రవాద శక్తుల్ని ప్రోత్సహించడం, మొదలుగా అభ్యుదయ మార్గం కన్నా భిన్నమైన ప్రత్యేకతను సంతరింపజేసాయి. ఇది రచనలో పూర్వం లేని కొత్తదనానికి దారితీసాయి. ఉదాహరణకు గ్రామీణ జీవన చిత్రణతో కవితా భావన సందేశం అభివ్యక్తి పరిపుష్టం కావడం గమనించవచ్చు.

ఈ పార్శ్వంలో "రాత్రి", "తిరుగబడు", "మార్చ్", "లే", మొదలైన కవితా సంకలనాలు వెలువడినాయి. ఇంకా కె.వి. రమణారెడ్డి "ఎర్ర పిడికిలి", వరవరరావు "జీవనాడి", "స్వేచ్ఛ", జ్వాలాముఖి "ఓటమి", "తిరుగుబాటు", నిఖిలేశ్వర్ "మండుతూన్న తరం", నగ్నముని "తూర్పుగాలి", శివారెడ్డి "నేత్రధనుస్సు", "రక్తం సూర్యుడు", "ఆసుపత్రి గీతం", ఇట్లా ఎన్నో రచనలు ఈ దిశను తేజోవంతం చేసాయి. ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించేవీ ఉపకరించేవీ. చెరబండరాజు "బోల్షివిక్ వారసులం నక్సల్‌బరీ బిడ్డలం, జనచైనా వెలుగులో నడుస్తున్నవారలం" అంటాడు. కవి వహించే ఉద్యమపాత్రతో కవిత్వం స్పష్టమైన దిశను పొందింది. విరసం మొదటి ప్రచురణ "ఝంఝు" ప్రభుత్వ నిషేధానికి గురి అయింది కూడా.

వరవరరావు "పార్లమెంటు పులి కూడ పంజాతో పాలించును", శివసాగర్ బాహాటంగా పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై తిరుగుబాటును ఉద్ఘోషిస్తాడు. అయితే, ఈ విధమైన ఆలోచనా రూపం ఉగ్రవాద లక్ష్యం ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛను జ్ఞాపకం చేయడం సహజం. ఉగ్రవాద కవుల్లో సృజనశక్తినీ భావనా విశిష్టతనూ, ఈ సందర్భంలో మరచిపోడానికీ వీల్లేదు.

"నేను చనిపోతాను! నీ కన్నీళ్ళనుండి తిరిగిలేస్తాను" "సూర్యనేత్రం నుండి లేచి వస్తాను" – అన్న మాటల్లో హృదయ స్పందనం కరుణతో వీరంతో సమన్వితమైన ఆశారూపం ఆకర్షిస్తుంది.

మరొక కవిత, "పొలాలలో పరిగగింజ లేరుకునే వేళలందు పక్షుల రాగాల నడుమ, గరికపూల పాన్పుమీద, అమ్మ నన్ను కన్నందుకు విప్లవాభివందనాలు" – ప్రకృతి చిత్రణంతో, స్పందన శీలంతో లక్ష్యాన్ని భావింపజేసే లక్షణమూ పేర్కోదగింది. "నరుడా! భాస్కరుడా!", "చెల్లీ చంద్రమ్మా!" రచనలు శివసాగర్‌లో నిబిడమైన భావరూపం, ఆదర్శం రెండూ పెనవేసుకొని ఉద్వేగరూపాన్ని పొందడం, లక్ష్యాన్ని నిర్దేవించడం విశేషం.

ఉగ్రవాద పథంలో చెరబండరాజు, శివసాగర్, నగ్నముని, నిఖిలేశ్వర్, జ్వాలముఖి, వరవరరావు, మానేపల్లి సత్యనారాయణ, శివారెడ్డి, అద్దేపల్లి రామమోహన్ రావు, తదితరులు ప్రయాణిస్తున్నవారు. అయితే ఈ ప్రయాణ రూపాన్ని ప్రత్యేకంగా పరిశీలించవలసిన అవసరమూ ఉంది. ఉగ్రవాద లక్ష్యం కవుల్లో కొందరిలో సూటిగా మరికొందరిలో సూచనగా ఇంకా కొందరిలో మసకమసకగానూ కన్పిస్తుంది. శివారెడ్డి, "కవులేం చేస్తారు! గోడలకు నోళ్ళిస్తారు, చెట్లకు కాళ్ళిస్తారు, గాలికి గొంతిస్తారు" కవులపని జడవ్యవస్థకు చైతన్యాన్ని కలిగించే అంశం భావరూపాల్లో సూచితమయింది. కళాత్మకతను సామాజిక పాత్రలో విలీనం చేసే ఆలోచన స్పష్టంగా కన్పిస్తుంది. మానేపల్లి ఈ పయనంలో రాజకీయాలకభిముఖంగా ప్రవర్తిస్తూ తన ఆశయాన్ని స్ఫుటంగా బింబింపజేస్తాడు. "యోధుడా కౌగిలించుకో" తాను విశ్వసించే ఆదర్శానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. "కవిత్వమా! నా ప్రాణమా! నువ్వొక ఆయుధమై బయలుదేఅ"

అని ఉద్యమశీలాన్ని గుర్తింపజేస్తాడు. పొంగే రక్తం వెనుకనుండి, శాంతినీ కాంతినీ దర్శింపజేసే కవి మానేపల్లి!

మావో ఆలోచనా విధానంతో సాంస్కృతిక విప్లవాన్నీ ఆయుధంతో అధికారాన్నీ హస్తగతం చేసుకోవాలన్న తీవ్రమైన ఆకాంక్షతో ఉద్యమించే లక్షణాన్ని బింబించే ఉగ్రవాద పార్శ్వం 1966 నుండి ఈనాటి వరకూ ప్రబలమైన సామాజిక శక్తిస్థానంగా నిలిచింది. శ్రీశ్రీ మాటల్లో "విచిత్రవీరులు నక్సలైట్లు, అన్యాయానికి డైనమేట్లు", "ఖడ్గసృష్టి"లో "పోయేదారి కంటకభూయిష్టం, దాని ప్రధానరసం భీభత్సం, దాని పునాది సాంఘిక యాథార్థ్యం, దాని ఆదర్శం వర్గరాహిత్యం." ఇదీ పార్శ్వం యొక్క ప్రధాన రేఖల్ని ఆవిష్కరిస్తూంది. ఉగ్రవాద కవిత్వం వస్తువునూ కవితాత్మనూ ఒకటిగా మలచుకొనీ, ఆదర్శరాన్నీ ఆచరణనూ ఒకటిగా సమీకరించుకొనీ, రాజకీయ ప్రయోజనంతో సామాజిక తత్పరతను ఉద్యమించే రణనినాదానికి ప్రాతినిధ్యం వహిస్తుంది.

# 4. సమన్వయ పార్శ్వం

ఏ సిద్ధాంతానికీ ఏ ఆదర్శానికీ సంపూర్ణంగా కట్టుబడకుండా, ప్రతి సిద్ధాంతంలోని ప్రతీ ఆదర్శంలోను విలువైనవీ సముచితమనిపించినవీ, వివిధాంశాల సమన్వయ గుణంతో అవతరించిందీ సమన్వయ పార్శ్వం. స్వేచ్ఛా కవిత్వంలో ప్రముఖమైందీ, సంప్రదాయ పరంపరలోని సారభూతమైన గుణం నుండి సామ్యవాదంలోని సమానత్వం దాకా, వర్తమానంపై దృష్టితో భవిష్యత్తుపై ఆశతో మానవతపై విశ్వాసంతో వర్ధిల్లింది. ఏ సిద్ధాంతమూ ఏ ఆదర్శమూ స్వయం సంపూర్ణం కాదు. ప్రతీదానిలో కొన్ని మంచి లక్షణాలు తప్పకుండా ఉంటాయి. వాటిని ఆధునిక యుగంలో తగిన గ్రహించి సమీకరించుకొని పురోగమించడం ఈ పార్శ్వం లక్ష్యం. ఇందులో నిర్మాణాత్మక దృష్టి ఉంది. సమాజ పురోగమనంపై ఆశారూపమూ ఉంది. ఈ పార్శ్వంలో దాశరథి, కాళోజి, సి. నారాయణరెడ్డి, బాపురెడ్డి మొదలైన కవులు కన్పిస్తారు. ఈ పార్శ్వాన్ని గురించి సమాలోచనం జరిపేప్పుడు దాశరథి కృతులు 'పునర్నవం', 'తిమిరంతో సమరం', 'ఆలోచనా లోచనాలు' మొదలైన రచనలు మనస్సులో మెదులుతాయి. ఈయన కవిత్వావిర్భావ భూమికను గురించి ఆలోచన చేస్తే, ఈ కవిలో 1. ఏదో చెప్పాలనే అభిలాష, 2. చుట్టూ ఉన్న మనుషులూ వాళ్ళ క్రియాకలాపాల్లో ఆసక్తీ, 3. కనబడే లోకంలో కనబడని లోకంపై ఆకాంక్ష, 4. ఆకారం మీద అనురాగం అనే నాలుగు లక్షణాలు ఈయన గుండెను కవ్వించి కలం చేపట్టచేశాయి. ఈయన "కవితా సౌధానికి వాస్తుశాస్త్రంలా తోడ్పడిన" అంశాలు అయిదు.

1. అచ్చంగా స్వంత అనుభవాలు, 2. ఇతరుల అనుభవాలు, 3. వ్యక్తికీ సంఘానికీ గల చుట్టరికం, 4. ప్రకృతికీ మనుషులకూ గల బాంధవ్యం, 5. నవ సృష్టికోసం కృషీ కవి మాటల్లో విశిష్టమైన వ్యక్తిత్వాన్ని భావింపజేస్తాయి. కవిత్వమనేది "మనిషికీ మనిషికీ మధ్య రాగబంధాన్ని" సమకూరుస్తుంది. దాశరథి మాటల్లో "క్షోభలోంచే రాస్తుంటాను, క్షోభలేంది లేను, అదినాకు వరం. వెనక్కు చూడడం రాదు. ముందును గురించి భీతిలేదు. వర్తమానం ఇష్టం" ఇందులో వైయక్తికతలం

వెనుక నుండి కవిత్వ ప్రేరణ శక్తి అనుభవానికి వస్తుంది. ఇక సామాజిక తలంపైకి వస్త, సమానత్వాన్ని కోరే సామాజిక శ్రేయోభావన స్పష్టం. "ఉన్నదాన్ని వున్న వాళ్ళందరిలో పంచి, ఉన్నంతలో అందరం కలిసి భోంచేసి, ఉజ్వలంగా, ఎంతో బాగుంటుంది." ఉన్న సంపదను అందరికీ సమానంగా చెందడం, ఉన్నంతలో అందరం కలిసి అనుభవించడం, అందరూ ఏ విభేదాలు లేకుండా కలహాలకు చోటివ్వకుండా బ్రతకడం కన్న "ఏ ఆదర్శంలోనూ ఏ సిద్ధాంతంలోను ఏముంద"ని ప్రశ్నిస్తాడు. అంతకంటే ప్రజాస్వామ్యమేమిటి? అంటాడు. బాల్యం గురించి వ్రాసిన ఈ పంక్తుల్లో సామ్యవాదంలోని సమానత్వం ప్రజాస్వామ్యంలోని స్వేచ్ఛారూపం స్థూలదృష్టికి వస్తాయి. "ఓం ప్రజాయై నమ:'లో ఏ వాదమైనా ప్రజలకు ఉత్కృష్టమైన స్థానాన్నివ్వడం కన్పిస్తుంది. ప్రజల్ని దైవంతో సమానంగా భావించి మంత్ర సదృశమైన స్థితిలో ఆవిష్కరించడంలో ప్రజల శ్రేయస్సు పట్ల రక్తీ, పురోగమనం పట్ల శ్రద్ధ అనితరమైంది. సమాజంలో చెడును పారద్రోలేందుకు "తిమిరంతో సమరం" సాగిస్తాడు. ఇందులో తిమిరం జడత్వానికీ, నిరంకుశత్వానికీ సంకేతం. దీన్ని జయించి చైతన్యవంతమైన ప్రజాసమ్మతమైన స్వేచ్ఛా ప్రభాతాన్ని దర్శించడం జరిగింది. మనిషికీ మనిషికీ మధ్య "ద్వేషానలం నుండి కాక రాగబంధం నుండి మాత్రమే కవిత్వం" వస్తుందని విశ్వసించే శాంతిప్రియుడు, కవి.

కవి ఎన్నటికీ ద్వేషాన్ని హింసనూ అశాంతినీ ప్రోత్సహించకూడదనే ఈయన నిశ్చయభావం.

సృజన శక్తి మాత్రం కాల స్థల సిద్ధాంతాల కతీతమైందనే ఈయన అభిమతం. "ప్రకృతిలో వసంతం నిర్ణీతకాలంలో" వస్తుంది. వ్యక్తిలోకవిత్వం "అకాలంలో చివుళ్ళు" తొడుగుతుంది. సమాజంలో ప్రగతికి దృఢసంకల్పం, సత్ప్రయత్నం, ప్రజా శ్రేయోలక్ష్యంతో పాటు మానవతా రాగమూ ముఖ్యమని భావించే ఉద్యమప్రియుడు, కావడం విశేషం. తెలంగాణా విమోచనోద్యమంలో ఈయన పాత్ర, దాని ప్రభావంతో అవతరించిన మహాకవిత్వం జగద్విదితం. ఏమైనా పేదలకు మేలు చేసేదిగా ఉండాలనే ఈయన ఆకాంక్ష. "క్షుద్బాధ పేదకుంటుంది, శిల్పానికుండదం"టాడు. "మస్కెట్ల నుండి రైఫిళ్ళ దాకా సాగిన దేశం, కొడవళ్ళ నుండి కోతయంత్రందాక

సాగనేలేద”ని చింతిస్తాడు. మనిషికి రణంపై ఉన్న ప్రీతి శాంతిపై లేదనీ సమాజ ప్రగతికి కృషికుల్నీ కార్మికుల్నీ ఏకం చేస్తాడు. నాగలినీ యంత్రాన్నీ పొలాన్నీ ఫ్యాక్టరీనీ, పల్లెనూ నగరాన్నీ ఆహ్వానిస్తాడు. ఈ మహాయుగ నిర్మాణంలో ఏ ఒక్కదానికీనిబద్ధంకాకుండా, ఏ వివిధాల్లోకి తలదూర్చకుండా, సమన్వయ రూపాన్ని భావిస్తాడు. ప్రతి సిద్ధాంతమూ, ఆదర్శమూ ఒకదానికొకటి పోషకమై సంపూర్ణమైన రూపానికి దారితీస్తాయి. తాను కోరే సమాజంలో “తిండీ, గుడ్డ, ఇల్లులేనివాడుం”డడు. ఇతని ప్రయాణం “ప్రజాస్వామ్య పథం మీద సామ్యవాద రథం మీద స్వాతంత్ర్య కాహళితో” సాగుతుంది. దీనికి హృదయం మానవతారూపం.

తెలంగాణా సాహిత్య ప్రపంచంలో తెలంగాణా విమోచనం తరువాత, ఒక్కమారు నవ్య, భావ, అభ్యుదయ కవిత్వరూపాలు అనుభవంలోకి వచ్చాయి. తెలంగాణాలో సాహిత్య వాతావరణంలోని ప్రత్యేకతను సూచిస్తుంది. అదేమంటే, ఇక్కడ ఒకదశ తరువాత వచ్చే మరొక దశగా కాక, తెలంగాణా విమోచనానంతరం ఒక్కమారు వీటి ప్రభావ పర్యవసానంగా కలయికతో ఏర్పడిన విశిష్టదశ సమాలోచనకందుతుంది. తెలంగాణాలో సాహిత్య చరిత్రను ఈ దృష్టితో చూడవలసి ఉంది. ఈ కారణంగా దాశరథి తదితరుల కవిత్వంలో సంప్రదాయ కాల్పనిక అభ్యుదయ భావాలతో కూడిన సమాలోకనం కన్పిస్తుంది. ఇది సాహిత్య చరిత్రకారులు గుర్తించవలసిన అంశం.

కాళోజీ అనగానే రాజకీయ సామాజిక వస్తువుపై అవతరించిన కవి ఎదుట నిలుస్తాడు. సమస్యల్ని వస్తువుగా గ్రహించి అభిప్రాయ ప్రకటనంతో, కవితారూపాన్ని ఇవ్వడం ఈ కవి ప్రత్యేకత. వివిధ సమస్యలపై భావ వ్యక్తీకరణకు కవిత్వాన్ని సాధనంగా తీసుకొని స్వేచ్ఛాకవిత్వానికి సామాజిక శక్తిని సమకూర్చడం జరిగింది. అయితే ఏ రాజకీయ సిద్ధాంతానికీ పక్షానికీ నిబద్ధం కాని దృష్టితో సమస్యల్ని స్వతంత్రంగా విశ్లేషించి చిత్రించే ధోరణి సమన్వయ పార్శ్వంలో నిలుపుతూంది. ఈ కవి రాజకీయ సామాజిక దృక్పథమూ సాహిత్య జీవితమూ ఒకటిగా కన్పిస్తాయి. తెలంగాణాలో ప్రతి సామాజికోద్యమంతో సంబంధం కలిగిన వ్యక్తి కాళోజీ నారాయణరావు. ఈ అనుభవాల్ని అభిప్రాయాల్ని కవిత్వంలో తనదైన ప్రత్యేక పద్ధతిలో ఆక్షేపం, హాస్య

చతురత, విమర్శనాశ్రయించి ఆవిష్కరించడం జరిగింది. దేశ స్వాతంత్ర్యోద్యమాల నుండి మానవహక్కుల రక్షణ వరకూ ప్రత్యక్ష సంబంధం కలిగిన వ్యక్తి కాళోజీ. ఏ సిద్ధాంతానికీ, ఏ రాజకీయ పక్షానికీ కట్టువడని మనస్తత్వం వల్ల ఎక్కడ అధర్మం అనిపించినా, అవినీతి కన్పించినా ఖండించటానికి వెనుదీయడు. అన్నిటిలోని మంచిని గ్రహించే లక్షణం సమన్వయ పార్శ్వంలో వర్తింపజేస్తూంది.

'నా గొడవ' పేరుతో వెలువడిన కవితా సంపుటాలు విఖ్యాతమైనవి. పరాభవ సంవత్సరంలో ఆరు ఋతువుల పేరిట, కవితా సంకలనాలు వెలువడినాయి. మొత్తం మీద ఆరు దశాబ్దాలుగా సాగిన సుదీర్ఘ సాహిత్య జీవితంలో ఎన్నో సమస్యలపై సంఘటనలపై స్పందించిన అనేక ఖండికలు రాజకీయ సామాజిక స్థితిగతులకు అద్దంపడుతాయి. ప్రజాస్వామ్యంలో నిర్భయంగా సూటిగా దూసికొని వచ్చే అభిప్రాయాలు, తప్పిన దారిని గుర్తుచేస్తూ కీలకమైన పాత్రను నిర్వహించడం గమనించవచ్చు. 'నా గొడవ' 'ప్రజల గొడవ'గా ప్రసిద్ధికెక్కింది. వ్యక్తి బాధ్యతనూ విధి నిర్వహణను గుర్తు చేస్తుంది. ప్రేమ కరుణ మానవతతో స్పందింపజేస్తుంది.

ప్రజాస్వామ్యంలో భావ స్వాతంత్ర్యన్ని గుర్తుచేస్తూ, ప్రజాస్వామ్యాన్ని సరియైన మార్గంలో పయనింపజేసేందుకూ మానవహక్కుల రక్షణకై ఉద్యమించే "అంతరాత్మ కవి" కాళోజీ. ఈయన కవిత్వానికి ప్రాతినిధ్యం వహించే "నా గొడవ" స్వేచ్ఛా కవిత్వంలో సామాజిక వాస్తవికతకు చిహ్నమే కాకుండా, సమాజానికి హెచ్చరిక కూడా! ఈయన కవిత్వం సమన్వయ పార్శ్వంలో ప్రత్యేకంగా పేర్కొనదగిన సామాజిక వ్యక్తిత్వంగా భావింపజేస్తుంది.

స్వేచ్ఛా కవిత్వంలో కళాత్మకమైన విలువలతో సామాజిక స్పందనతో మూర్తీభవించిన సమన్వయ ప్రపంచం సి. నారాయణరెడ్డి కవిత్వం, సిద్ధాంతాల పట్ల రాజకీయ పక్షాల గురించి అవగాహనతో వాటి క్రియాత్మకత నుండి దూరంగా ప్రాచీన మూల సంస్కృతి నుండి ఆధునిక ప్రగతి రూపం దాకా జీవితాని కవసరమూ సముచితమూ అయిన వాటిని గౌరవిస్తుంది, ఆహ్వానిస్తుంది.

ఈయన స్వేచ్ఛాకవిత్వం సమన్వయ పార్శ్వంలో శిఖరాయమాణమయింది. మంటలూ మానవుడూ, మధ్యతరగతి మందహాసం, విశ్వంభర, భూగోళమంత మనిషి, గదిలో సముద్రం మొదలుగా అనేక కృతులు స్వేచ్ఛా కవిత్వానికి శక్తినీ శిల్పాన్నీ ప్రతిష్ఠను చేకూర్చాయి. ఈయన సమన్వయ దృక్పథం సంప్రదాయంలోని శాశ్వతమైన విలువల్ని గౌరవిస్తుంది. సామ్యవాదంలోని ప్రగతిశక్తిని స్వీకరిస్తుంది. తెలుగుదేశంలో ఈయన కవితామూర్తి పొందని అవార్డు లేదు. సన్మానం జరగని పట్టణం లేదు. యాభైయేండ్లపై సాహిత్యానుభవంతో యశోభోగయోగంతో స్వర్ణజయంతి జరుపుకుంది. స్థానికం నుండి జాతీయం దాటి ప్రపంచం అంచుల దాకా సమయోచిత స్పందనంతో దర్శనంతో విస్తరించింది. ఎటువంటి పరిస్థితుల్లోనూ చెదరకుండా అపారమైన సహనంతో వివేకంతో సమన్వ ధోరణితో కవితా వ్యక్తిత్వాన్ని నిర్మించుకున్న స్వేచ్ఛావర్తి! కళామతి!

ఎప్పటికపుడు వచ్చే మార్పుల్ని గ్రహించి నిత్య నూతనత్వాన్ని పొందే స్థితి రూపం మనస్సులో మెదలుతుంది.

"గుహ నుండి మహలు దాకా నడక నుండి రోదసి దాకా, దివిటీల నుండి విద్యుద్దీపాల దాకా, అమ్ముల నుండి అస్త్రాల దాకా" ప్రవహించిన సంస్కృతి మూలహేతువు. మనిషిలో వికసించిన విజ్ఞానధాతువు, గతం నుండి వర్తమానం దాకా సాగిన మానవ మహాప్రయాణంలోని వివిధ దశల్ని చిత్రిస్తూ సాగిన మహాకావ్యం 'విశ్వంభర'. ఈయన స్వేచ్ఛాకవిత్వ, ప్రజాస్వామ్యంలోని స్వేచ్ఛను కోరుతుంది. మార్క్సిజంలోని పీడిత జనచేతన నాహ్వానిస్తుంది. మానవతా వాదంలోని మానవీయమైన విలువల్ని కోరుతుంది. కళావాదంలోని నిర్మాణ శిల్పాన్ని గ్రహిస్తుంది. ఇట్లా అన్నిటిలోని మేలిమిని సముచితంగా అనుసరిస్తూ సమన్వయ గుణంతో అవతరించిన కళాహృదయం దర్శనమిస్తుంది. ఇక ఆదర్శానిం పైన పేర్కొన్న విధంగా "గాలికి సంకెళ్ళు వేసే అంధశాసనాన్ని" నిరసిస్తుంది. ఇందులో గాలి స్వేచ్ఛకూ, అంధశాసనం నిరంకుశ గతికీ, ప్రతీకలు. "క్రమ్మే అతిలోక శక్తుల కతిరిక్తంగా మనిషిని మనిషి"గా గౌరవిస్తుంది. మనిషీ – మానవత, జీవితం – వాస్తవికత, మనిషిలో శక్తీ – రక్తీ, వైయక్తిక స్వేచ్ఛ

– సామాజిక స్పందనతో అనుభూతమవుతుంది. అద్దంలో ప్రపంచంవలె శబ్దంలో మానవ వికాస చరిత్రను బింబించే కావ్యం విశ్వంభర, సమాజంలోని సామాజిక చారిత్రక సాంస్కృతిక కళా తాత్త్విక దృష్టి కోణాలతో సమాకలితమైంది. అర్ధరాత్రి "ఉషోదయంతో భాను హృదయం మూడు వన్నెలతో మెరసే" రూపం చరిత్రలో పొందిన స్వాతంత్ర్య మహానంద రూపాన్ని భావింపజేస్తుంది. ఒక్కొక్క కృతి ఒక్కక్క సజీవ శిల్పఖండంగా సాక్షాత్కరిస్తుంది.

ఏది వ్రాసినా మనిషికీ సమాజానికీ తెగని అనుబంధంతో అనుభవానికీ జీవితానికీ గల సహజ సంబంధంతో, శిల్పదృష్టితో కళాహృదయంలో ఆకర్షిస్తాయి. ఏ పని చేసినా శ్రద్ధతో నిష్ఠతో కళావిలసనంతో సాధించే మహాశిల్పి! స్వేచ్ఛా కవిత్వంలో సమన్వయ పార్శ్వంలో ప్రతిభావంతమైన యశోరూపం, సి. నారాయణరెడ్డి కవిత్వం.

బాపురెడ్డి స్వేచ్ఛా కవిత్వం భావ కళా సమన్వయంతో అవతరించింది. "రెండు మార్గాల సంగమం నా మనోమండలమం"టాడు. ఇందులో భావం మనస్సు, ఆపైన ఆత్మరూపాన్నీ, భౌతికం సామాజికార్థిక సమానత్వం రూపాల్నీ భావింపజేస్తాయి. భావం ఆలోచనా ప్రపంచంతో, భౌతికం మనుగడకు సంబంధించిన వస్తురూపంతో ఆకర్షిస్తాయి. ఈయన స్వేచ్ఛా కవిత్వంలో – 1. వర్గ వైరుధ్య విశ్లేషణ 2. మానవతా స్పృహ, 3. ఆధ్యాత్మిక స్పర్శ కన్పిస్తాయి. ఈ మూడు అంశాలూ సామాజిక వాస్తవికత ఆధారంగా ప్రవృత్తం కావడం విశేషం. ఒకచోట "సామ్యవాది"ని, "సాహిత్య సామ్యవాది"ని అంటాడు. మరోచోట "జడానికీ చైతన్యానికీ ముడివేసే తరంగాన్ని నేను" అంటాడు. ఇదీ కవి జీవవంతమైన మనోరూపాన్ని దాని చైతన్యశీలాన్ని భావింపజేస్తుంది. మరోచోట "ఈ జీవితం ఒక తెల్లని కాగితం, నీ జాతకం నీవే వ్రాసుకో" అంటాడు.

ఏ వాద వివాదాలకూ చెందని స్వేచ్ఛాగుణంతో స్వతంత్రమైన వ్యక్తిత్వం పరిశీలింపదగింది.

స్వేచ్ఛా కవిత్వంలో సమన్వయ పార్శ్వం ఎంతో విస్తృతినీ వైవిధ్యాన్నీ పొందడమే గాక ఉన్నతినీ ప్రయోజన తత్పరతనూ కలిగింది.

# 5. ప్రజాస్వామ్య పార్శ్వం

స్వాతంత్ర్యానంతరం రిపబ్లిక్ డే నుండి భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. దీనితో దేశ చరిత్రలో కొత్త యుగానికి స్వరూపం సిద్ధమైంది. ఇది ప్రజాస్వామ్య పథంలో నిర్దేశితమయింది. స్వేచ్ఛాకవిత్వంలో 1) స్వేచ్ఛ, 2) సమానత్వం, 3) సామాజిక న్యాయం, 4) విశ్వసౌభ్రాతృత్వంతో ప్రజాస్వామ్య పార్శ్వాన్ని గుర్తించవచ్చు. మౌలికమైన సంప్రదాయాల విలువల్ని మన్నిస్తూ ఆధునిక యుగంలో పరివర్తనకవసరమైన భావజాలాన్ని స్వీకరిస్తూ, సమాజంలో వాస్తవం అనుభవం హేతువు ప్రధానంగా ఆదర్శరూపం ఆవిష్కృతమవుతూంది.

ప్రజాస్వామ్యం ఆదర్శంగా మాదిరాజు రంగారావు స్వేచ్ఛా కవిత్వం (1953 నుండి 2004 వరకు) వెలువడింది. "శ్వేతేతర విహంగాలు" ఖండిక (తెలుగు స్వతంత్రలో ప్రకటితమైంది) యాభైవ దశకం (1953)లో సమాజంలో స్వేచ్ఛానూ శాంతినీ సమష్టికృషినీ ఉద్దేశించి ప్రజాస్వామ్యదృష్టిపై అభిలాషతో వ్రాసింది. మానవీయం మొదలుకొని అభిషేకం వరకూ దీర్ఘకృతుల్లో లఘుకృతుల్లో ఖండికల్లో ప్రజాస్వామ్య భావన పట్ల తత్పరత కన్పిస్తుంది. ఇది కవి ఆదర్శరూపాన్ని భావింపజేస్తూంది.

"మానవీయం" విశాలమైన ప్రాతిపదికపైన మానవ వికాసం యొక్క వివిధాంశాలు వివృతమైన కృతి. ఇందులో చివర "సమీకృత ప్రజావితతి" "క్రాంతి"లో కొత్త శక్తితో, కొత్త సమాజ సృష్టీ భావితమైంది. "పడగెత్తిన ఉదయం", ఇరవైనాలుగు గంటల్లో ఒక వ్యక్తి అనుభవ పరంపరలో వర్తమాన స్థితి చిత్రణం. ఇందులోను ప్రజాస్వామ్య హక్కులకై పోరాడే, కనీసపు అవసరాలకై ఉద్యమించే వ్యక్తులతో సమాజరూపంలో 'ప్రజాస్వామ్యం అవసరం' సూచితమైంది. "ముక్తధాత్రి" బంగ్లాదేశ్ అవతరణ కావ్యం. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకై ఉద్యమించే ప్రజల ఉద్యమఐం, దాని పరాకాష్ఠదశ, నిరంకుశ పీడనస్థితి, చివరకు ప్రజల విజయం, ప్రజాస్వామ్యస్థాపనతో ముగిసింది. దీనితోపాటే "ఇది వియత్నాం" కూడా. విప్లవచ్ఛాయల్లో శాంతి రెక్కల క్రింద వియత్నాం ప్రజల స్వేచ్ఛా రూపం కన్పిస్తుంది. "ఆవాహనం"లో "ఆవాహన చేసికో నీలోకి శిశిరనాశన ప్రజాస్వామ్యరాగం" మొదలుగా వివిధ ఖండికల్లో వర్తమాన

ప్రగతికీ, మహోదార మానవ సంస్కృతీ వికాసానికీ దాని పరిరక్షణకూ 'ప్రజాస్వామ్యం అవసరం' దృష్టికి వస్తుంది.

'వెలుగులో ఈ నేలపై' జాతీయ భావనా విలసితంగా ప్రజాస్వామ్య లక్ష్యంగా వర్తమాన సామాజిక స్థితిగతుల చిత్రణం. జాతీయ భావనతో మొదలైంది. త్యాగభూమి నుండి ఉద్భవించిన స్వాతంత్ర్య మహావృక్షం పరిరక్షణకూ ప్రజాస్వామ్యచేతన యొక్క అవసరం రూపితమయింది. ఈ దేశం "వర్గ రహిత వర్ణ రహిత బహుభాషలతో సమన్వయ సంస్కారకిర్మీరరూపం"గా దీని అస్తిత్వానికి కావలసిన ప్రజాస్వామ్య విధానం ప్రకాశితమైంది.

"మేల్కొన్న ఈ సమయం"లోనూ, కాలం మేల్కొని స్వేచ్ఛా ప్రపంచంలోకి అడుగులు వేసే స్థితి చిత్రితమయింది. "అగ్నిమయం జీవితం"లో అశాంతినీ హింసనూ నిరసిస్తూ, సమాజంలో సమభావం, సౌహార్దం అవసరాన్ని సూచిస్తూ ఆరద్రమయ జనహిత లక్ష్యం ఆకాంక్షితమైంది. "ఈ తరం స్వర చిత్రం"లో మానవ ప్రగతికి ప్రజాస్వామ్యం ఎట్లా 'విశ్వ హృదయ స్పందన'తో ఉపకరించేదీ "మానవీయ సూర్యునితో, ప్రజాస్వామ్య పతాకతో" ప్రయాణరూపం ధ్వనితమయింది. "అశాంతి ఆర్కెస్ట్రా"లో "ప్రజాస్వామ్య నవసమాజ చలనం" కన్పిస్తుంది. "వర్తమానం స్క్రీన్‌పై"లోను, "వర్తమానం దారి పొడవునా వేచి ఉన్న ప్రజాస్వామ్య భవిష్యత్తు" అవలోకితమయింది.

"అగ్ని నుండి ఆనందానికి" మరో కావ్యంలో సృజనరూపం మొదలుకొని వికాసరూపం వరకు మనిషిలో భౌతిక మానసిక ఆధ్యాత్మిక దశల చిత్రణం జరిగింది. ఇది శాంతి గమ్యమైందీ, స్వేచ్ఛా సంపన్నమైందీ. ప్రజాస్వామ్య లక్షణాన్ని బింబించేదీ.

''ఈ శతాబ్ది రెక్కలపై'', ''ప్రజాస్వామ్య రమణీయంగా'' వెలిగే "జనసంకల్పం"లో, "ప్రజాస్వామ్యదర్శనం" కనిపిస్తుంది. "డైరి దర్పణంలో", "ఈ శతాబ్దిరెక్కలపై" కావ్యాల్లోనూ సమాజంలో అసమానతల్లి యుగయుగాల పీడనలతో చెదరిన స్వరూపాన్నీ విషమస్థితుల్నీ రూపుమాపే సాధనం ఒకటే, అది ప్రజాస్వామ్యంగా లక్షితమైంది. ఇందులో ఇంకా స్త్రీవాద, దళితవాద ఉద్యమాల్లోని భావజాలం కేంద్రంగా వీటి విజయానికి ప్రజాస్వామ్యమెట్లా తోడ్పడేదీ దృష్టికి వస్తుంది.

"క్రాస్ – ఫైర్", "సీజ్–ఫైర్", "నేదురేపు మధ్య", "స్వేచ్ఛకు సిగ్నల్", ఇటీవలి "అభిషేకం", ఈ ఐదు కావ్యాల్లో 1) సమాజంలో నెలకొన్న విపరీతస్థితులు, 2) వాటిని ఎదుర్కొనేందుకు కావలసిన ప్రజాస్వామ్య నిబద్ధత, చిత్తశుద్ధితో పాటు మానవజాతి మనుగడకూ సమాజ పురోగతికీ, వికాసానికీ అవసరమైన శాంతి – ప్రేమ – ఉదారతతో కూడిన ప్రజాస్వామ్య లక్ష్యం ఆవిష్కృతమయింది. "మంచి భవిష్యత్తుకు ప్రవేశద్వారం"గా నవశతాబ్దిలో స్వేచ్ఛకూ, సమాజగతికీ, మంచి అవకాశంగా ప్రజాస్వామ్యం దర్శితమయింది.

"విధ్వంసానికి సాహసం సరిపోతుంది, నిర్మాణానికి సంకల్పం అవసరం. మానవ సంపూర్ణ వికాసానికీ శిఖరారోహణకూ ప్రజాస్వామ్యం బాగా ఉపకరిస్తుందన్న భావన ప్రజాస్వామ్య పార్శ్వంలో స్ఫుటంగా స్థాపితమయింది.

# 6. సామ్యవాద కళాభావ పార్శ్వం

మార్క్సు ప్రతిపాదించిన సామ్యవాద సిద్ధాంతం ఆధారంగా సామాజిక లక్ష్యాన్ని కోరుతూ, రాజకీయాల ప్రత్యక్ష ప్రభావాలకతీతంగా, సాహిత్యంలో కళాత్మకమైన విలువలకు ప్రాధాన్యాన్ని కలిగిందీ సామ్యవాద కళాభావ పార్శ్వం. ఈ పార్శ్వాని కధినేత గుంటూరు శేషేంద్రశర్మ. మార్క్సిజాన్ని ఈ దేశ సంస్కృతికీ సామాజిక పరిస్థితులకూ అనుగుణంగా మలచబడి అవతరించిందీ, స్వేచ్ఛాకవిత్వంలో వెలువడిన శేషేంద్రశర్మ కృతులీ మార్గాన్ని ఆవిష్కరిస్తాయి. ఈ మార్గంలో ఇంకా వనమాలి మొదలైన కవులూ పయనించారు. ఇది కళాత్మకమైన అనుభూతికి ప్రాధాన్యం ఇస్తుంది. రాజకీయ పక్షాలకు దూరంగా ఉంటుంది. అంటే వీటిని గురించి అవగాహన కలిగి ఉంటుంది కాని, ప్రత్యక్ష ప్రమేయాన్ని మాత్రం కలిగి ఉండదు. అంతర్జాతీయ తలంపై సిద్ధాంతమైనా దేశీయ భావనతో పాటు నిఖిల మానవాళి శ్రేయస్సుపై దృష్టి కలిగి ఉంటుంది. సాహిత్యానికి వస్తే ప్రాచ్య పాశ్చాత్య సిద్ధాంతాల్లోని కావ్యశాస్త్రాంశాల్ని పరిగణనలోకి తీసుకుంటుంది. తన ఆలోచన కనుగుణంగా సమన్వయ భావంతో వ్యాఖ్యానిస్తుంది.

ఈ భూమికపై సామ్యవాద సామాజిక భావనతో కళాత్మకమైన అనుభూతి ప్రాధాన్యంతో అవతరించిందీ పార్శ్వం. ఈ అభిప్రాయాలకు సిద్ధాంత వివరణ రూపం మేనిఫెస్టో (1974) ప్రకటితమైంది. ఈ ఆలోచనా రూపానికి సంస్థాగతంగా "కవిసేన" (1977) ఏర్పడింది. కవిసేనలో మార్క్సిజం అవగాహన పూర్తిగా భిన్నమైంది. కవిసేన దృష్టిలో కవిత్వంలో రాజకీయాలు ఒక అంశం మాత్రమే. దీనికో పెద్దపీట వేయకూడదని వీరి అభిమతం. కవిత్వంలో సౌందర్యాస్వాదనం ముఖ్యమైంది. దీని ఆకర్షణ రూపం అనుభూతి కళ మాత్రమే. దీన్ని రాజకీయ పక్షాలకు సంబంధించిన వాతావరణం కప్పేయకూడదు. ఈ సౌందర్యాస్వాదనం – అనుభూతి కళ గురించి ప్రాచ్య పాశ్చాత్య కావ్య శాస్త్ర సిద్ధాంతాల సమాలోచనంతో మేనిఫెస్టోలోను, ఇతర సందర్భాల్లోను శేషేంద్రశర్మ వివరించడం జరిగింది. అయితే మార్క్సు ఆర్థిక దృక్పథాన్ని, సామ్యవాద సిద్ధాంతంతో సామాజిక రూపానికి ఆధార కేంద్రంగా గ్రహించడం ఇందులో విశేషం.

ఈ పార్శ్వంలో సౌందర్యాస్వాదనం అనుభూతి కళ ఆకర్షణ రూపాలైనప్పటికీ, మార్క్సు సామ్యవాద సామాజిక లక్ష్యంతో జోడింపబడి ఆవిష్కృతం కావడంవల్ల దీన్ని అనుభూతి పార్శ్వం నుండి వేరుగా సమాలోచనం జరపడం సముచితం.

శేషేంద్ర శర్మ "సైద్ధాంతికంగా నేను మాత్రం విప్లవ కవిత్వంవైపే మొగ్గుచూపుతా" నంటాడు. మార్క్సు విప్లవ సిద్ధాంతం పట్ల అభిలాష స్పష్టం. వస్తుగతమైన భౌతికాంశాలపై అనుభూతి కళతో కవితాత్మను దర్శించడం ఇతనికిష్టం. పీడితులకోసం, బాధితులకోసం శోకతప్తహృదయంతో స్పందించడంలో ఇతనిలో పీడితుల పక్షం వహించే ఆలోచన వెంట సమాజంలో మనిషి ఎదుర్కొనే సమస్యలకు మార్క్సిజం పరిష్కార మార్గంగా స్వీకరించడం స్పష్టంగా కన్పిస్తుంది. ఇది కుల మత భాషా ప్రాంతాల్ని అధిగమించిన విశాలభావనతో కూడింది. దీన్ని శేషేంద్రశర్మ రాజకీయోద్యమంగా కాక "వైజ్ఞానికోద్యమం"గా పేర్కొనడం జరిగింది. ఈ విశిష్టగుణం ఈ పార్శ్వానికి వెన్నెముక వంటిది. వైజ్ఞానికోద్యమ భావన కవిసేన మేనిఫెస్టోలో ప్రతిపాదితమైంది. ఈ మేనిఫెస్టో "వైజ్ఞానిక ఉద్యమ భూమికగా కవిసేన కార్యార్థం శేషేంద్రశర్మచేత" రచితమైంది. ఆధునిక యుగంలో విస్తరిల్లే స్వేచ్ఛా కవిత్వంలో ఒక పార్శ్వానికి వైజ్ఞానిక నాయకత్వాన్ని పొందడం జరిగింది.

ఈ కృతి ఈయన "ఆశా కిరణమైన యువతరానికంకితం" చేయబడింది. ఇందులో అనుభూతి కళ నుండి ఇంద్రియవాదానికీ, ఇంద్రియవాదం నుండి ఆత్మకళకూ పయనించే సృజనరూపం సహేతుకంగా చర్చితమైంది. మేనిఫెస్టోలో, "సామాజిక చైతన్యమైనా, మరే చైతన్యమైనా అనుభూతి కళ అనే మూసలో పడి కళాత్మకతను పొందడం" చాలా అవసరమన్న భావం స్పష్టంగా ప్రకటితమయింది. విషయమేమంటే, ఇది కవిత్వ స్వరూప ప్రయోజనతలంపై మార్క్సిస్టులతో భేదించే అంశంగా కన్పిస్తుంది. అయితే ఇది ఈయన దృక్పథంలో కొన్ని పరిమితుల్ని పొందింది. సామాజికార్థిక తలంపై మార్క్సిజంనూ, సాంస్కృతిక జీవనతలంపై మానవ నాగరకతా పరిణామ దృష్టినీ, ఈ దేశానికి వస్తే సంప్రదాయమూలాల జీవితాన్నీ, భారతీయ పరంపరనూ మన్నిస్తుంది. ఈ అవగాహనతో కవిత్వంలో అనుభూతి కళతో సృజనాత్మకమైన ఆకర్షణ శక్తిని పొందింది. ఈ కారణంగా సరికొత్త పార్శ్వంగా సమాలోచన జరుపవలసిన

అవసరాన్ని ప్రేరేపిస్తూంది. "ఏ వస్తువైనా రాజకీయంగాగానీ సామాజికంగాగానీ మానవీకృతం కావాల"నే ఈయన అభిమతం. ఇది క్రమంగా కవితాకృతి పొందడం అవసరం. "మనిషి ఋణం తీర్చుకునే" సంకల్పం, మానవశక్తినీ దాని అనితరమైన ప్రాధాన్యాన్ని ఆవిష్కరిస్తుంది.

మార్క్సిజాన్ని భారతదేశ స్థితిగతులకు మలచుకొనే శక్తినీ ప్రదర్శిస్తాడు. "నేనెపుడు గొంతెత్తినా నాకోసం కాదు / యాభైకోట్లమంది కోసం గొంతెత్తుతాను / నేను పడుతూన్న బాధలే నా దేశమంతా పడుతూంది / కనుకనే నా జ్వాలిక! నా దేశపు నాలిక!" ఈ జ్వాలిక స్వతంత్రమైందీ, ఈ దేశంలోజనజీవిత బాధామయమైందీ. మండేసూర్యుడు, నా దేశం నా ప్రజలు, గొరిల్లా మొదలైన కృతులు ప్రవాహసదృశంగా వెలువడినాయి. ఇవన్నీ కలిసి స్వేచ్ఛాకవిత్వంలో "ఆధునిక మహాభారతం" పేరుతో, వస్త్వైక్యాన్ని భావింపజేయడం జరిగింది. "పీడిత ప్రజలకే ఈ భూమి సంక్రమిస్తుంది రండి! పాతి పెట్టిన ఉషస్సును బయటికి తీద్దాం! భూమిని చీల్చి దున్నుదాం రండి!" పీడిత జన శ్రేయోమార్గంలో కవితా వస్తువుకూ, శక్తివంతమైన భావచిత్రణలకూ నిలయమైన స్పందనరూపం అనుభవానికి వస్తుంది. స్వేచ్ఛాకవిత్వంలో శేషేంద్రశర్మ ఆధునిక భారతం, అయస్కాంతశక్తితో ఆకర్షిస్తుంది. భావరూపాలు మనస్సును ప్రభావితం చేస్తాయి. అర్థస్ఫూర్తినీ, ప్రతీయమాన శక్తినీ కలిగింది. ఇది భౌతిక మానసిక తాత్త్విక స్థాయిల్లో ఆలోచన కందుతుంది. రచనలో అభివ్యక్తి సౌందర్యంతో భావరూపాలతో ప్రతీకల ప్రయోగం సంశ్లిష్టమైన సంవిధాన కళారూపాన్ని పొందిింది. ఈ విధంగా స్వేచ్ఛాకవిత్వంలో విశిష్టమైన వ్యక్తిత్వాన్ని భావింపజేస్తుంది. సమాలోచనకు పురికొల్పుతూంది.

"రాజకీయ సిద్ధాంతాన్ని కౌగిలిచుకోవచ్చు. రాజకీయ పార్టీలకు కవి దూరంగా ఉండాలన్నదే" ఈయన దృఢవిశ్వాసం. కవి "సర్వకాలాల్లో సర్వావస్థల్లో స్వతంత్రుడు"గా ఉండాలన్నదే చిరాశయం. లేకుంటే "అసలు కవే కాదన్నదే" ఈయన నిశ్చయం. ఈ విధమైన మార్క్సిజంపై అభిమతి, అనుభూతికళపై అభిలాష, సౌందర్యాస్వాదనంపై అనురక్తిచేత శేషేంద్రశర్మ కవిత్వం స్వేచ్ఛాకవిత్వంలో సామ్యవాద కళాభావ పార్శ్వంగా సమాలోచనకందుతుంది.

# 7. దిగంబర పార్శ్వం

స్వాతంత్ర్యానంతరం ప్రజలు పెంచుకున్న ఆశలు భగ్నం కావడంతో అరవయ్యో దశకంలో అనేక సమస్యలుత్పన్నమయినాయి. విషమగతులెక్కువైనాయి. దేశం అస్థిరత్వాన్ని అశాంతినీ ఎదుర్కోవలసి వచ్చింది. సమాజంలో అవినీతి ప్రబలింది. సామాన్యుల జీవితాలు సంక్షోభానికి గురి అయినాయి. అసంతృప్తి హెచ్చింది. దిగువనున్న ప్రజల జీవనస్థాయిలో పెద్ద మార్పు లేదు. దారిద్ర్యరేఖలో పరివర్తన శూన్యం. తరతరాల నుండి పేరుకొన్న దారిద్ర్యాన్నీ అవిద్యనూ వెనుకబడిన తనాన్నీ రూపుమాపే ప్రయత్నం నెహ్రూ కాలంలో కొంత ఆరంభమైంది. ప్రణాళికలు సిద్ధం చేయబడినాయి. కాలం గడిచేకొద్దీ గతాన్నీ గతంలోని జడరూపాల్నీ వదలించే ప్రయత్నం జరిగింది కానీ పూర్తిగా సఫలం కాలేదు.

సమాజంలో అసమానత అట్లాగే ఉంది. అన్యాయాలు ఆక్రమాలు అవినీతితో జీవితం విలువల్ని కోల్పోడం ఆరంభమైంది. ప్రగతిశక్తులు ప్రజల్ని మరచిపోయారు. సైద్ధాంతిక విభేదాల్లో మునిగిపోయారు. ప్రజల బాధల్ని, వేదననూ, కోపాన్నీ, ఆక్రోశాన్నీ, అశాంతినీ వ్యక్తం చేసే వేదిక అవసరమైంది. ఈ పరిస్థితుల్లో అవసరానికి దిగంబర కవులు ఆగ్రహంతో శబ్దించారు. ప్రగతికవరోధంగా ఉన్న ఆటంకాలను తొలగించే సత్వరయత్నానికుద్యుక్తులయ్యారు. అప్పటి కర్తవ్యం సిద్ధాంతాల ప్రవచనం కాదు. క్రియాశక్తి విజృంభణంగా భావించారు. ఈ నిశితస్వరం వెనుక సిద్ధాంత ప్రేరణ లేకపోయినా ప్రగతిస్ఫూర్తి ఉంది. ఇది సమాజంలో నెలకొన్న అసంతృప్తినీ ఆగ్రహాన్నీ విషాదాన్నీ అసంతృప్తినీ బహిర్గతం చేసింది. ఇందులో ఏ విచక్షణ లేదు. అన్నీ ఆహుతి కావలసిందే! ఈ ఆవేశానికీ సంరంభానికీ అక్షరాకృతే దిగంబర కవిత్వం. ఇది పాత విలువల్ని ధ్వంసం చేసే సాధనంగా రూపొందింది. (1916లో జూరిచ్‌లో ట్రెస్టడ్ జారా నాయకత్వంలో గతకాలపు విలువల్ని విధ్వంసం చేసే ఉద్యమం ఈ సందర్భంలో గుర్తుకురాక మానదు. ఇది యూరప్ అంతటా సాహిత్య కళాక్షేత్రాల్ని ప్రభావితం చేసింది.) పాతవిలువల స్థానంలో కొత్త విలువలు రావలసిన సమయం ఆసన్నమైనమాట నిజమే. కాని ఇది విచక్షణారహితంగా ఉండకూడదు. పెద్దపెట్టున

మార్పుపై దృష్టితో దిగంబర పార్శ్వం అవతరించింది. అస్తిత్వవాదంలోని స్వేచ్ఛను మార్క్సిజంలోని విధ్వంసగుణాన్నీ వీటితోపాటు అమెరికా బీట్నిక్స్ (బీట్ జనరేషన్), బ్రిటన్‌లో ఏంగ్రీయంగ్‌మెన్, బెంగాల్‌లో హంగ్రీయంగ్‌మెన్, హిందీ సాహిత్యంలో భూకీపీడీ (ఆకలితరం) ప్రభావ పర్యవసానంగా రూపొందింది. ఇది తన చుట్టూ ఉన్న పరిస్థితుల్ని ఆకళించుకని అడుగువేసే వీరి సజీవమైన ప్రతిక్రియా తత్త్వాన్ని నిరూపిస్తోంది. ఈ ధోరణి ప్రజాస్వామ్యంలోని స్వేచ్ఛావకాశాన్ని పూర్తిగా వినియోగించుకుంది. ఇది స్థానిక దేశ సమస్యల పట్ల తీవ్రమైన ప్రతిస్పందనతో సంవేదనతో పాటు అంతర్జాతీయ తలంపై వచ్చిన కొత్త ఆలోచనా రూపాల్నీ ప్రతిక్రియా విధానాల్నీ సంవిలీనం చేసుకుంది. అయితే ఫ్రాన్స్‌లో ఆవిర్భవించిన అస్తిత్వవాదం 1965 నాటి తెరమరుగున పడింది. భారతదేశంలో ప్రాంతీయ భాషా సాహిత్యాలు కొంత ఆలస్యంగా దీని ప్రభావానికి గురి అయినాయి.

తెలుగు స్వేచ్ఛా కవిత్వంలో అవతరించిన దిగంబర పార్శ్వం ఏ రాజకీయ సిద్ధాంతాన్నీ ప్రతిపాదించలేదు. ప్రత్యామ్నాయాన్నీ సూచించలేదు కాని ప్రజాస్వామ్యంలోని స్వేచ్ఛతోపాటు సామాజిక న్యాయం, సమానత్వంకై ప్రజల పక్షాన శబ్దించే "ప్రగతిరూపం మాత్రం అంతర్గతంగా ఉంది అన్న విషయం మరచిపోకూడదు (ఇది కొంతకాలం తరువాత నిరసం అభిముఖంగా ప్రసరించింది) గత కాలానికి చెందినవీ ప్రస్తుతానికి పనికిరానివిగా అనుకున్నవీ శిథిల దశకు చేరుకున్నవీ ఈ కవుల దృష్టిలో అపహాస్యానికీ అవమానానికీ తిరస్కారానికీ వినాశనానికీ గురి అయినాయి. ఈ దిశలో తీవ్రవైఖరి ప్రదర్శించేందుకు వీరు వెనుకాడలేదు. ఈ ధోరణిలో మానసికంగా ఏ సెన్సార్ లేకుండా స్వయంప్రేరణ పద్ధతిలో యథాతథంగా ఉద్గమించిన కవిత్వం, అసాధారణ స్థితిని పొందింది. దీన్ని మానసికమైన ఒత్తిడి నుంచి ఆలోచనల్ని విడుదల చేయడంగాను భావించడం జరిగింది. ఇది సంచలనాన్ని సృష్టించింది. అప్పుడు నెలకొన్న దుస్థితుల్ని గురించి ఆలోచనకు పురికొల్పింది.

1965 మేలో మొదటి సంపుటం రిక్షాలాగే వ్యక్తిచేత, 1966 డిసెంబర్‌లో రెండో సంపుటం హోటల్ సర్వర్‌చేత, 1968 జూన్‌లో మూడో సంపుటం బిచ్చకత్తెచేత దిగంబర కవిత్వం ఆవిష్కరింపబడింది. ఇది చెప్పుకోదగ్గ విశేషమే. ఇది అట్టడుగున

పడి ఉన్నవాళ్ళను గౌరవించడమే. సాధారణంగా ఏ మంత్రులో అధికారులో విద్యావేత్తలో పెద్దలో పై స్థాయికి చెందిన వ్యక్తులు చేసే కార్యక్రమాన్ని ఏ ఆడంబరం లేకుండా అతి సామాన్యుల చేత జరిపించడం సాహసమే. ఎవరూ ఊహించని తీరులో నవ్యతను ప్రవేశపెట్టారు. సమానత్వాన్ని యథార్థం చేసారు.

ఈ కవులు ఆరుగురు. వీరు కలం పేర్లు పెట్టుకొని విజృంభించారు. 1) నగ్నముని (కేశవరావు), 2) నిఖిలేశ్వర్ (కె. యాదవరెడ్డి), 3) జ్వాలాముఖి (వీర రాఘవాచార్య), 4) చెఱబండరాజు (బద్ధం బాస్కరరెడ్డి) 5) భైరవయ్య (మన్‌మోహన్‌రాయ్), 6) మహాస్వప్న (కమ్మిశెట్టి వేంకటేశ్వరరావు) మనస్సుపై నెలకొనే ముసుగుల్ని తొలగించి బట్టబయలు చేసే దిగంబర కవులు తమ అసలు పేర్లను దాచి మరో కలంపేర్లు వేసుకోవడం పట్ల విమర్శ లేకపోలేదు. వీరి లక్ష్యం సమాజంలో మానసికమైన దిగంబరత్వాన్ని అంటే ఏ ఆచ్ఛాదనం లేని శుభ్రమైన స్పష్టమైన మనస్సు యొక్క సహజరూపాన్ని ఆవిష్కరించడమే. దీనికనుగుణంగా ఆలోచన చేస్తారు ప్రవర్తిస్తారు. దీన్ని సాధించే ప్రయత్నం చేస్తారు. ఇతరులను ప్రేరేపిస్తారు. దీనికి నిత్యం సచేతనమైన స్వచ్ఛమైన మనోరూపం అవసరం. ఇది లోపించడాన్ని క్షమించరు. సచేతనమైన స్వచ్ఛమైన మనస్సుతో జీవించడం అవసరంగా భావిస్తారు. మనోరూపం శూన్యం కాదు. అందులో ఎన్నో అంతరువులు, ఒక్కొక్కదానిలో ఎన్నో అనుభవాల స్మృతులు, ఆలోచనలు, కోర్కెలు ఆశలు ఆశయాలు రాసులుగా పడి ఉంటాయి. ఇవి దాగి ఉంటాయి, అణగి ఉంటాయి. తలలెత్తుతూంటాయి. అయితే వీటిని యథాతథంగా అభివ్యక్తం చేయడం దిగంబర కవిత్వంలో కన్పిస్తుంది. ఇది సాహసకార్యమే. ఇది సమాజానికవసరమనీ, సరికొత్త అన్వేషణకు పునరాలోచనకు పురికొల్పుతుందనే వీరి అభిప్రాయం.

ఈ కవులు తమదైన సరికొత్త శకాన్ని కూడా నిర్మించుకున్నారు. దాని పేరు దిగంబరశకం. ఏ ఆచ్ఛాదన లేని సహజమైన మానసికస్థితిని దిగంబర కవిత్వం సూచిస్తే మనోభావ స్ఫూర్తి కలిగిన కాలపరిణామాన్ని దిగంబర శకం భావింపచేస్తుంది. వీళ్ళ ఋతువులూ ఆరు. అవి ఆశ, తపన, అశ్రు, మదిర, విరహ, విషాద అనేవి. వీళ్ళ వారాలు ఆరు, అవి, స్నేహ, విశృంఖల, క్రాంతి, సృజన, వికాస, అనంత

అనేవి. ఏడోది లేదు. బహుశా సంఖ్యా బాగా లేదేమో, విరామం ఉండదేమో, ఈ కవులూ ఆరుగురే అవబట్టి కావచ్చు.

మనిషి మనస్సు అనేకమైన కారణాలవల్ల ఎన్నో తొడుగులతో ముసుగులతో కప్పబడి ఉంటుంది. వీటి ప్రభావం జీవితంపై ఎంతో ఉంది. ఇవి నిజమైన మనస్సుకు చెందిన కళనూ దీప్తినీ ముఖ్యంగా అసలు స్వరూపాన్నీ మరుగున పడేస్తాయి. స్వార్థం దురాశ దురధికారం దీన్ని మరీ వికృతం చేస్తాయి. ఇకపోతే ధనం అదికారం కీర్తిపై అభిలాష దీన్ని అపమార్గం పట్టిస్తుంది. అహంకారం 'దుష్కృత్యాలను ప్రేరేపిస్తుంది. కాబట్టి వీటి నుండి ముక్తమై మనస్సు నగ్నంగా ఉండడమంటే సహజత్వాన్ని పొందడమే. అయితే సహజత్వాన్ని చేరుకోవడమంత సులభం కాదు. అందుకై తొడుగుల్నీ ముసుగుల్నీ తొలగించడానికి ధైర్యమూ సాహసమూ అవసరం. మనసు నగ్నస్థితిలోనే సహజత్వాన్ని కలిగి ఉంటుంది. ఇదీ దిగంబర కవులుద్దేశించిన మానసిక రూపం. దీని ఆధారంగా దిగంబర కవిత్వం ప్రకటితమైంది. తమ ఆశయాన్ని సాధించేందుకు నిశితమైన తీవ్రమైన అభివ్యక్తి విధానాన్ని ఆశ్రయించారు. దీనికై మర్యాదను అతిక్రమించడానికీ నాగరకతను త్యజించడానికి సంస్కారాన్నీ వీడడానికీ వెనుదీయరు. ఒక దుస్థితిని చూచినపుడు, దుస్థితిని గురించి ఆలోచన కలిగినపుడు మతి ఏవిధంగా చలిస్తే ఆ విధంగానే ఏ నియంత్రణం లేకుండా స్పందించడం, అభివ్యక్తం చేయడం జరిగింది.

సమాజంలో నెలకొన్న అన్యాయాల్నీ ఆక్రమాల్నీ అవినీతినీ మౌఢ్యాన్ని బట్టబయలు చేసేందుకు కసీ కోసం అసభ్యత తీవ్రస్థాయికి చేరుకుంటుంది. ఇది మొదట్లో సభ్యసమాజంలో కొంత సంచలనాన్ని కలిగించింది. వీరు కోరేదీ ఇదే. సమాజం దృష్టిని ఈ విషయాలపై ప్రసరింపజేయడమే కాబట్టి ప్రయోజనంలో ఈ మేర కృతకృత్యులయినట్లే! ఈ స్థితిలో అరాచకతత్త్వం అశ్లీలగుణం కొంత చోటుచేసుకోవడం సహజం. అత్యుద్రేకంలో వివేచనకాస్కారం లేదు. గతంలోని ప్రతిదీ ధ్వంసం చేయాలనే, వర్తమానంలో స్థితుల్ని తిరస్కరించాలనే తప్ప ప్రత్యామ్నాయంగా నిర్మాణ సూచన లేకపోవడంతో లక్ష్యం స్పష్టం కాకపోవడంతో ఇది వరద పొంగులా వచ్చింది. అంతలో అణగిపోయింది. వెనువెంటనే విరసంలో లీనమైంది. అస్తిత్వవాదచ్ఛాయలతో మొదలైంది, విధ్వంసన గుణంతో ఉద్యమించింది.

విప్లవ భావసామ్యంతో విరసంలో చేరింది. ఇది తాత్కాలికమైన అవసరం తీరిన సాధనంగా మిగిలిపోయింది. అయితే ఈ పార్శ్వంలో ప్రజాస్వామ్య విజయానికి అవినీతినీ అక్రమాన్నీ అసమానతలను తొలగించేందుకు సమాజానికి "షాక్ ట్రీట్‌మెంట్"గా దీన్ని గుర్తించినపుడే, దీనికి న్యాయం చేకూరుతుంది. చైతన్యరహితమైన సమాజాన్ని ఎత్తిచూపే నగ్నముని "కొయ్యగుర్రం" ఈ సందర్భంలో గుర్తుకువస్తుంది. ఒక విధంగా దిగంబర కవిత్వం విరసం ఆవిర్భావానికి ప్రేరక దశగా ఉపకరించింది. ఇది స్వేచ్ఛాకవిత్వంలో భాగంగా శక్తివంతమైన పాత్రను నిర్వహించింది.

2

మొత్తం మీద సిద్ధాంతపరంగా ఏ ఆదర్శాన్నీ ప్రపంచించలేదు. సామాజికమైన నిర్మాణాత్మకతను కనబరచలేదు. కేవలం నిరాశనిస్పృహతో విధ్వంసానికే ఉద్యమించింది. ఉన్న విలువల పట్ల నిరసనం తిరస్కారం వినాశనం కోరింది. కాని వాటి స్థానంలో కొత్త విలువల్ని గురించి ఆలోచించలేదు. వాటి ప్రసక్తి కూడా లేకపోవడంతో విమర్శకు గురి అయింది. అయినప్పటికీ ఇది ఏర్పరచుకున్న పరిమితుల్లోని వర్తించింది, దీన్ని అధిగమించిన అంశాల్ని ఆపేక్షించడం న్యాయం కాదన్న అభిప్రాయమూ ఉంది. దిగంబర కవులు ఉద్దేశించని వాటిని కోరడంలో ఔచిత్యం లేదు. అందుకే ఇది తత్కాలంలో పరిమితమైన ప్రయోజనాన్ని నిర్వర్తించి మిగిలిపోయిన సాధనంగానే నిలిచింది. ఏమైనప్పటికీ విస్మరించిన ప్రగతిశక్తుల కార్యకలాపాలకు వీలు కలిగించింది. వాళ్ళ సానుభూతినీ పొందింది. వాళ్ళు ఒక విధంగా చేయలేక మిగిలిన పనిని వీరు చేస్తూన్న తృప్తిని కలిగించింది. రమణారెడ్డి మాటల్లో "దిగంబర కవులు జీవితంలో కశ్మలాన్ని పబ్లిక్‌గా కడిగేయడానికి అవసరమయ్యారు" ఈ అత్యవసర చర్యకు తాత్త్వికమైన పునాదిలో పని లేదు. ఆదర్శాల ఆలోచనతో నిమిత్తం లేదు.

మనిషిలోని సహజమైన స్వచ్ఛమైన స్వరూపన్ని గుర్తించేందుకూ దానిపట్ల ఆసక్తిని పెంచేందుకూ ఉద్యమించింది. దీని కవరోధంగా ఉన్న వాటినన్నిటినీ తిరస్కరించింది, వినాశనానికీ సంకల్పించింది. దీని లక్ష్యం ఈ మాత్రమే. పరోక్షంగా

సమాజంలో స్వేచ్ఛనూ న్యాయాన్నీ సమానత్వాన్ని అభిలషించే స్థూలమైన ప్రజాస్వామ్య గుణమూ స్ఫూర్తికి వస్తుంది. అంతేకాని దీని సమాలోచనకు వేరే పార్శ్వాలకుపయోగించే కొలబద్ధల్ని ఉపయోగించరాదు. ఈ ఉద్దేశంతో తమ పనికై అవలంబించిన అశ్లీలమైన అభివ్యక్తి విధానం, ఈ శతాబ్ది అరవైయవ దశకంలో దారితప్పుతున్న ప్రజాస్వామ్య వ్యవస్థపై యువశక్తి కోపాన్నీ ద్వేషాన్నీ అసహనాన్నీ అశాంతినీ ప్రకటిస్తుంది. పాశ్చాత్య భావ జాలంతో ప్రభావితమైనప్పటికి (బిట్నిక్స్, ఆంగ్రీయంగ్‌మన్) దేశానికి సంబంధించిన స్థితిగతులతో సంవదిస్తూ స్వతంత్రమైన అస్తిత్వాన్ని పొందిందీ దిగంబర కవిత్వం. ఆ తరువాత పశ్చిమబెంగాల్‌లో తలెత్తిన నగ్జల్‌బరీ రాజకీయ ప్రభావానికి గురియైంది. దీనితో దిగంబర పార్శ్వం అధ్యయన భాగంగా మిగిలిపోయింది.

భైరవయ్య మాటల్లో "దిగంబరత్వమంటే, బట్టలు విప్పి బారచాచి నడిరోడ్లో గంతులేయడం కాదు" "మనిషిలో అట్టడుగున బురదగుంటల్లో పడి ఉన్న మనిషిని లేవదీయడం, కళ్ల వెనక దాగి ఉన్న సిసలైన కన్నీళ్ళను ప్రసరించడం, నిజాల్ని నగ్నంగా చెప్పడం" అన్న మాటలు దీని అంతస్తత్వాన్ని పట్టిస్తున్నాయి. మనిషిలో మనస్సుపై నెలకొన్న సమాజంలో చెడుకీ బాధలకూ దారితీసే ముసుగుల్ని తొడుగుల్ని రంగుల్ని తొలగించి, సహజమైన వ్యక్తిత్వాన్ని సమాజశ్రేయస్సుపై దృష్టితో ఆవిష్కరించడమే వీరి ఉద్దేశం! దీనిపై దిగంబరకవిత్వం నిర్మితమైంది. జీవితంలో హైన్యంలో దైన్యంలో చిక్కుకున్న నిజరూపాన్ని స్పష్టంగా నిర్భయంగా ఆవిష్కరించే ప్రయత్నం జరిగింది. అశ్లీలమైన అభివ్యక్తి "విద్యుదాహత చికిత్సగా" పనిచేసేందుకే అని విమర్శకుల అభిప్రాయం. ఇది తత్కాలంలో సత్వర ఫలితాన్ని ఆశించిందీ.

"నన్నయ్యను నరేంద్రుని బొందలోనే నిద్రపోనియ్యి లేపకు! పీక నులిమి గోతిలోకి లాగుతాడు" మొదలుగా ఆవేశం తీవ్రస్థాయికి చేరుకొని జుగుప్సను కలిగిస్తూ విధ్వంసగుణంతో దూసుకపోయే భావజాలం వెల్లువలా ఉక్కిరిబిక్కిరి చేస్తూ ముంచెత్తుతుంది. దిగంబర కవులు తమ తమ ప్రత్యేకమైన వ్యక్తిత్వాలతో స్వేచ్ఛా కవిత్వానికి సామాజిక స్పందనతో వైవిధ్యాన్ని చేకూర్చడమే కాక శక్తివంతమైన సాధనంగాను సిద్ధం చేసారు. నిరాశ నుండి నిస్పృహనుండి విషాదం నుండి అశాంతి

నుండి కపటం లేని మోసం ఎరగని స్వేచ్ఛ సమానత్వం న్యాయం కలిగిన సమాజంకై అన్వేషణలో భాగంగా దిగంబరమైన మనస్సు అవసరాన్ని భావించారు. ఎంతోకొంత మానవవికాసానికీ సమాజశ్రేయస్సుకూ దోహదం చేసేదిగా గుర్తించడం నిర్మాణాత్మకమైన సాహిత్య విమర్శకు దారిచూపడమే.

దిగంబర పార్శ్వాన్ని విశ్లేషిస్తే, కనిపించే అంశాలు –

1. నిజమైన సహజమైన స్వచ్ఛమైన మనోరూపం పట్ల అభిలాష కలిగి ఉండడం.
2. దీన్ని ఆవిష్కరించటానికి సూటిగా స్పష్టంగా ఏ అదుపు లేకుండా తోచింది తోచినట్లుగా భావజాలాన్ని పైకి చిమ్మేయడం.
3. సమాజంలో వచ్చిన చారిత్రక సామాజిక సాంస్కృతిక పరిణామ దశల్ని పట్టించుకోకుండా, వాటి అవసరాలెంత వరకో ఆలోచించకుండా వైయక్తికమైన ధోరణిని ప్రదర్శించడం.
4. అశ్లీలం అనుచితం ఆటవికమన్న భావను విస్మరించడం.
5. సమాజంలో ముందు విధ్వంసం కోరడమే గాని ఆపైన ప్రత్యామ్నాయ నిర్మాణాన్ని తలచకపోవడం.
6. రచయితలు కళాకారులు నాయకులు ఒకరేమిటి అందరినీ బట్టబయలు చేసి వారిలోని వికృత స్వరూపాన్ని బహిరంగపరచడం.
7. మానవ సంబంధాల్ని వ్యాపారంగా విషాదంగా మార్చే వ్యవస్థను అంతం చేయాలనుకోవడం.
8. ఏ సిద్ధాంతాన్ని అవలంబించకుండా, ఏ నిర్మాణాత్మకమైన ధోరణి లేకుండా సత్వర ఫలితాల్ని ఆశించడం.
9. బురదగుంటలో అట్టడుగున్న పడి చిక్కుకున్న దుస్థితి నుండి మనిషిని పైకి తీసే ప్రయత్నంలో మానవీయాన్ని ప్రకాశమానం చేయడం.

10. విద్యుదాహత చికిత్సను తలపించే అశ్లీలమైన అభివ్యక్తిని అవలంబించడం, జుగుప్సనూ భీభత్సాన్నీ సంతోషంగా స్వీకరించడం.

11. చేతనావర్త కవిత్వం రావడానికి కారణమవడం.

12. విప్లవ రచయితల సంఘం ఆవిర్భావానికి బీజభూతమైన కారణం కావడం.

13. స్వేచ్ఛాకవిత్వానికి అభివ్యక్తిలో విస్తృతినీ వైవిధ్యాన్నీ కలిగించడం.

14. స్థానికంతో పాటు జాతీయ అంతర్జాతీయమైన అవగాహనను ప్రోత్సహించడం.

15. రచనలో దిగంబరత్వానికి సాధారణ స్థాయి నుండి పై స్థాయిదాకా అర్థాంతరాలను భావింపజేసే తాత్త్విక దృష్టిని కలిగి ఉండడం.

సమాజంలో అడుగున బురదలో మనిషికోసం, నిజరూపంపై దృష్టితో, అరాచకం అశ్లీలం అనే రెక్కలతో విధ్వంసంకై వీచే మినీఝంఝ దిగంబర కవిత్వం. శ్రీశ్రీ మాటల్లో – "దిగంబర కవులు, ముళ్ళగులాబీలు, ఆగ్రహభార్గవులు, పగబట్టిన చక్షుశ్రవులు". దిగంబర కవిత్వం సమాజంలోనెలకొన్న పతనస్థితులపట్ల తీవ్రమైన ఆక్రోశాన్నీ ఆగ్రహాన్ని అదుపులేని అభివ్యక్తిలో ఆవిష్కృతమైన నిరసన పార్శ్వంగా నిలిచింది.

# 8. చేతనావర్త పార్శ్వం

భారతీయ చింతనతో సాంస్కృతికమైన నవోజ్జీవన లక్ష్యం కలిగిందీ, తాత్త్వికమైన భూమికతో వర్తించేదీ, సామాజిక సమస్యల పట్ల విహగావలోకనం కలిగిందీ, చేతనావర్త పార్శ్వం. దిగంబర కవిత్వానికి ప్రతిక్రియగా ఇంచుమించు సమాంతరంగా ఆవిర్భవించింది. చేతనయొక్క ఆవర్తం లేదా చేతనతో ఆవర్తం కలిగిందీ. ఆవర్తమంటే ఒక చుట్టు చుట్టి రావడం, ఇందులో క్రమమూ వేగమూ ఉంటాయి. భౌతికమైన స్థితితలం నుండి మానసికమైన నిర్మాణరూపాన్ని కలిగింది. ఈ నిర్మాణరూపం సాధారణమైన నైతికం నుండి ఆధ్యాత్మికం దాకా పర్యాప్తమైంది. ఇందులో సమాజతలంపై భౌతికంతో పాటు మానసికమైన వికాసాన్ని కోరుతూ, ఆత్మోన్నతి నభిలషించే ఆదర్శం లక్షితమైంది. చేతనావర్త కవులు నలుగురు. 1. కోవెల సంపత్కుమారాచార్య, 2. పేర్వారం జగన్నాథం, 3. కోవెల సుప్రసన్నాచార్య, 4. వేనరెడ్డి. ఈ నలుగురి కవిత్వం వారివారి ప్రత్యేకతలతో వ్యక్తిలో చేతన యొక్క వివిధావర్తాల చిత్రణాన్ని ఉద్దేశించింది. ఇదంతా విశ్వాత్మ చేతనలో భాగంగా గుర్తించడంతో ప్రత్యేకతను సంతరించుకుంది. చేతనావర్తం మొదటి సంపుటం 1969లో అరవిందులు జన్మించిన ఆగస్టు నెలలో వచ్చింది. రెండో సంపుటం 1970లో వెలువడింది. ఈ కవిత్వం తాత్త్విక తలంపై భౌతికశక్తుల్ని పరిగణిస్తూ అంతశ్శక్తికీ అతీతశక్తికీ దివ్యదశలకూ ప్రాధాన్యాన్ని ఇవ్వడం కన్పిస్తుంది.

వ్యక్తి సంస్కార స్థితులతో వికాస దశలతో జీవితంలో ఆరోహణ నభిలషిస్తుంది. అయితే ఒక్కొక్కరి కవిత్వంలో ఒక్కొక్క విధమైన అంతస్తత్వం ఆవిష్కృతమయింది. జీవితంలో ఆశ, నిరాశ, ధైర్యం, భయం, సుఖం, దు:ఖం, వెలుగూ, చీకటీ ఇట్లా అనేక ద్వంద్వాల మధ్య కదలే జీవితంలో వివిధ దశల్లో చైతన్యం ఆవర్తాన్ని పొందుతుంది. ఆవర్తంతో సంధి దశల్లో కల్లోలం నుండి అశాంతి నుండి మనిషి సచేతనంగా ఉద్గమించడం జరుగుతుంది. పై దశలో దీనికి ప్రయత్నమూ సాధనమూ అవసరం. ఇందుకు తగిన రీతిలో జ్ఞానం, వివేకం, శిక్షణ, సాధన, లక్ష్యమూ తోడ్పడతాయి. ఆరోహణలో క్రమంగా మనస్సు దివ్య జీవనాన్ని స్పృశించడం

జరుగుతుంది. ఇందులో 1) అరవిందుల దివ్య జీవన సాధనం, దర్శనం, 2) సంప్రదాయ బంధురమైన ఆత్మ – పరమాత్మ తత్వోన్మీలనం, 3) రామకృష్ణ వివేకానందుల బోధల పరమార్థం, 4) భారతీయ సంస్కృతికి చెందిన తేజోరేఖలు కొన్ని అందుతాయి. స్థూలంగా ఇదీ దీని తాత్త్వికభూమిక. ఇక సాహిత్యానికి వస్తే రచయిత ఏ సిద్ధాంతాన్నైనా ఏ రాజకీయ దృక్పథాన్నైనా కలిగి ఉండవచ్చు. కాని రచన మాత్రం కవితాత్మకంగా ఉండాలన్నదే వీరి ముఖ్యమైన ఆశయం. జీవితాన్ని గురించి ఆలోచన జరుపుతూనే, అనుభవాన్ని స్పందింపజేస్తూనే, తాత్త్వికస్పర్శను కలిగి ఉండడం చేతనావర్త కవుల ప్రత్యేకత. ఇది ఈ నలుగురిలో ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధమైన కవితా రూపాన్ని పొందింది, ఒకే మూసలో పోసినట్లు కాకుండా వారి వారి స్వతంత్రమైన వ్యక్తిత్వ వికాసాల్ని భాసింపజేస్తూంది.

సంపత్కుమార "ఈ క్షణం మీద పరచిన ఊహలతో కాలానంత పరిణామాన్ని గుర్తించకుండా బ్రతికే మనిషి భవిష్యత్తు శూన్యం". ఇందులో వర్తమాన జీవితం సూచించారు. మార్పు అనివార్యమన్న తత్త్వం ప్రపంచితమైంది. దీన్ని గుర్తించడం వివేకవంతమైందన్న భావనతో పర్యాప్తమైంది. ఈ వివేకం లోపిస్తే అంతా వ్యర్థమే. సాధారణమైన లౌకికస్థితి చిత్రణం ఆధారంగా, దీని వెనుకనుండి పనిచేసే పరివర్తన శక్తినీ, దాని ప్రభావాన్నీ, జీవిత గమనాన్నీ, వ్యక్తి కర్తవ్యాన్నీ భావింపజేస్తూంది.

పేర్వారం జగన్నాథం "మంచికైనా, చెడుకైనా మానవుడే కేంద్రబిందువు". మనిషి ఔన్నత్యాన్ని ఆవిష్కరించే ఈ పంక్తులు, మనిషిలోని శక్తిని గురించి ప్రేరేపిస్తాయి. ఈయన కవిత్వంలో వివేకానందుల స్ఫూర్తితో వెలసిన భావజాం మనస్సులో మెదలుతుంది. ఇది సంపూర్ణ జీవితంలో ఒక దశకు చెందింది. అవసరాల్ని బట్టి ప్రాధాన్యం కలిగిందీ, ఆదర్శవంతమైన జీవితాన్ని ఉద్దేశించిందీ.

సుప్రసన్నాచార్య వీరిలో అధికమైన ఆధ్యాత్మికానుభవం బింబించే కవి, "అతడు పాడతాడు ప్రబోధసంగీతాన్ని, పిలుస్తాడు ఆనంద ప్రభాతమై" ఈ కవి ప్రబోధం, ఆనందంతో వేరు వేరు దశల్లో పొందే భౌతికాధ్యాత్మికానుభవరూపాలు. ప్రబోధంలో వేరుగా కన్పించే వ్యక్తిత్వం, ఆనందంలో ఒకటైపోయిన వ్యక్తిత్వమూ స్ఫూర్తికి వస్తాయి.

భిన్నత్వం నుండి ఏకత్వానికీ, తమస్సు నుండి ఉదయానికీ ప్రయాణం మెదులుతుంది. ఆవర్తంలోని మలుపుల్ని సూచిస్తుంది.

మరో వేనరెడ్డి "కాలాన్ని కత్తిరించి చూడకు, దేశాన్ని విభజించి చూడకు". కాలం అఖండమైంది. దేశం సమగ్రమైంది. వీటిని ఒకే ప్రవాహంగా అఖండంగా దర్శించడంలో కాల్పనికమైన ఆనందం ఉంది.

సంపత్కుమార రచనలో భారతీయాత్మ చైతన్య ప్రసారంతో పాటు సామాజిక జీవనగతులూ ప్రాముఖ్యం వహిస్తాయి. పేర్వారం రచనలో నిందాస్తుతి, స్తుతినింద మార్గంలో అధిక్షేప భాసురంగా జీవితచిత్రణం కన్పిస్తుంది. వాస్తవికత మానవత ఈయన కవిత్వానికి రెండు చక్రాలుగా ఉన్నాయి. సుప్రసన్నాచార్య రచనలో భారతీయాత్మ చైతన్యంతో పాటు ఆధ్యాత్మిక జీవన భూమికలు దర్శనమిస్తాయి. ఇవి జీవితంలో సుగమ సుందరమైన అనుబంధాన్ని కోరేవి.

1. చేతనావర్త కవిత్వం భారతీయ జీవనంలో నిహితమైన తాత్త్విక భూమికకు ప్రాధాన్యమిస్తుంది.

2. ఐహిక, మానసిక, ఆధ్యాత్మిక స్థాయిలో ఉత్తరోత్తర బలీయత్వాన్ని కోరుతుంది.

3. సంప్రదాయ భావనలో మౌలికమైన విలువల్ని కాపాడే ధోరణి కలిగింది.

4. సామాజికంగా కాలాన్ని బట్టి, కొన్ని మార్పులకు సిద్ధపడుతుంది.

5. సామ్యవాదాన్ని తిరస్కరిస్తుంది.

6. సామాజిక రాజకీయవాదాల్ని గురించి అంతగా పట్టించుకోదు. భారతీయ సంస్కృతిలో మౌలికతేజాన్ని ఆదర్శంగా గ్రహిస్తుంది.

7. వ్యక్తి ఆదర్శాలతో పాటు కవిత్వంలో అనుభూతికీ ప్రాముఖ్యాన్నిస్తుంది.

8. దేశాన్ని మాతృమూర్తిగా దర్శించి, చైతన్యశీలమైన సాంస్కృతికమైన తేజాన్ని ఆవిష్కరిస్తుంది.

ఈ పార్శ్వం వ్యక్తిలో ప్రత్యేకతల్ని గుర్తిస్తుంది. భౌతికావసరాల్ని పరిగణిస్తుంది. మానసిక లోకాన్ని దృష్టిలోకి తీసుకుంటుంది. ఆత్మరూపాన్ని దర్శించే ప్రయత్నం చేస్తుంది. భారతీయ సంస్కృతికి సంబంధించిన మౌలికమైన విలువల్ని ప్రతిఫలింపజేసే ఉద్దేశం కలిగిందీ. వ్యక్తికీ సమాజానికీ మధ్య భౌతికానికీ ఆధ్యాత్మికానికి మధ్య భౌతికానికీ ఆధ్యాత్మికానికీ మధ్య సముచితమైన అనుబంధాన్ని స్థాపిస్తుంది. జీవితంలో సభ్యతనూ సంస్కారాన్నీ వివేకాన్నీ ఆనందాన్నీ సౌభాగ్యాన్నీ ఆదర్శాన్నీ ఆపేక్షిస్తుంది. ఈ కవిత్వం ప్రజాస్వామ్యంలోని స్వేచ్ఛను అవసరం మేరకు ఉపయోగించుకుని వర్తించింది. స్వేచ్ఛాకవిత్వంలో ప్రత్యక్ష రాజకీయ ప్రభావాలకు దూరంగా కవిత్వ కళతో పాటు తాత్త్విక భూమికను గురించీ ఆలోచింపజేస్తుందీ చేతనావర్త పార్శ్వం.

# 9. దళిత పార్శ్వం

స్వేచ్ఛా కవిత్వంలో ఈ శతాబ్ది చివరలో యుగాలుగా అణచబడిన దళితుల దృక్పథంతో అవతరించింది దళిత పార్శ్వం. చారిత్రక సామాజిక భూమికపై పరిణమించింది సరికొత్త దృక్పథాన్ని విలువల్ని ప్రవేశపెట్టింది. వస్తుసవ్యతతో నిర్దిష్టమైన సామాజిక లక్ష్యంతో ఉపక్రమించింది. భారతీయ సమాజంలో అనేక కారణాలవల్ల కుల ప్రాతిపదికపై నిర్మితమైన వ్యవస్థలో ఎంతో కాలంగా వేరు చేయబడిన ప్రజలు బహిష్కృతులూ, తిరస్కృతులూ పొందిన చైతన్యప్రభావరూపమే ఈ పార్శ్వం. దళితుల ఆలోచనా తరంగాలు హృదయ ప్రకంపనలే దళిత స్వేచ్ఛా కవిత్వం. స్వాతంత్ర్యానికి పూర్వం ఈ దిశలో కృషి జరిగినప్పటికీ, స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్యంలో రాజ్యాంగబద్ధంగానూ అపూర్వమైన అవకాశాలతో దళిత పురోగమనం ఒక చారిత్రకమైన పరిణామ దశగా రూపొందింది. సామాజిక రాజకీయ ఆర్థిక న్యాయాన్ని కోరుతూ సాగే దళితుల ఉద్యమశక్తినీ పురోగమనతత్త్వాన్నీ స్వేచ్ఛాకవిత్వం మాత్రమే స్ఫుటంగా ప్రతిబింబించింది. దళితులు కోరేది, అస్పృశ్యత అంతరించి సమాజంలో అస్తిత్వంతో అర్థవంతమైన ఆత్మగౌరవ యుతమైన వికాసం. దీనికవసరమైన వాతావరణం ముందు నిర్మితం కావాలి. దైన్యాన్నీ హైన్యాన్నీ వదలి స్వేచ్ఛగా బ్రతుకు గడచే పరిస్థితులు ముఖ్యం. భౌతికమైన భద్రతతోపాటు మానసికమైన అశ్వాసమూ అవసరం.

భారతదేశంలో నెలకొన్న కులభేదాన్ని నిర్మూలించేందుకు గౌతమబుద్ధుడు కృషి చేసాడు. తరువాత మధ్యకాలంలో కబీర్, వేమన, పోతులూరి వీరబ్రహ్మ మొదలైన వాళ్ళు సంస్కరణ మార్గానికి వ్యాప్తిని చేకూర్చారు. ఆధునిక యుగంలో మహాత్మాగాంధి, జ్యోతిరావుపూలె, డాక్టర్ అంబేద్కర్ ప్రధానంగా కన్పిస్తారు. దళితుల్ని పీడించే మొదటి సమస్య అస్పృశ్యత. ఇది మానసికమైన వేదనకు గురిచేసేది. ఈ సమస్య ముందు తొలగింపబడాలి. గాంధీజీ హరిజనోద్యమం ఈ దిశలో కొంత ప్రగతిని సాధించింది. పూర్వం బుద్ధుని వర్ణరాహిత్య దృక్పథంలో ఎందరో పంచములు బౌద్ధులయ్యారు. అంబేద్కర్ కూడా ఈ మార్గంలో పయనించడం జరిగింది. ఈ దిశలో దళితుల్ని ప్రేరేపించడమూ కన్పిస్తుంది. పూర్వకాలంలో దళితులెందరో ఇస్లాం, సిఖ్, క్రిస్టియన్

మతాల్లోకి వర్ణవిభేదం కారణంగా అక్కడక్కడా పరివర్తితులయ్యారు. గాంధీజీ హరిజనోద్యమం సామాజిక తలంపై నిర్మాణాత్మకమైన మార్పుకు నాంది పలికింది. మహాత్ముని నాయకత్వంలో దళితులు జాతి మహాప్రవాహంలో కలిసి జీవనం సాగించే స్థితికవకాశమేర్పడింది. అంబేద్కర్ మాటల్లో మహాప్రవాహంలో కలిసి జీవనం సాగించే స్థితికవాశామేర్పడింది. అంబేద్కర్ మాటల్లో 'కులం పునాదుల మీద మీరు దేన్ని నిర్మించలేరు. ఒక జాతిని నిర్మించలేరు. ఏదీ సంపూర్ణంగా నిర్మాణం కాజాలదు.' ఈ మాటల్లో యథార్థం స్వాతంత్ర్యానంతరం మరీ అనుభవానికి వచ్చింది. ఆధునిక యుగంలో దళితుల వికాసానికై ఉద్యమించి వారి జీవితాలకు కొత్త స్వరూపాన్ని ఇచ్చే ప్రయత్నంలో అంబేద్కర్ పాత్ర విస్మరించరానిది. జాషువాలో గాంధీజీ ప్రేరణతో పాటు అంబేద్కర్ స్ఫూర్తి కూడా ఉంది. "ముని అంబేద్కరు నా సహోదరుడు మాకై యష్టకష్టాలకుం బలియై సీమకు బోయి క్రమ్మరిన విద్వాంసుడు" అని జాషువా అన్నాడు. అయితే జాషువాపై గాంధీజీ ప్రభావమే అధికంగా ఉంది.

స్వేచ్ఛా కవిత్వానికి వస్తే బహుజనోద్యమం 1980 నుండీ, దీనికి కారంచడు (1985)తో పాటు చుండూరు, నీరుకొండ, పదిరి, కుప్పంలో దళితులపై జరిగిన అత్యాచారాలు విపరీత కృత్యాలు దళిత పార్శ్వానికి క్రియాశక్తులుగా పనిచేసాయి. వెనువెంటనే దళితుల్లో చైతన్యం ప్రబలింది. దళిత సభలూ సమావేశాలూ జరిగాయి. అంబేద్కర్ ఆదర్శంగా దళిత కవిత్వం విస్తరించింది ముఖ్యంగా 1985 నుండి ఒక నిర్దిష్టమైన స్వరూపాన్ని నిశ్చయమైన లక్ష్యాన్ని కలిగి వర్తించింది. యుగాలుగా భారతదేశంలో నెలకొన్న వర్ణవ్యవస్థకు కాలం చెల్లిపోయింది. పరివర్తన దిశలో విపరీత కృత్యాలు కారణంగా ఒక విధమైన ప్రతిక్రియ భావంతోనూ రూపొందింది. సమాజంలో బహిష్కృతులూ తిరస్కృతులూ దీనులూ హీనులూ ప్రధాన ప్రవాహం నుండి జారిపోయిన దళితుల అవమాన జీవితం ఇతివృత్తమైంది. వాళ్ళ సమస్యలు స్థితిగతులూ ఆలోచనా క్షేత్రాలయ్యాయి. వారిపై జరిగే దౌర్జన్యాలు అన్యాయాలు అక్రమాలూ అవమానాలూ ఖండింపబడడమేగాక నిరసనంతో ప్రతిఘటనంతో పోరాటంతో ఎదుర్కొనేందుకు సిద్ధం కావడం ఒక చారిత్రక పరిణామం. దీని వెనుక హాహాకారం ఉంది, బాధ ఉంది, వేదన ఉంది. ఈ కారణంగా అంతటా

సహకారమందింది. సానుభూతి ప్రబలింది. ఈ అంశాల ప్రతిఫలనంతో స్వేచ్ఛా కవిత్వంలో దళిత పార్శ్వం రెండు విధాలుగా కన్పిస్తుంది. 1) దళితుల సమస్యల్ని గురించి దళితులు సామాజిక చైతన్యంతో వ్రాసింది, 2) దళితేతరులు దళితుల్లో చైతన్యం కలిగించే ఆలోచనతో వ్రాసింది. ఈ రెండింటి లక్ష్యం ఒకటే. మొదటి విధంలో వెంటనే ఉపక్రమించే తీవ్రత, ప్రతిక్రియ ధోరణి కన్పిస్తుంది. రెండోదానిలో సానుభూతి సమన్వయ ధోరణి ఉంది.

గాంధీజీ హరిజనోద్యమం ఈ దేశం పునరుజ్జీవనికి పునర్నిరాణానికెంతో దోహదం చేసింది. అంబేద్కర్ దళితోద్యమం దీనికి కొత్త శక్తినిచ్చింది. దళితుల్లో సంకల్ప శక్తిని దృఢతరం చేసింది. ఉద్యమగుణాన్ని పెంపొందించి అంబేద్కర్ అయస్కాంత వ్యక్తిత్వం సరికొత్త వాతావరణాన్ని ఉద్బుద్ధం చేసింది. దీనికి స్వాతంత్ర్యా నంతరం నెలకొన్న ప్రజాస్వామ్య వ్యవస్థ ఎంతో దోహదం చేసింది. దళిత సమస్య మూలకారణాల్లో 1) సామాజికం (అస్పృశ్యత) 2) ఆర్థికం, 3) మానసికం అనేవి ముఖ్యమైనవి. వీటిని పరిష్కరించేందుకు సుదీర్ఘమైన ప్రణాళిక, చట్టపరమైన చర్యలతో పాటు ఉదార వర్తనమూ అవసరం. భారతదేశ రాజ్యాంగంలో నిర్దేశక సూత్రాల్లో పౌరులందరికీ సమానమైన హక్కులు పొందుపరచబడినాయి. అందుకు తగిన అవకాశాలూ కల్పింపబడినాయి. వెనుకబడిన వారికీ దళితులకూ గిరిజనులకూ ప్రత్యేకమైన సదుపాయాలు చేకూర్చబడినాయి. డా. అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతల్లో ఒకరు. దళితుల సమస్యల్ని కూలంకషంగా అధ్యయనం చేసి విశాలమైన అవగాహనతో భవిష్యత్తుపై దృష్టితో నిర్మాణాత్మకమైన చర్యల్ని రాజ్యాంగంలో పొందుపరచేట్లు చేసి గొప్పవని చేసాడు.

మహారాష్ట్రలో 1960 ప్రాంతంలో అంబేద్కర్ నాయకత్వంలో దళితచైతన్యం వికసించింది. దీనితో దళిత సాహిత్యమూ ఉద్భవించింది. నారాయణ్ సర్వే, నామ్‌దేవ్‌షేక్, కేశవ్‌మేష్‌రామ్, మల్లికా ఆర్నే మొదలైన రచయితలు వర్ధిల్లారు. గుజరాత్‌లో దళిత పాంథర్స్ పేరిట 1975లో ఉద్యమంతో దళిత సాహిత్యం వెలువడింది. యోసప్ మక్వాడ్, ప్రవీణ్ గద్వీ మొదలైన రచయితలు వచ్చారు. అన్ని భారతీయ భాషల్లోను ఇంచుమించు ఒకటి రెండు దశాబ్దాల తేడాతో దళిత సాహిత్యం

ప్రవర్తిల్లింది. ముఖ్యంగా కవిత్వంలో అందునా స్వేచ్ఛాకవిత్వంలో దళితుల బాధలూ, ఆవేదన, ప్రగతీ, లక్ష్యమూ, సమస్య పరిష్కారమూ, చారిత్రక సామాజిక నేపథ్యంలో చిత్రితమైనాయి. ఇందులో ఒక పాయ అహింస శాంతి సమన్వయ మార్గాన్ని అవలంబించింది. మరో పాయ ప్రతిఘటననూ అశాంతినీ, సంఘర్షణనూ ఎన్నుకుంది. అయితే ప్రజాస్వామ్యంలో అవకాశాల వల్ల క్రమంగా సమాజంలో దళితుల సమస్యలు శాంతియుతంగా పరిష్కరించుకొనే ధోరణితో పాటు ఆశ, విశ్వాసమూ ప్రబలుతూంది. ఇది మంచి సంకేతం. స్వేచ్ఛా కవిత్వం దళితుల స్పందనకు సాధనంగా ఉంది. వాళ్ళ సమస్యలూ చర్యలూ బాధలూ ఆశలూ లక్ష్యాలు ప్రకటనకు వేదికగా ఉపకరిస్తూంది.

స్వేచ్ఛా కవిత్వం, యుగాల అసమానతల్లి రూపుమాపే ఉద్దేశంలో సామాజిక న్యాయాన్ని కోరే లక్ష్యంతో దళితుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే ధోరణిలో, అస్పృశ్యతను రూపుమాపే భావనతో ప్రజాస్వామ్యంల గురుతరమైన పాత్రను నిర్వహిస్తూంది. దళితుల్లో స్వేచ్ఛను గుర్తు చేయడం, దళితుల పట్ల దుర్వ్యవహారాన్ని నిరసించడం, అస్పృశ్యతను నివారించడం, విద్యను అందుబాటులోకి తేవడం, ఉపాధి సౌకర్యాలకూ అభివృద్ధి కార్యక్రమాలకూ సరియైన అవకాశాలు కల్పించడం మొదలుగా ఆధునిక దళిత సమాజ నిర్మాణాన్ని ప్రోత్సహిస్తుంది. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఇందులో మౌలికమైన అంశాలపై దృష్టి ప్రసరించడం జరిగింది. ఇది హరిజనోద్ధరణకు పునాదిగా నిలచింది. ఆ తరువాత అంబేద్కర్ నాయకత్వంలో జరిగిన కృషిలో దళిత సముత్థానం విస్తరించింది. ఈ పరివర్తన కాలంలో స్వేచ్ఛా కవిత్వం దళిత స్పృహను దళిత స్పందననూ దళిత పురోగతినీ సంపూర్ణంగా ప్రతిఫలింపజేసింది.

ఒకవైపు గాంధీజీ ఆదర్శాలకనుగుణంగా బోయి భీమన్న "గుడిసెలు కాలిపోతున్నాయి" రచనలో మరోవైపు నుండి అంబేద్కర్ ఆదర్శాలతో కొలకలూరి ఇనాక్ మొదలైన వాళ్ళు దళితుల పోరాట తత్త్వాన్ని ప్రతిబింబించే రచనలూ, దళిత పార్శ్వాన్ని పరిపుష్టం చేస్తున్నాయి. భీమన్న "గుడిసెలు కాలిపోతున్నాయి", ఇప్పుడున్న "వన్యవ్యవస్థ" నుండి "సవ్య వ్యవస్థ"ను కోరే దళిత జనాభ్యుదయాన్ని కోరే బలమైన

స్వరంగా వినిపిస్తుంది. వేదకాలంలో ఏ మతవిభజనమూ లేదు. మానవజాతి అంతా ఒక్కటే.

కులవ్యవస్థ ఉన్నంత వరకు సామాజికాభ్యుదయం జరగదని భీమన్న విశ్వాసం. ఈయన రచనలు ఆధునిక సమాజంలో దళితజన హృదయ స్పందనల్ని, వాళ్ళ ఆశల్ని ఆశయాల్ని సమస్యల్ని సమన్వయ పరిష్కారదిశల్ని సూచిస్తాయి. ఎన్నికల్లో దళితుల గుడిసెల్ని తగలబెట్టడం, వారిని అవమానం పాలు చేయడం, వారి ఆస్తుల్ని భగ్నం చేయడం, హింసించడం మొదలుగా కక్షలతో జరిగే ఆకృత్యాల్ని బట్టబయలు చేస్తూందీ రచన. "మా ప్రాణాలు తోడేస్తున్నారు, మా గుడిసెలు తగులబెట్టేస్తున్నారు" అన్న మాటల్లో సమస్య జటిలమైంది. దీన్ని అంతం చేయడానికి యువశక్తిపై ఆశతో యువతరానికాహ్వానం పలకడం జరిగింది. భీమన్న స్వేచ్ఛా కవిత్వ వ్యక్తిత్వం గుణాత్మకమైంది నిర్మాణాత్మకమైంది. సమస్యను సహేతుకంగా పరిశీలించే దృష్టి కలిగింది. ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రయోజనాన్ని ఆపేక్షించేదీ, సమాజ సుస్థితికి యత్నించేదీ, మనిషిలోని మానవత్వాన్ని ఆవిష్కరిస్తూ ఉన్నతమైన విలువల్ని కాపాడేదీ. ఒక్కొక్కమారు ఒక్క దళితుల వరకే పరిమితం కాక సమస్త పీడితుల్ని గురించి ఆలోచిస్తుంది, స్పందిస్తుందీ భీమన్న దళిత పార్శ్వం. "ధర్మసంస్థాపనార్థం ఈ గుడిసెలు మళ్ళీ మళ్ళీ అవతరిస్తుంటాయి, పోతూంటాయి. పుట్టుకొస్తూంటాయి" అంటూ, కారంచేడు దౌర్జన్యకాండను నిరసిస్తూ ఇనాక్ స్వేచ్ఛా కవిత్వ, సంఘర్షణ పథంలో ఆవిష్కృతమయింది.

స్వేచ్ఛా కవిత్వంలో దళిత పార్శ్వం, సూటిదనం, స్పష్టత నైశిత్యంతో ఉంది. అపుడపుడూ వ్యంగ్యాన్ని అధిక్షేపాన్ని కలిగింది. ఇది కొన్ని సందర్భాల్లో భావరూపాలతో ప్రత్యేకతలతో మరికొన్ని చోట్ల తాత్విక స్పర్శతో ప్రత్యేకతనూ భావింపజేస్తూంది. మొత్తం మీద ప్రధానంగా దళితుల్ని గురించి స్పందన గుణంతో అనుభవ శక్తితో వాస్తవజగత్తును ప్రతిబింబిస్తూంది. 1995లో దళిత మేనిఫెస్టో "విస్ఫోటనం" వెలువడింది. ఇది దళిత కవిత్వం పరిధుల్ని ప్రయోజనాన్ని నిర్దేశిస్తూంది. "ఇదిగో! జాగ్రత్త! జాగ్రత్తగా రానీయి మాటలు నీ నోరే మాట్టాడుతుందో సూసుకొనీ మాట్టాడు" మద్దూరి విజయశ్రీ మాటల్లో, దళిత చేతన నుండి బయటపడిన హెచ్చరిక సుస్పష్టం.

"నీళ్ళడిగితే నెత్తురిచ్చిన చోట నెత్తురు తాగటం తప్పదని చెప్పడానికి సాహసిస్తున్నాను" మద్దూరి నగేశ్ బాబు మాటల్లో అగ్ర కులానికి చెందిన ఉపాధ్యాయుని చేతిలో కన్ను పోగొట్టుకున్న దళిత విద్యార్థిని దృష్టిలో పెట్టుకొని వ్రాసిన పంక్తులు చర్యకు ప్రతిచర్యను ప్రోత్సహించడం గమనించవచ్చు. కరుణ నుండి హింసకు దారితీసే స్థితిలో తీవ్రవైఖరి గోచరిస్తుంది. "మా చెమట మట్టివాసనలు లేకుండా మీ ఇండ్లకు రంగెట్లా వచ్చిందని" ప్రశ్నిస్తాడు జూలూరి గౌరీశంకర్. సంపన్నుల జీవితంలో దళిత శ్రమకు వెలసిన రూపాన్ని దర్శిస్తాడు, దాని విలువను చిత్రిస్తాడు. "నేనిపుడు కొత్త భారతావనికి కొత్త తలనవుతున్నాను. నా జెండా రంగూ నా తల్లి రంగూ ఒకటే" నన్న ఎండ్లూరి సుధాకర్, తనలో బాధ కోపం ప్రకటిస్తూనే, జాతీయ భావనతో పురోగమన దృష్టితో కూడిన సమైక్య భావనను ఆవిష్కరిస్తాడు. "క్షమించు దళితా! క్షమించు! ఈ దేశం చిత్రపటాన్ని అర్థం చేసుకోడానికి నాకో జీవితకాల సమయం కావాలి" అంటాడు శిఖామణి. చరిత్రలో ఈ దేశ చిత్రపటం ఎన్నో కులాలతో మతాలతో భేదాలతో ఎంతో సంక్లిష్టమైంది. సామాన్యబుద్ధికందదు. దీనికి విశేషమైన ఆలోచన అవసరం. ఈ కవే మరోచోట, "రా! ఈనాటి ఆకాశపు కాన్వాస్ మీద రేపటి సూర్యుణ్ణి చిత్రించు" అంటారు. ఇందులో ఆశారూపమూ ఆత్మవిశ్వాసమూ కన్పిస్తాయి. ఇంకా లక్ష్మీనరసయ్య సతీష్ చందర్, కత్తి పద్మారావు, సంజీవరావు, బన్న ఐలయ్య మొదలుగా ఎందరో దళితకవులు దళిత పార్శ్వాన్ని అలంకరిస్తున్నారు. కత్తి పద్మారావు, "నాగేటి చాళ్ళలో, నేను చల్లిన విత్తులు నా పాదాల ఎరుపుతో మొలకెత్తుతున్నాయి" – శ్రమశక్తిని గుర్తించే ఈ మాటలు దాని అవసరాన్ని కవితాత్మకంగా చిత్రిస్తున్నాయి. "నా స్వరాన్ని నేను గుర్తించగలను" అని దళితజన ప్రత్యేకతను ఎత్తిచూపుతాడు.

రెండువేల యేండ్ల "నిశ్శబ్ద పీడనంలో నున్న నిశ్శబ్ద సంస్కృతి", ఇపుడు నిరసన ప్రతిఘటన పరివర్తన దిశగా సశబ్దంగా సక్రియగా పొందే చైతన్య వికాసానికి, ప్రాతినిధ్యం వహిసుందీ దళిత పార్శ్వం.

# 10. స్త్రీవాద పార్శ్వం

స్త్రీవాదం తెలుగు స్వేచ్ఛా కవిత్వంలో ఇరవయ్యో శతాబ్ది చివరి పాదంలో వ్యాప్తి చెందింది. 1975 నుండి ఉద్యమ రూపాన్ని పొందింది. 1985 నుండి వికాస దశకు చేరుకుంది. అంతర్జాతీయ సిద్ధాంతబలంతో ప్రవేశించింది. వివిధ దేశాల ప్రత్యేకతల పట్ల అవగాహనకు ప్రయత్నించింది. ఆధునిక యుగంలో పాశ్చాత్య ప్రపంచం నుండి వీచిన భావజాలంలో భాగమైంది. సమాజాన్ని సాహిత్యాన్ని ప్రభావితం చేసింది.

స్త్రీవాదం స్త్రీ దృక్పథంలో చారిత్రక సామాజిక పరిణామాల్ని పరిశీలిస్తుంది, విశ్లేషిస్తుంది. సమాజంలో నెలకొన్న జెండర్ వివక్షకు స్వస్తిచెప్పి సమానభావాన్ని స్థాపిస్తుంది. ఈ వాదం స్త్రీ సమాజంలో ఉత్సాహాన్ని నెలకొల్పింది. స్త్రీ సమస్యల పరిష్కారానికి ప్రేరేపించింది. స్త్రీలో స్వతంత్రమైన శక్తిని వికసింపజేసింది. జీవవంతమైన పాత్రను నిర్వహించింది. స్త్రీవాద స్వేచ్ఛా కవిత్వంలో స్త్రీ దృష్టితో ఆలోచనా కేంద్రంగా పితృస్వామ్య ఆధిపత్యానికి భిన్నంగా స్త్రీ అస్తిత్వాన్ని గురించి చింతన, ఆచరణాత్మకమైన మనోరూపాన్ని కలిగింది.

కాస్త వెనక్కి వెళితే ఇంగ్లాండులో 1630–50 మధ్య రాడికల్ ఇంగ్లీషు సొసైటి స్త్రీల విషయంలో అణచివేతను వ్యతిరేకించింది. మతపరమైన సమానత్వాన్ని సమర్థించింది. స్త్రీల స్వాతంత్ర్యంకై మెరీ వూల్‌స్టోన్ క్రాఫ్ట్ Mary Woolstone Craft 1970–97 మధ్య ఎంతో శ్రమించింది. John StaurtMill (1806–73) ఈ విషయంలో 1867లో రెండో సంస్కరణ బిల్లుతో ఎంతో మేలుచేసాడు. అమెరికన్ స్త్రీ సమాజం 1920లో ఓటుహక్కుకై పోరాడారు. విజయాన్ని సాధించారు. స్త్రీలపట్ల వివక్ష పనికిరాదన్న అభిప్రాయం బలపడింది. 1920–60 మధ్యకాలంలో స్త్రీల హక్కులకై స్వాతంత్ర్యంకై ఉద్యమాలు వెలసాయి. 1960 నుండి స్త్రీవాదం ప్రపంచవాప్యంగా పితృస్వామ్య వ్యవస్థలో భావజాలాన్ని విశ్లేషించి స్త్రీ దృష్టితో ఆలోచనా రూపాన్ని రూపొందించింది, ప్రయోజనాత్మకమైన పాత్రను నిర్వహించింది.

ఇటీవల మనీలాలో జరిగిన సమావేశాలు స్త్రీవాదంలోని నిర్మాణాత్మకమైన ధోరణుల్ని స్పష్టం చేసాయి. దీనికి అంతర్జాతీయ సంస్థల సహకారమూ లభించింది. అమెరికాలో ఇటీవల ఉన్నతవిద్య గురించి జరిపిన సర్వేక్షణలో కళాశాలల్లో విశ్వవిద్యాలయాల్లో స్త్రీలు 53% పురుషులు 47% విద్యాభ్యాసం చేస్తున్నట్లు విదితమయింది. ఈ మార్పు స్త్రీవాద ఉద్యమం ప్రభావం వల్లనేనని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో పనిచేసే ప్రొఫెసర్ హోవె ఒక ఇంటర్వ్యూలో పేర్కొన్నాడు.

1975లో అంతర్జాతీయ మహిళా సంవత్సరం ప్రకటితమయిన సందర్భంగా స్త్రీవాదంపై సమావేశాలు చర్చలు జరిగాయి. అంతర్జాతీయ స్థాయిలో ఉద్యమరూపాన్ని పొందిన స్త్రీవాదం వివిధ దేశాల్లో నెలకొన్న భిన్న భిన్న సామాజిక ప్రత్యేకతల్ని గుర్తించే దృష్టిని ప్రేరేపించింది. దీనికందరూ అంగీకరించారు.

స్త్రీవాదం స్థూలంగా పితృస్వామ్య వ్యవస్థలోని పురుషాహంకారత్వాన్ని, ప్రతిదీ పురుషదృష్టితో చూచే లక్షణాన్ని వ్యతిరేకిస్తుంది. స్త్రీ పరాధీనతనూ స్త్రీలో న్యూనతా భావాన్నీ తొలగించేందుకు సిద్ధమవుతుంది. జెండర్ భేదాన్ని నిరసిస్తుంది. స్త్రీ పురుషునితో సమానంగా పోటీపడే దృష్టినీ వాతావరణాన్ని అన్ని స్థాయిల్లో కల్పించే విధంగా కార్యక్రమాన్ని రూపొందిస్తుంది. ముఖ్యంగా స్త్రీవాదం స్త్రీ దృక్పథంతో చరిత్రనూ సంస్కృతినీ సమాజ చలనాన్నీ వివేచిస్తుంది.

స్త్రీల వికాసం, అభ్యున్నతి కోసం ఇంతకుముందు కృషి జరిగింది. అయితే స్త్రీవాదం స్త్రీ దృష్టితో ఆలోచన చేస్తుంది. దీని దృష్టికోణం వేరు. స్త్రీ వికాస ప్రయత్నాలు స్త్రీవాదానికి పూర్వరంగంగా ఉపకరించాయి. ఇందులో సందేహం లేదు.

స్త్రీవాద కవిత్వ,లో ప్రధానంగా కన్పించే అంశాలు, పురుషులు స్త్రీలను అణచివేసే ధోరణుల్ని, నిర్బంధాల్ని, కఠిన నియమాల్ని, జెండర్ భేదాన్ని సంపూర్ణంగా వ్యతిరేకించడమేగాక, ఆర్థిక సామాజిక వైయక్తిక స్వేచ్ఛకు ప్రాధాన్యం ఇస్తుంది. మౌలికమైన హక్కుల్ని కాపాడేందుకు క్రియాత్మకమైన పాత్రను నిర్వహిస్తుంది.

స్త్రీ జీవితంలో విద్య, ఉద్యోగం, కుటుంబం – మాతృత్వం – సామాజిక సంబంధాలు, సామాజిక రాజకీయ పాత్ర, స్త్రీ పురుష సంబంధాలు మొదలైన సత్వరవిషయాలపై ఈ దిశలో సమస్యల్ని గురించి, ఆదర్శాల్ని గురించి ఆచరణ గురించి ఎంతో ఆలోచన జరిగింది.

తెలుగు సాహిత్యానికి వస్తే, స్త్రీవాదం –

1. 1960 –70 మొదటిదశలో స్త్రీ అణచివేత గురించి ఆలోచన మొదలైంది, సిద్ధాంత పర్వతాన్ని పొందింది.
2. 1971–80 రెండోదశలో పురుషునితో స్త్రీల సమానత్వం గురించి, క్రియాత్మకత మొదలైంది, జీవితానుభవ స్థితులపై దృష్టి ప్రసరించింది.
3. 1981–90 మూడోదశలో స్త్రీవాదం తీవ్రమైన ఉద్యమరూపాన్ని పొందింది. ప్రయోజన విస్తృతితో వ్యాప్తి చెందింది.
4. 1991 – 2000 నాలుగోదశలో వ్యతిరేకతలు తగ్గిపోయాయి. సర్వాంగీకారయోగ్యమైందిగా స్థిరపడింది. స్త్రీవాదం స్త్రీ వికాసానికీ ఉన్నతికీ ఉపకరించే ఉత్తమ సాధనంగా నిలదొక్కుకుంది. దేశ సామాజిక సాంస్కృతిక ప్రత్యేకతల్ని గుర్తించి అడుగు ముందుకు వేయడం ఈ దశలో పేర్కోదగిన అంశం.

స్త్రీవాద కవిత్వం గురించి వ్యతిరేక విమర్శలు మొదట్లో వచ్చాయి. కాలం గడచేకొద్దీ అవి అవతరించాయి. స్త్రీవాదంలోని వాస్తవాన్ని గుర్తించి పురుషుల కర్తవ్యాన్ని మేల్కొల్పే వాతావరణం నెలకొంది.

స్త్రీవాదంలో భేదాలు అనుసరించే విధానాల్నిబట్టి ఏర్పడినాయి. అందరి లక్ష్యమూ ఒకటే.

1. స్త్రీవికాసం అభ్యుదయంపై దృష్టితో ఆధునిక భావజాలిన్ని పొందింది ఉదార స్త్రీవాదం.

2. వర్గవైరుధ్యం, ఉత్పత్తి విధానాల్లో మార్పు వర్గరహిత సమాజ స్థాపనం సిద్ధాంతాలపై నెలకొంది మార్క్సిస్టు స్త్రీవాదం.

3. సహేతుకమైన సామాజిక పరివర్తనతో ప్రగతిశీలమైంది రాడికల్ స్త్రీవాదం.

4. మానవత – మానవీయమైన విలువలకు ప్రాధాన్యంతో వెలసింది మానవీయ స్త్రీవాదం.

5. ప్రజాస్వామ్య తత్పరతతో – స్త్రీ స్వేచ్ఛ – సమానత్వం – న్యాయం కోరే ప్రగతి రూపం ప్రజాస్వామ్య స్త్రీవాదం.

ఇట్లా ఆయా అవసరాలకూ ఆయా వ్యక్తుల అభిప్రాయాలకు అనుగుణంగా వర్తిల్లాయి.

తెలుగు స్వేచ్ఛాకవిత్వంలో 1970 నుండి స్త్రీ వాదం తన పురోగమనాన్ని వేగవంతంగా సాగించింది. రచనలు విస్తారంగా వెలువడినాయి. స్త్రీవాదానికి ప్రాతినిధ్యం వహించే "నీలిమేఘాలు" కవితా సంకలనం 1993లో వెలువడింది. ఇందులో పితృస్వామ్యవ్యవస్థకు భిన్నంగా ఆలోచనా ప్రపంచం అవతరించింది. జెండర్ భేదం, అణచివేత, నిర్బంధం, కఠిన నియమాలు, అవమానం, హింస, ఇంటిపనీ, పరాశ్రయ వాతావరణం, స్వేచ్ఛకు మూసిన తలుపుల్ని గురించి, చిత్రణం కన్పిస్తుంది. స్త్రీ స్వేచ్ఛనూ హక్కుల్నీ సమర్థిస్తూ స్త్రీ అస్తిత్వాన్ని ప్రభావోపేతంగా ఆవిష్కరించే ఆదర్శం స్పష్టంగా రూపొందింది.

**2**

స్త్రీవాదం ఇటీవల తెలుగు సాహిత్యంలో సరికొత్త ముఖాన్ని అవతరింపజేసింది. సామాజిక తలంపై ఉద్యమరూపాన్ని ధరించింది. స్త్రీ సమాజంలో ముఖ్యంలో యువతరంలో ఉత్సాహలహరిని సృజించింది, స్వతంత్రశక్తిని వికసింపజేసింది. ఆధునికయుగంలో పాశ్చాత్య దేశాల నుండి వీచే సిద్ధాంతాల వలెనే స్త్రీవాదం పరివర్తనకు దారితీసింది. ప్రపంచంలో ఏ మూల నుండి ఏ మూలకైనా మార్పును

కోరే గాలి వీచవచ్చు. మారుతూన్న సమాజంపై దీని ప్రభావం గాఢంగా ఉంటుంది. తీవ్రంగాను ఉండవచ్చు. అయితే ఆ దేశంలోని సామాజిక స్థితిగతుల్ని సాంస్కృతికమైన విలువల్ని దృష్టిలో పెట్టుకొని దీని ప్రవేశాన్ని మలచుకోవలసి ఉంటుంది. అప్పుడే అది జీవవంతమై నిలుస్తుంది. ప్రయోజనాత్మకమైన పాత్రను నిర్వహిస్తుంది. పరిధి కూడా విస్తృతమౌతుంది. లేకపోతే కొంతకాలానికి ప్రభావరహితం కావచ్చు. విపరీత ఫలితాలకు దారితీయవచ్చు.

సాహిత్యానికి వస్తే స్త్రీల సాహిత్యం – స్త్రీవాద సాహిత్యం అని రెండు విధాలుగా కన్పిస్తుంది. స్త్రీల రచనలు మొదటి నుండీ సాహిత్యంలో భాగంగా వస్తూన్నవే. స్త్రీవాద రచనలు స్త్రీ స్వేచ్ఛనూ, సమానత్వాన్ని కోరేవి. అవసరమైతే నిరసనతో ప్రతిఘటనతో నిర్మాణాత్మకమైన దృష్టితో ప్రగతినుద్దేశించేవి. బాధలకూ నివారణకూ తిరస్కృతికీ గురియైనవారిలో చైతన్యాన్ని గుర్తింపజేసేవి. వారిని పరిరక్షించే లక్ష్యం కలిగినవీ, ప్రపంచంలోనే ఈనాడు స్త్రీవాదం బాగా వ్యాప్తిలో ఉంది.

స్త్రీవాదం అంతర్జాతీయ స్థాయిలో ఉద్యమశక్తితో వెలసింది. పురుష సమాజం స్త్రీపట్ల అవలంబించే దృక్పథంలోనే గణనీయమైన మార్పును తెచ్చింది. స్త్రీవాదం ఉద్యమరూపం ధరించడంతో ప్రపంచంలో అభివృద్ధి చెందినవనుకున్న దేశాల్లోనూ ఒక్కొక్క స్థాయిలో సామాజికంగా అణగిన స్త్రీ స్వరాన్నీ వికలమైన హృదయాన్నీ గురించి బయటికి తీసి వినిపించడం స్పందింపజేయడం జరుగుతూంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో జాతి మతం వర్గం కులం భేదం లేకుండా, అందరికీ వర్తించేవిధంగా ఒక విధానాన్ని అవలంబించే ప్రయత్నం జరుగుతూంది. ఇది సులభంగా అయ్యే పని కాదు. ఇదో చిక్కు సమస్యే. దీనికి ప్రాంతీయ సాంస్కృతిక ఆచార వ్యవహారాలభేదాలు కొన్ని పరిమితుల్ని సృజించే మాటవాస్తవం. అంతర్జాతీయ తత్త్వంలో ఉద్యమించిన స్త్రీవాదం, వివిధ దేశాల్లో ఎదురయ్యే అనుభవ పరంపరలో ఈ వాస్తవాన్ని గుర్తిస్తూంది కూడా. యు.ఎన్.ఓ (UNO) సహకారంతో ఒక్క మనీలాలోనే కాక ఇతర ప్రదేశాల్లో జరిగే సమావేశాల్లో తీర్మానాల్లో ఇది స్పష్టం చేయబడింది.

రచయిత సావిత్రి! రాజమండ్రి నివాసి. ఆంధ్రప్రభసావిత్రి అనీ, రేడియో సావిత్రి అనీ, రాజమండ్రి సావిత్రీ అని ప్రశస్తి రేఖల్లో బింబించిన స్వేచ్ఛాజీవి. స్వేచ్ఛ కోసం పోరాడింది! కుటుంబంలో భర్త నుంచి మానసికమైన ఒత్తిడికీ, ఒరపిడికీ గురైంది. హింసకూ లోనైంది. అశాంతిలో కసీ ద్వేషం ప్రబలింది. పురుష వ్యతిరేక భావం జ్వలించింది. చివరకు శారీరకంగా క్షీణించి క్షీణించి ఆహుతియైన వ్యక్తి! భర్త నుండి ప్రేమదూరమైందీ, సానుభూతి కరువైందీ. మానవతా బిందువు కోసం పరితపించిందీ. చివరకు స్వచ్ఛందంగా విడిపోయిందీ. సమాజంలో తనదైన వ్యక్తిత్వంతో శక్తినంతా సమీకరించి బ్రతికే ప్రయత్నం చేసింది. చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తూ ఇద్దరు పిల్లల్ని సంరక్షించుకుంటూ బ్రతికింది. కాని చివరిదాకా నిలబడలేకపోయింది. అదృశ్యమైంది.

మహా పురుషుడు కందుకూరి వీరేశలింగం సంస్కరణోద్యమానికి కేంద్రమైన రాజమండ్రి, విద్యా సంస్కృతీ సంపన్నమైన సమాజంలో "అయ్యో" అని అపుడపుడూ ఎక్కడో సానుభూతి కన్నా? ఏ వ్యక్తీ ఏ సంస్థ? చక్కదిద్దలేని స్థితి? ఎంతో శోచనీయమైనది, శారీరకంగా క్షయవ్యాధి పీడితయై మృత్యువు సమీపంలో ఉన్న సమయంలో రంగనాయకమ్మ కోరిక మేరకు ప్రగతి ఛారిటబుల్ ట్రస్టు గౌరవ కార్యదర్శి శాంతకుమారి ఆలన పాలనలో చేరింది. ఆపై కన్ను మూసింది. స్త్రీ పట్ల జరిగే అన్యాయానికీ, సమాజం వహించే ఉపేక్షా భావానికీ నిదర్శనరూపంగా నిలిచింది. స్త్రీ విముక్తికై ఉద్యమించిన ఈమె వ్యక్తిత్వం సామ్యవాద ప్రగతి శక్తితో వికసించింది. క్రమంగా భౌతికంగా అలిసిపోయింది. మానసికంగా నలిగిపోయింది. స్త్రీ స్వేచ్ఛకై వాదిస్తూనే ఉంది. సంఘర్షిస్తూనే ఉంది. పురుష సమాజంపై ద్వేషం ప్రబలడమూ సహజం. ఈ అశాంతిలో కన్నీళ్ళతో ఆర్ద్రమై వేదనతో తప్తమై ఆవిర్భవించిందే ఈమె కవిత్వం. ఇదో? మానసికమైన బాధ ఉపశమింపజేస్తూ బయటికి ఉద్యమించిన ప్రయత్న రూపం, చాలా చిన్నదే, అయినా చిత్తశుద్ధి ఉంది. తొలిదశనుండీ అన్నీ కలిపి (23 కవితలు, ఒక కథ, ఒక గల్పిక, ఏడు సమీక్షలు, తొమ్మిది వ్యాసాలు మాత్రమే) రాశిలో తక్కువే. వీటిలో చాలా భాగం సామాజిక స్పృహతో చర్చలతో ఘర్షణలతో అశాంతిలో నుంచి వెలువడినవి అనుభూతినీ ఆర్ద్రతనూ ప్రసరిస్తాయి.

ఈమె ప్రసిద్ధమైన కవిత "బందిపోట్లు". దీని ఇంగ్లీష్ అనువాదం (decoits) 'పెంగ్విన్' సంస్థ ప్రచురించిన స్త్రీ విముక్తివాద కవితా సంకలనంలో చేర్చబడింది. ఇది స్త్రీవాద కవిత్వంలో శాశ్వత స్థానాన్ని పొందింది.

"పాఠాలొప్పజెప్పకపోతే పెళ్ళి చేస్తానని పంతులుగారన్నపుడే భయం వేసింది". పెళ్ళి చేస్తానంటే చావగొడతానని ప్రకృతార్థం! రూఢి అయింది. భర్త చేతిలో భార్య పొందే ఉపాయనం సూచితం. "ఆఫీసులో ఆఫీసరు నుండి ఇంట్లో భర్త నుండి" సెలవు దొరకదు అన్న మాటల్లో స్త్రీ అస్వతంత్ర స్థితి చిత్రితం. ఈ ధోరణిలో సాగిన ఈ కవిత స్త్రీవాద కవిత్వంలో పతాకస్థానాన్ని పొందింది. "నీ పని నీవు చేస్తున్నావని నీతులు వల్లించకండి, నిక్కమైన అర్థమేదో తేలిపోయింది, కర్తవ్యపు కాగడా కళ్ళు నులుముక చూడమంది".

స్త్రీ స్వేచ్ఛను అణచివేయడమే కాకుండా దీన్ని గురించి ఆలోచన రాకుండా చేసే ప్రయత్నంలోని సత్యాన్ని బయటపెడుతూ "పురుషాధిక్య" సమాజ నిరసనం కనిపిస్తుంది. కర్తవ్య ప్రబోధమూ ఉంది. ప్రయాణంలో అడ్డంగా నిలిచిన "గోడల్ని బద్దలుచేసే" సంకల్ప బలాన్ని ప్రేరేపిస్తుంది.

రచయిత ఒకచోట "లోపాలు సవరించి" రేపటి తరాన్ని లేప" వలసిన అవసరముంది అంటుంది సామాజిక దృష్టితోనే కాక మానసిక విశ్లేషణతోను ఈ అంశాన్ని పరిశీలించవలసి ఉంది. ఆమెలో పురుష సమాజం పట్ల పెరిగిన వ్యతిరేక భావానికి దారితీసిన పరిస్థితుల్ని భౌతిక తలంపైనేగాక మానసిక తలంపైనా దృష్టి ప్రసరించవలసి ఉంది. ఒక వ్యక్తిలో మానసిక వైక్లబ్యానికీ వైపరీత్యానికీ దారితీసే అన్ని అంశాలు పుట్టుక మొదలుగా విశ్లేషిస్తేగాని ఈ సమస్యకు సంపూర్ణమైన పరిష్కారాన్ని గురించి ఆలోచించడం కుదరదు. పురుషుడు స్త్రీ ఇరువురూ ఒక సంపూర్ణ రూపం రెండు భాగాలన్న అభిప్రాయంతో ఉద్యమించవలసి ఉంది. ఒక్కసావిత్రి కాదు? ఇంకా ఎందరో? 'పురుషాధిక్యత'ను 'పురుషాహంకారాన్ని' నిరసించే తత్త్వంతో అశాంతికీ మానసికమైన విషమగతికీ సమాజంలో గురిఅయ్యేవారు ఉన్నారు.

స్త్రీవాదం సఫలంకావడానికి జరపాలిసిన ప్రయత్నంలో స్త్రీవాద కవిత్వంలో దృష్టికి వచ్చేవి –

1. స్త్రీ పట్ల హింసను దౌర్జన్యాన్ని అంతం చేసే వాతావరణ సృష్టి.

2. స్త్రీ విద్యకూ –అభివృద్ధికీ జాతీయ పథకాన్ని సిద్ధం చేయడం – దాని సక్రమమైన నిర్వహణం.

3. స్త్రీ, పురుష విభేద భావాన్ని రూపుమాపే దృక్పథం – అవసరాన్ని గుర్తించడం.

4. అశ్లీల భావ ప్రకటనావకాశాల్ని తొలగించడం. అవసరమైతే చట్టాలు చేసి వాటిని ఉపయోగంలోకి తీసుకురావడం,

5. అన్ని వర్గాల స్త్రీలతోపాటు పేదలూ శ్రామిక స్త్రీల హక్కుల్ని కాపాడడం,

6. సమాజంలో అన్ని రంగాల్లో స్త్రీలు పాల్గొనే అవకాశం కలిగించడం.

7. ప్రకృతి సహజమైన స్త్రీ పురుష సంబంధాల్లో సమన్వయ దృక్పథానికీ సహకార భావానికీ ప్రాముఖ్యం ఇవ్వడం.

8. వ్యక్తి మానసికమైన సుస్థితికి, సామాజికావసరంగానే కాక వైయక్తికావసరంగానూ స్త్రీ పురుషుల పాత్రను విస్మరించకపోవడం.

ఆధునిక యుగంలో ఈ వాదం ముఖ్యంగా ప్రజాస్వామ్యంలో తన ప్రయోజనాత్మకమైన పాత్రను నిర్వహిస్తూందనడంలో సందేహం లేదు. స్త్రీ (విముక్తి – స్వేచ్ఛ) వాదం మానవ వికాస చరిత్రలో భాగమైంది.

"నే కోరింది పిడికెడు బ్రతుకు, చిటికెడు గాలి, గుక్కెడు నీళ్ళు! కనీసం నిశ్శబ్దం, నాకు దక్కినవి హోరుగాలి! వికారపు నిందలు, దుర్గంధ జలపాతాలు! అవహేళనం! అనవసర జోక్యం, ఖచ్చితంగా ఓ హత్య!" – సావిత్రి. స్త్రీలు సాధారణంగా ఎదుర్కొనే ఒంటరితనం, పరాశ్రయం అస్వతంత్రత అవమానం పీడనం భయవాతావరణం, అభద్రత అపనింద చివరకు మరణదశ; ఇట్లా పరిణమించే ఒక

విషాద స్థితి చిత్రణం ఈ కవిత! జీవితంలో స్వేచ్ఛకోసం పోరాడింది. స్త్రీ పట్ల జరిగే అన్యాయానికి సమాజం వహించే ఉపేక్షా భావానికి ఈమె జీవితం ఒక నమూనా. సాహిత్యంలో సామ్యవాద ప్రగతిశక్తి ప్రతీకగా నిలిచింది. స్త్రీ స్వేచ్ఛకై ఉద్యమించింది. జీవితంలో అన్ని విధాలా పోరాడింది, పోరాడుతూనే కన్ను మూసింది. ఇలాంటి స్త్రీలు సమాజంలో ఎందరో! వారందరికీ ప్రతినిధి సావిత్రి! స్త్రీ స్వేచ్ఛకై పోరాడుతూ కన్నీళ్ళతో ఆర్ద్రమై వేదనతో తప్తమైందీ ఈమె స్వేచ్ఛా కవిత్వం.

కొండెపూడి నిర్మల "ఎంతగా అణచివేయబడ్డామో! అంతగా భూమిని తన్నుకొని పైకెగసే జలోత్సాహం! ధారకడుతూన్నది" అంటుంది. ఏ విధంగాను అణచివేతకు భయపడని మనస్తత్వంతో తనకు అనుకూలంగా లేని వ్యతిరేకస్థితుల్ని ఛేదించుకొని జలధారవలె పైకి సహజంగా ఎదిగే, ప్రవాహ సదృశమైన స్త్రీ వ్యక్తిత్వం చిత్రితమైంది. ఇంకా జయప్రభ, ఘంటసాల నిర్మల, ఓల్గా, హైమావతి, శిలాలోలిత, అబ్బూరి ఛాయాదేవి, రచిత, ఆదూరి సత్యవతీదేవి, మొదలుగా స్త్రీవాద దృక్పథంతో గణనీయమైన స్థానాన్ని పొందిన కవులు.

ఆధునిక యుగంలో స్త్రీవాదం మానవ సమాజ వికాస చరిత్రలో భాగంగా నిలిచిపోయింది. ప్రజాస్వామ్యంలో ప్రయోజనాత్మకమైన పాత్రను నిర్వర్తిస్తూంది. అయితే అన్ని ప్రక్రియల్లోకన్నా స్వేచ్ఛా కవిత్వంలో దీని స్పందనం ముందుకుగాను, శక్తివంతంగాను ప్రతిధ్వనించింది. వసంతా కన్నాభిరామన్ "నా ఉనికిని మళ్ళీ కొత్తగా ఏర్పరచుకున్నపుడు, స్త్రీగా ఉండడమంటే అర్థమేమిటో తెలుసుకున్నా". ఈ మాటలు ఆధునిక యుగంలో స్త్రీవాదంతో రూపొందే స్త్రీ నూతన వ్యక్తిత్వం స్ఫూర్తి కడుతూంది. తెలుగులో స్త్రీవాద స్వేచ్ఛా కవిత్వం.

1. స్త్రీ అస్తిత్వానికి సంబంధించిన వాతావరణ నిర్మితికి తోడ్పడింది.

2. పితృస్వామ్య వ్యవస్థలోని లోటుపాట్లను ఎత్తిచూపుతూ, పురుషాధిక్యతకు సమానంగా స్త్రీ ఔన్నత్యాన్ని నిలిపింది.

3. స్త్రీవాద భావజాలంతో స్త్రీ సమాజంలో సామాజిక చైతన్యాన్ని కలిగించింది.

4. స్త్రీ శారీరక (పని మొదలుగా) మానసిక స్థితుల్ని చిత్రిస్తూ, సామాజిక వాస్తవికతను బింబించింది.

5. అణచివేత, దౌర్జన్యం, హింస, అవమానం, మోసం, దహనం మొదలైన విపరీత కృత్యాలకు గురి అయ్యే స్త్రీ వ్యధనూ అశాంతినీ చిత్రించింది.

6. స్త్రీ వ్యక్తిత్వంలో కాంతి రూపాన్ని ప్రదర్శించింది.

7. కవిత్వంలో వస్తుపరమైన ఆలోచనతో పాటు, కళాపరమైన అనుభూతి గుణానికీ ప్రాధాన్యం ఇచ్చింది.

8. మానవ సంబంధాల్ని, మానవీయమైన విలువల్ని ఆవిష్కరించింది.

9. ప్రకృతి సహజమైన స్త్రీ పురుష సంబంధాల్లోని వాస్తవికతను, సహకారభావాన్ని సూచించింది.

10. స్త్రీలో న్యూనతా భావానికి స్వస్తిపలికి, నిర్మాణశీలాన్ని పెంపొందింపజేసింది.

11. వ్యక్తి హక్కు కలిగిన స్త్రీ అస్తిత్వాన్ని దృఢతరం చేస్తూ స్వతంత్రమైన వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసింది.

12. స్త్రీ భావనలో ఆశ్లీలాన్ని తొలగించి, ఉదాత్తతను సరికొత్త విలువల్ని సంతరింపజేసింది.

ఆధునిక తెలుగు కవిత్వ పరిణామంలో స్వేచ్ఛా కవిత్వంలో స్త్రీవాద పార్శ్వం స్పందనలతో ఆకర్షించడమే కాక, కొత్తదృష్టితోను సమాలోచనకు ప్రేరేపిస్తుంది.

స్వేచ్ఛా కవిత్వంలో భావనా రూపాలతోపాటు, వివిధ పార్శ్వాలూ - ఈ ప్రక్రియ పొందిన విస్తృతినీ వైవిధ్యాన్నీ భావింపజేస్తాయి. ఆధునిక సమాజంలో ఇది నిర్వహించిన ప్రయోజనాత్మకమైన పాత్రనూ కళాత్మకమైన విలువల్నీ భాసింపజేస్తాయి.

# FACETS OF TELUGU FREE - VERSE

by

**Prof. Madiraju Ranga Rao**

**2026**
**RASADHUNI**
Sahithi Parishath
Shantingar, Hyderabad - 28

Literary Criticism - 16

# Facets of Telugu Free - Verse

(Sahithya Samalochanam)

by

**Prof. Madiraju Ranga Rao**

© **Dr. M. SANTHOSH KUMAR**

First Edition : 2014
Second Edition : 2026

Presented
to my daughter
**HARITHA**
*M.A. (Lit)*
*with blessings*
*on her birthday*

# SIGNIFICANCE OF SVECCHA KAVITHVAM

After Independence, the Free-Verse attained significance in Telugu Modern Poetry. The form attracted a majority of creative writers especially in poetry. In a short time, it has become a wider forum as well as a powerful instrument for free expression. In a rapidly changing society, it has served the purpose effectively. Gradually the Free-Verse has widened its horizons. It opened new doors to creative activity. It played an inevitable role in absorbing social awareness, political views and psycho-analysis and projected them on a wider spectrum. It was more accessible than 'Padyam' or 'geyam' (poems of prosody). Every movement and new trend of social importance in modern age at first, reflected in it. The form of Free-Verse stood foremost in the suitable projection of modern or new personality of poets.

By its comprehensive features and free access to any type of ideas, I prefer to call it or name it 'Sveccha Kavithvam', or Free-Verse. The word 'Kavithvam' implies verse in Free-Verse. Every ideology and new trend appeared in Free- Verse. The form had taken a greater lead in fast changing situations than other forms in literature. It has become a wider forum for expression, because of its facility for freedom in structural design and easy way of composition. It attracted especially the younger generation of poets. The spirit of democracy also helped it, assume easily accessable liberal frame for composition of poetry, without any metric rules or restraints. Within a span of fifty years of post-independence era, Free-Verse (Sveecha Kavithvam) had enriched itself with several Ideologies and trends i.e. Neo-traditional, Liberal, Marxist, Maoist, Kavisena, Feminist, Dalith, Digambara, Paigambara, Chetanavartha, Democratic, Samanvaya, Muslim vada and Anubhuti streams. It encompassed the new socio-cultural phenomena emerging in our democratic society.

On the whole, the scenario of Post - Independence era could be broadly anlaysed in three facets, viz National, International and Human,

which are the three essential factors of influence in modern society. The present study attempts to focus on the social realities, social awareness and social purpose along with traditional roots of permanent values and changes due to national and international compulsions, necessities. The human out-look, human endeavour, human touch played an important role in Telugu Free-Verse. It includes interpretative part of different perspectives on literary merit of the writings and the soul of poetry.

The Free-Verse (Sveccha Kavithvam) as a modern forum of Poetry is very popular in literary circles. It suited very well for the spontaneous expression of feelings of a person in modern times, without any specific rules or guiding principles for composition. The poet has full liberty in structural methods and expressive ways. The will of the poet predominates and conceives the form. Words, group of words, sentence, chain of sentences, being under the control of "will" of the poet, acquires the shape which is necessary and apt at the moment. I opine the countenance of poetry, should not seek the foot-prints of prose or hangover for landing. Liberty, the core of democracy, works on the form. It attracts the creative minds of poetry of modern ethos. The situation, emotional state of mind, action, reaction, view-point and creative nature operate together. Regardless of particular conditions and prevalent situations universality assumes importance. The methods, modes, patterns in Free-verse have to be analysed and studied individually as there is no established model for the Free-Verse. Hope on human being, confidence in his powers of physical as well as mental, desire for human bondage, aspiration for all round progress, striving for freedom and ever missing human touch in society are the salient features for Free-verse. Of course, ideologies, convictions, views and extraneous elements work as levers either directly of indirectly at present. The Free-verse has become a product of modern literary culture of democratic thought, in our independent society.

# NATIONAL FACET

**(1)**

Nationalism is an emotional feeling of all citizens of the country with a sense of 'oneness'. It has the glory of past history and culture. In spite of different religions and regional peculiarities, the "sense of national spirit" is common to all in India.

After Independence and adoption of the Indian constitution, the scope of National facet of pluralistic society in India attained the grace of a rainbow in the democratic setup. In the words of Pandit Jawaharlal Nehru in modern age "Nationalism does not mean Hindu Nationalism,. Muslim Nationalism, Sikh Nationalism or Christian Nationalism. These ideas belong to the "petty and backward minds". Nationalism is "an emotional feeling of oneness" in our democracy It is a concrete idea which guides us to bright future with a sense of tolerance, harmony and human touch.

Before Independence, Nationalism worked against the Colonialism. After Independence, it helped national integration and bright future of Indian society. In a democratic society, Nationalism attained significant form, having cultural roots, and opening branches of reforms and changes required for the modem society. It strengthened the noble idea of unity in diversity, aptly applicable to Indian ethos of Pluralistic Society "Ekam... bahudha vadanthi" The idea was visualised in upanishadic thought.

We do not find today any trace of the ancient Egyptian, Hellenic, Babilonic, Sumarian and Hittite civilizations. But Indian civilization and culture survived the onslaught of time. It has an inherent capacity to assimilate changes, occurring from time to time in our society. For sustenance, it requires tolerance, cooperation, adaptability and generous attitude. The sovereign socialist secular democratic Republic of India attained its strength from the constitution, which was approved on 26th January 1949 and came into force from 26th January 1950. By this historical event the National Facet assumed greater importance and began to play a vital role in society after Independence.

Nation is a live - form of groups of people with oneness, coming together, through social historical and cultural relations and mental attitudes of moral religious and intellectual strength. The fabric pertaining to a nation is national. It evokes patriotism, socio-cultural identification and a sense of pride in citizens. Social, political, religious, ethical acts and agricultural, Industrial development, in addition to literature, fine arts and other professional skills in different walks of life, determine the unique character of a nation. Literature is reflective and interpretative document of society existed in different times. The concept and practice of democracy widened the National, International and Human facets in Telugu Free-verse.

In the creative field of Free-verse, writers have their own creative individuality. Hence their writings differ individually in social, political and artistitic perspectives. The unified action of these elements, motivated by psychological attitude of a writer, do lead to significant personality of his/her own, in relation to writings of creative nature. The three facets i.e. National, International and Human, invariably interact with one another at certain points. In modem poetry, this is inevitable. However, the three facets have their distinct character and played their roles independently also. Hence the study is unique and well designed. The study contemplates, on the representative works of three facets endowed with a high poetic quality. It envisages to analyse and interpret the facets, each of them separately as the aim of study is not writing the History of Free-verse, the work- plan is devised on the basis of selected representation of poets and their writings of importance.

The study envisages the three facets of Telugu Free-Verse after Independence, irrespective of ideological differences and views expressed in a accepted spirit of democracy, as their fundamental right. National outlook has gained utmost importance at the times of National movement for freedeom. After Independence it acted for national integration and rejuvenation. In a seculat democratic society, government does not support or encourage any particular religion. All religions, faiths are equally treated. They would have equal footing and their influence cannot be forgotten or ignored. Hence the National facet attains importance. In this context one should remember the fact, that the reforms and changes

do occur, in the process of national re-construction. In our democratic system, the caste system prevalent in Indian society since a long time, is now under scrutiny. Total annihilation of caste system in under progress in a big way, in transformation of society towards Modern India. The Telugu Free-Verse fully reflects the present scenario. The phenomena has two perspectives.

1. The national facet emerged at the time of war, depicting the national sentiment and glory, by infusing patriotism.

2. The national facet emerging at the time of reconstruction, depicting the existing situations, realities, aspirations, targets, goals. It also focuses on the values of cultural roots, as well as reforms and changes for the welfare of society. Different combinations of cultural roots and modern ideas come under investigation in the analysis of evolution of Telugu Free-verse.

**1. External threats: Rise of national Sentiment**

In the perspective of rise of sentiment the ‘war periods’ dominate the scene. The invasion of China on Indian borders and two forced wars from Pakistan on India, come under the classification. In this context, Free-verse in Telugu intended to infuse unity, inspire patriotism, invoke enthusiasm and glorify the nation.

In October 1962 China invaded India at NEFA and LADDAK borders. It transgressed the Panchaseela agreement between then Prime Minister of India Pandit jawaharlal Nehru and Chou-En-Lai. This was a sudden development that shocked the country. People from Kashmir to Kanya Kumari rose with a sense of one-ness and expressed their emotional feeling in one voice. National sentiment is reflected in Telugu Free-verse in multiple ways. Almost all poets reacted to the unusual war situation, in their own ways of concern and Patriotism.

Puripanda Appala Swamy in ‘Ranabheri (Drum of War) exhorts: “O! People come on! come on! to war-field!” He calls people to participate in war, in high national spirit, against the personified China. He regards Mr. Chou-En-Lai as a treacherous person who sprinkles blood on the peak of the Himalayas, and ignites fire in hermitage. The peak of snow mountain and hermitage suggest the lofty nature and pious quality of

great India. The Poet Bala Gangadhar Thilak in his poem. ‘Thrisaoolam’ expresses his patriotism thus: “Don’t believe China-man the person squeezing flowers, words of a prostitute and words of Chou-En-Lai”. Violation of the accord and an attempt to backstab the peaceful coexistence policy by Chinese leader Chou-En-Lai is suggested. His disturstful nature, against India is depicted in the Free-verse C. Narayan Reddy, reacting in an imaginary way, “Today, each head had a growth of peak of Himalaya mountain” It suggests the unconquerable state of the country and unprecedented confidence in every citizen of the country. Kaloji Narayana Rao, hopes “Initial success is for him (Chinese-Chou-En-Lai), and final victory is ours (Indians)”, Thus the Idea of self-confidence of a nationalist mind is embedded in this poem. Madiraju Ranga Rao, utters in this context thus, “Bharat nation stood at the height of sky with a mind of war strategy and rising feet of democracy”. It implies the gigantic persomality of the nation and quality of statecraft in war as well as in peace. “The heart of Bharat nation is an abode of the swans of peace. Don’t forget the bloody one, who fires guns on it”. The verse suggests traditionally peace loving pesonality of the country. The poet warns, not to forget the murderous act of an enemy. It reminds the valorous spirit and the need of the hour. In this poem the peace loving statecraft of Pandit Jawaharlal Nehru, the signatory of ‘Pancha sheel’ document is subtly implied.

Several Free-verse poets promptly reacted with poetic flavour and Patriotic zeal in other two wars with Parkistan. In these grim situations their writings inspired the people with hope and enthusiasm. By this it proved that the structure of country’s democracy is preserved intact and national facet is glistened with hope.

In 1965 Indo Pakistan war enraged the national sentiment. India won the war. In January 1966 under the supervision of Kosygin the Tashkent agreement was signed by two warring contries. It encouraged friendly relations between the two countries. In war period, the national facet reflected in Telugu Free-verse is noteworthy. The heroic act of Abdul Hameed a soldier who destroyed the Pakistani Tank, in the words Kaloji “attained the forms of Bheema, Hanuma, Garuda the puranic figures. Hameed is first an Indian, his natonal fervour is true to the

democratic spirit of the country. Bala Gangadhar Tilak, in “Mother! Where has father gone?” says “Freedom of thought, Individual respect, devoid of descrimination of colour, class, religion is the basis of Indian society”. How the democratic thinking strengthened the pluralistic base of the country in visualized, in these words. “Every Indian being a soldier, Every heart being a cannon” The war scences were thus portayed. Abdul Hameed is a Muslim, Keeler is a Christian, Guru Baksh Singh is a Sikh, Potharaju is a Hindu. All the warriors irrespective of their religion, participated in war with national fervour. Varavara Rao, Pendyala imagines Punjab rivers as “taking head bath in blood, instead of snow rays.”

Another situation of war is Kargil adventure by Pakistan that took place in 2000 A.D. At last India won the un-declared war initiated by Pakistan. But it has to pay heavy price, as 460 Indian soldiers sacrificed their precious lives. The extraordinary situation prompted creative writers to react through their writings- Madiraju Ranga Rao, depicts the situation thus:’ “Beautiful dream of Kashmir, becomes fruit of repugnance, / The abode of Himalayan mountain, with heroic touch, becomes fire bomb” Tiger Hill is a strategic point situated in a high place. This was occupied by Pakistani soldiers. Indian soldiers regained it through substantial sacrifice. The un-parallel joy on the occasion, as a nationalist stimulated the poet. The group of soldiers on the Tiger Hill appeared like an “Arch of fame”: and “Nation moves on the warriors glorious enthusiasm. Nation speaks on the warriors emotional affection. Nation voices on the warriors excited melody”

War is temporary and Peace is a permanent one, essential for life. Telugu Free-verse reflected the historical significance and emotional sense of national feeling, at the time of wars, war-like situations and external threats, fused with national spirit.

### Internal Turbulences and Need for Unity

There are two dangers for the country. One is external, another is internal. External dangers come through war and they could be well fought by war strategy. The internal dangers are difficult to tackle as they involve our own country men.

Dasarathi, keeping in mind the internal turmoil and destructive forces behind unrest writes as follows: “When flowers fight in the garden, Whole garden would be a battlefield”. The garden signifies the country, flowers represent persons of various castes, regions, religions and languages. They fight one another in various names for narrow ends. The infighting destroys the beautiful, fragrant garden ie. the great nation of India. Kaloji says “If there is no friend-ship between yourself and myself; every atom in the blood, shouts war, every particle in the body, rains poison” The poet wishes for affection among people instead of hatred and enmity. Madiraju Ranga Rao, says in “cross fire,” “Sickle in one hand, axe in another hand is not the need of the hour, to have, but, flower of love in one hand and flag of democracy in another hand is need of the hour”.

In a turbulent atmosphere the immediate requirement is peace, which could be well achieved in democracy only by discussion, accommoditon and mutual respect. Destruction is not the answer but construction is the only way and the right answer. In Agnipeetam” the poet says, for future of the country, door of entrance is only one, i.e. Liberal democracy. Between today and tomorrow the poet visualizes the successful elevation of National facet, through function of democracy, in a creative and constructive spirit.

# NATIONAL PHENOMENA NEW PERSPECTIVES

**(2)**

National phenomen in modem times especially after Independence in Telugu Free-verse are seen at different levels in various combinations of cultural roots and modem ideas. Combinations emerge out of different necessities. It depends on writer's choice. New perspectives come to surface by creative personality. The National spirit is one in all Free-verse writings, but the perspectives of the poets are many.

On the occasion of Mahatma Gandhiji's centenary, Sri Sri the revolutionary poet says, "I announce all the Indian people are one, I narrate you the message of co-existence" The national out- look, in these lines cherishes the national unity, in amicable living of all people. Gunturu Sheshendra Sharma, in "Adhunika Mahabharatham", says, "My body is Gangothri, My voice is Bhagirathi" The poet identifies himself with the country. He associates his physical form with the images of great rivers. It also suggests the lively and continuous traditional values flowing down the ages in the history of India. In "My country and my people" he says "the figure of the country is a plough". The idea depicts, the agricultural base of the country, its central figure is farmer, the back bone of Indian agricultural economy which was very dear to Gandhiji.

In due course, another perspective, combining philosophical touch with traditional values emerged in Telugu Free-verse, in national facet. Kovela Suprasanna charya, in "Satankura" illuminates the cultural awakening (I). Configuration of time and its appearance, (2). Roots of creative spirit and discovery, (3). Conflict between, good and evil forces, (4). The thematic ideas having traditional significance. His free-verse springs from the roots of ancient cultural. values having philosophical touch. Jeevanadi of Penna Siva Rama Krishna is another long poem of philosophical roots. The employment of upanishadic symbols and an a wakening of kundalini power having connectivity to social transformation is noteworthy. Kovela Sampath Kumaracharya in his Free-verse projected another dimension of cultural values, social awarness and philosophical

ideas in it. He aspires for (1). Harmony in external and internal world of a person. (2). Perception of human feelings beyond ideologies and theories. (3). Discovery of human psyche and Introspection. (4). All round social development of mankind. These are the key-points appearing around the circle of life, in his poetry. He often focuces on native cultural bearings. Dasarathi Krishnamacharya awakens farmers in a progressive tone, "Awake! farmers! Bring crowbar and spade! / The fragrance of soil of our lands, is continuous for ever". The poet identifies himself with the agricultural ethos of the country, with a national spirit and cultural back-ground.

Depiction of social and political realities in a free-society is the dominating feature in Telugu Free-verse after Independence. The national facet under study cherishes several liberal and commtted ideologies of poets of their choice. Hence it appears like a multi-coloured rainbow a true reflection of democracy. Somasundar Avantsa, the Marxist Poet of Free-Verse, in 'Kalam Veelunama', estimates the result of thirty years of Independence. "The India of thirty years Independence / In course of time the melody of unity has broken" In the eyes of the constitution of India all are equal. But in practice they quarrel with one another in the name of caste, region, religion and other selfish motives. "Sitting under a green tree / Dreaming very green dreams", the poet hopes for future of the country. Green tree is a symbol for agricultural country. The dreams are for the sake of brothers and sisters of the country. As dry spell persists around, the poet hopes for better future. The dreams may come true, "Selfish hopes are invading my country and plundering on the way. I will make the head, very high like the Himalaya!" The poet hopes for the end of exploitation. He wants total change in the country towards progressive society. Pervaram Jagnnadham in a satirical way depicts effectively the serious situations of social importance, in "Vrshabha puranam" He laments the deteriorated situation after Independence, where preachings of Gandhiji are forgotten by everyone. Who is tarnishing the pure soul of Gandhiji? questions the poet. Electricity has come to the village, at last, but "Burnt our life-bulbs are not at all glowing". These images bring to mind the pathetic condition of the ordinary people in the villages. The "un-invited guests arrive (in a village), once every six months, fill the difficulties of people, in bags and reach the city". The casual and ritualistic

attitude of officials or representatives of people, towards villages and their problems were desciribed, appealingly. Dilawar, in “Velugu Poolu”, imagined the light of freedom, as an immortal triumph on death (Mrutyunjaya). He sees the sun of enthusiasm in indifferent darkness. The ray of hope in the poet towards the country flashes a positive note.

Bala Gangadhar Thilak “Prardhana” (Prayer), submits to the Almighty, “Our country is a strange mansion!, Having enormous problems! “Food to the satisfaction, Friendship to the heart, / Freedom all along the life, Enough to us! My Lord!” The poet emphasizes the basic needs of life and their necessity for survival of democracy in India. The national facet has been projected on physical, mental and ideal planes. On the occasion of Independence day, “Velugulo ee nelapai” Madiraju Ranga Rao says “My nation is not poor, My country is not a waste land” It reflects self confidence, and hope for future. He depicts the contemporary society mixed with violence, pain, oppression and destructive tendency. Hopes against the odds and expects peace, generosity, and constructive thinking in life. “My legs are moving like streams of Ganga and Godavari, My hands are moving like waves of Krishna and Brahma putra/ With a combination of various melodies, With a series of so many forces/ I am moving spirit, I am shining hope of the country”. The Poet identifies himself with various aspects of mother land. On the occasion of Golden Jubilee of Independence, Miriyala Rama Krishna in “Suvarna Svapnam”, (Golden dream), says “To me country appears like a physique. The message is for the man who had a soul/ heart”. In the long poem, the poet focuses on selected places of historical literary and cultural significance in Andhra Pradesh. The heart of the poet identifies with the country and establishes strong bond with its people.

The national facet had multi demensional perspectives in Telugu Free-verse with an ample scope for detailed study under specialization of the subject.

Daliths are citizens of India. Hence they are part of the Indian nation. In my opinion the hopes, aspirations, problems, targets, solutions, realities and ideals, and concerns do come under the study of National facet in Telugu Free-verse. Dalith subject is concerned with Indian society. Gandhiji, Jyothi Rao Phoole, Ambedkar were national leaders who had wokerd for the Daliths. Gandhiji’s Harijan movement in modern history

is well-known. In the Indian constitution untouchbility is banned under article No.17, On this basis several acts were passed, for the upliftment of Daliths. Various steps were taken to improve their quality of life and create self-confidence, dignity and placement in society. In Telugu poetry, since 1970 onwards hopes, aspirations, realities and targets of Daliths were fully reflected in Free-verse. The reality of excommunication, oppression, suppression and humiliation of Daliths, was the subject matter. After Independence, the democratic process at all levels in society, not only helped but encouraged them in education, social justice, progress, human touch, respectability and honour. However, agony, anger, frustration, desire to avenge prevailed in their thoughts. They are reflected in Telugu Free-verse. At present their emotional fervour is slowly cooling down due to adequate concern, social Justice and healing touch given to them. Today they are in a mood of peaceful transformation true to the spirit of democracy.

There are two streams of Dalith movement in Telugu Free-verse. One is Gandhian path second is Ambedkar outlook. The second phase is now very much prevalent. Dalith poetry emerged and sustained only in Indian national scope. Marxist Ideology, infact, took note of the Daliths and extended support in certain stages of class struggle; But it could not concentrate on the cause of Daliths only as it had other national and international issues and commitments.' Moreover there were ideological restrictions and practical compulsions in tackling the problem. The democratic method paved the way for peaceful transformation after Independence.

Boyi Bheemanna in "Gudiselu Kalipothunnai", (Huts are burning) in a Gandhian way aspires for "right and civilized society" in place of "Jungle 'Society". He is a true nationalist and optimist. He wishes for good human society and hopes for bright future for Daliths. Kolakuluri Enoch and others are believers in Ambedkar way. They prefer active role to achieve their rights, through protest and struggle. Several collections of Free-verse anthologies emerged such as "Chikkanauthunna pata", "Padunekkina pata", "Bahu vachanam", "Dandora", "Dalith Kavitha", "Gunde Chappudu" and so on. They focus on Dalith history, their life and problems portray bitter experiences and - social purpose, in emotional ways. The word Dalith has become a symbol for agony and

struggle against oppressed life. Dalith poetry emerged strongly from "Karamchedu incident in 1985 and assumed a movement form. From "Chunduru" event in 1991 it stabilized, as a new force. Dalith Manifesto "Visphotam", reveals the aim and purpose of Dalith poetry. Endluri sudhakar, in "Kotha Gabbilam" says. "Now rebellious shoes, rose up 'like flags", The same poet says, "I become now, new head for new land of Bharat". His endeavour and self confidence is evident in the above lines. Juluri Sankar, opines "New paths are forming". These feelings indicate opening of new directions in the lives of Daliths. Shikamani in "Muvvalacheti Karra" calls on the slided and neglected people in society and inculcates enthusiasm in them for building "new country". He implies the responsibility of human being to help poor instantaneously in their suffering and harship from the heart. He re-affirms love and kindness, with personal imprints. "Banna Ilayya says in "Nippu Kanika", "The tragic colour of life, is the key (main) syllable for today's poetry" The throbbing observation is apt and significant in the present situation, of unhappy lives of the daliths. In the words of G. Laxmi Narsaiah, the exponent of Dalith perspective, Dalith movement is "an historical outcome" of social necessity. Kathi Padama Rao, identified with Dalith movement chooses historical angle and social context, also favours human touch and amicable approach to problem in is poetry. All Dalith writings of Free-verse naturally reflect the same problems but in different poetic shades of their choice.

Dalithism in Free-verse fought against discrimination, suffering, contempt, humiliation pertaining to Daliths. Its aim is to attain freedom from social shackles, to get, social equality, self-confidence and respect in society. Hence it served the purpose promptly in a democratic way, in a democratic society for a democratic ideal.

The National facet in Telugu Free-verse after Independence assumed importance as (1). It, illumined the national sentiment in difficult times of external threat or aggression. (2). It envisages identification of cultural roots of permanent values (3). It welcomes changes required for sustenance of society with a concord of "oneness", i.e. the Idea of 'nation'. (4). It strengthened the base of democracy for better future. In the present study, different perspectives of the National facet were reviewed and interpreted accordingly.

# INTERNATONAL FACET

**(1)**

The present study deals with the impact of international events on Telugu Free-verse after Independence. The post Independence era is a singiicant one, as independent state-craft was adopted in managing foreign afairs, true to the spirit of democratic sovereignty. Several events and incidents of international significance from different countries do attract intellectual commnuity and creative writers. Some times theories ideologies, trends of social and political nature abroad do influence on literature. In Telugu Free-verse after Independence, two kinds of international facets appeared on the scene.

1. a) Struggle for freedom in differnt countries b) tragic events c) voice against despotic rules.
2. Theories, Ideologies, trends, concerned to society.

**1. Notable events:**

Keeping in mind the American policy pertaining to Africa, Asia, Cuba, Laos, Congo, revolutionary poet Sri Sri (Srirangam Srinivasa Rao), warns, "Having opened your ears/ Having opened your mind/ Having opened eyes/ Hear! We condemn your old Ideas of Hitler O! kennedyDid you hear! This is an introduction of Sri Sri". The poet protests and almost ecnsures the behaviour of big countries towards a small country. John Fitzgerald Kennedy, President of U.S.A. in the year 1961, initiated military action on Cuba. However Cuba stood with great courage, against the mighty country. Fidere castro, President of Cuba since 1959, fought against the supremacy of America. Pointing at America which supports its forcible action on cuba, on the pretext of protecting world peace the Poet foresees the contrary effects. "Your tanks, your bombs, aeroplanes Policies would show the way to cemeteries and steal the peace". the poet opines the result of American action would be disastrous. It is not for peace in Society. Being a Marxist, and humanist it is but natural for the poet to stress his point more vigorously. On the occasion of the assassination of African National leader Patris Emergi Lumumba (1925-61), Sri Sri reacted sharp1y. P.E Lumumba, the freedom fighter, emerged as a symbol of

freedom movement for African people. He became Prime Minister of Congo in 1960, and was dethroned by the president of Congo, Kasavubu. He was imprisoned and assassinated in 1961. The tragic event perturbed the world community "O Africa, my Africa, your sharp leader of horns (gallant commander) has not one 'L' goes, millions of "Ls" sprout. 'L' for Lenin, "L" for Lumumba; good morning (condolence) Africa! Condolence!" Free-verse of Sri Sri represents the grief of all progressive and peace loving forces in the world.

K. V. Ramana Reddi says in "Jailu Kokila" "Run into the world like a Lenin, Mao, Guvera". The is intended to infuse enthusiasm to liberate people from colonial rule, all over the world. International facet of Marxism played a dominant role in Telugu Free-verse in the Post-Independence era almost for three decades. After-wards it has moved to visible participation than active role. Nandini Sidha Reddi, in "Bhoomi Svapnam" condemning the occupation of Palastien by Israel, says, "The heart of the world, with opened throat raising the voice, as a sprout springs up the song of Palestien liberation. The spirit of freedom is applicable to all international events of liberation. On Vietnam heroic battle, poet Cherabandaraju in "Gamyam" says, "You being in your country, we being in our country. Our aim is to conduct revolutionary struggles", "wishing total annihilation of imperialism".

Madiraju Ranga Rao, on the freedom of South Africa, "yesterday's volition of mankind being a cloud of lightnings and thunderbolts today it is raining, water of illumination and attaining democracy!" That is South Africa! Joy of Democracy" reveals the intensity of people's participation. Commenting on the role of America in Vietnam, The poet feels, "How far the man travelled!, who thinks himself a cultured one! Do you want comparison, yes! clearly like America in Vietnam". Without human face, a country's richness, development, any advancement is useless. Inhuman activity of American power, causing suffering, destruction, to people of Vietnam has been disapproved. Jayadheer Thirumala Rao in "Aranya netram" says: "The blood oozing from the last wound of Vietnam Hero tells me" the story of sorrowful life. On arrival of Russian army into Afganistan HRK opines, Russia as a baby of revisionist demon. It clearly shows the poet's Ideological swing towards Maoism. Political identity of international choice is evident.

The Poet Ajanta, on the tragic incident of assassination of American President J.F. Kennedy, remarks "Wherever may be the man, by birth he is independent" saying it whole heartedly, when the President Kennedy was murdered in the Street. "The fire emitting wound on the forehead of America never heals". "Flags have no tears", in the "Civilization of horror comics, man himself is a death". (Death of Kennedy - April 1964.) The wound is not only on the person, but on the country and democracy. America, today, is a symbol for democracy. Kennedy as a true democrat performed his duties and discharged his responsibilities against the apartheid. Racial discrimination is an impediment to the progress of mankind. Hence he took strong steps to eradicate it from the American Society. This was not acceptable to some section of people. So he was eliminated. Man works against mankind and becomes an embodiment of death. The cruel situation has been suggested aptly by the poet in "Horror Comics".

In Telugu Free-verse, the subject of people's sttruggle for freedom in West Pakistan and their success and emergence of "Bangladesh" is noteworthy. The struggle led to the formation of sovereign country. It attained international significance. In Dasarathi's "Thimiram tho samaram". The "Victory of Bangla people" visualized an "auspicious future" for "mankind". He further says "by annihilating guns/ lit the light of kindness". The life which fights with darkness is immortal one. It is an abode of peace on the earth". Struggle for Bangladesh, as a separate country has become inevitable, in view of dictatorial attitude of West Pakistan. The attitude was compared with darkness, the freedom of people was compared with day light. However the poet feels peace is an essential need, for the society, at any cost. Kaloji Narayana Rao describes the Bangladesh freedom movement, "Mujib is not one person, but embodiment of seven and half crore people". He also feels that the emancipation of Bangladesh is a great victory for human dignity. C. Narayana Reddi in "Jaya hey Bangladesh". "Victory! to you Bangladesh your breath is Mujeeb your fist is people's power, The heroic country, Bangladesh is fighting for emancipation". In this poem the poet identifies the leader of Bangladesh freedom struggle with country and people. He also suggests indomitable power of the 'will' of people.

Madiraju Ranga Rao depicted the historiccal event, in his long poem "Muktha dhatri" - The book consisting four chapters depicts (1). Beginning of freedom struggle, and its effect (2). Atrocities of West Pakistan and its impact on people (3). Peak of the movement for freedom, and (4). Emergence of free-country, Bangladesh in the map of World Countries. Mukthadhatri "Liberation of Bangladesh" long poem (1971) was a note worthy work, in Free-verse. The poem starts with Amar BangIa, Sonar BangIa; (Immortal Bangla, Golden Bangla), in a sentimental tone. The freedom movement was started, due to despotic rule of West Pakistan rulers. Muzeeb-ul-Rehman, with revolutionary zeal, emerged as a leader. The struggle gained momentum and Bangladesh came into existence on 16th December 1971, as a sovereign country. "In the air, in every atom voice of immortal Bangla on the soil, / in every particle, voice of golden Bangla" / People suffered a lot and agony reached it's heights. "On the field of wilderness, the barbarism is dancing silently going down". Tyranny slowly lost it's ground. At last the people's concern to democracy reached it's peak. The strong will of the people won the battle. "Father of Bangladesh, "Muzeeb became the fortune of liberated land of Bangla". In this context the poet describes aptly, the west Pakistan as a "knocked out darkness", and Bangladesh as "awakened east". The poem had the international facet and political angle with social purpose of accomplishment of democracy.

Another long poem by Madiraju Ranga Rao is on Vietnam war (1973). It is in two parts (1). Viplavacchayallo "In the shadow of revolution" (2). "Santi velugulo" In the light of peace": The first part, "In the shadows of revolution" is a gallery of pictures of different events of war in Vietnam. The big power American involvement has become the main springboard for escalation. America with all its armoury and ammunition and advanced war-craft could not defeat Vietnam. 'Mai lai' is an example for how certain areas in Vietnam were scorched by bombing and poisoned by arsenic gas. "Village Mai lai Good bye for ethics of war. Mai lai Good bye for human kind" This tragic situation was described as a darkest (amavasya) day in the history of human civilization. "Having burnt the peace, having prepared the tombs, lit would they light up the candles? Would they adorn with flowers". At last America has to withdraw from the war field. March towards peace gained its momentum. The

situation was described by the poet, as “Showers of rain at summer time”. The poem was handled with symbolic significance of high order. The poem depicts the strong will of the people of Vietnam, against the external interference, dictation, and political influence. At last Vietnam won the heroic battle against mighty Country, super power, with their limited sources and tremendous fighting spirit. The “dark phase” has gone from their life. “Morning light zoomed on their faces”, and “flowers blossomed from their eyes”. “Happiness flourished in their minds’ “Bitter experiences of past history” “remained” in memory like “photos in an album”.

The poets of Telugu Free-verse in Post-Independence era promptly responded and reacted to international events, from time to time, and enriched the international facet of Telugu Free-verse by their quality of emotion, thought and artistic temperament.

# DEMOCRACY AND COMMITMENT

**(2)**

In international facet Liberalism, Democracy, Marxism and Feminism influenced the Telugu Free-verse in their own ways. They played an important role in giving effective an International facet to Telugu free-verse. After independence, in democratic setup and free society the activities of the said ideologies were more conscious and much committed towards their targets. Liberalism with its open mind, also favours the progressive outlook. It is nearer to democracy. Hence these two, liberalism and democracy go together. In moden times Free-verse by virtue of full freedom in form and precepts, practically became platform for different ideologies of international level.

Ideologies do have theoretical base. Hence they have inspired creative writers. Definite actions in clear derections, and specific targets are seen in their aim. Also they do have philosophical perspectives, giving scope for thought. They stand on reason giving scope for interpretation and elucidation. Activised thought in particular ideology takes the form of movement. So various moverments have taken place in society. They strive for better quality of life and more progress of mankind.

**Democracy**

Democracy is a complex and intricate” form but more “representative” one than other forms. It reflects the supremacy of the people. It has enormous capacity for flexibility adoptability and accommodation to others views. It is a system of government “of the people, by the people, for the people”. Liberty, equality fraternity justiee which are the main characteristics of our constitution attracted the lovers of individual freedom social reform and development. Especially, in a pluralistic society like India, democracy is the only form which is suitable. In parliamentary democracy adopted by Indian constitution, different sections of people have their representation in parliament and legislatures. In democracy, (1). People hold ultimate power through adult franchise (2). Policies and programmes by political parties figure and they are open for discussion (3). Civil liberties are guaranteed (4). Public interest and their welfare, occupy importance. (5). Legislature, executive and

Judiciary systems have mechanism of checks and balances with a scope for independent Judiciary. (6). Every possibility of change of government by peaceful means, are the prime objects. Hence by virtue of inherent advantages, it has an edge over other Ideologies, and is always considered the best form of government. Different voices echo in Parliament, various problems are taken up and discussed thoroughly and solutions are found by voting or consensus or agreement.

Both Democracy and human rights go together. They are complementary to each other. All human rights are universal. It respects roots of traditional values, invites required reforms, strives for progress of all human beings in society, at different levels. Hence it was acceptable to majority of writers. Either knowingly or unknowingly one may cherish the spirit of democracy. Dissent, protest, opposition are meant to cultivate a look of comprehensive nature. In fact they indirectly strengthen the foundations of democracy. In this context certain norms, conventions do assist smooth functioning, but the responsibility is on all citizens, more so on persons in power.

Almost all poets of liberalism in Telugu Free-verse do reflect the spirit of democracy in an indirect way. Those poets who are committed to other ideologies do prefer the spirit of democracy in different ways. Among the poets of Telugu Free-verse, Madiraju Ranga Rao is a committed writer of Democracy. His belief in liberal democracy is visible in his works as a chrerished Ideology. In “Shvethethara Vihangalu”, “Shvetha” indicates democracy. The idoelogy was subtly suggested by employing symbols for democratic forces and other forces, as Shvetha and Shvethethara, respectively. In “Velugulo ee nelapai”, The poet on the occasion of Independence day, saluting to national flag, hopes for better days, He opines the democratic mind has to bloom with vigour and wisdom for progress of humanity” Conventions of democracy are yet to establish in our country and the right frame of mind is yet to take its shape for perfect functioning of democracy. The poet thinks the feeling of heart of democracy, is neessary for it’s success. Importance of wisdom with human touch, more than rules and regulations for a person in free society is visualized, in “Orchestra Hridayam’. Rao gives a call to proceed with the “sun rays of human thought and flag of democracy.” Democracy today fulfills the hopes and aspirations of people where Marxism could

not pay reguired attention due other compulsions. The Poet firmly opines, for India, with its main and subaltern multi-cultural, multi-religious and multi-languages society, The liberal democracy is the only suitable form to maintain harmony, peace, friendship and advancement. “Flower of peace in one hand / flag of democracy in another hand”. The eternal Journey of mankind is visualised.

Kaloji Narayana Rao, is another poet whose voice of dissent and protest strengthened the democracy. Most of the non-marxist Free-verse writings in Telugu, either derectly or indirectly, touch and cherish the basic ideals of democracy.

**Liberalism**

Liberalism is an universal ideology of generous attitude and progressive ideals. It stresses on independent open mind. It favours reform and desires freedom in religious practices. It emphasizes on political liberty and ethics in the management of state affairs. It cherishes certain level of standards in private and public life. The poets of Free-verse Boyi Bheemanna, Balagangadhara Tilak, Ajanta, Dasarathi, Kaloji Narayana Rao, C. Narayana Reddy, V. Mohana Prasad, Perveram Jagannatham and others come under this fold as they are not committed to any particular ideology. But they are liberal in inviting different view points. Boyi Bheemanna the poet of liberal Ideas, desires and accepts change in society with open mind. He opines ‘Saraswathi’ in yester-years wore Kanchi Silk Saree, now wears different Voni (upper garment). The Poet reminds the fact, that customs and habits change. Their change is inevitable in modern society.

Bala gangadhara Tilak stands for liberalism. His free-verse fully represents it. He is neither a traditionalist nor a Marxist. He wants change and progress in society with liberal ideas at all levels. He respects core element in tradition. He says, “which has inner strength ‘to stand all times’ even one does not say ‘No’ to it. In another poem, “Live in present and reflect on today’s world. Open the windows of the house and invite all winds”. The idea exhibits inclination towards change and liberal attitude towards all dear in the world. Exposure to outer world helps persons in every field. In another poem, ‘Shikhararohanam’ (Ascending a peak) “Shakspeare, Dante, Kalidasa, Sankara, Marx, Mahatma, Picasso, Sartre,

whoever may be, they are part of the continuous new experiment, going on. It is an ascendancy of a peak in search of truth and beauty". Every great person in the world is in search of some thing new in life. He opines Marx and Mahatma Gandhi are among them. One strived for welfare of physical world. Another attempted for enlightment of inner world. The universal outlook of Free-verse poet comprises comprehensive perception of things in liberal perspective. Ajantha, another poet of liberalism, thinks beyond political affiliations, "No avaries, no envies, no sighs, no hatreds, no stealings, no difficulties, no tears. Every where, only one silence, only one vibration of heart". The poet depicts the nagative side of the life, in a positive tone. He expects universal brotherhood on international plane. Liberal ideas are visible in poetic thought. "Life in a positive tone", reveals "universal out look"on international events and liberal ideas are suggested in poetic thought.

Dasarathi another eminent Free-verse poet, is a true representative of liberal ideas in modern times. He opines in "mastishkamlo laboratory", that one should learn values "from past" but should not be "mortagaged", to past" He focuses on just and reasonable acceptance of traditional values. Laboratory in mind, suggests the form of modern thinking containing investigation, analysis of problems and discovery of new things. On reason and wisdom "Sitting in the new type of laboratory, one could descover unique seeds, for growth of peace, in world", the poet presents the intellectual capabilities beyond ideologies and vision for peaceful transformation of society towards progress. Liberalism in Free-verse of Dasarathi is almost nearer to the Idea of Democracy. C. Narayana Reddy poet of Liberalism, prefers himself to be called a poet of "Samanvaya" composite character. He says in "Mantalu manavadu" about expulsion of old faces and revelation of new faces. Old face suggests useless traditional form and new face suggests reform and change suitable for modern age. He is not adherent to a single Ideology, but prefers himsely for combination.

"Morning which is to come will come as a new Dharma (rectitude)". What is this new dharma? Which is realated to welfare of the people and progress of society. The Idea explicitly denotes liberal view of the poet. In "Udayam Na Hrudayam" the Poet presents the same. "That morning is a goal, that heart is my song". Liberalism invariably comes to the

mind. Vegunta Mohana Prasad subscribes to liberalism in a more subtle way. In “Rahasthanthri”, he desplays it. In general tone “Troubles, estableshment, all are unbearable and intolerable” “Let you know the power of labour and evolution of life”. He displays liberal attitude in a philosphical way and says “It does not matter, in which language a person cries?” crying for so many things”. Crying may be at so many levels, It may be either personal or concerning to others. at different points and It does not have the connotation of a particular Ideology, but very nearer to unbiased liberalism. The poetry of Pervaram Jagannadham is nearer to liberalism. He believes in adjustment and change towards the progress. The direction of depiction of the realistic mood of life touches the tone of liberalism. Various poets of Telugu Free-verse enlightened the liberalism in different perspectives of their choice.

**Marxism**

Marxism is an important component of international influence on Telugu Free-verse. After Independence, it played a pivotal role in democracy. The theoretical base of dealectical materialism propounded by Marx and Engels was strengthened by Lenin and others. It is a model socialism “free of classes and free of commodity money relations” in society. It had the wide scope for different interpretations in various situations. After Lenin’s death Stalin had his own system of socialism. What ever may be the different shades of interpretations, it firmly stands behind proletariat class. It supports their struggle aganist vested interests in society.

Socialism is a system formulated on proletarian self-government. It takes over the power from capitalism. The self government of workers replaces the capitalism. Lenin describes marxism “the ideology of labour class”. There will be no state ownership. The real owners are working people. Workers are the real masters. International support of all revolutionary forces is an integral part of Marxism. Ignoring such revolutionary forces would mean ignoring Marxism. Marxism was the ideological inspiration for progressive Free-verse writers in Telugu. The traditional and neo-traditional character of poetry changed considerably in form, content and purpose. The Marxist free-verse depicts social realism, in relation to realties of class struggle. It propagates ideas against oppression, inequality, injustice. It also inspires action against exploiters.

Emancipation of exploited class from shackles and in turn establishment of proletariat society is the main concern. The Ideology of Marxism attracted and ifluenced the Telugu free-verse after Independence in several ways. It played a significant role having an international facet. Of course, the society comprises vast groups of individuals. But it is sum total embodiment of historical, social, political and economic activity of mankind. Though poetry is an individual creative effort, so many social, political and psychological forces work behind it. Hence, their infulence cannot be ruled out. One could clearly see the change in elements of creative writings after Independence in democratic society, as other Ideologies are allowed to flow freely.

Sri Sri, the chief exponent of progressive poetry says, in "Khadga Srishti" (sword's creation) "This sword! annihilates unrighteousness. It establishes equality. It shows new way". The poem clearly indicates revolutionary Ideology of Marxism. The poet visualizes the social goal, in poetic spirit. "This is a sword, dreaming with pen / This is a heaven, creating with people". The dream, the heaven are of socialist society, craving for new path for perfect progress of mankind.

The Progressive poets like Arudra, Somasundar, Kundurthi and so on, travelled towards the new way, of marxism in poetry. Arudra attempts "to break" the "un-seen walls around him", for emancipation of the oppressed people. Somasundar in the same vein, promises to break the iron cages, and release the shackled proletariat class. Kundurthi often confirms his leaning towards the progressive ideology of Marxist Socialism. Another poet of Free-verse Adigopula Venkata Ratnam, says In "Maha padham", workers fist is labour power. He clearly expresses struggle against exploitation, and predicts "no scope for escapism". He fully belives in Marxism, hopes for solution for all evils, in a complex and complicated society.

The split in communism in international politics (1960) led to another phase under the leadership of Sri Sri. VIRASAM revolutionary writers wing (1970) emerged. It began to propagate Chinese leader Mao's Ideology of cultural revolution. In this connection, Sri Sri says, "Today Peking is the light of hope and centre of revolution for exploited and oppressed world". In Telugu Free-verse the second phase of marxism

was set in Mao's Ideology. The poets, Ramana Reddy, Varavara Rao, Nikhelashwar, Cherabanda Raju, Shiva Reddy, Shiva Sagar, Siddha Reddy and others spearheaded the Moism with distinct mark of naxalite movement. It is an attempt to re-build revolutionary forces for the success of Marxism in literary and cultural fields, in addition to political movement for change, in society. Sri Sri depicts naxalites as, "Strange heroes, dynamites for injustice'. It clearly endorses the violent activities of Maoist, supporters. Samudram "ocean", of Varavara Rao is a symbol of people's revolutionary zeal. "No cyclone fear for ocean. Cyclone fear is for shore. I am furious sound of ocean" the cyclonic ocean indicates the violent movement of Moism. Addepalli Ramamohana Rao depicts the agony of effected people in an emotional plane and marxist voice.

The basis of the movement was shifted to remote villages and forest areas. The subject of urban and industrial problem was widened by adding rural issues of land and agricultural matters. Hence viplava (revolutionary) Free-verse plank differs from the progressive, (Abhyudaya) Free-verse plank, in general. Siva sagar in "Udyam nela baludu" gives call to all professionals, labourers, farmers, weavers, servants, oppressed and suppressed people" to Join the revolutionary moverment. This echoes Sri Sri's call, in Khadga Srushti Whatever may be their subtle personalities, broadly speaking all progressive and revolutionary Free-verse poets come under the umberella of Sri Sri, the leader of Marxist Free-verse in Telugu.

Seshendra Sarma is a unique Free-verse poet with a distinct personality. He believes in Marxism, and proposes to accept the "Ideology", as a solution for economic, social problems. He opines politics in society is only one part of life. The "poet is responsible to mankind but not to the political party", says on his active role in party. In "Adhunika Maha Bharathanm", the poet depicts farmers life on a broad convas of green fields, gardens, mountains, rivers, sky ocean, with revolutionary zeal in symbolic action.

In addition to them lakes, sickles, ploughs, trees, birds are woven to projet rural agricultural life. He mentions "I am only a sign board, people themselves have to reach that goal" He is against Joining or taking active involvement in marxist party to reach the goal of Socialism, as a

poet. He identifies in an indirect way with struggle for change of society. He never hesitates to preach even violence to achieve the goal. “Seshen Thunder” Thunder! let directions break (into pieces)” without fear. “I have’t come with cuckoos in my pocket I have come with bombs in my fist”. The above lines reveal his active role engraved with Marxism and embedded with the ethos of rural life.

Manepalli Satyanarayana follower of Marxism depicts the activist image in “Yodhuda”... in an emotional enrichment and commends for achievement of proletariat society. His concern for the set goal is evident in almost all his poems, either subtly or specifically, on realistic plane.

K.Shiva Reddy, the Marxist poet, draws clear line betwen people and their enemies. “Here there are only two classes, two parties”. He incorporates whenever he thinks fit in a poem, the ideas of class strggle, violence, opression and revolution. He is a poet of anti-establishment.

**Feminism**

Feminism in Telugu Free-verse has began its active role since 1975. The Feminist Free-verse emerged, in an amazing way. It fascinated Telugu poetry lovers, from 1980 onwards. It reviews examines analyses, interprets and proposes human history, culture, literature and life from feminist perspective. It attempts to re-construct feminine personality, on the basis of gender equality, and freedom in all spheres of life. In fact this as an international phenomenon. The line of thinking takes up the activities pertaining to opportunities, development, progress, freedeom, equality, human dignity of women. Such acitvity took place earlier also. It is a well known historical fact. But todays Feminism. In general way with historical perspective and matriarchal out look has an international bearings.

The Feminist movement intensified its campaign since 1960 all over the world. It worked to propagate awareness, to remind basic rights, to exterpate torture, violence, \ suppression on women by men and also to inculcate Feminist Ideology in women world. Its intention was to change completely the masculine social cultural psychological structure, prevalent in society, for a long time. To achieve the target, several view-points emerged in different situations. Among them are 1). Liberal Feminism

2). Radical Feminism 3). Marxist Feminism, 4). Conventional Feminism, 5). Democratic Feminism and so on.

In Telugu Free-verse the Feminist writings achieved significant position, in a short time. The subjects are gender discrimation; household work, house maid duties, other immense responsibilities humiliation, torture, slavery, violence, lack of opportunities, discouragement, confinement, dependence, inferior position and patriarchal domination, in society. Their purpose is to achieve development of total personality of women, in a feminist prospective, in all spheres. United Nations Organization (UNO) in the year 1975, declared the period 1975-85 as a women decade. Several activities were taken up in this regard all over the world, by several organizations. In Telugu Free-verse several feminist writers contributed their creative power for the noble cause. Most of them established heir existence by their own emotive, distinct literary personality in the history of Free-verse. The poetic sensibility and art of poetry, made them enter in to the gallery of poets.

Savithri' s "Bandipotlu" (decoits) was published in 1984. It has become a trend setter for a "sort of Feminist free-verse, which depicts suffering, agony and reminds immediate reactions of women, towards male dominated society. Savthri struggled hard for freedom in family as well as in individual life. She was away from her husband and psychologically lost her mental peace. She built up strong opinion against men, Fighting all her life, she passed away in pathetic conditions. Her famous Free-verse (Sveccha Kavithvam) by name "Bandipotlu", translated in to English as "Dacoits" was included in an anthology of poetry published by "Penguin" international publishers.

"I was afraid, when teacher said, / if you did not recite lesson I will perform your marriage". In Telugu language connotative meaning of "pellichesta" is, "I will punish you". It is an idiomatic expression. "Do not utter morals. True meaning is clear! open your eyes! In dutiful light". She condemns male domination, and instigates for action, against injustice to women. "I wanted handful of life, a spoonful of air, a gulp of water, At least Silence! But I received blames! and ridicule!" "un-necessary interference!" Definitely "it is a murder!" loneliness, humiliation,

dependence, oppression and fearful atmosphere, and death at the end of life are the highlights in a woman's life, portrayed in the poem.

Kondepudi Nirmala, in her ,poem, depicts courageous fighting sprit of women. "How much we have been suppressed/ so much enthusiasm of a writer coming out forcibly from ground (earth) and forming a stream?" This poem is in contrast to earlier poem by Savithri. Self confidence, hope and activism in women, signal the change in thinking. Feminism brought change in men's attitude and awareness, also 'in women's perception. Vasantha Kanna biran in an encouraging tone says "Encounter is the first step, on cruel beasts who torment! you!". The idea is to instill fighting spirit in women in crucial situations. Serbs in Bosnia to eradicate Croatians, attempted atrocities on them. In the process women were harmed and insulted. Protesting and condemning the inhuman acts of serbs, Niramala expresses deep concern. In lust and wrath the manner in which they humiliated the women is deplorarable. It exhibits their "crooked morality" and "false heroism". Jayaprabha wants struggle against violence and exploitation of women. She expects awakening in them, "who have tired in life',' so early, "perfoming useless worships and "menial work". She enthusiastically voices', "our pens are moving towards war", for tomorrow's new dawn. Jayaprabha's feminist expectation and hope certainly points at total transformation of women's life, into bright morning future. There are many Free-verse feminist poets advocating and working for the cause of feminism' Ghantasala Nirmala focuses on the subject and depicts subtle and emotional feelings artistically pertaing to feminism. Volga, Hymavathi, Silalolitha, Rajitha, Adurti Satya vathi Devi and others, who contributed to the cause effectively, in thrir own way.

Feminism is not only concerned with the rights of women, but addresses issues related to gender equality, awareness of freedom, openings for development and independent existence, in feminist perspective. Feminist writers have secured their purposeful existence in history of Free-verse by their commitment to Ideology and creative power, which deserves critical appreciation.

# HUMAN FACET

Human Facet in Telugu Free-verse after Independence, is classified into two (1). Micro level. (2). Macro level. Micro level is concerned with particular events depicted in a subtle way. It scope is limited and purpose is well directed to, a single target. Macro level is related to several situations described in broad base. Its scope is universal and purpose is well directed to multiple targets, on a broad base. Speaking generally, human facet in the study, comprises external and interrnal states of man-kind, either individually or collectively. Human being is a perfect creation of thought and perception, in the world. Plato expressed confidence in noble qualities of the man. The faculty of reason helps one to understand and proceed further. Human being is the central figure in Human facet. Hence the study entirely. revolves around feeling, experience, thought, wisdom, reason development in life. Man is a creator as well as destroyer. He has the capacity to rise high and shrink by weakness. Love, hope, nobility, forgiveness, sacrifice, magnanimity, righteousness shine and please others. Hatred, despair, narrowness, revenge, accumulation of meanness, dishonesty / Knavishness harm others. Man is a combination of various qualities like colours. Hence life becomes most intricate uncertain affair that takes unprecedented course in a moment.

Human element saves man from total annihilation. In democracy, human rights are meant to strengthen its base. Human facet is an inseparable aspect of poetry. It glitters in different angles, as the poet desires to express. Rising, thoughts could be related to universal outlook. They cross the frontiers of class, caste, religion, region and other narrow limits. Human facet attracts by its human relationship and universal perception. It views human element at all levels of individual, community and society. These are interlinked in life.

Sri Sri in “Sarath Chandrika” (Moonlight in autumn) accosting moon, appeals “to speak to unfortunate persons and console them who are in Jails, and slums”. He further requests “to touch the fore-head” of poor people. The human touch, which a man could not extend them, is being accorded by moon rays. It reminds of his duty. “In core of the conscience all are human beings” opines poet in “Khadga srushti”. “This is true, new

rectitude is a duty of man, Human power is greater than atomic power". The poet reveals the capacity of human power which could be utilized in either way for peace and development or for war, death, destruction. Human facet shines or diminishes. So poet say, "Man is my music, Man is my message". The universal out-look reflects by out-shining all other notions.

Balagangadhara Thilak in "Vasudhaika geetham' (song of the land) says "I hoist human flag", The poet visualizes the universal image of man, wiping out narrow boundaries of race nation, religion, province and country. Thilak is a humanist of liberal out-look. "I cannot eulogize the world without human quality" says in "Artha geetham" (Song of agony). Without human element society is a forest 'where beasts live. There fear prevails and danger awaits. He laments selfish, distressing and cruel occurrences in society. In 'prayer' (Prardhana) he stresses, human element is the "only one" precious "ornament", which had "fragrance" like "sandle wood": The aim of all civilizations and progress is to achieve "divine" form.

Kundurthi expresses deep attachment to human beings, "I like man he is more to me, than God!". He is credulous in powers, of man, than super power of the divine." Man's will and and his actions do form the life, in turn configure in society. Kaloji Narayana Rao, who does not subscribe to any particular Ideology, professes 'the spirit of human beings' and their "action" only leads for the destiny of mankind. Somasundar, Marxist expresses faith in human endeavour. Miriyala Rama Krishna travels on the same path. He yearns for change in society by human effort along with human touch.

Ajanta is a remarkable- poet of humanism. In "Svapna Lipi", (Dream Script) he says "All men are one, Man is independent by birth". The Universal out-look of the poet, and his high opinion about human beings is revealed. "Man is both, killed and killer". It indicates the role of a person,' for good 'as well as bad in different circumstances. The poet says, "Appearance of pure person for a moment is enough. Circumstances spoil the purity of a person. It is a very difficult task to keep up the purity in life.

Pervaram Jagannadham in his commitment to human culture says "For good or bad, the man is the central point and feels "humanism in man should be like a fragrant flower" K. Suprasanna charya, "Goodness' is not property of any establishment. It sparkles in the soul of man", The brightness of goodness is universal. It has no discrimination. Goodness is a result of "human light". K. Sampat Kumara Charya sees every where "the effort of man" at "various points". He would like to see all men in one "human form" for "happiness in life" This is his "firm belief". C.V. Krishna Rao, in "Vaitarini" and "Killari'" believes in "human, mind" and "human effort" and "human heart". Adigopala Venkataratnam on same path, wishes people "to march forward", with "affection and passion" for "prosperity of mankind" and progress of society.

Digambara poets in Telugu Free-verse are free from Ideological influences. Their concern is mainly for human sprit. Nagnamuni, Nikhilieshwer, Jvalamukhi, Cherabanda Raju, Bhairavayya, Mahasvapna, six poets inspired resurrection of human values in the present decadent society. They emphasis on un-masking the pure and natural conscience. It is visualized "free from dust dirt and immoral atmosphere" as an ideal for the mankind. In this way "Digambara" Free-verse, played its role in human upliftment for better society. The poets craved for human values no doubt, in bitter and offensive tone. Papineni Siva Shankar appears as a "dreamer", of "human form" in "greenery world". He is sympathetic towards, people in "suffering" with "human touch" Rudra Sri, gives utmost importance to inner qualities", in man, than "external appearance", like caste, religion etc.

Ismail and Kothapalli Satyanarayana, tried to depict human images on canvas of nature. Prasen, Seetharam, Afsar, declared their idealism as "human vision", To see man as a man to recognize his power in both internal and external form, to encourage, to promote creative and constructive qualities, to strive for "completeness" in "man" for the welfare of society.

The "Sandhya Kavithavam" of Vegunta Mohan Prasad stands for "human concern", in complicated life, The agony, melancholy suffering hatred and so on and in contrast to happiness, love, friendship, peace etc. subtly employed to reveal the importance of human touch. Siva Reddy,

though a committed marxist extols man. “Any thing never comes to the mind before man’s great beauty.” In his opinion it is a qulitative one, which comprises creative and constructive powers in man. N. Gopi, says, “First and foremost we are human beings”, “Life is a prism which reflects manliness.”

Dasarathi poet of liberal ideas in ‘Punaranavam’, “Thimiram” tho samaram”, fully endorses the human existence, its vitality and celebrity. The poem earnestly whises string of affecion (raga bandham) between persons. He believes that the poetry springs from it. He expects real inner form of man, to come out with intellect wisdom and feeling. He is optimistic and hopes for bright future. He has full confidence in man in handling the future course of history, on humanistic track. ‘Punarnavam’ means “rejuvenation”. It is a symbol for regeneration, elixir for transformantion of mankind to new form of vital force. In “Thimiram tho Samaram” (“Fighting with darkness”), he opines that the will with dedication is important to achieve victory over evil. “Have the search of path, where man never hates man” / “Make the whole world a heaven of happiness and peace”. The poet feels “man should not become the killer of himself’. He reveals constantly the brighter side of man, which is always threatened by darker side of man. In his view, human element is essential to avoid the tension, clash, conflct between them. The human facet at micro level is abundant and praise worthy in Telugu Free-verse.

Madiraju Ranga Rao, an exponent of Sveccha Kavithvamu concept, brings out human facet in micro level mode of treatment. for projectinng human scenario, In “Ee Shatabdi Shabdamai Kavyamai”, (Being a poem of the Century) the poet says, “Human passion has no social barriers”, in any form. He views human element with universal out-look. In “Prayanam nundi Prayanam”, (From Journey to Journey) he describes “on seeing from the window of moving train, it seems peace in running trying to hold some thing missing / forgotten” It appears man is waiting” for some thing. The running train denotes “passing life”, and “missing” one indicates precious “humanism”. Man always misses the human element, and runs after it. This is a poem of symbolic action. In “Manavatha Pushpamai” (“Being human flower”), poet depicts “It is not enough, of coming up trees here and there on rocky hill in a person. Every atom of greenery heart has to pulsate”. The poem explicates the humanism in subtle way

with an imagery component taken from nature. In “Cross fire” the poet says may be an unknown defaulter” whoever may be the man in the news, the human bond should he recognised. The human element in pathos is described on a limited canvas. The human facet at micro level in Telugu Free-verse is seen abundantly in various dimensions.

The importance for human being is a well established fact in all Free-verse poets in Telugu, without any exception, irrespective of ideological commitments or leanings.

# HUMAN FACET
# LONG POEMS OF A BROAD BASE

**(2)**

Several long poems in Telugu Free-verse are written on a broad base of human aspect. Some poets depicted the human story in different angles of their choice. They have covered human history, culture, development, progress, events of significance, ideological importance and so on; concerning the Individual and society. Projection of these angles vary from poet to poet. Canvas of the long poem is large and the treatment of subject matter goes under transformation at macro level. In creative process, the form of long poem attains distinct individuality of the poet. It is an embodiment of so many factors of poetry, i.e. selection of theme, language, expression, ideology, philosophy and, so on. Some of them were being taken for studiy on representative bases.

“Manaveeyam” of Madiraju Ranga Rao is a first long poem on Macro-level, having realistic thought of human development. It touches all important peaks, in life from early ancient cultural period to modem period. It starts with the first experience of dawn, and human life pertaining to hard realities and imaginary world. It is an epitome of man’s development. Morning sunshine gives man living spirit and exhilarates him for action. “Man’s movement with awakened mind”, is a Cautious and Judicious conscience in a Journey of life. In the Journey man faces so many obstacles, difficulties, opposition and enmity from different quarters. They have to be met with will, action and wisdom. The long poem has the back ground of nature and descriptive realities of different facets of human life.

In part - I, the early stages of human life, are depicted. The effort of man to fulfill basic necessities in daily life i.e. redressal of hunger, safe-dwelling, clothing and civilized society by higher aspirations were contrived. The progressive steps from one generation to another generation and one period to another period are formulated. Materialistic needs, psychological influences, behavioural tendencies and un-expected turns in history of mankind are projected in accordance with the subject.

The epic elements are visible in the treatment of the subject, focusing on multi faceted colossal image of life. In due course, the poet depicts, thus: “The life being a fire ball, Each one travelled in his way which gives happiness, comfort and advances in experience of knowledge”. It is a reality of life. Mr. Rao compares life to a bridge and says ‘The foot prints on the bridge are reminiscences of the history, and embellishments of time”. It reminds us of the significant remains and signs in the passage of history.

In part - II, the social inequalities and their repercussions, reverberations are depicted. Also emergence of new forces, new equations, due to historical reasons and visualization of new path for the creation of new society are described. In the process, poet affirms “un-nerved in grief; non-stop in difficulty, un-leaving in defeat”, one should have the vision of new world.

The long poem has various perspectives of life. It has been designed on social, political and psychological and artistic elements. Also, it often glistens with philosophical touch. “Humanism is a power which, Joins the two ends of life with this world” Humanism was recognized as prime element for sustenance of life.. Hungry at the physical level, selfish at the psychological level, denigrated and de-dehumanized in human life were depicted aptly focusing on peculiar situations in life. Even in civilized society some times wars do occur, and human tragedy takes place. To counter it, selfless service. is needed. - Selfishness, ego, hatred may lead to turbulence, chaos and melancholy. The Poet opines “Today’s man has to take the form of universal culture”, “Sounding new energy in every step”, ‘Pulsating new creation in every heart”. Humanism with an edge over all other elements. is established “Manaveeyam” is a long poem, which reflects the human personality as a permanent feature of mankind, in all ages of human history.

“Koyya Gurram” (Wooden Horse) is another long poem of Nagnamuni. It is a symbol for static, inactive, lazy, society. In 1977 November, the cyclone created havoc in Divi Seema. Enormous devastation took place and people suffered a lot. Death prevailed every where. This long poem emerged in this situation of horror and tragedy. The poem is intended to infuse human values, and inculcate human concern.

The inactive administration has been censured for its insensible style of functioning. The poet promises to discover the fuel to burn the useless “Wooden Horse”. The attitude indicates contempt and anger towards the present establishment. The “Wooden Horse” goes on pleasure walk on iron hoofs. It never sees people on ground. It moves in sky. In fact horse is a symbol for power and speed. Some times it indicates victory. In present context, wooden horse implies the static admintration. The government never bothered to tackle the serious problem. It projects at various points agony, suffering and tragic conditions of people of the affected area. Hence the poet desires to “destroy the Wooden horse” and create “another horse”, a live and active one. The poet indirectly suggests the replacement of present inactive - establishment by an active one, i.e. Wooden horse by a lively horse.

“Vishwambhara” another long poem by C. Narayana Reddy is a depiction of various stages in the Journey of mankind. Social, artistic and philosophical perspectives have been taken into consideration, The hero is man and the vast world is the stage. Its back ground is nature. The personalities that emerge at different occasions are, Alexander, Christ, Ashoka, Socrates, Buddha, Lincoln, Lenin, Marx, Gandhi and so on. In the poem dates are not mentioned. In a general way time is covered from primitive age to Modem age to focus on the importance and greatness of man along with the shadows of weaknesses. “Man, always being in existence, never exits the role of character”. Every human being plays individual role, all his life. It never ceases. The play of characters is a continuous process. In the poet’s view it never ends. It is said in comprehensive context of universal activity. Man is a stage manager also, sutradhari (one who holds the thread of drama.) The poet in a philosophical tone says “Man has no death, The death is for body only. Thought has no death. Man is a powerful being who conqueres time”. In these words the poet upholds the inner personality of conscience (antharathma) in man, which is always alive in continuation of society.

The poet reveals the importance and greatness of man at social and nature levels. In his view, “Man becomes slave to five senses”, and “under illusion forfeits address”. He “lingers in between illusion and reality”. Then awakened by employing “element of reason”, “goes forward”. In the end, the poet sums up, “Man is a cover for conscience,

Man is a garment for world" This is the Philisophy of Vishwambhara / This is the rtuth of unending life". The relation between man, world conscience and life is aptly established. The spirit of the long poem is well managed artistically.

"Nadesham Na Prajalu" of Gunturu Seshendra Sharma is another long poem in Free-verse. He is a founder of "Kavisena". It is a non-political, Vaignanika (Scientific) movement. It is a secular one, with human concern. The poet asserts that, the voice of a poet should be a "permanent moral call". The long poem is a description of realities of Indian life, and vision of human progress. The human elements in this long poem appear on two levels. 1). Consciousness of external world (2). Proposition of social rectitude. The human facet in "My country and my people" appears in various images employed in the scenario of farmer's life with the back ground of agricultural and rural atmosphere. The poet depicts "Man as a God", in the "temple of mankind", and gives utmost importance to human outlook in "Na desham na prajalu". He aspires for the "new world" where "men live like men" only. In the analysis we find the conflict between exploiters and exploited for land, 2). Concern for common citizen, 3). Struggle for ecomoic equality and social change, 4). Call for annihilation of oppression and slavery, 5). Establishment of new society of Marxist ideology are the core targets for progress of mankind. They were focussed artistically by employing images, symbols and attractive poetic sensibilitty through process of style on emotional plane.The long poem is a noteworthy contribution to human facet in Telugu Free-verse. The poet opines it as a modern epic.

"Padagettina Udayam" another long poem of Madiraju Ranga Rao is a record of the events experienced in twenty four hours time of an individual's life. The title suggests splendid power of human being, to face the challenges today. As soon as man awakens in the morning, the world manifests number of openings before him. In the poem, many and varied experiences in twenty-four hours of the day are depicted. Human element is subtly suggested whenever occasion arises from early morning to next dawn. The subject comprises five stages of day's time co-related to human endeavou in life, in the modern world. In the poem, Rising sun suggests the wish for going forward in life. Midday sun indicates the peak, could he achieved in life. Evening sun reminds the sorrowful

situations in life. Arrival of night denotes a mixed bag of fearful conditions and restful condition also hopeful situation in moon. Last phase of night points out the end of the day and beginning of new day. "The old face, dropping down the sweat drops, and stitching shoes" appears on the foot-path or at a corner, in day time. The human factor reminds the social problem of hard working people and hard reality of life.

"Agninundi Anandaniki" "Fire to Bliss" is another long poem of Madiraju Ranga Rao. It begins with an idea of creation and covers various aspects of activities. The complex and complicated life viewed in 'Camera focus' technique. "Fire" is a symbol for unceasing strength in man. "Bliss" is a result of hope and endeavour of righteousness in man.

"Jeevana lipi" long poem by Avantsa Somasunder is another valuable work. It is divided into five parts. Morning' is an indication of happy human society. Mid day' It is a reflection of peak of human race achievement, in history. Evening is a suggestion for exit of past glory, and sorrowful situation. Mid night: It is a depiction of dormant! mad night, without people around. End of night is a form of anti-darkness, and rekindled hope on appearance of dawn. The poet proposes "Let us awake energy of life and human concept" and stresses their necessity for our _existence.- He also appeals, "Let! us! establish! Liberal humanism / Let! us! welcome! Progress of man", in the world. The poet opines, no worthwhile progress is possible in society without humanism. He reveals his full faith in man and his glory.

"Cross-fire", "Cease-fire" and "In between today and tomorrow", the "trio" called "Agnipeetam" "Throne of Fire" by Madiraju Ranga Rao extols essentiality of human element, human touch, human dignity, human concern and human spirit at the present Juncture, for the better future of mankind. The trio in "Agnipeetam" is directed towards the goal of liberal democracy. "Cross-fire" becomes tragic in political social, and personal circumstances. The situation may lead to death, destruction, hostility and violence. So ceasefire is necessary to restore peace harmony and progress. It will be achieved quickly and effectively through democratic progress, in peaceful way. Un rest and strugles do occur due to social Problems and natural calamities are some times un-avoidable. They may affect human beings in all spheres of life. Cyclone, earthquake

and so on are not in our hands. Sometimes it may go beyond human power. This is a different problem. Coming to the social reality “May be Justice, may be law, may be revenge, may be an Ideology”, what ever may be, it should not become “iron leg” and “snatch away the right to live from man. (Cross fire). The Poet in an optimistic way sings that it is now “tuned for splendid human melody”, and hopes for harmonious atmosphere in society. “The new figure of the human being appears on the face of new millennium” - is the poet’s vision of mankind in 21st century.

The poet is a firm believer in liberal democracy. So the trio, “Agnipeetam” asserts the way of friendship, harmony, peace for equality, fraternity, Justice, and freedom for all, in a society with a democratic spirit only. Without human face they never yield good results. Moreover it may increase the problems, tensions, conflicts, enmity and destruction, in different situations.

The human facet in Telugu Free-verse played a positive role true to the spirit of democracy. The study of National, International and Human Facets in Telugu Free-verse after Independence, is an attempt to look at the creative works in new perspectives of critical appreciation. The facets in different combinations go together in most of the writings, as different Ideologies and views do exist and are active in their spheres. The Free-verse has assumed manifold expansion due to historical necessity, social compulsions and individual awareness of freedom The variety of creative output of Sveecha Kavithvamu reflects the true spirit of democracy, in Post-independence Telugu Svecha Kavithvam (Free-verse.)

సాహిత్య సమాలోచనం Literary Criticism - 17

# పరిశోధనా స్వరూపం

మాదిరాజు రంగారావు

2026

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్–28.

Literary Criticism - 17

# PARISHODHANA SWAROOPAM

(Sahithya Samalochanam)

by
Prof. Madiraju Ranga Rao

© : Dr. M. Santhosh Kumar

First Edition : 1992
Second Edition: 2003
Third Edition : 2026

# అంకితం

పరిశోధనా ప్రపంచంలో ఆదర్శ శిఖరం
పరిశోధనారత్న
**ఆచార్య బిరుదురాజు రామరాజుగారికి**

# సూచిక

1. పరిశోధనా క్రమం ........... 207

2. పరిశోధనా విధం ........... 229

3. గ్రంథ పరిష్కరణం ........... 239

# పరిశోధనా స్వరూపం

## 1. పరిశోధనా క్రమం

### 1. ప్రయత్నం - కర్తవ్యం

పరిశోధన - దీనికి సంబంధించిన వాతావరణం పాశ్చాత్యుల ప్రభావంవల్ల, వారి కృషివల్ల ఆరంభమైందే. అయినప్పటికీ ఎంతో ప్రాచీనమైన సంస్కృతిగల భారతదేశంలో అనేక రంగాల్లో ఈ దిశలో చేయవలసిన కృషి ఎంతో ఉండడంవల్ల పూర్వం దీని అవసరం ఎక్కువగా భావితమైంది. వివిధ భాషా ప్రాంతాల్లో ఎంతో సహజమైన అమరికతో తన పాత్రను నిర్వహిస్తోంది. చారిత్రక దృష్టితో కేవలం సమదర్శనంతో పరిశీలనం జరిపి యథార్థాన్ని అన్వేషించి కనుగొనే ప్రయత్నం పాశ్చాత్య విద్వాంసులతో ఆరంభమై, నేడు మన పరిశోధకుల కృషివల్ల ఎంతో సంపన్నమై విలసిస్తూంది. వీరి పరిశోధనల ఫలితంగా ఎన్నో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీనితో పూర్వం నుండీ అశ్రద్ధవల్ల ఇతర రాజకీయ సాంఘిక కారణాలవల్ల వినష్టమైపోయిన సంస్కృతీ స్వరూపాన్ని పున్నిర్మితం చేసే ప్రయత్నమూ జరిగింది. ఉన్నదాన్ని సరియైన దృక్పథంతో వాస్తవగుణంతో అవగాహన చేసుకొని ఆవిష్కృతం చేసే ధోరణి ప్రబలింది.

ముఖ్యంగా భాషా సాహిత్యాలకు సంబంధించినంతవరకు చూస్తే పరిశోధనా వ్యాసంగం పాశ్చాత్యుల శాస్త్రీయమైన పరిశీలనంతో ఆరంభమై క్రమంగా ప్రాచ్య విద్వాంసుల విశేషమైన కృషివల్ల ఒక పరంపర ఏర్పడింది. ప్రాధాన్యాన్నీ పొందింది. చాలా తక్కువ కాలంలో గణనీయమైన స్థితినందుకుంది. పరిశోధనా విభాగాలూ ప్రత్యేకంగా రూపొందాయి. దీనితో ఆలోచనాత్మకమైన విజ్ఞానసంపదతోపాటు దానికి అనుభవాత్మకమైన రూపమూ అభివృద్ధినొందింది.

ఏదేని ఒక అంశం గురించి కొత్త అంశాలు కనుగొనడానికీ, ఇదివరకే ఉన్నవాటిన గుర్తించి పునఃపరిశీలనం చేయడానికీ, కొత్త దృక్పథంతో వ్యవస్థీకరించడానికీ, వ్యాఖ్యానించడానికీ సిద్ధాంతీకరించడానికీ శ్రద్ధతో అన్వేషణతో జిజ్ఞాసతో వివేచనమూ దర్శనమూ ప్రధానంగా సాగే ప్రయత్న పర్యవసానమే పరిశోధన. దీని పరిధి చాలా విస్తృతమైంది. ఎవరికి వారు ఎక్కడికక్కడ తమ క్షేత్ర స్వరూపాలను, ప్రత్యేకమైన దృష్టితో అవసరాల్నిబట్టి కొన్ని పరిమితుల్లో నిబంధించి ఉపక్రమించడం అనివార్య మౌతుంది. ప్రస్తుతం సాహిత్యానికి మితం చేస్తే, సాధారణమైన వ్రాతప్రతి పరిశీలనం

మొదలుకొని సమాచార సేకరణం, వాస్తవాల అన్వేషణంతో, విశ్లేషణ పరిశీలనం వివరణంతో సమన్వయం, సమర్థనం విభేదం నుండి అభిప్రాయాల ఆవిష్కారం సిద్ధాంతాల ప్రతిపాదనం దాకా పర్యాప్తమైంది.

పరిశోధకుని దృష్టి ఎప్పుడూ అన్వేషణలో ఏవో కొత్త విషయాలను దర్శించడానికే ఆరాటపడుతుంది. దీనికి పూర్వం ఎంతో కృషి చేయవలసి ఉంటుంది. విషయం ఏదైనప్పటికీ, పరిశోధకులు దీన్ని ఒక క్రమపద్ధతిలో ఆలోచన చేసి, నిర్వహణం సాగించవలసి ఉంటుంది. దీన్ని మొత్తంమీద, పరిశోధనా విభాగంగా పేర్కొనవచ్చు. ముఖ్యంగా ఆరంభకులకు దీని పరిజ్ఞానం చాలా అవసరం. దీని లోపం వల్ల ఎన్నో సందర్భాల్లో ఎందరికో పరిశోధనపై అభిలాష ఉన్నప్పటికీ నిశ్చయమైన స్థితికి రాలేకపోవడం, ప్రయాణించవలసిన మార్గం కోసం తడుముకోవడం, అటు ఇటూ పరుగెత్తడం లేదా మధ్యేమార్గంలో నిరుత్సాహంతోనో ఆగిపోవడం జరుగుతుంది. ఒక నిర్దిష్టమైన విధానం తెలిసినపుడు, పరిశోధన శాస్త్రీయ మార్గంలో ప్రవృత్తమై సుస్థితికి దారితీస్తుంది. అభిలాషలో దృఢత్వాన్ని పొందుతుంది. ప్రయత్నం ఫలోన్ముఖమౌతుంది. అందువల్ల దీని స్వరూపాన్ని గతిక్రమాన్ని తెలుసుకోవడం పరిశోధనా వ్యాసంగం అవలంబించనున్నవారి మొదటి కర్తవ్యం.

పరిశోధకునికి వ్యక్తిపరంగా అభిలాష, శ్రద్ధ, జిజ్ఞాస, ప్రయత్నం అనే నాలుగు లక్షణాలు మౌలికంగా ఉండాలి. పరిశోధకుడు వీటిని నిరంతరం ఒక ప్రమాణంలో నిలుపుకుంటూ ఉండాలి. కొత్తగా ప్రవేశించిన వారికిది ఎంతో శ్రమాకలితంగా అనిపించ వచ్చు. పరిశోధన మధ్యలో విరమించుకోవడమో లేదా ఉపక్రమించనే లేకపోవడమో జరుగుతుంది. ఈ గుణం చెదరకుండా జీవితంలో ముఖ్యమైన వ్యాసంగంగా రూపొందడం గొప్ప పరిశోధకుల్లో స్పష్టంగా కన్పిస్తుంది. పరిశోధన మానవుని అనంతమైన విజ్ఞానాభివృద్ధికి దోహదం చేసేదీ, విజ్ఞానసంపదలో భాగమై నిలిచేదీ అతని జీవితంలో మరింత సుఖాన్నీ ఆనందాన్నీ కలిగించేందుకు ఉపకరించేదీ కావడంవల్ల ముఖ్యంగా వైజ్ఞానిక రంగంలో ఈ విషయంలో దీనికి గల స్థానం మహత్తరమైంది. భాషా సాహిత్య రంగంలోనూ ఎంతో గౌరవస్థితిని పొందింది.

2. పరిశోధనా విధాలు

ఈనాడు పరిశోధనా ప్రపంచంలో సాగే పరిశోధనను నాలుగు విధాలుగా విభజించవచ్చు. 1) కేవలం అభిమానంతో, ప్రత్యేకించి ఒక విషయంపై అభిరుచితో వ్యక్తిగతంగానూ లేదా సమష్టిగానూ పరిశోధనా కృషివల్ల అవతరించింది. ఇందులో మౌలికతకు, పరిణతికి అవకాశం ఎక్కువ. ఈ పరిశోధకుల జీవితలక్ష్యమే పరిశోధన కావడంవల్ల ఉన్నతమైన స్థాయిని కలిగి ఉంటుంది. ఎప్పటికప్పుడు కొత్త విషయాల అన్వేషణలో విజ్ఞానసంపన్నంగా విలసిస్తుంది. 2) విశ్వవిద్యాలయాల్లోనూ, గుర్తింపబడిన సంస్థల్లోనూ, విద్యార్థుల ఉన్నతమైన విద్యలో భాగంగా డిగ్రీతో ప్రమేయం కలిగి సాగించే పరిశోధనం.

విద్యార్థి దశలో పరిశోధనకు పూనుకోవడంవల్ల మౌలికత, సిద్ధాంత ప్రకటనం కన్నా సమాచార సేకరణం, విశ్లేషణం, వివరణం, సమీక్షాధోరణి ఎక్కువగా కలిగిఉండే అవకాశం ఉంది. అయినా విద్యార్థుల్లోని విషయాభిలాష వల్ల అన్వేషణా తత్పరతవల్ల, డిగ్రీకోసం, వృత్తిపరమైన అవకాశాలపై దృష్టితో సాగే పరిశోధనలోనూ, ఉన్నతమైన స్థాయికి చెందిన పరిశోధన జరుగకపోలేదు. 3) విశ్వవిద్యాలయాల్లోనే వృత్తిపరంగా ఒక విషయంపై నిర్దిష్టమైన ప్రణాళిక నేర్పాటుచేసుకొని సాగే పరిశోధనం. ఇదీ వృత్తిపరంగా అనుకూలించడంతో పాటు అభిలాష, తత్పరతకూడ కలిగి ఉంటుంది. ఉపాధ్యాయులకు పరిశోధనలో ఉన్న అనుభవం విజ్ఞానంవల్ల ఒక స్థాయిని పొంది, విజ్ఞానాభివృద్ధికి దోహదం చేస్తుంది. 4) ప్రభుత్వం, ఎకాడమీలు, సంఘాలు, పరిశోధనా కేంద్రాల పక్షాన శాశ్వతమైన ప్రాతిపదికపై దీర్ఘకాలికమైన యోజనతోనో, వ్యక్తిపరమైన ఆధ్వర్యంతోనో, సమితి పర్యవేక్షణలోనో ప్రత్యేకంగా ఉద్దేశించిన పరిశోధనం. ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారి పర్యవేక్షణలో సాగుతూ విజ్ఞాన సంపన్నమైంది. వీటిలో ఒకటి రెండు ఇతర ప్రయోజనాలపై దృష్టి ఉన్నా ఇంచుమించు అన్నిటి ధ్యేయమూ ఒకటే. ఒక్కొక్కరి వీలునుబట్టి వారికి అందుబాటులో ఉన్న పరిస్థితులను బట్టి ఏర్పడినవి. వీటి లక్ష్యాల నిర్దేశంలో వాటిని అందుకునే రీతుల్లో వైవిధ్యం ఉండవచ్చు.

విశ్వవిద్యాలయాల్లో ఈనాడు పరిశోధనా వ్యాసంగం ఎంతో విస్తృతంగా సాగుతూంది. ఈ కృషివల్ల పాండిత్యంతోపాటు కొత్తను అన్వేషించే దృష్టి కూడ అలవడు తూంది. పరిశోధకుడు పరిశోధనకు ఉపక్రమించే ముందు, దీనికవసరమైన ప్రాథమికాంశాలు కొన్ని దృష్టిలో ఉంచుకోవడం అవసరం. ఇది ఈ రంగంలో ప్రవేశించే వారికి మార్గాన్ని సుగమం చేస్తుంది, అవగాహనకు తోడ్పడుతుంది.

## II

ఎంతో అభిలాషతో శ్రద్ధతో నిరంతరం, అన్వేషణ జరిపి, సమాచారం సేకరించి, పరిశీలించి విశ్లేషించి వివేచించి అంతర్ బహిర్ ఆధారాలతో సహేతుకమైన అభిప్రాయాన్ని నిర్ణయాన్ని ప్రకటించే పరిశోధనా రూపాన్ని ఆవిర్భవింపజేసేందుకు పరిశోధకుడు, క్రమించవలసిన ముఖ్యమైన దశలు కొన్ని ఉన్నాయి. అవి 1) విషయాన్నీ-శీర్షికనూ ఎన్నుకోవడం, 2) తొలి సంగ్రహపత్రం సిద్ధం చేసుకోవడం, 3) ఆధార విషయాలు సేకరించడం, 4) సేకరించినవాటి విలువల్ని నిర్ణయించడం, 5) విశ్లేషించి, వ్యవస్థీకరించడం, 6) వివరించడం వ్యాఖ్యానించడం, 7) అభిప్రాయాలను సమన్వయ పరచడం, సిద్ధాంతాలను ప్రతిపాదించడం, 8) పునర్విలోకనం జరిపి, తుది స్వరూపాన్ని ఇవ్వడం, అనేవి.

### 3. విషయాన్ని ఎన్నుకోడం, శీర్షికను నిలపడం
**(Choosing Topic & Title)**

కొత్తగా పరిశోధనా రంగంలోకి అడుగుపెట్టే వారిని ఎదుర్కొనే మొదటి సమస్య ఇది. ఎందరో విద్యార్థులు ముఖ్యంగా పరిశోధనకోసం విషయాన్ని సూచించవలసిందిగా పర్యవేక్షకుల్ని సమీపిస్తూ ఉంటారు. ఆ పర్యవేక్షకులీ విద్యార్థి విద్యా స్వరూపం బాగా ఎరిగి ఉండాలి. సాహిత్యంలో ఇతని అభిమాన విషయం, పనిచేసే శక్తి; ఆలోచనా వైఖరిపై దృష్టిని ప్రసరించవలసి ఉంటుంది. అతడేదో ఆలోచించి సూచిస్తే దానిపై ఇతడు పరిశోధన సాగించవచ్చు, సాగించకపోవచ్చు. ఏదో ఆపద్ధర్మంగా స్వీకరించి, దాన్ని ఆ తరువాత మార్చుకునే ప్రయత్నమూ జరుగుతూ ఉంటుంది. పరిశోధకుడు ముఖ్యంగా తన అభిరుచి కనుగుణమైంది, లేదా అభిప్రాయాలకు దగ్గరగా ఉంది, ఎన్నుకొని ఉపక్రమించాలి. కాకపోతే దీన్ని గురించి ఉత్పన్నమయ్యే సందేహాలను పర్యవేక్షకుల్ని అడిగి తెలుసుకోవచ్చు. సముచితమైన సలహాలను పొందవచ్చు. దీనివల్ల ఇతడు సాగించే పరిశోధనలో సౌలభ్యం ఏర్పడుతుంది. ముందుగానే స్థూలమైన అవగాహనవల్ల అభిలాషకు నిలకడ కలిగి, తొలిప్రయత్నం ముందుకు సాగుతుంది. పరిశోధన చేసే వ్యక్తి నిర్దేశకుని ఎన్నుకోబోయే వ్యక్తితో లేదా తనకిష్టమైన పరిశోధనతో ప్రమేయమున్న వ్యక్తితో చర్చించడం మంచిది. ఈ విధంగా తనకత్యంత పరిచయమూ అభిరుచీ ఉన్న విషయాన్ని ఎన్నుకోవడం వల్ల దాన్ని గురించి మనస్సు వెంటనే ఆలోచన చేయడం మొదలుపెడుతుంది. పరిచయం, అభిరుచి – ఆలోచన ప్రయత్నం క్రమమైన గతిలో విస్తృతమౌతూ పరిశోధనకు ఉత్సాహశక్తి లభిస్తుంది. ఒక్కొక్కపుడు పరిశోధకునకా

విషయాన్ని గురించి ఎక్కువ పరిజ్ఞానం ఉండకపోవచ్చు. ఇది సరియైన వాతావరణం చేత, ప్రోత్సాహంచేత వివృద్ధమౌతుంది. మొట్టమొదట స్థూలమైన రూపంలోనైనా విషయం దాని శీర్షికతో పరిచయం కావాలి. తరువాత పరిశోధనా పరిధుల నిర్ణయం జరుగుతుంది.

ఆరంభంలో దీన్ని గురించి అనేకమైన ప్రశ్నల రూపంలో ఆలోచించడం మొదలుపెట్టాక క్రమంగా ప్రశ్నలకు లభించే సమాధానాల ఏర్పాటుతో విషయం పరిష్కృతమౌతుంది. ఆలోచన ఒక నిర్ణయ స్థితికి చేరుకుంటుంది. ఇది పరిశోధనలో ప్రారంభకుల విషయంలో విషయ నిర్ధారణ చేయడానికవలంబించే ఉత్తమ పద్ధతి.

తరువాత దీన్ని సరిగా నిర్వహించ గలిగినంతలో, ఆ విషయానికి సంబంధించి నంతవరకూ ఐక్యత దెబ్బ తినకుండా పరిధిని నిర్ణయించడం జరుగుతుంది. దీనితోపాటు అంటే విషయం దాని పరిధి నిర్ణయంతో సరియైన శీర్షిక లభ్యమౌతుంది. ఇప్పుడు పరిశోధకుడు తాను చేసే పరిశోధన గురించి తన గమ్యాన్ని గురించి స్థూలమైన అభిప్రాయానికి చేరుకుంటాడు. ఇందులో ఒక విధమైన నిశ్చయస్థితి ఉంటుంది.

ఇంతకుముందు ఎదుర్కొన్న ప్రశ్నల పరంపరను ఒకచోట నియతం చేసి, సమాధానాలను రేఖాప్రాయంగా ఆలోచనలో ఉంచుకొని, పరిధిని అధీనంలోకి తెచ్చుకోవడంతో రెండోస్థితి ఆరంభమౌతుంది. పరిశోధకుడు ఎటువంటి విషయసామగ్రిని (మెటీరియల్) సేకరించాలన్న దానిపై దృష్టి ప్రసరిస్తుంది. ఇక్కడ ఏది దీని పరిధిలోకి వస్తుంది? ఏదిరాదు? అనే విషయం స్పష్టంగా తెలియాలి. ఇది చాలా భాగం పరిశోధకులు విషయాన్ని నిర్వహించే తీరు, అతని లక్ష్యంపై ఆధారపడి ఉంటుంది. అతడు అనుసరించే మార్గమూ ముఖ్యమౌతుంది. ఎంత చెప్పినా ఇది అనుభవంలోకి రావడానికి కొంత సమయం పడుతుంది. ఈ సమయం వ్యర్థంగా భావింపరాదు. పరిశోధన గురించి ఒక దృక్పథం ఏర్పడడానికి తాను ప్రయాణించే మార్గం స్పష్టం కావడానికి అనేక విషయాల పరస్పర సంబంధం అవగతమవడానికీ, సాధారణమైన పూర్వరంగం గురించీ తెలియడానికీ, ఈ సమయంలో చేసే కృషి ఎంతో ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు. ఈ విధంగా పరిశోధకుని విజ్ఞానం ఎంతో విస్తృతమౌతుంది. ఇది మునుముందూ ఉపకరిస్తుంది.

ఒక విషయం గురించి ఆలోచనా ప్రధానమైన పనిలో నిమగ్నమై ఉన్న వ్యక్తికి దాన్ని గురించి విహంగావలోకనం ఎంతైనా అవసరం. ఇది ఆ విషయంపట్ల స్థూలమైన అవగాహనకెంతో సహకరిస్తుంది. ఇది ఎటువంటిదంటే, అతడు కృషిచేసే పరిశోధనా క్షేత్రం ఎటువంటిది? అది ఎక్కడ ఉంది? దానిచుట్టూ ఏముంది? ఏది దేనికి

సంబంధించింది? ఎందులో భాగం? ప్రక్కనున్న ఇతర విషయాలతో గల అనుబంధం ఏమిటి? ఇది ఎటు తీసుకవెళ్ళుతుంది? ఎక్కడినుండి దీనికి దారి? ఇది ఎంతవరకు వ్యాప్తమైంది? దీని స్వరూపం ఏమిటి? తనకేది అవసరం? ఈ విధంగా అనేకమైన ప్రశ్నలు, అనుభవంలో ఎదురయ్యే సమస్యలకు సంబంధించినవే! ఈ పరిశోధనా కృషి సమయం చాలావరకు వీటిని పరిష్కరించడానికి ఉపయోగ పడుతుంది. ఈ పరిష్కార ప్రయత్నంలో ఏర్పడే అవగాహనచేత, పరిశోధించే విషయానికొక స్వరూపం, సుస్థితి ఏర్పడుతుంది. ఇది మొదటి దశ. ఇందులో విషయం ఎన్నికచేసి, దానికి సరియైన శీర్షికను నిలిపి, స్థూలంగా పరిధుల్ని నిర్ణయించుకోవడం జరుగుతుంది.

### 4. సంగ్రహ పత్రం (Synopsis)

మొదటిది : పరిశోధనా ప్రణాళికకు సంక్షిప్తమైన పరిచయరూపమే సంగ్రహపత్రం, ఇది పరిశోధనా పర్యవసాన రూపం కాదు. ఇందులో సిద్ధాంత గ్రంథంలో యోజితమైన విభాగాలు, ఉపవిభాగాలు, వాని శీర్షికలతో ఒక్కొక్క శీర్షిక క్రింద క్రమంగా అందులోని విషయమూ చాల సంక్షిప్తంగా ఉల్లేఖితమవుతుంది. ప్రధానమైన పరిశోధనకు ఉపక్రమించే ముందు స్థూలమైన దృష్టిరేఖలతో ఇది రూపొందించబడుతుంది. కాబట్టి దీన్ని తొలి సంగ్రహపత్రం అనవచ్చు. (చివరకు పరిశోధనా గ్రంథానికి జతపరిచేది, మరొకటి మార్పులతో అనుక్రమణిక ననుసరించి రూపొందేది తుది సంగ్రహపత్రం). పరిశోధన ఆరంభించి కొనసాగించడానికి తొలి సంగ్రహపత్రం అవసరమౌతుంది. ముందుగా దీన్ని సిద్ధం చేసుకోవడంవల్ల విషయం ఎన్నిక, దాని శీర్షిక పరిధుల నిర్ణయం పరిశోధనలో అవలంబించే మార్గం. అందులో విభాగాలు ఉపవిభాగాలు, ఉద్దేశం స్థూలంగా నిర్ధారణ జరిగే స్థితి చేరువ అవుతుంది. పరిశోధన ముందుకు సాగేకొద్దీ ఇందులో ఏవో చిన్న చిన్న మార్పులు జరగవచ్చు.

చివరిది : ముందుగా సేకరించిన అనేకమైన విశేషాంశాల పరిశీలనం, విశ్లేషణం, వ్యవస్థీకరణం వివరణంలో అనుభవంవల్ల వివేచనవల్ల పునరాలోచనకు గురియై పరిశోధన ముగిసేలోపల, ఏవో కొన్ని మార్పులు జరగడం అనివార్యమూ సహజం కూడా. మొదట్లో ఆయా విభాగాల్లో, ఉపవిభాగాల్లో పరిచ్ఛేదాల్లో పరిశోధన జరిపిన అంశాలను స్పృశిస్తూ సిద్ధాంత గ్రంథంలోని విషయక్రమం, మొదటి నుండీ చివరివరకూ సమీక్షారూపంలో సిద్ధం చేయబడుతుంది. ఈ విధంగా మొదట్లో సంక్షిప్తంగా, మార్గనిర్దేశకంగా ఉన్నది. తరువాత మార్పులతో ప్రాతినిధ్య రూపంగానూ తీర్చబడుతుంది. ఎంతో విషయాన్ని సంక్షిప్తం చేసి ప్రభావశీలంగా జరిగిన పరిశోధనా స్వరూపాన్ని గురించి

స్థూలమైన పరిచయంతో పాఠకులకు ఒక అభిప్రాయాన్ని అందజేస్తుంది. అందువల్ల పరిశోధన చివరలో దీన్ని జాగ్రత్తగా రూపొందించవలసి ఉంటుంది.

మొదటి సంగ్రహపత్రం సిద్ధం అయిన తరువాత ఆ ప్రణాళికనుబట్టి లభ్యమానమయ్యే విషయాల సేకరణం ఆరంభమౌతుంది. దీనికిగాను చదవవలసినవీ సంప్రదించవలసినవీ గ్రంథాలు, పత్రికలు, ఇతరమైనవి గురించిన సమాచార ప్రయత్నంతో పరిశోధన చేయాలనే అభిలాష నుండి, పరిశోధన చేస్తున్న అనుభవంలోకి పరిశోధకుడు క్రమిస్తాడు. అభిలాషతో పాటు ప్రయత్నం మొదలౌతుంది. పరిశోధకుని మనస్తత్వంపై కొత్త ప్రభావం దృష్ట్యా ఇది ముఖ్యమైన పరివర్తన దశ.

### 5. ఆధార విషయ సేకరణం (Collection of Source Material)

పరిశోధనకు ఆధారమైన విషయాల సేకరణంతో, మొదట్లో పటం సహాయంతో గుర్తించే స్థలం – ఇప్పుడు పరిచయాధిక్యాన్నీ పొందుతూన్నట్లు ఉంటుంది. ఈ సేకరణ కార్యక్రమంలో విషయానికి సంబంధించిన ఆలోచనకు ఒక స్వరూపగతమైన పుష్టి చేకూరుతూ, అనేకమైన తదనుబంధ విషయాలు అవగతికి రావడం మొదలౌతాయి. ఈ సేకరణ క్రమంలో బహుగ్రంథాలను ఉపయోగించుకోవడంతోపాటు వివిధ ప్రదేశాలను సందర్శించడం, వివిధ రచయితలను వ్యక్తులను కలవడం, వారితో సంభాషణలు చర్చలు, ప్రశ్నావళుల ద్వారా వైయక్తికమైన స్థాయిలో సరియైన ప్రాథమిక, విశేష సమాచారాన్ని సమగ్రంగా సాధికారకంగా పొందే అవకాశం కలగడంవల్ల చాలా విలువైంది. ఇది ఎన్నుకొన్న విషయాన్ని బట్టి భేదిస్తుంది. పరిశోధనం వెనుకబడిన రంగాల్లో, ఆధారాలను సరియైన సమాచారాన్నీ వివరణలతో అన్వేషించి లభింపజేసుకోవడం కొంత శ్రమతో కూడిన పనే.

శాస్త్రీయమైన పద్ధతులపై ఏర్పాటైన మంచి గ్రంథాలయాలు లేకపోవడం, పరిశోధనకు తగిన వాతావరణం లోపించడంవల్ల అభివృద్ధి అంతగా సాగకపోవచ్చు. తెలుగుకు సంబంధించినంతవరకు భాషా సాహిత్య రంగాల్లో ఈ స్థితి స్పష్టంగా కన్పిస్తుంది. ఆధార విషయ సేకరణం రెండువిధాలుగా సాగుతుంది. 1) ప్రాథమికం : ఇది ప్రధానాంశంతో ప్రత్యక్ష సంబంధం కలిగింది. 2) సహాయకం : ఇది ప్రధానాంశంతో పరోక్షసంబంధం కలిగింది. సాహిత్యంలో ఒక రచన గురించి పరిశీలించేప్పుడు, మరోశాస్త్రం లేదా ప్రక్రియను గురించి పరిజ్ఞానం అవసరం కలగవచ్చు. ఇది మరో శాఖకు, విభాగానికీ సంబంధించి ఉండవచ్చు. ఈనాడు వీటి పరస్పర సంబంధాల స్థాపనతో, ఏర్పడే విజ్ఞానాత్మకమైన విశాల ధోరణి పరిశోధనలో స్పష్టంగా కన్పిస్తుంది.

## 6. మూల్యాంకనం (Evaluation)

మూల్యాంకనంలో పరిశోధకుడు తాను సేకరించిన ఎన్నో విషయాలను జాగ్రత్తగా పరిశీలించాలి. ఏది స్వీకరించాలో, ఏది నిరాకరించాలో సరిగా నిర్ణయించాలి. దీనికి సవిమర్శకంగా ఉచితానుచిత పరిజ్ఞానంతో ఒక అభిప్రాయానికి రావలసి ఉంటుంది. ఇందుకు వ్యక్తిగతమైన ఇష్టానిష్టాల నతిక్రమించి వస్తుపరమైన సమదర్శనం అలవరచు కోవాలి. అంతర్ బహిర్ సాక్ష్యాధారాలతో మాత్రమే ఉపక్రమించాలి. ఒక అభిప్రాయాన్ని బలపరచేందుకు లేదా తిరస్కరించేందుకు అవసరమైన మూలపత్రాలను సేకరించాలి. వాస్తవాలను తెలియజేసే వాటిని పొందుపరచాలి. ఈ క్రియలో నిర్మాణాత్మకమైన ధోరణి కలిగి ఉండడం అవసరం. పరిశోధకుడు తాను తీసుకునే ముఖ్యమైన నిర్ణయాలపై పాఠకుల ప్రతిక్రియను కూడా ఆలోచించాలి. ఆయా శాఖల్లో నిష్ణాతులైనవారి సలహాలను, ఆలోచనలను కూడా పరిశీలించడం మంచిది. ఇవి మౌఖికంగాను లిఖిత రూపంలోను జరుగవచ్చు. వాటిని అవసరం మేరకు ఉపయోగించుకోవాలి. దీనికి సంబంధించిన ఎన్నో విషయాల పరిచయం అవగాహన ఉన్నప్పుడే పరిశోధకుడు తాను సాగించే పరిశోధనను ఆధునికంగా నిర్వహించగలడు.

వస్తుపరమైన సమదృష్టితో, ఉచితానుచిత పరిజ్ఞానంతో విలువల్ని నిర్ణయించడంలో పరిశోధకుడెంతో నిగ్రహంతో మెలకువతో వ్యవహరించాలి. తాను సేకరించిన ఎన్నో విషయాలు నిర్దేశకుని సహాయంతో సరియైన మూల్యాంకనం పిదపనే, పరిశోధనకు స్వీకరించాలన్న సంగతి మరువకూడదు.

## 7. విశ్లేషణం – వ్యవస్థీకరణ (Analysis & Organisation)

మూల్యాంకనం తరువాత దీని వెనుకనుండి పనిచేసే ఉచితానుచిత పరిజ్ఞానం, ఎన్నిక, నిర్ణయం అనే సమాహార లక్షణంతో, తాను సంపాదించిన సర్వవిషయాలను విశ్లేషించి, వ్యవస్థీకరించడం మరో ముఖ్యమైన దశ. ఇది పరిశోధనా బాహ్యస్వరూపాన్ని నిర్దేశిస్తుంది. ఇందులో పరిశోధకుడు అవలంబించే మార్గంలో వ్యక్తిత్వం కొంత ముద్రితమై, అతని ఉద్దేశాన్ని ప్రయోజనాన్ని అవగాహనకు తెస్తుంది. అంటే పరిశోధకుడు తన పరిశోధన కివ్వదలచుకొన్న నిర్మాణం, తీర్చదలచుకున్న రూపం స్ఫుటమౌతుంది. ఇక్కడ నిర్దేశకుని మార్గదర్శకత్వం ఎంతో విలువైంది.

విశ్లేషణ సందర్భంలో గుర్తుపెట్టుకోవలసిన అంశాలు కొన్ని ఉన్నాయి. 1) విషయాన్ని కూలంకషంగా పరిశీలిస్తూ, అధీనంలో ఉన్న సమాచారాన్ని ఎన్నిక చేసి

మూల్యాంకనం జరపాలి. 2) మొత్తంమీద విషయంపై అభిప్రాయం సహజంగా రూపొందే విధంగా ఉండాలి. 3) ఒక వాదంపై, లేదా విమర్శపై చర్చలో బాహాటమైన పరిశోధనేతరమైన అంశాల్ని పురస్కరించుకొని ఏర్పడే మొగ్గుదలను అదుపులో ఉంచుకోవాలి. 4) ఒక ప్రత్యేకమైన దృష్టిని అవలంబించటానికీ, నిర్ణయం తీసుకోవడానికి రూపొందించే స్థితి సమర్థనీయంగా ఉండాలి. 5) కొత్త అంశాలపై వెలుగును ప్రసరిస్తూ, హేతుసహితమైన ధోరణీ కలిగి ఉండాలి.

వ్యవస్థీకరణం పరిశోధననుబట్టి అనేక విధాలుగా ఉంటుంది. 1) చారిత్రక పద్ధతిలో, 2) హేతుక్రమంలో, 3) విషయక్రమంలో, 4) అభిప్రాయ (పోలికలనుబట్టి విభేదాలనుబట్టి) క్రమంలో, 5) విమర్శనాక్రమంలో, 6) రచయిత ఇవ్వదలచుకున్న వస్తు ప్రాముఖ్య క్రమంలోనూ ఉండవచ్చు. విశ్లేషణాన్ని అనుసరించి వ్యవస్థీకరణం జరుగుతుంది. ఇది తెలిసిన దానినుండి తెలియనిదానివైపు, సామాన్యం నుండి విశేషం లేదా సమస్యవైపుకు దృష్టిని మరలిస్తుంది. కాబట్టి, పరిశోధకుని ఆలోచనా వైఖరిని, అభిప్రాయ రూపాన్ని స్థూలంగా పట్టిఇస్తుందనడంలో సందేహం లేదు. ఒక్కొక్కపుడు పరిశోధనను గుణాత్మకంగా మలచుకోడానికీ సహకరిస్తుంది.

### 8. వివరణ - వ్యాఖ్యానం - అభిప్రాయ సమన్వయం - సిద్ధాంత ప్రతిపాదనం (Proposition)

దీన్ని, పై అంశం తరువాత పేర్కొన్నా అందులో భాగంగా ఉంటూ, ఆ పైన స్పష్టంగా భాసించేది. ఇది చివరి దశలకు చెందినది అయినప్పటికీ, పరిశోధన ఆరంభించినప్పటి నుండీ, అంతో ఇంతో ఇవి తలెత్తుతూ, ఎంతో కొంత ప్రమేయం కలిగి ఉంటాయి. ఇది ఒక విధంగా పరిశోధనకు అంతస్ స్వరూపం అనవచ్చు. ఇందులో పూర్వం నుండీ వచ్చేవాటిని ఖండించడమో లేదా స్పష్టీకరించడమో, ఆలోచింప జేయడమో, కొత్తదృష్టిని కలిగింపజేయడమో ఉంటుంది. వివరణను, వ్యాఖ్యానాన్ని అతిక్రమించిన అభిప్రాయ సమన్వయం, నూత్నసిద్ధాంత ప్రతిపాదనం అనేవి పరిశోధనకు మౌలికతను చేకూర్చేవి. పరిశోధకుని ప్రతిభను ప్రదర్శించేవి, స్వతంత్ర ప్రతిపత్తిని చాటేవి, పరిశోధకుని శ్రమనూ, ఆలోచననూ, ప్రతిభనూ భావింపజేసే ఈ లక్షణం పరిశోధనా వ్యాసంగంలో అతని మహాకృషి ఫలంగా పేర్కొనవచ్చు.

మొత్తంమీద, ఇందులో సాధారణం నుండి దారితీసిన ప్రత్యేకమైన సమస్యలను ఎదుర్కోవడానికీ, పరిష్కరించడానికీ సన్నద్ధమయ్యే ప్రవృత్తి గోచరిస్తుంది. కారణం నుండి

కార్యానికీ, కార్యం నుండి కారణానికీ జరిగే ఆలోచనా ప్రసారంలో, ఈ రెండింటి సంబంధం చేత ఎన్నో నవీనమైన అంశాలు ఆవిష్కృతమౌతాయి. పరిశోధనకు విశ్లేషణం వ్యవస్థీకరణం అనేవి బాహ్యస్వరూపాన్ని కలిగి ఉంటే వివరణం, వ్యాఖ్యానం, సమన్వయం అంతస్స్వరూపాన్ని భావింపజేస్తాయి.

ఒకమారు పర్యావలోకనం చేస్తే, పరిశోధనా క్రమంలో వివిధ దశలు ఒకదానికొకటి సహకరిస్తూ శ్రద్ధ మరియు శ్రమతో, విజ్ఞానపరమైన విషయ సేకరణంతో ఆలోచన, దర్శనంతో పరిశోధనా రూపాన్ని తీర్చేవిగా కన్పిస్తాయి. ఈ దశలు సౌలభ్యం కోసం ఒకదాని తరువాత మరొకటి పేర్కొనబడినా, పరిశోధనలో ఒకదానితో మరొకటి అనుబంధంతో, సంకలితమై ఉండేవి, చివరి మూడు దశలూ జరిగిన పరిశోధనలోని మౌలికమైన స్వరూపాన్ని పరిశోధకుని ప్రతిభా సామర్థ్యాలనూ ప్రతిబింబింపజేసేవి.

పరిశోధన – అనేది పరిశ్రమ, ఆలోచన కలిసింది. ఈ రెండింటి విశిష్టమైన సమన్వయంతో రూపొందేది ఒక క్రమపద్ధతిలో మౌలికగుణంతో, శ్రద్ధగా ప్రయత్న పూర్వకంగా తీర్చిన విజ్ఞాన వ్యాసంగం.

## III

**సహాయకాలు :**

పరిశోధన సాధించడానికి, దాని సమగ్రతకు ఒక్కొక్కటి ఒక్కొక్కవిధంగా దోహదం చేసేవి, సహాయకాలు ఐన అంశాలు కొన్ని ఉన్నాయి. ఇవి పరిశోధనా గ్రంథంలో ప్రధానమైన ఆకృతి వెలుపల, అనివార్యంగా ఉండేవి. 1) ఉపయుక్త గ్రంథసూచిక, 2)క్రమపట్టికా నిర్మాణం, 3) అధోజ్ఞాపికలు, 4) మూలపత్రాల చేర్పు (ఎ. సమాచారం, చర్చలు, గోష్ఠులు, ఉపన్యాసాలు, రేడియో – టి.వి. ప్రసంగాలు ; బి. పట్టికలు, బొమ్మలు మొదలైనవి). 5) పదసూచిక, 6) అనుబంధం, ఇంకా, 7) ముగింపుమాట, 8) సంగ్రహ పత్రం (తుది మార్పులతో సిద్ధం చేసింది, చివరిది), 9) ఉపోద్ఘాతం, 10) చిట్టచివరిది చెక్‌లిస్ట్. పరిశోధనకు సంబంధించినవన్నీ సరిగా ఉందీ లేందీ ఒక క్రమంలో పరిశీలించి జాగ్రత్త పడేందుకు ఉపయోగపడే ఈ చెక్‌లిస్ట్ విడిగా ఉంచబడుతుంది.

### 9. ఉపయుక్త గ్రంథ సూచిక (Bibliography)

పరిశోధన మొదలుపెట్టగానే దానికి సంబంధించిన పత్రికలు, గ్రంథాలపట్ల పరిచయం ఆరంభమౌతుంది, ఆసక్తి పెరుగుతుంది. అవి సంప్రదించే, లేదా వాటిని పొందే ప్రయత్నమూ జరుగుతూ ఉంటుంది. వీటికి సంబంధించిన సమాచారాన్ని

సిద్ధం చేసుకోవడం ఒక ఎత్తు, దీనివల్ల క్రమంగా పరిశోధనకు, ఎక్కడ ఏ విషయం లభించేదీ, ఏది చదవవలసిందీ, ఎవరెవరూ దీనిపై ఎంత కృషి సలిపిందీ ఇంకా చేయవలసిందీ - గ్రంథాలు, పత్రికలు తదితర సాధనాల ద్వారా ఒక అభిప్రాయం ఏర్పడుతుంది. ఇది పరిశోధకుని విస్తారమైన విజ్ఞానంతోపాటు, క్రమంగా స్థూలమైన అవగాహనకూ దారితీస్తుంది. పరిశోధన ముందుకు సాగుతున్నకొద్దీ అనుభవంవల్ల ప్రణాళికలో కొన్ని మార్పులు, చేర్పులు జరుగుతూనే ఉంటాయి. ఇది ఒక దశలో నిలిచిపోయేది కాదు, చివరిదాకా పర్యాప్తమైంది కాబట్టి దీన్ని ఎప్పటికప్పుడు ఒక వ్యవస్థలో తీర్చుకోవలసిన అవసరం ఉంది.

పరిశోధనకుపయుక్తమయ్యే గ్రంథాలు, వివిధ పత్రికలు, వాటిలోని వ్యాసాలు-చర్చలు-సమీక్షలు-రేడియో, టెలివిజన్ ప్రసంగాలు, గోష్ఠులు మొదలైనవి అన్నీ ఒక క్రమంలో సూచికగా సిద్ధం చేసుకోవాలి. దీనివల్ల పరిశోధనా వ్యాసంగం వ్యవస్థిత స్థితిలో నిర్ణీతపథంలో సాగే వీలుంది. ఎంతో సౌలభ్యమూ కలిగిస్తుంది. దీనికి సంబంధించిన గ్రంథాలు, పత్రికలు-వ్యాసాలు-సమీక్షలు-చర్చలు-ప్రసంగాలు మొదలైనవి సంపాదించడం జరగాలి.

1) రచయిత వ్రాసినవీ.
2) రచయిత గురించి ఇతరులు వ్రాసినవీ.
3) రచయితకూ, గ్రంథాలకూ సంబంధించిన ప్రసక్తి కలిగినవీ ఇతరత్ర వివరణం కలవీ.
4) చారిత్రకం లేదా ప్రక్రియ లేదా విషయ పురస్కృతమై పరిశోధనా పరంగా ప్రాతినిధ్యం వహించేవీ, ప్రాముఖ్యం కలవీ.

ఏ విషయంపై ఏఏ అంశాలు ఉపయోగకరమైందీ, తెలుసుకోడానికి, ముందు విషయ ప్రధానమైన ఉపయుక్త గ్రంథ సూచికలు సిద్ధం చేసుకోవడం అవసరం. పరిశోధన జరిగేకొద్దీ చేర్పులు జరుగుతూనే ఉంటాయి. చివరకు ముఖ్యంకానివి తొలగింపబడనూ వచ్చు. ఈ సూచికలు రెండు విధాలు. 1) మౌలికం, 2) విస్తృతం, మౌలికం. ఇది పరిశోధన కత్యంతమూ అవసరమైంది తప్పనిసరియైనది. ఉపయోగించే గ్రంథాలను సూచించేది, విస్తృతం మౌలికమైన పట్టికా పరిధి ఆగినచోటునుండి మొదలౌతుంది. ఇది ముఖ్యం కాకపోయినా, లేకపోతే పరిశోధనకు సంపూర్ణత చేకూరదు.

ఉపయుక్త గ్రంథ వ్యాస సంగ్రహ సూచికలను జాగ్రత్తగా సిద్ధంచేసుకొని, పరిశోధనా గ్రంథం చివర జతపరచే పద్ధతి ఒకటి ఉంటుంది. ఇది భావి పరిశోధనలకూ,

ఒక్కొక్క విధంగా ఎంతో సహాయకారిగా ఉంటుంది. ఇందులో సంఖ్యా బాహుళ్యం దృష్టితో గ్రంథాలు, పత్రికలు చేరుస్తూ పోకూడదు. ఇది సమగ్రంగా సిద్ధం చేయడానికి విషయ పరిజ్ఞానం, విచక్షణ అవసరం. ఇది ప్రస్తుత పరిశోధన గురించి స్థూలమైన అవగాహన కలిగించేదిగానూ ఒకవిధంగా దర్శనిగానూ ఉపయోగపడాలి.

దర్శినిలో ఒక్కొక్క గ్రంథం లేదా వ్యాసం క్రింద అందులో ఉన్న విషయాన్ని చాలా సంగ్రహంగా విషయ ప్రాధాన్యాన్ని బట్టి (2-5) రెండు నుంచి ఐదారు వాక్యాల్లో ఇవ్వడం జరుగుతుంది. ఇది చాల అరుదు, ఏమైనా ఉపయుక్త గ్రంథసూచి చూడడంతోనే పరిశోధనలో ఏ రచయితలనూ విషయాలనూ ఉల్లేఖించిందీ తెలుస్తుంది. పాఠకులకేదో ఒక అంశంపై ఆసక్తి లేదా సంశయం తలెత్తినపుడు సమస్య ఉత్పన్నమైనపుడు, వివరంగా తెలుసుకోవాలనుకున్నప్పుడు సూచికలోని గ్రంథాన్ని లేదా వ్యాసాన్ని పరిశీలించడం జరుగుతుంది. ఇంకా ప్రకటితంకాని, పరిశోధనకు సంబంధించినవి గ్రంథాలు, వ్యాసాలు, చర్చలు, రేడియో టెలివిజన్ ప్రసంగాలు (టేప్‌లు) లిఖిత - మౌఖికరూపాల్లో ఉన్నవి - పరిశీలించినవి ఒక క్రమంలో చివర జతపరచవలసి ఉంటుంది.

### 10. పట్టికా నిర్మాణం (Cataloguing)

గ్రంథపట్టికల నిర్మాణం, ఉపయుక్త గ్రంథ సూచికకు పూర్వరంగం అనవచ్చు. ముందు కార్డులపై ఒక క్రమంలో పట్టికలను సిద్ధం చేయడం దీని ప్రధాన లక్షణం. ఇది 1) రచయిత నామక్రమంలో, 2) గ్రంథ నామక్రమంలో, 3) విషయక్రమంలో మూడు విధాలుగా ఉంటుంది. ముందుగా ఎప్పటికపుడు కార్డులపై ఏదో ఒక క్రమపద్ధతి నవలంబించి సిద్ధం చేసుకోవడం మంచిది. దీన్నే చివరకు ఉపయుక్త గ్రంథసూచికగా పరిణమింపజేసి ఉపయోగించుకోవచ్చు. వీటిని గ్రంథాలయాల్లో పరిశోధనా కేంద్రాల్లో, భద్రపరచడంతో భావి పరిశోధకులకెంతగానో ఉపకరిస్తుంది. సాధారణంగా రచయిత నామక్రమంలో గ్రంథం నామక్రమంలో సూచికలు కన్పిస్తాయి. కాని విషయక్రమంలో చాలా తక్కువగా ఉంటాయి. ఇది శ్రమతో సాధించవలసిన పని కావడంవల్ల చాలామంది ఉత్సాహం చూపరు. కొందరు పరిశోధకుల వైయక్తికమైన పరిధిలో, అక్కడక్కడా కొన్ని పరిశోధనా కేంద్రాల్లో పెద్దపెద్ద గ్రంథాలయాల్లో ఇది కొంతవరకు సాధింపబడడం కద్దు.

విషయాన్ని బట్టి ప్రత్యేకంగా ఒక్కొక్క విభాగం చేస్తూ, సాహిత్యం తీసుకుంటే నాటకం, కావ్యం, నవల అనీ శతకం ప్రబంధం, అనీ ప్రతీకవాదం, అస్తిత్వవాదం అనీ ఎన్నో శాఖోపశాఖలుగా దీన్ని విస్తరింపజేసి దేనికది చక్కగా సిద్ధం చేయవచ్చు. ఇది పరిశోధకుని అభిలాషతో విషయం పరిశోధనా పరిధుల్నిబట్టి ఉంటుంది. ఒక్కొక్కప్పుడు

పరస్పర సంబంధం గల విషయాలను శీర్షికలతో ఒకే కార్డుపై వివరాలతో ఉల్లేఖిస్తూ పోవడమూ ఉంది. ఒక్కొక్కప్పుడు గ్రంథం పేరు; రచయిత పేరు; ఇతరమైన వివరాలతో క్రిందనే దాని ప్రత్యేకత పరిశోధనలో ప్రసక్తమైన అంశం, వివరణంలో చాలా సంగ్రహంగా ఉంటుంది. దీన్ని యథాతథంగా ఉపయుక్త గ్రంథసూచికకు ఉపయోగించుకోవచ్చు. ఈ పద్ధతివల్ల గ్రంథం పట్ల - అందులోని విషయం గురించి ఆసక్తి పెరిగే అవకాశం ఉంది. కొత్తవారికి పరిచయంతోపాటు విషయ ప్రవేశనకూ వీలు కలుగుతుంది. ఆలోచనకూ వెంటనే అవకాశాన్ని ఇస్తుంది. పరిశోధకుడు ఆ గ్రంథానికిచ్చిన విలువ, చూచినతీరు, దిఙ్మాత్రంగా తెలుస్తుంది కూడా.

ఈ ప్రయత్నంలో గ్రంథాలు, పత్రికలు, విశేష సంచికలు-చర్చలు-ఉపన్యాసాలు-సమీక్షలు-గోష్ఠులు-రేడియో టెలివిజన్ ప్రసంగాలు విడివిడిగా కాటలాగింగ్ కార్డులు, నోట్సు (టిప్పణి) కార్డులు - భావి పరిశోధకుల కెంతగానో ఉపయోగపడతాయి. వీటిని జాగ్రత్తగా భద్రపరచవలసిన అవసరం ఉంది. దీనివల్ల ప్రాథమికమైన కృషి చర్వితచర్వణం కాదు. ఉన్న సమయాన్ని మరొకవిధంగా దీనిపై అభివృద్ధికి ఉపయోగించవచ్చు. ఆ రంగంలో నిరంతరం క్రమాభివృద్ధికి దారితీస్తూ, అందరికీ సులభంగా అందుబాటులో ఉండి, తరువాత చేయవలసిన ఆలోచనకు పురికొల్పుతుంది. పట్టికా నిర్మాణం (కార్డు కాటలాగింగ్ - నోట్స్ కార్డు) నుండి అవతరించిన తుదిరూపమే ఉపయుక్త గ్రంథ సూచిక అవుతుంది.

దీనివల్ల 1) పరిశోధకులకు ఆయా విషయాలపై సులభంగా సంప్రదించే వీలుంది. 2) భావి పరిశోధకులకు కాలం వృథా కాకుండా, జరిగినపనే తిరిగి చేయకుండా, దానిపై అభివృద్ధిని సాధించే వీలు కలిగిస్తుంది. 3) ఒకరి తరువాత మరొకరి కృషి సమీకృతమౌతూ, పరిశోధనారంగం అభివృద్ధికీ సువ్యవస్థితమైన స్థితికీ తోడ్పడుతుంది. 4) పరిశోధనా రంగంలో ప్రాథమికమైన ఆధారసంపదకు నిలయంగా శాస్త్రీయమైన పద్ధతిలో ఒక ఆదర్శరూపాన్ని సంతరించుకొని నిలుస్తుంది.

### 11. అధో జ్ఞాపికలు (Foot Notes)

పరిశోధనా గ్రంథం చదివేటప్పుడు పాఠకులకు ఆయా సందర్భాల్లో ఉల్లేఖనం చేయబడిన అంశాలు ఎక్కడినుండి గ్రహింపబడినాయో, తెలియడానికి ఉపకరిస్తాయి. ఇంకా వివరణం కావాలనుకుంటే వెంటనే ఆయా గ్రంథాలను సంప్రదించడానికి వీలు కలిగిస్తుంది. ఇది ప్రధానమైన రచనపై విస్తృతమైన అవగాహన కోరేవారికి సహకరించేది. పుట అడుగుభాగంలోనో లేదా అధ్యాయం చివరనో లేదా గ్రంథం చివరనో, మొదటిసారి

పేర్కొనబడిన గ్రంథం పూర్తిరూపం ఇవ్వాలి. రచయిత పేరు ఉండాలి. పత్రిక ఐతే దాని శీర్షికతో సంపుటి, సంచిక పుటతో సహా ఉండాలి. వీటికి అవసరమైతే ప్రచురణకు సంబంధించిన వివరాలు ఉండాలి. మరొకమారు ఇది ప్రసక్తమైతే, దీని పూర్తిరూపం తిరిగి వ్రాయనవసరం లేదు. ఏది మారిందో దాన్ని మాత్రమే ఇస్తూ, మారనివి సంక్షిప్తం చేస్తే చాలు. గ్రంథమైతే పరిచ్ఛేదం మారవచ్చు, పుట మారవచ్చు - పత్రిక ఐతే సంపుటి, సంచిక, పుట మారవచ్చు.

1. ముందు రచయిత పేరు, తరువాత శీర్షిక - ఇది క్రీగీతతో ఉండాలి. ఉంటే ఆ తరువాత సంపాదకుడు లేదా అనువాదకుని పేరు ఇవ్వాలి. పేరు తరువాత కుటుంబ నామం ఉండాలి.
2. ప్రచురణకు సంబంధించిన వివరాలు, ప్రచురణ సంఖ్య, ప్రచురణ స్థానం, ప్రచురణకర్త పేరు, ప్రచురణ తేదీ ఇవ్వాలి.
3. పత్రిక ఐతే సంపుటి, సంచిక, పుట సంఖ్య సంవత్సరం ఇవ్వాలి.
4. అథోజ్ఞాపికకు ఆ పుట చాలకపోతే, మరోపుటలో అథోజ్ఞాపిక నిలిపే స్థానం నుండే కొనసాగించాలి.
5. పవిత్ర గ్రంథాలైన వేదాలు ఉపనిషత్తులు భగవద్గీత, బైబిల్, ఖురాను మొదలైన గ్రంథాలకు క్రీగీత ఉంచకూడదు.
6. దినపత్రికలు, సంచికలలో వ్యాసాలు, గ్రంథాల్లో కవితల శీర్షికలకు క్రీగీతలుంచాలి.
7. రచయిత పేరు ముందు, పదవి గౌరవచిహ్నాలు బిరుదులు మొదలైనవి వదలివేయడం మంచిది.
8. కలం పేరు ఉంటే దాన్ని ముందు పేర్కొనాలి. ఆ తరువాత అసలు పేరు అవసరమైతే ఇవ్వాలి.
9. ఒకరికంటే ఎక్కువ కర్తలు, సంపాదకులు ఉంటే అందరిపేర్లు గ్రంథం లేదా పత్రిక ముఖపత్రంలో ప్రచురించిన క్రమంలో ఉండాలి.
10. గ్రంథం లేదా వ్యాసం శీర్షిక మొదటిసారి క్రీగీతతో వ్రాయాలి. మరల వస్తే సంక్షిప్తాక్షరాల్లో సూచితం చేయాలి. అదే గ్రంథం లేదా పత్రిక అక్కడే దానిక్రిందనే ప్రసక్తమైతే "Ibid" అని వ్రాయాలి. అయితే రచయిత పేరుకు మాత్రం "Ibid" అని వ్రాయకూడదు. (Ibiden) అనే లాటిన్ పదం సంక్షిప్తరూపమే "Ibid" (దీని అర్థం "In the same place")

అథోజ్ఞాపికలు రెండు విధాలు : 1) విషయం (content) కలవీ, 2) ప్రసక్తి

(reference) కలవీ, ఇవి 1) ప్రధానభాగంలో చర్చలకూ వివరణలకూ సంబంధించిన అంశాలను విస్తరించవలసినపుడు అంగీకరించడమో తిరస్కరించడమో జరిగినపుడు అభిప్రాయానికి ఉపపత్తులు చూపవలసి వచ్చినపుడు ఇచ్చే ఆధారాలను పురస్కరించుకొని ఉంటాయి. 2) రచయిత అవసరంగా భావించిందీ ప్రధానభాగంలో చేరిస్తే పరిశోధనా ప్రవాహరూపాని కంతరాయం కలుగుతుందని భావించినపుడు ; ఒక సందర్భాల్లో వివరణంలో సంబంధానికి మరో ఎదురుప్రసక్తి (cross reference) ని అందించే అవసరమున్నపుడు ఉపయుక్తమౌతాయి. వీటిని content footnotes అంటారు. ఇందులో ఒకటి రెండు లేదా మూడు దాకా references ఉండవచ్చు. ఇతరులకు సమ్మతి లేదా కృతజ్ఞత ఎక్నాలెడ్జ్ తెలియచేయవలసి వచ్చినపుడు అథోజ్ఞాపికల అవసరం ఉంటుంది. వీటి ప్రయోజనం 1) ప్రధానభాగంలో ప్రకటించిన అభిప్రాయాలకు సాధికారకమైన లక్షణాన్ని కలిగించడం, 2) ప్రత్యేకంగా పేర్కోదగిన వాస్తవాలు, అభిప్రాయాలు, ఇవి (ప్రచురి) ప్రకటితాలు అప్రచురి(అప్రకటి)తాలు కావచ్చు. ఉండే స్థానం నిశ్చయంగా తెలియజేయడం, 3) పాఠకునితో జరుగుతూన్న దానిపట్ల స్పష్టమైన నిశ్చయమైన అభిప్రాయాన్ని నెలకొల్పడం.

అథోజ్ఞాపికలుండే స్థలం పుటలో అడుగుభాగం. ఇది తప్పనిసరిగా పైనుండి వరుసలో క్రమం తప్పకుండా ఉండాలి.

## 12. మూలపత్రాల ధ్రువీకరణం - వాటిని జతపరచడం :

పరిశోధనకు సహాయపడిన మూలపత్రాల్లో లేఖలు-నివేదికలు-సమాచారం-ప్రశ్నావళి-ముఖాముఖిచర్చలు-డైరీలు-కరపత్రాలు-పట్టికలు-బొమ్మలు-పటాలు మొదలైనవెన్నో ఉన్నాయి. ప్రధానమైన అంశానికి ప్రత్యక్షంగానే కాక పరోక్షంగానూ ఉపయోగించేవి తప్పనిసరిగా సంప్రదించాలి. అవసరమైనవి జతపరచాలి. ఇవి పరిశోధనలో ఆయా అంశాలకు వివరణలుగా, అనిశ్చయ స్థితిని తొలగించేవిగా, నిర్ణయాలకు దారితీసేవిగా, ఒక్కొక్కపుడు ఇదివరకు ఏర్పడి ఉన్న స్థితిని తారుమారు చేసేవిగానూ ఉంటాయి. వీటిని సమగ్రంగా పరిశీలించి, సూచనగానో సంగ్రహంగానో అవసరమైతే పూర్తిగానో చేర్చవలసి ఉంటుంది. ఇవి చారిత్రకంగా విషయపరంగా ఒక్కొక్కప్పుడు ఎంతో అమూల్యమైనవిగా ఉంటాయి. ఈ విశేష సమాచారాన్ని పత్రాల రూపంలోనే కాక శ్రవణదర్శన (audio-visual) యంత్రాలు- ఫిల్మ్‌లు; టేప్‌లు, స్లైయిడ్‌లు మొదలైనవాని సహాయంతోనూ అందించే వీలుంది. ఆధునిక యుగంలో నవీనమైన సాధనాల వాడుకనుబట్టి, పరిశోధనా సందర్భంలో వీటి ప్రమేయం అనివార్యమౌతుంది.

వీటిని భద్రపరచి మరొక సందర్భంలోనూ ఉపయోగించుకోవచ్చు.

**13. పదసూచిక (Index)**

ఇది పరిశోధనలో వివిధ స్థలాల్లో వచ్చే ముఖ్యమైన పదాలు ఏయే సందర్భాల్లో ఎక్కడెక్కడ వచ్చిందీ అకారాది క్రమంలో యోజితమవుతాయి. ఇది పాఠకునికి ఏ విషయం ఎక్కడ ఉందీ వెంటనే సులభంగా తెలుసుకొనేందుకు ఉపకరిస్తుంది. ఇది రచయిత క్రమంలోనూ, విషయ క్రమంలోనూ వర్ణక్రమంలో సిద్ధంచేసి చివరన జతపరచడం జరుగుతుంది.

**14. అనుబంధం (Appendix)**

పరిశోధనా గ్రంథంలో ప్రధానభాగంలో ఇవ్వడానికి వీలుకానివీ, పరిశోధనా వ్యాసంగంలో అవసరమై ఒక ప్రత్యేకత కలిగినవీ ప్రముఖంగా గుర్తించవలసిన యోగ్యత కలిగినవీ ఇందులో చేర్చబడతాయి. ఒక్కొక్కపుడు ఉపయుక్తమైన మూలపత్రాలు, సాంకేతికమైన విశేషాంశాలు ఉండవచ్చు. ఇవి ప్రధాన విషయంతో తప్పనిసరిగా సంబంధం కలిగి, పరిశీలించడానికి యోగ్యమైనవిగా ఉండాలి.

**15. ముగింపుమాట (Epilogue)**

ఇది దాదాపు పరిశోధనా గ్రంథానికి సమాప్తి వాక్యాలతో కూడింది. ఇందులో పరిశోధకుని వైయక్తిక ముద్రతో, విషయానికి సంబంధించిన స్ఫూర్త్యారూపం ఉంటుంది. చాలా సంగ్రహంగా ఉంటూ పరిశోధనలో కొసమెరుపుల్ని భావింపజేస్తుంది.

**16. చివరి సంగ్రహపత్రం (Final Synopsis)**

ఇది మొదట సిద్ధంచేసిన దానిపై పరిశోధనా క్రమంలో విషయ పరిజ్ఞానం, సేకరణం, ఆలోచన అనుభవంవల్ల కొన్ని మార్పులు చేర్పులతో చివరకు సమగ్రంగా రూపొందించబడుతుంది. ఇది మొత్తం పరిశోధనా గ్రంథానికి దాని ప్రణాళిక యొక్క బహు సంక్షిప్తమైన పరిచయరూపం అనవచ్చు. ఇది పరిశోధన గురించి ముందుగా తక్కువ కాలంలో స్పష్టమైన అవగాహన కలిగించే లక్షణం కలిగింది చివరదీ. మొదటిదాని పైన అభివృద్ధి కలిగిందీ, సంపూర్ణమైందీ, ఇదే ముఖ్యం.

**17. ఉపోద్ఘాతం (Introduction)**

పరిశోధనకు వెనుకనుండి పనిచేసిన అనేకాంశాలు అవశ్యం చెప్పవలసినవీ, పరిశోధకునకు మానసికంగా తృప్తిని కలిగించేవీ, సాధారణంగా ప్రసక్తమౌతాయి.

పరిశోధన చేపట్టడానికి హేతువులు, పరిస్థితులు, విషయం ఎన్నుకొన్న తీరు, నిర్దేశకుని అంగీకారం, ఇతరుల ప్రోత్సాహం, అది సాగినతీరు, సాధనసంపత్తి, సమీకరణం, సమాచార సేకరణం గురించీ, ఆయా సందర్భాల్లో సహాయపడినవారికి కృతజ్ఞతలతో సమాప్తమౌతుంది. ఇది పరిశోధనకు ఆరంభం నుండి చివరిదాకా ఇతరులవల్ల పొందిన అనుభవాన్ని వ్యక్తిగతమైన దృష్టితో ప్రకటించడానికి అవకాశం గల సాధారణ స్థానం.

## 18. పరిశీలనా పట్టిక (Checklist)

ఇది సిద్ధాంత గ్రంథంలో శీర్షిక మొదలు చివరి సంగ్రహ పత్రం దాకా అన్నీ సరిగా ఉందీ లేందీ, సరిచూసుకునేందుకు ఉపకరిస్తుంది. పరిశోధనా స్వరూపాన్ని బట్టి పరిశీలనాపట్టిక (Checklist) సిద్ధం చేయబడుతుంది. శీర్షిక మొదలు పదసూచిక దాకా అనుమతి పత్రంతో సహా అన్నిటి సరియైన సంయోజనం, ఉందీ లేందీ పరిశీలించి, అన్నీ జ్ఞాపకం చేస్తుంది. పరిశోధనా గ్రంథానికి బాహ్యమైన సమగ్రతకు లోపం కలుగకుండా మరవకుండా చూస్తుంది.

# IV

## పరిశోధన - ప్రామాణికత

ఆధునిక కాలంలో పరిశోధన ఎంతో విస్తృతినీ వైవిధ్యాన్ని పొందింది. జీవితంలో వలెనే వివిధ విషయాలపై అభిలాష, కొత్తను అన్వేషించాలనే ఆలోచన, భిన్నమైన అభిరుచులు, అన్నీ కలిసి ఒక విశిష్టమైన స్థితిని చేకూర్చాయి. అయితే ఈ సందర్భంలో గుర్తుపెట్టుకోవలసిన ముఖ్యాంశాలు కొన్ని ఉన్నాయి.

1) ఒక గ్రంథం లేదా వ్యాసాల సంగ్రహ రూపం పరిశోధన కాదు.
2) ఇతరుల అభిప్రాయాలు సేకరించి, అవి యథాతథంగానో అయినా కొంచెం మార్చి విమర్శనారహితంగా వ్యాఖ్యానరహితంగా పునరుక్తం చేయరాదు.
3) కొన్ని ఉల్లేఖేలు (quotations) ఎంత గొప్పవైనా ఏ వివరణమూ వ్యాఖ్యానమూ, చర్చ లేకుండా నేర్పుగా ఒకచోట వరుసగా చేరుస్తూ పోకూడదు.
4) వ్యక్తిగతమైన అభిప్రాయాలు ఉండవచ్చు. ఇతరులతో విభేదించవచ్చు. ఇవి పరిశోధనలో తప్పనిసరిగా ఉండేవి. అయితే సరియైన ఆధారాలతో నిరూపితం చేయకుండా నిర్ణయాలు ప్రకటించకూడదు. వ్యక్తిగతమైన దూషణ పనికిరాదు. స్తుతి వాక్యాలు ఉండకూడదు.

5) ఒక విషయాన్ని గురించి అనేకాంశాలు ప్రకటితం అయినా కాకపోయినా, వాటి పేరు చెప్పకుండా ఎక్కడినుండి స్వీకరించిందీ పేర్కొనకుండా, వాడుకోకూడదు. పరిశోధన ఎంత వ్యక్తిగతమైందో, అంత సామూహిక ప్రమేయం (Collective Involvement) కలిగింది. పరిశోధకునికి పనిచేసే సామర్థ్యం, శ్రద్ధ, స్వతంత్రమైన ఆలోచనాశక్తి – విమర్శనాత్మకమైన దృష్టి – వస్తుపరమైన సమదర్శనం ఉండాలి.

ఇక సిద్ధాంత రచనకు విషయ విన్యాసంలో వివిధాంశాల సమన్వయంతో వాటిని సంయోజనం చేసే తీరుతో సంక్షిప్తత, పఠన యోగ్యత (readability) ఉండాలి. అభిప్రాయాల ప్రకటనంలో, విభేదాల్లో చిత్తశుద్ధితోపాటు సౌజన్యం చాలా ముఖ్యం. ఈనాడు విశ్వవిద్యాలయాల్లో పరిశోధన ఎంతో సమృద్ధిగా జరుగుతోంది. ఇతర సంస్థలు, వ్యక్తులు చిరస్మరణీయమైన కృషి చేయడం మొదటినుండీ వస్తూన్నదే. అయితే ఈనాడు ఈ పరిశోధనను చక్కని వ్యవస్థాపరంగా తీర్చిదిద్దవలసిన అవసరం ఉంది. దీనికి ఆ సంస్థలు వ్యక్తులూ ఒక సమగ్రమైన స్థితిని చేకూర్చే బాధ్యతను విస్మరించరాదు. పరిశోధనకు సంబంధించిన వాతావరణాన్ని పటిష్టం చేయడానికి సరియైన దిశలో ప్రవర్తింపచేసే ప్రయత్నం జరగాలి.

1) పరిశోధనకు సంబంధించినంతవరకు ప్రతి విశ్వవిద్యాలయంలోను సాధారణ పరిశోధనా విభాగంతోపాటు విశేష పరిశోధనా విభాగమూ ఒకటి రూపొందాలి. మొదటిదానిలో సాధారణమైన పరిశోధనకవసరమైన గ్రంథాలు, పత్రికలు, ఇతర సాధనాలు అన్నీ శాస్త్రీయమైన పద్ధతిలో వ్యవస్థీకృతమై ఉంటాయి. రెండోదానిలో ఒక ప్రత్యేకమైన విషయాన్నో అంశాన్నో, రచయితనో, కాలాన్నో పురస్కరించుకొని దానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు ఉంటాయి. ఇవి ఒక్కొక్క కేంద్రంలో లేదా స్థానంలో ఒక్కొక్కటి అభివృద్ధి దశకు చేరుకొనే ప్రయత్నం వల్ల ఒక ప్రత్యేకతను కలిగిఉంటాయి. ప్రత్యేకమైన అర్హతలతో పరిశోధనకెంతో తోడ్పడతాయి. 2) పరిశోధన జరగని విషయాలను గుర్తించి వాటిపై దృష్టి కేంద్రీకరించాలి. 3) ఇదివరకు జరిగిన పక్షంలో ఆ విధానంకన్నా భిన్నమైన విధానం అవలంబించి కొత్తదనం కోసం ప్రత్యేకత కోసం పాటుపడాలి. ఫలితాలను సాధించాలి. 4) ఎక్కడ ఏమి జరిగిందీ, ఏమీ జరుగుతూందీ పరిశోధకులందరికీ అందుబాటులో ఉండాలి. దీన్ని విశ్వవిద్యాలయాలు, ఆయా సంస్థలు పరస్పరం సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సాధించవచ్చు.

పరిశోధన జరగని శాఖల్లో పరిశోధనను ప్రోత్సహిస్తూ జరిగిన శాఖల్లో కొత్తదృష్టిని ప్రేరేపించాలి. ఇది క్రమంగా పోనుపోను మౌలిక (Basic) పరిశోధనం నుండి విశేష (Advanced) పరిశోధనకు దారితీస్తుంది. ఒక భాషలోనే కాక పక్కపక్కనే ఇతర విభాగాలతోనూ సంబంధాలతో, ఇతర భాషా పరిచయాలతో పరిశోధనా రంగాన్ని విస్తృతపరచవచ్చు. ఎంతో అమూల్యమైన ఫలితాలనూ పొందవచ్చు. ఈనాడు ఈ విశాలమైన దృష్టి అవసరం ఎంతైనా ఉంది.

## V

### నిర్దేశకుని బాధ్యతలు

పరిశోధనలో నిర్దేశకుని బాధ్యత కీలకమైంది. పరిశోధన కుపక్రమించిన సమయం నుండి పరిశోధన పూర్తి అయ్యేదాకా (ఆపైన డిగ్రీకి అర్హమైందిగా ప్రకటించేంత వరకూ) నిర్దేశకుని ప్రమేయం పథనిర్దేశం పర్యవేక్షణం విలువైంది.

విషయాన్ని ఎన్నుకోవడంలో పరిశోధనా విద్యార్థిని ప్రోత్సహించడం, చర్చించడం, అభిలాషను తెలుసుకోవడం, తదున్ముఖంగా పరిశోధనా కార్యక్రమాన్ని సూచించడం, దీనికి సంబంధించిన పరిజ్ఞానాన్ని పరిపుష్టం చేయడం, పరిమితుల్ని నిర్ధారించడం, కొత్త కోణాలపై దృష్టిని ప్రసరింపజేయడం మొదలుగా నిర్దేశకుని బాధ్యతలు దృష్టికి వస్తాయి. దీనికి సూత్రాలంటూ లేవు. నిర్దేశక పరిశోధక సత్సంబంధాలపై, ఇరువురి అవగాహనపై విషయాన్నిబట్టీ, విద్యార్థి స్థాయినీ నిర్దేశకుని వ్యక్తిత్వాన్నిబట్టీ ఎప్పటికపుడు నిర్ధారిత మవుతుంది.

విద్యార్థిలో తత్పరత, శ్రద్ధ, నిజాయితీ ఎంత అవసరమో ఇవి ఎంతో కొంత నిర్దేశకునిలోనూ అవసరం. పైగా విద్యాసంబంధమైన సదభిలాష, పరిశోధనపై చెదరని క్రియాత్మకతతో పాటు విలువల్ని కాపాడే మనోరూపమూ అవసరం. ఇది పరిశోధనలో ఉన్నతమైన ప్రమాణాల్ని కాపాడడానికీ, కనీసస్థాయిలో నిలపడానికీ ఉపకరిస్తుంది. పరిశోధకునికి ప్రత్యక్షంగా పర్యవసానం కనిపిస్తే నిర్దేశకుని విషయంలో పరోక్షంగా అనుభవ ప్రయోజనం ఉంటుంది.

విద్యార్థి పరిశోధనా రూపంలోని మొదటి వ్రాతప్రతినీ, రెండో వ్రాతప్రతినీ, ఎంతో సహనంతో సరిదిద్దవలసి ఉంటుంది. మొదటిదానిలో కేవం విషయ విన్యస్తరూపం ఉంటే, రెండోదానిలో విషయ సమగ్రరూపం సరిదిద్దుకుంటుంది.

పరిశోధనా కాలంలో విద్యార్థి మరియు నిర్దేశకుని అనుబంధం కేవలం విద్యాసంబంధమైందే కాదు. మానసికంగా వాత్సల్యపూర్ణమైందీ. ఇరువురూ కలిసి విజయవంతంగా సాధించిన తృప్తినిచ్చేదీ, ఆనందాన్ని నిలిపేదీ, ఇరువురి జీవితంలో చెదరని ఆదర్శాన్ని స్థాపించేదీ.

నిర్దేశకుని బాధ్యత కొన్ని పరిమితుల్లో ఎంతో గురుతరమైంది. దీన్ని నిర్దేశకుడు విస్మరిస్తే పరిశోధన కంతరాయమేర్పడినట్లే! దీనిపట్ల పరిశోధకునిలో నిబద్ధత లేకపోతే క్రమశిక్షణ లోపిస్తే నిజాయితి కరువైతే పరిశోధన ఆగిపోయినట్లే. నిర్దేశకుడెప్పటికపుడు నిర్ణీతమైన సమయసూచికను సిద్ధంచేసి, దాని ప్రకారం పర్యవేక్షణం కొనసాగించవలసి ఉంది. పరిశోధకుడు సేకరించిన విషయాల్ని సమాచారాన్ని ఒకమారు పరీక్షించి, విశ్లేషణకు, ఆపైన వర్గీకరణకూ, ఆ తరువాత వివేచనకూ సరియైన సూచనలతో ముందుకు నడిపించాలి. ఈ మధ్య గ్రంథసూచికను సమాచారపట్టికను సిద్ధంచేసేందుకు సహకరించాలి.

దీనికి సమయపాలనం ముఖ్యం. కాబట్టి పరిశోధకునిలో ఉత్సాహాన్నీ పరిజ్ఞానాన్నీ ప్రమాణాల్ని పెంపొందించే విధంగా నేతృత్వం నెరపడం అవసరం. ఇది తాత్కాలికంగా విద్యార్థిలో శ్రమకు తట్టుకోలేని స్థితినీ, బాధనూ కలిగించినా దూరదృష్టితో ఎంతో మేలును చేకూరుస్తుందనడంలో సందేహం లేదు.

ఈ పరిశోధనా ప్రక్రియలో విషయంపై విద్యార్థితోపాటు నిర్దేశకుని పరిజ్ఞానం కూడా పెరుగుతుంది, అనుభవ విస్తృతీ కలుగుతుంది. పరిశోధనా కార్యక్రమం పరిశోధకునితోపాటు మరో విధంగా కొత్త ఆలోచనకు దారిచూపుతూ నిర్దేశకునికీ ఉపకరిస్తుంది. పరిశోధనా విషయంలో పరిశోధనా ప్రమాణాల్ని గురించి ఆలోచించవలసి ఉంటుంది.

పరిశోధకునికన్నా నిర్దేశకుడు అన్ని విధాలా ఎక్కువ కాబట్టి ఆ ప్రభావం ఆరంభం నుండి సమాప్తి వరకూ ప్రసరిస్తూనే ఉంటుంది. ఇది సహజం! మంచి పరిశోధనకు అవసరం కూడా. ఇది ఏ దిశలో ఏ సాంద్రతలో ఎంత దూరం ఉంటుందనేది నిర్దేశకుని అంతరవ్యక్తిత్వాన్నిబట్టి ఆవిష్కృతమవుతుంది. దీనివల్ల ఆర్థికంగా లాభాలు ఉండకపోవచ్చు. కాని హార్దికంగా విద్యా పరిశోధనాపరంగా నిర్దేశకుని వ్యక్తిత్వం పెరుగుతుంది. పరిశోధనా రంగానికి మేలు చేకూరుతుంది.

# 2. పరిశోధనా విధం

## 1. పరిశోధన - క్రమగతి

ఒక క్రమపద్ధతిలో బాహ్యాంతర్విధానాల ననుసరించి నిర్దిష్టమైన ప్రణాళికతో సాగే శాస్త్రీయమైన విమర్శనారూపం, పరిశోధనం. దీని అంతర్విధానంలోపరిశోధనకు స్వీకరించిన విషయం గురించి హేతుదృష్టి ఉంటుంది. విశ్లేషణం, సమన్వయం, సిద్ధాంతంతో సమాకలితమవుతుంది. అర్థవంతమైన అన్వేషణతో నిర్ణయానికి దారితీసే పరిశీలనం వివరణం కన్పిస్తుంది. ఇంకా నిర్వహణరూపం గురించి ప్రసక్తమౌతుంది. ఈ విధానంలో నిహితమైన వ్యక్తిత్వ వికాసమూ పరిశోధనా వ్యాసంగంలో దీని ఆవశ్యకత పరిశీలనా యోగ్యమైంది. ఈ సందర్భంలో శాస్త్రీయ దృక్పథంతో కూడిన యోజన వల్ల నిర్వహణ మార్గాలను అనుసరించడం వల్ల కలిగే ప్రయోజనం ఎంతో అమూల్యమైంది.

శాస్త్రం అంటే ఒక క్రమపద్ధతిలో హేతుసహితంగా తీర్చిన ఆలోచనా ప్రయోగరూపం. ఈ దృష్టితో అంతర్విధాన క్రమాన్ని అనుసరించడం పరిశోధనలో పరిశోధకుని కర్తవ్యం, అంటే ఒక క్రమపద్ధతి ననుసరించి సమస్యను ఎదుర్కొని దాని పరిష్కారాన్ని సాధించి సిద్ధాంతాన్ని ప్రతిపాదించేసరణికి సంబంధించిన రూపం అన్నమాట. సమస్యను పరిష్కరించడానికి సత్యాన్ని దర్శించడానికీ ప్రతీ చర్య పరిశోధనలో కార్యకారణోపస్కృతంగా ఉంటుంది. ఒక పద్ధతిననుసరించి జరగాలి. క్రమసహితమై ఉండాలి అన్నమాట.

పరిశోధన మొదటిదశలో బాహ్యవిధానం, రెండో దశలో అంతర్విధానం ప్రాధాన్యం వహిస్తాయి. ఇందులో విశ్లేషణ సమన్వయం కార్యకారణ సంబంధం. పరిశీలనం సిద్ధాంతం మొదలైన అంశాలు పరిశోధనా రచనకు శిఖర సదృశమైనవీ, చర్చనీయమైనవీ. మొదటి విధానం స్థూలాకృతికీ రెండోది సూక్ష్మరూపానికీ సంబంధించింది. పరిశోధకుడు ఎన్నుకొన్న వస్తువు, అతడు నిర్వహించే దృక్పథం ప్రతిపాదింపదలచిన నిర్ణయం లేదా సిద్ధాంతంపై దీని ముఖపార్శ్వాలు తీర్చబడి ప్రవర్తితమౌతాయి. సాహిత్య ప్రక్రియను బట్టి, విషయపరిధినిబట్టి, సమస్యలనుబట్టి పరిణామస్థితులేర్పడుతాయి. పరిశోధనలో అంతర్ విధానాన్ని గురించి సమాలోచనం చేసేప్పుడు బాహ్య విధానం వలె ఇదమిత్థమని స్పష్టంగా నిర్ణీత రూపాన్ని ఇవ్వడం కష్టం. పరిశోధనా నిర్వహణంలో అంతర్ విధానానికి సంబంధించిన ఏర్పాటు పరిశోధన గతి క్రమానికీ, అంతస్తత్త్వానికి, పరిశోధకుని మనస్తత్త్వానికీ వస్తుగతమైన దృష్టికి

సంబంధించింది కావడంచేత, దీని స్వరూపగతికి శాస్త్రీయమైన వివేచనతోపాటు సమయానుకూలంగా మౌలికస్థితికీ అవకాశం తప్పకుండా ఉంటుంది.

## 2. పరిశోధన – సమాలోచనం

ఈనాటి పరిశోధనా సిద్ధాంతాల తీరును చూస్తే ఒక్క మూలపాఠ పరిష్కారాన్ని మినహాయిస్తే ఎక్కువగా పరిశోధనమూ విమర్శ రెండింటి సమ్మేళనంగా గోచరిస్తుంది. నిజానికి రెండూ పరస్పరం ప్రభావాన్ని నెరపుతూండేవే కావడంచేత, ఒక్కొక్కపుడే రెండిటికీ మధ్య అంతరం చెరగిపోతుంది. ఈ కారణంగా ఒక విశిష్టరూపాన్ని సంతరించుకోవడమూ జరుగుతూంది. నిర్వహణంలో రెండింటికీ భేదం ఉంది. ఈ భేదం వల్లనే రెండు విడివిడిగా వ్యవహృతమౌతున్నాయి. పరిశోధనలో అప్పటివరకూ జరిగిన కృషికి సంబంధించిన విజ్ఞాన ప్రసక్తితో ప్రవృత్తమౌతుంది. ఇది ఒక క్రమవిధానంలో తీర్చబడుతుంది. సమగ్రమైన పరిశీలనాగుణంచేత విషయ విస్తృతినీ పొందుతుంది. మొత్తంమీద సర్వమూ ఒక వ్యవస్థీకృతం చేసే ప్రయత్నం తప్పనిసరిగా ఉంటుంది.

ఒక నిర్ణయం బహిరంతస్ సాక్ష్యాధారాలపై సరియైన ఉపపత్తులతో చర్చా సహితంగా లేదా వివరణయుతంగా రూపొందింపబడుతుంది. ముఖ్యంగా అంతర్విధానంలో మౌలికమైన ఆలోచనావిష్కార సమయాల్లో తప్ప మిగతా చోట్ల పరిశోధనకు సంపూర్ణమైన స్వాతంత్ర్యం ఉండదు. అంటే కొన్ని పరిమితుల్లో నిర్ణీతమై ఉంటుందన్నమాట. వైయక్తికమైన ధోరణికన్నా వస్తుగతమైన దృష్టికే ప్రాధాన్యం. విమర్శలో ఒక నియతమైన విధానక్రమం పాటింపబడదు. ఇది విమర్శకుని వ్యక్తిగతమైన దృష్టినిబట్టి స్వేచ్ఛాయుతంగా ప్రవర్తితమౌతుంది. తత్కాలానికి సరిపడేట్లు నిర్ణయించుకున్న విధానంలో స్వానుభవంతో అతని దృష్టిలో ఉన్న ప్రయోజన తత్పరతతో రూపొందుతుంది. ఆత్మగతమైన స్పందనపై ఏర్పడే ఆలోచన, సిద్ధించే దర్శనంపై ఆధారపడి నిర్ణయాలు ఉంటాయి. ముందుగా స్థిరపరచుకొన్న విలువలతో కూడిన అభిప్రాయాలపై ఆధారపడి ఉపక్రమించడంతో నిర్ణయాలు సాక్షికంగా వెలువడేందుకు వీలుంది. వస్తుగతంగా కన్నా వైయక్తికమైన ధోరణికే అవకాశం ఎక్కువ.

పరిశోధనా విధానం, విమర్శనా ధోరణీ రెండు వేరువేరు నిర్వహణం పరిధులూ కలిగినవి. ఐనా ఈనాడు వెలువడే పరిశోధనా గ్రంథాల్లో వీలునుబట్టి ఈ రెండింటిలో అవసరమైన లక్షణాల సమాహారంగా రూపొందే స్థితి ఎక్కువగా కన్పిస్తుంది. ముఖ్యంగా సృజనాత్మక సాహిత్యంలో తత్త్వం, జీవితం, భావం, శిల్పం గురించి సమాలోచనం

చేసేప్పుడు భావుక లక్షణంచేత పరిశోధనలో వస్తుపరమైన దృష్టి సడలి, స్వానుభవగతమైన ఆలోచనకు గురికావడం జరుగుతూంది. దీనితోపాటు బాహ్యాంతర విధానాల యాంత్రికమైన పద్ధతిపట్ల వైముఖ్యం కాకపోయినా, ఆసక్తి లేకపోవడం కావచ్చు. కార్యాన్ని శ్రమరహితంగా సులభమార్గాన సాధించాలన్న అభిలాష ఉండవచ్చు. గుణదోష విమర్శ రూపాన్ని పొందుపరచుకొని అంతర్దృష్టితో సమగ్రతకు దారితీసే మాట సమాలోచనం. ఇది సముచితమైంది.

### 3. విశ్లేషణ - సమన్వయం

అంతర్విధానంలో విశ్లేషణం సమన్వయం పరిశోధనా పరిధిలో అవలంబించే పాత్ర విశిష్టమైంది. ఇవి విషయాన్ని ఒక ప్రయోజనానికీ నిర్ణయానికీ అభిముఖంగా తీర్చేవి. బాహ్య విధానంలో వలె వీటిని విశ్లేషణ సమన్వయం అనకుండా విశ్లేషణ స్థితి, సమన్వయ స్థితి అనడం గమనించదగింది. వస్తువులోని వివిధాంశాలకు సంబంధించిన అనుబంధాలను బాగా తెలుసుకోడానికీ, అవి ఎట్లా ఒకదానితో మరొకటి ప్రయోజనకారులుగా పరిణమించేదీ గుర్తించడానికి తోడ్పడే ఈ స్థితులు పరిశోధనా భాగం అంతా పర్యాప్తమై ఉంటాయి. ఆయా సందర్భాల్నిబట్టి కార్యకారణ సంబంధం చేత స్థితిత్వాన్ని పొందుతాయి. వీటి సంస్థితి, వివిధాంశాలకు ఒకదానినుండి మరొకటి విడదీసి అవసరమైన విధంగా మిగతావాటితో సమన్వయం చేకూర్చి భావించడంతో ఏర్పడుతుంది. ఏవి వేటికి విరుద్ధమో, ఏవి వేటికి పొసగుతాయో ఏవి వేటికి తటస్థాలో కూడా సులభంగా తేలిపోతుంది. విశ్లేషణ పద్ధతినాశ్రయించి, కొత్త విషయాలు కనుగొనడమూ జరుగుతుంది. అందువల్ల దీన్ని అంతర్విధానంలో అన్వేషణ పద్ధతి (మెథడ్ ఆఫ్ డిస్కవరీ) అనడం సముచితంగా ఉంది. దీనివల్ల ఏది ముఖ్యమో ఏది అముఖ్యమో స్పష్టమవడమే కాకుండా, ఏది దేనికి కారణమో ఎట్లా కార్యరూపం వహిస్తుందో హేతుబద్ధంగా అవగతికి వస్తుంది.

ఒక కవిత తీసుకుంటే దాన్ని చదవగానే మొత్తంమీద కలిగే స్థూలమైన అనుభవాన్ని విశ్లేషిస్తే బాహ్య విధానంలోని శబ్దం నుండి మొదలుకొని అంతర్విధానంలోని వ్యంగ్య మర్యాద దాకా అనేకాంశాలు ఒకదానికొకటి కారణభూతాలై కార్యరూపాన్ని పొందుతాయి. విశ్లేషణ స్తితినిబట్టి, దాన్ని అనుసరించే సమన్వయ స్థితినిబట్టీ అవగత మౌతాయి. ఎప్పటికపుడు విశ్లేషణతోపాటు అవసరమైన అంశాల సమన్వయంతో ఆలోచనకు పూనుకోవడం జరుగుతుంది. కాబట్టి పరిశోధనలో ఈ రెండూ ఒకదానినొకటి

అందుకొని, ఉపక్రమణంతో గతిరూపాన్ని చేకూరుస్తాయనడంలో సందేహం లేదు. ఇది ఏ కవిత్వంలోనో ఏ పద్యానికో ఏ నవల్లోనో ఏ సంఘటనకో ఏ పాత్రకో మాత్రమే ఖండఖండంగా పరిమితం కాదు. పరిశోధనలో వస్తువునుబట్టి ప్రక్రియనుబట్టి ఎన్నుకొన్న విషయంలో అంశాన్ని బట్టి విశ్లేషణ మారుతూ ఉంటుంది. సమన్వయం ప్రత్యేకతను పొందుతుంది. దీనికి స్పష్టమైన నిర్దేశక సూత్రాలంటూ లేవు. ఒక సందర్భంలో సముచితమైంది మరో సందర్భంలో కాకపోవచ్చు.

ప్రస్తుతాంశాన్ని శాస్త్రీయంగా విశ్లేషిస్తే సాహిత్య పరిశోధకుడు రెండు దశల (లెవెల్స్)ను ఎదుర్కోవలసి ఉంటుంది. ఒకటి అనుభవగుణం కలిగిందీ, రెండోది హేతు లక్షణం కలిగిందీ. సృజన విషయాల్లో అనుభవగుణానికీ సృజనేతర విషయాల్లో హేతుగుణానికీ ప్రాధాన్యం ఉంటుంది. వీటిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడంలోనే సాహిత్యంలో పరిశోధన ప్రయోజనాత్మకమైన పాత్రను నిర్వహించగలదు. ఆ సందర్భంలో ఔచిత్యాన్ని పాటిస్తూ అప్పటి ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని ముందుకు పోవడంలోనే న్యాయం చేకూరుతుంది.

పరిశోధకుడు తన ప్రజ్ఞచేత అనుభవంచేత కొత్తవిషయాన్ని ఆవిష్కరించే అవకాశం కలిగి ఉండడంవల్ల, అంతర్విధానంలో ఈ సమన్వయస్థితిని ఆవిష్కార పద్ధతి (మెథడ్ ఆఫ్ ఎక్స్ పొజిషన్) అనడమూ జరిగింది. వివిధాంశాలను ఏకత్ర సమీకరించి సమన్వయం సాధిస్తూ కొత్తరూపాన్ని ఆవిష్కరించే ప్రయత్నంలో కొన్ని క్లుప్తం కావచ్చు, ఉన్నవి మారవచ్చు. అర్థవంతమైన వీటి కలయికచేత, సంబంధస్థాపనం చేత, కొత్త ప్రయోజనాన్ని పొందడం జరుగుతుంది. ఇది మొదట్లో ఎక్కడికక్కడ దశలు దశలుగానో ఖండఖండాలుగానో తటస్థపడుతూ, పోనుపోను రచన మొత్తంమీద ఒక ప్రత్యేక క్రమంలో యోజితమై సిద్ధాంతపరమైన సహయోగాన్ని పొంది విశిష్టమైన రూపాన్ని భజిస్తుంది. పరిశోధన మొత్తంమీద పరిపూర్ణ స్థితినుండి వచ్చే శక్తివంతమైన నిర్ణయార్థాలూ వీటి పర్యవసానాలే. ఈ సమాలోచనాన్ని సంగ్రహంగా క్లుప్తీకరిస్తే అంతర్విధానంలో విశ్లేషణ స్థితి, దేనికది బాగా గుర్తించి కొత్తవి అన్వేషించడానికి దారితీస్తే, సమన్వయస్థితి, కనుగొన్నవాటిని ప్రయోజనవంతంగా ఆవిష్కరించడానికి ఉపకరిస్తుందనేది స్పష్టం. విశ్లేషణం సమన్వయం అనేవి పరిశోధనా గమనానికి రెండు పాదాలుగా ఈ కారణంగానే భావించడమైంది.

## 4. హేతుదృష్టి

అంతర్విధానంలో ఉపకరించే అంశాల్లో మరొకటి హేతుదృష్టి. పరిశోధనలో తలెత్తిన సమస్యలకు శాస్త్రీయమైన సమాధానం పొందేందుకు అవలంబించే మార్గం ఇది. ఇది వాస్తవాలపై జరిగే ఆలోచనా పురస్కృతమైందే తప్ప ఏ విధంగానూ కాల్పనికం కాదు. ఆధునిక యుగంలో ఈ దృష్టికి గల ప్రాధాన్యం గురించి వేరే చెప్పనక్కర లేదు. దీన్ని అనుసరించిందే కార్యకారణ సంబంధాల యోజనం. ఇది రెండు విధాలుగా నిర్వహింపబడవచ్చు. ఒకటి కాలక్రమంలో రెండోది హేతుక్రమంలో, ప్రతిదానికీ కారణం ఉంటుంది. ఒక్కొక్కప్పుడు ఇది స్ఫుటం కాకపోవచ్చు. కారణానికీ ఆధారం పరిస్థితి – సాధారణ దృష్టిలో కారణం అంటే పరిస్థితి అనే. అయితే కార్యం యొక్క పూర్వరూపమే కారణం. జీవితంలోనూ కార్యకారణ సంబంధం ఒకచోట సమాప్తి పొందేది కాదు. అట్లాగే పరిశోధనా ప్రపంచంలోనూ ఇది గొలుసు వంటిది, చక్రనేమి క్రమణం వంటిది.

ఎన్నో సమస్యలకు శాస్త్రీయమైన అవగాహనతో చర్చకు నిలిపి పరిష్కరించేందుకు తోడ్పడే ఈ అంశం అటు సామాజిక తత్త్వాన్ని ఇటు కళాత్మకమైన విలువల్నీ శోధించేందుకు పలువిధాలుగా ఉపకరిస్తుంది. ఒక క్రమ పరిణామ గతిలో సామాన్యం నుండి ప్రత్యేకమైన విషయానికీ, ప్రత్యేకం నుండి సామాన్య విషయానికీ పరిశోధకులకు అనుభవంలోకి వచ్చేదే. ఇక్కడ రెండు విధాలైన స్థితుల్ని పరిశోధకు డెదుర్కోవలసి వస్తుంది. ఒకటి వాస్తవికం, రెండోది దార్శనికం. వాస్తవికంలో హేతుస్థితి ఉంటుంది. దార్శనికంలో హేత్వతీతమైన అనుభవరూపం ఉంటుంది. ఇది ఏ హేతువుకూ లొంగదు. కాని అనుభవంలో నిజం అనిపిస్తుంది. ముఖ్యంగా సృజనాత్మక సాహిత్యంలో ఈ స్థితి ఎదురౌతుంది. ఈ రెండూ ఏ విధంగానూ పరస్పరం విరుద్ధం కావు. అన్యోన్యం పోషకాలే.

## 5. నిర్ణయ స్థితి – పరిష్కారం

పరిశోధనలో కొన్ని సందర్భాలు ఎట్లా ఉంటాయంటే తాత్కాలికమైన పద్ధతిలో ఒక ఊహాత్మక నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. కొన్ని సమస్యలు క్లిష్టమైనవీ, అపరిష్కృతంగా ఉన్నవీ ఎదుర్కోవలసి వచ్చినపుడూ, ఉన్నదానిపై అభివృద్ధిని కోరేటప్పుడూ ఈ చర్య అనివార్యమౌతుంది. మొదట్లో ఇది అంచనా లేదా ఊహాత్మక నిర్ణయ రూపంలో ఉంటుంది. అయితే ఇది ఏ ఆధారమూ లేకుండా మాత్రం ఉండదు. కాని సత్వరం

నిశ్చయమైన నిర్ణయానికి తగిన బలమైన సమర్థనీయమైన హేతుస్థితి ఉండదన్నమాట. ఊహాత్మకమైన నిర్ణయరూపం తాత్కాలికమైన ప్రాతిపదికపై పొందించడం జరుగుతుంది.

ఈ నిర్ణయరూపం పరిశోధన సాగేకొద్దీ విశ్లేషణ సమన్వయ స్థితులతో కార్యకారణ చర్చారూపంతో బహిర్ అంతర్ సాక్ష్యాధారాలపై పరీక్షకు నిలిపి, అట్లా నిలచినమీదట అవసరమైన మార్పులతోనో లేదా యథాతథంగానో స్వీకృతమౌతుంది. అసాధారణ పరిస్థితుల్లో నిరాకృతమూ కావచ్చు. ఇది మూల పాఠ పరిష్కారాల్లోనూ చారిత్రకాంశాల్లోనూ, అపరిష్కృతంగా ఉన్న సమస్యలను గురించీ, నిర్ణయాన్ని పునర్విలోకనం కోరేప్పుడూ నిర్ణయంలో మార్పుల్ని అభిలషించేప్పుడూ, ఆలోచన చేసేప్పుడు ప్రత్యామ్నాయంగా అవసరమౌతుంది.

అంతర్విధానంలో ఆరంభం నుండి సమాప్తివరకూ పరిశీలనం అనేది నిరంతరం జరిగే పరిశోధనా క్రియారూపం. ఇది చాక్షుషమూ, మానసికమూ అని రెండు విధాలు. చాక్షుషం ప్రత్యక్షగుణంతో పరిమితమైంది, దేశకాల సంబంధమైందీ, బాహ్యస్థితి నాశ్రయించిందీ, చాక్షుషం దీని ఆధారంపై లేదా స్వతంత్రంగానూ వర్తిస్తుంది. మానసికం, ఆలోచనా గుణంతో ఉంది. దీనికి పరిమితి లేదు. దేశకాలాతీతమైందీ, ఆంతరస్థితి నాశ్రయించిందీ, ఒక్కొక్కప్పుడు దర్శనస్థాయిలోనూ ప్రవర్తమానమవుతుంది.

పరిశీలనం అంటే ఏదేని ఒక వస్తువును అది ఉన్నస్థితినీ, స్వరూపాన్నీ, ఒక ప్రయోజనాపేక్షతో చూడడం లేదా ఆలోచన చేయడం. కాబట్టి ఇది భౌతికంగానూ లేదా మానసికంగానూ అనుభవాత్మకమైంది. పరిశోధనలో దీన్ని అదుపులో వుంచడం అవసరం. లేని పక్షంలో విషయ పరిధుల్ని మరచిపోయేట్లు చేయడం లేదా అతిక్రమించడం జరుగుతుంది. అవసరం లేనివీ సంబంధం లేనివీ చోటుచేసుకొని చేరే అవకాశమూ ఉంది. విషయ పరిధుల దృష్ట్యా నియమితమైన పరిశీలనం వల్ల సత్ఫలితాలు పొందడానికీ, సావధానతతోపాటు గ్రహణశక్తి అవసరం. ఆ తరువాత వివేచనాశక్తి ప్రమేయం వస్తుంది. వివేచన పర్యవసానంగా సరియైన ఎన్నిక జరుగుతుంది.

అయితే ఒక సమస్య గురించి మానసికమైన క్రమగతిలో అనుమానం (ఇన్‌ఫెరన్స్), నిర్ధారణ, ఆలోచన, భావనతో ఎప్పటికప్పుడు పరిశోధనం పరిణామాన్ని పొందుతూ ఉంటుంది. పరిశీలనంతో, వివేచనతో అభిప్రాయం లేదా సిద్ధాంత స్వరూపానికి దారి ఏర్పడుతుంది. అంటే సిద్ధాంత గ్రంథానికొక స్వరూపం ఇవ్వడానికి ప్రారంభ చర్య మొదలు ప్రతిపాదనం వరకూ ఈ శాస్త్రీయమైన విధానంతో ప్రణాళిక సుగమత్వాన్ని

పొందుతుందన్నమాట. ఈ క్రమంవల్ల ఆంతర విధానంలో సంకీర్ణత, అస్పష్టత అసంతృప్తి తొలగిపోయి సౌలభ్యమూ, స్పష్టత, సంతృప్తి సిద్ధిస్తుందనడంలో సందేహం లేదు. పరిశీలనం దాని తరువాత వివేచనం అనేవి వస్తుపరమైన దృష్టిని కోరే హేతుస్థితికి ప్రాధాన్యం ఇచ్చే సందర్భంలో ఎక్కువగా అవసరమౌతుంది.

ఈ నిర్మాణక్రమం ప్రయోజనం అంతా 1) సమస్యల స్వరూపాన్నీ వీటి వెనుకనున్న వాస్తవాన్నీ, గతినీ గుర్తించడం, 2) ఒకదాని ప్రభావం మరోదానిపై ప్రసరించి అవి పనిచేసే తీరును అర్థవంతంగా పరిణమింపజేయడం, 3) సిద్ధాంత స్వరూపాన్ని స్పష్టంగా సమంజసంగా ఆవిష్కరింపజేయడం, 4) శాస్త్రీయమైన విధానాల్ని అవలంబించడం. పరిశోధనలో సిద్ధాంత ప్రతిపాదనకు సంబంధించిన సమస్యల ఆయువు పట్లను తెలుసుకోడానికీ, విశ్వసనీయమైన ఆధారతలంపై పరిశోధకుడు సరియైన మార్గాన ప్రయాణించడానికీ మాత్రమే. చివరకు ఒకొక్కప్పుడు పాతదే యథాతథంగా స్వీకృతం కావచ్చు. నిరాకృతం కావచ్చు. ఏమైనా మార్పులను పొందవచ్చు. కొత్తవి ఆవిష్కృతం కావచ్చు. ఇందులో ప్రతి దశలోనైనా పరిశోధనలో మౌలికతను ప్రదర్శించేందుకు అవసరమైన స్వేచ్ఛకు అవకాశం ఉందన్న సంగతి మరచిపోకూడదు. ఈ స్వేచ్ఛవల్లనే పరిశోధనలో ఇంతటి వైవిధ్యమై, వైశిష్ట్యమూ.

### 6. అంతస్స్వరూపం – ప్రయోజనం

ప్రతి పరిశోధనకూ ఒక ప్రత్యేకత ఉంది. దాని అంతస్ స్వరూపమూ ప్రయోజనమూ వేరువేరుగా ఉంటాయి. ప్రతి పరిశోధకుని అన్వేషణ మార్గం లక్ష్యం భిన్నంగా ఉంటాయి. స్థూలంగా కొన్ని సూత్రప్రాయమైన బాహ్యాంతర్నిర్దేశకాలున్నప్పటికీ పరిశోధకుని మౌలికమైన వ్యక్తిత్వ ప్రభావం వల్ల అంతరమైన యోజనమూ సంస్థితిలో విశిష్టత కలిగి ఉంటుంది. ఈ వైవిధ్యం మానవ జీవితం వలెనే తప్పనిసరియైంది. పరిశోధనా వ్యాసంగం, విజ్ఞానరాశిని సంపన్నం చేసింది.

ఆధునిక యుగంలో సాహిత్య వ్యాసంగం బహు విస్తృతిని పొందుతూండడంచేత నేటి పరిశోధన వినూత్నమైన విధానాలతో కొనసాగుతూనే ఉంది.

ఒక్కొక్క పరిశోధకునికి సమాధానాలు పరిష్కారాలు ఒక్కొక్క విధంగా ఉంటాయి. వీటిలో కొన్ని తాత్కాలిక ప్రయోజనం కలవీ, మరికొన్ని శాశ్వతమైన ప్రాతిపదిక కలవీ, పరిశోధనా కృషిలో ఎప్పటికపుడు ఎదుర్కోవలసిన పరిస్థితుల్ని పరిశోధకుడు స్వేచ్ఛగా

ప్రయత్నించి నిర్ణయరూపాన్ని ప్రదర్శించేందుకు ఉపక్రమించడంతో అంతకుముందున్న స్థూలమైన రేఖలకు స్వరూపం ఏర్పడడం ఆరంభమౌతుంది.

పరిశోధనలో ప్రయాణమే లక్ష్యం కాదు. లక్ష్యంగా వేరుగా ఉంటుంది. ప్రయాణ లక్ష్యం పరిణామరూపంగా పరిగణించేవారి మాటల్లోనూ తాత్విక సత్యంతోపాటు కొంత వాస్తవికత లేకపోలేదు. ఇది అంతం అంటూ లేని నైరంతర్యాన్ని సూచిస్తూనే ఎక్కడికక్కడ ఖండఖండంగా లక్ష్యసీమల్ని భావింపచేస్తుంది. అంతర్విధాన క్రమంలోని విశ్లేషణం సమన్వయం పరిశీలనం, ఆలోచన, దర్శనంచేత సుస్థితిని పొందిన పరిశోధన ప్రణాళికా నియతమైంది.

## 7. అంతర్విధాన దశలు

జీవితంలో వలెనే పరిశోధనలోనూ అంతర్విధానానికి సంబంధించిన మూలతత్వం 1) హేతుయుతం, 2) భావనామయం, 3) అనుభవాత్మకం అని మూడు దశ (లెవెల్స్)ల్లో ప్రవృత్తమై కన్పిస్తుంది. మొదటిది కార్యాచరణ చర్చతో, రెండోది ఆలోచనా ప్రసారంతో మూడోది దర్శనశక్తితో పరిశోధకుడు వస్తువును నిర్వహించే విధానికి చెందినవి. ఈ మూడు వేటికవి విభజించడానికి వీలు కలిగినా సందర్భాన్ని బట్టి ఏదో ఒకటి ప్రముఖంగా తక్కినవాటి ప్రమేయం కలిగి తప్పనిసరిగా కన్పిస్తుంది. అంతర్విధానంలో ఇంతవరకు వివరించింది ఒక ఎత్తు. ఇది ఒక ఎత్తూ.

ఇది ఇట్లా ఉంచి పరిశోధనలో పరిశోధకుని మనస్తత్వానికి సంబంధించిన ధోరణులూ విస్మరించటానికి వీల్లేదు. దీని ప్రసక్తి లేకుండా ఈ వ్యాసానికి సమగ్రత చేకూరదు. ఈ ధోరణుల్లో 1) కొన్ని సర్వసాధారణమైనవీ, 2) మరికొన్ని వైయక్తికమైనవీ, 3) మరికొన్ని అసాధారణమైనవీ ఉంటాయి. వీటి సమ్మేళనంతో ఏర్పడిన విశిష్టమైన రూపం చాలా సంక్లిష్టమైంది. ఎంత ప్రయత్నించినా ఇంకా తెలియంది ఎంతో మిగిలి వుండే లక్షణం కలిగింది. ఇది ఏర్పడడానికి కారణాలు, మనస్తత్వశాస్త్రరీత్యా 1)ఆనువంశికం, 2) పోషణ-పరిసరాల ప్రభావం, 3) సంతరించుకున్న విజ్ఞానం, అలవడిన సంస్కారం, 4) గతంలోని అనుభవాల ప్రభావం, 5) వ్యక్తిగతమైన మనస్తత్వ నిర్మితి, 6) సమాహారంగా రూపొందిన అభిప్రాయాలూ, ఆదర్శాలూ ముఖ్యంగా పేర్కోదగినవి. పరిశోధనా స్వరూపంతో ఇంచుమించు అందరూ ఒకే బాహ్య అంతర్విధాన సూత్రాలను అవలంబించినప్పటికీ పరిశోధనా గ్రంథాలు ఎంతో వైవిధ్యంతో వివిధ స్థాయిల్లో విలువలతో ప్రవర్తితం కావడానికి మూలకారణాల్లో అంతర్గతమైన మనస్తత్వం

ముఖ్యమైంది. దీనిచేత ఏర్పడిందే వ్యక్తిత్వ విలసనం. ఈ సందర్భంలో పేర్కోదగిన మరో విషయం, పరిశోధకుని స్వేచ్ఛా శీలంతో కూడిన హేతుదృష్టి, నిర్ణయశక్తీ తప్పనిసరిగా దృష్టిని ఆకర్షిస్తాయి. యంత్రాలకూ మానవులకూ గల భేదం గుణాత్మకం.

వ్యక్తి అంటే మొదట బాహ్య శరీర నిర్మితీ, ఆ తరువాత అంతర్ వ్యక్తిత్వ పరిణామం వలెనే పరిశోధనలోనూ ఈ స్థితి అనుభవానికి వస్తుంది. పరిశోధనా అంశాలు కొన్ని స్థిరమైనవీ మరికొన్ని పరిణామ సహజమైనవీ కన్పిస్తాయి. ఈ రెండోదాని వికాస రూపమే పరిశోధనలో మౌలికమైందీ, పరిశోధన యొక్క గుణాధారమైన అస్తిత్వాన్ని ప్రదర్శించేదీ. ఇది అంతర విధానంలో నిహితమై విశిష్ట వ్యక్తిత్వ శక్తి కలిగి ఉండడంచేత మనస్తత్వపరమైన వివరణం అవసరమౌతుంది.

పరిశోధనలో అంతర్విధానంలో సన్నిహితమైన వ్యక్తిత్వ సిద్ధాంతం శాస్త్రరీత్యా సమున్నతమైందీ, సమర్థనీయమైందీ. ఇది పరిశోధనలో ఒకప్పుడు హేతుసహితమైన ఆలోచనకూ మరొకప్పుడు హేత్వతీతమైన స్థితికీ ముఖ్యంగా సాహిత్యరంగంలో అందునా సృజనాత్మక రచనల్లో ఎదుర్కోవలసి ఉంటుంది. అయినప్పటికీ ఒక క్రమసహితమైన అంతర్ విధానంలో ప్రయోజితమై ఆవిష్కృతం కావడంవల్ల ఏ విధమైన క్లిష్టతనూ పొందదు. కొత్తను అన్వేషించే అభిలాష గల పరిశోధకుడు అవలంబించే స్వేచ్ఛ నియంత్రితమై, పరిశోధనా పరిధి అవసరం మేరకు విస్తృతిని పొందడం చేత ఒక విధంగా పరిశోధన హద్దులు మీరకుండా నిర్దుష్టంగా నిర్మితమౌతుంది. ఒక్కమారు సమాలోచనం చేస్తే అంతర్విధానం.

## 8. అంతర్విధానం – ప్రధానాంశాలు

పరిశోధనలో అంతర్విధానం,

1. పరిశోధనకు క్రమ సహితమైన గతి చేకూరేందుకు అవసరమైన నిర్మాణరూపాన్ని ఇస్తుంది.
2. మొదటినుండి చివరి వరకూ భౌతిక రూపంతోపాటు అంతరమైన పరిణామంతో వికాస సమగ్రతను చేకూరుస్తుంది.
3. హేతువు చేత కార్యకారణ సంబంధాన్ని, అనుభవంచేత వైయక్తిక మనస్తత్వ ధోరణినీ, ఆదర్శంచేత సామాజిక దృష్టినీ భావింపజేసే వాస్తవశక్తుల్ని గుర్తిస్తుంది.
4. పరిశోధనా వ్యాసంగం వెనుక నుండి అంతర విధానాన్ని నడిపే శక్తులున్నాయనీ అవి సామాజికం, వైయక్తికం, ఆదర్శ లక్షణాలచేత సమాహితమైనవనీ తెలుస్తుంది.

5. కొత్తను అన్వేషించే అభిలాషతో స్వేచ్ఛ, హేతుదృష్టి, అనుభవ దర్శనం చేత నిర్మితమైన పరిశోధనా వ్యక్తిత్వ వికాసం, విస్మృతం కావడానికి వీలులేని స్థితిని భావింపజేస్తుంది. వివేచనకు ఉపకరిస్తుంది.

"సమస్యలెన్నో క్రమపద్ధతులన్ని విధాలు" అన్న నార్త్ రోప్ మాటలు, ఈ విధాన క్రమం వైవిధ్యాన్ని ప్రకటిస్తూ పరిశోధకుని స్వాతంత్ర్యాన్ని భావింపజేస్తాయి. సాహిత్యం ఒక విధంగా సామాజిక స్వరూపంతోపాటు కళాత్మకమైన అంశాలకూ సంబంధించింది. మానవులూ వారి వివిధ చర్యలూ ప్రతిచర్యలూ ఆలోచనలూ కల్పనల ప్రమేయం కలిగింది. సాహిత్యం గురించి పరిశోధనం భౌతిక మానసికమైన నిర్మాణ వ్యక్తిత్వాలను తప్పనిసరిగా సంతరించుకొని ఆవిష్కృతమౌతుంది. ఈ సమాలోచనమే ప్రస్తుత పరిశోధనా స్వరూపంలో అంతర్విధానక్రమం – వ్యక్తిత్వం.

# 3. గ్రంథ పరిష్కరణం

## 1. పరిశోధన - పరిష్కరణం

పరిశోధనా క్షేత్రంలో గ్రంథ పరిష్కరణం ప్రత్యేకమైన విభాగం. మూల లిఖిత (కృతి) ప్రతి (Text) రూపానికి యథాతథంగానో లేదా అత్యంత సమీపంగానో పాఠ పరిష్కరణం సిద్ధం చేయడం ఇందులో ముఖ్యం. ఇది పరిశోధనా సమాచార సేకరణంతో కూడిన పీఠికతో అనుబంధంతో ప్రకటితమౌతుంది. సంపాదకుని గురుతర బాధ్యతకు నిదర్శనమైంది. గ్రంథం ప్రాచీనమైనకొద్దీ ఈ దిశలో పరిశోధన ప్రాముఖ్యం వహిస్తుంది పరిష్కరణంలో ఉత్పన్నమయ్యే సమస్యలనేకం. వీటిని పరిష్కరించడానికి దీర్ఘ శ్రమతోపాటు పాండిత్యం వివేకం నిర్ణయశక్తి అవసరం.

ఈ సందర్భంలో మూలలిఖితప్రతి నుండి ఒకదాని ననుసరించి మరొకటి బహుకాలంపై వచ్చిన అనేక వ్రాతప్రతుల్ని ముద్రితప్రతుల్ని సంప్రదించవలసి ఉంటుంది. దీనికి సంబంధించిన పరిశీలనమే మూల (లిఖిత) Written (కృతి) విమర్శ Textual Criticism మూలప్రతితోపాటు దాని నుండి సిద్ధం చేసిన అనుసరణ ప్రతుల (గ్రంథాల) సంపాదనం మొదలుకొని పాఠ పరిష్కరణంతో పీఠికతో ప్రకటించే దశ వరకు ఎన్నో సమస్యలకు సహేతుకమైన పరిష్కారమార్గం అన్వేషించవలసి ఉంటుంది. ఇది ఎంతో గురుతరమైన బాధ్యతతో కూడింది. దీన్ని నిర్దుష్టంగా నిర్వహించేందుకు కొన్ని పద్ధతులున్నాయి. ఇవి అంతర్జాతీయ పరిశోధనా స్థాయిలో రూపొందినవి. ప్రామాణికతను సంతరించుకొన్నవి.

ఎందరో పరిశోధకుల అనుభవం మీద సిగ్గుదేరి క్రమంగా పరిశోధనా ప్రపంచంలో గ్రంథ పరిష్కరణ నిర్దేశక సూత్రాలు స్థిరపడినాయి. అయినప్పటికీ స్థానికమైన పరిస్థితులకనుగుణంగా భాష ప్రాంతం సంస్కృతి అలవాట్లు మొదలైన అంశాలను పురస్కరించుకొని పరిశోధకులు వీటిని తమ పరిశోధనావసరాల కనుగుణంగా వివిధ ప్రాంతీయ భాషల్లో సవరించుకోవడం జరిగింది. ఇది సహజం కూడా. ఇది మూలప్రతి (గ్రంథ) విమర్శ పరిధిని విస్తృతం చేసింది. మూల లిఖిత ప్రతీ, అనుసరణ ప్రతులూ ప్రాచీనమైనకొద్దీ లభించే ఆధారాల విశ్వసనీయత పట్ల అనుమానాలెక్కువగా ఉంటాయి. వీటిని నిర్ణయం చేసి నిశ్చయమైన స్థితినేర్పరడానికెన్నో సాక్ష్యాధారాలు సేకరించవలసి ఉంటుంది. అన్నిటినీ సహేతుకంగా చర్చించి వివిధ తలాలపై తీసుకున్న నిర్ణయాలను సమన్వయపరచడమూ అవసరమౌతుంది.

సంస్కృతం ప్రాకృతం మొదలైన ప్రాచీన భారతీయ భాషలకు చెందిన మూల ప్రతి (గ్రంథ) విమర్శనం ఎన్నో సమస్యలతో పరిశోధనా విస్తృతపరిధిని పొందింది. ఆధునిక భారతీయ భాషల విషయంలోను ఎదురయ్యే సమస్యలు ఇంచుమించు ఒకటే ఐనా కాలం ప్రాంతం వల్ల పరిస్థితుల్లో మార్పు వల్ల కొంత భేదిస్తాయి. భాషకై అవలంబించే లిపి వల్ల, ప్రాంతీయ ప్రత్యేకతలతో సిద్ధించే వివిధ వస్తు సాధనాల వల్ల వేరు వేరు స్థితుల్ని కలిగి ఉన్నాయి.

ప్రాచీనకాలంలో గ్రంథాలను సంరక్షించే సరియైన వ్యవస్థ లేకపోవడంవల్ల, ఆ తరువాత కాలంలో ఏర్పడింది సరిగా పనిచేయకపోవడంవల్ల, ముఖ్యంగా ప్రాచీన సాహిత్యానికీ ఎంతో నష్టం వాటిల్లింది. ప్రాచీన సంస్కృత సాహిత్యం విషయంలో సరేసరి. తెలుగులో నన్నయభట్టుకు పూర్వం గ్రంథాలీ విధంగానే నష్టమైనాయి. పోతన భాగవతం అదృష్టవశాత్తు బ్రతికి బయటపడింది.

ఒక కృతి ఎప్పుడో ఒకమారు పరిష్కృతం కావచ్చు. కాలం గడిచాక అప్పటికి దొరికిన సమాచారాన్నిబట్టి తిరిగి పరిష్కరించవలసిన అవసరం రావచ్చు. ఇక పరిష్కరింప బడని గ్రంథాలను గురించి వేరే చెప్పనక్కరలేదు. ఎంతో సమాచార సేకరణతో అవసరమైన ఎన్నో సాక్ష్యాధారాలతో హేతుదృష్టితో జరిగే పరిష్కరణం పరిశోధనా వ్యాసంగంలో ముఖ్యమైంది. ఇది భారతీయ భాషల్లో పాశ్చాత్య ప్రభావంవల్ల ఆరంభమైంది.

మూలపాఠం మొదలుకొని క్రమపద్ధతిలో గ్రంథ పరిష్కరణం వరకు వివిధ దశల్లో నిర్వహించే పరిశోధనా వ్యాసంగం పరిశోధనా ప్రపంచంలో తనదైన ప్రత్యేకతను సంతరించుకుంది. సమాచార సేకరణతో, సహేతుకమైన పరిశీలనంతో, సముచితమైన నిర్ణయంతో ప్రామాణికమైన స్వరూపాన్ని ఇవ్వడమే మూలకృతి పరిశీలనంలో ఉద్దేశం.

## 2. మూల (కృతి) ప్రతి నుండి ప్రతులు

మూల లిఖిత ప్రతి నుండి అనుసరణ ప్రతులూ, ప్రతులనుండి తిరిగి వ్రాసిన ప్రతులు అనేకం శాఖోపశాఖలుగా విస్తరిల్లి కన్పిస్తాయి. అచ్చుయంత్రాలు లేని కాలంలో ఒక ప్రతిని చూచి మరో ప్రతి వ్రాయవలసి వచ్చేది. ఈ పనికి అభిలాష లేదా ఎవరినుండైనా ప్రోత్సహమో ఆదరణో అవసరం. దీనికితోడు సాధన సంపత్తి వ్రాసే నేర్పు ఓర్పు కావాలి. పూర్వం రాజాస్థానాల్లో ఒకరి మాటపైనో తామై ఇష్టపడో వేతనం పైనో లేఖకులీపని చేసేవారు. ఒక్కొక్కప్పుడీ పనిపై పర్యవేక్షణ ఉంటే ఉండేది లేకపోతే లేదు. ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా వ్రాసేవారు. ఒకే వ్యక్తి అయినప్పటికీ ఒక్కొక్కసారి

ఒక్కొక్క విధంగా వ్రాసే అవకాశం ఉంది. కాలం గడిచేకొద్దీ చేతులు మారేకొద్దీ అనేక కారణాలవల్ల ఎన్నో మార్పులూ, దోషాలూ చోటుచేసుకునేవి. ఈ మార్పులూ, దోషాలూ క్రమంగా కొంతకాలానికి స్థిరపడిపోవడమూ జరిగింది.

ప్రాచీనకాలంలో భారతదేశంలో వేదశాస్త్ర విద్యావ్యాప్తి మౌఖికంగానే జరిగేది, ముఖస్థ విద్యకే ఎక్కువ గౌరవమూ ప్రచారమూ ఉండేది. పెద్దపెద్ద పండితులు విద్యను బోధించడం జరిగేది కాని వ్రాసేవారు కాదు. ఈ పరంపర భారతదేశంలో ఇంకా అక్కడక్కడా మిగిలే ఉంది. ఈ కారణంగానే వేదాలకు శ్రుతి అన్న పేరు వచ్చింది. ఈ విధానం భాషా దృష్టితో ప్రాచీన సంస్కృత స్వరూపాన్ని రక్షించడంలో ఎంతో మేలు చేసింది. సమాజంలో ప్రచలితంగా ఉన్న వైదిక భాషా స్వరూపాన్ని ఉచ్చారణ సహితంగా యథాతథంగా నిలిపింది. ఇది భాషా పరిశోధకులకు సంస్కృతీ గవేషకులకెంతో ఉపకరించే విలువైన అంశం. ఆ తరువాత పరిస్థితులు మారడం లేఖనం లిపి – విద్యా వ్యాప్తి సాధనాలు క్రమంగా విజ్ఞానవ్యాప్తికి దోహదం చేసాయి. ఈ స్థితిలో పూర్వం లేఖకులు నిర్వహించిన పాత్ర గణనీయమైంది.

### 3. లిఖిత వ్రాత ప్రతులు

లిఖిత కృతి ప్రతి మూడు విధాలు. 1) రచయిత స్వయంగా వ్రాసింది. 2) రచయిత పర్యవేక్షణలో వ్రాసింది. 3) రచయిత ప్రమేయం లేకుండా వ్రాసింది. భారతదేశంలో ప్రాచీన కృతులకు సంబంధించినంతవరకు మొదటి విధం అసలే మృగ్యం. రెండోది ఆధునిక భారతీయ భాషల్లో కొంతవరకు లభ్యం. దీనికీ నిశ్చయమైన ఆధారాలు తక్కువ. మూడో విధం మాత్రం ప్రచురంగా కన్పిస్తుంది. భారతదేశంలో పై రెండు విధాలకు సంబంధించిన పరంపర ఎప్పుడో విచ్ఛిన్నమైంది తిరిగి సుస్థితిని పొందలేదు. ఆధునికకాలంలో కొంతవరకు మాత్రమే ఈ స్థితిని చూచే అవకాశముంది. ఇప్పటికీ రచయిత స్వంత దస్తూరితో లభించిన కృతిని భద్రం చేయాలన్న ఆలోచన దృఢంగా లేదు. కారణం దీనికి సంబంధించిన పరంపర లేకపోవడం అట్లా ఉంచి రచయితలకూ ప్రజలకూ దీనిపట్ల సరియైన దృక్పథం లేకపోవడమూ. స్థూలంగా రచన ముఖ్యం కాని ఎవరు ఎట్లా వ్రాసారన్నది ముఖ్యం కాదన్న అభిప్రాయంతో కూడిన మనస్తత్వం పరిశోధకుల కవసరమైన అంశాలపట్ల తూష్ణీభావాన్ని వహింపజేస్తూంది.

రచయిత స్వయంగానో, అతని ప్రమేయం లేదా పర్యవేక్షణలోనో వ్రాతప్రతి సిద్ధం చేయకపోవడంతో మూలలిఖితకృతికి సరియైన రూపాన్ని స్థిరపరచడంలో కొన్ని చిక్కులు ఎదుర్కోవలసి వస్తుంది. పోనుపోను ఇంకా కొన్ని మార్పులకు చేర్పులకవకాశం కలుగుతుంది. ఈ స్థితుల్ని ఒక పద్ధతిలో సరిచేసే ప్రయత్నంలో భాగమే మూల (లిఖిత) ప్రతి ((గ్రంథ) (కృతి) విమర్శ. కొన్ని నిర్దేశక సూత్రాల ననుసరించి కారణాలన్వేషిత మౌతాయి. ప్రతిలో చోటుచేసుకున్న దోషాలను తొలగించి శిథిలాలను పూరించి చేర్పుల్ని సరిచేసి నిర్ణయరూపాన్ని ఇచ్చే సంపూర్ణమైన ప్రయత్నం గ్రంథ పరిష్కరణంలో కన్పిస్తుంది.

నాగర లిపిలో కాక ఎన్నో సంస్కృత గ్రంథాలు అనేక భారతీయ భాషల లిపిలో వ్రాయబడినాయి. భారతీయులు సంస్కృత భాషలోని విజ్ఞానసంపత్తిపట్ల అభిలాషతో అవసరం దృష్ట్యా సంస్కృత భాషా లిపి నిరోధాన్ని ఈ విధంగా తొలగించుకోవడం జరిగింది. ఒక లిపి నుండి మరో లిపిలోకి మారే సందర్భంలో ఎన్నో పొరపాట్లు జరిగే వీలుంది. ఇవి ఒక్కక్క భాషలో ఒక్కొక్కవిధంగా జరగవచ్చు. మూలలిఖిత కృతినుండి వ్రాసినవి, ఆ తరువాత కాలానికి చెందినవీ ప్రతుల్లో జరిగిన దోషాలను సరిచేయడానికీ దోషాల స్వరూపం తెలుసుకోడానికీ ప్రాంతీయ బాషల్లో వేరువేరు లిపుల్లో వ్రాయబడిన ప్రతులెంతగానో తోడ్పడతాయి. ప్రాచీన సంస్కృత వాఙ్మయ పరిశోధనకివి బాగా అనుకూలించాయి.

ప్రాచీన కాలంలో కావలసిన ప్రతుల్ని చేతివ్రాతతో సిద్ధం చేసేవారు. ఒక ప్రతిని చూచి మరో ప్రతిని వ్రాసేప్పుడనేక దోషాలకవకాశం ఉంది. కాలం గడిచేకొద్దీ ఈ దోషాలు మరో ప్రతిని సిద్ధం చేసేప్పుడు కొనసాగుతూ స్థిరరూపాన్ని పొందుతాయి. కొత్తవి చోటుచేసుకోవడమూ జరగవచ్చు. మూల లిఖిత ప్రతి అందుబాటులో లేకపోవడం వల్ల ఒకవేళ ఉన్నా అశ్రద్ధవల్లనో దాన్ని విప్పి చూడకూడదన్న మూఢ విశ్వాసంవల్లనో మూలలిఖిత ప్రతి నష్టం కావడంవల్లనో అనేక కారణాలవల్ల ఎన్నో దోషాలు మార్పులు చేర్పులు తొలగింపులకు సంబంధించినవి సంభవిస్తాయి. కాలం గడిచేకొద్దీ చేతులు మారేకొద్దీ లిఖిత ప్రతులు ప్రాచీనమై పోయేకొద్దీ దోషాల సముదాయంతో ప్రతి శీర్ణమై పోయిన స్థితుల్లో క్లిష్టంగా గహనంగా తయారవుతాయి. పరిశోధకులీ స్థితుల్ని పరిష్కరించడానికాయత్తం అయ్యేముందు మూల లిఖిత ప్రతిని గురించి లభ్యమాన లిఖిత ముద్రిత ప్రతుల్ని గురించి అవి దొరికిన స్థలం కాలం లభ్యమైన విధం వ్రాయబడిన వస్తువు దాని స్థితి – అప్పటి పరిస్థితులు అన్నీ బాగా పరిశీలించాలి. దీనికి చరిత్ర సంస్కృతికి చెందిన శాఖల సహకారమూ తీసుకోవలసి ఉంటుంది.

## 4. ఏర్పడే దోషాలు

లేఖకుడు చూచి వ్రాసే ప్రతుల్లో ఏర్పడే దోషాలు రెండు విధాలు. మొదటిది నేత్రగతమైనవి. ఇవి నేత్ర బలహీనతలకు సంబంధించింది. దృష్టిదోషంవల్ల లేదా భ్రమవల్ల ఒక అక్షరం మరో అక్షరం వలె కన్పిస్తుంది. అక్షరం సరిగా కన్పించక పొరపాటు జరుగుతుంది. మరో అక్షరం చోటుచేసుకుంటుంది. రెండోది మనోగతమైంది. లిఖిత ప్రతిలో ఉన్న అక్షరాన్ని పొరపడి లేదా మరో అర్థాన్ని భావించి మార్చడం జరుగుతుంది. లేఖకుడు చదువుకున్న వ్యక్తి ఐతే ఇటువంటి దోషాలు ఎక్కువగా జరిగే వీలుంది. ప్రాచీన గ్రంథాల్లో కన్పించే దోషాలు ఎక్కువగా ఈ విధంగానూ కన్పిస్తాయి. లేఖకుడు బహు శ్రద్ధతో వ్రాస్తూనే మధ్యమధ్య తన బుద్ధిబలంతో పాండిత్యంతో అనుకోని అనుకోకుండా యాంత్రికంగానో వివేచనతోనో అక్షరాలు పదాలు మార్చడం జరుగుతుంది. కొన్ని సమయాల్లో పద్యపాదాలు మార్చిన సందర్భాలు ఉన్నాయి. కొత్త పద్యాలు చేర్చడమూ జరిగింది. ఇవి ఇట్లా ఉంచి కృతికర్త స్వయంగా చేసే దోషాలు ఉన్నాయి. కొన్నిచోట్ల పొరపాట్లు దొర్లడంవల్ల లేఖకుడు వీటిని యథాతథంగా దించేయడం జరుగుతుంది. వ్రాత స్పష్టంగా లేకపోవడంవల్ల తెలిసీ తెలీకా మరికొన్ని దోషాలు సంభవిస్తాయి. ఈ సందర్భాల్లో లేఖకుడు తన ఆలోచనతో పాండిత్యంతో పాటు వివేకమూ ఉపయోగించవలసి ఉంటుంది.

ఈ దోషాల్ని మరో విధంగా వర్గీకరించవచ్చు. మొదటిది ప్రామాదికం. ప్రమాదవశాత్తు అనుకోకుండా జరిగేవి ఒక అక్షరం బదులు మరో అక్షరం ఒక శబ్దం బదులు మరో శబ్దం చోటుచేసుకుంటాయి. రెండోది బుద్ధిపూర్వకం. లేఖకునిలో సాహిత్యం పట్ల అభిలాష వల్ల ఉత్సాహం వల్ల ఆలోచన చేత పాండిత్యం చేత బుద్ధి పూర్వకంగా జరిగేవి. మూడోది బాహ్య ప్రభావితం. వ్రాత ప్రతి ఎక్కువమార్లు ఉపయోగించడం వల్ల శిథిలదశకు చేరడం చేత ఇంకా ఎండ చలి చెమ్మ మొదలైన తీవ్రమైన వాతావరణ పరిస్థితులకు లోనుకావడం మూలంగా మార్పులకు గురౌతుంది. అక్షరాలు పదాలు పంక్తులూ సుస్థితిని కోల్పోతాయి. ఈ స్థితిలో లేఖకులు తమకు తోచిన విధంగా ఒక్కొక్కరు ఒక్కొక్క విధమైన మార్పుల్ని చేర్పుల్ని సంతరించే ప్రయత్నం జరుగుతుంది.

ఈ దోషాలను పరిశీలిస్తే దృష్టికి వచ్చే అంశాలు : 1) ఒక అక్షరం మరో అక్షరంగా కన్పించడం లేదా పొరపాటున భావించడం. 2) పోలికవల్లనో పొరపాటు

వల్లనో తప్పుగా అర్థం చేసుకోవడం, 3) వ్రాతలో పూర్వపదం చివరి అక్షరంతో, పరమైన పదం మొదటి అక్షరం కలిసిపోవడం. 4) అక్షరాలు పదాలు వాక్యాలు పేరాలు పుటల విభజనలో ఏదో కొంత భాగం క్రమం తప్పడం లేదా స్థానాంతరం పొందడం. 5) ఎవరైనా చెబుతూంటే మరొకరు వ్రాసేప్పుడు ఉచ్చారణలో దోషాలవల్ల, సరిగా వినకపోవడం, వినబడకపోవడం, 6) వ్రాత ప్రతిని సరిగా అనుసరించకుండా లేఖకుడు తానేదో చేర్చాలనే ఉద్దేశం కలిగి ఉండడం, 7) బాహ్య కారణాలవల్ల అక్షరాలు పదాలు కొంతభాగం మాసిపోయి లేదా వినష్టమై పోవడం ఛందస్సుకు భంగం లేకుండానే ఉన్నది మరో అక్షరంగా పదంగా కన్పించడం, అనేవి సాధారణమైనవి.

ఇవి ఇట్లా ఉంచి మరికొన్ని సందర్భాలు ఉన్నాయి. సుదీర్ఘమైన కృతిని ఒకరికంటె ఎక్కువమంది చూచి వ్రాతప్రతిని సిద్ధం చేయవలసిన అవసరం కలిగినపుడు వ్యక్తుల స్థాయిలో కొన్ని దోషాలు చోటుచేసుకునే వీలుంది. ఆయా భాగాలు మార్పుల్లో ప్రత్యేకతను కలిగి ఉంటాయి. ప్రతి లేఖకునికీ ఒక్కొక్క విధమైన మనస్థితి ఉంటుంది. లేఖనానికి సంబంధించిన అలవాట్లు ఉంటాయి. ఈ కారణంచేత ఒక్కొక్క విధమైన దోషాలు జరిగే వీలుంది. అతని అభిరుచులు ఆలోచనలు అలవాట్లు ప్రభావం నెరపుతాయి. అయితే లేఖకుల చిత్తశుద్ధి శ్రద్ధ వివేకంతో ఇందులో చాలా దోషాలు పరిహరించవచ్చు. ఇది లేఖకుల సాహిత్యస్థాయి ఒక ప్రమాణంలో ఉన్నపుడే సాధ్యం. దోషాలు లేని వ్రాతప్రతిని సిద్దం చేయడం కష్టతరమైన పనే కావచ్చు. కాని అసాధ్యం మాత్రం కాదు. కాలం స్థలం పరిస్థితులు (మూల) వ్రాతప్రతి తన సుస్థితిని కోల్పోయేట్లు చేసే వీలుంది. దీన్ని సరియైన సమయంలో తగినవిధంగా తీసుకొనే చర్యలవల్ల నివారించే వీలుంది. ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ఇటీవల శాస్త్రీయమైన దృక్పథం వల్ల తగిన చర్యలతో సుస్థితి ఏర్పడింది. ఈ దిశలో మన రాష్ట్రంలో తృప్తికరమైన వాతావరణ నిర్మితి జరగవలసి ఉంది.

### 5. గ్రంథ పరిష్కరణం – విధాలు

ఒక కృతికి సంబంధించిన వ్రాతప్రతులను ముద్రితప్రతులను సహేతుకంగా తగిన సాక్ష్యాధారాలతో వివేచనచేసి సరియైన పాఠాలను నిర్ణయించి పాఠభేదాలతో పీఠికలతో ప్రకటించడం పరిష్కరణం. ప్రామాణికంగా సరియైన పాఠాన్ని నిర్ణయించి స్థిరపరచడం ప్రధాన లక్ష్యం. ఇది అంత సులభసాధ్యం కాదు. ప్రతి వినష్టమైపోయి మారిపోయి మాసిపోయి లుప్తమైపోయి శీర్ణమైపోయి ఖండితమైపోయి ఉన్న రూపాల్ని

పూరించి సరిచేయడమనేది ఎంతో శ్రమతో వివేకంతో పాండిత్యంతో క్రమపద్ధతిలో జరుగవలసిన పని. పరిష్కరణలో నిర్ణయింపబడిన పాఠ నిర్ణయం పరిష్కర్తకే కాక అందరికీ లేదా ఎక్కువమందికామోదయోగ్యంగా ఉండాలి లేదా సహజం అనీ సముచితం అనీ బాగుంది అనీ అనిపించాలి.

**పాఠ పరిష్కరణ ప్రధానంగా రెండు విధాలు :**

1) రెసెన్షియో (Recensio) : ఇది మూల (లిఖిత) ప్రతి (కృతి)లోని పూర్వ రూపానికి చెందిన పాఠం స్థితిని తిరిగి అంటే యథాస్థితిలో నెలకొల్పేందుకు దారితీసే విధం.

2) ఎమెండేషియో (Emendatio) ఇది మూల (లిఖిత) ప్రతి (కృతి)లోని విశ్వసనీయం కాని అంశాలను తొలగించే ప్రయత్నంతో సరియైన స్థితిని పునరుద్ధరించేందుకు దారితీసే విధం.

రెసెన్షియోలో ప్రాచీనమైన మూలకృతిలో రూపాన్ని యథాస్థితిలో నిలిపే యోచనతో కృషి ఆరంభమౌతుంది. దీనికోసం సహకరించే ప్రతులను ప్రాతినిధ్యం దృష్టితో ఎన్నుకోవడం జరుగుతుంది. మొట్టమొదట రచయిత స్వయంగా వ్రాసింది లేదా దానికి సాధ్యమైనంత సమీపంగా ఉందీ, లభించిన ప్రతుల ఆధారంగా గ్రహింపబడుతుంది. రచయిత పర్యవేక్షణలో వ్రాసినవీ. ఆపైన రచయిత సమకాలీనమైనవీ సమీపంగా ఉన్నవీ మిగతావీ క్రమంగా పరిగణనలోకి వస్తాయి.

దొరికిన లిఖిత ప్రతుల్ని ఎన్నుకోవడం కూడ ఒక పద్ధతిలో జరుగుతుంది. ఇది ప్రతినిధిత్వాన్ని నెరపే విధంగా ఉంటుంది. వివిధ సాక్ష్యాధారాల పరిశీలనం తరువాత నిశ్చయరూపాన్ని పొందుతుంది. ఇదివరకు పరిష్కృతం కానివి, ఒకవేళ జరిగినా సవిమర్శకంగా నిర్దోషంగా సరియైన పాఠరూపం పొందలేదన్న భావం ఏర్పడినవీ గ్రహింపవచ్చు. విశాలమైన ప్రాతిపదికపై ఎన్నిక జరుగుతుంది.

ఈ సందర్భంలో లిఖిత ప్రతులే కాక ముద్రితాలు కూడా స్వీకార్యాలే. ఈ కార్యక్రమంలో 1) వ్రాతప్రతులను ముద్రితప్రతులను సేకరించినవి దొరికిన సమాచారంతో అన్నీ నమోదు చేయాలి. 2) వీటికి సంబంధించిన విశేష సమాచారాన్ని పరిశోధించి క్రోడీకరించాలి. 3) సాధారణాంశాలను ప్రత్యేకాంశాలను వేరువేరుగా గుర్తించి విషయాన్ని విశ్లేషించి క్రమబద్ధం చేయాలి. 4) ప్రత్యేకమైన ప్రతుల్ని వాటి ప్రత్యేకతలను సహేతుకంగా విమర్శనాత్మకమైన దృష్టితో పరిశీలించాలి. 5) కాలం స్థలం పరిస్థితుల పరిశీలనంతో

వ్రాతప్రతుల వంశవృక్షాన్ని పరిగణనలోకి తీసుకోవాలి. 6) ఇవికాక ఇంకా ఏమైనా పరిశీలించే అంశాలుంటే వాటిని పేర్కొని పరిశోధనకు గ్రహించాలి. ప్రాచీన ప్రతినుండి ఇటీవలి ముద్రితాముద్రిత ప్రతులవరకు ఏకాలంలో ఏ స్థితిలో ఏ విధంగా ఏమేమి మార్పులు చేర్పులు జరిగింది వాటికిగల కారణాలు గుర్తించి పై విశ్లేషణపై దృష్టితో యథాస్థితిని నిలిపే ప్రయత్నంతో పాఠనిర్ణయం చేసి గ్రంథపరిష్కరణ కుద్యమించడం పరిశోధకుని కర్తవ్యం.

ఎమెండేషియోలో విశ్వసనీయం కాని పాఠాన్ని తొలగించి మూలలిఖిత ప్రతిని సరియైన రూపంలో పునరుద్ధరించే ప్రయత్నం జరుగుతుంది. ఇందులో మూల లిఖిత రూపాన్ని అనేకమైన దోషాల నుండి విముక్తం చేసే ఆలోచన ముఖ్యం. ఈ చర్యలో ఒక్కొక్కపుడు వాడుకలో ఉన్న ప్రసిద్ధమైన పాఠం తొలగింపబడవచ్చు. ఇది ఎంతో సహేతుకమూ సముచితమూ ఐన విధంగానే జరుగుతుంది. కొన్ని సందర్భాల్లో ఏదో ఒక స్థితిలో ప్రవేశించిన దోషం లేదా మార్పు అదేవిధంగా అనేక కారణాలవల్ల సాగుతూ వస్తుంది. అయితే ఇది సహేతుకమైన కారణాలతో సముచితమైన నిర్ణయాలతో సమంజసమైన ఆధారాలతో తొలగింపబడాలి. దీనికారచయిత నివసించిన కాలం అతని దృక్పథం జీవితం మనస్తత్వం అప్పటి భాష సంస్కృతి, రచనా ధోరణి మొదలైన అంశాల సమగ్ర పరిశీలనం అవసరం.

## HURISTICS & HIGHER CRITICISM :

రెసెన్సియో మరియు ఎమెండేషియో కాక మరో రెండు విధాలున్నాయి. ఒకటి **హ్యూరిస్టిక్స్**. ఇందులో బహు లిఖిత ప్రతులను సంగ్రహించి వివిధ సాక్ష్యాధారాలతో వస్తుసామగ్రిని సేకరించి, విశ్లేషించి లిఖిత ప్రతుల వంశవృక్షరూపంలో పరిశోధనా ప్రణాళికను సిద్ధం చేయడం జరుగుతుంది. దీని ఆధారంగా గ్రంథపరిష్కరణ ఆరంభమౌతుంది. మరొకటి **హైయర్ క్రిటిసిజమ్**. ఇది ఎక్కువగా అత్యంత ప్రాచీన గ్రంథాలను అనువాద గ్రంథాలను పరిష్కరించడానికుపయోగపడుతుంది. ఇందులో మూల లిఖిత ప్రతిలోని రూపాల్ని ఆ తరువాత వచ్చిన ప్రతుల్లోని రూపాల్ని బాగా పరిశీలించడం జరుగుతుంది. అనువాద విషయంలో అయితే మూల భాషలోని రూపాల్ని అనువదించిన భాషలో లభించిన ప్రతుల్లోని రూపాల్ని వేరువేరుగా సహేతుకంగా విశ్లేషించి ఆలోచించడం జరుగుతుంది. తెలుగు మహాభారతం లాంటి అనువాద గ్రంథాల్లోని పాఠ పరిష్కరణకీ పద్ధతి ఎంతగానో ఉపకరిస్తుంది.

ఏవో కొన్ని భేదాలను మినహాయిస్తే పైన పేర్కొన్న పద్ధతులన్ని ఇంచుమించు ఒకే లక్ష్యం కలిగినవి. వీటిలో సాధారణాంశాలే ఎక్కువ. ఏ ఒక్క పద్ధతీ కాకుండా అన్ని పద్ధతుల్లోని విశేషాంశాలను సందర్భాన్ని అనుసరించి అవసరాని కనుగుణంగా ఉపయోగపడే విధంగా గ్రహించి వాడుకోవడంలో తప్పేమీ లేదు. పరిశోధనా వ్యాసంగం దృష్టితో ఉత్తమం కూడా.

**6. పాఠ పరిష్కరణ పద్ధతులు - ప్రయోజనాలు :**

ఒక భాష నుండి మరో భాషలోకి చేసిన అనువాద గ్రంథాలు ప్రాచీన లిఖిత ప్రతిరూపాన్ని యథాస్థితికి తీసుకొని రావడాని కుపయోగపడతాయి. ఇదేవిధంగా మూల గ్రంథాలు అనువాద గ్రంథాల్లోని పాఠాలను పరిష్కరించడానికి సహకరిస్తాయి. చారిత్రక దృక్పథంతో భాషా స్వరూపాన్ని గ్రహించడానికి వీలౌతుంది. అనువాదం జరిగిన కాలాన్ని బట్టి అనేకాంశాలు తెలుసుకొనే అవకాశం ఉంది. మూల లిఖిత కృతి ప్రాచీనతను కాలభేదం వల్ల స్థితిలో ఏర్పడిన మార్పును గమనించే అవకాశం ఉంది. ఒక్కొక్కపుడు మూలకృతి నుండి ఉల్లేఖితమైన ఛందో వ్యాకరణాలంకారగతమైన అంశాలు ఎన్నివిధాలు గానో తోడ్పడతాయి. కృతికి ప్రామాణికతను ఏర్పరచి, తృప్తిని కలిగిస్తుంది.

ఇవికాక ఇంకా మూలకృతికి జరిగిన అనుసరణలు సార సంగ్రహాలు వ్యాఖ్యానాలు వివరణలు పేర్కోదగినవి. అయితే వీటిలో అనువాదకర్తల దృక్పథాన్ని బట్టి మార్పులు చేర్పులు ఉండవచ్చు. ఈ కారణంగా పరిశోధకులెంతో జాగ్రత్తగా పరిశీలన చేసిన మీదటే నిర్ణయాలను తీసుకోవలసి ఉంటుంది. పరిశోధనా పరిధి విస్తృతమయ్యే కొద్దీ పరిశోధకుల బాధ్యత కూడా ఎక్కువే ఔతుంది.

Recensio (Recension) రెసెన్షియో (రెసెన్షన్) మరియు Eemdatio (Emendation) ఎమెండేషియో (ఎమెండేషన్) మొదలైనవాటితోపాటు ఎడ్గర్టన్ (Edgerton) ప్రవేశపెట్టిన పద్ధతీ బాగా వ్యాప్తిలో ఉంది.

## ఎడ్గర్టన్ పద్ధతి :

ఈ పద్ధతిలో ముందుగా లిఖిత ప్రతుల్ని సంపాదించి వాటి ప్రత్యేకతల్ని అనుసరించి విభజించి ఒక్కొక్కదాని విశిష్టతనుబట్టి ఆయా ప్రత్యేక లక్షణాలకు ప్రాతినిధ్యంగా కొన్ని లిఖిత ప్రతుల్ని ఎన్నుకోవడం జరుగుతుంది. ముద్రితప్రతుల విషయంలోను ఇదే విధానం అనుసరింపబడుతుంది. వీటువెంట వీటికి సంబంధించిన

సమాచారం సమగ్రంగా సేకరించి నమోదు చేయడమౌతుంది. ఒక్కొక్క ప్రతి పుట్టుపూర్వోత్తరాలు మొదలుకొని ప్రస్తుతం దొరికినప్పటి స్థితి దాకా ఈ సమాచారం పర్యాప్తమై ఉంటుంది. ఇది ప్రతుల చరిత్రను మూల లిఖిత ప్రతి చరిత్రతో ఆ తరువాత వచ్చినవి, వివిధ దశల్లో రూపొందించిన వాటి చరిత్రలో గల అనుబంధాన్ని స్థాపించేందుకెంతగానో సహాయపడుతుంది.

ప్రతి దొరికిన స్థలం, వ్రాయబడిన కాలం, వ్రాసినవారు, వ్రాయించినవారు, వ్రాయబడిన వస్తువు, సాధనాలు ప్రస్తుతం ఉన్న స్థితీ మొదలుగా భౌతిక చారిత్రకమైన అంశాలతో సమాచారాన్ని గ్రంథ పరిష్కరణకు తోడ్పడేందుకు భూమికగా విషయ విశ్లేషణం చేయబడుతుంది. ప్రాతినిధ్య దృష్టితో ఎన్నుకొన్న ప్రతుల్ని ఒకచోట సమీకరించి అన్నిటిని పోల్చిచూచి పరిశీలన చేసే ప్రయత్నం మొదలౌతుంది. అన్ని ప్రతుల్లో ప్రధానమైందిగా భావించిన ప్రతిలోని పాఠరూపాల క్రింద వరుసగా ఎన్నుకొన్న ప్రతుల్లోని పాఠభేదాలు ఉల్లేఖితమౌతాయి. దీనికై ముందుగా ఎన్నుకొన్న ప్రతుల్లోని పద్యాలను వచన వాక్యాలను సాధ్యమైనంత తక్కువ విభాగాలు (యూనిట్స్)గా విభజించడం జరుగుతుంది. ఒక అక్షరానికొక గడి ఉండే విధంగా ప్రత్యేకంగా అవసరమైన విధంగా షీట్సును సిద్ధంచేసి వాటినీ పరిశోధనకుపయోగించడమవుతుంది. ఈ పద్ధతిలో ఒక పాఠం క్రింద మరో పాఠం వరసగా వ్రాయబడి ఒక్కొక్క విభాగాన్ని తీసుకొని క్రింది విభాగాలతో సరిపోల్చి భేదాలను గుర్తించి, కారణాల నన్వేషించి హేతుయుతమైన నిర్ణయాలు తీసుకోవడంతో పాఠ పరిష్కరణం జరుగుతుంది.

ఈ విధంగా సరిచూచి (కొలేట్) చేసి ఎన్నుకొనే పద్ధతివల్ల లిఖిత ప్రతుల చారిత్రకమైన స్థితిగతులు, వంశానుగతమైన విశేషాంశాలు తదితర ప్రత్యేకతలు సులభంగా గుర్తించడానికి వీలౌతుంది. వివిధ ప్రతుల్లోని పాఠభేదాలు దృష్టికి వచ్చి తీరతాయి. పాఠ పరిశీలనం సులభతరమౌతుంది. ఆ తరువాత దీనిపై జరిగే పరిశోధనకు మౌలికమైన వస్తురూపమూ ఏర్పడుతుంది. ఈ దిశలో పరిశోధన ఒకసారి జరిగింది, మళ్ళీ జరిగేందుకు వీలుండదు. అక్షరం మొదలు పదం సమాసం పద్యపాదంతో భావాత్మకమైన విభాగ గుణంతో అంతర్గతమైన భాష ఛందస్సు శైలి వివేచనంతో గ్రంథ పరిష్కరణం జరుగుతుంది. ఈ పద్ధతి బాగా వ్యాప్తిలోను ఉంది. సాహిత్య ఎకాడమి పక్షాన ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారి ప్రధాన సంపాదకత్వంలో పోతన ఆంధ్రమహాభాగవత పరిష్కరణం ఈ పద్ధతిలోనే జరిగింది. సందర్భాన్నిబట్టి అన్ని పద్ధతుల్లోని అవసరమైన లక్షణాలను గ్రహించి పరిష్కరణ చేయడమే ఉత్తమం.

## 7. సంపాదకులకు సామాన్య సూత్రాలు

గ్రంథ పరిష్కరణ సశాస్త్రీయంగా నిర్వహించేందుకు పరిశోధకులు ముఖ్యంగా సంపాదకులు కొన్ని సామాన్య సూత్రాలు గమనించవలసిన అవసరం ఉంది.

1. మొట్టమొదట చేయవలసిన పని ; పరిష్కరించే గ్రంథానికి సంబంధించిన వ్రాతప్రతుల్ని ముద్రితప్రతుల్ని సేకరించి వాటి ప్రత్యేకతల్ని గుర్తించాలి. ఉమ్మడి అంశాలను పేర్కొనాలి. వీటికి ప్రాతినిధ్యం వహించే విధంగా ఒక్కొక్కటి చొప్పున మరీ ముఖ్యమైతే రెండు మూడు చొప్పున ఎన్నుకోవాలి.
2. వీటి ఎన్నిక ఒక పద్ధతిలో జరగాలి. వివిధ సంప్రదాయాలకు వివిధ ప్రాంతాలకు వివిధ కాలాలకు చెందినవి శాస్త్రీయ దృష్టితో వేరువేరుగా విభజించి - వీటికి సరియైన ప్రాతినిధ్యం వహించే విధంగా ఉండాలి.
3. ఎన్నుకున్న ప్రతుల్ని విస్తృతంగా అధ్యయనం చేసి వాటి విశిష్టతను ప్రత్యేకతలను గుర్తించాలి, నమోదు చేయాలి.
4. వీటి పూర్వ చరిత్రను పరిశోధించి అంతర్ బహిర్ సాక్ష్యాధారాలతో వీటి ప్రామాణికతను నిర్ధారణచేసి విశ్వసనీయతను స్థిరపరచాలి.
5. ఇంతకుముందు పేర్కొన్న గ్రంథ పరిష్కరణ పద్ధతి నవలంబించి అవసరమైన వివిధ పద్ధతుల్ని ఉపయోగించుకుంటూ ఒక నిర్దిష్ట ప్రణాళికననుసరించి గ్రంథ పరిష్కరణ పరిశోధన కుపక్రమించే శాస్త్రీయమైన మార్గాన్ని ప్లాన్ చేసుకోవాలి.
6. పరిశీలన విమర్శ వివేచన నిర్ణయం అనేవి ఈ విధమైన పరిశోధనలో అవలంబించే స్థితిక్రమం. ఇది శాస్త్రీయ విధానంలో భాగం. ఒక్కొక్కపుడు ఒకచోట స్థిరంగా ఉండి పని చేసేందుకు వీలు కాదు. అవసరమైన ప్రతుల కోసం సమాచారం కోసం ఎన్నో ప్రాంతాలు సందర్శించవలసి ఉంటుంది. ఎందరో వ్యక్తుల్ని కలిసి సంప్రదించవలసి ఉంటుంది. ఇది ఎంతో శ్రమతోగాని ఒక్కొక్కపుడు మార్గం దొరకదు. పరిశోధకుణ్ణి పరీక్షకు నిలుపుతుంది కూడా. పరిశోధకులకు ఓర్పు తత్పరత శ్రమించేగుణం అవసరం.

## 8. నిర్ణయ మార్గాలు

ఈ పరంపరలో తరువాత దశ మూల లిఖిత ప్రతి విమర్శకు సంబంధించింది. నిర్ణయ మార్గాన్ని నిర్దేశించేది.

1. పరిష్కరణకు యోగ్యమైన పాఠం గురించి అవశ్యకమైందీ సముచితమైంది గుర్తించి ఏయే ప్రతుల్లో ఉందీ లేందీ.
2. సంప్రదాయ సహజంగా వచ్చేదీ లేందీ అంతరాయం ఎట్లా కలిగిందీ ఏ విధంగా జరిగిందీ.
3. తాను ఎన్ను కుంది అర్థవంతంగా ఉందీ లేందీ.
4. పునరుక్తి ఉందీ లేందీ.
5. వ్యాకరణ సమ్మతమైందీ కాందీ
6. రచయిత సహజమైన వ్యక్తిత్వాని కనుగుణంగా ఉందీ లేందీ.
7. రచనా శైలి కనుగుణంగా ఉందీ లేందీ.
8. కృతి నిర్మాణంలో సరిపోయిందీ లేందీ.
9. ఛందస్సు నియమాల కనుగుణంగా ఉందీ లేందీ.
10. మార్పు జరిగిన కాలం? ఏ స్థితిలో జరిగిందీ ఎల్లా జరిగిందీ?

మొదలైన అంశాలను గురించి ఎంతో సవిమర్శకంగా పరిశోధన జరుపవలసిఉంది. కొన్ని పాఠాలు ప్రచారంలో ఉన్నవి దోషభూయిష్ఠంగానూ ఉండవచ్చు. ఇవి ఎక్కువ ప్రతుల్లోనూ కన్పించవచ్చు. తక్కువ ప్రతుల్లో ఉంది, దోషరహితమైంది సమంజసమైంది కావచ్చు. ఎక్కువ ప్రచారంలో లేకపోవచ్చు ఈ స్థితిలో రచయిత అవలంబించిన భాష మొదలైన అధారాలతో లభ్యమైన పాఠభేదాన్ని సరిపోల్చి సహేతుకమైన చర్చతో భేదాన్ని గుర్తించాలి. పైన పేర్కొన్న పరిశోధన పద్ధతిలో పరీక్షకు నిలిచి బయట పడిన పాఠం స్వీకార్యమౌతుంది. ఏ పాఠాన్ని ప్రధాన భాగంలో ఉంచేదీ దేన్ని బ్రాకెట్‌లో నిలిపేదీ, దేనికి అధోజ్ఞాపికల్లో చోటు కల్పించేదీ నిర్ణయం చేయవలసి ఉంటుంది. దీనికై అవలంబించిన వివిధ చర్యల్ని క్రమంగా పీఠికలో స్పష్టీకరించడం అవసరం.

## 9. పరిష్కర్త సమస్యలు

గ్రంథ పరిష్కరణలో పరిష్కర్త ఎదుర్కొనే సమస్యలు నాలుగు విధాలు. 1) అంగీకరించడం 2) సంశయం పొందడం 3) నిరాకరించడం 4) మార్పులు చేయడం వీటిని సంతృప్తికరంగా అధిగమించడంలో పరిశోధకుని శక్తి సామర్థ్యాలు ప్రస్ఫుటమౌతాయి. ఏమైనప్పటికీ ఏ పూర్వ పరిష్కరణపై ఆధారపడకుండా పరిశోధకుడు తన పరిశోధనా పర్యవసానంగా అన్ని పరీక్షలకు నిలిచి సమంజసం అనిపించిన పాఠాన్నే ప్రధాన భాగంలో ఉంచాలి. ప్రధాన భాగంలో నిలిపిన పాఠంతో ఇంచుమించు సమానమైన

పాఠం దాని పక్కనే బ్రాకెట్‌లో ఉంచవచ్చు. లేదా క్రింద అధోజ్ఞాపికలో చేర్చవచ్చు. మిగతావి అంటే అన్నీ కాక సంతృప్తికరంగా ఉన్నవీ సమీపంగా ఉన్నవీ అధోజ్ఞాపికల్లో నిలపాలి.

ఈ సందర్భంలో, సంబంధించిన ప్రతిని గుర్తించేందుకు గుర్తులు ఉపయోగించవచ్చు. గుర్తులు యథేచ్ఛగా ఉపయోగించరాదు, ఏదో ఒక పద్ధతి నవలంబించాలి. వివిధ ప్రదేశాలకు సంబంధించినవి ఆ ప్రదేశం పేరులోని మొదటి అక్షరంలో అక్షరక్రమంలో ఉండాలి. ఆ పేరు సంగ్రహరూపం వాడుకోవచ్చు. అదే విధంగా పలు గ్రంథాలయాలకు భిన్న సంప్రదాయాలకు సంబంధించినవి కూడా. ఇక సంఖ్యాక్రమానికి వస్తే ఎక్కువ అంగీకారయోగ్యమైన ప్రతి నుండి మొదలు పెట్టడం ఒక పద్ధతి. లేదా మరో పద్ధతి అప్పటి పరిశోధనావసరాల దృష్ట్యా అవలంబించవచ్చు.

తప్పు పాఠం ఎప్పుడో పూర్వకాలంలోనే ఏర్పడి అదే పరంపరగా వస్తూంటే దీన్ని సరిచేయడం సాధారణమైన పనికాదు. మూల కృతి రచనా కాలం అప్పటి బాషా స్వరూపం రచయిత రచనా పద్ధతి శైలి చారిత్రక సాంస్కృతికి రీతులు రచయిత వ్యక్తిత్వం మొదలైనవి ఎంతో జాగ్రత్తగా పరిశీలించాలి. ఆ తప్పు పాఠం ఏ కాలంలో ఏ విధంగా చోటు చేసుకుందో అన్వేషణకుపక్రమించాలి. ఇది వివిధ పద్ధతుల్ని ఉపయోగించి సశాస్త్రీయంగా సుప్రసిద్ధ పరిశోధకులు శ్రీ సుక్తాంకర్‌చే పరిష్కృతమైన సంస్కృత మహాభారతంలో మొత్తం ఎనిమిది వేల శ్లోకాలుగల ఆదిపర్వంలో ఇటువంటివి ముప్పైఆరు పాఠాలకు ఎమెండేషన్ పద్ధతిలో పరిశోధన చేసి మార్పులు చేయడం జరిగింది. ఆ తరువాత కొంత కాలానికి నేపాల్‌కు చెందిన బహు పురాతనమైన ప్రతి ఒకటి దొరికింది, దీనిలో పాఠ రూపాలు శ్రీ సుక్తాంకర్ చేసిన మార్పులతో సరిపోవడం విశేషం. ఇది ఆయన నిశితమైన శాస్త్రీయమైన పరిశోధనా శక్తికి నిదర్శనం.

ఒక్కొక్కపుడు వ్రాతప్రతిలో సరియైన అర్థం కుదరని పాఠం మార్చవలసి వస్తుంది. ఈ స్థితిలో వివిధ సాక్ష్యాధారాలపై ఉహాత్మకమైన (హైపోతెటికల్) రూపాన్ని ఇవ్వవలసి వస్తుంది. పరిష్కర్త సశాస్త్రీయంగా వస్తుగతమైన దృష్టితో నిర్ణయంచేసినవి సరియైనవిగా పర్యవసితంకావడం జరుగుతుంది లేదా అత్యంత సమీపంగానో వర్తించే విధంగానూ ఉంటాయి. సరియైన పాఠ నిర్ణయాలతో లిఖిత ప్రతి ప్రాచీన రూపాన్ని సాధించి సుస్థితి కల్పించడమే మూల లిఖిత కృతి ప్రతి విమర్శ (Textual Criticism) పరిశోధనా బాధ్యతల నిర్వహణంలో పరిష్కర్తపొందే ఆనందం అనితరమైంది.

## 10. పీఠిక - అనుబంధం - ముద్రణం

పరిష్కృత గ్రంథం పీఠిక విషయానికి వస్తే ఇది ఇతర గ్రంథాలకు వ్రాసే పీఠిక వంటిదికాదు. ఇది ఎంతో సమాచారంతో సంపన్నమై ఉంటుంది. ప్రతీ కృతి వ్రాత ప్రతిని గురించి సమాచారంలో దొరికిన స్థలం గ్రంథాలయం లేదా వ్యక్తివద్ద గ్రంథమున్న స్థితీ, వ్రాయబడిన వస్తువు, దాని స్వరూపం, చేతి వ్రాత పద్ధతి, లిపి స్వరూపం, లేఖకుని గురించి, పోషకుడు లేదా ప్రేరకుని గురించి, తదితరమైన బాహ్యా స్వరూపం గురించి సమస్తం నమోదు చేయాలి. వ్రాత లేదా ముద్రితప్రతుల సంపాదనం మొదలుకొని పరిష్కరించిన తీరు యాధా తథంగా పేర్కొవాలి. వీటితో పాటు ఫోటో కాపీలు మైక్రోఫిల్ములు మొదలైన అధునిక సాధనాలతో భద్రపరచవలసినవి భద్రపరిచిన విధం అప్పటి పరిష్కరణకు సేకరించిన వస్తు రూపాల్ని విశ్వసనీయతతో సహేతుకంగా వివరించాలి.

దీనితో పాటు రచయిత గురించి పరిశీలించాలి. తాను పరిష్కరించే కృతికి చెందిన పరంపర మరియు మూల సమాచారం మొదలుకొని చారిత్రక ప్రాధాన్యం గల అంశాలను వివరించాలి. మూల కృతిపై వెలువడిన వ్యాఖ్యానాలు వివరణలు మొదలైనవి సాహిత్య చరిత్ర కుపకరించేవి పొందు పరచాలి. ఇందులో ఏ లోపమూ జరగకూడదు. ఈ సందర్భంలో, తాను పరిష్కరించిన పండరినాథ రామాయణ మహాకావ్యానికి శ్రీ మోతుకూరి హనుమంతరావుగారు వ్రాసిన పీఠిక ఉదాహరణీయమైంది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ పక్షాన పరిష్కృతమైన ఆంధ్రమహాభారతానికి ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనంగారు, ఆచార్య దివాకర్ల వేంకటావధానిగారు వ్రాసిన పీఠికలు ఉల్లేఖనీయాలు, ఎంతో విలువైనవి.

ఈ విధమైన విషయ సేకరణం, వివరణం, అన్వేషణం, ఎన్నిక ఆ తరువాత ఈ దిశలో జరిగే పరిశోధనకు మార్గదర్శకంగానే కాక ప్రాథమిక విషయ సేకరణంతో పాటు సాధారణ పరిజ్ఞానం విషయంలో కాలం వృథా కాకుండా శ్రమ పునరావృతం కాకుండా ఉంటుంది. ఇంతకన్న ఉన్నతమైన విషయాలపై విశేషమైన అంశాలపై దృష్టిపడని భాగాలపై లభ్యంకాని సమాచారంపై పరిశోధనను కేంద్రీకరించేందుకు మంచి అవకాశం ఉంటుంది.

ఒక అనుబంధం గురించి ముఖ్యమైన పదాలను లిఖిత లేదా ముద్రితమైన కృతి విశేషాలను రచయిత వ్రాసిన ముద్రితాముద్రిత కృతులకు చారిత్రక భౌతిక విశేష సమాచారాల కవసరమైన చిత్రాలను అక్షర క్రమంలో పట్టికలను జతపరచాలి. భండార్కర్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారు పరిష్కరించి ప్రకటించిన సంస్కృత మహాభారతం ఈ దిశలో ఆదర్శ పరిశోధనా రూపంగా నిలిచింది.

వీరి కృషి భారత దేశంలోని బహుముఖీనమైన సంస్కృతి సంప్రదాయాలు వివిధ భాషా భేదాలు భౌగోళిక సామాజిక స్థితులు బాగా అధ్యయనం చేసి సిద్ధం చేసిన విధానంతో ఉన్నతమైన ప్రమాణాలతో అంతర్జాతీయమైన ఖ్యాతిని పొందింది.

స్థానికమైన అవసరాల దృష్ట్యా ప్రాంతీయభాషల్లో దీన్ని అనుసరించేప్పుడు కొన్ని మార్పులు అవసమరమౌతాయి. ఇది తప్పదు, ఈ పద్ధతిలోనే అంటే స్వల్పమైన మార్పులకు వీలుతో టెక్స్ట్యువల్ క్రిటిసిజమ్ (Textual Criticism) ఈనాడు పరిశోధనా రంగంలో ప్రత్యేకమైన విభాగంగా గుర్తింపబడింది దీని కెంతో కొంత శిక్షణ అవసరం. ఏ శిక్షణ ఏ అవగాహన లేకుండా లిఖిత ప్రతిని ఎవరిచేతనో తిరుగవ్రాయించి యధాతథంగా ముద్రించడం జరుగుతూంది. పరిశోధనా ప్రమాణాల దృష్ట్యా ఇది మంచి పద్ధతి కాదు. మంచి శిక్షణలో ఉత్తమ ప్రమాణాల కనుగుణంగా పరిష్కృతమైన గ్రంథం సాహిత్య ప్రపంచానికి అమూల్యమైన సంపదే.

సరియైన అవకాశాలు లేని సాధన సంపత్తి లేని కాలంలోకన్నా ఈనాడు ఎన్నో విధాలుగా పరిశోధనకు సుముఖంగా ఉన్న వాతావరణంలో పరిష్కరణకు సంబంధించిన పరిశోధన అవశ్యంగా ఉన్నత ప్రమాణాల్లో ఆశించడం న్యాయం. టెక్స్ట్యువల్ క్రిటిసిజమ్ (Textual Criticism)లో పరిష్కర్తతో పాటు పరిశోధనాభిమానులూ పొందే మానసిక వికాసం ఆనందం అమేయమైంది.

సాహిత్య సమాలోచనం Literary Criticism - 18 & 19

# అధికార భాష అనువాద కళ

మాదిరాజు రంగారావు

**2026**

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్–28.

Literary Criticism - 18 & 19

# ADHIKARA BHASHA ANUVADA KALA

(Sahithya Samalochanam)

by
Prof. Madiraju Ranga Rao

© : Dr. M. Santhosh Kumar

First Edition : 1994
Second Edition : 2003
Third Edition : 2026

# అంకితం

సంప్రదాయ మూలాలకూ ప్రగతి శక్తులకూ మధ్య
సమన్వయాన్ని కోరే సాహితీమూర్తి
**శ్రీ కేతవరపు రామకోటిశాస్త్రిగారికి**

# సూచిక

## అధికారభాష


| | | | |
|---|---|---|---|
| 1. | అధికార భాష : తెలుగు | .......... | 167 |
| 2. | తెలుగులో సాధారణ పాలన | .......... | 171 |
| 3. | తెలుగులో న్యాయపాలన | .......... | 175 |
| 4. | విద్యా మాధ్యమం - తెలుగు | .......... | 179 |


## అనువాద కళ


| | | | |
|---|---|---|---|
| 1. | అనువాద స్వరూపం | .......... | 185 |
| 2. | అనువాద విధాలు | .......... | 187 |
| 3. | కవిత్వాను వాదం - అనుసృజన | .......... | 188 |
| 4. | నాటకానువాదం | .......... | 191 |
| 5. | అనువాద పద్ధతులు | .......... | 193 |
| 6. | అనువాద సమస్యలు - పరిభాష | .......... | 198 |
| 7. | అనువాదకుని బాధ్యతలు | .......... | 203 |
| 8. | అనువాద ప్రయోజనం | .......... | 205 |

# అధికార భాష

## 1. అధికార భాష - తెలుగు

చరిత్రలో తెలుగును గురించి దొరికిన అధారాన్ని బట్టి పూర్వం నుండి (క్రీ.శ. ఆరో శతాబ్ది నుండి) భారతదేశ స్వాతంత్ర్యానంతరం భాషాశాస్త్ర నిర్మాణదశ వరకూ, రాజభాషగా ప్రవర్తిల్లినట్లు కన్పించదు. అయితే అప్పుడపుడూ చేసిన సూచనలో తీసుకున్న చర్యలూ ఆపైన అనుకూల స్థితుల్ని కల్పించేందుకు సహాయపడినట్లు కన్పిస్తుంది. చరిత్రలో వివిధ కాలాల్లో రాజవంశాల రాజ్యాల్లో సంస్థానాల్లో చాల పరిమితంగా వాడుకలో ఉన్నట్లు గమనించవచ్చు. పాలనా వ్యవహారాల్లో స్థానికమైన అవసరాల సందర్భాల్లో మాత్రమే ఉపయుక్తమైంది. కాలం గడిచేకొద్దీ తెలుగు సాహిత్య భాషగా ఆదరణను పొందింది. కాని పాలనా భాషగా మాత్రం మౌఖిక రూపంలో పరిమితమైన పరిధిలో ప్రచలితమైంది. చారిత్రకాధారాల్నిబట్టి చూస్తే క్రీ.శ. 6,7 శతాబ్దాల నుండి లిఖిత రూపం పొందిన సూచనలున్నాయి. రేనాటి చోళుల కాలం ఈ స్థితికారంభ దశగా ఉంది. ఈ రాజుల కాలంలో తెలుగు భాషలో ఆదేశాలు వెలువడినాయి. వీటికి సంబంధించిన ఆధారాలు శాసనాల్లో లభిస్తాయి. ఈ కాలంలోని శాసనాల్లో వ్రాయబడిన వచనం పరిశోధకులకెంతో సమాచారాన్ని అందించింది. వచనంలో ఉన్న ఈ శాసనభాష చాలా ప్రాచీనమైంది. క్రీ.శ. ఆరు, ఏడు శతాబ్దాల్లో రేనాటి చోళుల కాలంలో అధికార భాషగా తెలుగు మన అన్వేషణ కందుతుంది. ఈ రాజుల కాలంలో వెలువడిన శాసనాల్లో ఆదేశాలు తెలుగు భాషలో కన్పిస్తాయి. శాసనాల్లో వచనం పరిశోధకుల్ని ఉత్సాహపరుస్తుంది. ఈ భాష చాలా ప్రాచీనమైంది. ఇప్పటికీ పరిశోధకులెంత కృషి సలిపినా శాసన భాష పూర్తిగా అర్థంకాని స్థితిలో ఉంది. దీన్ని అతి ప్రాచీనమైన తెలుగు భాషగా పరిగణించడమైంది. రేనాటి చోళుల రాజ్యమంటే ఈనాటి చిత్తూరు కడప జిల్లాలతోకూడిన ప్రదేశాలతో ఏర్పడింది. ఇవి ఆ రాజ్యంలోవే. చాళుక్యుల కాలంలో భాషలో సంస్కరింపబడిన అభివృద్ధి దశ కన్పిస్తుంది. "తెలుంగు నిలిపి రంధ్ర విషయంబున జన సత్యాశ్రయుని దొట్టి చాళుక్య నృపుల్" అన్నమాట భాషా విషయకంగా అనేక చారిత్రక వాస్తవాల్ని సూచిస్తుంది. నన్నెచోడుని మాటల్లో ఆ కాలంలో చాళుక్య రాజుల ప్రోత్సాహంతో విద్యా సంబంధమైన పాలనాపరమైన స్థితుల్లో తెలుగు భాష పొందిన సుస్థితినీ గౌరవ దశనూ భావింపజేస్తుంది. ఈ సందర్భంలో 1) చాళుక్య భీముని కొరవి శాసనం (క్రీ.శ.892-921), 2) మిరియాల కామసాని గూడూరు శాసనం (క్రీ.శ.1000) గుర్తుకు వస్తాయి.

తూర్పు చాళుక్య రాజుల కాలంలో తెలుగు భాషకు సాహిత్యానికీ ఆదరణ లభించింది. వ్యాప్తిని పొందింది. అభివృద్ధి ముఖాన్నిసంతరించుకుంది. విద్యా విషయాల్లో రాజ్య వ్యవహారాల్లో ఒక స్థాయిలో ప్రయోజనాత్మకమైన స్వరూపాన్ని అవలంబించింది. తరువాత వచ్చిన కాకతీయ రెడ్డి వెలమ రాజుల (క్రీ.శ.1100-1447) కాలంలోను విజయనగరం మరియు తంజావూరు రాజుల (క్రీ.శ.1336-1642-1750) కాలంలోను తెలుగులో సంస్కృతంలో శాసనాలు కన్పిస్తాయి. సంస్కృతభాష ప్రక్కనే తెలుగు భాషకూ ప్రాధాన్యం లభించింది. ఈ రాజుల కాలంలో రాజ్యపాలనా వ్యవహారాలు తెలుగులో నిర్వర్తింప బడినట్లు భావింపవచ్చు. రాజ్యపాలనలో అవసరమైన ముఖ్యాంశాలు ప్రజలకు తెలియడం అవసరంగా భావితం కావడం విశేషం. ఈ కారణంగా ప్రజల భాషయైన తెలుగుకు ప్రాధాన్యం, ప్రశస్తి లభించాయి. కేతన రచించిన 'విజ్ఞానేశ్వరీయం' ఆ కాలంలో ప్రజలకు ధర్మశాస్త్రం అవసరాన్ని తీర్చింది. ఇది ఆనాడు న్యాయస్థానాల్లో పాలనా వ్యవహారాల్లో దీని ఉపయోగాన్ని తలపిస్తుంది. విజయనగరం తంజావూరు రాజుల కాలంలో తెలుగు సంస్కృత భాషలతోపాటు తమిళం కన్నడం కూఢా ఉపయుక్తమైనాయి. వివిధ భాషలు మాట్లాడే ప్రజల సౌకర్యంతోపాటు వివిధ భాషలపట్ల ఆదరభావంతో విశాల దృక్పథంతో కూడిన సాంస్కృతిక సమైక్య వ్యక్తిత్వాన్ని కూడ తలపిస్తుంది. తెలుగు భాషా విషయానికి వస్తే సాధారణ పాలనలో దీని ప్రవేశం అధికమైనట్లు కన్పిస్తుంది. పాలనా యంత్రాంగం విస్తరిల్లడం ప్రజల ప్రమేయం ఎక్కువ అవడం దీనికి కారణం. ఈ విధానం ఈ రాజుల కాలంలో చక్కని పాలనా వ్యవస్థకు నిదర్శనంగా ఉంది. కైఫియత్‌లు వెలువడినాయి. కైఫియత్ అంటే రాజ్యంలో వివిధ స్థలాలకూ భిన్న సంఘటనలకూ సంబంధించిన స్థానికమైన వివరాలన్నమాట. ఇవి తెలుగులో ఉండడం విశేషం. ఇవి పాలనా నిర్వహణంలో తెలుగు భాష పొందిన సముచిత స్థానాన్ని తెలియజేస్తున్నాయి. ఈ కాలంలో వివిధ కార్యకలాపాల్లో ప్రజల భాషయైన తెలుగు వాడుకలోకి వచ్చింది. పాలనా సంబంధమైన తెలుగు పదాలు రూపొందాయి, స్థిరపడినాయి. ఉదాహరణకు రాయసం అంటే రాజ్యంలో ఆదేశాలు వ్రాసే అధికారి. సుంకరులు అంటే సుంకం వసూలు చేసేవారు. రాజభాషగా తెలుగు తన అస్తిత్వాన్ని మలచుకోవడం ఆరంభమైంది.

మరో దిశ నుండి, మహమ్మదీయుల పరిపాలనలో స్థానికులైన ప్రజల భాషయైన తెలుగు ఆదరణ పొందడం గమనించదగింది. ముఖ్యంగా గోలకొండ కుతుబ్‌షాహీల కాలం (క్రీ.శ.1512-1687)లో అధికార భాష పర్షియన్. దీనితోపాటు అరబీ మరియు ఉర్దు భాషలకు ప్రాధాన్యం ఉంది. అయితే తెలుగు భాషకు కూడ ఆదరణ లభించింది. పాలన ప్రజలకు సన్నిహితమయ్యే ప్రయత్నంలో భాగంగా సామరస్యపూర్వకమైన రాజనీతి

కారణంగా ఇది జరిగింది. తెలుగు సాహిత్యానికీ తెలుగులో పాలనా వ్యవహార రూపానికీ మన్నన చేకూరింది. తెలుగులో అధికార భాషా స్థితిలో ఇదొక మలుపుగా పేర్కోవచ్చు.

భారతదేశంలో క్రీ.శ. 1830లో ఇంగ్లీషు పరిపాలనా భాషగా విద్యాబోధనా భాషగా ప్రవేశించింది. ఈ విధానంతో పెద్ద మార్పు వచ్చింది. జాతి జీవన పద్ధతిలో సంస్కృతీ రూపంలో పరివర్తన చోటుచేసుకుంది. సాధారణ పాలన న్యాయపాలన విద్యాబోధన మొదలుగా నూటయాభై సంవత్సరాలు దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి కొత్త రాజ్యాంగం అవతరించేవరకు సాగింది. ఇంగ్లీషు భాష ప్రపంచ దేశాలతో సన్నిహిత సంబంధాలకు దారితీసింది. భారతదేశంలో వివిధ రాష్ట్రాల మధ్య సదవగాహనకూ సమైక్యతకూ తోడ్పడింది. ఇది పూర్వం సంస్కృత భాష చేసిన గొప్ప పనిని మరో విధంగా నిర్వహించింది. దేశంలో వివిధ భాషలపై సాహిత్యంపై సామాజిక రాజకీయ క్షేత్రాలపై సంస్కృతిపై అనితర ప్రభావాన్ని నెరపింది. అధికార భాషయైన ఇంగ్లీషు చక్కని పాలనా వ్యవస్థకు దారితీయడమే కాక క్రమంగా ఆధునిక చేతనమే దిక్సూచియైంది. అయితే తెలుగు భాష క్రింది స్థాయిలో పూర్వం వలెనే తన పాత్రను నిర్వహించింది. సామాన్య ప్రజల కార్యకలాపాల్లో వ్యవహారాల్లో సాధారణ స్థాయిలో ఇంగ్లీషు ప్రవేశించని లేదా అవసరం లేని స్థితుల్లో పరిమిత క్షేత్రాల్లో తెలుగు అధికార భాషగా గుర్తింపబడక పోయినా ప్రజలకు ప్రయోజనాత్మకమైన రూపంలో ఉంది.

భారత దేశ స్వాతంత్ర్యోద్యమంతోపాటు ఆయా ప్రాంతాల్లో భారతీయ భాషల వికాసంపై శ్రద్ధ కలిగింది. ప్రజలు ఆయా భాషల వ్యక్తిత్వాలకై ఆరాట పడసాగారు. ఈ కాలంలో దీనికి భాషా రాష్ట్రాలొక్కటే శరణ్యమన్న అభిప్రాయమూ ప్రబలింది. రాష్ట్ర నాయకులతోపాటు దేశ నాయకులు దీన్ని మన్నించారు. స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజల ప్రమేయంతో భాషా ప్రయోజనం విస్తృతమయ్యే కొద్దీ తెలుగు భాష వాడుక పెరిగింది. భాషా రాష్ట్రాల అవతరణంతో ఆంధ్రరాష్ట్రంలో తెలుగు బాష తన ప్రయోజనాత్మకమైన పాత్ర పటిష్ఠంగా నిర్వహించడం మొదలైంది. పాలక వ్యవస్థ వ్యవహరించే భాషను పూర్వం రాజుల కాలంలో రాజభాషగా స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్యంలో అధికారభాషగాను పేర్కొనబడింది. దీనికై రాజ్యాంగంలో ప్రత్యేకంగా శాసనరూపమూ కల్పితమైంది. ప్రత్యేక ప్రతిపత్తి లభించింది. రాష్ట్రంలో భాష ముఖ్యంగా 1) శాసన, 2) సాధారణ పాలన, 3) న్యాయపాలన, 4) విద్యా మాధ్యమ పరంగా అధికార ముద్రను పొందవలసి ఉంది. దీనికి అంటే ఇది విజయవంతం కావడానికి తగిన సాధన సంపత్తిని కూడా చేకూర్చవలసి ఉంటుంది.

తెలుగు భాష నిర్వర్తించే ప్రయోజనాత్మకమైన పాత్ర స్వరూపం ముఖ్యంగా అధికార భాషగా దేశ చరిత్రతో ముడిపడింది. చరిత్రలో వివిధ దశల్లో దీని అస్తిత్వ సూచనలు కన్పిస్తున్నాయి. కాని స్పష్టమైన నిర్దిష్టమైన స్వరూపాన్ని పొందలేదు. ఇది దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక, ఆంధ్రరాష్ట్రం ఆ తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాతనే ఎంతో కొంత సాధ్యమైంది. స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే జాతీయోద్యమంతో పాటు ప్రాంతీయ భాషా సంస్కృతుల వికాసానికీ ప్రాముఖ్యం హెచ్చింది. ప్రాంతీయ భాషల అభివృద్ధి భారతదేశ సమైక్యతకూ సమైక్యరూపానికీ భంగం కాదన్న వాస్తవమూ గుర్తింపబడింది. భారత రాజ్యాంగం అమలులోకి రావడంతో ఆయా ప్రాంతీయ భాషల వ్యక్తిత్వం పునర్నిర్మితమై కొత్త యుగం ఆరంభమైంది.

ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణంలో శాసన పాలన న్యాయ విద్య మొదలైన వ్యవహారాల్లో అధికార స్థాయిలో ఉపయోగించే భాష అధికార భాష. ప్రజాస్వామ్యంలో ప్రాంతీయ భాషలకీ అవకాశం రావడం అనివార్యమైంది. ప్రజల భాషలో ప్రభుత్వ కార్యకలాపాలు జరపడంవల్ల ప్రజలకూ ప్రభుత్వానికీ మధ్య సన్నిహిత సంబంధాలేర్పడతాయి. ప్రజల్లో జాగరూకత పెరుగుతుంది. అభిలాష ఇనుమడిస్తుంది. ఉత్సాహం అధికమవుతుంది. అన్నిటికన్నా భాగస్వామ్య భావన ఏర్పడుతుంది. ప్రజలకు ప్రభుత్వానికీ ఆ మధ్య భాషా సంబంధమైన అవరోధం తొలగి, సామాజిక, రాజకీయ వ్యవహారాల్లో చురుగ్గానేకాక వివేకవంతంగా పాల్గొనడం జరుగుతుంది. ప్రజల కోసం, ప్రజలదీ అయిన ప్రభుత్వం అర్థవంతమవుతుంది. ప్రయోజన విస్తృతినీ పొందుతుంది. ప్రజలు మాట్లాడే భాష అధికారికమైన గుర్తింపును పొందడంతో నిర్వహణ దృష్టి మారుతుంది. ప్రజల ప్రమేయభావన గుణాత్మకతను పొందుతుంది. సంబంధాలు సుదృఢమౌతాయి.

తెలుగు అధికార భాషగా వర్తిల్లిన ప్రయత్నాల్ని స్థూలంగా సమీక్షిస్తే ఆధునిక యుగంలో భాషా రాష్ట్ర నిర్మాణం తరువాతనే వేగవంతమయినట్లు కన్పిస్తుంది. రాష్ట్రంలో గ్రామస్థాయినుండి ఆపైన దశలు దశలుగా జిల్లాస్థాయి వరకు ప్రాంతీయ భాషల కధికార నిర్వహణ రూపాన్ని ఇవ్వవచ్చునన్న నిశ్చయభావం ఏర్పడింది. ప్రజల భాషలో ప్రభుత్వ కార్యకలాపాలు సాగించాలన్న సంకల్పం, నిర్ణయం, ప్రయత్నం – ఆయా భాషల వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసాయి. ఈ చర్య సమాజాభివృద్ధికీ వ్యక్తి వికాసానికీ ఉపకరించేది అయినా దీనికి సమస్త భారతదేశ భావనతో అంతర్జాతీయ సంబంధాలపై దృష్టితో కొన్ని పరిమితులు లేకపోలేదు. వీటిని గుర్తిస్తూ ఒక స్థాయివరకు తెలుగు భాషకు అధికార భాషగా ప్రయోజనాత్మకమైన రూపాన్ని ఇవ్వడం ఆ ప్రాంతం లేదా రాష్ట్ర ప్రజల్ని గౌరవించడమే, వారి శ్రేయస్సును కాంక్షించడమే.

## 2. తెలుగులో సాధారణ పాలన-వివిధ చర్యలు

సాధారణ పాలన తమ మాతృభాషలో జరగాలనే అభిలాష ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరునికీ సహజం. ఉన్నతమైన సంస్కృతి ఉత్తమమైన సాహిత్యం గల తెలుగు ప్రజలు తెలుగులో సాధారణ పాలన జరగాలనుకోవడం ఎన్నాళ్ళుగానో అందని ఫలంగా మిగిలింది. ఆంధ్రప్రదేశ్ అవతరణంతో, అంతకుముందునుండి బీజభూతంగా ఉన్నది. మొలకెత్తి శాఖా సంపన్నం కావడం మొదలైంది. ఇది పాలనా వ్యవస్థను సమాజానికి సన్నిహితం చేయడమే కాక ప్రజల్లో తమ బాధ్యతను దృఢతరం చేస్తుంది. ప్రజలకూ ప్రభుత్వానికీ మధ్య అవరోధం తొలగి మంచి అవగాహన ఏర్పడుతుంది. ప్రజాస్వామ్యాన్ని పటుతరం చేసి సామాజిక ప్రగతిని వేగవంతం చేసేందుకుపకరిస్తుంది.

భారత రాజ్యాంగంలో భారతీయ భాషల స్థానాన్ని గురించి వాటి ప్రయోజనాన్ని గురించి దేశ సమగ్ర వికాసానికుపయోగకరమైన అంశాలెన్నో వివిధ సందర్భాల్లో పొందుపరచ బడినాయి. రాజ్యాంగ నిర్మాతలు భారతదేశంలో ఆయా రాష్ట్రాల చారిత్రక సామాజిక స్థితిగతుల్నిబట్టి ఉత్పన్నమయ్యే భాషా సమస్యను గుర్తించారు. ఆయా రాష్ట్రాల్లో అధికార భాషా పరిష్కారాన్ని మంచి అవగాహనతో సూచించడమూ జరిగింది. ఇది భవిష్యన్మార్గాన్ని సుకరం చేసింది. భారత రాజ్యాంగంలో షెడ్యూలు 8, పరిచ్ఛేదాలు 343-351లో రాష్ట్రాల్లో ప్రజల భాషలో పాలన గురించి ప్రసక్తమైంది. ఆయా రాష్ట్రాల్లోని భాషల్లో అధికార కార్యకలాపాలు జరుగవచ్చునన్న విషయం పరిచ్ఛేదాలు 345-348లో నిబంధితమైంది. ఇది ప్రజాస్వామ్యంలో ప్రజల భాషను గుర్తించి మన్నించడమే.

1953 అక్టోబరు ఒకటో తేదీన ఆంధ్రరాష్ట్ర నిర్మాణం జరిగింది. ఈ చర్య భారతదేశ స్వరూప చరిత్రలో మలుపుకు కారణమైంది. ఇది మొదలుగా ఆ తరువాత దారితీసిన పరిస్థితుల ప్రభావంతో భారతదేశం భాషా రాష్ట్ర విభాగాలతో నూతన వ్యక్తిత్వాన్ని సంతరించుకుంది. భాషా రాష్ట్రాల అభివృద్ధితోనే భారతదేశం సమగ్రమైన అభ్యున్నతిని సమగ్రమైన వికాసాన్ని పొందుతుందన్న ఆలోచనకు క్రియారూపం చేకూరింది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన తరువాత 1955 సెప్టెంబర్ 25వ తేదీన తెలుగును అధికార భాషగా గుర్తించే తీర్మానానికి శాసన ప్రతిపత్తి లభించింది. తాలూకా స్థాయిలో తెలుగు ప్రవేశానికి శాసన సభ తీర్మానంతో దీనికై ప్రత్యేకాధికారిని నియమించడం జరిగింది. ఈ దిశలో ఆదేశాలు వెలువడినాయి. 1956 నవంబర్ ఒకటో తేదీన ఆంధ్రరాష్ట్రం తెలంగాణా కలిసిన ఆంధ్రప్రదేశ్ అవతరించింది. అధికార భాషగా తెలుగును

విజయవంతం చేసే చర్యలు మొదలైనాయి. ఈ కార్యక్రమంలో ముందు చర్యగా 1957లో శాసనసభ స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు అధ్యక్షతన శాసన సాధారణ పాలన న్యాయ శాఖలకు సంబంధించిన పారిభాషిక పద కోశాలను సిద్ధం చేసేందుకై కమిటీ ఏర్పాటు చేయబడింది. తెలుగు అధికార భాషకు సంబంధించిన వ్యవహారాల్ని నిర్వహించేందుకు ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్‌ను కూడ నియమించింది. 1966 మే 14 తేదీనుండి అధికార భాషా చట్టం అమలులోకి వచ్చింది. ఈ చర్యతో తెలుగుకు అధికార భాషా ప్రతిపత్తి లభించింది. దీని వెనువెంటనే ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు కార్యకలాపాల నిర్వహణకు పాలనా యంత్రాంగాన్ని సమాయత్తం చేసే ప్రయత్నం మొదలైంది. 1968లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధికార భాష తెలుగుపై శ్వేతపత్రం ప్రకటించింది. భారతదేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలేర్పడిన తరువాత ప్రాంతీయ భాషలు స్పష్టమైన నిర్దిష్టమైన లక్ష్యంతో అధికార భాష గౌరవస్థానాన్ని సంతరించుకున్నాయి. మొట్టమొదటి నిర్మాణాత్మకమైన కృషి శాసనసభ మరియు శాసనమండలిలో చర్చలు ప్రసంగాలు తీర్మానాలు తెలుగులో జరిగేందుకనుమతి లభించడంతో సాకారాన్ని పొందింది. వివిధ కార్యాలయాల్లో తెలుగు ప్రవేశానికనుమతి లభించడంతో మూలబద్ధమైన రూపం ఏర్పడింది. చారిత్రకంగా భారతదేశంలో భాషా ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్నిర్మాణానికి ఆంధ్రరాష్ట్రం మార్గదర్శకమైంది. ఇది ప్రాంతీయ భాషా సంస్కృతుల ప్రత్యేకతల్ని నిలుపుకునేందుకు వాటిని పెంపొందించుకునేందుకు తోడ్పడింది.

సుదీర్ఘమైన చర్చల అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటుచేసిన కమిటీ సూచనల మేరకు మొదట తాలూకా స్థాయిలో వివిధ కార్యాలయాల్లో తెలుగు అధికార భాషగా ప్రవేశపెట్టాలనే నిర్ణయం తీసుకోబడింది. దీనికనుగుణంగా తెలుగులో పారిభాషిక పదాల నిఘంటు నిర్మాణం, టైప్‌రైటర్, షార్ట్‌హాండ్ మొదలుగా సాధనసంపత్తిని సమకూర్చే ప్రయత్నం వేగాన్ని అందుకుంది. అధికార భాషగా తాలూకా స్థాయిలో తెలుగు ప్రవేశానికి, ప్రజలకత్యంత సంబంధమున్న 27 ప్రభుత్వ శాఖల్ని గుర్తించడం జరిగింది. 1) విద్య (విశ్వవిద్యాలయాలు తప్ప), 2) రహదారులు, భవనాలు, 3) వాణిజ్యం పన్నులు, 4) సహకారం, 5) ఆబ్కారీ, 6) అటవి, 7) పశుపాలన, 8) మత్స్య పరిశ్రమ, 9) పబ్లిక్ వర్క్స్, 10) రెవెన్యూ, 11) ట్రెజరీ ఎక్కౌంట్స్, 12) ధర్మాదాయ, 13) పంచాయతిరాజ్, 14) గిడ్డంగులు, 15) తూనికలు-కొలతలు, 16) భారతీయ వైద్యం, 17) రిజిస్ట్రేషన్-స్టాంపులు, 18) చేనేత-పట్టుపరిశ్రమలు, 19) సర్వే-సిటల్‌మెంటు, 20) శ్రామిక, 21) పోలీసు, 22) పౌరగ్రంథాలయాలు, 23) మునిసిపాలిటీ, 24) రేవులు, 25) జైలు,

26) అగ్నిమాపకం, 27) స్త్రీ సంక్షేమం అనేవి ముందుగా తీసుకోబడినాయి. 1960లో క్రిందిస్థాయినుండి తాలూకా స్థాయి వరకు తెలుగులోనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలనీ, ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహింపబడాలనీ ప్రభుత్వం ఆదేశించింది. దీనికి సహాయంగా 1957లో అయ్యదేవర కాళేశ్వర్‌రావు (స్పీకర్) అధ్యక్షతన ఏర్పాటైన కమిటి ఎంతో సమర్థవంతంగా పనిచేసింది. తమకప్పగించిన బాధ్యతను పూర్తిచేసింది. దీని పర్యవసానంగా 1963లో తెలుగు పారిభాషిక పదకోశం ముద్రితమైంది. 1953 నుండి 1963 వరకు పది సంవత్సరాల కాలంలో బహు వ్యయ ప్రయాసల్ని ఎదుర్కొని పరిశోధన గావించి 1963లో తెలుగు టైప్‌రైటర్ నిర్మాణానికి అవసరమైన కీ బోర్డు సిద్ధం చేయబడింది. ఆ తరువాత ప్రయోగంలో అనుభవంతో సాంకేతిక పురోగమన సహాయంతో 1964 డిసెంబర్‌లో కొద్ది మార్పులతో కీబోర్డ్‌కు ప్రామాణికమైన రూపాన్ని ఇవ్వడం జరిగింది. దీనితోపాటు షార్ట్‌హ్యాండ్ మాన్యువల్ కూడ తయారైంది. టైప్‌రైటర్ మరియు షార్ట్‌హ్యాండ్ అనేవి తెలుగు అధికార భాషగా విజయవంతం కావడానికెంతో తోడ్పడే సాధనాలు అందుబాటులోకి రావడం విశేషం. 1974లో 'తెలుగు ఉగాది' రోజునుండి తాలూకాస్థాయిలో ప్రవేశపెట్టబడిన తెలుగు అధికార భాష పనితీరును పరిశీలించేందుకు వావిలాల గోపాలకృష్ణయ్య అధ్యక్షతన అధికార భాషా సంఘం నెలకొల్పబడింది. వీరి అధ్యక్షతన జరిగిన కృషి ఫలంగా 1976 నుండి జిల్లాస్థాయిలో తెలుగు అధికార భాషగా ప్రవేశపెట్టడం జరిగింది. మరో విశేషమేమంటే తెలుగు మాధ్యమంలో విద్యనభ్యసించిన వారికి వారి అర్హతలనుబట్టి ప్రభుత్వోద్యోగ నియామకాల్లో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ పరీక్షల్లో ఐదు మార్కులు చేర్చడానికి అనుమతి నీయడమైంది. తాలూకాస్థాయినుండి జిల్లాస్థాయికి తెలుగులో పాలనా నిర్వహణకవసరమైన జి.ఓ.లతో, ఎప్పటికప్పుడు పనితీరును సమీక్షించి చర్యలు తీసుకొనే యంత్రాంగం వల్ల అధికార భాషా సంఘం కృషితో అధికార భాషగా తెలుగుకు స్థిరరూపం ఏర్పడింది. మరోవైపు తెలుగు ఎకాడమి స్థాపనం, శిక్షణ తరగతుల నిర్వహణం మొదలైన చర్యలు దీనికెంతో సహాయపడినాయి. అభ్యర్థనలు, నోటీసులు, ఉత్తర ప్రత్యుత్తరాలు, అభిప్రాయాలు, నిర్ణయాలు మొదలైన వాటికి తెలుగులో నమూనాలు విషయపత్రాలు అవసరమైన సందర్భాల్లో అనువాద రూపాలు సిద్ధం చేయబడినాయి.

తెలుగు ఎకాడమీ విద్యా సంబంధమైన గ్రంథాల్ని వివిధ స్థాయిల్లో పనికివచ్చే వాటిని ఎన్నికచేసి తెలుగులో వ్రాసి ప్రచురించే బృహత్కార్యక్రమాన్ని చేపట్టింది.

ఇకపోతే చట్టాలకు సంబంధించిన అంశం ఒకటుంది. భారత రాజ్యాంగం ఆర్టికల్ 343 ప్రకారం ప్రభుత్వం విడుదల చేసే అధికార పాఠం ఇంగ్లీషులోనే ఉండవలసి ఉంది. అయితే 1963లో అధికార భాషా చట్టం (ఐదో పరిచ్ఛేదం)తో హిందీ పాఠానికీ అవకాశం కల్పింపబడింది. అయితే వివిధ రాష్ట్రాల్లో ఆర్టికల్ 345 ప్రకారం రాష్ట్రాల్లో ప్రజలు మాట్లాడే భాషను అధికార భాషగా గుర్తించే అవకాశం ఉంది. దీన్ని పురస్కరించు కొని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1965లో అధికార భాషా చట్టాన్ని నిర్మించింది. ఇది 1966లో అమలులోకి వచ్చింది. ఎన్నో చట్టాలు నియమ నిబంధనలు ఇంగ్లీషు భాషలో ఉన్నవి, తెలుగులోకి అనువదించవలసిన అవసరం ఏర్పడింది. పాలనాపరమైన ఎన్నో ప్రాథమికాంశాల్ని అధికార భాషయైన తెలుగులోకి తేవలసి ఉంది. ఇది ఒక్కనాటితో జరిగే పని కాదు. ఈ పనికి స్వల్పకాలికంగాను దీర్ఘకాలికంగాను ప్రణాళిక లవసరం. అన్ని రంగాల్లో స్థిరపడిన ఇంగ్లీషు భాష స్థానంలో, తెలుగును తీసుకరావడం అంత సులభం కాదు. స్థానికమైన అవసరాలకనుగుణంగా ఈ పని మొదలైంది. సచివాలయంలో ఈ కార్యక్రమానికొక అనువాద విభాగం ఏర్పాటు చేయబడింది. ప్రభుత్వ సంకల్పం, ప్రజల ఆమోదం, యంత్రాంగం, ప్రయత్నం కారణంగా 1974 మార్చిలో తాలూకా స్థాయి వరకు, ఆపైన 1976 ఏప్రియల్‌లో జిల్లాస్థాయి వరకు తెలుగు అధికార భాషగా ప్రవర్తిల్లింది. దీనికి,

1) ఇప్పుడు అమలులో ఉన్న చట్టాల్ని, చారిత్రకమైన ప్రాముఖ్యం ఉన్నవాటిని తెలుగులోకి అనువదించడం,
2) ఇప్పుడు అమలులో ఉన్న నియమ నిబంధనల్ని అవసరమనుకున్న పూర్వ రూపాల్ని తెలుగులోకి అనువదించడం.
3) అనువాదంలో ప్రామాణిక రూపాల్ని సాధించడం.
4) అధికార భాష పట్ల ప్రజల స్పందనల్ని గమనించి తగిన చర్యలు తీసుకోవడం.
5) కార్యాలయాల్లో ఇంతవరకూ ఇంగ్లీషు భాషకలవాటు పడినవారికి శిక్షణ తరగతుల్ని, తగిన ప్రోత్సాహాన్ని ఇవ్వడం.
6) కార్యాలయాల్లో పనిచేసేవారికి అధికార పద్ధతిలో అవసరమైన సమాచారాన్ని అందించడం.
7) తెలుగు భాష రాని ఉద్యోగులకు శిక్షణ తరగతుల్ని నిర్వహించడం, వారిలో ఆసక్తిని పెంపొందించే చర్యల్ని చేపట్టడం.
8) అన్ని రంగాల్లో తెలుగులో పాలనా వ్యవహారాల పట్ల మానసికంగా సరియైన వాతావరణాన్ని కల్పించడంతో

తెలుగులో అధికార భాష విజయపథంలో పయనించడం మొదలుపెట్టింది. తెలుగు మాతృభాష కానివారికి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ 1960 నుండి పరీక్షల్ని నిర్వహించి, ప్రోత్సాహ వాతావరణాన్ని నెలకొల్పింది.

ఏమైనప్పటికీ ప్రభుత్వంతో పాటు ప్రజల్లోను అభిలాష, శ్రద్ధ, ప్రయత్నంతో కూడిన వాతావరణం తెలుగు అధికార భాషగా తన ప్రయోజనాత్మకమైన పాత్రను నిర్వర్తిస్తుందనడంలో సందేహం లేదు.

## 3. తెలుగులో న్యాయపాలన

న్యాయశాస్త్రం వ్యక్తికీ వ్యక్తికీ మధ్య వ్యక్తికీ సమాజానికీ మధ్య వ్యక్తి క్షేమంతో సమాజ శ్రేయస్సుతో సంబంధాల్ని నెలకొల్పేది, సమస్యల్ని పరిష్కరించేది. దీన్ని పూర్వం ధర్మశాస్త్రమనేవారు. ఇది ప్రత్యేకంగా ఒక శాఖగా వర్తిల్లింది. అటు వ్యక్తిపరంగా ఇటు సమాజంలోను సుస్థితి నెలకొల్పే సాధనం న్యాయపాలనం. న్యాయపాలనం న్యాయ స్థానాల్లోనుండి ప్రవర్తిస్తుంది. ఇది ఎప్పటికపుడు వ్యక్తి అవసరాల్ని సమాజ ప్రయోజనాల్ని దృష్టిలో పెట్టుకొని మార్పులతో కొత్త శాసనాలతో రూపాన్ని పొందుతుంది. దీన్ని నిర్వహించేందుకు న్యాయవ్యవస్థ ఏర్పాటైంది. భారత రాజ్యాంగంలో న్యాయ పాలనకు సమున్నతమైన స్థానం ఇవ్వబడింది. ప్రజాస్వామ్యంలో దీని పాత్ర అసామాన్యమైంది. 1966లో జరిగిన ఆంధ్రప్రదేశ్ అధికార భాషాచట్టం ప్రకారం మూడో పరిచ్ఛేదాన్ని అనుసరించి తెలుగు అధికార భాషగా అమలులోకి రావడంతో, న్యాయపాలనా క్షేత్రం కూడా దీని పరిధిలోకి వచ్చింది. ఇది ఏ మేరకన్నది ఎప్పటికపుడు నిర్దేశితమౌతూ వచ్చింది.

పూర్వం నుండీ క్రిందిస్థాయిలో ప్రామిసరీ నోట్లు విక్రయ దస్తావేజులు ఆస్తి బదలాయింపులు వీలునామాలు ఇంగ్లీషుతోపాటు తెలుగులోను వ్రాయబడేవి. తెలంగాణాలో హైదరాబాద్ సంస్థానంలో అధికార భాష ఉర్దూ అవడంవల్ల ఇవి ఉర్దూలోనూ కన్పిస్తాయి. న్యాయపాలనలో గ్రామస్థాయినుండి పైకి వెళ్ళే కొద్దీ తెలుగు ప్రమేయం తగ్గుతూ వచ్చింది.

న్యాయశాస్త్రం పరిధి అంతర్జాతీయ క్షేత్రం వరకు విస్తరించింది. సరియైన న్యాయపాలన తెలుగులో నిర్వహించడానికి ముందు ఈ దిశలో కొంత కృషి అనివార్యం. ఇప్పటివరకు ఇంగ్లీషు భాషలో ఉన్న కేంద్ర రాష్ట్ర చట్టాలతో పాటు ప్రముఖ దేశాల్లోని చట్టాల్లోని ముఖ్యాంశాల్ని కూడ తెలుగులోకి పరివర్తితం చేసుకోవలసి ఉంది.

న్యాయశాస్త్రంలోని వివిధ శాఖలకు చెందిన ప్రధానమైన గ్రంథాలను తెలుగులో అందుబాటులోకి రావలసి ఉంది. అనువాదంలో మూలంలోని అర్థానికేమాత్రం భంగం రాకూడదు. అర్థంలో మార్పువల్ల నష్టం వాటిల్లే అవకాశముంది. న్యాయశాస్త్ర ఉద్దేశానికీ న్యాయపాలన ప్రయోజనానికీ భంగం కలుగుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1964లో న్యాయశాఖలో ఈ పనికై ఒక విభాగాన్ని ఏర్పాటు చేసింది. తెలుగులో అనువదించిన వాటిని పరిశీలించి ఆమోదించే సంఘం కూడ నియమితమైంది. తెలుగులో న్యాయ పాలనకు, న్యాయశాస్త్రానికి సంబంధించిన గ్రంథాలు ఒకవైపున, అవసరమైన చట్టాలు నియమ నిబంధనలు మరోవైపున తెలుగులో రావాలి. ఇవి సరియైన అధికార పాఠాలుగా ఆమోదాన్ని పొందాలి. ఇంగ్లీషులో ఉన్న పదాలకు సరియైన తెలుగు పదాల్ని నిర్మించుకోవాలి. లేదా అవసరమైతే ఇంగ్లీషు పదాల్నీ వాడుకలో ఉన్న అన్యభాషా పదాల్ని గ్రహించవచ్చు. ఒక్క పొరపాటువల్ల న్యాయపాలనలో ఎన్నో చిక్కుల్ని ఎదుర్కోవలసి ఉంటుంది. న్యాయానికి క్షతి కలుగుతుంది. ప్రాంతీయ భాషలపట్ల ఆదరణ తగ్గుతుంది. భాషాశక్తిని గురించి శంక ఏర్పడుతుంది. సాధారణ పాలనలో కన్నా న్యాయపాలనలో ఎక్కువగా భాషాగతమైన సమస్యల్ని ఎదుర్కోవలసి ఉంటుంది. అందువల్ల తెలుగులో న్యాయపాలనకు అన్ని అంశాల్లో పూర్వరంగంతో సర్వసన్నద్ధమైతే తప్ప దీన్ని ప్రవేశ పెట్టేందుకు వీలులేదు.

న్యాయపాలనకు మూలస్తంభాలనదగినవి – 1) భారత శిక్షాస్మృతి, 2) శిక్షా ప్రక్రియ, 3) వ్యవహార ప్రక్రియా సంహిత, 4) సాక్ష్యం చట్టం, 5) ఆస్తి బదలాయింపు చట్టం, 6) కాంట్రాక్టు చట్టం అనేవి. ఇవి న్యాయశాస్త్రానికి సంబంధించినవి. న్యాయ పాలనలో అనివార్యాలుగా కన్పిస్తాయి. అందువల్ల విషయానికీ అభివ్యక్తికీ ప్రాధాన్యం ఇవ్వవలసి ఉంటుంది. దీనికి సంబంధించిన పరిభాష అభివృద్ధి చేసుకోవలసి ఉంటుంది. న్యాయశాస్త్రంలో పదాలు ఒకదానితో మరొకటి పరస్పర సంబంధంతో వర్తిస్తాయి. ఉదాహరణకు, కాంట్రాక్ట్ (Contract) అంటే చట్టరీత్యా అమలు చేయదగిన ఎగ్రిమెంట్ (Agreement). ఎగ్రిమెంట్ అంటే పరస్పరం కన్సిడరేషన్ (Consideration) (ఆలోచనకు) తగిన ప్రామిజ్ (Promise) . ప్రామిజ్ అంటే అంగీకరింపబడిన ప్రపోజల్ (Proposal) ఇట్లా నిర్దుష్టమైన భావంతో శబ్దం ఉపయుక్తమౌతుంది. తెలుగులో ఏదో పదంతో సరిపోదు, దానికి 1) స్థిరత, 2) ప్రామాణికత, 3) అర్థావబోధ చేకూరాలి. అందువల్ల సాధారణ పాలనలో తెలుగు ప్రవేశపెట్టినట్లు న్యాయపాలనలో అంత సుకరంగా సమకూడదు. న్యాయపాలనలో సివిల్ వ్యవహారంలో కన్నా క్రిమినల్ వ్యవహారాల్లో

సాంకేత పదజాలం గొప్ప పాత్రను నిర్వహిస్తుంది. సివిల్ అయినా క్రిమినల్ అయినా నోటీసులు సమన్లు ఉత్తర్వులు ఇంచుమించు ఒకే పద్ధతిలో ఉండేవి కాబట్టి అధికార పాఠాల్ని మరియు నమూనాల్ని ప్రకటిస్తే సరిపోతుంది. తెలుగులో న్యాయపాలనకు తీసుకోవలసిన చర్యలు,

1) దేశంలో వివిధ న్యాయస్థానాల్లో జరిగిన నిర్ణయాలు, వివరణలు, వ్యాఖ్యానాలు ముఖ్యమైనవి తెలుగులోకి రావాలి.
2) రాష్ట్రాల్లో హైకోర్టులు మరియు సుప్రీంకోర్టుల్లోని వాదాలు తీర్పులు తెలుగులోకి రావాలి.
3) న్యాయస్థానాల్లో తెలుగు భాష న్యాయశాస్త్రానికి సంబంధించిన మంచి గ్రంథాలయాలు ఏర్పాటు కావాలి.
4) ఇప్పటినుండి తెలుగులోనే చట్టాలు నిర్మింపబడాలి. తెలుగులోనే నియమ నిబంధనలు రావాలి.
5) ఆధునికమైన ఉపకరణాలు తెలుగు టైప్‌రైటర్, తెలుగు షార్ట్‌హాండ్ (సంక్షిప్త లేఖనం) మొదలైనవి సాధారణ పాలనలో వలెనే ఇక్కడ కూడ పనిలో సౌకర్యాన్ని వేగాన్ని కలిగించే స్థితికి తీసుకరావాలి.

ఆంధ్రప్రదేశ్ గెజిట్‌లో ప్రకటితమైన 1966 అధికార భాషా చట్టం సెక్షన్ 6లో వివిధ చట్టాల నియమ నిబంధనలు తెలుగులోకి తెచ్చే వీలు కల్పింపబడింది. ఈ దిశలో తగిన చర్యలు తీసుకోవడమూ జరిగింది.

కేసుల్లో సాక్షులు ఎవరో బాగా చదువుకున్నవారైతే తప్ప మిగతా వారందరూ మాతృభాషలోనే సాక్ష్యమివ్వడానికి సిద్ధపడుతారు. వీటిని జాగ్రత్తగా రికార్డు చేసుకోవలసి ఉంటుంది. ప్రమాణపత్రాలతో సహా తతంగమంతా తెలుగు భాషలో ఉండడం అవసరం. వాద ప్రతివాదాలు తెలుగులో జరిగితే ఇరుపక్షాలవారు ఏయే సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టబడినాయో, తమ కేసు గురించి న్యాయవాదులెట్లా వాదిస్తున్నదీ, ఏమి లోపించిందీ, ఏమి చేర్చవలసి ఉందీ, మొదలైన అంశాల్ని తెలుసుకునే అవకాశముంది. రాష్ట్రంలో జిల్లా స్థాయి వరకు తెలుగులో నిర్వహింపబడే అవకాశం కలిగింపబడింది. హైకోర్టులో కార్యకలాపాలు తెలుగులో జరగడానికి రాష్ట్రపతి ఆమోదంతో గవర్నర్ ఆదేశం జారీ చేయవలసి ఉంది. హైకోర్టులో తీర్పు ప్రాంతీయ భాషల్లో జరగాలంటే, పార్లమెంటు దీనికై చట్టం చేయవలసి ఉంటుంది. జిల్లా స్థాయి వరకు తెలుగులో న్యాయపాలనను

ఎక్కువ సమస్యలు లేకుండా సరియైన చర్యలతో నిర్వహించవచ్చు. దీనివల్ల న్యాయపాలన తన సమున్నతమైన గౌరవ స్థానాన్ని నిలుపుకునే అవకాశం ఉంది.

హైకోర్టు స్థాయిలో ప్రాంతీయ భాష ప్రవేశపెట్టడానికి కొన్ని సమస్యలున్నాయి. వీటికి తగిన చర్యలు తీసుకోవలసి ఉంటుంది. ఈ పని అనుకున్నంత సుకరం కాదు.

1) ఇతర రాష్ట్రాల నుండి హైకోర్టు న్యాయాధిపతులు బదిలీ అయినప్పుడు భాషా సమస్య ఉత్పన్నమవుతుంది.
2) వివిధ రాష్ట్రాల్లో హైకోర్టుల్లో న్యాయాధిపతుల తీర్పులు ఎప్పటికపుడు ప్రాంతీయ భాషలోకి అనువదించవలసి ఉంటుంది.
3) ఎప్పటికపుడు న్యాయస్థానాలకు సంబంధించిన సమాచారం ప్రాంతీయ భాషలో అందుబాటులోకి తేవలసి ఉంటుంది.
4) హైకోర్టు నుండి సుప్రీం కోర్టుకు వెళ్ళే న్యాయపరమైన అంశాలన్ని ప్రాంతీయ భాషలోకి తీసుకురావలసి ఉంటుంది.
5) న్యాయశాస్త్ర విజ్ఞానం ఎప్పటికపుడు ప్రాంతీయ భాషలోకి పరివర్తితం కావలసి ఉంటుంది.
6) ఏ ప్రాంతానికి చెందిన న్యాయవాదులు ఆ ప్రాంతానికే భాష కారణంగా పరిమితమైపోతారు. క్షేత్ర పరిధి సంకుచితమౌతుంది.

ఈ కారణాలవల్ల జిల్లా స్థాయి వరకే తెలుగు భాష న్యాయపాలనలో ప్రవేశానికై ప్రభుత్వం అంగీకరించింది.

జిల్లా స్థాయి వరకు తెలుగులో న్యాయపాలన సమర్థవంతంగా ఉండేందుకు, సఫలమయ్యేందుకు తీసుకోవలసిన చర్యలు –

1) వాద ప్రతివాద పత్రాలు, అర్జీలు మొదలైనవి తెలుగులో ఉండాలి.
2) సాక్ష్యం తెలుగులో జరగాలి.
3) న్యాయవాదులు తెలుగులో వాదించాలి.
4) న్యాయాధిపతి తీర్పులు ఉత్తర్వులు డిక్రీలు మొదలైనవి తెలుగులో వెలువడాలి.
5) ఇతర భాషా రాష్ట్రాల్లోని తీర్పులు, విశేష సమాచారమూ ఎప్పటికపుడు తెలుగులో లభ్యమయ్యేట్లు చూడాలి.
6) న్యాయశాస్త్ర పదజాలం తెలుగులో నిర్దుష్టంగా ప్రమాణీకరింపబడి సిద్ధం చేయబడాలి.

7) తెలుగులో న్యాయశాస్త్రానికి సంబంధించిన పత్రికలు విశేష సంచికలు వెలువడాలి.
8) కేంద్ర మరియు రాష్ట్రాలకు సంబంధించిన శాసనాలు, చట్టాలు కనీసం ముఖ్య మైనవి సత్వరం అవసరమైనవి అధికార పాఠాలతో అందుబాటులోకి రావాలి.
9) తెలుగు భాషలో వెలువడిన న్యాయశాస్త్ర గ్రంథాలతో, ఇతర సమాచారంతో కోర్టులో గ్రంథాలయాలు ఏర్పడాలి.
10) న్యాయపాలనకు సంబంధించిన నమూనా పత్రాలు ప్రామాణికంగా సిద్ధం చేయబడి తెలుగులో రాష్ట్రమంతటా ఒకేవిధంగా ఉండాలి.
11) ఎప్పటికప్పుడు న్యాయశాస్త్రంలో వచ్చే మార్పులు, న్యాయపాలనలో జరిగే విశేషాలు, జాతీయాంతర్జాతీయ ప్రాముఖ్యం కలిగిన కేసులు నిర్ణయాలు తెలుగు భాషలోకి పరివర్తితం కావాలి.
12) న్యాయవాదులకు మొదట్లో తెలుగులో శిక్షణ కార్యక్రమాల్ని చేపట్టాలి.

ఈ విధానాన్ని ఎంతోకొంత అవలంబించడంవల్ల సాధారణ పరిపాలనతో పాటు కొంచెం ఇబ్బంది అయినా తెలుగులో న్యాయపాలనం జిల్లాస్థాయి అంటే సెషన్స్ వరకు, ప్రభుత్వాదేశాల మేరకు సాగుతూంది. ఇది మునుముందు ఇంకా పటిష్టంగా సమగ్రంగా రూపొంది తెలుగు భాష తన ప్రయోజనాత్మకమైన పాత్రను సంపూర్ణంగా నిర్వర్తిస్తుందనే భావించవచ్చు.

## 4. విద్యా మాధ్యమం - మాతృభాష-తెలుగు

భాష మనిషి నుండి మనిషికి మనసులోని భావాన్ని తెలిపే సంకేతరూపం. మనసులోని భావాల్ని వ్యక్తం చేసే సాధనం. ఆలోచన మరియు భాష రెండూ విడదీయ రానివి. మాతృభాషలో విద్యాబోధన సహజమైందన్న విషయం వేరే చెప్పనక్కర లేదు. ఇది విద్యార్థి మానసిక వికాసానికి దోహదం చేస్తుంది. ప్రతిభాశక్తిని పెంచుతుంది. ఆలోచనల్ని వేగవంతం చేస్తుంది. మరో భాషలో అయితే మాతృభాషతో సమానమైన మానసిక స్థితిని పొందితే తప్ప ఇది సాధ్యం కాదు. ప్రయోజనాత్మకమైన భాషా రూపాన్ని గురించి ఆలోచిస్తే మన అవసరాల్నిబట్టి అది మారుతుంది. దాన్ని ఆ విధంగా రూపొందించుకోవలసి ఉంటుంది. సాధారణ పాలన న్యాయపాలన విద్యామాధ్యమం మొదలుగా భాష తన ప్రయోజనపరమైన క్షేత్రపరిధి విస్తృతమయ్యే కొద్దీ ప్రయోగరూపమూ పెరుగుతుంది. వైవిధ్యాన్ని పొందుతుంది, మారుతుంది. కొత్తరూపాన్ని పొందుతుంది. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో ప్రాంతీయ భాషలకు వికాసోన్ముఖమైన దశ ఏర్పడింది.

భాషా రాష్ట్రాల్లో ఆయా ప్రజల భాషలకు ప్రాముఖ్యం హెచ్చింది. క్రింది స్థాయి నుండి పై స్థాయి వరకు అంటే స్నాతకోత్తర స్థాయి వరకు మాతృభాషలో విద్యాబోధన జరగాలన్న అభిప్రాయం బలపడింది. దీనికనుగుణమైన శాసన ప్రతిపత్తి చేకూర్చడం జరిగింది. చట్టం, భాషకు శాసన ప్రతిపత్తి కల్పిస్తే, ప్రజల అవసరాలు, లక్ష్యానికి కార్యరూపాన్నిస్తాయి. ప్రస్తుతం భారతీయ సమాజంలో భాష నాలుగు విధాలుగా వ్యక్తి జీవితంలో ప్రవర్తిత మౌతుంది. 1) మాతృభాష, 2) నివసించే ప్రాంతీయ భాష, 3) విద్యా బోధనా భాస, 4) అధికార భాష. దేశంలో ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికెన్నో కారణాలవల్ల వెళ్ళినపుడు, పై స్థితి ఏర్పడుతుంది. లేదా ఎంతో కాలం నుండి నివాసం మారకపోయినా మాతృభాష, నివసించే ప్రాంతంలోని భాష, విద్యా బోధనా భాష వేరు వేరు కావచ్చు. పుట్టుకతో తల్లి ఒడిలో నేర్చుకునేది మాతృభాష. వ్యక్తి నివసించే పరిసరాల్లో మాట్లాడేది ప్రాంతీయ భాష. వీటికి భిన్నంగా మరో భాషలో ఏదో కారణంవల్ల విద్యనభ్యసించవలసి రావచ్చు. వీటికి భిన్నంగా కార్యాలయాల్లో అధికార భాషకవకాశముంది. ఇటువంటి పరిస్థితుల్లో భాష గురించి చాలా జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవలసి ఉంటుంది.

విద్యాబోధన మాతృభాషలోనే జరగాలన్న అభిప్రాయం ఉంది. భాష నేర్వడ మంటే 1) గ్రహణం, 2) పఠనం, 3) సంభాషణం, 4) లేఖనం అనేవి సిద్ధించడమన్నమాట. మాతృభాషలో ఈ స్థితి చాలా సుకరమని వేరే చెప్పనక్కరలేదు. ప్రాథమిక స్థాయినుండి విద్యార్థి ఎప్పుడూ చిన్నప్పటినుండి మాట్లాడే మాతృభాషలో విద్య నేర్వడం సులభం. త్వరగా అబ్బుతుంది. మనస్సుపై సులభంగా ముద్ర వేస్తుంది. ఆయా రాష్ట్రాల్లో ఎక్కువగా మాట్లాడే ప్రజలు తమ మాతృభాష పట్ల గౌరవాన్ని ప్రదర్శించడం సహజం.

అయితే తక్కువసంఖ్యలో మాట్లాడే ప్రజల మాతృభాషకు కూడ సముచితమైన స్థానం ఇవ్వవలసి ఉంటుంది. ఎవరి మాతృభాష వారికి ప్రీతికావడంలో ఆశ్చర్యం లేదు.

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో వివిధ రాష్ట్రాల్లో ఈ దిశలో గణనీయమైన పరివర్తన వచ్చింది. ప్రాథమిక స్థాయినుండి ఉన్నత పాఠశాల స్థాయివరకు ఒక దశలో మాతృభాషలో విద్యాబోధన జరిగితే, మరో దశలో వివిధ సాధన సంపత్తిని సమకూర్చుకొని కళాశాల స్థాయివరకు విస్తరించింది. దీనికనుగుణంగా ప్రభుత్వ విధానమూ రూపొందింది. దీనికవసరమైన పాఠ్యపుస్తకాల్ని సిద్ధం చేయడం జరిగింది. ఈ పనిలో ఉపాధ్యాయులకు తగిన శిక్షణకవకాశాలు కల్పితమైనాయి. మొదట్లో కొన్ని సమస్యలుత్పన్నమైన మాట నిజం. అయితే వాటిని క్రమంగా అధిగమించడమూ జరిగింది. ఉదాహరణకు ఆరంభంలో విద్యను బోధించేవారు ఇంగ్లీషులో చదువుకొని ఉండవచ్చు. వారికి గల

భాషాగతమైన అవరోధాన్ని అభిలాషతో శ్రద్ధతో అభ్యాసంతో అవసరమైతే శిక్షణతో తొలగించుకోవడం జరిగింది. ఇప్పుడీ విధానం కళాశాలా స్థాయి వరకు స్థిరపడిందనే చెప్పొచ్చు. కళాశాలా స్థాయివరకు మాతృభాషలో విద్యాబోధన ఎంతో సుగమంగా సాగిపోతూంది. త్రిభాషాసూత్రం అమలుతో భాషల పట్ల సౌమనస్యం ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్‌లో మాతృభాషలో విద్యాబోధన క్రిందిస్థాయినుండి పై స్థాయివరకు అంటే కళాశాల స్థాయివరకు ఇంకా మానవీయ శాస్త్రాల్లో స్నాతకోత్తర స్థాయివరకు వ్యాపించింది. శాస్త్ర సాంకేతిక క్షేత్రాల్లో కొన్ని సమస్యలు ఎదురయ్యే మాట నిజం. స్నాతకోత్తర స్థాయిలో ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక విషయాల్లో మాతృభాషలో విద్యాబోధనకు అవసరమైన సదుపాయాల్ని కల్పించవలసి ఉంటుంది.

1) తెలుగులో అవసరమైన పాఠ్యగ్రంథాల్ని సప్రామాణికంగా సిద్ధం చేసి ప్రచురించడం, వీటికనుబంధంగా వివిధ విషయాలపై విశేష గ్రంథాల్ని ప్రచురించడం.
2) ఆయా విషయాలకు సంబంధించిన విజ్ఞాన సర్వస్వాలను విజ్ఞానప్రదమైన మౌలిక గ్రంథాలను తెలుగులోకి తేవడం.
3) వివిధ విషయాలకు సంబంధించిన పత్రికల్ని తెలుగులో నడపడం.
4) వీటికి సంబంధించిన పుస్తకాలతో పత్రికా సంచికలతో అవసరమైన విధంగా గ్రంథాలయాల్ని నెలకొల్పడం.
5) ప్రపంచస్థాయిలో ఎప్పటికపుడు విజ్ఞాన సాహిత్యాన్ని తెలుగులోకి పరివర్తింపజేయడం.
6) తెలుగులో బోధించే అధ్యాపకులు మధ్య మధ్య శిక్షణతో పునర్నవం కావడానికి వీలు కల్పించడం.
7) ఆయా విషయాలపై చర్చలు, గోష్ఠులు, ప్రసంగాలు తెలుగులో సాగేందుకు ప్రోత్సహించడం.
8) శాస్త్ర సాంకేతికాంశాలను తెలుగులో నేర్చుకునేందుకు బోధించేందుకు పరిశోధన సాగేందుకు వాతావరణాన్ని నెలకొల్పడం.

అయినప్పటికీ ఇంతచేసినా దీనికీ కొన్ని పరిమితులున్నాయి. ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి వెళ్ళినపుడు, మరో దేశానికి వెళ్ళినపుడు భాషాగతమైన సమస్య ఏర్పడుతుంది. అయితే తెలుగుతోపాటు ఇంగ్లీషు భాషలో స్థాయిని కాపాడుకొంటే ఈ సమస్యను కొంతవరకు పరిష్కరించవచ్చు.

ప్రజల్లో పరిస్థితుల్నిబట్టి స్నాతకోత్తర స్థాయిలో విద్యా మాధ్యమంగా ఇంగ్లీషు పట్ల కోరిక సహజం. భారతదేశంలో ఇప్పటికీ పై స్థాయిలో ఒక రాష్ట్రంతో మరో రాష్ట్రాన్ని కలిపే భాష ఇంగ్లీషు కావడంచేత, ఎక్కడైనా ఉద్యోగావకాశం లభిస్తుంది. అంతర్జాతీయంగాను గుర్తింపు లభిస్తుంది. జాతీయ స్థాయిలో అవరోధం ఉండదు. ఆపైన ఎక్కడైనా పరిశోధన కవకాశం లభిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌ను తీసుకుంటే క్రిందిస్థాయిలో పాలిటెక్నిక్, పారా మెడికల్ కోర్సుల్లో తెలుగును ప్రవేశపెట్టవచ్చు.

తెలుగు భాషను తీసుకుంటే స్నాతకోత్తర స్థాయిలో ఇంగ్లీషుతో సమానంగా సాధ్యం కాకపోయినా కనీసం సాధారణ స్థాయిలో విద్యార్థికి విజ్ఞానాన్ని సమకూర్చే సాధన సంపత్తిని చేకూర్చుకొని గాని ఉపక్రమించకపోవడం మంచిది. ఈ స్థాయిలో కేవలం ఏవో కొన్ని పాఠ్యగ్రంథాలతో సరిపోదు. విశేషమైన ఉపయోగకరమైన విజ్ఞాన గ్రంథాలతో కూడిన వాతావరణాన్ని కల్పించడం అవసరం. తెలుగు ఎకాడమీ ఈ దిశలో కొంత కృషి చేస్తోంది. ఈ రచనలకు భాషాపాండిత్యం ముఖ్యం కాదు. విషయాన్ని క్లిష్టత లేకుండా అన్వయ గుణంతో అర్థబోధ కలిగేట్టు చెప్పగలగాలి. దీనికి విజ్ఞానశాస్త్ర రచనా పరంపర ఏర్పడాలి. తెలుగు భాష మాధ్యమంగా ఉన్న విశ్వవిద్యాలయాలు నిర్వహించవలసిన పాత్ర ఎంతో ఉంది. తెలుగు ఎకాడమి కృషితోపాటు వీటి ప్రయత్నమూ కలిసి స్నాతకోత్తర స్థాయిలో విద్యామాధ్యమంగా తెలుగు ఇతోధికంగా రాణించే అవకాశం ఉంది.

రాష్ట్రంలో అధికార భాషగా సాధారణ పాలన, న్యాయపాలన, విద్యామాధ్యమంగా తెలుగు భాష విజయవంతం కావడానికి కొన్ని చర్యలు తీసుకోవలసి ఉంది.

1) అధికార భాషకూ విద్యామాధ్యమానికీ కావలసిన పరిభాషను తెలుగులో సిద్ధం చేసుకోవాలి.
2) అవసరమైతే ఇతర భాషా పదాలు తీసుకొని వాటిని యథాతథంగానో లేక తెలుగు భాషా స్వరూపాన్ని దృష్టిలో ఉంచుకొనే భాషా దారిద్ర్యాన్ని పోగొట్టుకోవాలి. పారిభాషిక పదాల్ని సిద్ధం చేసుకోవాలి.
3) శాసనాలు, చట్టాలు, బిల్లులు నియమ నిబంధనల ఆధికారిక పాఠాలు తెలుగులో ప్రామాణికంగా రావాలి.
4) పిటిషన్ మొదలైన ఎన్నో వ్యవహార పత్రాల నమూనాలను విషయ రూపాలను ప్రామాణికంగా సిద్ధం చేసుకోవాలి.

5) ప్రతి శాఖలో తెలుగు వాడుక భాషను గురించి పరిజ్ఞానాన్ని కలిగించాలి.
6) అవసరమైనన్ని తెలుగు టైప్‌రైటర్లు అందుబాటులోకి తేవాలి. షార్ట్‌హ్యాండ్‌ను ప్రోత్సహించాలి. సాంకేతిక విజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి.
7) అన్ని ప్రభుత్వ శాఖల్లో విద్యా సంబంధమైన క్షేత్రాల్లో అన్ని సందర్భాల్లో ఒకే విధమైన పరిభాషను రూఢం చేయాలి.
8) తెలుగులో పాఠ్య గ్రంథాలతోపాటు విశేష గ్రంథాలను అందుబాటులో ఉండేట్లు చూడడమే కాక చౌకగా లభించేట్లు చూడాలి. ఈ దిశలో గ్రంథాలయాన్ని పటిష్ఠం చేయాలి.
9) ప్రతి రంగంలో పత్రికలు (జర్నల్స్) విషయ విభాగాన్నిబట్టి తెలుగులో వెలువడేట్లు చూడాలి.
10) పరిపాలన మరియు న్యాయపాలనకు సంబంధించిన పదకోశాలను విజ్ఞాన కోశాలను ముందుగా నిర్మించాలి.
11) మధ్య మధ్య పాలనా రంగంలోను, న్యాయరంగంలోను, విద్యారంగంలోను తెలుగు ప్రవేశం గురించి శిక్షణ తరగతులను గోష్ఠులను చర్చలను నిర్వహించి ఎప్పటికప్పుడు పునర్నవం చేసే ప్రణాళికను సిద్ధం చేయాలి.
12) ఇతర భాషలనుండి తెలుగులోకి, తెలుగు నుండి ఇతర భాషల్లోకి అనువాద కార్యక్రమాన్ని ప్రోత్సహించాలి.

దీనికై ఒక సంస్థను విద్యావేత్తలతో ఏర్పాటుచేస్తే మంచిది. ప్రభుత్వానికుండే ఎన్నో పనుల్లో దీనిపట్ల శ్రద్ధ కనబరచకపోవచ్చు. అందువల్ల ఈ పనులకో సంస్థను చట్టబద్ధంగా నెలకొల్పడం అవసరం.

# అనువాద కళ

## 1. అనువాద స్వరూపం

అనువాదమంటే అనుసరించి చెప్పడం. ఒక భాషలోని విషయాన్ని మరో భాషలోకి యథాతథంగా అనుసరించడం. దీన్నే భాషాంతరీకరణమని అనడం జరిగింది.

"The replacement of Textual material in one language by equalent textual material in another language" - Catford.

అనువాదం మూలానికి సమంగా కనీసం సమీపంగానైనా ఉండాలి. అనడం సులభమే కాని ఆచరణలో కష్టం. ఇది సాధారణ విషయాలు మొదలుకొని మహాగ్రంథాల వరకు వ్యాపించింది. అందులోను ఎన్నో ప్రక్రియలు, ఎన్నో ప్రత్యేకతలు. సామాన్యం నుండి విశేషానికి వెళ్ళేకొద్దీ ఈ పని కష్టతరమౌతూ పోతుంది. భాష శైలి అభివ్యక్తి మొదలుగా అనువాదకుని అభిరుచి ఆదర్శం వ్యక్తిత్వం దాకా ఎన్నో విషయాలతో కూడుకొని అవతరిస్తుంది. అనువాద ప్రక్రియ ఎంతో ప్రాచీనమైంది. ఇది ఒక భాష మాట్లాడే వారి ఆలోచనను మరో భాష మాట్లాడేవారికి తెలియజేసే కార్యం. ఒకరి అనుభవాన్ని ఆ భాష రాని మరొకరికి తెలియజేయడంతోపాటు సాంస్కృతిక బంధాన్ని ఏర్పరచడమూ జరుగుతుంది. ఒక్కొక్క భాష ఒక్కొక్క ప్రత్యేకతను కలిగి ఉంటుంది. కాబట్టి అనువాదం సంపూర్ణమైన తృప్తినీయకపోవచ్చు. సోదర భాషలైనా మూల భాష అనువాద భాష ఒకే విధంగా ఉండవు. సోదర భాషలు కాకపోతే మరీ విభేదిస్తాయి. అందువల్ల సాధ్యమైనంత వరకు సమానత్వాన్ని పాటించడం జరుగుతుంది. కొన్ని కొన్ని సందర్భాల్లో ప్రత్యేకతలతో స్వతంత్రమైన వ్యక్తిత్వాన్ని నిలుపుకొనే ప్రయత్నం జరుగుతుంది. అప్పుడు అనుసృజన అవుతుంది. దీనికి కారణాలనేకం.

"Translation is an art. This is a metem-psychosis" - Wilamoultz

అనువాదం ఒక కళ. ఇదో దేహాంతర రూపంగా భావితమైంది. ఎంతో ప్రాచీనమైన అనువాద ప్రక్రియ వివిధ భాషల మధ్య జాతుల మధ్య సంస్కృతుల మధ్య దేశాల మధ్య స్నేహబంధమైంది. ఒక భాషలోని భావ సంపదను మరో భాషలోకి పరివర్తనం చేసే అభిలాష మనిషిలోని ఉదాత్త దృక్పథానికి విశాల భావనకూ నిదర్శనం. అనువాదం యథాతథంగాను యథాసంభవంగాను స్వతంత్రంగానూ ఉండవచ్చు. స్థూలంగా యథాతథంగా ఉండేది అనువాదమనీ, దీనికి భిన్నంగా ఉండేది యథాసంభవ

మనీ స్వతంత్రమై ప్రతిభాయుతమైంది అనుసృజన అనీ అనవచ్చు. అన్నిటినీ కలిపి అనువాదమని అనడం జరుగుతూంది. అనువాదకుని శక్తీ, లక్ష్యం, ప్రతిభనుబట్టి ఒకే రచనకు అనువాదాలు వేరువేరుగా ఉండవచ్చు. విషయం ఒకటే అయినా ప్రయోజనాభిలాషను బట్టి అనువాదం భేదిస్తుంది.

ఒక భాషలో వ్యక్తమైన ఆలోచనల్ని మరో భాషలోకి అనువదించేప్పుడు భాషలో సహజత అభివ్యక్తిలో స్పష్టత అవసరం. సృజనరచనకు కళాత్మకతపై దృష్టి ఉండాలి. రెండు భాషల్లో అభినివేశం లేదా పరిచయం ఉన్న వ్యక్తి ఒక భాషలోని సంపదను మరో భాష మాట్లాడే ప్రజలకు తెలియజేయాలనే సంకల్పం అనువాదానికి దారితీస్తుంది. ఇది ఒక శబ్దం లేదా వాక్యం మొదలు మహా గ్రంథం వరకు పర్యాప్తమైంది. వివిధ భాషలు మాట్లాడే శక్తి ఒక్క మానవజాతికే ఉంది. అందరికీ అన్ని భాషలూ వచ్చే అవకాశం లేదు. వివిధ భాషలు మాట్లాడేవారి సంఖ్య స్వల్పంగానే ఉంటుంది. కనీసం రెండు మూడు భాషలు తెలిసి అందులోను కొంత పాండిత్యం కలిగినవారి సంఖ్య మరీ తక్కువగా ఉంటుంది. మాతృభాషకన్న భిన్నమైన భాష అనేక కారణాలవల్ల నేర్చుకోవడం తటస్థిస్తుంది. ఏవో అవసరాల్నిబట్టి ప్రయోజనాల్నిబట్టి కేవలం భౌతికమే కాక మానసికమైన స్థితి కూడా అనువాద ప్రయత్నానికి దారితీస్తుంది. ప్రపంచంలో ఏ దేశమైనా ఏ జాతి అయినా మానవీయమైన విలువలన్నీ ఒకటే. అయినప్పటికీ జీవన విధానాలు వేరుగా ఉంటాయి. సాంస్కృతిక స్థితిగతులు భిన్నంగా ఉంటాయి. పరిసరాలు పరిస్థితులు మనోరీతులు ఒక్కొక్క భాషలో ఒక్కొక్క విధమైన ప్రత్యేకతలతో సాహిత్యం అవతరిస్తుంది. ఇందులో నిఖిల మానవ సంబంధమైనవీ అందరూ తెలుసుకోవలసినవీ (అంటే ఆ భాష రానివారు కూడా) ఎన్నో! తెలుసుకోవలసిన అవసరమూ ఉంది. ఈ అవసరాన్ని గుర్తించి వారికి తెలియజేసే ప్రయత్న ఫలితమే అనువాదం.

ఒకే సంస్కృతికి చెందిన భాషల్లో అనువాదం ఒక విధంగా సుగమం. ఒకే కుటుంబానికి చెందిన భాషల్లో అనువాదం మరో విధంగా సుకరం. మొదటిదానిలో సాంస్కృతిక వాతావరణం కలిపితే రెండోదానిలో భాషాలక్షణం కలుపుతుంది. సంస్కృతి, భాష రెండూ కలిస్తే మరీ ఉత్తమం. ఆలోచన విజ్ఞానం అనుభవం స్పందనం వివిధ భాషల్లో అనేక చారిత్రక సాంస్కృతిక కారణాలవల్ల ఒక్కొక్క విధాన్ని పొందుతాయి. ఒకరిని గురించి మరొకరు తెలుసుకునే కోరికతో చేసే ప్రయత్నం మనిషిలో సంస్కార లక్షణాన్ని సూచిస్తాయి.

ఇక భాషా విషయానికి వస్తే ఒక్కొక్క భాష అనేక చారిత్రక సామాజిక సాంస్కృతిక కారణాలవల్ల పరిణామక్రమంలో ప్రత్యేకతల్ని పొందుతూ అభివృద్ధి చెందుతుంది. పదం, పదబంధం, వాక్యం, సామెత, జాతీయం, వాక్యాంశం, ఉపవాక్యం కారకంలో ప్రత్యేకతలు కలిగి భాషా స్వరూపం మన దృష్టికి వస్తుంది. మరో భాషలో జరిగే అనువాదంలో ఈ ప్రత్యేకతల్ని సంపూర్ణంగా సాధించడం కష్టం. ఏవో చిన్న చిన్న వాక్యాలు సామాన్య విషయాలు మినహాయిస్తే మూలంలోని అన్ని అంశాల్ని యథావిధంగా యథాక్రమంగా అనువాదంలో తెచ్చే ప్రయత్నం కృతకంగా ఉంటుంది. ఇటువంటి అనువాదాలు సఫలం కావు. అనువాద సమయంలో 1) ఆలోచన-అభిప్రాయాలు, 2) భాష-శైలి, 3) అభివ్యక్తి, 4) కళారూపం ప్రధానంగా దృష్టికి వస్తాయి. మూలకర్తతో కొన్నిటిలో విభేదించడం సహజం. ఆలోచన అనుభవం ఒకే విధమైనప్పటికీ అవి ధరించే ఆకృతి వేరుగా ఉంటుంది. ఒక్కొక్క భాష ఒక్కొక్క విధమైన బహిరంతర్నియమ రూపాల్ని కలిగి ఉంటుంది. అభివ్యక్తి రచయిత వ్యక్తిత్వంలో భాగం. కళారూపం శక్తి సంజాతమైంది. ఇవి అనువాదంలో అనువాద భాషా స్వరూపంతో అనువాదకుని వ్యక్తిత్వంతో అనువాద లక్ష్యంతో ప్రత్యేక రూపాన్ని సంతరించుకొని దానికదిగా సంపూర్ణమైన స్థితిలో అవయవిగా దృష్టికి రావడం గమనించవచ్చు. ఆధునికయుగంలో వివిధ భాషల మధ్య దేశాల మధ్య జాతుల మధ్య సంబంధాలు పెరగడంతో ఒక్క సాహిత్యమే కాదు, శాస్త్ర సంకేతికాలే గాక ఇంకా అనేకానేక విషయాలు అనువదింపబడు తున్నాయి. సంస్కృతి, విజ్ఞానం, సార్వకాలికాలికాలయినంతవరకు అనువాద ప్రక్రియ అవ్యాహతంగా సాగుతూనే ఉంటుంది.

## 2. అనువాద విధాలు

అనువాదం విషయాన్నిబట్టి నాలుగు విధాలు 1) సామాన్యం, 2) సాధారణం, 3) శాస్త్రీయం, 4) సాహిత్యకం, సామాన్యం. సామాన్యమైన విషయాలకు సంబంధించిందీ. దైనందిన జీవితంలో ప్రజలు అవసరాల్నిబట్టి అవలంబించేదీ. వివిధ భాషలు మాట్లాడే ప్రజలు తిరిగే ప్రదేశాల్లో, రాకపోకలు ఎక్కువగా ఉన్న స్థలాల్లో ఒక భాషనుండి మరో భాషలోకి సామాన్య విషయాల ప్రకటన రూపంతో అవసరాల్ని తెలియజేసే వాక్యాలకు సమాచార రూపంతో పరిమితమైందీ. వీటిలో మూలాన్ని తెలుసుకునే అభిలాష ఉండదు. అప్పటికపుడు ఆ పని గడవడం ముఖ్యంగా అనువాదం జరుగుతుంది. అనువాద రూపం ఉంటుంది. తక్కువ పరిధి కలిగిందీ.

సాధారణం : ఇది సామాన్యంకన్నా విస్తృతమైన పరిధి కలిగింది. ఇందులో ప్రకటనలు మొదలుకొని వివరణలదాకా సాధారణమైన విషయాలు కలిగింది. అనేక వాక్యాలతో విషయాన్ని విస్తృతపరచేది. మూలాన్ని తెలుసుకొనే అభిలాషకవకాశం ఉంది. ఆధునిక యుగంలో సాధారణ జీవితంలో దీని అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇందులో మూలంలోని అభిప్రాయాన్ని అందరికీ అవగతం చేయడం ప్రధానలక్ష్యం.

సాహిత్యం : ఇది పూర్వ నుండి వస్తుంది. సృజనాత్మక లక్షణంతో కూడింది. ప్రపంచ భాషలన్నిటిలో ఈ అనువాద విధం కన్పిస్తుంది. దీనికెంతో చరిత్ర ఉంది. ఆలోచన-అభిప్రాయాలు, అనుభూతి-కళ, భాష-అభివ్యక్తి మొదలైన అంశాలతో సంపన్నమైంది. వ్యక్తిత్వంతో ఆకర్షిస్తుంది. వివిధ భాషల మధ్య, దేశాల మధ్య, జాతుల మధ్య సంస్కృతుల మధ్య సంబంధాలకు కారణమైంది. సాహిత్య శక్తి చేత విశిష్ఠతను కలిగింది.

శాస్త్రీయం : శాస్త్ర సాంకేతిక విషయ ప్రధానమైంది, ప్రాచీనమైంది ఆధునిక యుగంలో దీని ప్రాముఖ్యం మరీ పెరిగింది. భాషా దృష్టితో దీని ప్రాముఖ్యం మరీ పెరగింది. భాషా దృష్టితో విషయం ప్రధానంగా అనువాదం జరుగుతుంది. మానవ విజ్ఞానాన్ని అందరికీ అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం ఉంది. సాహిత్యకంలో కవిత్వానువాదం పేర్కొదగింది. నాటకాన్ని నవలనూ విస్మరించడానికి వీల్లేదు. కథ, వ్యాసం, లేఖలు మొదలుగా సాహిత్య ప్రక్రియలన్ని దీని క్రిందికి వస్తాయి.

## 3. కవిత్వానువాదం - అనుసృజన

ఒక భాష నుండి మరో భాషలోకి కవిత్వానువాదం సులభం కాదు. ఇది అందరూ అంగీకరించిన సత్యం. అయినప్పటికీ కవిత్వానువాదాలు అవిచ్ఛిన్నంగా వస్తూనే ఉన్నాయి. ఈ సందర్భంలో 1.శబ్దం 2.భాష 3.శైలి 4.అభివ్యక్తి 5.ఛందస్సు లేదా గమనం 6.ఆవేశస్థాయి 7.అనుభూతి సాంద్రత 8.అర్థస్ఫూర్తి 9.లక్ష్యం అనేవి జ్ఞాపకం వస్తాయి. కవిత్వంలో శబ్దం ఏదో ఒక అర్థాన్ని మాత్రమే ఇచ్చేదిగా ఉండదు. నైఘంటుకార్థాన్ని అధిగమించిన అర్థస్ఫూర్తితో విలసిస్తుంది. ఇది ఒక్కొక్కపుడు అమూర్తమైన భావాలకు ప్రతీకగానూ ఉంటుంది. శబ్ద సంయోజనంతో ఏర్పడే వాక్య విన్యాసం అర్థప్రసార శక్తిని కలిగి ఉంటుంది. రచనకు గతిశీలాన్ని కలిగిస్తుంది. ఇది ఆపైని శైలికి దారితీస్తుంది. సమాహారంగా భావ స్థానాలతో అభివ్యక్తి రూపాన్ని పొందుతుంది. ఇవి దేనికది విడివిడిగా కాక సమాహారంగా వర్తిస్తాయి. ఈ స్థితి ఛందస్సు లేదా గమన రూపంతో

ఆకర్షణీయమౌతుంది. కవి వ్యక్తిత్వాన్ని స్ఫురింపజేస్తుంది. అనువాదంలో ఈ రూపాన్ని తేవడం కష్టమైన పనే. పైగా ఒక్కొక్క భాష ఒక్కొక్క విధమైన ఛందో రూపాన్ని పరంపరగా కలిగి ఉంటుంది. కాబట్టి సాధారణంగా ఈ పరంపరనే అవలంబించడం జరుగుతుంది. దీన్ని కాదని ప్రయోగాలు చేయడమూ జరుగవచ్చు.

కవిత్వం అనుభూతి హృదయం కలిగింది. దీనికొక ఆవేశస్థితి ఉంటుంది. దీన్ని అనువాదంలో తీసుకొని రావడానికి అనువాదకుడా స్థితిని అందుకోవాలి. ఇది యథాతథంగా ఏ విధంగానూ సాధ్యం కాదు. అనువాదకుడు దీన్ని మూలంలోని ఆలోచనతో లక్ష్యంతో సాన్నిహిత్యం వల్ల, సమైక్యం వల్ల సాధించవచ్చు. ఇకపోతే అర్థస్ఫూర్తిని ప్రతిభాశక్తిచేత, లక్ష్యాన్ని దర్శనశక్తిచేత పొందవచ్చు. ఈ దశ అంతర్వ్యక్తిత్వానికి సంబంధించింది. మూలంలోని అంతర్వ్యక్తిత్వాన్ని అదే స్థాయిలో నిర్మించడం కుదరదు. ఇక్కడ అనువాదకుని అంతర్వ్యక్తిత్వం ఏర్పడడం జరుగుతుంది.

శబ్ద భాష శైలి మొదలుగా అర్థస్ఫూర్తీ లక్ష్యం వరకు దేనికది విడివిడిగా విశ్లేషణకందినా ఒకదానికొకటి సానుబంధంగా సావయవ సంపూర్ణంగానే యోజిత మౌతాయి. ఇది సృజన పరిణామంలో సహజంగా జరుగుతుంది. సూక్ష్మమైన అనుభూతి గుణంతో భావుకత్వాన్ని అపేక్షించే కవిత్వం అనువాదకుని ప్రతిభచేత విజయవంతంగా ఆవిష్కృతమయ్యే శక్తి ప్రాప్తిస్తుంది. దీన్ని అనుసృజనగా గుర్తించవలసి ఉంటుంది. ఎన్ని పరిమితులున్నా ఆయా పరిమితుల్లో విశేషమైన అంశాలతో అనువాదాలు అనుసృజనలుగా రాణించడం కన్పిస్తుంది. అనుసృజన రూపాలు మౌలికమైన సాహిత్య కృతులతో సమానంగా నిలచాయి. ఆంధ్రమహాభారతాన్ని దీనికి ఉదాహరణగా గ్రహించవచ్చు. మంచి అనువాదం లేదా అనుసృజన శక్తివంతమైందీ. ఆ భాషలో స్వతంత్రమైన రచనతో సమానమైన ఖ్యాతినీ గౌరవాన్ని పొందడం జరుగుతుంది. అనువాదంలో ఒక దృష్టితో గుణంగానూ మరో దృష్టితో దోషంగానూ కన్పించే సందర్భాలనేకం తటస్థపడతాయి. వీటిని సమర్థవంతంగా నిర్వహించడంలో రచనాశక్తి ఇమిడి ఉంది. కవిత్వానువాదం మూలకర్త బహిరంతర్వ్యక్తిత్వాలపై అనువాదకుని బహిరంతర్వ్యక్తిత్వాల ప్రకాశమాన రూపంగా భావించవచ్చు. బహిర్వ్యక్తిత్వం శబ్దం, భాష, శైలి, ఛందస్సు, గమనం మొదలైన అంశాల్ని కలిగి ఉంటే, అంతర్వ్యక్తిత్వం ఆవేశం అనుభూతి అర్థస్ఫూర్తి, లక్ష్యంతో ఏర్పడుతుంది. వీటి మధ్య ప్రసార కాంతి తప్పనిసరిగా ఉంటుంది. ఇది సృజన శక్తిచేత పరిణమిస్తుంది. అందువల్ల విమర్శలో బహిరంతర్వ్యక్తిత్వాలు విడివిడిగా కన్పించినా భావుక ప్రపంచంలో ఆస్వాద స్థితిలో

ఒకటిగానే అనుభవానికి వస్తాయి. కవిత్వానువాదం దేశదేశాల మనుషుల హృదయాల్ని కలిపే ఉత్తమ సాధనంగా, ఆలోచనా ప్రపంచాల్ని దర్శింపజేసే దర్పణంగా, ఆనంద దాకయమే కాకుండా మానసిక సామాజిక ప్రేరణశక్తిగాను రాణిస్తుంది. యథాతథంచేత అనువాదంగానూ, స్వతంత్రమైన వివక్షచేత అనుసృజనగానూ గుర్తింపవచ్చు.

**కవిత్వానువాదంలో సమస్యలు :**

1. మూలంలోని అన్ని శబ్దాలకూ సమానమైనవి దొరక్కపోవచ్చు, సాధ్యం కాకపోవచ్చు.
2. అలంకారశక్తిని యథాతథంగా తీసుకురావడం కష్టం.
3. భాషాగతమైన వైచిత్రి, విన్యాసం నుండి కాకువు వరకూ నిక్షిప్తమైంది. అనువాద భాషా వైచిత్రి వేరుగా ఉండవచ్చు. భాషా లక్షణాలన్నీ కుదరకపోవచ్చు.
4. మూలంలోని ఛందస్సు అనువాదంలో కుదరకపోవచ్చు. ఆ పరంపర లేకపోవచ్చు, కొత్త ప్రయోగం చేయవలసి రావచ్చు.
5. మూలంలోని ఛందస్సౌందర్యం, శైలీ రామణీయకత తీసుకొనిరావడం కుదరదు. మరో మార్గం సమానమైంది అవలంబించవలసి రావచ్చు.
6. అనువాద సందర్భంలో సహజమైన సృజనాత్మక శక్తిని అణచుకోవడం కష్టం. దీని ఆవిష్కారం సహజంగా జరుగుతుంది.
7. మూల రచయిత పొందిన ఆవేశస్థితి, అనుభూతి సాంద్రత యథాతథంగా అనుభవంలోకి రావడం జరుగదు.
8. మూల రచయిత పొందిన ప్రేరణ మానసిక స్థితి వేరుగా ఉంటాయి. తత్సమానమైన స్థితిని అనువాదకర్త పొందడం కష్టం.
9. అభివ్యక్తి విధానం ఒకటిగా ఉండకపోవచ్చు. శైలినీ వ్యంగ్యాన్ని యథాతథంగా తీసుకరావడం కష్టం.
10. మూలంలోని రచయిత అంతర్బహిర్వ్యక్తిత్వాల్ని అనువాదంలో బింబించడం కుదరదు. ఎంత కాదన్నా అనువాదకర్త వ్యక్తిత్వం బింబిస్తూనే ఉంటుంది.
11. అనువాదం చేసేప్పటి కాలంలోని సామాజిక సాంస్కృతిక ప్రభావాలు తప్పవు.
12. మూల రచన జరిగిననాటి భౌగోళిక సాంస్కృతిక భూమికను అధ్యయనం చేయవలసి ఉంటుంది. మూలరచయిత జీవితాన్ని తెలుసుకోవలసి ఉంటుంది.
13. మూలంలోని అభిప్రాయాలతో లక్ష్యంతో ఏకీభవించినపుడే అనువాదానికి లక్ష్యశుద్ధి ఏర్పడుతుంది. లేకపోతే కొత్తరూపాన్ని పొందుతుంది.

14. మూలంలోని భాష అనువాదంలోని భాష ఒకే కుటుంబానికి చెందనపుడు, ఒకే సాంస్కృతిక రూపం కానపుడు సహజత్వానికి మౌలికతకు క్షతి ఏర్పడవచ్చు.
15. కవిత్వానువాదంలో ముఖ్యంగా స్పందనశక్తి అనుభూతి గుణంతోపాటు దర్శన శక్తినీ పొందవలసి ఉంటుంది.

ఈ సమస్యల్ని దృష్టిలో పెట్టుకునే "Poetry cannot be translated" అన్న మాట ఏర్పడింది. అయితే కవిత్వాన్ని అనువదించలేకపోవచ్చు. కాని అనుసృజన చేయడం జరుగుతుంది. ఇది పరిణామ సహజం.

## 4. నాటకానువాదం

సృజనాత్మక సాహిత్యంలో నాటకానికి గల ప్రాముఖ్యం "నాటకాంతం హి సాహిత్యం" అన్న ప్రసిద్ధమైన సూక్తినిబట్టే తెలుస్తుంది. సాహిత్యంలో ఒక్కొక్క ప్రక్రియకు ఒక్కొక్క విధంగా అనువాద కార్యాన్ని చేపట్టవలసి ఉంటుంది. ప్రతి ప్రక్రియలో మరో ప్రక్రియతో భేదించే లక్షణాలతో పాటు సమానమైనవీ ఉంటాయి. అందులోను కావ్యానికీ నాటకానికీ సమానమైన అంశాలెక్కువగానే ఉన్నాయి. అయితే విభేదించే అంశాల్ని గుర్తిస్తూ నాటకలక్షణాల పరిజ్ఞానంతో అనువాదానికి పూనుకోవడం అవసరం. కవిత్వం బాహ్యరూపంలో వర్ణనాత్మకమైతే నాటకం సంభాషణాత్మకంగా కన్పిస్తుంది. నాటకంలో కవిత్వం ఉండవచ్చు. ప్రాచీన నాటకాల్లో అయితే తప్పనిసరిగా ఉంటుంది. ఈ కారణంగానే మహానాటక కర్తల్ని మహాకవులుగా పరిగణించడం జరిగింది. నాటకంలో మధ్య మధ్య కవిత్వం ఛందోరూపంలో ఉంటుంది. సంభాషణ రూపంలో వచనం కన్పిస్తుంది. వీటి అనువాదం కవిత్వానువాదం క్రిందికే వస్తుంది. వివిధాంశాల్లో సన్నివేశ నిర్మాణాలతో కూడిన దృశ్యాలు నాటకానికి సోపానాలు. ఇవి పాత్రల సంభాషణ లతో కల్పితమైన స్థితులతో నిలుస్తాయి. నాటకానికి సంబంధించినంతవరకు అనుభవం దృష్ట్యా 1) కేవల పఠనయోగ్యాలు, 2) ప్రదర్శనీయాలని విభజించవచ్చు. నాటకానువాద సందర్భంలో ఈ ప్రయోగావసరాన్ని గుర్తించడం అవసరం. ఇది కాల పరిమితి కలిగింది కావడంవల్ల నాటకంలో ఎన్నో సంఘటనలు ఊహకు వదిలివేయ బడతాయి.

నాటకానువాదానికి నాటక సిద్ధాంత పరిచయంతోపాటు రంగస్థల పరిజ్ఞానం అవసరం. నాటకంలో వాడిన భాష – దాని స్వరూప స్వభావాలు, ఏ కాలానికి చెందినది తెలుసుకోవాలి. నాటకంలో అభినయంతోపాటు సంభాషణ ముఖ్యం కాబట్టి ఈ రెండింటిని గురించి అధ్యయనం చేయవలసి ఉంటుంది. ముఖ్యంగా సంభాషణలో మానసిక స్థితినీ, భాషాశక్తినీ, ప్రయోగ వైచిత్రినీ గమనించవలసి ఉంటుంది.

మూలనాటకానికి సంబంధించిన చారిత్రక పరిణామ దశలతో పాటు ఆ నాటకం వెలువడిన నాటి సామాజిక స్థితుల్ని గురించి తెలియడం అవసరం. నాటకంలో వస్తువు ఏ కాలానికి చెందినదో ఆనాటి సామాజిక వాతావరణం గురించి కూడా ఆలోచన చేయాలి. రంగస్థలానికి సంబంధించిన సాంకేతిక సాధనాలు వాటి ప్రభావమూ తెలియాలి. ఇవి నాటకానికెంతో ఆకర్షణీయతను సిద్ధింపజేస్తాయి.

నాటకాన్ని సాహిత్య దృష్టితో అనువదించడం ఒక పద్ధతి. ఇది సులభం. నాటకాన్ని ప్రదర్శనీయ దృష్టితో అనువదించడం మరో పద్ధతి. సాహిత్యపరంగా కవితామయంగా వర్ణనా ప్రధానంగా ఉన్నది. ప్రయోగార్హతను లోపిస్తుందని కొందరి అభిప్రాయం. ఈ మాట నిజం కాదని మరికొందరి అభిప్రాయం. దీన్ని రంగస్థల పరిజ్ఞానంతో చక్కగా సాధించవచ్చు. అయితే ఇది సాహిత్యంతో బాగా పరిచయమున్న వారికోసం ఉద్దేశింపబడిన మాట నిజం. అంతమాత్రాన ప్రయోగార్హతను కోల్పోదు. పఠనయోగ్యమైన నాటకంలో భాష శైలి అభివ్యక్తి విధానం వేరుగాను ప్రయోగార్హ నాటకంలో భాష శైలి అభివ్యక్తి విధానం వేరుగాను ఉంటుంది. ప్రయోగార్హమైన నాటకంలో సౌలభ్యం ఎక్కువ. జనాకర్షణ గుణంతో అలరిస్తుంది. అందువల్ల దేని ప్రయోజనం దానిదే.

నాటకాన్ని కావ్యం అనుకోకూడదు. నాటక ప్రక్రియ ఉద్దేశాన్ని గురించి ప్రయోజనాన్ని గురించి ఆలోచన అవసరం. ఎదురుగా ప్రేక్షకులున్నారన్న విషయం గుర్తుపెట్టుకోవాలి. వాళ్ళ మనస్సులోకి సంభాషణ సూటిగా ప్రవేశిస్తుందన్న భావం ఉండాలి. అందువల్ల అనువాదంలో సంభాషణలోని మానసిక స్థాయి శక్తికి లోపం రాకూడదు. సహజత, సౌందర్యం, ఆకర్షణ కోల్పోకూడదు. సంభాషణతో పాటు పేర్కొదగింది అభినయం. అభినయం గురించి శాస్త్ర పరిజ్ఞానం అవసరం. నాటకం ప్రయోగ నైపుణిచేతనే రక్తి కడుతుందన్న అంశాన్ని మరవకూడదు. ఇది పరిమితమైన కాలంలో రంగస్థలంపై పాత్ర రూపాల్ని ధరించిన వ్యక్తులచేత ఆడబడే దృశ్యప్రక్రియ. ఎంత పెద్ద కథ అయినా పరిమితమైన కాలంలో కుదించబడుతుంది. ఈ సంగ్రహరూపాన్ని సంయమనంతో సంక్షిప్తతతో కథాభాగాల్ని నిర్వహించే రచనాశక్తి అవసరం. కథలో చాలా భాగం ప్రదర్శింపబడదు. కథలో వదలిన భాగాలన్నీ సూచితమౌతాయి. సామాజికుల ఊహకు వదలివేయబడతాయి. అయితే ప్రధానమైన అనివార్యమైన వివిధాంశాల సముచిత సంయోజన శిల్పంతో సంపూర్ణతను భావింపజేస్తుంది. నాటకంలో పలు సందర్భాల్లో ఎన్నో అంశాలు వివిధ సంకేతాలతో సూచనలతో సాంకేతిక విధానాలతో నాటక శాస్త్ర మర్యాదలతో ప్రవృత్తమౌతాయి. అనువాదం చేసే రచయిత ఈ అంశాల్ని క్షుణ్ణంగా తెలుసుకోవడం అవసరం. ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రయోగ విజ్ఞానాన్ని

కూడ కలిగి ఉండడం మంచిది. ప్రదర్శన భాగం తరువాత ఇక రచనా విభాగానికి వస్తే భాష శైలి పదబంధాలు సామెతలు జాతీయాలు సంభాషణల్లోని వైచిత్రి మొదలైనవి సాహిత్యపరమైన అంశాల పట్ల శ్రద్ధ అనివార్యం.

నాటకంలో వచ్చే పలు విధాలైన పాత్రలు ఉన్నత మధ్యమ దిగువ తరగతికి చెందిన వ్యక్తుల ప్రతిబింబాలే. కాబట్టి వీటి వెనుకనున్న జీవన స్థితిగతుల్ని వాస్తవశక్తుల్ని గురించి అధ్యయనం చేయవలసి ఉంటుంది. వివిధ వృత్తులవారు కార్మికులు, కర్షకులు, ప్రభువులు, ఉద్యోగులు, సామాన్యులు, విద్యావంతులు. ఇట్లా వారివారి ఆలోచనా సరళిని, అలవాట్లను, పలుకుల్నీ స్త్రీ పురుష పాత్రల ప్రవర్తనల్నిబట్టి పరిశీలించవలసి ఉంటుంది. అప్పుడు మూలనాటకంతో సంపూర్ణ పరిచయం బలపడుతుంది. భావైక్యం కలుగుతుంది. అనువాదం చేసే నాటకంలోని వస్తువు దృష్ట్యా ఇతివృత్త నిర్మాణం దృష్ట్యా భౌతిక సామాజిక వాతావరణాన్ని, పాత్ర వైయక్తిక మానసిక ధోరణులను గురించి ప్రత్యేకంగా అధ్యయనం చేయవలసిన అవసరం ఉంది. నాటక రచనను బట్టి అభినయానుగుణంగా అందులో పాత్రల వివేచనకై అవసరమైన పరిజ్ఞానాన్ని పొందడంలో దోషం లేదు. ఇది మంచి నాటకానువాదానికి తోడ్పడే మాట వాస్తవం. నాటకానికి సంబంధించిన విజ్ఞానంతో ప్రదర్శనకు సంబంధించిన పరిశీలనంతో నాటకానువాదాన్ని విజయవంతంగా నిర్వహించవచ్చునన్న మాటలో యథార్థం అనుభవానికి మాత్రమే అందే నిజం.

## 5. అనువాద పద్ధతులు

అనువాదం ఒక ప్రయోజనపరమైన కళ. ఒక భాషలోని రచనా స్వరూపాన్ని మరో భాషలోకి పరివర్తింపజేసే సాధనా రూపం. గొప్ప గ్రంథాల అనువాదంలో మూల రచయిత ప్రతిభతో శిల్పశక్తితో సమానంగా అనువాదకర్త కన్పించడం కద్దు. దీనికెంతో ప్రతిభ, పాండిత్యం, ఏకాగ్రత, శ్రద్ధ, నైపుణి అవసరమౌతాయి. ఇది అనువాదంలో సృజనాత్మక సాహిత్యానికి బాగా వర్తిస్తుంది. ఆధునిక యుగంలో సమాజావసరాల్ని బట్టి తత్కాల ప్రయోజనంతో శబ్దం–వాక్యం మొదలుకొని అనేక రూపాలుగా అనువాదాలు గోచరిస్తాయి. పూర్వం నుండి వచ్చే సాహిత్యంతో పాటు ఈనాడు సాహిత్యేతరం కూడా అనువాద ప్రపంచంలో బహు విస్తారంగా ఉంది. ఈనాటి పెక్కు అవసరాల్ని కూడా దృష్టిలో పెట్టుకొని వ్యవహార ప్రపంచం నుండి ఆలోచనా ప్రపంచం దాకా విశ్లేషణం చేస్తే ఈ క్రింది అనువాద పద్ధతులు దృష్టికి వస్తాయి. 1) పద–వాక్యానువాదం, 2) భావానువాదం, 3) ఛాయానువాదం, 4) సారసంగ్రహానువాదం, 5) వ్యాఖ్యానువాదం, 6) రూపాన్తరం, 7) ఆశు అనువాదం, 8) స్వతంత్రానువాదం.

**పద-వాక్యానువాదం :**

పదానువాదంలో కేవలం పదానికి మాత్రమే ప్రాముఖ్యం ఉంటుంది. మూలంలోని పదానికి సరియైన పదం ప్రయుక్తమౌతుంది. రండి=ఆయియే. వాక్యాను వాదంలో పదక్రమాన్ని పాటించే ఒక విధం, పదక్రమాన్ని పాటించని మరో విధం కన్పిస్తాయి. 1) పదక్రమాన్ని పాటించే విధం - మీరు రండి=ఆప్ ఆయియే. 2) పద క్రమాన్ని పాటించని విధం – ఇక్కడికి రండి=కమ్ హియర్. ఈ అనువాదం సహజమైంది. ఇంగ్లీషు పొజిషనల్ లాంగ్వేజ్ (Positional Language). పద స్థానాన్ని బట్టి అర్థం అవగతికి వస్తుంది. కాబట్టి ఇట్లా అనువదించడమే సముచితం. ఆధునిక యుగంలో భారతీయ భాషలు ప్రయోజనాత్మకమైన పాత్రను బహు విస్తృతంగా నిర్వర్తించవలసి వస్తుంది. చాలా సందర్భాల్లో పాలన న్యాయపాలన మొదలుగా అర్థావగతికీ పద్ధతి బాగా నప్పుతుంది. ఒక పదం నిర్దుష్టమైన అర్థాన్ని తెలుపుతుంది. బాగానే ఉంది. కాని ఒకటికన్న ఎక్కువ పదాలు కలిసి, కారకం చోటు చేసుకునేప్పటికి, ఆయా భాషల లక్షణాల్నిబట్టి అనువాద సమస్య ఉత్పన్నమౌతుంది. అనువాదం సహజ సుందరంగా ఉండేందుకు మూలభాష మరియు అనువాద భాషా లక్షణాలు బాగా తెలిసి ఉండాలి. పదబంధాలు జాతీయాలు సామెతలు పట్ల జాగ్రత్త వహించవలసి ఉంది. ఉదాహరణకు అతడు చాపక్రిందికి నీరు తెచ్చాడు. ఇందులో ఏ ఆపదనో వ్యతిరేకతనో చాటుమాటుగా చేసే హానినో తెలుపుతూంది. దీనితో సమానమైంది. మరో భాషలో వెతకాలి. పదానికి పదం వాక్యానికి వాక్యం అనేవి అర్థాన్నిబట్టి ప్రయోజనాన్నిబట్టి ఔచిత్యంతో భాషా సహజత్వానికి భంగం రాకుండా అనువాదాన్ని నిర్వహించవలసి ఉంటుంది.

**భావానువాదం :**

భావానువాదంలో వాక్యంలోని భావంపై మాత్రమే దృష్టితో అనువాదం చేయడం జరుగుతుంది. శబ్దంపైకాని వాక్యంపై గాని దృష్టి ఉండదు. శబ్దమనే భౌతిక రూపంపై కాక అర్థం లేదా ఆలోచన లేదా భావం అనే ఆంతర రూపంపై శ్రద్ధ వహించడం కన్పిస్తుంది. ఇందులో వాక్యం-వాక్యాలు పేరాలోని భావజాలంపై దృష్టి ఉంటుంది. ఇది విషయాన్నిబట్టి మార్పుల్ని కోరుతుంది. ఉదాహరణకు శాస్త్ర విషయమైతే సాధ్యమైనంత వరకు శబ్దం-వాక్యం-వాక్యాలపై శ్రద్ధతో భావానికి క్షతి రాని విధంగా అనువాదం సాగుతుంది. బాహ్యరూపం అనువాద భాషకు సంబంధించింది. ఇందులో శబ్దాల ఎన్నిక నుండి వాక్యం శైలి మొదలుగా అనువాదకుని రచనా వ్యక్తిత్వాన్ని పొందుతుంది. భావం మూల విధేయంగా తప్పనిసరిగా ఉంటుంది.

**ఛాయానువాదం :**

ఛాయానువాదంలో వాక్యానికి ప్రతి వాక్యంగా అనువదింపబడుతుంది. సంస్కృత నాటకాల్లో ముఖ్యంగా స్త్రీ పాత్రలూ, సమాజంలో క్రిందిస్థాయికి చెందిన పాత్రలు మాట్లాడవలసి వచ్చినపుడు ప్రాకృత భాష ఉపయుక్తమౌతుంది. దీనికి సంస్కృతచ్ఛాయ కూడ ఉంటుంది. ఇది వచనంలోను ఛందస్సులోను ప్రయుక్తమౌతుంది.

వచనం - ప్రాకృతం : అజ్జ! కిం దావ దేవీ ఎ ణి వేదేమి!

సంస్కృతం : ఆర్య! కిం తావద్దేవ్యై నివేదయామి!

శ్లోకం - ప్రాకృతం : ఈషదీషచ్చుమ్బి ఆఇం బమరేహి ఉహ సుఉమార కేసర సిహాఇం
ఒ దంసఅతి దఅమాణా పమదా ఓసిరీస కుసుమాఇం

సంస్కృతం : ఈషదీషచ్చుమ్బితాని భ్రమరైః పశ్య! సుకుమార కేసర శిఖాని
అవతంసయన్తి దయామానాః ప్రమదాః శిరీష కుసుమాని.

కొంచెం కొంచెం చుంబిస్తూ తుమ్మెదల సమూహం దేని రసాన్ని అయితే గ్రహిస్తున్నాయో, ఆ కేసరాలతో కూడుకున్న గుచ్ఛాలుగల శిరీష పుష్పాలను ప్రమదలు దయాభావంతో కర్ణాభరణాలుగా అలంకరించుకుంటున్నారు.

**సంగ్రహానువాదం :** ఇది మూలంలోని సారభూతమైన విషయాన్ని లేదా సంగ్రహంగా విషయాన్ని అనువదించే లక్షణం కలిగింది. ఇందులో సంక్షిప్తత ముఖ్యం. అయితే విషయంలోని ప్రధానమైన అంశాలు మాత్రం తప్పనిసరిగా ఉండాలి. మహాగ్రంథాల్ని, మహావిషయాలను, సామాన్యులకందుబాటులోకి తేవడానికీ పద్ధతి అవలంబింప బడుతుంది. సంక్షిప్తతతోపాటు సరళత కూడ అవసరం. జాతీయాంతర్జాతీయ తలం నుండి టెలిప్రింటర్‌పై ఇంగ్లీషులో వచ్చే మహాప్రసంగాలను వార్తాపత్రికల్లో సారరూపం లోనూ సంగ్రహరూపంలోను అప్పటి అవసరాల్నిబట్టి పరిమితుల్నిబట్టి అనువాదం ప్రకటిత మవుతుంది. ఆధునికయుగంలో ఈ పద్ధతి పలుచోట్ల అనుసరింపబడుతూంది. దేశభాషలు తమ ప్రయోజనాత్మకమైన పాత్రను నిర్వహించేందుకిది ఎంతగానో తోడ్పడుతూంది. ఆధునికమైన అవసరాలకు బాగా ఉపకరిస్తూంది.

**భాష్యానువాదం :** ఇది మూలాన్ని వ్యాఖ్యానరూపంలో అనువదించే పద్ధతి. అనువాదకుడు అవసరమనుకున్న సందర్భాల్లో పలు అంశాల్ని వివరించడం సమర్థించడం కొత్త దృక్పథాన్ని ఇవ్వడం మొదలుగా పర్యాప్తమైంది. అనువాదకుడు కేవలం అనువాదకర్తగానే కాక, మూలాన్ని గౌరవిస్తూనే ఇంకా అదనంగా కొన్ని విషయాలు చెప్పే ప్రయత్నం చేత స్వతంత్రమైన వ్యక్తిత్వంతో అనువాదం భాసిస్తుంది. ప్రాచీన మహాగ్రంథాలకీ పద్ధతిలో

ఎన్నో భాష్య వ్యాఖ్యా రూపాలు కన్పిస్తాయి. ఇటీవల బాలగంగాధరతిలక్ భగవద్గీతానువాదం సుప్రసిద్ధమైంది భాష్యానువాదమే.

మూలకర్త అభిప్రాయాలకు వివరణంతో మూలంలోని అంశాలకు విస్తరణంతో ఆవిష్కృతమవడం మూలంకన్న అధికమైన రూపాన్ని పొందుతుంది. అనేక శాస్త్ర గ్రంథాలు ఖండన మండనాదులతో వ్యాఖ్యాతమవడం కన్పిస్తుంది. ఇది ప్రాచీన భారతీయ విద్యాపరంపరలో భాగంగా నిలిచింది.

**రూపాన్తరణం :** ఇది ఒక ప్రక్రియనుండి మరో ప్రక్రియకు రూపంలో మార్పుతో చేసే అనువాదం. నాటకాన్ని కావ్యంగానో కావ్యాన్ని నాటకంగానో, నవలను నాటకంగానో, కథను కావ్యంగానో ప్రక్రియారూపాన్ని మార్చే పద్ధతికి చెందింది. అనువాదకర్త అభిప్రాయాన్నిబట్టి ఇది సంక్షిప్తం కావచ్చు. విస్తృతం అవచ్చు. ఇటీవల మాలపల్లి నవల రేడియో నాటకంగా రూపాన్తరంతో ప్రసారం చేయబడింది.

ఈ రూపాన్తరం మరో విధం కూడ ఉంది. ఒక నాటకంలో కావ్యంలో నవల్లో లేదా మరే ఇతర ప్రక్రియలోనో మూలంలోని స్థలాల పేర్లు పాత్రల పేర్లు దేశ కాల సామాజిక సాంస్కృతిక పరిస్థితుల్నిబట్టి రూపాన్తరం చేయబడతాయి. ఉదాహరణకు షేక్స్పియర్ మర్చెంట్ ఆఫ్ ఆవెనిస్ నాటకంలోని వెనిస్‌ను వంశపురమనీ, ఆంటినోను అనన్త అని, పోర్షియోను పురశ్రీ అనీ, వైసోనియాను వసన్త అని రూపాన్తరం చేయబడినాయి. ఇవి మూలంలోని శబ్దాల ఉచ్చారణ ధ్వనికి సమీపంగా ఉండే శబ్ద యోజనం చేయబడతాయి. దీనివల్ల అనువాదంలో పాఠకులు దేశీయతా భావాన్ని పరిచయ సాన్నిహిత్యానుభవాన్ని పొందడం జరుగుతుంది.

**ఆశు లేదా వార్తానువాదం :**

ఒక భాషలో చేసిన ప్రసంగాన్ని మరో భాషలో చెప్పవలసి వచ్చినపుడు, ఒక భాషలో వెలువడిన వార్తను మరో భాషలో వెలువరించవలసి వచ్చినపుడు ఈ పద్ధతి అవలంబింపబడింది. ఒక ప్రసంగాన్ని లేదా సంభాషణను మరో భాషలోనికి పరివర్తితం చేసి చెప్పే అనువాదకుని ఇంటర్‌ప్రెటర్ అని కూడ అంటారు. ఒకరి భాష మరొకరికి తెలియనప్పుడు ఆ ఇద్దరు సంభాషించుకోవలసిన సమయంలో ఈ రెండు భాషలు తెలిసిన వ్యక్తి ఒకరి అభిప్రాయాన్ని మరొకరికి చెప్పడం జరుగుతుంది. ఈ పనిచేసే వ్యక్తిని దుబాసి (ద్విభాషి) (రెండు భాషలు మాట్లాడగలిగేవాడు) అని అంటారు. అనువాదకునికి రెండు భాషల్లో ప్రావీణ్యంతోపాటు అప్పటికప్పుడు ఒకరి అభిప్రాయాన్ని

మరొకరికి చెప్పగలిగే వాక్నైపుణ్యం కూడా ఉండాలి. ఇక్కడ శబ్దాన్ని కాని భావాన్ని కాని వాక్యాన్ని కాని సరిదిద్దుకునే అవకాశమే ఉండదు. సద్యఃస్ఫూర్తి అవసరం. ఆధునిక యుగంలో వివిధ దేశాల మధ్య సంబంధాలు పెరుగుతున్న సమయంలో దీని అవసరం ఉంది. రాజకీయ పాలనా వ్యాపార వ్యవహారాల్లో వివిధ రంగాల్లో ఆశు అనువాదం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటూంది.

వార్తానువాదం పత్రికా ప్రపంచంలో విఖ్యాతమైంది. ఏ రోజుకారోజు ఏ పూటకా పూట అప్పటికపుడు అంతర్జాతీయ జాతీయ స్థాయిలో ఒక భాషలో వచ్చిన వార్తల్ని మరో భాషలోకి అనువదించవలసి ఉంటుంది. సమయం తక్కువ, పనిలో వేగం వల్ల పరిమితమైన కాలం వల్ల అనువాద సమయం వేగాన్నీ, వివేకాన్ని సామర్థ్యాన్ని అపేక్షిస్తుంది.

**స్వతంత్రానువాదం :** మూలాన్ని అంటే మూలంలో విషయాన్ని కేంద్రభూమిగా తీసుకొని అందులోని వివిధాంశాల్ని ఆధారంగా చేసుకొని స్వతంత్రమైన రూపంతో అనువదించడం స్వతంత్రానువాదం. అనువాదకునికి స్వేచ్ఛ ఉంటుంది. ఈ స్వేచ్ఛ మూలంలో విషయ సీమల వరకు, వివిధాంశాల మేరలోను ఉంటుంది. కాని మిగతా విషయాల్లో తన వ్యక్తిత్వాన్ని బింబించడం జరుగుతుంది. ఇది అనువాదకునిలోని సృజనాత్మకతను, స్వతంత్రప్రవృత్తిని, రచనాశక్తిన ప్రకటిస్తుంది. దీనికి మూలంలోని భాషపై కన్నా భావం, అభిప్రాయం, లక్ష్యం ముఖ్యమౌతాయి. తనదైన శైలినీ అభివ్యక్తినీ కలిగి ఉంటుంది. పోతన భాగవతాన్ని ఈ సందర్భంలో పేర్కోవచ్చు.

మరో దృష్టితో సాహిత్య ప్రపంచంలో 1) కథానువాదం, 2) భావానువాదం, 3) పదానువాదమనీ అనుభవంలో మెదలుతాయి.

**కథానువాదం :** మూల గ్రంథంలోని కథా విషయాన్ని గ్రహించి, ప్రధానమైన సంఘటనల్ని విడవకుండా వర్ణనలో పాత్రచిత్రణలో సన్నివేశ కల్పనలో స్వతంత్రమైన పద్ధతి ననుసరించి చేసే అనువాదం. ఇది అనువాదకుని ప్రతిభాశక్తిని నిర్వహణ సామర్థ్యాన్ని ప్రతిఫలింప జేస్తుంది. ఈ మార్పులు ఆనాటి అవసరాల్ని బట్టి అనువాదకుని దృక్పథాన్నిబట్టి చేయడం జరుగుతుంది. తెలుగులో కవిత్రయ భారతం ఉదాహరణగా పేర్కోవచ్చు.

**భావానువాదం :** మూలగ్రంథంలోని భావజాలంపై దృష్టి ఉంటుంది. దీన్ని గ్రహించి తనదైన సహజమైన శైలిలో అభివ్యక్తం చేయడం జరుగుతుంది. కథాంశాల గమనంపై దృష్టికన్నా వర్ణనపై కథలోని పాత్రల మనోభావాలపై శ్రద్ధ కన్పిస్తుంది. భావనలో శైలిలో ప్రత్యేకతలతో తనదైన ముద్ర ఉంటుంది. లక్ష్యం ఒకటే అయినా ఎన్నుకున్న

మార్గం భిన్నంగా ఉంటుంది. ఇది అనువాదకుని విశిష్ట వ్యక్తిత్వాన్ని భావింపజేస్తుంది. దీనికి తెలుగులో శ్రీనాథుని కృతులు ఉదాహరణగా గ్రహించవచ్చు.

పదానువాదం : మూలంలోని పదపదంపై దృష్టితో అనువాదం సాగుతుంది. ఇది ఏదో యాంత్రికంగా కాకుండా మూలకర్తపై అచంచల విశ్వాసంతో ప్రతి పదం ఏదో రహస్య గర్భితమై ఔచితీ విలసితమై ఉంటుందన్న ప్రత్యయం పనిచేస్తుంది. మూలంలోని భావంపై లక్ష్యంపై కూడ దృష్టితో మూలవిధేయంగా అనువాదం ప్రకటితమౌతుంది. సాధ్యమైనంతవరకు మూలంలోని పదజాలాన్ని ఆవిష్కరించే ప్రయత్నం కన్పిస్తుంది. ఇది చాలా క్లిష్టమైన పని. ఇందులో అనువాదకుని స్వతంత్రమైన వ్యక్తిత్వం ఎక్కువగా భాసించే అవకాశం లేదు. ఈ పద్ధతిలో వ్రాసింది శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి శ్రీకృష్ణ భారతాన్ని పేర్కోవచ్చు. నాటకంలో సంభాషణలు ఈ పద్ధతిలోనే ఉంటాయి. నాటక ప్రక్రియలోని కొన్ని పరిమితుల దృష్ట్యా ఈ పద్ధతినవలంబించక తప్పదు.

ఎన్నో విధానాలతో పద్ధతులతో ఒక భాష నుండి మరో భాషలోకి అనువాదాలు నిరంతరం జరుగుతూనే ఉంటాయి. ఇది నిఖిల మానవజాతి బంధాన్ని విలువల్ని చిరంగా నిలుపుతుందనడంలో సందేహం లేదు. వివిధ భాషల మధ్య ఆదాన ప్రదాన సంస్కృతీ రూపమే అనువాదం.

## 6. అనువాద సమస్యలు - పరిభాష

విద్యా బోధనా భాషగా తెలుగు ఈనాడు ప్రాథమికం నుండి కళాశాలా స్థాయి వరకు అన్నిరంగాల్లో ప్రవేశపెట్టబడింది. విజయవంతంగా నిర్వహింపబడుతూంది. దీనికై తెలుగు ఎకాడమీ తెలుగులో గ్రంథ ప్రచురణం గావించి విశేష కృషి చేస్తూంది. అయితే స్నాతకోత్తర స్థాయిలో మానవీయ శాస్త్రాల వరకు మాత్రమే పాక్షికంగా పరిమితమై ఉంది. విజ్ఞానశాస్త్ర సాంకేతిక రంగాల్లో ఇంకా ప్రవేశింపలేదు. ఇంకా జరుగవలసిన కృషి ఎంతో ఉంది. 1) వివిధ దశల్లో వివిధ స్థాయిల్లో విద్యార్థుల కుపయోగపడే విధంగా విషయ పరిజ్ఞానంపై దృష్టితో గ్రంథాలు రావలసి ఉంది. ఒక్క పాఠ్యగ్రంథంతోనే ఈ విద్య సమాప్తి కాదు. ఒక్కొక్క దశకు ఒక్కొక్క స్థాయిలో భాష విషయ పరిజ్ఞానం పరిమితులు చోటుచేసుకుంటాయి. 2) తెలుగులో విశేష ప్రసంగాలు లేదా విస్తరణోపన్యాసాలు ఏర్పాటు చేయడం, 3) తెలుగులో క్విజ్‌లు నిర్వహించడం, 4) తెలుగులో విషయ విభాగం దృష్ట్యా పత్రికల్ని నిర్వహించడం, 5) తెలుగులో పుస్తకాల సేకరణతో విద్యార్థుల కుపయోగపడే విధంగా గ్రంథాలయాల్ని నిర్మించడం, 6) అనువాదాల విషయంలో ముఖ్యంగా శాస్త్ర సాంకేతిక క్షేత్రాలకు సంబంధించినవాటి పట్ల శ్రద్ధతో వ్యవహరించాలి.

**పదాల ప్రామాణీకరణం జరగాలి :** పదాల ప్రామాణీకరణాన్ని ఆయా క్షేత్రాల్లో అనుభవజ్ఞులైన నిష్ణాతులైన వ్యక్తులతో ఏర్పడిన నిర్ణాయక మండలి ద్వారా చేయవచ్చు. ఎందుకంటే ఉదాహరణకు స్టాటిస్టిక్స్ (Statistics) ను ఒకరు స్థితిశాస్త్రమనీ, ఇంకొకరు నిశ్చల శాస్త్రమనీ, ఇంకొకరు ఘనశాస్త్రమనీ, మరొకరు మరొక పదమూ వాడడం మాని ఇంగ్లీషులోవలె ఒక పదం ప్రామాణీకృతం కావాలి. అదేవిధంగా మరో ఉదాహరణ - రిప్రొడక్షన్ (Reproduction) ను ఒకరు పునరుత్పత్తి అని, ఇంకొకరు సంతానోత్పత్తి అనీ, మరొకరు ప్రత్యుత్పత్తి అనీ, మరొకరు మరొక పదమూ వాడడం మాని ఇంగ్లీషువలె ఏదో ఒక పదం ప్రామాణీకృతం కావాలి. ముఖ్యంగా పదాల విషయంలో ఒక పరంపర ఏర్పడాలి. అందరు ఆ పదమే వాడే సంప్రదాయం సిద్ధించాలి.

2) ఇంగ్లీషులో సాధారణంగా ఉదాహరణకు వృక్షశాస్త్రం తీసుకుంటే మొక్కల పేర్లు ఎక్కువగా ఏ లాటిన్ భాషకో, ఏ గ్రీకు భాషకో చెందినవై ఉంటాయి. ప్రాంతీయ భాషా విద్యార్థికి సులభంగా అర్థమయ్యేందుకు ఇంగ్లీషులో పేరుకు సమానంగా తెలుగులో వాడుకలో ఉన్నదానిని ఇవ్వవచ్చు. దీనివల్ల శాస్త్ర విషయం సులభంగా అవగతమయ్యే అవకాశముంది. ఉదాహరణకు (Helianthus) (helius=sun ; anthos=flower) అంటే సూర్యముఖి లేదా ప్రొద్దుతిరుగుడు పువ్వు అని బ్రాకెట్‌లో ఇవ్వవచ్చు.

న్యాయశాస్త్రంలో ఒకే అర్థం వచ్చేట్లు పైకి కన్పించే పదాన్ని వివిధ సందర్భాల్లో వాడడం కద్దు. వీటిని పరిశీలించి తెలుగులో ఏ పదానికాపదం రూఢంగా ఉపయోగంలో ఉండేట్టు చూడాలి. అవసరమైతే కొత్త పదాల్ని నిర్మించుకోవాలి. అది సాధ్యం కాకపోతే మరో భాష నుండి లేదా ఇంగ్లీషు భాష నుండి స్వీకరించవచ్చు.

ఉదాహరణకు 1) Investigation (by the Police), 2) Inquiry (by the Magistrate), 3) Trial (by the Judge). ఈ మూడింటికి తెలుగులో విచారణ అనే పదాన్ని వాడడం సముచితం కాదు. దీనివల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయి. న్యాయస్థానాల్లో తీవ్ర పరిణామాలకూ దారితీయవచ్చు. ఇదే విధంగా ఈ పదాలన్నీ అర్థంలో సూక్ష్మ భేదాలతో అనుభవంలో కన్పిస్తాయి. తెలుగులో వీటికి ఒక్కొక్క దానికి సరియైన పదం రూఢం కావాలి. ఇది ఒక పరంపరగా జరగాలి. అందరూ ఆ పదమే వాడే సంప్రదాయం ఏర్పడాలి. మరొకటి : Announcement, Publication, Advertisement, Broadcasting, Declaration పదాలకు, తెలుగులో సరియైన పదాలు రూఢం కాలేదు. ఇట్లా అనేకం ఉన్నాయి. సాధారణ వ్యవహార జగత్తులో దీన్ని

వదిలేసి విద్యా మాధ్యమంగా ప్రవేశపెట్టే తెలుగులో విషయ పరిజ్ఞానం కోసం భాషా విస్తృతిపై వైవిధ్యంపై దృష్టితో విద్యార్థుల సౌకర్యం కోసం పరిశోధకుల విద్యాధికుల ఉపయోగం కోసం, ప్రతిపదం ప్రామాణీకృతం కావాలి. రూఢార్థం ఏర్పడాలి. అవి స్థిరత్వాన్ని పొందాలి. అప్పుడుగాని తెలుగు భాషే కాదు ఏ ప్రాంతీయ భాష అయినా ఇంగ్లీషు భాషతో సమానంగా తలెత్తుకొని నిలుస్తుంది. గౌరవాన్ని పొందుతుంది. ప్రయోజనాన్ని నెరవేరుస్తుంది.

ఈ సమస్య తెలుగులోనే కాదు, మొదట్లో ప్రపంచంలోని ఎన్నో భాషల్లో తలెత్తింది. రష్యన్ విజ్ఞాన శాస్త్రవేత్త జె.జి. టాల్‌ఫిన్ ఇలా అంటాడు –

శాస్త్ర సాంకేతికమైన అనువాదాల్లో నిర్దుష్టత, స్పష్టత ప్రధానాంశాలు. భాషలో పదానికి సమానార్థకమైన పదాన్ని కనుగొనాలి. అలాంటిది లేనపుడు ఉద్దేశించిన అర్థ వివరణం ఇవ్వాలంటాడు. ప్రొఫెసర్ లియోనిస్ కొత్త పదానికి స్పష్టత, అర్థవైశిష్ట్యం, ఏకరూపత, క్రమత, పొందిక, సంక్షిప్తత, భావప్రకాశత ప్రమాణాలుగా ఉండాలంటాడు. ఇట్లా ఎందరో ప్రపంచవ్యాప్తంగా అభిప్రాయాలు తెలియజేశారు. అందరూ అంగీకరించింది ఒకటే, స్పష్టత, నిర్దుష్టత, ఒక పదానికొకే పదం రూఢం కావడం, ప్రామాణికం అన్నదే.

భాషావేత్తల సంస్థ లండన్‌లో ఏర్పాటు చేసిన సంఘం తయారుచేసిన ప్రత్యేక నివేదిక, సాంకేతిక పదాల ఎన్నికలో సైన్స్ పత్రిక, సంపాదకులు డా॥ డానేరోలక్, అమెరికన్ హైడ్రాలిక్ ఇంజనీర్ల సమావేశంలో సమర్పించిన ప్రామాణిక పరిభాషాభివృద్ధి పత్రం, డా॥ రంగనాథన్ (ఇండియన్ లైబ్రేరియన్) ప్రతిపాదించిన పరిభాషా నియమావళిని అనుసరించి అందరూ సమంగా అంగీకరించినవీ, పరిభాషా నియమాలు :

1. ఒక పదం ఒకే అర్థం కలిగి ఉండాలి. ఒక భావాన్ని వ్యక్తం చేయడాని కొకే పదం వాడాలి.
2. వాడుక భాష నుండి సాధ్యమైనంతవరకు పదాన్ని గ్రహించాలి. ఒకవేళ పదాన్ని సృష్టిస్తే అది సహజంగా అర్థవంతంగా ఉండాలి.
3. ఒక పదాన్ని ప్రాచీన భాషల (సంస్కృతం, గ్రీక్, లాటిన్, పెర్షియన్, అరబిక్) నుండి గ్రహిస్తే, లేదా వాటి ఆధారంగా నిర్మించడమనేది ఆ పదం వాడుక భాషలో సాధ్యం కానపుడు మాత్రమే పూనుకోవాలి.

4. సన్నిహిత సంబంధం గల భావాలకు (అదే విధంగా) ఆ పదానికి సన్నిహితమై, దానితో సంబంధం గలవి ఉండాలి.
5. అనువాద భాషలో పద నిర్మాణం సాధ్యం కాకపోతే క్లిష్టంగా ఉంటే కఠినమనిపిస్తే మూలభాష నుండి లేదా అంతర్జాతీయ భాష ఇంగ్లీషు నుండి గ్రహించవచ్చు.
6. వాడుకలో ఒకటి స్థిరపడిపోయి లోపభూయిష్ఠంగా ఉంటే దానికి సమానమైంది లోపరహితంగా నిర్మించుకోవాలి. లేదా పై దానికి సంక్షిప్త వివరణం ఇవ్వాలి.
7. ముఖ్యమైన లేదా అవసరమైన చోట్ల మాత్రమే ప్రతిపదానువాదం చేయాలి. మిగతా చోట్ల భావానువాదానికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలి.
8. సులభంగా పట్టువడేవైతే బాగా ప్రచారంలో ఉంటే విదేశీ భాషల్లోని పదాల్ని సైతం గ్రహించవచ్చు. దీనివల్ల అనువాదభాష విస్తృతి చెందుతుంది.
9. శాస్త్ర సాంకేతికానువాదాల్లో నిర్దుష్టత స్పష్టత ముఖ్యం. అనువాదం చేసే భాష సహజ లక్షణాల్ని కోల్పోకూడదు.
10. ఒక్కొక్క రంగంలో విషయాన్నిబట్టి ఒక్కొక్క పరిభాష ఉంటుంది. దీన్ని అవగాహన చేసుకొని మాత్రమే రచనకుపక్రమించాలి. లేకపోతే అపమార్గానికి దురర్థానికీ దారితీస్తుంది. ఆయా క్షేత్రాల్లో మౌలిక భావాన్ని వ్యక్తం చేయడంలో అనువాద పదాలు అపమార్గం పట్టించేవిగా ఉండకూడదు. దీనికి విస్తృతమైన పరిజ్ఞానం అవసరం. భావాన్ని సూటిగా తెలియజేయడానికి ప్రయత్నించాలి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించిన అనువాద సమితి, అధికార భాషా సంఘం ఎన్నిటినో పరిశీలించి ఇంచుమించు ఇవే సూత్రాల్ని అంగీకరించింది.

## పరిభాష - పదకల్పన - అన్యభాషా పదస్వీకారం

కొత్త భావాలు ప్రవేశిస్తున్నప్పుడు వాటిని వ్యక్తం చేయడానికి భాష కొత్తదనాన్ని పొందుతుంది. ఉన్నవాటితోపాటు, అవసరమునకున్నవి లేనపుడు కొత్త సంకేతాలు భాషలో ప్రవేశిస్తాయి. ఆధునిక యుగంలో భారతీయ భాషల్లో అనూహ్యంగా వచ్చే పరివర్తన మూలంగా భాషాభివృద్ధికి సమాజావసరాలకు వీటి అవసరం కలుగుతూంది. పూర్వం తెలుగు భాషా క్షేత్రానికీ ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం ఆధునిక సమాజంలో ప్రచలితమయ్యే తెలుగు భాషా క్షేత్రానికీ చాలా భేదముంది. కేవలం కావ్యజగత్తుకు మాత్రమే పరిమితమైంది. క్రమంగా, స్వాతంత్ర్యానికి పూర్వమే ఆధునిక ప్రభావంతో కొత్త ప్రక్రియలతో విస్తరించింది. ఇటీవలి శాస్త్ర సాంకేతిక విజ్ఞాన దశతో బాగా పరివర్తనం

చెందింది. తెలుగు భాషలో పాలన న్యాయపాలన విద్యా మాధ్యమం మొదలుగా ప్రయత్నాలు విరివిగా దృఢంగా సాగడంతో ప్రయోజనాత్మకంగా శాస్త్ర సాంకేతికంగా భాషా క్షేత్రం విస్తరింపబడక తప్పని పరిస్థితి ఏర్పడింది. అన్ని భారతీయ భాషలు ఈ పరిస్థితిని విజయవంతంగా ఎదుర్కొంటున్నాయి. ఇది భాషాభిమానం వల్ల కావచ్చు. సామాజికమైన ఉపయోగ గుణంవల్ల కావచ్చు. ప్రజాస్వామ్యంలో లభ్యమానమయ్యే అవకాశాలవల్ల కావచ్చు. ఇది చట్టం ద్వారా ప్రజల అభిలాష, అభిమానం ద్వారా సాధ్యమవుతూంది. చట్టం భాషను అవసరమైన ప్రతిపత్తిని కలిగిస్తే అభిలాష అభిమానం ఉత్సాహంగా వేగవంతంగా పనిచేయడానికి తోడ్పడుతాయి. మొదట్లో అలవాటు లేకపోవడం వల్ల అధికార భాషా ప్రయత్నాలూ విద్యా బోధనా భాషా ప్రవేశం కొత్తగా కన్పించవచ్చు. కాని కాలం గడిచేకొద్దీ పరిచయమధికమయ్యేకొద్దీ అనుభవం మీద మార్పులతో చేర్పులతో స్థిరపడడం జరిగింది. ఏదీ ఒక్కమారు నిర్దుష్టంగా సర్వసమగ్రంగా అవతరించదు. దీనికి నిరంతర కృషి అనుభవం ప్రయోగం అన్వేషణ అవసరం. భాషలో పరిభాష కాలక్రమేణ స్థిరత్వాన్ని పొందుతుంది.

**పరిభాష :**

**1)** వ్యవహారం (వాడుక)లో ఉంది. జనజీవితంలో వ్యవహారంలో ఉన్న పదాలు, అనేక విషయాల్లో అక్కరకు వస్తాయి. చారిత్రకంగా సాంస్కృతికంగా సమాజంలో చోటుచేసుకున్నవి. తెలుగు భాషా పరంగా సహజమైనవి, 2) తెలుగులో సహజమైనవి కాకపోయినా భాషలో ప్రవేశించి ఇమిడిపోయినవీ – ఇవి ఎంతో ఉపయోగపడతాయి.

**2) పదకల్పన :** భాషలో కొత్త భావాలు ప్రవేశించినపుడు, వాటిని వ్యక్తం చేసే పదజాలం ఆ భాషలో లేనపుడు కల్పన చేయవలసి వస్తుంది. కల్పన – అంటే కొత్త పదాన్ని సృజించడమన్న మాట మొదట్లో ఇది కొత్తగా వింతగా ఉండవచ్చు. ఆ తరువాత పరిచయాధిక్యంతో భేద భావం పోతుంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిభాషలో చాలా భాగం కల్పనకు చెందినదిగానే ఉన్నాయి. ఇవి ఎక్కువగా అత్యంత ప్రాచీనమైన మన సంస్కృతిలో భాగంగా నిలిచిపోయి బాగా అభివృద్ధి చెందిన సంస్కృత భాషా సహాయంతో ఏర్పడినాయి.

**3) అన్యభాషా పద స్వీకారం :** ఆధునికయుగంలో భాషను అభివృద్ధి పరచే విస్తృత మార్గాల్లో ముఖ్యమైంది. ప్రతి భారతీయ భాషలోను ఆధునిక యుగ ప్రభావంవల్ల ఇంగ్లీషు భాషా ప్రభావం కన్పిస్తుంది. అనేక చారిత్రక సామాజిక కారణాలవల్ల అరబీ,

పర్షియన్, ఉర్దు భాషల ప్రభావాన్ని గమనించవచ్చు. పూర్వంనుండీ చారిత్రక సామాజిక కారణాలవల్ల సోదర భాషల ప్రభావం, భారతీయ భాషల ప్రభావమూ దృష్టికి వస్తుంది. కాలక్రమాన ఇవి తెలుగు భాషలో కలిసిపోయాయి. తెలుగు భాషా లక్షణాల్ని పొందడమూ మన పరిశీలన కందుతుంది. అన్యభాషా పదాలు ఏ భాషలో చేరుతాయో ఆ భాషా లక్షణాల్ని పొందడం జరుగుతుంది. ఇంకా ఆ ప్రజలు మాట్లాడే పద్ధతివల్ల పదాలు సంపూర్ణంగానో పాక్షికంగానో మార్పులు చెందడమూ ఉంది. విజ్ఞానశాస్త్రంలో సాంకేతిక శాస్త్రంలో అన్యభాషా పద స్వీకారం బాగా కన్పిస్తుంది.

భారతీయ భాషలొకదానినుండి మరొకటి సులభంగా ఎక్కువగా పదాలు స్వీకరించడానికి అవకాశముంది. భారతదేశం మొత్తం మీద ఏవో కొన్ని సందర్భాల్లో తప్పనిసరివి మినహాయిస్తే ఒకే పరిభాషా పదజాలం ప్రయోగంలోకి రావడం మంచిది. ఇది భారతీయ భాషల సమైక్యశక్తిని నిరూపిస్తుంది. ఎంతో ధనాన్నీ, కాలాన్నీ, శ్రమనూ తగ్గిస్తుంది.

## 7. అనువాదకుని బాధ్యతలు

అనువాదకుడు మూలంలోని వస్తువును అవగాహన చేసుకొని దీనికి భంగం రాకుండా అనువాదం చేయాలి. ఆలోచనా రూపాన్ని అభిప్రాయ మార్గాన్ని అవగతం చేసుకోవాలి. మూలానికి దగ్గరగా పాఠకులను తీసుకరావాలి. అనువాదం చేసే భాషా సాహిత్యాల అభివృద్ధికి దోహదం చేయాలి. అనువాదంలో పఠనయోగ్యత ముఖ్యం. మూలంలోని శక్తిని కళాత్మకతను తీసుకొని వచ్చే ప్రయత్నం అవసరం. శబ్దజాలం పదబంధాలు వాక్యవిన్యాసం శైలి యథాతథంగా కాకపోయినా, ఏ విధంగాను తక్కువ స్థాయిలో ఉండకూడదు. అనువాదం చదువుతుంటే స్వతంత్ర గ్రంథం చదువుతూన్న భావం కలగాలి. అనువాదంలో మూలంలో అనవసరమనిపించినవీ, పునరుక్తమైనవీ తొలగించవచ్చు. మూలంలోని విషయాన్నిబట్టి భాషాజ్ఞానం పాండిత్యం శైలి అవసర మౌతాయి. ఉదాహరణకు గణిత శాస్త్రమైతే భాషాజ్ఞానం సాధారణ స్థాయిలో ఉంటే చాలు. శాస్త్ర సాంకేతిక రచన ఐతే భాషాజ్ఞానంతోపాటు అభివ్యక్తి గుణం అవసరం. సాహిత్యానికి భాష శైలి మొదలైనవి కావాలి. మూల గ్రంథంలోని విషయాన్ని ముందు బాగా అవగాహన చేసుకొని ఉపక్రమించడం వల్ల ఎన్ని అనర్థాలనో పరిహరించవచ్చు. ఏమైనప్పటికీ సహజత్వాన్ని కాపాడాలి. ఒక్క భాషా పాండిత్యం ఉంటే సరిపోదు. విషయాన్ని నిపుణంగా ఆవిష్కరించగల అభివ్యక్తి గుణం అవసరం. ఇది రచనా శక్తిచేత సంపన్నం కావాలి.

శాస్త్ర సాంకేతిక విషయాల్లో ఆయా క్షేత్రాల్లో నిష్ణాతులైన వారి సహాయాన్ని అపేక్షించవచ్చు. రచనలో అనుమానాలు కలిగినపుడు దోషాలుగా భావించినపుడు ఈ విభాగంలో నిష్ణాతులైనవారితో సంప్రదించాలి, చర్చించాలి. వారితో ఆలోచన జరిపి ఒక నిర్ణయానికి రావడం సముచితం. రచనలో స్పష్టత, నిర్దుష్టత సాధించేందుకు ఇతరుల పర్యవేక్షణ అనివార్యమయినపుడు ఉపేక్షించవచ్చు. ఏమైనప్పటికీ మూలకర్తతో అనువాదకుడు సరితూగలేడు. మూలగ్రంథానికుండే గౌరవం, ప్రతిష్ఠ అనువాదానికి తీసుకురావలసిన బాధ్యతను గుర్తించాలి. మూలరచన అనువాద రచన కాలం వేరువేరు కావచ్చు. పరిస్థితులు మారవచ్చు. ఇది సహజం. దీన్ని అనువాదకుడు గుర్తించి మూలరచనాకాలంలోని చారిత్రక సాంస్కృతిక సామాజిక పరిస్థితుల్ని గుర్తించి అధ్యయనం చేయాలి. ఇది అనువాద సమయంలో అనేక సందర్భాల్లో అక్కరకు వస్తుంది.

ఏ విమర్శకుడూ అనువాదాన్ని తీవ్రంగా నిశితంగా విమర్శించే అవకాశం ఉండకూడదు. అభిప్రాయ భేదాలు సహజం. ఇది సర్వసామాన్యమైన స్థితినుండి దిగకూడదు. ఒక ప్రమాణంలో పాఠకుల్ని తృప్తిపరచేదిగా ఉన్నదే విజయవంతమైన అనువాదంగా పేర్కోవచ్చు. అశాభంగానికి దారితీయకుండా జాగ్రత్తపడడం అనువాదకుని బాధ్యత. మరొకరు ఆ గ్రంథాన్ని అనువదించడానికి సాహసించకుండా ఉండే విధంగా ఉంటే మంచిది. ఉదాహరణకు కవిత్రయ భారతాన్ని, పోతన భాగవతాన్ని అనువదించడానికెవరు సాహసిస్తారు? ఈ స్థాయిలో కాక పోయినా పాఠకులకు మానసికమైన తృప్తిని కలిగిస్తే చాలు.

కాలం వేరు కావచ్చు, దేశం వేరు కావచ్చు, సంస్కృతి వేరు కావచ్చు. గ్రంథంలోని మౌలికమైన విలువలు సార్వజనీనమైనవి. దీన్ని మరచిపోకుండా విషయ ప్రతిపాదనంలో లక్ష్యనిర్దేశంలో మూలరూపంతో సాన్నిహిత్యానికీ సమైక్యస్థితికీ ప్రయత్నించడం అవసరం. ఆ తరువాతనే అనువాదకుని వ్యక్తిత్వం స్ఫుటత్వానికవకాశముంది. దేశ కాల పరిస్థితుల్ని బట్టి అనువాదంలో అవసరమైన మార్పులు బాధ్యతతో నిర్వహించవలసి ఉంటుంది. రెండు భాషలూ ఒకే సంస్కృతీ ప్రవాహానికి చెందినపుడు అనువాదం సులభతరంగా ఉంటుంది. ఒకే భాషా కుటుంబానికి చెందినవైతే భాషాగతంగా సుగమంగా ఉంటుంది. ఈ రెండు లక్షణాలకు భిన్నమైన మూలకృతి విషయంలో సంస్కృతీగతంగా భాషాగతంగా వేరువేరైనపుడు అనువాదకునిలో విధి నిర్వహణం బాధ్యత ఎక్కువౌతుంది. మూలకృతి గురించి సంస్కృతీగతంగా భాషాగతంగా అధ్యయనం చేయవలసి ఉంటుంది. చారిత్రక సామాజిక స్థితిగతుల్ని పరిశీలించవలసి ఉంటుంది. ఇది విస్మరించరాని బాధ్యత.

మానవుడు ఉన్నతమైన ఆలోచనలకూ ఆదర్శాలకూ విలువనిస్తూ, అనుభవ ప్రపంచంలో విజ్ఞానాన్వేషణలో వాటికి విస్తృతమైన పరిధిని పొందాలనుకున్నంత వరకూ అనువాద ప్రయోజనం ఉంటుంది. దీని ప్రభావాన్ని గుర్తించే మనోగుణం ఉన్నంతవరకు అనువాద రచన అవిచ్ఛిన్నంగా సాగుతూనే ఉంటుంది. ఇది అన్ని దేశాలకూ అన్ని కాలాలకూ వర్తిస్తుంది.

## 8. అనువాద ప్రయోజనం

ప్రాచీనమైన అనువాద రూపం, ఒక సమాజంలోని సమస్యలూ, ఆలోచనలూ, పరిష్కారాలూ, ఆదర్శాలూ మరో భాషకు చెందినవారికి తెలియజేసే ప్రయోజనం కలిగింది. అనువాదమంటేనే ఒకరు చెప్పినదాన్ని అనుసరించి చెప్పడం లేదా తిరిగి చెప్పడం. ఒకరు చెప్పింది మళ్ళీ చెప్పడం అని అర్థం. ("ప్రాప్తస్య పునః కథనే" లేదా "జ్ఞాతార్థస్య ప్రతిపాదనే" – శబ్దార్థచింతామణి). మరో విధంగా ఒక భాషలో ప్రాప్తించింది (పొందింది) మరో భాషలో తిరిగి చెప్పడం లేదా ఒక భాషలో జ్ఞాతమైంది (తెలిసిన విషయం) మరో భాషలో ప్రతిపాదించడంగా పేర్కోవచ్చు. మూలకృతికి చెందిన భాష తెలీని పాఠకులకు భాషాగతమైన అవరోధాన్ని తొలగించి భావగతమైన అనుబంధాన్ని స్థాపిస్తుంది. సంస్కృతీ స్వరూపాన్ని పరిచయం చేస్తుంది. విస్తృతం చేస్తుంది. మానవ జీవితం గురించి అవగాహనను పెంచుతుంది. తెలిసిన భాషలో గ్రంథాలతోపాటు తెలీని భాషలోని గ్రంథాలతో పరిచయం, కొత్త లోకాల్ని దర్శింపజేయడంతో పాటు అభిరుచినీ సంస్కారాన్నీ పెంచుతుంది. వీటితో అనువాద భాషా సాహిత్యాలు పరిపుష్టమవుతాయి. అనువాద ప్రయోజనం సాధారణ వ్యవహారిక జగత్తులో అవసరమైన కార్యకలాపాలు మొదలుకొని విశేషంగా మానసిక వికాస దశల వరకూ విస్తరించింది. వివిధ దేశాల మధ్య జాతుల మధ్య సత్సంబంధాల్ని ప్రేరేపిస్తుంది. విజ్ఞానవ్యాప్తికి దోహదం చేయడమే కాక అనుభవ ప్రపంచాన్నీ విస్తృత పరుస్తుంది.

సాంస్కృతిక జీవన ప్రమాణాల్ని పెంచుతుంది. ఈ కారణంగా నిఖిల మానవ జాతి సమష్టి కృషిలో భాగంగా సమాహార సంపదగా నిలుస్తుంది. ఆలోచన విజ్ఞానం ఎవరి సొత్తూ కావు. మానవులందరివీ అన్న భావాన్ని ఋజువు చేస్తుంది. ఆదాన ప్రదానంలో ఒకరి ఆలోచన, అనుభవం, ఆనందం మరొకరికి ఉపయోగపడడం కన్న ఉదార రూపమేముంటుంది? ఈ పనిని అనువాదం నిర్వహిస్తుంది.

గొప్ప గ్రంథాల్ని అనువాదంలో చదవడం వ్యర్థమన్న అభిప్రాయం లేకపోలేదు. అయితే ఆ గొప్ప గ్రంథం వ్రాయబడిన భాష ప్రపంచంలో ప్రజలందరికీ వివిధ భాషల వారికి వేరువేరుగాను తెలియదు. తెలియడంమసంభవం. అన్ని భాషలను అందరూ నేర్చుకోలేరు. అన్ని భాషల్లోని లేదా పెక్కు భాషల్లోని కనీసం కొన్ని భాషల్లోని గొప్ప విషయాల్ని తమ భాషలోకి ఎవరికి వారు పరివర్తితం చేసుకోవడం సులభం. ప్రాచీన భాషల్లోని ఉద్గ్రంథాలన్నీ ఆధునిక భారతీయ భాషల్లోకి పరివర్తితమైనాయి. అవి భారతీయ భాషలకు పుష్టినీ శక్తినీ సంస్కృతీ రూపాన్ని గొప్ప విలువల్ని ప్రసాదించాయి. ఇవి ఆయా భాషా ప్రజల అభిరుచికీ అభిమతికీ అనుగుణంగా రూపొందడం విశేషం. మూలకృతులు వెలువడిన ప్రాచీన భాషలీనాడు వ్యవహారం నుండి తొలగినా అవి లేని లోటును అనువాద రూపంలో ఉన్న ఆధునిక భాషా సాహిత్యాలు తీరుస్తున్నాయి. ఈ విధంగా మానవజాతి సంస్కృతీ నిక్షేపాలనదగిన రచనలు తరం నుండి తరానికందింపబడి, వివిధ భాషలు మాట్లాడే ప్రజలకెంతో మేలు చేకూరుస్తున్నాయి.

అనువాదం ఈ ప్రపంచాన్ని ఒకే భావసూత్రంలో బంధిస్తుంది. విభేదాలను విస్మరింపజేస్తూంది. ప్రజలందరి సుఖదుఃఖాల్ని, ఆనంద విషాదాల్ని విజయాపజయాల్ని ఆశా నిరాశల్ని ఉన్నత లక్ష్యాల్ని ఒకటిగా భావింపజేసే ప్రయోజన తత్పరమైంది. ముఖ్యంగా ఈనాడు అత్యంతావశ్యకమైన ప్రయోజనాన్ని నిర్వహిస్తుంది. మానవుని సృజనశక్తిని జీవిత వాస్తవాన్ని అనుభవ గుణాన్ని ఉత్తమ లక్ష్యాల్ని దూరదూరం వ్యాపింపజేసే ప్రక్రియగా స్థిరపడింది. ఆధునిక యుగంలో అనువాదం వ్యవహార విజ్ఞాన స్థాయిల్లో ఉపయోగ సాధనంగా ఉంది. ప్రపంచాన్ని ఏకం చేసే హృదయాల్ని కలిపే ఆలోచనల్ని పంచే ప్రయోజన శక్తిగా రూపొందుతూంది.

సాహిత్య సమాలోచనం Literary Criticism - 20

# ఆలోకనం
# నవల సమాలోచనం

మాదిరాజు రంగారావు

**2026**
రసధుని
సాహితీ పరిషత్తు
శాంతినగర్, హైదరాబాద్-28.

Literary Criticism - 20

# AALOKANAM

## NAVALA SAMALOCHANAM

(Sahithya Samalochanam)

by
Prof. Madiraju Ranga Rao

© : Dr. M. Santhosh Kumar

First Edition : 2004
Second Edition : 2026

# అంకితం

ఉదార మనస్వి

ప్రియ సోదరుడు

**డా॥ మాదిరాజు హరికిషన్‌రావుకు**

(GRIMSBY, U.K.)

# సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | తరం నుండి తరం | ........... | 5 |
| 2. | జీవితాదర్శం - చలం | ........... | 10 |
| 3. | చలం - ప్రేమలేఖలు | ........... | 17 |
| 4. | గోపీచంద్ సాహిత్య జీవిత దృక్పథం | ........... | 27 |
| 5. | అసమర్థుని జీవయాత్ర | ........... | 39 |
| 6. | అల్పజీవి పాత్రచిత్రణం | ........... | 46 |
| 7. | తెలుగు నాటకరంగం - నేటి స్థితి | ........... | 59 |

# 1. తరం నుండి తరం

సమాజంలో ఒక తరానికీ, మరో తరానికీ అంతరం అనివార్యం. సమాజమూ వ్యక్తీ పొందే పరివర్తనతో ప్రత్యేకతలతో ప్రభావితమైన స్థితులు తరాలు గడిచేకొద్దీ విభేదిస్తూ పోతాయి. ఒకే కాలంలో వివిధ తరాలకు చెందిన మనస్తత్వాలకూ, అభిప్రాయాలకూ, ఆచరణలకూ చెందిన వ్యక్తులూ ఉంటారు, సామాజిక రూపాలూ ఉంటూనే ఉంటాయి. తరం నుండి తరం మధ్య మధ్య వచ్చే మార్పుల ప్రభావం కొందరిలో మందంగా ఉంటుంది. ఇది మార్పులపట్ల ఉదాసీన వైఖరిని అవలంబింపజేస్తుంది. కొందరిలో వేగశీలంగానూ, వివిధ స్థాయిల్లో క్రియాత్మకతను కలిగింపజేసేదిగా ఉంటుంది. ఇది మార్పు పట్ల అభిలాషను, ఉత్సాహాన్ని నిలుపుతుంది. మరి కొందరిలో దీని అభిజ్ఞ లేకపోవటమో లేదా ప్రత్యేకమైన విశ్వాసాల వల్లనో, వేరే కారణాల వల్లనో నిరాకృతం కావటం జరుగుతుంది. ఇది యథాస్థితికి తోడ్పడుతుంది. కొన్ని సందర్భాల్లో వెనక్కు తిరిగి చూస్తూ అక్కడే నిలిచిపోయేట్లు చేస్తుంది. ఇది గత వైభవాన్ని జ్ఞాపకం చేస్తూ, దానిపట్ల అభిమానాన్ని ప్రజ్వలింపజేసేదిగానూ ఉంటుంది. మార్పుని కోరే తరం దీనికి భిన్నంగా హేతుదృష్టితో మారుతున్న పరిస్థితుల పట్ల వివేచనతో, కొత్తదనాన్ని ఆహ్వానిస్తూ, సామాజిక స్పందనతో ప్రవర్తిస్తుంది. కాల పరీక్షకు నిలిచిందీ, సమాజావసరాలకూ, వ్యక్తి వికాసానికి పనికివచ్చేదీ, జీవితంలో భాగమైపోతుంది లేంది అదృశ్యమౌతుంది. ఇది ఒకనాటిలో జరిగేదీ కాదు, ఒకనాటితో ఆగేదీ కాదు. నిరంతర పరిణామ చరిత్రలో భాగం. ఈ దృష్టితో ఆధునిక సమాజం అవసరాలకు అనుగుణంగా, మార్పును కోరే ఆలోచనలకు ప్రాతినిధ్యం వహించే నవల మాలపల్లి. ఈ విధమైన మార్పుల పట్ల ఉదాసీన వైఖరితో, గత వైభవాన్ని ఉజ్వలితం చేసే సమాజ చిత్రణం కలిగిన నవల, వేయిపడగలు. ఈ రెండూ ఒకే సమాజం యొక్క రెండు పార్శ్వాలు. ఇవి రెండూ కలిపి చూస్తేనే మన సమాజ సంపూర్ణ రూపం అవగతికి వస్తుంది.

ఆధునిక యుగానికి అస్తిత్వాన్ని ఇచ్చే దేశ స్వాతంత్ర్యం, వ్యక్తిస్వేచ్ఛ, సంఘ సంస్కరణం, మానవతా వాదం, విజ్ఞాన ప్రగతి మొదలుగా పర్యాప్తమైన పరివర్తనా రూపం, సమాజ పురోగతికీ, సాహిత్య పరిణామానికీ, వ్యక్తి ఉన్నతికీ దోహదం చేసేది. చారిత్రకంగా గుణాత్మకమైన పాత్రను నిర్వహించింది. దీని ప్రయోజనాత్మకమైన రూపం కాలం గడుస్తున్న కొద్దీ విశిష్టంగానూ, వైవిధ్యవిలసితంగానూ ఉండే మాట వాస్తవం. ఆధునిక యుగంలోనూ చారిత్రక, సామాజిక కారణాల వల్ల వచ్చి పైబడే అనుకోని ప్రభావాలూ తెచ్చే మార్పులూ అందరినీ మూసలో పోసినట్లు ఒకే దిశలో ప్రయాణింప

జేయవు, నిజమే. అయినా అందరూ అంగీకరించే కొన్ని సాధారణ వాస్తవాలు ఉంటాయి. ఈ మార్పుల్ని సామాజికమైన వాస్తవావసరాల దృష్ట్యా, వివేచించవలసిన చారిత్రక కర్తవ్యాన్ని రచయిత మరచిపోకూడదు. ఇట్లా జరిగితే, రచయిత అమూల్యమైన, ఆధునిక చేతనను పోగొట్టుకోవటం జరుగుతుంది. కొందరు రచయితలు వర్తమాన ధోరణుల పట్ల సహభావం లేదా అభిలాషను కలిగి ఉంటే, మరికొందరు నిరసన భావాన్నీ, ఉదాసీన వైఖరిని అవలంబిస్తారు. ఇది ఒక పార్శ్వానికి మాత్రమే పరిమితమైన సాహిత్య సృష్టికి దారితీస్తుంది. సమాజంలో పైపై తరాలకీ, క్రింది తరాలకీ మధ్య, కాలం గడిచే కొద్దీ అంతరం ఎక్కువౌతూ పోతుంది. ఇది భౌతిక స్థితుల్లో, మానసిక రీతుల్లో, స్పందన గుణంలో, సంబంధ వ్యవహారాల్లో, ఆలోచనా సరళిలో ఒక్కొక్క తరం ఒక్కొక్క బిందువు వద్ద నిలిచిపోతుంది. బిందువు బిందువుకీ మధ్య, దూరంలోని వ్యత్యాసాల్ని దృశ్యమానమయ్యే పరివర్తనా రూపాన్ని, గుర్తించే అర్థం చేసుకొనే, రచన, ఆధునికత కలిగి ఉంటుంది. దీనికి హేతుదృష్టీ, సానుభూతీ, అవసరం. ఇది కొన్ని పరిమితులకు వశం కావడం వల్ల అభిప్రాయభేదాలు కలగటం సహజం. ఆధునిక యుగంలో వేగంగా వచ్చే మార్పులకు సమాధానపడకపోవటంవల్ల, సిద్ధం కాకపోవటం వల్ల ఈ అంతరం ఎక్కువౌతుంది. కొందరు దీన్ని అందుకొనీ, అల్లుకొనీ పోతారు. ఒకరు సంప్రదాయ వాదులుగా, మరొకరు పురోగామ శీలురుగా చరిత్రలో పేర్కొనటం జరుగుతుంది. సమాజంలో కొత్త భౌతిక స్థితుల ప్రవేశం వల్ల, (1) ఇంతకుముందు ఉన్నవి కొన్ని మార్పులకు లోనుకావటం, (2) ఇంతకుముందు వున్నవాటి స్థానంలో కొత్తవి రావటం, (3) అదనంగా కొత్తవి వచ్చి చేరటం జరుగుతుంది. ఇది నిరంతరమూ జరిగేదే అయినా ఒక్కొక్క కాలంలో ఎంతో ప్రభావోపేతంగా ఉంటుంది. వేయిపడగలూ, మాలపల్లిలో ప్రసక్తమైన వస్తు విన్యాసంలోని కాలం పట్ల అవగాహన ఇటువంటిదే. సమాజం నుండి వేరుచేయజాలని సాహిత్యంలో ఈ స్థితిని, రచయిత తప్పనిసరిగా ఎదుర్కోవలసి ఉంటుంది. దీన్ని ఈ నవలా రచయితలెదుర్కొన్న విధం, ప్రతిపాదించిన పద్ధతివల్ల ఎన్నుకొనే లక్ష్యం వేరైంది. స్వాతంత్ర్య భావనలోనూ, సాంస్కృతికమైన ఉజ్జీవనంలోనూ నిర్వహించిన పాత్ర వేరైంది.

చారిత్రకంగా గాంధీ, ఠాగూర్, వివేకానంద, అరవింద, విద్యాసాగర్, బిపిన్ చంద్రపాల్, ఇట్లా అనేకమంది మహనీయుల చేత దేశంలో గొప్ప సాంస్కృతిక పునరుజ్జీవనం ప్రకాశించింది. సామాజిక పరివర్తనను కాంక్షించే శక్తులు, సమీకృత మైనాయి. ఉత్సాహ పవనాలతో వాతావరణం తరంగితమైంది. రచయితలు వేగంగా

ప్రతిక్రియ నెరపే గుణం, స్పందించే లక్షణం కలవాళ్ళు కావటంచేత సాహిత్య ప్రపంచమూ అపూర్వమైన నవ్యశక్తిని ప్రదర్శించింది. ఈ స్థితిలో ఇలాంటి ప్రభావాలకు లోనుకాకుండా, సంప్రదాయ దీక్షా కవచంతో వేయిపడగలు వెలువడింది, ఇది ఆశ్చర్యకరమైందే. సమాజంలో వలెనే సాహిత్యంలోనూ విశ్వాసాలకూ, హేతువుకూ మధ్య ఆచారాలకూ, అవసరాలకూ మధ్య యథాస్థితికీ పరివర్తన దశకూ మధ్య జరిగే సంఘర్షణ తప్పనిసరిగా ఉంటుంది. ఇది ఉద్యమాల వల్ల వ్యక్తుల ప్రయత్నంచేత ప్రయాణించే దిశ సిద్ధిస్తుంది. ఒక్కొక్కప్పుడు పరిస్థితులను బట్టి అనుకోని మలుపులనూ తీసుకుంటుంది. వైవిధ్యాన్నీ, విస్తృతినీ పొందుతుంది. వేయిపడగలు సాహిత్య చరిత్రలో కళాఖండంతో పాటు చారిత్రక సామాజిక డాక్యుమెంటుగానూ నిలుస్తుంది.

ఏ సిద్ధాంతం అవలంబించినా, ఏ హేతువును అనుసరించినా, సమాజంలో కొన్ని సంప్రదాయ శక్తులు మిగిలే ఉంటాయి. అవి తమ ప్రభావాన్ని నెరపుతూనే ఉంటాయి. కాలక్రమేణా తొలగిపోతూ, మార్పుల్ని పొందుతూ, సమాజం యొక్క ప్రవాహకత్వానికీ ఆటంకం రాని విధంగా ఉంటాయి. వీటిని సులభంగా గుర్తించవద్దు. ఈ ఆటంకాలను తొలగించే ప్రయత్నం చేసి, ప్రవాహ మార్గాన్ని సులభతరం చేసిన మహనీయులే బుద్ధుడు, వివేకానంద, గాంధీ, ఠాగూర్ మొదలైనవారు భారతీయాత్మను ఆధునిక చేతనతో ప్రకాశింపజేశారు.

వేయిపడగలూ, మాలపల్లీ రెండు గ్రంథాలూ, మన సమాజంలోని వివిధ శక్తుల క్రియాకలాపాలు, ఆలోచనా రూపాలు, దృక్పథాలు దృష్టిలో పెట్టుకుని విశ్లేషిస్తే, రెండు పార్శ్వభాగాలుగా స్పష్టంగా కన్పిస్తాయి. ఈ రెండింటినీ కలిపి చూస్తేనే, చారిత్రకంగా సమాజం యొక్క సంపూర్ణ రూపం సాక్షాత్కరిస్తుంది. వేయిపడగల్లో స్తంభించి, నిలిచిపోయిన స్థితిరూపాన్ని అందుకొని ప్రవహించిన స్థితిరూపమే మాలపల్లి. ఒకటి సనాతన దృష్టితో రూపొందింది. మరొకటి సంస్కరణ భావంతో అవతరించింది. ఒకటి శిథిలమైపోతూన్న గత వైభవాన్ని కళ్ళముందు నిలిపితే, మరొకటి ఆవిష్కృతమౌతూన్న వర్తమాన పరివర్తనను భావింపజేస్తుంది. ఒకటి గతంలోని సాంస్కృతిక భూమికపై నిర్వేదంతో, విషాదంతో విచలితం చేస్తే మరొకటి స్వరాజ్యోద్యమ భూమికపై సంచలనంతో క్రియాత్మకతను ప్రసరింపజేస్తోంది.

మాలపల్లిలో సమాజంలోని తరాల మధ్య అంతరాన్ని, తీర్చిన తీరు, అవలంబించిన దృక్పథం, ఆశించే లక్ష్యం, సామాజిక భవిష్యత్తును ఆశించే క్రమం కలిగింది. చౌదరి, రామానాయుడు, తక్కెళ్ళ జగ్గడు ఒకరికన్న మరొకరి వ్యక్తిత్వాలు

సామాజిక స్పృహతో భౌతికశక్తినీ, బంధురతనూ, గాఢత్వాన్నీ భావింపజేసేవి. ముఖ్యంగా రామానాయుడు, జగ్గడు వర్తమాన తలాలపై ఆధునిక చేతనతో, గుణాత్మకమైన మార్పుతో తరాల అంతరాలను గుర్తింపజేస్తారు. ఇదే విధంగా రామదాసు, సంగదాసు పాత్రలూ, గాంధీజీ సిద్ధాంతాల వికాసంతో, భారతీయ జీవన సంస్కృతి దృష్టితో, పరివర్తన గుణంతో విశిష్టమైనాయి. సంగదాసులోని సంస్కరణ దృక్పథం సామాజిక శక్తుల విజయరూపం వర్తమానం నుండి భవిష్యత్తుకు నిర్మితమైన సోపానం. వేయిపడగల్లో జీవిత వాస్తవాన్ని నిలిపే బలమైన సంఘటనలు ఎన్నో యోజితమైన మాట వాస్తవమే. ఐతే ధర్మారావు మొదలైన పాత్రలు మొదటి బిందువు వద్దనే వలయంలోనే నిలిచిపోవడంతో, ఇంచుమించు ఒక స్థాయిలోనే సమతలంపై కన్పిస్తాయి. వీటికి భవిష్యత్తు లేదు. ఎక్కడా ఒక స్థితి మారినప్పుడు దాని స్థానంలో ప్రత్యామ్నాయ సూచన కూడా లేదు. వర్తమానంలోని ఆధునిక చేతన గురించి ఆలోచన జరగలేదు. ఇందులో ఏమాత్రం సందేహం లేదు. దీనికి కారణం, దీనిపట్ల రచయితకు స్పష్టమైన అవగాహన లేకపోవటం వల్ల కావచ్చు. బుద్ధిపూర్వకంగా నిరాకృతం కావటం వల్ల కావచ్చు. తాను ఎన్నుకున్న దీక్షా ముద్రితమైన వస్తు స్వరూపానికి ఒదగకపోవటం వల్ల కావచ్చు. ఏమైతేనేం! – ఈ రెండు రచనల్లో సామాన్య లక్షణాలూ ఉన్నాయి. అవే భారతీయ సంస్కృతీ ముఖాలు! వేయిపడగల్లో సనాతన ధర్మాభిముఖంగా పరిణమిస్తే, మాలపల్లిలో స్వాతంత్ర్యోద్యమ సమర్పకమైన సాంస్కృతిక పునరుజ్జీవన దిశలో ప్రవర్తిల్లింది. బాహ్యభూమికలో జమీందారీ పద్ధతి ప్రాచీన విద్యావిధానం, చాతుర్వర్ణస్థితి, గ్రామీణ సంస్కృతి మొదలైన వాస్తవ చిత్రణం ఉన్నది. ఈ సందర్భంలో రచయిత వీటిని నిర్వహించిన విధం, భావించిన తీరూ, ఇచ్చిన దిశ, చేసిన వివరణం, కోరే లక్ష్యం మరచిపోవటానికి వీల్లేదు. వీటిని తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవలసిన అవసరం ఉంది.

స్త్రీ స్వేచ్ఛాభావన అనియత ప్రభంజనం వలే సమాజాన్ని కదిలించే కాలంలో, ఆదర్శవంతమైన దాంపత్యభావన, ధర్మారావు, అరుంధతి పాత్రలు లక్ష్యంగా ఇందులో ప్రాణప్రదమైంది. భారతీయ సంస్కృతీ తేజంలో భాగమైంది; మాలపల్లిలోనూ మరో విధంగా స్థాపితమైంది. ఇది కాలం పరీక్షకు నిలిచిందీ, బాహ్యమైన మార్పులు జరిగినా (ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో మార్పు మొదలైనవి) అంతరమైన స్థితి ఒక్కటే!

మాలపల్లి రచయిత స్వయంగా ఉద్యమ జీవి కావటంవల్ల, వస్తువుకు బలమైన ప్రేరణ, ఐక్య స్థితితో కూడిన లక్ష్యం నెరవేరింది. భూమికి సంబంధించిన సమస్యతో అట్టడుగున ఉన్న ప్రజల గురించి సంస్కరణ భావంతో, వ్యవస్థలో పురోగమన శీలంతో

ఆధునిక చేతన కన్పిస్తుంది. ఇది ఇంతకుముందు పేర్కొన్న విధంగా కుటుంబ వ్యవస్థలోని దాంపత్య జీవనంతో మొదలై వానప్రస్థాశ్రమంతో ఆధ్యాత్మిక ప్రవృత్తిని సూచిస్తూ, ఈ మధ్య భౌతికమైన శక్తుల పురోగమన దిశను నిర్దేశిస్తోంది. వేయిపడగల్లో ఆగిపోయిన స్థితి, దీనితో సచేతనమైంది. ఇది సామాజికమైన అవసరాలకు అర్థమైందీ, అనివార్యమైందీ. ఈ విధంగా వేయిపడగల్లో ఆగినచోటునుండి తప్పిపోయిన ఆధునిక చేతన మాలపల్లిలో అందుకోవడంతో, ఒకటి బ్రిటిష్ పాలనలో జమీందారి యుగానికి ప్రాతినిధ్యం వహిస్తే, మరొకటి గాంధీ యుగానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. వేయిపడగలు యథాస్థితికి కోట, మాలపల్లి పరివర్తన శక్తులకు భూమిక. భవిష్యత్ దర్శనరూపం. ఇది తరానికీ తరానికీ మధ్య అంతరాలను గుర్తిస్తూ శిథిలమౌతున్న దాని స్థానంలో ఆవిష్కృతం కావలసిన దాని స్వరూపంతో పాటు, ఈ రెండింటికి గల సంబంధాన్ని స్థాపిస్తోంది. వేయిపడగలు ఆగిపోయిన సామాజిక స్థితినుండి మాలపల్లి ఆరంభమౌతుంది. సమాజంయొక్క సంపూర్ణమైన స్వరూపం, ఈ రెండు రచనలు ఒకదాని తర్వాత మరొకటి కలిపి చూస్తేనే అనుభవానికి వస్తుంది. ఒకటి వేయిడగలు గతంలో మొదలై వర్తమాన బిందువువద్ద ఆగింది. మరొకటి మాలపల్లి వర్తమానంలో మొదలై భవిష్యత్తులోకి అడుగువేసింది. ఇది తరం నుండి తరంలోని అంతరాల భేదాలను, ఆలోచనకు తెచ్చే విశాలమైన ప్రయత్నం మాత్రమే. వేయిపడగలు పూర్వ సంప్రదాయశక్తికి ప్రాతినిధ్యం వహిస్తే, మాలపల్లి ఆధునిక పరివర్తన చేతనకు ప్రాతినిధ్యం వహిస్తూంది. రెండిటి మధ్య తరాల అంతరం స్థూలంగా నిన్నటికీ నేటికీ గల భేదం అయినా విలువల్లో కాలంలోని అవిచ్ఛిన్న రూపాన్ని భావింపజేస్తాయి. సమాజగతమైన పూర్ణతనూ దృష్టికి తెస్తాయి.

## 2. జీవితాదర్శం - చలం దృక్పథం

చలం నవలల్లో చివరిది "జీవితాదర్శం". ఇందులో చలం అనగానే ఉద్ధృతంగా విరుచుకుపడే, లైంగికమైన శృంగార భావ చాలనానికి భిన్నమైన, ఆదర్శరూపం ధ్యేయంగా అభిప్రాయం ఆవిష్కృతమైంది. ఇది ఒక్కొక్క మలుపు తిరిగినకొద్దీ కథలో క్రమంగా ఉన్మీలితమౌతూ ఆదర్శ ప్రణయరూపం స్పష్టంగా రూపొందింది. ఈ మానసికమైన ధోరణి రచయిత జీవితంలోనూ చివర పొందిన విశిష్టమైన మలుపుకు సూచీరేఖగా గుర్తించవచ్చు. చలం ప్రధానంగా వ్యక్తివాది. అతనికి వ్యక్తిస్వేచ్ఛ ముఖ్యం. అతని మనస్సు సౌందర్యభావనతో, అనుభూతి స్పందనతో నిరంతరం ప్రసరించేది. నీతి, హేతువు, నియమం కన్నా స్వేచ్ఛ, అన్వేషణ, వివేకం ముఖ్యం. దీనికి అడ్డంగా నిలచిన సర్వమూ- నీతి నిబంధనల్నీ, ఆచార పద్ధతుల్నీ ఖండిస్తూ, స్వేచ్ఛను నిలుపుకుంటూ, అన్వేషణ కొనసాగిస్తూ జీవితం అనుభవించే లక్షణం ఉంది. ఇది అతనిలో సామాజిక స్పృహనూ, యథార్థ స్థితిగతుల్ని గురించి ఆలోచనను ఒకమేరలో నిలిపింది. చలం సృష్టించిన స్త్రీ పాత్రలన్నీ ఇంచుమించు ఈ రేఖల్లో కాల్పనికమైన రూపాన్ని సంతరించుకున్నవే. అన్నీ సౌందర్యం- అనుభూతి-స్వేచ్ఛ-ఆదర్శంతో నిండిన భావలోకం వాతావరణంలో జీవిస్తాయి. ఆరంభంలోనే ఒక స్థాయిని అందుకుని క్రమిస్తాయి. పాత్ర మనస్తత్వాన్ని బట్టి, కథ తిరిగే మలుపుపై దృష్టితో ఈ ధోరణిలో రచయిత ఒక్కొక్క అంశానికిచ్చే ప్రాధాన్యాన్ని బట్టీ - భిన్న రూపాల్ని పొందుతాయి. అయితే ఈ నిర్వహణంలో సామాజిక స్పృహకు చెందిన విశ్లేషణం స్పర్శామాత్రంగా మనల్ని భావింప జేయకపోదు. చలం దృష్టిలో దీన్ని గురించిన ఆలోచన చాల పరిమితమైంది. అతని ఆదర్శరూపానికి ప్రోత్సాహకరంగా మాత్రమే ప్రసక్తికి వస్తుంది.

ఈ నవల్లో లాలస పాత్ర - కాల్పనికమైన ఆదర్శభావనలో చివరకు స్థిరపడిన రూపంగా తీర్చబడిన అంశం గమనార్హం. లాలస స్వేచ్ఛా జీవితాన్ని కోరేదీ, స్వతంత్ర ప్రవృత్తి కలిగిందీ. ఏలాంటి స్థితిలోనైనాసరే తన మనస్సుకు నచ్చింది త్రోసిపారేసేదీ క్లిష్ట పరిస్థితుల్లోనూ తన మనస్సుకు హత్తింది, సాహసించేదీ, ఆరాటం పొందేది, ధైర్యం ప్రదర్శించేదీ, కష్టాల్ని అధిగమించేదీ. ఆమె అందం, ఆకర్షణ మరో ప్రక్కనుండి తెలివి, చురుకుదనం జీవితంలో పరిస్థితుల్ని మరింత వేగవంతం చేసాయి. అనుకోని మలుపుల్ని తెచ్చాయి. క్రొత్త అర్థం కోసం అన్వేషణను సాగించాయి. ఆమెలో చివరకు కలిగిన వివేకం - అనుభవంతో విచిత్రమైన మనస్తత్వం, జీవితాన్ని ఒకచోట నిలిపివేసింది. అదే ఆమె ఆదర్శలోకం. జీవితంలో క్లిష్టపరిస్థితుల్ని అధిగమించే సాహసంతో కూడిన

ప్రయత్నం సుగమం ఎన్నటికీ కాదు. అనేక కష్టాలు తప్పవు. బాధలు అనుభవించాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఆ బాధలో సహిష్ణుత, ప్రవర్తించేవేళ పరవశతతో ఒక తృప్తిని మానసికంగా పొందవచ్చు. ఇటువంటి వారి జీవితం విషాదంగా పరిణమించ వచ్చు. కాని లాలస జీవితం విషాదాంతం కాకపోవడం విశేషం. ఎలాంటి సంక్షుభితమైన స్థితిలోనూ ఆశావహమైన భావానికిది నిదర్శనంగా ఉంది. ఆమె జీవన సాఫల్యం చివరకు ఆనందస్థితిలో పరిణమించింది. ఒక తృప్తిలో శాంతిలో క్రమించి స్థిరపడడం మనకు ఆశ్చర్యాన్నే కలిగిస్తుంది. ఇది సాధారణంగా మనకు కన్పించే చలం పాత్రల తీర్పు పద్ధతిలో - విషాదం నుండి ఆనందానికి - సంతోషానికీ శాంతికీ ఉన్ముఖమైన మార్పు. అందువల్ల మిగతా చలం నవలలకన్నా ఇది ఒక ప్రత్యేకమైన స్థాయిని పొందిందనవచ్చు. ఇలా ఎందుకు జరిగింది? అంటే ఆమె అన్వేషణకు ఒక విశ్రాంతి పదం దొరకడమే, ఆ ఆలంబన స్థానం దేశికాచారి వ్యక్తిత్వం. ఆమె సౌందర్యతృష్ణకూ, ప్రకృతి తాదాత్మ్యానికీ నిలయం అందడమే. వయస్సు తారతమ్యంతో నిమిత్తం లేకుండా, లైంగిక భావాతీతమైన ఉదారమైన ఆదర్శరూపము సన్నిహితం కావడమే. అదే భీమ్లీ సముద్రతీరం, ఆమె మనోవేగాన్ని భావోద్ధృతినీ నిలపగలిగిన ప్రదేశం, పైకి లేచి ఎగసిపడి సాగే సముద్రపుటలల్ని ఆపగలిగిన తీరంలోనే నవల ఆరంభమైంది ముగింపును పొందింది. వేరు వేరు చోట్ల జరిగిన జీవిత సంఘటనలు, ఇక్కడే మరో విధంగా పాత్ర స్మృతి పథాన లేదా సందర్భవశాన ప్రసక్తమైనాయి. ఇది నిజంగా అర్థవంతమైన గొప్ప టెక్నిక్.

దేశికాచారి విశిష్టమైన వ్యక్తిత్వం లాలస ఆదర్శ మనో లక్షణానికి సరిపోయింది. ఆయనవద్దనే ఉండి పోవాలని చివరకు నిశ్చయించుకుంది. ఆ నిర్ణయాన్ని లక్ష్మణసింగ్‌కు తెలియజేస్తుంది. ఈ విచిత్ర ప్రవర్తనం సాధారణదృష్టికి - అంటే వివాహం చేసుకున్న స్త్రీ ఆమె భర్త వచ్చి రావలసిందిగా ప్రాధేయపడుతున్నా - తిరస్కరించడం విపరీతంగానే కనబడుతుంది. "నేనెందుకు రావాలి అక్కడికి?" అని ప్రశ్నించినపుడు, దానికి అతనివద్ద సమాధానం లేదు. అతడంత ఎత్తులో ఆలోచించలేదు. ఆమె కిందికి దిగలేదు. ఆమె ఇప్పుడు పూర్వపు లాలస కాదు. ఆమెకు పేరుతో నిమిత్తం లేదు. కేవలం మనోవైఖరితోనే పని. ఈ మార్పు అసాధారణమైంది. సాహసంతో ఆదర్శలోకాన్ని స్పృశించేది. ఇది ఒక రూపంలో స్తిమితంగా నిలవడానికి హేతుమూర్తి దేశికాచారి.

ఒక సమయంలో సింగ్, నరసింహారావు, భీమ్లీ అందాలు విని చూడాలని వచ్చి - విసుగెత్తి, ఎందుకు వచ్చాంరా ఇక్కడికి అని బాధతో వెనక్కు తిరిగి పోవాలనుకునే సమయంలో దేశికాచారి వాళ్ళ మూడోకన్ను తెరిపించాడు. వాళ్ళ మనస్సుపై "మూత"

తీసివేసాడు. ఇతడు చూపిన జాలికీ, దయకూ, ఆత్మీయతకూ ముగ్ధులైనారు. వాళ్ళలో సౌందర్యభావన- ప్రకృతి తాదాత్మ్యం ప్రవేశపెట్టాడు. వారిలో అనుభవశక్తికి పదును వచ్చింది. వాళ్ళ దృష్టి మారింది. అనుభవప్రపంచం కొత్త కాంతిసీమల్లోకి జరిగింది. ఆనందస్థాయి పెరిగింది. ఇంతవరకూ నిస్పృహతో ఉన్నది రమణీయఖండంగా సాక్షాత్కరించింది. మనస్సు దారిద్ర్యం నశించి సంపన్నమైంది. వీళ్ళకీ ఇలా అయితే ఇక లాలస విషయంలో – ఈ ప్రదేశం ఆ వ్యక్తి బలమైన ఆకర్షణ కేంద్రం కావడంలో ఏ విపరీతమూ లేదు. లౌకికమైన ఎత్తులకూ జిత్తులకూ, "డబ్బుకీ, బలానికీ, కట్టుబాటుకీ, సంకుచితత్వానికీ" అతీతమై కన్పించింది. ఆమె మనస్సు ఇంతకుపూర్వమే ఈ స్థితికి అభిముఖమైంది. కాబట్టి ఇప్పుడు సంపన్నత కంటే ఆత్మీయతనూ తాదాత్మ్యాన్నీ పొందింది. దేశికాచారి మనస్తత్వానుగుణంగా, లాలసలోనూ సౌందర్యభావన, ప్రకృతి తాదాత్మ్యం, స్వేచ్ఛాతత్త్వం మౌలికంగా ఉండడంవల్లనే వాళ్ళలో స్పందించే అనుభవ భూమికను దగ్గరకు తీసుకొని వచ్చింది. జీవితంలో విచిత్రమైన మలుపులు అనేక సంఘటనలవల్ల పొంది, చివరకు ఇక్కడ నిలచింది. ఆదర్శాన్ని అందుకునేట్లు చేసింది. అందుకే మౌల్వంకర్ నుండి – ఎక్కడో భీమ్లీ అందచందాలకు ఆకర్షితుడై సముద్రతీరంలో కొండల మధ్య తోటలో ఇల్లుకొని స్థిరపడిన దేశికాచారితో శాంతమైన జీవితం గడుపుతోంది. ఈ ప్రదేశం సమాజానికి దూరంలో ఉంది. ఎవరన్నా రావాలన్నా పొదలూ, రాళ్ళూ, ఎగుడు దిగుళ్ళూ క్రమించాలి. ఎక్కడో సామాజిక వాస్తవ ప్రపంచానికి దూరంగా చిత్రమైన జీవన రూపం వ్యక్తివాదానికి కల్పితమైన వాతావరణం. నవల్లో ఆదర్శరూపంగా మలచబడింది.

ఇద్దరు స్నేహితులూ ఒకనాడు మునిమాపున బయలుదేరారు. సముద్రం అలలు ఎగసివచ్చి వాళ్ళు వచ్చిన దారిని ముంచేసాయి. ఇంతలో వెన్నెల వచ్చింది. ఆకాశాన్ని మబ్బులు క్రమ్మేసాయి. దారి తెలీదు. అంతా చీకటి భయం వేసింది. ఆ భయంలో అరపు విని కొండ తలపై నుండి మెరపులా వచ్చింది ఒక స్త్రీ. వారిని రక్షిస్తుంది. ఆమె ఆ ప్రాంతంతో పరిచయం ఉంటేగాని ఇలా చేయదు? ఈ వేళప్పుడు "ఆమె ఒంటరిగా ఏం చేస్తుంది?" విహారానికి వచ్చిందా?" ఆమె సహసానికి వాళ్ళు ఆశ్చర్యపోతారు. ఆమె అందానికి ముగ్ధులౌతారు. సింగ్‌కు ఆమె లాలస అయి ఉంటుందన్న అనుమానమూ కలుగుతుంది. ఆమె అందం, సాహసం, అతనికి లాలసనే స్ఫురింపజేస్తాయి. ఆమె ఒంటరిగా ప్రకృతి తాదాత్మ్యంలో, సౌందర్యతృష్ణతో సంచరిస్తూంది. ఆమెలో దయాగుణం ఉంది, రమణీయమైన అనుభవ స్పందనతో ఆదర్శలోకం ఆమెలో

మొదటి స్థానాన్ని పొందుతుంది. ఈ ప్రవర్తనలో భయం లేదు. సాహసం ఉంది, ధైర్యం ఉంది. ఇలాంటి వ్యక్తిత్వం గల వ్యక్తి, సంకుచితమైన సాంఘిక వలయంలో సంప్రదాయ విధి నిషేధాల్లో నీతినియమాల కట్టుబాటులో ఎలా ఉండగలదు? అయితే ఆమెను ప్రేమించిన సింగ్, ఆమె జైలునుంచి వచ్చాక పెళ్ళి చేసుకున్నాడు. ఆమెను గురించి ఇదివరకే బాగా తెలిసినవాడు, ఆమె అందానికీ తెలివికీ ముగ్ధుడై అన్నీ మరచాడు. ఆదాం వ్యవహారమూ తెలుసు. అతడు ఆమెను మోసం చేయడమూ ఎరుగు. అయినా ఆమెను కాంక్షించాడు. రెండు సంవత్సరాలు అతడెంతో ఉత్సాహంతో ఆనందంతో జీవితం గడిపాడు. ఆమె తనది అయితే చాలుననుకున్నాడు. అంతే వివాహంతో ఆమె తన స్వంతం అయి – ఆమెపై తనకేదో హక్కు ఉందనే భావన మొదలైంది. ఈ పొసెసీవ్ (Possessive) మనస్తత్వం సహజమైందీ. ఇది ఏ రూపంలోనైనా ఉండవచ్చు. చిన్నతనంలోనూ ఇది స్పష్టంగా కన్పిస్తుంది. చిన్నపిల్లలు మనదృష్టిలో ఎందుకూ పనికిరానివీ, రంగురంగుల రకరకాల రాళ్ళు, ఇంకా ఏవేవో పోగుచేసుకొని దాచు కుంటారు. అవి వాళ్ళకెంత ప్రియమో వేరే చెప్పనక్కరలేదు. అవి ఎందుకూ పనికిరానివని మనం పారేస్తే వాళ్ళు మానసికంగా ఎంతో బాధ పడతారు. మళ్ళీ అన్నీ ఏరుకొస్తారు. అన్నీ కూడబెట్టి దాచుకుంటారు. ఈ మనస్తత్వం పెద్దవారయ్యాక పనిచేసే తీరువేరు. ఇంకాస్త పైకి పోతే తల్లికి పిల్లలపైనా ఈలాంటి “స్వంత”భావం ఉంటుంది. లోలోపల దాగి ఉన్న ఈ “పొసెసీవ్” తత్త్వం కుటుంబాల్లో పెద్ద పాత్రనే వహిస్తుంది. ఇంకా ఇతర విషయాల్లోనూ, సంబంధాలను బట్టి ఒక్కొక్క విధంగా ప్రస్ఫుటమౌతుంది. అనేక విచిత్ర పరిణామాలకూ కారణమౌతుంది. సింగ్‌లో లాలస విషయంలో ఈ ‘స్వంతమనే’ భావం, కుదురు చేసుకోవడం జరిగింది. వివాహం అయ్యాక ఆమె స్వేచ్ఛావర్తనం అతనికి బాధ కలిగించింది. తన ‘స్వంత’ అనుభవాన్ని ఎవరో పంచుకోవడం తనకిష్టం కాని విషయం. తానొక్కడే అనుభవించాలన్నది మూలం. దీని పర్యవసానంగా అతడిలా ఆలోచిస్తాడు – స్త్రీకి స్వేచ్ఛ అవసరమే. చదువూ ముఖ్యమే. అయితే వివాహం తరువాత కాస్తయినా నియమాలు పాటించకుండా ఉంటే ఎలా?” అనుకూంటూ ఆమెను గురించి ఆలోచనలో – స్త్రీ స్వేచ్ఛను గురించి సంప్రదాయ పద్ధతిలో కాక, కొంత ‘మార్పు’ దృక్పథం కలిగి ఉంటాడు. ఒక నీతి నియమం మేరలో ఈ ‘స్వేచ్ఛ’ ఉండాలని అతని అభిప్రాయం దీనికి ఆమె అంగీకరిస్తుందా? ఇది ఆమె వ్యక్తిత్వానికి భిన్నమైంది.

మాల్వంకర్ విషయంలో తన భార్య ప్రవర్తించిన తీరు అతనికి బాధ కలిగించినా, ఎంతో ఉదారంగా ప్రవర్తిస్తాడు. మాల్వంకర్ తన గదిలో ఒక సంగీత సభ చేయడం గురించి ప్రశ్నించి, ‘ఇది మర్యాద కాదంటే’ మర్యాదకంటే ముఖ్యమైన విషయాలున్నాయని

సమాధానం చెబుతుంది. ఆ ముఖ్యమైన విషయం చలం దృష్టిలో 'అనుభవం' ఇది కళకు సంబంధించింది. అతడు 'ఇక్కడ ఏ అనుభవం' అని తిరిగి ప్రశ్నిస్తాడు. ఒక్కటి చాలు. అతడు నీతికీ మర్యాదకూ, ఈమె స్వానుభవానికీ కళకూ ఇచ్చే ప్రాముఖ్యంలో మొదటిది సమాజపరమైంది, రెండోది వ్యక్తి నిష్ఠమైందీ. అందులోనూ సంపూర్ణమైన స్వేచ్ఛాత్మకం కావడంతో, సమాంతర రేఖలవలె ప్రయాణించే ఇరువురూ కలసే ప్రశ్న లేదు. ఇలా అనేక సందర్భాల్లో సంభాషణలు, పై అభిప్రాయంపై వెలుగును ప్రసరిస్తాయి. ఆమె ఎవరితోనూ ఆఖరికి సోదరులతోనూ చొరవగా మాట్లాడడం సహించలేని స్థితికి వస్తాడు. ఆమెలో స్వేచ్ఛాప్రవృత్తి అతిశయించిన కొద్దీ, ఇతనిలో 'స్వంతం' (Possessive) లక్షణం అధికమౌతూంది. లాలస ప్రవృత్తి దీనికి భిన్నమైంది కావడంతో ఒక అదుపులో హద్దులో ఎన్నటికీ ఉండలేదు. మొదటే వివాహానికి ముందే తనపై లేనిపోని ఆశలు పెట్టుకోవద్దని నిష్కర్షగా చెప్పింది. ఇందులో ఆమె చేసిన మోసమేమీ లేదు. అందుకే ఎవరితోనో ఒకరితోను వెళ్ళిపోతున్నానని చెప్పినపుడూ, ఇక మాట్లాడడం "గౌరవహీన"మని ఊరుకున్నాడు. అతడామె అందానికీ, ఆకర్షణకూ లొంగిపోయి వెంటబడ్డాడే తప్ప, ఆమె ప్రవృత్తి అవగాహనకు రాకపోవడం పాత్రలోని విచిత్రమైన అంశం, ఇతడు ఉప్పు సత్యాగ్రహంలో పోలీసు లాఠీ దెబ్బలు తిని, స్మృతి తప్పినపుడు - ఉపచారాలు చేసి మనసుపడిన మదాలసను ఈమెకోసం తిరస్కరించాడు. ఇరువురి మనస్తత్వాలూ తీవ్రంగా భిన్నమైనవి కావడంతో వైవాహిక జీవితంలో వైమనస్యం రాక తప్పలేదు. చలం ఈ అంశాన్ని వివిధ సంఘటనల్లో ఎంతో సూక్ష్మంగా అనుభూతి సుకుమారంగా నిర్వహించాడు. సింగ్ సోదరులు మాల్వంకర్‌ను చంపేస్తామంటారు. అతడామెపై ప్రేమవల్ల వారిస్తాడు. తనకూ లాలస వెళ్ళిపోవాలనే ఉందని చెబుతాడు. మరీ అల్లరి కావడం ఇష్టంలేదు. ఇంకా ఈ మిగిలిన ప్రేమే భీమ్లీలో ఆమెను మళ్ళీ అనంతపురం తీసుకుపోవాలనే అభిలాషను చిగురింపజేసింది.

దేశికాచారి సరిగ్గా సింగ్‌కు భిన్నమైన మనస్తత్వం కలవాడు. అతనికి జీవితంలో దేన్నీ స్వంతం చేసుకోవాలనే కాంక్ష లేదు. బలవంతంగా దేన్నీ ఆశించడు. స్త్రీ స్వేచ్ఛకూ ఇచ్చే గౌరవం అపారం. అతనిలో సాహసమూ ఉంది, అది స్త్రీ కోసం. రెండు లక్షలు కొట్టేసి డిఫాల్కేషన్ కేసులో పట్టుబడ్డాడు. తాను ప్రేమించిన స్త్రీ మోసం తెలుసుకొని ఆ డబ్బు మాల్వంకర్ దగ్గరే ఉంచాడు. జైలునుంచి వచ్చాక మాల్వంకర్ అతనికి వడ్డీతో సహా ఒప్పజెప్పాడు. ఆ డబ్బుని ఆర్తులకీ బీదవాళ్ళకీ పంచిపెట్టిన ఉదారుడు దేశికాచారి. జీవితంలో మానవత్వం, ప్రేమ, ఆత్మీయతతో ఉన్నతమైన శిఖరాలనందుకున్నవాడు.

అతనిలో జాలి, దయ ఎంతటిదో ఈ ఇరువురు స్నేహితులకీ పరిచయమే. చివరిలో సింగ్ లాలస కోసం పడే ఆతురతను గమనించి, భోజనానికి పిలిచి నిర్ణయాన్ని వారిద్దరికీ వదిలివేయడం, అతని వ్యక్తిత్వానికి చివరి మెరపు. ఒకవేళ వారిద్దరూ వెళ్ళిపోయినా తిరిగివచ్చి, లాలస మాటల్లో "పొద్దుపోయింది" అని రోజూ మాదిరే, ఏకాంతం చెడకుండా ఇంటరిగా పడుకునేవాడు. ఈ విధమైన మానసికమైన సమత, నిర్మమత్వం ఆమెను ఎంతో ఆకర్షించాయి. ఆమె వ్యక్తిత్వాని కేమాత్రం భంగం రానీయని స్వేచ్ఛాదృక్పథం ఆమెలో విశ్వాసాన్ని కలిగించింది. దేశికాచారి వయస్సు దృష్ట్యా ఆమెకు తగినవాడు కాదు. అయితేనేం, అతని పట్ల ఆమె భావం లైంగికంగా ప్రధానం కాదు. ఇదీ ముఖ్యంగా గమనించదగిన అంశం. దీనికి అతీతమైన ప్రేమ-సౌందర్యం-స్వేచ్ఛ-మానవత-నిర్మమత్వం సమత్వం మొదలైన ఉన్నతమైన గుణాలతో ఎగసిన వ్యక్తిత్వం పట్ల ఆమె వశమైంది. ప్రణయ దర్శనంలో ఈ విశిష్టమైన దృక్పథం రచయితగా చలాన్ని సరిగా అవగాహన చేసుకోవడానికి ఎంతో సహకరిస్తుంది. లైంగిక ప్రవృత్తికీ - ఆదర్శ రూపానికీ - ఆధ్యాత్మిక ప్రవృత్తికీ మధ్యగల అంతరాల్ని ఇది పూరిస్తోంది. ఇది చలంలో కలిగిన ఆధ్యాత్మిక ప్రవర్తనకు action agent (క్రియా సాధనం) అనవచ్చు.

సింగ్ లాలసను గుర్తించినపుడు, ఆమె అతడు తనకు తెలీనట్టు ప్రవర్తిస్తుంది. తరువాత పేరుతో నీకేం పని అంటుంది. ఆమె వెనుకటి లాలస కాదు. ఆ లాలస వేరు, ఈ లాలస వేరు. మాల్వంకర్‌తో వెళ్ళినపుడూ, మనం గమనించవలసింది - ఆమెలో లైంగిక వాంఛకంటే, అతని సంగీతంలోని ఆకర్షణచేతనే - ఒక విచిత్రమైన అనుభవానికి గురి కావడం వల్లనే ఆమె సాహసించింది. అయితే మాల్వంకర్ దీనికి భిన్నంగా ప్రవర్తించాడు. అతడు స్త్రీలోలుడు. ఆమెపట్ల నిర్దయగా ప్రవర్తించేవాడు. అయినా ఆమె అతనితోనే ఉంది. సంగీతానుభవం ముఖ్యం అనుకోనీ. అతడామెను మరచిపోవడానికి ఎంతో కాలం పట్టలేదు.

ఆడం నుండి లక్ష్మణసింగ్ అక్కడినుండి మాల్వంకర్ ఆపైన దేశికాచారితో లాలస క్రమంగా లైంగిక శృంగారం నుండి నాది అనే సంకుచిత పథం నుండి, అవిశ్వాసం నుండి అభద్రత నుండి చివరకు ప్రేమకూ సౌందర్యానికీ ఆనందానికీ ఆత్మీయతకూ శాంతికీ స్థానమైన ఆదర్శజీవితానికి చేరుతుంది. ఇది డబ్బుకూ దర్పానికీ అతీతం. తనకు సరిపడని నీతికీ మర్యాదకూ నియమాలకూ ఆచారాలకూ దూరం. తనలో స్వేచ్ఛనూ స్వాతంత్ర్యాన్నీ నిలిపేది. 'నేను', 'నాది' అనే ఒత్తిడి లేంది. ఈ స్థితి ఆమె జీవితంలో వచ్చిన ప్రధానమైన మలుపును సుస్థిరం చేసింది.

ఆమెతో పాటు ఈత రాకపోయినా సముద్రంలో దూకి, ఉప్పునీళ్ళు త్రాగి ప్రాణం పోయే స్థితినుండి, సింగ్ తనచేత రక్షింపబడి అలసి నిద్రించే రాత్రి అతనివద్దకు వెళ్ళింది. "ఇరువురి మధ్య శృంగారం ఉంది, ప్రేమ ఉంది" అంటాడు రచయిత. ఇది ఆమెకు తెలుసు, అయితే ఇరువురిని దూరం చేసేది, స్వేచ్ఛ, అనుభవం, ఆనందం పట్ల భిన్న దృక్పథాలే. అతడు మేల్కొనలేదు కాని ఆమె రాక అతనికి స్వప్నంగానే ఉంది. అయినా అతనితో, పరీక్షా సమయం వచ్చినపుడు రానని తెగేసి చెప్పింది. ఆనాడు తన ఇంటినుండి వెళ్ళడానికి సాహసించినపుడు, చూపిన మంచితనానికీ, ఉదారతకూ కృతజ్ఞత ప్రకటించింది. ఇది మనస్సును కదలించే సన్నివేశం. వారిరువురి అనుభూతి స్పృహకు సింగ్ విస్తుపోతాడు. ఆమె ఎవరో తెలీదు. రేడియోలో సితార్‌వాద్యంలో కలసి కంఠస్వరం వినిపించింది. తరువాత ఆమెను చూచాడు, అనుమానించాడు, ఋజువు చేసుకున్నాడు, ఆశపడ్డాడు. కాని ఎంత ఆరాటపడినా, "నీవిక్కడికి ఎందుకు రాకూడదు" అంటే, తప్పకుండా "నేనే ఇక్కడికి వస్తాన"ని అనలేకపోయాడు. అలా అనడం జరగలేదు. సింగ్‌కు దేశికాచారికి భేదం ఆమె అనుభవాత్మకంగా విశ్లేషించింది. మొదటిది సింగ్‌కు ఆమెకూ మధ్యగల "ప్రేమ శృంగారమూ గొప్పవే". రెండోది, క్రమంగా దేశికాచారిలో ఆమె దీని కతీతమైన శాంతినీ ఐక్యాన్నీ "ఆకాశంలో మల్లే" అనుభవిస్తోంది. ఇప్పటికి పాత్ర బాగా సమున్నతిని పొందడంతో రెండోదాన్ని ఎన్నుకుంది. సింగ్, రావు ఇరువురు స్నేహితులూ ఆతిథ్యం స్వీకరించి బయట వెన్నెట్లో కూర్చున్నపుడు దేశికాచారి ప్రకృతి సౌందర్యాన్ని అనుభవిస్తూ లాలసతో "ఆ అందం చూస్తున్నావా?" అంటాడు. "ఓ" అని బదులు వస్తుంది. లాలస దేశికాచారి అనుభవించే జీవితం ఒక అన్వేషణలో పొందే ఆనందం, శాంతి ఐక్యం మనల్ని చకితుల్ని చేస్తుంది. అమూల్యమైన కొత్త విలువలవైపు మన దృష్టిని ప్రసరింపజేస్తుంది.

సంక్లిష్టమైన మానవ జీవితంలో నగ్న సత్యాలనూ కఠోర వాస్తవాలనూ ఎదుర్కోవలసి వచ్చినపుడు ఈ ఏకాంతధోరణి సామాజిక తత్త్వంలో ఎంతవరకు సముచితం? అన్న ప్రశ్న ఇక్కడ ఉచితం కాదు. ఎందుకంటే రచయిత దృష్టిలో సామాజిక స్పృహకన్నా వ్యక్తి స్వేచ్ఛ ముఖ్యం. ఈ నవల్లో ప్రయోజనం అంటే, స్త్రీ స్వేచ్ఛ. ఇందుకు సరిపడని నీతులూ నియమాలు ఆచారాలూ ఛేదించే మేరలో సామాజిక చైతన్యానికి దోహదం చేస్తుంది. అలా కాకపోతే చలం వ్యక్తిత్వమే కరిగిపోతుంది. ప్రకృతి తాదాత్మ్యం, సౌందర్యాన్వేషణం, స్వేచ్ఛ, ఆనందం, శాంతి, ఐక్యంతో అనుభవరూపమే జీవితానికి దీని ఆదర్శం.

# 3. చలం ప్రేమలేఖలు - ప్రేమ తత్త్వం

ప్రేమ లేఖలు ముందుమాటలో "మృణ్మయమైన ఆత్మలో తమోనిర్మితాలైన మేధస్సులు నిన్నూ నన్నూ అర్థం చేసుకోగలవా?" అన్నమాట చలం ప్రేమతత్త్వం గురించి అతని దృక్పథాన్ని భావింపజేసేది. ఇది ప్రేమలేఖల్లోని అంతస్తత్త్వాన్ని బింబించేది. చలం దృష్టిలో జీవంతో స్పందనతో కాంతితో విలసించే హృదయానికి మాత్రమే ప్రేమ అర్థమౌతుంది. దివ్యమైన అనుభూతికి చెందిన మనోభావం ఎంతో ప్రతీకాత్మకంగా అభివ్యక్తమైంది. సౌందర్యదృష్టే నిర్వ్యాజమైన స్నేహం. అనుభూతిగుణం తేజోరూపం లేంది, మానసికమైన ప్రేమస్థితిని అర్థం చేసుకోజాలరనే దీని అభిప్రాయం. వీటితోపాటు ప్రేమికుల్లో తీవ్రమైన ఆకర్షణ ఉద్రేకస్థాయి భావనా శక్తి పవిత్రమైన ప్రేమ అవసరమౌతాయి. సాధారణ జీవితంలో విశిష్టమైన స్థాయిలో స్నేహం ఆర్ద్రత అనేవి ప్రేమకు దారితీస్తాయి. చలం మాటల్లో స్నేహం లేకపోతే ఒక భాగం ఎండి నశించేది అది క్రియేటివ్‌సైడ్ కావచ్చు. రొమాంటిక్ సైడ్ కావచ్చు. మనిషి ఆరోగ్యానికీ ఆనందానికీ స్నేహం అవసరం.

ప్రేమలేఖ అంటే ఇష్టమైన వాళ్ళకీ మనస్సుకు బాగా నచ్చినవాళ్ళకీ ఎంతో ప్రియంగా వ్రాసేవి, ఇవి ఆత్మాశ్రయాలు. వీటిలో ప్రేమలోని గాఢత్వం సౌకుమార్యం మాధుర్యం అనుభూతి విలక్షణంగా ఆవిష్కృతమౌతాయి. ఇట్లా ఆ వ్యక్తి వియోగదశలో పొందిన స్థితీ ఆశ నిరాశ సుఖదుఃఖాలు ఇట్లా స్మృతులూ వర్తమాన వాతావరణంతో ఒక్కొక్క రమణీయమయిన లేఖారూపాన్ని పొందుతాయి. ఇవి రచయిత రచనాశక్తినిబట్టి సామాజిక దృష్టినిబట్టీ వైయక్తికానుభవ సీమల్నిబట్టీ కళాత్మకతనూ సామాజిక తత్త్వాన్నీ పొందుతాయి. ఇవి వ్యక్తమైన స్థాయిలో ఉన్నా సాధారణీయమై అందరికీ వర్తించే అంశాలను బట్టి అందరూ ఒక్కొక్క విధంగా వీటిని సాహిత్యదృష్టితో ఆనందించడం జరుగుతుంది.

ప్రపంచ సాహిత్యంలో గొప్ప ప్రేమలేఖలన్నీ ప్రేమికుల విరహదశలోనే రూపుదిద్దుకున్నాయి. దీనికి స్వచ్ఛమైన నిర్వ్యాజమైన మానసిక వాతావరణం అవసరం. వీటిలో ఏదో ఒక ఆదర్శానికి చెందిన భావరూపం ఆవిష్కృతమవుతుంది. ఒక్కొక్కప్పుడు ఉన్నతదశకు చేరి మిస్టిక్ ఎలిమెంట్ కూడ ప్రవేశించవచ్చు. ఈ మానసికమైన దశల్ని విశ్లేషిస్తే 1) సాధారణమైన జీవన వాస్తవం, 2) స్వేచ్ఛ, 3) సౌందర్యభావన, 4) కళాత్మకత, 5) కాల్పనికత, 6) అనుభూతిగుణం, 7) అమూర్తస్థితి లేదా భావరూపం, 8) మిస్టిక్ స్థితీ, దివ్యదశ - ఇట్లా పేర్కోవచ్చు.

చలం ప్రేమలేఖల్లో వీటిలో ఒక్కొక్కటీ ఒక్కొక్క సందర్భంలో కొన్ని కొన్ని కలిసే, మన దృష్టికి వస్తాయి. మొత్తంమీద ఇవి అన్నీ కలిసి రచనలో ప్రవాహరూపాల్ని పొందుతాయి.

పాశ్చాత్య సాహిత్యంలో లేఖా ప్రక్రియకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ఇది ఎంతో విశిష్టమైన స్థాయినీ అందుకుంది. బ్రౌనింగ్ వ్రాసిన ఉత్తరాలను గురించి వ్రాస్తూ ఆంద్రూలాంగ్ "ఈ అసాధారణమైన మానవ నేత్రాలకి, ఈ లేఖల్ని వాటి సౌరభాన్ని అనుభవించే అర్హత ఉందా?" అని అభిప్రాయపడతాడు. చలం ముందుమాటలో ఇది ప్రస్తావితమూ ఐంది, సాధారణమైన మనస్సు దీన్ని భరించలేదు. అంతటి దివ్యత్వం పొందిన లేఖలు సామాన్య పాఠకులకు అందవు. లౌకికమైన అపేక్షలకీ ప్రయోజనాలకీ దూరంగా చాలా పవిత్రమైన హృదయంనుండి తేజోవంతంగా ఆవిష్కృతం కావడమే వీటి విశేషం.

గాఢమైన స్నేహం గల వ్యక్తుల మధ్య ఒక్క వియోగం మాత్రమే కాదు ఆవేశ యుతమైన మనోభావ స్పందనమూ ఉండాలి. కాళిదాసు మేఘసందేశం ఒక ప్రేమలేఖే నంటాడు చలం. ఈ కావ్యానికి విరహస్థితిలో ఎంతో దూరంగావున్న తన హృదయంలో హృదయం, ఆలోచనలో ఆలోచన, స్పందనలో స్పందన, అనుభవంలో అనుభవం ఐన ప్రేయోమూర్తికి సందేశం పంపే కోరిక ముఖ్యం. ఇది లేకపోతే ప్రేమలేఖ లేదు, సందేశమూ లేదు. ఇదే కాళిదాసు సృజనశక్తిచేత ఆవేశాత్మకమైన భావస్పందనంతో ప్రేమతేజం ఆవిష్కృతమైంది. వియోగస్థితిలో వున్న తన ఉజ్వలమైన ప్రేమను అభివ్యక్తం చేసేందుకూ బలమైన ఉత్సుకత కలిగి ఉండాలి. దీనినుండి లేఖ తన కళాస్వరూపాన్ని పొందుతుంది. వ్యక్తి అనుభవ సాంద్రతచేత, ఆలోచనాశక్తిచేత లోతు విస్తృతీ కలుగుతుంది. అయితే రచయిత దీన్ని దైనందిన జీవితం నుండి విశిష్టంగా ఆలోచించే మనస్సు కలిగి ఉండాలి. ఇది విద్యవల్ల, సంస్కారంవల్ల, అనుభవసంపదవల్ల ఔన్నత్యాన్ని పొందుతుంది. ఇది కళాత్మకమైన సాహిత్య విలువల్ని పొందడానికి మంచి శైలీ, అభివ్యక్తీ అవసరం.

ఇక్కడ ప్రేమ అనేది వ్యక్తిగతమైంది. మానసికంగా భావనిబిడమైందీ, దీనికి బాధ వేదన అవసరమౌతుంది. ఇది వస్తువును ఆశ్రయించకపోవడంతో భావనా రూపాన్ని కేవలం చుట్టూ ఉన్న వాతావరణంతో స్మృతిలోని ప్రేమ పాత్రకు పరిమితం చేయవలసి ఉంటుంది. ప్రేమలేఖల్లో పాత్ర చుట్టూ ఏర్పడే కాల్పనిక స్థితిలో భావ రూపాలవల్ల అమూర్తస్థితి (అబ్‌స్ట్రాక్ట్‌నెస్) పొందే వీలుంది. చలం ప్రేమలేఖల్లో ఇది కవిత్వం అనిపించేంతటి స్థాయిని పొందిందొక్కచోట.

## 2

అర్ధాంగిని సంబోధిస్తూ మొదలైన చలం ప్రేమలేఖల్లో ప్రేమ పూర్ణమైన హృదయశక్తి సామాజికమైన అంతస్థుల్నీ, వ్యక్తిగతమైన భేదాన్నీ విస్మరించింది. సామాన్య జీవితంలోని డబ్బూ కీర్తీ అవసరాలూ పదవీ సుఖం మొదలైన పొరల్ని ఒలిచేస్తూపోయే జీవిత చిత్రం ఉంది. ప్రేమికులు తీవ్రమైన అవరోధాలు ఎదుర్కోడం వల్ల పొందే ఉద్రేకాలూ విపరీత ధోరణులూ మొదలైనవేవీ లేవు. కేవలం మానసికమైన సమతలంపై ఏ అవరోధమూ లేకుండా స్వచ్ఛమైన ప్రేమభావం తేజస్సుతో విశాలమైన మైదానంలోనో దీర్ఘమైన నదిలోనో ప్రయాణం చేస్తున్నట్లు ఉంటాయి. ఈ ప్రేమలేఖల్లో లీలగా దాంపత్య సౌరభమూ ఉంది. నిర్వ్యాజమైన అలౌకికదీప్తి ఉంది. దీన్ని అనేక సందర్భాల్లో ప్రేమలేఖల్లో వర్ణనాత్మకంగానూ, విచిత్ర సంఘటనల చిత్రణంతో తులనాత్మకంగానూ సులభంగా గుర్తించవచ్చు. ఇది అప్పుడప్పుడూ ప్రేమికులిరువురికీ కలిగే ఎడబాటుచేత తప్తమై ఉజ్వలమై "ప్రేమ" అసాధారణ స్థితినీ పొందింది. అంటే చలం మాటల్లోనే చెబితే "భగవంతుని ప్రేమించే" స్థితికిది దగ్గరగా చేరింది. ఈ లేఖల్లో కొన్ని సందర్భాల్లో మాత్రం దివ్యదశల్ని స్పృశించే ప్రేమ మనల్ని క్షణకాలం నిలుపుతుంది. ఇక్కడే ఇది మరీ భావరూపంతో అమూర్తత్వాన్ని (అబ్‌స్ట్రాక్ట్‌నెస్) పొందిన విధం బాగా ప్రభావితం చేస్తుంది. అవ్యక్తమైన అనుభూతిని ప్రసాదిస్తుంది.

కవిత్వంలో ముఖ్యంగా కాల్పనికమైన భావకవిత్వంలో ప్రేయసిని భగవత్ స్వరూపానికి సన్నిహితంగా వర్ణించే సందర్భాలెన్నో! విశేషంగా ఈ దృష్టితో చూస్తే ఠాగూర్ కవిత్వం ప్రభావాన్ని చలం ప్రేమలేఖల్లో స్ఫుటంగా గుర్తించవచ్చు. అక్కడక్కడా లేఖల చివర దీన్ని సూచించే ఠాగూర్ కవిత్వ పంక్తులూ దీనికి సంబంధించినవే. మరొకరివీ, రచయితవీ వాక్యాలు ఈ అంశాన్ని పరిపుష్టం చేస్తున్నాయి.

## 3

చలంలో సహజంగా వున్న స్వేచ్ఛాతత్త్వం, సౌందర్యతృష్ణ, ఆత్మార్పణం, భావోద్రేకం, సముద్రంలో అలలపై తేలే సాహసంతో ఈ లేఖల్లో అనుభవాత్మకంగా దర్శనమిస్తాయి. ఒక్కొక్కపుడు కాలం ఆగినట్టే ఉంటుంది. ఒక వింతైన మానసికమైన అనుభవానికి దారితీస్తుంది. సన్నని వాస్తవరేఖపై స్వప్నతుల్యమైన స్థితీ కాల్పనికలోకం నిర్మితమౌతాయి. ఇదంతా అమూర్తమైన భావనా (అబ్‌స్ట్రాక్ట్స్ ఐడియా) జనితమే. ఇదే పద్ధతి లేఖలన్నిటా పర్యవసితం కాదు. మధ్యమధ్య ఎన్నెన్నో స్మృతులతోనో చుట్టూ

ఉన్న పరిస్థితుల చిత్రణంతోనో ప్రేమభావం మూర్తస్థితినీ కలిగివుంటుంది. "ఆమె కళ్ళు సాధారణమైన లోకాన్ని చూచే వెలుగు కాదు, ఆ చూపూ ఆ ముఖం ఆ వక్షస్సూ" ఇట్లా ప్రేయోమూర్తి బాహ్యరూపం వర్ణితమైంది. ఇది ఆధార సూత్రంగా ప్రేమ తేజస్సు దర్శితమైంది. చలం ప్రత్యేకతల్లో ఇదొకటి. దీన్ని ఏదో ఒక లేఖను మాత్రం తీసికొని చూపలేం. క్రమంగా కొన్ని లేఖలమీద కాని నిరూపితం కాదు.

ఈ లేఖల్లో సమాహారంగా ఆమెలోని నిర్మలత్వం ఔజ్వల్యం ఇంకా దేవతాత్వం సాధారణ శృంగారానికతీతమైన రసరమ్యత అమూర్త భావరూపంలో ఆవిష్కృతం కావటం చలం ప్రత్యేకత. ఒక మూర్తరూపాన్ని ఇచ్చే నిశ్చయమైన అకాంక్ష లేకపోవడమూ దీనికి కారణంగా భావించవచ్చు. కవిత్వచ్ఛాయలతో కాల్పనిక చిత్రాలతో అక్కడక్కడా జీవన వాస్తవ రేఖలతో ఉత్తమ ప్రేమలేఖల స్థాయిలో ఆవిర్భవించిన ఈ ప్రేమలేఖల్లో "స్త్రీ ప్రేయోరూపం - సోదరీ మాతృపార్శ్వాల స్పృహతో ఆదర్శీకృతమైంది. సృష్టి సౌందర్యానికీ అనుభవ ప్రయోజనానికీ లక్షితమైంది.

మరో విశేషమేమంటే – ఈ లేఖల్లో అక్కడక్కడా రహస్యవాదానికి (మిస్టిసిజమ్) చెందిన మార్మికత చోటుచేసుకొంది. ఇక్కడ అమూర్తమయిన భావస్థితి తెల్లని మంచు పొరలో వెలుగువలె అనుభవానికి వస్తుంది. మనస్సు పై స్థాయికి వెళ్ళేకొద్దీ కింది సీమలు చెరగిపోతాయి. విశాల రూపం ఒక్కటే ఎదుట నిలుస్తుంది. ఈ స్థితిలోనే స్త్రీపట్ల పూజ్యభావం ఏర్పడుతుంది. ఆమెలోని దివ్యత్వం దర్శితమౌతుంది. అన్న పానాదులతో సహా లౌకికమైన సుఖం తృణీకృతమౌతుంది. అనుక్షణం ప్రేమకోసం తపించిపోవడం జరుగుతుంది. ఇది కొందరిలో ఒక సాధనగా పరిణమిస్తుంది. శరత్ దేవదాసు, కాళిదాసు మేఘసందేశంలో యక్షుడూ ఇంచుమించు ఇలాంటి వారే. చలం ప్రేమలేఖలు వియోగంలో ఒక్కొక్కప్పుడు కలలకు వాస్తవరూపంగానూ, మరొకప్పుడు కల్పనకు అనుభవ రూపంగానూ ఆకర్షిస్తాయి. అంతలో తనచుట్టూ ఉన్న రకరకాల అనుభవాల స్మృతుల వల్ల కిందకు చూచే ప్రయత్నమూ జరిగింది. ఇది చలంలో స్త్రీ సమస్యలపట్ల వీడని సామాజికశక్తుల ఆకర్షణ ఫలితమే. ఈ అంశాన్ని ప్రేమలేఖల్లో ఎన్నో ఉదాహరణలతో వివరించవచ్చు. ఎన్ని ఆకర్షణలు ఏ విధంగా లాగినా, హృదయంలో జాలీ దిగులుతో అంతలో నిరాశ – ఆశతో దూరంలో వున్న ప్రేమమూర్తితో హృదయానికి హృదయం దగ్గరగా, హృదయంతో మాట్లాడుతూ అంతరంగంలోని రహస్యాల్ని ఆకర్షించే భావనా జగత్తు ఎంతో సుందరంగా మలచబడింది. సౌందర్యానుభవంతో ఆరాధనా భావంతో దర్శనదృష్టితో అమూర్తరూపం, కరగిపోతున్న కాంతిశిల్పంవలె ఉంది.

ప్రేమలేఖలు కరుణామయమైన ప్రేయసి పాదాల ముందు ఆత్మార్పణ భావంతో మొదలౌతాయి. తరువాత విశ్వస్మరణలో కలిసిపోయే స్థితిని పొందాయి. ఈ సందర్భాల్లో చలం నుండి ఎంతో హృదయంగమమైన కవిత్వం అనుభవానికి వస్తుంది.

"మూసిన వాకిలి ముందు భిక్షమడగడం నాచేతకాదు" "నిర్భాగ్య జీవి జాలివల్ల శాంతిపొందదు" ఠాగూర్‌ను తలపిస్తూందీ స్పందనశీలం గల కవిత్వం, "నాకు చేతకాకేం ఈత! కన్నీటి కాలవల్లో" ఇట్లా ఒక్కొక్క మనస్ స్థితి భావచిత్రాలతో కరగిపోతూన్న కాంతిశిల్పంవలె మనముందు సాక్షాత్కరిస్తుంది.

**4**

చలం ప్రేమలేఖల్లో ప్రేయోమూర్తీ, ఆమెతో అత్యంత సాన్నిహిత్యం చేత, వియోగంచేత తప్తమయ్యే హృదయంలో ఉజ్వలమైన ప్రేమకాంతీ – పైకి బాహ్యమైన వస్తువు ఐనా వైయక్తికమైన అనుభవ సాంద్రతతో సాధనచేత అంతర్మయత్వాన్ని పొందింది. దీన్ని ఎన్నో ఉదాహరణలతో నిరూపించవచ్చు. ఇదే ఈ లేఖలకు ఆత్మాశ్రయ రూపాన్ని ఇస్తోంది. సృజనాత్మక సాహిత్యంలోనూ ఎంతో ఆకర్షణశక్తీ కలిగింది. కాంతీ, స్పందన, ఆర్ద్రత కలిగిన అంశం, అదే ప్రేమ. ఇది స్త్రీ పురుషుల శృంగారంవరకే పరిమితమైంది కాదు. విశాలమైదీ ఎన్నో పార్శ్వాలు కలిగిందీ. స్త్రీ పురుషుల శృంగారం ఒక పార్శ్వం మాత్రమే. ఈ పార్శ్వంలోని స్వేచ్ఛాతత్త్వం నిర్మలత్వం ఔజ్వల్యం దివ్యత్వంతో సంపన్నమైనవీ లేఖలు. సముద్రతీరంలో స్వేచ్ఛగా అన్నిటికీ దూరంగా, దూరంనుండి వీచే చల్లని గాలుల్లో వస్తూ పోయే అలల్ని చూస్తూ మైమరచే అనుభవ స్థితీ, చలం ప్రేమలేఖలూ రెండూ ఒకటే. అయితే మధ్యమధ్య వస్తూ పోయే పడవలూ పడవల్లోనుండి మనుషులూ దిగే వారూ ఎక్కేవారూ, చుట్టూ ఎంతగా మైమరచి ఉన్నా దృష్టిని వదలని జీవిత రూపాలూ మనల్ని ఈ లోకం పైకి తీసుకొని వస్తాయి. చుట్టూ ఉన్న జీవితంతో అనుబంధంతో వీడలేదీ ప్రేమ. ఎంత అమూర్త భావ రూపంలో ఉన్నా, పరిహరించరాని సామాజిక వాస్తవాన్ని ప్రదర్శిస్తూంది. ఈ అంశం కూడ ప్రస్తుత పరిశీలనలో పరిగణన యోగ్యమైంది.

చలం ప్రేమలేఖల్ని ఈ దృష్టితో పరిశీలిస్తే గాని వాటి ప్రేమతత్త్వం అవగాహనకు రాదు. ప్రేమికులు కలుసుకోడానికి వీల్లేని స్థితిలో ఒకరికొకరు దూరంగా ఉండడం తటస్థించింది. వియోగంలో మధురమైన స్మృతులతో ప్రియురాలి గురించిన ప్రేమ భావ రూపంతో కాల్పనిక వాతావరణంలో నిలిచినా వాస్తవానుభవాలతో స్మృతిలో సౌందర్యాన్ని వహించిన అక్షరాకృతులే ప్రేమలేఖలు. ఈ దృష్టితో చూస్తే వాస్తవతలంపై

కదిలే ఆలోచనా సరళి స్పష్టంగా కనిపిస్తుంది. ఉత్తరంకోసం ఎదురుచూస్తూ "హంసలూ విప్రులూ, చిలుకలూ, మేఘాలూ పోయి చివరకు ప్రేమ సందేశాలు పోస్టుజవాన్ల చేతుల్లో చిక్కాయి". ఇట్లా మధురమైన వ్యాఖ్యలతో సున్నితమైన హాస్యం నిండిన సందర్భాలనేకం, వెంటనే సీరియస్‌నెస్ అందుకోవడమూ ఉంది. "ఇది అంతం కాదు! మళ్ళీ కనబడతాను! ఇంతకన్న మధురంగా" అంటూ ఆశారూపమూ ప్రకటితమైంది. భావరూపంలో పై స్థాయిలో "విరహంలో కాలి మసైపోయి స్నేహంలో దైవత్వానికి ఎదిగే శక్తీ" కన్పిస్తుంది. వియోగంలో భరించరాని ఒంటరితనం, చివరి అట్లా ఉండడమే ఒక విధంగా వరంగా భావించడమూ జరిగింది. దూరంగా ఉండడంతో ఒకరికొకరు అర్థమైనంతలోనే ఒకరిలో ఇంకొకరికి గుణాలు గొప్పగా కన్పిస్తాయి. అవి ఎంతో కాంతివంతంగానూ ఆనందకరంగానూ ఉంటాయి.

ఒకరికిష్టమైన వస్తువులు మరొకరికెంతో ప్రియం. ఒకరి అలవాట్లు మరొకరికి ఇష్టం. ప్రియం అన్న మాటకు బదులు మరొకటి భరించలేని స్థితీ – భావనలో ఐక్యరూపంతో అంతా ప్రియంగానే పర్యవసిస్తుంది. మొదటి లేఖనుండి చివరి లేఖ దాకా ఎక్కడా ఒక్క చీకటీ – నీడా రవంతైనా కన్పించదు.

ఇంతకు ముందు పేర్కొన్న స్త్రీలోని ఇతర పార్శ్వాలూ ఈ సందర్భంలో ఉటంకించ వలసివుంది. "చాలాసార్లు నువ్వు" నాకే కాదు ... సోదరివనుకుంటాను" స్త్రీలోని మరో పార్శ్వం ఇది. ముందుమాటలో చలం స్త్రీ హృదయంలో ఉండే మాతృత్వాన్ని అనుభవించని ప్రియుడు స్వర్గానికి అంధుడు" అంటాడు. ఇది స్త్రీలో నిక్షిప్తమైన "మదర్ ఇమేజ్"ను సూచిస్తోంది. స్త్రీలోని సోదరీత్వం మాతృత్వం ఇట్లా ఆమెలోని వివిధ వ్యక్తిత్వాల్ని సూచించే సందర్భాలూ ఉన్నాయి. "నీ కోసం కొట్టుకొని కొట్టుకొని, గుండెజబ్బు పడ్డది. నువ్వు వచ్చి అదుముకుంటే గాని బాగుపడదు" మృత్యుసాన్నిహిత్యం నుండి అమృతస్థితికి తీసుకెళ్ళే ఆమె దర్శనం, స్పర్శ, ప్రేమ, తేజం, రసానుభవం ఇందులో స్త్రీ గురించి ఎంతో ఉన్నతంగా ఆలోచింపజేస్తాయి. జీవితంలో అనేక ఘటనలు, పాత్ర ఔన్నత్యాన్ని బింబించేవిగా ఉన్నాయి. ప్రేమకోసం చేసే సాహసం లేకుండానే కన్నీళ్ళు, వేదనా కలిగిన స్మృతులు ఎంతో మధురంగా ప్రవహించాయి. ప్రేమకోసం తపిస్తూ అట్లా ఎంతకాలమైనా నిలిచి ఉండడంలోనే ఈ ప్రేమలేఖల్లో ప్రేమికులకు అందమూ ఆనందమూ ఉంది. "స్త్రీలో ఉన్న కవిత్వం అక్షరాల్లో రాదు" అంటాడు చలం. శబ్దానికామె శక్తినీ తేజస్సునీ భరించే శక్తి ఎక్కడిది? ఒక్క హృదయానికి తప్ప అన్నదే అతని అభిప్రాయం. ఇదే ప్రేమలేఖల్లోని ప్రేమకు సంబంధించిన భావరూపానికి మూలం. ప్రేమ సంగీతం రెండిటిలో మనస్సు

ప్రేమనుండి సంగీతాన్ని అనుభవిస్తుంది. ప్రేమ పూర్ణమైన మనస్సుకు అంతటా సంగీతమే. "ప్రవాహంలో నీళ్ళ శబ్దంలో సంగీతం" ఉందంటాడు చలం. అప్పుడు చుట్టూ ఉన్న వాతావరణమంతా సంగీతమయమే!

**5**

ఈ లేఖల్లో అక్కడక్కడా నిరాశాధోరణి లేకపోలేదు. అది పాసింగ్ ఫేజ్ మాత్రమే. ఏ జీవితాన్ని ప్రేమించి, అనుభవించి ఆనందించి వృద్ధులై చివరకు చావుతో అంతం అయ్యేనో ఆ లోకాన్ని విడిచిపెట్టి పోయే క్షణాలు తలచుకుంటే విచారం కలుగుతుంది. దేవుడున్నాడా? అంటే "ఒకరిని చంపే అతడు రాక్షసుడే" అన్న భావంతో, ఈ ప్రపంచాన్ని గురించి, దీని కర్త గురించి మధ్య మధ్య ఆలోచనలు వస్తూనే ఉంటాయి. "నేను ఏ రైలు క్రింద జారతానని ఎందుకు భయపడతావు?" "ఇంత బలమైన ప్రేమ హృదయంతో .... వెలుగుతూ ఉండగా" నా కాళ్ళు తప్పటడుగులు వేస్తాయా? ఆ స్థితి వస్తే ఏ ఈశ్వరుడితోనో మరణ దేవతతోనో తగూలాడి ఈ జీవాన్ని పట్టుకొని ఒక వూపు వూగి నీ ఒళ్ళోవాలనూ!" మృత్యువును తిరస్కరించే, ఏ మాత్రం లక్ష్యం చేయని ప్రేమలోని చిరంజీవ శక్తి స్ఫూర్తికి వస్తుంది.

ప్రేమలేఖల్లో కాల్పనిక చిత్రాల్ని వాస్తవ స్థితుల్నీ ఈ సందర్భంలో పరిశీలిస్తేగాని దీనికి సమగ్రత చేకూరదు. నది ఒడ్డున తోట! పైన నీలాకాశం మిలమిల మెరిసే మంచు! మంచులో కొత్త పూలతో నవ్వుతూంది తోట! ఆ తోటలో అతడొక తోటమాలి! ఎన్ని నెలలనుండో రాణికోసం వేచివున్నాడు. ఆమె, ఇదిగో వస్తుందన్న భావంతో ప్రతిక్షణమూ నిరీక్షిస్తూ! తిండి లేదు. ఆమె ఏదో గొప్ప బహుమానం ఇస్తుందన్న ఆశతో జీవిస్తున్నాడు. ఆమె అనుగ్రహం ఎట్లా ఉంటుందో తెలీదు. తాను పెంచిన ప్రతి మొక్కలో పూవులో ప్రేమను చూచి ఆమె ఆనందపడాలి. తోటమాలి హృదయంలోని అక్షరాలు ఆమె చూడాలి. వాటిని చదవాలి. ఆమె తన బీదరికం చూచి ఏవగించుకోనీ! ఆగ్రహపడనీ! ఇంతేనా నీవు చేయగలిగిందని కోపగించనీ, అన్నిటికీ సిద్ధమే! ఆగ్రహానికీ, అనుగ్రహానికీ ఆ మాలి హృదయంలోంచి ఒక చిన్న కన్నీటిచుక్కను ఆమె చీర చెంగున పడవేస్తే అతనికి తృప్తి! ఆమె పాదస్పర్శ పొందిన భూమిని కౌగలించుకుంటాడు. దుఃఖిస్తాడు. తాను ప్రేమించిన స్త్రీకై నిరీక్షణలో వేదనలో దుఃఖంలో ఆరాధనలో సమర్పణలో ఉండే అందం తృప్తీ ఆనందం సార్థకత ఎంతో ఉన్నతంగా చిత్రితమైందీ లేఖ. ఠాగూర్ గార్డినర్ ప్రభావాన్ని తలపిస్తూ, ప్రేమికుని వేదన సహనశక్తి ఆరాధనతో చలం వ్యక్తిత్వాన్ని భాసింపచేస్తూంది. ఇందులో ప్రేమను రిసీవ్ చేసుకునే వ్యక్తి

తక్కువగానూ, అతడు ఎవరిని పొందాలని తపిస్తున్నాడో ఆ వ్యక్తిని ఉన్నతంగానూ చిత్రించడం జరిగింది. ఇది ప్రేమలేఖల్లో సర్వసాధారణం.

ఇంకో లేఖలో సామాజిక సమస్యతో ముడిపడిన సంఘటన ఒకటి ఉంది. వ్యాపారసరళి ప్రేమకూ నిర్వ్యాజమైన ప్రేమకూ మధ్య భేదాన్ని గుర్తింపజేసేది. వ్యక్తిపై సాంఘిక శక్తుల ఒత్తిడినీ, దాని ప్రభావాన్నీ భావింపజేసేది. ఒక భోగంపిల్ల! తన వృత్తిని కప్పిపుచ్చి పైకి సాధారణ స్త్రీవలె ప్రవర్తిస్తూ ఉంటుంది. పగలు చదువుకుంటూ అందరినీ ఆకర్షిస్తూ రాత్రివేళ తన వృత్తిని సాగిస్తూ ఉంటుంది. ఇతనికి ఆమె పరిచయం కలిగింది. ఆమె ఎటువంటిదో తెలీదు. ఒకనాడు సాహసించి ఆమె ఇంటికి వెళ్ళాడు. కొంతసేపు కూర్చొని బయటపడ్డాడు. రెండురోజుల తరువాత ఆ అమ్మాయి పాఠాలు చెప్పమని ఇంటికి వచ్చింది. ఇతని దృష్టి ఎంతసేపూ ఆమెను ఎట్లా మార్చాలా? అనే! వీళ్ళ దుర్భరమైన జీవితం గురించే ఆలోచన. ఆమె ఏవో స్కాండల్స్ చెప్పేది. ఇతనికి ఇష్టం ఉండేది కాదు. ఒకనాడీతని లోబరచుకునే ప్రయత్నం చేసింది. వృత్తి సహజమైన రీతిలో చొరవ తీసుకుంది. “ఆమె అందమైనదైనా” ఇతని “కిష్టంలేదు” “అందం కాదు ఇంకా ఏదో ఆకర్షణ ఉంది నా ప్రేమను నిర్ణయించేది” అంటాడు. “స్త్రీ ప్రేమ అంటే నా కమితమైన భక్తీ” అనీ మరోచోట స్పష్టం చేశారు. ఈ భక్తికి అర్హమైన మానసికమైన ఔన్నత్యం ఆ స్త్రీలో ఉండాలి కదా! నైర్మల్యం ఔజ్వల్యం ఉండాలి కదా! అయినా ఇతడామెను ఏవగించుకోలేదు, కోపించనూ లేదు. ఆమెను మెల్లగా దువ్వి, సన్నగా నవ్వి ఇవతలకు తీసుకొని వచ్చాడు. ఆమెకు చాలా కోపం వచ్చింది. మళ్ళీ రాలేదు. ఒకసారి వాళ్ళ ఇంటి గుమ్మం ముందు కనబడి చిరునవ్వు నవ్వి వెళ్ళిపోయింది. అంతే! ఈ జరిగిన సంగతి చెప్పడంతో మనోభారం తగ్గింది.

ఇది ప్రేమలేఖల్లో చలం దృష్టిని తప్పించుకోలేని సామాజిక సమస్యను ఎత్తిచూపేది. మనిషి ప్రవర్తనపై పరిసరాల ప్రభావం జీవితావసరాల ఒత్తిడీ, బలహీనమైన మనస్సూ, సంస్కార రాహిత్యంవల్ల రూపుదిద్దుకునే మనస్తత్వ వైఖరిని ప్రదర్శిస్తూ చలం సామాజిక స్పృహను ప్రకటిస్తోంది. వ్యక్తిగత దృష్టి – సమాజం అభిప్రాయం ; నీతి-అవినీతీ ; సాంఘిక సమస్య – సాంఘిక న్యాయం ; వాస్తవస్థితీ – ఆదర్శరూపం ఇట్లా ఈ భోగంపిల్ల సంఘటన నాశ్రయించి ఉత్పన్నమయ్యే అంశాలనేకం. అయితే వీటి గురించి ఆలోచన ప్రస్తుతం ఈ లేఖల్లో అవసరం కాదు. ఇంకా ఎన్నో ఇలాంటివి! మధ్యమధ్య వస్తాయి. నగం బండి కింద నలిగిన కుక్క బాధ అర్థం తెలీక యజమానీ, ముఖం చూచి తోక ఆడించడం, మొదలైనవి చుట్టూ ఉన్న వాతావరణంలో కన్పించక

తప్పని దృశ్యాలు! ప్రేమలేఖల్లోనూ చోటుచేసుకున్నాయి. చలం దృష్టి ఈ సందర్భంలో వేరు కావడంచేత సామాజికాంశాలు ఈ పాసింగ్ ఫ్లాషెస్‌గానే మిగిలిపోయాయి.

6

ప్రేమలేఖల్లో ప్రేమ స్వరూపానికి వస్తే ప్రేమ అనేది చలం దృష్టిలో "ఒక అహుతి ఒక యజ్ఞం" "రహస్య వ్యభిచారంలో ఉన్న మాధుర్యం ఏమిటో నాకర్థం కాదం"టాడు ఒకచోట. జీవితం క్షుద్రత్వం నీచత్వం అంధత్వం లేని ప్రేమతో వెలగాలనీ ఇతని ఆశయం. ఇది "సూర్యుని ఉదయంవలె" "పూలుపూయడంవలె" సహజంగా జరగాలంటాడు. ప్రేమలేఖల్లో పోనుపోను అక్కడక్కడా చలంలో ఏదో పరిణామ స్ఫూర్తి మనకు గోచరిస్తుంది. "ప్రపంచం అంతా స్త్రీ ప్రేమపరంగా వీక్షించడం జబ్బు" అంటూ "ఇది ఆత్మ పరిణామంలో ఒక స్టేజ్ ఏమో?" అన్న అభిప్రాయం ప్రకటిస్తాడు. తన పెరస్‌పెక్టివ్ తనదే ఐనా ఇందులో అతడు ప్రశ్నకు గురిచేసిన విషయం సాధారణమైంది కాదు. ప్రేమ–ఐశ్వర్యం ఎక్కడో లేదు, మన హృదయంలోనే ఉంది! బైటకాదు. ప్రేమ హృదయంతో వెలుగుతూంటే ఆ కాంతి ప్రతి వస్తువునూ దివ్యంగా కనబరుస్తుంది. గడచిన కాలంలో ఏదో జరిగింది. విషాదమో! దుఃఖమో! సంతోషమో! అయితే దాన్నే నెమరు వేసుకుంటూ కూచోలేం. దీన్ని రసంపీల్చిన చెరకు ముక్కలతో పోలుస్తూ "మళ్ళీ కాలాన్ని వెనక్కు తిప్పలేం!" అన్న భవిష్యద్భావనపై విశ్వాసదృష్టి కనిపిస్తుంది. ఆశారూపమూ సూచిస్తుంది. ఇతనికి దేవునిపై విశ్వాసం లేదు. అయితే తనకు ప్రియమైన వ్యక్తిని జాగ్రత్తగా కాపాడినందుకు హృదయం కృతజ్ఞతా పూర్ణమైంది. "రాత్రి ఎంతో కృతజ్ఞతతోఓ దేవుణ్ణి తలచుకున్నాను" "ఎంత కాలమైందో నేను ప్రార్థించి" అంటాడు.

ప్రేమికుల మధ్య సంబంధాన్ని గురించి "ఐ ఆమ్ నాట్ దైన్; ఐ ఆమ్ పార్ట్ ఆఫ్ దీ" అంటాడు. నేను నీవాణ్ణి కాదు, నేను నీలో భాగం. సమస్తమూ ప్రేమముందు అర్పితం కావాలనే ఇతని ఆకాంక్ష, స్వేచ్ఛ, ప్రేమ, సౌందర్యతృష్ణ, విరహం, కన్నీళ్ళు, ఆవేశం, ఆరాధన, పారవశ్యం, ఆనందం ఇట్లా ఒక స్థితి నుండి మరో స్థితికి క్రమిస్తూ పోయే చలం మనస్తత్వం ప్రేమలేఖల్లో స్పష్టంగా దర్శనమిస్తుంది. దీనికంతటికి జీవితమే ఆధారతలం. ప్రేమ సాధనగా పరిణమించింది. అతనికీ లోకం మీద అమితమైన ప్రేమ. జీవించడం చిత్రంగా ఉంటుంది. ప్రేమించడం అద్భుతంగా ఉంటుంది. ఈ లౌకిక మానసిక భావరూపంతో ముడిపడిన ప్రేమనుండి అంతలో "దేవుడు కూడా నాకో గొప్ప ప్రియునివలె తోచాడు, పూర్వం ఆ దేవుని శక్తి స్త్రీలలో కాని వ్యక్తం కాలేదు" అంటాడు. "యోగుల హృదయాల్లో వెలిగించుకొనే కాంతి నీ చిరునవ్వు!" నాకెట్లా

దొరుకుతుంది లోకాన్ని వెతికే నాకు" - అన్న మాటల్లో అధ్యాత్మిక భావస్పర్శ మనల్ని నిలిపి చలం గురించి ఆలోచింపచేస్తుంది. "మదర్ సిస్టర్ ఐడియల్ వుమెన్ ఇన్ వన్, హావ్ ఐ ఫౌండ్ ఎ బ్యూటిఫుల్ బీమ్ అఫ్ గాడ్". తల్లి సోదరి అదర్శనారి ఒకే రూపంలో, భగవంతుని అందమైన ప్రకాశాన్ని పొందగలిగేను. (Mother sister ideal woman in one, have I found a beautiful beam of God). స్త్రీ గురించీ ఆమె హృదయ స్పందనం వైశాల్యం గాంభీర్యం ఔన్నత్యం ఔజ్వలంతో పాటు దివ్యమైన తేజస్సూ ఈ లేఖల్లో అనుభవ దర్శనంతో చిత్రితమైనాయి.

ప్రపంచం చూచిన కొద్దీ హృదయాన్ని వెతికినకొద్దీ అనుభవం విస్తీర్ణమైన కొద్దీ "నాకేదో కారణం లేని విశ్వాసం కలుగుతోంది" అంటాడు చలం. ఎంత ఆలోచించినా చదివినా అడిగినా వెతికినా ఆ రహస్యం అందలేదు. "నేనింకా అభివృద్ధి కాలేద"ని సవినయంగా, చెప్పినా ప్రేమలేఖలు మొత్తంమీద ఎంతో అనుభవ పరిణతీ, ఆలోచనా వికాసం, అన్వేషణేచ్ఛ కన్పిస్తుంది. తాను అభిలషించింది "ఎంతో దూరంగా మనస్సుకు గోచరించడమే కాని మాటలతో నీతో చెప్పలే"నంటాడు ప్రేమమూర్తితో. ప్రేమలేఖలు చలం జీవన ప్రయాణంలో అమూర్తమైన భావరూపంలో ప్రేమ దివ్యత్వాన్ని ఆవిష్కరిస్తూ, ఇంకా ఏదో అందని రహస్యం కోసం సాగించే గంభీరమైన అన్వేషణలో పొందే ఆత్మసుందరమైన అనుభవరేఖలుగా భావిస్తాను.

# 4. గోపీచంద్ - సాహిత్య జీవిత దృక్పథం

గోపీచంద్ సాహిత్య జీవిత దృక్పథం వివిధ పార్శ్వాలతో దృష్టిగోచరం అవుతుంది. ఇది ఈతని వ్యక్తిత్వంలోని వైవిధ్యం వల్ల ఏర్పడింది. ఇది నిరంతరం కదలే ప్రవాహాన్ని భావింపజేసేది. ఎప్పటికపుడు జీవితంలో కొత్త పరిజ్ఞానంతో అనుభవంతో సంచలిస్తూ మార్పులకు లోనవుతూ గతిలో మలుపుల్ని పొందుతూ ఆకర్షిస్తూ ప్రవహించడం ఈతని ప్రత్యేకత. ఈ కారణంగా సాహిత్య జీవితంలో వివిధ దశల్లో వివిధ పార్శ్వాలు వెలసాయి. రచయితలను తలచుకుంటే వారి సాహిత్య జీవితం తాము అవలంబించిన అభిప్రాయాలపై సిద్ధాంతాలపై ఎన్నటికి చలించని ప్రత్యయంతో కదలని గిరిశిఖరంవలె, మరొకరు గతిలో మార్పులతో మలుపులతో కదలే ప్రవాహం వలె, ఇట్లా మరో మరో అంతర్ వ్యక్తిత్వంతో మన ఎదుట సాక్షాత్కరిస్తారు. ఈ రచయిత విషయంలో వివిధ దశల్లో వచ్చిన మార్పులతో ప్రభావశీలం గల సాహిత్య మూర్తిత్వం విస్ఫుటంగా కన్పిస్తుంది. దీన్ని కాలప్రభావం నుండి అంటే ఆనాటి సాంఘిక రాజకీయ వాతావరణం నుండి విడదీయడానికి వీల్లేదు. రచయిత మనస్తత్వమూ, వెనుకనుండి పనిచేసినమాట మరవడానికి వీల్లేదు. ఈ విధంగా ప్రత్యక్షంగా పరోక్షంగా పనిచేసిన అంశాలు విశ్లేషించి చూడవలసి ఉంటుంది. పాశ్చాత్య ప్రభావంతో సాంఘిక రాజకీయ రంగాలతో పాటు సాహిత్య రూపమూ క్రమంగా తీవ్రమైన పరివర్తనకు లోనై అంతకుముందున్న లక్ష్యమూ మారింది. విజ్ఞానశాస్త్ర ప్రభావం వల్ల ప్రతిదీ ప్రశ్నించడం పరీక్షకు నిలపడం జరిగింది. సమాజంలోని శుష్కమైన ఆచారాలూ, అర్థం లేని అలవాట్లూ, బాహ్యమైన ఆడంబరాలూ హేతుదృష్టిచేత నిశితమైన పరిశీలనకు లోనయ్యాయి. ఈ స్థితిలో పూర్వపు విలువలు అంతరించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పడని అనిశ్చయమైన దశ కన్పిస్తుంది. ఈ దశలో సంప్రదాయ ధోరణిలోని నిజమైన తత్త్వంతో పరిచయం లేకపోవడం, నవ్యధోరణులింకా పాదుకొనకపోవడం అందులోనూ ప్రతిదీ హేతుయుతంగా వితర్కించే తీవ్రవైఖరితో పాటు సమరసభావమూ లోపించడంతో ఈ పరివర్తనకు చెందిన దశలో ఒక సంక్షుబ్ధస్థితి అవరించింది. ఈ సమయంలో కొందరు ఎంతో విజ్ఞతతో సంస్కరణ పథంలో సమన్వయ దృష్టితో మానవీయ భావనతో అధిగమించగలిగారు. వీరివల్ల ఎంతో మేలు చేకూరిన మాట వాస్తవం. సంప్రదాయ వాదుల నిరసన లేకపోలేదు. దీన్ని అధిగమించడమూ జరిగింది.

గోపీచంద్ సాహిత్య జీవితానికన్వయిస్తే, నాస్తిక వాతావరణంలో భౌతికదృష్టితో హేతువాద నైశిత్యంతో ప్రతిదీ ముక్కలు ముక్కలు చేసి చూచే లక్షణం నుండి, సామాజిక స్పందనం పట్ల తత్పరతతో, సామ్యవాదం గురించి వివేచనతో, వ్యక్తి స్వేచ్ఛ - నవ్యమానవ

వాదం నుండి క్రమించి ప్రపంచంలోని వివిధ తాత్త్విక ధోరణుల ఆలోకనంతో భౌతికమైన విలువలతో పాటు నైతిక ఆధ్యాత్మికమైన విలువల సమన్వయ భావంతో దృక్పథం పర్యాప్తం కావడం విశేషం. గోపీచంద్ అనడంతోనే రామస్వామిచౌదరి, ఆయనతో పాటు నాస్తికవాదం, దానితోపాటు బ్రాహ్మణ వ్యతిరేకోద్యమం, ఇట్లా ఒక విచిత్రమైన వలయంలోకి ప్రవేశించి స్తిమితమైన అవగాహన లోపించి హఠాత్ వైముఖ్య ప్రదర్శనకు అవకాశం లేకపోలేదు. సాంఘిక పరివర్తనంవల్ల పనికిరాని పాత విలువలకు స్వస్తి చెబుతూ కొత్త విలువల్ని వేగంగా ఆహ్వానిస్తూ ఆ తరువాత నిదానంగా ఏది అవసరమో నిర్ధారణ చేసికొంటూ జీవితంలో జిజ్ఞాసతో అనుభవంపై వివేచనతో ఒక్క మారు వెనక్కు తిరిగి మానవుని అభిప్రాయాల ఆలోచనల అవలోకనంతో ఎప్పటికప్పుడు ఒక లక్ష్యాన్ని అందుకోవాలన్న నిశ్చయంతో సాగే యాత్రికుని లక్షణం వివిధ దశల్లో కన్పిస్తుంది. ఈతని సాహిత్య జీవిత వ్యక్తిత్వాన్ని విశ్లేషిస్తే కన్పించే ప్రధానమైన దశలివి. ఇవి తీసుకున్న మలుపులూ దృక్పథానికి వివిధ పార్శ్వాలుగా విలసించాయి.

1. భౌతికమైన విలువలతో నాస్తికుడూ హేతువాదీ ఐన తండ్రి అభిప్రాయాలకు వారసత్వంగా రూపొందేదీ,
2. సామ్యవాద ప్రభావం కలిగిందీ, నవ్యమానవవాదిగా ఉద్యమం నెరపిందీ,
3. అరవిందుల దర్శనం తరువాత దివ్యజీవనం (డివైన్‌లైఫ్) ప్రభావంతో ఆధ్యాత్మిక జగత్తు పరిచయంతో విశిష్టమైందీ,
4. ప్రాచ్య పాశ్చాత్య తత్త్వాల అవలోకనంతో సంపూర్ణమైన సత్యాన్ని అన్వేషించే ఆలోచనా ప్రకాశం కలదీ,
5. భౌతిక నైతిక ఆధ్యాత్మిక విలువల సమ్యక్ మేళనంతో జీవితంలో పరిపూర్ణతను సాధించే ప్రయత్నం కలదీ, అతీతమానవ (చేతనా) భావనాత్మకమైందీ.

ఈ దశలు ఒకదానినుండి మరొకటి మారడంలో దేనికది విడిగాగాక, ఒకదానికి మరొకటి ఆధారమై ఈతని సాహిత్య జీవితరూపం ఏర్పడింది. ఈ దశల్లో ఒక్కొక్కటి ఒక్కొక్క విధంగా ఉపకరించి రచయిత వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడినాయి. "ఈ మార్పులో ఒక క్రమం ఉంది. రేపు జరిగేది, నేటితో ముడిపడి ఉంటుంది. నేడు, నిన్నతో సంబంధం ఉంది. ఇది ఒక అవిచ్ఛిన్న ప్రవాహం". మొదటిదశలో సూత్రాశ్రమంలో ఏర్పడిన హేతుదృష్టి జీవితంలో వ్యర్థమైన ఆచారాలనూ ఆడంబరాలనూ ప్రశ్నకు గురిచేయడంతోపాటు నిజమైన విలువల్ని శోధించి, గుర్తించేందుకు ఉపకరించింది.

తండ్రి ప్రారంభించిన తీవ్రమైన హేతువాద ఉద్యమం అప్పటి సమాజంపై శక్తిమేరకు నిశితమైన ప్రభావాన్ని నెరపి తన పాత్రను నిర్వహించింది. ఆపైన సంస్కరణావశ్యకతను భావింప చేసేదిగా నిలచిపోయింది. ఈ చారిత్రక సంస్థితిలో సంకుచితమైన పరిధిని గుర్తించిన గోపీచంద్ దృష్టి సోషలిజం పట్ల ఆసక్తీ, ఆ తరువాత మానవేంద్రనాథ్‌రాయ్ నవ్యమానవ వాదంవైపు ప్రసరించింది. ఈ ఉద్యమంలో పార్టీ కార్యదర్శిగానూ క్రియాశీలత్వాన్ని ప్రదర్శించాడు. అప్పటికి పాశ్చాత్య సాహిత్యంతో ఏర్పడిన పరిచయం గోపీచంద్‌లో వివిధ వర్గాల జాతుల దేశాలమధ్య వైమనస్యానికీ నిరసనకూ బదులు సామరస్యానికీ సహనానికీ దారితీసింది. ఏ దేశంలో ఏ భావజాలం ఏ సిద్ధాంతాలు వ్యక్తమైనా అవి నిఖిల మానవాళికి చెందినవే అన్న విశాలమైన అవగాహన, కొత్త మలుపును తీసుకొని వచ్చింది. ఈ మానసిక వికాసంతో "భౌతిక ఆధ్యాత్మిక వాదాలు పరస్పరం వ్యతిరేకం కాదు. ఈ రెండింటిలో ఏది లోపించినా జీవితం అసంపూర్ణమే" అనే భావం ఏర్పడింది. ఈ మలుపు సాహిత్యలోకాన్ని చకితం చేసింది. వేదన చింతన అన్వేషణ లక్షణం గల ఈతని మనస్తత్వానికీ మలుపు సహజమైన పరిణామమే. ఇది ఈతని వ్యక్తిత్వానికి ఉదాత్తతనూ సమగ్రతనూ సిద్ధించేందుకు సోపాన పంక్తి ఐంది. ముఖ్యంగా హైదరాబాదు వచ్చాక పరంపరగా వెలువడిన నవలలు అనుభవ వైశాల్యంతో విజ్ఞాన సంపత్తితో ఈ లక్ష్యాన్ని భావింపజేసేవి. ఈ మార్పుకు వెనుక రచయిత మనస్తత్వంలోని స్వేచ్ఛాప్రవృత్తీ, ఎదుటి వాదంలోని గుణాన్ని స్వీకరించే సౌమనస్యం ప్రబలంగా పనిచేశాయి. తనలో వచ్చిన మార్పును గురించి ప్రస్తావిస్తూ "మార్పు అంటే భయపడనవసరం లేదు. ప్రతిదీ మారుతుంది. మార్పు తప్పదు. ఆ మార్పు ఎక్కడినుండో ఊడిపడదు. మార్పుకు క్రమం ఉంది. కారణం ఉంది. మార్పులో ఎప్పటికప్పుడు ఒక పద్ధతి కన్పిస్తుంది. మార్పు మిరాకిల్ కాదు అని వివరిస్తూ "ఎప్పటికపుడు ఒక సిద్ధాంతాన్ని నమ్మి పనిచేస్తూ ఆ సిద్ధాంతమే సంపూర్ణం అనుకోకుండా ఎప్పటికపుడు నూతన జ్ఞానాన్ని కలుపుకొని మానవుడూ మారుతూ జీవించాలి" అంటాడు. "ఏ దేశమైనా ఎక్కడి మానవుడైనా ఈ జీవితం ఏమిటి? ఈ చుట్టూ ప్రపంచం ఏమిటి? అని మొదటినుండీ తెలుసుకోవడానికి చేసే ప్రయత్నమే ఈ తత్త్వ ప్రపంచం. దీనికి మానవుడు తన సాధనాలన్నిటినీ ముఖ్యంగా హేతువు వివేకం అనుభవం విజ్ఞానం ఉపయోగించి ఎంతో కృషి చేశాడు. ప్రాక్ ప్రతీచీ భావ సంపదలను రెండింటినీ సమదృష్టితో పరిశీలిస్తేగాని సంపూర్ణమైన అవగాహన చేకూరదన్న విశ్వాసం రచయితలో దృఢపడింది. తాను విశ్వసించిన ఆదర్శానికనుగుణంగా నిరంతరం ప్రశ్నలతో, అన్వేషణతో ఎప్పటికపుడు

పొందే సమాధానాలతో నూత్న నూత్నంగా ఖండఖండంనుండి సంపూర్ణం వైపు ప్రవహించే స్వరూపంతో వ్యక్తిత్వం నిలిచింది.

**2**

చిన్నప్పటినుండి ఇతిహాస పూరాణాల సంప్రదాయ ధోరణుల్ని ప్రశ్నించే హేతుదృష్టితో నెలకొన్న భౌతిక నాస్తిక వాతావరణం గోపీచంద్ మనస్సును మొదట్లో ఆవహించింది. ఆ కాలంలో సూతాశ్రమంలో జరిగే అనేక విధాల చర్చల సందర్భంలో తండ్రి "గోపీ!" అని పిలిచి వాటిలో పాల్గొనే అవకాశం కల్పించేవాడు. ఇతడు ధైర్యంతో రంగంలోకి దూకితే తండ్రి ముసిముసినవ్వులతో వెన్నుతట్టేవాడు. ఈ విధంగా తండ్రి నిర్దేశంలో వ్యక్తిత్వం రూపొందుతూంది. ఒకనాడు తండ్రి "ఒరే! గోపీ! నీ మనస్సుకు ఏది మంచిదనిపిస్తే అది చెయ్యి! నా మాట వినవలసిన పనిలేదు. వినలేదని నేనేమీ అనుకోను, ఒకవేళ అనుకున్నా తొందరపడి మార్చుకోకు" మునుముందు ఏర్పడే సందేహమూ దాని నివారణోపాయమూ సూచితం. తండ్రి అభిప్రాయాలపట్ల ఇతడు నిశ్చయభావంతో ఉన్నవాడేనాయె! తన అడుగుజాడల్లో ఇతని వ్యక్తిత్వాన్ని రూపొందింప చేయవచ్చుగా. ఈ రకమైన "బ్లాంక్‌చెక్" ఇవ్వడంలో ఉద్దేశం? ఆ విధంగా తయారుచేయబడిన ప్రతిరూపంపై తండ్రికి విశ్వాసం లేకుండానైనా ఉండాలి. ఈ మాటలు గోపీచంద్‌లో స్వేచ్ఛను గురించి ఆలోచించే అవకాశం కల్పించాయి. స్వంత అనుభవంపై ఆలోచనకు దారితీసింది. క్రమంగా వ్యతిరేకం నుండి సామరస్యానికీ సంకుచిత వలయం నుండి నిఖిల మానవ క్షేత్రానికీ భౌతికం నుండి ఆధ్యాత్మిక తత్త్వానికీ ప్రయాణించే అన్వేషణకు దారితీసింది. మరో సంఘటన! ఉన్నవ గాంధేయవాది, ఆస్తికుడు, ఆధ్యాత్మిక వాసనామతి, గోపీచంద్ తండ్రి వీటికి పూర్తిగా వ్యతిరేకం, అయినప్పటికీ ఇరువురికీ మంచి స్నేహం. ఎంతటి వ్యతిరేకినీ 'మేన్‌స్ట్రీమ్'లో కలుపుకొనిపోయే గాంధేయతత్త్వం "ఈ స్నేహాన్ని దృఢతరం చేయగలిగింది. ఒకనాడు ఉన్నవతో కొడుక్కి పెళ్ళి సంబంధం చూచిపెట్టమంటాడు. ఆయన తలచుకుంటే అనుయాయులు ఎంతమంది లేరు! క్షణంలో తన విశ్వాసాలకూ అభిప్రాయాలకూ అనుగుణంగా తెచ్చిపెట్టేవాడు. ఉన్నవకు ఎలాంటి సంబంధం నచ్చుతుందో ఎటువంటిది తెస్తాడో ఎవరూ ఊహించడానికి ఎక్కువ శ్రమపడ నవసరం లేదు. ఉన్నవ తాను స్థాపించిన శారదా నికేతన్ ఆశ్రమంలో చదువుకునే అమ్మాయిని సూచిస్తాడు. ఆయన అంగీకరిస్తాడు. ఈ వైయక్తికమైన విషయానికి సంబంధించిన సంఘటనను తేలిగ్గా తీసిపారేయడానికి వీల్లేదు. హేతువాది, నాస్తికుడు భౌతికవాదియైన తండ్రి తన అభిప్రాయాల కనుగుణంగా ఉన్నప్పుడే యోచించి

అంగీకరించవచ్చుగా! ఈ అంగీకారంలో కొడుకు భవిష్యత్తుకు సంబంధించినవి ఆలోచనతో ఏదో మానసికంగా ఏర్పడిన శూన్యస్థితిని సంపూర్ణం చేసే తృప్తిరేఖ ఉందని నా అభిప్రాయం. తరువాత గోపీచంద్ జీవితాన్ని పరిశీలిస్తే ఈ నిర్ణయం ఎంతో యోగ్యమైందీ సముచితమైందిగా కన్పించడమేగాక, ఈయన సాహిత్య జీవితంలో నైతికమైన ఆధ్యాత్మికమైన ధోరణిలో ఈమె పాత్ర అనల్పమైందేనన్న భావమూ కలుగకపోదు. జీవితంలో ఒక్కొక్క ముఖ్యమైన స్థితిలో తీసుకునే నిర్ణయాలు అనుభవంలోకి వచ్చే సంఘటనలు తరువాత జీవిత స్వరూపాన్ని తీర్చేవిగా, మార్చేవిగా గొప్ప పరిణామ శక్తిని కలిగి ఉంటాయి.

రచయిత విద్యార్థిదశ, ఆ తరువాత పెరిగిన వాతావరణం మౌలికమైన ప్రభావాన్ని నెరపింది షేక్స్పియర్, బెర్నార్డ్‌షా నాటకాలతో పాటు పాశ్చాత్య రచయితల ప్రసిద్ధమైన నవలలతో కథా సాహిత్యంతో బాగా పరిచయం కలిగింది. చాలామందికి పాశ్చాత్య విద్యా ప్రపంచంలో పెరిగినవారికి మన సంస్కృతీ తేజాన్ని దర్శించడానికి ఇంగ్లీషుభాష సాధనమైంది. మొదట్లో పాశ్చాత్యులు ఆ తరువాత భారతీయులూ ఈ దిశలో ఎంతో బాధ్యతతో కృషిచేశారు. వివిధ భాషలవారికి తెలిసేందుకు మౌలికంగానో అనువాదంగానో ఇంగ్లీషులో రచనా వ్యాసంగం జరిగింది. ఈ రచయిత మాక్స్‌మూలర్, రవీంద్రనాథ్ ఠాగూర్, అరవిందులు రాధాకృష్ణన్ మొదలైనవారి ఇంగ్లీషు రచనల ద్వారా భారతీయ సంస్కృతీ తేజానికి సన్నిహితుడయ్యాడు. ఈతడు పెరిగిన వాతావరణాన్ని ఊహించీ సంస్కృత భాషా పరిచయం లేకపోయినా శంకరుల అద్వైతం గురించీ వేదోపనిషత్తుల గురించీ విశేషంగా తెలుసునంటే కొందరు విస్తుపోవచ్చు. ఈయన "విశ్వరూప సందర్శనం" నాటికలో గీతను ఆవిష్కరించడం జరిగింది. ఇట్లా వ్రాసారేం? అని ప్రశ్నిస్తే "గీత నన్ను అమితంగా ఆకర్షించింది. భగవద్గీత పట్ల నాకున్న భక్తి విశ్వాసాలను ప్రకటించేవరకూ నాకు తృప్తి లేదు" అని మనల్ని మనం నిర్నిమిత్తంగా, ఒక సాధనంగా భావించి పని చెయ్యాలనే అనాసక్తయోగం బాగా ఆకర్షించింది" అని సమాధానం వచ్చింది. నవల "పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా" సమాప్తిలో కేశవమూర్తి వ్రాసే రచనలో ముగింపు మాటలు ఉపనిషద్భావనాత్మకాలు. "ఈ సృష్టి రహస్యం ఆనందం. బ్రతుక్కి గమ్యస్థానం ఆనందం. బ్రతకడానికి కారణం ఆనందం. ఈ బ్రతుకులు ఆనందంలోంచి వచ్చినవే. ఆనందం వల్ల నిలబడుతున్నవే. ఆనందంవల్ల అభివృద్ధి చెందుతున్నవే. ఆనందంలో కలిసిపోయేవే".

ఇవి ఆ పాత్ర పరిణామంలో పరిణతినిబట్టి వచ్చినవే.

"ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్ । ఆనందాత్ హి ఏవ
ఖలు ఇమాని భూతాని జాయన్తే । ఆనందేన జాతాని
జీవన్తి । ఆనందం ప్రయన్త్యభి సంవిశన్తీతి" (తైత్తిరీయోపనిషత్తు 3-4(1)

భారతీయుల తత్త్వాలోకనంతో పాటు పాశ్చాత్యుల తత్త్వవివేచనమూ జరిపాడు. మార్క్సు మొదలుకొని బెర్గ్‌సన్, సార్త్రె, రసెల్, జిడ్డు కృష్ణమూర్తి, రాధాకృష్ణ మొదలుగా వివిధ భావాల్లోని ఆలోచనలు నవలల్లో అక్కడక్కడా ఆయా పాత్రల వ్యక్తిత్వాల్లో స్ఫూర్తికి వస్తాయి. మొదట్లో ఆధ్యాత్మిక వాదం అంటే శాస్త్రజ్ఞానంలేని కొందరు సనాతనుల వాదం అనుకునే వ్యక్తి ఉన్నవవారి ప్రేరణతో తనచుట్టూ ఉన్న వాతావరణం నుండి వివేకంతో పరిచయం సంపాదించుకొని క్రమంగా సత్యాన్వేషణతో అధ్యయనం చేయడం జరిగింది. ఈ ప్రస్తావన గోపీచంద్‌లో మౌలికంగా ఆధ్యాత్మిక లక్షణం గర్భితమై ఉన్నదన్న విషయాన్ని బావింప జేసేందుకే ఉద్దిష్టమైంది. ఈ మార్పును గురించి ప్రస్తావిస్తూ "నేను మాత్రం భౌతికవాది తల్లి గర్భంనుండి బయటపడ్డానా" అని సమర్థించుకోవడంలో ఎంతో కాలం నిగూఢంగా ఉండి ప్రకాశమానమయ్యే విషయంపై ప్రత్యయాన్ని గుర్తించవచ్చు. ఈతని సాహిత్య వ్యక్తిత్వంలో ఈ రేఖలు దీపిస్తూ నవల్లో పాత్రచిత్రణంలో ఆంతరమైన స్వరూప నిర్మాణానికీ కారణం ఔతున్నాయి. వాటి గమన వైఖరిలో పొందే లక్ష్యానికి ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రభావాన్ని నెరపడమూ స్పష్టంగా కన్పిస్తుంది.

## 3

ప్రతిదాన్నీ ప్రశ్నించే లక్షణం, హేతుచర్చ, తండ్రి నుండి సంక్రమించింది. ఈ తీవ్రమైన ధోరణి మన సంప్రదాయంలోని శుష్కత్వాన్నీ, కాఠిన్యాన్నీ, మౌఢ్యాన్నీ ఇంకా ఎక్కడికక్కడ చిన్న చిన్న వలయాలుగా ఏర్పడిన సంకుచిత స్వభావాన్ని నిరసించేందుకు ఉపకరించింది. ఆనాడు నాస్తికోద్యమమూ సమాజంలో పేరుకొన్న కశ్మలాన్ని విధూతం చేసి నైతికమైన విలువల్ని ప్రకాశింపజేసేందుకు సహాయపడిన యథార్థమూ మరచిపోకూడదు. ఇది ఇట్లా వుంచి మరోవైపునుంచి అప్పటి పరిస్థితుల చారిత్రకమైన ప్రాముఖ్యమూ ఈ ఉద్యమాన్ని విస్తరింపజేయనీయలేదు. స్వాతంత్ర్యోద్యమంలో దేశం నిమగ్నం కావడం, రెండో ప్రపంచ యుద్ధచ్ఛాయలూ, స్వాతంత్ర్యం లభించాక ముఖ్యంగా కొత్త రాజ్యాంగంతో నెలకొన్న ప్రజాస్వామిక వ్యవస్థలో కుల మత వర్ణ భేద రహితంగా అందరికీ అన్ని రంగాల్లో సమానమైన అవకాశాలూ, ఒక వ్యవస్థను తీర్చే ఉద్దేశంతో రాజకీయ సిద్ధాంతాల ఆకర్షణతో సాంఘిక పరివర్తనంతోనూ కొత్త పరిస్థితులు ఏర్పడినాయి. ఈ మార్పుల్ని ఎప్పటికపుడు గమనిస్తున్న రచయిత ప్రతిదాన్నీ ప్రశ్నించడం

నేర్చిన వ్యక్తీ భౌతికవాదాన్నీ, నాస్తికవాదాన్నీ ప్రశ్నిస్తూ అన్వేషణలో జిజ్ఞాసతో సమభావంతో తన వ్యక్తిత్వాన్ని నిర్మించుకునే ప్రయత్నం జరిగింది. ఈ కాలక్రమంలో మార్క్సు, లెనిన్ అభిప్రాయాలూ సోషలిజం అవగాహన నుండి క్రమించి రాయ్ నవ్యమానవవాదానికీ చేరుకున్నాడు. ఆంధ్రలో రాడికల్ పార్టీకి కార్యదర్శిగానూ పనిచేశాడు. సాంఘిక రాజకీయ పరివర్తనంలో ఆలోచనా ప్రసారరేఖలతో వెలువడిన నవల అసమర్థుని జీవయాత్ర. ఇందులో ప్రధానమైన పాత్ర సీతారామారావు. వంశ ప్రతిష్ఠకోసం తండ్రి అడుగుజాడల్లో నడచి ఆస్తినంతా కోల్పోతాడు. ఉన్నతమైన ఆదర్శాలకూ వాస్తవానికీ మధ్య పూడ్చరాని అఖాతం ఏర్పడుతుంది. తాను సర్దుకొని సర్దుబాటు చేసుకోలేని స్థితులకూ బాధపడే మధ్యతరగతి వ్యక్తి జీవితం చిత్రితం. ఇతడు క్రియాశూన్యుడు. కుటుంబం గడవడానికి డబ్బు అవసరంతో ఉద్యోగం చేయక తప్పలేదు. ఆ యంత్రంలో ఇమిడే అలవాటు చేసుకోలేక వదలడమూ జరిగింది. "ఏది ఏమైనా జీవితంలో ముందుకు పోవడమే ప్రధానోద్దేశం. పిరికివారికీ అసమర్థులకూ స్థానం లేదు" ఇవి లౌకికుడైన మామయ్య మాటలు. సీతారామారావులో పరిస్థితుల ఒత్తిడికి చీకాకు, కోపం, ఆందోళన, బాధ, ఉద్వేగం, వితండవాదం ఎక్కువైంది. సంఘర్షణకు దారితీసే పరిస్థితులు వచ్చాయి. మనస్సు అదుపుతప్పి విచిత్రమైన ప్రవర్తనకు దారితీసింది. ఈ విపరీత లక్షణంతో లోకంలో నిల్వలేకపోయాడు. శ్మశానంలోకి ప్రవేశిస్తాడు. ఎన్నో ఘనకార్యాలు చేసిన తన తండ్రి జిల్లేడుమొక్కలకు ఎరువు అయిన దృశ్యం కన్పిస్తుంది. తల్లి దూరంనుండి వాత్సల్యంతో తనవైపు ఆకర్షిస్తోంది. తన నీడతో యుద్ధం! గొంతు నులిమేసుకుంటాడు! ఆత్మహత్య! ఇతనిలోని పూర్వభావాలు నీడ రూపంలో తండ్రి ఆకారంలో కలసిపోతాయి. చివరకు వెలుగు రూపం మిగులుతుంది. "సుఖానికీ దుఃఖానికీ, జీవితంలో వ్యక్తి మనస్తత్వం ముఖ్యం". రామయ్య తాత మాటల్లో అస్తిత్వానికీ స్వేచ్ఛకూ ఇచ్చే ప్రాముఖ్యం స్పష్టం. ఆర్.ఎస్. సుదర్శనం మాటల్లో "అసమర్థుని జీవయాత్ర నిజంగా హేతువాది జీవయాత్ర". రామయ్య తాత మాటల్లో రచయిత ఆ మలుపులో విశ్వసించే నవ్య మానవ వాదచ్ఛాయలు ప్రతిఫలిస్తున్నాయి. ఈ నవల 1945లో వెలువడింది. అప్పటికి గోపీచంద్ చుట్టూ ఉంది, నవ్యమానవ వాదం ప్రభావమే.

## 4

అసమర్థుని జీవయాత్ర ఒక మలుపును సూచిస్తే, చాలా సంవత్సరాల విరామం తరువాత (సినిమా ప్రపంచంనుండి) అరవిందుల దర్శనంతో 'దివ్యజీవనం' ప్రభావమూ, 'అతీత మానసశక్తి' ఆకర్షణచేత, ప్రాచ్య పాశ్చాత్య తత్త్వాలోకనంతో భౌతిక, నైతిక

ఆధ్యాత్మికాల సమన్వయ శీలంలో ఇతని సాహిత్య వ్యక్తిత్వం మరో మలుపును పొందింది. భౌతికమూ ఆధ్యాత్మికమూ రెండూ ఒకదానికి మరొకటి పోషకాలుగా జీవితంయొక్క సంపూర్ణ స్వరూపాన్ని అవగతం చేసుకోవడానికి తోడ్పడుతాయనే ఇతని నిశ్చితాభిప్రాయం. మెరుపుల మరకలు, పిల్లతెమ్మెర, గడియపడని తలుపులు మరీ ముఖ్యంగా పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామాలో స్పష్టంగా ఆవిష్కృతమైంది. వీటిలో వ్యక్తిస్వేచ్ఛ ముఖ్యం. తమ స్వంత అనుభవాలపై ఎవరికి వారు సాగించే జీవితం ఉంది. జీవితం ఎంత విస్తృతమై, వైవిధ్యమూ, సంక్లిష్టమూ ఐందంటే దీని గమనం ఈ దిశలో ఉంటుందని ముందుగా ఎవరి ఊహకూ అందదు. ఎప్పుడు ఏమి జరుగుతుందో ఏ మార్గం అనుసరిస్తుందో, ఏ మార్గం వదిలేస్తుందో, చెప్పలేని విచిత్రమైన పరిస్థితులు పరిణమించడంలో ఇతివృత్తం నిర్మితమౌతుంది. ఇందులో వ్యక్తిత్వం గల ఏ పాత్రకు ఆ పాత్ర వారివారి మనస్తత్వాలను బట్టి వారికి తటస్థపడే వ్యక్తులతో అప్పటి పరిస్థితుల్ని ఆలోచనల్ని బట్టి సంఘటనల ఒత్తిడిలో, సంఘర్షణనుండి వ్యక్తిత్వం ప్రకాశిస్తూ బయటపడే పాత్ర సృష్టి కన్పిస్తుంది. చర్య ప్రతిచర్యలతో హఠాత్ పరిణామాన్ని పొందడమూ జరుగుతుంది. ఇతివృత్త నిర్మాణంలో సంఘటనల ప్రాబల్యాన్నిబట్టి ఈ నవలలు సంఘర్షణలో అవతరించే పాత్రల వైవిధ్యానికి నిదర్శనంగానూ ఉన్నాయి. మెరపుల మరకల్లో ప్రధానపాత్ర ఉషారాణి. స్వేచ్ఛాతత్వంతో ఏ నియమాలకూ కట్టుబడకుండా వ్యవస్థకతీతమైన స్వతంత్ర ప్రవృత్తితో విలపిస్తుంది. ఆవేశ ప్రవృత్తి కలదే. భర్త రామానుజం ఆమెను సుఖపెట్టాలనే ఎంతో తహతహ కలవాడు. అయినా చక్రవర్తిని ప్రేమించింది. తరువాత శ్రీకాంత్ ప్రవేశిస్తాడు. తాము ప్రవర్తిస్తున్న తీరుపట్ల దోషభావన కలగగానే ఫ్రాయిడ్, యుంగ్ మొదలైన మనస్తత్వతేత్తల వివిధ రచయితల భావాలతో సమర్థించుకునే ప్రయత్నమూ చేసేది. ఢిల్లీ వెళ్ళినపుడు శ్రీకాంత్ చెల్లెలి భర్త కమలాకరంతో పరిచయం ప్రణయానందానికి దారితీసింది. ప్రేమ జీవితంలో తన మనసుకు నచ్చిన విధంగా ప్రవర్తిస్తుంది. అభిలాష, సౌందర్యం, ఆకర్షణ, ఆనందం అనేవి ఏదో ఆదర్శంతో అనుభవంలోకి వస్తున్నట్లు భావిస్తుంది. చివరకు శ్రీకాంత్ విసిరిన చెంపదెబ్బతో ఆ మరకతో ఆమెలో అనూహ్యమైన హఠాత్ పరివర్తనం కలిగింది. మెరపుల్లో మరకలు అనుభవంతో గుర్తించి వాటిని విసర్జించి తీర్థయాత్రలు చేస్తూ హృషీకేశ్‌లో యోగినిగా మారుతుంది. అక్కడ ఆధ్యాత్మిక చింతనతో శేషజీవితం మనోనుగుణంగా గడుపుతుంది.

పిల్లతెమ్మెర నవల్లో చిత్రమైన స్వభావంతో తీర్చిన పాత్ర శ్యమంతకమణి. తనకు నచ్చిన వ్యక్తితో రెండు మూడు నెలలు తిరిగి వస్తుంది. ఏ సంకోచమూ లేకుండా

నిర్భయంగా ప్రవర్తించే మనస్తత్వం వల్ల రామనాథంతో వివాహం జరిగాక, తనదైన ఆదర్శంతో స్వేచ్ఛాభావంతో శచీంద్రునితో ఎగసిపోయి మద్రాసులో కళాసేవా సమితిలో చేరుతుంది. శచీంద్రుడామెను భార్యగా భావిస్తాడు. ఆమె స్వేచ్ఛా ప్రవర్తనం అతనికి బాధ కలిగిస్తుంది. ఆమెను హత్యచేస్తాడు. కళ-సౌందర్యమూ, అభిలాష-నీతి మధ్య సంఘర్షణను చిత్రించే నవల. తనకు నిరోధంగా ఉన్న సాంఘిక నీతినియమాన్ని ఛేదిస్తూ, స్వేచ్ఛను అభిలషించే మనస్తత్వంతో తనదైన ఆనందం ముఖ్యం. దీనితో తన అస్తిత్వాన్ని నిర్మించుకునే ఆవేగం ఉంది. గడియపడని తలుపుల్లో కోటేశ్వరమ్మ పాత్ర ధనం భోగం లక్ష్యంతో భర్తను వదలి హైదరాబాదు ప్రవేశిస్తుంది. శ్రీనివాసరావుతో పరిచయం ఔతుంది. అందరి మెప్పుకోసం తహతహలాడే ఆమెతో అతడూ సుఖంగా లేడు. భగ్నమైన జీవితంతో ఆధ్యాత్మిక చింతనతో యాదగిరిగుట్టపై స్వాముల దర్శనంతో ఏకాంతం వహిస్తుంది. చివరకు భర్త చిత్రపటం ముందు పెట్టుకొని జీవితం చాలిస్తుంది. ఈ నవలల్లో రచయిత దృక్పథం అస్తిత్వవాదచ్ఛాయలతో భౌతిక ఆధ్యాత్మిక భావాల సమ్యక్ మేళనంతో ప్రకాశిస్తుంది. వీటిలో ప్రధానమైన పాత్రలు తమ విలువల్ని తామే సృష్టించుకుంటూ అనుభవం ప్రధానమైన జీవితం లక్ష్యంగా కన్పిస్తాయి. గడియపడని తలుపుల్లో మాత్రం తిరిగి తాను వదలిన భర్తపట్ల భక్తిశ్రద్ధలతో (చిత్రపటం ముందు పశ్చాత్తాపంతో అంజలి ఘటించడం) వదలిన భావస్థితిని తిరిగి ఆశ్రయిస్తుంది. వ్యక్తి ధర్మానికి భిన్నమైన ధోరణిలో ముగింపు సంఘ ధర్మాన్ని సూచిస్తోంది. శ్యమంతకమణి జీవితం ఆమె పొందే అనుభవాల మధ్యలోనే సమాప్తమౌతుంది, దీనికి శచీంద్రుని ఉద్రేక మనస్తత్వమే కారణం. ఉషారాణి సంఘర్షణ నుండి అవలీలగా బయటపడి స్వేచ్ఛకు భంగం రాకుండా తనదైన వ్యక్తిత్వాన్ని నిలుపుకుంటుంది. ఈ పాత్ర పొందిన మార్పు మానసికం. ఒకే ఒక సంఘటన ఆమెలో విరక్తిని జనింపజేస్తుంది. ఈ స్థితిలోనూ తన వివేకంపై ఆధారపడే ప్రవర్తిస్తుంది. భౌతికలోకాన్ని ఎంత ఆవేశంతో ప్రేమించిందో ఆ మనుషుల్ని ఎంత ఆనందంగా భావించిందో అంత సులభంగా అన్నీ వదలి శాంతభావంతో ఆశ్రమానికి అంకితమైంది. ఈమెకు తనదైన వ్యక్తిత్వం ముఖ్యం.

అస్తిత్వవాదచ్ఛాయల్లో పాత్రలు సంఘం నిర్దేశించిన పద్ధతిలో కాక తమ స్వంత ఆలోచనపై అనుభవంపై ఆధారపడిన మార్గంలో ప్రవర్తిస్తాయి. ఒక్కొక్కప్పుడు కష్టాలు ఎదుర్కోవలసి వచ్చినా ఈ అన్వేషణలో బాధ అనిపించదు. పైగా అనుభవంలో ఆనందం, ఆనందంలో తృప్తి కలుగుతుంది. తాము చేసే పనులకు సంపూర్ణమైన బాధ్యత వహించడం ఇందులో ముఖ్యం. తమ జీవిత గమనాన్ని తామే రూపొందించుకోవటం ఇందులో

విశేషం. మెరపుల మరకల్లో ఉషారాణి, పిల్లతెమ్మెరలో శ్యమంతకమణి పండి పరమేశ్వరశాస్త్రి వీలునామాలో కేశవమూర్తి పాత్రలు ఈ దృష్టితో విశ్లేషణకు నిలుస్తాయి.

శిథిలాలయంలో నిర్మల (సుభద్ర) పాత్రను దీనికి లక్ష్యంగా తీసుకోవచ్చు. పీతాంబరం భార్య నిర్మల. ఆమె మనస్సు కోరికలకు నిలయం. ఆమె ప్రవర్తనను భర్త అనుమానించగానే "అతనంటే ఇష్టం నాకు. అతనితోనే ఉండిపోతాను" అని మనస్సు విప్పి చెప్పి ప్రేమికుడు నారాయణరావుతో వెళ్ళిపోతుంది. ఆ నారాయణరావుతోనూ ఉండలేదు. పీతాంబరం ఈ సమయంలో నీనా ఆకర్షణలోకి వస్తాడు. నీనా వేశ్య. ఆ వృత్తిని వదిలేస్తుంది. పీతాంబరాన్ని విశ్వసిస్తుంది. నిర్మల ఏదో పనిమీద ఢిల్లీనుండి హైదరాబాద్ వస్తుంది. పీతాంబరం ఆమెను క్షమించమని అభ్యర్థిస్తాడు. ఆమెను భార్యగా స్వీకరించడానికి సంసిద్ధతను వ్యక్తం చేస్తాడు. ఆమె తిరస్కరిస్తూ అన్న మాటలు ఆ వ్యక్తిత్వంలోని అస్తిత్వరేఖలను చక్కగా ఆవిష్కరించేవి. "నాకు ఎవరి భార్యగా వుండాలనీ అపేక్ష లేదు. ఒకవేళ ప్రయత్నించినా ఉండలేను. ఈ సంగతి నాకు మొదట్లో తెలియదు. అనుభవం మీద తెలుసుకున్నాను. నేను బ్రతికినా స్వతంత్రురాలిగా బ్రతుకుతాను. ఆ స్వాతంత్ర్యం పోయిననాడు మరణిస్తాను. అది నా స్వభావం అని నిష్క్రమిస్తుంది. ఈ మాటలు విన్న నీనా అక్కడున్న పీతాంబరంతో "అధైర్యంతో జీవితం గడపకు, ప్రతిదానికీ తప్పు తప్పు అంటూ కూర్చుంటావు. తప్పేమిటి? జీవించుకుంటూ పో" అని ధైర్యాన్నీ ఉత్సాహాన్నీ కలిగిస్తుంది. ఈ నవల గురించి "సార్త్రె అస్తిత్వ వాదానికి తెలుగు రచయిత "హత్తినమారాకు" అని ఆర్.ఎస్. సుదర్శనం.

ఈ నవలల్లో ప్రత్యేకత కలిగిందీ, గోపీచంద్ సాహిత్య వ్యక్తిత్వ దృక్పథాన్ని ప్రతిబింబించేదీ "పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామా". కేశవమూర్తి సుజాత ఇందులో ప్రధానమైన పాత్రలు. వివాహ వ్యవస్థను మన్నిస్తూ సంస్కరణ దృక్పథంతో ఆదర్శ ప్రేమలోని ఔన్నత్యానికి ప్రతీకలు. కేశవమూర్తి సమస్యను వాస్తవదృష్టితో పరిశీలించే క్రియాశీలి, రచయిత, వ్యక్తిస్వేచ్ఛ, స్వంత అనుభవంతో, ఆలోచనతో, అన్వేషణతో సాంఘిక పరివర్తనా లక్ష్యంతో ఎదురైన సంఘర్షణల నుండి క్రమిస్తూ విజయంతో వ్యక్తిత్వాన్ని నిర్మించుకునే మనస్తత్వం కలవాడు. బాధ్యతలను విస్మరించనివాడు. భగవంతుడూ, విధిపై భారంవేసి నిల్చిపోక స్వశక్తిపై విశ్వాసంతో ధైర్యంతో పనిచేస్తూ పోయే లక్షణం ఇతనిలో ఉంది. ఎక్కడ ఉన్నా ఈ వ్యక్తి కలసేదీ జీవించేదీ సమాజమే అన్న స్ఫూర్తి ఈ నవల్లో ఉంది. నవల్లో వ్యక్తి ప్రాధాన్యానికీ సంఘ ప్రాధాన్యానికీ జరిగే వాదోపవాదాల్లో, వ్యక్తి ధర్మంపై మొగ్గ చూపుతున్నట్లు అనిపించినా మొత్తంమీద సంఘ ధర్మం పట్ల ఆసక్తి

అంతిమ లక్ష్యమూ కలిగి ఉన్నట్లు ఈ రచననుబట్టి తెలుస్తుంది. ఈ నవల గోపీచంద్ ఆదర్శాలకు సంపూర్ణంగా ప్రాతినిధ్యం వహించేదిగానూ ఉంది. కేశవమూర్తి పాత్రలో గోపీచంద్ కన్పిస్తాడు కూడా. ఇందులో పాత్రలు ఒక వ్యక్తికి లోకంలో ఇతర వ్యక్తులతో కలిగే అనుభవాలవల్ల చర్య ప్రతిచర్యతో (వివాహం కారణంగా శాస్త్రి వైమనస్యం దుష్టచతుష్టయం సేమంతం పురూరవుడు, శారద్వతుడు (కోలాటం) రాధారమణ అనసూయవల్ల సూజాత దూరం కావడం, శాస్త్రిలో చివరి ఘడియల్లో పరివర్తనం రావడం, సుజాత నిజం తెలుసుకొని పొరపాటు సరిదిద్దుకోవడం, శాస్త్రి సౌమనస్యంతో వీలునామా రాయడం), దీని వెనుక నుండి పనిచేసే మనస్తత్వ ప్రసారంతో క్రమిస్తాయి. ఒకవైపు నుండి ప్రేమ, స్వేచ్ఛ, సంస్కరణం, పరివర్తనం, మరొకవైపు నుండి నీతి, ఆధ్యాత్మికం, ఆదర్శం, ఆనందం ప్రముఖంగా మన దృష్టికి గోచరిస్తాయి.

కేశవమూర్తి స్నేహితునితో పాండిచేరీ వెళ్ళి అరవిందుల దర్శనం – దివ్యజీవన గ్రంథ పరిశీలనంతో, అతని జీవితం "అతీత మానస స్థితికీ, అతీత మానవ సృష్టికీ ఉన్ముఖమైన ఆధ్యాత్మిక భావంతో సంపన్నమౌతుంది. మానవుడు ఏ పరిస్థితుల్లోనైనా ఏ ప్రభావంలోనైనా తన వ్యక్తిత్వాన్ని కాపాడుకోగలడు. దివ్యజీవనాన్ని స్పృశించగలడన్న నిశ్చయానికి చేసిన సూచికే కేశవమూర్తి జీవితం. గోపీచంద్ గురించి శకుంతల "ఆత్మజ్ఞానం అభివృద్ధి చెందినకొద్దీ అహాన్ని ఆడంబరాన్ని పూర్తిగా వదిలివేశారు. ఇంటా బయటా అందరికీ సహాయం చేయటం మొదలుపెట్టారు. రానురాను ఈ లోకానికి సంబంధించిన వ్యక్తిగా ఉండేవారు కారు, రేపటి విషయమే ఆలోచించేవారు కారు... అవకాశం లభించినపుడు భగవద్ధ్యానంలో నిమగ్నులయ్యేవారు. ఎన్నో రకాల అనుభూతులు పొందేవారు". కేశవమూర్తి పాత్రలో గోపీచంద్ ఆధ్యాత్మిక జీవన ప్రతిఫలనం స్పష్టంగా మన ఊహలో నిలుస్తుంది. ఈ నవల గురించీ, ఇందులో తాత్త్విక భూమిక గురించీ, పరిచయంలో రచయిత మాటలు "భౌతిక జీవితం మానవ జీవితానికి పునాదిగా ఉండాలి. భౌతిక జీవితం ముఖ్యమే. కాని మానసిక జీవితం అరికట్టబడకూడదు. అన్ని విధాలైన పరిస్థితుల్లో సమ్యక్ దృష్టి ఉండాలి". అందువల్ల సమాజంలో వీటినన్నిటినీ కలిపి, వలయాల నతిక్రమించి పరిధుల్ని దాటి విశాల భావనతో ఉత్తేజపరచగల వ్యక్తిరూపమే పండిత పరమేశ్వరశాస్త్రి వీలునామాలో గోపీచంద్ ఆశించింది. ఈ నూతన వ్యక్తి ఆవిర్భావానికి ఇతని దృష్టిలో ప్రజాస్వామిక విధానం అవసరం. "ఈ నూతన వ్యక్తి అతీత మానవ సృష్టికి ఆధారం".

అయితే ఒక విషయం ఎప్పటికపుడు ఎన్నో సిద్ధాంతాల వాదాల గురించి పరిశీలనంతో వాటిలో ఎంతో కొంత మంచి ఉంటుందన్న భావంతో ప్రభావానికి గురి ఔతూ నిరంతరం వ్యక్తిత్వ నిర్మాణ ప్రసార రేఖలతో, ఏర్పడిన సంక్లిష్ట (కాంప్లెక్స్) రూపం ఇతనిలో గోచరించకపోదు. వేదనతో చింతనతో అన్వేషణతో ఎప్పటికపుడు నవ్యతను ప్రవేశపెట్టాలనే ఆకాంక్షచేత గుణాత్మకమైన లక్షణానికీ ఇందులో అవకాశం ఉంది.

1) వర్తమాన జీవిత స్పందనం - సామాజిక స్పృహ.
2) మధ్య తరగతి మనస్తత్వమూ - జీవిత చిత్రణం.
3) హేతుచర్చ, శాస్త్రీయ దృక్పథం, సంస్కరణ, పరివర్తనంతో ఆధునికత.
4) ప్రజాస్వామిక విధానంపై విశ్వాసం.
5) వ్యక్తిస్వేచ్ఛ, అనుభవం, అన్వేషణ, ఆనందభావన.
6) భౌతికం ఆధారంగా మానసిక వికాసంతో పాటు నైతిక ఆధ్యాత్మిక జీవనం - అతీత మానవ భావన, దివ్యదర్శన స్ఫూర్తి.

ఇవి గోపీచంద్, సాహిత్య జీవితానికి ఉద్దేశించిన లక్ష్యాలుగా వివేచన కందుతాయి.

# 5. అసమర్థుని జీవయాత్ర

## ప్రధానపాత్ర - మనస్తత్వ చిత్రణం

త్రిపురునేని గోపీచంద్, "అసమర్థుని జీవయాత్ర", అసాధారణమైన మనస్తత్వ చిత్రణం గల వ్యక్తి ప్రధానమైన నవల. సీతారామారావు పాత్రను గోపీచంద్, కథాగమనానికి అవసరమైన మేరకు బాహ్యరూపానికి స్థానం కల్పిస్తూ, రచన మొత్తం మానసికమైన స్థితి సమర్పకంగా నిర్మించడం జరిగింది. ఒక జీవితంలోని అనేక సంఘటనల సంకలనం అనవచ్చు. ఇందులో క్రమపరిణామం కన్నా స్థితిచిత్రణకే ఎక్కువ ప్రాముఖ్యం ఉంది. ఈ విధంగా సాధారణమైన నవలనుండి భేదిస్తుంది. ప్రధానపాత్ర వెలుగులో తక్కిన పాత్రలు ప్రకాశిస్తాయి. దాన్ని అనుసరించి ప్రవర్తిస్తాయి. సీతారామారావు లోకం దృష్టిలో అసమర్థుడు. అతడు మాత్రం అంతరంగంలో తానొక విశిష్టమైన వ్యక్తిగా భావించే ఆలోచనాజీవి. పాత్ర అంతస్తత్వంతో రూపొందిన వ్యక్తిత్వానికీ, బయటి సమాజానికీ మధ్య జరిగిన సంఘర్షణ రూపమే ఈ రచన అనవచ్చు. సమాజంలో వివిధ వలయాల్లో దేనితోనూ సామరస్యం కుదరక, మానసికమైన వ్యథతో సాగిన జీవనయాత్రే, ఇతని జీవితం. నవల పేరులో ఉన్న 'జీవ' శబ్దం, పాత్ర ఆంతరమైన మనోరూపాన్ని ఆవిష్కరించేది. మనస్తత్వపరమైన రచనాతత్త్వాన్ని సూచించేది. ఇందులో ఉద్రేకం, ఆందోళన, క్షోభ, ఆలోచన, బాధతో పాత్ర వెనక్కు తిరిగి చూడడానికి వీలులేని వేగాన్ని పొంది, విషాద పర్యవసానానికి దారితీయడం జరిగింది. దీనికి కారణం పాత్రను క్రమ్మిన నిరాశా వాతావరణమే. ఈ పాత్రలో సుఖం, శాంతీ కన్నా, బాధ, అలజడే ఎక్కువ. ఆరంభంలో తప్ప ఎక్కడా ఆశాప్రసారం కన్పించదు. క్రియారూపం కన్నా ఆలోచనాధోరణి ఎక్కువ. అదీ ఒక్కొక్కపుడు కాల్పనికతను, ఒక్కొక్కప్పుడు సమాజాన్ని విశ్లేషించే హేతురూపాన్నీ పొందింది. మరొకపుడు ఉద్రేక భరితమూ, వేదనాయుతమూ అయింది.

మంచి స్థితిగతులు గల సంపన్నమైన కుటుంబ వాతావరణంలో పుట్టి పెరిగిన ఇతని జీవితం సుఖరూపంతో మొదలై, విషాదమయంగా ముగిసింది. దీన్ని రచయిత ఆరంభంలో స్వచ్ఛమైన గిరిశిఖరం నుండి ప్రవహించే నది, చివరకు మురికి కాలవలో అంతమైనట్లుగా ప్రతీకాత్మకంగా సూచిస్తాడు. జీవితం, దౌర్భాగ్యమయంగా అంతా అసహ్యపడే స్థితిలో, భీభత్సయుతంగా అంతమైంది. తండ్రి చనిపోయినప్పటినుండీ, కాలం గడిచేకొద్దీ ఆదర్శరూపానికీ వాస్తవరీతికీ మధ్య ఎంతగానో నలిగిపోయాడు. వివిధ

సంఘటనల్లో దీని ప్రభావం అంటే మానసికమైన స్థితి ఇతని చర్యలో ఒక్కొక్కవిధంగా విపరీతమైన ప్రవర్తన వ్యక్తమౌతుంది. ఒకదాని తరువాత మరొక సంఘటన సంక్షుబ్ధస్థితిని పెంచుతుంది. సంక్లిష్టతను ఎక్కువచేస్తూ పోతుంది. జీవితంలో అన్ని పార్శ్వాల్లోనూ, భర్తగా, తండ్రిగా, బంధువుగా, ఆఖరికి సామాన్య పౌరుడుగా, మానవుడుగా ప్రయోజన పరమైన పాత్రను నిర్వహించలేకపోవడం విశేషం. ఈతని అపజయాన్నే భావింపజేస్తుంది. తండ్రి మరణంతో బాధ్యత పైబడింది. లోకానుభవం, దీనికి సరిపడిన మనస్తత్వం లేకపోవడంవల్ల తృప్తికరంగా నిర్వహించలేకపోతాడు. దీనితోపాటు వంశగౌరవంపై మోజు, లోకం మెప్పుకోసం అభిలాష ఉండడంవల్ల లోకం ఇతణ్ణి బాగా వాడుకుంటుంది. ముఖ్యంగా మేనమామకు ఈ బలహీనత ఎంతో ఉపయోగపడుతుంది. లోకంలో ఈ వైఫల్యం ఏకాకిని చేసి, ఏకాంత ధోరణికి దారితీసింది. ఇతడు తన ప్రవర్తనను హేతుబుద్ధి చేత సమర్థించుకోజూస్తాడు. ఇతనిలో మంచి లక్షణం – వెలుగూ ఉంది. అది బయటపడి ప్రయోజనపరమైన ప్రశస్తినీ పొందలేదు. అతనికి చదువు ఉంది, చురుకైన తెలివీ ఉంది. ప్రతి విషయాన్ని పరిశీలించి చూచే దృష్టి ఉంది. సంస్కరణ దృక్పథం, హృదయ వైశాల్యమూ ఉంది. ఆర్ద్రగుణమూ లేకపోలేదు. ఇంకా ఎన్ని మంచి లక్షణాలున్నా ఎందుకూ పనికిరాకుండా పోయాయి. చిత్రమేమంటే చీకటి ఇందులో వెలుగును ఆవహిస్తుంది. భార్య, పిల్లలు, బంధువులు, పరిచయస్థులు – ఇతరులతో ఒక్కొక్కరితో ఒక్కొక్క వలయం నుండి మరో వలయంలోకి క్రమిస్తూ జరిగిన సంఘర్షణలో బాధకు గురి అవుతాడు. చీకటి మరింత పెరుగుతూ, భౌతికంగా దగ్గర ఉన్నా వీరికి మానసికంగా దూరం అవుతాడు. ఇతివృత్తంలో దీనికి సంబంధించిన అనేక సంఘటనలు ఒక్కొక్క పార్శ్వాన్ని చిత్రిస్తూ, ఈతని వైఫల్యాన్ని సంపూర్ణంగా చిత్రిస్తాయి.

## 2

సీతారామారావు పూర్తిగా లోక ప్రవృత్తి తెలీనివాడు కాదు. లక్ష్యం ఎరుగని వాడూ కాదు. అతనికి అన్నీ తెలుసు. గురుకులంలో తనతోపాటు చదివిన ఇందిరను ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. కట్నాలు, కానుకలకూ విముఖుడు. సంస్కరణదృష్టి కలవాడు. తాను స్వయంగా నిర్వహించే అవసరం లేని, తండ్రి మరణానికి పూర్వదశ వేరు. అంతా ఆదర్శమయమైంది. తాను స్వయంగా నిర్వహించే అవసరం కలిగిన స్థితిలో వాస్తవ జీవితం ఎదురైంది. ఆ జీవితానికీ, ఈ జీవితానికీ ఎంతో భేదం ఉంది. అతనిలో ఉన్న ఆర్ద్రత క్రమంగా పరిస్థితుల వేడికి అదృశ్యమౌతూ వచ్చింది. చివరకు పరిశుష్కమై రానురాను కఠినమూ అయింది. తండ్రి చనిపోయాక, మొదట్లో మేనమామ

పట్ల భూమి విషయంలో చూపిన ఉదారభావం ఆత్మతృప్తి కోసమా? లోకం కోసమా? అన్న ప్రశ్నకూ అవకాశం ఇవ్వకపోలేదు. ఈతడు మేనమామకు వ్రాసిన ఉత్తరం, అతడు దానికి వ్రాసిన సమాధానం బట్టి ఈ అభిప్రాయం తలెత్తుతూంది. దీనికి కారణం ఒకటే - పరిస్థితులు మారడం. దీని ప్రభావం వల్ల చూచే దృష్టిలో మార్పు అవసరం కావడం. మానవుని ఊహపై, ప్రవర్తనపై పరిస్థితులు ఎలా పనిచేస్తాయో తెలియజేస్తుంది.

సీతారామారావు ఉద్యోగంలో ప్రవేశిస్తాడు. ఉద్యోగం చేయడం వంశప్రతిష్ఠకు భంగకరం అన్న భావం ఇతనిలో మొదటినుండి పనిచేస్తోంది. అయినా ఉద్యోగం చేయక తప్పింది కాదు. పైగా ఉద్యోగ నిర్వహణంలో క్రమశిక్షణనూ, పై అధికారుల స్వార్థప్రవృత్తినీ, ఈతనిలో నిబిడంగా ఉన్న స్వతంత్ర ప్రవృత్తి అంగీకరించనీయలేదు. పైగా నిరాకరిస్తుంది కూడా. ఉద్యోగం మానేస్తే తన కాళ్ళపై నిలబడే ఆర్థికమైన స్తోమత ఇప్పుడు లేదు. అయినా తన మనస్సుకు నచ్చిన విధంగానే ప్రవర్తిస్తాడు. ఇంట్లో నిర్వ్యాపారంగా ఉండిపోవడానికే సిద్ధమౌతాడు. అయితే గడవడమెలా? ఉన్నదంతా హరించుకొనిపోయింది. దారిద్ర్యంలోనే స్వేచ్ఛను అనుభవిస్తూ, ఏవేవో ఆలోచనలతో పగటికలలతో కాలక్షేపం చేయడమే ఈతని పని. లౌకికంగా నిర్వ్యాపారంగా ఉన్న ఈతని మనస్సు స్వల్పమైన విషయాల్లో ముఖ్యంగా చిరాకు, కోపం, అసహనం, అనుమానం మొదలైన వికార రూపాల్ని పొందుతూ ఉంటుంది. ఇతడు కనే కలల్లో కన్పించేది. అన్నం-డబ్బు ఈ రెండూ భౌతికమైన అస్తిత్వానికి లోకంలో చాలా అవసరమైనవి. ఇంకా ఇతని మనస్సు పొరలలో అణిగి ఉన్న సాహసం, ధైర్యం, విజయం, శృంగారం సంఘటనలుగా కలలో కన్పించేవి. రచయిత మనస్తత్వపరంగా నెరవేరని కోరికలు గాఢమై, కలలో ఉద్గమించిన తీరు రచయిత శిల్పవంతంగా ఆవిష్కరిస్తాడు. ఈ విధంగా సీతారామారావు మానసికమైన తృప్తిని పొందుతాడు. సర్వమూ హేతుయుతంగా పరిశీలిస్తాడు. ఈ విధమైన ఆలోచనతో నిర్మితమైన ఆదర్శానికీ, నేలపై బ్రతకడంలోనూ ఎదురయ్యే యథార్థానుభవానికీ సమన్వయం కుదుర్చుకునే లక్షణం లేకపోవడంతో, రెండింటికీ మధ్య నిలిచిన ఇతణ్ణి ఒంటరితనం ఆవహిస్తుంది. ఎక్కడన్నా ఎవరైనా కలిసే స్థితి సమకూడితే, అది సంఘర్షణతో విడిపోవడం జరుగుతుంది. ఆదర్శప్రపంచం జీవన యాథార్థ్యం, రెండిటికీ మధ్య పాత్ర ప్రవర్తించే మనస్తత్వ చిత్రణంతో రూపొందిన ఈ రచన మనస్సులోని అంతర ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుంది. ఇది ఒక్కొక్కపుడు చైతన్యస్రవంతి ధోరణిలోనూ ప్రవహిస్తుంది.

## 3

'హేతుదృష్టి గల మానవుడు సుఖంగా వున్నాడా?' అని బల్లిని ప్రశ్నిస్తాడు. తనకంటే అది సుఖంగా ఉందని పైకి భావిస్తాడు. హేతుదృష్టి కలిగి ఉండడంతోపాటు, మానవుడేదో లోపించి ఉన్న విషయమూ సూచితమౌతూంది. బల్లికీ మనిషికీ భేదం గుర్తించే జ్ఞానం అతనిలో ఉన్నా, ఆ సమయంలో అతడున్న క్లిష్టమైన స్థితి ఎదుటి మానవుడు లేదా ప్రాణి ఒక్కొక్కప్పుడు జడమూ కూడా సుఖంగా ఉన్నట్లు భావింపజేస్తుంది. ఇది సహజం. ఇతర ప్రాణులకన్నా మానవుడు విశిష్టమైన అనేక భౌతిక మానసిక శక్తులు కలిగినవాడు అందులో చదువు, సంస్కారం అన్నీ కలిగి ఉన్న తనకూ బల్లికీ ఎక్కడో సామ్యమూ లేకపోలేదు. బల్లి గోడలు, దూలాలు పట్టుకొని తిరుగుతూంటే తాను ఇంటిని పట్టుకొని, బయటి ప్రపంచంతో పనిలేకుండా ఉన్నాడు. బల్లి ఏ ప్రయోజనాన్ని సాధిస్తుందో జీవించి తనూ అంతకన్నా ఎక్కువ ప్రయోజనాన్ని సాధించడం లేదు. అతని మనసులో దీన్ని గురించిన ఆలోచనలో ఆవేదన ఉంది, పరిశీలనమూ ఉంది. జీవితం అంటే ఏమిటి? ఏమి సాధించడానికి? అనే ప్రశ్నలకు సరియైన సమాధానం లభించలేదు. అన్నీ ప్రశ్నలే! సమాధానం దొరకదు. అతనిలో క్రియాత్మకంగా ఉద్యమించే లక్షణం లోపించడంతో జీవితంలో అనుభవ ప్రసారం స్తబ్ధమైంది. కాబట్టి జీవితం గురించి తెలీదు. అతనిలో కలిగే సందేహం అనిశ్చయం, అధైర్యం, ఏకాంతం వల్ల ఏ సమస్యా పరిష్కృతం కావడం లేదు. తాను సుఖపడలేదు. ఇతరులకూ సుఖం ఇవ్వలేడు. తన కుటుంబ సభ్యులనూ తృప్తిపరచలేకపోయాడు. ఇతని జీవితం నిష్ప్రయోజనం అవుతూంది. లౌకిక జీవితంలో అవసరమైన డబ్బు, ఉద్యోగం, అధికారం, పలుకుబడి, వ్యావృత్తి ఏదీ లేని జీవితంలో, మంచితనం, సంస్కారం, చదువు, ఆదర్శం ఉపయోగించే నేర్పు లేని వ్యక్తి సీతారామారావు చుట్టూ ఉన్న ప్రపంచం – న్యూనతా భావాన్ని అధికం చేసేదే అయింది. ప్రపంచంలో బ్రతకడానికి డబ్బు అవసరం. దీని విలువ అతనికి మొదట్లో తెలియలేదు. అదికాస్త తెలిసేవరకు మనస్సు ఈ వలయం నుండి అధిగమించింది. డబ్బు సంపాదించే మార్గాల్ని అతని పెంపకంవల్ల మనస్తత్వంవల్ల ఆలోచించనూ లేకపోయాడు. న్యూనతాభావం (Inferiority Complex) వల్ల ఇతని మనస్సు పొరల్లో అణగివున్న ధనాపేక్ష, క్రియాశూరత్వం మొదలైనవి. లోకంలో తాను సులభంగా పొందలేనివి, తనలో లేనివీ కోరికలుగా మిగిలిపోయి, చివరకు కలల రూపంలో అనుభవిస్తాడు. కాలం గడుస్తున్నకొద్దీ సంఘానికి దూరంగా ఏకాంతంగా, మానసికంగా ఆలోచనలు మరీ ఎక్కువౌతాయి. ఆందోళన, అశాంతి ఎక్కువైంది. సమాజంనుండి

ఉపసంహృతుడై, వ్యక్తిగా విశిష్టుడననుకొనే అహంభావంతో ఇతరులతో సంఘర్షణ మొదలైంది. ఇతని ప్రవృత్తి చాల చిత్రంగా కన్పిస్తుంది. డబ్బు చాల అవసరం. కాని డబ్బు అంటే నిర్లక్ష్యం. ప్రేమించే పెళ్ళి చేసుకున్నాడు. ఆ తరువాత తరువాత ఆమెను ద్వేషిస్తాడు. జీవితాన్ని ఆదర్శ శిఖరాల్లో ఊహిస్తాడు, కలలుగంటాడు, అన్నీ 'తెలుసు'ననే అనుకుంటాడు. తన మార్గం సరియైందనే అభిప్రాయంతో ఉంటాడు. చివరకు తన్ను తానే చంపుకునే స్థితికి వస్తాడు. ఇలా పరస్పరం వ్యతిరిక్తమైన ఆలోచనా ప్రసారం అతనిలో బాగా గమనించవచ్చు. ఎక్కడ ఎవరికి లోకువైపోతానేమో అన్న భయంతో ఆధిక్యతను నిలుపుకునే ప్రయత్నం చేస్తాడు. ఎరకలదానితో తగాదాపడిన సందర్భంలో ఈ వైఖరి స్పష్టం. అంతలో త్వరపడతాడు. ఇంతలో ఆర్ద్రమనస్కుడౌతాడు. పశ్చాత్తాపం పొందుతాడు. విపరీతమైన ధోరణి అవలంబిస్తాడు. చిన్నపిల్లని కొట్టినపుడు, భార్యపై చేయి చేసుకున్నపుడు ఇది మరీ శిఖరాలనందుకుంటుంది. అతని మనస్సును నీడ కమ్మేసింది. అక్కడక్కడా ఉన్న వెలుగు కాస్తా క్రమక్రమంగా పూర్తిగా మాయమౌతుంది. వాస్తవ జీవితంలో క్లిష్టపరిస్థితుల్లో ఎదుర్కొనే వ్యక్తిత్వాన్ని కూడదీసుకొని ఉత్సాహంతో ఉపక్రమించనూ లేడు. ఈ ప్రయత్నం ఏ మాత్రం జరిగినా ఇంత త్వరగా అతని సమాప్తి జరిగేది కాదు. సమాజాన్ని అర్థం చేసుకోవడానికి ఏ మాత్రమూ ప్రయత్నించక పోవడం ఇతని లోపం. తన సిద్ధాంతాలనుండి అభిప్రాయాలనుండి ఏ మాత్రం తొలగిపోరాదనే పట్టుదల ఎక్కువైంది. భౌతికంగా దారిద్ర్యంతో, మానసికంగా క్షోభతో క్రమంగా హృదయ సౌకుమార్యమూ నశించింది. పైగా కరుకుదనం పొందింది. మొదట్లో వంశం పేరు ప్రతిష్ఠల కోసం తండ్రిని మించిన చేయని అనిపించుకోవడంకోసం పడిన ఆరాటం ఇప్పుడు చల్లారింది. కాని దాని స్ఫులింగం ఇంకా లోపల మిగిలే ఉంది. ఇది చివర శ్మశానంలో చనిపోయిన తల్లిని గురించి చేసిన ఆలోచనలో గాని పూర్తిగా అంతరించలేదు. పాత్రలో చిట్టచివర వచ్చిన హఠాత్ పరివర్తనం, పాత్రచిత్రణలో కొసమెరుపు జీవితాన్ని తేజోవంతంగా తీరుస్తుంది. కథాగమనంలోనూ అనూహ్యమైన పరిణామంతో ప్రయోజనశీలాన్ని విస్తృతం చేస్తుంది. రచనాశిల్పం దృష్ట్యా కొత్త అభిలాషను కలిగిస్తూ వైవిధ్యాన్ని సంతరింపజేస్తుంది.

## 4

చిన్నప్పటినుండీ పెరిగిన వాతావరణానికీ ఇప్పుడు బ్రతికే వాతావరణానికీ మధ్య ఎంతో అంతరం ఉంది. ఎంత స్వతంత్ర ప్రవృత్తి కలవాడైనా కనీసస్థాయిలో సమన్వయం కలిగి ఉండాలి. అలా జరగలేదు. కాలం గడచేకొద్దీ ఈ అంతరం

పెరుగుతూ పోయింది. ఇక వెనక్కు రాలేని దశకు చేరుకుంది. మొదట్లో ఉదారుడుగా సంస్కర్తగా గుర్తించిన సంఘం, తరువాత తిరస్కరించింది. ఈ అంతరం, అఖాతమైంది. ఇతని కుటుంబం మొదలుకొని సమాజం వరకు పర్యాప్తమైంది. ఒక సభలో ఇతని మాటలు విని జనం కొట్టబోవటమూ జరిగింది. చివరకు పరిణత మతియైన రామయ్యతాత కూడ అసహ్యించుకునే స్థితికి వస్తాడు. అతని నిష్క్రమణకు అనివార్యమైన పరిస్థితులు ఆసన్నమౌతాయన్న మాట. ఒకమారు 'ప్రపంచానుభవం తక్కువ, కొంచెం తెలిసి మెలగాలి' అని రామయ్యతాత బోధిస్తాడు. అతనికీ మాట నచ్చదు. 'నేను తెలిసే చేస్తున్నా'నంటాడు. అతడొకవేళ అంగీకరిస్తే పాత్ర స్వరూపమే మారుతుంది. అలా మారడం రచయిత ఉద్దేశంలో లేదు. ఈ పాత్ర తాను 'అన్నీ తెలిసే' చేస్తున్నట్లు ప్రవర్తించడంలోనే మనస్తత్త్వ పరమైన అంశం ఉంది. ఇతనిలో ఆర్ద్రత, సుకుమారమైన ప్రవృత్తితోపాటు విషయాన్ని చాలా నిశితంగా పరిశీలించే లక్షణమూ ఉంది. మొదటివి అప్పుడప్పుడూ లోపించినా, శుష్కించినా, కరకుదేలినా చివరిది మాత్రం నైశిత్యాన్ని కోల్పోదు. పరిశీలనాగుణం తగ్గలేదు. ఇది ఇతనిలోని వెలుగు పార్శ్వానికి సంబంధించింది. మరో పార్శ్వం, ఇంతకుముందు పేర్కొనట్లు వంశగౌరవం, అహంభావంతోపాటు భయం, అధైర్యం మొదలుగా న్యూనతాభావం (Inferiority Complex) తో కూడిన మానసికమైన బలహీనతలతో ఏర్పడింది. ఇది నీడతో చీకటితో ప్రవృత్తమైంది. అతడు పరిస్థితులకు తట్టుకోలేక క్రుంగిపోవడం మొదలుపెట్టాక, తిరిగి తనలో ఉన్న శక్తిని సమీకరించుకొని ప్రయత్నం చేయలేకపోవడం పాత్రలోని ప్రధానమైన అంతస్తత్త్వం. దీన్ని మానసికమైన క్షోభ, ఉద్రేకం, ఆవేశం బాధతో నరాల బలహీనతవల్ల సిద్ధించిన అసమర్థతగా విశ్లేషించవచ్చు. మొదటి పార్శ్వాన్ని రెండో పార్శ్వం క్రమక్రమంగా క్రమ్మేసింది. అతనిలో ఉత్సాహం నశించింది. జీవితంపై ఆశ రాలిపోయింది. జీవించడం దుర్భరమైంది. దీనికి సంబంధించిన చర్యలు, ప్రతిచర్యలు అనేక వివిధ సంఘటనల్లో స్ఫుటంగా చూడవచ్చు. ఈ తత్త్వం క్రమంగా అధికమై మనస్సు రాపిడితో అదుపు తప్పింది. ఈ పాత్రచిత్రణలో ఈ అంశం మరీ ముఖ్యమైంది. 'కళ్ళెం లేని గుర్రం' అయినాడు. అస్తిమతత్వానికీ చేరుకున్నాడు. ఈ దశలోనే అతడు బొమ్మలు వేయడం, రాయడం మొదలుకొని అసంబద్ధంగా మాట్లాడడం, లోకదృష్టికి విపరీతంగా ప్రవర్తించడం, మనస్సులో మెదిలింది అణచుకోకుండా, సంస్కరించకుండా, కత్తిరించకుండా అదుపు చేయకుండా ఎదురుబడి మాట్లాడటం అన్నీ జరిగాయి. ఈ స్థితి వ్యక్తిలోని బలహీనతల్ని విజృంభింపజేసి, చిత్రవధ చేసుకొని తన మరణానికి ప్రత్యక్షంగా తానే కారణభూతం చేసింది. ఈ విధంగా పాత్ర మనస్తత్త్వంపై ప్రధానమైన దృష్టితో, విపరీతమైన ధోరణికి

నెట్టేసే పరిస్థితుల చిత్రణంలో రచయిత అక్కడక్కడా అవలంబించిన సంవిధానం చైతన్యస్రవంతికి సంబంధించింది. ఇది ఆంతర విశ్లేషణకూ దారితీస్తుంది.

**5**

రామయ్యతాత చదువుకోకపోయినా జీవితంలో తృప్తినీ, శాంతినీ పొందాడు. చదువు, సంస్కారమున్న ఇతనిలో అది లోపించింది. చదువు, సంస్కారం వల్ల ఇంకా ఇది అత్యుత్తమ స్థితిని పొందాలి. కాని అలా జరగలేదు. రామయ్యతాత తరం వేరు, ఈతని తరం వేరు. వారు పెరిగిన వాతావరణంలోనూ భేదం ఉంది. జీవనస్థాయిలోనూ అంతరం ఉంది. ఇది ఇలా ఉంచి, సర్వసామాన్యంగా అందరిలోనూ కనీసస్థాయిలో మౌలికమైన కొన్ని లక్షణాలుంటాయి. అందులో పేర్కొనదగింది మానవత. ఈ గుణమూ పోనుపోను విస్మృతం కావడం ఈ పాత్రలో మరో విశేషం. ఇతనిలో లోపించిన లోకానుభవం, వివేకస్ఫూర్తి రామయ్యతాతలో పుష్కలంగా ఉన్నాయి. అతని సాఫల్యానికి ముఖ్యమైనవి. ఇతని మాట సీతారామారావుకు నచ్చలేదు. హేతువు ముందు యథార్థం నిలవలేదు. దీనికి పోషకమైన మరో అంశం నవల చివరలో ఇతడు శ్మశానభూమి చేరుకున్న సన్నివేశంలో ఉంది. ఇతనికి తల్లిలోని సహనం, వివేకం కన్నా తండ్రిలోని అహం, మొదలైనవి సంక్రమించాయి. అభిమానపాత్రమయినాయి. శ్మశానంలో తండ్రి సమాధిపై మొలచిన జిల్లేడు చెట్టు, బూడిద ఐన తండ్రి భౌతికరూపం ఎరువుగా బలిసింది. జిల్లేడుచెట్టు తండ్రి మనస్తత్వానికి ప్రతీక. ఇది ఎవరికీ ఉపయోగం లేనిదీ, అందరూ దూషించేదీ. ఒక్కమారు ఇతని మనస్సులో గతం పరిశీలనారూపంలో పరివర్తితమైంది. ఈ పరివర్తనంలో అహంభావంలేని ఉదారమైన స్నిగ్ధమైన ఆర్ద్రగుణం ఆకర్షించింది. తల్లి ఆదర్శరూపం ఇతనిలో ఆవిష్కృతం కావడం జరిగింది. తల్లి పట్ల సౌముఖ్యం, తండ్రి పట్ల వైముఖ్యం ఏర్పడింది. ఇది ఈ నవల్లో చాలా ముఖ్యమైన అంశం. భౌతికంగా అతడు మృత్యుసన్నిహితుడైనా, మానసికంగా కొత్త రూపంలో సీతారామారావు పాత్ర ఇదివరకు లేని వెలుగుతో స్పందిస్తుంది.

నవల మొత్తంమీద, వ్యక్తిలో ఆత్మన్యూనతాభావం, భయభావం, ఆందోళనా స్వభావం వల్ల ఏ ఆదర్శాన్నీ, ఆఖరికి సాధారణ జీవితాన్నీ ఫలవంతం చేసుకోలేని క్రియాశూన్యుడు, ఆలోచనా జీవిగా ఈ పాత్ర నిర్మితమైంది. నిరాశోపహతుడూ, వివేక రహితుడూ ఐన అసమర్థునికి ప్రపంచంలో స్థానంలేదన్న విషయమూ స్థాపితమైంది. చిట్టచివర అతనిలో అంకురించిన కొత్త వివేకరూపం, పూర్వరూపం నశించిన మృత్యుభూమి నుండి ఉదయించింది. ఇది రచయిత ఉద్దేశంలో సూచితమైన మనిషిలో అవసరమైన జీవనరూపం.

# 6. అల్పజీవి పాత్ర చిత్రణం

రాచకొండ విశ్వనాథశాస్త్రి "అల్పజీవి" తెలుగు నవలా సాహిత్యంలో మనస్తత్వ ప్రధానమైన రచనల్లో పేర్కోదగింది. ఇందులో సుబ్బయ్య పాత్ర కేంద్రబిందువు. ఇది మనస్తత్వ భూమికలో చిత్రితమైంది. రాచకొండ సృజనశక్తిని ప్రదర్శించేది. మనస్తత్వ శాస్త్రపరంగా నవలను ఉన్నత శిఖరానికి చేర్చింది. ప్రస్తుతం ఈ అంశం వరకే పరిశీలనం పరిమితమైంది.

సుబ్బయ్య అల్పమైన శక్తి కలవాడు. ఇంటా బయటా ఇతని స్థానం చాలా సాధారణమైంది. మానసికంగా దుర్బలమైన వ్యక్తి కావడంతో ప్రతి స్వల్ప సంఘటనకూ ఇతనిలో ప్రకంపనలు జనిస్తాయి. ఆలోచనా తరంగాలు కదలుతాయి. వీని ప్రసారం పాత్ర స్వగతంలో ఆవేదనా రీతిలో స్పష్టంగా చూడవచ్చు. ఇది పాత్ర ప్రధానమైన నవల. సుబ్బయ్య పాత్ర వివిధ కోణాల్లో నిర్మాణంలోని వివిధ పార్శ్వ భాగాల విశ్లేషణతో ఆరంభమౌతుంది.

"సుబ్బయ్య సుందరుడు కాడు, ఒట్టి చచ్చు పెద్దమ్మ" సుబ్బయ్య అభిప్రాయం.

"సుబ్బయ్యకి జమీందారీ లేదు" - భార్య

"సుబ్బయ్య నంగిరి పింగిరిగాడు" - బావమరిది

"నాన్న చాలా మంచివాడు" - కూతురు

"నాన్నకు అమ్మను చూస్తే భయం" - కొడుకు

"చాలా అసమర్థుడు" - హెడ్ క్లర్కు

"పాపం! ఒట్టి భయస్థుడు" - అనేకమంది అనుకునే అభిప్రాయాలు.

ఇవన్నీ వాస్తవికంగా జీవిత యాథార్థ్యాన్ని చిత్రించేవి. పాత్ర వికాసరూపానికి దోహదపడిన అంశాలే. నవల ఆరంభంలోనే పాత్ర స్వరూపం భిన్న పాత్రల అభిప్రాయ రేఖలతో సూచనగా చిత్రితమైంది. ఇలా పాఠకుల మనస్సులో స్థూలంగా ఒక భూమిక ఏర్పరచి దీనిపై కథా నిర్మాణం సాగింది. ఈ పద్ధతి పాత్ర చిత్రణపై రచయితకు గల ప్రత్యేకమైన శ్రద్ధను కనబరుస్తుంది. మొదట పాత్ర స్వరూపం సూచించి దీన్ని క్రమంగా ఆవిష్కరిస్తూ పోవడం పైకి సులభంగా కన్పిస్తుంది. కాని భిన్న సంఘటనల యోజనతో కథా పరిణామ గతితో పాఠకుల ఉత్సుకతను నిలబెడుతూ చివరిదాకా సమస్థాయిని కాపాడుతూ నిర్వహించడం కష్టమైన నేర్పే. ఈ సంశ్లిష్ట శిల్పసాధనలో రాచకొండ కృత్యులయ్యారు. మనస్తత్వ ప్రధానమైన నవలల్లో శాశ్వతమైన స్థానమూ పొందింది.

ఇందులో రచనాశిల్పం రెండు విధాలుగా కన్పిస్తుంది - 1) కథనానికి సంబంధించింది, 2) నిర్వహణకు సంబంధించింది. మొదటిది పాత్రల పూర్వవృత్తాంతం నేరుగా కాకుండా (ఒక్క సుబ్బయ్య పాత్ర తప్ప, మొదట్లో అదీ వివిధాభిప్రాయాల విశ్లేషణతో ఆరంభమౌతుంది) ఏదో ఒక సంఘటన నాశ్రయించి చెప్పడం. రెండోది ముఖ్యమైంది, ప్రవాహ గుణం కలిగిన పాత్రల ఆలోచనారీతిలో రచనాపద్ధతి ఉండడమూ, మనస్తత్వపరంగా అంతర విశ్లేషణం (Internal analysis), ఆంతరంగిక సంభాషణం (interior monologue) ఇందులో విశేషం. కేవలం శిల్పం, శిల్పం కోసం అన్నట్లు కాకుండా పాత్రల మనస్తత్వాన్ని, ఆలోచనాక్రమంలో గాలికి అలలు అలలవలె పైకి ఉత్సహింపజేస్తూ సాగింది. పాత్రల స్వగతంతోపాటు రచయిత చేసే విశ్లేషణాత్మకమైన వ్యాఖ్యానం, వర్ణనాత్మక చిత్రణం ఒకదానికొకటి పోషకాలై సంపూర్ణతను సాధిస్తున్నాయి. ఇవి సంఘటనల యోజనలో ఉత్సుకతను నిలబెడుతూ, నిర్వహణలో ఆకర్షణను సాధిస్తున్నాయి. పైగా రచన సవేగమైన శైలీ విన్యాసంచేత, ఉద్వేగయుతమైన రచనాశిల్పంచేత చివరిదాకా లాక్కొనిపోయే చైతన్యగుణమూ కలిగి ఉంది.

అలవాటు చొప్పున వచ్చిపోయేవాళ్ళని చూస్తూ ఆలోచిస్తూ కూర్చున్న సుబ్బయ్య వద్దకు ఒకనాడు వెంకట్రావు డబ్బుకోసం రావటంతో ఎంతో శాంతంగా సాగిపోయే బ్రతుకులో అతని మనస్తత్వానికి సరిపడని పనివల్ల కల్లోలం ఆరంభమైంది. మనోరమ ప్రత్యక్షంతో జీవితం క్రొత్తమలుపు తిరిగింది. ఇంతవరకూ లేని తృప్తికీ సుఖానికీ శాంతికీ చేరువౌతూన్నట్లనిపించిందతనికి. ఎవరికోసమైతేనేం? డబ్బు తానేగా తీసుకుంది కాబట్టి గవరయ్య బిల్సు గురించి ఏం చేసేవాడో గాని సమయానికి సీటు మారింది. అవమానమూ పొందాడు. సాధారణంగా గడచే బ్రతుకును ఈ పరిస్థితులు తీవ్రమైన దశకు తోసివేశాయి. ముఖ్యంగా మనోరమ ఇంకా అవధాని, వెంకట్రావు, పోతరాజు సహాయంతో బయటపడ్డాడు. వెంకట్రావు కోసం గవరయ్యవద్ద డబ్బు పుచ్చుకోవడం పడరాని కష్టాలపాలు జేస్తే మనోరమతో పరిచయం ఊహించరాని ఊరటను సుఖస్పర్శను కలిగించింది. ఆ నీడా, ఈ కాస్త వెలుగూ ఇతని మనస్సును ఆవహించిన రెండు అనుభవ రూపాలు.

సుబ్బయ్య జీవితం మొదట సావిత్రి, పిల్లలు, ఆఫీసుతో ఒక విధమైన సాధారణ జీవిత సన్నివేశాని కొదిగింది. ఆపైన వెంకట్రావు కారణంగా బ్రతుకుపై క్రమించిన గవరయ్యతో జీవితంలోకి ప్రవేశించిన మనోరమతో మరో విధమైన సన్నివేశం సృజింపబడింది. వెంకట్రావు పరివర్తనకు కారణమనుకుంటే, గవరయ్య గతి వైఖరికి సాధనమవుతాడు. మనోరమ దీన్ని ఒకచోట నిలిపేదిగా కన్పిస్తుంది. గవరయ్య,

మనోరమ ఇరువురూ చెరి ఒక ప్రక్కనుండి, ఒకరు సుబ్బయ్య మానసికమైన సంక్షోభానికీ, మరొకరు ఉల్లాసానికీ అతిశయ రూపంలో ఆశ్రయం కావడం నవల్లో ఆసక్తిని కలిగించే పార్శ్వాలు.

మొదటిదానికి ఇతనిలో భయభావమూ (Fear Complex), న్యూనతాభావమూ (Inferiority Complex) కేంద్రబిందువులైతే, రెండోదానికి మానసికమైన అసంతృప్తి, శూన్యత అనవచ్చు. సావిత్రి గతంగా నెరవేరని కోర్కెలు జంకుతో మనస్సులో అణగి మణగి ఉండి ఎపుడో అతనికి తెలీకుండా, ప్రభావానికి కారణమయ్యాయి. మొదటిది లౌకిక జీవితానికి, రెండోది ప్రేమజీవితానికి (అంటే నవల పరంగా వివాహరూపానికీ, స్వేచ్ఛా జీవితానికి సంబంధించి) ప్రాతినిధ్యం వహిస్తాయి. అతని మనస్సులో ప్రవాహరూపంలో పై రెండు అనుభవాలు పరస్పరమూ ప్రభావం కలవీ విశిష్టత కలవీ. ఇతనిలోని ఫోబియాకు కారణం చిన్ననాటి భయోద్రేక సంఘటనలే. ఇది క్రమంగా పిరికితనంతో ఆత్మన్యూనతాభావంగా గూడుకట్టుకుంది.

**2**

సుబ్బయ్య మనస్తత్వం భయ రేఖలకొదిగిందీ, న్యూనతాభావం ఆవహించిందీ. భయం మానసికమైన అలజడి వల్ల కలిగేది. దీనికి ఉద్వేగం (Emotion) తో సంబంధం ఉంది. ఇది వాస్తవికమూ, కాల్పనికమూ అని రెండు విధాలు. సంఘటనలను పురస్కరించుకొని వాస్తవికమై, ఆలోచనలో కాల్పనికమై చోటు చేసుకోవడం రచనలో చూడవచ్చు. భయం అనేది పుట్టుకతోనే వచ్చేది కాదని ఒక అభిప్రాయం. ఉదాహరణకి శిశుదశలో చేతితో పాముని పట్టుకోవచ్చు. నిప్పు ముట్టుకోవడమూ జరుగుతుంది. ఎవరో తెలిసినవారు వారిస్తే అపాయం వాటిల్లుతుందనుకొని అప్పటినుండీ భయం ఆరంభమౌతుంది. ఇది పరిశీలన (observation) వల్ల కలిగేది. మరో విధమైంది వికృతమైన ఆకారం చూడడం, కుక్కలు మొరగడం, పెద్ద చప్పుడు వినడం మొదలైన వానివల్ల కలిగేది. ఇది అప్రీతికరమైన అనుభవం (unexpleasant experience) వల్ల ఏర్పడుతుంది. ముఖ్యంగా బాల్యదశలో పొందే ఎన్నో అనుభవాలు మనస్సులో నిలచిపోయి తరువాత తరువాత జీవితంలో ఎన్ని విధాలుగానో ప్రభావాన్ని నెరపుతాయి.

బాల్యదశలో జరిగిన రెండు తీవ్రమైన అనుభవాలు సుబ్బయ్య లేత మనస్సుపై బలమైన దెబ్బను తీశాయి. ఒకటి కుటుంబానికి సంబంధించింది. ఇతని తండ్రి సోమయ్య రెండో భార్య వికృతమైన ఆకారం కలది. చాలా క్రూరంగానూ ప్రవర్తించేది. ఆమె రూపగతమైన వికృతత్వమూ ప్రవర్తనాగతమైన క్రూరత్వమూ ఇతనిపై దారుణమైన

ప్రభావాన్ని నెరపాయి. మొదటిసారి ఆమెను చూడగానే సుబ్బయ్య భయపడి తండ్రిని చుట్టేసుకున్నాడు. ఆమె ప్రతిదానికీ ఏదో ఒక సాకుతో ఇతణ్ణి కొట్టేది. ఈ కారణంగా అతడెంతో వేదనకు గురి అయ్యాడు. ఒక సంవత్సరం తరువాత ప్రక్కింటి పెద్దమనిషితో లేచిపోయింది. చిన్నతనంలో ఈ అనుభవ పరంపర ఒక్కొక్కటీ ఒక్కొక్క దశలో మనస్సు దిద్దుకునే రూపంలో మార్పును తేవడం సహజం. తరువాతది సామాజికమైంది. సుబ్బయ్య చిన్నతనంలో ఒకనాడు రాత్రి చీకటిలో తండ్రి వెంట వెళుతున్నాడు. ఇంతలో ముగ్గురు మనుషులు బూతులు తిడుతూ కమ్ముకొని పైకి వచ్చారు. సుబ్బయ్యకు ఏమీ అర్థం కాలేదు. హఠాత్తుగా జరిగిన భయ సంఘటనకు తట్టుకోలేక శక్తిరహితుడై రాళ్ళకుప్పపై బడ్డాడు. తలకు దెబ్బ తగిలింది. ఆపైన "అమ్మో! నాయనో"యన్న అరుపులు! దెబ్బల చప్పుడు. ఇతనికి అమితంగా భయం వేసింది, దుఃఖం కలిగింది. మనస్సు క్రుంగిపోయింది. ఆ తరువాత కూడా ఒకొక్కప్పుడు ఆ దృశ్యం మెదలి మనస్సులో అకస్మాత్తుగా కంగారుగా లేచి కూర్చుంటాడు. కళ్ళవెంట నీరుకారుస్తాడు. ఈ భయంకరమైన సంఘటన, ఇదివరకు సవతితల్లి వల్ల కలిగిన భయతాపం రెండూ కలసిన భయన్యూనతా మనోరూపం స్థిరీకృతమవడానికి బాగా తోడ్పడినాయి. ఈ కారణంగా అతడెక్కడికయినా చీకట్లో ఒంటరిగా వెళ్ళడానికి జంకుతాడు. అందుకని సావిత్రి ఇతణ్ణి "పిరికిపంద" అని అంటూంటుంది.

చిన్నతనంలో కలిగిన ఈ భయభావం ఇతనిలో ఆత్మప్రత్యయాన్ని (Self Confidence) లోపింపజేసేది. ఒక్కొక్కప్పుడు ఇలాంటి స్థితిలో తెలివితేటలు కలవారినైనా న్యూనతాభావం ఆవహిస్తుంది. తల్లిదండ్రుల నుండి తృప్తికరమైన భద్రత (Safety) సంరక్షణ (Protection) లేకపోవడంవల్ల పిల్లల్లో క్రమంగా ఉపసంహరణ (retreat) తత్త్వం వృద్ధి చెందుతుంది. భయమూ క్షోభ రెండూ ఒకదాని ప్రక్కన వేరొకటి చేరిపోతాయి. అందువల్ల కుటుంబంలో చిన్న పిల్లల విషయంలో, ఆత్మ ప్రత్యయానికీ, భద్రతాభావానికీ కారణభూతులై, తల్లిదండ్రులు వారి ఆరోగ్యకరమైన వ్యక్తిత్వ వికాసాని కెంతో తోడ్పడేవారనడం నిర్వివాదమైన విషయం.

సుబ్బయ్య విషయంలో తల్లిదండ్రులనుండి ముఖ్యంగా తల్లి నుండి ప్రేమ, భద్రత పొందజాలకపోవడం, పైగా సవతితల్లి వల్ల లేతమనస్సు దెబ్బతినడం మూలంగా రూపొందిన మనోలక్షణం చూడవచ్చు. ఈ భయం సమీపంలోదే క్షోభ (Anxiety) ఇదే నవల్లో అర్థచ్ఛాయాభేదాలతో అక్కడక్కడా "బాధ"గా కన్పిస్తుంది. భయానికీ క్షోభకూ జీవితంలో హఠాత్తుగా జరిగే సంఘటనలే ఆధారం. ఒక్కొక్కపుడు వ్యక్తిలో ఆంతరమైన అనుమానంతో కూడిన ఆలోచనకు కారణమౌతుంది. ఈ ప్రకృతి అల్పజీవిలో పుష్కలంగా

ఉంది. ఉదాహరణకు మనోరమ వద్ద నుండి ఇంటికి తిరిగి వస్తూ ఆమె "కొంటెగా సీరియస్‌గా మీతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలి" అన్న మాటను గురించి ఆలోచించడంతో మనస్సు భారంగా క్రుంగిపోయే స్థితికి వస్తాడు. అప్పుడు –

"పెళ్ళి చేసుకోమంటుందా?" "ఎటువంటి క్యారెక్టరీమెది?" "అయిదువందలు తననే ఇవ్వమంటుందేమో?" "నా సొదంతా చెప్పుకున్నా" "ఆ మనిషి సంగతి ఏమైనా అడిగేనా?" "నాకు భయంగా ఉంది" అనుకుంటూ నడుస్తూ ప్రక్కన ఉన్న రాళ్ళకుప్పపై పడ్డాడు. ఇలాంటి అనుభవమే తండ్రితో వెళ్ళినప్పుడు జరిగిందని అనుకుంటూ ఉండగా ఎవరో రక్కసుల వంటి మనుషులు "చిన్న పని ఉంది రండి" అంటూ లాక్కొని పోయారు. సందర్భం వేరైనా చివర పొందిన మానసిక స్థితి ఒకటే. రాళ్ళకుప్ప, ఆ మనుషుల రాక, తాను చిన్నప్పుడు పొందిన దుస్థితిని తలపుకు తెచ్చేవి. "ఎవరో అపకారం చేస్తున్నారు", "అంతా మనకు వ్యతిరేకమే" అన్న అనుమానమూ భయంతో ముడిపడిందే ఇది మానసికంగా అసమస్థితికి కారణమూ అవుతుంది. ఈ పాత్ర గురించి వ్రాస్తూ రచయిత "మానవుడు భయపడడం సహజమే కాని సుబ్బయ్యలో ఎక్కువ మోతాదులో ఉందం"టాడు ఒకచోట. దీన్ని మరికొంచెం వివరిస్తాను. ప్రస్తుతం సుబ్బయ్య పాత్రకీ అన్వయిస్తుంది. మొదట భయంవల్ల అలజడి కలుగుతుంది. చుట్టూ జరిగే ప్రతి విషయంపై పలుమార్లు అనుమానం ప్రబలుతుంది. దీనివల్ల క్షోభ అధికమై మనస్సు స్తిమితత్వం కోల్పోతుంది. శంకాపీడతో అశక్తత ఆవహిస్తుంది. భయసాంద్రతనుబట్టి చెమటలు పుట్టడం, నోటివెంట మాట రాకపోవడం, గుండె కొట్టుకోవడం, తప్పుకోడానికి ప్రయత్నించడం, బుద్ధి మందగించడం, నిర్ణయశక్తి లోపించడం, చొరవలేకపోవడం, బ్రతుకుపట్ల నిరాశ వహించడం మొదలైన శారీరక మానసికమైన మార్పులు వస్తాయి. గవరయ్యను డబ్బు అడిగేప్పుడూ, వెంకట్రావు ఇంటికి డబ్బు విషయమై వెళ్ళేప్పుడూ, మనోరమ ఇంటికి మొదటిసారి వెళ్ళాకా, గవరయ్య వలన బాధలకు గురైనపుడూ చివరలో గవరయ్య బాధ తీరాకా, మనోరమ ఇంటినుండి సముద్రముఖం పట్టినపుడూ వీటిలో కొన్ని లక్షణాలు పాత్ర స్వగతంలోనూ, మాటల్లోనూ రచయిత మధ్యమధ్య చేసే వ్యాఖ్యానంలోనూ స్ఫుటంగా చిత్రితమైనాయి.

"నాకు భయంగా ఉంది
పాడు బ్రతుకు నాది
...... .......
ఏదో బాధతో ఎప్పుడూ భయపడుతూనే ఉంటాను.
నా మనసంతా భయాల్లో బాధ పెట్టుకుంటున్నాను

నాకిపుడు శాంతి లేకుండా శాంతి లేదు
నాకిపుడు శాంతి విశ్రాంతి లేదు"

అనేక సందర్భాల్లో పై పరిశీలనకు తగినట్లుగా అల్పజీవిలో మానసికమైన ప్రవర్తన కన్పిస్తుంది. ఒక్కొక్కపుడు అపాయశంకతో తీవ్రమైన క్షోభతో, అధికమైన భయంతో మనిషి నిస్సహాయస్థితికి చేరవచ్చు. ఈ స్థితిలో కాస్త ఆశ్రయం దొరికితే అదే స్వర్గం! ఇది అన్ని నియమాలనూ నీతులనూ ఉల్లంఘింపజేస్తుంది. "ఈమెకు ఆజన్మాంతం కృతజ్ఞుణ్ణిగా ఉండాల"ని మనోరమపట్ల సుబ్బయ్య వశవర్తనకిదే మూలం.

సుబ్బయ్య జాగ్రత్తగా మసలుకొనేవాడే. ఎవరికి జోలికీ పోయేవాడు కాదు. అధికారం అంటే భయం. ఆఫీసులో పని నెమ్మదిగా జాగ్రత్తగా చేస్తాడు. అందువల్ల అంతా విసుక్కుంటారు. మంచి ఉంటేనేగాని ఈ జీవితాన్ని గడపడం కష్టం. అందుకని అందరితో మంచిగా ఉండాలనే అతని ఆశయం. దీనికి నిదర్శనంగా అతడెవరినైనా పలకరించే ముందు మందహాసం చేయడం అలవాటు. అయితే ఇలా చేయడం ఎదుటివాళ్ళకి వెకిలిగా కన్పిస్తుంది. చిత్రమేమంటే ఒక విధంగా మంచిదనుకొని చేస్తే ఎదుటివాళ్ళకి వికృతంగా కన్పించడం, లోకువ కావడం జరిగింది. ఇది ఇతని నిస్సహాయస్థితి. సమాజం పట్ల అనుక్షణమూ భయశంకాలక్షణం, తనకు తెలీకుండానే నిరాశా నిస్పృహలకు దారితీస్తుంది. ఈ స్థితిలో చేతకానివాడన్న అభిప్రాయమూ కలిగిస్తుంది. సుబ్బయ్య విషయంలోనూ సరిగ్గా ఇలాగే జరిగింది. ఇతడు చాల విచిత్రమైన వ్యక్తి. పైకి చాలా అమాయకుడుగా కన్పిస్తాడు. గవరయ్యను డబ్బు అడిగాడు. ఏదో అవసరం వచ్చి పుచ్చుకున్నాడు. బాగానే ఉంది. బిల్లు పాసు చేయించేందుకని మొదట తెలీకపోయినా, తరువాత తెలిసినా, సీటు మారినా ఎలాగైనా తిరిగి ఇచ్చేయాలి కదా! పైగా వెంకట్రావు పరాయివాడేమీ కాదు. ఒక సందర్భంలో అవధాని వరసగా ప్రశ్నించి "చూడు సుబ్బన్నా! మనం అనుకున్నంత అమాయకులం కామోయ్" అంటాడు. దీనికతడు తన్ను మాటల్తో అవధానీ, మాట్లాడకుండా సావిత్రీ, ఇంకా రామస్వామీ, అందర్నీ మించి గవరయ్యా, అంతా హింసిస్తున్నట్లు బాధపడతాడు. ఇతణ్ణి గురించి రచయిత ఆఖర్నో మాటలో "ఈ నవల చివరి భాగాలు వ్రాసేప్పుడు నాకు సుబ్బయ్యంటే అసహ్యం వేసింది. గవరయ్య చెప్పినట్లు వాడు దొంగవెధవేనని నమ్మకంతో ఉండిపోయాను" అంటాడు. "భయానికీ మంచికీ పొందికలేదు. పిరికివారెపుడూ మంచివారు కాజాలరు" అనీ పాత్ర అంతస్తత్వాన్ని అవలోకించడం జరిగింది. సుబ్బయ్య పిరికితనం, మంచితనాన్ని వెనుకంజ వేయించి రాణింపు లేకుండా చేసింది. సావిత్రి విషయంలోనూ భయమూ, న్యూనతా భావమూ, స్వయం సమర్థతనూ ఆత్మవిశ్వాసాన్నీ లోపింపజేశాయి.

మొదటినుండీ పరిస్థితుల ఒత్తిడిని ఏ మాత్రమూ నిరోధించే శక్తి లేకుండా అవలీలగా లొంగిపోయే మనస్తత్వం కన్పిస్తుంది. వెంకట్రావు అడగమంటే అడిగాడు. గవరయ్య తిరిగి ఇమ్మంటే కంగారు పడ్డాడు. పోతన్న "డబ్బు ఇవ్వను" అనమంటే అన్నంత పని చేశాడు. అవధాని పురి ఎక్కిస్తే ఊఁ అన్నాడు. మనోరమ సహాయం చేస్తానంటే స్వీకరించి కృతజ్ఞతామూర్తి ఔతాడు. ఇంతమంది చేతులపై కదలుతూంటాడు. ఇవన్నీ ఏదో వాలు వెంట తరలిపోయే మనస్తత్వాన్ని బింబించేవీ, స్తిమితం లేని, ధైర్యం లేని లక్షణాల్ని సూచించేవీ. దీన్ని వ్రాసేప్పుడు చివరిభాగాల్లో రచయితలో మరో అభిప్రాయానికి కారణమైనాయి.

"సుబ్బయ్య పాత్ర శ్రీశ్రీగారి కోనేటిరావుకి కొంత నమూనా" అంటాడు రచయిత. దీని ప్రసక్తి సంగ్రహంగానైనా అవసరమనుకుంటాను కోనేటిరావు శ్రీశ్రీ చిత్రించిన మధ్యతరగతి గుమస్తా పాత్ర. ఇతణ్ణి గురించి 1. కోనేటి దినం, 2. కోనేటి రాత్రి, 3. కోనేటి జన్మ అని మూడు కథలున్నాయి.

1. కోనేటి రావు హెడ్డు గుమాస్తా. వేళకి ఆఫీసు తప్పని మనిషి. గూడ్సుబండిలా రొప్పుతూ రోజుతూ నడుస్తూంటాడు. ఆఫీసులో అతడు యంత్రంలో యంత్రమై పనిచేస్తాడు. మధ్యాహ్నం విశ్రాంతి సమయంలో ఆకలేసి పొంగరాలు తినాలని కోరిక పుడితే ఏదో సాకుతో అణచేసుకుంటాడు. ఏం చేస్తాడు? ఇదీ అతని దుస్థితి!

2. రాత్రి నిద్రలో స్వప్న దృశ్యాలు తిలకిస్తాడు. సినిమాలో కథనాయకుడై భయంకర పరిస్థితులనుండి నాయికను రక్షిస్తాడు. ఇరువురి చూపులూ అనురాగంతో కలిసాయి. ఇంతలో పాట, సినిమా సంగీతం, నిద్రలో జడుసుకున్న పిల్లవాడు కెవ్వుమన్న ఏడుపు ఇతణ్ణి నిద్రనుండి మేల్కొలుపుతుంది.

ద్వితీయ ప్రపంచయుద్ధంలో జర్మన్ సబ్‌మెరిన్ కమాండర్ జటావల్ కోనేట్ ఇతని ఆధిపత్యంలో యుద్ధనౌక తునాతునకలై పోతుంది. కొందరు బయటపడి ప్రాణాలు రక్షించుకోబోతే జర్మన్ భాషలో మెషిన్‌గన్ పేల్చవలసిందిగా అజ్ఞ ఇస్తాడు. ఇంట్లో పిల్లి పాలగిన్నె పడేసిన ధ్వనికి మెలకువ వస్తుంది. అమెరికా ప్రభుత్వం, టెన్నెసీ లోయ పరిశీలనకై ఇంజనీరింగ్ జీనియస్ అని ఇతణ్ణి ఆహ్వానిస్తుంది. వారి ఔదార్యానికి కృతజ్ఞతతో తన దేశానికి గౌరవ కారణమని సవినయంగా అంగీకరిస్తాడు. ఇంకో కుర్రాడి ఏడుపుకి మెలకువ వస్తుంది.

బ్రిటిషువారిపై సత్యాగ్రహం వల్ల ప్రయోజనం లేదని, అహింసనే పాటిస్తూ కూచోకూడదని భావించి ఆఫీసులో బీరువాలూ కుర్చీలూ బల్లలూ విరగ్గొడతాడు. కాగితాలు

తగలబెడతాడు – సిరాబుడ్లు గోడకేసి కొడతాడు. కలాలు విరగ్గొడతాడు. పేపర్ వెయిట్ తీసి గోడగడియారానికేసి కొడతాడు. ఎదురుగుండా దొరగారు వస్తే గూబ గింయిమనేట్లు వాయిస్తాడు. ఇంతలో "తెల్లారిపోయింది నాన్నా" అన్న కంఠస్వరం వినిపిస్తుంది.

3. పుట్టినరోజు మస్తుగా భోజనంచేసి అన్నిరోజులు మాదిరిగానే ఆఫీసుకు ఎండలో ఈదవలసి వచ్చింది. స్వాతంత్ర్యం రాకముందూ, వచ్చాకా తన బ్రతుకు ఒకేవిధం. తన నలభైఐదో పుట్టినరోజున ఆఫీసులో కూర్చొని పనిచేసుకుంటూనే ఉన్నాడు. ఇదివరకితణ్ణి కనబడని సంకెళ్ళు బంధించాయి. అవి ఇంగ్లండులో తయారైనవి. ఇప్పుడూ ఉన్నాయి సంకెళ్ళు కనబడకుండా. అయితే ఇవి ఇండియాలో తయారైనవి. స్వదేశీ సంకెళ్ళు. ఇదే భేదం. సామాన్యుని బ్రతుకులో గుణాత్మకమైన మార్పు శూన్యం. మధ్యతరగతి దుస్థితినీ, మనస్తత్వాన్నీ, కలల్నీ చిత్రించే కథలివి.

కోనేటిరావు సుబ్బయ్య ఇరువురివీ గుమస్తా బ్రతుకులే. ఇరువురూ కల్పనా ప్రియులే. కోనేటిరావులో స్వాతంత్ర్య భావన, స్వేచ్ఛాతత్త్వం మనస్సులోనే అణగి ఉంది. ఇంకా నాయకత్వం, వీరత్వం, వగైరా వగైరా స్వప్నంలో సాక్షాత్కరిస్తాయి. వాస్తవికమైన అనుభవంతో తెలివిన బడుతూంటాడు. ఇతడు జీవితంలో నెరవేరని కోర్కెలు స్వప్నంలో తిలకిస్తే, సుబ్బయ్య మనస్సులో కథలల్లుకుంటాడు. నవల్లో పాత్ర కావడంతో ఇతని స్వరూపం భిన్న సంఘటనల నాశ్రయించి విస్తృతినీ వైవిధ్యాన్నీ సంతరించుకుంది. ఇతడల్లుకొనే కథలన్నీ ఆలోచనా రూపాలే. ఇవి పాత్ర అంతస్తత్వాన్నీ ఆలోచనారీతినీ రూపించేవి. మనస్తత్వపరంగా పాత్రకు పుష్టినిచ్చేవీ.

**3**

లౌకిక జీవితమూ, ప్రేమ జీవితమూ అని రెండు భాగాలుగా వేరుచేసినా, వీటిలో అన్యోన్య ప్రసారం నెరపే అంశాలు చాలా ఉన్నాయి. లౌకిక జీవితం, వెంకట్రావు, ఆఫీసు, గవరయ్య చుట్టూ తిరిగితే, ప్రేమజీవితం సావిత్రినుండి మనోరమ చుట్టూ పరిభ్రమించింది. ఇక్కడ ఇతనిలో అణగిన స్త్రీవాంఛ సౌందర్యతృష్ణ ప్రభావం మనస్తత్వ సమర్పకంగా భావింపవచ్చు. లౌకిక జీవితమూ, ప్రేమ జీవితమూ అన్యోన్యమూ ప్రభావం నెరపే సంఘటనల యోజన జీవితంలోనూ చూడవచ్చు. ఉదాహరణకి మనోరమే సుబ్బయ్య కోసం డబ్బు చెల్లిస్తానని గవరయ్య దగ్గరికి వెళ్ళడంతో సానుభూతి కోరే లౌకిక పరమైన అంశంగానూ తీసుకోవచ్చు. అయితే పరిశీలనా సౌకర్యం కోసం విభజన చేయడం జరిగింది.

సుబ్బయ్య తన జీవితంలో నెరవేరని కోర్కెల్ని వివిధ రూపాలుగా కల్పనలో చిత్రించుకొని తృప్తిపడే వ్యక్తి. స్త్రీగతమైన వాంఛ, సౌందర్యతృష్ణలో అన్వేషణాత్మక ప్రవర్తనం మనోరమతో మొదటి పరిచయ సన్నివేశంతోనే ఇట్టే పసికట్టవచ్చు. ఈ సందర్భంలో రచయిత సుబ్బయ్యను గురించి "మగవాళ్ళందరికీ ఉన్నట్లుగానే చిన్నతనంలో సుబ్బయ్యకి ఆడవాళ్ళని ఆకర్షించే అభిలాష ఉంది" అని వ్యాఖ్యానిస్తాడు. తరువాత కాలంలో "అభిలాష" మరుపున బడింది. మనోరమ పరిచయంతో మరపు తొలగింది. సావిత్రి వెనుకబడింది. అతడు "పెళ్ళికొడుకులా సంబరపడ్డాడు. అతని మనస్సు చలించింది". ఇతని భార్య జమీందారు ఇంటిబిడ్డ. అంతటి గొప్ప వంశానికి చెందిన సౌందర్యవతి లభించినందుకు భగవంతునికి నమస్కారం చేశాడు. ఆమె మటుకు అలాంటివేమీ చేయలేదు. పైగా "ఇతడు నాకు పెనిమిటి?" అనుకుంది. తన్ను పెళ్ళి చేసుకోడానికి సాహసించినందుకామె "అతణ్ణి క్షమించి"నట్లు లేదు. అతడేమొ క్రమేపీ ఆమెకు తాను తగనన్న భావంతో ఆమెపట్ల భయభక్తులతో ప్రవర్తించడం మొదలు పెడతాడు. ఆమె కతనిపట్ల ఏ గౌరవమూ లేదు. పెళ్ళి అయి పదిహేను సంవత్సరాలైనా ఆమెతో ఏమి మాట్లాడాలో అతని కర్థంకాదు. ఇరువురి ఆలోచనా విధానం ప్రవర్తనారీతి పరస్పరమూ వ్యతిరేకముఖంగా కన్పిస్తాయి. ఆమెకు తెచ్చిపెట్టుకున్న అభిజాత్యం జాస్తి. సినిమా చూచి తిరిగి రాగానే పోతన్న మాటలకు తిరస్కార భావంతో ప్రవర్తించి భర్తను "మొగుడు మొగుడు కాకపోతే ఆడదాని బ్రతుకింతే" అని కించపరచడానికి వెనుదీయని వ్యక్తి. ఆ తరువాత పోతన్న తన అన్నగారి వద్ద కొంతకాలం నౌకరుగా ఉన్నాడన్న కారణంగా మన్నిస్తుంది. ఈ తెచ్చిపెట్టుకొన్న వంశాభిమతి ఇరువురి మధ్య అఖాతాన్ని కలిగిస్తుంది. ఈ స్థితిలో భార్యతో ఏం మాట్లాడాలో సాహసించలేక బయటికి వచ్చి వరండాలో కూర్చొని వచ్చిపోయేవారిని చూస్తూ వారిని గురించి ఏవో కల్పనలతో కాలక్షేపం చేస్తుంటాడు. ఇది ఈతని పాత్రచిత్రణలో ముఖ్యమైన అంశం. తన ఊహ వాస్తవమా? కాదా? అన్న విచారణతో పనిలేదతనికి. అలా విచారణ మొదలుపెడితే అతని పునాదే ఎగిరిపోతుంది. ఈ కల్పనాజగత్తువల్ల తృప్తినీ, శాంతినీ, ఆశనూ అనుభవిస్తాడు. ఉదాహరణకు రోజూ ఇంటిముందు నుండి పోయే ఎర్రచీర మనిషి - ఇతణ్ణి ఎక్కువగా ఆకర్షించే వ్యక్తి. ఆమె అంటే ఇతనికి చాలా ఇష్టం. రెండో వ్యక్తి మునీశ్వర్లవారు. అరవయ్యేళ్ళ వృద్ధుడు, విరాగి, శాంతమూర్తి, ప్రశాంతంగా ఉంటాడు. ఇతనంటే సుబ్బయ్యకి గౌరవమూ భక్తీ ఉన్నాయి. మిగతా ఇరువురూ ఆడపిల్లలు, లేడిపిల్లలు. ఒకేరకం దుస్తులు వేసుకొని రోజూ స్కూలుకు వెళ్ళుతూ వస్తూ ఉంటారు. వాళ్ళు గొప్పవాళ్ళు కావాలని ఇతని కోరిక. వీళ్ళకు సవతితల్లి ఉందనీ, ఆమె రోజూ

బాధపెడుతుందనీ అదృష్టవశాత్తు భవిష్యత్తులో 'బంగారపు లేళ్ళు' అవుతారని సంతృప్తి చెందుతుంటాడు. ఈ ఊహలో చిన్ననాడు తాను సవతితల్లివల్ల పొందిన కష్టాలకు చెందిన వైయక్తికమైన అనుభవ స్పర్శ ఉంది.

ఎర్రచీర మనిషి ఇతని లోలో అణగి మణగి ఉన్న స్త్రీవాంఛనూ, మునీశ్వర్లవారు అననుకూల పరిస్థితిలో తప్పుకొనే మనస్సు ఏకాంతంగా కోరే శాంత లక్షణాన్నీ, లేడిపిల్లలు తన సంతతి గురించి భవిష్యత్తుపై ఆశాపూరితమైన ఆలోచనాదృష్టినీ, సుబ్బయ్య పాత్రను దృష్టిలో పెట్టుకున్నప్పుడు మనస్సుకు స్ఫురిస్తాయి. ఇంకా ఎందరిని గురించో కథలు అల్లుతూంటాడు. ఇతనికి వీధి వరండాలో రోజా క్రరస్తంభం చాటున కూర్చోవడం అలవాటు. ఇది ఇతనిలోని ఆత్మ ప్రత్యయరాహిత్యంతోపాటు భద్రతను అపేక్షించే ప్రవృత్తినీ సూచిస్తుంది. ఇంకా తనకు అననుకూలంగా ఉన్న వ్యక్తి (భార్య) నుండి దూరంగా ఉండాలనుకోవడంతోపాటు కనబడకుండా ఉండేందుకూ ఊహలు రహస్యంగా సాగేందుకూ మానసికమైన ప్రయత్నంతో పాత్ర రహస్య ప్రకారాన్ని భావింపజేస్తూంది. ఇలా వ్యక్తులను ఘటనలను ఆశ్రయించి చిత్రించుకొని ఊహలో తృప్తిపడడంలో పాత్ర ఎప్పటికప్పుడు మానసికంగా సమస్థితిని పొందే వీలుంది. దీనికుపకరించే ఉదాహరణలు కొన్ని పరిశీలించడమవసరమనుకుంటాను.

గవరయ్య ఒత్తిడి ఎక్కువై, డబ్బు అడగాలని వెంకట్రావు ఇంటికి వెళ్ళుతాడు. అతడు లేడనీ ఎక్కడికో వెళ్ళాడనీ ఆగి ఆగి సమాధానమిచ్చే స్త్రీ కంఠం వినిపిస్తుంది. ఈ మాట అబద్ధమని అతని నమ్మకం. ఆ వ్యక్తి అబద్ధమాడవలసి వచ్చినందుకు మధ్యమధ్య నవ్వుతూన్నట్లు ఊహించుకొని మనస్సు లోలోపలి సన్నివేశాల్ని చిత్రించుకుంటాడు. ఆమెను గురించి భావించినతీరులో ఈతని స్త్రీవాంఛ, సౌందర్యతృష్ణ స్పష్టంగా చూడవచ్చును. "నవ్వుతూ అబద్ధాలాడే ఆమె ఎలా ఉంటుందో? నాకు తెలుసు. మేనకలా రవివర్మ బొమ్మలా ఉంటుం"దనుకుంటాను. ఇక్కడ తాను వెళ్ళిన పని మరచి ఆమె సౌందర్య వర్ణనతో ఆగక "ఆమె అందాన్ని కళ్ళతో తాగుతూ చేతుల్తో తాకుతూ ... వెంకట్రావు ఎంత అదృష్టవంతుడు" అనుకుంటాడు. ఈ ఊహలో తన దురదృష్టానికి పొందే బాధ బరువుగా ఒదిగి కన్పిస్తుంది. అమాయకుడు, భీరువు అయిన సుబ్బయ్య మనోరమ విషయంలో ఇంత చొరవగా, ఎలా సన్నిహితుడు కాగలడన్న క్లిష్టసమస్యను పరిష్కరించే అంశం ఇది. బయటికి కన్పించే వినయశీలమైన భయావృతమైన వ్యక్తిత్వం వేరు. లోలోపల నెరవేరని వాంఛలతో ఏర్పడిన అభిలాషా రూపం వేరు. ఇతనిలో ఇది అందమైన ప్రవాహగతి కలిగే ఉంది.

మనోరమ ఉదయం అనుకోకుండా కన్పించి పలకరించి కొంతసేపు గడపగానే అతనిలో ఉత్సాహం కలిగింది. "పెండ్లికొడుకులా సంబరపడ్డాడు". మనస్సు చలించింది. ఆమెను గురించీ కథ అల్లుకున్నాడు. ఆమెకెవరూ లేరు, భర్త ఎపుడో పోయాడు. "కాని భగవంతుడు సుబ్బయ్యనే వాణ్ణి సృజించాడు. ఆ సంగతి ఈరోజే తెలిసిందావిడకు" ఆమెకెవరూ సన్నిహితులు లేరు. అందరినీ తృణీకరించింది. ఆమెలోని రాక్షసత్వం నశించి శాంతమూర్తి, స్త్రీమూర్తి నిలచింది. ఈ కల్పనలో సావిత్రీ గతంగా మనస్సులో గుప్తంగా నిక్షిప్తమైన అనుకూలమైన చిత్రం ఉంది. పైకి తలఎత్తిన అభిలాషా రూపమూ ఉంది. దీనికుపస్కారంగా మరో ఘటన తరువాత వస్తుంది.

మనోరమ వెళ్ళిపోయాక ఇంట్లో సుబ్బయ్య వడ్డించుకొని భోజనం చేస్తున్నాడు. సావిత్రి స్వయంగా ఎపుడూ వడ్డించదు. అన్నీ సిద్ధంచేసి తన గదిలోకి వెళ్ళిపోతుంది. భోజనం చేస్తున్న సుబ్బయ్య "నేనామెకు తగను నిజమే! భర్త అని కొంచెమైనా గౌరవం ఉండకూడదూ?" అని కించపడతాడు. సావిత్రి తనను అననుకూలంగా పోల్చుకొని నిరుత్సాహపడే తత్త్వం మనస్సును కుంచింపజేసి న్యూనతాభావానికి దారితీసేది. ఇపుడు ఆమెను గురించి ఆలోచన మొదలైంది. భార్యవలన కొన్నేళ్ళుగా ప్రేమ, గౌరవమూ, ఆనందమూ పొందలేకపోవడంతో మానసికంగా శూన్యత ఏర్పడింది. పైగా ఒక్కొక్కపుడు తిరస్కారమూ పొందడంతో వైముఖ్యమూ ఏర్పడింది. అందువల్ల సావిత్రి స్థానంలో మనోరమ అవలీలగా ప్రవేశించడానికి వీలైంది. ఇంతవరకు అతన్ని ఎవరూ కదపలేదు. ఆమె సంభాషణతో కదిపింది. రచయిత ఈ మలుపును సూచిస్తూ "సావిత్రి ఎదురుగా ఉంటే నల్ల చీరావిడ అతని మనస్సునుండి తొలగిపోయి ఉండును" అంటాడు. సావిత్రి స్థానంలో "నల్లచీర మనిషి" ఉంది. "ఆమెకు ఇంత తెలుపు ఎక్కణ్ణుంచి వచ్చిందా?" అని ఆశ్చర్యపడేంతటి తెలుపు మనిషి! అయితే "నల్లచీర మనిషి" అన్న శబ్దచిత్రం ఏమిటి? ఇది సుబ్బయ్య మనస్సులోని నీడను తెలియజేసేదా? మనోరమ చరిత్రను సూచించేదా? ఆమెకో చరిత్ర ఉన్నట్లు సుబ్బయ్య కల్పనలో తప్ప మనకెక్కడా ఆధారం లేదింతవరకు. అయితే ఇది అనుమానమేనా? ఇతని మనస్తత్వానికి ప్రతీకా? నల్లచీర మనిషి తరువాత తెల్లచీరతో కన్పిస్తుంది. ఇది అతనిలోని మార్పుకు సంకేతం.

గవరయ్య బాధ భరించలేక వెంకట్రావు దగ్గరినుండి ఉత్తచేతుల్తో తిరిగి వచ్చి మ్రగ్గుతుంటే అతనికి సావిత్రి జ్ఞాపకం వస్తుంది. "ఏమలా ఉన్నారని అడగనైనా అడగదు. నేను బ్రతికిని చచ్చినా ఒక్కటే దానికి" అని నిస్సహాయ స్థితిలో బాధతో మనస్సు అనురాగ సానుభూతి స్పర్శతో నిండిపోవాలన్న తహతహ కనబరుస్తాడు. ఆ రాత్రి పదిగంటలకు వంతెనమీదికి వచ్చి వెన్నెట్లో చల్లని గాలిలో హాయిగా ఉందనుకుంటూ 'గట్టుదిగాలా?

వద్దా' అని ఆలోచిస్తుండగా "ఏమండీ సుబ్బయ్యగారూ?" అంటూ మనోరమ ఎదురుగా నిల్చుంది. "ఏవో మాటల్తో అతనికి దగ్గరగా జరిగి భుజంమీద చేతులు వేయడం అంతా సహజంగానే తోచిందతనికి. తన మనస్సులోని బాధను ఆమె ముందు క్రుమ్మరించడంతో "రిలీఫ్" కలిగింది. ఆమె అనురాగ ప్రవర్తనతో మనస్సు నిండిపోయింది. సముద్రంలో మునిగేవాడి చేతికి తెప్ప అందినట్లయింది ఆమె ఆశ్రయం. సావిత్రి అదృశ్యమైంది. ఈ స్థితిని రచయిత మనస్తత్వ ప్రధానంగా తీర్చడం చూడొచ్చు. ఇలా ఎందుకు జరిగింది? సుబ్బయ్యను ఇంత బలంగా ఆకర్షించిన ఈమె ఎవరు? కనురెప్పలు షోగ్గా వాల్చడం, కొంటెగా నవ్వడం, ఆరితేరిన లక్షణం. స్త్రీలకు భగవంతుడు ప్రసాదించిన నేర్పంతా ప్రదర్శించి తల ఊపడం, ఒక రవ్వ పెంకెతనంగా వాలుచూపు వారచూపు విసరడం, జాలితో కంట తడిపెట్టడం, ఇవన్నీ ఒక్కొక్క చోట ఒక్కొక్క విధంగా వర్తించాయి. ఎంతో చనువు శ్రద్ధ కనబరచడమూ మన దృష్టిని నిలిపి ఆలోచింపజేసేవి. సుబ్బయ్యపట్ల ఎంతో అభిమానం, ఆదరణ, అనురాగం మూర్తీభవించిన స్త్రీ మూర్తిలా కన్పిస్తుంది. కొంటెగా సీరియస్‌గా "మీతో ఒక్క విషయం మాట్లాడాలి" అనడంలో ఆంతర్యం ఏమిటి? ఆ ముఖ్యవిషయం మాట్లాడనే లేదు. ఆ రహస్యం రహస్యంగానే ఉంది. వెలగలేదు.

నవల చివరలో మాష్టారు చనిపోయాక బీచ్‌వద్ద నిశ్చలంగా కూర్చున్న ఆమె ఏదో విషయం గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు కన్పిస్తూంది. ఆ వంచిన వీపు, తల చూస్తే ఈమె ఏదో కష్టంలో ఉన్నట్లు తెలుసుకోవడం అట్టే కష్టం కాదు. ఆమె ముందు కదులుతూన్న సముద్రం, తలవంచుక కూర్చున్న ఆమె మహాసముద్రంలో తేలుతూన్న ట్లనిపించింది సుబ్బయ్యకి. కొంతసేపయ్యాక అతడు దగ్గరగా వచ్చి ఆమెచుట్టూ చెయ్యి వేసి, ముఖంలోకి చూచాడు. ఎదురుగా సముద్రం! భీకరంగా, మనోహరంగా "సముద్రం నిండుగా కదుల్తూనే ఉంది. ఈ సముద్రం కదలకుండా ఎప్పుడుంది?" ఈ ముగింపు నిస్సందేహంగా గంభీరంగా లోతు తెలీకుండా, అస్తిమితంగా 'ముఖ్యవిషయం' వలె చేతికి ఒదగకుండా ఉంది. రచయిత పాత్రల్ని 'క్రాస్‌రోడ్సు'కి తీసుకొని వచ్చి నిర్ణయాన్ని పాఠకులకే వదిలేశాడు. ఆఖర్నో మాటలో "మంచిగా ఉండాలంటే గుండెనిబ్బరం అవసరం" అన్న రచయిత మాటలు సమస్యవైపుకు త్రిప్పేవి.

"మాబిడిక్" నవల్లో సమాప్తి దృశ్యంలో "సముద్రం" వలెనే "అల్పజీవి" నవల్లోనూ చివర దృశ్యంలో "సముద్రం" తాత్త్విక స్పర్శతో ప్రతీకాత్మకతను పొందింది. కదలికలోనే ఉంది జీవితం. సమస్యలతో కూడిందీ, ఆనందాన్ని ఇచ్చేదీ. వ్యక్తి చివరకు మనోహరమైన ఆనందంవైపే మొగ్గుచూపుతాడు. ఇది వాస్తవ సహజమైందీ, మానసిక తృప్తికి దారితీసేదీ. నవల్లో చివర స్థితిచిత్రణం ధైర్యానికీ, ఆనందానికీ భూమికగా పర్యవసితమైంది.

సావిత్రి నుండి మనోరమవైపుకు వాలిపోవడం చూస్తే (1) విధి - బాధ్యత (2) తన సంతోషం - సుఖం అనేవాటిలో (Choosing between alternatives) నవల్లో పోనుపోను స్వాభిలాష, స్వప్రయోజనం వైపు మొగ్గు కన్పింపజేసేదిగా ఉంది. సాధారణంగా బలహీనమైన మనస్సు (Weak will) ఈ పని చేస్తుంది. జీవితంలో ఎదురయ్యే అవరోధాలను అధిగమించి, భార్యపట్ల తన విధిని బాధ్యతను చొరవతో యుక్తితో నిర్వహించుకోగల మనశ్శక్తి (Will power) అతనికి లేదు. పరిణతమైన వ్యక్తిత్వం గలవాడెపుడూ తాత్కాలికమైందీ, దగ్గరి ప్రయోజనం కలదీ ఎన్నుకోడు. అతని ఆలోచన భవిష్యత్తుపై ఉంటుంది. తన సుఖమే కాకుండా, తననాశ్రయించిన లేదా సంబంధించిన వారిని గురించీ అభిజ్ఞ ఉంటుంది. సుబ్బయ్యలో ఈ పరిణతమైన వ్యక్తిత్వ స్ఫూర్తి లేదు. అందుకే అల్పజీవి. అయితే మనోరమ ఇతనిలో ధైర్యాన్నీ, వ్యక్తిత్వాన్నీ నిలిపేందుకు ప్రయత్నిస్తుంది. కాబట్టి ఆమె అంటే ఇతనికి మహా ఇష్టం. మనస్తత్వ పరంగా ఇతనిలో ఆధిక్యభావాన్ని నిలిపేందుకు చేసే ప్రయత్నం - ఇతనిలో తృప్తికి కారణమౌతుంది.

నిజమే. ఇది ఇలా ఎందుకు జరిగింది? ఇంతకుముందు వివరించినట్లుగా భయం, న్యూనతాభావంతో ఆత్మప్రత్యయం లేకపోవడమే, అభద్రతా (Insecurity) భావంతో మనస్సు కుంచించుకొని పోయింది. వికాసం పొందలేదు. అయితే ఇతని మనస్సులో పొరల్లో అణిగి మణిగి ఉన్న పురుష సహజమైన స్త్రీవాంఛ సౌందర్యతృష్ణ మనోరమ చొరవతో ఉద్గమించి అగ్రులు చాచింది. ఆమె కనబరచే సానుభూతి మనస్సుకు ఊరటనూ శక్తినీ ప్రసాదించింది.

సుబ్బయ్య పాత్ర ఎలా ఉండాలని కాదు ; ఎలా ఉంది అనే. ఎడ్గర్, "ఆత్మన్యూనతా" (Inferiority Complex) మనస్తత్వ కేంద్రంగా ఎంత ప్రతిభావంతంగా నిర్వహించాడన్నదే ముఖ్యం. వాస్తవగతి రేఖలతో, పాత్ర మనస్తత్వ ప్రధానంగా తీర్చిన సృజనరూపం అల్పజీవి. రాచకొండ నవలల్లో సామాజిక తలంపై ప్రత్యేకంగా మనస్తత్వపరమైన అంశాలకు ప్రాధాన్యం ఉన్న విశిష్టమైన శిల్పఖండం. ఆరంభంలో వాస్తవికతతో, ముగింపులో తాత్త్వికతతో ఉద్వేగం భావుకత నిండిన జీవితంతో దాగిన కోరికలు కేంద్రంగా మానసిక రూపానికి ప్రతిరూపం "అల్పజీవి" నవల.

# 7. తెలుగు నాటకరంగం - నేటిస్థితి

## 1

తెలుగు సాహిత్యంలో మొదటినుండి కవిత్వం, ఇటీవలి నవలా ప్రక్రియల్లో జరిగినంత సృజనాత్మక వ్యాసంగం నాటక ప్రక్రియలో జరుగలేదు. కవిత్వం నవలపై వచ్చేంత సమాలోచనమూ నాటకంపై రాలేదు. సృజన సాహిత్యంతోపాటు దానికి సంబంధించిన సమాలోచనంలో ఎప్పటికపుడు జరిగే చర్చలూ, గోష్ఠులూ, ప్రసంగాలూ, సమావేశాలూ ఆ ప్రక్రియకు ఉత్సాహాన్ని ఇస్తాయి. సజీవమైన వాతావరణానికి దోహదం చేస్తాయి. ముఖ్యంగా కొత్తతరంలో కళాభిరుచిని కలిగిస్తాయి; వివేచనను పెంపొందిస్తాయి. నాటక రచనపైనా, ఆ నాటక ప్రదర్శనం పైన నటీనటుల నటనా సామర్థ్యం గురించీ ప్రదర్శన రీతిని గురించీ ఎప్పటికపుడు సమాలోచనం జరుగుతూ ఉండాలి. చర్చనీయాంశాలు సమాలోచితం కావాలి. భిన్న దృక్పథాలు ప్రజాస్వామ్య దృక్పథంతో ప్రకటితం కావాలి. ఈ స్థితి ఈ ప్రక్రియకు గల ప్రవాహశక్తినీ ప్రజల అభిలాషనూ ప్రమేయాన్నీ అవకాశాన్నీ సూచిస్తుంది. నాటక పరంపరను రక్షిస్తుంది.

ఈనాడు తెలుగునాట నాటక రచన, నాటక ప్రదర్శనకు చెందిన వాతావరణం చెప్పుకోదగ్గ స్థితిలో లేదు. తెలుగులో సాహిత్యారంభం నుండి నాటకానికి గల స్థానం మృగ్యం. వంద సంవత్సరాలకు కాస్త పైన మాత్రమే గుర్తించదగిన చరిత్ర కలిగింది. అంతకు ముందు దీన్ని గురించి ఆలోచన జరుగకపోవడం ఒక లోటే. సుప్రసిద్ధ సంస్కృత నాటకాల్ని కావ్యాలుగా తీర్చడంలో, తెలుగువాళ్ళ మానసిక స్థితీ, సామాజిక గతిలో వాతావరణం నాటకానికనుగుణంగా లేదన్న అంశాన్ని స్పష్టం చేస్తుంది. చాలాకాలం తరువాతగాని ఈ స్థితిలో మార్పు రాలేదు.

మొదట్లో వంద సంవత్సరాలకు పై దశకాల్లో పూనా, బొంబాయి, ఖండువా పట్టణాల నుండి మరాఠీ నాటకాలు (ఝుంఖండి కంపెనీనే) ప్రదర్శింపబడేవి. ప్రజల్నీ ఈ దృశ్యప్రక్రియ ఆకర్షించింది. రంగస్థలాలంకరణం, వేషభాషలు, గ్యాస్‌లైట్లు, పాటలు అద్భుతంగా తోచాయి. ఎంతగానో అలరించాయి. దీని తరువాత తెలుగులో నాటకాలావిర్భవించాయి. ఈ నాటకాల ప్రదర్శన కవసరమైన నాటక సమాజాలు వెలుగులోకి వచ్చాయి. వృత్తి నాటక సమాజం, ఔత్సాహిక నాటక సమాజం ఈ మధ్య కేవలం వ్యాపార దృష్టితో కాంట్రాక్టు పద్ధతులు తమ ప్రభావాన్ని నెరపాయి. పోను పోను వ్యాపార దృష్టీ, స్వార్థగుణం ప్రబలింది. క్రమశిక్షణ లోపించింది. నాటక ప్రదర్శనకు

క్షతి కలిగింది. క్రమంగా పూర్వౌన్నత్యాన్ని కోల్పోయింది. అయినప్పటికీ వృత్తి కళాకారులవల్ల, ఔత్సాహిక శక్తులవల్ల నాటక వాతావరణం నాటక కళ ఇంకా బ్రతికే ఉందనిపించే విధంగా కార్యక్రమాలు నిర్వహింపబడుతున్నాయి.

రంగస్థలాన్ని మరపించే సినిమా రాకతో నాటక ప్రదర్శనం వెనుక పట్టింది. ఆ మధ్య రేడియో ఇటీవల టెలివిజన్‌తో ఈ మార్పు వేగంగా స్ఫుటంగా కన్పిస్తూంది. సమాజంలో కాలాన్నిబట్టి సాంఘిక రాజకీయ కారణాలవల్ల కొన్ని మార్పులు అనివార్యంగా వస్తాయి. అంతమాత్రాన కళారూపాలు అదృశ్యం కావు; కాకూడదు. అవసరమైన కొత్తదనంతో రావలసిన మార్పులతో ఈ కళారూపాల పరంపర కొనసాగడం న్యాయం. ఒక్కొక్క కాలంలో ఒక ప్రక్రియకు సంబంధించిన సాంస్కృతిక రూపం ఉజ్వలంగా ప్రకాశిస్తుంది. ఇటువంటిదే వంద సంవత్సరాలపైగా వెలిగిన తెలుగు నాటక ప్రపంచం. ఇది అదృశ్యం మాత్రం కాదు. పూర్వవైభవం చరిత్రలో నిలుస్తుంది. వర్తమానంలో కొత్త కొత్త రుచులతో విలసించవలసి ఉంది.

నాటక రచన వేరు ; రంగస్థలంపై ప్రదర్శనలో అనుభవంతో సన్నివేశ యోజనం, పాత్రల ప్రవేశ నిష్క్రమణం, వాచికం, అభినయం మొదలుగా ప్రయోగ కళ వేరు, సినిమాలో వీటిని సాధించే పద్ధతీ, ఆ రంగంలో అనుసరించే క్రమమూ వేరు. సినిమాలో ఉండే ఆకర్షణ, ప్రభావోపేతమైన దృశ్య చిత్రణం నాటక ప్రదర్శనలో తీసుకొని రావడం కష్టమైన పనే ఐనా దీని ప్రత్యేకత దీనిదే. ఈ రెండు కళారూపాల తీరు తెన్నులు వేరు. యోజన నిర్వహణ పద్ధతి వేరు. అందుచేత రెండింటిని పోల్చి అది గొప్ప అని వితర్కించడం సముచితం కాదు. నాటకం ప్రత్యక్షమైన అనుభవం కలిగి నిర్దుష్టమైన నిర్మాణక్రమంతో సద్యః ప్రకాశమాన నటనావకాశం కలిగింది. నాటకం పూర్వస్థితిని నిలపడాని కిప్పుడున్న పరిస్థితులు సరిపోవు. ఉన్నదానిపై దీని అభివృద్ధి సాధించడానికెంతో యోజన, కృషి అవసరం. సినిమా వచ్చినా టీ.వి. ప్రబలినా మానవశక్తిని నటనాభిముఖంగా సజీవంగా ఉన్మీలితం చేసే ప్రతిభావంతమైన నాటకకళ తన ప్రత్యేకతను కాపాడుకుంటూ విశ్వ సంస్కృతిలో భాగమైంది. వాస్తవ సదృశమైన (Verisimilitude) జీవవంతమైన మౌలికమైన అభినయ రూపాన్ని నిలుపుకోవలసిందే. ఇది అంకితభావం చిత్తశుద్ధి గల భవిష్యత్తు యువతరంలో వచ్చే సాంస్కృతికమైన క్రియాశీల పాత్రవల్లనే సాధ్యం.

## 2

నాటక కళ చాలా ప్రాచీనమైందీ. నటనలో భావస్పందనతో అనుభవాత్మక మైందీ. ఆనందం ఆలోచనతో పాటు ప్రయోజన గుణంతో ప్రవర్తితమైందీ. ఉత్తమ నాటకంలో గుణాత్మకతను నిలపడం కోసం ఉత్తమస్థాయిలో ప్రదర్శనమూ అవసరం. రచనతో పాటు ప్రదర్శనకూ ప్రాధాన్యం కలిగిన ప్రక్రియ కావడంచేత కవిత్వం నవల మొదలైన ఇతర ప్రక్రియల కన్నా నాటక ప్రక్రియ ప్రత్యేకమైన స్థానాన్ని పొందింది. సహజమైన జీవిత వాస్తవంతో కాల్పనికస్పర్శతో రమ్యమైందిగా కీర్తింపబడింది. ఈ రమ్యత రచనాశిల్పంతోపాటు ప్రదర్శనకళ పైనా ఆధారపడింది. రంగస్థలంపై ప్రదర్శనం నటీనటుల నటనా వైభవం రంగస్థలాలంకరణం ఆహార్య వేష భూషాదులూ వాద్య సంగీతం కాంతి ప్రసారం ధ్వని ముద్రణం సంభాషణ విధం మొదలుగా సామాజికుల్ని కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్ళుతుంది. ఇది అనుభవైక వేద్యం. ఆలోచనా రమణీయం.

నాటకం ముఖ్యంగా క్రమ బంధురమైన వాచికాభినయ కళారూపం. అభినయంలో నటన, వాచికంలో సంభాషణ అంతర్భవిస్తాయి. ఇతివృత్తం అంకాలుగా, అంకాలు సన్నివేశాలుగా విభజింపబడి ప్రణాళికలో సంఘటనల క్రమంలో రూపొందుతుంది. పాత్ర చర్య ప్రతిచర్యచేత గతిశీలాన్ని కలిగి మొత్తం మీద కళ్ళముందు జీవితాన్ని తలపింపజేస్తుంది. నటన దీనికంతటికి ఆధారసూత్రం. నటనలేంది ప్రదర్శన లేదు. ప్రదర్శనలో నటన ప్రధాన భూమికను వహిస్తుంది. నటనచేతనే ప్రదర్శనకందమూ సామాజికులకానందమూ. ఇందులో అంతర్భాగమైన వాచికం శబ్దోచ్చారణకూ, వాక్యవిన్యాస వైలక్షణ్యానికి సంబంధించింది. ఇది పాత్ర కనుగుణంగా రూపొందుతుంది. ఇది ప్రయోక్త అధీనం. పాత్ర అనగానే వ్యక్తి స్వభావం, సామాజికమైన సంబంధం, అనుభవగుణం చర్యాక్రమం కొన్ని పరిమితుల్లో మనస్సులో మెదలుతాయి. ఈ పరిమితులే పాత్ర వ్యక్తిత్వానికి సీమాంచలాన్ని సంతరింప జేస్తాయి. ప్రదర్శనలో ఈ రేఖలు చరమస్థితి నందుకోవడమనేది నటీనటుల ప్రతిభా సామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది. ఈ ప్రపంచం జీవితంలోని "నానావస్థాంత రాత్మకత"ను భావింపజేస్తూ నాటకం యొక్క లోకవృత్తానుకరణత్వాన్నీ భాసింపజేస్తుంది. దీనిచేత నాటకం నానాభావోపపన్నమైందనీ రసావిష్కారకమైందనీ ఆలంకారిక మర్యాదకాస్థానమౌతూంది. జీవితం అనగానే లోకవృత్తం తలపుకు రాగానే వ్యక్తుల ప్రమేయంతో మానవీయ సంబంధాలతో ఏర్పడిన సమాజం జ్ఞప్తికి వస్తుంది. వీటిని అనుసరించి ఇతివృత్త నిర్మాణం పాత్రచిత్రణం జరిగి నాటకం ఈ సృష్టికి ప్రతిసృష్టి పునస్సృష్టి అనుసృష్టి అన్న అభిప్రాయానికాధారమౌతుంది.

ఇందులో వైయక్తిక సామాజిక తలాలు దేనికది విడివిడిగా కాక పరస్పరం అనుబంధం కలవిగా రూపొందుతాయి. నాటక లక్ష్యంలో ఈ అంశాన్ని స్పష్టంగా గుర్తించవచ్చు. చారిత్రకమైనా పౌరాణికమైనా సామాజికమైనా ఏదయినా జీవితం చేతనే పుష్టమవుతుంది.

3

నాటకంలో కథాగతంగా వ్యక్తీ సమాజం సంబంధాల్లో విషమత్వం వల్ల విచ్ఛిన్నత్వం వల్ల సమస్య ఉత్పన్నమౌతుంది. వ్యక్తిలో భావఘర్షణవల్ల సమాజంలో విభిన్న వ్యక్తుల సంఘర్షణ వల్ల వ్యక్తుల్లో సమస్య ఉత్పన్నమౌతుంది. దీనికి పరిష్కారమూ అన్వేషితమౌతుంది. నాటకంలో కళాసృష్టే ఆనందం అనే అంశంతో పాటు, సామాజికతకూ ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రాముఖ్యం ఉంది. పరిష్కార రూపం రచయిత అభిప్రాయానుగుణంగా సిద్ధాంతంగా ఆదర్శంగా పరిణమిస్తుంది. సాంఘిక నాటకాల్లో ఈ అంశం స్ఫుటంగా మన దృష్టికి వస్తుంది. నాటకంలో కళా సౌందర్యాని కెక్కువ విలువ ఉన్న వాటిలో సందేశం సూచనగా ఉంటుంది. ప్రయోజన తత్పరత కెక్కువ ప్రాముఖ్యం ఉన్న వాటిలో సందేశం / ఉపదేశం వ్యక్తంగా ఉంటుంది. రచయిత అవలంబించే శిల్పదృష్టిని బట్టి దీని ఆవిష్కారం ఉంటుంది. సమస్య లేని జీవితానికీ, పరిష్కారం లేని సమస్యకూ, ప్రయోజనం లేని ప్రవర్తనకూ సిద్ధాంతం లేదా ఆదర్శనం లేని లక్ష్యానికీ నాటకంలో శక్తిమంతమైన స్థానం ఇవ్వడం కుదరదు. ఇటీవలి ఆధునిక నాటకాల్లో ఏది చెడు? ఏది మంచి? అన్న అభిప్రాయాన్ని సామాజికులకు వదిలేసి శిల్పానికీ కళకూ ప్రాధాన్యం గల ధోరణి అవలంబింపబడుతూంది. ఐనప్పటికీ ఈ మంచీ చెడూ అనేవి నాటకంలో కొన్ని క్రమ సహితమైన దశలనుండి అనివార్యంగా ప్రయాణించవలసి ఉంటుంది.

నాటకం జీవిత వాస్తవానికి ప్రతిరూపమో ప్రతిబింబమో విశ్లేషణమో వ్యాఖ్యానమో అనిపించే సృజన కళా రూపం. అయితే బాధ్యతాయుతమైన రచయిత చేత దీనికొక లక్ష్యం నిర్దిష్టం కావడం సహజం. పాత్రలూ జీవితంలో వలెనే అనుకోని పరిస్థితులెదురై మంచి చెడూ, శక్తీ బలహీనతలతో ప్రవర్తమానమౌతాయి. కాబట్టి రచయిత ఆశించే ప్రయోజనాన్ని అనుసరించి వ్యక్తిపరమైన నీతీ, సామాజికమైన ఆదర్శం, సిద్ధాంతపరమైన దిశ ఏర్పడతాయి. ఇది కొన్ని సందర్భాల్లో బలంగా అభివ్యక్తమౌతుంది. మార్పును కోరే నిబద్ధత చేతనూ ఆధిక్యం స్ఫుటమవుతుంది. అయితే ఆవేశాత్మకమైన కళాత్వానికీ ఆలోచనాత్మకమైన ఆదర్శానికీ లేదా సిద్ధాంతానికీ మధ్య సమన్వయం సాధించడంలోనే నాటకం ఔన్నత్యం ఆధారపడి ఉంటుందన్న మాట స్పష్టం. మానవ

స్వభావం, పరస్పర సంబంధాలూ, అనుభవ స్థితులూ మానసిక రీతులూ కారణంగా వివిధ శక్తుల సంఘర్షణ సముత్పన్నమై నాటకీయకత సిద్ధిస్తుంది. దీన్ని గురించి ఆలోచన కారణంగా పరిష్కారమార్గాలు కన్పిస్తాయి. మొదటిది నాటక కళాపరమైందీ, రెండోది నాటక ప్రయోజనం లేదా ప్రతిపాదిత సిద్ధాంతం లేదా ఆదర్శపరమైందీ.

**4**

నాటకం జీవిత తత్త్వం భూమికగా గల సాహిత్య నాట్య సంగీతాల సమన్వయ కళారూపం. దీని పరిధి విస్తృతమైంది. ఇందుచేత నాటక రచయితకూ ముఖ్యంగా ప్రయోక్తకూ సాహిత్యంతో పాటు నాట్య సంగీత పరిజ్ఞానం అవసరమౌతుంది. సాంఘిక నాటకాలకు సంగీత జ్ఞానంతో అంత అవసరం ఉండకపోవచ్చు కాని మొత్తం మీద నాటక ప్రదర్శనకు దీని అవసరం తప్పనిసరి ఐంది. ఏ నాటకమైనా ప్రయోక్త విజ్ఞాన స్థాయి అనుభవ విస్తృతి నిర్వహణ శక్తి విజయవంతంగా ప్రదర్శితం కావడానికి ఎంతగానో ఉపకరిస్తాయి.

నాటకం అనగానే రచనతో పాటు దృశ్యగుణంతో ప్రదర్శన రూపం మనస్సులో రూపు కడుతుంది. అదే నాటక రంగం లేదా నాటకశాలగా సామాజికులతో ఏర్పడింది. నాటకం ప్రదర్శించడానికి ముందు అత్యవసరమైంది నాటక శాలా నిర్మాణం. దీన్ని ఉపయోగించుకొని కనీసస్థాయిలో అవసరమైన సాధనలతో సంపన్నంచేసిగాని ప్రయోక్త నాటక ప్రదర్శనకుపక్రమించడు. ఇది సామాన్యంగా అయ్యే పని కాదు. ఎంతో పెట్టుబడి అవసరం. అందరితో అయ్యే పనీ కాదు. ఎవరో కొందరికే సాధ్యం. అటు నాటకరంగ పరిజ్ఞానం ఇటు నిర్వహణ దక్షత కావాలి. నటీనటుల్ని క్రమశిక్షణలో పర్యవేక్షించాలి. ఈ అంశాలన్నీ వ్యవస్థీకృతం కావాలి. వ్యక్తిగతంగా ఎవరికి వారు గొప్పవారు కావచ్చు. అందరూ ఒకచోట చేరి ఒక కార్యాన్ని తలపెట్టినపుడు ఏకోన్ముఖులు కావాలి. అయితే వ్యక్తిగతమైన ప్రతిభా సామర్థ్యాల కవసరమైన చోట ప్రకాశమానమయ్యే అవకాశమూ అవసరమే. తెలుగు నాటకరంగంలో పోను పోను వ్యక్తిగతమైన ప్రశస్తీ, ప్రయోజనాపేక్ష చేత కాంట్రాక్టు నాటక పద్ధతి ప్రవేశించింది. ఇది నాటక వ్యవస్థను దెబ్బతీసిందనే చెప్పాలి. క్రమశిక్షణ లోపించింది. అడ్డదారి త్రొక్కింది. సాధారణ తలంపై నీతి నియమస్థాయి చెదిరింది. అందువల్ల ఇటువంటి స్థితి రాకుండా ఏదో ఒక పద్ధతిలో వ్యవస్థీకృతం అవాలి. ఒక పరంపర పాటించాలి. దీన్ని మన్నించే మానసికమైన స్థాయి, గుణ మర్యాద అవసరం. తెలుగు నాటకరంగంలో ఒక దశలో కాంట్రాక్టు నాటక సమాజాలు ఆధిక్యం నెరపడంతో దుస్థితి వాటిల్లింది.

## 5

స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్యంలో అవకాశాల్నిబట్టీ వచ్చే మార్పుల కనుగుణంగా తెలుగులో నాటకరంగం రూపు దిద్దుకోలేదు. తొలిదశలో సంస్కృత నాటక మర్యాదలతో ఆ తరువాత పాశ్చాత్య నాటక ప్రభావంతో ఎంతో వైవిధ్యంతో బహు త్వరలో వికాస రూపాన్ని పొందిన తెలుగు నాటకం ఒక్క మారు తెర మరుగునబడినట్లైంది. శూన్యస్థితి ఏర్పడింది. దీన్ని విశ్లేషిస్తే లోపం – ఒకటి సామాజికం. రెండోది సాంకేతికంగా కన్పిస్తుంది. సామాజికమైన మార్పుల కనుగుణంగా నాటకంలో పరివర్తన రాకపోవడం ఒకటైతే, సాంకేతికంగా ఆధునికతను పొందకపోవడం మరొకటీ. ఇది అట్లా ఉంచి ప్రేక్షక సమాజపరంగా చూస్తే అభిలాషతో పాటు సమయమూ దొరకడం లేదు. పూర్వం చిత్రనళీయం, గయోపాఖ్యానం, కురుక్షేత్రం, రాధాకృష్ణ, పాండోద్యోగ విజయాలు, ప్రతాపరుద్రీయం మొదలైన నాటకాలు రాత్రి తొమ్మిదిగంటల ప్రాంతంలో మొదలైతే తెల్లవారుఝాముదాకా ఆడేవారని చెబుతారు. ఈ కాలంలో ఆ ఓపిక, ఆ తీరిక, ఆ కోరిక కన్పించదు. పాతతరానికీ కొత్తతరానికీ మధ్య ఆలోచనలో అవసరాల్లో అవకాశాల్లో సవమవినియోగాల్లో స్పందన పద్ధతిలో ఏర్పడిన అంతరం ఒక కారణం. నాటక రచనలో, ప్రదర్శనలో కాలానుగుణమైన పరివర్తన వస్తూంది. ఆ తరువాత వచ్చిన సాంఘిక నాటకాల్లో ఇది స్పష్టం. పైన పేర్కొన్న నాటకాలన్నీ కళాత్మకమైన విలువలతో నాటక చరిత్రలో సగౌరవంగా నిలిచినవే. ఈ స్థాయిలో సాంఘికనాటకాలు, వాటిని వేసి, మెప్పించగల నటీనటులు రంగస్థలంపై అవతరించవలసి ఉంది. ఈ దిశలో కన్యాశుల్కం వచ్చింది. "మాభూమి" మొదలైన నాటకాలు ఎంతో ప్రచారాన్ని పొందాయి. కొత్త వాతావరణం వినిర్మిత మౌతూన్నట్లనిపించింది. కన్యాశుల్కం ఎప్పటిది? ఐనా ఇటీవలదే అనిపించేంతటి నవ్యతను కలిగింది. ఏమైనప్పటికీ స్వాతంత్ర్యానంతరం ఆశించినంతగా నాటకం పురోగమనం పొందలేదు. దీనికెన్నో కారణాలు చెబుతారు. ఆర్థికమైన ప్రోత్సాహం, రంగస్థలం – సాంకేతిక ప్రగతి – నాయకత్వం, ప్రజల్లో అభిలాష, మంచి నాటకం మొదలైనవి లోపించడం వంటివి ఎన్నో దృష్టికి వస్తాయి. ఇవేవీ మానవ సంకల్పానికీ శక్తికీ ప్రయత్నానికీ అసాధ్యాలేమీ కావు.

ఏవో నాటకాలు మధ్య మధ్య వస్తున్నాయి. పౌరాణిక చారిత్రక సాంఘిక కథా వస్తువులతో కొంత సాంకేతికమైన విలువలతో వస్తూన్నమాట నిజమే. సాహిత్య పరంగా ఉన్నతమైన ప్రమాణంలో లేకపోవడం కూడా ఉంది. ఇంకా ప్రదర్శన యోగ్యత కలవి కాకపోవడమూ ఉంది. వీటిని సరిచేసి, మార్చి ప్రదర్శనకు యోగ్యంగా

మలచుకోవలసి ఉంటుంది. అదొక పని! దీనికి కారణం రచయితకు ప్రదర్శన విభాగంతో సంబంధం లేకపోవడమో, పరిజ్ఞానం లోపించడమో! మరికొన్ని కేవలం ప్రదర్శనను దృష్టిలో పెట్టుకొని వస్తున్నాయి. ఇవి సాహిత్యపరమైన విలువల్లో ప్రమాణాలనందుకోలేకపోవడం కన్పిస్తుంది. ఈ స్థితినుండి ఉత్తమ నాటకం, ప్రదర్శన యోగ్యమైన కళారూపం ఆవిర్భవిస్తుందన్న ఆశతో ఎదురుచూడడం ఒక్కటే మనం చేయగలిగింది!

ఇక నటన విషయానికి వస్తే మంచి నటన చూడగలుగుతున్నామా? అని ప్రశ్న! స్థానం, బందా, బళ్ళారి, ఇత్యాదుల నటనా స్థాయికి చేరువలో ఐనా నటన ప్రదర్శితమౌతుందా? ఆధునిక కాలంలో ప్రతిభ, స్థిర సంకల్పం ఉంటే దీన్ని సాధించేం దుకు, పెంపొందించేందుకెన్నో అవకాశాలున్నాయి. జాతాయాంతర్జాతీయ స్థాయిలో ఎంతో సాహిత్యం లభ్యమవుతుంది. ఎంతో ప్రదర్శనాత్మక సమాచారమూ లభిస్తుంది. శిక్షణా సంస్థలూ వెలిసాయి. ఈ మార్గంలో కృషిచేసిన వ్యక్తులతో పరిచయానికీ విషయ సేకరణకూ మెరుగులు దిద్దుకోవడానికి అవకాశాలున్నాయి. అయినప్పటికి తెలుగు నాటక ప్రపంచంలో స్తబ్ధత ఏర్పడే ఉంది. దీనికి కారణం సాధారణ ప్రజల్లో అట్లా ఉంచి సంస్కారం గల విద్యావంతుల్లోనూ నాటక కళకు సంబంధించిన వాతావరణం – అభిరుచీ నిర్మితం కావడంలేదు. చిత్తశుద్ధితో అంకితభావంతో పనిచేసే నటీనటులు కరువైనారు. ఆర్థికంగా చూస్తే జీవితావసరాలకే రాబడి సరిపోయేట్టు లేదు. ఔత్సాహిక సమాజంలో ఎవరన్నా ఉంటే వాళ్ళు కాస్త అనుభవంతో అవకాశం వస్తే చాలు సినిమాలోకి ఎగిరి గంతేస్తున్నారు. దాని ఆకర్షణ కీర్తి కాస్తో కూస్తో రాబడి నాటకం కన్నా ఎన్నో రెట్లు మేలుగా కన్పిస్తోంది. నాటక సమాజాలు సినిమాలోకి ప్రవేశించడానికి శిక్షణ స్థానాలుగానూ రూపొందుతున్నాయి. పూర్వపు రోజుల్లో ఉన్న సమస్యలీనాడు లేవు. ఈనాటి సమస్యలు వేరు, పూర్వపు వాటితో ఏ విధంగా పోల్చి చూచినా ఇవి అధిగమించ రానివేమీ కాదు.

ఉదాహరణకు నటి విషయానికి వస్తే నాటకంలో పాత్ర ధరించడానికి స్త్రీలు ముందుకు వచ్చేవారు కాదు. స్త్రీ పాత్రలైనా పురుషులే ధరించేవారు. కొందరు దీన్ని వ్యతిరేకించడమూ జరిగింది. ఔత్సాహిక నాటక బృందాలు స్త్రీ పాత్ర లేని నాటకాలు వేయడం, ప్రోత్సహించడం జరిగింది. స్త్రీ పాత్రలేని నాటకాల్ని కోరే ప్రకటనలూ వెలువడేవి. ఇప్పుడిటువంటి హాస్యాస్పదమైన స్థితి లేదు. ఇప్పుడు విద్యావంతులూ ఎక్కువైనారు. స్త్రీలలో సంస్కరణ దృక్పథం, పురోగమనాన్ని కోరే మనస్తత్వం ఎంతో

అలవడింది. సాధారణ విషయపరిజ్ఞానమూ పెరిగింది. ఏ పని చేయడానికైనా, దానిలో పరిపూర్ణత సాధించడానికి స్త్రీ పురుష భేదం లేకుండా అవకాశాలు ఎక్కువైనాయి. మానవ సంబంధాలూ పెరిగాయి. ఈ పరిస్థితులు నాటకకళకెంతో ఉపయోగించేవి.

నాటకం భవిష్యత్తుపై దృష్టితో వర్తమానంలో కొన్ని నిర్దిష్టమైన చర్యలు తీసుకోవలసి ఉంది. మొదట యువతరంలో నాటకకళకు సంబంధించిన వాతావరణాన్ని సృజించాలి. వీళ్ళకు విద్యలో ఉద్యోగావకాశాల్లో పోటీ మధ్య కుటుంబం నుండి వేరుచేసే పరిస్థితుల్లో భౌతిక మానసికమైన ఒత్తిడులూ కలిగిన కారణంగా కాలం, ధనం, శ్రద్ధ వెచ్చించవలసి ఉన్న నాటకం అందుబాటులో ఉండకపోవచ్చు, ఆకర్షణీయం కాకపోవచ్చు. తక్కువ ఖర్చుతో సంపన్నమయ్యే సినిమాతోనో, ఏ టి.వి. ముందో కాలక్షేపంతోనో సరిపోతుంది. ఎందరి సహాయ సహకారాలో ఉంటే తప్ప ప్రదర్శనకు సాహసింపజాలని నాటకకళ గురించి ఆలోచనకే వీల్లేని స్థితి ఏర్పడింది.

పూర్వం చాలా తక్కువ సంఖ్యలో ఉన్నా విద్యా సంస్థల్లో ముఖ్యంగా కళాశాల స్థాయిలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగేవి. వీటిలో నాటకప్రదర్శనం ముఖ్యమైన భాగంగా ఉండేది. విద్యార్థిదశలోని ఈ వాతావరణం ఆ తరువాత దశలో బాగా ఉపకరించేది. దాని ప్రభావముద్ర నాటకం పట్ల ఉత్సాహాన్ని కలిగించేది. అభిలాషను పెంపొందించేదీ. ఏదో ఉద్యోగ వృత్తిలో ఉంటూ, తమకున్న కొద్దిపాటి విరామ సమయాల్లో పరిమితమైన ఆర్థిక శక్తితో పనుల ఒత్తిడిలోనో నాటకకళపై అభిమానంచేత నాటకాభివృద్ధి కుపక్రమించేవారు. దీని నుండి ఆవిర్భవించిందే ఔత్సాహిక నాటక సమాజం. వివిధ సందర్భాల్ని పురస్కరించుకొని పోటీలు జరిగేవి. వివిధ సంస్థల నుండి, వ్యక్తుల నుండి చేయూత లభించేది. ఈ ఉత్సాహమే నాటక రంగాన్ని కొంతకాలం సజీవంగా నిలిపింది. ఇందులో ప్రశస్తికెక్కినవారు అనుభవం బాగా గడించినవారూ వృత్తి కళాకారులుగా స్థిరపడ్డారు. మరికొందరు అవకాశం వచ్చి సినిమా రంగానికి వెళ్లారు. తెలుగు నాటకచరిత్రలో ఈ దశను విస్మరించడానికి వీల్లేదు. ఔత్సాహికుల చిత్తశుద్ధీ అంకితభావం కృషీ మనల్ని ఆకర్షిస్తుంది. దీనికీ కొన్ని పరిమితులున్నాయి. ఆ పరిమితులే కలిసిరాని సమయంలో బలహీన స్థానాలుగా పరిణమించాయి. ఏవో ఉద్యోగాల్లో వ్యాపకాల్లో ఉండడంవల్ల నాటక కళపై దృష్టి కేంద్రీకరించలేకపోయేవారు. ఏదో లభించిన సమయంలో ప్రాక్టీస్ చేసేవారు. పోనుపోను శ్రద్ధ తగ్గిపోవడం సహజం. ఉద్యోగాల్లో బదిలీలు కుటుంబ బాధ్యతలు పెరగడం యౌవనదశలో ఉన్న ఉత్సాహం తగ్గిపోవడం మొదలైనవి కార్యక్రమాలకు అంతరాయంగా పరిణమించాయి. కార్యకలాపాలకు భంగం

వాటిల్లింది. రాబడి తక్కువై పెట్టుబడి పెరిగింది. ధనసేకరణ సమస్య ఐంది. ఇవన్ని ఇట్లా ఉంచి అన్నింటినీ కలిపి వ్యవస్థాపరమైన నిర్వహణం సమస్య ఐంది. వచ్చే మార్పుల్ని ఎప్పటికపుడు పరిశీలించి అనివార్యమైనవి అంగీకరించి అంతర్భవింపజేసుకొని ముందుకుపోయే పరిస్థితి మృగ్యమైంది. ఈ కారణాలవల్ల ఔత్సాహికుల కార్యక్రమానికి క్షతి ఏర్పడింది, స్తబ్ధత ఆవహించింది.

## 6

తెలుగు నాటకానికి గడచిన వంద సంవత్సరాలపై జరిగిన కాలం చరిత్రలో చెప్పుకోదగిందేమీ కాదు. అటు సంస్కృతం నుండి ప్రాచ్యనాటకం, ఇటు ఇంగ్లీషు ద్వారా పాశ్చాత్య నాటకం – పొందిన అభివృద్ధి రూపం అందుబాటులో ఉండడంవల్ల తెలుగులో స్వతంత్ర నాటకం ఆరంభం నుండే ఉన్నత ప్రమాణాల్లో ఆవిర్భవించిందీ, రంగస్థలంపై రాణించింది. కొన్ని దశాబ్దాల క్రితం నాటకాల కోలాహలంతో ప్రతిధ్వనితమైన నాటకరంగం నేడు నిశ్శబ్దంగా ఉంది. తరం తరువాత తరం ఎన్నో విషయాల్లో భేదించడం సహజం. పైగా వేగంగా అభివృద్ధి ముఖంలో ఉన్న సమాజంలో ఈ అంతరం ఎక్కువగా ఉంటుంది. ఈ దృష్టితో నాటకకళాభివృద్ధికి ఆధునిక పద్ధతుల్లో సరియైన శిక్షణ సంస్థ అవసరం. ఇందులో సిద్ధాంత విభాగంతో పాటు ప్రయోగ విభాగమూ, ప్రదర్శనకు సంబంధించిందీ, పరిశోధనా విభాగమూ ఏర్పడాలి. ఈ మూడు స్థాయిల్లో స్వల్పకాలికమైన దీర్ఘకాలికమైన యోజనతో కార్యక్రమాల్ని చేపట్టవలసి ఉంటుంది. ఈ సంస్థను ప్రభుత్వం స్థాపిస్తే మంచిది. లేదా ఉదారులైన వ్యక్తుల పోషణలో కళాపోషకుల సహాయంతో స్వచ్ఛందమైన రూపం వహించినా సరే. జాతీయ రాష్ట్ర స్థాయిలో విద్యా విధానంలో నాటకకళకు సంబంధించిన విభాగాలను విశ్వవిద్యాలయాల్లో నెలకొల్పవలసి ఉంది. ఇవి ప్రధానసంస్థలో పాలనా విభాగంలో ఒకటిగానో లేదా అవసరమనుకున్న చోట్ల స్వతంత్ర ప్రతిపత్తి కలవిగానో ఏర్పడాలి. సంస్కృతీ సంపదలో భాగమైన నాటక రంగానికీ విధానం ఎంతో మేలు చేస్తుందనడంలో సందేహం లేదు.

ఇటీవల కొన్ని విశ్వవిద్యాలయాల్లో ప్రత్యేక శాఖలు వెలసి సమాజంలో నాటక రంగం గురించి ఉత్తమ స్థితికి కృషి చేస్తున్నాయి. బోధనతో పాటు ప్రయోగ విధానం ఉంటే సరిపోదు. మంచి గ్రంథాలయం, పరిశోధన కవసరమైన అవకాశం, నాటక కళకు చెందిన పూర్వ సంపదను ఒకచోట చేర్చి భద్రపరచే నిలయాలు సమాచార కేంద్రాలు ఏర్పడాలి. ప్రపంచస్థాయిలో వచ్చే సమాచారం ఎప్పటికపుడు క్రోడీకృతమై

అంతర్జాతీయ లక్షణాల్ని పొందడంతో ప్రజల్లో విశాల భావనకు అవకాశమేర్పడుతుంది. నవ్యతనూ వైవిధ్యాన్నీ మార్పునూ కోరే మానవ మనస్తత్వానికి తృప్తి కలుగుతుంది. లక్ష్యం సులభంగా గుర్తింపబడుతుంది, విస్తృతమవుతుంది.

ప్రతీ ప్రక్రియలో ఒక్కొక్క దశలో కొత్త కొత్త పద్ధతులు ప్రవేశించడం సహజం. వీటిని విలీనం చేసుకొని ముందుకుపక్రమించడమనేది చారిత్రక సత్యం. దురదృష్టవశాత్తు మొదటి నుండీ తెలుగువాళ్ళకు తమదైన రాజధాని లేకపోవడం ఒక లోపమే. ఆంధ్రులు చాలాకాలం ఉమ్మడి రాజధాని మద్రాసు కేంద్రంగా సాంస్కృతిక తేజాన్ని పొందారు. మరోవైపు హైదరాబాదు రాజధాని కేంద్రంగా బహుభాషా భాషీయ సంస్కృతీ సంగమంతో, కొంత ప్రత్యేక వాతావరణాన్ని సంతరించుకుంది. ఇది ముఖ్యంగా హిందీ, ఉర్దూ, కన్నడ, మహారాష్ట్ర, తెలుగు సంస్కృతీ ప్రభావాలతో సంకలితమైంది. ఆంధ్రరాష్ట్రం ఏర్పడ్డాక కర్నూలు రాజధాని ఐంది. ఆ పట్టణం తెలుగువాళ్ళ సాంస్కృతికరేఖలు దిద్దుకోకముందే ఆంధ్రప్రదేశ్ అవతరించి హైదరాబాదు రాజధాని అయింది. ఈ నగరంలో అనేక చారిత్రక కారణాలవల్ల తెలుగు నాటక రంగానికి అవసరమైన సుస్థితి లేదు. ఇపుడిపుడే కొత్త వాతావరణం ఊపునందుకుంటూంది. విజయవాడ, బందరు, రాజమండ్రి, విశాఖపట్నం మొదలైన పట్టణాలు సంస్కృతీ స్థానాలుగా ఉన్నా, రాజధాని కావడంవల్ల ప్రదేశానికి ఏర్పడే గౌరవ స్థితీ అవకాశాలూ వేరు. ఈ విధమైన సామాజిక చారిత్రక కారణాలవల్ల తెలుగు నాటకరంగం వంద సంవత్సరాలు పొందిన ఔజ్వల్యం స్థిరత్వాన్ని పొందకపోగా, బలమైన పరంపర కూడా నెలకొనలేదు. దీన్ని సాధించడం అసాధ్యమేమీ కాదు. యువతరంలో చిత్తశుద్ధి, అంకితభావం, సత్సంకల్పంతో అనుభవజ్ఞుల/ విజ్ఞుల ఉదారతతో క్రియాశీలంతో ప్రభుత్వ ప్రోత్సాహ విధానంతోపాటు ప్రజల అభిలాషాతత్పరత – అన్నిటికన్నా ముఖ్యమైంది. దీనికితోడు నటీనటుల్లో క్రమశిక్షణతోనూ, పురోగమన తత్పరతతోనూ నాటకరంగాని కభినవ రూపాన్ని ఆవిష్కరింపజేయవచ్చు.

ఉదాత్తమైన విలువల పట్ల అభిలాషతో ఉన్నతమైన ప్రమాణాలపట్ల అభిరుచితో, క్లాజికల్ దృష్టి బాగా ఉన్న సమాజంలోనే నాటకం విలసిస్తుంది, వికసిస్తుంది. జాతి/ దేశంలోని గొప్ప సాంస్కృతిక కళా తేజానికి ఉత్తమ చిహ్నం నాటకం.

సాహిత్య సమాలోచనం Literary Criticism

**సమాలోచనం 1**

# స్వేచ్ఛా కవిత్వం

మాదిరాజు రంగారావు

**2026**

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

Literary Criticism

# SAMALOCHANAM - 1
# SWECCHAA KAVITVAM

(Sahithya Samalochanam)

by

Prof. Madiraju Ranga Rao

© : Dr. M. Santhosh Kumar

First Edition : 1992
Second Edition : 2003
Third Edtion : 2011
Fourth Edtion : 2026

సమాలోచనం-1

# స్వేచ్ఛా కవిత్వం

## అంకితం

ఉదార ప్రజా స్వామ్య మనస్వి

రచయిత

**మాన్యశ్రీ పి.వి. నరసింహారావు గారికి**

# సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | స్వేచ్ఛా కవిత్వం - పరిచయం | .......... | 7 |
| 2. | ప్రజాస్వామ్య కవిత్వం | .......... | 14 |
| 3. | కవిత్వమూ - సృజనశక్తీ | .......... | 18 |
| 4. | కవిత్వమూ - అనుభవమూ | .......... | 22 |
| 5. | స్వేచ్ఛా కవిత్వం - ఆధునిక పరిణామం | .......... | 28 |
| 6. | ఆధునిక కవిత్వంలో వస్తురేఖలు | .......... | 32 |
| 7. | స్వేచ్ఛా కవిత్వం - కొన్ని సమస్యలు | .......... | 34 |
| 8. | ప్రజాస్వామ్య కవిత్వం | .......... | 41 |
| 9. | స్వేచ్ఛాకవిత్వం - ఆధునికత | .......... | 45 |
| 10. | మానవతా వాదం - అవసరం | .......... | 48 |
| 11. | వర్తమాన కవిత్వం - స్వేచ్ఛా సమాజం | .......... | 52 |
| 12. | ప్రజా స్వామ్య యుగం స్వేచ్ఛా కవిత్వం | .......... | 55 |
| 13. | స్వేచ్ఛకు అవకాశం - స్వేచ్ఛా కవిత్వం | .......... | 58 |

# 1. స్వేచ్ఛా కవిత్వం - పరిచయం

మరీ ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య ప్రభావంతో స్వేచ్ఛా కవిత్వం బహు విస్తృతంగా వెలువడింది. కాలం గడిచేకొద్దీ స్వేచ్ఛా స్పందనలతో దీని అస్తిత్వం ఎంతో వైవిధ్యంతో బలపడుతూ వచ్చింది. కవిత్వంలో సృజన స్వేచ్ఛకు కొత్త కవాటాలు తెరచినట్లయింది. సామాజిక స్పృహ, రాజకీయ దృష్టి, మనస్తత్వ విశ్లేషణం, ఆధునిక ప్రకాశనంతో నిరంతరం కొత్తదనంకై అన్వేషణతో తెలుగులో కొత్త ప్రక్రియగా వెలసింది. విశిష్టమైన రూపాన్ని పొందింది. సహృదయుల ఆదరణనూ పొందింది. ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ దీని స్వేచ్ఛా స్థితిగతులకు ప్రేరకమయింది. సాహిత్యచరిత్రలో ఈ కాలాన్ని ప్రజాస్వామ్యయుగంగా లేదా స్వేచ్ఛాయుగంగా పేర్కోడం, భిన్న సిద్ధాంతాల్నీ, వివిధ దృక్పథాల్నీ గౌరవించే ఆనుకూల్యాన్ని గుర్తించడమే.

సమాజంలో ఆశించే ప్రతి ఉద్యమమూ ప్రతి ధోరణీ స్వేచ్ఛా కవిత్వంలో మునుముందుగా ప్రతిఫలించింది. ఒక విధంగా కాలానుగుణమైన బాధ్యతను వహించిందని చెప్పొచ్చు. ఈ స్థితి సాహిత్యంలో దీని అవసరాన్నీ అనివార్యతనూ సూచిస్తుంది. చారిత్రకంగానూ సామాజికమైన అవసరాలకనుగుణంగా నిశితనిశితంగా తీవ్రతీవ్రంగా చండచండంగానే కాక సూక్ష్మసూక్ష్మంగానూ స్పందించింది. వైయక్తికమైన అస్తిత్వరూపాల్నీ చిత్రించింది. ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని లీనం చేసుకొని పరిణమించింది. స్వతంత్రమైన నిర్మాణరూపంతో ప్రజల్ని ఆకర్షించింది. అన్నిటికీ అభివ్యక్తి వేదికగా స్థిరపడింది.

ఇందులో ప్రజాస్వామ్య స్వేచ్ఛా కవిత్వంలో శ్రామికవర్గానికే కాక ప్రగతి దృష్టితో సమాజంలో అన్ని వర్గాలకూ శ్రేణులకూ తరగతులకూ భేదరూపాలకూ ప్రాతినిధ్యం ఉంది. అంతకుముందీ చిహ్నాలు లేవని కాదు. ప్రజాస్వామ్యం సంప్రదాయ ప్రగతి సిద్ధాంతాల ప్రసారానికీ సమాలోచనకూ ఎంతో అనువైంది. ఈ కారణంగా స్వాతంత్ర్యానంతరం కాలం గడచేకొద్దీ స్వేచ్ఛాకవిత్వం నైకముఖంగా వికసించింది.

1) ప్రజాస్వామ్యం, 2) మార్క్సీయం, 3) సమన్వయం, 4) నవకాలిక సంప్రదాయం, 5) మావోపథం, సిద్ధాంతాలే కాక, 6) అనుభూతి, 7) అస్తిత్వ వాదాలూ, 8) దిగంబర, 9) చేతనావర్త, 10) పైగంబర ధోరణులు కవిసేన, దళిత స్పృహ స్త్రీవాదాలతో సంపన్న మయింది. ఈ బహుముఖ వికాసం ప్రజాస్వామ్యంలో సహనంతో సమన్వయంతో ఇతరుల అభిప్రాయాల్ని మన్నించే గుణంతో, చర్చలతో సమాధానాల్ని

అన్వేషించే శాంతి వర్తనంతో స్వేచ్ఛ కేంద్రంగా ప్రగతి వాతావరణం ఉండడంవల్లనే జరిగింది. మౌలికమైన సంప్రదాయతలాలకూ ప్రగతి భావాలకూ సమాజంలో సంపూర్ణంగా అవకాశాలు లభించడమే, దీనికి కారణం.

స్వేచ్ఛా కవిత్వం పద్యం కన్నా భిన్నమైన విస్తృతమయిన పాత్రను నిర్వహించింది. దీని నిర్మాణ స్వరూపం ఇందుకనువైందిగాను రాణించింది. కొత్త సామాజిక సంస్కృతిని ప్రతిబింబించింది. దీన్ని సమీక్షిస్తే, 1) సమాజపరంగా స్వేచ్ఛ సౌభ్రాతృత్వం, సమానత్వం, సామాజిక న్యాయం, లౌకికత, ప్రగతిభావనతోనూ, 2) వ్యక్తిపరంగా సంస్కరణరూపం అనుభూతిగుణం మనస్తత్వచిత్రణంతో, మౌలికమైన సంప్రదాయతలాలతో ప్రజాస్వామ్య ప్రభావశక్తి విశ్లేషణకందుతుంది.

విశ్వమానవ దర్శనంతో అంతర్జాతీయ భావనతో జాతీయ మరియు స్థానీయ స్పందనలతో వర్తించింది. ఎప్పటికపుడు సామాజిక పాత్రను నిర్వర్తించింది. సమాజంలో తటస్థపడే బహుజాతుల్ని గురించి, బృందాల్ని గురించి, సమూహాల్ని గురించి, భేదరూపాల్ని గురించి వృత్తుల్ని గురించి ఆలోచన జరిపింది. పీడనం నుండి ముక్తం చేసే క్రియాత్మకతను ప్రోత్సహించింది. ఎప్పటికప్పుడు ఈ దిశలో కులం మతం వృత్తి ఉద్యోగం రాజకీయం పాలన ప్రాంతం జెండర్‌కు సంబంధించిన విషమ సమస్యల్నీ బాధాస్థితుల్నీ చిత్రించింది. వీటిని ఎదుర్కొనే శక్తినీ ప్రేరేపించింది. విశాలమైన మానవీయ ప్రాతిపదికపై నిలిచింది. ప్రజాస్వామ్య వేదికగా నిలిచింది. ఇదీ ప్రక్రియలోని గొప్పదనాన్నీ, ఎన్నిటికో సరిపడే, ఎన్నిటినో తనలో ఇముడ్చుకొనే రూపాన్నీ భావింపజేస్తూంది. వీటిని అనేకమైన ఉదాహరణలతో సంపన్నం చేయొచ్చు.

ఇందులో అంతర్జాతీయ తలంపై ప్రచలితమయ్యే మానవ హక్కుల్ని గురించే కాక, ఉదార తత్త్వస్థాయినీ, జీవితంలో బాధ వేదన పీడన వెనుకనుండి సామాజిక లక్ష్యనిర్దేశాన్నీ గమనించవచ్చు. ఇది ప్రజాస్వామ్యం మొదలుకొని, సంప్రదాయ భావన విప్లవం, సమన్వయం, మొదలుగా అనేక సిద్ధాంతాలలో ఆదర్శాలతో ప్రచలితమయింది. ఇది ఆధునిక కవిత్వంలో మరీ ముఖ్యంగా స్వేచ్ఛాకవిత్వంలో ప్రధానంగా ఉంది. ఖండఖండంగా ఎదురయ్యే మానవీయ తలంపై మానవతా స్పందనం, ఎప్పటికీ ఉండనే ఉంది. ఎక్కడికక్కడ ఎదురయ్యే సంఘటనలు సూక్ష్మసూక్ష్మ రేఖలతో చిత్రించడమూ కనిపిస్తుంది. సమాజంలో ఏదో సందర్భంలో పీడనో, బాధో, అలజడో, అపాయమో, హింసో, విద్రోహమో ఏదైనా కావచ్చు. సమాజంలో బాధలకుగురై, కారుణ్యాన్ని ఒలికే అనుభవాలు, భావసాంద్రతతో జీవితంలో దుస్థితి చిత్రితమవుతుంది. ఇవి

ప్రతీకాత్మకంగానూ నిర్వహింపబడవచ్చు. వీటిలో, ప్రకృతి విపరీతాలతో పాటు సామాజిక రాజకీయ వైయక్తిక తలాలపైనా, అనేకమైన దుస్థితుల దుర్ఘటనల చిత్రణం ఉంది. ఇది వర్తమాన స్థితిగతులకు కవి స్పందనరూపంగా కన్పిస్తుంది.

## II

స్వేచ్ఛా కవిత్వంలో ప్రజాస్వామ్య వ్యవస్థలోని రాజ్యాంగ రూపాలపట్ల విశ్వాసంతో, సంప్రదాయ మూలాల్ని గుర్తిస్తూ ప్రగతి లక్ష్యాన్ని నిర్మాణాత్మకంగా దర్శించే కవిత్వాన్ని ప్రజాస్వామ్య కవిత్వంగా భావించడం సముచితం. ఈ సమాలోచనంలో సాహిత్యపరమైన అంశాలే కాకుండా ఆనుషంగికంగా, సామాజిక రాజకీయ మనస్తత్వపరమైనవీ చోటుచేసుకోడం జరుగుతుంది. ఇంకా స్వేచ్ఛాకవిత్వంలో భావరూపాలూ ప్రతీకలూ, మనస్తత్వ రీతులూ పురాబింబాలూ కవిత్వకళలో ఉపస్కారకంగా సముచితమైన పాత్రల్ని నిర్వహిస్తున్నాయి. ఈ వెలుగులో సమాలోచనం చేస్తే రోజురోజుకీ పెరిగే విస్తృతికీ వైవిధ్యానికీ ఆధునిక కాలంలో వర్తమాన "ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛ" మూలంగా కన్పిస్తుంది. కాబట్టి దీన్ని సాహిత్య చరిత్రలో ప్రజాస్వామ్యయుగంగానో, స్వేచ్ఛాయుగంగానో పేర్కోవచ్చు.

భావకవిత్వంలో స్వేచ్ఛ వ్యక్తినాశ్రయించింది. స్వేచ్ఛాకవిత్వంలో స్వేచ్ఛ, 1) వ్యక్తితోపాటు 2) ప్రధానంగా సమాజాన్ని ఆశ్రయించింది. ఇంకా, 3) ప్రక్రియాగతమూ అయింది. ఇందులో వ్యక్తి స్థాయి నుండి సమాజ స్థాయికి పెరిగే విస్తరించే రూపం స్పష్టంగా కన్పిస్తుంది. దీని ఫోకల్ (Focal) కేంద్రం వేరు. కవి ఫోకస్ (Focus) లో కన్పించే స్థితిగతులూ, వాటి అవగాహన, పరిశీలన, దర్శనం పూర్తిగా భిన్నం. భావ కవిత్వంలో స్వేచ్ఛకు సంబంధించిన 1) దిశ, 2) పరిధి, 3) ప్రయోజనం చాలా పరిమితమైనవీ. భావనలో కళాత్మకమైన సాంద్రతకు ఆధిపత్యం ఎక్కువ. అయితే స్వేచ్ఛాకవిత్వంలో దిశ, పరిధి, ప్రయోజనం చాలా విస్తృతమైనవీ. భావనలో మానవతా పూర్ణమైన సామాజిక ప్రగతిలక్ష్యం ముఖ్యం. ఇది జీవితచలనంలో జాతీయ పరంపరాచేతనతో సామాజిక స్పందనతో ఎప్పటికప్పుడు దిశదిశనుండీ కొత్తను ఆహ్వానించే కళాత్మక గుణంతో ప్రవృత్తమయింది. సాహిత్య సమాలోచనంలో ఈ భేదాన్ని గుర్తించవలసిన అవసరం ఉంది.

## III

స్వేచ్ఛా కవిత్వం ఆధునిక కాలంలో 1) సులభమైన ఉత్తమమైన అభివ్యక్తి సాధనంగా స్థిరపడింది. 2) సంపూర్ణమైన స్వేచ్ఛకు అంటే నిర్మాణం మొదలుకొని వ్యక్తిగతమైన అభిప్రాయం సామాజిక దర్శనం దాకా నిలయమైంది, కావడంచేత బహుత్వరలో వ్యాప్తిని పొందింది. 3) వర్తమాన సమస్యలు కేంద్రంగా సామాజిక రాజకీయ మానసిక స్థితిగతుల్ని చిత్రించే అవకాశం బాగా ఉండడంచేత యువగణాన్ని ఆకర్షించింది. 4) పరిధి చాలా విస్తృతమైంది కావడంచేత లక్ష్యనిర్దేశంతోపాటు ఆధునిక భావజాలానికి తగిందిగానూ రూపితమయింది. ఈనాడు పద్యంలో ఈ అంశాలు అక్కడక్కడా క్వాచిత్కంగా మెరపుతీగెల్లా కన్పిస్తాయి. పద్యంలో వివిధ శక్తిమంతమైన స్థానాల్ని ఆధునికావసరాలకు పూర్తిగా వినియోగించుకో వలసి ఉంది. దీనికి పద్యరచనా ప్రావీణ్యంతోపాటు, ఆధునిక సామాజిక తత్పరత కూడా అవసరం. పైగా దీని నిర్మాణ రూపమూ సులభం కాదు. నిర్మాణ సౌలభ్యం కలిగిన స్వేచ్ఛా కవిత్వంపట్ల మొగ్గు కవుల్లో సహజంగా ప్రవర్తిల్లింది. ఇది ఆధునిక సమాజావసరాలకు తగిన మానసిక వాతావరణాన్ని కల్పించింది. దీనికి కారణం కవుల్లో ఆధునిక సామాజిక తత్పరతయే. ఇదీనాడు నవమానవచరిత్రకూ, ఆధునిక జీవన సంస్కృతికీ ప్రాతినిధ్యం వహిస్తూంది. ఇది సహజమైన పరిణామం.

వర్తమానానికీ గతానికీ అనుబంధం వివిధ విషయాల్లో తప్పనిసరిగా కొనసాగుతూంటుంది. సాహిత్యానికి వస్తే గతంలోని భారతీయ పాశ్చాత్య సిద్ధాంతాలకు సంబంధించిన మౌలికమైన ఆలోచనల్ని విస్మరించడానికి వీల్లేదు. వీటి ఉపయోగమూ ఎంతో ఉంది. ఈ అంశాల్ని ప్రదర్శనశాల్లో శిల్పాల్లా కాకుండా, సహేతుకంగా ప్రయోజనపరంగా అన్వయించుకోని ఉపయోగించుకోవలసి ఉంది. వీటిని ఆధునిక కవిత్వంలో కళాత్మకమైన విలువలపై దృష్టితో సమన్వయం చేసుకోవడం సముచితం. దీనికి విమర్శకుల్లో గ్రహణగుణం వ్యాఖ్యానకౌశలం సమయపరివర్తనం గురించి విజ్ఞత, దర్శనశక్తీ అవసరం.

ఆధునిక కాలంలో ప్రజాస్వామ్య సమాజంలో స్వతంత్రమైన ఆలోచనతోపాటు, కొత్తకొత్త నిర్మాణ రీతులతోపాటు, ఎన్నో వాదాలూ ధోరణులూ సిద్ధాంతాలూ ప్రకాశమానమవు తున్నాయి. దేనికది ఒక ప్రత్యేకమైన అధ్యయనపద్ధతి నపేక్షిస్తుంది. అందువల్ల కవిత్వ సమాలోచనమూ, ఒకే మూసలో పోసినట్లు జరపడం కుదరదు. దీనినుండి ముక్తమయి నప్పుడే, మంచి విమర్శ, ఉపయోగకరమయిన విమర్శ, హేతువుతో విజ్ఞతతో కూడిన విమర్శ ఆవిర్భవిస్తుంది. కవిత్వానికి సృజనశక్తి ఎంత ముఖ్యమో,

ఈనాడు దీని వికాసానికీ ప్రశస్తికీ వ్యాఖ్యానమూ సమాలోచనమూ అంతే ముఖ్యం. ఈ ప్రక్రియ సమాజంలో ఉత్తమ సాహిత్యసంస్కారస్థాయిని పెంచుతుంది. సముచితమైన విలువల్ని కాపాడడమే కాక సాహిత్య వాతావరణాన్ని కొత్తదనంచేత ప్రకాశింపజేస్తుంది.

## IV

స్వేచ్ఛాకవిత్వానికి నియతమైన లక్షణం లేదు. కవి తనకుతానుగా ఏర్పరచుకొన్న నిర్మాణరూపం సద్యఃస్ఫూర్తితో ఏర్పడేదే. ఇది ఒక విధంగా దీని లక్షణపరిధిని విశాలతరం చేస్తోంది. ఇదో కట్టులో, చట్రంలో ఛందోగతంగా ఒదిగిఉండకపోవడంవల్ల, స్వేచ్ఛాగుణం చేత, కొత్తకొత్త నిర్మాణ రీతుల్ని పొందడమూ గమనించవచ్చు. స్థూలంగా, 1) శబ్దంలహరి వలె మరో శబ్దాన్ని అందుకొనీ వర్తిస్తుంది. 2) శబ్దం తరంగంవలె ఎగసి మరో శబ్దాన్ని పట్టుకొనీ కదలుతుంది. 3) వాక్యం మరో వాక్యాన్ని అందుకొనీ, 4) మరోవాక్యంతో కలిసీ చరిస్తుంది. 5) లయచలనంతో, ప్రసారగమనంతో ఆకర్షిస్తుంది. 6) ధారాగతితో ప్రవహిస్తుంది. 7) ఇట్లా ఎక్కడికక్కడ ఆవేశస్థితిననుసరించి ఒకస్థాయిలో లేదా వివిధ స్థాయిల్లో పై అంశాల సమాకలనం జరుగవచ్చు. 8) ఆవేశ స్థాయిని బట్టి, భావ స్వరూపాన్నిబట్టి నిర్మాణ రీతినిబట్టి ఉద్గమన రూపం సిద్ధిస్తుంది. ఇది రచనలో ఖండఖండంగానూ సమూహాలు సమూహాలుగానూ, ఏకధారగానూ, సూత్రసదృశంగానూ వివిధ శిల్పాకృతుల్ని పొందే వీలుంది. 9) ఒక్కొకపుడు శబ్దం, శబ్దసమూహం, వాక్యం, దాని కదలికల్నిబట్టి, అక్కడక్కడా గణరూపాలూ, మాత్రారూపాలూ చోటుచేసుకోనూ వచ్చు. దీన్ని కవి ఉద్దేశించకనూ పోవచ్చు. అయితే పూర్వప్రక్రియల ప్రభావంవల్ల, గతంతో వీడని అనుబంధంవల్ల, ఈ స్థితి ఏర్పడుతుంది. దీన్ని నివారించనూవచ్చు. ఏమైనప్పటికీ సమాలోచనతో కవిత్వంలో పలు అంశాల్ని విశ్లేషించడం, చర్చకు నిలపడం, నిగ్గుతేలిన అంశాలతో లక్షణ స్వరూపాన్ని గుర్తించడం మునుముందు బాగా జరగవచ్చు. ఇది సమాలోచనా ప్రక్రియలో భాగం. 10) రచనలో సంభాషణ పద్ధతులూ, వచనరీతులూ, వచోవిన్యాసాలూ చోటుచేసు కుంటాయి. ఇవి వ్యవహారంలో ఉన్న భాషా సహజమైనవీ, వీటిలో పరంపరా ప్రభావం, ప్రయోగనవ్యత రెండూ దృష్టికివస్తాయి. ప్రతి కాలంలోనూ మార్పులు వచ్చేప్పుడు అంతకు పూర్వం ఉన్న, పరంపరకు సంబంధించిన అంశాలు కొన్ని చోటుచేసుకుంటాయి. కొన్ని అపరిహరణీయాలుగానూ కన్పిస్తాయి. ఏదైనా చివరకు సృజనరూపం కవి బహిరంతర్వ్యక్తిత్వం పైనే సర్వం ఆధారపడి ఉంటుంది.

స్వేచ్ఛా కవిత్వం నిర్మాణంలో "షోపీస్" కాదు. ఏదో ఒక పోతలో ఒదిగిపోయే, "ముద్రాకృతి" అసలే కాదు. దీనికి "మోడల్" అనేది లేదు. కాబట్టి కవి నిర్మాణదృష్టినీ,

కౌశల్యాన్నీ సృజన రూపంలో సిద్ధించే ప్రత్యేకతనూ బట్టి విభేదిస్తుంది. ఇది సంపూర్ణంగా కవి స్వేచ్ఛా మనోగతమయింది. ఏ సృజన రూపం అస్తిత్వాన్ని గురించీ, ఆవిష్కారం గురించీ, హేతురహితంగా సందర్భ శూన్యంగా ప్రశ్నించడం సమంజసం కాదు.

1) సామాజిక వాస్తవికత, 2) వేదనాస్పందనం ఈనాటి స్వేచ్ఛాకవిత్వంలో బాహ్యాంతర్విధాలు, రచనలో ఏకాకృతి పొందుతాయి. 1) సామాజిక వాస్తవికత అనేది ఒక్కొక్క కవిలో ఒక్కొక్కవిధంగా వ్యక్తిత్వవికాసంతో అవగతికి వస్తుంది. 2) వేదనా స్పందనం అనేది రచన వెనుక నుండి పనిచేసే మానసికమైన విశ్లేషణం, పరిశీలనం చిత్రణంతో సంయుతమైందీ. చారిత్రక సాంస్కృతికభావ ప్రసారమూస్ఫూర్తికి వస్తుంది. వీటితోపాటు మానవీయమైన విలువల ప్రతిపాదనమూ ముఖ్యం. స్వేచ్ఛా కవిత్వం సహేతుకమైన మార్పులకు నిబద్ధమైందీ, లక్ష్యనిర్దేశం కలిగిందీ అవడంచేత వివిధాంశాల చక్కని సమ్మేళనంచేత కొత్తతరాల్ని బాగా ఆకర్షించడం సహజం.

## V

మనిషిపై ఆశతో, మనిషిలో శక్తిపట్ల విశ్వాసంతో, యుక్తిపట్ల ప్రత్యయంతో, మనిషి మనిషితో సంబంధం కోరే గుణంతో, మానవతా మనోజ్ఞంగా ప్రకాశించే స్వరూపం స్వేచ్ఛాకవిత్వంలో దర్శనమిస్తుంది. ఎప్పటికపుడు కొత్తను కోరే, మార్పుకు ప్రేరేపిస్తుంది. మార్పుకు సహకరిస్తుంది. మార్పును లక్షిస్తుంది. సమాజగమనంలో సముచితమైన పాత్రను నిర్వర్తిస్తూండడంవల్ల, చారిత్రక ప్రాధాన్యాన్ని సంతరించుకుని, కవిత్వమంటే ఈనాడు 'స్వేచ్ఛాకవిత్వం'గా అర్థస్ఫూర్తిని పొందింది.

మరో విషయం, సమాజ గమన చిత్రణంతోపాటు, మనిషి లోలోపలి వ్యక్తిత్వాన్ని గురించి ఆలోచనకు గురిచేస్తూంది. ఈ రెండింటి అనుబంధాన్నీ, సంబంధాన్నీ గురించి చింతనకు దారితీస్తూంది. కొత్త ఊపిరితో, కొత్త ఆయువుతో, కొత్త ఆలోచనతో, ప్రగతి శీలంతో, ప్రజాస్వామ్య చేతనకు సంకేతంగా నిలచిందీ స్వేచ్ఛాకవిత్వం. సాహిత్యపరంగా ఈనాడిది కొత్త సంస్కారంతో ఏర్పడిన వాతావరణానికనుగుణమైన తరం కవులతో నిండిపోయింది.

దీన్ని సమీక్షిస్తే, 1) స్వయంప్రేరణయుతమయిందీ, 2) కవి వ్యక్తిత్వంలో సంప్రదాయ సంస్కృతీ తేజంతో పాటు ఆధునిక సంస్కారం, మానవీయ స్పందన శక్తీ, సామాజిక తత్పరత, హేతుదృష్టితో వస్తు నవ్యత ఇట్లా అనేకాంశాల సమాహారంగా ఆవిష్కృతమయ్యే సద్యోరూపంగా గోచరిస్తుంది. ఇందులో 1) కథా పద్ధతికన్నా భావ

విన్యాసానికే ప్రాధాన్యం, 2) కథన రీతులకన్నా భావ యోజనకే ప్రాధాన్యం, కథ–కథనం అనగానే వచనత్వం చోటుచేసుకునే వీలెక్కువ. అయితే స్థూలంగా కథాసూత్రం ఉండవచ్చు. కథాంశం ఉండవచ్చు. కాని నిర్వహణం మాత్రం భావ స్థానాలపై భావగతులపై దృష్టితోనే సాగుతుంది. ఇవి వర్తమాన స్వేచ్ఛా కవిత్వంలో స్ఫుటంగా కన్పించే అంశాలు.

ప్రస్తుత సమాజంలో, పై వర్గాల నుండి క్రింది వర్గాలదాకా, అందరినీ కలుపుకొనీ, వారి జీవిత సమస్యలకూ సమాధానాలకూ ప్రాధాన్యమిస్తూందీ ప్రక్రియ. ఇది చాలా తక్కువ సమయంలో బహుముఖీనంగా విస్తరించడానికి కారణమిదే. ఆధునిక సాహిత్య చరిత్రలో స్వేచ్ఛాకవిత్వం, ప్రజాస్వామ్య యుగంలో కొత్త దిశకూ స్వతంత్రమైన అభివ్యక్తికీ సాధనంగా నిలిచింది. సామాజిక తత్పరతతో వ్యక్తి స్ఫూర్తితో, ఆధునిక సాహిత్య సంస్కృతిలో చారిత్రకమైన పాత్రను నిర్వహిస్తూంది. ప్రజాస్వామ్య సంవిధానం భూమికపై, సాహిత్య చరిత్రలో ప్రజాస్వామ్య యుగంగానూ / కవితా ప్రస్థానంలో స్వేచ్ఛాయుగంగానూ పరిగణించదానికి వీలైన అస్తిత్వాన్ని పొందింది.

"అరుణకిరణం గుండెలో నిలిచి మనిషీ కదలిరా
మానవీయ సూర్యునితో ప్రజాస్వామ్య పతాకతో"

# 2. ప్రజాస్వామ్య కవిత్వం

ఆధునిక స్వేచ్ఛా కవిత్వం ఈనాడు సమాజంలో ప్రచలితంగా ఉన్న ప్రజాస్వామ్య తత్త్వానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. ఈ ఆధారతలంపై జీవితంలో భౌతిక చిత్రణంతో, మానసిక విలోకనంతో విశిష్టంగా ఉంది. నిరసన ప్రతిఘటన నినాదం సంఘర్షణ మొదలుగా ప్రస్తుత వ్యవస్థను వ్యతిరేకించే పద్ధతులు ప్రజాస్వామ్యంలో అనుమతించేవే. ఇటీవల విప్లవవాదులు అందునా రచయితలు తమ ఆదర్శాల్నీ అభిప్రాయాల్నీ ప్రకటించే స్వేచ్ఛా వాతావరణం ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం చేసింది.

సాహిత్య ప్రపంచంలో ఈ ధోరణి వైవిధ్యంతోపాటు విలువలకీ దారితీసేది. సమాజంలో ఎప్పుడూ యథాస్థితికీ ప్రగతి తత్త్వానికీ మధ్య సంఘర్షణ జరుగుతూనే ఉంటుంది. ఇది తప్పనిసరి, ఇది ఒక వ్యవస్థీకృతమై జరగడంవల్ల ఒక పద్ధతి అవలంబింప బడుతుంది. గతిలో వేగం వస్తుంది. ప్రయోజన విస్తృతి ఉంటుంది. గుణాత్మకమైన మార్పు వస్తుంది. దీని ఫలితం అందరికీ (అంటే ఎక్కువమందికి) అందుతుంది. ఇది వ్యక్తి నిష్ఠం కాక సమాజనిష్ఠంగా తన పాత్రను నిర్వర్తిస్తుంది. కాలం గడుస్తూన్నకొద్దీ కొత్త అనుభవాలు అవసరాలు ఎదురయ్యేకొద్దీ యథాస్థితి క్రమంగా ప్రగతికి దారి ఇస్తుంది. ఒకప్పుడు తప్పుకుంటుంది. ప్రగతి తత్త్వమూ కొంత సరిపెట్టుకొని పురోగమిస్తుంది. ఇది ఒకనాటితో ముగిసేది కాదు. తరం తరువాత తరం వచ్చేకొద్ది అనూహ్యమైన ప్రభావాలకు లోనై పరివర్తన కోరడం సహజం. సాహిత్యంలో మార్పు ప్రతిఫలనం అనివార్యం. ఈ మార్పు మిగతా ప్రక్రియల్లో కన్నా కవిత్వంలో ముందుగా వస్తుంది.

సాహిత్యంలో ముఖ్యంగా కవిత్వంలో ఇప్పుడున్న వాతావరణాన్నిబట్టి సంప్రదాయ చ్ఛాయలు, కాల్పనిక రీతులు అభ్యుదయధోరణి విప్లవదృష్టితోపాటు ప్రజాస్వామ్య దృక్పథం విమర్శకుల విశ్లేషణకందుతుంది. ఈ కాలం ఎన్నెన్నో ఆదర్శాలతో సిద్ధాంతాలతో అభిప్రాయాలతో సమాజంలో ఉన్న అన్ని విధాలైన జీవిత దిశల్ని స్పృశిస్తూ కన్పిస్తుంది. ఇది కాలం గడిచేకొద్దీ సంకుచితసీమల్ని అధిగమిస్తూ అంతర్జాతీయతను పొందుతూంది. ఇటీవల ఈ దృష్టితో ఇతర భారతీయ భాషల్లోను ప్రపంచ భాషల్లోను వచ్చిన మంచి కవిత్వాన్ని వెలుగులోకి తెచ్చే ప్రయత్నం జరుగుతూంది. ఆయా భాషల్లోని కవిత్వశక్తినీ మంచి స్థితిని పొందిన దిశను, ప్రదర్శిస్తూంది. తెలుగులో వచ్చే కవిత్వంలో శక్తినీ సుస్థితిని దిశనూ తులనాత్మకంగా పరిశీలిచేందు కుపకరిస్తుంది.

ఇప్పుడు తెలుగులో సంప్రదాయం కాల్పనికం అభ్యుదయం విప్లవం ప్రసరించే వెలుగులతోపాటు వివిధ దృక్పథాల సమన్వయంతో ప్రజాస్వామ్య తత్త్వం ప్రధానంగా కవిత్వం వెలువడుతూంది. ఇటీవల కమ్యూనిస్టు దేశాల్లో ప్రజాస్వామ్యానికభిముఖంగా వచ్చే మార్పులు కూడ ఈ సందర్భంలో పరిశీలించవలసి ఉంది. తీవ్రవాదానికి కారణాలు దానిలోని ఉత్తమ గుణాలతోపాటు సత్త్వరం ఇతర వాదాల్లోని ఉత్తమ కోణాలను ప్రోత్సహించే వ్యవస్థ అవడంవల్ల ఈనాడు ప్రజాస్వామ్యం అవసరమౌతూంది. ఇది సమాజశ్రేయస్సు సౌభాగ్యం సమానత్వంపై దృష్టితో సంప్రదాయం నుండి సామ్యవాదం వరకు చారిత్రక పరిణామంలో భాగాలైన అన్ని ఆలోచనా ధోరణులకు తమ తమ పాత్ర నిర్వహించే అవకాశం కలిగిస్తూంది. దేనికీ క్షతి ఏర్పడదు. వ్యతిరేకం ప్రతిపక్షం నిరసనం ప్రతిఘటన సంఘర్షణ అనేవి సామాజికంగా చూస్తే నాగరికత – సంస్కృతి వికాసంలో అనివార్యాలుగా చరిత్రలో కన్పిస్తాయి.

ఇవి వ్యక్తి స్వేచ్ఛకవకాశంతో పాటు సాంఘిక న్యాయానికి మానవజాతి సౌభాగ్యానికీ క్రమంగా దారితీసాయి. అయితే ఇవి అప్పుడప్పుడు అవసరం మేరకు వచ్చేవే కాని ఎల్లప్పుడు తీవ్రస్థాయిలో ఉండడం కుదరదు. కొంతకాలం విరామాన్ని పొందే స్థితి వస్తుంది. లేదా కాలంపై ఇతర శక్తులతో సమన్వయాన్ని పొందే స్థితి ఏర్పడుతుంది. ఈ దశలో ఉత్పన్నమయ్యే సాహిత్యం ప్రత్యేకంగా ఉండడం సహజం. కాబట్టి దేన్నీ సంపూర్ణంగా వేరుచేసి చూడడం కుదరదు. ఇతర విషయాలను కూడ పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ఏ వ్యక్తి ఇష్టానిష్టాలతో పనిలేకుండా సామాజిక తలంపై తమ తమ క్రియాత్మకమైన పాత్రల్ని నిర్వహిస్తాయి. ఈ విధమైన విభిన్న భావ ధోరణుల స్థితికీ క్రియాత్మకమైన పాత్ర నిర్వహణకూ ఆధారభూమి ప్రజాస్వామ్యం కావడం విశేషం. ఈ విధంగా చారిత్రక దృష్టితో సమన్వయ ధోరణిని అవలంబించే ఈనాటి ప్రజాస్వామ్య కవిత్వంలో ఈ క్రింది అంశాలు పరిశీలనకు వస్తాయి.

1) వ్యక్తిస్వేచ్ఛ, 2) సామాజిక న్యాయం, 3) కుటుంబ వ్యవస్థ నుండి అనేక కారణాలవల్ల దూరమై కొత్త అనుబంధాలేర్పడిన స్థితి, 4) నగర జీవనంలోని ఏకాంత ధోరణి, 5) మానసికమైన ఒత్తిడి–స్పందనం, 6) ఏకాంత ధోరణిని పోగొట్టే కార్యక్రమాల పట్ల కొత్తగా శ్రద్ధ, 7) సామాజిక శక్తులపట్ల ఆకర్షణ, వాటిని గురించిన ఆలోచన, 8) అస్థిరమైన స్థితి – అస్పష్టమైన అంచుల్లో భావ ధోరణి, 9) అన్నివైపులనుండి వచ్చే మార్పులకాహ్వానం – ప్రతిస్పందనం, 10) స్థానికం నుండి అంతర్జాతీయం దాకా ఆలోచనా ప్రభావాలతో రూపొందిన స్వీయవ్యక్తిత్వ వికాసం, 11) ప్రాచీనం నుండి ఆధునికం

వరకు సంప్రదాయం నుండి విప్లవం దాకా మానవుని ప్రస్థానంలో వివిధ సోపానాల అవగాహన, 12) హేతు దృష్టి-సంస్కరణం-పరివర్తనంతో నిత్యం మానవ ప్రగతిని సమాజశాంతిని కోరే ఆదర్శరూపం అనేవీ సందర్భంలో ప్రజాస్వామ్య యుగ కవిత్వ విశ్లేషణలో దృష్టికి వచ్చేవి.

ఒక విధమైన కవిత్వం నుండి మరో విధమైన కవిత్వాన్ని గుర్తించేందుకు 1) మూల వస్తువు ఎన్నిక, 2) స్థితి యోజనం, 3) భావప్రసారం, 4) నిర్వహణంపై దృష్టితోపాటు నిర్మాణ రూపం, 5) అభిప్రాయ ప్రకాశనం - సిద్ధాంత ప్రతిపాదనం అనేవి గ్రహింపవలసినవి. వీటి ఉపయోగంలో కవికి స్వేచ్ఛ ముఖ్యం. ఇది అభివ్యక్తి శిల్పం మొదలుకొని సిద్ధాంత ప్రకటనం - ఆదర్శాల ఆవిష్కారం వరకు వ్యాప్తమైంది. ఇవి ఈనాటి ప్రజాస్వామ్య కవిత్వరూపంలో కన్పించే సాధారణాంశాలు. ఈ దృష్టితో దీన్ని వివేచింపవలసి ఉంది.

సమాజంలో పీడితులు తాడితులు గురించి సానుభూతితో వాళ్ళ పక్షం వహించి మాట్లాడడం ఈనాడు సర్వసాధారణమైంది. ఈ కారణంగా ఎప్పుడో కొత్తగా ప్రత్యేకంగా కన్పించిన ప్రగతి భావ పదబంధాలు, విప్లవ ప్రతీకలు భావరూపాలు ఇప్పుడు పడికట్లు రాళ్ళుగా పరిణమించడం సహజం. ఇవి స్థిరపడినాయి. సాధారణ స్థితిని పొందినాయి. ఒక వాతావరణాన్ని పురస్కరించుకొని ఒక కాలంలో దానికి తగిన విధంగా యోజితమైన ఈ పదబంధాలు ప్రతీకలు భావరూపాలు మొదలైనవి ఎప్పటికీ ఎవరో కొందరి సొత్తుగా పరిమితంగా ఉండిపోవు, ఇవి సాధారణ్యాన్ని పొందుతాయి. దానికి సంబంధించిన వాతావరణాన్ని చిత్రించేప్పుడు, సూచించేప్పుడు భేదభావం లేకుండా అంతా నిస్సంకోచంగా ఉపయోగించడం జరుగుతుంది.

ఇక ఈనాటి స్వేచ్ఛా కవిత్వానికి వస్తే ఇందులో సామాజికంగా వైయక్తికంగా సంఘర్షణకు సంక్లిష్టస్థితికి దారితీసే భౌతిక శక్తుల్ని మనోరీతులను చిత్రించడం కన్పిస్తుంది. జీవితంలో సమస్యలపట్ల సందర్భాలపట్ల అవగాహన ఆలోచన స్పందనం, దృష్టిలో భేదం, లక్ష్యంలో భేదం ఒక రచయిత నుండి మరో రచయితను విభేదిస్తుంది. ప్రతి వ్యక్తి తనదైన ప్రత్యేక పద్ధతితో స్పందించడానికి ప్రతిక్రియ నెరపడానికి సృజనశక్తి వికాసానికి స్వేచ్ఛ ముఖ్యం. అవకాశం అవసరం. ఒక సిద్ధాంతంపట్ల ఆదర్శం పట్ల అభిలాష ఆలోచనా పథం ఉండడం వేరు. దానికాచరణ రూపమివ్వడం వేరు. దాన్ని ఆచరణలో పెట్టే స్థితి వేరు. దీన్ని కవిత్వంలో నిబంధించడానికి కావలసిన శిల్పకళావిభాగం వేరు. ప్రత్యేకమైన దృష్టి అవసరమౌతుంది. దీన్ని చిత్తశుద్ధితో అనుసరించడమే నిబద్ధత.

ఇందులో కష్టాలు సైతం ఎదుర్కొనే సంకల్ప శక్తి ఉంది. కార్యరూపంలోకి పరివర్తింపజేసే క్రియాశక్తి ఉంది. ఇది రచయిత సంపూర్ణ వ్యక్తిత్వాన్ని కవిత్వంస్థాయిని పెంచేందు కుపకరిస్తుంది. సమాజంలో కవి తానే వ్యక్తిత్వ నిర్మాణం కలిగి ఉన్నాడో దాని కనుగుణంగానే కవిత్వ మావిర్భవిస్తుంది. ఇది సహజం కూడా.

ప్రజాస్వామ్యం మానవజాతి శ్రేయస్సు కుపకరించే అన్ని సిద్ధాంతాల్లోని గుణాల్ని మన్నిస్తుంది. వేల వ్యక్తిత్వాల్ని వేయి విధాలుగా వికసింపజేసి సమాజానికి సంపూర్ణతను సిద్ధింపజేస్తుంది. అనంతకాలంపై ఒక్కొక్కటి ఒక్కొక్క విధంగా ఉపకరించవచ్చు. ఒక్కొక్కదాని ప్రయోజనం ఒక్కొక్క విధంగా పరిణమించవచ్చు. ఈ దృష్టితో ఆలోచనల్ని ప్రతిబింబింపజేస్తూ ప్రగతిని కాంక్షించేదే ప్రజాస్వామ్య కవిత్వం. దీని పరిధి ఎంతో విస్తృతమైంది, స్వరూపంలో వైవిధ్యం కలిగింది. ఆచరణీయమైన స్థితిని పొందింది, మానవజాతి సౌభాగ్య భవిష్యత్తుకు ఆవశ్యకమైంది. ఈనాటి తెలుగు సాహిత్యంలో 1) స్వేచ్ఛ-స్వాతంత్ర్యం, 2) సంస్కరణ-పరివర్తనం, 3) ప్రగతి-మానవతాభావన, 4) శాంతి-సౌభాగ్యం, 5) సౌందర్యం-సమానత్వం, 6) సంప్రదాయమూలాలు-విశ్వభావన పట్ల ఆకాంక్షతో అవతరిస్తూంది ప్రజాస్వామ్య కవిత్వం.

"నాలో మానవతా మేఘం
ప్రజాస్వామ్య సందేశంతో"

# 3. కవిత్వమూ - సృజనశక్తీ

ఒక స్థితి గురించి ఆవేశం, ఒక సంఘటన గురించి ఆవేదన, ఒక వస్తువు గురించి ఆలోచన ఒక్కొక్క కవి మనస్సులో ఒక్కొక్క విధంగా ప్రసారమౌతాయి. ఒక్కొక్కరొక్కొక్క విధంగా స్పందిస్తారు. వివేచన చేస్తారు. ప్రతిక్రియ నెరపుతారు. విశిష్టమైన దృష్టినవలంబిస్తారు. ఆదర్శాన్ని కలిగి ఉంటారు. ఇది వాక్ దశకు పూర్వస్థితి. దీన్ని అనుసరించి శబ్దం అర్థసహితమైన వాక్యవిన్యాసంతో నిర్మాణరూపం పొందుతుంది. సమాహారంగా కవి వ్యక్తిత్వం సిద్ధిస్తుంది. ఎన్ని అభిప్రాయ భేదాలున్నా దానికి కారణమైన సృజన శక్తి మాత్రం ఎటువంటి అభిప్రాయ భేదాలతో నిమిత్తం లేనిది, అందరికీ ఆమోదయోగ్యమైందీ, అందరినీ ఆకర్షించేదీ.

ఏది కవిత్వం? ఏది కవిత్వం కాదు? అనే ప్రశ్నలు తరువాత ఉత్పన్నమయ్యేవి. సామాన్యస్థాయి నుండి పై విశేషస్థాయికి పోయేకొద్దీ అభిప్రాయ భేదాలనేకం ఉత్పన్నమౌతాయి. సాధారణ పాఠకులు, అభిమానులు, విమర్శకులు, సహృదయులు, కవులు వీరు సమకాలీనంగా ఎట్లా ఉన్నా కాలం గడిచేకొద్దీ ఆపైన దీన్ని గురించి ఆదరించడమో ఆలోచన చేయడమో నిజంగా జరుగుతుంది.

కవితా ప్రస్థానంలో అన్నివిధాలైన కవిత్వమూ పరిణామదశల్లో వివిధ రూపాలుగా వచ్చినా మొత్తంమీద మానవ సంస్కృతీ రూపంతో నిబద్ధమైనవే. ఆయా భాషా సాహిత్య శక్తుల విస్తృతినీ వైవిధ్యాన్నీ కలిగించే మాట వాస్తవం. ఎటువంటి గొప్ప సృజనశక్తిని ఆవిష్కరించేదైనా ఎంతటి ప్రభావ సంపన్నమైనదైనా దానితో తృప్తిపడి సాహిత్య ప్రపంచం ఊరకనే ఉండిపోదు. ఉండలేదు కూడా. తర్క వితర్కాలు సాగుతూనే ఉంటాయి. ప్రశ్నలు వెలువడుతూనే ఉంటాయి. ఏవో సమాధానాలు వస్తూనే ఉంటాయి. ఇవి ఎప్పటికపుడేదో తృప్తిని కలిగిస్తూ ఉంటాయి. తిరిగి సందేహాలు తలెత్తుతూంటాయి. మరో సృజనాత్మక కృతి వస్తుంది. కొత్త సమస్యలుత్పన్నమౌతూనే ఉంటాయి. అసలు కవిత్వమంటే ఇట్లా ఉండాలన్న అభిప్రాయం ఎప్పటికపుడు కొత్తకొత్తగా పాఠకుల విమర్శకుల కవుల హృదయాల్లో ఉద్యమిస్తూనే ఉంటుంది. ఇది ఒకనాటితో ఒకచోట ఒక ఆలోచనా పరిమితిలో నిలిచేది కాదు. అలంకార శాస్త్రమంతా ఇట్లా వివిధ దశల్లో అవతరించిందే. సాహిత్య విమర్శ అంతా ఇట్లా వివిధ పద్ధతుల్లో వెలసిందే. ఈ కారణంవల్ల పోనుపోను ఒకే కాలంలో ఒకే యుగంలో భిన్నభిన్నంగా కవిత్వం వెలువడుతుంది.

ఒకే కవి వివిధ సందర్భాల్లో భిన్నభిన్నంగానూ కవిత్వాన్ని సృజించడమూ కన్పిస్తుంది. ఈ యుగాన్నే తీసుకుంటే ఒకే కాలంలో ఇంచుమించుగా కాల్పనికం అభ్యుదయం ప్రజాస్వామ్యం విప్లవం సంప్రదాయం నవ్యసంప్రదాయ పద్ధతుల్లో వివిధ గుణాలతో వాటి కలయికతో కవిత్వాలు వచ్చాయి. ఒకే కవికి సంబంధించినవి ఈ లక్షణాలతో రచనల్ని చూడవచ్చు.

శ్రీశ్రీ కవిత్వాన్ని తీసుకుంటే ప్రభవ వ్రాసిన సమయం వేరు. అప్పుడాతని కవిత్వస్ఫూర్తి వేరు. ఆయన భావించిన కవిత్వ నిర్వచనం వేరు. కాలం మారింది. ఆయన ఆలోచనలు మారాయి. జీవిత దృక్పథం వేరైంది. ప్రయోజనం మారింది. కవిత్వం భిన్నమైంది. దీనికనుగుణంగా రూపం నిర్మాణం లక్ష్యం మారడం సహజం. ఇదే కాలంలో ఇటువంటి స్థితిలో ఇంకొకరిలో ఈ మార్పు రాకపోవచ్చు. ఒకవేళ వచ్చినా ఈ విధంగా ఉండకపోవచ్చు. సృజనశక్తిలోని విశిష్టత ఇదే. శ్రీశ్రీలో ప్రభవ తరువాత వచ్చిన మార్పును బింబించే మహాప్రస్థానం ఆ తరువాత మరో మహాప్రస్థానం అవతరించాయి. పద్యం నుండి మాత్రాఛందస్సు ఆపైన వచన కవిత్వం ఆ తరువాత జానపద ఛందోఫణితుల్లో రచనల్ని గమనిస్తే సంప్రదాయం కాల్పనికం అభ్యుదయం విప్లవం మార్గాల్ని సూచించే విభిన్న లక్షణాల్ని గుర్తించవచ్చు. రచనల్లో బహిస్స్వరూపంలో అంతస్స్వరూపంలో లక్ష్యనిర్దేశంలో మార్పు స్పష్టం.

దీన్నిబట్టి భిన్న కవులతోపాటు ఒకే కవిలోను కాలంపై వచ్చే మార్పుల్నిబట్టి కలిగే దృష్టిభేదం వల్ల కవిత్వ నిర్వచనమూ మారుతుందన్న విషయం ఆలోచనకు వస్తుంది. కాలం గడిచేకొద్దీ అన్నిటిలోను మూలభూతమైన కవితాస్పర్శలో సృజనశక్తి గుర్తింపబడి నిలిచిపోతుంది. దాశరథి రచనల్లో పద్యం గేయం స్వేచ్ఛా కవిత్వ రూపాల్ని ఈ సందర్భంలో గమనించవచ్చు పాఠకులు అభిమానులచేత ప్రచారాన్ని పొందుతుంది. కవులచేత పరంపరగా కొనసాగింపబడుతుంది. ఈ అంశం సమకాలీన పరిస్థితుల్లో అతివ్యాప్తి అవ్యాప్తి దోషయుతమైనా ఎన్నో వ్యవహారకారణాలవల్ల లౌకికదశలో ఎక్కడికక్కడ విడివిడిగా ప్రచారరూపంలో ఉన్నా ఆపైన సందేహాలకు ప్రశ్నలకు చర్చలకు స్థానీయమై కాలాన్ని అధిగమించిన మరో రూపంతో ఆలోచనకు వస్తుంది.

కవిత్వంతో సంబంధం ఉన్నవాళ్లు సమాజంలో సాధారణ పాఠకులు అభిమానులు విమర్శకులు సహృదయులు పండితులు కవులు. వీళ్ళవల్ల వేదసూక్తాల నుండి ఈనాటి కవిత్వం దాకా కవిత్వం ప్రత్యేకమైన స్థానాన్ని పొందింది. ఎవరికి వారు చదువుకోడం అట్లా ఉంచి ఒకరు వినిపిస్తే మరొకరు వినే స్థితి ప్రాచీనకాలం నుండి

వస్తుంది. లవకుశుల రామాయణ గానం అంతకుపూర్వం ప్రాచీనకాలం నుండి వచ్చే వేదపఠనం మన దృష్టికి వస్తాయి. ఒక్కరే చదువుకునే కంటే ఈ విధంగా శ్రోతగా ఆనందించే అవకాశంవల్ల కలిగే ప్రయోజనం పేరు. స్వల్పసంఖ్యంలో ఉన్న సమావేశాల్లోను బహుళ సంఖ్యలో ఉన్న సభల్లోను ఈ పద్ధతి బాగా రాణింపుకు వచ్చింది. ఇదే కావ్యపఠనం కావ్యగానం కావ్యగోష్ఠి కవిసమ్మేళనం అనీ ప్రముఖంగా వ్యాప్తిలో ఉంది. కవి సమ్మేళనం ఇటీవల బాగా ప్రచారంలో ఉంది.

ఆధునిక యుగంలో నలభై యాభై ఏండ్ల క్రితం భావ కవిత్వోద్యమ నాయకుడు దేవులపల్లి కృష్ణశాస్త్రి తన కృతులనే కాకుండా సమకాలికులైన ఇతర కవుల కృతుల్ని గానం చేస్తూ ఊరూరు తిరుగుతూ ఆధునిక కవిత్వానికి విశేష ప్రచారాన్ని కలిగించిన విషయం అందరికీ తెలిసిందే. పాఠకులు తాము చదివేప్పుడు స్థితిని ఆలోచనాత్మకంగా మలచుకుంటారు. అదే తాము వినేప్పుడు ఆవేశాత్మకంగా తీర్చబడుతుంది. కృష్ణశాస్త్రి చేసిన కవితాగానం ఎక్కడా రికార్డు చేయబడకపోవడం మన దురదృష్టం. విశ్వనాథ కావ్యపఠనం మధ్య మధ్య వ్యాఖ్యాన సుందరంగా చిన్న చిన్న కథలతో ఆవేశ భాసురంగా ఎంతో ప్రభావోపేతంగా ఉండేది. ఎంతసేపైనా మహనీయమైన ఆకర్షణ స్థాయి తగ్గేది కాదు. ఇక దాశరథి నారాయణరెడ్డి ఇరువురు భిన్నరీతుల్లో కావ్యగానం చేస్తూ ఆంధ్రదేశంలో ముఖ్యంగా తెలంగాణాలో ఆధునిక కవిత్వాన్ని ప్రజల దగ్గరికి తీసికెళ్ళి సమాజంలో సాహిత్య చైతన్యం కలిగించిన సంగతి అందరికీ తెలిసిందే. ఇట్లా ఎందరో! వీరంతా తమ కృతుల్ని మాత్రమే చక్కగా గానం చేసేవారు లేదా పఠనం చేసేవారు. కేవలం కావ్యగానం లక్ష్యంతో వివిధ కవుల కృతుల్ని ప్రజల మధ్యకు తీసుకొని వెళ్ళే సాహిత్యయత్నం కృష్ణశాస్త్రి తరువాత జరగలేదనే చెప్పాలి. దీనికెంతో ఉదార హృదయం అవసరం. అయితే బెంగాల్‌లో ఈ పరంపర ఉంది. ఇక్కడ ఉదార హృదయం అట్లా ఉంచి కవిత్వప్రచారంతోపాటు ధన సంపాదనంపై దృష్టి అధికం. అంతో ఇంతో శ్రమించి వివిధ కృతుల్ని అభ్యసించి వివిధ కవుల కవిత్వాల్ని ఆకర్షణీయంగా గానం చేసి ధన సంపాదనం చేసే సంచార బృందాలు సుమారు నలభైదాకా ఉన్నట్లు చెబుతారు. ఇటీవల బెంగాల్‌లో గౌరీ ఘోష్ ఆమె భర్త పార్థుఘోష్ ఇరువురు ఆధునిక కవిత్వాన్ని గానం చేస్తూ ప్రజలను ఆనందపరవశుల్ని ఆలోచనా నిమగ్నుల్ని చేసే కార్యక్రమాలు చేపట్టారు. ఇక్కడ ధనార్జనతోపాటు సాహిత్యాభిలాష ప్రచార తత్పరత ఉంది. బెంగాలీయులకు సాహిత్యమన్నా కళలన్నా అందునా కవిత్వమంటే ఎక్కువ ప్రీతి కావడంచేత ఈలాంటి కార్యక్రమాలు విజయవంతమే అవుతాయి.

ఈ కార్యక్రమాల్లో వివిధ దృక్పథాల కవిత్వం వినబడుతుంది, ముందు మాటలతో ఆరంభించి మధ్యమధ్య సందర్భోచిత వ్యాఖ్యలతో వివరణలతో సాగుతుంది. కావ్యగానం వివిధ గతి విశేషాలతో భావస్ఫూర్తితో మంచి స్వరసంయుతంగా నిర్వహించడం వీరి ప్రత్యేకత. ఖాజా నజ్రుల్ ఇస్లాం కుమారుడు ఖాజా సవ్యసాచి ప్రత్యేక పద్ధతిలో చేసే కావ్యగానం జనామోదాన్ని పొందింది. ఈ సందర్భంలో హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ్‌నూ పేర్కొనవచ్చు. ఆయన పఠనం భావస్ఫోరకంగా ఉంటుంది.

కావ్యపఠనం, కావ్యగానం ఒక కళ. కవి వ్రాసింది అర్థం చేసుకొని అందులోని భావానికి తగినట్లుగా ఉద్రేకాన్ని పొంది ఆలోచనను గుర్తించి తగిన స్థాయిలో స్వరాల్ని పలుకుతూ అందులోని గతిభేదాల్ని వైవిధ్యాన్ని మధ్యమధ్య ప్రదర్శిస్తూ గానం చేయడం ఒక కళే. హిందీలో నీరజ్ కవి ఈ విధానంలో శ్రోతల్ని ఆకర్షించే శక్తిసంపన్నుడు. అయితే స్వయంగా తన కృతిని మాత్రమే కవి గానం చేయడం వేరు. ఇతరుల కృతుల్ని కళాత్మకంగా గానం చేయడం వేరు. బెంగాల్‌లో ఈ విధమైన కావ్యగానంలో శిక్షణనిచ్చే పాఠశాలలున్నట్లు వినబడుతుంది.

ఈ విషయం ఎందుకు ప్రసక్తమైందంటే కవిత్వానికి ప్రకాశమాన స్థితి కూడ అవసరమే. కావ్యగానం లేదా కావ్యపఠనం ఈ అవసరాన్ని చాలావరకు తీరుస్తుంది. దీనివల్ల ప్రజల్లో సాహిత్యాభిలాషను పెంపొందించే ప్రయోజనం సిద్ధిస్తుంది. యువతరంలో ఉత్సాహం వెలుగుతుంది. సాహిత్య వాతావరణాన్ని నిర్మిస్తుంది.

స్వేచ్ఛాకవిత్వం వచ్చాక కవిత్వాన్ని గానంచేసే పద్ధతి కవకాశం లేకుండా పోయింది. అయితే భావవ్యంజకంగా గతి విశేష స్ఫూర్తితో ప్రత్యేక పద్ధతుల్ని అనుసరించి చదివే వీలు లేకపోలేదు. కవిత్వం వినేప్పుడు ఏది కవిత్వం? అన్న ప్రశ్న జనించదు. ఆ తరువాతనే చర్చకు రావచ్చు. కవిత్వం చదివేప్పుడు ఉత్పన్నం కావచ్చు. ఎందుకంటే ఆలోచనకు సమయం ఉండాలి మెల్లగా వీలు చేసుకోవచ్చు. మానవునిలో జిజ్ఞాస ఆలోచనా శక్తి అన్వేషణ హేతుదృష్టి ఉన్నంతవరకీ చర్చలు ఉంటూనే ఉంటాయి. కవిత్వం దారిన కవిత్వం – స్పందన శక్తి సృజనగుణం ఉన్నంతవరకు వస్తూనే ఉంటుంది. కవిత్వం ఎవరికోసం? ఎందుకు? అనే ప్రశ్నకు సమాధానం, "వ్యక్తి జీవితం ఎవరికోసం? ఎందుకు జీవించడం?" అన్న ప్రశ్నలకు దొరికే సమాధానంలోని భాగమే కాని వేరు కాదు. జీవితంలో ప్రత్యేకత వైవిధ్యం ప్రయోజనమే కవిత్వంలోనూ తప్పనిసరిగా ఉంటుంది. జీవితంలోని అస్తిత్వమే కవిత్వం పొందే రూపం.

# 4. కవిత్వమూ - అనుభవమూ

కవిత్వం చదివేప్పుడు లేదా వినేప్పుడు మొదట పరిచయానికి వచ్చేది శబ్దం. శబ్దాల క్రమవిన్యాసంలో అర్థం - భాగాలుగా వాక్యం, ఆపైన విభాగంతో ఖండాలుగా భావం ఆపైన సమాహారంగా అవగతికి వస్తుంది. సామాన్యార్థానికతీతమైన ఆలోచన మన సంస్కారాన్నిబట్టి, భావనాస్థాయినిబట్టి విశిష్టమైన సౌందర్యం స్ఫూర్తికి వస్తుంది. ఈ స్ఫూర్తి విశేషం మనస్సుకు ఒక ఆలోచనను ఒక తాదాత్మ్యాన్ని లేదా విలీనత్వాన్నీ కలిగింపజేస్తుంది.

ఇది స్వేచ్ఛా కవిత్వంలో తరంగసదృశంగానూ, ప్రవాహసదృశంగానూ మనస్సును స్పృశిస్తుంది, ముంచెత్తుతుంది. ఈ పరిస్థితిలో మనస్సు ఆలోచనకూ పరివర్తనకు లోనవుతుంది. ఆనందానికి దారితీస్తుంది. ఆపైన అనుభవముద్ర బలమైన ఆకర్షణ కేంద్రంగా మనస్సులో నిలుస్తుంది. ఒకదాని తర్వాత మరొకటి కలిగే అనుభవ ముద్రలన్నీ ఆ తర్వాత కలిగే అనుభవానికి దోహదం చేసేవిగా ఉంటాయి. ఇవి సాహిత్యాభిలాషను విస్తృతం చేస్తుంది. ప్రవేశ సౌలభ్యానికి దారితీస్తుంది. వైవిధ్యాన్ని సంతరింపజేస్తుంది, వివేచనను పెంపొందింపజేస్తుంది సౌక్ష్మ్యాన్ని దర్శింపజేస్తుంది ఈ కవిత్వానుభవం ఒక ప్రమాణస్థాయిని అందుకోవడంతో పరిణతమైన మనస్థితి చేకూరుతుంది. పద్యానుభవం కన్నా ఈ క్రమం భిన్నమైంది. పద్య రచనలో సాధారణంగా పపద్యానికది పూర్ణమైతే స్వేచ్ఛా కవిత్వంలో ఒక స్థితి లేదా ఒక భావాన్ని బట్టి వాక్యం లేదా వాక్యసముదాయం పూర్ణభాగంగా విభాజితమవుతుంది..

పాఠకుల లేదా శ్రోతల సంస్కారాన్నిబట్టీ భావనా శక్తినిబట్టీ, ఆర్ద్రమైన మనోలక్షణాన్నిబట్టీ ఉత్తమ కవిత్వంలోని విలువలు ప్రకాశమానమౌతాయి. ఇక్కడ కొన్ని దిశలు ఒకదానితో మరొకటి అనుబంధంతో క్రమించడం గమనించవచ్చు. 1) శబ్దాలు గ్రహించడం, 2) అవయవార్థం అవగతికి రావడం, 3) భావన ప్రసరించడం, 4) పరి వర్తనకు లోనుకావడం, 5) తాదాత్మ్యం పొందడం, 6) అనుభవంగా నిలిచిపోవడం, 7) విమర్శనాత్మకత కలగడం, 8) ప్రభావకేంద్రంగా రూపొందడం, 9) ఇది మరో అనుభవాన్ని విస్తృతం చేయడం లేదా గాఢతరం చేయడం, 10) సమాహారంగా విశిష్టమైన వ్యక్తిత్వ నిర్మితి జరగడం. ఈ అంశాలు క్రమంలో దశదశలుగా, స్పష్టంగా మన అవగతికి వచ్చేవి. ఈ పరిణామం ప్రతీ రచన గురించి ఉంటుంది. అయితే ఉత్తమ రచనలవల్ల కలిగేది గాఢమైందీ సూక్ష్మమైందీ, నిశితమైందీ. ఒక రచన చదవకముందూ, చదివాకా

ఆ తరువాత తరువాత ఉండే తారతమ్యం స్పష్టంగా అనుభవానికి వస్తాయి. ఒక కొత్త వెలుగులో, ఒక కొత్త ప్రపంచంలోకి చేరి కొత్త కొత్త దృశ్యాలను చూస్తూ, కొత్త కొత్త లక్ష్యాలను అందుకున్నట్లుంటుందీ అనుభవం.

స్వేచ్ఛా కవిత్వంలో ఆలోచన, అనుభవం రెండూ సంయోజితమై కన్పించే భావరూపాలు సాధారణంగా ఏదో ఒక భావకేంద్రాన్ని, లేదా కొన్ని భావస్థానాలనో ఆశ్రయించి ఉంటాయి. ఇందులో కథ ఉండదు. కాని స్థితి ఉంటుంది. కొన్ని స్థితుల యోజనం ఉండవచ్చు. అది వస్తుగతం కావచ్చు. మనస్తత్వయుతం కావచ్చు, కేవలం భావ విన్యాసం కావచ్చు. ఈ సృష్టిలో మనఃప్రపంచం, అందులోని రహస్యాలు- స్మృతులు- వీటిని వెలికితీసే ప్రయత్నం, వర్తమాన చిత్రణం - ఎక్కువగా కన్పిస్తాయి.

ఈ సమాజంలోని వాస్తవం, జీవితంలోని అనుభవం రెండూ దీన్ని ప్రభావితం చేస్తాయి. వాస్తవికత జీవితానికి సంబంధించింది. అనుభవం మనోగతికి సంబంధించింది. కవిత్వంలో రెండిటినీ వేరుచేసి చూడలేం. వీటి సహభావం ఒక స్థాయికి చేరినపుడు ఉదాత్తతను సంతరించుకుంటుంది. ఇది దర్శనశక్తి వికాసంతో లేదా తేజంతో, అసాధారణమైన తాత్త్వికతను సంతరించుకుంటుంది.

ప్రతి వ్యక్తిలోనూ "అహం" ఉంటుంది. ఇది ఒక్కొక్కపుడు క్రియాశీలాన్ని వేగవంతం చేస్తుంది. ఇది రూపానికీ గాఢత్వాన్నీ నైశిత్యాన్నీ కలిగింపజేస్తుంది. అయితే ఇది ఉత్తమ కార్యాల్లో స్వార్థాన్ని వీడి నిర్మలినత్వాన్ని పొందుతుంది. అపుడే ఉజ్జ్వలతను పొందుతుంది. ప్రేరకశక్తిగా నిలుస్తుంది. ఇది క్షణాల్లో జరిగేది కాదు. దీనికి కొంత సమయం పడుతుంది. దీనికి కొంత సహనం కావాలి. స్పందనతో వేదనతో ఆలోచనతో ఏర్పడిన ఒక తీరులో మనస్సు ప్రవహించాలి. ఒక క్రమంలో మనస్సు మలినరహితం అయ్యేకొద్దీ తేజోవంతంగా ప్రకాశించేకొద్దీ "అహం" స్థానంలో దార్శనికత సిద్ధిస్తుంది.

కవిత్వంలో కథా ప్రణాళిక లేనపుడు ఉద్వేగం పాలు తగ్గినపుడు, ఆలోచనానుభవం ప్రధానంగా వివిధ భావకేంద్రాల సంయోజనంతో, భావస్థానాల సంపుటితో, ఏర్పడిన స్వేచ్ఛా కవిత్వాన్ని అర్థం చేసుకోడానికి, ఆయత్తమయ్యేసరికి కొంత సమయం పడుతుంది. దీనితో పరిచయం అయ్యాక, ఏర్పడిన రూపంలోని తీరు తెలిసాక; శిల్పంలోని ఒడుపు చిక్కాక, ఒక తెన్ను దొరికి - అర్థం చేసుకోవడంలో క్రమంగా కష్టం తొలగుతూ ఉంటుంది. ఇది క్షుణ్ణమై ఆ తరువాత సుగమత్వాన్ని పొందుతుంది.

ఉత్తమ కవిత్వంలో ఆలోచన లేదా ఉద్వేగం రెండిటిలో ఏదైనా ప్రధానంగా

ఉండవచ్చు. ఈ రెండూ దేనికది విడివిడిగా గాక, ఒక్కొక్క రచనలో ఒక్కొక్క కవి వ్యక్తిత్వంలో ఒక విధమైన హెచ్చుతగ్గుల్లో విచిత్రమైన సమ్మేళనాన్ని పొందుతుంది. ఒకే కవి వివిధ సందర్భాల్లో వెలువరించిన కవిత్వంలో ఈ లక్షణం వేరువేరుగానూ ఉండవచ్చు. అప్పటి అనుభవరూపాన్ని బట్టి ఆ వేగస్థాయి, వస్తు విన్యాసం, భావస్థానాల తీరు, ఆలోచనా శక్తి, మొదలైన అంశాలను బట్టి ఉంటుంది. అయితే ఒక కవి కవితావ్యక్తిత్వం, లేదా రచనా స్వరూపం గురించి ఒకమారు చదివి స్థూలంగా నిర్ణయం చేయవచ్చు. దీన్ని వివేచిస్తూపోతేగాని వెనుక దాగిన అనేకమైనసూక్ష్మ రహస్యాలు వెల్లడి కావు.

స్వేచ్ఛా కవిత్వంలో చాలా సందర్భాల్లో ఏర్పడే క్లిష్టత, భావ రూపాలకు ప్రతీకలకూ సంబంధించింది. వివిధ భావరూపాలతో ప్రతీకలతో విశిష్టమైన స్వరూపాన్ని యోజితం చేసేప్పుడు వాని సమీకరణ పద్ధతిలో క్లిష్టత కనపడవచ్చు. భావరూపం ఆలోచనాగతమైంది. అవ్యక్తచేతన యొక్క స్పందనరూపంగానూ, ఆవిష్కృతం అవుతుంది. దీనికీ, ప్రతీకకూ భౌతికాతీతమైన రూపాన్ని అనుభవానికి తెచ్చే శక్తి ఉంది. ఏ కవీ పాఠకుల్ని లేదా శ్రోతల్ని కష్టపెట్టే ఉద్దేశంతో భావరూపాల్నీ ప్రతీకల్నీ నిర్మించడు. కాని అనుకోకుండా ఇది సంభవించవచ్చు అతని ఉద్దేశం గ్రహించి ఆలోచనతో స్పందించి అనుభవించవలసిన అవసరం ఉంది. భావంలో గాఢత్వంవల్ల లేదా భావం బాగా కుదింపబడడంవల్ల క్లిష్టత చోటుచేసుకునే అవకాశం ఉంది.

కథాభాగం లేదా వస్తువుపై దృష్టి లేకపోవడంవల్ల కేవలం భావకేంద్రం చుట్టూ ఆలోచన అల్లబడడం, లేదా విస్తరించడంవల్లనూ క్లిష్టత ఏర్పడుతుంది. దీనికి ప్రత్యేకంగా అనుభవదృష్టిలో వ్యాఖ్యానాత్మకమైన ఆలోచనా వైఖరి అవసరం. ఇది ఒక్కమారు పరిచయమైతే క్రమంగా ఒక పద్ధతి కలవాటు పడడం, ఆ తరువాత ఏర్పడిన దారిలో సుగమంగా ప్రయాణించడానికి మనస్సు సిద్ధమై ఉంటుంది. ఈనాటి స్వేచ్ఛా కవిత్వంలో భావరూపం, ప్రతీక ప్రాముఖ్యం గురించి వేరే చెప్పనక్కర లేదు.

కవిత్వం విషయంలో చిత్రమేమంటే, ఏది ఔనో చెప్పడంకంటే ఏది కాదో చెప్పడం సులభం. అందునా వ్యక్తీ సమాజం ఎన్నో ప్రభావాలకు గురౌతున్న తరుణంలో దీని నిర్ణయం మరీ క్లిష్టతరమైంది. ఈనాడు రూపం గురించీ అభిప్రాయభేదం ఉంది. ఛందస్సులో వ్రాసేవాళ్ళూ, దాన్ని వదిలేసినవాళ్ళూ ఉన్నారు. అనేక విధాలుగా సమాజంలో స్వేచ్ఛ – భిన్నాభిప్రాయాలు కలిగి ఉండే స్వాతంత్ర్యం అనుభవంలో ఉన్నపుడు భిన్న మార్గాలకూ భిన్న పద్ధతులకూ ఎంతో అవకాశం ఉంటుంది. ప్రజాస్వామ్యం యొక్క

గొప్ప ప్రయోజనాలను బాగా ఉపయోగించుకొనే ప్రధాన క్షేత్రాల్లో సాహిత్యం కూడా ఒకటి. లక్ష్యంలోనూ అనేక దర్శనరూపాలు కన్పిస్తాయి. ఇవన్నీ సాహిత్యాన్ని సంపన్నం చేసేవి, సంస్కృతీ రూపాన్ని విస్తృతపరచేవి. అయితే ఏది స్వీకార్యం ఏది అత్యంతావసరం అన్నవి ఎవరికివారు నిర్ణయించుకోవలసిందే. స్వయంనిర్ణయం కవి వ్యక్తిత్వానికి నిదర్శనం. మొత్తం మీద వ్యక్తిలోని ఆలోచన, అనుభవం, అభిలాష, పాండిత్యాలను సూచిస్తుంది.

కొత్తను అన్వేషించే లక్షణం – మార్పును కోరే తత్త్వంతోపాటు పాతలో ఒక విధంగా ఏర్పడిన స్తబ్ధత, కొత్త ప్రయోగాలకు దారితీస్తుంది. సమాజంలోని స్వేచ్ఛా వాతావరణం రచనలో స్వేచ్ఛను అవలంబించే ధోరణికి దారితీస్తుంది. ఒక్కొక్కమారు సమాజంలోని కఠోరమైన నిబంధనలు, పనికిమాలిన కట్టుబాట్ల నుండి విముక్తం కోరే మనస్సు స్వేచ్ఛవైపు ఉత్క్రమిస్తుంది.

ఈనాడు ఛందస్సు విషయంలో ముక్త ఛందోధోరణిలో ఈ అంశాల్ని చూడవచ్చు. ఇదే చరమావధి అవదు. కఠినమైన పాత నియమాల నుండి విముక్తం కోరే స్వేచ్ఛా తత్త్వంలోని తీవ్రత, ఈ పద్ధతినవలంబింప జేసిందన్నప్పుడు, దీని చారిత్రకమైన పరిశీలనం చేయవలసి ఉంటుంది. కొంత కాలానికి మరో క్రొత్త ఛందస్సులోనో కొత్త విధంలోనో కవిత్వం వ్రాయబడవచ్చు. ఇందులో పరిమితంగా నియమాలుండవచ్చు. ఛందస్సువల్ల సంక్షిప్తత చేకూరుతుంది. అస్పష్టత తొలగే అవకాశం ఉంది. విశిష్టమైన గతి, ఒక ఆకర్షణ సిద్ధిస్తుంది. రచనలో శిల్పప్రదర్శనకు ఆస్కారం ఉంది. ఇలా ఛందస్సు కవిత్వానికి ఏ విధంగానూ భంజకం కాదు. మన తెలుగులో మొదటినుండీ వచ్చే చంపకోత్పల శార్దూల సీసాదులే ఛందస్సు అనుకోకూడదు. ఈనాడు స్వేచ్ఛా కవిత్వంలోనూ, విశ్లేషించి చూస్తే, తెలిసో తెలియకో ఛందస్సుకు సంబంధించిన అంశాలు అక్కడక్కడా చోటుచేసుకోవడం గమనించవచ్చు. వైవిధ్యాన్ని కోరే తత్త్వం, కొత్తను అన్వేషించే స్వభావం అనేకమైన ప్రయోగాలకు దారితీస్తుంది.

కవిత్వం ఎప్పుడూ సాధారణ వచనం కన్నా భిన్నమైన పద్ధతిలోనే ఆవిష్కృత మౌతుంది. సాధారణ వచనం కొన్ని సందర్భాల్లో యథాతథంగా ఒక ప్రభావం ఉద్దేశించి, ఉపయుక్తమౌతుంది. అయితే కొందరి స్వేచ్ఛా కవిత్వంలో ఛందస్సు విషయంలో ఒక సంకీర్ణత కన్పిస్తుంది. ఎక్కడో లయ అందుతూ, కొన్నిచోట్ల మాత్రాగతి చేకూరుతూనో, అంతలో యతి, ప్రాస అక్కడక్కడా కుదురుతూనో ఏదో ఛందో రూపానికి దగ్గరగా పాదాల్లో పాదఖండాల్లో మెదలుతూనో, ఒక ఊపు ఒక గతిలో అంతలో మారుతుంది. ఆరోహణంతోనో అవరోహణంతోనో మనస్సులో విచిత్రమైన విన్యాసంతో ఛందోగతమైన

అనుభవ ప్రభావాన్ని స్థూలంగా కలిగించే లక్షణం చూడవచ్చు. ఇది ఛందస్సు ప్రభావం నుండి తప్పించుకోలేని స్థితిని సూచిస్తుంది. ఛందస్సు అంటే, మౌలికంగా గణాల ఏర్పాటు; మాత్రల పంపకం - ఉన్నా ఒక విశిష్టమైన గతితో ఆరోహణావరోహణం ఉన్న పదవిన్యాస శిల్పం ముఖ్యం. దీన్ని ఎంత రమణీయంగా సాధిస్తే, రచనకంత ప్రభావశక్తి చేకూరుతుంది. ఇది కేవల శాస్త్రాన్ని మించిన పరిధిలోనిది. ఈ పరిధిలో స్వేచ్ఛా కవిత్వం వ్రాసే ప్రయత్నం జరిగింది. పద్యరచనా శిల్పం తెలిసిన వాళ్ళలో బాగా కన్పిస్తుంది.

ఇకపోతే మౌలికమైన విషయానికి వస్తే, వివిధ భాషల్లో భిన్న విధానాలవలంబించడం జరిగింది. అన్నింటిలోనూ ఏదో యాంత్రికంగా లాక్కొనిపోయే గుణం తప్పనిసరిగా ఉంటుంది. ఇందులో కవి ప్రవేశపెట్టే ప్రతిభాపూర్వకమైన విన్యాస శిల్పం, సాధారణ పాఠకుడు ఆనందించడానికీ, విశేషంగా భావుకులు వ్యాఖ్యానించడానికీ, విమర్శకులు వివేచించడానికీ అవకాశం కలిగిస్తుంది. దీన్నిబట్టిచూస్తే ఆలోచనాభివ్యక్తిలో భావరూపమైన స్పష్టతనూ, రూపావిష్కరణలో ఆకర్షణీయమైన గతిని సాధించేంతవరకు, కవిత్వంలో ఏ కాలమైనా ఛందస్సుయొక్క ప్రమేయంవల్ల నష్టం లేదు. ఈ ప్రమేయం మరీ ఎక్కువై అసలు కవిత్వంపై దృష్టిపోయి, ఛందశ్శిల్పం కవిత్వాన్ని మ్రింగేసి మొత్తంమీద పీట వేసుకోవడాన్ని ఎవరూ సమర్థించరు, సమంజసమూ కాదు. కవికి తెలిసీ తెలీకుండానే స్వేచ్ఛా కవిత్వంలో, ఛందస్సు నెరపిన అనివార్యమైన ప్రభావం గురించి చందస్ సంప్రదాయ మనస్తత్వపరమైన అంశాల పై దృష్టితో పరిశీలనం జరగవలసి ఉంది.

ఈ సందర్భంలో మరో విషయం - కవిత్వం పైకి చదివేట్టు చేసేది ఒక విధం- లోలోపల చదువుకునేట్టు చేసేది మరోవిధం, మొదటిదానిలో మొదలుపెట్టగానే వేగం అందుకొనే రచనా శిల్పంతో, ముందుకు త్రోసుకొనివచ్చే ఆ వేగంతో గతివిశేషం అనుభవానికి వస్తుంది. ఇక్కడ ఛందస్సు ప్రమేయం అధికం. రెండోదానిలో మొదలు పెట్టగానే మనస్సును ఆలోచనాయుతం చేసేది. గతివిశేషంపై కన్నా భావప్రసారం అనుభవానికి వస్తుంది గతి తావన్మాత్రంగా ఉంటుంది.

వ్యక్తినుండి వ్యక్తికి జీవితం భేదించినట్లే ప్రతి సృజనరూపం రచయిత నుండి రచయితకు భేదిస్తుంది. జీవితంలో పరిచయాలు, పరిస్థితులు, అభిరుచులు, అనుబంధాలు, ప్రయోజనం మాదిరే రచనపట్ల అన్వయించుకోవచ్చు. అభిప్రాయ భేదాలూ తరచు ఏర్పడడం సహజం. ఒక్కొక్కపుడు సవ్యాజంగా, మరొకపుడు నిర్వ్యాజంగా బాహ్యమైన ఆంతరమైన హేతువులనుబట్టి ఇవి ప్రకటితం అవుతూంటాయి. వీటి

సంకలన రూపమే విమర్శనా ప్రపంచం. పాఠకుడు ఆగినచోటునుండి పండితుడు, అతడు నిలచినచోటునుండి వ్యాఖ్యాత, వ్యాఖ్యాత కదలని చోటునుండి విమర్శకుడు ప్రయాణం ఆరంభిస్తారు. విమర్శకుడు ఎరుగని చోట్ల సహృదయుడు లేదా భావుకుడు అనుభూతి శీలంలో ప్రవర్తిస్తాడు. సాహిత్య విద్యాప్రపంచంలో వివిధ వలయాలున్నాయి కాబట్టి వీటిని బట్టి స్థాయిలో తరగతులు తప్పనిసరి. వీరంతా వివిధ రూపాల్లో అనుబంధాల్ని స్థాపిస్తూ పరస్పర ప్రభావంతో సాహిత్యాభిలాషను సంపన్నం చేసేవారు. వీరిలో ముఖ్యంగా విమర్శకులు, భావుకులవల్ల ఆలోచనాగతిలోనే మార్పు రావచ్చు. ఎంతోకాలంగా నిర్లక్ష్యం చేయబడిన రచనలపై ఆదరం పెరగవచ్చు. చాలా బాగా ప్రచారంలో ఉన్నవాటిపై పునఃపరిశీలనం జరగవచ్చు. అందువల్ల వీరి బాధ్యత అనితరమైంది. గ్రహణశక్తితోపాటు పరిశీలనం, వివేచనం ఉంటే సరిపోదు. ఉదారత కూడా అవసరం. ఒక్కొక్కడు దారి తప్పడమూ జరుగుతుంది. వివేకవంతమైన హేతుదృష్టి దీన్ని నియమిస్తుంది.

ఈనాటి స్వేచ్ఛా కవిత్వం విషయంలో ఇంకా క్షుణ్ణమైన సమాలోచనా పథరూపం ఏర్పడలేదు కాబట్టి, ఈ విషయంపై శ్రద్ధ తప్పనిసరిగా అవసరం. ఇందులో వివిధ భావస్థానాల సంవిధానం; వివిధ భావ రూపాల సహయోగంతో జరిగే నిర్మాణం గురించి, పరిచయంతో సరిపోదు. పరిశీలన అవసరం. ఈ అనుభవం క్రొత్త ప్రపంచంలో ప్రవేశించడం వంటిది. ఇందులో అన్నీ తెలుసుకోవాలనే కోరిక, తెలిసినదాన్ని గురించిన ఆలోచన జరిగినపుడే, బాధ్యతను నిర్వర్తించినవాళ్ళమౌతాం. ఎంతో వైవిధ్యం కలిగిన ఆధునిక వాతరణంతో సుస్వరతను పొందే స్పందన శక్తి కలిగి ఉండడం సామాన్య విషయం కాదు. ప్రవహించే కాలంలో కదలుతూన్న వాస్తవాన్ని గుర్తించి, అందులో ప్రయాణం చేయడంతో విశిష్టమైన అనుభవ సంపాదనం ఒక విశేషమే. ఈ అనుభవాన్నీ, ఆలోచననూ తక్కినవారికీ అవగతికి తెచ్చే కళారూపమే సమాలోచనం.

"ఒక చేతిలో శాంతిపుష్పం
మరో చేతిలో ప్రజాస్వామ్య కేతనం
సృజన కిరణ హృదయంతో
మనిషి అమృత యానం!"

# 5. స్వేచ్ఛా కవిత్వం - ఆధునిక పరిణామం

స్వచ్ఛంద నిర్మాణ శిల్పమే స్వేచ్ఛా కవిత్వం. ఈనాడు విస్తారంగా ప్రచారంలో ఉంది. ఈ సందర్భంలో కనీసం పది పదిహేనుగురు కవులు వ్రాసిన ఉత్తమశ్రేణికి చెందిన కవిత్వం స్ఫురణకు వస్తుంది. ఇది ఈనాడు సమాజంలో వ్యక్తి ఎదుర్కొనే జీవితం మారుతూన్న విలువలు అందుకునే లక్ష్యాల దృష్ట్యా వస్తువుతోపాటు రూపమూ మార్పుచెంది అవతరించింది. ఇప్పుడు వస్తూన్న ఈ కవిత్వంలో ఎంతో వైవిధ్యం ఉంది. ప్రాచీన తేజాన్ని నిలుపుకుంటూ ఆధునిక వికాసాన్ని సంతరించుకుంటూ పరివర్తనశీలంతో పరంపరా బంధంతో అభ్యుదయ కాంక్షతోనూ, విప్లవస్ఫూర్తితోనూ సమన్వయ గుణంతోనూ అనేక జీవిత పార్శ్వాలను బింబిస్తోంది. ఈ విధమైన వైవిధ్యం పూర్వం ఏ దశలోనూ కన్పించదు. సాహిత్య చరిత్రలో విశిష్టమైన స్థానాన్నీ స్థితినీ పొందింది. స్వేచ్ఛా కవిత్వంలో ఈనాడు కన్పించే వైవిధ్యాన్ని గుర్తించ వలసిన అవసరం ఉంది. ఈ వైవిధ్యానికి వ్యక్తి స్వేచ్ఛతో పాటు విస్తృతమైన జీవిత సందర్భాలూ, వ్యక్తిత్వంలో ఎవరికి వారు ప్రత్యేకత కోసం ఆరాటం కారణాలనవచ్చు. ఇది వారి ఇచ్ఛ కనుగుణమైందీ, స్వేచ్ఛతో కూడిందీ. ప్రస్తుత సమాజంలో స్వేచ్ఛా వాతావరణంలో పరివర్తనా శీలంతో వేగాకులమైన సంశ్లిష్ట జీవితం ప్రభావం దీనిపై ఉన్నమాట నిజం. ఈ విధంగా ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య వ్యవస్థ నంగీకరించిన సమాజంలో దీని పరిణామం ఎంతో సహజమైందీ, చారిత్రక గతియుతమైందీ. ఇందులో ప్రజాస్వామ్య భావప్రసారం స్పష్టంగా కనిపిస్తుంది. వస్తువులో రూపంలో అభివ్యక్తిలో లక్ష్యంలో దీనికనుగుణమైన స్థితిని స్పష్టంగా గమనించవచ్చు.

స్వేచ్ఛా స్పందనతో ప్రాణితమయ్యే ప్రజాస్వామ్య వ్యవస్థ రచయితల స్వయం వ్యక్తిత్వ వికాసానికెంతో అవకాశం ఇచ్చేదిగా ఉండడం మరచిపోవడానికి వీల్లేదు. సామాజిక స్పృహ రాజకీయ చైతన్యం, కొత్తపట్ల అభిలాష, జీవితం గురించి గుణాత్మక మైన ఆలోచన, పాత విలువల్ని వర్తమాన స్థితి కనుగుణంగా మలచుకొనే దృష్టీ, అన్వేషణతో పాటు అంతర్జాతీయ ప్రభావ సంపత్తీ అన్నీ కలిసి ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధమైన మూల వ్యక్తిత్వరూపం ఏర్పడుతూంది. బహు నియమబద్ధమైన పురాతన రూపమైన, పద్యం నుండి విముక్తమైంది. అనవసరమనుకున్నవి వదలించుకొనీ, తప్పనిసరివి అవలంబిస్తూ స్వేచ్ఛను పొంది ఆవిర్భవించిందీ కవిత్వం. పద్యం ఒక విధమైన పూర్వపు సామాజిక వాతావరణాన్ని భావింపజేస్తే, స్వేచ్ఛా కవిత్వం మరో విధంగా ఆధునిక వాతావరణాన్ని

భావింప జేస్తూంది. వేగంగా పరివర్తనకు లోనయ్యే సామాజిక రూపంతో పాటు, విశిష్టంగా రూపొందే వ్యక్తి అస్తిత్వ ప్రపంచాన్నీ చిత్రించగలిగింది.

ఆధునిక సమాజంలో భావజాలానికీ, ఆలోచనా సరణికీ పద్యం ఎంతవరకు వాహికగా ఉపయోగపడుతోందనేది చర్చింపదగిన అంశమే. ఒక దశలో కొందరు ఆధునికకవులు ప్రయత్నించారు కానీ కృషి ఆరంభంలోనే నిలిచిపోయింది. ఈ సందర్భంలో విస్మరించరాని అంశం ఒకటి ఉంది. అది పద్యం పట్ల ఎవరికి ద్వేషమూ నిరసనమూ లేకపోవడం. పద్యం అందుకున్న శిల్ప శిఖరాలూ అట్లాంటివి. చరిత్రలో పద్యానికి ఉన్న గౌరవస్థితికి ఏ క్షతీ లేదు. కాని అది ప్రస్తుత సామాజిక స్థితిలో అవసరాల దృష్ట్యా ఎంతవరకు తన పాత్రను నిర్వహించగలదనేది వేరే ప్రశ్న. పద్యరచన కళాక్షేత్రం వలె నిలచే ఉంటుంది. పూర్వం వలె విరివిగా వ్రాయబడకపోవచ్చు. అదేవిధంగా పద్యానికి పూర్వం ఉన్న స్థితి ఈనాడూ కొనసాగేది మాత్రం అనుమానాస్పదమే. ఆధునిక జీవితంలో నేడు ఎదురయ్యే సామాజిక అవసరాలకూ, కోరే లక్ష్యాలకూ సరిగా నప్పకపోవడం వల్లనే పద్యం తన స్థానాన్ని కోల్పోతూందన్న విషయం మన విశ్లేషణకందుతుంది. ఇప్పుడున్న పద్యం కన్నా సులభమైన ఛందోరీతి నాశ్రయించి లేదా స్వల్పమైన నియమాలు కలిగే గతిలో లయలో కొత్త విధానాలతోనో ఆధునిక జీవితానికనుగుణంగా మరొక విధం రావచ్చు.

ఈ మరోవిధం స్వయం ప్రేరితంగాను, ఇతర భారతీయ లేదా అంతర్జాతీయ ప్రేరణతోను ఆవిష్కృతం కావచ్చు. కవి అన్వేషణలో భాగంగా నిర్మితం కావచ్చు. సృజనాత్మక శక్తిలో భాగమై అప్పటి అవసరాలను బట్టి వీలునుబట్టి ఉంటుంది. ఇది పొందే కొత్తదనం ఇచ్చే ప్రయోజనం వల్ల చారిత్రక ప్రాముఖ్యాన్ని కలిగి ఉంటుంది. ఈ సందర్భంలో వెనక్కివెళితే గురజాడ ముత్యాలసరాలు పేర్కోవచ్చు. ఈ వెలుగులో చూస్తే పద్యానికి వేయి ఏండ్ల చరిత్ర ఉన్నా సమాజంలో ఇంతకంటే ఎక్కువరెట్లు చరిత్ర కలిగినవే. మార్పులవల్ల ప్రాధాన్యాన్ని కోల్పోయాయి. కొంత గతం గురించి చెప్పుకోడానికి వర్తమానానికి ప్రేరణనిచ్చే సుదూర స్థానాలుగాను, నిలచాయి. అనుభవంలో మాత్రం అవి వాస్తవమైన క్రియాత్మక పాత్రను కోల్పోవడం జరిగింది. ఈ స్థితిలో సామాజిక గతిలో కొత్త పరిణామ సూచకంగా, పద్యానికి భిన్నంగా అంతర్నిహితమైన గతి లయ నిర్మాణ సూక్ష్మాలతో స్వచ్ఛందమైన విన్యాస శిల్పంతో ఆవిర్భవించిందే స్వేచ్ఛాకవిత్వం.

ఆస్తిరూపమైన భూమీ జీవనహేతువైన వ్యవసాయం నుండి క్రమంగా పోనుపోను ఈనాడు మారిన ఆస్తిరూపాలతో వృత్తులతో జీవికలతో జీవితం ఎంతో వైవిధ్యాన్ని

పొందింది. సంపద, పెట్టుబడి, ఉత్పాదనం, వినిమయం, రాబడి, వ్యాపకం, ఉపయోగం తీరులోభిన్నత్వాన్న ప్రత్యేకతను విస్తృతిని పొందింది. క్రియాకలాపాలూ ఎక్కువైనాయి. జీవితం సంశ్లిష్టమైంది, వైవిధ్యం పొందింది. అంతగా ముఖ్యం కానివీ అవసరం అనిపించనివీ, ఉపయోగం లేనివీ వదలుకోవడమో లేదా దూరం కావడమో అదృశ్యమైపోవడమో జరుగుతూంది. అప్పటి అవసరాల్నిబట్టి ఉండే సామాజిక స్థితినిబట్టి కొత్త కొత్త సంబంధాలు ఏర్పడడం ఎక్కువైంది. ఇదేవిధంగా జీవితం నుండి వేరు కాని సాహిత్యంలో ప్రస్తుతానికి కవిత్వంలో అనేక స్థితుల పర్యవసానంగా మార్పులు రావడం సహజమైంది. ఈ సందర్భంలో అనివార్యమైన సామాజిక ప్రభావశక్తులు, వైయక్తికరీతులు మనదృష్టికి వచ్చి తీరుతాయి.

ఈ విశేషస్థితికి దోహదం చేసే మరో అంశం ఉంది. తెలుగులో మంచి పద్యం రాయడానికి పూర్వ కావ్యాలతో మంచి పరిచయం అవసరం. పద్యరచనకు తెలుగులో నెలకొన్న నిర్మాణరీతుల్లో ముఖ్యంగా యతి, ప్రాస స్థానాల్లో సహజత్వంతోపాటు, పనితనమూ, ఒక పాదం నుండి మరో పాదానికి క్రమించడంలో ప్రవాహకత్వం లేదా గొలుసులో మలపుల వంటి శిల్పమూ, ఇట్లా ఎన్ని విధాలుగానో మొత్తంమీద శిల్పజ్ఞత అవసరం. పూర్వ కవుల రచనాశక్తిని మించకపోయినా దానితో సమానంగానైనా ఉండాలని భావుకప్రపంచం కోరుతుంది. దీనికి ప్రాచీన కావ్యసంస్కారంతోపాటు అభ్యాసం శిల్పజ్ఞత ఎంతో ముఖ్యం. వర్తమాన జీవితంలో తప్పనిసరియైన ఇతర వ్యాపకాలవల్ల ఈ విధమైన కృషికి అవకాశం దొరకదు, తీరికా లేదు. పైగా అధీతి బోధనా పద్ధతులు వేరైనాయి.

పద్యం అర్థం చేసుకునేందుకే భాషలో చక్కని ప్రవేశం ఉండాలి. నిర్మాణంలో మెలకువలు తెలిస్తే మంచిది. ఇది నేర్చుకునేందుకు వ్యక్తిలో అభిలాష, చెప్పే విశేషజ్ఞులు ఉంటేనే సాధ్యం. అభిలాష ఉన్నా లక్ష్యానికి చేర్చే సామాజిక స్థితుల ఆనుకూల్యం ఉండాలి. పైగా ఇది అనవసరమూ, ఆధునికతను బింబించలేదు, కృతకం అనుకుంటే వేరే చెప్పనవసరమే లేదు. ఈ విధమైన వాతావరణం పద్యరచనపట్ల ఉత్సాహాన్ని పెంపొందించేదిగా ఉండదు, ఉన్నది నిలిచే స్థితీ చేకూరదు.

ఆధునిక సమాజంలో స్వేచ్ఛా వాతావరణంలో లభ్యమయ్యే అవకాశాలను బట్టి స్వేచ్ఛా కవిత్వం ఆధునికమైన సహజ పరిణామ రూపంగా ప్రవర్తిల్లుతూంది. పద్యం ఒక విధమైన సమాజ వ్యవస్థకూ ఆలోచనా విధానానికీ నిర్దిష్టమైన లక్ష్యానికీ ప్రాతినిధ్యం వహిస్తూంది. భావకవిత్వంలో ఇది కొంత మార్పుల్ని పొందినమాట నిజం. అయితే ఇది చాలా పరిమితంగానే జరిగింది. అభ్యుదయ కవిత్వంతో సంపూర్ణంగా విడివడింది.

ప్రస్తుతానికి వస్తే వేగంగా పరివర్తనకు లోనైన ప్రజాస్వామ్య స్వేచ్ఛా వ్యవస్థకూ, దీనికనుగుణంగా రూపొందే సంశ్లిష్ట జీవితానికీ వ్యక్తి లక్ష్యానికీ గుణాత్మకంగా సరిపడకపోవడంవల్లనే పద్యం తప్పుకుంది వెనువెంటనే స్వేచ్ఛాకవిత్వానికి చోటు ఇచ్చింది. పూర్వ సాహిత్యంతో మంచి పరిచయంతో చక్కని పద్యరచన చేయగలవారూ స్వేచ్ఛాకవిత్వం వ్రాసేవారిలోనూ ఉన్నారు. వీరు స్వేచ్ఛా కవిత్వాన్ని ఎన్నుకోవడంలో ప్రస్తుత వాతావరణంలో ఆధునికతను కోరే వీరి స్వచ్ఛమైన లక్ష్యమూ అభిమతీ స్పష్టం. స్వేచ్ఛా జీవనంలో ప్రజాస్వామ్య భావనతో పరిహరింపరాని కొత్త పట్ల అభిలాష, అన్వేషణ పట్ల ఉత్సాహం సామాజిక స్పృహతో పాటు వ్యక్తిత్వ వికాసం అనేవి, వీరినాకర్షించాయి స్వేచ్ఛా కవిత్వానికి ఆధారగుణాలుగానూ ఉన్నాయి. ఇవి అఖండ కవితా ప్రవాహంలో మలుపులే కాని సమాప్తిరేఖలు కావు. పద్యానికీ స్వేచ్ఛా కవిత్వానికీ మౌలికంగా అంతస్స్వరూపంలో వైరుధ్యం లేదు. బాహ్యదృష్టితో దాని స్థానం దానిదే దీని స్థానం దీనిదే. జాతి ఉత్తమ సంస్కృతిలో భాగంగా నిలిచిపోయిన పద్యం ఆకర్షణ తగ్గదు, అదే చివరిదీ కాదు. దాని తరువాతగా వెంటనే ఆధునికతకు ప్రాతినిధ్యం వహిస్తూ చారిత్రక పరిణామంలో భాగంగా వచ్చిందే ఈనాటి స్వేచ్ఛా కవిత్వం.

"మానవులంతా ఒకటే
మానవతా రాగం ఒకటే
ఇది మరిచిన ఉదయం
ఒక విషాద కావ్యం"

# 6. స్వేచ్ఛా కవిత్వంలో వస్తురేఖలు

చుట్టూ ఉన్న ప్రకృతీ రోజూ అనుభవానికి వచ్చే సమాజం, మానవ సంబంధాలు, భావాదర్శం అనేవి ఆధునిక కవిత్వంలో కన్పించే వస్తురేఖలు. ఇవి రచనలో ఏ భావ సూత్రాన్నో ఏ సంఘటననో ఏ స్థితిరూపాన్నో ఏ ఆదర్శగుణాన్నో ఆధారం చేసుకొని వర్తిస్తాయి. ఇవి వేటికవి విడివిడిగా కాక ఒకదానితో మరొకటి ప్రత్యక్షంగానో పరోక్షంగానో అనుబంధం కలిగిఉన్నవి. ప్రాధాన్య వివక్షచేత తరతమభావంతో నిర్మాణరూపంలో భాగాలుగా విశ్లేషణకందుతాయి. వీటితోపాటు అతీత భావన గురించి ఆలోచన కూడా లేకపోలేదు.

స్వేచ్ఛా కవిత్వంలో ప్రకృతి ప్రమేయం కేవలం వర్ణనాత్మకంగానే కన్పించదు. ఏ సామాజిక స్థితినో ఘటననో ఏ మానవ సంబంధ రూపాన్నో ఏ ఆదర్శభావాన్నో స్ఫూర్తికి తెచ్చే విధంగా అంతర్గత గుణంతో యోజితమైంది. ఇదేవిధంగా మిగతావీ. దీనికి ఉదాహరణ లనేకం ఇవ్వొచ్చు. దాశరథి ఆధునిక కవితా సంకలనం పేరు పునర్నవం. పునర్నవం అంటే తిరిగి కొత్తదనాన్ని పొందే ప్రకృతి రూపం తలపుకు వస్తుంది. దీనితో వసంతభావన స్ఫూర్తికి రావడం సహజం. ఇంకా పాత వ్యవస్థ పోయి దానిస్థానంలో కొత్త వ్యవస్థ అవతరించే సామాజిక రూపమూ ధ్వనిస్తుంది. ఇదేవిధంగా తిమిరంతో సమరం, తిమిరం ప్రకృతికి సంబంధించింది. సమరం జీవితానికి సంబంధించింది. తిమిరం చెడుకీ నిరంకుశత్వానికీ మౌఢ్యానికీ ప్రతీక. చెడు నశించి నిరంకుశత్వం రూపుమాసి మౌఢ్యం అంతరించిపోయేందుకు భౌతిక దశలో మనోదశలో ప్రకృతి స్థాయిలో ఆదర్శస్థాయిలో జరిగే నిరంతర సంఘర్షణ చివరకు మానవుని ఆశారూపం విజయ శక్తీ సూచితం. ఇందులో ప్రకృతీ సమాజం ఆదర్శం అనేవి ముప్పిరిగొని ఉన్నాయి.

మనచుట్టూ ఉన్న సమాజం నిరంతరం మానవ సంబంధాలతో ఏర్పడేది. వ్యక్తినుండి అంతర్జాతీయ స్థాయి వరకు అనేక సంబంధాల ప్రభావాల పర్యవసాన రూపం, సాంఘిక రాజకీయార్థిక సాంస్కృతికమైన వివిధ గతి-రేఖలతో రూపొందుతుంది. వ్యక్తి జీవితంపై సమాజం ప్రత్యక్ష ప్రభావాన్ని నెరపినట్లే వ్యక్తి మనస్తత్వం మానవ సంబంధాల్లో కీలకమైన పాత్రను నిర్వర్తిస్తుంది.

మనస్సు ప్రసక్తితో జ్ఞాపకానికి వచ్చే మరో అంశం అతీత భావన. మనిషి కంటికి కన్పించనీ భౌతికస్థితికందనిదాన్నీ గురించి ఆలోచింపజేసే, ఏదో సమాధానం కోరేదీ ఎంతో ఆశ్చర్యపరచే ఆదర్శం గురించి ఆలోచనకు దారితీసేది. స్వేచ్ఛా కవిత్వంలో ఈ అంశం చాల పరిమిత స్థితిలోనే ఉంది. ఒక్కొక్కరి రచనలో ఒక్కొక్క విధంగా

ప్రసక్తమైంది. "ఆ సకలాతీత శక్తి ఉన్నట్లు? లేనట్టా?" శ్రీశ్రీ సంశయాస్పదమైన మాటలీ సందర్భంలో జ్ఞప్తికి వస్తాయి.

ఆధునిక యుగంలో మానవుని శక్తిపై ఉండే సంపూర్ణ విశ్వాసం హేతుదృక్పథం వల్ల ఈ అతీత భావన చుట్టూ అల్లుకున్న మూఢప్రపంచం అదృశ్యమైంది కాని అందని చైతన్యం మాత్రం మిగిలే ఉంది. దీన్ని గురించి ఏదో విధంగా ఆలోచన చింతన అనివార్యం.

భావాదర్శం సిద్ధాంతాలకూ ఆదర్శాలకూ సంబంధించింది. ఉత్తమరచనకు లక్ష్యమైంది, తప్పనిసరియైంది. ఈ నాలుగైదు వస్తురేఖలతో పొందే ఉపయోగం, నిర్మాణంలో అవలంబించే సంవిధానాన్నిబట్టి ఉంటుంది. ఇది పైన పేర్కొన్న విధంగా ఘటననో స్థితినో భావాన్నో అనుభూతినో ఆలోచననో ఆదర్శాన్నో ఆధారం చేసుకొని సావయవ రూపాన్ని పొందుతుంది.

ప్రకృతి అనగానే మనకు మొట్టమొదట వాఙ్మయంలో స్ఫురించేది ఋగ్వేదంలోని ఉషస్సూక్తం. ఇందులో ఉషస్సు భౌతికమైన ఆకృతితో ఎంతో రమణీయంగా వర్ణితమైంది. ఇది మానసికమైన ఆనందరూపానికి ప్రతీకగా దర్శనమిస్తుంది. రోజు చూచే ప్రకృతే ఏ రోజు కారోజు మార్పులతో కొత్తగా అనుభవానికి వస్తుంది, జీవితంపై ప్రభావం నెరపుతుంది. సామాజిక స్థితికీ మానసిక స్థాయికీ ఒక విధంగా హేతువౌతుంది. ఆధునిక కవిత్వంలో ఏ అమానుష స్థితికీ ఏ ఆశ్చర్యానికీ అవకాశం ఇవ్వకుండా మానవుని కృషీ ప్రజ్ఞ విజయంపై సంపూర్ణ విశ్వాసంతో ప్రవర్తిల్లే ధోరణి స్పష్టం. అయితే కల్పనకు స్థానం ఉండనే ఉంటుంది.

"అడవులు! కొండలు! ఎడారులా మన కడ్డంకి" – శ్రీశ్రీ. మానవుని ప్రస్థానంలో ఎదురయ్యే ఆటంకాలు అవరోధాలు కష్టాలు అడవులు కొండలు ఎడారులుగా ప్రకృతి రూపంలో సంకేతింపబడినాయి. ప్రకృతితలంపైనుండి జీవితరూపం బింబితమైంది. దీన్ని మానవ సంబంధాలతో ఏర్పడే సామూహిక శక్తితోనే జీవితంలో ఎదుర్కోవలసి ఉంది.

"రగిలి రగిలి మంటలతో కదలుతూంది ఈ క్షణం
వెనుక నుండి ఏ జలదమొ! కరుణ చూచు ఆశతో"

ఈనాడు ద్వేషంతో అసహనంతో హింసతో సంక్షుభితమైన సామాజిక స్థితి చిత్రితం. కరుణ వర్షించి ప్రేమ పల్లవించి శాంతితో హ్లాదసమయం కోరే మనోరూపం ధ్వనితం.

ఎంతో ప్రభావశీలమైన ప్రకృతి మధ్య చుట్టూ ఉన్న సమాజంలో వివిధ వ్యక్తుల మధ్య ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ ఏర్పడే మానవ సంబంధాలతో అస్తిత్వం పొందే జీవితం, భావాదర్శంతో పరిపూర్ణత నందుకుంటుంది. ఈ సమాలోచనం స్వేచ్ఛాకవిత్వంలో కేవలం వస్తురేఖలకు మాత్రమే పరిమితమైంది.

# 7. స్వేచ్ఛా కవిత్వం - కొన్ని సమస్యలు

స్వేచ్ఛా కవిత్వం సంప్రదాయ ఛందస్సునుండి ముక్తమైన ఆధునిక ప్రక్రియ. ఒక నిర్ణీతమైన నియమబద్ధత లేనిదీ యతిప్రాసలు లేనిదీ లయబద్ధం కానిదీ సంప్రదాయ చ్ఛందోరీతికి చెందనిదీ. భిన్నమైందీ ఈ ప్రక్రియలో ముఖ్యంగా స్వాతంత్ర్యానంతరం చెప్పుకోదగ్గ ప్రయోగాలు జరుగుతున్నాయి. శ్రీశ్రీ, నారాయణబాబు, పఠాభి ప్రయోగశీలాన్ని అందిపుచ్చుకొని ఆరుద్ర, బైరాగి, దాశరథి, సోమసుందర్, సి. నారాయణ రెడ్డి, తిలక్, కుందుర్తి మొదలగు కవుల రచనలీ మార్గాన్ని పరిక్షుణ్ణం గావించాయి. ఈ మధ్య పలువురు శక్తివంతులైన కవులు శేషేంద్ర సంపత్కుమార, సుప్రసన్న, వేగుంట, పేర్వారం, శివారెడ్డి తమతమ ప్రత్యేకతలతో ఈ ప్రవాహ రూపాన్ని అవిచ్ఛిన్నం కొనసాగిస్తున్నారు.

మంచి స్వేచ్ఛా కవిత్వం వ్రాయడం సులభం కాదు, ఛందస్సు మొదలగు ఏ సంప్రదాయ సామగ్రీ ఆధారం లేకుండా! అయితే గాలిలో తేలడమా? అని ప్రశ్నించవచ్చు. అవును విమానంలోవలెనని సమాధానం. విమానం అన్నమాట ఆధునికతకు సంకేతంగా గ్రహిస్తే సమాధానం ఎంత ఉచితమైందో సులభంగా తెలుస్తుంది. ఈనాటి కవిత్వంలో కొంత క్లిష్టత, అయోమయమూ ఉందనే అభిప్రాయముంది. ఇందులో కొంత నిజం లేకపోలేదు. దీన్ని గురించి ఆలోచిస్తే ఇందులో చాలాభాగం బాహ్యస్వరూపాన్ని గురించి ఎక్కువ పట్టింపు లేక అంతస్స్వరూపాన్ని గాఢంగా, అధికంగా చిత్రించే ఉబలాటంవల్ల ఏర్పడిందని తెలుస్తుంది. మానసిక స్థితి చిత్రణలో భావనల సహయోగం విరామం లేకుండా దట్టంగా ఉండడంవల్ల క్లిష్టత, అయోమయం కలుగుతుంది. దీనికీనాటి కవిత్వం నుండి అనేక ఉదాహరణలీయవచ్చు. ఇది కొంత ప్రయోగదశకూ, కొంత రచనా శిల్పం తెలీని స్థితికీ బరువైన చెందింది. పూర్వం భాషాగతమైన కాఠిన్యం, శైలీ బంధురత్వం ఎదురైనట్లు ఈనాడు భావగతమైన క్లిష్టత అయోమయం ఎదురౌతుంది. దానిమాదిరే ఇందులోనూ కొంత నిలచేది మిగతాది పోయేదీ ఎప్పుడు జరిగేదే.

ఈనాటి స్వేచ్ఛాకవిత్వం ముఖ్యంగా వ్యక్తి జాగృతి లేదా సామాజిక చైతన్యం వెన్నెముకగా స్వేచ్ఛా శిల్ప మర్యాదలతో, మానసిక దృక్పథం కలిగింది. విషయ భావ రూప విన్యాసంలోని అభివ్యక్తి లోపం సంప్రదాయమార్గంలో ఛందస్సు మొదలైన వాటివల్ల కప్పబడుతుంది. ఇక్కడ అలాంటి అవకాశం లేకపోవడంవల్ల లోపం కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది. అందుకే స్వేచ్ఛాకవిత్వం వ్రాయడం చాలా కష్టం. దీన్ని అర్థం చేసుకోవడానికి

పాఠకులకు కొంత సహనం కావాలి. రచనను సానుభూతితో వివేచించవలసి ఉంటుంది.

స్వేచ్ఛాకవిత్వాన్ని కొందరు కవిత్వం బాహ్యమైన బంధనల నుండి పొందే చిట్టచివరి విముక్తరూపమనీ, కొందరు ఒకచోట పేర్చికూర్చిన వచనపు తుంటలని అంటారు. రెండూ అతివాదాలే. నా దృష్టిలో కవితాపరిణామంలో స్వేచ్ఛా కవిత్వం ఒక ముఖ్యమైన దశ. పురాణం ప్రబంధం భావ అభ్యుదయ కవిత్వాలు ఒకటి శిఖరస్థితినందుకోగా మరొకటి తరువాత తరువాత ఉద్గమించినట్టివే. పూర్వపుదాని ప్రభావం తరువాతిదానిపై స్పష్టం, పూర్వపూర్వ ప్రభావం పోనుపోను తక్కువౌతుంది. స్వేచ్ఛాకవిత్వం కూడా కొంతకాలానికి బాగా పరిణతిచెంది, మొగం మొత్తి మరొకటి అవతరించవచ్చు. ఈ మార్పు అనివార్యం కావచ్చు.

కవుల్లో సోమరులు, శక్తిరహితులూ ఉన్నట్లే పాఠకులలోనూ ఉంటారు. కవిత్వం గురించి ముందుగా మనస్సునొక చట్రంలో బిగించుకొని దానికి దూరమైనవానిపట్ల జడభరితంగా ఉంటారు. కవిత్వాన్ని చదవడానికి ముందు మనస్సు స్వచ్ఛమైన గాలి స్ఫుటమైన వెలుతురు లేని ఇరుకునుండి ముందు బయటపడాలి. మనస్సు నిర్మలమైన దర్పణమవాలి. మొత్తంమీద పాఠకుని బాధ్యత తక్కువేమి కాదు. ఇది గమనించకపోవడం వల్ల ఎక్కువ అయోమయం ఏర్పడుతుంది మునుముందే ఏర్పడే అభిప్రాయం కారణ అవుతుంది.

జీవితంలో అనేక వస్తువుల్ని చూస్తూ ఉంటాం. అందులో కొన్ని మనకవసర మయ్యేవి, కొన్ని ఊరకే చూచి ఆనందించదగ్గవి. కొన్ని ఆలోచింపజేసేవి. ఇందులో చాలా విలువైనవి ఉన్నాయి. ఉదాహరణకు వెలుగు, దీన్ని నిర్వచించడం సులభం కావచ్చు. మనస్సు గాఢమైన అనుభూతి పొందినపుడు నోటమాటరాదు. ఇది వాక్కున కతీతమైన స్థితి. ఈ స్థితిని వివరించడం చాలా కష్టం. అంటే విలువైనదాన్నీ గాఢమైన అనుభూతి దశనూ నోటిమాటలతో చెప్పడం కష్టమన్నమాట. ఇది ఒకరకంగా అయోమయమే. ఇలాంటిదే కవిత్వమూ. దీని వైవిధ్యం చెప్పరానంతగా ఉంటుంది. సమయం సందర్భం పాత్రను బట్టి భేదిస్తుంది దీన్ని వ్యక్తచేయడంలో అసమగ్రతే, అయోమయం అస్పష్టత.

ఎంతమందో సాహిత్యవేత్తలు ప్రపంచంలో వివిధ భాషల్లో ఎంత కాలంనుండో కవిత్వాన్ని నిర్వచించడానికి ప్రయత్నించారు. ఎక్కడికక్కడ ఏకదేశంగానే ఉండిపోయింది. ఈనాడు వివిధ భాషల,జాతుల సంస్కృతుల కలయిక త్వరితగతిని

జరుగుతూన్నపుడొకదాని ప్రభావం నుండి మరొకటి తప్పించుకోలేని స్థితి ఏర్పడుతూంది. అయినపుడు ఇంతకు పూర్వమున్న దృష్టిలో మార్పు తప్పదు. దీన్ని గురించి నిష్కర్షగా చెప్పలేం. సరిగా స్వేచ్ఛా కవిత్వంలోనూ ఈనాడు జరుగుతూన్నదిదే, కవిత్వమూ అతి నవ్యమైన భిన్నత్వాన్ని, వైవిధ్యాన్ని పొందుతూంది. ఇదంతా ఒక దృష్టితో చూస్తే అయోమయమే. ఏ నిర్వచనానికి ఒదగని రచన ఎక్కడో హఠాత్తుగా కనబడుతుంది. అందుకనే ఏ నిర్వచనమూ ఈనాటి దృష్టితో సమగ్రం కాదు. దీని సౌందర్యం మాటలకొదుగందీ, అనుభూతి వివేచన కందనిదీ, ఎంత చెప్పినా ఇంకా మిగిలి ఉండేదీ కావడమే దీనికి కారణం. ఇది కవిత్వం ఉత్తమత్వమే. దీనితో పాటు బహుక్లిష్టమైన సామాజిక సంస్థితిపై ప్రభావాన్ని నెరవుతూంది.

## II

స్థూలంగా కవిత్వాన్ని బాహ్యస్వరూపం, అంతస్స్వరూపం అని విభజించవచ్చు. రూపం అనగానే నిశ్చయరేఖలతో కూడిన అవయవస్ఫూర్తి కదుతుంది. బాహ్య స్వరూపం దృష్టికొదిగిందీ, అంతస్స్వరూపం ఊహకొదిగిందీ. బ్రతుకమ్మ పండుగకి పూలుతెచ్చి అందంగా వివిధరీతుల్లో గుండ్రంగా ఎత్తుగా పేరుస్తారు. వీటిని పూజించిన స్త్రీలు, కొంతసేపు చుట్టూ చేరి ఆడి తరువాత తీసికెళ్ళి నదిలో వదలుతారు. అవి వరుసగా తేలిపోతుంటాయి, మొదటినుండీ చివరివరకూ దృష్టినాకర్షిస్తుంది. అలాగే ఒక అమర్చిన గది, ఒక మాటతీరు, ఇవన్నీ బాహ్య స్వరూపానికి చెందినవే అయినా వాటి వెనుక అంతస్స్వరూపం దాగిఉంది. అది మన భావనలో వీటిని చూచినపుడు ఆకర్షణ వల్ల మనస్సు అనుభూతి పొంది, వివేచన మొదలౌతుంది. మొదటిది ఆనందానికి రెండవది ఆలోచనకు స్థానం. ఈ రెండింటి పర్యవసానమే సమాలోచనం. ఇది వ్యక్తినిష్ఠమైంది. మరొక ఉదాహరణ, వెలుగు, చీకటి మొదలైనవి – వీటి రూపం మొదటివాటికన్న సూక్ష్మసూక్ష్మ మయింది. వ్యక్తిలో అభిరుచి, సంస్కారంతో కూడిన అనుభూతిపొందే శక్తి వస్తు సౌందర్య భావనకు మూలహేతువు.

కవిత్వానికి వస్తే బాహ్య స్వరూపం స్థూలమైంది. అంతస్స్వరూపం సూక్ష్మసూక్ష్మ మైంది. ఈ రెండూ ఎప్పుడూ దేనికది విడివిడిగా ఉండవు. రెండింటి మధ్య గీత గీయలేం. ఒక్కొక్క స్థితిలో ఒక్కొక్కటి ప్రాధాన్యం వహించి ఉంటుంది. ఎంత బాహ్య సౌందర్య ప్రధానమయిన కవిత్వంలోనూ అంతో ఇంతో అంతస్సౌందర్యం ఉంటుంది. ఇది ఉత్తమత్వానికి చాలదు. ఒక ప్రమాణంలో ఇది కుదిరి, పాఠకుల పరిశీలనకు నిలవడమన్నది ఎంత చెప్పినా పాఠకుల స్థాయినిబట్టీ ఉంటుంది. లేకపోతే అంతమంది

వివిధ రకాల కవులు, అంతమంది వివిధరకాల పాఠకులు, అంటే ఒకటి నచ్చితే మరొకటి నచ్చనివారు ఉండరు. కవిత్వం అన్ని సాహిత్య ప్రక్రియల్లోకి గాఢమైందీ, అందమైందీ. గొప్ప కవిత్వం ఎన్నోసార్లు చదివించడంతోనే పని పూర్తిచేసుకోక, చదివినకొద్దీ పారవశ్యంతో పాటు ఆలోచనకు పదనుపెట్టేది కావడంవల్ల చివరిమాటగా ఎవరి అభిప్రాయమూ నిలవకుండా పోతుంది. ఈ దృష్టితో నేటి స్వేచ్ఛాకవిత్వంలోని అయోమయం క్లిష్టతను విచారించవలసి ఉంది. ఈ విచారణ హేతుబద్ధంగా ఉండడం అవసరం. నిలిచే గుణం లేంది అదృశ్యమవుతుంది అంతే.

చాలామంది పాఠకులు, శ్రోతలు లయబద్ధమయిన పాదాలపట్ల ఆసక్తి చూపడం కద్దు. ఈ రచనల్లో సంగీత గుణంచేత బహుళ ప్రచారమూ పొందడం జరుగుతూంది, ఇది సహజం. సామాన్యులకెపుడూ విశేషాన్ని గురించి పట్టదు, ఎవరన్నా దృష్టికి తీసుకొస్తే తప్ప. లయాత్మక రచన, భౌతికరూపాన్ని ఎక్కువగా ఆశ్రయించింది. కవితా ప్రపంచంలో మొదటి శ్రేణికి చెందింది కాదు. లయ, ఛందస్సు రెండూ వేరు. శబ్దాల బరువూ తూగుతో క్రమమయిన పొందిక లయ, స్వేచ్ఛా కవిత్వ రచనలు కొన్ని బరువూ తూగూ కలిగి భిన్న భిన్న రీతుల్లో అంతర్లయతోనూ ఉన్నాయి. ఎక్కువగా 'అంతర్నాదం' ప్రధానంగా వస్తున్నాయి. అంతర్లయలో లయచ్ఛాయ ఉంటుంది. అంతర్నాదంలో లయచ్ఛాయ ఉండదు. కాని అనుస్యూతమయిన ప్రవాహగుణం అలలు అలలుగా, ధారలు ధారలుగా, ఖండఖండాలుగా లేదా మరొక మరొక రీతిగా ఉండి, నాద సాంతత్యం ధ్వనిస్తూంటుంది. శబ్దయోజనం, ఉన్నతావనత సమరీతుల్లో భావోపస్కృతంగా ద్రవస్థితిలో మలపులు తిరుగుతూంటుంది. లయ ఉండడంలో దోషం లేదు. అది భావదీప్తికుపకరించే మేర ఉంటే చాలు. పాదాలు లయబద్ధం చేసి టకటక నడిపితే చెవికి సరదాగా ఉంటుంది. కాని దీని అమేయ ప్రమేయంవల్ల మనస్సుకు రచనలో సృజనశక్తి ప్రసారాన్ని పంపవలసినంతగా పంపడానికంతరాయ మేర్పడుతుంది. అక్కడక్కడ మెరపులు కన్పించవచ్చు. గాఢమయిన భావన లేనివారు దీన్ని ఆశ్రయించడం కద్దు. గాఢమయిన భావనతో శిల్పమతులు దీన్ని సంవిధానానికుపయోగించుకుంటారు. కేవల గాఢ భావన కలవారు దీనిపట్ల శ్రద్ధ చూపరు. కవులు ప్రధానంగా నేడు ఈ మూడు తరగతుల క్రిందికి వస్తారు.

స్వేచ్ఛా కవిత్వాన్ని పోతపోసినట్లు వ్రాస్తూపోతే విసుగు కలుగుతుంది. అందుకని దీన్ని పరిహరించడానికి, సృజనశక్తి ప్రసారానికంతరాయం కలగకుండా 'అంతర్లయ' – ఇంకా శ్రద్ధ ఉంటే – 'అంతర్నాదం'పై దృష్టి ఉండాలి. ఈ లక్షణం కొన్ని పద్యాల్లో

కొంత కన్పిస్తూంది. ఈ పోలికచేత కొందరికి తెలిసో తెలియకో మనస్సుకు స్వేచ్ఛా కవిత్వాన్ని వచనపద్యమంటే బాగుంటుందనిపిస్తుంది. మనస్సులో పొరలో పద్యంపట్ల అభిమానంచేత, ఆకర్షణ కారణంగాను ఈ పోలికను పేర్కోవచ్చు. కొట్టవచ్చినట్లు టకటకసాగే పద్యంలో అంతర్నాదం కన్పించదు. పద్యం కవులుకానివాళ్ళు పద్యం వ్రాస్తే ఇలా పట్టేయవచ్చు. మనకది పద్యకవిత్వమనిపించదు, ఛందోవేత్తలకు తప్ప! కవిత్వానికి వ్యాకరణం ఛందస్సు, పూర్వకావ్య పఠనమూ, అలంకార శాస్త్ర పరిచయమూ చాలన్న భాషావేత్తల కావ్యాలన్నీ దీనికుదాహరణలే. అలాగే స్వేచ్ఛాకవిత్వాన్ని కవులు కానివాళ్ల వ్రాసేది వచనం. స్వేచ్ఛాకవిత్వాన్ని రూళ్ళకర్ర గీతల్లా వ్రాసేవాళ్ళూ ఉన్నారు. గంటల గణగణలా, సైనికుల కవాతులా వ్రాసేవాళ్ళూ ఉన్నారు. నిజమైన స్వేచ్ఛా కవిత్వంలో పల్స్‌బీట్‌లాంటి జీవస్పందనం తప్ప ఏ ఆర్భాటమూ ఉండకూడదు. ఒక్క ఉదాహరణ తీసుకుందాం. ప్రాస ఉన్నది. ఇది ఎఫెక్ట్ కోసం ఉపకరించేది. ప్రతి పాదంలో తప్పనిసరిగా ఉండాలనడంలో కవికి బంధమయింది. అతడు కొన్ని శబ్దాల నాశ్రయించవలసి వస్తోంది. భావం పరిమితత్వాన్ని పొందుతుంది లేదా కొన్నిచోట్ల అనవసరంగా విస్తృతి పొంది శరీరం పెరుగుతుంది. తెలుగు కావ్యాల్లో భావ సంక్షిప్తత కొరవడడానికి కారణం ఇదే. శిల్పమర్యాద పొందిన మాట నిజం. ఇలాంటి అనేక బంధాల నుండి స్వేచ్ఛ పొందిన రచన స్వేచ్ఛాకవిత్వం. దీన్ని మళ్ళీ వలయంలో బంధించకూడదు. ఇందాక కవులు కానివాళ్ళు వ్రాసే స్వేచ్ఛాకవిత్వం వచనమన్నాను. పద్యానికి, వచనానికి భేదం సులభంగా గుర్తించవచ్చు. కవిత్వానికి వచనానికి భేదం ఎక్కడుందో తెలియాలి. అనుభూతి సాంద్రతలో, ఉద్రేకస్థాయిలో, ఆలోచనల ఎత్తులోతులో, దీనికనుగుణంగా ఒదిగిన శబ్దసంయోజనంలో వాక్య సహయోగంలోనని సమాధానం. దీని నాశ్రయించి శిల్పభాగం ఉంటుంది. అంతర్గతమయిన లయ, నాదం ఈ స్థితిలో ప్రతిభచేత సిద్ధిస్తుంది. ఈలాంటి పాదాలు గొప్ప వచన రచయితల గ్రంథాల్లో అక్కడక్కడా కన్పిస్తాయి. ఇది ఒక స్థితిలో ఆ రచయితల కవితాత్మ ప్రకాశనం అనుకోవాలి. ఉదాహరణకు చలం రచనల్లో ఈలాంటి పాదాలు కన్పిస్తాయి.

## III

అంతస్స్వరూపం ఊహైక గమ్యమయింది. విషయం, భావరూపం, ఆవిష్కరణ మూడింటిలో ఆవిష్కరణ చాలావరకు బాహ్యరూపంలోని భాగమే. సామాజిక ప్రయోజనాన్ని గుర్తించినవారు విషయంపట్ల ఎక్కువ శ్రద్ధవహిస్తారు. దీనివల్ల సిద్ధాంతాలు, విశ్వాసాలు, ప్రవచనాలు, వ్యాఖ్యానాలు అవసరమౌతాయి. ఇది కావ్యకళకు భంజకమని

ఒకరూ, ఇది లేనిది కళాప్రయోజనం శూన్యమని మరొకరూ అంటారు. భావరూపం సృజనశక్తిపై ఆధారపడి ఉంటుంది. ఉత్తమ కవిగా నిలచేది దీనిపైనే. కవిత్వంపట్ల నిజమయిన ప్రశంస అందులోని మౌలికవిషయాన్ని గుర్తించే శక్తివల్ల వస్తుంది. విషయ ప్రశంసలో దాని రూపాభిజ్ఞత సమాజ వాతావరణం పరిజ్ఞానం వల్ల కలుగుతుంది. పౌరాణిక వాతావరణంలో ఉన్నవారికీ ప్రబంధ వాతావరణం క్రొత్త. ప్రబంధ వాతావరణంలో ఉన్నవారికి ఆధునిక వాతావరణం క్రొత్త. ఆధునికులలోనూ మళ్ళీ తరగతులు. ఇంకా పోతే ఒక కవి రచన మెచ్చినవారికి మరొక మరొక కవి రచన నచ్చదు. దీనికి కారణం ఊహిస్తే, శబ్దయోజనం. ఊహావైఖరి, రచనారీతి, సిద్ధాంతాలపై విశ్వాసం. వీటికి అలవాటుపడి ఉండడమే. దీనికీ భిన్నమైంది, ఒకరికి నచ్చదు. ఇందులో కొందరు తమకు నచ్చంది ఏదో ఒక విధంగా వినీ చదివీ, ఆ తరువాత కొంత దగ్గరకు వచ్చేవారు ఉన్నారు. చాలామంది మర్యాదకోసం నటించేవారే. ఒకరకమైన వాతావరణానికలవాటుపడి మిగతా వాటికి వెలిఅయ్యే మనస్తత్వాన్ని సాధ్యమైనంతవరకు ఛేదించుకునే శక్తికలవారు చాలా తక్కువ, వీరే సహృదయులు.

ప్రతి కవిలో ఒక విధమైన వాతావరణముంటుంది. ఇది తప్పదు. అతనికి కొన్ని సంకేతాలు, భావసహయోగాలు, శబ్దాలు, మానసిక రూపాలు పరిచయమై వుంటాయి. కొందరీ విషయంలో పూర్వకవులపై అభివృద్ధి సాధిస్తారు. మరికొందరు, ఇతరులకు లేని గుణాలు సంతరిస్తారు. ఇవి కవికి ప్రత్యేకతను సిద్ధింపజేస్తాయి. స్థూలంగా చూస్తే 'ప్రేమ' అన్నమాట భావకవికిచ్చే ప్రేరణ వేరు, అభ్యుదయ కవికిచ్చే ప్రేరణ వేరు. అలాగే భావసంకేతాలూ, శబ్దాల ఎన్నిక, వాటి సంయోజనమూ భేదిస్తాయి. వీరు పొందే వైయక్తిక, సామాజిక స్ఫూర్తి వేరు. అందుకని కవిత్వమూ భిన్నంగా ఉండడం సహజం. ఉత్తమ కవిత్వం చాలావరకు బాహ్య మర్యాదల్ని అతిక్రమించిన వివేకం కోరుతుంది. వివేకంతోపాటు కళాదృష్టి అవసరం. అపుడే ఏ వాతావరణానికి చెందిన కవిత్వమైనా పాఠకులు ఆనందించగలరు. నేటి స్వేచ్ఛాకవిత్వం ఈ బాహ్య స్వరూపాన్ని అతిక్రమించి, అంతస్స్వరూపాన్ని ఎక్కువగా ఆవిష్కరిస్తుంది.

ఒక స్వేచ్ఛా కవిత కొన్ని స్థితుల సంకలనం కావచ్చు. ఒక స్థితి వ్యక్తీకరణం కావచ్చు. అందునా ఒక స్థితి ఎన్నో మానసిక రూపాల కూడలి కావచ్చు. మొత్తం ఒకే మానసిక చిత్రణముండవచ్చు. ఇవన్నీ నేడు కన్పించేవీ – ఈ పద్ధతులు కథాత్వాన్ని ప్రక్కకు నెట్టేవి. భావకవిత్వం నుండి ఆరంభమయిన రూపం నేడు వేరే లక్షణాలతో పరిణతకు చేరుకుంటూందని చెప్పవచ్చు. భావకవిత్వంలో, అందునా స్వేచ్ఛాకవిత్వంలో

నేడు మానసిక రూప చిత్రణలకు ప్రాధాన్యం యివ్వబడుతూంది కాబట్టి కవి ఎంతో జాగరూకతతో వ్యవహరిస్తే తప్ప 'క్లిష్టత', 'అయోమయం' ఏర్పడడానికవకాశమెక్కువ. ఒక దీర్ఘకవితలో మానసిక రూపాలు ఏకధారగా ఏర్పడడంవల్ల విసుగు పుట్టడానికవకాశముంది. ఇది బాహ్య స్వరూపాన్ని పూర్తిగా నిరాకరించడానికి వీలులేదన్న ఊహని ఋజువు చేస్తూంది. ఈ స్థితిలో కవి అంతస్స్వరూప వైవిధ్యం కోసం ప్రయత్నించాలి. బహిస్స్వరూపం ఆశ్రయమూ చక్కబరచు కోవాలి. ఇక్కడే శిల్పం చోటుచేసుకుంటుంది కాబట్టి కవి జాగరూకతతో ఉండవలసి ఉంటుంది. ఈ లోపం కలిగిన రచనలు ఉత్తమశ్రేణికి చెందినవిగా పరిగణింపబడవు. దీనికి బహుకావ్య పరిచయం, సంస్కారం, కొంత శిల్ప వైవిధ్యం ఎంతగానో అవసరం.

పూర్వ సంప్రదాయ రీతులపట్ల ద్వేషం పెంచుకొని ముడుచుకొనిపోయేకన్నా, వాటిని సహనంతో మననం చేసుకొని మనస్సు వికసింపజేసుకోవడం నేడెంతగానో అవసరం. కథ ఉన్నచోట రూపానికెక్కువ ప్రాధాన్యం ఉంటుంది. కథలేనిచోట మూడ్ (మానసిక స్థితి) ప్రాధాన్యం వహిస్తుంది. ఇది ఫోటో-టెక్నిక్ వంటిది. ఇందులో కవి దృష్టి చిత్రలేఖనానికుపకరించే కుంచెవలెగాక, కెమెరా మూవ్‌మెంట్‌లా ప్రసరిస్తుంది. ఏ ప్రగతీ ఒకరి ఇష్టానిష్టాలపై ఉండదు. అప్పటి శక్తుల ప్రాబల్యం, పరిస్థితుల పరిణామంపై ఆధారపడి ఉంటుంది.

ఈనాటి స్వేచ్ఛా కవిత్వంలో అభ్యుదయ కవుల భౌతికం, భావకవుల కాల్పనికం, సంప్రదాయ కవుల భౌతికాతీత ప్రభావ తీవ్రతలు తగ్గి – నేటి సామాజిక జీవనానుభవంతో నిగ్గుతేలిన వాస్తవం దృశ్యమానమవుతూంది. వివిధ సిద్ధాంతాలూ, అభిప్రాయాలూ జీవితంలో సమన్వయం పొందుతున్న సమయం. ఈ పరిణామానికి ప్రతిబింబమే నేటి స్వేచ్ఛాకవిత్వం.

"రారా నీ ! రవిహర్షం !
మానవతా కిరణంతో
స్వేచ్ఛా సమసమాజమై."

# 8. ప్రజాస్వామ్య కవిత్వం

ఈనాటి స్వేచ్ఛాకవిత్వంలో ఆధునికత ప్రధానంగా 1) సామాజిక చరిత్రగతికీ, 2) అభిప్రాయాల సిద్ధాంతాల ప్రకటనకు, దార్శనికతకు, 3) జీవితంలో భౌతిక మానసిక స్థితి చిత్రీకరణకు, 4) కళాత్మకమైన నవ్యతకు అన్వేషణకు పర్యాప్తమైంది. ఇవి వేరువేరు స్థాయిల్లో పనిచేస్తున్నట్లు కన్పించినా మొత్తంమీద కవిత్వానికి పరిపూర్ణతను చేకూర్చేవి. వర్తమాన కాలంలో కవిత్వం, 1) ప్రజాస్వామ్య భావనతో, 2) మార్క్సీయ విప్లవ దృష్టితో, 3) కాల్పనిక అనుభూతి రేఖలతో, 4) చేతనాత్మక రూపంతో ప్రధానంగా నాలుగు ముఖాలుగా పర్యాప్తమై కన్పిస్తుంది.

కవి తనకు తాను సృజనసమయంలో ఏర్పరచుకొన్న నియమాలచేత ఆవిష్కృత మౌతుందీ స్వేచ్ఛాకవిత్వం. స్వేచ్ఛ ఎక్కువగా ఉండడంతో బాధ్యత కూడా అధికంగానే ఉంటుంది. ఇది సమయసమయానికి కొత్త కొత్త మార్పుల్ని రచనలో సులభంగా ప్రవేశ పెట్టేందుకు బహు విస్తృతమైన అవకాశాన్ని ఇస్తోంది. ఈనాటి ఆధునికతకు సంపూర్ణంగా ప్రాతినిధ్యం వహిస్తోంది. ఇది జీవితాన్ని స్వేచ్ఛగా రూపొందించుకునే స్వాతంత్ర్యంతో గతిక్రమాన్ని నిర్ణయించుకొనే అవకాశం కలిగిన సామాజిక రూపానికి ప్రతిబింబం అనవచ్చు. రాజకీయమైన ఆధారతలం, సమాజంలో జీవితచలనం, వ్యక్తి ఆలోచనల స్వేచ్ఛాసంచారం, క్రియాశక్తుల స్వతంత్ర వికాసం దీని అస్తిత్వానికెంతగానో ఉపకరిస్తున్నాయి.

మానవ సమాజం పరివర్తనాశీలమైంది. ఈ మార్పు నిరంతరం జరుగుతూ ఉంటుంది. సాధారణంగా మంద్రమంద్రంగా సాగుతూ విశేష పరిస్థితుల్లో వేగాన్ని అందుకుంటుంది. ఉన్న స్థితికీ, రాబోయే మార్పుకీ మధ్య ఎన్నో విధాలుగా సంఘర్షణ అనివార్యమౌతుంది. అప్పటి పరిస్థితుల అవసరం మేరకు మార్పు వచ్చి తీరుతుంది. ప్రస్తుతం సాహిత్యంలో అనేక చారిత్రక కారణాలవల్ల రాజకీయ ప్రభావంచేత ఎన్నో మౌలికమైన మార్పులు చాలా వేగంగా వచ్చాయి. భారతదేశంలో వలస పాలనవల్ల పైనుండి యూరోపియన్ దేశాల్లోని సాంస్కృతిక పునరుజ్జీవనం ప్రభావంవల్ల క్రమంగా తదితర రాజకీయ సాంఘిక ఆర్థిక సిద్ధాంతాల కారణంగా కొత్తగాలులు వీచడం ఆరంభమైంది. నిఖిల మానవీయ తలంపై మానవతా స్పందనతో ఆధునిక శక్తి క్రియారూపం ధరించింది. కొన్ని దశాబ్దాలుగా జరుగుతూ వచ్చే మార్పులవల్ల ఆస్తిరూపంలో, సంపద వినిమయంలో ఉత్పత్తి సాధనాల్లో ఆలోచనా విధానంలో అభిరుచిలో అనుభవ స్పందన రీతుల్లో పరస్పర సంబంధాల్లో లక్ష్యాల్లో ఇంకా వివిధ కార్యకలాపాల్లోను ఇట్లా జీవితంలో అనేక క్షేత్రాల్లో సంచలనం మొదలైంది, పరివర్తనం కలిగింది.

ఆధునికత అనేది అప్పటికప్పుడు ఏదో పరిమితమైన సమయంలో హఠాత్తుగా వచ్చేది కాదు. ఇది క్రమించే స్థితులూ స్పృశించే అంశాలూ రూపొందే పార్శ్వాలూ అనేకం ఉంటాయి. స్థూలంగా విశ్లేషిస్తే ఇది చారిత్రకంగా సాంఘికమైన సంస్కరణం, రాజకీయమైన పరివర్తనం, శాస్త్ర సాంకేతికమైన అభివృద్ధి, ఆధునిక భావనకవకాశం ఇస్తున్నాయి. జీవితంలో వీటివల్ల వచ్చిన గుణాత్మకమైన వికాస వైవిధ్యం పరస్పరం ఎంతో సంబంధం కలిగి అన్యోన్య ప్రభావాలతో కాలంగడిచే కొద్దీ సమాజంలో సంస్కరణంతో నవ్యతతో పరివర్తనంతో ఆధునిక రూపాన్ని ఆవిష్కరిస్తూ పోయాయి. దీని పర్యవసానమే ఆధునిక సమాజంలో ఆధునిక మానవుడూ, అతని గురించి ఆధునిక కవిత్వం.

మార్పు కోరే సమాజంలో ఆధునికత పోనుపోను క్షేత్రవిస్తృతిని పొందింది, ప్రగతిశీల వ్యక్తిత్వాన్ని పొందుతూ వచ్చింది. మౌలికమైన సంస్కృతి పునర్విలోకితమవుతూ వచ్చింది. అటు ప్రగతి, ఇటు మౌలిక సంస్కృతీ సమాజ ప్రవాహానికి రెండు తీరాలుగా వెలసాయి.

1. సంప్రదాయ తత్వాన్ని ప్రస్తుత సమాజానికన్వయించడంలో ప్రయోజన తత్పరత.
2. సంకుచితమైన ధోరణి వదలి, ఎక్కువమంది ప్రజల ఆమోద యోగ్యతకు విలువ.
3. సమస్యలను హేతుదృష్టితో చర్చించి, సమాజ శ్రేయస్సు దృష్ట్యా పరిష్కారం ఉపయుక్తం కానివాటి నిరాకరణం.
4. ప్రజల ఆలోచనల్లో స్పందనలో పరస్పర సంబంధాల్లో మార్పు.
5. కొత్త అనుభవ క్షేత్రాల్లో కొత్త కొత్త అన్వేషణలతో క్రియా కలాపాలు ఎక్కువ కావడం జీవితం సౌఖ్యం సౌభాగ్యం కోసం యత్నం.
6. ప్రత్యర్థుల అభిప్రాయాల ప్రకటనం, సమస్యలపై చర్చలకు అవకాశంతో తగిన స్థానానికి సౌముఖ్యం.
7. గతంపై కన్నా వర్తమాన సుస్థితికీ, భవిష్యత్ దర్శనంతో ప్రజాస్వామ్య భావనకు ప్రచార వ్యాప్తి.
8. మానవుని ఉన్నతిపై విశ్వాసంతో, ప్రాంతాల్నీ దేశాల్నీ దాటి ప్రపంచ స్థాయిలో అన్నిరంగాల్లో పరస్పరం సంబంధాలు నెలకొని ఆదాన ప్రదానం జరగడం.
9. కేవలం భగవంతుని చేరుకోవడం లేదా పొందడం కన్నా ముక్తిపై దృష్టికన్నా సమాజ శ్రేయస్సుకు నైతికమైన వ్యక్తిత్వానికీ ఆదర్శరూపానికీ ప్రాధాన్యం.

10. శాస్త్ర సాంకేతిక విద్యా ప్రగతితో న్యాయం, సంపదలో అవకాశం అందరికీ సమానంగా లభించే ప్రయత్నం.
11. ప్రాచీన సంస్కృతిలోని వారసత్వ సంపదను నిఖిల మానవ సంస్కృతిలోని భాగంగా కొత్తదృష్టితో పరిశీలనం.
12. స్త్రీ పురుషుల సంబంధాల స్థాయిలో మార్పు - సమాజంలో స్త్రీ వ్యక్తిత్వ వికాసానికి ముఖ్యంగా ఆర్థిక స్వాతంత్ర్యానికి ఉపకరించే విధానంతో పాటు సమాజ స్థితి పరికల్పనం.

సమాజ ప్రగతికి వేగంతోపాటు సుస్థితినీ కలిగించడానికి ఉపకరించే పై అంశాలతో ఏర్పడిన క్షేత్ర విస్తృతీ, కార్యకలాపాల వైవిధ్యం ఆధునిక సమాజ పరిణామ క్రమంలో ముఖ్యమైనవి. (స్వేచ్ఛా) ప్రజాస్వామ్య కవిత్వంలో దీని స్వరూపం ఆధునికతా రేఖలతో స్పష్టంగా బింబిస్తుంది. అన్నిరంగాల్లో కొత్తను అన్వేషించే ప్రయోగ పరంపర సాగుతూంది. జీవిత ప్రమాణాల్ని పెంపొందిస్తూ, సమాజాన్ని సౌభాగ్యవంతం చేసేందుకు ఉపకరిస్తోంది. ప్రజాస్వామ్య వ్యవస్థలోనే ఈ స్థితికి ఎక్కువ అనుకూల్యం ఉంది.

## II

ప్రస్తుతం స్వేచ్ఛా కవిత్వానికి వస్తే రాజకీయమైన అవగాహనతో సైద్ధాంతికమైన అభిప్రాయ మూలకమైన నిబద్ధతపట్ల అభిలాష ఈనాటి కవుల్లో ఎక్కువగా కన్పిస్తుంది. ఇది ఒక్కొక్కప్పుడు కళాత్మకతను, రచనా శిల్పాన్ని పక్కకు నెట్టేసి ఆధిక్యత నెరపేంతటి శక్తివంతంగాను పనిచేస్తోంది. ప్రజాస్వామ్య కవిత్వంలో సామాజిక స్పందనతో పాటు వైయక్తికమైన అన్వేషణం ఉంటుంది. సమష్టి మరియు వ్యష్టి స్థాయిలో ఉండే భేదాన్ని గుర్తిస్తుంది. వైవిధ్యాన్ని అనుమతిస్తుంది. ప్రయోజనాన్ని మరవదు. కళాత్మకతకు భంగం కలిగించే స్థితి రానీయదు. సమాజంలో సమభావాన్ని సృజిస్తుంది. దీని సుస్థితికీ సుస్వరతకు దోహదం చేస్తుంది. సమాజ ప్రగతికెంత ప్రోత్సాహం ఉంటుందో వ్యక్తి వికాసానికీ అంతటి ప్రోత్సాహం ఉంటుంది. సామాజిక చైతన్యం వ్యక్తిపై ఎంతటి ప్రభావాన్ని నెరపుతుందో, వైయక్తికమైన ప్రేరణ కూడా సమాజంపై అంతే గుణాత్మకమైన స్థితిని నెలకొల్పుతుంది. కార్మికలోక కల్యాణంతోపాటు సమాజంలో వివిధ రంగాల్లో వారి వారి శక్తులనుబట్టి పనిచేసే వివిధ వర్గాల ఆరోగ్యకరమైన అభ్యున్నతినీ కాంక్షిస్తుంది. సాంస్కృతిక మూలాల్లోని చేతనను గౌరవిస్తుంది. ఇది ప్రజాస్వామ్య కవిత్వానికి ప్రాతిపదిక.

స్వేచ్ఛా కవిత్వంలో ఈ సామాజిక తత్త్వం ముఖ్యంగా ప్రజాస్వామ్య భావనతో వ్రాసే రచనల్లో స్ఫుటంగా కనిపిస్తుంది. భౌతిక మానసిక తలాలపై అన్వేషణంతో

పరిశీలనంతో కొత్తరూపం ఆవిష్కృతమౌతుంది. ఇది చేతనలో పై స్థాయికి సంబంధించి విశేషంగా మనస్తత్వ సమర్పకంగా ఉంటూంది. దీనికి వేరే సమాలోచనం అవసర మౌతుంది. ఈ రచనల్లో పారిశ్రామికంగానేకాక పరిపాలనాపరంగాను రాజకీయ వ్యవస్థాగతంగాను నిత్యజీవితంలోను విభిన్న పరిస్థితులూ వాటి ఒత్తిడులకు గురిఅయ్యే మానసిక రీతుల చిత్రణం, విశ్లేషణం ఉండటం సహజం.

ఈ వెలుగులో కవిత్వంలో ఆధునికత, 1) చరిత్రగతిలో పరివర్తనా పార్శ్వాలనూ, 2) వాస్తవతలంకై జీవితంలో వస్తుస్థితుల్నీ, భావింపజేసే శక్తివంతమైన ప్రసారరూపంగానూ కన్పిస్తుంది. ప్రస్తుత పరిధిలోకి రాకపోయినా కవిత్వంలో వీటితోపాటు ఉల్లేఖనీయమైనవీ అనివార్యమైనవీ. 1) పైకి అవిదితంగా ఉండే మానసిక రీతులూ మనస్తత్వ ధోరణులూ, 2) ఆవిష్కార శిల్పమూ - కళాత్మకత అనేవి. మొదటి ప్రత్యక్షంగానో పరోక్షంగానో అనుభవాత్మకమైన జీవితంలో వాస్తవతలంపై ఏర్పడే సూక్ష్మస్థితులు వివిధ సంఘటనలు, ప్రవర్తనలు ఆధారంగా చిత్రితమౌతుంది. రెండోది అభిరుచిని నిలిపేందుకూ ఆకర్షణను కలిగించేందుకు కొత్తకొత్త సంవిధాన రీతులతో యోజితమై ఆధునిక రూపాన్ని ధరిస్తూ ఉంటుంది.

సాహిత్య చరిత్ర గతిలో అభ్యుదయ కవిత్వం పొందిన విస్తరణ రూపమే విప్లవ కవిత్వం. అభ్యుదయ విప్లవ కవిత్వాలకు మధ్య వచ్చిన దిగంబర కవిత్వం సమాజంలో నైరశ్యాన్నీ వైక్లబ్యాన్నీ విషాదస్థితినీ ఎత్తిచూపుతూ మానసికమైన దుస్థితిని భౌతికతలంపై జుగుప్సా భీభత్స దృశ్యాలతో చిత్రించింది. సామాజిక పరివర్తనకు తీవ్రమైన చర్యల్ని అభిలషించింది. దీనిలో విధ్వంసక దోరణితోపాటు నిర్మాణాత్మకమైన భావన ఉంటే బాగుండేదే కాని ఆ కవుల లక్ష్యం మార్పు మాత్రమే. దీని వెంటనే వచ్చిన చేతనావర్త కవిత్వం సంప్రదాయశక్తికి వర్తమాన స్థితికీ మధ్య చేతనాను బంధాన్ని స్థాపిస్తూంది. లక్ష్యంలో దివ్యభూమికల్ని దర్శిస్తూంది.

ప్రజాస్వామ్య కవిత్వం భౌతిక రూపాన్ని విడనాడకుండా ఉదాత్తమైన విలువలకు ప్రాధాన్యం ఇస్తోంది. మార్క్సీయభావనతో సమాజంలో వర్గపోరాటాన్ని తీవ్రతరం చేసే ఉగ్రశక్తిగా విప్లవకవిత్వం ఆయుధయుత పాత్రను వహించింది. వీటికి సమాంతరంగా అపుడపుడూ తలెత్తే అనుభూతి కవిత్వం కాల్పనికతను సంతరించుకుంది. వీటికి భిన్నంగా విశిష్టంగా సామాజిక ప్రగతి లక్ష్యంతో, వ్యక్తి వికాసంపై దృష్టితో భౌతిక మానసిక తలాలకు సమానమైన ప్రాధాన్యంతో చిర సంప్రదాయ సంపద పట్ల గౌరవంతో వెలువడింది ప్రజాస్వామ్య (స్వేచ్ఛా) కవిత్వం.

# 9. ఆధునికత

కవీ పాఠకులు ; కవిత్వమూ సమాజమూ అనేవి పరస్పరం ఆధార సంబంధం కలిగినవి. ఆధునికయుగంలో బాగా విస్తరించిన క్రియాకలాపాల క్షేత్రంలో, కవి తనకు తాను ఏర్పరచుకున్న నియమాలతో ఏ 'రెఫరీ' అవసరం లేకుండా ఆడే ఆటవంటిది స్వేచ్ఛా కవిత్వం. దీనితో ప్రత్యేకమైన బాధ్యతలూ ఏర్పడతాయి. ఒకవైపు కవీ మరొకవైపు పాఠకులు సమాలోచకులు ఉంటారు. పాఠకునిలో ప్రతిదాన్ని ప్రశ్నించి పరీక్షకు నిలిపి విమర్శించే ధోరణి ఆధునిక యుగ ప్రభావంవల్ల ఏర్పడిందే. అతనిలో హేతుబుద్ధి, చర్చాలక్షణం ఆలోచనాత్మకంగా పనిచేయడమే దీనికి కారణం. ఇరువురికీ అభిరుచి ఉన్న సాధారణక్షేత్రం కవిత్వం. అయితే వీరు చెరి ఒకవైపు నుండి ఉపక్రమిస్తారు.

రచన చేసేప్పుడు కవిలో ఉండే విమర్శనాశక్తి నిర్వహించే పాత్ర వేరు. రచన వెలువడిన తరువాత స్థితి వేరు. రచనాక్రియ సమాప్తి కావడంతో రచయిత ప్రమేయంలో ప్రధానమైన దశ పూర్తి ఐనట్లే. సృజనశీలంగల పాత్ర అదృశ్యమౌతుంది, మరో పాత్ర మొదలౌతుంది. తాను వ్రాసినదాన్ని విమర్శకుల విమర్శల నుండి సమర్థించుకోవడమో వివరించడమో వ్యాఖ్యానించడమో లేదా దీనికి ప్రాతిపదికగానో మార్గదర్శకంగానో అధారవిషయాన్ని నిర్మించడమో జరుగుతుంది. సమాలోచనా రూపం అవతరిస్తుంది. రచనతో రచయిత ప్రత్యక్ష సంబంధం తెగిపోతుంది. పరోక్షసంబంధం ఉండనే ఉంటుంది. ఇక్కడినుండి రచనతో పాఠకుని ప్రత్యక్ష సంబంధం మొదలౌతుంది. రచయిత, పాఠకులు ఇరువురు చేరుకునే శిఖరాలు ఉన్నాయి. అవి అనుభవస్థితి, ఆలోచన, ఆదర్శం అనేవి, క్రమంగా పాఠకునిలోనుండి సమాలోచన రూపం తన కర్తవ్యాన్ని నెరవేర్చడం మొదలు పెడుతుంది. అనుభవ శీలం కలిగిన సహృదయ లక్షణంతో నిశితమైన విమర్శనంతో పాఠకుని వ్యక్తిత్వంలో ఏర్పడే వికాస రూపం సమాలోచనం. కర్తవ్యంలో విస్మరించరాని బాధ్యత నిక్షిప్తమై ఉంది.

స్వేచ్ఛా కవిత్వంలో అస్పష్టత గురించి ఒకటి రెండు మాటలు ముచ్చటించవలసి ఉంది. ఇక్కడ అస్పష్టత అనేది కొన్ని ప్రత్యేక స్థితులకు సంబంధించింది. ఒకవిధం రచనలో వాక్యాల మధ్య, విభాగాల మధ్య భావ పరంపర మధ్య పూర్తి చేయవలసిన స్థానాలు మిగిలి ఉంటాయి. ఒక్కొక్కపుడు శబ్దాలకు సంబంధించింది అయి ఉండవచ్చు. పాఠకులు చదివేప్పుడు వీటిని ఆలోచనతో పూర్తిచేసుకోవలసి ఉంటుంది. కొన్ని సందర్భాన్ని బట్టి వాటి అంతట అవే సహజంగా ఏ శ్రమ లేకుండా పూర్తి అవుతాయి.

అవి సంక్షిప్తత, గుప్తతపై దృష్టితో పరిష్కరించుకోవలసి ఉంటుంది. మరికొన్ని భావ చిత్రణలకూ వాటి అభివ్యక్తికీ సంబంధించినవి. ఇవి కవి మనోరూపానికిచ్చే స్థానాన్ని బట్టి అస్పష్టత కవకాశం లభిస్తుంది.

ఇంకా ప్రతీకల ప్రయోగం సంశ్లిష్ట భావరూపాల విన్యాసం చైతన్యస్రవంతి సంవిధానం మొదలైనవి ఉండనే ఉన్నాయి. వీటివల్లనూ అస్పష్టత కవకాశం ఉంది.

ప్రజాస్వామ్య (స్వేచ్ఛా) కవిత్వంలో ఆధునికతకు మరో ముఖ్యభాగమైన ఆవిష్కార రూపాన్ని ఈ విధంగా పరిశీలనలోకి తీసుకొనిరావచ్చు.

1. కథ ఉండదు కాబట్టి వస్తువును స్థితియోజనంతో, భావవిన్యాస క్రమంతో నిర్వహించడం.
2. వస్తువు లేదా కథను సూక్ష్మస్థితిలో భావించి లేదా మధ్యమధ్య సూత్రప్రాయమైన రూపాన్ని ఇస్తూ సంఘటన చర్య ప్రతిచర్యలతో తీర్చడం.
3. ఎన్నికచేసిన అంశాల క్రమంలో పరిణామ దృష్టికన్న హేతుదృష్టిని అవ లంబించడం లేదా ప్రయోజన దృష్టితో ఏకముఖంగా తీర్చడం.
4. శబ్దాడంబరానికీ సమాస విన్యాసానికి స్థానం లేకపోవడం.
5. కవికి నచ్చినవిధంగా సమయానికి తగినట్లుగా గతివిశేషాన్ని ఏర్పాటుచేసు కోవడం, లయవిన్యాసాల్ని సాధించడం.
6. రచనలో, వాక్యాల ఆరంభం, విన్యాసం, ముగింపులో విసుగుదల కలగకుండా వైవిధ్యం కలిగి ఉండడం. వాక్యం మరో వాక్యాన్ని అందిపుచ్చుకోవడంలో నేర్పుతో మొత్తంమీద లహరి లేదా తరంగ విన్యాసమో ప్రవాహ ప్రసారమో మరో సూత్ర విధమో కలిగి ఉండడం.
7. భావనలో లోతు ఔన్నత్యం ఉదాత్తత కోసం ప్రతీకల్ని భావచిత్రాలను ఆశ్రయించడం, చైతన్యస్రవంతి వంటి నూత్న సంవిధానాలను అనుసరించడం.
8. ఆవేశస్థాయిని ఆలోచనా గతిని నిలిపే విధంగా భావం యొక్క ఉచ్చలనం, నిశ్చలనం, అవతరణం స్థితుల్ని నేరుగా జాగ్రత్తగా అవిచ్ఛిన్నతకు భంగం రాకుండా నిర్వహించడం.
9. ప్రతి సంఘటనకూ ప్రవర్తనకు ఆలోచనకు వెనుక ఉన్న శక్తివంతమైన భావం లేదా అభిప్రాయం గురించీ పాత్ర మనస్తతచిత్రణంపై వెలుగు ప్రసరించడం.
10. సైద్ధాంతిక లేదా తాత్త్వికమైన లక్షణాన్ని కళాత్మకమైన రూపంతో సంయోజించి రచనకు రామణీయకతను ఉదాత్తతను కలిగించడం.

ఈ విధంగా కవి తాను జీవించే యుగాన్ని ప్రతిబింబిస్తూ తనదైన స్వతంత్ర వ్యక్తిత్వంచేత రచన ప్రత్యేకతను పొంది విశిష్టతను కలిగి ఉంటుంది.

ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛా కవిత్వం ఎప్పటికప్పుడు ఆధునికతను సంతరించుకొని ఎంతో వైవిధ్యంతో వెలువడుతోంది. విప్లవలక్ష్యం ఉంటేనే ఆధునికత ఉంటుందను కోవడం ఉచితం కాదు. ప్రజాస్వామ్య స్వేచ్ఛా కవిత్వంలోను సమాజంలోని సంక్షోభం, నిరసన, ప్రతిఘటన, సంఘర్షణతో క్లిష్టస్థితులు తిరస్కృతాలు కావు. పైగా వాటి మూలకారణాల్ని గుర్తించి పరిష్కార యోజన జరుగుతుంది.

మరో ప్రక్క నుండి ఆర్థిక రాజకీయ సాంఘిక వలయాలనుండి సమాజం ముందుకు క్రమిస్తున్నపుడు సంక్షోభం సంఘర్షణ ఏదో ఒక రూపంలో తప్పనిసరి అవుతాయి. ఈ క్లిష్టస్థితుల్ని వివిధ దశల్లో పరస్పరం సహకారభావంతో సమన్వయపరచే నిర్మాణాత్మకమైన వ్యవస్థకు ప్రాతినిధ్యం వహిస్తుంది ప్రజాస్వామ్యం. దీన్ని "సంపూర్ణంగా ప్రతిఫలింపజేసుకొని సమాజప్రగతికి దోహదం చేస్తూ వ్యక్తి వికాసానికి స్వేచ్ఛను కలిగిస్తుంది ప్రజాస్వామ్య కవిత్వం". ఇది ప్రజాస్వామ్య (స్వేచ్ఛా) కవిత్వయుగం అని వ్యవహరించే స్థాయిలో ఆధునికతను సంతరించుకొని ఆవిష్కృతమౌతుంది.

**"నిన్నటి మానవ సంకల్పం మేఘమై పిడుగులతో మెరపులతో,**
**నేడు కాంతి జలం వర్షిస్తూంది - ప్రజాస్వామ్య బంధువై".**

# 10. మానవతావాదం - అవసరం

మానవత్వం మానవునితో పాటే పుట్టింది. సమాజంలో వ్యక్తి పుట్టింది మొదలు మరణం వరకు అన్ని యుగాల్లోను అవిచ్ఛిన్నంగా వస్తున్నది, అన్నిరకాల సామాజిక వ్యవస్థల్లోను అవశ్యం ఉండేది, ఏ రాజకీయ సిద్ధాంతమైనా ఏ తరగతికి చెందిన సంఘమైనా దీన్ని ఆశ్రయించి ఉన్నతమైన విలువల్ని పొందడం చూడవచ్చు. ప్రతి ఆదర్శంలో దీని స్పృహ తప్పనిసరిగా ఉంటుంది. ఇది ఏదో ఒక రూపంలో ఆటవిక సమాజం నుండి అత్యంతాధునికమైన వ్యవస్థ దాకా గుర్తింపబడింది. వివిధ దశల్లో దీని ఆవిష్కృతి సహజధోరణిలో సాగుతూ మనల్ని ఆకర్షిస్తుంది. జీవితాన్ని గురించి ఆలోచన చేసే, జీవితానుభవాన్ని చిత్రించే సాహిత్యంలోనూ దీన్ని స్పష్టంగా చూడవచ్చు. మనిషిలో ఆర్ద్రత స్పందన కారుణ్యం ఉదారత మొదలుగా విశాలమైన భావనతో పలువిధాలైన రంగు, జాతి, కులం, మతం గల ప్రజల్ని దగ్గరికి తెస్తుంది. ఒక్క మనుషుల్నే కాదు ప్రాణికోటిని, ప్రకృతిని సన్నిహితమైన స్నిగ్ధబంధంతో గుండెకు హత్తుకునేట్లు చేస్తుంది. ఒకరిపట్ల మరొకరికి నిర్వ్యాజమైన సానుబంధాన్ని సాన్నిహిత్యాన్ని కలిగిస్తూ మానసికంగా తృప్తిని శాంతిని ప్రసాదిస్తూ, సమాజంలో అనేకమైన చారిత్రక కారణాలవల్ల ఏర్పడిన కృత్రిమమైన అవరోధాలనూ అఖాతాలను అధిగమించే ఉదారసూత్రంతో మనల్ని అందరిని ఎల్లవేళలా బంధించే శక్తి కలిగింది.

"Man is the measure of all things" “మానవుడే అన్ని విషయాలకు ప్రమాణం” అన్న గ్రీక్ దార్శనికుడు ప్రొటాగరస్ సూత్రం ఈ వాదానికి మూలస్తంభం, మానవుని వివిధ శక్తులను గురించి ఆలోచనచేసి ప్రపంచంలో అతని పరమోత్కృష్టమైన స్థానాన్ని దృష్టిలో పెట్టుకొని మానవత్వాన్ని మొట్టమొదట ఒక తత్త్వంగా వివేచన చేసిన ప్రసిద్ధాచార్యుడితడు. భారతీయులు దీన్ని గురించి ప్రకటించిన అభిప్రాయాలు మనకు అక్కడక్కడా కన్పిస్తాయి. మానవతా భావం వీరి దృష్టిని ఎంతగానో ఆకర్షించింది. అయితే పాశ్చాత్యులు దీన్ని ఒక పద్ధతిలో ఆలోచన చేస్తూ క్రమంగా ఒక తత్త్వంగా రూపొందించిన మాట వాస్తవం. మానవుని అస్తిత్వానికీ అతని జీవన స్వరూపానికీ, ప్రపంచంలో ఉన్న విశిష్టత, దీనికి సంబంధించిన అనేక రహస్యాలను తెలుసుకునేందుకు జరిగే జిజ్ఞాస, అన్వేషణ ఇందులో కన్పిస్తుంది. దీని పర్యవసానంగా మానవుని సర్వశక్తి సమర్పకత్వం నిరూపితం చేయబడింది. ఇతడు ప్రపంచంలోని సర్వవిషయాలకూ ప్రమాణకేంద్రంగా శక్తిస్థానంగా నిర్ధారణ చేయబడి ఆలోచన సాగడం, వివేచన జరగడం ఇందులోని విశేషం.

ఈ దృష్టితో సమాజంలో పరంపరాగతంగా, సమాజంలో ఏ కారణాలవల్లనైతేనేం వస్తున్న దేవతల సర్వశక్తి లక్షణం అంగీకరయోగ్యం కాదు. ఈ విధంగా జరిగితే మానవుని ఔన్నత్యం తగ్గిపోతుంది. దేవతల విషయంలో మనలో అజ్ఞానానికి కారణా లనేకం. దీనికెక్కడలేని స్థానాన్ని ఇచ్చి ముందుగా ఒక నిర్ణయంతో వ్యవహరించకూడదని ఈ వాదం అభిప్రాయం. ఇందులో మానవుని బుద్ధి విలసనంతో ప్రవర్తనారూపంతో కూడిన శక్తీ ప్రయత్నం ముఖ్యం. అనుభవం విజయం ఆనందం అన్నీ మనిషి బహుముఖీన మైన వ్యక్తిత్వ వికాసాన్ని మన దృష్టిపథంలో ఉన్నతంగా ప్రవర్తింపజేయడమే ముఖ్యం. దీన్ని విశ్లేషిస్తే మానవుని జీవితం ప్రకృతి సహజమైందీ, ఒక లక్ష్యం కలిగిందీ, అతని బుద్ధి విశ్వ రహస్యాలను కనుగొనే మేధాశక్తి సంపన్నమైందీ. అతని ప్రవృత్తిపై శ్రమపైనే జీవితం ఆధారపడి ఉంది. స్వేచ్ఛా లక్షణం వివేకస్ఫూర్తీ భౌతిక మానసిక స్థితిని రూపొందింపజేస్తాయి. జీవితానికి ఒక గమనాన్ని కలిగింపజేస్తాయి. మానవునిలో నిక్షిప్తమై ఉన్న ఎన్నో నిగూఢ శక్తులు ఒక్కొక్క పరిస్థితిలో ఒక్కొక్క విధంగా ప్రకాశమానమవుతాయి.

మానవుని స్థితికి మానవుడే బాధ్యుడు. అతడు ప్రకృతిని వశం చేసుకోగల దక్షుడు. తనలో నిహితమైన శక్తిని గుర్తించి సమీకరించి వ్యక్తిత్వాన్ని నిర్మించుకోగల వివేకి. జీవితంపై చెదరని ఆశ, తోటి మానవులపై విశ్వాసం, సంబంధాలు అతని పురోగమనానికి దారితీస్తాయి. వీటి అన్నిటికీ మూలం అతనిలో అణగని స్వేచ్ఛాతత్త్వం అన్న విషయం మరచిపోకూడదు. ఇది మానవ వాదానికి కీలకమైంది. ఈ విషయంలో మానవ వాదానికీ అస్తిత్వవాదానికీ చాలా దగ్గరి సంబంధం ఉంది. అయితే ఈ స్వేచ్ఛకూ కొన్ని పరిమితులు లేకపోలేదు. వీటిని, ఎన్నో విషయాలను దృష్టిలో పెట్టుకొని వివేకంతో గుర్తించవలసి ఉంటుంది.

మానవునికీ ఇతర శక్తులకూ జరిగే సంఘర్షణలో ఎప్పటికైనా విజయం అతనిదే నన్న నిశ్చయభావం మానవుణ్ణి ఎన్నో మహాకార్యాలకు ప్రేరేపిస్తుంది. దీని పర్యవసానంగా సాధారణ స్థితినుండి విశిష్టస్థితికి చేరుకోగలడు. కొన్ని సందర్భాల్లో దైవరూపంగానూ భావింపబడి ఆరాధనా యోగ్యతను పొందడం జరిగింది. ఇది మానవుని ప్రస్థానంలో గొప్ప మలుపుగా పేర్కొనవచ్చు. గొప్ప చారిత్రక వ్యక్తులెంతరో కాలంపై దేవతల స్థాయికి చేరుకున్నారు. మానవుని విశిష్టత గురించి వివేచనకు పునరుజ్జీవం పోసి ప్రాతినిధ్యం వహించే మరొక ఆచార్యుడు పికొడెలా మిరాన్డొలో. ఇతని దృష్టిలో మానవుడు వాస్తవంగా విశ్వానికి సూక్ష్మమైన ప్రతిబింబం. ఇది భౌతికమూ మానసికమూ ఐన మూర్తి కలిగింది. కాలక్రమేణ ఈ అభిప్రాయాన్ని గురించి ఎంతో జిజ్ఞాసతో ఆలోచన సాగింది.

ఆధునిక సాహిత్యంలో మరీముఖ్యంగా స్వేచ్ఛాకవిత్వంలో, మానవుని శక్తినీ ప్రజ్ఞనూ ఆవిష్కరించే ఉత్కృష్టమూన భావన విస్తారంగా కన్పిస్తుంది. ఆధునికయుగంలో వైజ్ఞానికమైన విజయ పరంపర జీవితంపై ఎంతో ప్రభావాన్ని నెరపింది. దీనితో జీవిత స్వరూపమే మారింది. జీవితంపట్ల వైఖరి, దాన్ని గురించి ఆలోచనలో పరివర్తనం వచ్చింది. మానవుని ఔన్నత్యంపై అధికమైన విశ్వాసం కుదిరింది. విధి–దైవం అన్నిరంగాల్లో పక్కకు నెట్టివేయ బడినాయి. ఈనాటి అవసరాలను బట్టి జీవితక్షేత్రంలో వివిధ కార్యకలాపాల విస్తృతిలో మానవత్వం ప్రధానంగా మానవతావాదం సాహిత్యంలో ఏ అభిప్రాయానికైనా సిద్ధాంతానికైనా అనివార్యంగా కన్పిస్తుంది. ఇది స్వేచ్ఛా కవిత్వంలో తప్పనిసరియైన మానవత్వంతోపాటు సంస్కరణపట్ల అభిలాష వైజ్ఞానికమైన దృక్పథమూ పురోగమన లక్షణంతో ప్రయోజన విస్తృతిని పొందింది. ఇది ఈనాడు ఎంత సాధారణమై సార్వజనీనంగా పరిణమించిం దంటే, ఏ ఆదర్శంలోనైనా, ఏ వ్యవస్థా నిర్మాణంలోనైనా ఆధునికతత్వంతో చక్కగా ఇమిడి పోవడమే కాకుండా, దాన్ని ఎంతో ప్రకాశమానం చేస్తూంది. కాబట్టి ఈనాడు సాహిత్య వివేచనలో ముఖ్యమైన అంశంగా పరిగణనకు వస్తూంది. స్వేచ్ఛాకవిత్వంలో రాజకీయ సాంఘిక తాత్త్విక మానసిక దృక్పథాల ప్రవేశంవల్ల ఏర్పడే వివిధ వలయాల్లో కన్పించే మానవతా వాదం పరిశీలనంచేత సమాలోచనం కూడ పరిపుష్టమౌతుంది.

మానవత్వంపేరిట పేర్కొనే ఉదారవాదం వేరు, మానవతావాదం వేరు అన్న విషయాన్ని ఈ సందర్భంలో గుర్తించవలసి ఉంటుంది. మానవుని లోని ఆర్ద్రతను స్పందనను ఉదారలక్షణంతో జీవితలక్ష్యాన్ని భావింపజేసి కొన్ని విలువల్ని ప్రత్యేకంగా సంతరింప జేయడంలో దీని ప్రత్యేకత ఉంది. వైజ్ఞానిక పరిశోధనం ఆధారంగా రాజకీయమైన విభేదాలతో మారణహోమానికి దారితీసే క్లిష్టపరిస్థితుల్లో మానవత్వం హృదయంగా గల మానవతావాదం ఒక్కటే ప్రపంచాన్ని రక్షిస్తుంది. పురోగమింపజేస్తుంది.

స్థానికమైన, వివిధ జాతి మత వర్ణ భాషా సంస్కృతులతో రూపొందించిన విచిత్రమైన పరిస్థితుల్లోను వీటినధిగమించి మానవతావాదం ఉజ్వలంగా ప్రకాశిస్తూ సమాజంలో, సమన్వయ వాతావరణానికీ, సమరసభావానికీ మార్గాన్ని సృష్టిస్తుంది. ఆకలితో దారిద్ర్యంతో బాధతో దుఃఖంతో ఉన్న తోటి మానవుని కింత కూడు గుడ్డ జాలి సానుభూతితో తోడ్పడడమే కాకుండా, అతని వ్యక్తిత్వ వికాసానికి, హేతుయుతమైన ఆలోచనతో సంస్కరణాభిలాషతో విశ్వైక్య భావనతో విస్తృతమైన ప్రాతిపదికను రూపొందించడం మానవతావాదంలోని ప్రధాన లక్షణం. ఇది ఒక సామాజికమైన

ఆదర్శంతో వ్యవస్థా నిర్మాణంలో ప్రజాస్వామ్యమైనా సామ్యవాదమైనా మరే వాదమైనా గొప్ప ప్రయోజనాన్ని సఫలంజేసి నిఖిల మానవాళి సౌభాగ్యానికి సహాయభూతమవుతుంది. ఈ కార్యంలో ఇది నెరపే పాత్ర సమాజంలో కొందరికి అభిమతం కాకపోవచ్చు. ఉదాహరణకి సంప్రదాయ మౌఢ్యాన్ని నిరసిస్తుంది. వ్యర్థమైన ఆచారాలను ఆడంబరాలను ప్రశ్నిస్తుంది. ఆయుధబలంతో మోహరించే మౌర్ఖ్యాన్ని తిరస్కరిస్తుంది. మానవులలోని మంచికీ, నిర్మాణశక్తికీ, మేధాగుణానికీ, వివేకస్ఫూర్తికీ, హృదయస్పందనకూ ప్రాముఖ్యాన్నిస్తుంది.

ఇది మానవులందరినీ మానవీయ భావనతో మానవతా సూత్రబద్ధం చేయడంలో వైజ్ఞానిక స్పృహ అంతర్జాతీయ భావన కలిగింది. సౌహార్దగుణంతో స్వేచ్ఛా వాతావరణంలో జీవిత స్వరూపాన్ని తీర్చిదిద్దేందుకు ప్రయత్నించడంవల్ల దీనికి కాలదోషం పట్టడం అంటూ ఉండదు. మానవత్వం సహజంగా అంతర్నిహితమై ఆకర్షించే ఈ మానవతావాదం ప్రగతిశీల రాజకీయ సిద్ధాంతంతో తీర్చిన వ్యవస్థలోను గుణవంతమైన ప్రయోజనాన్నే నిర్వహిస్తుంది.

వైయక్తికమైన మానవీయ సంబంధాలకు సామూహిక లేదా సామాజిక మానవీయ సంబంధాలకు మధ్య ఘర్షణ లేదు. అయితే రెండింటికీ మధ్య అంతరం ఉంది. సాధారణంగా మానవత్వంపై దృష్టి ఉన్న రచయిత వైయక్తికమైన సంబంధాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాడు. మానవతావాదంపై అభిలాష ఉన్న రచయిత దీన్ని కలుపుకొని సామూహిక లేదా సామాజిక మానవీయ సంబంధాలకు ప్రాముఖ్యాన్ని ఇస్తాడు. ఇది సామాజిక చైతన్యాన్ని వేగవంతం చేసేందుకే ఉపకరిస్తుంది. వేగవంతమైన సామాజిక ప్రగతికి దారితీస్తుంది. ఉత్తమశ్రేణికి చెందిన సృజనాత్మక రచనల్లో ముఖ్యంగా కవిత్వం నవల కథలో అవశ్యంగా కన్పిస్తుంది. ఈనాడు సాంఘికంగాను దీని అవసరం జీవితంలో అనివార్యమైంది. స్వేచ్ఛాకవిత్వంలో మానవతా వాద ప్రభావం ఆకర్షణీయమైన ప్రయోజనకరమైన స్థానాన్ని వహించింది.

"సమస్యల కాష్ఠ రూపం
పీడిత జన సందేశం
ప్రజా స్వామ్య బింబం"

# 11. స్వేచ్ఛా కవిత్వం - స్వేచ్ఛా సమాజం

సాహిత్యంలో సమాజమూ వ్యక్తి ఒకదానికొకటి పోషకంగా ఉన్నతికీ వికాసానికీ దోహదం చేసేవి. సమాజం లేంది వ్యక్తి వికాసం లేదు. వ్యక్తుల సమూహమే సమాజం. వ్యక్తులు లేంది సమాజం లేదు. వ్యక్తులు వస్తూ పోతుంటారు. నిజమే! సమాజానికీ ఇది వర్తిస్తుంది. యాభై సంవత్సరాల క్రితం వున్న సమాజస్వరూపం ఇప్పుడు లేదు. ఈ మార్పు ఒకప్పుడు నెమ్మదిగా అసలేం జరగనట్లు మరొకపుడు వేగంగానూ జరుగుతూంటుంది. దీనికి చారిత్రక రాజకీయ మత సాంఘిక ఆర్థిక కారణాలనేకం. సమాజంలో వివిధ వలయాలు అంతస్థులూ వుంటాయి. వ్యక్తులూ అనేక విధాలు. ఎవరి వ్యక్తిత్వం వారిదే. సామాజిక పరివర్తనంతో వ్యక్తుల్లో మార్పు వస్తుంది. వ్యక్తుల వికాసంతో సమాజం అభ్యున్నతీ పొందుతుంది. వ్యక్తుల విశిష్టతతో సమాజం ప్రత్యేకంగానూ నిలుస్తుంది. ఈ పరస్పరానుబంధం అనివార్యం, అభిలషణీయం.

స్వేచ్ఛా కవిత్వంలో సమాజం - వ్యక్తి ప్రమేయం విస్తారంగా దృష్టికి వస్తుంది. చారిత్రకంగా ఇది నిర్వహించే పాత్ర వ్యవస్థాగతమైన ఆదర్శాలూ, అభిప్రాయాలూ, వ్యక్తిపరమైన అనుభవాలూ ఆలోచనలూ కారణంగా ప్రాముఖ్యాన్ని వహిస్తోంది. సామాజిక భావన విస్మరించరానిదైనట్లే వ్యక్తి స్వరూపమూ మనస్తత్వ ధోరణీ పరిహరింపరానిది. ఇవి రచనలో వివిధ నిష్పత్తుల్లో రూపొంది ప్రత్యేక రూపాన్ని పొందుతాయి. ఇది ఇట్లా వుంచి ఏ దేశమైనా ఏ సాహిత్యమైనా పరంపరగా వచ్చే సంస్కృతీ భావన ఒకటి వుంది. ఈనాటి జీవన వ్యవస్థలో నిరసనకు గురైన దురాచారాల్ని చెల్లని నియమాల్ని అహేతుకమైన ధోరణుల్ని తీసివేస్తే సారభూతమైందీ సంస్కృతీ ప్రస్థానంలో శిఖరంగా నిలచే సంప్రదాయ పరంపర వుంది. ఇది సుదీర్ఘ సమాజ చరిత్రతో ముడివడింది. మార్పుపేరిట దీన్ని విస్మరిస్తే సంపూర్ణత లోపిస్తుంది. ఇది ప్రతి భాషా సాహిత్యానికీ వర్తిస్తుంది. ఇది జాతీయ స్థాయిలోనూ, కొన్ని సందర్భాల్లో దీన్ని అధిగమించి విశ్వభావనాత్మకంగానూ విలసిస్తుంది.

ఆధునిక యుగంలో పరిణమించిన సమాజ స్వరూపంతో కవిత్వమూ, స్వాతంత్ర్యోద్యమం, సమాజ పునరుజ్జీవనంతో ప్రవృత్తమై, స్వాతంత్ర్యం సిద్ధించాక ఆలోచనలో ప్రజాస్వామ్య వ్యవస్థాగతమైన స్వేచ్ఛా సంచారంతో నిర్మితమైంది. వర్తమాన కవిత్వస్థితిపై, వ్యక్తి వికాసంపై దీని ప్రభావం వుంది. ఈ దృష్టితో, స్వాతంత్ర్యం పొందిన కాలం నుండీ ఆధునిక కవిత్వాన్ని ఒక భాగంగా తీసుకొని పరిశీలన జరపడం అన్నివిధాలా సమంజసమూ హేతుయుతమూ.

భారతదేశం స్వాతంత్ర్యం పొందాక రాజ్యాంగంలో ప్రజాస్వామ్య వ్యవస్థను అంగీకరించడంతో జాతీయ దృష్టీ సాంఘిక రాజకీయ ధోరణీ పరివర్తనకు లోనయ్యాయి.

ఇది భారతదేశ చరిత్రలో అపూర్వమైంది. జాతి భవిష్యత్తును తీర్చే అసాధారణమైన మలుపు. చరిత్రలో సామాజిక రాజకీయ ఆర్థిక స్వరూపంతోపాటు సాహిత్యమూ మారిన విలువలతో, ఎదురైన కొత్త పరిస్థితుల్లో అంతర్జాతీయ ప్రభావానికి గురైంది. సామ్యవాద సిద్ధాంతమూ ప్రబలంగా పనిచేసింది. ముఖ్యంగా అభివృద్ధి చెందుతూన్న దేశాల్లో దీని ఆకర్షణ విపరీతంగానూ వుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో లభించిన అవకాశాలనుబట్టి వివిధాభిప్రాయాలు సిద్ధాంతాలూ వివిధ లక్ష్యాలు కవితాప్రపంచంలోనూ ప్రచలితం కావడం జరిగింది. జాతి అంగీకరించిన ప్రజాస్వామ్య వ్యవస్థలోని స్వేచ్ఛా వాతావరణమే ఈ వైవిధ్యానికి కారణమైంది. ప్రజాస్వామ్యం వల్ల సిద్ధించే ఉత్తమ ప్రయోజనాల్లో ఇదొకటి.

ఈనాటి సమాజంలో వున్న పరిస్థితులకు ప్రతిరూపంగా కవిత్వమూ వివిధ భావ ధోరణులతో కన్పిస్తుంది. విశ్వనాథ రామాయణ కల్పవృక్షం పూర్తి ఐంది వందేమాతరం నినదించింది. మానవీయం వెలసింది మరో మహాప్రస్థానం, ఖడ్గసృష్టి ప్రభవించాయి. శివప్రసాద్ మహాసర్గ అవతరించింది. పునర్నవం ఆవిష్కృతమైంది. విశ్వంభర ఉదయించింది. దిగంబరం – చేతనావర్తనం – విప్లవం ఇట్లా అనేకం – భావావేశంతో లక్ష్యశుద్ధితో తెలుగులో కవిత్వం స్వేచ్ఛావాయువుల్ని పీలుస్తూంది. జాతీయ భావన, సంస్కరణం పరివర్తనం ప్రజాస్వామ్యం సామ్యవాదం విప్లవం సంప్రదాయ పరంపరా పార్శ్వాలతో గోచరిస్తూంది. వీటిలో ఒక్కొక్క రచయిత వ్యక్తిత్వంలో ఒక్కొక్క పార్శ్వం ఆధిక్యం వహిస్తూ లేదా కొన్నిటి కలయికచేత విశిష్ట రూపాన్ని పొందుతూ పరిశీలనలో గోచరిస్తాయి. వీటితోపాటు చేర్చవలసింది మరొకటి వుంది మనస్తత్వ ధోరణి. రచయితలో అంతర్నిహితమై చేతనలో నుండి రచనపై ప్రభావాన్ని నెరపేది, మనస్తత్వ పరిశీలనం ఇటీవలిది కావడం. ఈ శాస్త్రంతో ఎక్కువ పరిచయం లేకపోవడంవల్ల దీన్నిగురించి ఆలోచన జరగవలసినంతగా జరగడంలేదు. సృజనాత్మక సాహిత్యంలో ముఖ్యంగా కవిత్వంలో ఇది నిర్వహించే పాత్ర అమూల్యమైంది. దీనికి అభిప్రాయాల సిద్ధాంతాల భేదం లేదు. మనీషి–మనస్తత్వం ముఖ్యం.

ఇకపోతే విశ్వజనీనత, మానవతా లక్షణం ఎప్పుడూ ఉండనే ఉన్నవి. పురోగమన తిరోగమన యథాస్థితి సంస్కరణ పరివర్తన విప్లవ సాహిత్యాల్లో ఇది అపరిహరణీయమైంది. ఐనప్పటికీ ఇది ఇటీవల పురోగమన హేతుదృష్టితో ఒక సిద్ధాంతంగా రచయితలను ఎంతగానో ఆకర్షించింది. ఏ స్థాయిలో ఏ ఆదర్శంతో ఏ విధమైన చర్య ప్రతిచర్యలతో సంబద్ధమైనప్పటికీ మానవ జీవితం నైతికమైన తాత్త్వికమైన విలువలతో ఆర్ద్రత ఉదారత హిత భావనతో రచన ప్రసారితం కావాలనే అపేక్ష సహజం, వాస్తవతలంపై భిన్న అస్తిత్వాలతో ఎంతో వైవిధ్యం కలిగిందీ.

మానవజీవితంపై పరిసరాల ప్రభావం తప్పనిసరి. అందువల్ల పరిసరాలు ఆరోగ్య వంతంగా వుండవలసిన అవసరమూ వుంది. ఇది గుణాత్మకమైన స్థితికి ఎంతో దోహదం చేస్తుంది. చారిత్రకంగా ఆలోచిస్తే వివిధ ధోరణులు ఉత్తమ లక్ష్యాలతోనే వచ్చాయి. ఎప్పటికపుడు సమాజంలో ఏర్పడే నిష్క్రియతనూ కాలుష్యాన్నీ పోగొట్టేందుకూ బంధనల్ని ఛేదించి చైతన్యవంతం చేసేందుకూ ప్రయత్నం జరుగుతుంది. స్వేచ్ఛావ్యవస్థ, వివిధ భావ ప్రసారాలకు దోహదం చేస్తుందనడంలో సందేహం లేదు. ఏ భావప్రసారానికీ లోను కాకుండా ఏ రచయిత దూరంగా వుండలేడు. అట్లా అయితే వ్యక్తిత్వానికి సంపూర్ణత చేకూరదు. చారిత్రక పరిణామంలో సందర్భోచితినీ కోల్పోతుంది. ఇప్పుడే కాదు మును ముందూ జీవితంలో ఏర్పడే అనుచితమైన స్థితులనుండీ, కఠోరమైన బంధనాల నుండీ విముక్తం చేసే ప్రయత్నం జరుగుతూనే వుంటుంది. నిరంతరం అరాజక స్థితికీ గంగరగోళానికీ భయావహ మృత్యు స్థితికీ దారితీసే విధ్వంసక ధోరణి ఏ మాత్రమూ ఏ విధంగానూ సమర్థనీయం కాదు.

ఈనాడు మన చుట్టూ నెలకొని వున్న సమాజం నిస్సందేహంగా కొత్తప్రపంచం. స్వాతంత్ర్యానికి పూర్వస్థితికీ నేటిస్థితికీ ఏ విధంగానూ పోలిక లేదు. జీవితాన్ని సంపన్నం చేసే సౌభాగ్యమయం చేసే శాస్త్ర సాంకేతిక పారిశ్రామిక పురోగతి సమాజంలో సంస్కృతీపరమైన గొప్ప విలువల స్థితికి ఏ విధంగానూ విరుద్ధం కాదు. పైగా జీవితంలో గుణాత్మకమైన మార్పుకు దారితీసే ఆలోచనా శక్తుల్ని కళాత్మక ధోరణుల్నీ ఆధునికత ప్రకాశవంతం చేస్తుంది. దీనికి భిన్నంగా స్వేచ్ఛ లేని వ్యవస్థలో వ్యక్తి ఆలోచననూ, అభిప్రాయాన్నీ అరికట్టే నిరంకుశ ధోరణులు సృజనశక్తిని వికసింపనీయవు. వివిధ స్థాయిల్లో వ్యక్తిత్వాన్ని కుంఠితం చేస్తాయి. సామాజికమైన పరిపూర్ణతను ఖండితం చేస్తాయి. మానవుని సంపూర్ణమైన అభివృద్ధికీ సమభావంతో సమాజ వికాసానికీ వివిధ భావ ప్రసారానికీ వేదికయైన ప్రజాస్వామ్య విధానం ఒక్కటే అభిలషణీయమూ, అనుసరణీయమూ ఐంది.

కవిత్వం ఎటువంటి జీవిత వాస్తవ దృశ్యాల నుండి ప్రయాణం చేసినా, అభిప్రాయాల వివరణం, ప్రకటనం, ఆవిష్కారం మాత్రమే కవిత్వం అవదు. ఇవి కవిత్వం కావడానికి అర్థమైన కళాత్మకతను కనీస స్థాయిలో అవలంబించవలసి ఉంటుంది. స్వేచ్ఛా సమాజంలో వెలువడుతూన్న నేటి స్వేచ్ఛాకవిత్వాన్ని విశాలమైన అవగాహనతో ఈ దృష్టితో సమాలోచనం జరుపవలసి ఉంది. అప్పుడు కాని చారిత్రక సంప్రదాయ రాజకీయ సాంఘిక మనస్తత్వ ప్రభావ శక్తుల ప్రత్యేకతలు గుర్తింపబడి కవిత్వంలోని మౌలికత, విశిష్టత, అనుభవానికి రాదు. సౌభాగ్యం కుసుమించే సామాజిక చేతనతో ఆలోచన అన్వేషణ అనుభవం పరివర్తనతో "గమ్యమైన స్వేచ్ఛాసమ సమాజం, రానీ కొత్త యుగంవాస్తవమై".

# 12. ప్రజాస్వామ్య యుగం-స్వేచ్ఛాకవిత్వం

ఈనాటి ఆధునిక కవిత్వాన్ని ప్రభావితం చేసే ముఖ్యమైన అంశం ప్రజాస్వామ్యం. ఈ వ్యవస్థలో తీవ్రవాదం మొదలుకొని పూర్వ సంప్రదాయ నిరతి వరకూ ఎన్నో ప్రచలితమై కన్పించే అభిప్రాయాలు దృక్పథాలు ఉన్నాయి. ఒక సిద్ధాంతాన్ని విశ్వసించేవారు కొన్ని నిశ్చయమైన భావాలు కలవారు తదితర రచనల్ని నిరసించడం విమర్శించడం సాహిత్య జగత్తులో పరిపాటే. ఇది సహేతుకమైన సీమల్ని అతిక్రమించనంతవరకు విషయ ప్రాధాన్యం దృష్ట్యా అభిప్రాయాల ప్రసారానికీ వికాసానికీ ఎంతగానో తోడ్పడుతుంది. సృజనశక్తికి పయనించే దిశను సూచిస్తుంది. ఒక విధంగా ఈ విమర్శ తత్త్వపరమైన అనుమానాల్ని తొలగించి ప్రశ్నల్ని నిలిపి అన్వేషణను విస్తృతం చేస్తుంది. సమాధానాలకై అభిలాషను కలిగించి లక్ష్యాన్ని నిర్దేశిస్తుంది. సాహిత్యప్రపంచంలో సిద్ధాంతపరమైన తత్త్వగతమైన ప్రేరకశక్తుల్ని గురించి ఆలోచింపజేయడం కన్పిస్తుంది. మరికొందరు సమన్వయ భావంతో విమర్శ చేసేవారూ ఉన్నారు. వీరివల్ల సదవగాహన సహిష్ణుత పరస్పరం అభిప్రాయాల ఆదాన ప్రదానంతో సాహిత్య వాతావరణానికి వినూత్నత చేకూరుతుంది. మరికొందరు వ్యవహారదక్షులూ ఉన్నారు. వీరి వ్యవహార దక్షత సాహిత్య వికాసానికి ఉపకరించేంత వరకూ ఫరవా లేదు.

సమన్వయ భావం వల్ల భిన్నాభిప్రాయాలు కలిగినవారైనప్పటికి విషయంపై అభిలాషతో ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం వాటిలో గుణాల్ని గుర్తించడం జరుగుతుంది. ఎవరైనా సరే తమ అభిప్రాయాల్ని సిద్ధాంతాల్ని స్పష్టం చేసేందుకు ప్రకటించేందుకవకాశ మిస్తుంది ప్రజాస్వామ్యం. అందునా స్వేచ్ఛా శీలానికవకాశం ఎక్కువగా ఉన్న సాహిత్యంలోనూ ముఖ్యంగా సృజనాత్మక ప్రక్రియల్లో ఈ స్వాతంత్ర్యం అవసరమెంతైనా ఉంది. ఎన్ని అనుకూల ప్రతికూల పవనాలు వీచినా అలంకారాన్నో భీభత్సాన్నో కల్పించినా సంభావనమో నిరాకరణమో నెరపినా ఉపేక్షించినా విస్మరించినా సృజనాత్మకమైన మనీషకే కళాత్మకమైన శక్తికే ఎప్పటికైనా విలువ, గౌరవమూ. దీని కనుకూలమైంది ప్రజాస్వామ్యం.

సిద్ధాంతాలు అభిప్రాయాలు సృజనశక్తికి ప్రేరకశక్తినిస్తే ఆవిష్కారరీతులు ఆకర్షణ విధానాలు రూపంలో కళాత్మకతను సంతరించిపెడతాయి. వైవిధ్యానికి దారితీస్తాయి. ఈ కారణంచేత ఒకే కాలంలో ఒకే సిద్ధాంత మౌలికతను కలిగిన రచనలైనా భిన్న వ్యక్తిత్వాల్ని కలిగి ఉంటాయి. సామాజికతలంపై సిద్ధాంతాలకు అభిప్రాయాలకుండే విలువలతోపాటు తాత్త్వికతలంపై ఆలోచనా రూపానికీ అస్తిత్వం ఉంది.

ప్రజాస్వామ్యంలో వివిధ సంప్రదాయాలకు దృక్పథాలకు సమాన గౌరవంతో పాటు సాహిత్యానికి చెందిన వివిధ శక్తుల వికాసానికీ ఎంతో అవకాశముంది. దేశం స్వాతంత్ర్యం పొందాక వికసించిన వివిధ భారతీయ భాషా సాహిత్యాల్లో ఈ మార్పును వైవిధ్యరూపాన్ని గుర్తించవచ్చు. ముఖ్యంగా కవిత్వంలో మార్పు రూపం అంతర్జాతీయ ప్రమాణాల్ని అందుకుంది. ఒక్కొక్క రచయితనుబట్టి ఈ మార్పు మూలరూపంతో ఒక్కొక్క విధమైన నిష్పత్తిని సమీకరించుకొంది. ఆర్థిక మత రాజకీయ సాంఘిక తాత్త్విక కళాత్మక వాతావరణంలో మానసికమైన స్థితి రీతులతో నిర్మితమైన వ్యక్తిత్వం ప్రత్యేకతను పొందుతుంది. ఇది ప్రతిభచేత అపూర్వమై విలసిస్తుంది. పాండిత్యం చేత విశిష్టత చేకూరుతుంది. సౌందర్యదృష్టి కళాత్మకత చేత ఆకర్షణ సిద్ధిస్తుంది. ఒకే సిద్ధాంత లక్ష్యం దృక్పథం కలిగిన రచయితల్లోను ఆంతరమైన వ్యక్తిత్వ నిర్మాణం ఒక్కొక్క విధంగా విలసిస్తుంది. స్వేచ్ఛాకవిత్వంలో ఎంతో వైవిధ్యోపేతంగా ఉంది.

వర్తమాన కాలంలో వచ్చే స్వేచ్ఛా కవిత్వాన్ని పరిశీలిస్తే సామాజిక స్పందన వెనుకనుండి ఈ వైయక్తికమైన రూపం స్పష్టంగా ప్రతిఫలిస్తుంది. ఇది ఈనాటి స్వేచ్ఛా సామాజిక ప్రభావ పర్యవసానం. ఏ వాదానికి చెందిన రచయిత ఐనా అంతో ఇంతో ఈ అంశం చోటు చేసుకుంటుంది. వ్యక్తులపై ముఖ్యంగా యువతరంపై పనిచేసే సామాజికమైన అనుభవ భూమికను పరిశీలించవలసి ఉంది. ఆర్థికంగా అవసరాలనుబట్టి కుటుంబ విధానానికి దూరం కావడం, వ్యక్తిత్వ వికాసంలో స్వేచ్ఛను కోరడం, అన్వేషణనభిలషించడం ఏకాంత ధోరణిలో నిర్మితమైన మానసిక స్థితీ పరిస్థితుల ఒత్తిడీ మానసికంగా సంశ్లిష్టమైన ఆలోచనా రూపం పేర్కోవచ్చు. ఇంకా ఎప్పటికపుడు కొత్త కొత్త సామాజిక సంబంధాలతో అనుభవ వైవిధ్యంతో జీవన శైలిలో మార్పు వచ్చింది. స్వయంగా తమకు తామై ఎదుర్కొనే సమస్యలూ మనసులో నిలచిన ఆదర్శరూపమూ ఒకదాని తరువాత మరొకటి విశ్లేషణకందుతాయి. పాతబడినవి సరిపడవనుకున్నవి వదిలేసి కొత్తవీ అవసరమనుకున్నవీ వాటిస్థానంలో ప్రవేశించి ఇంకా స్థిరపడకపోవడం ఒకరకమైన మానసిక శూన్యస్థితీ కన్పిస్తుంది. కుటుంబానికి దూరమై ఒంటరితనం ఆవహించిన జీవితంలో ఆదర్శాన్ని అందుకునే ఆలోచన, ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధంగా పరిణమిస్తుంది.

స్వాతంత్ర్యం తరువాత వ్యక్తీ సమాజానికీ గల చారిత్రకమైన సంబంధం మారింది. వ్యక్తిలో అన్వేషణకూ సామాజికమైన చింతనకూ అవకాశం హెచ్చింది. రాజకీయ వ్యవస్థలో మార్పు స్వేచ్ఛకు బాటవేసింది. సామాజికంగా పరివర్తన గుణంతో శాస్త్రీయ దృష్టితో

సంస్కరణాభిలాషతో మారిన స్థితిలో సాహిత్య వ్యక్తిత్వం ఎన్నడూలేని వైశాల్యాన్ని పొందింది. గతిలో వేగాన్ని పుంజుకుంది. వ్యక్తిలో అపూర్వమైన స్వేచ్ఛాతత్త్వం సృజనశక్తి వికాసానికన్ని విధాలా అవకాశం కలిగింది.

15 ఆగస్టు 1947 అర్థరాత్రి నుండి దేశచరిత్రలో కొత్తయుగం ఆరంభమైతే 26 జనవరి 1950 నుండి దేశ సమాజ చరిత్రలో కొత్తదశ మొదలైంది. ఈనాటి నుండి భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిష్కృతమైంది. ఆదర్శాల్ని అందుకునే లక్ష్యంతో చారిత్రకంగా జాతీయాంతర్జాతీయ దృక్పథాల మేళనంతో రాజకీయ శక్తులతోపాటు ఆధునికమైన సాంస్కృతిక వాతావరణం రూపొందింది. భారత రాజ్యాంగానుసరణతో ప్రజాస్వామ్య భావన సాహిత్య ప్రపంచానికి ప్రత్యక్షంగాను పరోక్షంగాను కొత్తశక్తినీ దీప్తినీ చేకూర్చింది. కవిత్వంలో ఈ మార్పు స్పష్టం. కేవలం సాహిత్యశాస్త్రంతో పరిమితం కాక రాజకీయ సాంఘిక ఆర్థిక మానసిక శాస్త్రాలతో పరిచయం కొత్త సీమల్ని చూపింది. ఈ విశిష్టమైన ధోరణిలో వర్తమాన స్వేచ్ఛా కవిత్వం ప్రవర్తిల్లింది. ప్రగతిశీల స్వభావంతో సాహిత్యం ఉండాలనడంలో ఇప్పుడే అభిప్రాయ భేదం లేదు. కాని ఏ గతిశీలంలో అందునా నిరంతరం ఘర్షణ హింసలో ఏ దిశలో ఏ మేరకన్న అంశంపై మాత్రం విభేదం అనివార్యం. సిద్ధాంత ప్రకటనలు అభిప్రాయభేదాలు చర్యకు ప్రతిచర్యకు కలిగే అవకాశాలు నిరసన ప్రతిఘటనలూ ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ మూలంగానే నన్నమాట మరచిపోకూడదు. ఇవి ఒకమేరవరకు అంగీకరింపదగినవే.

సామాజికమైన సంబంధాల్లో మార్పు కొత్త కొత్త అనుభవాల ప్రభావం భౌతికమైన జీవన ప్రయత్నంతో పాటు మానసికమైన వ్యక్తిత్వం ప్రతి స్వేచ్ఛాకవిత్వ రచనలో అంతో ఇంతో విశ్లేషణకందుతుంది. ఈనాటి స్వేచ్ఛా కవిత్వంలో తప్పనిసరిగా మనదృష్టికి వస్తుంది. ఈ కాలాన్ని ప్రజాస్వామ్య సాహిత్యయుగంగా కవిత్వంలో స్వేచ్ఛాయుగంగా భావించవచ్చు.

ఈ కాలంలో వచ్చిన సాహిత్యంలో రచయిత స్వీయ వ్యక్తిత్వం గుర్తింపు ఉంది. జాతిలో నిక్షిప్తమైన శక్తిసామర్థ్యాలను బయటికి తీసి వెలుక్కితెచ్చే ధోరణి ఉంది. విశ్వజనీన దృక్పథంతో ప్రగతి శక్తుల సమీకరణం ఉంది. జాతి సంప్రదాయ మౌలిక లక్షణాలతో ఆధునికతను ఆవిష్కరించడం ఉంది. సామాజిక తత్త్వంలో స్వేచ్ఛా స్పందన ముఖ్యం. వ్యక్తిత్వవికాసంలో స్వేచ్ఛాగుణం అవసరం. ప్రజాస్వామ్యతత్త్వంతో రూపొందిన వ్యక్తిత్వ ప్రతిఫలనమే వర్తమాన సాహిత్యం. కాబట్టి స్వాతంత్ర్యానంతరం రూపొందిన సాహిత్యదశను ప్రజాస్వామ్య స్వేచ్ఛా యుగంగా పేర్కోడం సమంజసం.

# 13. స్వేచ్ఛకు అవకాశం - స్వేచ్ఛాకవిత్వం

I

ఆధునిక సాహిత్య చరిత్రలో స్వాతంత్ర్యానంతరం ప్రజాస్వామ్య ప్రభావంతో స్వేచ్ఛాయుగం అవతరించింది. క్రమంగా కాలం గడిచేకొద్దీ, దీని అస్తిత్వం బలపడింది. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛాగుణం సాహిత్యంలో వివిధ ప్రక్రియల వికాసానికెంతో దోహదం చేసింది. ప్రస్తుత విషయమైన స్వేచ్ఛా కవిత్వంలో దీని ప్రభావం సంపూర్ణంగా గోచరిస్తుంది. సృజన స్వేచ్ఛకు కవాటాలు తెరచే స్వేచ్ఛాయుగంలో ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ ప్రజాస్వామ్యానుభవం కీలకమైంది. కాలానుగుణమైన మార్పులతోను కొత్తదనంతోను, స్వతంత్రమైన నిర్మాణరూపం కలిగిన స్వేచ్ఛాకవిత్వం సమాజంలో వచ్చే ప్రతి ఉద్యమాన్నీ, ధోరణినీ, మొట్టమొదట స్వీకరించింది. వాటికి ప్రేరణగా ఉపకరించింది. వేదికగానూ నిలిచింది. ప్రాతినిధ్యం వహించింది.

ఆధునిక కాలంలో ప్రజాస్వామ్య స్వేచ్ఛాయుగంలో సామాజిక రాజకీయ కారణాలవల్ల అనేకమైన వాదాలు దృక్పథాలూ సమాజంలో చారిత్రకమైన మలుపుల్నీ మానవీయమైన పాత్రల్ని నిర్వహించడం జరిగింది. ఈ దిశలో మొట్టమొదట వేగంగా స్పందించే కవిత్వంలో మార్పు సహజం. అయితే ఈ మార్పులకు దోహదం చేసే విధంగానో, ప్రాతినిధ్యం వహించే విధంగానో పద్యం ఉపయోగితం కాలేదు. కారణం ఈ భావజాలాన్ని ఆవిష్కరించేందుకు 1) సంప్రదాయబంధురమైన పద్యసంస్కృతి, 2) దాని నిర్మాణరూపమూ అవరోధంగా నిలిచాయి. ఇంకా పద్యానికున్న వాతావరణంలోని బాహ్యాంతర స్థితుల ప్రత్యేకతలు పరిమితులు కారణంగానూ, కొన్ని సందర్భాల్లో అవసరాల్నిబట్టి కొత్త ప్రక్రియ దానంతటదే సహజంగా ఆవిర్భవిస్తుంది. అట్లా ఏర్పడిందే స్వేచ్ఛా కవిత్వం. ఇదో అనివార్యమైన పరిణామంగా విశ్లేషణ కందుతుంది. ఈ మాట వేయేండ్ల కాలక్రమంలో విరాట్ రూపాన్నీ, మహనీయమైన శిల్పసౌందర్యాన్నీ పొందిన పద్యాన్ని ఏ మాత్రం తక్కువ చేయడం కాదు. ఆధునిక కాలంలో స్వేచ్ఛాకవిత్వం 1) బాహ్య నియమాలకతీత లక్షణంచేత, 2) కొత్త అవసరాలకు తగిన స్వేచ్ఛాగుణం చేత, 3) అంతర నిర్మాణ సౌలభ్యం చేత, 4) ఆవిష్కారంలో కొత్త అభివ్యక్తికి అవకాశం చేత కవుల హృదయాల్ని ఆకర్షించింది. ముఖ్యంగా యువతను ప్రేరేపించింది. విస్తృతంగా వర్ధిల్లింది. ఆధునికతకు సాధనంగానూ విలసిల్లింది. కొత్త ఆలోచనకూ, అనుభూతికీ చుట్టూ తలుపులు తెరిచినట్లయింది.

మూడు నాలుగు దశాబ్దాల తెలుగు కవిత్వంలో పద్యం ఆధునిక భావజాలాన్ని సంపూర్ణంగా ప్రతిబింబించలేకపోయింది. ఈ శూన్యస్థితిని స్వేచ్ఛా కవిత్వం పూరించింది. కవిత్వమంటే స్వేచ్ఛాకవిత్వానికి మాత్రమే పరిమితమైన దశ ఏర్పడింది. మునుముందు పద్యం నిర్వహించే పాత్ర చాలా ముఖ్యమైంది.

1980 తరువాత వచ్చిన స్వేచ్ఛాకవిత్వంలో మార్క్సిజం వెనుకబడింది. శ్రామిక వర్గానికే కాక ఇతర వర్గాలకూ ప్రాధాన్యం హెచ్చింది. అంతకుముందీ అంశం చిహ్నాలు లేవని కాదు. 1975 నుండి మొదలై 1980 నాటికి స్పష్టమైన దిశను పొందింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్వేచ్ఛా కవిత్వం వివిధ సిద్ధాంతాల వికాసానికీ పరిణామానికీ ప్రభావాలకూ వీలైంది. కాబట్టి దీని పరిధి త్వరలో అతి విస్తృతమైంది. ప్రజాస్వామ్య భావనలో నిహితమైన, సహనం సమన్వయం ఎదుటి అభిప్రాయాన్ని మన్నించే లక్షణం, చర్చ, ప్రజాభిప్రాయం మొదలైన లక్షణాలవల్ల కొత్త సామాజిక సంస్కృతికి దారి ఏర్పడింది. ఇది స్వేచ్ఛా కవిత్వ వాతావరణానికి ఎంతో బలం చేకూర్చింది.

1) స్వేచ్ఛా కవిత్వంలో 1980 నుండి క్రమంగా మార్క్సియం వెనుకబడుతూ వచ్చింది. సమన్వయ ప్రజాస్వామ్య దళిత, స్త్రీ వాద మైనారిటీ అనుభూతి వాదులూ హైకూ వంటి ధోరణులూ వచ్చాయి. వీటి లక్ష్యం 1) సమాజపరంగా సమానత్వం, న్యాయం, ఉన్నతీ, శాంతీ, 2) వ్యక్తి పరంగా సంస్కారం, ఆనందంగానూ పరిశీలనకందుతుంది. వీటికి ప్రజాస్వామ్య వ్యవస్థ కేంద్రతలంగా వర్తించింది. స్వేచ్ఛాకవిత్వానికి గౌరవమూ ప్రశస్తి విస్తృతీ సిద్ధించాయి.

2) మరో విశేషం, విశ్వభావన విశ్వమానవుడు మొదలైన విశాలమైన భావజాలంతో పాటు జాతీయ భావనకూ స్థానీయమైన అవసరాల్ని బట్టి దేశీయతకూ ప్రాముఖ్యం లభించింది. వర్తమాన జీవితంలో వైవిధ్యంతో తటస్థపడే వివిధ బృందాల్నీ సమూహాల్నీ గురించీ వర్గాల్నీ వృత్తుల్నీ గురించీ వాస్తవ దృక్పథంతో ఆలోచన మొదలైంది. దీనితో మార్క్సిజం వెనకబడింది. కొత్తశక్తులు సమాజ తలంపైకి వచ్చాయి.

3) ముఖ్యంగా 1975 నుండి ఎక్కడికక్కడ సమాజంలో ఎదురయ్యే కులం, మతం, వృత్తి, ఉద్యోగం, ప్రాంతం జెండర్‌కు సంబంధించిన బాధాస్థితుల్నీ విషమ సమస్యల్నీ అసమానతలతో ఏర్పడిన వైరుధ్యాల్నీ ఎదుర్కొనే శక్తితోపాటు, పరిష్కార సాధనంగాను ప్రజాస్వామ్యం పనిచేసింది.

4) నిరంతరం వ్యతిరేకత, ఘర్షణ, హింసకు బదులు స్నేహం, సామరస్యం, శాంతి, విశాల దృక్పథంతో సమాజ హితం కోరింది. దీనికి సంబంధించిన కోణాలు అటూ ఇటూ స్వేచ్ఛా కవిత్వంలో సంపూర్ణంగా ప్రతిఫలించిన మాట వాస్తవం. వీటి స్పృహకూ స్పందనకూ ఆలోచనకూ వివేచనకూ స్వేచ్ఛా కవిత్వం సాధనమైన విధం అపూర్వమైంది. ఇది ప్రజాస్వామ్య శక్తికి నిదర్శనం.

5) ఈ సందర్భంలో అంతర్జాతీయ స్థాయిలో మానవహక్కుల్ని గురించే కాక, జాతీయ దేశీయ స్థానీయ స్థాయిలోను సమస్యలూ, పరిష్కారాలతో నిర్మాణాత్మకమైన పురోగమన దృక్పథం అలవడింది. అయితే ఈ పరిణామంలో స్వేచ్ఛా కవిత్వంలో వర్తమాన విషయము స్థితులవల్ల పొందే బాధ, వేదన, తపన, చింతన వెనుకనుండి లక్ష్య నిర్దేశమూ స్పష్టంగా కన్పిస్తుంది. ఈ సందర్భంలో మానవీయ దళిత స్త్రీవాదాల్ని పేర్కోవచ్చు.

6) వీటితో పాటు సామాజిక పార్శ్వమూ నిశితమైన పరిశీలనతో స్పందనగుణంతో చిత్రించడమూ గమనించవచ్చు. ఇంకా వైయుక్తిక మానవీయ పార్శ్వాల్ని గురించి చిత్రణలూ పరిశీలన కందుతాయి. ఈ కాలంలో వచ్చిన స్వేచ్ఛా కవిత్వంలో హేతుదృష్టి మరోవైపు నుండి అనుభూతి 'స్పందనకూ' ప్రాధాన్యం లభించింది. హైకూలు దీనికి బలమైన ఉదాహరణ. కేవలానుభూతి చిత్రణలూ కన్పిస్తాయి.

7) ఈ కాలంలో ఖండఖండంగా అక్కడి పరిస్థితుల్ని బట్టి స్వల్పసంఘటనలు కూడా సూక్ష్మతలపై చిత్రితం కావడం విశేషం. ఏదో అపాయమో విపరీతమో, విషాదమో ఏదైనాకావచ్చు. సామాజిక స్థితిగతులకు సంబంధించినవి ఎన్నో సామాజికత – స్పందన కవిత్వకళ అనుభూతి అన్వేషణ – ప్రస్థానం మొదలుగా దృష్టికి వస్తాయి.

8) 1980 తరువాత స్వేచ్ఛా కవిత్వంలో చాలా భాగం రాజ్యాంగ రూపాలపట్ల ప్రజాస్వామ్య సంబంధాల్ని కాపాడే నిర్మాణాత్మక ధోరణి స్పష్టంగా కన్పిస్తుంది. దీనికి వ్యతిరేకమైన ఆలోచన లేక పోలేదు.

9) ఈ సందర్భంగా కేవలం సాహిత్యపరమైన అంశాలకేకాక సాహిత్యేతరమైన సామాజిక రాజకీయ మనస్తత్వపరమైన అంశాలు కూడా చోటుచేసుకోవడం విశేషం. ఇక్కడే స్వేచ్ఛా కవిత్వంలో విశాలప్రాతిపదికపై సామాజిక కవిత్వ కళా సమాన్వయాల్ని కోరతాయి.

10) ఇకపోతే వస్తు నిర్వహణంలో సమావిష్కారంలో భావరూపాలు (ఇమేజెస్), ప్రతీకలు (సింబల్స్) పురాబింబాలు (archetypes) మనస్తత్వరీతులు (సైకాలజీకల్ మోడ్స్) (పాటరన్స్) మొదలైనవి విరివిగా కళారూపంలో భాగం కావడం బహుధా కన్పిస్తుంది.

ఈ ప్రత్యేకమైన అంశాల్ని పురస్కరించుకొని చూస్తే స్వేచ్ఛా యుగంలో స్వేచ్ఛా కవిత్వం ప్రజాస్వామ్య భావజాలంతో ప్రేరితమయినట్లు స్పష్టం. సుమారు 1980 నుండి మార్క్సియం స్థానంలో ప్రజాస్వామ్యం - స్వేచ్ఛ ప్రవేశించే స్థితీ బాగాకన్పిస్తుంది. అయినప్పటికీ గతానికీ వర్తమానానికీ సంబంధం తప్పనిసరి, దీన్ని విస్మరించడం సాహిత్యానికే లోపం, స్వేచ్ఛా కవిత్వ సమాలోచనంలో సాహిత్య శాస్త్రంలో భారతీయ పాశ్చాత్యసిద్ధాంత వాక్యాల్ని ప్రదర్శనశాలలో శిల్పాల్లో కాకుండా, సహేతుకంగా ప్రయోజనయుతంగా సమన్వయం చేసుకోవడం అవసరం. ఈ కాలంలో వచ్చిన స్వేచ్ఛా కవిత్వం 'పూర్వ కన్నా, స్వతంత్రమైన నిర్మాణంపై ప్రత్యయం కలిగిందీ ఎన్నో వాదాల ధోరణులు ప్రభావాలతో, దేనికది ఒక ప్రత్యేకమైన అధ్యయన మార్గాన్ని అపేక్షించడం సహజం. పద్యం, గేయం, గీతం, వచనం, ముద్రలు వీడిన మనోరూపంతో, స్వేచ్ఛా కవిత్వాన్ని దర్శించడం అవసరం, అపుడే సమాలోచనకు సరియైన స్థితి ఏర్పడుతుంది.

## II

స్వేచ్ఛా కవిత్వం ఆధునికయుగంలో సులభమైన ఉత్తమమైన అభివ్యక్తి సాధనం. రచనలో సంపూర్ణమైన స్వేచ్ఛకు వీలైంది. స్వతంత్రమైన ఆలోచనలతో ఎన్నొ ఒత్తిడుల్లో, పనుల్లో తీరిక తక్కువగా ఉన్న అధునిక సమాజంలో వర్తమాన బిందువు కేంద్రంగా సామాజిక స్థితిగతుల్ని ఆవిష్కరించేందు కనువైందిగాను కన్పిస్తుంది. కవిత్వాని కవసరమైన మూలధాతువుకు భంగం రాకుండా, ఆధునిక భావజాలానికి తగిన కళారూపంగా నిరూపితమయింది. దీని స్వరూపం అంతర్నియమాలతో కూడింది. దీనికి ఛందస్సులేదు. నిర్దిష్టమైన నియమాలు లేవు, కేవల వచనమూ కాదు, సమయ సందర్భాల్ని అనుసరించి, వాక్యప్రసారాలతో సంభాషరీతులతో ఆవేశ సంస్థితుల్నిబట్టి, కవి స్వయంనిర్ణయాలపై ఏర్పడే నిర్మాణరూపం కలిగింది. వివిధ సిద్ధాంతాల్నీ అభిప్రాయాల్నీ ప్రకటించేందుకు విస్తృతమైన అవకాశాలవల్ల, ప్రజాస్వామ్యానికీ స్వేచ్ఛా కవిత్వానికీ అనుబంధం సహజమైంది. ఇది ఆధునికతకు ప్రాతినిధ్యం వహిస్తున్నమాట నిజం!

స్వేచ్ఛా కవిత్వంలో శబ్దం తరంగసమంగా వర్తిస్తుంది. వాక్యం ప్రవాహ సదృశంగాను కదులుతుంది. సూత్రసమంగానూ సాగుతుంది. ఇది వాక్యం కదిలికను బట్టి సరిస్తుంది. ఛందస్సులో గుణరూపాలు మాత్రా రూపాలు సంభాషణ వచన రూపాలు గీతరూపాలు నిర్మాణంలో చోటుచేసుకోవచ్చు. ఇవి వైవిధ్యాన్ని ప్రకాశమానం చేసేవి మాత్రమే గౌణంగానే వర్తిసాయి.

ఈ స్థితి స్వేచ్ఛా కవిత్వం తొలిదశల్లోది. ఇపుడు మారింది పాతిక సంవత్సరాలనుండీ ఇంచుమించు అట్లాకాదు. రచనలో పరిణత రూపాన్ని సాధించింది. పద్యం, గేయం, గీతం, వచనం కన్నా భిన్నమైన అనుభవాన్ని కలిగించే నిర్మాణరూపం పట్టుబడింది. రూపమూకాదు, దీని నిర్మాణానికి మాదిరి (మోడల్) అనేది లేదు, పదవాక్య చలన విన్యాస గమనాల్లో స్వయం ప్రేరణాయుతమైంది. కవి సంస్కార మూలంచేత ప్రభావాల పర్యవసానంచేత తత్కాలంలో ఆలోచనా గతిలో ఆవేశ స్థాయిల్లో వస్తువు భావోద్గమనాన్ని మానసిక స్థితినీబట్టి కళాకృతిని పొందుతూంది. ఇది కవి ప్రతిభచేత రూపొందే నిర్మాణ వ్యాక్తిత్వానికి సంబంధించింది. రచనలో స్వయం ప్రేరణ కలిగిన స్వతంత్ర నిర్మాణ విధానంచేత సృజన పరిణామంలో ఏర్పడే భాగాలే, గతీ, లయ, విన్యాసం ప్రసారాలుగా సమాలోచనలో విశ్లేషణకందుతాయి. ఏ అనుకరణతోనూ దీని ఆకృతిని సాధించదానికి వీల్లేదు. స్వతంత్రమైన అభివ్యక్తి గుణం కలిగింది. కవి స్వేచ్ఛాసంకల్పాన్ని సంపూర్ణంగా ప్రతిఫలంచే ప్రక్రియ కావడంచేత అందరినీ ముఖ్యంగా యువకుల్నీ ఆకర్షించడం సహజం.

ఇందులో కథ చెప్పడంపై కన్నా భావం, స్థితీ, యోజనకే ప్రాధాన్యం. ఇది భౌతిక మానసిక చిత్రణలతో ఆపూర్ణమైందీ. భౌతికమంటే సామాజిక స్పందనం, మానసికమంటే అంతర చేతన, బాహ్యాంతర్విధాలుగా కన్పిస్తాయి. ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధంగా వారి ఆదర్శాల్నిబట్టి సామాజిక వాస్తవికత భిన్నభిన్న కోణాల్ని పొందుతూంది. దర్శనమూ విభేదించడం జరిగింది. స్థాయి భేదాలనేకం ఏర్పడినాయి. ఈ కారణంగా కవుల్లో వ్యక్తిత్వ వైవిధ్యాలతో అస్తిత్వాలూ స్పష్టంగా కన్పిస్తాయి. 1980 తరువాత ఈ వైవిధ్యం బాగా ఏర్పడింది. కవి భావనలో 1) సామాజిక, 2)రాజకీయ, 3) కళా, 4) మనస్తత్వ రీతులు వివిధ నిష్పత్తుల్లో ఆకృతిని పొందడం జరుగుతుంది. కాబట్టి కవిలో సంస్కార మూలానికి హేతువులైన అంశాలు, ప్రయోజనోద్దేశాలు స్వేచ్ఛాకవిత్వంలో విశ్లేషణకందుతాయి.

స్వేచ్ఛాకవిత్వం 1) మానవీయమైన విలువలకీ సహేతుకమైన మార్పుకీ నిబద్ధమైంది. మనిషిపై ఆశతో శక్తీ యుక్తీ పట్ల విశ్వాసంతో మనిషితో సంబంధంతో మానవతా గుణంతో మానవీయ పార్శ్వాన్ని కలిగింది. 2) ప్రతి మార్పుకీ మొట్టమొదట స్పందించే ఈ ప్రక్రియ, ఎప్పటికప్పుడు సముచితమైన పాత్రను నిర్వహిస్తూంది. సమాజ స్థితిగతులతోపాటు మనిషి వ్యక్తిత్వాన్ని గురించి ఆలోచన చేస్తుంది. 3) కవిత్వంలో కోరే సహజమైన అనుభవ గుణంతో ఏ సిద్ధాంతమైనా అభిప్రాయమైన ఆవిష్కరించే సౌలభ్యంతో, ప్రజాస్వామ్య చేతనకు ప్రాతినిధ్యం వహించడం జరిగింది. సాహిత్య చరిత్రలో ఏ యుగంలోనూ కన్పించని వైవిధ్యమూ విస్తృతీ బహు స్వల్పకాలంలో స్వేచ్ఛా కవిత్వంలో ప్రకాశించింది.

## III

స్వేచ్ఛా కవిత్వంలో (ఛందస్సులో నియతమైన నిర్మాణగతికి లయకూ ప్రత్యామ్నాయంగా) 1) పదచలనంతో వాక్య విన్యాసంతో స్వతంత్ర నిర్మాణం కన్పిస్తుంది. 2) కళాత్మకతకు లోపం రానీయని విధంగా ఆవేగంతో ఆలోచనతో అభివ్యక్తి విధం రూపొందుతుంది. 3) మధ్యలో సంభాషణ పద్ధతి సహజతను చేకూర్చేదిగాను యోజితమవుతుంది. 4) భావ ప్రమాణాన్నిబట్టి పదవాక్యోపవాక్యప్రసారం జరుగుతుంది. స్పందన రీతుల్ని దీనికనుగుణంగా ఆవేశస్థాయిననుసరించి వైవిధ్యాన్ని పొందుతుంది. 5) నిర్మాణ రూపంలో ఒక చలనాన్ని మరో చలనం, ఒక గమనాన్ని మరో గమనం, ఒక ప్రసారాన్ని మరో ప్రసారం అందుకొని నైరంతర్యాన్ని కలిగి ఉంటుంది. 6) మొదటి నుండి చివరిదాకా ఏర్పడే క్రమంలో శైలిని ఏర్పరచుకొని మూర్తిమత్వాన్ని పొందుతుంది. ఈ విధంగా రచనకొక నిర్దిష్టమైన ఆకృతి సిద్ధిస్తుంది. ఇది కవి ఆంతరమైన నిర్మాణ శక్తికి సంబంధించింది మాత్రమే. స్వతంత్రమైన ప్రతిపత్తి కలిగిందీ, స్వేచ్ఛా ప్రేరితమయిందీ.

ఒకమాట! ఏదైనా ఒక ప్రక్రియకు సంబంధించినది ఆస్వాదించేప్పుడు మనస్సు దానికి తగిన వాతావరణంతో సిద్ధం కావాలి, అవసరం కూడా. ఈ మానసిక స్థితి కవి అలవర్చుకున్న సాహిత్య సంస్కృతివల్ల కలుగుతుంది. ఇది సజీవమైన సహృదయ చేతనకు సంబంధించింది. దీనికి స్వేచ్ఛాకవిత్వం పట్ల అభిలాష, తత్పరత, సహృదయత, ఆలోచన అనేవి సాహిత్య సంస్కృతిని దీప్తిమంతం చేస్తాయి.

స్వేచ్ఛా కవిత్వానికి ప్రేరకశక్తియైన స్వేచ్ఛా లక్షణం ఎక్కువమంది కవుల్లో దీన్ని అనుసరించేందుకు ఉత్సాహాన్ని కలిగించింది. కవి తనదైన స్వేచ్ఛా వ్యక్తిత్వంతో అవతరించే సృజన రూపంలో, ఆధునికమైన భావనకు తగిన ప్రజాస్వామ్యంలో నిహితమైన స్వేచ్ఛానుభవాన్నీ దర్శించడం జరుగుతూంది. ఇదో విశిష్టమైన అనుభవం. సిద్ధాంత వైరుధ్యాలుండవచ్చు. అభిప్రాయ భేదాలుండవచ్చు. కాని సాహిత్య ప్రపంచంలో ప్రజాస్వామ్యంలో చారిత్రక పాత్రను నిర్వహించే సృజన రూపాన్ని గుర్తించడం దాని అస్తిత్వాన్ని, ఇదీ ప్రధాన ప్రవాహంలో కలుపుకోవడమూ జరిగింది.

ఎప్పటికపుడు కొత్త ఊపిరితో, కొత్త ఆయువుతో, కొత్త ఆలోచనలతో, కొత్త అనుభవాలతో సమాజంలో వచ్చే ప్రతి మార్పుకీ స్పందన శక్తిగా ప్రత్యక్షమయ్యే స్వేచ్ఛా కవిత్వం ముఖ్యంగా కాలానికి సరియైన సామాజిక వేదికగా నిలిచింది. ప్రతి వర్గానికీ, ప్రతి సిద్ధాంతానికి ప్రతి దృక్పథానికి బలమైన అభివ్యక్తి సాధనంగా పరిణమించడం, ప్రజాస్వామ్యం వల్లనే సాధ్యమయింది. ఇది ప్రజాస్వామ్య భావనలో కీలకమైంది. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛకు సంకేతమయింది.

"భవిష్యత్తుకు ప్రవేశ ద్వార మొకటే
ఉదార ప్రజా స్వామ్య వాస్తవం"

# దాశరథి
# కవితా సమాలోచనం

మాదిరాజు రంగారావు

**2026**

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

Literary Criticism

# DASARATHI KAVITAA SAMALOCHANAM

(Sahithya Samalochanam)

by

Prof. Madiraju Ranga Rao

© : Dr. M. Santhosh Kumar

First Edition : 1985
Second Edition : 2002-2003
Third Edtion : 2018
Fourth Edtion : 2026

# దాశరథి
# కవితా సమాలోచనం

## అంకితం

స్వాతంత్ర్యోద్యమం, సాహిత్య వ్యాసంగం

మూర్తీభవించిన

రచయిత

**శ్రీ ఎం.ఎల్. నరసింహారావు**

అన్నగారికి

# ఆలోకనం

Haritha Madiraju, Devulapalli

M.A., Lit.

Detroit,

Michigan USA

16th September, 2002

ఇది మా నాన్నగారి రచనల్ని పన్నెండు సంపుటాలుగా ప్రచురించే యత్నంలో భాగం. ఇప్పటికి రెండు సంపుటాలు వచ్చాయి. ఒకటి దీర్ఘకావ్యాలు (మానవీయం, ముక్తధాత్రి, పడగెత్తిన ఉదయం, ఇది వియత్నాం), మరొకటి అగ్నిపీఠం (క్రాస్‌ఫైర్, సీజ్‌ఫైర్, నేడూ రేపూ మధ్య) & స్వేచ్ఛకు సిగ్నల్.

దాశరథి కవితా సమాలోచనం (పునర్నవం) 1985లో ప్రింట్ అయింది. ఇందులో భాగాలు ముందుగా భారతి, స్రవంతి సాహిత్య పత్రికల్లో ప్రకటితమయినాయి.

ప్రజాస్వామ్య నిబద్ధత కలిగిందీ, మాదిరాజు రంగారావుగారి కవిత్వం, ఈ ఆదర్శం కేంద్రంగా విమర్శ జరగవలసి ఉంది.

ఈ గ్రంథం ప్రధానంగా ఆధునిక తెలుగు కవిత్వంలో శ్రీశ్రీ తరువాత 1)ఉద్యమ తత్త్వం 2)ప్రగతిభావన 3)కవిత్వ కళ కలిసి రూపొందిన వ్యక్తిత్వంతో ఆకర్షించే దాశరథి కృష్ణమాచార్య ఉద్యమ వ్యక్తిత్వంతో పాటు "పునర్నవం"పై సమాలోచనం. ఇది మహాకవి దాశరథి 1) సామాజిక సాహిత్య వ్యక్తిత్వం, 2) పునర్నవ పరిశీలనం, 3) అనుబంధం (కొన్ని లేఖలు) తో విశిష్టమైంది. దీన్ని సాహిత్య లోకానికి సమర్పించే అవకాశానికి ఆనందిస్తున్నాను.

# 1. ఉద్యమ వ్యక్తిత్వం - తెలంగాణా విమోచనం

'నా పేరు ప్రజాకోటి', నా ఊరు 'ప్రజావాటి' తొలిదశలోని తెలంగాణా ప్రజల రాజకీయ సమస్యలతో అభిన్నమైన సాహితీ వ్యక్తిత్వం గల మహాకవి దాశరథి. ఉజ్వలమైన సామాజిక నిబద్ధతతో జాతీయమైన ఉద్యమశక్తితో ప్రగతి పరంపరలో భాగమైందీ, దేశ స్వాతంత్ర్య భావధారలో కలిసిందీ ఆధునిక యుగంలో తెలంగాణా స్వాతంత్ర్యోద్యమం అనగానే కవితా ప్రపంచంలో ఎదురయ్యే ఉజ్వలమూర్తు లిరువురు. ఒకరు 'దాశరథి', మరొకరు 'కాళోజీ'. దాశరథి కవిత్వం నిజాం పరిపాలనలో మ్రగ్గే తెలంగాణా ప్రజల ఆకాంక్షలతో ఆలోచనలతో ఆశయాలతో ముప్పిరిగొంది.

**"మూగవోయిన కోటి తమ్ముల గళాల**
**పాట పలికించి కవితాజవమ్ము గూర్చి**
**నా కలానకు బలమిచ్చి నడిపినట్టి**
**నా తెలంగాణ! కోటిరత్నాల వీణ"**

ఈ పవిత్ర భూమి కంజాత వల్లియై సౌందర్య రాశియై రత్నాలవీణయై రాగాత్మకంగా కళాత్మకంగా రసాత్మకంగా దర్శనమిచ్చింది. అటు కర్షకుని హలానికీ ఇటు కవి కలానికీ బలమిచ్చిన శక్తిపుంజం. విశాల దృక్పథం గల ఈ మనస్వి తెలంగాణా స్వాతంత్ర్య లక్షసాధనతో ఆగిపోలేదు. మహాంధ్రోదయం దాకా చారిత్రకంగా ముఖ్యమైన పరిణామదశలో ప్రధానపాత్ర నిర్వహించాడు. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో తెలంగాణా విమోచనోద్యమం ఒక భాగం.

నిరంకుశత్వం నుండి పీడన నుండి స్వాతంత్ర్యం కోసం సమానత్వం కోసం 'క్షోభ' చెందుతాడీ కవి. అందుకే 'క్షోభలేంది కవిత్వం లేదు', 'క్షోభ నుండే కవిత్వం వ్రాస్తా'నంటాడు. క్షోభ నుండి విముక్తం కావడానికి తెలంగాణా విమోచనానికీ చేసిన సృజనాత్మక ప్రయత్న పర్యవసానాల్లో ఒకటి అగ్నిధార, రెండోది రుద్రవీణ. ఈ రెండూ ఉద్యమశక్తి స్ఫూర్తితో అవతరించినవే. జ్వలించే ప్రజల బాధామయ జీవనగతుల్ని చిత్రించాయి. చిలీలో నెరుడావలె ఉద్యమంలో భాగమై జీవించిన కవి దాశరథి. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఆరంభించిన తెలంగాణా స్వాతంత్ర్యోద్యమానికి ప్రేరణ భారతదేశ స్వాతంత్ర్యోద్యమం. ఒక దశలో దానితో ఇంచుమించు సమాంతరంగా నడిచింది. తెలంగాణాలో మొదట్లో భాషా సాంస్కృతిక తలంపై నిర్వహింపబడింది. 1930 నుండి 1946 వరకు తెలంగాణాలో వివిధ ప్రాంతాల్లో సభలు సమావేశాలు

జరిపిన ఆంధ్రోద్యమం, ఆంధ్ర మహాసభ ప్రజల్లో చైతన్యానికెంతో కృషి చేశాయి. ఆదిలాబాద్, మంచిర్యాల, మహబూబ్‌నగర్, వరంగల్ మొదలగు పలుచోట్ల అనేక కార్యక్రమాలు నిర్వహింపబడినాయి. దీనికి గ్రంథాలయ ఉద్యమం కూడా ఎంతో సహకరించింది. మొదట్లో గ్రంథాలయాలు విద్యా సాంస్కృతిక కేంద్రాలుగా ఉన్నాయి. ఆ తరువాత స్వాతంత్ర్యోద్యమానికి నిలయాలైనాయి. ఆంధ్ర సారస్వత పరిషత్తువంటి సాహిత్య సంస్థలు విద్యాసాంస్కృతిక వాతావరణ నిర్మాణానికి కృషిచేశాయి. మరోవైపు నుండి కాంగ్రెస్ పార్టీ రాజకీయోద్యమం, కమ్యూనిస్టు పార్టీ అభ్యుదయ కార్యకలాపాలు ముమ్మరంగా పనిచేశాయి. ఈ అన్ని శక్తులూ కలిసి దాశరథి సాహిత్య వ్యక్తిత్వాన్ని మలచాయి. ఈ దశలో వెలువడిన దాశరథి కవిత్వాన్ని పరిశీలించేటప్పుడు చారిత్రకంగా రాజకీయ సామాజిక శక్తుల ప్రమేయం గురించి స్థూలమైన పరిశీలన అనివార్యం.

## 2

విద్యాభ్యాసం చేసే రోజుల్లోనే దాశరథి ఉద్యమస్ఫూర్తితో రాజకీయ వాతావరణంలోకి ప్రవేశించాడు. దీనితో సామాజిక స్థితిగతుల్ని గురించి ఆలోచన మొదలైంది. కవి గుండె గాయపడింది. అగ్నిధార ప్రవహించింది. రుద్రవీణ నిస్వనించింది. ఈ కవిత్వం సమాజానికి ఉత్తేజాన్ని ప్రసాదించింది. లక్ష్యాన్ని నిర్దేశించింది. సామాజిక ప్రయోజనమూ, కావ్యకళా రెండూ దాశరథి కవిత్వంలో చక్కని సమన్వయాన్ని పొందాయి.

**"చింతల తోపులో కురియు చిన్కులకున్ తడి ముద్దయైన బా**
**లెంత యొడిన్ శయించు పసిరెక్కల మొగ్గను వోని బిడ్డకున్**
**బొంతలులేవు కప్పుటకు బొంది హిమంబయి పోవునేమొ వా**
**యింతును రుద్రవీణపయి ఇంచుక వెచ్చని అగ్నిగీతముల్"**

పసితనంతో మొగ్గలా ఉంది. బాధతో కష్టంతో ఈట్టుకోలేని దశలో వెచ్చదనం కోరుతూంది. ఇదీ అప్పటి తెలంగాణా స్థితి. వెనుకబడినతనంతో అమాయకత్వం, దారిద్ర్యం, నిస్సహాయత్వంలో ఉదయించిన శిశువు స్థితి సూచితం. క్లిష్టదశలో ఆదుకునే రవంత హృదయం కోసం నిరీక్షించే దృశ్యంలో మానవీయ భావనతోపాటు, ఉత్తేజాన్ని కలిగింప జేసే కర్తవ్యమూ ధ్వనితమవుతూంది.

1944లో వరంగల్ కోటలో ఆంధ్ర సారస్వత పరిషత్తు వార్షికోత్సవాల ఏర్పాట్లు జరిగాయి. ఉదయం జరుగవలసిన సభలకై వేసిన పందిళ్ళ కారాత్రి ముష్కరులెవరో నిప్పంటించారు. వ్యక్తిస్వేచ్ఛ కరువైన ఈ దుస్థితిని నిరసిస్తూ ..

**"ఓ! పరాధీన మానవా! ఓపరాని దాస్యము**
**విదల్చలేని శాంతమ్ము మాని**
**తలుపులను ముష్టిబంధాన కలచివైచి**
**చొచ్చుకొని పొమ్ము స్వాతంత్ర్య సురపురమ్ము"**

మరునాడు నిప్పు చల్లారీ చల్లారని ఆ వాతావరణంలోనే సమావేశాలు విజయవంతంగా జరిగాయి. ఈ పద్యం స్థానికమైన సంఘటన ఆధారంగా ప్రజల స్వాతంత్ర్యేచ్ఛనూ, స్వేచ్ఛాతత్త్వాన్నీ ఉద్యమశీలంతో విశ్వతలంపై నిలుపుతూంది. నిశ్చలమైన వీరగుణంతో నిరంకుశ కవాటాల్ని భిన్నంచేసి స్వాతంత్ర్య సురపురం చేరే ఆశాభావం ఉద్యమానికి ప్రేరణనిస్తోంది. ఆ సభకు అధ్యక్షుడు సురవరం ప్రతాపరెడ్డి. కార్యనిర్వాహకుడు దేవులపల్లి రామానుజరావు. ఇది ముష్కరులచేత భగ్నమైన స్వాతంత్ర్యం తిరిగి పొందే విజయదశకు సంకేతం.

## 3

దాశరథి స్వస్థలం వరంగల్ జిల్లాలో "గార్ల" జాగీర్ గ్రామం. ఈయనకు జాగీర్‌లో జరిగే అన్యాయాలు అక్రమాలు సుపరిచితమే. స్వేచ్ఛాప్రియుడైన ఈ కవికి నియంతలపట్ల ద్వేషం, శ్రమజీవులపట్ల సానుభూతిని కలిగించింది. ప్రగాఢమైన ఆలోచనకు దారితీసింది. పీడితులైన శ్రమజీవులకు తగిన శ్రమఫలం లభించదు. భోగలాలసత్వం అలసత్వంతో కాలం వెళ్ళబుచ్చే పీడకులకే అంతా చెందుతూంది. ఈ చారిత్రక సత్యం యథార్థ చిత్రణమే ఈ పద్యం.

**"ప్రాణములొడ్డి ఘోరగహనాటవులన్ పడగొట్టి మంచి మా**
**గాణములన్ సృజించి ఎముకల్ నుసిసేసి పొలాలుదున్ని భో**
**షాణములన్ నవాబునకు స్వర్ణము నింపిన రైతుదే! తెలం**
**గాణము రైతుదే! ముసలి నక్కకు రాచరికంబు దక్కునే"**

ఇది ఈనాటి సమస్య కాదు. ఈ ప్రాంతం సమస్య, ఎన్నోచోట్ల ఉంది. దీన్ని అంతం చేసేందుకెన్నో ప్రయత్నాలు అక్కడక్కడా జరుగకపోలేదు. అయితే ఈ దిశలో ఒక

స్పష్టమైన ఆధారంతో కార్యాచరణ పథకంతో ఉద్యమించే స్వాతంత్ర్యలక్ష్యం ఇతణ్ణి బాగా ఆకర్షించింది. ఉద్యమగుణం ఉద్రేక స్వభావంతోపాటు కష్టజీవులపట్ల సానుభూతీ వారిని గురించి చింతనతో మార్క్సు లెనిన్ రచనల అధ్యయనం కారణంగా ప్రగతివాద శక్తులకు దగ్గరైనాడు. అభ్యుదయ వ్యక్తిత్వం అవతరించింది.

**"అనాదిగా సాగుతోంది అనవరత సంగ్రామం**
**అనాధునికీ ఆగర్భ శ్రీనాధునికీ మధ్య"**

పీడితుడు తాడితుడు అనాధుడు దిక్కులేని కూలిపై బ్రతికే ప్రజల వర్గం ఒకవైపు. వీరి గోడు వినేవాడే లేడు. పీడకుడు ఆగర్భ శ్రీమంతుడు వారసత్వంగానో అన్యాయం గానో కూడబెట్టిన సంపదతో కాలక్షేపం చేసే వర్గం మరోవైపు. పొట్టకోసం ఒకచోటి నుండి మరోచోటికి పరుగెత్తే నిరుపేదను సంఘర్షణ కాహ్వానిస్తాడు. ధనమదాంధుల్ని నిరసిస్తాడు. ప్రశ్నిస్తాడు కవి. అద్యతనంలోకి ఆహ్వానిస్తాడు.

**"తరతరాల దరిద్రాల కరువులతో బరువులతో పరుగెత్తే నిరుపేదా రా రా. నాతో రా రా"**

శ్రమశక్తి కొల్లగొట్టబడిన బీదల దయనీయమైన స్థితిని గర్హిస్తూ దీన్ని నివారించేందుకు భవిష్యత్తులో మార్గాన్ని గుర్తించాడు. "రానున్నది ఏది నిజం అది ఒకటే సోషలిజం"

సామ్యవాదంవైపు తన ప్రయాణం గురించి నిశ్చయాన్ని వెలిగిస్తాడు. "రక్తారుణ వైజయంతి రమ్మన్నది పోతున్నా"నంటూ క్రియాత్మకతను ప్రకటిస్తాడు. ఇందులో అరుణశబ్దం కమ్యూనిష్టు పార్టీ నాయకురాలు అరుణ ఆసఫ్ ఆలీని సూచిస్తోంది.

## 4

నిజాంకు వ్యతిరేకంగా హైదరాబాదు రాష్ట్రంలో 1946 స్వాతంత్ర్యోద్యమం తీవ్రతరమైంది. ఇది సహించని నిజాం ప్రభుత్వం నిరంకుశ విధానాల్ని అవలంబించింది. ప్రజలెన్నో కష్టాలకు గురియైనారు. ఇతర ప్రాంతాలకు వలసపోయారు. స్త్రీలు సైతం అవమానాలకు గురియైనారు.

**"నాడు మానవతీ నయనాంచలముల నాగ సర్పాలు బుసకొట్టి నాట్యమాడె**
**నాడు మానవతయు నవనాగరికతయు తన్ను తిన్నది రాక్షసత్వమ్ము చేత"**

తత్కాలంలో నవనాగరికతకూ మానవతకూ తగిలిన ఆఘాతం చరిత్రలో విస్మరించరానిది. క్రమంగా పరిస్థితి విషమించింది. 1948లో దాశరథి అరెస్టు చేయబడినాడు.

నిజామాబాద్ (ఇందుపురం) జైల్లో బంధితుడైనాడు. అనేక హింసలకు గురియైనాడు. స్పృహ కోల్పోయే స్థితీ ఏర్పడింది. అక్కడక్కడా దొరికిన బొగ్గుముక్కలతో నిజాంకు వ్యతిరేకంగా గోడలపై పద్యాలు వ్రాయడం మొదలుపెట్టాడు.

**"ఓ నిజాము పిశాచమా కానరాడు నిన్నుబోలిన రాజు మాకెన్నడేని**
**తీగెలను తెంపి అగ్నిలో దింపినావు నా తెలంగాణ కోటిరత్నాల వీణ"**

అక్కడినుండి హైదరాబాదులో చంచల్‌గూడా జైలుకు తరలింపబడినాడు. ఈ విధంగా ఉద్యమంతో ప్రత్యక్ష ప్రమేయం ఈయనలో ఇదివరకే నెలకొని ఉన్న దేశ స్వాతంత్ర్య ధర్మాన్ని శక్తివంతం చేసింది. భావరూపాలకు అనుభవ గాఢత్వాన్ని అభివ్యక్తి నైశిత్యాన్ని చేకూర్చింది. పిశాచం సాధారణంగా పట్టుకుంటే వదలదు, మానసికంగా బాధిస్తుంది, వేధిస్తుంది. ప్రాణం పోదు, నిలవదు, సమాజంలో ఇదో విశ్వాసం. ఈ విశ్వాసాన్ని కవి సందర్భోచితంగా ఉపయోగించుకోవడం జరిగింది. చక్కని స్వరాలు పలికే వీణ తీగల్ని భిన్నంచేసి అగ్నికాహుతి చేసే కృత్యంలో ప్రేమించవలసిన మనస్సుని భగ్నం చేసి కష్టాలపాలు చేసి బాధించే దారుణమైన మనోరూపం వ్యంజితం, వీణపైనా ప్రజల్లోనూ రాగం పలికించడానికి స్పందించే హృదయం కావాలి. అది నిజంగా పాలకుల్లో మృగ్యమైంది.

**"ఈ శిథిలాలయమ్మున జనించిన చిక్కని శర్వరీ తమో**
**రాశి శిఖాగ్రసీమ పదరా ఒక దీపము పెట్టి వత్త మా**
**వేశములేని ఈ బ్రతుకు వీధుల వెచ్చని దీప మాలికా**
**పేశల కాంతి నింపుదము పెక్కుతరాలతమమ్ము లింకగన్"**

ప్రస్తుతం పారతంత్ర్యంలో సమాజం నిరంకుశ విధానాలవల్ల శిథిలావస్థలో ఉంది. దట్టమైన చీకటి ప్రబలింది. కాస్త రవంతదీపం కావాలి దారి చూపేందుకు. చల్లబడిపోయే బ్రతుకుని కాపాడేందుకు కాస్త వెచ్చదనమూ అవసరం.

"ముద్దుల్ గుల్కు దీపమ్ములం దేదో చల్లదనమ్ము ప్రాకినది" అల్లంత దూరంలో అంటే భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన త్యాగమూర్తుల జీవితాలు ఉజ్వలంగా ప్రకాశించే కాంతిబింబాలు. ఆకర్షిస్తున్నాయి.

**"దూరదూరాన దీపాల తోరణాలు అందులో–భరతవీరుల నెత్తుటి వరద కలదు**
**అందులో విచ్చె బంగరుటంబుజములు – పూజ మాతృపదమ్ముల వ్రాలుకొరకు"**

ఇది తెలంగాణా స్వాతంత్ర్యసమరానికి ఆదర్శరూపమైంది. చుట్టూ అలముకొన్న అలసత్వాన్నీ ప్రస్తుతానికి ఉత్తేజితం చేయవలసిన సహనాన్నీ పనికిరాని శాంతాన్నీ వదలివేసి చైతన్యాన్నీ, వివేకాన్నీ, ఉత్సాహాన్నీ వరించేందుకు ప్రేరేపిస్తుందీ పద్యం. 'కవికి నిర్బంధం ఉండకూడదు, స్వేచ్ఛ ఉండాలి. కవిత్వం మేనిఫెస్టో కాదు, కళాత్మకంగా ఉండాలి' అన్న ఈ కవి అభిప్రాయాని కద్దం పడుతుందీ కవిత్వం.

## 5

15 ఆగస్టు 1947వ తేదీన భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందింది. ఈ మహత్తరమైన చారిత్రక పరిణామం హైదరాబాద్ స్వాతంత్ర్యోద్యమంపై గణనీయమైన ప్రభావాన్ని నెరపింది. దీనితో సెప్టెంబర్ 1947 నుండి ఉద్యమం తీవ్రతరమైంది.

**"తరతరాల స్వప్నాల సుందరఫలమ్ము – స్వైరభారత భూమి చొప్పడెనొలేదో?**
**విషము గుప్పించినాడు నొప్పించినాడు–మా నిజాం రాజు జన్మజన్మాల బూజు"**

జనజీవనం స్తంభించింది. నిజాం నవాబు స్వయంప్రతిపత్తికై ప్రయత్నాలు మొదలుపెట్టాడు. దొంగచాటుగా ఆయుధ సామగ్రిని చేరవేయడం మొదలైంది. సాయుధ సంఘర్షణకు దారితీసే సమస్యను అంతర్జాతీయం చేసే ఎత్తుగడ మొదలైంది. అదను చూచుకొని మతోన్మాద శక్తులు విజృంభించాయి.

"నా తెలగాణ రమారమి రెండు శతాబ్దముల్ తమఃపటలము నందునన్ గడచె" ఇంకా తెలవారలేదన్న బాధ ప్రతి వ్యక్తిలో వ్యక్తమైంది. ఆలస్యం చేస్తే అమృతం విషమయ్యే ప్రమాదాన్ని శంకించిన భారత ప్రభుత్వం 13 సెప్టెంబర్, 1948 నాడు పోలీసుచర్య కుపక్రమించింది. 18 సెప్టెంబర్ సాయంకాలం ఐదుగంటలకు నిజాం నవాబు యుద్ధవిరమణ నిర్ణయాన్ని హైదరాబాద్ రేడియోనుండి ప్రకటించడం జరిగింది. భారతదేశంలో హైదరాబాద్ సంస్థానం విలీనమైంది. 'తెలగాణమ్ము తమః కవాటముల బందీయైన నిశ్శబ్దరాత్రులు' అంతమైనాయి. గళమెత్తిన ఉద్యమకవి చిరస్వప్నం ఫలించింది. స్వాతంత్ర్యోదయంతో జాతిచరిత్రలో పునరుజ్జీవన యుగమారంభమైంది.

**"రెండువందల యేండ్ల చరిత్రపుటల కప్పుకొనియున్న గాఢాంధకారమెల్ల**
**కొట్టుకొనిపోయె తూరుపుమిట్టనుండి పారివచ్చిన వెలుతురు వాగులోన"**

భారత స్వాతంత్ర్యోదయం వెలుగులో నిజాం నిరంకుశమైన పాలనాంధకారం కొట్టుకొనిపోయింది. రుద్రవీణను జాతికంకితం చేస్తూ దాశరథి పలికిన మాటలు ఈ మహాకవి స్థిరమైన వ్యక్తిత్వాన్ని స్ఫూర్తికి తెస్తాయి.

**"పాటలు పాడితిన్ తెలుగుబాబులు నిద్దుర మేలుకోగ ఆ**
**రాటము సేయగా కరకు రాచరికమ్మును కూలద్రోయగా**
**కోటి గళాల నొక్కకడ చేర్చితి విప్లవశంఖమెత్తితిన్**
**నాటికి నేటికిన్ తెలుగు వాడికి వెచ్చదనమ్ము నూదితిన్"**

తెలంగాణా చరిత్రకూ తెలుగు సాహిత్య చరిత్రకూ భవిష్యత్తు పరిశోధకులకు దాశరథి కవిత్వం అమూల్యమైన ఆధారం. సమకాలీన చైతన్యానికి ఆదర్శశిఖరం.

**"ధనం దాచగలరుగాని తేజస్సును దాచగలర**
**తెరలు దించగలరు గాని శిరస్సులను వంచగలర"**

ఈ స్వేచ్ఛాప్రయాణ చరిత్రయే నిజాం పాలననుండి తెలంగాణా స్వాతంత్ర్యోద్యమం. దాశరథి సామాజిక సాహిత్య వ్యక్తిత్వంలో ఇదో భాగం. తెలంగాణా విమోచనకై ఉద్యమంతో పాటు నేటికీ అనవరతమైన ఉత్తేజాన్ని కలిగించే శక్తి గోచరిస్తుంది.

## 2. ఉద్యమ వ్యక్తిత్వం - మహాంధ్రోదయభావన

**"చిమ్మ చీకటిలో తూర్పు సెమ్మెమీద దివ్వె ఒక్కటి వెలిగించి రువ్వినావు**
**వెలుతురుల బాకు! ఆకాశ వీధిలోన ఎవరవయ్యా! ప్రగాఢ సాహిత్యమూర్తి"**

**"నీ వెరుగవె! శ్రీరాముడ! నేను మానవుడనె లెమ్ము!**
**నిద్రాణాంధ్ర ధరాస్థలిని నేడు మేలు కొల్పగలను"**

ఇది ఆంధ్రప్రదేశ్ అవతరణకు పూర్వం చీకట్లను దూసిన ప్రభా చిత్రణం. శ్రీ పొట్టి శ్రీరాముల ఆత్మాహుతి నుండి అవతరించింది ఆంధ్రరాష్ట్రం. నిద్రాణమైన తెలుగు భూమిని స్వరాష్ట్రం కోసం మేలుకొల్పేందుకు దీక్షపూనినాడు గాంధీజీ శిష్యుడు. ఆయన విసరిన ఆయుధం అహింసాయుతమైందీ, శాంతిలక్ష్యం కలిగిందీ. సువిశాల దృక్పథం గల మహాకవి సామాజిక స్పందన ఎప్పటికీ ఒకే ఒక పరిమితమైన వలయంలో నిలిచిపోదు. అనేకమైన చారిత్రక కారణాల వల్ల ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో పరిమితుల్ని స్వీకరించవచ్చు.

ఇది అనివార్యం. గమ్యం చేరాక ఆ సీమల్ని, వాటి విస్తృతమైన ప్రయోజనంపై దృష్టితో స్పందిస్తాడు. ఆలోచన చేస్తాడు. ఇది నిరంతరం జరిగే మానవ చరిత్ర పోనుపోను వలయాల్ని అతిక్రమిస్తూ మానవతా గంధంతో విశ్వాంచలాల్ని స్పృశించడమూ కద్దు. ఇది మహాకవి ఉదార చరితకు నిదర్శనం.

దాశరథి కవితా వ్యక్తిత్వంలోను ఈ దశల్ని స్పష్టంగా గుర్తించవచ్చు. ప్రస్తుతానికి వస్తే మొదటి దశ హైదరాబాదు రాష్ట్ర విమోచనం – అందునా తెలంగాణా స్వాతంత్ర్యానికి చెందింది. రెండోది తెలుగువాళ్ళను ఏకంచేసే మహాంధ్రోదయాన్ని అభిలషించింది. మొదటిదానిలో ఈయన క్రియాత్మకమైన వ్యక్తిత్వం స్వయంగా ఉద్యమించింది. రెండోదానిలో ఈయన భావాత్మకమైన వ్యక్తిత్వం సౌందర్యంతో ఉత్క్రమించింది. ఈ రెండూ ఒకదాని రూపంతో మరొకటి చారిత్రకంగా పరిణామగతుల్ని పొందాయి. ఈనాటి స్వతంత్రభారత స్వరూపానికి ఒక్కొక్కటీ వివిధ దశల్లో ఒక్కొక్క విధమైన పాత్రను నిర్వహించాయి. చారిత్రకంగా చూస్తే మొదటిది వివిధ స్వతంత్ర సంస్థానాల విలీనంతో స్వతంత్ర భారతం పరిపూర్ణ స్వరూపానికి దోహదం చేసింది. రెండోది భాషా రాష్ట్రాల ప్రాతిపదికపై భారతదేశం అభ్యుదయానికీ ప్రజాస్వామ్య సుస్థితికీ హేతువైంది. 'భాషా రాష్ట్రమటన్న వాంఛితమునుత్పాదించి మా తెల్గువా డాషా మాషి కబుర్లుగాక! నిజమౌ నట్లేరు కవ్వించినన్ రోషం బందక నుద్యమించి గెలిచెన్ లోకంబు హర్షింప ప్రత్యూషం బిన్న దినాలకైనది స్వరాష్ట్రోద్యానభాగంబునన్"

తెలంగాణా విముక్తమయ్యాక ఆంధ్రావతరణం తరువాత మహాంధ్రోదయం ఒక స్వప్నం. లక్ష్యమైంది మూడుకోట్ల (అప్పటి జనసంఖ్య) తెలుగుప్రజల్ని సమీకృతం చేసి మహాంధ్రం కోసం ఉపక్రమించడం జరిగింది. ఉభయ ప్రాంతాల ప్రజల్ని ఉద్బోధించి సౌమనస్యాన్ని సాధించేందుకూ సోదరభావాన్ని నెలకొల్పేందుకూ ఈ దశలో ప్రజాభిప్రాయాన్ని మలచేందుకు ఈ కవి ఉద్యమించాడు.

**"కోటి కంఠాలతో తెలుంగులు సతమ్ము ఆంధ్రరాష్ట్రావతరణ శుభావసరము**
**కోరుచున్నారు, కలిసి పోగోరుచందు రగ్రజుల తోడి వీలైనయంత వడిగ"**

తెలుగు భాష – సంస్కృతికి చెందిన విశాలమైన దృష్టితో ఆంధ్ర మహా ప్రజ సమైక్యంగా వర్ధిల్లే ఏకైక రాష్ట్రాన్ని వాంఛించే సంకల్పం వాస్తవమైంది. దీని వెనుక నున్న చారిత్రక నేపథ్యం గురించి స్థూలమైన ప్రస్తావన ఈ సందర్భంలో అవసరం.

## 2

ఆంధ్రులు తమ ప్రత్యేకతను నిలుపుకునేందుకు తమ భాషనూ సంస్కృతినీ వికసింపజేసేందుకు ఇరవయ్యోశతాబ్దం ఆరంభం నుండి (1910) అనేక సంస్థలు స్థాపితమైనాయి. ఉద్యమాలు వెలిసాయి. కందుకూరి, రాయప్రోలు, విశ్వనాథ, కొడాలి, పానుగంటి మొదలైన మహారచయితలెందరో భారతదేశంతోపాటు ఆంధ్రజాతి ఔన్నత్యాన్ని కీర్తించారు. ప్రజల్లో ఆంధ్రాభిమానం వికసితమైంది. సమజాభివృద్ధికై అనేకరంగాల్లో కృషి మొదలైంది. ఆంధ్ర జాతీయ కళాశాల, విజ్ఞాన చంద్రికా గ్రంథమండలితో పాటు వివిధ గ్రంథాలయాలూ నెలకొన్నాయి. ఆంధ్రపత్రిక మొదలుగా తెలుగు పత్రికారంగం ఆవిర్భవించింది. ఆంధ్రుల చరిత్రకూ సంస్కృతికీ సమగ్రరేఖలు దిద్దే ప్రయత్నం జరిగింది. సాహిత్యాన్నీ సంస్కృతినీ సమాజావసరాల కనుగుణంగా, సంస్కరణ దృక్పథంతో పరివర్తన గుణంతో పునర్నవీకృతం చేసే ఉద్యమం విస్తరించింది. ఇదంతా చివరకు ప్రత్యేకాంధ్ర రాష్ట్ర వాంఛ కభిముఖంగా ప్రవర్తిల్లింది. అయితే ఆంధ్రరాష్ట్రానికి చెందిన అగ్రనాయకులు కొండా వెంకటప్పయ్య, బులుసు సాంబమూర్తి, టంగుటూరి ప్రకాశం, అయ్యదేవర కాళేశ్వరరావు, కాశీనాథుని నాగేశ్వరరావు మొదలైన పెద్దలంతా 'ముందు దేశ స్వాతంత్ర్యం, ఆ తరువాత ఆంధ్రరాష్ట్రం' అన్న అభిప్రాయానికే ప్రాముఖ్యం ఇవ్వడం జరిగింది. కేంద్ర నాయకులు దీన్ని బలపరచారు.

తెలుగు మాట్లాడే ప్రజలు నివసించే ప్రాంతాలన్నీ ముక్కలుగా చెదరిపోయాయి. అనేకమైన చారిత్రక కారణాలవల్ల వేరువేరు అస్తిత్వాల్ని సంతరించుకున్నాయి. వేరువేరు ప్రభుత్వాల పాలనలోకి వచ్చాయి. ఇది ఒక విధంగా ప్రాదేశిక భాషా సంస్కృతికి చెందిన ఏకత్వాన్ని కుంఠితం చేసింది. తీవ్రమైన అసమానతల్ని సృష్టించింది. అయితే ఒక విధంగా కొన్ని కొన్ని ప్రత్యేకతలతో భారతదేశ సమగ్ర రూపానికీ ఏకత్వానికీ దారి తీసిందని తృప్తిపడే అవకాశమూ లేకపోలేదు. కోస్తా ప్రాంతం, రాయలసీమ నేరుగా బ్రిటిష్ పాలనలోకి వచ్చాయి. అక్కడి పాలనాభాష ఇంగ్లీషు. రాజధాని మద్రాస్. ఆ నగరం తమిళం తెలుగు భాషా సంస్కృతులకు నిలయమైంది. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు పత్రికలు పరిశ్రమలు మొదలగు ఎన్నో సంస్థలతో ఈ నగరం తమిళులతో పాటు తెలుగువారికీ ప్రతిష్ఠాకరమైందిగా పరిణమించింది. హైదరాబాదు రాష్ట్రం తెలుగు కన్నడం మరాఠి ప్రాంతాలతో ఏర్పడింది. నిజాం పాలనా భాష ఉర్దూ! ఇట్లా చెదరిన భాషా ప్రాంతాలన్నీ కలిపి భాషా ప్రాతిపదికపై రాష్ట్ర నిర్మాణం ఆవశ్యకత గురించి ఆలోచన ప్రబలింది. భారతదేశం స్వాతంత్ర్యం పొందేవరకు అందుకు వేచి ఉండవలసి వచ్చింది.

# 3

భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందాక మూడునెలల తరువాత పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 1947 నవంబర్ 27వ తేదీన భాషారాష్ట్ర నిర్మాణం గురించి విధాన ప్రకటనలు చేయడం జరిగింది. 1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. ప్రజల భాషలో ప్రభుత్వ కార్యకలాపాలు జరిపే అవసరం గుర్తింపబడింది. అపుడే ప్రజాస్వామ్యం సఫలమౌతుందన్న అభిప్రాయానికి బలం చేకూరింది. ఎన్నికలు వచ్చాయి. ప్రజల అభిమతానికి ప్రాముఖ్యం వచ్చింది. 1952 ఆగస్టు 15వ తేదీన స్వామి సీతారాం నిరవధిక నిరాహారదీక్ష 38 రోజుల తరువాత విరమింపబడింది.

ప్రత్యేకాంధ్ర రాష్ట్రాన్ని సాధించే ప్రయత్నంలో 1952 అక్టోబర్ 19వ తేదీన మద్రాస్‌లో మహనీయులు బులుసు సాంబమూర్తి ఏర్పాటుచేసిన యజ్ఞశాలలో గాంధీజీ శిష్యులు పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహారదీక్ష మొదలైంది. 'నాకే పార్టీ లేదు - ఆంధ్రరాష్ట్ర నిర్మాణం ఒక్కటే నా లక్ష్యం' అని ప్రకటించడం జరిగింది. తెలుగు ప్రజలందరు ఆయనలో తమ ఆదర్శాన్ని దర్శించారు. 1852 డిసెంబర్ 14న అర్ధరాత్రి ఆయన తుదిశ్వాస విడిచారు. శాంతియోధుని ఆత్మార్పణం ప్రజలలో అశాంతిని రగిల్చింది. ఆంధ్రరాష్ట్రం సాధన కోసం ప్రజలలో ఉద్యమం ఉజ్వలితమైంది.

> **"వెలుతురు బాకు తాకిడికి విచ్చిన చిక్కని కాలరాత్రి**
> **గుండెలు జిలుజిల్లునన్ రుధిర నిర్ఝరి పారె దిగంగ నా ముఖ**
> **మ్ముల నవ కుంకుమ ప్రభలు మొల్చెను తామర మొగ్గలట్లు త**
> **ప్పులు తెరువుండు రండు పిలువుండు శయించిన వారినెల్లరన్"**

అర్ధరాత్రి చీకటిలో రువ్విన వెలుగు చకితచకితంగా ప్రజల్ని మేల్కొలిపింది. అది శాంతిసమరం! అహింసయే ఆయుధం అయినా ఇంకా మేల్కొనని వారూ ఉన్నారు. వారికై ఈ ప్రబోధం. ఆ వెలుగు తెలుగుగా దర్శితమైంది. ఆనాటి ఉషస్సు పొట్టి శ్రీరాములు ఆత్మాహుతితో పవిత్రమై ఉదయించింది.

1952 డిసెంబర్ 19వ తేదీన నెహ్రూ మద్రాస్‌నగరం మినహా ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు సంసిద్ధతను ప్రకటించారు. 1953 అక్టోబర్ ఒకటో తేదీన నిర్వివాద ప్రాంతాలతో ఆంధ్రరాష్ట్రం కర్నూల్ రాజధానిగా ఏర్పడింది. ఆంధ్రుల చిరస్వప్నం వాస్తవమై రూపొందింది. తెలుగు వ్యక్తి భారతదేశంలో భాషారాష్ట్రాల నిర్మాణానికి

హేతుభూతుడైనాడు. తెలుగువాడు కార్యకుశలుడన్న యథార్థాన్ని చాటిచెప్పిన సంతోష సమయమది! ఆనాటి ప్రత్యూష భారతదేశచరిత్రలో నవదశకు నాంది పలికింది.

**"తలలు వాలిచియున్న నా తెలుగు జనము ఉన్నతోన్నత పర్వతాలో యనంగ"**

విజయ గర్వంతో ఆంధ్రుల వ్యక్తిత్వం నలుగురినీ ఆకర్షించింది. "మామిడి పాటినట్లు, మధుమాసము హాసము చేసినట్లు శ్రీరాముని ప్రాణదానమున రాగిలె తెల్గుల ఇంటిలోన ఆరామము పూలతో ఫలభరమ్మున వంగిన భుజరాజిలో ప్రేమముతో మృదు ప్రణయ రేఖలతో అనురాగశాంతితో" అశాంతి అణగింది. అసహనం అంతరించింది. వసంతం విలసిల్లింది. ఆనందం అనురాగం ఆర్ద్రతతో తెలుగుదేశం పల్లవించింది. రసస్విన్నమైంది. స్వరాష్ట్రోద్యమం మొదటినుండీ స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా పర్యవసితం కావడంచేత దేశభక్తిని శంకించే అవసరమే కలుగలేదు. పైగా భాషా రాష్ట్ర నిర్మాణం భారతదేశ సమగ్ర వికాసానికి జీవభూతమైందిగాను భావితమైంది.

**"కోటి కంఠాలతో తెలుంగులు సతమ్ము ఆంధ్ర రాష్ట్రావతరణ శుభావసరమున కోరుచున్నారు. కొలిసి పోగోరుచుందు రగ్రజులతోడ వీలైన యంతవరకు"**

ఆంధ్రరాష్ట్రంతో తెలంగాణా ప్రాంతాలను కలిపి సువిశాలమైన రాష్ట్రం కోసం ఆరాటం ముమ్మరమైంది.

శ్రీ మాడపాటి హనుమంతరావు పిలుపు మేరకు 1954 జూన్ 13, 14 తేదీలలో విశాలాంధ్ర సదస్సు జరిగింది. ఒకవైపునుండి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు, మరోవైపునుండి ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి బెజవాడ గోపాలరెడ్డి ఇరువురూ తమ ప్రజల అభిప్రాయానికి ప్రాతినిధ్యం వహించారు. తెలంగాణా ఆంధ్ర ప్రాంతాల విలీనానికి సుముఖమైన వాతావరణాన్ని నెలకొల్పే ప్రయత్నం జరిగింది. తెలంగాణా ప్రజల్లో భయమూ వ్యక్తం లేకపోలేదు. అభయాలూ ఇవ్వబడినాయి. ఒప్పందాలు జరిగాయి. రాజకీయరంగం మహాంధ్రావతరణానికీ సిద్ధమైంది.

తెలంగాణా స్వాతంత్ర్యానికి ఉద్యమించిన మహాకవి విస్తృతమైన ప్రయోజనంతో తెలుగు ప్రాంతాలన్నీ కలిపి ఒకే రాష్ట్రంగా నిర్మించే అభిప్రాయాన్ని సహేతుకంగా బలపరచడం జరిగింది.

**"మూడు కోటుల ఒక్కటే ముడి బిగించి కలిపివేయుము నా తెలంగాణ తల్లి!"**

కవి ఇరుప్రాంతాల్లో పర్యటించాడు. సుహృద్భావాన్ని పెంపొందించాడు. 1956 ఆగస్టు 10వ తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరణకు 7వ రాజ్యాంగం సవరణ బిల్లు లోకసభలో

ప్రవేశపెట్టబడింది. "నాకు కావలె మహాంధ్రోర్వర! రండి అన్నల్లార! తూరుపు దారి కెదురుగ ద్వార బంధము మనిషి మనిషి మనస్సు దారుల రాగ బంధము రాగబంధము". 1956 నవంబర్ ఒకటో తేదీన హైదరాబాదు రాజధానిగా ఆంధ్రప్రదేశ్ అవతరించింది.

మల్లంపల్లి సోమశేఖరశర్మగారు 'మహాంధ్రోదయం' కావ్యానికి పీఠికలో 'విశాలాంధ్ర కంటె మహాంధ్ర పదమే నాకు వలెనే దాశరథికిని రుచించినది. మహాంధ్ర పదమే పరిగ్రాహ్యమేమో' అన్న అభిప్రాయం గమనింపదగింది. ఈ సందర్భంలో మహాకవి సందేశం ఈనాటికీ వర్తిస్తున్నది.

**"కృషికుల్ కార్మికులెల్ల రొక్కటిగ సంగీతమ్ములంబాడు దు**
**న్మిషితాంతఃకరణమ్ములన్ తెలుగు భూమిం గూర్చి ఆనందపుం**
**చషకమ్మెత్తుడు! స్వీయరాష్ట్ర జనతా సౌఖ్యార్థమై త్రావుడీ!**
**విషతుల్యంబగు భేద భావములు పృథ్విన్ మాసి పోనిందహో"**

స్వరాష్ట్రాల నుండి సమస్త పృథ్వీతలంపైన భేదాలు మాసిపోయి శాంతిని కోరే ఉదార తత్త్వం సర్వజనప్రియమైంది. సమాజానికి కల్యాణకరమైంది.

కాకతీయుల కాలంలో ఒకే రాష్ట్రంగా స్థిరపడిన ఆంధ్ర భూప్రజలు అనేకమైన చారిత్రక కారణాలవల్ల విడిపోయారు. మళ్ళీ ఈనాడు 1956 నవంబర్ ఒకటో తేదీన ఆంధ్రప్రదేశ్ అవతరణంతో సమైక్య రూపాన్ని ధరించారు. దాశరథి కవిత్వం తెలుగు ప్రజల స్వేచ్ఛాశక్తినీ ఉద్యమరూపాన్నీ ప్రతిబింబించే ఆదర్శ శిఖరం.

**"ఈనాడు మహాంధ్రోదయమైనది. కోట్లాది ప్రజలు తెలుగుతల్లి పాదాలకు**
**వెలుగుల పారాణి నిడిరి తెలుగు తెలుగు వెలుగు వెలుగు".**

## 3. పునర్నవం - సామాజిక సాహిత్య స్పందనం

తెలంగాణా సాహిత్యరంగాన్ని స్మరించగానే ఝుటితిస్ఫూర్తిగా మార్మోగే పద్యపాదం "నా తెలంగాణ కోటిరత్నాల వీణ". శ్రీశ్రీ తరువాత ఎన్నదగిన తేజోమూర్తియై ప్రకాశించిన "అభ్యుదయ కవిచక్రవర్తి", దాశరథి. తెలంగాణా స్వాతంత్ర్యోద్యమంలో ఎంతటి తీవ్రతను చూపాడో మహాంధ్రోదయ నిర్మాణంలోనూ అంతటి ఆవేశమూ కనబరచాడు. ఇది ఈతని చారిత్రకమైన అవగాహనకూ, అభ్యుదయ క్రియాశీలానికీ నిదర్శనం. ఏ ప్రాంతంలో ఏ రూపంలో ఏయే కారణాలను పురస్కరించుకొని ఆవిష్కృత మైనప్పటికీ తెలుగు సాహిత్యం తెలుగువారందరిదీ. ఆ తరువాత పొలిమేరలు ఎరుగని

మానవలోకానిదీ. ఈ విశాలమైన దృక్పథం, జాతి సంస్కృతిని సుసంపన్నం చేసేదీ, వైవిధ్యాన్ని చేకూర్చేదీ, ఉన్నతమైన స్థానాన్ని కలిగించేదీ.

ఈ కవి మనస్తత్వం ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంది. మొదటిది దేశభక్తి భావన, రెండోది అభ్యుదయ దృక్పథం, మూడోది సంప్రదాయ వివేకం. ఈ వెలుగులో ఈతని కవితాస్వరూపం దర్శించినపుడే, విశిష్టమైన వ్యక్తిత్వం అందుతుంది. ఇది ఈతని కవితాస్ఫూర్తికి వెనుకనున్న ప్రధానమైన తత్త్వం. అటు పద్యమూ ఇటు మాత్రాఛందస్సూ ఇటీవలి ముక్తచ్ఛందోరచన ఇతని చేతిలో అనితరమైన శిల్పరూపాన్ని సంతరించుకున్నాయి. సంప్రదాయబంధురమైన పద్యాన్ని "పీడిత ప్రజావాణికి మైక్ అమర్చి యభవాదులకున్ వినిపింపజేసెదన్" మొదలుగా అభ్యుదయ భావాలను ఇతడు నిర్వహించిన తీరు గుర్తించదగిన అంశం. అయితే ఈ ప్రయత్నం స్వల్ప పరిధిలోనే జరిగింది. పద్యానికీ ఆధునిక భావనకూ మధ్యనున్న అంతరాళం – ఈ ప్రయత్నాన్ని సమగ్రంగా కొనసాగించడానికి వీలునివ్వలేదోమోనన్న అభిప్రాయమూ కలుగకపోదు. ఎటువంటి శబ్దాన్నైనా చొరవతో శ్రుతిసుభగంగా పొదిగే నేర్పు పై పాదంలో చూడవచ్చు. ఈతని పద్యరచనకు లక్ష్యభూతంగా నిలిచేది మహేంద్రోదయం. మాత్రాఛందస్సు, ముక్తచ్ఛందోరచనలు కలగలసిన ఆధునిక రూపానికీ ప్రాతినిధ్యం వహించేది పునర్నవం. ఇతని కవిత్వాన్ని పరిశీలిస్తే ముక్తఛందం కన్నా మాత్రాఛందస్సు, ఆపైన పద్యంపై ఇతనికి అభిమానం ఉన్నట్లు కన్పిస్తుంది. అయినప్పటికీ రచనాశిల్పంపై దృష్టి సమానమే. ఈ లక్షణమే ఇతనిలో సమన్వయలక్షణానికి దారితీసి సమానమైన ఆదరభావానికి కారణమై ఉంటుంది. తొలిదశలో ఉద్యమస్ఫూర్తితో కూడిన కవిత్వంలో చాలాభాగం ముఖ్యంగా ప్రశస్తిని పొందినవన్నీ పద్యాల్లో వ్రాసినవే. మాత్రాఛందస్సులోనూ లేకపోలేదు. దీనికి కారణం– రచన వెలువడిన కాలంలో రూపం (form) పట్ల ఇతనికి గల సమదృష్టి, సమన్వయభావమూనూ. ఈనాటికీ పద్యం, మాత్రాఛందస్సు, ముక్తచ్ఛందస్సులో ప్రదర్శించే త్రివిక్రమత్వం చూస్తే ఈతనికి రూపంపట్ల పట్టింపులేనట్లే కన్పిస్తుంది. ఇదే విధంగా ఒక ప్రత్యేకమైన రాజకీయ సిద్ధాంతానుసరణపై కాక, సమన్వయ గుణంపై అభిలాష కన్పిస్తుంది. స్థూలంగా జాతీయ భావనలో అభ్యుదయ దృక్పథంతో, విశ్వజనీన మైన మానవతావాదంతో ఏర్పడిన విశిష్టమైన వ్యక్తిత్వం, తీవ్రవాద ధోరణులనుండి తిరిగిన మలుపుకు కేంద్రమైంది.

## 2

'పునర్నవం' గ్రంథానికి కవి వ్రాసిన 'మననం' పీఠికలో "ప్రతి ఆటకూ నియమం ఉంది. మరి రాతకూ కోతకూ నిబంధనలున్నాయి. గుండెదడలో గణాలు గుణించుకొని వ్రాయాలి. ఊపిరి లెక్కించుకోవాలి, పొంగుకొలవాలి" అంటాడు. ఈ మాటలు ఈ కవిలో 'పోయెటిక్ ప్రాసెస్' కవిత్వం రూపొందే క్రమ పరిణామ స్థితి రూపాన్ని భావింపజేసేవి. రచన ఆవిష్కృతమయ్యేముందు కవి మనస్సులో జరిగే సృజనక్రియ ఏయే గుణాల నాశ్రయించి సాగేదీ సూచితం. ఇందులో దాశరథి కళాత్మకమైన దృక్పథాన్ని చూడవచ్చు. మననంలో మరొకచోట "వెనక్కి చూడడం రాక, ముందునుగూర్చి భీతిలేక, వర్తమానంలో ఇష్టం వచ్చినట్లు చేస్తూ ఉంటాను, నష్టపడతాను. బహుఉద్రేకప్రకృతిని" అంటాడు. ఇందులో ఇతని ఉద్యమస్వభావంతోపాటు కాలప్రభావానికి స్పందించి క్రియారూపం ధరించే మనస్తత్వమూ ప్రతిబింబిస్తూంది. విస్తృతపరిధిలో భావిస్తే, ఈ మనస్తత్వం సామాజికస్పృహ, క్రియాశీలం గల "సైకిక్ ఫ్రేమ్" మనోరూపానికి నిదర్శనంగా నిలుస్తుంది. వర్తమానంలో ఇతడు ఎదుర్కొన్న అనేక ఉద్యమాల ప్రభావం కవిత్వంలో సాక్షాత్కరిస్తుంది. వీటినుండి తప్పించుకొని ఎక్కడో దూరంగా ఉండే స్వభావం కాదితనిది. ఉరకలెత్తే ఉత్సాహంతో ప్రవాహసదృశంగా పరుగులెత్తించే లక్షణంతోపాటు ప్రయోజన తత్పరతవల్ల ఈతని రచన ఆవేశమూ, సంవిధానమూ, లక్ష్యమూ కలిగి ఆధునిక కవిత్వంలో, గుణాత్మకమైన ఉన్నత స్థితిని పొందింది. కాలంలో వచ్చే మార్పు, ప్రభావాన్ని నెరపి వైవిధ్యాన్నీ సంతరించిపెడుతూంది.

ఏ ఉద్యమమూ ఆకర్షించనివేళలో, 'ఇష్ట'పడనపుడూ ఇతర కళాఖండాలు సృజిస్తూ ఉంటాడు. దీని పర్యవసానమే గాలిబ్‌గీతాలు మొదలైనవి. ఒక్కమారు పర్యాలోకనం చేస్తే ఉద్యమప్రకృతీ–కళాత్మకత ఈ రెండూ ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క విధమైన నిష్పత్తిలో విశిష్టమైన వ్యక్తిత్వపార్శ్వాల్లో – సమ్యక్స్వరూపాన్ని పొందాయి. ఇతని భావప్రపంచాన్ని నిర్మించాయి. ఆవేశం, స్పందన, క్రియాశీలంతో పరిణతినొంది అవతరించే ఈ కవిత్వంలో ఉద్యమస్ఫూర్తి కేంద్రస్థానం వహించింది. ఇది ఈతని సాహిత్య వ్యక్తిత్వాన్ని శిఖరభూతంగా దీపింపజేసేది. ఇతరమైన కళాసృష్టి వివిధ పార్శ్వాలను వికసింపచేసేదీ, విస్తృతిని భావింపజేసేదీ.

# 3

పునర్నవంలో మొదటిగీతం "తెలంగాణా". ఇది ఈతని సామాజికమైన అవగాహననూ, కర్తవ్యనిష్ఠనూ ఆవిష్కరించేది. నిజాం నిరంకుశపాలనలో ఉన్న తెలంగాణ విముక్తిపోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న కవి. సత్యాగ్రహం చేసి అధికారుల దురాగ్రహానికి గురైనపుడు వరంగల్, నిజామాబాద్, హైదరాబాద్ జైలుగోడలీతనిలో స్వేచ్ఛా ప్రసారాన్ని బంధించలేకపోయాయి.

**"జగత్తులో నేడు సగం । దగాపడుట మానుకుంది**
**బీదజనం నేడు మొగం । తుడుచుకొని మేలుకొంది"**

తరతరాల రాజరికపు పీడనతో క్రుగ్గిన బ్రతుకులోని దౌర్భాగ్యస్థితి దగాపడడంలో సూచితం. ఈ 'దగా' కొన్ని చారిత్రకమైన కారణాలవల్ల, ప్రజల్లో చైతన్యశక్తి లోపించడం వల్ల జరిగింది. ఇపుడు సామాన్యుడు తెలివినబడ్డాడు. మేల్కొన్నాడు. మేల్కొని మొగం తుడుచుకున్నాడు. మళ్ళీ నిదురకొదిగేస్థితి రాకుండా జాగ్రత్తపడ్డాడు. గతమంతా చీకటి. నిదురలో గడచినట్లుంది. వర్తమానంలో గతాన్ని మరచి మెలకువతో ఉన్న సామాన్యుని చైతన్యస్ఫూర్తిలో ప్రత్యయం ఈ మాటల్లో ప్రకాశిస్తోంది. "ఇక నిద్దురరాదు మనకు, ఇక చీకటి మాటలనకు". భౌతికదశలో కళ్ళు తెరవడంతోపాటు మానసికంగా మేల్కొనడమూ ఇందులో విశేషం. ఇది అనంతకాలంపై అవిచ్ఛిన్నంగా కొనసాగాలని కవి ఆశయం. లేకపోతే మళ్ళీ మరోవిధంగా 'దగా' పడే ప్రమాదం ఉంది. ఇది కవిలోని నిశ్చయమైన కర్తవ్యశీలంతోపాటు భవిష్యత్తుపై ఆశారూపాన్నీ, భవితవ్యాన్నీ తీర్చే సాధననూ ద్యోతమానం చేస్తోంది.

**"మండుతూన్న సూర్యుడు మన । మండలాన విచ్చెను తన**
**కాంతినేత్రమున నేడు । వెలుతురు లెవదడ్డ లేదు"**

**వెలుతురు లడ్డుటకొరకై । పలుగోడలు కట్టినారు**
**వెలుతురులను దాచుకొరకు । పలుమేడలు కట్టినారు"**

మండుతూన్న సూర్యుడు చైతన్యంతో విలసించే చైతన్యభావనకూ, వెలుతురులు స్వేచ్ఛాతత్త్వానికీ, గోడలు నిరంకుశత్వంతో నిలచిన మౌఢ్యలక్షణానికీ ప్రతీకలు. బహుకాలంగా నిద్రావృతమై ఈనాడు మేల్కొన్న జనం కళ్ళముందు తాండవించే వెలుగులను నిరోధించడానికి రాచరికపు పాలకులు చేసే ప్రయత్నం గోడలు కట్టడం.

ఇది వ్యర్థమైన పని. తత్కాలంలో వారికి వ్యర్థమైన పని అని అనిపించదు. ఇదే మూర్ఖత్వంతో కూడిన అజ్ఞాన ప్రపంచం. స్వేచ్ఛ వెలుగువలె నిరాఘాటంగా సంచారం చేస్తోంది. అనుభవంలోకి వచ్చే కొద్దీ విలువ పెరిగేదీ, వస్తువు విలువను మరింత బాగా తెలిపేదీ.

**"ధనం దాచగలరుగాని । తేజస్సును దాచగలర**
**తెరలు దించగలరుగాని । శిరస్సులను వంచగలర"**

జాతి ఆత్మాభిమానం వ్యక్తి కర్తవ్యనిష్ఠ రెపరెపలాడుతోంది. తేజస్సు-శిరస్సు రెండూ జాతి మానసిక భౌతికరూపాలకు ప్రతీకలు. ధనం చంచలమైంది. తెరలు నశ్వరమైనవి. ఒక పరిమితదశలో వ్యాప్తమై ఆపై తొలగిపోయేది. దీనికి భిన్నమైంది తేజస్సు. అమేయమైంది. శిరస్సు ఆత్మప్రయత్నం చేత అసాధారణమైన స్థానాన్ని పొందింది. తేజస్సులోని తీక్షణత, శిరస్సులోని వివేకమూ జాతి సుస్థితికి కావలసిన ముఖ్య లక్షణాలు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనే పౌరుల అచంచలమైన విశ్వాసాన్నీ అప్రతిహతమైన శక్తినీ వ్యంజింపజేసేవి.

**"తమ మంత్రం పారదింకః ఉచ్చు తెంచుకొనెను జింక ఇక స్వేచ్ఛా ప్రయాణము"**

అటు నిరంకుశ పాలకులు, ఇటు దగాపడిన ప్రజలు - ఇరువురి మధ్య జరుగుతూన్న సంఘర్షణలో ఆవేదనపడే మనస్సు కాంక్షించేది జాతి అభ్యుదయం. దుష్టమైన వ్యవస్థపై తిరగబడిన ప్రజల్లో వచ్చిన గుణాత్మకమైన పరివర్తనాన్ని సూచించేవి పై వాక్యాలు. ఈ పరివర్తనం నిరాశ నిస్పృహ నిరుత్సాహ వాతావరణాన్ని రూపుమాపి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ప్రగతి దృక్పథంవైపు సమాజాన్ని పురోగమింపజేసేది. సమాజంలో ఈ స్థితిలో వచ్చిన క్రియాశీలం గల ఉత్సాహశక్తుల్ని వేగవంతం చేయడమే ప్రస్తుతం కవి ఉద్దేశం. రాచరికాన్ని అంతం చేసి ప్రజాస్వామ్యంలో ప్రజలను ప్రవేశపెట్టి స్వేచ్ఛగా జీవించే వాతావరణాన్ని కలిగించడమే ఈ సంఘర్షణ యొక్క మొదటి ప్రయోజనం. ఈ సందర్భంలో మార్క్స్ చెప్పిన పాతపై కొత్త పోరాటం సాగించడం, సంఘర్షణ నైరంతర్యాన్ని కాపాడడం, అభ్యుదయ శక్తులను సమీకరించడం అనే అంశాల్ని సమన్వయం చేయవచ్చు. ఇక్కడ పోరాటంతో కూడిన గతినీ, మేల్కొన్న సమాజాన్నీ వేరుచేయడానికి వీలులేని స్థితి ఉంది. గతి, మార్పు, ప్రగతి అన్నీ వివిధ దశలు. వేగమూ పరిణామమూ ప్రభావమూ స్పష్టంగా చూడవచ్చు. గీతంలో వెలువరించిన సంఘర్షణ మొదటిదశనూ, తెలంగాణా స్వాతంత్ర్యం రెండోదశనూ, ఇక మూడవది స్వాతంత్ర్యానంతరం జరిగే ప్రగతికి నాందిగానూ పేర్కోవచ్చు.

# 4

కవి సామాజికమైన స్పృహనూ క్రియాచరణాన్నీ వ్యక్తం చేసేది 'అశ్రుదీపం'. ఈ కవితాసంపుటిలో చివరిగీతం. సామాన్యుని దుర్భరమైన జీవితంతో నిరంకుశుల కఠోర ప్రవృత్తి ఇందులో చిత్రితం. జాతి జీవనస్థితిని క్రుంగదీసే పిరికితనం, దోపిడీ, పేదరికం, మొదలైన అవలక్షణాలంతరించి అందరికీ స్వాతంత్ర్యఫలం సమానంగా అనుభవానికి రావాలనే ఆశ, 'జీర్ణకుటి', 'మృత్యుశ్వాసం' వంటి భావరూపాలు ప్రస్తుత సామాజిక వ్యవస్థ యొక్క శిథిలమైన, శక్తి కోల్పోయిన రూపాలకు ప్రతీకలు.

**"ఎంగిలి మెతుకులకై ముందుకు సాగిన అనంత శుష్కహస్తాల సందోహాలు**
**చింకిపాతలకై వేచిఉన్న యువాంగనా దిగంబర దేహాలు"**

**ఎంతో కరుణాత్మకంగా సాగే చిత్రపరంపరకు**
**"తరతరాల పేదల త్యాగాల పంటను మ్రింగిన రాజకీయాలు"**

సమాజంలో వహించిన కీలకమైన పాత్ర ప్రసక్తమైంది. పరమ నికృష్టమైన స్థితి. "మ్రింగిన" అనే ప్రాణవంతమైన మాట కవితాస్ఫూర్తినిస్తూ పీడకుల మనస్తత్వాన్ని భావింపజేస్తోంది. నీతికీ, నియమానికీ దూరంగా దగా-దోపిడిలో నెలకొన్న రాజకీయ దుస్థితి చీకటిరేఖతో మూర్తిత్వాన్ని పొందింది.

**"రుద్రవీణ తీగెలచప్పుడు వణికించును భీరులనిప్పుడు**
**నిరుపేదా నాతో రా రా తే తేరా పలుగూ పారా!"**

ఈ రుద్రవీణానాదం వీరులకు ఉత్సాహాన్నీ, భీరువులకు భయాన్నీ కలిగించేది. పేదల్లో ఆశను జనింపజేసేదీ, సమాజంలో అక్రమాలకూ అన్యాయాలకూ గురైన పీడితుల పక్షం వహించి అసమానతలను తొలగించే ప్రయత్నాన్ని వేగవంతం చేసే కవిలోని ఆత్మ ప్రత్యయానికీ నిర్మాణాత్మకమైన వైఖరికీ నిదర్శనం. రుద్రవీణారావం వ్యక్తుల్లో చైతన్యాన్ని ఉత్పహింపజేసేది. పలుగూపార కృషీవలుని కృషిసాధనాలు. దేశాన్ని సస్యశ్యామలం చేసే కార్యాన్ని ప్రేరేపించేది. జనంలో చెలరేగిన విప్లవతత్త్వానికి క్రమంగా నిర్మాణాత్మకమైన మలుపును ఇచ్చే దృక్పథం గల రచనలో జాతీయ భావన నవోన్మేషాన్ని పొందింది.

**"నిరంకుశత్వం పోయేందుకు నిరుపేదా నాతో రారా**
**భరతమాతృపదాగ్రములచెంత నిలచి విశ్వశాంతిగీతం మ్రోయగ"**

నిరుపేదల పక్షం వహించి నిరంకుశత్వాన్ని హతమార్చే క్రియాతత్వం గల అభ్యుదయ గుణంతోపాటు దేశభక్తి లక్షణంతో నిహితమైన పై పాదాలు దాశరథి విశిష్ట వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తాయి. ఈ దేశభక్తి ముదిరి సంకుచితమైన పరిధిలో నిబద్ధం కాకుండా విశ్వశాంతి సమర్పకంగా, నిఖిల మానవ శుభోదర్కంగా ఉండాలన్న విశ్వాసం, ఈతని వ్యక్తిత్వంలోని కొత్తముఖాన్ని ప్రకాశమానం చేస్తూంది.

**"రుద్రవీణ వాయించేరు। రారండోయి బీదాబిక్కీ**
**కొట్టండోయ్ దమరూ దక్కీ। నటరాట్టులు రారండోయ్**
**రుద్రవీణలో అశ్రుదీపికలు। అశ్రుదీపముల రుద్రవీణలు**
**మంటలు మ్రోతలు-మ్రోతలు మంటలు। భవిష్యత్తు పండించే పంటలు"**

ఈ వీణ చైతన్య విలసనానికి అశ్రుదీపకాంతిచేత కొత్తరాగాన్ని పొందింది.

వీణ, చూతన్యప్రసారానికీ-అశ్రుదీపం, ఆశా వికాసానికీ ప్రతీకలు. కారుణ్యంతో తొణికిసలాడే ఈ గీతం క్రమంగా ఉత్సాహంతో చెంగలిస్తూ, సంఘర్షణలో సంరంభంలో కదలే ఆశాకేతనంతో దర్శన మిస్తుంది. ప్రతివ్యక్తిలో నృత్యం చేసే నటరాట్ స్వరూపం నవసమాజ నిర్మాణానికి కావలసిన ఆవేశం, ఉద్రేకం, క్రియారూపం, లక్ష్యంతో కూడింది. పాతలోకం స్థానంలో కొత్తలోకం! అవతరణ సందర్భంలో ఆనందనృత్యం - కవి పొందిన ఆశావహమైన మనో రూపానికి నిదర్శనం బ్రతుకుబరువు మోయలేక సతతమౌతున్న గుండెదడలోని లయ, ఊపిరిలోని విన్యాస పరంపర, ఉద్రేకంలోని పొంగు, ఆవేశంలోని గాఢత్వం, లక్ష్యంలో నిశ్చయభావంతో సమన్వితమైన చిత్రపరంపరే ఈ కవిత్వం. ఇతడు అభ్యుదయ వాదీ, జాతీయవాదీ, నిఖిలమానవ శాంతిప్రియుడూ. ఇది ఇతని సాహిత్యవ్యక్తిత్వంలోని సామాజిక స్పందనం.

## 4. అభ్యుదయ భావన

స్వాతంత్ర్యం అనంతరం వెలువడిన స్వేచ్ఛాకవిత్వంలో అగ్రస్థానంలో నిలచే కవితాసంపుటి "పునర్నవం". జాతీయం, అంతర్జాతీయం, కాల్పనికం, వైయక్తికం, విశ్వజనీనం, మొదలుగా బహుముఖీనమైన కవితాస్వరూపాన్ని ఆవిష్కరించేది. ఇది కలిగించే అనుభవం ప్రగతిశీలమూ కాల్పనికమూ అయింది. ఏ ఇజాల బరువూ దించకుండా ఏ తత్త్వాల డొంకల్లోనూ తిప్పకుండా సూటిగా మానవతా సీమాంచలాల్లో సమాజంలోని సంఘర్షణ అశాంతిరేఖల్ని స్పృశిస్తూ, చిత్రిస్తూ పరివర్తనం నుండి

శాంతిచ్ఛాయల్లోకి స్వేచ్ఛగా ప్రయాణింపజేసేది. సమకాలీన ఆధునిక కవుల అసాధారణ మైన ప్రభావాలకు దూరంగా ప్రత్యేకంగా సమన్వయ వ్యక్తిత్వం కలిగి సహృదయుల మనఃఫలకంపై ప్రస్ఫుటమైన ముద్రవేయగలిగింది. సామాజికస్పృహ, అనుభూతి స్పందనం, రచనాశిల్పం- ఈ మూడు లక్షణాలూ సుసంయోజితమైన కవిత్వం ఇతనిది. ఉషస్సంధ్యతోపాటు ఈ సంపుటిలో మరికొన్ని 'మస్తిష్కంలో లేబొరేటరీ' 'కిరణశకలం' 'యుగాంతరలేఖలు' 'కాంతిరఖంరఖ' మొదలైనవి ఈ కవి సామాజికమైన అవగాహనతోపాటు విశ్వజనీన దృక్పథాన్ని ప్రతిబింబించేవి.

ఉషస్సు తమస్సు రెండూ అనాదిగా వస్తూన్న వర్ణనాజగత్తులోని అంశాలే. మన ప్రాచీన సాహిత్యంలో ఉషస్సు- సూర్యునిచుట్టూ ఎంతో తత్త్వమూకవిత్వమూ ప్రకాశించింది. ప్రపంచసాహిత్యంలోనూ అత్యంత ప్రాచీనమైన ఋగ్వేదంలో ఉషస్సు ఎంతో మనోజ్ఞంగా వర్ణితమైంది. ఇది ఆకాశాన్ని దీపితం చేసేది. స్వర్గదారాలు తెరచేదీ - సూర్యుడు ప్రయాణించడానికి దారులు చూపేదీ*. తూర్పున చీకటితలుపులు తెరచి ఉజ్వలంగా శుభ్రంగా వెలిగే ఉషస్సు వర్ణితమైంది. ఇక్కడ ఉషస్సు జ్ఞానస్ఫూర్తికీ తమస్సు అజ్ఞానరూపానికీ ప్రతీకలు.

**"ఉషస్సు కిర్మీరకవాటం తోస్తూ, ఒక్కమాటు చూచిందటు**
**తమస్సు పాషాణకిరీటం తీస్తూ, ఒక్క పరుగు తీసిందటు"**

ఇవి ఉషస్సంధ్యలో ఆరంభపంక్తులు. కవి మనోంతరాళంలో సుప్తమైన ఉత్తమసంస్కారం సృజనవేళల్లో ఒకప్పుడు భావనాలోకాన్ని వెలిగిస్తుంది. మరొకపుడు ప్రాకే తీగకు ఆధారంవలె నిలుస్తుంది. ఈ ప్రభావం ఎలాంటి కళాకారుని సృజనరూపం నుండీ పరిహరింపరానిది. ఈ స్ఫూర్తి విశేషం దాశరథి కల్పించిన ఉషస్సంధ్యలో చూడవచ్చు. ఇక ఆలోచనా క్రమం అనుభూతి వలయంనుండి కల్పనతో మొదలై సామాజిక ఆదర్శాన్ని అందుకునేదిగా నిర్వహింపబడింది. కవిత్వం ఏ భాషకు చెందినదైనా కొన్ని cyclic patterns (దశారీతులు) సంకేతింపబడడం సాధారణంగా గమనించవచ్చు. భారతీయ సాహిత్యలో ఋతువులు, వయోవస్థలు, రోజుకు సంబంధించిన ఉషస్సంధ్య, సాయంసంధ్య, పగలు-రాత్రిదశలు పేర్కోదగినవి. ప్రస్తుతానికి ఉషస్సంధ్యలోని ప్రతీక నిర్వహణం (Symbolic action) లో సైక్లిక్‌పాటరన్ తమస్సు-ఉషస్సు అయితే, ఇందులో సామాజిక రూపం (Social design) నిహితమైంది. ఇక్కడ ఇది రాజరికం - ప్రజాస్వామ్య వ్యవస్థకులకు సంబంధించింది. ఉషస్సు రోజుకు ఆరంభదశ. తమస్సు అంత్యదశ. కాలగతిలో కన్పించే ప్రధానమైన పరివర్తనా సమయాలు.

ఈ గీతం సమాజజీవితంలో వేగవంతమైన మార్పును సూచించేది. తెలంగాణా విముక్తమైన స్థితీ, స్వాతంత్ర్యం సిద్ధించినా భారతదేశం ఇంకా దుర్భరస్థితి వీడని లక్షణం నుండి సంపూర్ణంగా సువ్యవస్థితమై సౌభాగ్యదశకు చేరుకోజూచే స్థితీ, అంతర్జాతీయ రంగంలో కొరియా యుద్ధం మొదలైన విషాదఘటనల పరిణామాల నుండి బయటపడని సంకటస్థితీ, కవి మనస్సులో చారిత్రక యాథార్థ్యాన్ని ఆదర్శతత్వాన్నీ ప్రేరేపించి ఉండవచ్చు. ఈ ప్రేరణచేత కవి ఊహ నిరంకుశత్వం నుండి ప్రజాస్వామ్యానికీ, కలనుండి వాస్తవానికీ, అశాంతినుండి శాంతిపథానికీ ఉన్ముఖీకృతమైంది. ఈదృక్ ప్రసారంలో ఈ కవితను విలోకించవలసి ఉంది. ఇక్కడ ఉషస్సు ప్రజాస్వామ్య వ్యవస్థకూ, తమస్సు నిరంకుశమైన రాజరిక వ్యవస్థకూ ప్రతీకలు. తమస్సు ఉషస్సు రెండూ ప్రకృతిలోని పరస్పర విరుద్ధమైన లక్షణాలు గల దృశ్య రూపాలు. ఇక్కడ సమాజపరంగా బింబ ప్రతిబింబరూపంలో కవిత్వ నిర్మితి జరిగింది. చీకటినుండి వెలుగులోకి చేసే ప్రయాణరూపమే ఈ గీతం. పాషాణం స్థూలప్రకృతిలోని కఠినమైన వస్తురూరం. కిరీటం లోకంలో అలంకారయోగ్య మైందీ, అధికార సూచకమూ కిరీటం. పాషాణం-కిరీటం అన్న పదాల ఎన్నిక విలువైంది. పాషాణకిరీటం అన్న సమాసమూ విశిష్టమైంది. స్వర్ణకిరీటం, మణికిరీటం మొదలైనవి లోకంలో వాడుకలో ఉన్నాయి. పాషాణకిరీటం ఏమిటి? ఇదెలా? కవితాజగత్తులోనే సాధ్యం. పాషాణం ఈ సందర్భంలో అసాధారణమైన కఠోర ప్రవృత్తికీ, కిరీటం నిరంకుశమైన రాజకీర వ్యవస్థకూ ప్రతీకలు. కిర్మీరం వివిధ వర్ణ సమాహార చిత్రరూపం సమాజపరంగా వివిధ జాతుల భాషల మతాల సామరస్య సంధానకమైందీ ఆశావహ మైందీ. పైన పేర్కొన్నట్లు బాధ్యతాయుతమైన ప్రజాస్వామ్యానికి అప్పుడున్న వ్యవస్థలో పరివర్తనం సూచితం. కవాటం తీయడం, వెలుగు ప్రసరించడం, బంధనం నుండి విముక్తినీ స్వేచ్ఛా ప్రభాతాన్నీ విలసితం చేసేవి. ఈ విధంగా ప్రకృతిపరమైన కల్పన సమాజ సంస్థితికి యోజితమైంది. ఇక్కడ ఇంతకుముందు చెప్పినట్లు చారిత్రకంగా తెలంగాణా విముక్తి లేదా ప్రజాస్వామ్యం లేదా సామాజికంగా విశేష పరివర్తననూ స్ఫూర్తికట్టించే ఏ సందర్భాన్నైనా భావించవచ్చు. ఏదో ఒక ఘటనను ప్రత్యేకంగా ఆశ్రయించకపోవడంతో, ఇక్కడ ఆలోచనా విధానంలో రచన సీమల్ని అతిక్రమించిన అతీతమైన విశాల లక్షణాన్ని పొందుతూంది. తమోనిష్క్రమణంతో నిరాశావృతమైన ఒక ఘట్టం పరిసమాప్తినొంది, ఉష ఆగమనంతో ఆశాబంధురమైన కొత్తఘట్టం ఆరంభమౌతూంది. ప్రకృతిపరమైన కిర్మీరమూ పాషాణమూ క్రమంగా కవాటమూ కిరీటమూ నిర్దేశించే ప్రతీకాంశలో భావానికి గాఢత్వాన్నీ, నవ్యతకు ఆకర్షణనూ సంతరించి పెడుతున్నాయి. ఉషస్సు కిర్మీర కవాటం తోస్తూ చూడడం, తమస్సు పాషాణ కిరీటం

తీస్తూ పరుగిడడం కవి ఆశించిన కవి నిర్మించే భావచిత్రానికి కల్పనలో పుష్టినీ గతిలో వేగాన్నీ సాధిస్తూ రామణీయకతను సిద్ధింపజేస్తూంది. కొత్త సమాజానికి సూచనగానూ ఉంది.

ఇక్కడ తమస్సు ఉషస్సు రెండూ కవి ఆలోచనలో రెండూ భిన్న వ్యవస్థలకు ప్రతీకలు. [1]మొదటిదాని విలయ తాండానికీ, కఠోర ప్రవృత్తికీ గురియైన సమాజం తీరూ, రెండవదానికై తిరుగుబాటు జరిగినప్పటి సమాజం తీరూ, తరువాత వర్ణితమైంది. మొదటి వ్యవస్థ శిథిలమై దాని స్థానంలో క్రమంగా రెండోది అవతరించే చారిత్రక సత్యం ఉద్ఘాటితమైంది. "అటు జీర్ణాలయ రూపమ్ములు శిథిలవనాంతర కూపమ్ములు" గాలీ వెలుగూ సోకని అంటే స్వేచ్ఛా స్వాతంత్ర్యం లేని ఈ శిథిల కూపాల్లో ప్రజల స్థితి దుర్భరం. రాజులు, రాజరికాలు, శాసనాలు, చట్టాలు, జైళ్ళు, పాలకుల క్రౌర్యం, కౌటిల్యం, కసీ, మారణాయుధాల మంటలూ, మసీ క్షుధార్తులు, ఖామందులతో "సిండికేట్ల మాగ్నేట్లు సేట్లు నిరుపేదలకు మూసిన గేట్లు" - ఇదీ ఆ వ్యవస్థారూపం. దీనిపై తిరుగుబాటు, రక్తపాతం, జలపాతం, "ఇటు జలపాతానికి నాంది విద్యుదగ్ని ప్రభవించక ఏముంది?" జలపాతం వేగంగా వచ్చే సామాజిక పరివర్తననూ, విద్యుదగ్ని ప్రజల్లోని విప్లవ చైతన్యశక్తినీ సూచిస్తాయి. ఇన్నేళ్ళుగా పేరుకొని ఉన్న "కుళ్ళిన సమాజపు దుర్గంధం ఈ వేగానికి కొట్టుకపోవడమూ అనివార్యం. ఇన్ని శతాబ్దాలుగా "గొంతుదాటి పలుకని శబ్దాలు" ఇప్పుడు గర్జాబంధురాలయ్యాయి. సంఘర్షణలో చనిపోయిన "యోధుల గుండెలు" తరుణ పయోజాల దండలై ఉత్సాహ స్థితిని నిలుపుతున్నాయి. ఈ భాగంలో రెండు వ్యవస్థల మధ్య సంఘర్షణలో ప్రజల త్యాగనిరతీ, అచంచల విశ్వాసమూ చిత్రితం. ఇది అంత సులభంగా తుదముట్టే ఘట్టం కాదు. ఈ సందర్భంలో దుష్టులతో తర్జన భర్జన జరిగింది. ప్రజాగళ గర్జనలతో వాతావరణం నినదించింది. శిఖరభూతమైన దశ నుండి తమస్సు స్థానంలో - ఆశాకేతనమైన "ప్రభ" దర్శనమిస్తుంది. గతం నుండి విడివడి భవిష్యత్తులోకి ప్రయాణించే ఆలోచనాతరంగం ప్రజాశక్తిమయంగా తీర్చబడింది. ఇక్కడ కవి అవలంబించిన రచనాశిల్పం పరిశీలనార్హం. ఒక శబ్దం వెనుక నుండి సంఘటనను స్ఫురింపజేయడం జరిగింది. ఇందులో వాక్యనిర్మాణం సంపూర్ణంగా ఉండదు. కొన్ని శబ్దాల ఉల్లేఖనంతో ఆయా సందర్భాల్లోని సామాజికస్థితీ ఘర్షణ పరివర్తనం గల వాతావరణ నిర్మితి పాఠకుల మనస్సుకు రూపుకట్టుతుంది. ఇందులో

1. "Conflict and change are arbiquitous throughout social life" - social organisation. p.52 - Alfered N. Whitehead

తప్పనిసరిగా చరిత్రగతిని చూపే సంఘటనల క్రమమూ ఉంది. అటు (ప్రగతినిరోధకులు) ఇటు (ప్రగతిశీలురు) – ఇరుపక్షాల మధ్య జరిగిన సంఘర్షణలలో ఇరువురునీ ఉన్నచోటే నిలిపే రేఖ చెదరడంతో అనిశ్చయస్థితి అంతరించింది. ప్రగతివైపు గమనం సిద్ధించింది. చిరకాలంగా పీడించేవారివల్ల భరింపరాని అన్యాయపరంపరలకు గురియై చివరకు విజయం సాధించి నూతన వ్యవస్థకు పునాదులు వేయడం ఇందులోని మౌలికమైన అంశం.[1]

క్షోభ–ఉద్వేగం రెండూ ఈతని కవిత్వానికి ప్రధానమైన మనస్తత్వపరమైన భూమికలు. ఇవే కవిత్వపరంగా ప్రతి స్థితికీ, గాఢమైన రూపాన్నీ వేగవంతమైన గతినీ ప్రసాదిస్తున్నాయి. "ఎత్తండి కాంతిపతాకాలు ఒత్తండి శాంతిబాకాలు పదండి ఆగామిపథమ్ముల పాడండి అందాల పదమ్ములు" ఆద్యంతమూ సామూహిక లేదా సామాజిక చైతన్యశీలంతో కవితాగతిని ప్రచలితం చేయడం ఇందులోని ప్రత్యేకత.

తమస్సునిమర్గమనంతో ప్రభాతోరణాలతో పూర్వం తప్పనిసరియై పీడించిన పీడకలలు విస్మరించి, చివరకు జాతి సమైక్యంగా ఆశాపథంలో ప్రయాణింపజేసే ప్రయత్నం ఉంది. ఇది పైన పేర్కొన్నట్లు కవిలోని సహజమైన క్షమాగుణం, శాంతి ప్రయత్నం ఆవిష్కరించేది. "మనస్సుకూ మనస్సుకూ మధ్య చుట్టరికం, మనిషికీ మనిషికీ మధ్య రాగబంధం" వ్యక్తిదశలో ఇతని అంతిమలక్ష్యం. ఇది తత్కాలీనమైన సంకుచితమైన వలయాల నతిక్రమించే మానవతా మనోజ్ఞమైంది. వ్యక్తికీ, సమాజానికీ గల చుట్టరికం, ప్రకృతికీ మనిషికీ గల బాంధవ్యం, నవసృష్టికోసం కృషీ, సామాజిక దశలో ఇతని ఆదర్శరూపం. సామాజిక వస్తుప్రపంచంతో ఈ కవిత్వం అనుభూతి దఘ్నంగా ఆవిష్కృతమైంది. ఇది ఉషస్సంధ్యా రేఖలతో దర్శనమిచ్చే అభ్యుదయ కళారూపం.

## 5. వాస్తవికత - ప్రగతిపథం

దీపావళి ఆనంద రూపానికి సంకేతం. అమావాస్య నాడు వెలిగే దీపాలు ఆశారేఖలుగా, జ్ఞానశిఖలుగా ఉత్సాహ కళికలుగా పథప్రదర్శకాలుగా మనస్సులో మెదలుతాయి. మంచి నుండి చెడుకీ దుఃఖం నుండి ఆనందానికీ అజ్ఞానం నుండి వివేకానికీ ఆలోచనను పర్యవసింపజేసేవిగా ఇవి సంప్రదాయ జగత్తులో నిలిచిపోయాయి.

1. Conflict is a consequence as well as a cause of social change. Conflict and change are intertained in social life. 'Ibid' - 164.

అనేకమైన పౌరాణిక గాథలతో ఈ పండుగతో గల సంబంధం ప్రాచీనమైందీ, సుపరిచితమైందీ. చీకటిపై ఎంత చిన్న దీపంతోనైనా విజయానికి చేసే ప్రయత్నాన్నీ, వర్తమానంలో ఆశతో ఎదురుచూచే భవిష్యత్తునూ, మనిషి ఉత్సాహాన్ని కార్యగతినీ సూచించేవి, ఈ దీపాలు. ఈ కవిత్వంలో పౌరాణిక ప్రసక్తిని వదలి ప్రగతిశీల భావంతో, సామాజిక పరివర్తనం చిత్రితమైంది. దీపావళి పండుగను ఈ కవి చూచే చూపులోనే భేదం ఉంది. సమాజంలో 'పాత' స్థానంలో 'కొత్త' వ్యవస్థాపరంగా వ్యక్తి స్వేచ్ఛలో తిరిగిన మలుపులో ఉదయించింది. ఇది దాశరథి ప్రగతిశీల వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తూంది.

దేశదేశాల ప్రజలు అనేకమైన చారిత్రక కారణాల వల్ల ప్రభువుల పాలనలో వెనుకబడినవారూ, స్వాతంత్ర్యం కోల్పోయినవారూ, స్వేచ్ఛలేనివారూ. "భూపావళి బుగ్గిచేసి కోపావళి నగ్గిచేసి" అంతా దీపావళి జరుపుకోవలసిందిగా కవి ప్రబోధం. రాజుల నిరంకుశమైన పరిపాలనం ప్రజల కోపాగ్నికి ఆహుతియైన అనంతరం వచ్చేది సమసమాజ విశిష్టమైన మరో దీపావళి, "వ్యక్తులు పరిపాలించే శక్తి నశించింది నేడు సంఘంలో ప్రతి అణువూ శక్తి గడించింది నేడు". రాజరికమైన వ్యవస్థ అంతరించడంతో వ్యక్తుల పాలనకు తావులేకుండా పోయింది. రాజకీయ వ్యవస్థలో వచ్చిన గుణాత్మకమైన మార్పువల్ల ఇంతవరకూ వ్యక్తిపరంగా ఉన్న శక్తి ఇప్పుడు సమాజపరంగా ప్రవృత్తమైంది. సాంఘికమైన సమగ్ర వికాసానికి ప్రతి వ్యక్తి శక్తీ అవసరం. ఈ వ్యక్తిపరమైన భావాన్ని "ప్రతి అణువూ" అన్నమాటచేత సూచితమైంది. వ్యక్తుల శక్తి స్థానంలో సాంఘిక శక్తి ఆవిష్కృతమై ఉత్సాహాన్ని ప్రేరేపించి కార్యాచరణకు ఉన్ముఖుల్ని చేసే చైతన్యపూరితమైన వాతావరణం చిత్రితమైంది.

"చీకటి దెయ్యం ఒకటే – లోకానికి రాజైతే ఆకాశం నిలువబోదు" అర్ధరాత్రి విలువ లేదు" అర్ధరాత్రి గాఢమైన అంధకారంతో భయంగొల్పే సమయం. చీకటి ఒకటే లోకానికి రాజత్వం వహిస్తే వెలుగుకు నిలువనీడ ఉండదు. ఆకాశానికి అస్తిత్వమూ లేదు. ఇక సూర్యుని ప్రసక్తి లేనే లేదు. అర్ధరాత్రి, ఉదయం, పగలు, సాయంకాలం అనేవి కాలగతిలోని ప్రకృతిసహజమైన పరివర్తనా దశలు. ఇందులో అర్ధరాత్రి ఒకటి. ఇదే రాజుఐతే సర్వమూ భయాత్మకమూ నిరంకుశమూ ఐన స్థితిమయమే. చీకటిపై దెయ్యం రూపం ఆరోపితమై సమయం యొక్క పీడాకరమైన స్థితి వ్యంజితం. ఆకాశం మనస్సుకూ అర్ధరాత్రి దుష్టమైన కాలానికి ప్రతీకలు. ఈ భాగం కవితలోని మూలభూతమైన అంశానికి పుష్టినిచ్చేది.

దీపాలు ఇంటిముందు వెలిగిస్తే సరిపోదు. ఇవి కోటలో బాటలో 'నాటా' లంటాడు. కోటలు రాజరిక వ్యవస్థకూ, బాటలు ప్రయాణానుగతికీ చిహ్నాలు. కోటలో వెలగడంలో రాజరికమూ, నిరంకుశత్వమూ సంకుచితత్వమూ దారిద్ర్యమూ నశింప జేయడం బాటలో వెలగడంలో ఉన్న చోటునే ఉండిపోక జీవితంలో ప్రయాణం కొనసాగ డానికి దారిచూపేవిగా ఉపయోగానికి రావడమన్న ప్రయోజనం ఉంది. దీపాలు నాటడమేమిటి? ఈ దీపాలు కాంతితో వెలుగుతూ ఒక దీపం నుండి మరొకటి క్రమిస్తూ సంతతి సంతతికీ వెలుగు ప్రసాదించే లక్ష్యాన్ని కలిగినవి. ఇవి దారిద్ర్యం అజ్ఞానం దుః ఖమనే చీకటి ఉన్నంతవరకూ అవసరమయ్యేవి. విత్తు నాటబడి మొలకెత్తి కాలక్రమేణ పెరిగి వృక్షమై ఫలాకృతితో అనేక విధాలుగా అవసరాలు తీర్చే రూపం, దీపాలు నాటడంలో ఈ ప్రయోజనం అనుభూతికి తెస్తుంది. ఇక్కడ వీటి ఉపకృతి విస్తృత పరిధిలో ఊహింపజేయడం జరిగింది. వీటి వెలుగులో తమస్సును మళ్ళీ దరిజేరనీయకుండా దూరదూరం వేటాడే ప్రసక్తి ఉంది. ఇక్కడ తమస్సు పారతంత్ర్యానికీ అజ్ఞానానికీ దారిద్ర్యానికీ ప్రతీక. వేటాడమన్న మాటలో తమస్సును నిర్మూలించడానికి జరిగే ఉద్యమాలలో నిశ్చయభావం ప్రయత్నశీలం విజయభావం ఉంది. ఈ దీపమూ చైతన్య రూపానికి ప్రతీకగా నిలిచేది.

కాలం అశ్వం వంటిది. కళ్ళేన్ని లాగి వెనక్కు నడిపించే తిరోగాములంతా, పురోగాముల విజయంతో నడుం విరిగి కుప్పకూలిపోయే స్థితీ తరువాత చిత్రితం. ప్రగతిభావనతో వర్తించే ఈ కవి సంపూర్ణంగా ఆశావాది. వర్తమాన ప్రగతికీ, భవిష్యత్తు దర్శనానికీ ప్రజలతో సంబంధం అనివార్యం, అవగాహన అవసరం అంటాడు. కాబట్టి ఈ కవిత్వం వెనుకనుండి సామూహిక చైతన్యాన్ని జ్వలింపజేసే కంఠస్వరం వినబడుతుంది. కాలాశ్వం వేగమైనగతిని సంతరించుకోవడంతో ఇక ప్రజ వెనుకకు నడువలేదన్న విశ్వాసమూ వచ్చింది. "మనం జనం జనం మనం, జనం లేంది మనం లేం" అని ప్రజల్లో పరస్పరం సమైక్యభావనను కలిగించడానికి దోహదం చేసే ఆలోచన కన్పిస్తుంది. వస్తువులో అణువువలె సంఘంలో ప్రతి వ్యక్తీ వ్యవస్థారూప నిర్మాణంలో సంపూర్ణతకు తోడ్పడతాడు.

**"చల్లని చమురుంటేనే – జ్వాలావళి కీలావళి**
**ప్రజాబలం ఉంటేనే – కవిత్వాలు రాజ్యాలు"**

వ్యక్తుల సమష్టిరూపమైన సాంఘికశక్తిపైనే ప్రభుత్వాల స్థితి ఉంటుంది. కవిత్వ ప్రశస్తీ ఉంటుంది. ఇక్కడ సంఘశక్తి ప్రగతిపథాన్ని తీర్చే చైతన్య స్వరూపంగా భావితమైంది.

ఇది ప్రజల్లో ప్రగతిపరంగా వచ్చే గుణాత్మకమైన పరివర్తనా స్థాయినిబట్టి ఉంటుంది. ఈ స్థాయి పెరిగి, సంపూర్ణమైన ప్రజాబలం - ప్రగతి శక్తులను సమీకరించేదిగా, నిర్వహించేదిగా పరిణమించే విశ్వాసం ఉంది. ఈ శుభోదర్కాన్ని మనసారా కాంక్షిస్తాడీ కవి. చమురు ఉంటేనే వత్తి వెలిగేది. ప్రజాబలం ఉంటేనే ప్రభుత్వమూ కవిత్వమూ అనేది. ఈ దృఢమైన అభిప్రాయమే ఈ కవికి ప్రజోద్యమాలకు సంబంధించిన అనేకాంశాలపై కవిత్వ రూపంలో గొంతువిప్పడానికీ, క్రియాత్మకతను నెరపడానికీ ఆధారమైంది.

**"లోకంలో మూలమూలల - ఆకలితో కేకవేయు**
**నిరుపేదా జరుపుకోరా - మరో దివ్యదీపావళి"**

చీకటిలో ఎక్కడో మూలమూలల దారిద్ర్యంతో ఆకలితో ఆవేదనతో "కేక" వేసే నిరుపేద జరుపుకునే దీపావళి మరోది, అది దివ్యమైందీ. ఇది ప్రతి ఏటా వస్తూపోయే దానికన్నా భిన్నమైందీ. విశిష్టమైందీ. రానున్న కొత్త వ్యవస్థలో సామాన్యుడు సాధారణమైన సుఖశాంతులతో బ్రతికేందుకు వీలు కల్పించడానికి మొదటిమెట్టు కోటి కోటి దీపాలను బాటలో కోటల్లో నాటి తమస్సును వేటాడేందుకు ప్రయత్నం చేయడం, ఆపైన ఉషస్సును అందుకోవడం ప్రభుపాలన నుండి ప్రజాపాలనకు పరివర్తనం చెందిన చారిత్రకమైన మలుపులో ఉన్న స్థితితోపాటు, భవిష్యత్తు రూపముగా ఆశావహంగా ఆవిష్కృతమైంది. నిరుపేద కేంద్రస్థానంగా వ్యక్తి-సమాజం, ప్రజాబలం-ప్రభుత్వం, ఉద్యమం-కవిత్వం అనే రేఖలతో ఏర్పడిన వాస్తవిక - ప్రగతిపథంపై దృష్టితో రూపొందిన కవితా స్వరూపం ఇది. సమసమాజ నిర్మాణ లక్ష్యం కలిగిందీ. సమానత్వం ప్రగతి తత్త్వంపై దృష్టి కేంద్రీకృతమయిందీ.

## 6. అనుభూతి చిత్రణం

దాశరథి ప్రఖ్యాతమైన కవిత 'బాల్యం', ఎన్నో కవిసమ్మేళనాల్లో అశేష జనాన్ని ఆకర్షించిందీ, ఆనందింపజేసిందీ. బాల్యంలోని అమాయకత ఆర్ద్రత స్వచ్ఛత రచనలో ప్రతిఫలింపచేయడం ఒక విశేషం. ఈ గీతం ఎందరినో ఆకట్టుకోడానికి కారణాలు రెండు. ఒకటి ఇందులో బాల్యదశను దర్శించి ముగ్ధులు కావడం, రెండవది అత్యంతమూ స్నిగ్ధమైన కాల్పనికత. ప్రతి వ్యక్తి మనస్సునూ ఆర్ద్రభావంతో పరిమళింపజేసేది బాల్యస్మృతి. ఎంతకాలం గడిచినా దీని రంగు రుచీ వాసన తరగదు. బాల్యదశలో అందరూ పొందే

అనుభవాల దర్శనం, వాటి విశ్లేషణం, వీటిని మనస్తత్వ పరిశీలనలో సామాజిక అవగాహనతో కవి చేసే వర్ణనం, వ్యాఖ్యానం ఒక ప్రక్రమంలో చిత్రితమైనాయి. వీటి పరిశీలనమే ప్రస్తుతోద్దేశం. ఇందులో కొన్ని చిన్న చిన్న సంఘటనల చిత్రణలో కవి దర్శించే అంతస్తత్వం మనల్ని అనుభూతి అంచుల్ని స్పృశించేస్తుంది. ఇది రచనలో ప్రసన్నతరంగా ఆవిష్కృతమై మనస్సుపై ప్రస్ఫుటమైన ముద్రను వేస్తుంది.

> **"దుర్గంధం లేని మనస్సు కుల్యాజలంలో**
> **బాల్యం అనే నౌకమీద పయనించే**
> **దివ్యసమయాలు వచ్చేనా? ఏమో?**

ఇవి గీతం చివరి పంక్తులు. బాల్యం మళ్ళీ వచ్చేనా? రావచ్చు. స్మృతిలో స్పష్టాస్పష్టంగా కదులుతూ అలౌకికమైన ఆనందాన్ని నందింపజేస్తూంది. అందుకే ఆ సమయం దివ్యం. ఆ దివ్యభావనా రూపానికి బింబరూపం బాల్యం. బాల్యం అనే నౌక, ఆ నౌకపై ప్రయాణం, సాగేది మనస్సు కుల్యాజలంలో, ఇది బాల్యంలోని స్వచ్ఛమైన సహజమైన స్వేచ్ఛాయోగ్యమైన ఆలోచనా రూపాన్ని భావింపజేస్తూంది. పిల్లల మనస్సు ఇంకా లౌకికమైన కృత్రిమ వాతావరణానికి లోనుకాని దశ సువ్యక్తం. మరో విశేషం, జలాలపై ప్రయాణ సాధనమైన నౌక పరిధీకృతమైన నిర్మాణ రూపంచేత ప్లవన లక్షణం చేత భద్రతనూ అనుభూతిమయ స్థితినీ, భావింప చేసేది. ఈ విధంగా బాల్యదశపై నౌకా రూపావిష్కారంచేత కొత్తదనాన్ని కోరే మనోభద్రతా భావరూపం వ్యంగ్య విలసితమౌతూంది. ఈ పాదాలు చదివి ముగించగానే పాఠకుల మనస్సులో స్పష్టంగానో అస్పష్టంగానో పై అనుభవరేఖ సరిస్తుంది.

> **"దుర్మార్గాలకీ దుఃఖాలకీ అవతలిగట్టున**
> **తొంగి తొంగిచూచే లోకం బాల్యం**
> **ఈ లోకం ఎత్తిన వెన్నెల బావుటాలు**
> **బ్రతుకులో చల్లదనాన్ని రెపరెపలాడిస్తాయి."**

జీవితానికి ఇవతలిగట్టు బాల్యలోకం. ఆవలిగట్టున ఉంది మరో లోకం. అది దుర్మార్గాలకూ దుఃఖాలకూ నిలయం. ఇది బాల్యదశకు తరువాత దశకు చెందింది. ఈ గట్టునుండి ఆ గట్టుకు ప్రయాణం సాగక తప్పదు. ఇది సహజం కూడా. ఇక్కడి నుండి స్మృతిలో విలసించే దీన్ని కవి "తొంగితొంగిచూచే" బాల్యచేష్టాత్మకంగా, ఉత్సుక భావంతో చిత్రించడంలో సహజత్వం ఉంది. సహజంగా పిల్లలకు చంద్రునిపై చెప్పరాని ఆకర్షణచే ప్రేరితమైన అనురాగం ఉంటుంది. విశాలమైన నీలాకాశంలో వెలిగే కాంతిబింబం, విరజిమ్మే చల్లని వెన్నెల, శిశువు నేత్రాలను ఆహ్లాదపరచేవి, మనస్సుకు

ఉల్లాసాన్ని కలిగింపజేసేవి. ఇంతవరకూ ఎక్కువ గాఢమైన ముద్రలు పడని పిల్లల మనస్సును చకితం చేసి ఉత్సాహంతో పరవశింపచేసే ప్రకృతి దృశ్యాల్లో ప్రముఖమైంది చంద్రుడూ – వెన్నెల. ఈ సహజమైన ముగ్ధమోహనమైన అనుభూతి ప్రసారాన్ని ఆశ్రయించే పిల్లల పాటలెన్నో వెలువడినాయి. అందువల్ల చంద్రుని లక్షణమైన వెన్నెల వెన్నెలగుణమైన చల్లదనం బ్రతుకులో "రెపరెపలాడే" కాలం బాల్యం. పై వర్ణనలో పిల్లల మనస్సుపై ప్రకృతి వేసే ప్రభావం ప్రభావానికతి శీఘ్రంగా గురిఅయ్యే సుకుమారమైన మనస్తత్వం గమనించవచ్చు. అసలు బ్రతుక్కి "ఆనందపు పొలిమేర గాక మరేముంది?" బాల్యదశ దాటగానే ఆనందపు పొలిమేరగాక మరేముంది? బాల్యదశ దాటగానే ఆనందపు పొలిమేర అంతరించి ఆనందాభాస లేదా దుఃఖపు పొలిమేర ఆరంభమౌతుందన్నమాట. ఇక్కడి నుండి "డబ్బు సంపాదనకు కావలసిన రహస్యాలు", దానికోసం "చేయవలసిన సదస్యాల"తో బ్రతుకు తెరుపు పాయలు పాయలుగా చీలి లౌకికమైన కృత్రిమ వలయం రూపొందుతుంది. అందువల్ల బాల్యం సహజమైన ప్రకృతితో, ఆనందాన్ని నింపుకున్న కాలం, "నిశ్శబ్దంగా నితాంత జీవిత లతాగ్రాన పూచే నిర్మలమైన ఎర్రరోజా ప్రసూనం"గా విలసిస్తుంది. 'జీవిత లతాగ్రాన' అంటే జీవితసమాప్తిలో అనే అర్థం స్ఫురించడంలేదా? అని కొందరి మిత్రుల ప్రశ్న. జీవితమనే లతయొక్క అగ్రం – అంటే చివర లేదా సమాప్తి అనేదానికి బదులు మొదట లేదా ప్రధానంగా అన్న లక్షణార్థమో చెప్పుకోవలసి ఉంటుంది. ఇటువంటి సందర్భాలనేకం కవిత్వంలో తటస్థపడుతాయి. ఇక్కడ కవి ఆంతర్యం ప్రధానం. సందర్భాన్నిబట్టి ఔచితీయుతంగా ఉండాలి. శబ్దాన్నిబట్టి అర్థంతో ఉన్మీలనం పొందే భావం ముఖ్యంగా కవిత్వంలో (Static) నిశ్చలమైంది కాదు. ఎప్పటికప్పుడు అభినవ రూపాన్ని ఆవిష్కరించే శక్తి కలిగింది. ఒక శబ్దానికి ఉన్న స్పష్టమైన అర్థం కన్నా దాని ఛాయా (కాంతి లేదా ప్రతిబింబం) రూపం ఎక్కువగా భావాన్ని దూరదూరం ప్రకాశమానం చేస్తుంది. ఈ దృక్పథం ఈనాటి స్వేచ్ఛా కవిత్వం ఆలోకనానికి ఎంతో అవసరం. [1]మొదట అంటే జీవితంలోని వివిధ దశల్లో బాల్య కౌమారాదుల్లో మొదటిది బాల్యం. ప్రధానంగా అంటే వస్తుపరంగానూ వర్ణితమయ్యేది. బాల్యం "ఎర్రరోజా ప్రసూనం" – రోజాపూవు, ప్రకృతిలోని ఆకర్షణీయమైన జీవనరూపాన్నీ,

---

1. Words especially words in poems exhibit ambiguous radiation, manifold refraction. It is neither merely subjective nor merely objective"
– W.K. Wim Satt.- The Verbal Icon - p.124

2. ప్రణవంలో త్రివర్ణాలు – పునర్నవం
నలుపు తెలుపు ఎరుపు వర్ణాలు ప్రతీకాత్మకంగా నిర్మితమైన కవిత. కవి మాటల్లో "కొత్తరకం వర్ణాలు ఎత్తిచూపుతున్నాడిక్కడ" పరిశీలించదగింది.

ఎర్రదనం భవిష్యత్తులోని రక్తిమనూ, ఆశనూ స్ఫురింపజేసేది. ఈ లక్షణం బాల్యానికీ ఉంది. ఆధునిక కవిత్వంలో [2]వర్ణాలు (Colours) వర్ణసామరస్యాలు (Colour Combinations) ప్రతీకాత్మకంగా ప్రయుక్తం కావడం బహుధా కన్పిస్తుంది. ఇక్కడ ప్రతీక, అనుభూతి ప్రధానమైన ఆలోచనా రూపాన్ని, సంక్షిప్తంగా ఆకర్షణీయంగా విన్యస్తం చేస్తోంది. ఈ సందర్భంలో వస్తువు కేవలం - రూపవర్ణనకే పరిమితం కాకుండా అంతస్తత్వం యొక్క వికాస రూపంలో ఉంది. "రోజాపూవు" కవిభావనలో బాల్యదశను రమణీయంగా ఊహింపజేస్తూ కాల్పనికతను సంతరింపజేస్తూంది. అందానికీ, ఆకర్షణకూ ప్రకృతి సహజ గుణానికీ ప్రతీకగా నిలుస్తోంది.

ఈ సుదీర్ఘమైన కవితలో దాశరథి ప్రత్యేక గుణమైన సూటిదనంతోపాటు కళాదృష్టి ఉంది. బాల్యం అనే వస్తువునాశ్రయించిన దీని ప్రక్రమం నాలుగు విధాలుగా సంయోజితమైంది. మొదటిది కేవలం బాల్యవర్ణం - కాల్పనికం. రెండోది పిల్లల మనస్తత్వ చిత్రణం, మూడోది పెద్దల ప్రవర్తనాలోకం, నాల్గోది మధ్య మధ్య కవి వ్యాఖ్యానం. రెండోదానికీ మూడోదానికీ మనస్తత్వపరంగా లేదా సమాజ విశ్లేషణం పరంగా వ్యాఖ్యానమూ ఉంటుంది. కవి ఊహ సాధారణంగా లోకగతమైన అనేక సంఘటనలు, అనుభవాలు పొందికగా ఎక్కడికక్కడ వలయాలుగా నిర్మితమై సాగుతూ ఉంటాయి. ఉన్న పరిధిలో వివిధ సందర్భాల్లో పై అంశాలను పరస్పరం సంయోజనపరచి కళాకృతి నివ్వడంలో సావయవమైన సంపూర్ణస్థితి చేకూరింది. ఇది ఈ రచనలోని నిర్మాణశిల్పం. మొదటి అంశం కాల్పనికం పైన సూచనగా విస్తృతమైంది. రెండోది పైకి పెద్దల ప్రౌఢవర్తనం వెనుకనుండి పిల్లల మనస్తత్వాన్ని భావింపచేయడమనే అభివ్యక్తి తీరు ఉంది. వీరిలో ప్రధానంగా కన్పించే అమాయకత్వాన్ని స్ఫురింపజేసేది.

"నమ్మించి మోసం చేయొచ్చనీ డబ్బుకోసం గడ్డితినాలనీ ఏమీ తెలీని చల్లనికాలం".

అణుబాంబు ప్రేలుడులో ఆకర్షణంలో భస్మమైపోతామనీ మూడు డబ్బ్యాల మంటల్లో మాడి బొగ్గయిపోయి".

తాము ఏ ఘోరానికీ పాల్పడేదీ ఏమీ ఎరుగని "మెత్తనికాలం" పెద్దల గడుసుదనం ఉటంకిస్తూనే, ప్రక్కనుండి దీనికి విరుద్ధమైన పిల్లల "చల్లని" మెత్తని మనస్తత్వం, వైయక్తికమైన పరిధుల్ని అతిక్రమించిన నిఖిల మానవజాతి ప్రపంచంలోకి క్రమించడం చూడవచ్చు. బాల్యం ప్రసక్తి వచ్చినప్పుడల్లా కవి ప్రయోగించే విశేషణాలు 'చల్లని' 'మెత్తని' 'అమృతం' మొదలుగా సౌకుమార్యం ఆహ్లాదం, అందం, మాధుర్యంతో పాటు

ఆకర్షణీయమైన "దివ్య"మైన వాతావరణాన్ని సృజింపజేస్తున్నాయి. మూడోది పిడికెడు డబ్బుల్ని విసరి ఏట్లో పారేస్తాడు, బంగళామీంచి దూకుతాడు, ఇవన్నీ దేవుడుగాని చేయలేడు. పిల్లలు ఎప్పుడేది చేయాలనిపిస్తే అది నిర్హేతుకంగా చేస్తారు, ఆలోచన చేయరు. ఇందులో నిర్భీతి, తెలియనితనం, స్వేచ్ఛ, సహజోద్రేకం అన్నీ పుంజీభూతమై ఉంటాయి. ఒక ప్రమాణంలో చూస్తే ఇవన్నీ దేవుడుగాని చేయలేడనిపిస్తుంది. ఇవి ఆలోచన హేతువు భయం ఉన్న పెద్దలు చేయలేరు, వారికి అసాధ్యం కూడా.

"ఇంట్లోంచి ఎత్తుకవచ్చి తన మిత్రులకు ఎంతైనా ఏమైనా ఎప్పుడైనా ఇస్తాడు" స్వపరభేదంలేని మనోగుణం చిత్రితం. మనకు విలువైన వాటిపట్ల ఎంతో సంకుచితంగా ఉండే వాటిపట్ల దీనికి విరుద్ధంగా పిల్లల ఆలోచన ప్రవర్తన ఎలా పర్యవసించి విలువ విలువలేనివిగా చేస్తాయో ఉదారంగా వ్యవహరిస్తారో చూపి, అంతకంటే సామ్యవాదం ఏమిటి?" అని సమాజపరమైన ప్రశ్నతో సామాన్యస్థితిని ఒక విశేషస్థితి చమత్కారంగా అనుసంధించడం జరిగింది. మృదుహాస్యాన్నీ అనుసరించడమూ కన్పిస్తుంది. దేవత్వం పసితనాన మనలో నిండి మానవుని దేవతగా ఊగించి ఊగించి నరకం అనే నరజన్మలోకి అమాంతం పారేస్తుంది. మళ్ళీ పసితనంపై దేవత్వం – ఆపైన నరకంపై, నరజన్మ అనే రూపచిత్రాలు బాల్యం పట్ల గాఢమైన అనుభూతి స్పందననూ దీన్ని గురించి తీవ్రమైన వివేచనా శక్తినీ రూపుకట్టించేవి. బాల్యంలో దైవత్వం వలన పారవశ్యం పొందడం తరువాత నరకంలోకి క్షిప్తం కావడం, రెండింటినీ ప్రక్కప్రక్కనపెట్టి తారతమ్యాన్ని గుర్తింప జేసేవిగా ఉన్నాయి. బాల్యం పట్ల విశేషానురక్తిని పెంచేవిగానూ ఉన్నాయి.

బాలవాక్కు బ్రహ్మవాక్కు ఒకటి దాచి మరొకటి చెప్పదు. లౌకికమైన తత్కాలీనమైన కృత్రిమ స్థితికతీతంగా మనస్సు ప్రవర్తించే దైవసన్నిభమైన సత్యానికి పిల్లలెంత సన్నిహితులో నిరూపించేవి. "అమ్మ ఎదలో అమృతాన్ని నాన్న చంకలో నాకలోకం అనుభవించగల ధన్యుడు" అమ్మ, నాన్న ఇరువురూ ప్రేమస్థానీయులే. అయినా ఇరువురూ ఆకర్షించే లక్షణాలు వేరు. అమ్మ అనుభూతికి నిలయమైన హృదయానికీ, నాన్న ఆలోచనాత్మకమైన వివేకానికీ సమీపంగా కన్పిస్తారు. అమ్మ అనునయంలో ఒదిగిపోతాడు, నాన్న అదుపులో పెరుగుతాడు. అమ్మ ఎదపై భద్రత, నాన్న చంకలో రక్షణ ఉంది. అక్కడ అనుభవంలోకి వచ్చేది అమృతసమమైన ఆనందం. ఇక్కడ ఆలోచనాగతమైన నాకం. రెండింటిలో అనుభవభేదం ఉంది. మొదటిది సద్యఃఫలాకృతికీ రెండోది భవిష్యత్ దర్శన రూపానికీ ప్రతీకలు కావచ్చు. మొదటిదానిలో ఆర్ద్రత, మాధుర్యం ఉంటే రెండోదానిలో ఉన్నతీ పరిణతీ గోచరిస్తాయి. రెండూ అవసరమైనవే.

ఒకదానికొకటి ఆశ్రయపదాలై జీవితంలో వ్యక్తి సంపూర్ణతకు దోహదమిచ్చేవి, ఇదంతా పిల్లల మనస్తత్వ విశ్లేషణలో భాగమే. ఐనా కవి మనస్సులో ఎంతకాలం నుండో ఎన్నో అనుభవాలు ప్రవేశించి సుప్తమైన సంస్కారరూపంలోంచి; సృజన సమయంలో చిత్రంగా ఒక్కొక్కప్పుడు తెలిసీ, మరొకపుడు తెలీకుండా కవి భావనలో సాక్షాత్కరిస్తాయి. వివేచనకవకాశమిస్తాయి. దైనందిన జీవిత సమస్యల్నీ దుఃఖాల్నీ దురంతాల్నీ మరచి "వినిర్మల పథాలమీద నీడలేని మెత్తని వెన్నెల్లో ముళ్ళులేని పూలతీగెల ప్రక్కగా" కదలిపోయే "దివ్యదశ" బాల్యం–నీడలూ ముళ్ళూ లేని చల్లనీ మెత్తనీ జీవితం మనకు తెలీకుండా గడచేదీ, గడచాక స్మృతిపథంలో అమృతమయంగా మెదలేదీ. పై బింబాల్లో విషాదానికీ కష్టానికీ అతీతమైన స్థితి వ్యంజితం. దీనికి కారణం బాల్యంలోని వినిర్మలత్వమే. ఈ పథం మళ్ళీ మనం చేరుకోలేనిదీ, "అమూల్యమైన ఆనందాన్ని అందించే అమృత శక్తి బాల్యం".

1) బాల్యంలోని ఆనందరూపం, 2) జీవితంలో పెద్దల ప్రపంచం, రెండింటికీ మధ్య కలియరాని అంతరం, 3) ఒకటి ప్రసన్నతతో మరొకటి సంక్లిష్టతతో ఎట్లా సన్నద్ధమయ్యేదీ, 4) కల్పనతో లోకపరిశీలనంతో వివృతి పొందిన రచన ఇది మరొక విధంగా భావిస్తే, బాలుర మనస్తత్వం – సామాజికమైన యాథార్థ్యం రెండూ ఒక అవగాహనతో సంశ్లేషాన్ని పొందిన కళాఖండం. దీనికి ఉపస్కారకంగా కొన్ని సంఘటనలు యోజితమైనాయి. అనుభవ పరంపర ఉంది. వీటి గతిలో సామరస్యం ఉంది. దీని చిత్రణలో మనస్తత్వ రేఖలతోపాటు స్వచ్ఛమైన కవితాత్మను బింబించే రూపం కవిప్రతిభ వల్ల సంక్రాంతమైంది. సృజన సమయంలో కవి మనస్సువలెనే ప్రసన్నంగా స్నిగ్ధంగా నీడలేని మెత్తని చాంద్రీరూపంతో సాక్షాత్కరించే ఉత్తమ కవిత 'బాల్యం'.

## 7. వర్తమాన స్పందనం

'మస్తిష్కంలో లేబోరేటారీ' కవిత కవి సామాజిక సాహితీ వ్యక్తిత్వానికి ప్రతిబింబంగా నిలచేది.

**"మొహంజొదారో శిథిలాల లోతులోకి**
**పురాతన నాగరికతా గర్భంలోకి**
**సూర్యుడస్తమించిన జాడల్లోకి ఒకదారి**
**మరొకదారి మస్తిష్కంలోని మా ఇంటికి**
**మరి మా ఇంటిముందుగా లేబోరేటరీ"**

కవి ఎదుటనున్న దారులు రెండు. ఒకటి పురాసంస్కృతీ గర్భంలోకి వెళ్ళి పరిశీలన చేసేదీ, ఇంటివెనుక నుండి సూర్యుడస్తమించే జాడల్లో కలిసేది. ఇది గతానికి చెందింది. మరొకటి మస్తిష్కంలోని ఇంటికి, ఆ ఇంటిముందుగానే లేబోరేటరీ. ఇంటివెనుకా ముందూ ఎన్నో చిత్రాలు, అవి సంఘటనాత్మకమైనవీ, స్థితినాశ్రయించినవీ, ఒకదాని వెంట మరొకటి ఆకర్షణీయంగా, జీవితంలోని నగ్నసత్యాలను స్మరింపజేస్తాయి. ఇంటివెనుకనున్నవి గతకాలపు మచ్చుతునకలు. పురాసంస్కృతీ శిథిలాలు. మానవగాథా శకలాలు. ఇంటిముందు భవిష్యత్తును దర్శింపజేసే చలనం దీని గమనవైఖరి వేరు. మొదటిది ప్రస్తుత కాలానికీ అంతగా పనికిరాని వ్యవస్థకు సంబంధించింది. ఇందులో మన కెదురయ్యేవి, చేతనా విరహితాలు, అంధకారబంధురాలు. ఇది సూర్యుడస్తమించిన జాడల్లో అవనతమై ఉండేది. రెండోది ప్రస్తుతం అవసరమైన స్వేచ్ఛ, వాస్తవికత, పురోగమన శీలంపై దృష్టిగల మహామానవుని అన్వేషణపై ఆస్థ కలిగింది. ఇది సూర్యుడుదయించే దారులవైపు ఉన్ముఖీకృతమై ఉంది. మధ్యమధ్య కవి వ్యాఖ్యానం, చరిత్ర గురించీ కాలాన్ని గురించీ, మానవుణ్ణి గురించీ అతని జీవిత సమస్యల్ని గురించీ ప్రకృతస్థితికన్వయిస్తూ తాత్త్వికమైన ఆలోచనా ధోరణిలో సాగింది. ఇవి కవి మనస్సులో ఉన్న మౌలికమైన వస్తునిర్మాణ రేఖలు.

ఈ లేబోరేటరీలో కూర్చొని "శాంతిపండే 'రీతి' క్రొత్తరకం విత్తనాల్ని" కనిపెట్టి 'బలమైన కవిత్వాన్ని సృజించే', అవకాశం ఉంది. ఇది సమాజ సుస్థితికి శాంతి, మానసికమైన శాంతస్థితి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మిస్తుంది. ఇక్కడ జరిగే కృషిలో అందరూ భాగస్వాములే. కాబట్టి ఈ లేబోరేటరీ ఎప్పుడూ తెరిచే ఉంటుంది. ఇందులో అందరికీ ప్రవేశం ఉంది. ఇక్కడ జరిగే వినూత్నమైన పరిశోధనలవల్ల శిథిలమైన ఆశలు చివురిస్తాయి. జీవితం రసవంతంగా ఆనందప్రదంగా పరిణమిస్తుంది. ఆదర్శ రూపం సిద్ధించడానికి చేయవలసిన ప్రయత్నమూ ఇక్కడ ప్రసక్తమైంది. మస్తిష్కం అంటే మేధ. ఇది జీవితంలో అనుభవానికీ ఆలోచనకూ కేంద్రమైన హేతురూపం. దీనియందు మన ఇంద్రియానుభవానికి వచ్చేవన్నీ కూడి ఉంటాయి. ఇది శిరోదేశాన్ని పొంది ఉండడంవల్ల మస్తిష్కం అని పేరు వచ్చింది. ఈనాటి వైజ్ఞానికమైన అవసరాన్ని కవి ప్రముఖంగా గుర్తిస్తూనే, వివేకాన్ని కోల్పోయే ప్రమాదంలో పడకూడదని అచంచలంగా విశ్వసిస్తాడు. అందుకని ఆలోచనకూ అనుభవానికీ జీవితంలో సమమైన ప్రాధాన్యం ఉండాలన్నది ఇతని నిశ్చయమైన ఆశయం. దీని సామరస్యాని కేమాత్రం భంగం కలిగినా ఆపద తప్పదు. ఇది అనేక సందర్భాల్లో స్ఫుటంగా వివృతమైంది. "నిశ్శబ్దంగా

నిదురపోయే నిరపరాధి పరమాణువు డొక్కచించి డోలుకట్టి ప్రమాదాలు తేబోకు" విజ్ఞానం, వివేకంతో సమన్వితమైనపుడే సౌభాగ్యాన్నీ ఆనందాన్ని ప్రసాదిస్తుందన్న స్ఫూర్తినిస్తుంది. ఇంటిముందు లాబొరేటరీలో కూర్చొని ప్రయోగసరణికి స్థూలంగా గతం వర్తమానం భవిష్యత్తు అనే మూడు దశల్లోని జీవిత రేఖలు అభ్యుదయ భావనతో తీర్చబడినాయి.

స్థూలంగా కవిలోని సామాజిక స్పృహ అభ్యుదయభావనతో మానవతా దృక్పథంతో విలసితమైంది. చాలా సందర్భాల్లో రెండూ ఒకదానికొకటి ప్రోద్బలంగా చిత్రితమైనాయి. ఇక్కడ రెండింటికీ ఆశ్రమస్థానం ఒక్కటే. అవి ఉన్ముఖీకృతమైన తీరులో ఉంది భేదం. ఈ రచనలో గతాన్ని ఉన్నచోటునే భద్రంగా ఉంచి వర్తమానం వీపుతట్టి మేల్కొల్పి భవిష్యత్తుకు స్వాగతం పలికే ప్రవృత్తిలో అవసరమైన క్రియాశీలంతో అభ్యుదయ భావన ఆశాంచలాలు స్పృశిస్తుంది. చరిత్రలో కొన్ని ఘటనలు ఈ దృక్పథంతో మలచేందుకు ఉపయుక్తమైనాయి. కవి సామాజిక స్పృహ, కవితాతత్త్వం రెండూ ఒకదానినొకటి స్పృశిస్తూ ఏకరూపంతో కదలిపోవడం గమనించవచ్చు.

"గతంలోంచి కొంత నేర్చుకోబోయి గతానికి తాకట్టు పడుతున్నారు కవులు", గతాన్ని, మానవుడు అనంత ప్రయాణంలో అతిక్రమించిన స్థానంగా కాక, అదే గమ్యస్థానమనుకోవడంలో పురోగతికి క్షతి కలుగుతూంది. అపూర్వ పూర్వానుభవ విశేషంతో ప్రయాణం సాగించడం వేరు. గతానికి తాకట్లు పడడంలో మానసికంగా స్వేచ్ఛ ఎరుగని దశలో నిస్సహాయస్థితీ సూచితం. గతాన్ని ఎందుకూ పనికిరాదని నిరసించడం లేదు. దానినుండి కొంత శిక్షణపొందడం వరకే పరిమితం కావాలి. ఆపైన జీవితంలో పరిస్థితులనుబట్టి వర్తమాన వ్యూహరచన లక్ష్యాన్నిబట్టి భవిష్యరూపమూ ఉంటాయి. ఇంటివెనుక సూర్యాస్తమయ సన్నివేశం విన్యసించడంలో గతకాలానికి సంబంధించిన చీకటి, పోనుపోను గాఢమైన నిశాస్వరూపమూ లక్షించవచ్చు.

మా ఇంటివెనుకగా తాజహమహల్ అందాల్లో మెరసిన షాజహాన్ కీర్తి తాజ్‌మహల్లో ప్రభువుకీర్తి మెరవడంలో అతని కళాసౌందర్య లక్షణం స్ఫూర్తి కదుతూంది. అస్తమయానంతరం - అంటే గతంతో ఏదీ సరిగా కన్పించని చీకటి స్థితిలో కన్పించే కళారూపాల్లో ఇదొకటి. ఇలాంటి సంస్కృతీ ఖండాలు లేకపోలేదు. ఇవి మానవజాతి కీర్తిని మెరపించే కళాకృతులు, శిల్పం సాహిత్యం తదితర క్షేత్రాల్లోనూ పేర్కొనదగినవి ఉన్నాయి. వీటిలో కొన్ని ఈ కాలంలో చెల్లనివీ లేకపోలేదు. "ఆనాటి పాతగంటం కంటిలో రాక్షసీ వికటాట్టహాసం, రంభోర్వశీనాకవాసం "పాతగంటం కన్ను" అన్న భావచిత్రం నవ్యమైందీ. ఎంతో అర్థస్ఫూర్తినిచ్చేదీ. గంటం వ్రాస్తుందీ కాని చూడలేదు.

బాహ్యజగత్తును చూచేది కన్ను. ఊహాత్మకమైన అంతరజగత్తును చూచేది మనస్సు. మనస్సులో మెదలిన ఊహాసమూహానికి గంటం అక్షరాకృతినిస్తుంది. ఊహాసమూహం కవిమనస్సులో రూపొంది, సాగి అక్షరాకృతి వహించే క్రమగతిపై దృష్టితో పై భావచిత్రం నిర్మితమైంది. రాక్షసుల దేవతల కథలతో అల్లుకొన్న పూర్వ సాహిత్యంలో యథార్థమైన జీవితానికి దూరమైన కృత్రిమమైన వాతావరణాన్ని భావింపజేస్తూంది.

**"లోకాన్ని అడక్కుండా ఎవడో దుష్టనృపతి**
**రచించిన కఠినశాసనాల రాసులు"**

పాలకులూ పాలితులూ మధ్య పెద్ద అఖాతం. ఈ పంక్తులు దీనిలోతులు చూచేవి వీరిలోకం వేరు వారిలోకం వేరు. ఇవన్నీ చారిత్రకమైన అవగాహనతో ఆలోచిస్తే, ఏ మార్పులేని కఠినమైన వాతావరణం అవగతమౌతుంది. అప్పటి నిరంకుశమైన రాజరిక వ్యవస్థవల్ల ఏర్పడిన విపరీత పరిణామానికిది ఒక ఉదాహరణం మాత్రమే. దీని పరాకాష్ఠ రూపం రైతుల జీవితాలు రాజుల భోగవృత్తికి ఉపయుక్తమైన చారిత్రక సత్యం.

"రాజుల పాదాల క్రిందుగా రైతుల రతనాల బ్రతుకుల తివాచీలు". తనకు సాంఘికన్యాయం చేకూరడం లేదన్న స్పృహ కూడా లేదు రైతుకు. పై వారి అందులో నిరంకుశులైన రాజుల సేవాభావంలోనే ఒదిగిపోయి మలగిపోతూంది అమూల్యమైన జీవితమంతా. దీనికి కారణం తరాలుగా క్రమ్ముకొన్ని అజ్ఞానమూ దారిద్ర్యమై వాళ్ళను ఆధునిక జగత్తునుండి దూరం చేశాయి. ఎప్పుడో ఎక్కడికి చేరుకున్నవారు అక్కడే నిలచిపోయారు, ఆ పైన ఏ అభివృద్ధీ లేదు. రాజులకూ వీరిని గురించి పట్టలేదు, పట్టించుకుంటే తమ భోగసరణికంతరాయం కలుగుతుందన్న భయమూ లేకపోలేదు. అభ్యుదయ కవిత్వంలో బహుధా కన్పించే కార్మికలోకంతోపాటు, ఇతని కవిత్వంలో రైతులను గురించీ, అంతటి అభిలాష మొదటినుంచీ కన్పిస్తుంది.

ఈ లేబొరేటరీలో కూర్చుని శాంతిని పండించేందుకు ముఖ్యమైన మరో రకపు విత్తనం కనిపెట్టే అవకాశం ఉంది. అది మానవత్వపు విలువల్ని ప్రసాదించేది.

"నిరాశతో ఏడ్చే దరిద్రాంగన కన్నీటి చుక్కలకు ఎంతదూరాన నవ్వు పువ్వులున్నాయో?" దారిద్ర్యమనేది చాలావరకు సామాజిక వ్యవస్థకు చెందింది. దీన్ని బట్టే ఎక్కువగా అన్ని సమస్యలూ ఆధారపడి ఉంటాయి. ఈ స్థితి మనిషిలో అవాంఛనీయ మైన పోకడలు తలెత్తటానికి దారితీస్తుంది. దీని నిర్మూలనకు సాంఘిక వ్యవస్థలో మార్పు అవసరం. అయితే వైయక్తికమైన మనస్తత్వ ప్రభావమూ ఉండకపోదు కాని

ఎక్కువభాగం సంఘ వ్యవస్థాపరంగా ఉన్నవే. వ్యక్తీ - సంఘమూ రెండూ పరస్పరం ప్రభావం నెరపేవికాబట్టి ఈ రెండు దశల్లో ఉన్నతికి కృషి జరిగినపుడే వికాసవంతమైన జీవితానికి చేరువలో ఉండగలం. దీన్ని గురించి కవి జరిపే ఆలోచన, అతడు నెరపే ఆలోచన, అతడు నెరపే సానుభూతి ఆవిష్కారం, వెనుక సామాజిక వ్యవస్థాపరమైన అంశం స్ఫుటంగా చిత్రితమైంది. మానవతా చిత్రణంతోపాటు, హృదయంలో ఏ పొరలో దయ ఏ తెరలో నిర్దయ, ఏ దిక్కున రాగం, ఏ దిక్కున త్యాగం దాక్కొని సెలవిచ్చే మనస్తత్వపరమైన వైయక్తిక భావధోరణీ యోజితమైంది. సౌభాగ్యవంతమైన సమాజవ్యవస్థను సాధించే ఆశాభావంతోపాటు, కరుణ, అనురాగం, శాంతి మొదలైన ఉదార గుణోపేతమైన స్థితిని సాధించడానికీ మొదట 'మానవుడు మానవుడు'గా మేల్కోవలసిన అవసరం ఎంతైనా ఉంది.

**"కటికి రాతిగోడలతో కట్టిన కారాగేహంతో**
**గతకాలపు శాసనాల కట్టుబడిన ఖైదీవలె**
**భయంభయంగా గాలి పీల్చుకుంటావేం**
**ఊపిరితిత్తుల్ని కొలిమి తిత్తులుగా**
**నొక్కి నొక్కి మండించవోయ్ మానవతా జ్వాలావళి**

అభ్యుదయభావన - మానవతా దృక్పథం, రెండింటి సమన్వయం ఈ పంక్తుల్లో చూడవచ్చు. ఇందులో కన్పించే చిత్రాలు రెండు. ఒకటి భయానికి సంబంధించిందీ, రెండోది విషాదానికి సంబంధించిందీ. రాతిగోడల కారాగారంలో కఠినశాసనాలకు కట్టుబడి, నిర్బంధంలో ఉన్న ఖైదీవలె ఉంది సామాన్యుని స్థితి. ఇది పాలితులపై పాలకుల కఠోరమైన అధికార ప్రవర్తనను భావింపజేసేది. అదే, పాలకుల వలన భయంతో అడుగులు వేసే మనస్సులో, రగిలిన మెలకువతో ఎగసే మానవతా జ్వాలాసంచారం, కఠోరమైన అధికార ప్రవర్తనకూ స్వేచ్ఛాయుతమైన ప్రజాసంచారానికీ మధ్య జరిగే సంఘర్షణలో ఈ కవి ఊహ ప్రజల పక్షమే వహిస్తుంది. వీరు మునుముందు ధైర్యంతో కదలి పురోగమించే జ్వలదగ్నిశిఖలుగా కళ్ళముందు సాక్షాత్కరిస్తారు. ఇది స్థూలంగా దేశానికీ, కాలానికీ స్థగితం కాకపోవడంతో విశ్వజనీనత్వాన్ని పొందుతూంది. "కారాగేహంలో ఖైదీవలె" - సహజపరమైన వాస్తవిక భావచిత్రం. ఐతే "ఊపిరితిత్తుల్ని కొలిమితిత్తులుగా మండించి వాస్తవంపై నిర్మితమైన కల్పన, చైతన్యం జ్వలించే ప్రగతి భావబంధురమైంది. వాస్తవం-ప్రగతిశీలం-రెండింటి సమన్వయంతో ప్రధానమైన ఉద్దేశ్యానికి పరిపుష్టం చేకూరుతూంది. ఒకటి బాధానుభవాన్ని పలికితే మరొకటి తద్విముక్తికి చైతన్యాన్ని ప్రబోధిస్తూంది. "ఇంకా

అక్కడక్కడా ఎత్తయినా గడీగోడనీడలు చిన్ని చిన్ని గుడిసెల్ని పెరగనీయడంలేదు". ఇంకా భయం భయంతో తలవంచుకొనే బరువు బరువుగా నడుస్తున్నాడు బా సీడు. ఎత్తయిన గడిగోడలు ఫ్యూడల్ వ్యవస్థకు ప్రతీక. ఈ వ్యవస్థ సామాన్యుని జీవితంలో గుణాత్మకమైన మార్పుకు నిరోధమైంది. అణువును భేదించినా ఆకాశాన్ని ఉత్తరించినా ఇక్కడ సామాన్యుని బ్రతుకులో మార్పు మాత్రం శూన్యం. కాబట్టి గుడిసెల్లో మార్పు లేదు. ఎన్ని శతాబ్దాలు గడిచినా, "ఇక్కడే ఉన్నాం ఈ ఊరు పొలిమేరలోనే" ఎంతకాలం గడచినా మానవునిలో మూలభూతంగా సంస్కరణకూ పరివర్తనకూ చెందిన గుణం ఉన్నా అనేకమైన వికర్షణల వల్ల, వ్యాఘాతాలవల్ల ఆటంకాలవల్ల మానవతా కేంద్రాన్ని స్పృశిస్తూనే లక్ష్యాన్ని అందుకోలేక పోతూంది. దీనికి సామాజిక స్పందనం అవసరం. వ్యవస్థాపరమైన పరివర్తనం రావాలి. ఇది కేవలం ఆదర్శంగానే నిలిచిపోయింది. ఈ భాగం వాస్తవాన్ని దర్శించే ఉత్కంఠతో, దీని వెనుకనున్న సత్యాన్ని అన్వేషించే తత్పరతతో నిబిడమైంది. ఏవో కొన్ని వైయక్తికమైన ఉదారవర్తనలకతీతమైన, విస్తృత పరిధిలో సాంఘిక న్యాయాన్ని అభిలషించే వ్యవస్థా దృక్పథంతో ఇది ఉన్మీలితమైంది.

ఇంకా ఈ లేబోరేటరీలో పరిశీలించే అంశాలు చాలా ఉన్నాయి. "ఏ డిగ్రీలో ఎంత వేడి నిలిస్తే ఏ రకం ప్రాణకోటి పడుతుందో ఏ ఖిలా గోడనీడ ఏ మహారాజు వంశాన్ని ఎంతెంత కాలం కాపాడిందో" ఒకటి వైజ్ఞానికమైన పరిశోధనకు చెందింది. రెండవది సామాజిక తత్త్వమూ రెండూ ప్రజల శ్రేయస్సుకు ఉద్దేశించినంతవరకూ వేరుకావు. పరస్పరం ప్రయోజనభావం లేకపోతే మానవ వికాసానికి సమగ్రత చేకూరదు. రెండింటి లక్ష్యమూ ప్రజల సౌభాగ్యం, అభ్యున్నతీ. ఈ లోపంవల్లనే "మస్కెట్ల నుండి రైఫిళ్ళదాకా నడచిన దేశం, కొడవళ్ళనుండి కోతయంత్రందాకా సాగలేదు" ఇక్కడే సమస్థితి చెదరింది. మారణాయుధాల ఉత్పత్తి అభివృద్ధిదశలో నున్నట్లు ప్రాణాధారమైన ఆహారాన్ని సృష్టించే వ్యవసాయరంగం పొందలేదు. ఏదైనా జీవితంలో మనం సాధించదలచుకున్న విలువల్నిబట్టి ఇచ్చే ప్రాముఖ్యాన్నిబట్టి ఉన్నతిని పొందుతుంది. అందువల్ల విజ్ఞానప్రగతి, మానవుని శ్రేయస్సుకై జీవిత సౌభాగ్యం కోసం జరగాలి. జీవితంలో సమన్వయ దృక్పథం అవసరాన్ని పదే పదే నొక్కిచెబుతూ మరో పార్శ్వమైన కళాజగత్తుపైకి ఇతని చూపు ప్రసరిస్తుంది. ఇదీ సామాజిక స్పందనం కలిగిందే.

"అజంతా శిలాసుందరికి లేని క్షుద్బాధాసంచలనం పల్లెపడుచుకున్నదని గమనించుకో భాయీ". చిత్రం శిల్పం మొదలైన కళారూపాలు మానసికమైన అనుభూతి నిచ్చేవి. వీటికి క్షుధ ఏం తెలుసు? జీవితం నిత్యమూ అనుభవాత్మకమైంది. ఇది

ప్రాణి, అందులో మానవులకే బాగా వర్తిస్తుంది. ఎంతకాలం శ్రమించినా అజంతా సుందరిలో ఏ మార్పూ ఉండదు. అనుభవ స్పందనతో గడిచే మనిషి వాస్తవ జీవితంలో అవసరమైన ఆహారం లేకపోవడం దుర్భరం. కాల్పనికమైన జగత్తుకూ, యథార్థమైన భౌతిక జగత్తుకూ గల తారతమ్యం ఇందులో సుకుమారంగా ఎత్తిచూపడం జరిగింది. క్షుధ–ఆలోచన–అనుభవం–యథార్థం–కల్పన అనేవి జీవితంలో తప్పనివైనా ఎప్పటికప్పుడు అవసరాన్నిబట్టి ప్రాముఖ్యం సంతరించుకుంటాయి. కల్పనలోని కళారూపానికీ, వాస్తవంలోని జీవితరూపానికీ మధ్య అంతరం చాలా ఉంది. అయినప్పటికీ, విచిత్రమేమంటే ఈ రెండింటినీ కలిపే పల్చని స్ఫటికసదృశమైన రేఖ ఉంది. దీన్ని కళలో వాస్తవికతలో కళాకృతిగానూ దర్శించవచ్చు. రెండింటినీ ఒకచోట కలిపే కాంతి ప్రసారంగా స్ఫటికసదృశమైన స్థితిలో ఉండే, ఈ ధోరణి, అనుభూతి విశేషంతో సామాజిక స్పందనతో రూపొందిన లక్షణాన్ని దాశరథి కవిత్వంలో స్పష్టంగా చూడవచ్చు.

ఈ మెట్ల పైనుండి కవిత్వానికి వస్తే, కవి మనస్సులోపలి చిత్రశాలలో "చిత్రించరాని శిల్పం కూర్చలేని" వేదన ఉంది. ఈ వేదన ఇంతవరకూ ప్రసక్తమైన సామాజిక దుస్థితివల్ల స్పందితమైంది. ఈ స్పందనలో జన్మించిన "ఊహింపులు" నిర్భయంగా నిర్నిరోధంగా, "దిసమొలల్తో లోకానబడి పరుగిడుతున్నాయి. వీటి స్వేచ్ఛాప్రవృత్తిని అరికట్టాలా? లేక సమాదరించాలా? అని విచికిత్స. "దెయ్యాల ఆడబిడ్డలవంటి పెద్ద పెద్ద మోదుగవృక్షాలకు నిప్పుబట్టకట్టించిన రీతి" పరుగెత్తేను ఊహలు. మోదుగపూలు నిండుగా పూచినపుడు ఎర్రగా కళ్ళు మిరుమిట్లు గొల్పుతాయి. ఇవి పూచేకాలంలో కొమ్మలే బాగా కన్పిస్తాయి. ఆకులంతగా ఉండవు. గుత్తులుగుత్తులుగా పూచి, కొమ్మల్ని ఆవరించి వ్రేలాడుతూ పూలు కంటిని చప్పున ఆకర్షిస్తాయి. ఈ పూలు నిప్పుబట్టగా వర్ణించడంలో భావచిత్రం గాఢత్వాన్ని పొంది, ఔజ్వల్యాన్ని ఆవిష్కరిస్తోంది. దెయ్యాలు భయానికి ప్రతీక. ఈ స్థితి మోదుగవృక్షాలకు నిప్పుబట్ట కట్టినరీతి ఊహలు చిత్రించడంలో వేదనాజ్వాలలే తన కవిత్వానికి సహజమైన ఆచ్ఛాదనా రూపం – మరే తొడుగులు అక్కరలేదన్న రమణీయభావమూ స్ఫూర్తికి వస్తుంది. "దండించనా? రండి రండని పిలిచి నా కవవిత్వపు పండుటెరుపు చేలాలందించనా?" అనీ వితర్కితుడౌతాడు. ఊహ మనస్సులో మెదలింది, కవిత్వరూపంలో ఆవిష్కృతమయ్యే క్రమగతికి సంబంధించిన అంశం ఇందులో స్థూలంగా విశ్లేషణకు వస్తుంది. దండించడమంటే సహజమైన స్వేచ్ఛాతత్త్వాన్ని నిరోధించడమన్నమాటే. ఏ రెడీమేడ్ దుస్తులు లేవు. వాటి అక్కర కూడా లేదు. అందుకని వేదనలో జన్మించిన స్వచ్ఛహైన, ఏ దాపరికం లేని

స్వేచ్ఛామూర్తులకు కవిత్వపు చేలాంచలాలందించే ఔత్సుక్యం కలిగింది. ఇవి పండుటెరుపు వర్ణం కలవీ ఇది ఉజ్వలమైన అభ్యుదయ రూపానికి ప్రతీక. "నిప్పుబట్ట కట్టిన" కల్పనా స్థానంలో, కవి అందించిన ఎరుపు చేలాల వాస్తవాకృతి, రచనకు వ్యంగ్యభాసురత్వాన్ని కలిగిస్తూంది. ఒకమారు అంతర్విలోకనం చేస్తే నగ్నత్వంలో సహజత్వమూ, ఉరకడంలో స్వేచ్ఛ, నిప్పుబట్టలో తేజస్స్వరూపం వేదనలో సృజనాత్మక మనో లక్షణం, ఎరుపు చేలాల్లో కవిత్వావిస్కార రూపం భావింపజేసే శక్తిసంపన్నంగా రచన ప్రత్యక్షమౌతుంది.

అనేక సందర్భాల్లో తాత్త్విక దృక్పథంతో సాగిన వ్యాఖ్యానమూ మరవడానికి వీల్లేదు. "కదల్లేని వృక్షంవలె కాలం అక్కడక్కడా పెరగ్గలదా? కాలం కదలందికాదు, అక్కడక్కడా కాస్తకాస్త పెరిగేదీ కాదు. కాలం అప్రతిహతమైన గతిశీలం కలదీ, పరిణామమైన రూపం కలదీ. మానవుని ప్రయాణంలో సుళ్ళు సుళ్ళుగా తిరిగినా, బ్రతుకులో చిక్కులు ముళ్ళుముళ్ళుగా పడినా, ఏ మాత్రం ఆగేది కాదు. ఒక క్రమగతితో అఖండంగా, చైతన్యరూపాన్ని భావింపజేస్తుంది. ప్రకృతికతీతమైందీ, అనుభవైక మాత్రమైందీ. ఈ చింతనా సంస్కారం విశేష స్థితిలో విశ్వజనీన దశకు చేరువగా ఉత్తమ కవిత్వంలో అనివార్యంగా కన్పిస్తుంది.

మొదట పేర్కొన్నట్లు ఈతని సామాజిక స్పందనం రెండు ముఖాలుగా విలసించేది. అభ్యుదయ భావన - మానవతాదృక్పథం అనేవి, ఒకదాని కాంతి మరోదానిపై ప్రసరిస్తూ కవి సమసమాజ వ్యవస్థా లక్ష్యానికి పుష్టిని చేకూరుస్తోంది. ఇక కవితాతత్త్వం - శిల్పానికి గల స్థానాన్ని మరువకుండానే వేదనాదీప్తిని కలిగింది. జీవితంలో విజ్ఞానమూ, వివేకమూ, కళారూపమూ, వాస్తవస్థితిలో "మానవుడు మానవుడు" గా భౌతిక మానసిక భూమికల్లో సంపూర్ణమైన వికాసాన్ని పొందడానికి చేసే కవి ప్రయత్నం- ఆ నవీనభావనా రూపమే ఈ లేబోరేటరీ.

## 8. అధివాస్తవికత

భౌతిక మానసికమైన భూమికల్లో నిర్మాణ శిల్పంగల కవిత "మేల్కొన్న మనిసిని చూడ్డానికి వెళ్ళుతున్నాను" ఈ ఖండిక చివరిపాదమే దీని శీర్షిక. ఇందులో కవి ఒక పాత్రగా, నిఖిల మానవప్రతినిధిగా కన్పిస్తాడు. దీని నిర్వహణం వ్యక్తావ్యక్తమైన మనస్స్థితిలో వ్యంగ్య విలసితమైంది. కవి మనస్తత్త్వ చిత్రణాత్మకమైన నిర్మాణ ప్రతిభను దర్శింపజేసేది. ఇందులోని బాహ్యమైన రూపం వేరు. ఆంతరమైన రూపం వేరు. చదువుతూ ఉంటే సామాన్యార్థం వెనుకనుండి విశేషార్థస్ఫూర్తితో మనస్సునావరించిన ఆశావహమైన

కాంతిరూపం అనుభవానికి వస్తుంది. మధ్య మధ్య అమూర్త (abstract) లక్షణమూ లేకపోలేదు. రచన సాంద్రమైన భావరూపాలతో కూడివున్నా ప్రతీకాత్మకమైన గతిలో కవి నైపుణ్యం వల్ల అక్లిష్టంగా ఆవిష్కృతమైంది. స్పష్టత దాశరథి సహజమైన కవితా గుణమైనా భావనలో గాఢత్వం కలిగిఉన్నప్పుడు, అర్థాంతరం విశేషమైన స్ఫూర్తిచకితంగా ఆవిష్కృతమయ్యేప్పుడు ఏదో విధంగా స్పష్టతమై మంచుపొర ఆవరించక తప్పదు. ఈ సన్నని మంచుపొర అందాన్నీ ఆకర్షణనూ ఒకప్పుడు ఇస్తుంది. ప్రతిభాకాంతి ప్రసారం చేత శిల్పవైభవాన్ని పొందుతుంది. ఒకదశలో అనుభవ విశేషాన్ని అనుమడింపజేస్తోంది. ఈ లక్షణం అర్థాంతరానికి గభీరతను కలిగించేంతవరకు గుణంగానే పర్యవసిత మౌతుందనడంలో సందేహం లేదు. కవి ఉద్దేశాన్నిబట్టి దోహదకారిగా పరిణమించడ మనేది మనస్తత్వ ప్రధానమైన కవితలో ఉన్నదే. ఈ కవిత చదివేప్పుడు అనుభవ ప్రసార కాంతిలో విశేషార్థం స్ఫుటమౌతూ ఉంటుంది. ఒక ఆలోచన తరువాత మరొకటి తరంగాలవలె క్రమిస్తూ, చదవడం ముగించగానే తీరానికి చేరినట్లుంటుంది. ఇది మొదటిదశ. రెండోది తీరం చేరగానే మనస్సులో కదలే ప్రయాణానుభవస్మృతి చిత్రం వంటిది. ఫ్రాయిడ్ చెప్పిన పూర్వచైతన్య (ఆజీలి-బీళిదీరీబీరిళితిరీ) దశలోని లక్షణం, ఆ లక్షణం ఒక విషయం అప్పుడు తెలిసి ఉండకపోయినా మరోక్షణంలో వెంటనే బుద్ధికి గోచరించే అనుభవరూపం గుర్తించవచ్చు.

> **"చెట్లు నడిస్తే ఎంత భయంకరమో**
> **అట్లా చీకట్లు నడుస్తున్న ఈనాడు**
> **అంతా నిదురపోతున్నారు నీడల్లో**
> **కాలరాక్షసి అడుగుజాడల్లో"**

చీకట్లు నడుస్తూన్నవి. ఈ భావచిత్రం కవితా నిర్మాణం యొక్క ఆరంభరూపం. చీకట్లు ఎప్పుడు నడుస్తూన్నవి? ఈనాడని సమాధానం. చీకటి వచ్చేది ప్రకృతిలో కాలగమనం చేత, రోజూ సూర్యాస్తమయం తరువాత అయితే ఈనాడేమిటి? కవి ఇక్కడ సాధారణమైన సమయఖండాన్ని అధిగమించి దేన్నో ఉద్దేశించినట్లు స్పష్టం. చీకటి దేన్నీ కన్పించనీయదు. అన్నిటినీ కప్పివేస్తుంది. ఏదీ కన్పించకుండానే చీకటిలోనూ సమయం గడచిపోతుంది. ఇదమిత్థమని ఏదీ నిర్ణయించడానికి వీల్లేని అజ్ఞానాకృతి చీకటి ఏమీ కన్పించకపోతే మానేరనుకుంటే, అట్లా సరిపెట్టుకోనివ్వకుండా భయపెడుతూన్నవి. ఈ భయం గాఢమైందీ, తీవ్రమైందినూ. ఇక్కడ మరో విధంగా ఒక ప్రయాణంలో కవి భావించడం జరిగింది. అదే చెట్లు నడిస్తే ఒకచోటునుండి మరోచోటికి కదులుతూంటే మరేమన్నా

ఉందా? ఇది జరిగేది కాదు. కాని ఒకవేళ జరిగితేనో చమత్కారంగా ఊహిస్తే, మెదలేది ఆశ్చర్యకరమైన ఘటనయొక్క ఘోరమైన దృశ్యం. అందువల్ల ప్రకృత భయావహ స్థితిని స్ఫురింపజేసే భావచిత్రం, గాఢమైన రేఖలతో ప్రస్ఫుతమైంది. అజ్ఞానంవల్లనో భయంవల్లనో అంతా నిదురపోతున్నారు. ఎక్కడ? అన్న ప్రశ్నకు సమాధానం కాలరాక్షసి అడుగుజాడల్లో అనే మామరో భావచిత్రం అనుసరిస్తుంది. సమయం యొక్క సుదీర్ఘమైన పరంపరారూపం కాలం. ఇక్కడ కాలం రాక్షస స్వభావాన్ని వహించి ఉంది. ఇదీ భయదమైన క్రూరమైన తత్త్వాన్ని సూచించేది. కాలం ఆగేనా? నడుస్తూంటేనే అడుగుజాడలేర్పడేది. ప్రజలు ఎక్కడివాళ్ళు అక్కడ నిశ్చలంగా పడి ఉన్నారు. ఈ నిద్రాస్థితి వారి విభీతమైన అశక&తమైన మనస్స్థితినీ సూచించకపోదు. అందరూ నిదురపోతూంటే, ఎక్కడో ఎవ్వడో మేల్కొన్నాటనీ ఎవడో అన్నమాట! అర్ధరాత్రి మేల్కొనేదెవడు? అన్న సంశయంతో విశ్వాసం కుదరలేదు. అయినా చూచి రావడం మంచిదని బయలుదేరాడు. అయితే చిత్రంగా ఒక అనుమానం వచ్చింది. అది ఇతడు మాత్రం మేల్కొని ఉన్నాడనా? లేదు. ఇదీ కలలోని ప్రస్తావనే. "కలలోనైనా మేల్కొన్నవాణ్ణి చూడ్డం ఘనవిషయం కాదా? ఈనాటి లోకంలో" అని చమత్కారమైన యథార్థస్థితి వివృతమైంది. ఇదంతా కలలోని మాటే దీన్ని ఇలా సమర్థిస్తాడు కవి. మేల్కొన్నవాడే కరువైనపుడు కలలోనైనా మేల్కొన్నవాణ్ణి చూడడం గొప్పవిషయమేను ఈ మాట వ్యక్తావ్యక్తమైన మనస్స్థితిని సూచించేది. ఒక్కొక్కప్పుడు మనస్సు స్వప్నం లేదా స్వప్నతుల్యమైన స్థితిని పొందే అనుభవాన్ని ఇక్కడ జ్ఞాపకం చేసుకోవలసి ఉంటుంది. శవం బ్రతకడం ఎంత విచిత్రమో మనం మేల్కోడమూ అంతే నిజమంటాడు. శవం బ్రతకడం అనూహ్యమూ, అసాధ్యమూనూ, ఇది ఊహ్యమూ సాధ్యంగా పరిణమించడం అంటే శవసదృశమైన జీవరహితస్థితి సూచితం. ఇది అసాధారణమైన ఘటనా విశేషమే. లేకపోతే శవం బ్రతకడానికి మహనీయమైన శక్తి ఏదో కారణం కావాలి. దీన్నే "ఎవడో కొత్త తరహా మేటి వైద్యుడు, ఏదో కొత్తతరహా ఔషధం వాడి ఉండాలి" - ఇదీ ఊహే, వ్యంగ్య స్ఫూర్తిలో వాస్తవమూ కావచ్చు. లేకపోతే ఇన్నాళ్ళుగా అలముకొన్న నల్లమందు మత్తులో జడప్రాయంగా పడిఉన్నవాళ్ళు ఒక్కమారు చీకటిలో అర్ధరాత్రి మేల్కొని, వెలుగులై విప్లవమూర్తులై క్రమించడం సాధ్యం కాదు. ఈ భావచిత్రం ఈ ఖండికకు చివరి రేఖగా కన్పిస్తుంది. మొదట చెప్పినట్లు మంచుపొరవలె ఉన్న అస్పష్టత పూర్తిగా విచ్చిపోయి స్ఫుటంగా అభిప్రాయం భాసిస్తూంది.

"ఏమైతేనేం వెళ్ళి చూచిరావడం మంచిది. మేల్కొన్న మనిషిని చూడ్డానికీ వెళ్ళుతున్నా". ఈ ఔషధం చాలా కొత్త తరహాది. అమృతతుల్యమైంది. క్రొత్త జీవనాన్ని ప్రసాదించేది. వైద్యుడూ కొత్తరకానికి చెందిన మేటి! దీన్ని ఉపయోగించే నిదానమూ బాగా తెలిసినవాడు. ఇతడు మహాత్ముడు కావచ్చు. ఈ స్ఫూర్తికీ అవకాశం ఉంది. చైతన్యశక్తికి నిలయమైన విప్లవమూర్తి కావచ్చు. కవి స్వయంగా ఒక పాత్రరూపంలో మనస్స్థితిని వ్యాఖ్యానించడం, వస్తువును పరుస్తూ ఎక్కడికక్కడ సంశయం- పరిష్కారం ఎదురయ్యే ప్రశ్న - సమాధానంతో అల్లుకొనిపోతూ చీకటి వెన్నెలవలె ప్రకాశింపజేసిన తీరు, ఆ పైన సూర్యబింబంవలె చైతన్యరూపం ఆవిష్కరించిన తీరు - రచనా శిల్ప దృష్ట్యా విచిత్రమైందీ. విశిష్టమైందీ. దీన్ని గురించి ఆలోచిస్తే నాకు దొరికిన సమాధానం ఇది.

కవి చూపిన ఆంతరమైన సంభాషణాత్మక నిర్వహణం మొట్టమొదలు పైక శిల్పానికి ఆధారరూపం. తరువాతవి అంతశ్చైతన్యంలోని ఆలోచనాకృతీ, అనుభవ దఘ్నమైన భావచిత్రాలూ రూపుదిద్దుకోవడం జరిగింది. వీటితోపాటు దృష్టి ప్రసరించవలసిన మరికొన్ని అంశాలు. 1) అధివాస్తవిక తరంగధోరణిని గుర్తింపజేయడం, స్వప్నం లేదా స్వప్నతుల్యమైన దశలను వ్యాఖ్యానించి ప్రాముఖ్యాన్ని వహింపజేయడం, ఉంది. 2) మనస్సులోని తమః ప్రదేశాలపై వెలుగు ప్రసరింపజేసి అక్కడ గుప్తంగా ఉన్న ఆలోచనా రూపాలు ఆవిష్కరించడం జరిగింది. 3) మనస్సు సాధారణమైన లౌకికమైన అదుపుల నుండి విముక్తం చేసి స్వేచ్ఛగా సంచరింపజేసి బహిర్ (exterior) వాస్తవికతను అంతర్ (Interior) వాస్తవికతను సమైక్యపరచిన అనుభవదశ చిత్రితమైంది. కవి మనస్సులో చిత్రార్పితమైన కవిత్వం వెనుక దాగిన ఆలోచనా విధానం ఇది.

## 2

ఇప్పుడొకమారు ఈ ఆలోచనా తరంగాలు దాటి తీరానికి వస్తే కన్పించే ప్రతిబింబం వేరు. చిరకాలంగా దాస్యంలో మ్రగ్గే జాతి భయదమైనస్థితీ, నిరభిజ్ఞకమైన జీవితం గడిపే దుర్దశారూపం, మనస్సు పొదలో మెదులుతుంది. వందల ఏండ్లుగా కాలం నిరంకుశంగా గడచిపోతూంటే చరిత్రలో చీకటిదారుల్లో వ్యక్తిత్వ రహితంగా జడప్రాయంగానో సదలని నల్లమందు మత్తులోనో పడిఉన్న జాతి జీవనంలో ఒక్కమారు గాంధీ మహాత్ముని ప్రబోధంతోనో, విప్లవశక్తి ప్రసరించే అంగార జీవధారతోనో విరసిన చైతన్యం కళ్ళముందు సాక్షాత్కరిస్తుంది. ఇప్పుడు ఆలోచన పల్లవించి, స్వేచ్ఛ సాహసం

త్యాగం మొదలైన ఉదారగుణాలతో రాశీభూతమైన వ్యక్తిత్వం వచ్చింది. ఇది కలలోని మాటా? అని సందేహం పడేంతగా నమ్మడానికి శక్యంగాని ఆశ్చర్యకరమైన వాస్తవరూపాన్ని ధరించింది.

దీన్ని మరింత స్పష్టీకరిస్తే, భౌతికంగా మేల్కొని ఉన్నా మానసికంగా ఇంకా నిదురవీడని జాతి మనస్తత్వం భావితమైంది. చిరకాలంగా దాస్యంలో మ్రగ్గిన జాతి జీవనంలో శుభోదర్కమైన సమయానికి నాందిగా అమృతక్షణం వచ్చింది. స్వాతంత్ర్యం సిద్ధించింది. ఈ ఊహకు బలమైన కారణం "అర్ధరాత్రి మేల్కొనడం, మనకు స్వాతంత్ర్యం వచ్చింది, అర్ధరాత్రే కదా స్వాతంత్ర్యం సిద్ధించినా జాతి మానసికంగా ఇంకా పూర్తిగా నిద్రవస్థనూ జనస్థితినీ వీడలేదన్న భావమూ సూచితమైంది. సంపూర్ణమైన జాగ్రత్స్థితిని పొంది ఉదయబింబం చూడవలసీ ఉంది. ప్రయాణం సాగించవలసీ ఉంది. ఇది మరో మరో దేశానికీ, ఇదే స్థితిలో ఉన్న జనతాశ్రేణికీ అన్వయించవచ్చు. భౌతికమైన మానసికమైన అవస్థలోని యథార్థరూపాలు ఒకదానితో మరొకటి సంబంధం కలవే. రెండూ కలసి భవిష్యత్తును తీర్చే ప్రయోజనాన్ని అభిలషిస్తాడు కవి. జడసదృశమైన స్థితినుండి మేల్కొల్పే కొత్తతరహా ఔషధం, జాతిని ఉత్తేజితం చేసేది. దీని ఉపయోగించే నేర్పుగల గొప్ప వైద్యుడు మహాత్ముడు కాకపోతే దీన్ని ఒక స్థలానికీ కాలానికీ పరిమితం చేయకుండా ఉంటే ఇలాంటి స్థితిలోనే మరో విప్లవరూపమో? చైతన్యబింబమో కావచ్చు. ఇక్కడ ఏ పేరూ, ప్రసక్తీ లేకపోవడంతో భావుకుని ఊహ పరిధీకృతం కాదు. రచన విశ్వజనీనత్వాన్నీ పొందుతూంది.

వ్యక్తి వికాసంలోనే జాతి అభ్యుదయం, మానవాళికి భవితవ్యం ఇక్కడ నిఖిల మానవ చైతన్యరూపం కవి వైయక్తిక దర్శనం వ్యక్తమౌతూంది. వ్యక్తుల సమాహారమే సమాజం కాబట్టి వైయక్తి చేతననుండి సామాజిక చేతన పరోక్షంగా ఆవిష్కృతమౌతూంది. ఇందులో వ్యక్తిచేతన సాధనంగా కవిత్వగతిలో చర్య (action) నెలకొంది. ఈ కవిత కొన్ని భావచిత్రాల సంకలనంతో మధ్యమధ్య పాత్రరూపంలో కవివ్యాఖ్యానమూ కలిగింది. కవితారేఖలతో వస్తువు మానసికమైన అంచలాలను స్పృశిస్తూ స్మృతిబింబాన్ని ప్రతిఫలించే అధివాస్తవిక కళారూపం.

# 9. ప్రతీకాత్మకత

దాశరథి ప్రతీకాత్మక కవితల్లో పేర్కోదగింది, ప్రణవంలో త్రివర్ణాలు. ఇది "ఓం ప్రజాయైనమః" అని ఆరంభమై "ప్రజాయైనమః ఓం"* ముగుస్తుంది. భారతీయ తత్త్వవేదాంత ప్రపంచంలో ప్రణవానికి గల స్థానం గురించి వేరే చెప్పనక్కరలేదు. ఇంతవరకూ సంప్రదాయసిద్ధంగా వచ్చే దేవతల స్థానంలో ప్రజల్ని నిలిపి నమస్సులు పలకడం విశేషం. ఇది ఆద్యంతాలు ఓంకార నిబంధితం కావడం కవి ప్రజలకిచ్చే ఉన్నతమైన గౌరవస్థానం స్పష్టం. ఆధునిక యుగంలో సామాజిక దృక్పథంతో ప్రజాయత్తమైన కవి మనోలక్షణాన్ని దర్శింపచేస్తూంది. రాజరిక వ్యవస్థనుండి ప్రజాస్వామ్య వ్యవస్థకు సమాజం పరివర్తనం చెందిన సమయంలో, రాజు దేవాంశసంభూతుడన్న విశ్వాసం నుండి విముక్తమై ప్రజలే సర్వశక్తిసంపన్నులన్న అభ్యుదయ భావన దీనికి వెన్నెముకగా ఉంది. ఇందులో కొత్త సమాజం కొత్త మానవుడు కొత్త ఆలోచన గతిచిత్రం ఉంది. సంప్రదాయ సిద్ధమైన ప్రతీకను ఆధునిక భావనకనుగుణంగా మలచి, అభ్యుదయాకృతిని సిద్ధింపచేయడంలో కవి ప్రతిభాస్పర్శ ఉంది.

వచ్చేది ఎవరు? ఎక్కడినుండి? ఏ స్థితిలో! ఎక్కడికి వెళ్ళేది? అన్న ప్రశ్నలకు సమాధానపూర్వకమైన వ్యంగ్యచిత్రమే ఈ రచన.

"అకార అంధకారంలో ఉకారంపుటుడుపులు వేసుకు మకారంపు మండే కాగడాతో మనిషి ఎవరో వస్తున్నాడు"

అంధకారంలో తెల్లని దుస్తులు ధరించి చేతిలో మండే కాగడాతో వస్తున్నాడు మనిషి. అంతటా క్రమ్మిన చీకటి నలుపు. ఒంటిపై దుస్తులు మాత్రం తెలుపు. దుస్తులు తెలుపైనంత మాత్రాన ఏం లాభం? దారి ఏమైన కన్పించేనా? లేదు. చేతిలోని కాగడా కాంతి తప్ప, అంతా చీకటి! దుస్తులు కేవలం అలంక్రియా మాత్రమేనా? ఉడుపులపై ప్రసరించిన కాంతి "మంచిషోగ్గా" కన్పిస్తోంది. ఇదీ స్థూలంగా ఒక వస్తునిర్మాణ భాగం. అయితే, చీకటి - అంధమైన జడమైన సమాజాన్నీ, ఆ వచ్చే మనిషి చైతన్యరూపాన్నీ, తెల్లని ఉడుపులు స్వచ్ఛమైన ప్రవృత్తినీ భావింపజేసేవి. మండే కాగడా క్రియాత్మకమైన అభ్యుదయ భావనకు నిలయం. చీకటిరాత్రి ప్రయాణాన్ని కొనసాగించేందుకు, కాగడా సాధనంగా ఉపకరిస్తోంది.

---

★ ఓంకారం, బ్రహ్మమూ, ఆత్మ, భూత భవిష్యద్వర్తమాన సర్వమూ -

అంధకారం అకారమనీ, ఉడుపులు ఉకారమనీ మండే కాగడా మకారమనీ ప్రణవాక్షరాలకు కవి తీర్చిన నవ్యమైన సంకేతరూపాలు. రూపనిర్మాణానికి తగ్గినట్లుగా క్రమంలో పదాల ఎన్నిక జరిగింది. అంధకారం, ఉడుపులు, మండే కాగడా అనీ, వీటిలోని మొదటి అక్షరం క్రమంగా ప్రణవంలో ఒక్కొక్క అక్షరాన్ని సూచింపచేసేవి. ప్రణవంలోని వర్ణాలు మూడు అ–ఉ–మ. ఇవి నలుపు, తెలుపు, ఎరుపు వర్ణస్ఫూర్తితో నిర్వహించిన తీరు తాత్త్విక జగత్తునుండి లౌకిక జగత్తుకు తిరిగిన మలుపును స్పృశిస్తుంది. "ఎటుచూచినా అకారమే ఉడుపుల్లో ఉకారం తప్ప" పరిసరమంతా అంధకారమయం. ఒక్క ఉడుపుల్లోనే ఉంది తెలుపు. చీకటి ఎంత దట్టంగా ఉందంటే మండే కాగడా లేకుండా మసలడమే కష్టంగా ఉంది. అజ్ఞానులకు నలుపూ తెలుపూ భేదం తెలీదంటాడు కవి. అందుకునేవారు అకారాన్నే ఉకారమనుకుంటూ ఉంటారు. చీకటిలో వెలుగు లేంది స్పష్టంగా ఉడుపులు కన్పించవు కూడా. ఈ వెలుగు భౌతికమైన వలయం నుండి మానసికమైన వలయానికి పరిక్రమించి – విచక్షణలో భేదాన్ని గుర్తిస్తూ – అంతస్తత్వాన్ని పరిశీలించే అంతర్ముఖాన్ని దర్శింపజేసే శక్తి కలదీ. అజ్ఞానుల సంగతి అలా వదిలేస్తే – పేదలకు నలుపూ తెలుపూ ప్రసక్తి లేదు. వారికి అకారమూ ఉకారమూ ఏ దిక్కునా కానరావు. వారికి తెలిసింది ఒక్కటే, అది మకారం. "కళ్ళల్లో మకారాలు డొక్కల్లో మకారాలు మనసుల్లో మకారాలు అంతటా మమకారాలు" ఈ మాటలు, వ్యంగ్య విలసితాలు. 'మ' వర్ణాన్ని ఆవృత్తి చేసి "మమ"కారమన్న చమత్కారమైన ధోరణిలో, మకారగాఢత్వాన్నీ కళ్ళల్లో డొక్కల్లో మనస్సులోని ఆంతర్యాన్నీ అనుభవానికి తేవడం జరిగింది. దీనికి రెండు కొసలు. ఒకటి మకారాధిక్యత, రెండోది మకారావశ్యకత. కళ్ళల్లో కోపం ఎరుపు, డొక్కల్లో క్షుధ (ఎరుపు) మనసుల్లో ప్రతీకారం (ఎరుపు) ఇది వర్గ సంఘర్షణ యొక్క ఆరంభదశ. సమాజంలో పీడితుల దుర్భరమైన స్థితిలో కోపించే చూపులతో అలమటించే ఆకలి మంటలతో, సంఘర్షణకాయత్తమయ్యే ఆలోచనతో కళ్ళూ చొక్కలూ, మనస్సులూ ఎరుపుదనం వహించాయి. పీడితుల్లోని మకార చిత్రం ఇది. మరో విధం మకారం ఎరుపు, నెత్తురు ఎరుపు, ఎరు మారితే "మకారం లాంటి నెత్తురున్నపుడు మనిషి మాట్లాడతాడు, తిరుగుతాడు. అకారంగా ఆ నెత్తురు మారిన్నాడు అతనిలో ప్రాణం అంటూ ఉండదు" – మంట నెత్తురూ మకారమే. ఈ రెండూ ఎరుపే. శరీరంలో నెత్తురు ఎరుపుగా ఉన్నపుడే జీవితానికి అస్తిత్వం ఉంది. ఎరుపు నుండి మారితే నలుపుకు తిరిగితే మనిషికి మృత్యువు తప్పదు. అలాగే మండే కాగడా నలుపుకు తిరిగితే అంటే ఆరిపోతే ప్రయాణం సాగదు. ప్రయాణం నిరంతరం సాగడానికి రాత్రి చీకటిలో కాగడా నిరంతరం జ్వలిస్తూనే ఉండాలి. లేకపోతే అంతా అంధకారమయం.

ఎక్కడ మనిషి అక్కడే! జడప్రాయమైన స్థితి ఆవహిస్తుంది. భౌతికమైన శరీరరూపానికి నెత్తురులో ఎరుపుదనం అవసరమైనట్లే మానసికంగా ఆలోచనలో అభ్యుదయ తేజమూ అవసరమన్న భావం మెదలుతుంది. "ప్రణవంలో (త్రివర్ణాలు) ప్రతిఫలించడం కద్దు, కొత్తరకం త్రివర్ణాలు ఎత్తిచూపుతున్నానిక్కడ" ఎత్తిచూపుతున్నానిక్కడ అనడంలో కవి ఆంతర్యం, మనదృష్టిని ప్రత్యేకమైన పరిశీలనవైపు ప్రసరింపజేయడమే. అకారం నలుపు, ఉకారం తెలుపు, మకారం ఎరుపు అనేవి కొత్తతీరులోవి. ఇవి క్రమంగా ఆకృతినీ, దుస్తుల్నీ, మండే జ్వాలనూ (కాంతినీ) తెలిపినా దీన్ని అధిగమించి సమాజరూపాన్నీ స్వచ్ఛమైన ప్రవృత్తినీ, అభ్యుదయ భావననూ వ్యంజింపజేసేవి.

నలుపూ తెలుపూ పరస్పరం విరుద్ధమైన ప్రకృతి గలవి. తెలుపూ నలుపూ పరస్పరం పోషకాలుగా (complimentaries) స్వీకరించడానికి వీలుంది. చీకటిలో తెలుపు దుస్తులు సరిగా కన్పించవు. దీన్ని బాగా కన్పింపజేయడానికి ఎరుపుకాంతి కావాలి. ఇక్కడ కాగడా కాంతిలో ఇది చేకూర్చింది. ఎర్రని కాంతిలో నలుపు తన వ్యక్తిత్వాన్ని కోల్పోతుంది. తెలుపుకు క్షతి లేదు. పైగా అందమూ చేకూరింది. 'షోకు'గా కన్పించడంలో ఇది సువ్యక్తం. చీకటిలో తెల్లని దుస్తులతో, చేతిలో మండే కాగడాతో వచ్చేమనిషి - వెనుకనుండి, నిరాశా నిస్పృహ దారిద్ర్యం విషాదం మూర్తీభవించిన సమాజంలో స్వచ్ఛమైన ప్రవృత్తిలో అభ్యుదయ భావనతో పురోగమించే చైతన్యశక్తి, మన మనఃఫలకంపై ప్రతిబింబిస్తుంది. చీకటిలో నిలిచిపోక, వెలుగుతో పురోగమించే ప్రయాణ సంకల్పమే దీని ఆంతర్యం.

## 10. కాల్పనిక పార్శ్వం

పునర్నవం కవిత దాశరథి కాల్పనిక పార్శ్వాన్ని దర్శింపజేసేది. ఇందులో నిర్మితమైన వాతావరణం అనుభూతి నాశ్రయించింది. ఆదర్శాన్ని బింబించేది. దీని నిర్వహణం ముఖ్యంగా అంతరమైన వర్ణనంతో భావచిత్ర సమర్పకంగా మధ్య మధ్య కవి వ్యాఖ్యానంతోనూ సాగింది. దీన్ని చదివాక మనలో నిలచే అంశాలివి. (1) పునర్నవం అంటే ఏమిటి ? (2) కవిత్వం అంటే ఏమిటి ? (3) కల్పనకు కావలసింది. (4) పురోగామి కర్తవ్యం (5) పునర్నవం - ప్రభావం. ఇవి రచనలో పైన పేర్కొన్న క్రమంలో ఉండవు. రచనలో అక్కడక్కడా ఒక్కొక్క సందర్భంలో అవసరాన్ని బట్టి కన్పిస్తాయి. కళాదృష్టితో రూపురేఖల్ని సంతరించుకునే రీతిలో సంయోజితమైనాయి. మొట్ట మొదటి మెదలే అంశం పునర్నవం అంటే ఏమిటి ? అనేది దీనికి సమాధానం కవిత మధ&యలో

ఒకచోటా, చివరలో ఒకచోటా దొరకుతుంది. కవిత చదివాక ప్రయత్నరహితంగా ఒక ఆలోచనా సరళికి సంబంధించినవన్నీ ఒక చోటికి వచ్చిచేరి, పరిశీలనా దృష్టికే విశేషణాత్మకమైన అనుభవ రూపాన్ని కలిగించడం సహజం, పునర్నవం అంటే తిరిగి కొత్తదనం వహించడం. ఇది నింగిలో నేలపై ఊహలో ప్రవర్తనలో అంతటా ఒక్కొక్క సమయంలో ఒక్కొక్కచోట దర్శనమిస్తుంది. మొదటి అంశానికి చెందిన మూడు ఖండాలు ఆకాశం భూమి మనస్సు అనే మూడు భావస్థానాల నాశ్రయించినవి.

"మనకంటే లక్షయేండ్లు పెద్దది మన నెత్తిమీదనున్న ఆకాశం దూది పింజలాంటి కొత్త మబ్బుల్లో తొంగి చూడడమే పునర్నవం" మొదటిది ఆకాశం మేఘ సంచారానికి నిలయం, మనకు పైన ఉంది మనకందనిదైనా నితంమూ అనుభవానికి వచ్చేది. యుగయుగాలుగా అదే రోజూ చూచే ఆకాశమే అయినా కొత్త మబ్బుల్లో తొంగిచూడడంలో ఉంది పునర్నవం. కొత్త మబ్బులు తొలకరినీ. దీనితో ఋతుపరివర్తనమూ భావింపజేస్తుంది. అంతవరకు గ్రీష్మంలో భూమి సంతప్తమై వాన చినుకుకోసం తహతహలాడుతూ ఎదురుచూచే సమయంలో ఆకాశాన అనుభూతిని కలిగించేది. ప్రకృతిలో జరిగే ఈ మార్పు మనస్సుపై అనివార్యమైన ప్రభావం నెరవుతుంది. రెండోది భౌతిక జగత్తు నాశ్రయించిన ఊహలో మనోజగత్తు చిత్రతమైంది. "ఆకురాలిన మనస్సులో అప్పుడే పూలు పూస్తున్నాయి. పునిర్నవం కాలం వచ్చింది. లోకం పూచింది, హర్షంలో మనోజగత్తుపై ప్రకృతి గతమైన వసంతభావన ఆరోపితమైంది. ఈ భావచిత్రంలో శిశిరం నుండి వసంతం, విషాదం నుండి ఆనందమూ, ఒకటి ప్రకృతిపరంగా రెండోది మనః పరంగానూ యోజితమైనాయి. మనస్సు ఆకులు రాల్చింది. అర్ద్రతా రహితమైందీ, పచ్చదనం నశించిందీ, కాలం చెల్లిందీ గాలికి అంటే పరివర్తనకు కొట్టుకొనిపోయింది. దీని స్థానంలో జీవం ప్రసరించేదీ, శక్తి నిహితమైందీ, కొత్త రూపంలో కొత్తఆశలతో తలఎత్తింది. కాలగతిలో శిథిలమైన పురావ్యవస్థ స్థానంలో క్రొత్త ఉదయించడం సూచితం ప్రకృతి పరంగా కొత్తదనమూ, మనఃపరంగా సంతోషమూ, సమాజ పరంగా నవ్యవ్యవస్థా రూపమూ దర్శనమిస్తాయి.

"పోవాలికృత్రిమాల చీకటి అపుడు వెలుగుతుంది. మనఃకుటి రావాలి మన నరాల్లో జవం అపుదర్థమౌతుంది. పునర్నవం ఇందులో కేవలం మనోజగత్తు పైనే దృష్టి కేంద్రీకృతమైంది. కృత్రిమాల చీకటి పోయెదెప్పుడు ? మనస్సు సహజమైన స్వచ్ఛమైన ఉదారభావంతో వెలిగినపుడు, నరాల్లో సరించే నవచైతన్యం జీవితానికీ పునర్నవం అంటే

ఏమిటో అనుభవాకి తెలుస్తుంది. కొత్తగా ఫలోన్ముఖమైన రూపానికి పరివర్తితం చేస్తుంది. పునర్నవం అంటే ఇదీ అని, నిర్మాణాత్మకంగా ఇంతవరకూ ప్రకృతిరూపం, భౌతికరూపం, మనోరూపం అనే మూడు కేంద్రాల నాయశ్రయించి కొత్తరూపం, కొత్తగదీ, కొత్త ఆలోచన అన్న భావ రేఖలతో సామాజిక స్ఫూర్తి విశేషంగా చిత్రితమైంది.

తరువాత పరిశీలించదగిన అంశం పునర్నవానికి ఈ కవిత్వానికీ మధ్య స్థాపితమైన అనుబంధం, 'పొడిగాలి దెబ్బలకు ఆకులు తునాతునకలైపోయి 'ముసలి మొగం పడిన వృక్షం మీద యౌవనం చిగిర్చడంతో జీవస్థానంలో వచ్చే నవ్య సృష్టి అనివార్యమైంది. రోజూ కనబడే నక్షత్రాల్లో కనబడని కొత్తదనం ఒకనాడు చూచి విశిష్టమైన అనందానుభూతి పొందడంలో వస్తువు పాతదైనా చూపులో ఆలోచనలో కొత్తదనంతో పొందే అనుభవం విశిష్టమైంది. మనసుమల్లె పొదల్లోంచి పసందైన వాసనలు వీచి అవి రచనలో నిలచేస్థితి, మనోగతమైన సంస్కారం అక్షరాకృతిలో కళాత్మకతను పొంది అందరికీ ఆనందాన్ని ఇవ్వడం ఆకర్షణీయమైంది. ఇక్కడ పై మూడు ఖండాల్లో కవిత్వమంటే ఏమిటన్న ప్రశ్న గురించి భావితమైన ధోరణి కాల్పనికమైంది ఇలా ఉల్లేఖించవచ్చు.

1) పరివర్తనా స్వభావంగల వస్తువులో వచ్చే జీవవంతమైన నవ్యమైన సృష్టి.

2) పరివర్తనం పొందని వస్తువులో మనచూపు చూచే ఆలోచనచేసే క్రొత్తదనం - అనుభవలక్షణం.

3) మనస్సుచేసే ఊహకూ, పొందే అక్షరాకృతికీ సంబంధం పరివర్తనం అనేది ప్రకృతి స్వభావం. ఇది జీవితంలో జీవశక్తి వికాసానికి, కొత్త రూపానికి ఆలోచనకూ హేతువైంది. ప్రకృతి నుండి కవిత్వానికీ, కవిత్వం నుండి జీవితానికి అర్థాంతరం ప్రసారమానమౌతుంది.

## 2

"అబద్ధాలాడడమంత సులభం అవదు సుమా కవిత అల్లడం అయితే హరిశ్చంద్రునంతగా అలమటించనక్కరలేదు. కావ్యకల్పనకు" - కవిత్వం అల్లడానికి చిత్తనైర్మల్యం అవసరం. దీనికి హరిశ్చంద్రుడంతగా కాకపోయినా కొంతైనా పరీక్ష తప్పదు. కొంతైనా వ్యథతప్పదు, కవిత్వంలో ఆశించే ప్రయోజనాన్నిబట్టి, లక్ష్యాన్నిబట్టి దీని సాంద్రత ఉంటుంది. లౌకికంగానూ, ఆదర్శకంగానూ బహువిధాలుగా వేదనకు కారణమైన - ఆ

'స్వచ్ఛత' అందరినీ ఆకర్షించేది, కదిలించేది. ఇక్కడ కవి స్వేచ్ఛగా స్వచ్ఛంగా లక్ష్యశుద్ధితో ప్రవర్తించేప్పుడు హరిశ్చంద్రుడు పడిన బాధలు జ్ఞప్తికి తేవడంలో అగ్ని పరీక్షనుండి మనస్సు తప్త సువర్ణమై ఔజ్వల్యాన్నిపొందే తేజోరూపం విలసిస్తోంది. ఆ బాధలోనూ అతడు పొందే మానసికమైన తృప్తే ఆనందం అటు వైయక్తికంగానూ, దాని ప్రభావంతో రచనకూ విశిష్టత చేకూరుతుంది.

తరువాత స్ఫృష్టమైంది పురోగామి కర్తవ్యం, మనిషి పురోగతికి కావలసింది కోర్కె తరువాత దాన్ని అనుసరించి ఉత్సాహమూ, ప్రయత్నమూ, అయితే లోకంలో ఇవి ఎక్కడికక్కడ ఉత్తరింపబడి అడుగు ముందుకు సాగదు. దీన్ని ఆశతో సాహసంతో జయించవలసి ఉంది. దీనికి అవసరమైన శక్తిని ఆర్జించవలసి ఉంటుంది. అది అపోలోవద్ద నేర్చుకోమంటారు.

"పోపులాంటి మతాధికారిని కూపంలోకి దొర్లించే బలాన్ని లూథర్‌వద్ద సంపాదించుకొని మౌఢ్యానికి గోరీకట్టు" మతం మానవుని కళ్ళు తెరపించి వెలుగు దారిన ప్రయాణింపజేసేదిగా ఉండాలి. కాని మౌఢ్యంతో కళ్ళు మూసేట్లుచేయరాదు. చీకటికూపంలోకి దొర్లించేదిగా ఉండరాదు. వివేకంతో మౌఢ్యాన్ని అంతరింపజేసే శక్తితో పోపులాంటి మతాధికారి కెదురుతీర్చి నిలిచిన లూథర్ సంస్కారవర్తనం సంకల్పబలం ఉదారాయశయం సూచితం, లూథర్ ప్రొటస్టెంటు క్రిష్టియన్ మత సంస్కర్త, * ప్రతి వ్యక్తీ ఆకావాదిగా ఉండాలి. అప్పుడే ప్రగతి సాధ్యం. లేకపోతే మానవ సంస్కృతి - నాగరకత కష్టాల్లో నష్టాల్లో ప్రయాణిస్తూ ఈదశకు చేరుకునేదికాదు.

★ Core of the Luther's teaching was the fargiveness of the sins, real sins. Luther Pleaded for the moderation and consideration for the moderation and consideration for the weak and restraint of violence. He was Taitan, in the age of gaints.

Encyclopedia Americana Vol vii P.862

"ఎంతైనా ఆశాశైలం నెత్తమ్ముల చెంతనిలిచి
పద్యాల పావురాళ్ళని బహుదిశల్లోకి విసకు"

ఇది శాంతికోసం ప్రయత్నాన్నీ ఆశనూ సూచించేది. స్వచ్ఛమైన దవళ వర్ణంతో ఎగసే పావురాళ్ళు శాంతికోసం మానవుడుచేసే ప్రయాణానికి ప్రతీకలు, ఆశల్లోకి విసరబడి, సుదూరమైనగతితో, శాంతికపోతాల రెక్కలకు రంగులద్ది, కాళ్ళకు గజ్జెకట్టి నేరేడు పళ్ళు తినిపించి ఆనందిస్తానంటాడు కవి. ఈ భాగంలో కవినేరుగా ప్రవేశించి మాట్లాడడం,

ఇంతవరకూ అమూర్తం (Abstract) గా ఉన్న వ్యక్తిత్వానికి మూర్త (Concrete) లక్షణాన్ని కలిగిస్తూ, అభేధాన్ని పాటించడమే. ఒక అభిప్రాయాన్ని దృఢంగా ప్రత్యయంతో చెప్పడాన్నీ, దీనికి కవి ప్రాతినిధ్యం వహించే స్థితినీ, భావింపవచ్చు. ఇది విశ్వభావనా సమర్పకమైన నిర్వహణం కలిగింది. పావురాళ్ళు రెక్కలకు రంగులద్దడంతో కళాత్మకత, గజ్జెకట్టి ఆనందించడంలో ప్రయత్నగతీ, శాంతినృత్యంతో జనపారవశ్యం. ఆలోచనకు వస్తాయి. క్రమమైన వ్యవస్థనూ, సానుబంధంతో ఉత్తమలక్ష్యానికి నిదర్శనంగానూ మనలో నిలుపుతాయి.

రూడాల్ఫ్ వాలంటినోవలె ప్రతివాడూ అందగాడు అమృతభావనా వీధిలో ప్రతివాడూ కాళిదాసు" ఒక్కొక్క దృష్టిలో ప్రతివస్తువూ అందమైందే. ప్రతి మనస్సు భావనాశీలంకలదే. అందం వస్తువును ఆశ్రయించింది. భావన మనస్సు నాశ్రయించింది. వీటిని గురించి ఎవరూ ఎప్పటికి అదమిత్థమని తేల్చిచెప్పడానికి వీల్లేనివి. వెలుగుపలై స్వయంసంపూర్ణమైనవి. ప్రతివానిలో, అతిడెటువంటి వాడైనా ఏదోవిధమైన అందం, తద్భావన తప్పనిసరిగా ఉంటుంది. కాల్పనిక గుణం నిక్షిప్తమై ఉంటుంది. ఒకటి కళాత్మకంగా ఆకర్షణశక్తినీ, రెండోది కాల్పనికంగా అనుభూతినీ, ఇస్తూ తృప్తిపరచేవి.

కవిత్వం చదివేప్పుడు కవి మేధామండలంలోని అరలు పరిశీలించి అందులో ఏమేమి చమత్కారాలున్నాయో గుర్తించాలంటాడు. పైకి కన్పించే రచన వెనుక నుండి పనిచేసిన వివిధ శక్తుల్ని పరిశీలించి అవగాహన చేసుకోవడంలో రచన పాఠకుల కత్యంత సన్నిహితమౌతుంది. ఈ అరలు వైయక్తికమై అనుభవం మొదలుకొని సిద్ధాంతపరమైన ఆలోచనవరకూ ఎన్నో కలిగిఉండవచ్చు. ఈ మేధా మండలం ఎన్నో స్మృతులకు నిలయం. ఇక్కడ పురారూపం (archetype) మొదలుకొని ఇప్పటి అనుభవముద్రవరకూ నిలీనమై ఉంటాయి మన కంటికి కన్పించే భౌతికజగత్తుకన్నా, కంటికి కన్పించని మానసికలోకం ఎంత గొప్పదో ఊహామానదండంతో కొలిచి మనస్సులో లెక్కలు తయారు చేయమంటారు, కవి ఊహ భౌతికమైన వస్తువు నతిక్రమించి మానసికలోకంపై ప్రసరిస్తుంది. దీని చిత్రణలో కాల్పనికత స్పష్టం. ఈ కవిత కవి కాల్పనికమైన సంచార లక్షణానికి ప్రాతినిధ్యం వహించేది.

పునర్నవం ప్రభావశీలం కలిగింది. ఎప్పటికపుడు కొత్తరూపాన్నీ కొత్త లోకాన్నీ దర్శింపజేసేది కొత్త అనుభవాన్ని ప్రసాదించేది. అందువల్ల దీన్ని చూచే చూపులో ఆలోచించే రీతిలో అనుభూతి పొందే రీతిలో వ్యక్తికి అవసరమైన విశిష్ట రూపాన్ని భావింపజేస్తుందీ భాగం. ఈ లక్షణం ప్రతిభావుకునిలో అంత ఇంతో బీజభూతంగానైనా ఉంటుంది. ఇది లేకపోతే అంతాశూన్యమూ నిస్సారంగానూ కన్పిస్తుంది. పునర్నవరూపం, కవిత్వస్వరూపం,

చిత్తనైర్మల్యం, పురోగామి లక్షణం, పునర్నవ ప్రభావంతో, కాల్పనికమైన వాతావరణ స్ఫూర్తి విశేషంగా సాగిన ఈ కవిత వెనుకనుండి ప్రసరించే స్పందన రేఖలివి.

(1) హేతువుకతీతమైన ఆలోచన (2) కొత్తను అన్వేషించే ఆరాటం (3) వైయక్తిక కేంద్రం నుండి సాగే ఆలోచనా ప్రసారం (4) స్వేచ్ఛా సంచారంగల మనస్తత్వం (5) భౌతిక జగత్తుకన్నా అధికంగా మనోలోకంపై దృష్టి (6) అనుభూతికి ప్రాధాన్యం (7) సంస్కరణ పురోగతి స్ఫూర్తి (8) నిఖలమానవ శాంతి సౌభాగ్యంపై పై అసక్తి, ఇవి ఈ కవితతో కాల్పనికమైన ఉన్మేష రూపాన్ని చిత్రించేవిగా భావిస్తాను.

## 11. భవిష్యద్దర్శనం

ఆశావహమైన సమాజాన్నీ అభ్యుదయగతినీ చిత్రించే కవిత "రేపటి జలపాతాలు". ఇందులో ప్రకృతి రూపమూ మానవ మనస్తత్వమూ ఆధారంగా సామాజిక పరివర్తనంతో క్రమించే జీవితరూపం ప్రవృత్తమైంది. ప్రకృతి పరమైన ఆరంభరేఖలతో, జీవితంలో అనివార్యమైన పరిణామం, దీని ప్రభావ పర్యవసానంగా భవిష్యత్తురూపమూ అవిష్కృతమైంది. ఇది ప్రకృతి చిత్రీకరణం, సామాజిక పరివర్తనం అశాలోకనం అనే మూడు ప్రసార వలయాలతో తీర్చబడింది, "మంచు కొండలు నేటివా ? హేమంత ఋతువీనాటిదా ? ఆరంభంలో ప్రకృతిగతమైనరూపం స్థగితమైంది. మంచుకొండ ఎన్ని యుగాలనాటిదో ? హేమంతఋతువూ ఈనాటిది కాదు. ఒకటి స్థిరమైంది. రెండోది కాలభ్రమణంలో ఒక పార్శ్వమై విలసిల్లే ఋతురూపం, మంచు గ్రీష్మంలో కరగిసోనలై ప్రవాహమవుతుంది. హేమంతంలో బిగిసిపోతుంది. వస్తువు ఒకటే ఋతుప్రభావంవల్ల భిన్నదశల్లో వేరు వేరు రూపాలను పొందుతుంది. అలాగే సమాజంకూడా కొన్ని దశల్లో ఏమార్పు లేకుండా జడ ప్రాయమైనస్థితిలో ఉంటూ మరికొన్ని దశల్లో పరివర్తన స్వభావంవల్ల భిన్న కాలాల్లో అనివార్యంగా సహజమైన మార్పులను పొందుంది. "వార్ధులన్నీ నేటివా ? లావాద్రవం ఈనాటిదా ?" వార్ధులూ లావాద్రవమూ నేటివికావు. వార్ధీ స్థిరమైందే. మంచుకొండకంటే భిన్నమైన స్థిరత్వం కలిగింది. ఇది సంచలనత్వమూ ఆలోలత్వమూ కలది. బహువిస్తృతమైన పరిధిలో ప్రసారమానలక్షణంతో వర్తించేది. ఇక లావాద్రవం అగ్ని పర్వతంలోలోన కుతకుతలాడి ఎపుడో బ్రద్దలై లోనుంచి పైకి ఉబికి నేలపై ప్రవహిస్తుంది. ఇది హఠాత్సంభవమైన విపరీతకృత్యానికి చిహ్నం. ఒకటి నిరంతర సంచలనత్వమూ సమాలోలత్వంతో ప్రవృత్తమయ్యే స్థితినీ, మరొకటి హఠాత్తుగా

సంభవించే విపరీతమైన పరిణామానికి లోనయ్యే స్థితినీ వ్యక్తం చేస్తాయి. ఇవన్నీ ప్రకృతిపరమైన అంశాలే. మరోవలయం మనస్తత్వపరమైంది. "కామమంటే నేటిదా ? సంగ్రామ భయమీనాటిదా ?" కామం ఈనాటిదికాదు, సంగ్రామమూ ఈనాటిదికాదు. ఏనాటి నుండో వస్తూన్నవి. కామ మంటే కోరిక. కోరికతోనే జీవితం మొదలు. ఈ కోరికలోకదానితో ఒకటి అల్లుకొని అనంతంగా విస్తరించి ఉంటాయి. అందులో మనం ప్రధానమనుకొనేవి కొన్ని వ్యక్తినీ వ్యక్తి నీబట్టి భేదిస్తాయి. వీటిలో వైయక్తిక, జాతి, దేశం ఆపైన సర్వమానవలోకానికి సంబంధించినవి ఉండవచ్చు. వీటి నాశ్రయించి అవి తీరడానికనేక సంగ్రామాలు జరగడం కద్దు, చరిత్రలో అడుగడుగునా అనేక సంఘటనలు సాక్షాత్కరిస్తాయి. యుద్ధం సాధారణంగా సామాన్య ప్రజలకెప్పుడూ ఇష్టంఉండదు. అయినా కొన్ని యుద్ధాలు అనివార్యాలుగా అజాతికీ, దేశానికి పరిణమిస్తాయి. స్వదేశానికి ముప్పువాటిల్లితే, ప్రజలంతా యుద్ధపరిణామాలనెదుర్కొడానికి సంసిద్ధులౌతారు, అయినప్పటికి యుద్ధంవల్ల కలిగే విపరీత పరిణామాలు తప్పవు. కాబట్టి ఈ దృష్టిలో భయశబ్దం సముచితమైంది, భయభావం స్వేచ్ఛకూ వికాసానికి పురోగతికి అవరోధమైంది. కోరిక – సంగ్రామభయమూ ఈ రెండింటినీ వ్యక్తి మనస్తత్వం సామాజిక ప్రవర్తన దృక్పథంతో అన్వయించడం సులభం. తరువాతది (ప్రబోధం) – లక్ష్యమూ కళకూ సంబంధించింది.

"క్రీస్తు నేడా ? కీట్సునేడా ? హస్తిపురమీనాటిదా ? క్రీస్తు కీట్సు నేటివారు కాదు. ఒకరు ప్రవక్త, మరొకరు కవి. ఒకరి ప్రవృత్తిప్రభోధాత్మకం, కారుణ్యానికి, శాంతికీ ప్రతీక, ఇంద్రియాతీతమైన శక్తికి నిలయం, మరోకరి ఆలోచన కళాత్మకం, ఇంద్రియాత్మకమైన అనుభవానికి కళానభవానికీ ఆశ్రయం, ఇరువురూ ఈనాటివారు కాదు. అయినా ఏనాటికీ వీరి విలువలు తగ్గేవికావు. ఈ విధంగా భిన్నమైన విశిష్టమైన పథప్రవర్తనకులందరినీ వేరు వేరుగా చెప్పకపోయినా వీరిద్దరితో అందరినీ స్ఫురింపజేయడం జరిగింది. ఒకటి పరమూ – దివ్యమూ మరొకటి కాల్పనికమూ – భౌమమూ అయింది. వీరిని గ్రహించడంలో అటు తత్త్వపరమైన భావలోకానికి ఇటు కళాపరమైన రూపానికీ జీవితంలో గల స్థానాన్నీ, ప్రభావాన్నీ భావింపజేయడం కవి ఉద్దేశం, ఇకపోతే తరువాతది హస్తినాపురం, ఇదీ ఈనాటిదికాదు. ఈ నగరం ఈనాటిదికాదు. ఈ నగరం పూర్వం విలసించిన స్థలాన్ని చూచినపుడు లేదా ఆ పేరుతో మన స్మృతిపథంలో చరిత్రాత్మకమైన పౌరాణికమైన అంశాలెన్నో భావపరిచయం వల్ల పరిభ్రమిస్తాయి. సుఖమూ దుఃఖమూ హ్లాదమూ ఆర్తీ యుద్ధమూ శాంతీ పాత్రలవల్ల

సంఘటనలవల్ల మూర్తికట్టించే గాథారూపాలనేకం, నిత్యమూ మానవజీవిత శకలాలను బింబించేవి. ఇలాంటివి వివిధకాలాల్లో వివిధ దేశాల్లో జరిగినవెన్నో, ఈ చారిత్రక పౌరాణికమైన వలాయాన్ని అధిగమించి, "మనిషినేదా ? మమతనేదా ? మానవత ఈనాటిదా ? మనిషి ఉదాత్తమైన వ్యక్తిత్వానికి మూలభూతమైన అంతరగుణాలు మమత – మానవత అనేవి. ఈ వలయం నిఖిల మానవముఖ పార్శ్వాన్ని దర్శింపజేసేది. నాటివన్నీ ఏదో ఒక రూపంలో ఈనాడూ తటస్థపడతాయి. లేదా స్మృతిపథంలో ప్రభావాన్ని నెరవుతాయి. అయినప్పటికీ నాటికి నేటికీ భేదం ఉంది. దీన్ని మన అనుభవంలో స్పష్టంగా చూడవచ్చు దీన్నే కవి విస్తృతమైన అవలోకనంతో ఈనాటికీ రేపటికీ ఉండే భేదాన్ని గుర్తింపజేస్తూ రేపుమాత్రం కాలదేవత చూపులో తేడాలు వస్తాయంటాడు, మార్పు అనివార్యం అవసరమూ, ఇది అవసరాన్నిబట్టి లక్ష్యాన్నిబట్టి సమాజాన్ని ప్రభావితం చేస్తుంది. ఇంతవరకూ కవి ఊహలో గతాన్ని స్మరిస్తూ సామాజిక వాస్తవాన్ని చిత్రిస్తూ భవిష్యత్తును భావించేంతవరకూ ఒక భాగం.

మరోభాగం భవిష్యత్తుపై ఆశాలోకనంతో పరివర్తనాత్మకమైన వర్తమాన చిత్రణం. "కొండదూకిన నిండువాగల గొంతుశబ్దాలు వినిపిస్తే" గిరిశిఖరం నుండి కిందికి దూకే జలపాతంలో వేగం ఉంది తీవ్రత ఉంది, సంచారశీలం కలిగింది. కాల గతికి ప్రతీక సంప్రదాయ శిఖరం నుండి ప్రవహించే పరివర్తనా రూపమూ ధ్వనితం, గొంతు శబ్దాలు పలకడంలో, కొత్త నీతులు, కొత్త చట్టాలు, కొత్త చేతలు రూపొందడం ఉంది. ఇందులో మార్పుకోరే ప్రజల అభిమతం అనురణిస్తూంది. స్వేచ్ఛ సమానత్వం అభ్యుదయ భావనతో సాంద్రమైన వాతావరణం కల్పితమైంది. ఇంతవరకూ భావనాలోకంలో విహరింపజేసే మనస్సును యదార్థభూమిపై తీసుకొని వచ్చేది రేపు వేరే రేపు వేరే "రెక్కలూడిన స్వప్న దేవత పిక్కబలసిన పేదమనిషి – వొక్కటై లోకాన్ని సాకెడి రోజు రేపే! రోజు రేపే! రేపు రెక్కలుపోయి ఎగిరే శక్తి లేక కుప్పకూలి స్వప్నం అంతరిస్తుంది. దీని స్థానంలో మెలకువలో వాస్తవం అవతరిస్తుంది. ఇక్కడ అజ్ఞానం ఉండదు. దాస్యం ఉండదు. మౌఢ్యం ఉండదు. హేతుశక్తితో శాస్త్రీయ దృక్పథంతో వివేకోదయంతో మానవుని జీవితస్వరూపం పొందే పరివర్తనం లక్షితమైంది. స్వప్నానికి, వాస్తవానికి మధ్యరేఖ అంతరించి, ఒకటై సమాజంలో అంతరాలు నశించి అంతా ఒకటిగా సుఖజీవితాన్ని గడిపే సామాజిక వ్యవస్థ ఈ కవి భవిష్యత్ దర్శనరూపం. 'రేపురేపే' అన్న ఆవృత్తిలో ఈ రేపు కేవలం కాల సూచకమైందేగాక గుణాత్మకంగానూ పొందే వైశిష్ట్యాన్ని స్ఫూర్తికి తెచ్చేది. ఈ వలయం సవేగమైన గతిశీలంతో సాంఘిక పరివర్తనా పార్శ్వాన్ని దర్శింపజేసేది.

ఈ కవిత ప్రకృతిపరంగా ఆరంభమై, భావ-స్మృతి - చిత్రాలతో మనస్తత్వ స్పర్శతో, వాస్తవ రూపంలో నవసమాజ దర్శనంతో ముగుస్తుంది. ప్రకృతి - భావ - సమాజ ముఖ పార్శ్వాలు కలిగింది. భౌతికమైన ప్రకృతిరూపం భావగతమైన మానవత - మమత, సమాజగతమైన పరివర్తనా రూపంతో ఈ మూడువలయాలనూ ఒకదానిలో ఒకటి అంతర్భవింపజేసికొన్న ప్రగతిశీల రచన - "రేపటి జలపాతాలు".

## 12. కవిదృక్పథంలో

పునర్నవం సంకలనానికి కవి వ్రాసిన 'మనసం' ఆధారంగా ఈతని కవితా దృక్పథం కొంతవరకు, అవగాహన చేసుకోవడానికి అవకాశం ఉంది. ఇందులో స్పృశించిన అంశాలను క్రోడీకరిస్తే, నాలుగు భాగాలుగా కన్పిస్తాయి. ఇవి రచనలో ఒకదానికొకటి ఆశ్రయించి అక్కడి స్థితికీ ఆలోచనకూ లక్ష్యానికి శిల్పానికి అనుగుణంగా ప్రవర్తితమై కన్పిస్తాయి.

1) అనుభవమూ - స్వేచ్ఛ 2) క్షోభ - ఉద్వేగమూ 3) భావరూపం - శిల్పం 4) మానవతావాదం - ప్రగతి దృక్పథం ఈ అంశాలను ప్రస్తుతం రేఖా మాత్రంగా పరిశీలించడం జరుగుతుంది.

వైయక్తికమైన పరిధి మొదలుకొని లోకపరిశీలనం వరకూ వ్యాప్తమైంది. 'మననం'లో "అచ్చంగా సొంత అనుభవాలు" ఇతరుల అనుభవాలు అని రెండు విధాలుగా పేర్కొనడం జరిగింది. స్వంత అనుభవాలు, లోకపరిశీలనం ప్రత్యక్షంగా పరోక్షంగా నెరపిన ప్రభావపరంపర స్మృతిపథంలో సంచరిస్తూ వీలును బట్టి ఉద్గమించి రచనలో చోటుచేసుకుంటాయి. ఇదోకవిధంగా తత్కాలీన రాజకీయ సాంఘిక సమస్యలూ వాటితో కవికిగల సంబంధంలో రచనలో ప్రముఖ స్థానాన్ని వహిస్తాయి. ఇది రెండోవిధం ఈ సందర్భంలో స్వీయమైన అనుభవాల ప్రత్యక్ష సంబంధంవల్ల తెలంగాణాపోరాట ప్రభావం, ఇతరకవులు ఇక్బాల్, ఖాజనజ్రుల్ ఇస్లాం, నెరుడా రచనలతో పరిచయం ఈతని సంప్రదాయ బంధురమైన దృక్పథాన్ని సంపూర్ణంగా మార్చివేసాయని చెప్పొచ్చు. దీనితో ఇతనిలో వెలిగే స్వేచ్ఛాతత్త్వమూ తోడైంది. స్వేచ్ఛాతత్త్వం మౌలికంగానూ అనుభవపరంపర విశేషంగానూ ఉపకరించినట్లు కన్పిస్తుంది. "నా అనుభవం మొదటి మెట్టు" ఇతరుల అనుభవాలు రెండోమెట్టు" అంటాడు. స్వేచ్ఛను అణచివేసే ఏ నియమనిబంధనలకూ కట్టుపడని మనస్తత్వం ఇతనిది. అందుకే ఇతని జీవితం ఎన్నో ఒడుదొడుకులకు లోనైంది.

ఇన్నిటా స్థిరంగా నిలువగలిగిందొక్క కవిత్వమే. దీన్ని ఈ కవి ఎంతో అర్ద్రహృదయంతో స్మరిస్తాడు "లోకంలో తలదాచుకోడానికి చోటులేని కాలంలో కవిత్వం తన కల్పలతా హస్తాలు చూసి నాకో ఇంతనీడ నిచ్చింది". మనస్సుకి ఎక్కడా లభించని తృప్తి ఇక్కడ ఛాయామాత్రంగానైనా లభిస్తుందని ఇతని విశ్వాసం అందుకే దీన్ని వదలకుండా ఉన్నానంటాడు.

ఈ మానసికతృప్తి వెనెక ఇతని కవిత్వానికి అంతరమైన ప్రేరణశక్తులు క్షోభ - ఉద్వేగం. దీని ఉద్గమనరేఖలు వైయక్తిక సామాజిక స్పందనలు, ఉద్వేగము క్షోభవల్ల రచనకు సాంద్రమైన అనుభూతి రూపం సిద్ధిస్తుంది. ఉద్వేగంవల్ల రచనలో ఉరకలెత్తే పొంగుతో ప్రవాహసదృశమైన సహజస్థితి చేకూరుతుంది. ఈ సందర్భంలో కవి మనస్సు ఎంత త్వరమాణమైందంటే ముందూవెనుకా గురించి ఆలోచించే సమయంలేదు. ఉద్వేగంలో కదలిపోవడమే ఇతని కభిమతం గతాన్ని గూర్చి ఆలోచిస్తూ కూర్చోక భవిష్యత్తులో తనకేం జరుగుతుందోన్న భీతిలేక" వర్తమానంలో ప్రతిఘటనకూ స్పందించే లక్షణం, ఒక విధంగా ప్రగతిభావనకూ వేగవంతమైన గతిని కలిగించిందనే చెప్పొచ్చు. క్షోభ, ఉద్వేగం సంతరించుకున్న అనుభూతిశిఖలు పునర్నవంలో ఎన్నో కన్పిస్తాయి. "నిప్పులో దూకే పాత వీర శైవులకీ, పీరీలు మేసే తురకలకీ నాకూ ఇందులో తేడా లేదంటాడు స్వతంత్రమైన ప్రకృతికనుగుణంగా 'వర్తమానంలో ఇష్టం వచ్చినట్లు చేస్తా" నంటాడు. 'వర్తమానం' సమకాలీన స్థితికీ సంఘటనలకూ కంపించే కవిస&పందన శక్తినీ, "ఇష్టం" స్వేచ్ఛా భావనతో కూడిన మానసిక లక్షణాన్నీ సూచించేవి సమాజంలో దుస్థితినీ దుర్నీతినీచూచి ఎదిరించే ఈతని మౌలికమైన మనస్తత్వబీజంనుండి క్షోభ- ఉద్వేగం అన్న రెండు అంకుర పార్శ్వాలలో కవితా రూపం ఉద్గమిస్తుంది. ఇది జైల్లో రైల్లో బాటలో తోటలో కత్తుల మధ్య పూగుత్తుల్లో ఓటమిలో ఆశలో భిన్న ప్రకారాలుగా రూప వికాసాన్ని పొందింది. ఏదో చెప్పాలనే కోర్కెతోపాటు చుట్టు ప్రక్కల ఉన్న మనుషులూ వాళ్ళ క్రియాకలాపాల్లో ఆసక్తీ, కనబడే లోకంలో కనబడని లోకంపై అకాంక్ష, ఆకారంమీద అనురాగం, గుండెను కవ్వించి కలం పట్టించాయి. ఇక్కడ కనబడేలోకం వాస్తవస్థితినీ కనబడనిలోకం మనోజగత్తునీ నిత్రించేవి. భావనలు వాస్తవికతపైనా కల్పనతోనూ రూపొందిన లక్షణం స్పష్టం. ఇతని దృష్టిలో రచనకు, వ్యుత్పత్తీ - భావనాబలం - శిల్పం అవసరం, ఇవి నిరాక్షారాలకు ఆకారాలు పోస్తాయంటాడు. ఈ సందర్భంలో కవిత్వం రూపొందే (Poetic Process) దశను గురించిన ప్రస్తావన గమనించదగింది. "గుండె దడలో గణాలు గుణించుక రాయాలి ఊపిరి లెక్కించుకోవాలి. పొంగు కొలవాలి".

మనస్సులో కదలేభావానికి రూపం సిద్ధించేప్పుడు ప్రయత్నశీలమైన కవి శిల్పదృష్టీ, దీనిని సహజమైన హృదయానుభూతి కనుగుణంగా మలచుకొనే ధోరణీ చూడవచ్చు. సాంద్రమైన అనుభూతితో శిల్పసుందరంగా కవిత్వం చెప్పడానికి ఉత్సాహపడతాడు. వచనంకన్నా కవిత్వం పలకడమే ఇతనికిష్టం. దీనికి కారణం చెబుతూ నాకు స్థలాన్ని ఆక్రమించడంమీద నమ్మకంలేదు. కాలాన్ని ఆక్రమించడం మీద నమ్మకంలేదు. కాలాన్ని ఆక్రమించాలనే తప్ప" అంటాడు. అందుకే లోకంలో ఎక్కడా పొందని తృప్తి కవిత్వం నీడల్లో ఇతని మనస్సు పొందుతుంది. బ్రతుకు బరువుతోనున్న మనస్సు కవిత్వంలో మునిగినపుడు తేలిక పడుతుందనీ, కవిత్వం తనపై నెరపే అసాధారణ ప్రభావాన్నీ వివరిస్తాడు. ఈ సమయం మానసికంగా విశిష్టమైన అనుభూతిమయమైంది. "ఈ స్థితిలో ఊహలకు సంగీతం చేర్చినంత తేలిగ్గా" హ్లాదైక మయమౌతుంది. సంగీతం నాదమయమూ, సంచార ప్రసార శీలంకలదీ, ఒకచోట నిల్వకుండా సదాప్రయాణించడమే దీని స్వభావం, ఇక్కడ చెవికిందపైన కళాస్వరూపాన్ని ఊహకన్వయించడంలో అనుభూతి పారమ్యం ఆలోచనాత్మకమౌతుంది. దీని ప్రభావాన్ని ఇలా అనుభవపూర్వకంగా విశ్లేషించడం జరిగింది. మొదట ఉచ్ఛ్వాసంలో చొరబడి కవిత్వం గాలికంటే ముందుగా నరాల్లో పాకిపోయి ఏది అందుకోలేని ఆత్మకు తాకుతుంది. ఆత్మను స్పృశించడంలో అనుభూతిస్థితిపై కవిదృష్టి స్పష్టం, మనస్సు బుద్ధి మొదలైన దశలనతిక్రమించి సంకల్పానికి ఆలోచనకూ అతీతమైన విశిష్టరూపంలో ప్రసరించే కవితాస్ఫూర్తి చిత్రితం.

ఇతనిలో సేచ్ఛాతత్త్వంతోపాటు నిబిడమైన విశ్వజనీన దృక్పథం, నూతన సామాజిక వ్యవస్థకు చెందిన అవగాహనతో ప్రగతిశీల దృక్పథానికి విస్తృతినీ వైవిధ్యాన్ని సంతరింపజేసింది. ప్రగతివాదంలో మానవతాభావం అనివార్యంగా పరిశీలనకు వస్తుంది. ఈతని కవితాసౌధ నిర్మాణానికి 1) వ్యక్తికీ సంఘానికీ గల చుట్టరికం, 2) ప్రకృతికీ మనిషికీ గల సంబంధం, 3) నవసృష్టికోసం కృషీ – ఇవి వాస్తుశాస్త్రంలో తోడ్పడినాయి. ఇంకా మరిరెండు 4) సొంత అనుభవాలు, 5) ఇతరుల అనుభవాలు అంతర్గతంగా తోడ్పడినాయి. ఇందులో ఉన్న ప్రకృతి–నవసృష్టీ–వ్యక్తీ–సంఘం అనే నాలుగు అంశాలపై నున్న ఇతని దృష్టి ప్రకృతిలో నవసృష్టివైపు, వ్యక్తి నుండి సంఘంవైపు ప్రయాణిస్తుంది. ఇతని కవిత్వం జీవితంలో అసామాన్యమైన స్థితీ సంఘటనపరంగా ప్రతిస్పందితమైన అనుభూతిని అందుకునే emotional springs పై రూపొందింది. ఇందులో కాల్పనిక వాతావరణమూ అప్పుడప్పుడూ చోటుచేసుకోవడమూ జరిగింది. దీనికంతటికీ కేంద్రం మానవుడే 'మనస్సుకూ మనస్సుకూ చుట్టరికం హెచ్చి, మనిషికీ మనిషికీ రాగబంధం'

ఏర్పడుతుంది. ఈ రాగబంధానికీ కవిత్వానికీ అవినాభావ సంబంధం ఉంది. దీనితో కవిత్వం "అమృత"రూపాన్ని పొంది మానసికంగా శాంతిని ప్రసాదిస్తుందని ఈతని విశ్వాసం. ఈ శాంతి నిజానికి పురోగమన లక్షణం గల వ్యవస్థలోనే సాధ్యమన్న నిశ్చయ భావమూ రచనలో కన్పిస్తుంది. దీన్ని ఈ కవిత్వంలో "వ్యక్తిపరమైన అంశానికి స్థానం ఉంటూనే, 'సంఘ' పరమైన వస్తువుతో నిర్మితమైన రూపాన్ని తేలిగ్గా ఊహించవచ్చు. మానవతా దృక్పథంతోపాటు సమాజంలో మార్పును కోరే ప్రగతిభావన ఈతని కవిత్వానికి దిక్సూచి.

అనుభవమూ - స్వేచ్ఛ కవిత్వానికి కొత్త మలుపును తెచ్చాయి. క్షోభ- ఉద్వేగం కవిత్వం పొందే అనుభూతి దశలను పెంచాయి. భావరూపం - శిల్పం కవిత్వానికి కావలసిన ఆకృతినీ, ఆకర్షణనూ సంతరించి పెట్టాయి. మానవతా వాదం - ప్రగతి దృక్పథం కవిత్వానికి ప్రయోజనపరమైన విస్తృతిని చేయికూర్చా. ఇదీ కవి దృక్పథంలో విలోకిస్తే గోచరించే కవితా స్వరూపం.

# అనుబంధం - లేఖలు

ఇందులో వ్యాసాల్ని గురించి

## మహాకవి దాశరథి స్పందన

కొన్ని లేఖలు మాత్రమే

DASARATHI

90-C, Venkatachala Mudali St.
Mylapore - MADRAS - 600 001

19-1-1976

Dear Ranga Rao,

నీవు నా గురించి స్రవంతిలో వ్యాసం వ్రాశావని ఎవరో చెప్పగా ఆ స్రవంతి కోసం హైదరాబాదు హిందీ ప్రచార సభ వేమూరి రాధాకృష్ణమూర్తిగారికి వ్రాయగా పంపారు. నేడే అందింది. చదివాను. చాలా గొప్పగా వ్రాశావు.

"తెలుగు సాహిత్యం తెలుగువారందరిదీ - ఆ తరువాత పొలిమేరలు ఎరుగని మానవలోకానిదీ" అన్న మాటలు నిత్యసత్యాలు.

పునర్నవంలోని ఎన్నో కవితలు తీసుకొని నీవు చేసిన వ్యాఖ్య బాగుంది. ముఖ్యంగా "అశ్రుదీపం" ఎవరూ స్పృశించలేదు. నీవు చాలా వివరంగా ఆ కవిత గురించి వ్రాశావు. Thanks.

నీ వ్యాసం అద్భుతంగా ఉంది. Your analysis is correct. నా కవిత ఏదో ఒక రాజకీయ సిద్ధాంతానికీ గానీ, ఏదో ఒక కవితా రూపానికి గానీ కట్టుపడి ఉండక పోవడాన్ని గమినంచినందుకు సంతోషించాను. Thanks.

మొన్న 27-1-76 నాడు శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయంలో నా కావ్యగానం ఏర్పాటు చేసాడు M.L. సభ బాగా జరిగింది. గోపాలశాస్త్రి అధ్యక్షులు. వెంకటరామారెడ్డిగారు ముఖ్యఅతిథి. నీ క్షేమసమాచారం వ్రాయించగలవు.

నీ

**దాశరథి**

P.S.

It is a very fine article - comprehensive and analytical.

DASARATHI

Phone : 423656
13(C), Film Directors' Colony
Kodambakkam, MADRAS - 600 024

31-8-1977

ప్రియమిత్రులు
శ్రీ మాదిరాజు రంగారావుగారికి

నమస్కారములు.

మీ 29-8-1977 లేఖ. Thanks.

జూన్ నెల 'స్రవంతి' నాకు వారు పంపలేదు. ఎక్కడైనా సంపాదిస్తాను. ఇంత వివరంగా ఒకొక Poem మీద వ్యాసం వ్రాయ తలపెట్టినవారు లేరు. నీకు నా యెడల గల అనురాగానికీ నీ కార్యదీక్షకీ ధన్యవాదాలు.

నేను ఇప్పుడు Market లో లేని నా పుస్తకాలను ఒక సంపుటిగా ప్రచురిస్తున్నాను.

నీ అభినందనలకు శుభాకాంక్షలకు ధన్యవాదములు.

భవదీయుడు
**దాశరథి**

---

*Kalaprapurna*
DASARATHI

Phone : 423656
13(C), Film Directors' Colony
Kodambakkam, MADRAS - 600 024

5-9-1977

Dear Brother,

నీవు పంపిన "బాల్యం - ఒక సమాలోచనం" అందింది. Thanks.

ఒక Poem ను తీసుకొని విశ్లేషణాత్మకంగా ఈ ధోరణిలో వ్రాసే నూతన ప్రక్రియను నీవే ప్రవేశపెట్టావు.

"జీవితలతాగ్రాన" అన్నదానికి నీ interpretation చాలా సమంజసంగా ఉంది. మన University కి ఒకసారి తీరుబడిగా వస్తాను.

ధన్యవాదములతో
**దాశరథి**

*Kalaprapurna*
**DASARATHI**

Phone : 423656
13(C), Film Directors' Colony
Kodambakkam, MADRAS - 600 024

5-9-1977

Dear Ranga Rao,

స్రవంతి సెప్టెంబరు సంచిక ఇప్పుడే అందింది. నీ వ్యాసం "ప్రతీకాత్మక కవిత", ప్రణవంలో త్రివర్ణాలను గూర్చినది చదివాను. అద్భుతంగా ఉంది. చాలా లోతుల్లోకి వెళ్ళావు. నీ విశ్లేషణ అనిర్వచనీయం.

Many Thanks. వ్యాసం చాలా బాగుంది.

నీ
**దాశరథి**

---

*Kalaprapurna*
**DASARATHI**

Phone : 423656
13(C), Film Directors' Colony
Kodambakkam, MADRAS - 600 024

24-9-1977

భాయీ రంగారావ్,

నమస్తే.

ఈ రోజు భారతి (సెప్టెంబర్ సంచిక) సంపాదించి నీ వ్యాసం 'దాశరథి కవితా దర్శనం' చదివాను. చాలా గొప్పగా ఉంది. ధన్యవాదాలు. "ఉషస్సంధ్య" 1950 ప్రాంతంలో వ్రాయబడినట్లు నీవు ఊహించడం సరియైనదే. వ్రాసిన సంవత్సరం - కవిత ఆఖరున వేస్తే బాగుండేది.

నీవంటి సహృదయుడు సమర్థుడు అయిన వ్యాఖ్యాత విమర్శకుడు నా కవితలోని సిద్ధాంతాలను సునిశితంగా పరిశీలించి సుగమంగా పాఠకులకు తెలియ పరచడం నా అదృష్టంగా భావిస్తున్నాను.

మెడనొప్పి ఇంకా తగ్గలేదు. ఉత్తరం సరిగా వ్రాయలేకపోతున్నాను.

క్షేమ సమాచారం వ్రాయించగలవు. కృతజ్ఞతలతో ...

నీ
**దాశరథి**

*Kalaprapurna*
**DASARATHI**

Phone : 423656
13(C), Film Directors' Colony
Kodambakkam, MADRAS - 600 024

26-12-1977

Dear Dr. Ranga Rao,

నమస్తే.

నూతన సంవత్సర శుభాకాంక్షలు. **1978** మీకు మీ కుటుంబమునకు ఆయురారోగ్య ఐశ్వర్యములను ప్రసాదించుగాక!

డిసెంబరు భారతి నిన్న దొరికింది. నీవు నా కవిత "మేల్కొన్న మనిషి..." గురించి వ్రాసిన పరిశీలనాత్మక వ్యాసం చాలా బాగున్నది. Many Thanks. ఆ కవితలోని అధివాస్తవిక చిత్రాన్ని స్పష్టంగా చూపావు, వ్యాసంలో.

కొత్తరకం మేటి వైద్యుణ్ణి మహాత్ముడుగా నీవు పోల్చుకోవడం చాలా కరెక్ట్. ఎందుకంటే ఆ హింసతో సమరం సాగించి గెలిచినవాడు అతడే ప్రపంచంలో. ప్రపంచంలో ఏ దేశంలో జరగని నూతన ప్రయోగం (కొత్తతరహా ఔషధం) మహాత్ముడే చేశాడు.

Your analysis is superb.

ధన్యవాదములు
భవదీయుడు
**దాశరథి**

*Kalaprapurna*
DASARATHI

Phone : 423656
13(C), Film Directors' Colony
Kodambakkam, MADRAS - 600 024

12-1-1978

My Dear Dr. Madiraju Ranga Rao,

నమస్తే.

నవంబరు భారతి ఈ రోజు దొరికింది. రాజోలు నుంచి తెప్పించాను.

నీవు నా "మస్తిష్కంలో లేబొరేటరీ"పై వ్రాసిన వ్యాసం అద్భుతంగా ఉంది. Kudos!

చాలా విశేషాలు చెప్పావు. ఈ వ్యాసాలన్నీ పుస్తకంగా రావాలి.

సంక్రాంతి శుభాకాంక్షలు !

Socio-realism ను గురించి నీవు వ్రాసింది thought provoking గా వుంది. నా ఆరు పుస్తకాల సంపుటి దాశరథి కవిత పేరిట అచ్చైంది. బైండు కావాలి. అంతే. కాగానే పంపుతాను.

నీ

**దాశరథి**

Note : ఇది దాశరథి "పునర్నవం"కు సంబంధించినవి. నాకు వ్రాసిన లేఖల్లో కొన్ని మాత్రమే. మిగతావి సందర్భాన్నీ, విషయాన్ని అనుసరించి ప్రచురించడం జరుగుతుంది. - మాదిరాజు రంగారావు.

సాహిత్య సమాలోచనం

Literary Criticism

# శ్రీశ్రీ మహాప్రస్థానం

మాదిరాజు రంగారావు

2026

రసధుని

సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్-28.

Literary Criticism

# SRI SRI MAHAPRASHANAM

(Sahithya Samalochanam)

by

Prof. Madiraju Ranga Rao

© : Dr. M. Santhosh Kumar

First Edition : 2001
Second Edition : 2003
Third Edtion : 2008-2009, 2013, 2018
Fourth Edtion : 2026

సమాలోచనం-6

# శ్రీశ్రీ మహా ప్రస్థానం

## అంకితం

ప్రియ సోదరుడు

డా॥ మాదిరాజు రాధాకిషన్‌రావుకు

# సూచిక

| | | | |
|---|---|---|---|
| 1. | మహాప్రస్థానం ప్రేరక శక్తులు | .......... | 257 |
| 2. | అభ్యుదయ దృక్పథం | .......... | 261 |
| 3. | ఆరంభ గీతం – ఆదర్శ రూపం | .......... | 269 |
| 4. | ఋక్కులు – సంవిధాన ప్రయోజనాలు | .......... | 272 |
| 5. | జయభేరి – విశ్వభావన | .......... | 275 |
| 6. | వాడు – పీడనశక్తికి ప్రతీక | .......... | 277 |
| 7. | వ్యత్యాసం – యధార్థ జీవిత చిత్రణం | .......... | 279 |
| 8. | రథ చక్రాలు – గతిరూపం | .......... | 281 |
| 9. | అభ్యుదయ పథం | .......... | 285 |
| 10. | "అనితర సాధ్యం" శ్రీశ్రీ "మార్గం" | .......... | 292 |

# 1. మహాప్రస్థానం - ప్రేరక శక్తులు

గురజాడ అప్పారావుతో ఆరంభమైన అభ్యుదయ కవిత్వం శ్రీశ్రీతో విస్పష్టమైన ఆకృతిని సంతరించుకుంది. సమస్యాత్మకంగాను మానవతా ప్రబోధకంగాను ఉంది, శ్రీశ్రీలో వర్గ సంఘర్షణతో విప్లవంతో సామ్యవాద పరిష్కార మార్గంగా పరిణమించింది. అంతర్జాతీయమైన అవగాహనతో నవ సమాజావతరణకు లక్ష్యంగా నిలిచింది. గురజాడ నిర్దేశించిన సాహితీ జగత్తుకు శ్రీశ్రీ నాయకత్వం వహించడంతో తెలుగు సాహిత్య చరిత్రలో వినూత్న యుగం ఆరంభమైంది. గురజాడలోని స్వేచ్ఛా (లిబరల్) భావాలు క్రమంగా శ్రీశ్రీలో మార్క్సు సిద్ధాంతంవైపుకు దారితీసాయి. ప్రభవ రచన తరువాత శ్రీశ్రీలో ప్రధానమైన మలుపుకు, గురజాడ ప్రభావం కారణమైంది, సాహితీపరంగాను సామాజికం గాను గురజాడ రచనల్లోని స్వేచ్ఛా దృక్పథం అంతకు ముందున్న కవిత్వం నుండి వేరైంది. ఇక్కడే రాయప్రోలు, గురజాడ కవిత్వ వ్యక్తిత్వాలు విభేదిస్తాయి. రాయప్రోలు సంప్రదాయ జగత్తులో ఆధునిక కవి. గురజాడ ఆధునిక జగత్తులో ప్రగతి కవి.

శ్రీశ్రీ రచనల్లో ప్రముఖమైన కృతులు మహాప్రస్థానం, ఖడ్గసృష్టి. మహాప్రస్థానంలో శ్రీశ్రీ కవిత్వంపై పనిచేసిన శక్తివంతమైన ప్రభావాలు రెండు. మొదటిది యూరోపియన్ దేశాల్లో ముఖ్యంగా ఫ్రాన్సులో 1924 ప్రాంతంలో వచ్చిన అధివాస్తవికతకు సంబంధించిన స్వేచ్ఛాతత్వం. రెండోది మార్క్సు ప్రతిపాదించిన గతి తార్కిక భౌతికవాదం, శ్రీశ్రీని మహోజ్వల వ్యక్తిగా నడిపించిన ఈ ప్రేరక శక్తుల్లో మొదటి దాన్ని అందివుచ్చుకొని రెండోది సాగింది.

అంద్రెబ్రెటన్ 1924లో స్వేచ్ఛ అన్న మాటకు అధివాస్తవికత (సర్రియలిజం) పరంగా స్పష్టంగా వ్యాఖ్యానించడం జరిగింది. ఈ సందర్భంలో ఇతడు "Liberty for the artist means first a liberation from the rules of art" అంటాడు. కళాకారుని స్వేచ్ఛ అంటే మొదట కళానిబంధనల నుండి స్వేచ్ఛను పొందడంగా భావించడం. దీనికై చేసే ప్రయత్నం అధివాస్తవికతా ధోరణులకు దారి తీసింది. దీని ప్రభావం శ్రీశ్రీ. "ఓ కవితా ! నా కవితా !" అన్న సుదీర్ఘమైన కవితలో కనిపిస్తుంది. ఇక్కడ పాత ఆలోచనలకు నిబంధనలకు స్వస్తి పలకడం, క్రొత్త ఆలోచనలతో స్వేచ్ఛా రూపానికి నాంది పలకడమే ప్రధాన లక్షణంగా కనిపిస్తుంది. పూర్వం ఉన్న సరస్వతీ దర్శనం వేరు. ఇపుడితడు భావించే సరస్వతీ దర్శనం వేరు. అక్కడ "వినువీధుల్లో విహరించే అందని అందం"లో "చటులాలంకారపు మటుమాయల నటన"తో ఉంది. ఆమెను

భూమిపై అందుకోడానికి సహజమైన నిజసౌందర్యం చూడడానికి, కవి, చీకటిలో వేదనలో క్రుక్కిన రోజులు లేకపోలేదు. ఈ స్థితి కవిలోని మానసికమైన సంక్షోభాన్ని పరివర్తన ముఖాన్నీ సూచిస్తుంది. తరువాత వరుసగా భూకంపం, ప్రభుత్వ పతనం, యుద్ధం, విప్లవం అన్నీ ఆమె విశ్వరూప సాక్షాత్కరంగా కనిపిస్తాయి. ఆపైన ఈ భూమిపై కనిపించేవి. "జవరాలి మనః ప్రపంచపుటావర్తాలు రోగార్తుని రక్తనాళ సంస్పందన, ఉరి తీయబడ్డ శిరస్సు చెప్పిన రహస్యం, సమ్మె కట్టిన కూలీలు, కూలీల భార్యలు, బిడ్డలు ఆకలి చిచ్చుల హాహాకారం ఆర్తారావం" వినిపించాయి. ఇంతవరకు వినువీధుల్లో విహరించే సరస్వతీ రూపానికి దూరమైన సామాజిక ఘటనలు ప్రజాసమస్యలు ఇందులో క్రమంగా ప్రసక్తమైనాయి. ఈ స్థితిపూర్వ కవితా వస్తు సంప్రదాయం నుండి వేరైంది. ఇవన్నీ విన్నవించబోతే, మాటలకై వెదుకాడబోతే, స్వేచ్ఛాగుణంతో ప్రత్యేకతను పొంది, క్రమించింది.

"శ్మశానాల వంటి నిఘంటువులు దాటి వ్యాకరణాల సంకెళ్ళు విడిచి ఛందస్సుల సర్ప పరిష్వంగం వదలి" "వడివడిగా వెలువడినై యెదనడుగిడి"నై, ఇందులో చెప్పబోయేది ప్రధానంగా ఇంతకు ముందు పేర్కొన్నట్లు పూర్వ కళా నిబంధనల నుండి విముక్తి పొందే తత్పరత కనిపిస్తుంది. నిఘంటువు, వ్యాకరణం, కఠినమైన నిబంధనలతో కూడిన ఛందస్సు-కవి హృదిలో ప్రసరించే భావ ప్రసారాన్ని నిరోధించేవిగా కనిపించాయి. అలాంటి శుష్కమైన కృత్రిమమైన నిబంధనల నుండి విముక్తి పొందడమే ఇతని లక్ష్యం. అంతేకాని ఈ కవిత్వంలో నిఘంటువుల్లోని శబ్దాలు, వ్యాకరణ నియమాలు, ఛందోరీతులు లేవని కాదు. ఇతడెన్నుకొన్న ఛందోరీతివేరు. ప్రత్యేకమైంది. ఇందులో ఇతనికి స్వేచ్ఛ ఉంది. తనకు తానై భావప్రసారాన్ని బట్టి ఏర్పరచుకొన్నది. ఛందస్సులో సర్ప పరిష్వంగం అన్న మాటలో అతని ఉద్దేశం స్పష్టం. ఛందస్సు రమణీయ గతి విన్యాసం వరకే పరిమితమై ఉండాలి గాని, క్లిష్టమైన నియమనిబంధనలతో సర్పం వలె చుట్టుకొని కొన ఊపిరితో ఉక్కిరి బిక్కిరి చేసేదిగా ఉండకూడదనే కవి అభిప్రాయం. మహా ప్రస్థానం రచనా కాలంనాటి శ్రీశ్రీ మనస్సు పూర్వ నియమాల్ని ఉల్లంఘించి, క్రొత్త నియమాల్ని తన రచనానుగుణంగా ఏర్పరచుకొన్నట్లు అతని రచనా శిల్పమే సాక్ష్యం. ఇవి ఇతని సృజనాత్మక శక్తికి సరిపడినవి. స్వేచ్ఛా, మనస్తత్వగతికి ఒదిగినవీ. ఏ విధంగాను రచనా స్వాతంత్ర్యానికి నిరోధం కానివి. "నా ఆకాశాలను లోకానికి చేరువగా నీ ఆదర్శాలను సోదరులంతా పంచుకునే రవ్వల జడిగా" ఊహించడంలో సూక్ష్మంగా వస్తు విన్యాసాన్ని, దృక్పథాన్ని ప్రతిబింబిస్తుంది. ఇతనికొక ఆదర్శం ఉంది. దీని అనుభవంలో సోదరులంతా భాగస్వాములు కావాలనే తహతహ కనిపిస్తుంది. ఈ

అనుభవ రూపంలో రచనలో ప్రగతి లక్ష్య పర్యవసానమే మహాప్రస్థానం ఎన్నుకొన్న కవితా వస్తువు దృష్ట్యా ప్రజల సమస్యలకు దర్పణంగా నిలిచింది.

**"నేనేదో విరచిస్తానని నా రచనలో లోకం ప్రతిఫలించి**
**నా తపస్సు ఫలించి నా గీతం గుండెలలో ఘూర్జిల్లగ"**

నా జాతి జనులు పాడుకునే మంత్రంగా మ్రోగించాలని" ఇతని ఆకాంక్షలో కవితా వస్తుశిల్ప లక్ష్యాల్ని చూడవచ్చు. ఇందులో కవితా వస్తువు ఎన్నిక, ఇది అభివ్యక్తి పొందిన తీరు ప్రయోజనం కన్పిస్తాయి. ఒకటి రచనలో లోకం ప్రతిఫలించడం, రెండోది జాతి జనులు పాడుకునే మంత్రంగా మ్రోగించడం. మొదటిది వస్తు దర్శనాన్ని, రెండోది శిల్ప రూపాన్ని భావింపజేసేవి. కవిత్వంలో ఏ నియమం, గతి విశేషం లేకపోతే ఇదెలా సాధ్యం ? అయితే ఇవి క్రొత్త పద్ధతిలో కవి స్వేచ్ఛా భావనలకు దీప్తినీ వేగాన్నీ కలిగించేవిగా ఉన్నాయి. శ్రీశ్రీ ఆంతర్యం పాత నుండి విడివడి క్రొత్తను అన్వేషించడమే ఇది భాషలో, భావనలో ఛందస్సులో స్పష్టం. మూడోది జనోపయోగం, జనహితం కలిగిందీ.

ఆంద్రే బ్రెటన్ చెప్పిన కళా నిబంధనల నుండి విముక్తి పొందడం మొదటి సోపానం. దీనితో సరిపోదు. దీనితో సమానంగా తానాశించిన లక్ష్యాలకు నిదర్శనంగా క్రొత్త సమాజ సృష్టి జరగాలి. ఇది రెండో సోపానం అందుకు – "కదిలేది కదిలించేది మారేదీ మార్పించేదీ" కావాలి ఇతడు పాతను నిరసిస్తున్నాడు. బాగానే ఉంది. అయితే కోరే క్రొత్త ఏమిటన్న ప్రశ్నకు సమాధానం "పెను నిద్దర వదలించేదీ పరిపూర్ణపు బ్రతుకిచ్చేది". ఇందులో భావ విప్లవం సామాజిక చైతన్యంగా జీవితాశయంగా నిర్దేశించడం జరిగింది. మార్పు ప్రవచించిన విప్లవ తత్వానికి ప్రతీకలుగా

**"సింధూరం రక్త చందనం బంధూకం, సంధ్యారాగం**
**ఎగరేసిన ఎర్రని జెండా కలకత్తా కాళిక నాలిక"** మొదలుగా కనిపిస్తాయి.

"వికసించిన విద్యుత్తేజం చెలరేగిన జనసమ్మర్దం" ఇవి వర్గ సంఘర్షణను, విప్లవ విజృంభణాన్ని వ్యక్తం చేసేవి. విప్లవభావనతో ప్రజల్లో కదలిక వచ్చి, సామూహిక చైతన్యంగా పరిణమిస్తుంది. పరివర్తన వారిని పురోగమింపజేస్తుంది. ఇది బ్రతుకులకు సంపూర్ణతను సాఫల్యాన్ని సిద్ధింపజేస్తుందనే ప్రగాఢ విశ్వాసం. ఈ అంతర్గత తత్వం ఈయన వ్యక్తిత్వానికి ప్రధానమైంది. ఇది " విలయావర్తపు బలవత్ ఝరవత్ పరివర్తన" ఫలాకారం. ఈ పరివర్తనమే కవి వేసిన విశేషణాల్లో సంక్షోభంతో ఆవేదనతో సమాజపరంగాను, అప్పటికి కొత్తదనంతో కవితాపరంగాను అన్వయించుకోవచ్చు. ఈ పరివర్తన ఇతనిలో ప్రధానమైన మలుపును పట్టిస్తుంది.

ఫ్రాన్సులో ఆంద్రే బ్రెటన్ వ్యాఖ్యానించిన అధివాస్తవిక ధోరణి కారణంగా కవిత్వంలో విశిష్టమైన మార్పు వచ్చింది. ఇది చిత్రకళకు ప్రాకింది. ఇతని మొదటి మానిఫెస్టో 1924లో ప్రచురితమైంది. రెండవది 1930లో వెలువడింది. మొదటిదానిలో సైకిక్ ఆటోమేషన్ ప్రధానంగా ఉంది. దీని లక్ష్యం 1) ఆలోచనల వాస్తవ రూపాన్ని ప్రకటించే ప్రయత్నంగాను, 2) ఏ విధంగాను అభ్యాసమైన అలవాటైన నియమాలకు లొంగని ఆలోచనా ప్రసారంగాను చర్చితమైంది. రెండవదానిలో సర్రియలిజం గురించి తాత్త్వికమైన విశ్లేషణ కనిపిస్తుంది. ఇక్కడ ప్రధానంగా పేర్కొనదగిన అంశం అంద్రె బ్రెటన్‌కు కమ్యూనిష్టు ఉద్యమంతో సంబంధం ఉంది. అటు పూర్వకళా నిబంధనల్ని త్రెంచుకొనే స్వేచ్ఛాతత్త్వం ఇటు కమ్యూనిజం – చేదోడు వాదోడుగా కలిసి పనిచేసిన ప్రభావం మహా ప్రస్థానంలో చూడవచ్చు. "ఓ కవితా నా కవితా" అన్న గీతంలో ఇతడు ఎదుర్కొన్న సమస్యలు, మనస్సు నుండి చెరగిపోని పూర్వ రూపం (వినువీధుల్లో విహరించే. చటులాలంకారపు నటనలుమొదలైనవి) దీన్ని వెనక్కు నెట్టి త్రోసుకొని వచ్చే నవ్యరూపం (అగ్ని సరస్సున వికసించిన వజ్రం మొదలుగా) సాక్షాత్కారంతో ఈ మధ్య స్థితీ పరివర్తన దశలోని మానసికమైన సంఘర్షణలో సంవేదనలో శిల్పీకృతమైనాయి. రచనలో సంక్షుబ్ధత్వం నుండి అవతరించే నవ్యసృష్టి ఆయా దశల కనుగుణంగా శబ్దచిత్ర సంయోజనంతో భావరూప సంవిధానంతో కనిపిస్తుంది. ఒక ఉద్రేక స్థితిలో ఈ గీతం మొదటి నుండి చివరి వరకు లయాత్మకమైన వలయాలు వలయాలుగా అత్యంత వేగ గతిలో నడవడం శ్రీశ్రీ అనితరమైన శిల్ప శక్తికి నిదర్శనం. ఇది ఈ మహాగీతం వెనుకనున్న స్పందనా రూపం. ఫ్రాన్సులో ఆవిర్భవించిన పది పన్నెండు సంవత్సరాల కాలంలోనే ఆ ప్రభావ ముద్రతో స్వయం వ్యక్తిత్వస్ఫూర్జితమైన కవిత్వం వెలువడడం గమనించదగిన అంశం. అక్కడ 1924-30 వరకు ప్రచలితమైన నూత్న కవితా స్వరూపానికి ప్రతిస్పందనంగా ఇక్కడ 1934-40 మధ్యలో వెలువడింది. అంతర్జాతీయ రంగంలో వచ్చే ప్రధానమైన మార్పులకు స్పందించి, సృజనరూపం దిద్దుకోడానికి తెలుగుదేశంలో ఉన్న వ్యక్తికి పదిపదిహేను సంవత్సరాలు చాలా తక్కువ సమయమే. 1934లో మహా ప్రస్థానం 1937లో ఓ కవితా నా కవితా 1940లో జగన్నాథుని రథ చక్రాలు వెలువడినాయి. ఈ కవితల క్రమంలో మరో ప్రపంచ స్ఫూర్తితో ఆదర్శం పరివర్తనా శీలం లక్ష్యం కనిపిస్తాయి. ఇది శ్రీశ్రీ విశిష్టమైన వ్యక్తిత్వ నిర్మితి జరిగిన కాలం.

1935లో బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీతో సంబంధాలు త్రెంచుకున్నాడు. అయితే సర్రియలిజం ప్రవచిస్తూనే ఉన్నాడు. 1936లో పారిస్‌లో సర్రియలిజంపై అంతర్జాతీయ

చర్చారూపం ఆరంభమైంది. ఈ సందర్భంగా బ్రెటన్ గురించి తెలుసుకోవాలనే ఔత్సుక్యం సహజం. ఇతడు ఫ్రాన్సు నుండి మెక్సికోకు వెళ్ళి 1941లో న్యూయార్క్ వెళ్ళాడు. 1942లో యేల్ విశ్వవిద్యాలయంలో ప్రముఖమైన ఉపన్యాసం చేశాడు. ఇది అతడు కమ్యూనిజం నుండి విముక్తి పొందిన విస్తృతమైన కళా సిద్ధాంత రూపాన్ని పట్టి ఇస్తుంది. 1947లో తిరిగి పారిస్ వచ్చాడు. ఈ ప్రయాణాల వలన పొందిన అనుభవం పరంపరతో వచ్చిన వైశాల్యం వైవిధ్యం ఇతనిలో కమ్యూనిజం నుండి విడివడిన అధివాస్తవికతా కళాత్మక శక్తిని మరింత ప్రకాశింపజేసాయి. అంతర్జాతీయ చర్చా రంగంలో కళాత్మకమైన సుస్థితికి ప్రయత్నం జరిగింది. ఈ మార్గం వేరైంది.

దీనికి భిన్నంగా శ్రీశ్రీపై కమ్యూనిజం రోజురోజుకు బలమైన ప్రభావాన్ని ప్రసరిస్తూ వచ్చింది. దీనికి కారణం ఇక్కడ జరిగే తీవ్రమైన పరిణామాలే. ప్రపంచయుద్ధ పరిణామాల వల్ల ఏర్పడిన సంక్షోభం, విదేశీ పరపరిపాలనలో క్రుంగిపోయిన దేశస్థితి. వీటి పర్యవసానం గాను ఇంకా ఇతని జీవితంలో ఎగుడుదిగుళ్ళ వల్లనూ ఏర్పడిన ఆలోచనల తీరు తెన్నులు వేరుగా పేర్కొవచ్చు. "ఓ కవితా నా కవితా" గీతంలో ప్రస్ఫుటమయ్యే స్వేచ్ఛాతత్త్వం – తక్కిన గీతల్లోను వికాస వైవిధ్యంతో కనిపిస్తుంది. ఇది శ్రీశ్రీ అపూర్వమైన వ్యక్తిత్వం పొందిన ఒక ముఖం. అభ్యుదయ సాహిత్య వికాసంలో పరిశీలనార్హమైందీ.

## 2. అభ్యుదయ దృక్పథం

శ్రీశ్రీలో స్వేచ్ఛాతత్త్వం తర్వాత పేర్కోదగిన మరో లక్షణం అభ్యుదయ దృక్పథం. 'మహాప్రస్థానం' కవితా సంపుటి ఈతని అభ్యుదయ వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగా ప్రతిబింబించేది. ఇందులో మొదటిది 'మహాప్రస్థానం', మరోది 'దేశచరిత్రలు', చివరిది 'జగన్నాథుని రథచక్రాలు' ప్రముఖంగా పేర్కోదగినవి. 'మహాప్రస్థానం' గీతంలో సమాజ పరివర్తన గతిలో వేగాన్ని సాధించే ప్రయత్నం కన్పిస్తుంది. అభ్యుదయ శక్తుల సమీకరణం జరిగింది. పురోగమన ధ్యేయమైన మరో ప్రపంచ స్ఫూర్తి చిత్రితమైంది. 'దేశచరిత్రలు' గీతంలో సామాజిక గతి క్రమంలో చారిత్రక పరిణామ దశలకు మార్పు సిద్ధాంతాల సమన్వయం కనిపిస్తుంది. 'జగన్నాథుని రథచక్రాలు' గీతంలో ప్రజాశక్తుల విజృంభణ, వర్గసంఘర్షణ, చివరకు విజయ సూచనతో కవి లక్ష్యమైన సమసమాజ స్థాపనం లక్షితమైంది. పై మూడు ప్రధానమైన రచనలతోపాటు, అవతారం, ప్రతిజ్ఞ, నీడలు, మిథ్యావాది, వ్యత్యాసం, నిజంగానే, మొదలైనవి. కవి ఆదర్శరూపాన్ని వివిధ కోణాల

నుండి వెలుగులోకి తెచ్చేవి. వస్తువు. ఎన్నికలో నిర్వహణలో క్రొత్తదనం ఉంది. లక్ష్యసాధనలో సంపూర్ణమైన కవి వ్యక్తిత్వాన్ని బింబిస్తూ వినూత్నమైన యుగానికి ఆదర్శమైందీ కృతి.

"మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది". ఇది సామాజిక ప్రబోధంతో అభ్యుదయ శక్తులకు గతినిర్దేశం చేస్తూంది. ఆలోచనకు ఉద్రేకాన్ని జతపరుస్తూంది. ఆదర్శానికి వాస్తవికతను జోడిస్తూంది. ఈ భూమికతో వ్యక్తుల్ని ఉత్తేజపరుస్తూ, సంఘర్షణతో, వర్గరహితమైన సమసమాజ పరివర్తన కాయత్తం చేసే రాజకీయ సిద్ధాంత తత్త్వంతో ఆరంభమౌతుంది.

"మహాప్రస్థానం" రచనా కాలం (1934) నాటికి ప్రపంచంలో ఆదర్శమైన వ్యవస్థలు రెండు. ఒకటి ప్రజాస్వామ్యానికి రెండోది సామ్యవాదానికి అంకితమైనవి. మొదటిదానికి అమెరికా, రెండోదానికి రష్యా నాయకత్వం వహించాయి. భారతదేశంలోనూ సామాన్యునికి సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయం చేకూర్చే, సర్వ సమానత్వం గల ఆదర్శప్రాయమైన సమాజాన్ని నిర్మింపజేయాలన్న ధ్యేయంతో సామాజికంగా, అభ్యుదయ భావప్రసారం జరుగుతూన్న కాలం. ప్రపంచయుద్ధ పర్యవసానంగా, దేశం ఆర్థిక సంక్షోభంతో విచలితమైంది. ప్రజాసమస్యల పరిష్కారానికి మార్క్సు ఆర్థిక సిద్ధాంతాన్ని అవలంబించిన దేశాలన్నీ రష్యా నాయకత్వంలో రెక్కలు సాచడం మొదలుపెట్టాయి. ఇది ఇక్కడ అక్కడ అన్న భేదం లేకుండా సంకుచితమైన దేశసీమల్ని దాటింది. జాతి వలయాలు తుడిచివేసింది. విశ్వమానవతా దృక్పథంతో, వెనుకబడిన దేశాల్లో మానవుని సమస్యల పరిష్కారానికీ పద్ధతియే మేలైందన్న భావం ప్రబలింది. ఈ కవిలోను ఈ భావం దృఢంగా నిలచింది. రెండో ప్రపంచయుద్ధంలో రష్యా పాల్గొన్న సందర్భంలో ఇతడు వ్రాసిన "ఓ రష్యా! నా రష్యా!" గేయం నిరంకుశత్వానికి వ్యతిరేకంగానే గాక, కవి ఆదర్శానికి ప్రాతినిధ్యం వహించే సామ్యవాద పక్షం పట్ల నిబద్ధతనూ అచంచలమైన ఆశాగతినీ ప్రతిబింబిస్తూంది.

రష్యా గురించి "కోటి గొంతులు నిన్ను కోరి రమ్మన్నాయి. కోటి చేతులు నిన్ను కౌగిలిస్తున్నాయి" అని ఎంతగానో ఉప్పొంగిపోతాడు. ఇందులో మేరలు మీరిన అనుభూతితో గాఢమైన మానసిక తృప్తిని పొందడం గమనించవచ్చు. ఒక లక్ష్యంతో నిశ్చలమైన అభిప్రాయాలతో నిర్మితమైన సాహితీ వ్యక్తిత్వం "మహాప్రస్థానం" అంతటా దర్శనమిస్తుంది. విశ్వజనీన దృక్పథంతో సామాన్య ప్రజల ఆశయాలకు దర్పణంగానే కాక అంతర్జాతీయమైన అవగాహనతో సాహిత్యాన్ని సిద్ధింపజేయడంలో ఇతడు చూపిన

మార్గం సాహసోపేతమైంది. తెలుగు సాహిత్యగతినీ, విలువల్నీ, లక్ష్యాల్నీ సంపూర్ణంగా మార్చివేసింది. ఇది పూర్వ సాహిత్యరూపం కన్నా సంపూర్ణంగా భిన్నమైంది. కొత్త విలువలకూ, కొలమానాలకూ ప్రయోజనానికి దారితీసింది.

## II

మార్క్సు, ఎంగెల్స్ నిరంతర కృషి ఫలంగా ఆవిర్భవించిన గతి తార్కిక భౌతికవాద స్వరూపం శ్రీశ్రీ నవ్యకవిత్వానికి అంతస్తత్వం. డైలక్టు అన్న పదం గ్రీక్ భాషా సంబంధమైంది. ప్రత్యర్థి వాదనలో పరస్పరం వ్యతిరేకించే లక్షణాన్ని గుర్తించి వాటిని పరిశీలించి పరిష్కరించి వాస్తవాన్ని బయటకి తీసే చర్యానైపుణ్యాన్ని డైలక్టు అంటారు. స్థూలంగా ఇది తర్కంతో నిర్వహించే చర్చాకళకు సంబంధించింది. ఇక్కడ వస్తువులో నిహితమైన పరస్పర వ్యతిరేకశక్తుల్ని గుర్తించి దాని మూలగతినీ, అభివృద్ధి పరిణామాన్నీ పరిశీలించ దానికి సహకరించేదిగా భావింపవచ్చు.

వస్తువు గతి స్వభావం కలిగింది. ఇది దీని అంతస్స్వభావం. పదార్థం యొక్క అస్తిత్వ లక్షణానికి నిదర్శనం. పదార్థం ఎప్పుడూ గతి సహితమైంది. గతిలో అవతరిస్తుంది. గతిలో స్ఫుటమవుతుంది. వస్తువులో మార్పు నిత్యం జరుగుతూ ఉంటుంది. జడ జగత్తులోనూ భౌతిక రసాయనికమైన మార్పులు తప్పవు. మార్పు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదు. మార్పు లేకపోతే పరిణామమే లేదు. జీవపరిణామంలో ఈ మార్పుకత్యంత ప్రాముఖ్యముంది. ఈ అంశాన్ని దృష్టిలో పెట్టుకొని 'గతితార్కిక' అన్న మాట ఉపయోగించడం జరిగింది. ఇది వాస్తవికతను గుర్తింపజేసేది. దీని స్వరూపం భౌతికమైంది. అందువల్ల 'గతి తార్కిక భౌతికవాద'మనడం జరిగింది. వస్తువూ గతీ రెండు విడదీయరానివి. ఈ గతిలో వేగం రావడంవల్ల గుణాత్మకమైన మార్పు త్వరగా వస్తుంది. ఈ సందర్భంలో మతం యథాస్థితిని సమర్థించేది కావడంవల్ల సమాజంలో మార్పుకు వ్యతిరేకంగాను ప్రగతి నిరోధంగాను భావితమైంది. ఇది యథాస్థితికి కొమ్ము కాచేదన్న అభిప్రాయంతో మత సంబంధమైనదంతా నిరసింపబడింది. గతా తార్కిక భౌతికవాదం రూపొందడానికి ఆ కాలంలో ప్రముఖ పాత్ర వహించిన పరిశోధనాంశాల్లో

1. శక్తి–నిలువలు, మార్పిడి సూత్రం
2. జీవకణ నిర్మాణ సిద్ధాంతం, మార్పు, పరిణామం
3. డార్విన్ పరిణామవాదం, అనేవి ప్రముఖమైనవి.

అయితే ఇది ప్రకృతి – మానవుడు – ఆలోచన అనేవాటిని, గతి, సంఘర్షణ, సమన్వయం అన్న సూత్రాలతో సహేతుకంగా సంయోజనపరచి సమాజపరంగా నిర్మించిన చారిత్రక పరిణామ దృష్టిగల భౌతికవాదంతో కూడిన తత్త్వంగా దృష్టికి వస్తుంది.

స్థూలంగా చూస్తే 'మహాప్రస్థానం'లో కవి విభిన్న శక్తులను గుర్తించడం జరిగింది. వీటి మూలస్వభావాన్ని, అభివృద్ధి దశల్నీ పరిశీలించి, సమీకరించి, అభివృద్ధిక్రమంలో పాతపై క్రొత్త జరిపే పోరాటాన్ని ప్రేరేపించడం కన్పిస్తుంది. అభ్యుదయ శక్తుల వికాసాన్నీ, చివరకు విజయాన్నీ నిరూపించడం గమనించవచ్చు. ఇది కవి ప్రధానమైన ఉద్దేశంగాను కనిపిస్తుంది. సామ్యవాద భావనతో నిహితమైంది.

ఈ విధం సాహిత్య జగత్తులో క్రొత్త దృక్పథంతో, సామాజిక తత్పరతను చేకూర్చింది. ఎన్నో వందల యేండ్లుగా నెలకొన్న తెలుగు సాహిత్య వ్యవస్థ అసాధారణమైన మార్పులకు లోనైంది. శ్రీశ్రీ 'మహాప్రస్థానం' అవతరణం, తెలుగు సాహిత్యంలో ఒక విశిష్టమైన ఘటనగా పేర్కోవచ్చు. ఈ మరో ప్రపంచానికి నాయకత్వం వహించడానికీ, ఎప్పటికప్పుడు క్రొత్త ఆలోచనలతో దీనిపై ప్రత్యయం విశ్లథం కాకుండా, సాహసంతో ప్రయాణించడానికీ, కళాత్మకంగానే కాక తాత్త్వికంగాను బాధ్యతాయుతమైన రచనాశీలం అవసరం. 'మహాప్రస్థానం'లో మొదటి నుండి చివరి వరకు ఈ పరివర్తన గమనాన్ని స్పష్టంగా గమనింపవచ్చు. క్రొత్తను అన్వేషించడంలో శ్రీశ్రీ ఎన్నో ప్రయోగాలు చేయవలసి వచ్చింది. ఈ అన్వేషణా క్రమంలో భాగమే ఈ కవి అధివాస్తవిక రచనలు.

## III

జీవితంలోను, కవిత్వంలోను సంప్రదాయానికీ మార్పుకూ మధ్య ఎడతెగని పోరాటం ఎప్పుడూ సాగుతూనే ఉంటుంది. సంప్రదాయానికీ మార్పు కోరే విప్లవానికీ మధ్య నిరంతరం జరిగే సంఘర్షణను వేగవంతం చేసే కవితా కళా సాధనంగా ఆవిష్కృత మైందీ 'మహాప్రస్థానం'.

"మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం" పిలిచింది. సమాజంలో వయస్సు మళ్ళిన సోదరులను ప్రక్కకు నెట్టేసి, నెత్తురు మండే శక్తులు నిండే, సైనికులై, కదలే యువలోకానికెదురయ్యే ఎడారులూ, నదీనదాలు, కొండలూ వాటిని అధిగమించి మరో లోకాన్ని చేరే స్థితి చిత్రితమైంది.

ఇంతటి నవ్యసృష్టిలోను ప్రవృత్తమయ్యే సంప్రదాయ ప్రభావం శ్రీశ్రీ సాహితీ వ్యక్తిత్వానికి శక్తినీ విస్తృతినీ కలిగించేదే కాని ఏ విధంగానూ క్షతి కలిగించేది కాదు.

ఈ శబ్దాలు ఒక్కొక్కమారు ప్రతీకలై ఒక స్థితికీ, భావానికీ వివిధచ్ఛాయల్ని ప్రవహింప చేస్తూ గాఢత్వాన్ని, నైశిత్యాన్ని, ఔజ్వల్యాన్ని సంపాదించి పెడుతున్నాయి. ఉదాహరణకు ఇందులో ప్రయుక్తమైన "హరోం హరోం హర" "ధనంజయుడు" ఇంకా ఆ తర్వాత వచ్చే "నిటాలాక్షి", "నటధూర్జటి", 'ఆదిసూకర వేదవేద్యుడు' మొదలైనవి ఆయా సందర్భాలో ఆవిష్కృతమైన విధాన్ని గమనించవచ్చు. ఇవి పౌరాణికమైన వస్తుజాలంలో చేరినవైనా, ప్రకృతస్థితిలో పరివర్తన భావానికి ఉద్ధృతినీ, వేగాన్ని, ఔజ్వల్యాన్ని, వివృతినీ కలిగింపజేసే ప్రతీకాత్మకతను సంతరించుకున్నాయి. శివుని మూడో కన్ను పగలడంలో సంఘర్షణలో చెలరేగిన విప్లవశక్తి వల్ల పాత వ్యవస్థ వినాశనం సూచితం. అలాగే 'ధనంజయుడు' అనేది సామాన్యుడు సామ్యవాద లక్ష్యంతో ధనస్వామ్య వ్యవస్థపై విజయం సాధించడం సూచితం. ఇలాగా ఎన్నో పరిశీలనకందుతాయి. శ్రీశ్రీలో సంప్రదాయ బంధురత ఎంత లోతుగానో వ్రేళ్ళుదన్నుకొని నిలిచింది. ఇతనిలో ఇది శక్తివంతమైన "నవ్య" కవిత్వాన్ని ఆవిష్కరించడానికి సహాయపడింది.

శ్రీశ్రీ దృక్పథంలో "మరో ప్రపంచం" ప్రస్తుత వ్యవస్థకు భిన్నమైంది. ఇక్కడ దీని స్వరూపం కేవలం సూచితమైంది. "రథచక్రాలు"లో వివృతమైంది. దీన్ని సాధించడ మంత సులభం కాదు. దీనికి త్యాగం, నిబద్ధత, ఆదర్శంతో పాటు సాహసం, ధైర్యం, ఉత్సాహం అవసరం. ఈ లక్షణాలన్నీ ధారా ప్రచండంగా వర్ణింపబడిన గీతం 'మహాప్రస్థానం'. వర్తమాన యుగంలో విప్లవచైతన్యంతో ఉజ్జ్వలమైన సమాజ భవిష్యత్తును ప్రతిఫలింపజేసే రచన.

'దేశచరిత్రలు' - క్రియ ప్రతిక్రియ వెనుకనున్న చారిత్రక శక్తుల యథార్థ కథనం అనవచ్చు. చరిత్రలోని మౌలికమైన సమస్యలు నూత్నదృక్పథంలో విశ్లేషించి చూచే మనస్తత్వంతో, ఇంతవరకూ మరచిన సామాన్యునిపై వెలుగు ప్రసరించడం జరిగింది. ఇది రచనకొక విశిష్టతను చేకూర్చింది. గుంపుగా జీవించే మానవుల్లో మొదటి నుండి సహకారంతో పాటు సంఘర్షణ కూడా తప్పనిసరిగా ఉండేది. భూమి, ఒనగూడిన సంపద రానురాను సరిపోకపోవడంవల్ల, విస్తరణ కాంక్ష వల్ల, అధికార తృష్ణ వల్ల బలప్రదర్శనతో సంఘర్షణ తీవ్రరూపం ధరించింది. దీనికై సైనికబలం, ఆయుధాల అవసరం, యుక్తీ వ్యూహం అవసరమైనాయి. తాము జయించిన వారిని బానిసలుగా చేసుకోవడమో లేదా చంపివేయడమో జరిగేది. సంఘంలో క్రమంగా మరో ప్రక్కనుండి డబ్బు, అధికారం, సంపద, హస్తగతం చేసుకొన్న ఒక వర్గం ఆధిపత్యం మరో వర్గంపై జరుగుతూ బలపడుతూ వచ్చింది. క్రమంగా సామాన్యుని స్థితి ఎప్పుడూ పైవారికి

ఉపయోగపడేలా ఉందే కాని ఏ మార్పు పొందడానికి అవకాశం లేకపోయింది. అప్పుడప్పుడు చరిత్రలో అవసరాల్నిబట్టి ఏదో మార్పుకు దారితీసినట్లు కనిపించినా అది చాలా స్వల్పమైంది. ఇవి రాజకీయంగా, సాంఘికంగా, ఆర్థికంగా ఒకదాని ప్రభావం మరోదానిపై ప్రసరింపజేస్తూ సమాహారంగా సామాన్యుని దుస్థితికి హేతుభూతమయ్యాయి. రాను రాను నాగరకత పెరిగిన కొద్దీ పీడకులు, పీడితుల మధ్య ఆఘాతం మరీ ఎక్కువైంది. వైషమ్యం, స్వార్థం, కౌటిల్యం అన్నీ ఇందుకు దోహదం చేశాయి. ఇప్పుడు ఇతిహాసపు చీకటికోణంలో అట్టడుగున కనిపించని కథలన్నీ పైకి తీసి చరిత్రకు వినూత్నమైన అర్థాన్ని చెప్పవలసి వచ్చింది. సమాజానికి హేతుదృష్టితో పరివర్తన గుణంలో సామ్యవాద గతిని కల్పించవలసిన అవసరం ఏర్పడింది. ఈ విశేషస్థితుల్ని దృష్టిలో పెట్టుకొని శ్రీశ్రీ తన రచనలో చారిత్రక పరిణామ దశలను వర్గసంఘర్షణ దృష్టితో విశ్లేషించి చిత్రించడం కనిపిస్తుంది.

'నైలునదీ నాగరికతలో సామాన్యుని జీవనమెట్టిది?
క్రోమాన్యాన్ గుహాముఖాల్లో మానవకథ వికాసమెట్టిది?

పురాతన నాగరకతలో బ్రతికిన సామాన్యునిపై వెలుగు ప్రసరించే పద్ధతి వల్ల చరిత్ర స్వరూపమే మారింది. దీనితో తారీఖులు, దస్తావేజులు వదలి యథార్థ జీవిత కథనంలో సామాన్యునికి విశిష్టమైన స్థానం లభిస్తూంది. ఇప్పుడు రాళ్ళెత్తిన కూలీ, పల్లకీ మోసిన బోయీ ప్రాధాన్యమేమిటో అర్థమౌతుంది. 'క్రో-మాన్యాన్' అనే పేరుతో పెద్ద గుహ ఫ్రాన్స్‌లో నెజీర్ నదీ తీరాన ఉంది. క్రో-మాన్యాన్ అంటే పెద్ద గొయ్యి అని అర్థం. 1868లో రైలుమార్గం వేసే ప్రయత్నాలు జరిపినపుడు లే ఐ జీన్ ప్రాంతంలో త్రవ్వకాల సందర్భంలో ఎన్నో పెద్ద తలలు, వెడల్పయిన ముఖాలు, ఎత్తయిన నాసికలు గల అస్థిపంజరాలు కనిపించాయి. ఇవి ఆరు అడుగుల పొడవు కలిగినవి. ఎడ్వర్డ్ లార్టే ఈ నాగరకతపై గొప్ప పరిశోధన జరిపాడు. ఆ గుహలో పై కప్పుమీద గోడలమీద దున్న మొదలైన జంతువుల చిత్రాలు కనిపించాయి. జంతువులు వలలో పడినట్లు, బల్లెం గ్రుచ్చుకొన్నట్లు, రాళ్ళతో గాయపడినట్లు చిత్రాలు ఒకదానిపై మరొకటి వేయబడి ఉన్నాయి. ఇంకా జంతువుల వేషాల్లో మనుషుల బొమ్మలు ఉన్నాయి. ఇక్కడ విలసిల్లిన సంస్కృతి పాతరాతియుగంలోని చివరిదశకు చెందిందని (క్రీ.పూ. 28,000 నుండి 10,000 మధ్యకాలం) పరిశోధకుల అభిప్రాయం. మానవ సంస్కృతుల్లో మొదటి నుండి ఇప్పటివరకు మరచిన సామాన్య మానవునిపై దృష్టితో ఈ దేశం ఆ దేశం, ఈ జాతి ఆ జాతి అన్న భేదం లేకుండా చరిత్రను అవగాహన చేసుకోవలసిన అవసరం

భావితమైంది. ఈ గీతం ఇప్పటివరకు మనం అనుసరించే విలువల్నీ మార్చివేసిందీ. సామాన్యులు కేంద్రంగా క్రొత్తదృష్టిని ఏర్పరచింది. క్రొత్త విలువల్ని రూపొందించిందీ.

"ఏ శిల్పం? ఏ సాహిత్యం ఏ వెల్లులకీ ప్రస్థానం?" అన్న ప్రశ్నలకు సమాధానమే, 'మహాప్రస్థానం'లో చివరి గీతం. పతితుల్నీ భ్రష్టుల్నీ బాధాసర్పదష్టుల్నీ దీనుల్నీ, హీనుల్నీ ఉద్దేశించింది "జగన్నాథ రథచక్రాలు".

"జగన్నాథుని రథచక్రాలు" కవిత ఎప్పటికీ అసంపూర్ణంగా ఉండిపోతుందేమో అని శ్రీశ్రీకే సందేహం కలిగింది. ఇది లేకుండా 'మహాప్రస్థానం' పూర్తికావడానికి వీలులేదు. దీన్ని తొందరడి ఏదో విధంగా వ్రాసేయ్యడానికి ఇష్టం లేదు. 'మహాప్రస్థానం' సంపుటిలో మొట్టమొదటి గీతం 'మహాప్రస్థానం' చిట్టచివరి గీతం 'జగన్నాథుని రథచక్రాలు' ఉండాలనే శ్రీశ్రీ ఉద్దేశం. ఎలాగైతేనేం అనుకున్న విధంగా 1940లో ఒకరోజు రథచక్రాలు వ్రాయడం పూర్తయింది. ఈ మాటల్లో కవి దృష్టిలో రెండు గీతాలు కలిసి భావ సంపూర్ణతను ఎలా సాధించిందీ సులభంగా గుర్తించవచ్చు. మొదటిది విప్లవ భావనతో కార్యాచరణకాయత్తపరచేదీ, రెండోది పాతదైన ప్రస్తుత వ్యవస్థ స్థానంలో క్రొత్తదైన సమసమాజస్థాపనం సాధించడానికి కార్యాచరణమైందీ. దీని తీవ్రరూపం చిత్రితమైంది. సామాజిక పరివర్తనం కోసం అభ్యుదయ చైతన్యంతో విప్లవమూర్తులుగా ఉత్తేజితం చేసి మార్పును సాధించే లక్షణం కనిపిస్తుంది. సామాజిక న్యాయం చేకూరకుండా ఇంకా అట్టడుగున పడిఉన్న పతితుల్ని, భ్రష్టుల్నీ, దీనుల్నీ, హీనుల్నీ ఉద్దేశించి కరుణోపేతమైన చిత్రణతో ఆరంభమౌతుంది. వీరి నిస్సహాయస్థితికి జాలిపడతాడు. ఓదారుస్తాడు. ఇంతటితో తన కర్తవ్యం తీరిందనుకోక వాళ్ళలో ధైర్యాన్ని, స్థైర్యాన్ని కలిగిస్తాడు. వారి సమస్యకు పరిష్కారమార్గంగా జగన్నాథుని రథచక్రాలు భూమార్గం పట్టించే ప్రతిజ్ఞ చేస్తాడు. ఈ జగత్తుకు నాథుడు ప్రజ!

సమాజంలో సంఘర్షణ అనివార్యమైన దశకు చేరుకున్నప్పుడు పీడితులు, పీడకుల మధ్య ఒక స్థితివరకు ఉన్న రేఖ చెదిరిపోతుంది. దీని పర్యవసానంగా విప్లవం విజృంభిస్తుంది. పూర్వవ్యవస్థ కూలిపోయే పరిస్థితి ఏర్పడుతుంది. మానవుడు తన చరిత్రకు తానే బాధ్యుడు. ఈ నవ వ్యవస్థా నిర్మాణంలో ప్రతి వ్యక్తికీ కర్తవ్య బాధ్యత ఉంది. సమాజ పురోగమన సందర్భంలో, సమసమాజ స్థాపనకై అభ్యుదయ శక్తులకు తద్ వ్యతిరేక శక్తులకు మధ్య సంఘర్షణ అనివార్యమై, ఇది విప్లవానికి దారితీస్తుందన్న మార్క్స్ అభిప్రాయాన్ని ఇచ్చట అనుసంధించుకోవచ్చు.

"హాలాహలం పొగచూరింది కోలాహలం చెలరేగింది" హాలాహలం తర్వాత వచ్చేది అమృతం, కోలాహలం తర్వాత నెలకొనేది శాంతి! భవిష్యత్తులో అమృతఫలం కోసం శాంతి జీవనం కోసం వర్తమానంలో జరుగుతూన్న మథనమే, ఈ సంక్షోభం, సంఘర్షణ! దీనినుండి అవతరించేది సామ్యవాదం!

స్వాతంత్ర్యం, సమభావం, సౌభ్రాత్రం పునాదులై ఇళ్ళులేచి
జనావళికి శుభం పూచి "శాంతి! శాంతి! కాంతి జగమంతా జయిస్తుంది".

అన్న ఆకాంక్ష ఈతని విధ్వంసన శీలంతోపాటు దాన్ని అనుసరించిన నిర్మాణాత్మక లక్షణాన్ని దర్శింపజేస్తుంది. ఇది మానవతా స్పర్శతోను విలసిస్తూంది. ఒక దేశం, జాతి అన్న పరిధుల్ని అతిక్రమించి, అఖిల ప్రపంచ స్థాయిలో స్పందనం ఉత్తేజం కలిగించే సృజనరూపం, ఈ గీతం. ఒక వ్యక్తి మరో వ్యక్తిని, ఒక జాతి మరో జాతిని అణచివేయనీ, పీడించనీ సామ్యవాద వ్యవస్థయొక్క ఆవిర్భూతిని సాక్షాత్కరింపజేసే ప్రయత్నరూపంగా దర్శనమిస్తుంది.

ఈ గీతాల్లో అప్పుడప్పుడే యూరోపియన్ దేశాల్లో ప్రచలితమైన స్వేచ్ఛాతత్త్వం, దీనికి సహకారంగా హేతుభావన దీనికి మార్గదర్శిగా మార్క్సు గతి తార్కిక భౌతికవాదం, ప్రభావంతో రూపొందిన వ్యక్తిత్వం, క్రొత్త యుగానికి ప్రాతినిధ్యం వహిస్తూంది. ఈ కవిత్వం లక్ష్యమైన సామ్యవాద ఆదర్శం, అంతర్జాతీయమైన ప్రభావం కలిగింది. పూర్వ సాహిత్య ప్రభావంతో, సిద్ధించిన పద్యరచనతో ఆరంభించి, భావ కవిత్వంలోకి ప్రవేశించి దీన్ని అధిగమించి అభ్యుదయ జగత్తులో స్థిరపడి, విప్లవశక్తికి ప్రతినిధిగా రూపొందిన శ్రీశ్రీ విశిష్టమైన వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగా బింబించేవీ మూడు గీతాలు.

శ్రీశ్రీ మాటల్లో "సంపూర్ణ స్వాతంత్ర్యం ఎలాగైతే ఒక ఆదర్శప్రాయంగానే ఉండి ఎన్నటికి అందుకోరానిదో అలాగే అచ్చమైన కవిత్వం కూడా ఎంత వాడికి అందరానిదే! కవిత్వమూ స్వాతంత్ర్యం ఎవ్వరికీ, ఎన్నటికి అందని అందాలే ఆదర్శాలే అయినప్పటికి వాటిని సాధించాలనే ప్రయత్నంలో, ఆ ప్రయత్నంలోని ఆవేగంలోనే, ఆవేగంలోని అశాంతిలోనే, ఆ అశాంతి నుండి ఆనందంలోనే జీవితానికి సార్థక్యం!" ఉంది. ఈ ఆలోచనతో కూడిన అన్వేషణ, తపన, క్రియాశీలం స్పందనల సమాహారమే, శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వం! మార్క్సీయం కేంద్రబిందువుగా రూపొందిన సాహితీ వ్యక్తిత్వం!

# 3. ఆరంభ గీతం - ఆదర్శరూపం

ఇది "మహాప్రస్థానం" గీతాల సంపుటిలో మొదటిది. ప్రస్థానం అంటే గమనం, ప్రయాణం. విజయయాత్రకు వెడలడం ఇంకా మరో లోకానికి ప్రయాణించడం. ఇక్కడ ఈ గమనమూ, ప్రయాణమూ మరో ప్రపంచానికి అంటే ఈ వ్యవస్థను కాదని, తిరస్కరించి దీన్ని అంతరింపజేసి ఆపైన మరో క్రొత్త వ్యవస్థలోకి ప్రయాణించడం అన్నమాట. ఇదో సామాజిక ప్రయాణం. ఇందులో ఇప్పుడు నెలకొని ఉన్న వర్గ సమాజరూపాన్ని రూపుమాపి వర్గరహిత సమాజాన్ని అవతరింపజేసే తీవ్రమైన ప్రయత్నం ఉంది. దీనివల్ల పాతశక్తుల స్థానంలో క్రొత్త శక్తులు ఎదుగుతాయి. పాత సంబంధాలు పోయి కొత్త సంబంధాలు ఏర్పడతాయి. ఈ క్రొత్తదైన మరో ప్రపంచాన్ని స్థాపించే ప్రగతిశీల ఉద్యమంలో జనచైతన్యం వర్గ సంఘర్షణ సమసమాజ దర్శనం - స్ఫూర్తి చిత్రమే ఈ గీతం. ఇది భౌతికశక్తుల పునాదిపై ఏర్పడింది. సమాజం గతి లక్షణం కలిగింది. దీన్ని ప్రకృతి శక్తులూ, భౌతికశక్తులూ పురోగమింపజేస్తాయి. సంఘర్షణమనేది సమాజం యొక్క భౌతికధర్మం. విధ్వంసంనుండి సృష్టి సహజం. భావితమైంది. ఒక దశలో అంటే చరమస్థితిలో మరో క్రొత్తరూపాన్ని పొందుతుంది. ఈ గీతం మార్క్సు గతితార్కిక భౌతికవాదానికీ సన్నిహితమైంది. ఈ గీతం వ్రాసేటప్పటికి మార్క్సు సిద్ధాంతం గురించి పరిజ్ఞానం తనకు లేదని శ్రీశ్రీ అన్నప్పటికి కవిలో అప్పటి సమాజదుస్థితి పట్ల ఆవేదన ఉద్వేగం పరివర్తన కోరే గుణంతోపాటు ఆనాడు తనకున్న అంతర్జాతీయమైన అభిలాష, ఆలోచన, అవగాహన, మార్క్సు సిద్ధాంతాలతో సంవదించే చైతన్యం గల కవిత్వం ఆవిష్కృతమైందని భావించవచ్చు. కాని రచనల్ని చూస్తే మార్క్సిజం గురించి కవిలో స్థూలమైన చింతనను త్రోసిపుచ్చలేం!

"మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది.
పదండి ముందుకు పదండి తోసుక పోదాం పోదాం పైపైకి"

ఈ మరో ప్రపంచమే క్రొత్త సమాజం. ఇది వర్గరహితమైంది. సమసమాజ భావన కలిగింది. మార్క్సు సామ్యవాద సూత్రాలపై నిర్మితమైంది. దీనికోసమే ఈ ప్రస్థానం. ఇది అనితరమైంది. అంతర్జాతీయ భావప్రేరణ కలిగింది. గతి తార్కిక భౌతికవాదం పునాదులపై వ్యవస్థీకృతమైంది. కవి మరో ప్రపంచం నుండి పిలుపు ప్రయాణ గమనానికి దిశను చూపుతుంది. ఇది క్రియాచరణమైంది.

"పదండి ముందుకు పదండి త్రోసుకుపోదాం పోదాం పైపైకి" కవి అభిప్రేతమైన ఈ ప్రస్థానం ఉత్సాహశీలమైంది. అంటే వీర రసావిష్కారమైందన్నమాట. ఇది దూరం బహుదూరంలో ఉంది. కవి అంతరంగం ఈ స్థితిలో మార్పు కోరే భావంతో అతని పిలుపుతో కార్యాచరణకు సిద్ధమయ్యే సామాజిక శక్తులతో ప్రగతిరూపం పొందింది. కవి భావన ప్రబోధరూపంలో వస్తువుతో ఐక్యాన్ని పొందడం గమనార్హం. ఇదో సంవిధానం. పిలుపుననుసరించి కవి ప్రతిధ్వనితో అభినీతమైన చలనంతో గమనంతో సంఘర్షణ, ఆ పైన విప్లదర్శనం కనిపిస్తాయి. ప్రజాశక్తి, కదం తొక్కుతూ పదం పాడుతూ ముందుకు సాగింది. అశ్వగతి సామాజికమైన విజయయాత్రను, పాటశ్రమను లెక్కచేయని మనోరూపాన్నీ, హృదంతరాళం ఉత్సాహంతో వీరభావాన్నీ స్ఫూర్తికి తెస్తాయి. గర్జించే హృదయం ప్రస్తుత వ్యవస్థపై తిరుగుబాటునూ జైత్రయాత్రలో ఆత్మవిశ్వాసాన్నీ శబ్దిస్తుంది. ప్రస్థాన దశ సంఘర్షణకు దారితీస్తోంది. రణస్పర్శను పొందుతూంది. ఈ గమనం ఉన్నత లక్ష్యంతో విజయభావనతో మహాప్రస్థానంగా పరిణమిస్తుంది.

## II

ప్రస్థానంలో మొదటి దశలో మరో ప్రపంచం జలపాత ధ్వనివలె శ్రవణ పథంలో అనుభవానికి వస్తుంది. ఇది కశ్మలమైన సమాజాన్ని క్షాళనం చేసి శుభ్రమైన వ్యవస్థను నిర్మించే మార్పుకు సంకేతమైంది. జనశక్తి "దారి పొడుగునా గుండె నెత్తురులు తర్పణ చేస్తూ" ఎన్నో బాటలూ పేటలూ కోటలూ నదీనదాలు అడవులూ కొండలు ఎడారులూ దాటుతూ నిర్నిరోధంగా పురోగమించింది. ఈ యాత్ర సీమల్ని, ఖండాల్ని దాటింది. ఈ రచన విశాలమైన అంతర్జాతీయత్వాన్ని పొందింది. ఈ పురోగతిని చుట్టూ ఉన్న ప్రకృతికీ సమాజానికీ సంబంధించిన అడ్డంకులేవీ నిలుపలేకపోయాయి. సాధనలో లక్ష్యం దగ్గరౌతున్నకొద్దీ కార్యాచరణ పట్ల ప్రియత్వమూ అధికమైంది. ఉత్సాహం ఇనుమడించింది. అంకితభావం గాఢత్వాన్ని పొందింది. ధైర్యం కవచమైంది. ఈ ప్రస్థానంలో "నెత్తురు నిండే శక్తులు మండే" సైనిక శక్తులకే స్వాగతం. జరాక్రాంతులకూ, రుజాగ్రస్తులకూ స్థానం లేదు. సోమరులకిక్కడ మృత్యువే అలంకారం. వీళ్ళపై నుండీ వీళ్ళను వదిలీ "హరో హరోం హర! హర హర హర!" యని మరో జగత్తులోకి వ్యవస్థలోకి కదిలిపోయే కదం ఇది! ఉద్రేకోత్సాహసంభృతమైంది.

ఈ లక్ష్యం అంతలో చేతికందేది కాదు. సులభంగా సాధ్యమయ్యేది కాదు. దీనికో క్రమం ఉంది. పరిణామ దశలున్నాయి. వీటిని దాటినపుడే మరో ప్రపంచం కనిపించేది. మహా ప్రపంచం చేరేది. ఇది ధరిత్రి నిండా నిండిన సమాజ భావనలో

సర్వ ప్రపంచ దృష్టి ఉంది. వివిధ జాతుల్ని మతాల్ని వర్గాల్ని వర్ణాల్ని సమైక్యం చేసే సర్వమాన సౌభ్రాతృత్వ లక్షణం ఉంది.

ప్రస్తుతానికి వస్తే ఈ సమసమాజ సామ్యవాద మరో ప్రపంచం, మహాప్రపంచం, ఈ సమాజం అణువణువూ విస్తరిస్తూ ధరిత్రిని ఆవహించేదీ. ప్రపంచతలంపై విప్లవ కార్యాచరణం కలిగిందీ. దీనికి అవని అంచులే చివరి సీమలు.

చైతన్యంతో మహాప్రజ "ప్రభంజనంవలె" హోరెత్తి, "భావవేగంతో" ప్రసరించి వార్షుక మహామేఘం వలె ఉరుములతో మెరుపులతో పెళపెళ విరుచుకుపడుతూ పురోగమించడం చిత్రితమైంది. "ప్రళయ ఘోషవలె శబ్దించడం ప్రస్తుతం నెలకొన్న పెట్టుబడిదారీ వ్యవస్థ వినాశనం సూచితం. ప్రస్థానంలో మరో (పై) దశకు చేరుకోగానే ఎదురుగా దూరంగా మరో ప్రపంచపు "త్రేతాగ్ని" కణకణలాడుతూ కనిపిస్తుంది. "కన్పడలేదా?" అన్న ప్రశ్నలో గమనంలో వివిధ పరిణామ దశలు దాటాక తప్పకుండా కనిపిస్తుందన్న సమాధానం ఉంది. త్రేతాగ్నులు మూడు. గార్హపత్యం ఆహవనీయం దక్షిణాగ్ని అనేవి. ఇక్కడ కణకణలాడే అగ్నిస్ఫూర్తి వరకే భావరూపం నియతమైంది. వైదికమైన వివరణతో పనిలేదు. సంస్కృతి గర్భితమైన పురాభావజాలం అనేక సందర్భాల్లో పరిమితుల్లో వస్తువుకూ ఆలోచనకూ, బలాన్ని ఆకర్షణనూ చేకూర్చేదిగా నిర్వహించబడింది. కవి వాచ్యం చేయని విప్లవం – "అగ్ని" భావ రూపంలో ధ్వనితమౌతుంది. త్రేతాగ్ని పరిశుద్ధమైన తేజోరూపాన్ని భాసింపజేస్తుంది. ఇందులో "జలప్రళయం" పాత వ్యవస్థను నశింపజేసే చర్యకు ప్రతీక. పురా ప్రతీకలు స్థితికీ సందర్భానికీ, భావనకూ శక్తి కేంద్రాలుగా పరిమిత స్థాయిలో ఉపయోగింపబడినాయి.

జనశక్తి చేసే తిరుగుబాటు, సంఘర్షణ ఫలితంగా మేరు పర్వతాలు 'ఎగిరి ఎగిరి' పడుతున్నాయి. సముద్రం 'జలప్రళయ' నాట్యం చేస్తూంది.

"సల సల క్రాగే చమురా? కాదిది ఉష్ణ రక్తకాసారం"

దేహంలో నెత్తురు దీపానికి చమురు వంటిది. విప్లవయాత్రలో దారిలో నెత్తురు పడియలేర్పడినాయి. ఈ దశ సామ్యవాద సమాజ పరిణామంలో భాగమైంది. గమనం శివసముద్రమూ నయాగరా వలె వేగాన్నీ తీవ్రతనూ అందుకుంది. త్రాచులవలె వేగంతో, రేచులవలె విడువని పట్టుతో, ధనంజయుని వలె విజయశీలంలో మునుముందుకు సాగే ఆకాంక్షలో ప్రత్యయమూ ప్రయత్నమూ నిబద్ధత స్పష్టంగా కనిపిస్తాయి.

"ధనంజయ" శబ్దం – ధనాన్ని జయించినవాడు అర్జునుడేగాక, పెట్టుబడిదారీ (ధన) వ్యవస్థపై విజయాన్ని సూచిస్తోంది. దూరంగా ఎదురుగా విజయరూపం.

"అగ్ని కిరీటపు ధగధగలూ ఎర్రబావుటా నిగనిగలూ హోమజ్వాలల భుగభుగలూ"

విప్లవ దృశ్యం మొదట్లో ఉన్న శ్రవణపథం నుండి చివరనున్న నేత్ర పథానికందే దశకు చేరుకుంది. "అగ్నికిరీటం", విప్లవంతో హస్తగతమయ్యే అధికార శక్తికీ, ఎర్రబావుటా విప్లవ సమాచరణకు, భుగభుగమనే హోమజ్వాలలు స్వచ్ఛమైన ఉత్సాహవంతమైన క్రియాత్మకమైన చైతన్యగతి శీలానికి ప్రతీకలుగా నిలుస్తాయి. ఈ ప్రస్థానం అనితరమైంది. మహనీయమైంది. ప్రజాపరమైందీ.

ఎక్కడా వాచ్యం కాని వ్యంగ్య విలసితమైన అర్థస్ఫూర్తితో, వివిధ స్థాయిల్లో భిన్నభిన్నమైన ఆలోచనా రామణీయకతల కాస్కారమైందీ, ఆరంభగీతం. కవి ఆదర్శాన్ని ఆవిష్కరిస్తూంది. వస్తువు ఎన్నికలో అభివ్యక్తి విధంలో, లక్ష్యసాధనలో ఉన్నతమైన కవితా కళాప్రమాణాల్ని పొందింది.

## 4. ఋక్కులు - సంవిధాన ప్రయోజనాలు

ఋక్కు అంటే స్తుతి – ఛందోయుతమైన వేదమంత్ర విషయంలో ప్రసిద్ధమైంది. వేదంలో ఋక్కులుప్రకృతివర్ణనంతో దేవతా భావనతో అతీత దర్శనంతో విలసిల్లాయి. శ్రీశ్రీ 'మహాప్రస్థానం' లో ఋక్కులు అనే ఖండిక ఉంది. ఇక్కడ ఋక్కు అంటే శబ్ద సంక్షేపంతో అర్థసంగ్రహంతో భావస్ఫూర్తితో ఆకర్షణీయమైన రూపాన్ని సూచిస్తుంది. ఈ ఖండికను రెండు భాగాలుగా గుర్తించవచ్చు. మొదటి దానిలో కవితా వస్తు స్వరూపం వర్ణితమైంది. రెండోదానిలో కవితా తత్త్వం వివృతమైంది.

మొదటి భాగంలో మూడేసి శబ్దచిత్రాలు (Word Images) అంత్య ప్రాసతో లయాత్మక గతివిశేషంతో మూడు నమూనాలు (Patterns) గా సంవిధానం యోజితమైంది. అయితే ఒక్కొక్కదాని చివర వాక్యాలు, కవితా వ్యాఖ్యలుగా కనిపిస్తాయి. వీటిలో ఉల్లేఖితాలైన వస్తువులు వాస్తవజీవితంలో మనకు కన్పించేవీ, అనుభవంలో నున్నవీ. వీటిని గురించి ఆలోచన చేయడం వీటి సామాజికమైన అవసరాన్ని గుర్తించడం, అహీనమైన స్థానాన్ని దృష్టికి తేవడం కనిపిస్తుంది. ఒక వరసలో కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బుబిళ్ళ, శబ్దచిత్రాలు కనిపిస్తాయి. వీటి చివర కవి మాటల్లో దేన్నీ హీనంగా చూడవద్దు. అన్నీ కవితామయాలే అన్న వ్యాఖ్యలో తత్త్వోక్తితో సంవిధాన రూపాన్ని పొందాయి.

"కుక్కపిల్ల" విశ్వాస పాత్రమయింది. అందమైంది. తనను పోషించే మనిషిని చివరిదాకా వదలకుండా ఉండేది, కాపాడేది. ఈ కృతజ్ఞతా లక్షణం సమాజంలో వ్యక్తి గుర్తుపెట్టుకోదగింది. అగ్గిపుల్ల మనిషి జీవన సంస్కృతిలో గణనీయమైన దశకు చెందింది. ప్రాచీనకాలంలో అరణిని మథించీ, ఎంతో కష్టపడీ అగ్నిని సాధించేవారు. దాన్ని కాపాడుకునేవారు. ఇది ఎంతో ప్రయాసతో కూడిందీ, కాలయాపనతోనూ కూడింది. ఈ క్రమంలో అగ్ని ఇతరేతర కారణాలవల్ల దేవతారూపాన్నీ పొందింది. శ్రీశ్రీ బుక్కులో అగ్గిపుల్ల మానవ సంస్కృతి చరిత్రలో గొప్ప మలుపును సూచించడమే కాక విశేషమైన ప్రయోజనరూపం కలిగింది. ఈ సందర్భంలో అగ్గిపుల్ల మనిషి అవసరాన్ని అవలీలగా తీర్చే సులభమైన ఆధునిక సాధనం, తనలో అగ్నిని నిక్షిప్తం చేసుకుంది. క్షణంలో ప్రయోజనం తీర్చే రూపాన్ని పొందిందీ.

మరో వరసలో 'రొట్టెముక్క' 'అరటితొక్క' 'బల్లచెక్క' శబ్దచిత్రాల్లో వస్తువులు మనిషివైపే చూస్తుంటాయి. తమ 'లోతుకనుక్కో'మంటాయి. రొట్టెముక్క క్షుధను తీర్చేది, ఇది మనిషి మొట్టమొదటి అవసరం. దీని చుట్టూ ఎంతో సామాజిక చరిత్ర ఏర్పడింది. దీన్ని అంటిపెట్టుకొని మనిషి భ్రమణమూ సాగింది. అరటిపండుపైనున్న పొట్టు (తొక్క) రక్షణ కవచంలా పనిచేస్తుంది. మాలిన్యం నుండి కాపాడుతుంది. కాస్తలోతుగా ఆలోచిస్తే మనిషికీ మానసికంగా ఇలాంటి రక్షణ కవచమేదో జీవితంలో అవసరమనిపిస్తుంది. బల్లచెక్క కూర్చోడానికి పనికి వచ్చే విశ్రాంతి తలం. శ్రమానంతరం మనిషికి విరామం అవసరం. ఇది మనిషిని శ్రమ నుండి మళ్ళీ పునర్నవీకృతం చేస్తుంది. ఈ విరామ విశ్రాంతి స్థితిలోనే ఎంతో విజ్ఞానం, ఎన్నో కళలు ఆవిర్భవించాయి. ఇక్కడ బల్లచెక్క విశ్రాంత స్థితికి సంకేతం మాత్రమే.

ఇంకో వరసలో "తలుపు గొళ్ళెం, హారతి పళ్ళెం, గుర్రపు కళ్ళెం" శబ్ద చిత్రాలతో, ప్రతి వస్తువు అర్థ్వతనూ దానిలో ఏర్పడిన పనితనాన్ని, శిల్పాన్ని ప్రయోజనాన్ని భావింపజేయడం జరిగింది. వీటి నిర్మాణంలో మనిషి తెలివీ, ప్రయోజనలక్ష్యం, శిల్ప దృష్టీ ఆకర్షిస్తాయి. తలుపు గొళ్ళెం ఇంటి భద్రత కవసరమైంది. కళ్ళెం గుర్రం వేగాన్ని ఉధృతినీ అదుపులో పెడుతుంది. ఎప్పటికప్పుడు అవసరమైన సరియైన అశ్వగతికి తోడ్పడుతుంది. ఇక మరొకటి హారతి ఇచ్చేటపుడు మండే, వెలిగే కర్పూరాన్ని వహించే సాధనం పళ్ళెం. ఇది ఒక విశేషమైన పనిలో ఉపకరించేది. సహకరించేది ఈ భాగం వస్తు వర్ణనం ప్రధానమైంది.

రెండో భాగంలో, చూపంటూ ఉంటే చూచీ వాక్కుంటే వ్రాసీ "సందర్భాన్ని బట్టి భాహ్యస్థితిని దాటిన మానసికమైన ఆలోచనా స్వరూపాన్ని ఆవిష్కరిస్తుంది. వాక్కుభావమయమైంది. అభివ్యక్తిగతమైంది. ఈ రెండింటి సమ్మేళనం (అంటే భావం మరియు అభివ్యక్తి) చేత సిద్ధించే రసావిష్కారం శోభామయమైంది. దీన్ని అర్థం చేసుకోడానికీ అనుభవించడానికీ చూపుఉండాలి. ఇది బాహ్యంగాను ఆంతరంగాను వర్తించేది. ఇది ఉండడం వల్ల 'శోభాలేశం' లభ్యమానమవుతుంది. లేశం అన్నమాట కనీస స్థాయిని సూచిస్తూంది.

'చూపు' కేవలం భౌతికమే గాక మానసికం కూడా. ఆలోచనకు సంబంధించింది. వాక్కు శబ్ద శక్తి సంబంధించిందీ. స్థూలంగా రసమంటే అనుభవంలో రుచీ సారమనీ అర్థం. రసం చేతనే కావ్యం జీవిస్తుందనీ అలంకారిక మతం.

"ప్రపంచమొక పద్మవ్యూహం, కవిత్వమొక తీరని దాహం" ఇది 'ఋక్కులు' ఖండిక చివరి పంక్తులు. సాహిత్య ప్రపంచంలో బహుళ వ్యాప్తిని పొందాయి. రణక్షేత్రంలో శత్రువుల పై విజయాన్ని సాధించేందుకు పద్మం ఆకారంలో దళాల అమరికవలె సేనల ఏర్పాటు పద్మవ్యూహం. ప్రపంచమూ ఇటువంటిదే అని కవిభావం. లోపలికి ప్రవేశించడమే కాని బయటపడడం కష్టతరమైంది. జీవితంలో సంఘర్షణ అనివార్యమవుతుంది. మహాభారత యుద్ధంలో అభిమన్యుని కథ ఈ సందర్భంలో జ్ఞాపకం వస్తుంది. పద్మవ్యూహంలో ప్రవేశించి విజయాన్ని పొందడం సులభం కాదు. దీనికి వ్యూహ పరిజ్ఞానం, ఛేదించే నేర్పు అవసరం. కేవలం రణేచ్ఛ ఉంటే సరిపోదు. కవిత్వ విషయంలోను కేవలం పిపాస ఉంటే సరిపోదు సంవేదన, భావనాశక్తి, రచనా కౌశలం ఉండాలి. ఈ దాహం ఒక్కమారుతో తీరేది కాదు. అంతంలేంది. అనంతమైంది. కవితా విషయంలో ఉచ్చనీచభేదం పనికిరాదు. ఏ వస్తువైనా స్వీకారార్హమే. అయితే కవి ప్రతిభ చేత కవితావేశం భావ రచనా రామణీయకతల్ని పొందుతుంది. ఆపై రసనిర్దేశం జరగవచ్చు. "రమ్యం జుగుప్సిత ముదారమథాపి నీచం ఉగ్రం ప్రసాది గహనం వికృతం చ వస్తు యద్వాప్యవస్తు కవి భావిత భావ్యమానం తన్నాస్తి యన్నరసభావముపైతి లోకే" అన్న దశరూపకంలోని సాహిత్యశాస్త్రోక్తిని అనుసంధించుకోవచ్చు. అందమైందైనా రోత పుట్టించేదైనా, గొప్పదైనా తక్కువదైనా, భయంగొల్పేదైనా, సంతోషం కలిగించేదైనా, దుఃఖం (కష్టం) కలిగించేదైనా ఏ విధమైన వస్తువైనాసరే లోకంలో కవి సంస్కారం చేత ఆలోచనలో రసభావాన్ని పొందని వస్తువు లేదు. ప్రతి భాదీప్తితో అభివ్యక్తి శక్తితో, లక్ష్యశుద్ధి వల్ల భావన చేత కవిత్వమవుతుంది. "ఋక్కులు" కవిత్వంలో అవసరమైన

వస్తువు మరియు శిల్పాలతో పాటు వేదన మరియు రామణీయకత గురించి స్పృశిస్తూ వస్తు వైవిధ్యాన్నీ భావనా వైశిష్ట్యాన్నీ, ప్రయోజనాత్మక లక్ష్యాన్నీ రసావిష్కారాన్నీ గురించి ఆలోచింపజేసేదిగాను గుర్తింపవచ్చు.

## 5. జయభేరి - విశ్వభావన

'మహాప్రస్థానం' గీతాల సంపుటిలో "జయభేరి" కొత్త భావరూపానికీ ప్రగతి తత్వానికీ ఆకర్షణీయంగా నిర్వహించిన సంవిధానానికి ప్రాతినిధ్యం వహిస్తుంది. ప్రయోజనపరత్వమూ అభివ్యక్తి శిల్పమూ ఈ రెంటింటి సమన్వయమూ కళాత్మకమైన పరణతిని పొందాయి. రచన చదువుతూంటే అనుభవ విశ్లేషణలో సామాజికత ఆకర్షిస్తుందా ? కళ ఆకట్టుకుంటుందా ? అనిపిస్తుంది. భేరి అనేది చర్మవాద్యం. జయాన్ని సూచించే ధ్వనితో సంపన్నమైంది. జయభేరి ఆశయసాధనలో జయ సూచనతో సంతోషకరమైన స్థితిని ధ్వనింపజేస్తుంది. ఇందులో విజయభావనా స్థితి సమాజపరమైంది. దీనికి కేంద్ర బిందువు వ్యక్తి "నేను" రూపంలో వ్యక్తమైంది. ఇతడు కవి స్వరంలో రూపొందే సామాజికమైన అస్తిత్వంతో సామ్యవాద జన సమాజానికి ప్రతినిధి.

"నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను".

ప్రపంచాగ్ని సమాజ విప్లవ శక్తికి, సమిధ బాధ్యతాయుతమైన వ్యక్తికీ, ఆహుతి ప్రయోజనపరమైన కార్యాచరణకూ ప్రతీకలు. కవి స్వరంతో అనుసంధింపబడిన నేను ఈ సందర్భాన్ని బట్టి సామ్యవాద రూపమైన సామాజిక విప్లవ శక్తిలో ఏకదేశం.

కవి భావించే సమాజం ప్రపంచతలంపై వ్యవస్థీకృతమైంది. అదే సమసమాజం. మార్క్సు సామ్యవాద సిద్ధాంతంపై నిలబడింది. ఈ కవితలో నేను ప్రగతి శక్తికి సంకేతం. తాను కూడా ప్రగతిశక్తుల్లో ఒకడుగా భావించడానికి ఉపక్రమించడం సమాజంలో ప్రతి ఒక్కరినీ కలుపుకొనిపోయే విధంతోపాటు కవిగా తన సామాజిక పాత్రను విస్మరించరాని స్థితినీ సూచిస్తోంది. ఈ అభివ్యక్తి విధానం ఈ గీతానికి ప్రత్యేకతను సిద్ధింపజేస్తోంది.

"నేను సైతం విశ్వసృష్టికి అశ్రువొక్కటి ధార పోశాను"

విశ్వసృష్టి విశ్వజనీనమైన కరుణాత్మకస్థితి గతులను చెందిన సమాజ జీవితాన్నీ అశ్రువు దీనికి స్పందించే వేదనా హృదయం రాల్చే సానుభూతినీ స్ఫురింపజేస్తాయి. ధారపోయడమనేది, త్యాగంతో వర్తించే వ్యక్తిత్వాన్ని భావింపజేస్తోంది. సమాజంలో

అడుగడుగునా కరుణాత్మక దృశ్యాలనేకం. జీవితంలో ఛేదరికం నుండి జీవనబాధలదాకా దు:ఖాల నుండి మృత్యువు ఛాయల దాకా పరివ్యాప్తమై కనిపిస్తాయి. మరోవిధంగా ప్రపంచవ్యాప్తంగా పీడితుల తాడితుల దుఃఖితుల్ని కరుణాత్మకమైన జీవిత రూపానికి విశ్వవృష్టి, తోటి మనిషి పట్ల ఆర్ద్రమైన అనుభూతికి అశ్రువూ నిలుస్తాయి. ఇది మార్పుకు తొలిదశ ప్రకృతీ సమాజం పరిణామ గుణంలో అంతర్భాగమైంది.

చారిత్రక నేపథ్యంలో సమాజంలో పీడితుల్ని దుఃఖితుల్ని గురించి ఆలోచన చేసిన వారిలో బుద్ధుడు సాక్షాత్కరిస్తాడు క్రీస్తు ఎదుట నిలుస్తాడు మార్క్స్ మెదలుతాడు. ఎందరో వివిధ తలాలపై పీడనకూ బాధలకూ ఒక్కొక్క విధంగా ప్రతిస్పందించారు. ప్రతి క్రియల్ని కనుగొన్నారు. ఏ పరిష్కారమూ సమగ్రమైందిగా కనిపించలేదు. వీటి సమాధానాల సందుల్లో నుండి అంచుల్లో నుండి ఎన్నో ప్రశ్నలు తలెత్తాయి. అయితే ఆర్థిక దృష్టితో ఈ ఎడారిని సుక్షేత్రం చేసేందుకు మహావృష్టి కాకమరేముంది ? మహావృష్టి మార్పుకు సంకేతం. దీనిలో భాగమే నేత్ర గగనాశ్రువు. హృదయ తంత్రిని సుకుమారంగా మీటే ఆర్ద్రస్ఫూర్తిని మెరపించేది ఖండం. ఒక్కొక్క స్థాయిలో ఒక ప్రమాణంలో వ్యంగ్య మర్యాదల్ని కలిగింది, ఉత్తమ కవిత్వమనుకుంటే ఆ ఒరిపిడికి నిలిచేవీ పంక్తులు.

"నేను సైతం భువన ఘోషకు వెర్రి గొంతుక విచ్చి మ్రోశాను"

ఇందలో భువన ఘోష, ప్రపంచ వ్యాప్తంగా ప్రజల ఆర్తి స్వరాలసంపుటి వెర్రి గొంతుక అమాయకమైందీ అంటే సహజమైందీ, కష్టాల్లో బాధల్లో నిర్నిమిత్తంగా ఒకటయ్యే స్వర సంపుటితో మ్రోగేదీ. సామాజికమైన ఆర్తిలో వైయుక్తికమైన అనుభూతి స్ఫూర్తితో తదైక్యం కలిగిందీ.

"నేను సైతం ప్రపంచాబ్జపు తెల్లరేకై పల్లవిస్తాను"

ప్రపంచమనే పద్మానికి తెల్లని రేకై చిగిర్చడంలో శాంతి ప్రియత్వం ఉంది. పద్మం అందర్జాతీయ సమాజానికి ప్రతీక, సామ్యవాద వ్యవస్థీకృతమైంది. అందులో సుందరమైన రేకుల వ్యక్తిత్వంతో ఏక దేశమైన మనిషినీ, పల్లవించడం అస్తిత్వ వికాసాన్నీ భావింపజేస్తాయి.

"నేను సైతం విశ్వవీణకు తంత్రినై మూర్ఛనలు పోతాను"

ఇదే విధంగా విశ్వమనే వీణకు తంత్రినై మధురమైన స్వరాల్ని పలకడం సమాజ తలంపై ప్రయోజనపరత్వాన్నీ వైయక్తికంగా కళాత్మకతనూ దృష్టికి తెస్తాయి. మూర్ఛన అంటే సంగీత శాస్త్రంలో స్వరాల ఆరోహణావరోహణం.

ఒక నిర్దిష్టమైన క్రమంలో స్వరాల ఆరోహణ అవరోహణ చేతనే రాగం సిద్ధిస్తుంది. దీనిలో నేర్పు చేత ప్రతిభ చేత రాగ కళ ప్రకాశిస్తుంది.

"నేను సైతం భువన భవనపు బావుటానై పైకి లేస్తాను"

ఇందులో పై ఖండంలో లేని విశేషం ఉంది. పైన పేర్కొన్న వాటికి భిన్నమైంది. ప్రపంచ భవనంపై పతాకయై పైకి లేస్తానంటాడు. తాను బావుటాల్లో ఒకటి కాదు. ఇక్కడ కవిగా తన ప్రత్యేకతను నిలుపుకునే మనోరూపం కనిపిస్తుంది. ఈ బావుటా సర్వమానవ విజయశక్తికి సంకేతం. ఇక్కడ తన విజయమంటే మానవ సమాజ విజయమే. కష్టాల నుండి పీడన నుండి దుఃఖాల నుండి బాధల నుండి ఉద్గమించే సంతోష భావనా స్థితినందుకున్న సందర్భంగా మ్రోగేదీ జయభేరి, విజయ చిహ్నం.

ఈ ఖండంలో విశ్వైక్య భావన ఏక సూత్రంగా ఉంది. సామ్యవాద సామాజిక తత్త్వం ఆధారతలంగా ఉంది. వ్యక్తి అస్తిత్వం స్ఫుటమై కనిపిస్తుంది. వ్యక్తి వికాసం సమాజంలో భావమైందీ. ఆలోచనతోపాటు అనుభూతినీ కలిగించేదీ. కళాత్మకమైన ఆకర్షణతో పాటు సమాజపరమైన సామ్యవాద ప్రయోజనంతో సహృదయుల్ని ఆకట్టుకునే "అనితర"మైన కళాత్మకతను పొందిన గీతం జయభేరి.

## 6. వాడు - పీడన శక్తికి ప్రతీక

సమాజంలో పీడన, బాధ, వేదన సంఘర్షణ, మానవత, సమానత అన్న భావ స్థానాల పరివృత్త రూపమే శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వం. మార్క్సియ సామ్యవాదం కేంద్రస్థానం. దీనికి మార్క్సియ భావ ప్రపంచానికి వాస్తవ జీవిత కార్యాచరణ సూచనారూపమే ''వాడు'' ఖండిక. ఇది అభ్యుదయ స్వేచ్ఛా కవిత్వంలో ప్రథమోదాహరణీయంగా నిలుస్తుంది.

సమాజంలో "వస్తు సముదాయం" సమష్టి కృషి పర్యవసానమైంది. ఇందులో ప్రతి ఒక్కరి శ్రమ దాగి ఉంది. సమాజంలో వస్తు సృష్టి ఆరంభం నుండి సమాప్తి వరకూ పర్యాప్తమైంది. అందరూ కలిసి చేసిన వస్తువు వినియోగంలో లేదా మూల్యంలో అందరికీ భాగం ఉండాలి, ఇది న్యాయం. అయితే ఎవడో ఒక్కడే వచ్చి దీన్ని అపహరిస్తూంటే చూచి, నిరసిస్తూ, ప్రతిఘటిస్తూ "అన్యాయం" అని ఎలుగెత్తడం గొప్ప ఆధునిక యుగ పరిణామమే. ఈ పరిస్థితి రావడానికెంతో కాలం పట్టింది. చరిత్రలో ఈ విధమైన నిరసన స్పృహ లేకుండానే సమాజంలో యుగాలు గడిచాయి. ఆధునిక

యుగంలో హేతువాద ప్రభావంతో ప్రగతిశక్తుల చలనంతో ప్రశ్నించడం మొదలైంది. దీని పర్యవసానమే ! సమష్టి శ్రమ ఫలాన్ని దోచే వ్యక్తిని చూచి, ఆగ్రహించడం, "అన్యాయమని" శబ్దించడం జరిగింది. పీడితుల నిరసనం శబ్దైకమాత్రంగానే నిలిచింది. వాడు (పీడకుడు) మాత్రం "అనుభవించాలి మీ కర్మమని" వెళ్ళిపోతాడు.

ఇది పూర్వ సమాజంలో నెలకొన్న తాత్త్విక స్పర్శతో కూడిన మాట. విధి – కర్మ – పేరిట అణచివేతను ప్రతారణాన్ని (Exploitation) కప్పివుచ్చే ధోరణి ముఖ్యంగా భారతీయ చింతనలో భాగమైంది. ఇది ఒక స్థాయిలో నిష్క్రియత్వానికి దారితీసింది. పీడితుల్ని ఉన్న దశలోనే ఉండిపోయేట్లు చేసింది. శ్రమజీవుల నిరసననూ లెక్క చేయకుండా వారిని కష్టాలపాలుజేసే వ్యవహారదక్షుడు ప్రతారణశీలి (Exploitor) "వాడు". ఇదో సమాజ యథార్థ స్థితి రూపం.

పొద్దు పొడిచింది మొదలు పగలంతా శ్రమ నిండిన "పని" తప్ప మరే వ్యాపకం లేదు. ఆట, పాట, కొత్త అనుభవం, ఆలోచన అనే విశేషాలు లేనే లేవు. సూక్ష్మతలంపై జీవితం లేనేలేదు. "ముద్ద" దొరకడమే కష్టమైపోతే, ఇక కడుపునిండాక తీరికవేళల్లో సమయం గురించిన ప్రశ్నేలేదు ! అందుకే వాళ్ళు "మొద్దు"లూ "మొరటులు"గా మిగిలిపోయారు. ఇది సమాజంలో విషమత్వానికి దారితీయడం సహజం. ఇది గ్రహించి చారిత్రక దశలో సామాజిక చేతనలో ఎదురుతిరిగి, "దారుణ"మంటే, ఇట్లా పనిచేస్తూపోవడం, "ఆచారం", ఇది దాటరాదని జవాబు వస్తుంది. సమాజంలో ఆచారం పేరిట జరుగుతూన్న పీడనకూ అమానుషత్వానికీ ఇది నిదర్శనమైంది.

ఆ తరువాత దశలో శ్రామికులు తమ జీవితంలో ఈ దుస్థితి భరించలేని స్థితి వచ్చింది. ఈ బరువును భరించడం కష్టమైంది. చేతిలో పనిముట్లను వదిలేసే స్థితి వచ్చింది. "చెయ్యలేం, చస్తున్నాం" అన్న ఆవేదన, ఆక్రోశం ఎగసింది. జీవనానికి "ఆసరా" చూపించమంటే పీడితులు మాట పలక్కుండా గొంతు నొక్కేయడం, వారిని అవమానకరంగా బాధించడం జరిగింది. క్రమంగా శ్రామికులు దౌర్జన్యమార్గం అవలంబించక తప్పని పరిస్థితి ఏర్పడింది. పనిముట్లు వదిలేసారు ఆగ్రహం వెలిబుచ్చారు. నిరసన ప్రకటించారు. సంఘర్షణకు దిగారు. కాబట్టి దీనికి సమాధానంగా వారిని అణచివేసే ధోరణిలో పీడితలపై దౌర్జన్యానికి సిద్ధం కావడం అణచివేతకు పరాకాష్ట అయింది.

ఈ రచన మూడు భాగాలుగా ఉంది. మూడు పేరాల్లో నిబంధింపబడింది. మొదటి భాగంలో కేవలం నిరసం ఉంది. రెండో భాగంలో దీన్ని ఆచరణలో పెట్టడం

జరిగింది. మూడో భాగంలో సమాప్తి రేఖను తలపించే క్రియత్మాకత ఉంది. వీటిని క్రమంగా నిరసనం, ప్రతిఘటనం, సంఘర్షణగా గుర్తించవచ్చు. ఇందులో మార్భియమైన అభ్యుదయ భావన సూక్ష్మస్థితిని పొందింది.

"వాడు" ఖండిక, ఒకటి ఆధునిక యుగంలో హేతుదృష్టితో అభ్యుదయ భావజాలంతో మేల్కొన్న శ్రామిక సమాజం రెండు వారిలో పీడితుల్ని ఎదిరించే మోహరించే మానసిక పరివర్తననూ, బింబించే ఖండిక. ఈ దుర్భరమైన స్థితి అలజడికీ ఆందోళనకు దారితీసేది. వర్గ సంఘర్షణకూ దారిచూపేది.

"వాడు"కు పేరు లేదు. యుగాలుగా సమాజ పీడనశక్తికి ప్రతీకగా, చరిత్రలో నిరంకుశతత్వానికి ప్రతినిధిగా నిలిచే, సామాజిక రూపంగా గ్రహింపబడింది. ఎన్నో పేర్లతో వ్యవహరింపబడే సర్వనామం. ఈ పేర్లు శ్రమకు సంబంధించిన పారిశ్రామికం వ్యవసాయికం, వృత్తిపరం, ఇంకా ఎన్ని విధాలుగానో వర్గ వ్యక్తి భేదాల్ని జ్ఞాపకం చేస్తాయి. తటస్థ పడతాయి.

ఈ ఖండికలో 1) పీడన నుండి ఆర్తి, 2) ఆర్తితో వేదన, 3) వేదన మూలంగా సంఘర్షణ, 4) మొత్తం మీద లోపించిన మానవత, 5) చివరకు స్థాపింపగోరే సమానత సమాలోచనకందుతాయి. ఇందులో వస్తువు దేశ కాలాతీతమైన విశ్వజనీనమైన జీవిత యధార్థరూపాన్ని పొందింది. అభివ్యక్తి రూపం కవి ఆదర్శతలంపై సార్వజనీనమైన హృదయాన్ని స్పందించే మానవతా గుణాన్ని తలపిస్తూంది. లక్ష్యం వాచ్యం కాలేదు. అది పీడన అంతరించిన వర్గ భేదం లేని, సమ సమాజం. స్ఫూర్తికి మాత్రమే అందుతూంది.

## 7. వ్యత్యాసం - యథార్థ జీవిత చిత్రణం

"వాడు" కవితకు వివరణ రూపమే వ్యత్యాసం. ఇదో పార్శ్వం మాత్రమే. సమాజంలో రేఖకవతల కొందరూ రేఖకివతల కొందరూ. వీరు ఇరుపక్షాలుగా యుగాలుగా ఉన్నవారు అంతా మానవులే, సమాజం ఒకటే, కాని పరిస్థితులు వేరు, జీవితాలు వేరు, ఆలోచనలు వేరు, ప్రవర్తనలు వేరు. జీవితంలో అసమానతలతో ఈ పక్షాలు పరస్పరం వ్యతిరేకమైనవి. విభేదాలతో సంఘర్షణకు దారితీసేవి.

ఒక వైపు ఉన్నవారు జీవితం వడ్డించిన విస్తరి అయితే వీరిని కాపాడేందుకు గొప్ప వ్యవస్థ ఉంది. వీరికి ఉన్నచోటు చాలు ! కదిలితే ఏమవుతామోనని ! భయం ! భద్రతకై ఇంకా వెనక్కి పోవాలనుకునేవారూ ! ఉన్నారు. వీరికి సుఖం ! సంతోషం !తో

కూడిన జీవితం ముఖ్యం. వారి వీలును బట్టి అభిప్రాయాలు మార్చుకునే అదృష్టవంతులు. ఇదో వర్గం.

మరొకవైపునున్నవారి జీవితం, ఎప్పటికపుడు యాతనతో కూడుకొంది. ఎవరి వంట వారే వండుకొనే స్థితిలో ఉంది. పదార్థాలు సులభంగా దొరకవు ! ఒక్కొక్కప్పుడు విస్తరి కూడా దొరకదు అన్నీ సందేహాలే ! అన్నీ ప్రశ్నలే ! సుఖం ! సంతోషం ! కన్నా, బాధ ! ఆవేదన అధికం అలజడి ఆందోళన తప్పదు ! దారిలో ముళ్ళూ రాళ్ళూ ఎన్నో ! అభిప్రాయాల కోసం సిద్ధాంతాల కోసం ప్రయాణంలో ! అన్నీ భరించడం అవసరం, జీవితంలో ఆదర్శం లక్ష్యం ముఖ్యమైన పురోగాములు మరో వర్గం.

ఈ కవితలో రాజకీయ సిద్ధాంతాల ఉద్ఘాటనం లేదు. కేవలం యధార్థ జీవిత స్వరూపం సమాజంలో ఎట్లా రెండుగా చీలి ఉంది, అది ఎట్లా వర్గాలుగా ఏర్పడి ఉందీ. యథార్థగతిలో చిత్రితమైంది.

ఈ వ్యత్యాసం క్రమక్రమంగా స్వార్థం, ప్రతారణంతో ఎన్ని యుగాలుగానో రూపుదిద్దుకుంటూ బలపడుతూ వచ్చింది. రాజరికం, మతం మొదలైన విశ్వాసాల సహాయంతో పట్టు చెడకుండా కాపాడబడుతూ నిలిచిఉంది. ఉన్నవారు, లేనివారూ, పీడకులూ, పీడితులూ, అదృష్టవంతులూ, శ్రమజీవులూ, సుఖజీవులూ, అభాగ్యులు రేఖకు చెరొకవైపుననున్నవారు ఈ వ్యత్యాసాన్ని అనుక్షణం గుర్తుచేస్తారు. వ్యక్తులు లేకుండా సమాజం లేదు. నిజమే కొందరు వ్యక్తుల సమాహారం సమాజం అవదు. వీరి జీవితాల వెనకనున్న సామాజిక రాజకీయ సాంస్కృతిక శక్తుల ప్రభావం ముఖ్యం. వీటి ప్రభావ పర్యవసానరూపమే సమాజం. అనేక చారిత్రక సమాజిక రాజకీయ కారణాల వల్ల సమాజ గతిలో వ్యత్యాసాలు చోటు చేసుకున్నాయి. అభ్యుదయ దృక్పథంలో మార్క్సియ భావనలో ఈ వ్యత్యాసం వర్గ సంబంధమైందని మాత్రమే ఈ సందర్భంలో గుర్తించవలసి ఉంది. అటు, ఇటు వ్యత్యాసాలతో రెండు సమాజాల్లో ఒకటి పాత ప్రపంచం, రెండోది కొత్త ప్రపంచం. ఇవి నిరంతరం ఘర్షణ పడుతుంటాయి. ఇది ఒక్కొక్కప్పుడు వేగాన్ని పొందవచ్చు. దీన్ని వేగవంతం చేయడమే అభ్యుదయ రచయిత కర్తవ్యం. ఈ వ్యత్యాసాలు లేని, ఇవి తుడిచి పెట్టుకొనిపోయే ఒకే ఒక సమాజ రూపం వర్గరహితమైంది. సామాజిక న్యాయంతో ఆర్థిక సమానత్వంతో అవతరించవలసి ఉంది.

సమాజంలో రేఖకిరువైపుల సంఘర్షణకు సిద్ధంగా ఉన్న ఇరుపక్షాల యధార్థ స్వరూప చిత్రణమే "వ్యత్యాసం" మునుముందు మహాప్రస్థానం కావ్యంలో "జగన్నాథ

రథ చక్రాల" ఆగమనంతో సంఘర్షణ సమీకృతమవుతుంది. వ్యత్యాసాలకు కారణమైన వర్గ సమరం సమహితమవుతుంది. అలజడి చెలరేగుతుంది. అటో ఇటో తేలిపోతుంది. రేఖ అంతరించి సమసమాజస్థానం జరుగుతుంది. ఇది వర్గ రహితమైందీ, ఆర్థికసమానత్వం కలిగిందీ.

వ్యత్యాసాలకు కారణాలు స్థూలంగా ఒకటి అవిద్య, రెండు దారిద్ర్యం – వీటిని రూపుమాపే ప్రయత్నం జరగవలసినంతగా యుగాలుగా జరక్కపోవడం, మూడు సమస్యల పట్ల హేతుదృష్టి లోపించడం నాలుగు స్వార్థం సంకుచిత్వం. అయితే మానవతనూ ఉదారతనూ కోల్పోవడంగా దృష్టికి వస్తాయి. రాజ్యమూ మతం పట్ల విశ్వాసాలతో కూడిన వాతావరణం మొదటి వర్గమైన పీడకులు బలపడేందుకు మాత్రమే సహకరించాయి.

శ్రీశ్రీ రచనలో ఈ విశ్లేషణ మార్క్సీయ వర్గ భేద సిద్ధాంతంతో మూలరూపాన్ని పొందింది. వ్యత్యాస నిర్మూలనం కేవలం భావనా మాత్రంగానే కాక క్రియాచరణంగానూ పరిణిమింపజేయడం, సత్వరం లక్ష్యసాధనకుక్రమింపజేయడం, ప్రేరేపించడం, అభ్యుదయ కవిత్వం ప్రముఖ ప్రయోజనం. ఈ సంప్రేరణ గుణం శ్రీశ్రీ కవిత్వంలో ఒక ఆకర్షగుణంగాను రూపొందింది. ఈ రచన మార్క్సీయ భావనలో పురోగమన గమ్యానికి స్పష్టతను చేకూర్చింది.

## 8. రథ చక్రాలు – గతి రూపం

'మహాప్రస్థానం' గీతాల సంపుటిలో అంకితం వదిలేస్తే చివరది జగన్నాథ రథ చక్రాలు. ఇది ఉద్రేక సంరంభంలో ఉత్కంఠను నిలుపుతూ ఊపిరి తీసుకోడానికి కూడా సమయం లేని వేగంతో అంచెలు అంచెలుగా గతిరూపం కలిగిన శిల్పఖండం. మధ్య మధ్య స్వల్ప విరామం ఉన్నట్లు కనిపిస్తుంది కాని, ఇది ఆ తరువాత వచ్చే దాన్ని సత్వరం అపేక్షించే భావచలనంతో ఆకర్షిస్తుంది. ఇందులో భావసూత్రం సామ్యవాద సమాజాన్ని లక్షించే ప్రగతిరూపం. ఈ విధంగా శిల్ప విధానంతో ప్రగతి భావనతో సమస్థితిని పొందింది. ఆరంభం నుండి సమాప్తి వరకు గీతంలో ఆవేశ స్థాయి నిలుపబడింది. శబ్దశక్తి ప్రసారం అవిచ్ఛిన్నంగా కొనసాగింది. శ్రీశ్రీ రచనల్లో సామ్యవాద ప్రగతి తత్వంతో కవితా శిల్పం శిఖరాల్ని అందుకున్న వాటిలో ముఖ్యమైంది. ఇందులో భావధార తరుముకొని వస్తుంది. ఈ విశిష్టత సామ్యవాద కవిత్వానికి విశేషమైన ఖ్యాతిని ఆర్జించి పెట్టడమే కాక గౌరవ స్థానాన్ని కలిగించింది. అభ్యుదయ కవిత్వ లక్ష్యంగాను సాహిత్య చరిత్రలో రూఢమైంది.

'జగన్నాథుని రథం' – పురాభావ (ఆర్కిటైప్) ప్రతీక. విప్లవ భావానికి సంకేతంగా ప్రయుక్తమైంది. జగన్నాథ రథ చక్రాలనగానే సాధారణంగా మనస్సులో మెదిలేది, పూరి జగన్నాథస్వామి రథోత్సవం. ప్రజలంతా తలా ఒక చేయి వేస్తారు. తాళ్ళతో లాగుతూ రథాన్ని లక్ష్యానికి చేర్చడంతో పర్యాప్తమైంది. ఇది ఎంతో కృషీ, పట్టుదల అంకితభావంతో ఎక్కడెక్కడి నుండో సమీకృతమైన మహాప్రజ ! ఆప్రయత్నరూపంగా కనిపిస్తుంది. ఇది ఏ భేదభావాలు లేకుండా ఒక మహాకార్యంలో పాల్గొనే జన సందోహంలోని ఉత్సాహశక్తికి కార్యదీక్షకూ ఉత్తమ లక్ష్యానికి ప్రతీక.

ఆధునిక యుగంలో ఈ జగతికి నాథుడు దైవం కాదు, ఏ ప్రభువూ కాదు. మహాప్రజయే. ఈ ప్రజారూపమే సమాజం. ఈ రథగమనం సామాన్య ప్రజల మార్పును కోరేది ! ఆ ప్రయత్నరూపాన్ని భావింపజేసేదీ, ఇది విప్లతోపేతమైంది. సామ్యవాద లక్షితమైంది. సామాన్యుడు భాగస్వామి – నడిపేదీ సామాన్యుడే. ఈ రథం సామ్యవాద విప్లవభావ రూపమైంది. దాని చక్రాలు పరివర్తన శీలంగలవి. దీనికి నాథుడు విప్లవం మూర్తీభవించిన రథాన్ని ముందుకు నడిపించే బాధ్యతను స్వీకరించిన, మహాప్రజ !

ఈ సందర్భంలో వర్తమాన సమాజ జగతికి నాథత్వాన్ని పొందిన రూపం మహాప్రజ ఈ రథం "మెయిలు దారిన బయలు" దేరింది. దీన్ని భూమార్గం పట్టించే ప్రయత్నమూ దాని సఫలత్వంలో ఆశాదృశ్యం చిత్రితమైంది. ఇది గీతంలో నిబిడమైన, అంతరమైన భావ నిర్మాణ సూత్రం. మెయిలుదారి అంటే ఆకాశం. ఇది కాల్పనిక జగత్తుకు ప్రతీక, ఇక్కడి నుండి భూమార్గనికి పట్టించే ప్రయత్నం కనిపిస్తుంది. అంటే కవిత్వంలో కాల్పనిక జగత్తు నుండి మారుతున్న స్థితి సూచితం. ఇది సామ్యవాదయుతమైంది. కల్పన ఎన్నటికీ అందని ఆదర్శంతో కూడింది ఇంతవరకూ జరిగినకథ దీనికి సంబంధించింది. ఇక ముందు జరుగబోయేది దీనికి భిన్నమైంది. వాస్తవోపేతమైందన్నమాట. ఇది సామాజికమైంది. సమాజంలో అదీ పతితలకూ, దీనులకూ, హీనులకూ, కూడులేని, గూడులేని పక్షులకూ, భిక్షులకూ సంబంధించింది. అట్టడుగునపడియున్న వారిపై దృష్టిని ప్రసరింపజేసేదీ.

"పతితులార ! భ్రష్టులార ! బాధా సర్పదష్టులార !" అని ఆరంభమైన గీతం సంబోధనాత్మకమైంది. ఆత్మీయతను వెలారుస్తోంది.

ఇది మొదటి దశ. వీళ్ళు "శని దేవత రథ చక్రపు టిరుసుల్లో పడి నలిగిన" వాళ్ళు, శని కష్టాలకూ నష్టాలకూ కారకుడన్న విశ్వాసం ఉంది. ప్రజల్లో ఉన్న ఈ నమ్మకంపై నిర్మితమైందీ భావం. ఆ తరువాత మంచి జరుగుతుంది. రథగమనంలో

ఒక దాని తరువాత మరొక ఇరుసు క్రమిస్తుంది. ఈ పరిక్రమణంలో పడిపోయిన బ్రతుకులంటే ! సామాజిక పీడనలో నలిగిపోయిన, చితికిపోయిన వన్నమాట వీరే పీడితులూ ! తిరస్కృతులూ ! బహిష్కృతులూ ! పరిచ్యుతులూ !

వీళ్ళను సాంత్వనపరచే దశ రెండోది. "ఏడవకండి ! ఏడవకండి !" అని, సానుభూతితో కరుణాత్మకమైన భావనతో కూడిందీ. దీని తరువాత వచ్చే మూడో దశలో బాధా సర్పదష్టులకొక ఆశారూపం ఆవిష్కృతమైంది. అదే జగన్నాథ (అంటే ప్రజా) రథ చక్రాల ఆగమనం ! ఇది భూమార్గం పట్టడంగా ఉంది. వాస్తవమైన స్థితికి చెందిందీ, జన విప్లవమయమైందీ.

"వస్తున్నాయొస్తున్నాయ్ జగన్నాథ రథ చక్రాల్ !
భూమార్గం పట్టిస్తాను భూకంపం పుట్టిస్తాను"

విప్లవ చేతనలో కవి సమైక్యం పొందడంతో పీడిత పక్షం వహించే మానసిక స్థితి వ్యంజితమౌతూంది. ఇందులో పీడితుల కాశ్వాసం ఉంది. విప్లవ పథ నిర్దేశం ఉంది. ప్రజల నిస్సహాయతను పోగొట్టి ధైర్యాన్ని కలిగించే మానసికమైన ప్రేరణ యోజితమైంది.

ఈ గీతంలో పోరాటానికి కవిత్వమొక సాధనంగా అవలంబించిన ప్రయోజన రూపం దృష్టికి వస్తుంది.

మహాప్రజ అధినేతగా కలిగిన సమాజ రథ వేగానికి "సింహాచలం కదిలింది, హిమాచలం కరిగింది, వింధ్యాచలం మొదలైనవి ఎగిరిఎగిరి పడుతున్నాయి, ఎంతో కాలంగా స్థిరంగా ఉన్నవి, ఇక చలనం లేదనుకున్నవి కదలిపోతున్నాయి. పట్టుతప్పిపోతున్నాయి. వినాశన స్థితిని పొందుతున్నాయి. ఇది పాత వ్యవస్థ తన అస్తిత్వాన్ని కోల్పోయే స్థితికి నిదర్శనంగా ఉంది. ప్రజా రథగమనంలో, విప్లవ ప్రభావం చైతన్య బంధురంగా చిత్రితమైంది.

రథం వచ్చే ముందు ఉన్నస్థితి అంతా చీకటి ! దుఃఖం ! నిరాశ ! దగాపడిన తమ్ములూ ! వాళ్ళ బాధలూ ! ఇంతవరకూ ఆకాశ మార్గాన వెళ్ళే రథం భూమార్గం పట్టడంతో వీళ్ళ సమస్యల్ని పరిష్కరించే వాస్తవరూపం ఆరంభమయింది. ఇంతవరకు కాల్పనిక జగత్తులో ఉన్న భావజాలం, భౌతికతలంపైకీ వాస్తవ జగత్తులోకీ క్రమింప జేయడమే ఈ విశేషపరివర్తనం ఉద్దేశం, సామ్యవాద సాధనలో విప్లవభావోపేతమైంది ఆచరణయుతమైందీ.

మరో దశ, రథం భూమార్గం పట్టడంతో ఉత్పన్నమైన స్థితిలో ! సంఘర్షణతో! భూకంపం పుట్టినంత పని జరిగింది ! శివుని మూడో నేత్రం పగిలి అగ్ని విస్ఫోటం జరిగినంత అయింది. ఈ పురాభావాలన్నీ ప్రకృత విప్లవస్థితిని ప్రభావోపేతంగా ప్రస్ఫుటీకంరించేందుకే తోడ్పడుతున్నాయి. విలయరూపం సమాజంలో విప్లవ శక్తుల సమరస్థితిని వ్యంజింపజేస్తోంది. అటో ఇటో తేలే స్థితికై విప్లవాచరణంలో శిఖరస్థితిని చేరేందకు సర్వశక్తులూ సన్నద్ధం కావడం సూచితం. ఎటు చూచినా ప్రజా సంరంభం ! ఇది మార్పు అవసరాన్నీ ప్రజల ప్రమేయాన్నీ సూచిస్తోంది.

మొయిలుదారి భావవాదాన్నీ, భూమార్గం యధార్థమైన భౌతిక వాదాన్నీ సూచిస్తాయి. ప్రకృతి శక్తులతోపాటు మానవశక్తులూ కలిసిన సంస్థితి స్ఫుటంగా కనిపిస్తుంది. ఇది సామాజిక పరిణామ రూపంలో భాగంగా యోజితమైంది. ఇది ఆర్థిక వ్యత్యాసాల్ని తుడిచిపెట్టేది, అసమానతల్ని రూపుమాపేది. సమాజ స్థితికి ఆర్థికతలం ఆధారం, రాజకీయ సామాజిక కళాసాహిత్యాల పోకడలు ఆర్థికవ్యవస్థను బట్టే ఉంటాయి. వీటిలో సమూలంగా మార్పుచేస్తే తప్పప్రజల జీవితంలో గుణాత్మకమైన మార్పుకు అవకాశం లేదు. సమాజ సంపదను ప్రజాయత్తం చేయడమొక్కటే శరణ్యం. దీనికి సంఘర్షణ అనివార్యమౌతుంది. ఈ గీతంలో జగన్నాథ రథ గమనం ప్రజాపరమైంది.

వర్గచైతన్యం, ముఖ్యంగా ప్రజల్లో సామ్యవాద పరిజ్ఞానంతోను అనుభవం వల్లనూ సమస్యల పరిశీలన వల్లనూ ఏర్పడుతుంది. ఇది పీడిత తాడిత వర్గంలో విప్లవభావానికీ, విప్లవాచరణకు, దారితీస్తుంది. ఇక్కడ దైవశక్తులకన్నా మానవశక్తులకే ప్రాధాన్యం ఉంది. మానవుని పైన మానవశక్తిపైన ఆశ, విశ్వాసం, ఆచరణం, విజయం మొదలుగా ప్రజల ప్రమేయాన్నీ, కార్యశక్తినీ, సమరరూపాన్నీ ఆవిష్కరిస్తూందీ గీతం.

ఈ విజయావిష్కారం సులభమైంది కాదు ! "మరఫిరంగి ! టార్పిడో ! టార్నాడో!" అని యుద్ధ వాతావరణ వస్తుజాలంతో చిత్రమైంది. ఇందులో మార్క్సిజంలోని కార్యాచరణ విప్లవ సంకేతాలు పరంపరగా కనిపిస్తాయి. దీన్ని కవి ఆవేశంతో, ఉద్రేకంతో, శిఖరస్థాయిలో నిలిపి వేగాన్ని సాధించడం జరిగింది.

విధ్వంసన చణమైన సంఘర్షణతో కోలాహలం నుండి హాలహలంతో అంతా పొగచూరినట్లుంది. ఇదో సముద్ర మథనం వలె ఉంది ! మొదట హాలహలం ఆ తర్వాత అమృతం అదే సామ్యవాద సమాజ విజయం. ఇది ప్రజా ద్రోహులను తూలగొట్టేదీ అసమానతల్ని తుడిచిపెట్టేదీ.

చివర దశ, జనచైతన్యంలో వచ్చిన విప్లవ పర్యవసానంగా సామాన్యుని స్వాతంత్ర్యంతో పాటు ప్రజల్లో సమభావం, సౌభ్రాత్రం, సౌహార్దం సిద్ధింపజేసేది. ఈ భావస్థానాలు పునాదిగా కొత్త వ్యవస్థ ఆవిర్భావం ఈ గీతంలో లక్షితమైంది. దేవుని స్థానంలో రాజుస్థానంలో నెలకొన్న ప్రజ అంటే సమాజమే ఈ జగన్నాథ రథం ! సమాజంలో విప్లవ చర్యయే రథ గమనం ! ప్రయాణ లక్ష్యం సామ్యవాదం ! అంతటా "శాంతి ! కాంతి !" సామ్యవాద స్వప్నం నిజమౌతుందని శ్రామిక రాజ్యం ఋజువౌతుందని! కవి సంకల్పం !

"రారండో రండి రండి ! ఈ లోకం మీరేలండి" అన్న ఆశాస్ఫూర్తితో "జగన్నాథ రథచక్రాలు" అభ్యుదయ కవిత్వంలో వివిధ శక్తులు సమాజపరం అయ్యే, మార్క్సు విప్లవభావంతో నిండింది. సామ్యవాద లక్ష్యాన్ని ఉద్దేశించిన మార్గానికి ఆదర్శరూపమేకాదు, నవయుగానికి ఆరంభ శిఖరమైన కవితా రూపాన్ని పొందింది.

## 9. అభ్యుదయ పథం

శ్రీశ్రీ ఆరంభించిన అభ్యుదయ మార్గం గురజాడ ప్రగతి వారసత్వాన్ని అందుకుంది. మహాప్రస్థానం కవితా సంపుటి తెలుగు సాహిత్యంలో అంతర్జాతీయ సామ్యవాద చేతనకు ప్రాతినిధ్యం వహిస్తూంది. మార్క్సు సమసమాజ లక్ష్యంగా మరో ప్రపంచమై నూతన వ్యవస్థానిర్మాణానికి దారితీసింది.

"మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం పిలిచింది"

ఈ మరో ప్రపంచం వ్యక్తిగతమైంది కాదు. సమాజగతమైంది. మార్పును కోరేది. సర్వప్రజల సమానత్వంతో, సౌభాగ్యంతో సామ్యవాద నిర్దిష్టమైన మార్క్సు సిద్ధాంతాలకత్యంత సమీపంగా వర్తించే లక్ష్యంగా కలిగింది.

ఈ మరో ప్రపంచం ప్రజల్ని "అగ్ని కిరీటం"తో "ఎర్రబావుటా"తో ఆహ్వానిస్తోంది. ఇందులో అగ్ని విప్లవశక్తికీ, ఎర్ర బావుటా సామ్యవాద భావానికీ ప్రతీకలు. ఈ ప్రపంచం సంపూర్ణంగా భిన్నమైంది. కొత్త ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యవస్థపై నెలకొంది. ఇది గతితార్కిక భౌతిక వాదయుతమైంది.

గురజాడ లిబరలిజమ్‌లో ప్రగతిశీలం నుండి శ్రీశ్రీ మార్క్సు అభ్యుదయ తత్వానికి ప్రయాణించడానికి ముప్పై – ముప్పై ఐదు సంవత్సరాలకాలం పట్టింది. ఈ మధ్యకాలంలో నవ్య కవిత్వం భావ కవిత్వం కాల్పనిక ముద్రలతో ప్రముఖమైన పరిణామ ధోరణులుగా

వ్యాప్తిలోకి వచ్చాయి. అయితే వీటితోపాటు ఇంచుమించు సమాంతరంగా, సంప్రదాయ కవిత్వం సాగింది. పలుభేదాలతో నవ్య సంప్రదాయ కవిత్వం సాగుతూనే ఉంది. ఈ వలయాన్ని ఛేదించుకొని సాహసంతో అతిక్రమించి మ్రోగించిన శ్రీశ్రీ "జయభేరి" (1933). కవిత్వానికి సంబంధించిన ఉన్నతమైన ప్రమాణాల్ని అనుసరించి పరిశీలిస్తే ఇది మొట్టమొదటి కొత్తముఖం అభ్యుదయ గీతంగా నిలుస్తుంది.

చారిత్రక పరిణామంతో చూస్తే సంఘ సంస్కరణ ప్రయాణ పతాకగా తోకచుక్క (1910)తో గురజాడ ఆరంభించిన ప్రగతిశక్తికి, శ్రీశ్రీ అభ్యుదయ ప్రకంపనమే ఈ జయభేరిగా గుర్తింపవచ్చు.

"నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను" ప్రపంచ వ్యాప్తమైన విప్లవాగ్నికి ప్రతివ్యక్తి ఒక సమిధయై ఉజ్వలింపజేయాలని కర్తవ్యబోధ వ్యంజితం. సమాజం కోసం చేసే ప్రాణాహుతిలో దూరఫలం ఉంది. జడశక్తులూ సుప్తశక్తులూ చేతనతో మేల్కొనీ సమిధల వలె త్యాగంతో ఉద్యమానికి ఉపయోగపడే అవసరం సూచితమైంది.

అభ్యుదయ శబ్దాన్ని మొదట ప్రయోగించింది శ్రీశ్రీయే 'నవ' 'నవ్య' 'నవీన' శబ్దాలు వాడాడు. అయితే అభ్యుదయ శబ్దమే తెలుగుసాహిత్యంలో సమసమాజ సామ్యవాద సిద్ధాంతాన్ని ఆవిష్కరించేందుకు రూఢమైంది. ఇది మార్పు విప్లవ చైతన్యాన్ని స్ఫూర్తికి తెస్తుంది. ప్రాతినిధ్యం వహిస్తూంది కూడా.

"నేడే ఈ నాడే ఈ నాడే నర జాతికి పరివర్తన
జగమంతా బలి వితర్ది నవ జీవన శుభ సమయం అభ్యుదయం"

సమాజంలో వివిధ శక్తుల సంఘర్షణతో విప్లవం, సమూల పరివర్తనకు హేతువైంది. నవ జీవనాన్ని ప్రతిఫలించే నూతన వ్యవస్థను సమావిర్భవింపజేసేది అన్న భావంతో "అభ్యుదయం" సమావిష్కృతమైంది. అభ్యుదయ కవిత్వం తెలుగు సాహిత్యంలో ప్రగతి శక్తుల చైతన్యవంతమైన పాత్రతో, నిబద్ధమైన సామాజిక రాజకీయ ప్రభావంతో గుణాత్మకమైన మార్పుకు కారణమైందీ. సమసమాజ భావన మూలమైందీ.

సామ్యవాద సమసమాజాన్ని కోరే అభిప్రాయాల కనుగుణంగా విశ్లేషణకందే "మహా ప్రస్థానం" శ్రామిక రాజ్యాన్ని స్థాపించేది. శ్రమ జీవన సౌందర్యాన్ని భావించేది. జగమంతా శాంతినీ, క్రాంతినీ కోరేది.

'నాలో కదిలే నవ్య కవిత్వం కార్మిక లోకపు కల్యాణానికి
శ్రామిక లోకపు సౌభాగ్యానికి సమర్పణంగా సమర్చనంగా'

'శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనే లేదని
కష్ట జీవులకు కర్మవీరులకు నిత్యమంగళం నిర్దేశిస్తూ' సాగింది.

కమ్యూనిస్టు పార్టీ దేశానికేం మేలు చేసిందన్న విశ్లేషణలో తెలుగుసాహిత్యానికి వస్తే సంస్కరణ పరివర్తన దిశల్ని వేగవంతం చేసిందనే చెప్పాలి. ఇది ప్రగతి శక్తులకు ప్రేరణగా నిలిచింది. మార్పుకు కేంద్రంగా వ్యవహరించింది. దీనికనుబంధంగా అభ్యుదయ రచయితల సంఘం స్థాపితమైంది. ఒక్క మార్క్సిజం వరకే పరిమితం కాకుండా ప్రగతిశీల శక్తులకు నిలయమైంది. యువశక్తుల్నీ ఉత్సాహంతో ఉద్యమింపజేసింది. సంస్కరణ వాదానికి పరివర్తన సిద్ధాంతానికి విప్లవ భావాలనూ చేయూతనిచ్చింది. వేదికగా నిలిచింది. దీని వల్ల సమాజంలో అనివార్యమైన మార్పులు ఎంతో వేగంగా వచ్చాయి. ఇవి ఆలోచనల్ని ఆధునికం చేసేందుకెంతగానో తోడ్పడ్డాయి. వ్యక్తిలో సామాజిక స్పృహతో అన్యాయాల్ని నిరసించే అక్రమాల్ని ఎదరించే ధైర్యాన్ని పుంజీభవింపజేసింది. సాహిత్య విమర్శకుల్నీ చారిత్రకాంశాన్ని విస్మరించలేనంతగా అభ్యుదయ సాహిత్యంతో పెనవేసుకుపోయింది.

తెలుగు ఆధునిక కవిత్వంలో ముఖ్యమైన అభ్యుదయ పరిణామ శిఖరానికి ప్రాణభూతమైన కేంద్ర బిందువు మార్క్సు సామ్యవాద సిద్ధాంతం. "మహాప్రస్థానం" వ్రాసే నాటికి తనకు మార్క్సిజం గురించి తెలియదనీ" మార్క్సిజం తెలుసుకున్నది సాహిత్యంద్వారానేనని శ్రీశ్రీ ఒక మాట అన్నాడు. అయితే శాస్త్రపరమైన సిద్ధాంతం దాని తత్త్వరహస్యాలూ కూలంకషంగా తెలియకపోవచ్చు. కాని ఆలోచనలో ప్రపంచంలో వెలువడే ప్రగతిశీల సాహిత్యంతో పరిచయం, సామాజిక విశ్లేషణ శక్తి తన చుట్టూ నెలకొన్న దీన, హీన జన జీవన గాథా వాతావరణం పట్ల సానుభూతి, ఈ దుస్థితికి స్పందించే హృదయం శ్రీశ్రీ ఆలోచనల్ని మార్క్సిజానికి సమీపంగా వర్తింపజేసాయి. వాస్తవమైన అనుభవస్థాయిలో స్పందప తీవ్రత తనకు తెలయకుండానే విప్లవ రచనకు దారి తీసింది. అభ్యుదయ కవిత్వానికి అవసరమైన పరిచయంతో సృజతన్మాతకమైన ప్రతిభతో "మహా ప్రస్థానం" అవతరించింది.

ఆంగ్ల విద్యాప్రభావం వల్ల దేశంలో కొందరు విద్యావంతులూ, మేధావులూ ఆసక్తితో ఎప్పటికపుడు వివిధ దేశాల్లో ప్రచలితమయ్యే కొత్త సిద్ధాంతాల్ని పోకడల్ని

తెలుసుకునే ఉత్సుకత కనబరచేవారు. కలకత్తా, బొంబాయి, మద్రాసు, ఢిల్లీ వంటి నగరాల్లో వీటికి సంబంధించిన సాహిత్యమూ వివిధ పత్రికల ద్వారా సమాచారమూ బాగా అందుబాటులో ఉండేది. ఈ విధంగా శ్రీశ్రీ మద్రాసు నగరంలో మార్క్సిజం గురించి స్థూలమైన పరిచయాన్నైనా పొందే అవకాశముంది. ఆ తరువాత రాజకీయ ప్రభావం అనివార్యం కావచ్చు. మానసికంగా సానుభూతి స్థితీ, పరిశీలనాగుణమూ తోడ్పడి ఉండవచ్చు. "శ్రామిక వర్గ శ్రేయస్సు కోరే కవి తనచుట్టూ ఉన్న సామాజిక శక్తుల మధ్య జరిగే సంఘర్షణలో తన పాత్రను నిర్వర్తించడానికి వెనుదీయడ"న్న మార్క్సీయమైన మాట శ్రీశ్రీ పట్ల బాగా వర్తిస్తుంది.

కవిత్వంలో "నేను సైతం విశ్వ వీణకు తంత్రినై మూర్ఛనలు పోతాను" అన్న భావన, చివరకు సమష్టి చైతన్యంలో కలిసి ఏకమయ్యే వ్యష్టి సంకల్పాన్ని చిత్రించే భావరూపాలతోను సంపన్నమైంది.

ఈ భావజాలానికి మహాప్రస్థానం రచన నాటి చరిత్రక నేపథ్యమూ, కొంత సహకరించింది. రెండో ప్రపంచయుద్ధ (1939-45) వాతావరణం నెలకొన్నప్పటి నుండీ, సమాజం ఆర్థికంగా విషమ పరిస్థితుల్ని ఎదుర్కోవలసి వచ్చింది. రాజకీయంగా సంక్షోభాన్ని పొందింది. యుద్ధానికి దారితీసే పరిస్థితుల్లో సమాజం ఏమంత సుఖశాంతులతో లేదు. ఫాసిస్టు నిరంకుశ శక్తులకూ, శాంతి కాముక శక్తులకూ మధ్య ఘర్షణ అనివార్యమైంది. ఇటలీ జర్మనీ ఫాసిస్టు దోరణులు మరీ విజృంభించాయి. ఈ కాలం (1934-39లో ఫ్రాన్సు మరియు యూరోపియన్ దేశాల్లో 1934-36లో కార్మిక వర్గ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలోకి వచ్చింది. ప్రపంచమంతటా క్రమంగా ముఖ్యమైన దేశాల్లో కార్మికుల కర్షకుల ఉద్యమాలు సమాఖ్యలు తలెత్తాయి. అంతటా శ్రామిక జనచైతన్యం విజృంభించింది. ఈ క్రమంలో బ్రిటన్ అమెరికా ఆపైన రష్యా ప్రపంచశాంతికై ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఏమైనప్పటికి ఈ సంక్షుబ్ధమైన కాలం శ్రీశ్రీ ఆలోచనపై అతని జీవితంపై అనివార్య ప్రభావాన్ని నెరపింది. సరిగ్గా 1933 నుండి 1942 మధ్యకాంలోనే గొప్ప కవిత్వం వచ్చింది. (1933 జయభేరి - 1934 అవతారం - 1934 మహాప్రస్థానం - 1934 దేశచరిత్రలు - 1937 వ్యత్యాసం 1937 అభ్యుదయం 1937 నవకవిత 1938 జ్వాలాతోరణం 1941 జగన్నాథ రథచక్రాలు 1942 గర్జించు రష్యా మహా ప్రస్థానం సంపుటిలోని గీతాలు వెలువడిన కాలం ఇదే. ఈ అంశం శ్రీశ్రీ మహాప్రస్థానం సమాలోచనలో గుర్తింపదగింది.

సమాజంలో ఆకలీ, దారిద్ర్యం, అజ్ఞానం ప్రబలింది. శ్రమ శక్తిని వశం చేసుకున్న ధనస్వామ్య వర్గానికి వ్యతిరేకంగా పోరాటమూ ఆరంభమైంది. వ్యవస్థలో మార్పు ప్రజలకు నవజీవనాన్ని ప్రసాదిస్తుందన్న అభిప్రాయం పుంజుకోవడం మొదలైంది.

"చిరకాలం జరిగిన మోసం బలవంతుల దౌర్జన్యాలు
ధనవంతుల పన్నాగాలు ఇంకానా ఇకమై సాగవు"

"ఒక వ్యక్తిని మరొక వ్యక్తి ఒక జాతిని వేరొక జాతి
పీడించే సాంఘిక ధర్మం ఇంకానా ఇకపై సాగదు" మార్క్సు గతి తార్కిక భౌతికవాదం చరిత్రను కొత్తకోణాల్లో దర్శింపజేసింది. సాహిత్యమూ సమాజమూ వేరు కావు. పరస్పరం సంబంధం కలవీ. అన్యోన్యం ప్రభావం నెరపేవీ. వీటి గమనం భౌతిక శక్తులపై ఆధారపడి ఉంటుంది. ప్రకృతిలో మార్పుల్ని బట్టి సమాజంలో మార్పులు జరుగుతాయి. ఇది సమాజమైన పరిణామరూపం. ఇదీ ఈ కవిత్వం మూల స్వరూపం.

1) ఈ జగత్తు వస్తు నిర్మితమైంది. భౌతికమైంది. ఆఖరికి మనస్సు కూడా భౌతిక రూపమే. ఇది మస్తిష్కంలో ఉన్న శక్తి నిలయం. ఆలోచనకూ అనుభవానికి జ్ఞానానికి కేంద్రస్థానం. మనస్సుకు గల ఈ శక్తి వల్లనే మానవజాతికి మహనీయత్వం సిద్ధిస్తోంది. ఈ మనస్సు భౌతికమైన ప్రపంచానికి ప్రతిరూపం అనవచ్చు. స్వతంత్రమైంది కాదు. మార్క్సు భౌతికవాదం మనస్సును దైవ ప్రాబల్యం నుండి ముక్తం చేసింది. అతీత శక్తుల ప్రాధాన్యం నుండి తప్పించింది. సమాజం వైపు వాస్తవం వైపు జీవితం వైపు సమస్యల వైపు మనిషి దృష్టిని మరల్చింది. జీవితంలో దృక్పథాన్నీ విలువల్నీ లక్ష్యాన్ని సంపూర్ణంగా మార్చేసింది.

2) సమాజంలో బహుసంఖ్యాకులు పీడితులే. పీడకులెప్పుడూ అల్ప సంఖ్యాకులే. బహు సంఖ్యాకుల జీవితాలు అల్ప సంఖ్యాకుల గుప్పిట్లో చిక్కుకపోయాయి ! వీరు అన్యాయాలకు అక్రమాలకు గురయ్యారు. అసమానత్వం పెరిగిపోయింది. దీన్ని సరిచేయడం సాధారణంగా కుదిరేపని కాదు. ప్రజల్లో దారిద్ర్యం అజ్ఞానం రోజురోజుకూ ప్రబలిపోయింది. నిస్సహాయస్థితిలో నలిగిపోతున్నారు. పీడకుల ప్రతారణ (Exploitation) బహుముఖాలుగా విస్తరించింది. అనేకమైన బాధలకూ కష్టాలకూ గురి అవుతున్నారు.

3) సామాజిక వ్యసవ్థకు మూలం ఆర్థికమే. ఆర్థిక వ్యవస్థే ఉపరితల నిర్మాణాన్ని రూపొందిస్తుంది. అందువల్ల సామాజిక వ్యవస్థ యొక్క మూలంలోనే మార్పు రావాలి.

ఉత్పత్తి సాధనాలపై "కష్ట జీవులకూ కర్మ వీరులకూ" అధిపత్యం చేకూరాలి. ఇది శ్రామిక జనచైతన్యంతో వర్గపోరాటం వల్లనే సాధ్యం. దీనికో సమయంలో సంఘర్షణ, విప్లవం అనివార్యాలౌతాయి. అభ్యుదయ కవిత్వం ప్రధానంగా ఈ భావస్థానాల్ని స్పృశిస్తుంది. నూతన వ్యవస్థలో స్వాతంత్ర్యాన్ని సమభావాన్నీ సౌభ్రాతృత్వాన్ని సౌహార్దాన్నీ కోరుతుంది. "శుభం పూచే" ఉదయాన్ని ఆశిస్తుంది.

4) మార్క్సిజం లక్షణాల్లో ఒకటి, పరస్పర వ్యతిరేక శక్తుల మధ్య సంఘర్షణ. దేశ చరిత్రలు గీతం ఈ సిద్ధాంత భావజాలానికి కళాత్మకమైన కవితారూపం అనవచ్చు.

5) "పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెను" మానవజాతి చరిత్ర అంతా వర్గాల మధ్య జరిగే సంఘర్షణ పర్యవసానమేనని కవి భావం. ప్రతీవస్తువులో రెండు విరుద్ధ శక్తులుంటాయి. ఇవి పరస్పరం సంఘర్షిస్తూ ఉంటాయి. సమాజంలో ఈ శక్తుల మధ్య సంఘర్షణ కొన్ని కొన్ని పరిస్థితుల్ని బట్టి మందంగానూ తీవ్రగానూ వేగంగానూ ఉండొచ్చు. వస్తువులో చలనం నిరంతరమైంది. ఏదోమార్పుకు లోనవుతూనే ఉంటుంది. ఇది పైకి కన్పించవచ్చు, కన్పించకపోవచ్చు. అందువల్లనే వస్తువు పరివర్తన గతి లక్షణం కలిగిందిగా పేర్కోడం జరగింది. ఈ క్రమంలో చూస్తే ప్రకృతీ ఆపైన మనిషీ కన్నా, మరో గొప్ప శక్తీ ఏదీ లేదు. ప్రకృతీ, మనుషులతో సమాజం రెండే ముఖ్యమైనవి.

6) ప్రతీ వస్తువులో అంతర్వైరుధ్యం ఉంటుంది. ఇది సమాజానికీ వర్తిస్తుంది. కొంతకాలానికి సృష్టి పాతదైపోతుంది. శిథిల సూచనలు కనిపిస్తాయి. ఇది వ్యక్తికీ సమాజానికీ అన్నిటికీ వర్తిస్తుంది. క్రమంగా కొంత కాలానికి వినాశనాన్ని పొందుతాయి. సమాజంలో అంతర్నిహితమైన "ఇతరేతర శక్తులు" పైకి లేస్తాయి. పరస్పరం సంఘర్షిస్తాయి. పాత శక్తులు పడిపోతాయి. ఈ వినాశనం నుండి కొత్త సృష్టి ఉద్భవిస్తుంది.

పుడమి తల్లికి పురిటి నొప్పులు కొత్త సృష్టిని స్ఫురింపజేస్తాయి. ఈ కొత్త సృష్టికి ముందు సంక్షోభం పెనుతుఫాను సంఘర్షణ భీభత్సం అనివార్యమౌతాయి ఈ స్థితి. "జాతి జాతి నిర్ఘాతపాత సంఘాత హేతువై కాలకేతువై అదె సంవర్తనపు తుఫాను మేఘం! తొలి గర్జించిన తూర్యవిరావం"గా భావితమైందీ కవిత్వంలో.

మహా ప్రస్థానంలో వివిధ గీతాల్లో గ్రీష్మం – అగ్ని – ప్రళయం – మహామేఘం – మహావర్షం – గర్జనం – సూర్యుడు – కిరణాలు – ఉదయం – పద్మం – సృష్టీ ఇట్లా ఎన్నో ప్రకృతి ప్రతీకలు తటస్థపడతాయి. ఇవి పాత వ్యవస్థ నుండి కొత్త వ్యవస్థ

ఆవిర్భావానికి సంకేతాలుగానూ నిబంధితమైనాయి. మార్పును గురించి ప్రకృతిపరంగా విశ్లేషిస్తే,

I) గ్రీష్మం మండే ఎండలతో చండప్రచండంగా తాండవిస్తుంది. ఈ భీషణమైన ఆతపానికి దీని ప్రభావ పర్యవసానంగా పరిణామ స్థితి హెచ్చి, నీరు ఆవిరై పైకి వెళ్ళిపోతుంది. ఆపైన మార్పుతో మేఘమై వర్షిస్తుంది. ఇది కొత్త సృష్టికి నాందీ రూపం. ఇదో విధమైన మార్పు.

II) నేల నుండి బీజం మొలకెత్తుతుంది. బీజం నశిస్తుంది. దాని స్థానంలో కొత్త సృష్టి పల్లవిస్తుంది. పాత వ్యవస్థ స్థానంలో కొత్త వ్యవస్థ అవతరించే విధం బహు సహజమైందీ అనివార్యమైందీ. ఇదో విధమైన మార్పు.

ఇట్లా ఇంకా అనేక విషయాల్లో మందవేగ తీవ్రస్థాయిల్లో పరిణామాల్ని గుర్తించవచ్చు. ఈ దృష్టితో భౌతికమైన అస్తిత్వానికీ చైతన్యానికీ పరస్పర సంబంధం ఉంది.

భౌతిక శక్తులపైనే చైతన్యం ఆధారపడి ఉంటుంది. ఇది ఎన్నెన్నో పరిణామ దశల్ని క్రమిస్తుంది. అవే ! సమాజంలో "సంరంభం ! సంక్షోభం ! సంఘర్షణ ! విప్లవం!" మొదలుగా దృష్టికి వస్తాయి. ఇక్కడ ప్రజలకు కష్టంలో దుఃఖంలో బాధలో సాంత్వనంతో ఆశాస్ఫూర్తినీ ధైర్యాన్నీ ఇవ్వడం కన్పిస్తుంది.

"వస్తున్నాయ్ వస్తున్నాయ్ వస్తున్నాయొస్తున్నాయ్
జగన్నాథ ! జగన్నాథ ! జగన్నాథ రథచక్రాల్"

విప్లవ చైతన్యంలో విప్లవ ప్రక్రియలో ఉత్పత్తి సాధనాలు ప్రజలకైవసమౌతాయి. విశ్వ శ్రామికుల సమష్టి చైతన్యంతో శ్రామిక రాజ్యం. అదే ! మరో ప్రపంచం సిద్ధిస్తుంది. ఇందులో కవి అంతర్యం, విశ్వాసం వ్యంజితమవుతున్నాయి.

'పతితులూ' 'భ్రష్టులూ' 'దీనులూ' 'హీనులూ' 'దరిద్రులూ' 'బాధితులూ' అందరూ కొత్త స్ఫూర్తితో మార్పుతో ఆనందించే 'స్వాతంత్ర్యం' 'సమభావం' 'సౌభ్రాత్రం' 'సౌహార్దం'తో "ఆ స్వప్నం నిజమౌతుంది" "ఆ స్వర్గం ఋజువౌతుంది" "జగమంతా శ్రామిక జన" "శాంతి శాంతి కాంతి శాంతి" చేకూరుతుంది. చివరకు ఆ కాంతిలో ఆ శాంతిలో సామ్యవాద మరో ప్రపంచ వ్యవస్థపై ఆశారూపంతో వెలసిందీ. కొత్త యుగానికి హేతుభూతమైందీ. తెలుగు సాహిత్యప్రపంచంలో అభ్యుదయ కవిత్వ పరిణామ శిఖరంగా అవిష్కృతమైందీ "మహాప్రస్థానం".

# 10. "అనితర సాధ్యం" శ్రీశ్రీ "మార్గం" ప్రతిపాదనం

శ్రీశ్రీ మార్గం కవి మాటల్లో "అనితర సాధ్యం" అనితరమంటే అనన్యమైందీ, సాటి లేనిదీ, ఇతరులు సాధించడానికి సులభం కానిదీ లేదా శక్యం కానిదీ. దీనికిదే సాటిగా భావించవచ్చు.

1) మహాప్రస్థానం కవితలు వెలువడి అర్ధ శతాబ్ది పైగా కాలం గడచినా ఇప్పటికీ వాటిలోని నవ్యత సామాజికత ఉపయోగిత విషయంలో ఆకర్షణ శక్తి తగ్గలేదు, పైగా ఈనాటి పరిస్థితుల్ని బట్టి ఇనుమడిస్తూంది. ఇది దీని అనితరమైన అస్తిత్వ రూపం.

2) i) ఈ సంపుటిలో రచనలు బహిర్గతంగా సంద్రమైన భావోద్రేకాన్ని అనురణించే శబ్దచలనాన్నీ వేగాన్నీ

ii) అంతర్గతంగా తీవ్రమైన కొన్ని సందర్భాల్లో నిశితమైన రసావేశాన్ని ప్రసరించే భాషా స్ఫూర్తినీ, దీప్తినీ పొందాయి. ఇదో అనితరమైన రసభావ శిల్పం.

3) కృతుల్లో

i) ఒక పొర (స్థాయి)లో ఉత్సాహం ఉధృతీ, ఉద్వేగం ఉల్లోలమూ, ఆరాటం ఆవేశమూ, సంవేదన సంచనలమూ ఉన్న సమాహిత స్థితులు అనుభావానికి వస్తాయి.

ii) ఇంకొక పొర (స్థాయి)లో యథార్థ జీవిత చిత్రణంతో సమాజం గురించి సామ్యవాద విప్లవ లక్ష్యమూ ఆలోచనకందుతాయి. ఈ రెండు స్థాయిలకూ సంబంధించిన కళాత్మకమైన మేళనం అనితరమైంది.

4) ఆంతర వ్యక్తిత్వం (Inner Personality), ప్రతిభ, సాహిత్య సంసర్గం చేత ప్రాప్తించిన 'పట్టు' (grip), కవి భాషాశక్తిని మాత్రమే కాకుండా ప్రయోగ నైపుణినీ ఆంతరమైన కళా హృదయాన్నీ ఆవిష్కరిస్తోంది. వివిధ నిష్పత్తుల్లో కలిసిన అభివ్యక్తి అనితరమైంది.

5) అభ్యుదయ కవిత్వానికాకృతినీ దిశనూ గమన వైఖరినీ విప్లవ లక్ష్యాన్ని చూపిన మహాప్రస్థానంలో కవితలు సహృదయుల నాల్కలపై అలవోకగా నర్తించే విశేషం నిస్సందేహంగా అనితరమైంది.

ఈ విశేషాల్ని దేనికది విశ్లేషించి వివిధాంశాల సహయోగాన్ని సమాలోచనకు సంకల్పిస్తే, మొత్తం మీద మహా ప్రస్థానంలో ఖండికల్నీ వివిధ సందర్భాల్లో ఉల్లేఖింపవలసి వస్తుంది. ఇది అంత వైవిధ్యోపేతమైంది.

మహా ప్రస్థానం కవితా సంపుటిని సంపూర్ణంగా అర్థం చేసుకోడానికీ అనుభవ విస్తృతిని పొందడానికీ ప్రాచ్య పాశ్చాత్య సాహిత్య శాస్త్ర మర్యాదలతో పాటు ఆధునిక సామాజిక రాజకీయ మనస్తత్వ శాస్త్ర ధోరణుల పరిచయమూ అవసరం.

సాహిత్య సమాలోచనం Literary Criticism

# నవల స్వరూపం

మాదిరాజు రంగారావు

2026

రసధుని – సాహితీ పరిషత్తు

శాంతినగర్, హైదరాబాద్ – 500 028.

Literary Criticism

# NAVALA - SWAROOPAM

(Sahithya Samalochanam)

by

Prof. Madiraju Ranga Rao

© : Dr. M. Santhosh Kumar

First Edition :1984
Second Edition: 2003
Third Edition : 2013
Third Edition : 2026

సమాలోచనం-2

# నవల స్వరూపం

## అంకితం

పరిశోధనకూ సమాలోచనకూ ప్రతిరూపం

పరిశోధనా రత్న

**ఆచార్య బిరుదు రాజు రామరాజు గారికి**

# సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ఆలోకనం | .......... | 67 |
| 2. | పరిమితులు - లక్ష్యం | .......... | 79 |
| 3. | వస్తువు | .......... | 89 |
| 4. | ఇతి వృత్తాం | .......... | 92 |
| 5. | పాత్ర స్వరూపం | .......... | 101 |
| 6. | వాతావరణ కల్పనం | .......... | 113 |
| 7. | సంభాషణ | .......... | 119 |
| 8. | శైలి | .......... | 125 |
| 9. | దృష్టికోణం | .......... | 132 |
| 10. | ప్రతీక | .......... | 140 |
| 11. | చైతన్య ప్రవంతి | .......... | 149 |
| 12. | ఉద్దేశం - నిర్దేశం | .......... | 160 |

# 1. నవల స్వరూపం

## I ఆలోకనం

నవల బహు స్వతంత్రమైందీ. ఎంతో విస్తృతమయిన పరిధి కలిగిందీ. జీవితానికత్యంత సన్నిహితమైందీ. సమాజ శక్తులతో కూడింది. ఈ ప్రక్రియ ఆధునిక యుగానికవసరమైందీ. ఎక్కువమందిని ఆకర్షించిందీ. రచనలో ఎత్తుకొన్న స్థాయిని చివరిదాకా నిలపడంలో రచయిత బాధ్యత అనల్పమైందీ. ఇది జీవితం గురించీ సమాజం గురించీ ఆలోచనకూ ఉన్నతమైన ప్రయోజనానికీ ఉద్దేశింపబడింది. రచయిత ప్రతిభచేత కవిత్వమూ నాటకంతో పాటు సమానమైన ప్రజామోదాన్ని పొందింది. వచనంలో ఉండడం వల్ల నిర్దిష్టమైన నియమ నిబంధనలు లేకపోవడంవల్ల సుగమత్వం వల్ల పాఠకుల్ని బాగా ఆకట్టుకుంది. బహు విస్తృతమయిన జీవితం ఆధారంగా వస్తువూ, స్వతంత్రమైన నిర్మాణ పరంపరతో రచయితకు దీనిపట్ల సానుకూలత్వాన్ని కలిగించడం మరో విశేషం. ఏ స్థానంనుండైనా ఏ స్థితినైనా గ్రహించే వీలుంది. ఇందులోని వస్తువు - ఇతివృత్తం పరిమితులతో అనేకమైన సంఘటనల క్రమంతో తీర్చబడుతుంది. సమాజాన్నీ మనిషినీ అనుక్షణం భావింపజేస్తుంది. రచయిత దర్శనంలోని మనో జగత్తులోనూ భౌతిక జగత్తులోని జీవితంతోనూ ఎక్కువ చేరువతనం కలిగిందీ. కథనశక్తిచేత ఆకర్షణీయతను పొందిందీ.

పాశ్చాత్య సాహిత్యంలో 1700 ప్రాంతంలో ఈనాడు మనం అనుకునే విధంగా నవల వ్రాయడం ఆరంభమయింది.

"కాల్పనికమైన వచన కథనం, కొంతవరకు తగినంత నిడివి కలిగిందీ. అందులో పాత్రలూ వాటి చర్యలూ వాస్తవ జీవితానికి ప్రాతినిధ్యం వహిస్తాయి. ఇంచుమించు కాస్త ఎక్కువగానో తక్కువగానో సంశ్లిష్టతను కలిగిన ఇతివృత్తంతో చిత్రితమవుతాయి". ఇదో నిర్వచనం.

Boccoccio మొదలైన రచయితలు వ్రాసిన చిన్న కథా రూపమయిన వచనరచన ఇటాలియన్ భాషలో క్రమంగా సుదీర్ఘమయిన కథతో వాస్తవమైన జీవితంలోని వ్యక్తులు పాత్రలుగా సంశ్లిష్ట (Complexity) గుణంతో నవల (నవెల్లా)గా రూపొందింది..

---

★ "A fictitious prose narrative of considerable length in which characters and actions representative of real life and portrayed in a plot of more or less complexity".

నవల ప్రవేశ సౌలభ్యం కలిగిన రూపంతో సమాజంలో మధ్యతరగతి ప్రజల నుండీ, పత్రికా రచనా వాతావరణం నుండీ ఉద్భవించింది. అయినప్పటికీ ఈనాడు క్రమ క్రమంగా అన్ని తరగతులవారికీ అందుబాటులోకి వచ్చింది. పూర్వం తీరిక ఉన్న పై తరగతివారే ఎక్కువగా చదివేవారు. విద్య బాగా వ్యాప్తి చెందడంతో సామాజికమైన అవగాహన, సాహిత్యపరమైన అభిలాష ఎక్కువ కావడంతో, దీని విస్తృతి ఈనాడు అధికతరమైంది, బహుళ ప్రచారాన్నీ పొందింది.

తెలుగులో నవల అవతరించి వంద సంవత్సరాలకు పైన అయింది. 1872లో గోపాలకృష్ణమచెట్టి "శ్రీరంగరాజచరిత్ర" వెలువడింది. 1878లో కందుకూరి వీరేశలింగం రాజశేఖరచరిత్ర ప్రకటితమయింది. ఇవి నవల పరిణామ చరిత్రలో ఆరంభదశ గురించి చర్చలో ప్రముఖస్థానాన్ని వహిస్తాయి.

ముఖ్యంగా ఇంగ్లీషు బెంగాలి భాషల ప్రభావంతో ఇతర భాషలతో, వ్యక్తులతో, ప్రాంతాలతో పరిచయ సంబంధాలవల్ల, తెలుగు సాహిత్యంలో ఆధునిక వాతావరణానికి కొత్తదనం వచ్చింది. ఈ కొత్తదనం నవల్లో సులభంగా సంపూర్ణంగా ప్రతిఫలించింది. సమాజంలో వచ్చే మార్పులు ఇతర ప్రక్రియల్లోకన్నా నవల్లో చాలా విస్తృతంగా సంపూర్ణంగా ప్రసరిస్తాయి. కారణం దీని నిర్మాణపరిధితోపాటు అవకాశ స్థానాలు ఎక్కువగా ఉండడమే. జీవితానికత్యంత సన్నిహితమైంది కావడమూ.

## II

నవల చదవడానికి పాఠకులకు ఎక్కువ సాహిత్య పరిజ్ఞానం అవసరం లేదన్న అభిప్రాయం ఉంది. కాని, అనుభవగుణంలో మాత్రం మినహాయింపు లేదు. అంతో ఇంతో సాహిత్య పరిజ్ఞానం ఉంటేనే మంచిది. చాలా తక్కువ నియమాలతో ఎక్కువ స్వాతంత్ర్యమూ అవకాశాలూ కలిగిన కారణంగా బహుళ వ్యాప్తినీ, విశేషాదరాన్నీ పొందింది, అయినప్పటికీ విలువల విషయంలో కనీస ప్రమాణాలు పాటించవలసే ఉంటుంది. ఎంత పరిజ్ఞానముంటే అంతగా శక్తిని గ్రహించేవీలుంది.

ఉత్తమమైన నవల ఏ విధంగానూ ఉన్నతమైన ఆలోచనలో ఆదర్శంలో భావనలో ఏ ప్రక్రియకూ తీసిపోదు. అయితే అనుభూతి సాంద్రతలో అంతరం ప్రక్రియనుబట్టి భేదించడం సహజం. లేకపోతే సాహిత్యంలో వైవిధ్యం లోపిస్తుంది. ఒక నవల్లో కన్పించే జీవితం సంపూర్ణం కాదు. ఎప్పటికీ ఎన్ని నవలలు వచ్చినా ఇంకా ఎంతో జీవితం మిగిలే ఉంటుంది. ఏ విషయంలోనైనా నియమాలు తక్కువగా ఉండి, స్వేచ్ఛ

ఎక్కువగా ఉన్నపుడు వ్యక్తి బాధ్యత పెరుగుతుంది. వివేకం అవసరమూ ఎక్కువవుతుంది. స్వేచ్ఛ వల్ల సమాజంలో వచ్చే మలుపుల్నిబట్టీ మార్పుల్నిబట్టీ, జీవితం గురించి ఆలోచన అవగాహన పెరిగినకొద్దీ, ఈ ప్రక్రియవైపు పాఠకుల దృష్టి ప్రసరించడం సహజం. ఇది ప్రజల ఆశలూ ఆశయాలు బింబించే చిత్రించే సాహిత్యరూపంగా సాన్నిహిత్యం పొందడం జరిగింది.

తెలుగులో కవిత్వం నాటకం గురించి జరిగినంత ఆలోచన లక్షణ వివేచన స్వరూప విమర్శ నవల గురించి జరగలేదు. దీనికి కారణం ఇది బాగా ఇటీవలి ప్రక్రియ కావడమే. కవిత్వంతో నాటకంతో పోలిస్తే దీని పరిణామ చరిత్ర చాలా స్వల్పమైంది. ఈనాడు సాహిత్యం పట్ల పెరుగుతూన్న అభిరుచీ, ఇతర ప్రచార సాధనాలు అందుబాటులో ఉన్న తీరూ వల్ల నవల రచనా వ్యాసంగానికెక్కువైన అవకాశాలున్న దృష్ట్యా, దీని స్థానం స్థిరపడింది. దీన్ని గురించి ఆలోచన, విమర్శ వేగవంతమయింది. వంద సంవత్సరాల కాలంపై సమాజంలో, బహువిధ సమస్యల్నీ, స్థితుల్నీ, జీవితంలో బహువిధ ప్రవర్తనల్నీ, రీతుల్నీ, దీనికిగల విస్తృతమైన అవకాశం చేత, నవల గతంతోపాటు వర్తమాన గమనాన్నీ చిత్రిస్తూంది, దర్శింపజేస్తూంది. సాహిత్యంలో కావ్యంతో నాటకంతో సమానంగా నిలబడే స్థాయికి చేరుకోడం గొప్ప విషయమే.

భారతీయ భాషల్లోను ఇంచుమించు ఇదే స్థితిలో ప్రవర్తిల్లింది. తెలుగు సాహిత్యంలో కొన్ని నవలలు 'క్లాసిక్స్' శిఖరాల్లా తలెత్తుకొని కాలపరీక్షకు నిలిచాయి. ఇదీ ప్రక్రియకు గల అనన్యమైన వర్ధమాన జీవశక్తి ఎంతటిదో స్పష్టం చేస్తూంది.

## III

ఆధునిక జీవితంలో అన్నిరంగాల్లో వచ్చే వేగవంతమయిన మార్పులతో ఎప్పటికప్పుడు సరికొత్త వాతావరణాన్ని బింబించే శక్తి నవలకు సంపూర్ణంగా ఉంది. ఇది ఎలాంటి వస్తువునైనా భావజాలాన్నైనా తనలో ఇముడ్చుకోగలదు. హెన్రీ జేమ్స్ మాటల్లో – "నవల అనేది ఒక గృహం. దీనికి అనేకమైన గవాక్షాలకు అవకాశం ఉంది. వ్యక్తి కోరిక, దర్శనం చేత విశాలమైన మానవ దృశ్యక్షేత్రాన్ని విలోకించడానికి దేన్నైనా తెరచి చూడొచ్చు"★.

★ "The house of fiction has the possibility of millions of windows, any which can be fashioned to open on the spreading field of human scene by the pressure of an individual will and vision"

వ్యక్తినీ జీవితాన్నీ సమాజాన్నీ ఒక్కొక్క రచయిత ఒక్కొక్క దృష్టితో చూస్తాడు. ఒక్కొక్క భావ కోణంలో దర్శిస్తాడు. స్థూలంగా సమాజం వ్యక్తీ పరంగా చూస్తే రెండు విధాలైన నవలలు విశ్లేషణకందుతాయి. 1) మానవ సంబంధమైన అవగాహనతో సమాజపరమైన చిత్రణంతో ప్రధానంగా ఉన్నవి – ఒక విధం. 2) మనస్సంబంధమైన ఆలోచనతో వ్యక్తిపరమైన ప్రకాశనం ప్రధానంగా ఉన్నవి – మరో విధం. ఇవి అంతర రూపాన్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తాయి. రచనలో ఒక విధం మరో విధానానికి ఉపస్కారకంగానూ ఉండటం కద్దు.

నవల్లో సంఘటనల పాత్రల సంబంధాన్ని పురస్కరించుకొని నిర్మాణరూపం ఉంటుంది. దీని నిర్వహణం కేవల భౌతికమైన సంస్థితికే కాక, బయటికి కన్పించని అంతర రీతికీ సంబంధించి ఉంటుంది. మనస్తత్వ శాస్త్రపరంగా 'మనోవిశ్లేషణ'కు దారితీస్తుంది. ఆధునిక నవల్లో దీన్ని గమనించవచ్చు.

ఇది ఇట్లా ఉంచి సమాజగమనంలో జీవిత చిత్రణం వెనుక నున్న అదృశ్య శక్తుల్ని గుర్తించడమూ అవసరమవుతుంది. దీనికి చరిత్ర సంస్కృతి సామాజిక శాస్త్రం, రాజకీయ శాస్త్రం, మనస్తత్వశాస్త్రం ఇంకా ఇతరమైన విషయాలతోపరిచయం ఉంటే మరీ మంచిది. వీటి అవగాహనతో వ్రాసిన రచనా స్థాయి నిస్సందేహంగా పెరుగుతుంది. నవల వ్రాసేటప్పుడు అందులోని వస్తువుకు సంబంధించిన విషయాల పరిజ్ఞానం ఉండాలి, ఇది తప్పనిసరి. ఉదాహరణకు చారిత్రకమైన ఇతివృత్తం తీసుకుంటే ఆ కాలంలోని మనుషుల జీవితాలూ రాజకీయ సామాజిక వ్యవస్థ ఆచార వ్యవహారాలు వేషభూషాదులే కాకుండా, స్థల విశేషాలు, ప్రకృతి పరిసరాలూ బాగా తెలుసుకొని వ్రాస్తే మరీ మంచిది. ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ సేకరించిన సరియైన చారిత్రక సాంస్కృతిక సమాచారం కథా భాగాల్లో సంయోజితం కావాలి. ఆ కాలంలో నెలకొన్న వాతావరణానికి తగిన వాస్తవాన్ని సాధ్యమైనంతవరకు నిర్మించాలి. ఇది సామాజిక విషయాలకూ వర్తిస్తుంది. ఈ శ్రమాకలితమైన పూర్వ ప్రయత్నం తెలుగులో అంతగా కన్పించదు. చాలావరకు కల్పనలోనూ శ్రుతివచనంగానూ, లభించిన గ్రంథాల్లో అదీ చదివో చదవకనో, కల్పనిక పాత్రలతో సంఘటనలతో గుప్పించడం జరుగుతూంది. అందువల్ల నవల పరిపుష్టమైన రూపాన్ని పొందడం లేదు. ఒక పాశ్చాత్య రచయితకూ మనకూ ఇక్కడే తేడా! గురజాడ కన్యాశుల్కం నాటకం వ్రాసేముందు ఈ సమస్య గురించి సమాచారం సేకరించి, వస్తుపరమైన నవ్యతతో పాటు వాస్తవికతనూ సహజత్వాన్ని సాధించాడు. దీనివల్ల ఎంత గొప్ప శాశ్వత ప్రయోజనం సమకూరిందో అందరికీ తెలిసిందే. కవిత్వానికన్నా నాటకానికీ అందునా నవలకు విషయాభిలాషతోపాటు వాస్తవాల సేకరణలో నిబద్ధత అవసరం.

## IV

రచనలో లక్ష్యశుద్ధీ అంకితభావమూ వాస్తవాలపట్ల శ్రద్ధవల్ల రచనలో ప్రభావశక్తి ఇనుమడిస్తుంది. వచనంలో ఉండే నవల్లో కవిత్వంలో వలె నాటకంలోవలె లోపాల్ని బలహీనతల్ని కప్పేసే వేరే ఉపాయాలంతగా లేవు. అందువల్ల రచనలో వ్యగ్రతను నిలిపేందుకూ, కళాత్మకతను పెంపొందించేందుకూ ప్రయత్నం అవసరం. ఈ దిశలో అధిక ప్రయోజనాన్ని సాధించేందుకు రచయిత బాధ్యత ఎంతో బరువైంది. దీన్ని విస్మరించడంవల్ల రచన ప్రమాణాల్ని అందుకోలేకపోతుంది. నవల్లో క్షేత్రపరిధి చాలా విస్తృతమయింది. కాబట్టి ఒక సమస్య గురించి ఒక పాత్ర గురించి ఒక సంఘటన గురించి అవగాహనలో ప్రత్యేకతను కనబరచడంతో వీటి సముచిత సంయోజనంతో రచనకు ఆకర్షణ సిద్ధిస్తుంది. సహజత్వంతో వాస్తవికతతో పాఠకుల్ని ఆకట్టుకుంటుంది. కల్పన అవసరమే. అంతో ఇంతో కల్పన సృజన ప్రక్రియల్లో అనివార్యం. అయితే నవల్లో మనుషుల అనుభవ ప్రపంచంతో సామాజిక జీవన భూమిక ప్రధానంగా ఉంటుంది.

1) వ్యక్తీ–సమాజం, 2) చరిత్ర–సంస్కృతి, 3) జీవితం–అనుభవం, 4) సమస్య–సంఘర్షణ, 5) ప్రయోజనం–లక్ష్యం, 6) శాంతి–సౌభాగ్యం. వీటి పరిజ్ఞానంతో అధ్యయనంతో అవగాహనతో నవలకు విస్తృతీ లోతు కలుగుతాయి. వీటి ఆవిష్కారానికి ఉత్తమ సాధనం నవల. ఈ సాధనంపైన, రచనా సందర్భంలో పట్టుతప్పిపోయే ప్రమాదం ఉంది. మరోటి, రచయితలో ఒక నిర్దిష్టమైన లక్ష్యం లేకపోవడంవల్ల, కళేతరమైన ఒత్తిడులవల్ల, మానసికంగా తత్కాల ప్రయోజనాలకు లొంగిపోవడంవల్ల, రచనలో గాఢత్వం చెదరిపోతుంది. కళాత్మకత సన్నగిల్లుతుంది. దీని విస్తరణ రూపమే ఫార్ములా నవలలు వస్తూ పోతాయి. సామాజికమైన ఉత్తమ నవల్లో పాత ప్రపంచం గురించి ఆలోచన ఉంటుంది. ఆశించే కొత్త ప్రపంచం గురించి దర్శనం లేదా స్ఫూర్తి ఉంటుంది. వర్తమానం గురించి అనుభవంతో విశ్లేషణతో చిత్రణతో వ్యాఖ్యానంతో జీవితం స్పందిస్తుంది. రచన ఆనందాన్నిస్తూనే ఆలోచననూ వికసింపజేయాలి. సమాజస్థితిలో సాగే గమనంలో పరివర్తనలో భాగం అవాలి. ఈ విషయాలన్నీ కాకపోయినా కొన్నైనా ఎన్నుకున్న పరిధిలో సామరస్యాన్ని పొందడంలో రచన శిల్పవంతమవుతుంది. మనస్సుపై చెరగని ముద్ర వేస్తుంది కొంత కాలం నిలుస్తుంది.

## V

ప్రతి వ్యక్తీ ఏదో ఓ స్థలంలో ఓ కాలంలో ఓ వ్యవస్థలో భాగంగానే జీవిస్తాడు. ఈ వ్యవస్థ చారిత్ర సాంఘిక రాజకీయ ఆర్థిక నైతిక వైజ్ఞానిక పరిణామ శక్తులతో

రూపొందింది కావడంవల్ల దీని ప్రభావం పుట్టిపెరిగిన వాతావరణాన్నిబట్టి ప్రసరిస్తుంది. వ్యక్తిత్వం ఏర్పడుతుంది. స్థూలంగా వ్యక్తి నుండి వ్యక్తికి దీని స్వరూపం భేదిస్తుంది. మానసిక తలంపై పనిచేసే అంశాలు ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రేరేపిస్తాయి. సమాజం వ్యక్తుల సంబంధాలతో కూడింది. ఎందరో వ్యక్తుల ఉనికీ అవసరాల ప్రయోజనాల లక్ష్యాలతో ఏర్పడిన సమాజం నుండి రచయిత వస్తువును గ్రహిస్తాడు, ఇతివృత్తాన్ని నిర్మిస్తాడు. పాత్రల్ని ప్రవేశపెడతాడు. వాటిని చలనశీలాన్నీ గమనపథాన్నీ, గమ్యస్థానాన్నీ లక్షిస్తాడు. ఇదో సాలీడు గూడులాంటిది. నవల మానవ జీవితానికి ప్రతిరూపం అనడంలోని యాథార్థ్యమిదే. సమాజంలో సంచరించే వ్యక్తివలెనే నవల్లో ప్రతి పాత్ర నిర్మాణ రూపాన్ని పొందుతుంది. ఈ పరంపరలో ఆశ నిరాశ – ఆరాటం వేదన – ఆనందం విషాదం – సుఖమూ దుఃఖమూ – శాంతి రణం – కాంతి సౌభాగ్యం, ఇట్లా అనేక భావబింబాలూ వాటి ప్రతిబింబాలూ కలిసి బహు సంక్లిష్టమైన సంస్థితుల్ని పొందుతాయి. మనల్ని ఆకర్షిస్తాయి. మానసికమైన అనుబంధాన్ని నెరపుతాయి. వీటి ఆవిష్కారంలో భావనా జగత్తుకొక రూపం ఇవ్వడంలో కొంత కల్పన ఉండవచ్చు. అయితే ఏ రచయిత అయినా చివరకు మానవ సంబంధాలకూ మానవత్వమూ దాని విలువలకూ భంజకం కాకుండానే జాగరూకత వహిస్తాడు. రచయిత చూచిందీ విన్నదీ, అనుభవానికి వచ్చిందీ ఎంత వాస్తవంగా చిత్రిద్దామనుకున్నా కొంత కల్పన చోటుచేసుకుంటుంది, తప్పదు. ఇక్కడ సంఘటన ఆధారంగా పాత్రకు కళాకృతినిచ్చే శక్తీ, పాత్ర గతిశీలంలో జీవిత రూపమూ ముఖ్యం, దీని తీర్పు రచయిత దృక్పథంపై ఆధారపడి ఉంది.

కథావస్తువులో అవసరాల్ని బట్టి రచయిత దృక్పథంవైపునే పాత్రలు తీర్చబడతాయి. అభిప్రాయాల సిద్ధాంతాల సరళినిబట్టి లక్ష్యం ఉంటుంది. రచయిత 1) సమాజంలో సమన్వయభావం కోరవచ్చు, 2) వ్యతిరేక భావం కలిగి ఉండవచ్చు, 3) తనదైన ప్రత్యేకతను కాపాడుకోవచ్చు, 4) తప్పుకొనే లక్షణం కలిగి ఉండొచ్చు. ఇందులో వైయక్తికమైన ఏకాంత చిత్రణకు ప్రాధాన్యం ఉంటుంది. ఈ అంశాలు రచనలో వివిధ నిష్పత్తులో ఆయా సందర్భాల్లో సమీకృతమవుతాయి.

ఏమైనప్పటికీ రచయిత మనోరూపానికీ అభిప్రాయ సముదాయానికీ, ఇవి ప్రచలించే వర్తమాన కాలానికీ మధ్య ప్రసారరూపం ఉంటుంది. రచయిత దీన్ని గుర్తించి బాధ్యతను నిర్వహించడంలో అనేకమైన భేదాలు ఉత్పన్నమవుతాయి. సమాజపరంగా నవల స్థానం ఈ నిర్వహణ రీతులపై ఆధారపడి ఉంటుంది. సమకాలీన సమస్యను తీసుకున్నపడు అందులోనూ వివాదాస్పదమైన సమస్యను ఎత్తుకున్నపుడు, రచయిత

బాధ్యత మరీ గురుతరమవుతుంది. ఒక భావుకుడు జీవితాన్ని దర్శించి స్పందించి ఉత్సాహంతో తన విశిష్టమైన అనుభవాన్నీ ఆలోచననూ దృక్పథాన్నీ ఇతరులకు స్వేచ్ఛగా అందజేసే సంకల్పం పొందిన కార్యరూపం నవల. ఇందులో జీవితంలోని సారభూతమైన ప్రపంచం సులభంగా అవతరిస్తుంది.

భాష విషయంలో ఒక మాట. నవల్లో కథనం వర్ణనం. వ్యాఖ్యానం సంభాషణ మానసిక చిత్రణం మొదలుగా అనేక సందర్భాలెదురవుతాయి. ఎంతో విస్తృతమైన పరిధి కలిగిన రచనలో వైవిధ్యం అవసరమవుతుంది. కేవలం మాండలికంలో దీన్ని చూపడం సాధ్యం కాదు. మాండలికం కొన్ని పరిమితుల్లో గుణాన్నే ఇస్తుంది. అయితే నవల్లో సాహిత్యపరమైన శిల్పం దృష్ట్యా భాషాగతంగా ప్రామాణికాన్ని కలిగి ఉండాలి. దీనివల్ల పాఠకులకు విసుగునుండి విముక్తి కలుగుతుంది పాఠకుల పరిధి పెరుగుతుంది.

ఈ భాషాగతమైన నిర్వహణ శిల్పం, విస్తృత ప్రయోజనంతో, నవలను చివరిదాకా చదివింపజేసే ఆకర్షణను పెంపొందిస్తుందనడంలో సందేహం లేదు. రచయిత భాషాగతమైన వైశాల్యాన్ని పొందడంతో రచనలో దీని శక్తి పెరుగుతుంది.

నవలకు సంబంధించిన సృజన విషయంలో పాఠకుల బాధ్యత కూడా ఉంది. దీన్ని విస్మరించడానికి వీల్లేదు. పాఠకుల్లో ఒకస్థాయినందుకొనే సాహిత్య సంస్కారం, తృష్ణ, అనుభూతి గుణంతోపాటు, రచయిత స్పందనతో సుస్వరతను పొందాలి. అభిప్రాయ భేదాలుండవచ్చు, అది వేరే విషయం. అనుభవ తత్పరతతో రచయిత వ్యక్తిత్వంతో ఏకరూపతను పొందడంతోపాటు రచనా విషయంలో అవగాహన కూడా అవసరం.

## VI

నవల పఠనంలో కవిత్వానికీ నవలకూ భేదం ఉంది. కవిత్వంలో శబ్దం, అన్వయం, అర్థాంతరం, రచనాశిల్పం మొదలైనవి ఖండఖండంగా సమాహారంగా పరిశీలనకు వస్తాయి. అవగాహనతో మననంతో సాంద్రమైన అనుభవ బింబాన్నీ ఆలోచనా రీతినీ వివేచించడం అవసరమవుతుంది. నవల్లో పాఠకుడు ప్రతి పంక్తీ చదివేప్పుడు మొత్తంమీద సాధారణ తలంపై వేగాన్ని అందుకొని క్రమిస్తుంది. ఈ ముందుకు పోవడం అనేది నవల్లో చదివించే గుణం వల్ల ఏర్పడుతుంది. కొన్ని నవలల్లో మధ్య మధ్య దాటేయడానికి వీలూ, కొన్ని నవలల్లో (చలం) చివరిదాకా చదివించే గుణం కన్పిస్తుంది. ఇతర విషయాలు అట్లా ఉంచి ఇక్కడ భాషకు గల ప్రాధాన్యం అనితరమైంది. అంటే

పాండిత్యమయంగానూ కాదు, ఆలంకారికంగానూ కాదు. నవల్లో వైవిధ్యాన్ని ప్రదర్శించ గలిగిన రీతినీ, ప్రామాణికతనూ, స్థాయినీ కలిగి ఉండడం అన్నమాట.

నవల గురించి విస్తృతమైన ప్రాతిపదికపై పఠనంలో బోధనలో వస్తువును గుర్తించటం, ఇతివృత్తాన్ని పరిశీలించడం, సంఘటనల సంయోజనం, పాత్రచిత్రణం, సంఘర్షణ విధం, రచయిత దృక్పథం ఇంకా ప్రతీకలు అభిప్రాయాలూ ఆదర్శాలు మొత్తం మీద నిర్మాణ శిల్పం గురించి వివేచన జరుపబడుతుంది. ఉత్తమ నవలను అనుభవించ డానికి కనీస స్థాయిలో అభిలాష సాహిత్య సంస్కారం ఉంటే మరీమంచిది. నవల అధ్యయనంలో వివిధాంశాల సంకీర్ణ స్థితిని సుగమం చేయడానికి పాఠకుని యోగ్యత సమర్థత తత్పరత ఎంతో తోడ్పడుతుంది.

నవల్లో ఒక సంఘటన లేదా పాత్ర ఎందుకు ఆకర్షిస్తోంది? ఎందుకు వైముఖ్యాన్ని కలిగిస్తోంది? ఇది సంఘటనల కల్పన వల్లనా పాత్రల వ్యక్తిత్వం వల్లనా? రచయిత నిర్వహణం వల్లనా? ఈ ప్రశ్నలకు సమాధానంలో పాఠకుని సంస్కార స్థాయి, ఆలోచనా పరిణతి నిక్షిప్తమై ఉంది. రచనలో నిర్మాణ శిల్పం, కళా సౌందర్యం నుండి అభిప్రాయ ప్రకాశనం దాకా ఎదురయ్యే సమస్యలకు సహేతుకమైన అనుభూతి గతమైన సమాలోచనం విమర్శ స్థానాన్ని వహిస్తుంది. సమస్య ప్రతిపాదనం - పరిష్కార నిర్ణయం అనేది రచయిత నిర్మాణ లక్ష్యదృష్టినిబట్టి ఉంటుంది.

ఒక్కొక్కప్పుడు కొందరి విషయంలో నవలలు చదువుతూ పోతూంటే అభిలాష ఎక్కువ అవుతుంది. అభిరుచి సంస్కరింపబడుతుంది. వివేచన మొనదేరుతుంది. మొట్టమొదటి స్థితికీ ఆ తరువాత తరువాత పోను పోను స్థితికీ, అనుభవ భేదాన్ని ఇట్టే గుర్తించవచ్చు. విశిష్టమైన పరివర్తనకు లోనైన మనస్సుకు నవల పట్ల విస్తృతమైన అవగాహన స్ఫూర్తికి వస్తుంది. ఈ మానసిక క్రమం నవల విషయంలో అప్రయత్నంగానూ, అక్లిష్టంగానూ చాలావరకు సాగిపోతుంది. అయితే అనుభవ ప్రపంచం వేరు, విమర్శ ప్రపంచం వేరు. విమర్శలో ఎదురయ్యే ప్రశ్నలు వేరు. వాటి సమాధానాలు లోతైన అధ్యయనాన్ని అపేక్షిస్తాయి. సాధారణంగా పాఠకుల్లో తమచుట్టూ ఉన్న జీవిత ప్రపంచమే నవల్లోనూ కన్పించడంతో, అనుకోకుండా మానసికమైన బాంధవ్యం ఏర్పడుతుంది. ఆపైన ఐక్యతా స్ఫూర్తి కలుగుతుంది.

## VII

ఒక్కొక్క రచయిత గురించి లేదా రచన గురించి సరియైనవీ, కానివీ ఏవో అభిప్రాయాలు వ్యాపించవచ్చు. అవి వ్యక్తిపరంగా కావచ్చు, సిద్ధాంతపరమైనవి కావచ్చు. నవల గురించి నిర్మాణ పరంగానూ, ప్రేరణపరంగానూ కావచ్చు. రచయిత స్వంతమైన వైయక్తికమైన అంశాల్ని ఆశ్రయించి ఉండొచ్చు. అవి రచనకు జోడింపబడవచ్చు. ఈ స్థితిలో వస్తుపరమైన హేతు దృష్టి విమర్శకు బాగా ఉపకరిస్తుంది. ఒకటి మాత్రం గుర్తుపెట్టుకోవలసి ఉంది. సిద్ధాంతపరమైన అంశాలకూ, కళాపరమైన అంశాలకూ మధ్యగల సూక్ష్మమైన అంతరాన్ని గుర్తించవలసి ఉంది. స్థూలంగా రెండూ కలిసి రచనా శిల్పంలో భాగమయ్యే మాట నిజమే. సిద్ధాంతం లేదా ఆదర్శమూ మరియు కళ – రెండూ వేరువేరుగానూ కలసీ ఒకటిగానూ ఏ విలువల్ని సాధించిందీ, ఏ ప్రమాణాల్ని నెలకొల్పిందీ, ఏ స్థాయిని అందుకుందీ, సమాలోచనలో భాగమవుతాయి.

సైద్ధాంతికంగా బలం కలిగి ఉన్నా, కళాత్మకంగా రచన విజయం సాధించక పోవచ్చు. తక్కువస్థాయికి చెందినదై ఉండొచ్చు. కళాత్మకంగా గొప్పదై సైద్ధాంతికంగా తటస్థ వైఖరి లేదా పాఠకునితో విభేదించేదిగానూ ఉండొచ్చు. సిద్ధాంతాలకూ కళావాదాలకూ అతీతంగా స్వేచ్ఛ-మానవత ఉదారత మొదలైన విశ్వజనీనమైన మానవీయ భావనతో పరిపుష్టం కావచ్చు. ఈ అంశాలపై వెలుగు ప్రసరించడం నవలా విమర్శకుని కర్తవ్యం. స్వేచ్ఛగా ఆలోచించడం అభిప్రాయాలు వ్యక్తం చేయడం ప్రజాస్వామ్యంలోని అవకాశాలు ఇవి సాహిత్యానికి మౌలికమైన ఉపకృతికి దోహదం చేస్తాయి.

నవల్లో రచయితకు స్వేచ్ఛ ఉంది. అలాగే చదివే పాఠకులకూ ఉంది. నవల బయటికి వచ్చి ప్రజాపరమయిన తరువాత అందులో అంశాల్లో దేన్నైనా ప్రశ్నించవచ్చు! తిరస్కరించవచ్చు! సమాలోచనంలో అభిప్రాయ ప్రకటనంగానీ, ప్రశంసగానీ సహేతుకంగా విషయ ప్రధానంగా, దృక్పథం వేరైనప్పటికీ ఉంటే, సాహిత్య ప్రపంచంలో ఉత్తమ వాతావరణానికి దారితీస్తుంది.

ప్రతి వ్యక్తి మనోరూపానికి కొన్నిపరిమితులుంటాయి. ఈ పరిమితుల్లో ఆలోచనకొక దిశ ఉంటుంది, అనుభూతికొక సాంద్రత ఉంటుంది, సంస్కారానికొక పరిమళ రూపం ఉంటుంది, వివేచనకొక లోతు ఉంటుంధి. ఇవన్నీ వ్యక్తిత్వ చిత్రంలో విలువైన రేఖలు! ఒక్కొక్క సందర్భంలో అనుభూతికి హేతువు లొంగిపోవచ్చు. మరో సందర్భంలో అనుభూతిని హేతువు తిరస్కరించవచ్చు. ఏమైనప్పటికీ అందరూ ఏకీభవించే

మానసిక తలం ఒకటి ఉంది. అది మానవీయమైందీ, మానవతా పూర్ణమైందీ, స్వేచ్ఛాయుతమైందీ, అనుభవాత్మకమైందీ.

## VIII

నవల గురించి ఆలోచన చేస్తే రచన రెండు విధాలుగా ఆవిర్భవిస్తుంది. 1) ఒకవిధం : జీవితం గురించి అవగాహనను విస్తృతం చేసేదీ, అనుభవాల లోతుల్ని స్పృశించేదీ, కళాత్మకమైన విలువలకు ప్రాధాన్యం ఇచ్చేదీ, ఒక దృక్పథం కలిగిందీ, రచయిత విశిష్ట వ్యక్తిత్వాన్ని భావింపజేసేదీ. 2) రెండో విధం : సమస్యపై దృష్టి లేకుండా కాలక్షేపం కోసం వ్రాసేవీ. ఇందులో గాఢమైన చింతన ఉండదు. అనుభవ సాంద్రత ఉండదు. ఇవి సాధారణ స్థాయిలో పాఠకుల్ని అలరిస్తాయి. కళాత్మకమైన విలువల్ని అంతగా పట్టించుకోనివీ. ఈ రెండు విధాలు ఆవిర్భవించే మానసిక దశలు వేరువేరుగా గుర్తించవచ్చు. ఇతర ప్రక్రియల్లో కన్నా నవల్లో వ్యక్తీ జీవితం సమాజం గురించి చింతన ఎక్కువ. ప్రయాణమూ దీర్ఘమే. దీనికెంతో ఆలోచన అనుభవం స్పందనం అవసరం.

ఇతివృత్తం, పాత్రలు, సంఘటనలు, ప్రతీకలు, అభిప్రాయం, ఆదర్శం, సిద్ధాంతం మొదలైనవి నవల్లో కొంతవరకే దేనికదిగా పరిశీలనార్హాలు, కాని అన్నిటినీ కలిపి సావయవ కళారూపంగా ఏకముఖంగా ప్రవర్తింపజేసి పరిశీలన జరపడంలోనే నవలా సమాలోచనకు న్యాయం చేకూరుతుంది. సమగ్రత సిద్ధిస్తుంది. నిజానికి పై అంశాలు ఒకదానితోమరొకటి తప్పనిసరిగా సంబంధం కలిగేఉంటాయి. ఇది సహజం కూడా. ఇతివృత్తంలో సంఘటనల క్రమానికీ పాత్రల ప్రవర్తనకూ సంబంధం తప్పనిసరిగా ఉంటుంది. లేకపోతే ఆకృతి సిద్ధించదు. రచనలో అనేకమైన అవయవాలు సమీకృతమైన (సంపుటిగానున్న) నవలను ఏకాకృతిగా దర్శించడంలోనే, దాని అస్తిత్వం ఉంది. అనుభవ సంపూర్ణత చేకూరుతుంది. దీన్ని పరిపుష్టం చేసే మరో అంశం, నవల్లో అభిప్రాయం, ప్రయోజన సంబంధమైంది. ఇది పాత్రల ప్రవర్తనలో సంభాషణలో, రచయిత మాటల్లో మధ్యమధ్య వివృతం కావచ్చు! నవల మొత్తంమీద చివర పర్యవసానంలో ప్రభావసుందరంగా సూచితమూ కావచ్చు. మొత్తంమీద అంటే ఇతివృత్తం పాత్రచిత్రణం, దృష్టీ, దర్శనం, సంభాషణలు మొదలైన అంశాలన్నీ పొందికగా అమరీ, అంతర్లీనమైన కళారూపమే నవల!

## IX

నవల గురించి ఒక అభిప్రాయం ఉంది. ఇది కథ, జీవితచరిత్ర, వ్యాసం, నాటకం, కవిత్వం మొదలైన అనేక ప్రక్రియల్లోని ఉత్తమమైన అంశాల సమాహార రూపమనీ. అయితే ఇది కథాకథన నిర్వహణంతో ఇతివృత్త నిర్మాణంతో పాత్రచిత్రణంతో ప్రత్యేక ప్రక్రియగా రూపొందింది. ముందుగా విశేషంగా అభివృద్ధి చెందిన కొన్నిప్రక్రియల ప్రభావం, ఆ తరువాత వచ్చే ప్రక్రియపై ఉంటుంది. అంతమాత్రాన నవల అస్తిత్వానికే మాత్రం క్షతి కాదు. నవలకే నియమ నిబంధనలు కచ్చితంగా లేకపోవడం ఒక విధంగా మేలే జరిగిందని చెప్పవచ్చు. దీనివల్ల వైవిధ్యం చేకూరింది. ఇది కాలాంతరాన ఉపకృతిగానూ పరిణమించింది. మరో ప్రక్రియ ప్రభావమంటే, చలం నవలల్లోనూ, రాచకొండ విశ్వనాథ శాస్త్రి 'అల్పజీవి'లోనూ కవిత్వ పంక్తుల్ని సులభంగా గుర్తించవచ్చు.

నవల్లోని విలువలకు ప్రమాణం ఇరువురు. ఒకరు పాఠకులు, మరొకరు విమర్శకులు లేదా సమాలోచకులు. మొదట ఏ రచనకైనా పాఠకులే ఉంటారు. శ్రోతలూ ఉండవచ్చు. తరువాత వచ్చేది విమర్శకులు లేదా సమాలోచకులు. లోకంలో రచన ప్రచారం పొందడానికీ, ప్రతిష్ఠ చేకూరడానికీ వీరిరువురూ కారకులు. పాఠకుడు సాహిత్యం పట్ల అభిలాషతో నవలపట్ల అభిరుచితో తనదైన వైయక్తికమైన అనుభవ ప్రభావంతో ఆనందిస్తాడు, ఆలోచిస్తాడు. ఇది అభిప్రాయ ప్రకటనంలో బహిర్గతమవుతుంది. ఇది స్థూలతలంపై సంకీర్ణ వికీర్ణ రూపాల్లో ఉంటుంది. విమర్శకుడు/సమాలోచకుడు సూక్ష్మతలంపై వ్యవస్థీకృత పద్ధతిలో ఆలోచిస్తాడు, ఆనందిస్తాడు. ఇది నవల గురించి సూచికగానూ ఉపకరిస్తుంది. ఈ అభిప్రాయాలతో భేదించే అవకాశమూ ఉంది. మరో విధంగా స్పందించనూ వచ్చు. తరాలు గడచేకొద్దీ, కాలం జరిగేకొద్దీ ఎక్కడెక్కడో ఆగిపోకుండా, మళ్ళీ మళ్ళీ ఆలోచనకు వివరణకూ వ్యాఖ్యానానికీ అవకాశం ఎప్పటికీ ఉండే సృజన రూపం ఉత్తమ నవల. దీనికి మినహాయింపు కాదు. 'వేయి పడగల్ని' ఈనాడు ఆధునిక భావజాలంతో కొత్త దృష్టితో చూడడం ఈ సందర్భంలో గమనించవచ్చు. పాఠకుడూ విమర్శకుడూ/సమాలోచకుడూ కలిసే స్థానం ఒకటుంది. అది అనుభవ పూర్వకమైన వివేకతలం. సహృదయ రూపాన్ని కలిగిందీ. ఇదే చివరి ఒరపిడిరాయి.

## X

నవల చదవడంవల్ల ప్రయోజనం అంటే ఏ ప్రయోజనాన్ని ఆశించిందీ, ఆ ఆశించేదాన్ని బట్టి ఉంటుంది. ఆనందం కోసం! ఆలోచనా ప్రకాశం కోసం! సంస్కరణం కోసం! పరివర్తనం కోసం! ఆఖరికి కాలక్షేపం! ఏదైనా ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ

మనోరూపంపై ప్రభావాన్ని నెరపుతుంది. ఇది క్రమంగా సమాజంలో ఉత్తమ సంస్కృతికి దారితీస్తుంది. నవల ప్రభావం వ్యక్తులపై అనితరమైంది. నవల ప్రయోజనం ఆనందం, అనుకున్నా ఉదాహరణకు ఆస్కార్ వైల్డ్ వ్రాసిన "పిక్చర్ ఆఫ్ డోరియన్ గ్రే" "కళ కళకోసమే"నన్న సిద్ధాంతం ఆదర్శంగా ఉంది. అందమైన ప్రయాణం అనుభవాన్ని పొందినప్పటికీ, నవల చదివాక ప్రయాణం తరువాత ఆ ప్రయాణం గురించి ఆలోచన సహజం! ఇది జీవిత వస్తువునుండి వేరు కాదన్న విషయాన్ని జ్ఞాపకం చేస్తుంది. వస్తువులో ఇతివృత్త విభజనలో సంఘటన మరియు దీన్ని నడిపే పాత్ర రెండూ జీవితనాణెం రెండువైపులు కావడంవల్ల సామాజికాంశాలు చోటుచేసుకోవడం సహజం.

నవల, వర్తమానంలో వచ్చే ప్రతి మార్పునీ తనలో బింబిస్తూ, పురారూపం నుండి ఈనాటి వాస్తవ స్థితివరకూ మానవ జీవితాన్ని స్పందించేదీ, జీవితం గురించి ఆలోచన చేసేదీ, జీవితాన్ని చిత్రించేదీ, వ్యాఖ్యానించేదీ, దర్శించేదీ. నవల్లో కళాత్మకత మానసికమైన ఆనందానికీ, సామాజికత సంస్కరణకూ పరివర్తనకూ హేతు మూర్తు లవుతాయి. ఉత్తమ నవల మనిషిలో ఆలోచనల్ని స్వనిస్తుంది. అనుభవాల్ని వెలిగిస్తుంది. కర్తవ్యాన్ని ప్రబోధిస్తుంది. అంతరాత్మను మేల్కొల్పుతుంది. "Novel is the brightest book of life" – D.H. Lawrance.

# 2. పరిమితులు - లక్ష్యం

## I అవకాశాలు

మానవ జీవిత లక్ష్యమే నవలదీ. జీవిత లక్ష్యంలో భేదాలున్నట్లే నవల లక్ష్యంలోనూ ఉన్నాయి. ఎన్నో విషయాలను ఒకచోట సమీకరించడానికి అవకాశం కలిగింది, కావడంచేత దీని విస్తృతీ పరిమితులూ నిర్ణయించడం కుదరదు. కాని రచయిత ఉద్దేశాన్ని బట్టి తనంతట తానుగా కొన్ని పరిమితుల్లో నియతం కావడం జరుగుతుంది. ఇది రచయిత స్వయం నిర్ణయంపై ఆధారపడింది.

1) కథలోని సంఘటనల కథనం, 2) వ్యాసంలోని చింతన-పరిశీలన, 3) నాటకంలోని పాత్రచిత్రణం, 4) కవిత్వంలోని అనుభూతి సాంద్రత, భావరూపం, 5) జీవిత చరిత్రలోని వ్యక్తిత్వ కథనం ఇట్లా అక్కడక్కడా ఆయా ప్రక్రియల విశేషాంశాల సమాకలనం అనుభవానికి రావచ్చు. కాని నవల తనదైన అస్తిత్వంతో సృజనాత్మక సాహిత్యంలో విశిష్టంగా ఉత్తమ సాహిత్య కళారూపంగా స్థిరపడింది. ప్రతి ప్రకియలోను ఇతర ప్రక్రియల ప్రభావాన్ని అంతో ఇంతో గుర్తించవచ్చు. అంతమాత్రాన స్వతంత్ర ప్రతిపత్తిని శంకించనవసరం లేదు.

నవల ఆధునికమైన అవసరాలకు సరిపడింది, జీవితంలోని విస్తృతినీ, వైవిధ్యాన్నీ, లోతునూ బింబించే సంగ్రహ రూపంగానూ ఖ్యాతమయింది. జీవితం గురించి అభిలాష, అభిరుచి, ఆరాటం, ఆవేదన, ఆనందం, ఆలోచన ఉన్నంతవరకూ నవల తన ప్రయోజనపరత్వాన్ని నిలుపుకుంటూనే ఉంటుంది. సాధారణ సాహిత్య పరిజ్ఞానానికీ అందుబాటులో ఉందీ, సులభమైన పఠన యోగ్యతను కలిగిందీ, వ్యాప్తిలోనూ కళాత్మకతను పొందిందీ, తొలినాటి ఆకర్షణ ఇప్పటికే నిలిచే ఉంది, ఎప్పటికీ నిలిచే ఉంటుంది.

పైకి సులభంగా కన్పించినప్పటికీ దీని నిర్మాణం క్లిష్టమైందీ, అవధానతను కోరుతుంది. విస్తృతమైన పరిధివల్ల ఎక్కువ స్వేచ్ఛ వల్ల, ఎంతో బాధ్యతాయుతంగా, దొరికిన అవకాశాల్ని వినియోగించుకోవలసి ఉంటుంది. దీనికి నిశితమైన పరిశీలనా దృష్టీ, సూక్ష్మమైన స్థితిగతుల్ని అవగతం చేసుకునే మేధ అవసరం. వీటిని తన దృక్పథంతో మలచుకొనీ, దర్శనంతో సమగ్రతను సిద్ధింపజేసుకునే ప్రయత్నం, లక్ష్యాన్ని భావింపజేస్తుంది. ఒక్కమాటలో చెబితే రచయిత సంపూర్ణ వ్యక్తిత్వాన్నిబట్టి లక్ష్యం

ఏర్పడుతుంది. ఎంత గొప్ప నవల అయినా దీనికి కొన్ని పరిమితులు తప్పనిసరిగా ఏర్పడతాయి. మరో విధంగా చెబితే వచనంలో సుదీర్ఘమైన వాస్తవ జీవితరూపం నవల అయినప్పుడు, ఆ 'వాస్తవజీవితం' కొన్ని పరిమితుల్లోనే సాగుతుంది. రచనలో నిబంధింప బడుతుంది.

ఈనాడు ప్రచలితంగా ఉన్న అభిప్రాయాల వ్యాప్తికీ దృక్పథాల ప్రసారానికీ, సిద్ధాంతాల ప్రచారానికీ నవల మంచి కళాత్మకమైన సాధనంగా ఉపకరిస్తుంది. ఉపయోగాల పరిమితులతో అభిప్రాయ భేదాలేర్పడతాయి! దీనితో భిన్న వాదాలూ సిద్ధాంతాలకూ అవకాశం ఏర్పడుతుంది. కాబట్టి నవలల్లో స్థాయి భేదాలనూ అభిప్రాయ భేదాలనూ తలపించేవి రావడంలో ఆశ్చర్యం లేదు. వీటి క్రియాక్షేత్రాలు సీమితాలన్న విషయమూ మరచిపోకూడదు.

## II వాస్తవ సదృశత్వం

నవల అస్తిత్వం జీవితంలోని వాస్తవ సదృశత్వాన్ని పరిపుష్టం చేయడంలో ఉంది. దీనికి పాత్రల్ని మానవ రూపాలతో భౌతిక మానసిక దశల్లో ఆవిష్కరించవలసి ఉంది. జీవితాన్ని యథాతథంగా దింపడం కుదరకపోవచ్చు, కొంత కల్పన అనివార్యం కావచ్చు. అందువల్ల చిత్రణలో వర్ణనలో వివరణలో అన్నిటా 'జీవిత సదృశత్వం', నవల చదివేప్పుడు, చదివాకా అనుభవంలో స్పందించడం ముఖ్యం. ఈ గుణం నవలను, లక్ష్యానికి చేర్చేదిగా పరిణమింపజేస్తుంది.

జీవిత వాస్తవం 1) సాధారణమనీ, 2) అసాధారణమనీ రెండు విధాలు. ఈ రెండింటి మధ్య అంతరాన్నీ, వీటి ప్రయోజనాల్నీ రచయిత గుర్తించాలి. ఒక స్థితిలో రెండిటి సమత్వమూ అవసరమవుతుంది. అసాధారణం మనలో ఔత్సుక్యాన్ని పెంపొందిస్తుంది. అభిలాషను తీవ్రతరం చేస్తుంది. ఆలోచనకు పదును పెడుతుంది.

వాస్తవం–కాల్పనికం రెండు ప్రపంచాలు అందరిలో ఉంటాయి. ఆలోచనతో కల్పనకు స్థానం లభిస్తుంది. దీన్ని పూర్తిగా తుడిచేయడం అసంభవం. ఇవి ఏ నిష్పత్తిలో ఉండేదీ రచయితపై ఆధారపడి ఉంటుంది. కథా నిర్వహణలో ప్రయోజనమూ మరియు కళా స్థాయినిబట్టీ ప్రకాశిస్తాయి. అందువల్లనే వాస్తవం కన్నా వాస్తవ సదృశ స్థితి మాత్రమే నవల్లో ప్రతిభాసిస్తుంది.

ఏ జీవితాన్ని వాస్తవ దశలోనూ కాల్పనిక స్థితిలోనూ ఇదమిత్థమని నిర్ణయించి ఒక సూత్రక్రమంలో బంధించడం కుదరదు. అలాగే నవల కూడా. ఇది ఒడ్డుల్ని అంటే పరిమితుల్ని కలిగిన సజీవమైన ప్రవాహరూపాన్ని తలపిస్తుంది. ఒక రోజు గడచినట్లు మరో రోజు గడవదు! ఒక జీవితం ఉన్నట్లు మరో జీవితం ఉండదు. ఎన్నెన్నో జీవితాల్లో చర్య ప్రతిచర్యలతో పరస్పర సంబంధాలతో సంక్లిష్టమైన సంశ్లిష్టమైన స్వరూపాన్ని 'వాస్తవ సదృశం'గా అందుకోడం, రచనలో ప్రవర్తింపజేయడం ఒక మహాకార్యమే.

రచయితల్ని బట్టి ఉద్దేశాలు భిన్నభిన్నంగా ఉంటాయి. నవల చదివేప్పుడు ఈ సందర్భంలో గుర్తించవలసిన అంశాలు : 1) యథార్థమైందీ, 2) రచయిత కల్పించిందీ, 3) పాఠకుని మనస్సులో రూపొందేదీ. యథార్థమనేది ఒకటి ఉన్నా రచయిత మరొకటి కల్పించినా పాఠకుల్లో భిన్నాభిప్రాయాలు తలెత్తడం సహజం. అందరూ ఒకే విధంగా ఆలోచించరు. ఒక కథ విషాదంతో ముగిసిందా? మోదంతో ముగిసిందా? అనే ప్రశ్న కాదు ముఖ్యం. అలా జరగడంలో సంఘటనల క్రమం, పాత్రల వర్తనం, ప్రతివర్తనం వీటి సమన్వయం, సహేతుకమైన పర్యవసానంతో చివరకు రచన ఉద్దేశాన్ని స్పృశించడం జరగాలి. ఉద్దేశం స్థానం నుండి పరిష్కారాల మార్గాలు బయలుదేరతాయి. ఉద్దేశం తెలిస్తేనే ప్రశ్నలకు సమాధానాల్ని అన్వేషించడం సులభం. ఉద్దేశం లేదా విస్తృత రూపంలో లక్ష్యం అనేది నవల్లో ఎక్కడో ఒకచోట లభించేదీ పట్టుకునేదీ కాదు. రచన అంతటా సర్వాంగీణంగా వ్యాప్తమై ప్రసరిస్తూంటుంది. అయితే నవల చివర మాత్రం వెలుగు దీపంలా స్మృతిపథంలో నిలచిపోతుంది.

ఉద్దేశాన్నిబట్టి లక్ష్యం నిర్దేశితమవుతుంది. లక్ష్యం లేని నవల ఉండదు. కాకపోతే ఆ లక్ష్యం పాఠకులకు ఆనకపోవచ్చు. అంగీకారం కాకపోవచ్చు. సృజన సాహిత్యంలో ఒకరితో మరొకరు అంగీకరించని లక్ష్యాలే ఎక్కువ. అందరూ అంగీకరిస్తే ప్రత్యేకత ఏముంది? వైవిధ్యమేముంది?

## III దిశానిర్దేశం

మనిషికీ సమాజానికీ ఉన్న పరస్పర సంబంధాన్ని ఆవిష్కరించే సందర్భాల్లో రచయిత లక్ష్యం స్ఫుటమవుతుంది. ఇది వ్యక్తీ కుటుంబం సమూహం వర్గంలో వివిధ వలయాలకూ సమాజానికీ మధ్య అనుబంధాలకూ సంబంధాలకూ సంబంధించిన విషయాల్ని బట్టి నియతమవుతుంది. నవల వ్యక్తీ, కుటుంబం, సమూహం, వర్గం మొదలుగా వివిధ వలయాల్ని అతిక్రమించీ, విస్తృతిని పొందుతూ విశ్వజనీనత్వాన్నీ

పొందుతుంది. నిఖిల మానవాళి కథగా ప్రపంచ తలంపై లక్ష్యం దూసుకపోతుంది. గొప్ప రచనల్లో చివరి లక్ష్యం మానవీయ విశ్వభావనా స్థాయిలో ప్రసరిస్తుంది. ఇది రచయిత మానవీయ అంతర్జాతీయ వ్యక్తిత్వాన్ని బట్టీ ప్రవర్తమానమవుతుంది.

ఈ లక్షణం 1) సామాజికంగా చూస్తే మనుషుల ప్రవర్తనా రీతులూ, నీతి నియమాలూ, మతప్రస్థానం, తాత్త్వికచింతన, రాజకీయ ధోరణులూ మొదలైన అంశాల్ని స్పృశిస్తుంది. 2) వైయక్తికంగా చూస్తే స్వంత ఆలోచనలూ, స్వీయ జీవిత మనస్తత్వ రీతులూ, అనుభూతి స్పందనలూ అన్నీ కలిసి లక్ష్యం వెనకనుండి పనిచేస్తాయి. వ్యక్తీ-కుటుంబం - చుట్టూ ఉన్న సమాజం, 3) సాధారణ ప్రపంచం అనే మూడు పొరల్లో పనిచేసే మనస్సు, జీవితంలో కలిగే అనుబంధం - ఆకర్షణ - అభిలాష ఈ ప్రయోజనంతో రచనపై ప్రభావం నెరపుతాయి. వీటి చిత్రణం నవల లక్ష్యానికి చేరే ముందు పరంపరలో భాగంగా కన్పిస్తుంది.

నవల్లో రచయిత ప్రతిభ పరిజ్ఞానం అనుభవ పరంపర, పాఠకుల పరిమితుల్ని దాటి ఉన్నపుడు మరింత ఆకర్షిస్తుంది. ఒక్కొక్కప్పుడు ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది. ఈ దృష్టితో ఉత్తమ నవల పాఠకుల పరిజ్ఞానాన్ని పెంచుతుంది. అనుభవానికి విస్తృతినిస్తుంది. ఆలోచనకు లోతునిస్తుంది. ఆలోచనల్ని పెంచుతుంది. అందువల్ల నవల్లో ఉద్దేశానికివి సహకారాలుగా ఉపకరిస్తాయి. అయితే నవల్లో లక్ష్యం గురించి అవధులు నిర్ణయించడం కుదరదు. లక్ష్యం దానికది సిద్ధాంతంచేతనో ఆదర్శం చేతనో భావనచేతనో సంపూర్ణంగా ఆవిష్కృతం కావడంలో, రచయిత చిత్తశుద్ధీ అంకితభావం గోచరిస్తుంది.

నవల్లో పరిమితుల్ని జీవితమూ - రచయిత ఆధారంగా ఆలోచిస్తే, జీవితం అనుక్షణం మారే స్వభావం కలిగింది. స్థిరం (static) కాదు, చలనశీలంలో, ప్రవాహకత్వంలో (Flux) లోసమీకరణాలు మారతాయి. స్థితి మారుతుంది. సంయోజనా రూపమూ వేరవుతుంది. నిరంతరం జరిగే ఈ ప్రక్రియ కొన్ని రోజులపై కాలంపై స్పష్టంగా కన్పిస్తుంది. ప్రకృతిలోనూ ఈ విధం ఉంది. సమాజంలోను గమనించవచ్చు. ఈ కారణంగా కన్పించే సమాజంలో ఏ అంశాల్ని ఎన్నుకోవాలి? వేటికి ప్రాధాన్యం ఇవ్వాలి? జీవిత స్వరూపానికీ వీటికీ సంబంధం ఏమిటి? ఎంతవరకుంది? వేటిని స్వీకరించాలి? అన్న ప్రశ్నలతో ఏర్పడే పరిమితులు రచయిత దృక్పథంపై ఆధారపడి ఉంటాయి.

వీటి గుర్తింపు, పరిశీలనం, ఎన్నిక, నిర్మాణం అనేవి నవల్లో నిర్వహణ విభాగం కిందికి వస్తాయి. రచనలో శిల్పగుణంచేత వీటికి ఆకర్షణీయత లభిస్తుంది.

ఉత్తమ నవల్లో నీతి-నియమం-సత్యం-ధర్మం అనేవి 1) సాధారణ స్థాయిలోనివీ, 2) విశేష స్థితిలోనివీ, ఎదురవుతాయి. వీటినధిగమించి 3) జీవన తత్త్వం ప్రపంచితమవుతుంది. ఇది సార్వజనీనంగా విలసిస్తుంది. ఇందులో అంతర్లీనంగా విశ్వాసాలు అభిప్రాయాలు ఆలోచన చింతన సిద్ధాంతాలు ఆదర్శాలు ఉండవచ్చు. ఈ అంశాన్ని ఉన్నవ, విశ్వనాథ, చలం, బుచ్చిబాబు, గోపీచంద్ మొదలైన ప్రముఖ రచయిత నవలల్లో ఒక్కొక్కరి రచనల్లో ఒక్కొక్క విధమైన స్వరూపంతో సులభంగా గుర్తించవచ్చు. ఇవి వారి లక్ష్యానికి సోపానాలుగానూ కన్పిస్తాయి. నవల లక్ష్యం ఉల్లాసంతోపాటు పరిజ్ఞానానికీ, మార్పుకీ, సమాజ దర్శనానికీ, జీవన తత్త్వ వివేచనకూ ఉపకరించడం స్పష్టంగా మెదలుతుంది. లక్ష్యం యొక్క క్షేత్రపరిధి ఎప్పటికీ విస్తృతమైందే. పరిమితుల్ని ఎన్నుకోడం రచయిత కర్తవ్యం. దిశానిర్దేశం రచయిత దృక్పథంపై ఆధారపడిందీ.

## IV కళా సామాజిక వాదాల సమన్వయం

దర్శనం కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్ళి జీవిత లక్ష్యం గురించి నిశ్చయభావంతో ఆలోచింపజేస్తుంది. ఒక్కొక్కపుడు ఆలోచన నుండి క్రియవైపు ఉన్ముఖుల్ని చేస్తుంది. సంస్కరణకూ మార్పుకూ ఎంతో దోహదం చేస్తుంది. రచయిత సృజన రూపంలో 1) దార్శనికతకూ, 2) తత్త్వప్రపంచానికీ, 3) కళాత్మకతకూ మధ్య సామరస్యాన్ని సాధించడంవల్ల, ఉన్నతమైన ప్రమాణాలు చేకూరుతాయి. దీనికి సమాజం మూలం. దీనికి మాలపల్లి నవల చక్కని ఉదాహరణగా నిలుస్తుంది. ఇందులో లక్ష్యం నిర్దిష్టమైంది. అది దళితజన సముద్ధరణం. దర్శనం భవిష్య సమాజ ప్రకాశంలో సూచితం. తత్త్వప్రపంచం రామదాసు పాత్ర నిలయంగా భౌతికం నుండి పరిణతి పొందిన భవ్యమైన ఆలోచనా క్రమంలో గమనించవచ్చు. అయితే ఈ స్థూలమైన ఆకృతి రేఖలు, ఇతివృత్తం-పాత్రలు-వాతావరణం - మొదలుగా నిర్మాణ యోజనచేత పరిపుష్టమయి రమణీయ రూపాన్ని వహిస్తాయి. ప్రయోజనం, ఆనందం సిద్ధిస్తాయి. 1) సమాజపరమైన ప్రయోజనం, 2) జీవితాన్ని గురించి చింతన, 3) వ్యక్తిపరమైన ఆనందం మానసికమైన వికాసాన్ని కలిగిస్తాయి. నవల్లో సమాజం - వ్యక్తీ అనే రెండు అనుభవ తలాలపై కథనం సాగుతుంది.

"కళ కళకోసమే" అనే వాదం పందొమ్మిదో శతాబ్ది చివరిపాదంలో వ్యాప్తికి వచ్చింది. సామాజిక సమస్యలనుండి దూరంగా సందేహాలనుండి ముక్తమై స్వతంత్రంగా

ఉండాలనే ఈ వాదం, సామాజికమైన నీతి నియమాల్ని పట్టించుకోదు. వాస్తవాలకందని ఎత్తులో ఉండాలనే ఆలోచన కన్పిస్తుంది. కళకూ సామాజిక వాస్తవికతకూ సంబంధం లేదు. ఈ రెండూ కలిసే వీలులేదని కళావాదుల విశ్వాసం. దీనికి ఆస్కార్ వైల్డ్ నవల పిక్చర్ ఆఫ్ డోరియన్ గ్రేను పేర్కొంటారు. అయితే "వస్తువు సమాజం నుండి దూరం కాదు, ఇతివృత్తమూ పాత్రలూ జీవితం నుండి వేరు కావు" అని కొందరు విమర్శకుల అభిప్రాయం. అయితే నిర్వహణలోనే తేడా ఉంది. ఇది ఎక్కువగా కళాత్మకం, శిల్పశోభితం అనే ఈ సమాలోచకుల ప్రతిపాదనం, ఏమైనప్పటికీ ఈ నవల రచన-కళ-సమాజం-వీటి సంబంధం గురించి చర్చకు నిలయమైంది. కళావాదానికి ప్రాతినిధ్యం వహించింది.

రచయిత ఒక కళాకారుడు. సమాజంలో సభ్యుడే. సమాజానికి దూరంగా ఉండజాలడు. సమస్య ప్రభావం అతనిపైనా ప్రసరిస్తుంది. పరిష్కారమనేది అతని జీవితానికీ అవసరం. యథాస్థితి మరియు పరివర్తనకు చెందిన ఏ ప్రభావమైనా రచనపై పడక తప్పదు. అందునా ఆలోచన, వేదన కలిగి ఉన్నవాడు అవడంవల్ల, అభిలాషతో ఉత్సాహంతో సమస్యనూ స్థితినీ అవగతం చేసుకొనే ప్రయత్నం చేయాలి. దీన్ని విస్మరించకూడదు. దీన్ని నిరాకరించడం కృత్రిమత్వం. ఈ దృష్టి సృజన రూపానికి కొత్త శక్తినిస్తుంది. ఇది అతని బాధ్యత అనేది ఒక అభిప్రాయం.

ఈ విధమైన అభిప్రాయం క్రమక్రమంగా మరోవైపునుండి బలంగా వీస్తూ, రచయితల్లో "సామాజిక స్పృహ"నూ, "స్పందన"నూ, "నిబద్ధత"నూ ఉద్బుద్ధం చేసింది. "కళ కళకోసమే"నన్న వాదంలోని కళాత్మకమైన "దృష్టి", "అభిరుచి", అనుభూతిగుణమూ పూర్తిగా విస్మృతమూ కాలేదు. అయితే వీటి సమన్వయం ఉత్తమ నవల్లో కన్పిస్తుంది.

ఇది ఇట్లా ఉంచి, రచయితను సామాజికంగా లక్ష్యానికి నిబద్ధం చేసే ఆలోచన ఇటీవల బాగా వ్యాప్తిలోకి వచ్చింది. నైజీరియన్ విమర్శకుడు, Kole Wole Ogunbesan మాటలు ఈ సందర్భంలో పరిశీలనార్హాలు. "రచయిత సమాజంలో సభ్యుడు. అతని సూక్ష్మమైన మానసిక (అనుభూతి) స్పందనం తనచుట్టూ ఉన్న సామాజిక రాజకీయ స్థితిగతులలో నియతమవుతుంది. ఈ అంశాలు జీవిత విషయంలో భాగమవుతాయి. ఇందులోనుండి రచయిత సహజ ప్రేరణతో రచనకు ప్రయత్నించాలి.★

★ "The writer is a member of society and his sensibility is conditioned by the social and political happenings around him. These issues form a part of the substance of life within which his instinct a writer must struggle".

నవల "యథార్థ జీవిత సదృశం" కాబట్టి కొందరు వ్యక్తుల జీవితంలోవలె నవల్లో "ఏకాంత ధోరణి" తాత్కాలికమూ, పరిమితమూ స్వల్పమాత్రా రూపంగానే కదలిపోతుంది. తనదైన ఉనికిలో వైవిధ్యంలో భాగంగా నిలిచిపోతుంది. రచయిత దృక్పథాన్నిబట్టి వస్తువునుబట్టి పాత్రచిత్రణలో శిఖరభూతంగా కన్పించవచ్చు. ఇది విశేష తలాన్ని ప్రత్యేకమైన గుర్తింపునూ అంతవరకు పొందడం జరుగుతుంది. ఇది కళాత్మకమైన నిర్వహణలో భాగంగానే చర్చకు నిలుస్తుంది. ఒక్కొక్కరి లక్ష్యం ఒక్కో విధం. అయినప్పటికీ, స్థూలంగా నవల్లో లక్ష్యం గురించి సాధారణమైన వివేచనం తరువాత లక్ష్యం విషయంలో పరిశీలించదగిన ప్రయోజనాంశాలు, సమాలోచనార్హాలుగా కన్పిస్తాయి.

## V ప్రయోజనాంశాలు

### 1) మానసికమైన ఉల్లాసం, ఉపశమనం, తృప్తి, ఆనందం :

మనస్సు అనేకమైన కోర్కెల నిలయం. మనిషి పుట్టింది మొదలు, చిన్నతనం నుండీ మనసులో నిలిచిపోయే సంచరించే అనేకమైన కోర్కెల తృప్తికి అవకాశం అవసరమవుతుంది. పగటి కలలు కనడం, నిదురలో కలలు కనడం దీనికి సంబంధించినవే. పిల్లల్లో ఈ స్థితి అనేక రూపాల్లో బయటపడుతుంది. పిల్లలు పెద్దల్నీ, జంతువుల్నీ, వస్తువుల్నీ తమను ఆకర్షించే తమపై ప్రభావాన్ని నెరపే అనేకమైన రూపాల్ని అనుకరిస్తూ నటిస్తూ కాలక్షేపం చేయడం కద్దు. పెద్దలైతే సామాజికమైన అవరోధాలవల్ల సభ్యతకు భంగం కలుగుతుందన్న భావంతో మనసులోనే అణచుకొని పగటి కలలు రాత్రికలలు కంటారు. మనో జగత్తులో నిర్నిబంధంగా జరిగే స్వేచ్ఛాయుతమైన కాల్పనిక సంచారం మానసికమైన తృప్తిని చేకూరుస్తుంది. దీనివల్ల ఎవరికీ అపకారం జరగదు. ఇది కేవలం వైయక్తికమైంది మాత్రమే. రచయిత తన స్వేచ్ఛాగుణంతో నవల్లో ఎన్నిటినో ప్రవేశపెట్టడం జరుగుతుంది.

నవల ఒక సంగ్రహ జీవిత ప్రపంచం. ఇందులో కథ, పాత్రలు, సంఘటనలు, సమస్యలు, ప్రతిఘటనలు, పరిష్కారాలు – ఇంకా నిరాశ ఆశ; అపజయం విజయం, అభిప్రాయాలూ ఆదర్శాలూ ఇట్లా అనేకమైనవి; తనలో ఉన్న ప్రపంచంతో సంవదించేవి, పాఠకునికి ఉల్లాసాన్నీ ఉపశమనాన్నీ తృప్తినీ ఆనందాన్ని చేకూరుస్తాయి. మనస్సు ఒత్తిడి నుండి విముక్తమైనట్లుంటుంది. నవల్లో అనేకమైన అంశాలు పాఠకుని మనస్సులో అణగినవీ లేదా దాగినవీ వివిధ రూపాల్లో విభేదాన్నో తిరస్కారాన్నో ఐక్యాన్నో ఆరాధననో

పొందుతాయి. ఈ స్థితి వల్ల మానసికంగా ఏర్పడిన సంచలనాన్నీ నివారించుకొనీ, ఏర్పడిన అఘాతాన్ని తొలగించుకొనీ, ఆలోచనాత్మకంగా ఆశ్వాసాన్ని పొందడం జరుగుతుంది. లక్ష్యం అనేది నవల్లో రచయిత కావాలని ప్రవేశపెట్టినట్లు ఉండకూడదు. రచనలో వివిధాంశాల క్రమగతిలో పరిణామశీలంతో పెనవేసుకొని సాగాలి. ఇది నవల పేరు పెట్టడం మొదలుకొని సమాప్తి వాక్యాల్లో అర్థస్ఫూర్తి దాకా పర్యాప్తమయి ఉంటుంది. "చివరకు మిగిలేది" నవల పేరునూ, నవల చివరి వాక్యాల్ని తలచుకుంటే ఈ మాటల్లోని సామంజస్యం స్ఫుటమవుతుంది.

పాఠకుని మానసికమైన సహజోద్రేకానికి (రక్షణ) "సేఫ్టీ వాల్వ్" లాగాను పనిచేస్తుంది. లక్ష్యం రచనలో సహజగతిలో సిద్ధించినపుడే దాని ప్రయోజనమూ అంత సహజమైన "రుచి"తో మనస్సుకు హత్తుకుంటుంది.

ఉత్తమ నవల చదివేప్పుడు దాని ప్రభావరూపాన్ని ప్రతిక్షణమూ మనస్సు అనుభవిస్తుంది. ఇది ఉన్నతమైన లక్ష్యంచేత సార్థకతను పొందుతుంది. జీవిత వాస్తవ సాదృశ్యంతో మరీ దగ్గరగానూ, సంపూర్ణమైన సహయోగాన్ని పొందడం జరుగుతుంది. ఇదో విధంగా మానసికమైన ప్రకాశరూపాన్ని సంతరింపజేస్తుంది. ఇదో పేర్కోదగిన ప్రయోజనాంశం.

**2) వాస్తవాల పట్ల అవగాహన, అనుబంధం, ఆలోచన, సమస్య పరిష్కారంవైపు గమనం :**

జీవిత వాస్తవ శక్తుల పట్ల అవగాహనతో పరిశీలన విశ్లేషణతో సమస్యలకు పరిష్కారాన్ని కనుగొనే దిశవైపు దృష్టి గమిస్తుంది. స్థూల దృష్టితో ఇందులో ప్రజాస్వామ్యం, సామ్యవాదం, సమన్వయవాదం, ప్రగతివాదం, సంప్రదాయవాదం, నవ్యసంప్రదాయవాదం మొదలుగా దేశం మరియు స్థానీయమైన అనివార్యాలతో భిన్నభిన్న మార్గాల మైలురాళ్ళూ, ఆనవాళ్ళు కనిపిస్తాయి. చెదరని విశ్వాసంతో నవలల్లో రచయిత సైద్ధాంతిక బలంతో అవలంబించే శిల్పవిధానాన్ని బట్టి వీటి ఆవిష్కారం ఉంటుంది. ఒక్కొక్కప్పుడు కోరే లక్ష్యం పాఠకులకు వదలేయబడవచ్చు, సూచితం కావచ్చు, ప్రకటితం కావచ్చు. స్థూలంగా చూస్తే ఇందులో సామాజికమైన మౌలికాంశాలూ, జీవితంతో అనుబంధ సంబంధాలూ, వీటిని గురించి చింతన – తనదైన 'అస్తిత్వం'తో రచయితలో ఏర్పడిన దిశలో వస్తువు ఉన్మీలితమవుతుంది.

**3) తాత్త్విక భూమిక-జీవిత దర్శనం-వ్యక్తివికాసం-సమాజ భవితవ్యం :**

ఇది రెండోదాని విస్తరణ రూపం అనవచ్చు. ఈనాడు ఈ లక్ష్యానికి ప్రాముఖ్యం ఉంది. సమస్యలు–పరిష్కారాలు అంతర్జాతీయ తలంపై ఆలోచనను ప్రేరేపించే లక్షణంతో ఆకర్షిస్తుంది. సమాజశ్రేయస్సుకూ, సౌభాగ్యానికీ, స్వేచ్ఛకూ, పురోగమనానికీ ఎన్నో ఆలోచనా వైఖరులూ, క్రియాకలాపాలూ ప్రచలితమయినాయి. ఇక్కడ భిన్న సిద్ధాంతాల, వాదాల ప్రసక్తి ఉంటుంది. వ్యక్తి వికాసం నుండి సమాజాభ్యుదయం వరకూ పర్యాప్తమైన ఈ అంశం, జాతీయస్థాయినుండి అంతర్జాతీయ స్థాయివరకూ సామాజిక ఆర్థిక రాజకీయ తాత్త్విక మనస్తత్వ క్షేత్రాల్ని స్పృశిస్తుంది. సమాజానికీ, సాహిత్యానికీ మూలం గురించీ, నడిపే శక్తుల్ని గురించీ నడచే రీతీ, పథం గురించీ, గమ్యం గురించీ ఇందులో విశ్లేషణ ఉంటుంది. దీనిపై ఆలోచన సాగుతుంది. జీవితంపై ఆశను నిలుపుతూ, ప్రయాణానికీ దిక్సూచిగా పనిచేస్తుంది. సమాజ భవితవ్యం గురించి లక్ష్యం స్పష్టంగా నిర్దేశితం కావడం ఇందులో విశేషం. అది ప్రజాస్వామ్యం కావచ్చు, సామ్యవాదం కావచ్చు, మరో సామాజిక లక్ష్యం కావచ్చు. రచయిత నవల్లో వ్యక్తీ సమాజం పట్ల తన పాత్రను నిర్వహించే విశ్వాసాన్ని పెంచుతుంది. ఇందులో విశాల ప్రాతిపదికపై జీవిత దర్శనం ఉంటుంది. ఇది తాత్త్వికమైన భూమిక ఆధారంగా నిర్మితమవుతుంది. ఉన్నతమైన స్థాయిలో నిలుస్తుంది. వ్యక్తి వికాసం గురించీ సమాజ భవితవ్యం గురించీ మనిషిలో అంకితభావంతో క్రియాశక్తిని ప్రోత్సహిస్తుంది. ఇది సంప్రదాయ బంధురమైన లేదా మార్పు కోరే విధంలో నవ్యసంప్రదాయ సహితం కావచ్చు. సమసమాజ నిర్మాణాన్ని అపేక్షించే సామ్యవాద చరణం కావచ్చు. స్వేచ్ఛ–సమానత్వం కోరే ప్రజాస్వామ్యపథం కావచ్చు. అన్నిటిలో మేలిమిని గ్రహించి సాగే సమన్వయ మార్గం అవచ్చు. ఏదైనా వీటి వెనుక మానవచరిత్ర – పరిశీలనంతో వర్తమానానికి అవసరమైన ఆలోచనతో భవిష్యత్తు గురించి స్పష్టమైన నిశ్చయభావంతో జీవిత దర్శనం కన్పిస్తుంది. రచయిత కోరే సమాజ భవితవ్యం స్ఫూర్తి కదుతుంది.

**4) నిఖిల మానవ సంస్కృతి పరిణామంలో భాగం :**

ఇది నవల్లో అపరిహరణీయమైంది. సహజంగా వర్తించే లక్ష్యం. నవల్లో వాతావరణ పరికల్పనతో పాటు మానవీయమైన రూపమూ తప్పనిసరిగా అవతరిస్తుంది. కాలాంతరాన అప్పటి అవసరాల్ని పూరించేందుకు ఎన్నో సిద్ధాంతాలూ, మతాలూ, వర్ణాలూ, వర్గాలూ, జాతులూ, కులాలూ, దేశసీమలూ, ఆలోచనలూ అవతరించాయి. వీటి పరిధుల్ని అధిగమించిన మానవీయ భావసూత్రం ఇందులో సరిస్తుంది.

ప్రపంచంలో మానవులందరూ పంచుకునే అనేకాంశాలు ఉదారమైన పథంలో వర్తిస్తాయి. ఆకలి, దారిద్ర్యం, బాధ, అవినీతి, అధర్మం, అన్యాయం, త్యాగం, కారుణ్యం, ఉదారత మొదలైన సాధారణ జీవన విషయాలు సంకుచితమైన పరిధుల్ని దాటి మనిషిలో ఉదారమైన అంతరంగాన్ని స్పృశిస్తాయి. మానవ వికాస చరిత్రలో మానవీయ భావనా కేంద్రంగా సాగిన విలువలు నవలను విశ్వజనీనమైన్న లక్షణాలతో సంపన్నం చేసాయి.

1) భౌతికంగా తిండి, బట్ట, ఆశ్రయం, పనీ, 2) మానసికంగా తృప్తి, సంతోషం, రాగం, సౌభాగ్యం గురించి చింతనకు సంబంధించిన అనేక సిద్ధాంతాలూ అభిప్రాయాలతో పాటుగా ఇంకా 3) పై స్థాయిలో నిఖిల మానవ సంస్కృతీ తలంపై జీవిత కోణాల్ని దర్శించడం ఇందులో విశేషం. ఇది మానవీయ సంబంధాల్ని దృఢతరం చేయడమే కాక, ఎప్పటికప్పుడు జీవితంలో కావలసిన కొత్త వెలుగునూ ప్రసరింపజేస్తుంది. రావలసిన కొత్త మనిషిని భావిస్తుంది దర్శింపజేస్తుంది.

సమాజంలో వ్యక్తులూ, కుటుంబంతోపాటు బయటి ప్రపంచంలోని వాతావరణాన్ని చిత్రిస్తుంది. విశ్వతలంపై సంస్కారశీలాన్నీ సౌందర్య రూపాన్నీ, సౌహార్ద గుణాన్నీ పెంపొందిస్తుంది. సంకుచితత్వం నుండి వైశాల్యంలోకీ, పరిమితమైన మతి కోణం నుండి ఉదారమైన వివేకానికీ, హేతువు నుండి స్పందనకూ పయనింపజేసే లక్ష్యం కలిగిందీ. ఉత్తమ నవల్లో ఇది అన్నిటినీ క్రమించి చిట్టచివర మనుషుల్నీ సమాజాన్నీ బంధించే సుదీర్ఘమైన విశ్వ సంస్కృతీ రూపంగా చేతికందని వెలుగులా, అనుభవైక మాత్రమైందీ.

# 3. వస్తువు

వస్తువు లేదా విషయం నవలకు ఆధార స్థానం. రచయిత మూలభూతమైన అభిప్రాయానికి చాలా సంక్షిప్తమైన సారభూతమైన ప్రతిపాదనారూపం. దీనినుండి ఇతివృత్తం సాగి పరచుకొనీ రూపొందుతుంది. ఒక విధంగా రచనా ప్రణాళికను అదుపులో ఉంచుతుంది. రచయిత ఆలోచనల్ని స్థూలంగా లక్ష్యానికి దగ్గరగా సీమల్లో ఉంచుతుంది. అనుక్షణం పరిమితుల్ని జ్ఞాపకం చేస్తుంది. వస్తువును గురించి చెప్పేప్పుడు పాత్రల ప్రసక్తి ఉండదు. వాటి పేర్లూ పేర్కోనవసరం లేదు. ఇది ప్రధాన కథకు కేంద్రస్థానం. నవల్లో వివిధాంశాలు శాఖోపశాఖలుగా ఇక్కడి నుండే విస్తరిస్తాయి. వ్యక్తి చర్య ప్రతిచర్య నుండి వ్యక్తుల కలయికతో ఘటనల్ని ఆశ్రయించి వస్తువు ఉద్గమిస్తుంది. ఇతివృత్తంలో సంఘటనల క్రమంలో వికాసాన్ని పొందుతుంది. స్థూలంగా పాత్ర-ఘటన-సమస్య నుండి వస్తువు ఇతివృత్తమయంగా రూపొందుతుంది. నవల్లో మౌలికమైన అస్తిత్వాన్ని కలిగి ఉంటుంది.

నవలకు ఏదో ఒక భావం (Idea) లేదా సమస్య, (Problem) మనస్సులో మెదలుతుంది. దీన్ని అనుసరించి వ్యక్తులు మెదలుతారు. సంఘటన మొదలు రూపొందవచ్చు. ఈ సంఘటన ఎటువంటిది? సమస్య ఏమిటి? ఆ వ్యక్తి ఎవరు? అతడు ఎట్లా ప్రవర్తిస్తాడు? ఆమె ఎట్లా ప్రవర్తిస్తుంది? ఈ ప్రశ్నల్ని స్పృశిస్తూ వస్తువు ఆకృతి పొందుతుంది. ఈ విధమైన ప్రశ్నల నుండి ప్రశ్నలూ, వాటికి సమాధానాలతో చర్యలూ, ప్రతిచర్యలతో ఇతివృత్తం వివృతమవుతుంది, పాత్ర నిర్మితమవుతుంది.

నవల్లో వస్తువు ఎంత బలంగా ఉంటే అంత శక్తివంతమైన జీవిత క్షేత్రం పరచబడుతుంది. మాలపల్లి నవల్లో దీన్ని గమనించవచ్చు. 1) గాంధీజీ నాయకత్వంలో స్వాతంత్ర్యోద్యమం సమాజానికి కొత్త రూపాన్ని ఇచ్చింది. 2) వ్యక్తులందరూ సమానం, అందరి వికాసమే దేశం అభివృద్ధి! 3) జీవితంలో సమస్య-సంఘర్షణ తప్పవు, ఉంటాయి. 4) శాంతి అహింస సమానత్వం మానవత్వం అత్యంతావశ్యకమైనవి. 5) వర్ణవ్యవస్థ మానవ నిర్మితమైంది. దీన్ని నేటి పరిస్థితులకనుగుణంగా మార్చే శక్తి మనలో ఉంది. 6) దేశ పురోగతికి భౌతిక మానసిక ఆధ్యాత్మిక వికాసం అవసరం, దీనికి త్యాగం ఉదారత చిత్తశుద్ధీ తోడ్పాటు మరీ ముఖ్యం.

ఈ అంశాలు విశ్లేషణకందేవి! క్రమంగా నవల కవసరమైన ఇతివృత్తం, పాత్ర మొదలైన అంగాలతో నిర్మాణ రూపాన్ని పొందాయి. ఇది వేరే విషయం.

ఈ విషయంలో నవలకూ నాటకానికీ సామ్యముంది. హామ్లెట్ నాటకం తీసుకుంటే, 1) మనస్సు స్తిమితంగా లేని మనిషి ఏ పనీ సక్రమంగా చేయజాలడు, 2) భౌతికాతీత శక్తి మనస్సుపై ప్రభావం నెరపుతుంది. ఆలోచనలో ప్రవర్తనలో మార్పుకి గురిచేస్తుంది. 3) అనుకోనివిధంగా చెడుకీ మంచికీ అవినీతికీ నీతికీ మధ్య సంఘర్షణ జరుగుతుంది. మనిషిని బలవంతంగా పరిస్థితులు లాక్కొనిపోతాయి. 4) చివరకు చెడూ, అవినీతీ అపజయాన్ని పొందుతాయి. 5) స్థిరమైన మనస్సుతో సంకల్పానికి బలం వస్తుంది. సంకల్పబలానికి ప్రయత్నం తోడై కార్యం సాధింపబడుతుంది. 6) ఇది శ్రేయోముఖంగా వర్తించడం మంచిది. వ్యక్తికీ సమాజానికీ ఎప్పటికీ అవసరమైంది.

ఈ విధంగా ఒక్కొక్క నవల్లో వస్తువు 'భావం' కేంద్రంగా, 'సమస్య' కదలికతో ఒక్కొక్క విధమైన ప్రతిపాదనా విషయంగా ఆలోచనకందుతుంది. తరువాత కథతో సంబంధం ఏర్పడుతుంది. ఇతివృత్తమవుతుంది (ఇది వేరే విషయం). రచయిత దృష్టిని బట్టి వస్తువుకు సంబంధించిన అంశం ప్రకాశిస్తుంది. ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా భావించడం సహజం. ఇది రచయిత సంపూర్ణ వ్యక్తిత్వానికీ సంబంధించింది. ఉదాహరణకు ఉన్నవవారి వ్యక్తిత్వం స్వాతంత్ర్యోద్యమం–గాంధీజీ ప్రేరణతో రూపొందింది. ఇది వస్తువును ప్రభావితం చేసింది. కొన్ని సందర్భాల్లో రచయిత ఆంతర వ్యక్తిత్వాన్ని కూడ పరిశీలించే అవసరం కలగవచ్చు.

నవల్లో కేంద్రబిందువు వస్తువు. ఈ స్థానం నుండి అనేక సంఘటనలు, ఇతివృత్త పరిణామానికి దారితీస్తాయి. రేఖలన్నీ ఈ కేంద్రబిందువుతో ముడిపడి ఉంటాయి. క్రమంగా దూరదూరం జరిగిపోతుంటాయి. తమ తమ ప్రత్యేకతలతో నవల్లో పరిశీలనకందే మరో మరో విషయంగా ఆవిర్భవిస్తాయి. వస్తువుకూ, దగ్గరలోనున్న ఇతివృత్తానికీ ఆనుగుణ్యం ఉండాలి. లేని పక్షంలో దేని దారి దానిదే అవుతుంది. అసమన్వితి ఏర్పడుతుంది. వస్తువు ఎంత ఉదాత్తమైందీ శక్తివంతమైందైనా భిన్నాంగాల అమరిక సరిగా లేకపోవడం వల్ల వస్తువులో అంశాలు సరియైన ప్రకాశాన్ని పొందలేవు. ఇవి వస్తువులోని ఆంతర్యాన్నీ యథార్థాన్నీ సముచితంగానే కాక సహేతుకంగానూ ఆవిష్కరించగలగాలి. వస్తువిస్తరణ రూపమే ఇతివృత్త పరిణామం. దీన్ని నడిపేవే పాత్రల చర్యలు. నవల మొత్తం చదివాక వస్తువు సాధారణమైన సార్వజనీనమైన భావనతో మనస్సుపై వెలుగు ముద్రను పొందడంతో రచయిత వ్యక్తిత్వం పెరుగుతుంది.

మరో విషయం, నవల్లో నైతికమైన విలువలూ అభిప్రాయాలూ మొదలైనవి, వస్తువులో దాగిన లేదా నిహితమైన భావస్థానాలకు వివరణ రూపాలుగానూ, భావస్థానాలపై కాంతి ప్రసారాలుగానూ, ఆలోచనకందుతాయి.

వస్తువు ఒక్కొకపుడు నవల పేరులో సూచితం కావచ్చు. ఒక భాగంలోనో మొత్తంమీదనో స్ఫుటంగానో పర్యవసానంగానో సారభూతంగానో స్ఫూర్తికట్టవచ్చు. ఇది సాంఘిక రాజకీయ నైతిక మనస్తత్వపరమైన అనేకాంశాల పరస్పర ప్రభావభాసురంగా రూపొందవచ్చు. వస్తువు ఎన్నికలోనూ వస్తువును నిపుణంగా మలచి ఆవిష్కరించడం లోనూ, ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ రచయిత వ్యక్తిత్వం ప్రభావం తప్పనిసరిగా ఉంటుంది. నవల గురించి విశ్లేషణలో సమాలోచనలో ముందు విమర్శనీయమయ్యే అంశం ఇదే.

వస్తువులో చాలా సాధారణంగా స్థూలంగా సంఘర్షణ తడుతుంది. ఇది అభిలాషను కలిగించేదిగానూ ఉంటుంది. వస్తువు, మానవుల గురించీ లేదా జీవితాన్ని గురించి సాధారణమైన ప్రకటనం మాత్రమే. వస్తువు చారిత్రకమో! రాజకీయమో! సామాజికమో! పరిచయమున్నదైతే సరే, లేకపోతే ఉత్సుకతను ఉదయింపజేస్తుంది. ఇందులో సుప్తంగా ఉన్న సంఘర్షణ 1) వ్యక్తికీ వ్యక్తికీ మధ్య, 2) వ్యక్తికీ భావశక్తులకూ మధ్య, 3) భావశక్తులకూ భావశక్తులకూ మధ్య, 4) వ్యక్తికీ అంతరంగానికీ మధ్య, 5) వ్యక్తికీ లేదా భావశక్తికీ సమాజశక్తికీ మధ్య ఇట్లా అనేక విధాలుగా ఉంటుంది. ఇదంతా ఎందుకు చెప్పడమంటే నవల్లో రచయిత ఎన్నికలో వస్తువు ప్రాధాన్యాన్ని గురించి చెప్పడం కోసమే! వస్తువు బీజభూతమైంది. దీనినుండే నవల్లో వివిధాంశాలు ప్రత్యేకతలతో ఉద్గమిస్తాయి. నవల మొత్తం మీద బీజం నుండి జీవశక్తి ప్రసారంలా వస్తుప్రభావం సూక్ష్మంగానూ గుప్తంగానూ సూచనగానూ అక్కడక్కడా స్ఫుటంగానూ అనుభవానికి వస్తుంది. "జీవితత్వం" ప్రవర్థిస్తుంది. మనిషి జీవితం వస్తువైనపుడు, "జీవితత్వం" సహజం. వస్తువు నవల్లో అనివార్య లక్షణం.

---

★ "Theme is simply a statement about human beings or about life"

- Anatomy of Novel

# 4. ఇతివృత్తం

ఇతివృత్తం సంఘటనల పరంపరారూపం. ఈ పరంపర ఒకదానితో మరొకటి సంబంధం కలిగిందీ. కథాగతికి అనుకూలమైందీ. సంఘటన అనేది మానసికమైన సంచలనంతో, ఉద్వేగంతో, స్తంభనతో కూడిందీ, ఘర్షణతో నిండిందీ, చర్య కలిగిందీ. ప్రధానపాత్ర కష్టాలనుండి బయటపడే అన్వేషణలో అనుసరించే మార్గంగానూ కన్పిస్తుంది[1]. సంఘర్షణ కథలో ఎక్కడబడితే అక్కడ ప్రవేశపెట్టేది కాదు. సంఘర్షణ కథలో మొదటినుండీ ఉంటుంది. కాని అంతటా చైతన్యవంతంగా ఉండదు. కొన్నిచోట్ల మాత్రమే శిఖరస్థాయిని పొందుతుంది. సంఘర్షణ ఆవేశానికి దారితీస్తుంది. నాటకం కథ లేదా నవలలో కథా నిర్మాణమే ఇతివృత్తమనీ సంప్రదాయగతంగా వచ్చే నిర్వచనం[2].

నవల అనుభవంలో చూస్తే ఇతివృత్తం చిన్నచిన్న కథాభాగాలూ, ఉపకథలూ, సంఘటనలతో నిర్మితమవుతుంది. దీన్ని జర్మన్ సాహిత్యంలో కంపోజిషన్ (సంయోజనం) అనీ, రష్యన్ సాహిత్యంలో మోటివేషన్ (సంప్రేరణం) అనీ అంటారు.

నవల్లో మొత్తం మీద కథలో విడదీయదగిన ముఖ్యమైన భాగం లేదా విషయం దృష్ట్యా ప్రధానమైన అంశం ఇతివృత్తంగా పరిగణితమవుతుంది. ఇవన్నీ కలిసి వస్తువు (థీమ్)లో అంతర్లీనమవుతాయి.

జీవితంలో ఎదుర్కొనే సమస్య లేదా సంఘర్షణలో వ్యక్తుల చర్య, ప్రతిచర్యలు ఏ విధంగా ఉన్నాయి? కథ ఏ విధమైన పరిణామం చెందుతుంది? ఆ క్రమం ఎట్లా ఉంది? ఏ రూపాన్ని పొందుతూంది? పాత్ర పరిణత స్థితికెట్లా చేరుతూంది? మొదలైన అంశాలు ఇతివృత్తంలో నిహితమై ఉంటాయి. సంఘర్షణ స్వరూపం పాత్రశీలం చేత నిర్ణీతమవుతుంది. పాత్రల భిన్న భిన్న మానసిక స్థితులూ, అభిలాషలూ, ఉద్దేశాలూ, ప్రయోజనాలూ, సంఘర్షణతో ఏర్పడే సంఘటనలతో ఇతివృత్తం రీతి (డిజైన్) ఏర్పడుతుంది. ఏ ఇతివృత్తం తీరు దానిదే. పాత్ర ప్రమేయం లేకుండా నవల్లో ఏ సంఘటనకూ అస్తిత్వం చేకూరదు.

---

1. Plot can be defined as a series of connected incidents, all filled with tension and conflict that path of a lead character takes in his search for a way out of his difficulties – The craft of Fiction : William C. Knott.
2. A narrative structure of the play, tale or novel has traditionally been called plot - ibid.

ఇతివృత్తంలో సంఘర్షణకు ఉద్దేశం, పర్యవసానం అనేవి రెండు ముఖ్యాంశాలు. ఇవి పాత్రను ఆశ్రయించినపుడే బాగా రాణిస్తాయి. ఇతివృత్తానికీ పాత్రకూ గల సంబంధం చాలా సన్నిహితమైంది. ఇ.ఎమ్. ఫాస్టర్ ఇతివృత్తానికన్నా పాత్రకు ప్రాధాన్యం ఇస్తాడు. హెన్రీ జేమ్స్ ఇతివృత్తానికీ పాత్రకూ మధ్య అంతరాన్ని పాటించడు. అయితే నవల్ని గురించి సాహిత్య విమర్శ సూక్ష్మ సూక్ష్మ తలాలపై ఎక్కువవుతూన్న కొద్దీ, కథావస్తువు, ఇతివృత్తం, పాత్ర గురించి విమర్శలో సునిశితమైన విశ్లేషణ ఎక్కువయింది. ఇవి నవల్లో పరస్పరం పోషకాలుగా గుర్తింపబడుతూనే అవయవైక సంపూర్ణతకు దోహదం చేసేవిగా పరిశీలింపబడుతూనే, ఒక్కొక్కదాని ప్రత్యేకతను గురించి విస్తృతమైన చర్చకు అవకాశం కలిగింది. ఇతివృత్తం- పాత్ర అనేవి ఒకదానితో మరొకటి ఎంత సమాశ్రయ భావం కలిగినా, రెండింటినీ వేరువేరుగా వివేచనకు పూనుకోవడంలోనే సామంజస్యముంది. దీనితో వాటి ప్రత్యేకతను గుర్తించడం జరుగుతుంది.

ఇతివృత్తం అనేది కథలో యోజితమైన కొన్ని ఘటనల సమాకలనం. ఇందులో ఒక క్రమం ఉంటుంది. కథనం వర్ణనం వ్యాఖ్యానం వాతావరణం కల్పన వదిలేసి కథకు సంబంధించిన యోజన (Plan) మాత్రమే గ్రహింపబడుతుంది. దీన్నిబట్టి కథలో ఏం జరిగేదీ తెలుస్తుంది. కథాగమనానికి ఆయువుపట్టు అన్నమాట. ఇతివృత్తానికి మొదలు మధ్య చివర ఉంటాయి. పూర్వకథల్లో పురాణేతిహాస కథానిర్మాణం జ్ఞాపకం వస్తుంది. ఆధునిక కాలంలో కొత్తకొత్త యోజనా మార్గాలచేత ఎన్నో మార్పులు వచ్చాయి.

ఇతివృత్తమనేది శరీరాకృతికి అస్థిపంజరం వలె నవలకు ముఖ్యమైందిగానూ, జీవం స్పందించడానికవసరమైన మృత్తికగానూ, కొందరు విమర్శకులు భావించారు. అయితే దీని పని ఇంతమాత్రమే కాదు. స్థూలమైన నిర్మాణ రూపంలో భాగంతోపాటు, నవల్లో అనేకాంశాలతో సంబంధం కలిగిందీ. పాత్రచేత సంఘటనచేత అభిప్రాయంచేత పరిపుష్టమవుతుంది. మొత్తంమీద రచనలో అవసరమైన విషయాన్ని ప్రత్యక్షంగానో పరోక్షంగానో అనుభవానికి తెచ్చే ఆధారతలంగా ఉపకరిస్తుంది. తన అస్తిత్వాన్ని భావింపజేసే లక్షణం కలిగిందీ.

ఇందులో 1) అనేకమైన సంఘటనల సంఘర్షణల పరంపర - రచయిత ప్రణాళిక ననుసరించి అవసరమైన క్రమంలో ఉంటాయి. 2) దీనిలో కాలాన్ని ఆశ్రయించిన గమన రూపం ఉంటుంది. 3) దీనికి మొదలు చివర మధ్య ఉంది. ఇది దీని స్వరూపాన్ని అవగతం చేస్తుంది. ఇతివృత్తం ప్రత్యేకంగా గుర్తింపదగిందిగానూ,

ఇతర అంశాల సంబంధం చేత సమాపూర్ణమై కనిపిస్తుంది. 4) రచనలో ఇతర అంశాల్ని సమైక్యంగా నిలిపే ప్రత్యక్ష నిర్మాణ రూపంగానూ నిలుస్తుంది.

II

నవల విషయానికి వస్తే, ఇందులో ఇతివృత్తంలో 1) సంఘటన, 2) పాత్ర, 3) చర్య, 4) ఆలోచన అనే అంశాల సమన్వయం బాగా కన్పిస్తుంది. కథలో గమనం వల్ల కాలం ప్రసక్తి తప్పనిసరిగా వస్తుంది. నవల్లో కాలం – స్థలంలో పాత్ర ప్రవేశించి, మరో లక్షణానికి దారితీస్తుంది. ఇది సహజం. ఒక లక్షణం నుండి మరో లక్షణానికి సరిస్తూ, అనుబంధంతో, పరస్పర సహకారంతో కలుస్తూ, ఒక "అల్లిక" నవల్లో ఆవిష్కృత మవుతుంది. ఇతివృత్తం అభిలాషను నిలుపుతూ ఉత్సుకతను పెంపొందించే విధంగా రూపొందించడంలో రచయితకు నేర్పు అవసరం. పాత్ర ఎదుర్కొనే సమస్య గురించి అభిలాష, ముందు ఏం జరుగుతుందన్న ఉత్సకత! నవలను చదివింపజేసే అంశాల్లో భాగాలుగా రాణించాయి.

ఇతివృత్తం రెండు విధాలుగా యోజితం కావచ్చు. 1) కాలక్రమంలో, 2) హేతుక్రమంలో.

1) కథలో జరిగే అనేక సంఘటనలు వరసగా అవి పరిణమించే కాలక్రమంలో గతిస్వరూపం ఉంటుంది. పూర్వకాలపు నవలల్లో సాధారణంగా అవలంబించే విధం ఇది. మునుముందు ఏమి జరుగుతుందోనన్న అభిలాషను అంకురింపజేసే లక్షణం కలిగీ ఉంటుంది.

2) కథలో జరిగే అనేక సంఘటనలు, వీటి వెనుకనున్న హేతువు క్రమంలో గతి స్వరూపం ఉంటుంది. ఒక విషయం తరువాత మరొకటి హేతుదృష్టితో యోజితమవుతాయి. ఇందులో ఏమి జరుగుతుందోన్నది కాకుండా ఇట్లా ఎందుకు జరుగుతూందన్న ఆలోచనకు దారితీస్తుంది. సందేహంతోపాటు కారణం వివరణం సూచనలో ఇతివృత్తానికి ఆలోచనా స్థాయి లభిస్తుంది. దీనివల్ల పూర్వాపరక్రమం మారుతుంది. కొత్తదారిలో రచన సాగుతుంది. ఆకర్షణీయతను పొందుతుంది. ఈ విధం అంత సులభమైంది కాదు. రచయిత మేధకు పనిపెట్టేదీ.

కార్యకారణ సంబంధంతో నడిచే నవల్లో పాత్ర చర్యలపై సంఘటనల యోజనపై ఆలోచనతో అవలంబించే శిల్పం, ఉన్నతకోటికి చెందింది. ఇది కళాత్మకంగా నవల స్థాయిని పెంచుతుంది. దీన్ని విజయవంతంగా నిర్వహించేందుకు, కథాగమనంపై

పాత్ర చర్యపై రచయితకు సంపూర్ణమైన ఆధిపత్యం లేదా పట్టు ఉండాలి. నేర్పు అవసరం.

బలమైన ఇతివృత్తం వల్ల కథా ప్రణాళికకు విశిష్టత చేకూరుతుంది. ప్రత్యేక పరిస్థితులూ వీటికి అనుకూల్యం ప్రాతికూల్యం గల స్థితిగతులతో ఇతివృత్తానికి ప్రాబల్యం కలుగుతుంది. కొన్ని నవలల్లో కొంత భాగం కాలక్రమం, కొంతభాగం హేతుక్రమం అవలంబించి వైవిధ్యాన్ని ప్రదర్శించడమూ జరుగుతుంది.

దీనితోపాటు పాత్ర తన జ్ఞాపకాన్ని పుస్కరించుకొనీ వెనుకటి కథను స్మరించడం, స్వీయ చరిత్రాత్మకం, లేఖలు డైరీల ప్రసక్తితో ఇతివృత్తం నిర్మాణంలో కొత్తదనాన్నీ వైవిధ్యాన్నీ పొందుతూంది.

ఇదంతా నవల విశ్లేషణకూ, సమాలోచనకూ బాగా ఉపకరిస్తుంది. ఇతివృత్తం గురించి ఎంత చెప్పినా అంతా ప్రయాణానికవసరమైన మార్గాన్నీ, సదుపాయాన్నీ చూపే పటం వలె వివరణవలె మాత్రమే ఉపయోగపడతాయన్న మాటలో వాస్తవం లేకపోలేదు. అయితే ప్రయాణం మొదలయ్యాక అప్పటికెదురయ్యే పరిస్థితుల్ని బట్టి కొత్త చేర్పులూ మార్పులే చేరవచ్చు. కాని స్థూలంగా ప్రయాణరూపం ఒకటే. ఈ విషయంలో రచయితకు స్వేచ్ఛ ఉంది. దీనివల్ల ఒక్కొక్క సందర్భంలో ఒక్కో విధమైన ఇతివృత్తం నిర్మాణం అవగతికి రావడం, నవల్లో వీలయ్యే నవ్యతకు నిదర్శనం.

## III నిర్మాణ రూపాలు

విమర్శకులు ఇతివృత్తాన్ని పలు విధాలుగా వర్గీకరించారు.

**1. ఒక విధం :** ఇది ఇతివత్త నిర్మాణంలో ఐక్యతా సూత్రం ఆధారంగా ఉంది. ఇది రెండు రూపాల్లో ఉంటుంది. ఎ) సాధారణం (సింపుల్), బి) మిశ్రమం (కాంపౌండ్).

**I)** సాధారణంలో కొన్ని పంక్తుల్లో సంక్షిప్తపరచడానికి వీలుగా, పాత్ర అనుభవాలతోను సంఘటనలతోనూ సూటిగా వరసగా ఇతివృత్తం చిత్రితమవుతుంది.

**II)** మిశ్రమంలో వెంటనే సంక్షిప్తపరచడానికి వీల్లేకుండా ఎన్నో పాత్రల అనుభవాలతోను సంఘటనలతోనూ మిశ్రితమవుతుంది. ప్రత్యేక రీతిలో యోజితమవుతుంది. అక్కడక్కడా చెదరినట్లనిపించే వివిధ భాగాలు సంకీర్ణ స్థితిలో ఒకచోట నిబంధింపబడతాయి. మిశ్రమ గుణాన్ని పొందుతాయి. ఇవి ఐక్యమై సమగ్రతను పొంది ప్రత్యేక విధాన్ని తలపిస్తుంది. ఇందులో మధ్యమధ్య స్వతంత్రమైన అంశాలు

ప్రవేశిస్తూ ఉంటాయి. రచయిత వీటినన్నిటిని రచనలో సమదృష్టితో నిర్వహించవలసి ఉంటుంది.

ఇతివృత్తంలో వివిధ భాగాలు, దేనికది విడివిడిగా ఉన్నట్లుగా అనిపించకుండా సంవిధానంలో ఐక్యత స్థాపితం కావాలి. ఇది రచయిత కళాత్మకమైన రచనా శిల్పానికి నిదర్శనం.

**2. మరో విధం :** కథకు సంబంధించిన విషయాన్ని స్థూలంగా ప్రణాళికకు అవసరమైన పద్ధతిలో యోజన చేసే విధం. ఈ విధం ఇతివృత్తం రెండు రూపాల్లో ఉంటుంది.

**I)** శ్లథం/వదులు (loose)

**II)** శ్లిష్టం/సమైక్యం (organic)

ఎ) శ్లథంలో ఎన్నో అవసరమైన సంఘటనలు పరస్పరం అంతగా సంబంధం లేని అనేకమైన ఉపకథలతో అంశాలతో యోజితమైన రూపం కన్పిస్తుంది. ఇందులో కథా సమైక్యంపై కాకుండా కేంద్రస్థానీయమైన ఒక పాత్రపై ఈ యోజనం ఆధారపడి ఉంటుంది. ప్రధాన కథతో సహేతుకమైన సంబంధం లేని అనేకమైన సంఘటనలూ, ఉపకథలూ, వివిధాంశాలూ ఒకచోట ప్రధానపాత్రకు కట్టివేయబడతాయి. లేదా పాత్ర చుట్టూ తిరుగుతాయి. ఇతివృత్తం సర్వం ఒకే పాత్రను ఆశ్రయించి ఉంటుంది. అక్కడక్కడా ఏదో సంబంధం ఉన్నట్లు పైకి కన్పించవచ్చు. కాని మొత్తం మీద సమన్వయలోపం కన్పిస్తుంది. ఒక విధమైన కీర్ణత్వాన్నీ లేదా శ్లథత్వాన్నీ కలిగి ఉంటుంది.

ఇది ఇట్లా ఉంచి ఇందులో మరో విషయం పాత్రలు ఒకదాన్ని మరొకటి మధ్యలో క్రాస్ చేస్తూ (అతిక్రమిస్తూ), ఒక దృశ్యం మరో దృశ్యంలోకి అనవసరంగా క్రమిస్తూ ఇతివృత్తం బలహీనంగా నిర్మితమవుతుంది. ఈ విధంలో రచయిత అంతా సిద్ధం చేసుకొని ముందుగానే పర్యవసానాన్ని కూడా నిర్ధారించుకొని తన అభిప్రాయాల కనుగుణంగా సర్వమూ పరిణమింపజేస్తున్నట్లు కన్పిస్తుంది. అట్లా పైకి కన్పించకపోవడం నిర్మాణశిల్పం దృష్ట్యా మంచిది. కాని శ్లథంలో బాహాటంగా కళాత్మకత దృష్ట్యా ఈ బలహీనత సమాలోచనకందుతుంది.

బి) సమైక్యం లో అక్కడక్కడా ఉన్న ఉపకథలూ, సంఘటనలూ వివిధాంశాలు సహజంగా సముచితంగా అవసరం మేరకు క్రమంలో యోజితమవుతాయి. ఇతివృత్తం సమైక్యరూపాన్ని పొందుతుంది. వివిధ పాత్రలు ఉండవలసిన స్థితిలో ప్రవర్తిస్తాయి.

మొత్తంమీద అమరికలో హేతుయుతంగా సావయవ సంపూర్ణత్వం సిద్ధిస్తుంది. ఇతివృత్త నిర్మాణంలో హేతుసమన్వయంచేత రచన కళాత్మకంగా రూపొందుతుంది.

ఇతివృత్తాన్ని సాంఘికం, పౌరాణికం, చారిత్రకం, రాజకీయంగా చేసే విభజన పూర్వం నుండి వస్తున్నదే. నార్త్‌రోప్‌ఫ్రై అనే విమర్శకుడు కథలో నాయకునిబట్టి 1)దేవతలూ, 2) ఉన్నత ప్రకృతిగల మానవులూ, 3) సామాన్యమానవులు, 4) అధమ ప్రకృతిగల మనుషులూ అని వర్గీకరించాడు. ప్రధాన పాత్రలు ఆధారంగా ఇతివృత్తాన్ని విభజించి చూపాడు. ఇంకా ఎ) విషాదాంతం, బి) మోదాంతం అనీ పూర్వం నుండి వాడుకలో ఉన్న విభజనే.

ఇవన్నీ విమర్శకులు ఎప్పటికప్పుడు నవలపై ఉత్తమమైన కొత్త సమాలోచనాన్ని అందించే ఉద్దేశంతో ఉపక్రమించినవే.

## IV

నార్మన్‌ఫ్రైడ్‌మాన్ మొదలైన విమర్శకులు ఇతివృత్తాన్ని మూడు విధాలుగా విశ్లేషించి చూపారు. ఎ) పాత్ర ప్రధానమైనవీ, బి) చర్య ప్రధానమైనవీ, సి) భావ ప్రధానమైనవీ.

**I)** పాత్ర ప్రాధాన్యం గల ఇతివృత్తంలో పాత్ర ప్రముఖస్థానాన్ని వహిస్తుంది. మంచివైపుకు మరలీ పాత్రలో మార్పువస్తుంది. మార్పుకనుగుణంగా మొదటినుండీ పాత్రలో సంస్కార బీజాలు నాటబడి క్రమంగా వికసించడం కన్పిస్తుంది. ఉదాత్తమైన ఆశయం నెరవేరేందుకై, ఎదురయ్యే క్లిష్ట పరిస్థితుల్ని తట్టుకొనీ, పరీక్షలో విజయాన్ని సాధించడం జరుగుతుంది. ఒక్కోమారు పాత్ర ఆశయాలూ ఆశలూ కూలిపోవచ్చు. ఏదో మార్పుతో కొత్తజీవితం మొదలు కావచ్చు. ఏమైనా ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఆ పాత్రపైనే వెలుగు ప్రసరిస్తుంది.

ఇందులో అంటే పాత్ర ప్రధానంలో 1) పరిణతం, 2) పరీక్షాత్మకం, 3) సంస్కరణం, 4) ప్రక్షీణం అని అవాంతర భేదాలున్నాయి. వీటిలో ఒక్కొక్కటీ పాత్రలో పేర్కొదగిన అవాంతరమైన అంశాన్ని స్ఫురింపజేస్తుంది.

**II)** చర్య లేదా క్రియా ప్రాధాన్యం గల ఇతివృత్తంలో కథలో జరుగబోయే దాన్ని గురించి అభిలాషపై దృష్టి ప్రసరిస్తుంది. ఇది పూర్వం నుండి వస్తున్న ఇతివృత్త భేదం. ఇందులో పాత్రగతమైన భావన, చర్యను ముందుకు నడిపించేంత మాత్రంగా

ఉంటుంది. అప్పటి అవసరాలకు తగినంత మేరలో ఆలోచన సాగుతుంది. (పాత్రగతమైన భావన లేదా ఆలోచనకు తక్కువ అవకాశం ఉంటుంది). ఇతివృత్తం క్రమంలో అనుమానం, నిరీక్షణ, ఆశ్చర్యం, ఆవేగం లక్షణాలతో ఇతివృత్తం మౌలికమైన విషయం లేదా సమస్య చుట్టూ వ్యవస్థీకృతమవుతుంది.

ఇందులో అవాంతర భేదాన్నిబట్టి 1) కారుణ్యం, 2) శిక్ష, 3) విషాదం, 4) ప్రశంస, 5) రాగాత్మకం అనీ గుర్తించడం జరిగింది. చర్య లేదా క్రియ ప్రాధాన్యం గల ఇతివృత్తంలో ప్రధాన పాత్ర చర్య లేదా క్రియ చేత ప్రేరితమవుతుంది. క్రమంగానో హఠాత్తుగానో పాత్ర మార్పుకు లోనవుతుంది.

సి) భావం లేదా ఆలోచనా ప్రాధాన్యం గల ఇతివృత్తంలో కథలో మార్పు కోరే ఆశయం లేదా అభిప్రాయం లేదా సిద్ధాంతం ప్రపంచితమవుతుంది. ఇది ఇటీవల బాగా ప్రసిద్ధిలోకి వచ్చింది. సమస్యకు పరిష్కారం నిశ్చితమైన ఆలోచనతో నిర్దిష్ట మవుతుంది. పాత్ర ప్రవర్తనలో ఏ గొప్ప అనూహ్యామైన మార్పులుండవు. సిద్ధాంతానికి దోహదం చేసే మేరలో మార్పులుంటాయి. వ్యక్తి లేదా సమాజం శ్రేయస్సు దృష్ట్యా పాత్రధోరణి చిత్రితమవుతుంది. ఇది ఎక్కువగా భావన లేదా ఆలోచనతో పరివ్యాప్తం కావడం ఇందులో విశేషం.

దీనిలో అవాంతర భేదాలున్నాయి. 1) విజ్ఞానాత్మకం, 2) సత్యప్రకాశనం, 3)ప్రభావశీలం, 4) నిరాశామయంగా పేర్కొబడినాయి.

ఇతివృత్తంపై వివేచనంతో కూడిన ఉత్తమ విమర్శ నవల సమాలోచనలో పరిహరింపరానిది. నార్మన్ ఫ్రైడ్‌మాన్ ఇతివృత్త విశ్లేషణలోని మూడు విధాల్లో చర్య ఇతివృత్తాన్నే చాలా మంది రచయితలు అనుసరించినట్లు కన్పిస్తుంది.

ఇది ఇట్లా ఉంచి, ఉత్తమ నవల్లో ఇతివృత్తానికీ ప్రధానపాత్రకూ గల సంబంధం విడదీయరానిదిగా ఉంటుంది. ఇతివృత్తంలో పాత్ర అనుబంధంతో చర్య మూడు విధాలుగా గుర్తించడం జరిగింది. 1) ఆరంభం లేదా ఉద్గమనం (Beginning or Rising), 2. పతాక (Climax), 3. సమాప్తి (End or Falling) అనేవి కథా పరిణామ స్థితుల్ని సూచిస్తాయి.

ఏ పాళ్ళలోనైతేనేం పాత్ర-చర్య-భావన (ఆలోచన) మూడింటి సహయోగంతోనే ఉత్తమ నవల రావడానికి అవకాశముంది. రచయిత దృక్పథంతో ఆశయంతో ప్రాధాన్య వివక్ష ఏర్పడుతుంది. ఈ స్వేచ్ఛ నవల అభివృద్ధికి అవకాశాన్ని ఇచ్చే అంశమవుతూంది.

## V

ఈనాటి పత్రికా ప్రపంచం నవల గౌరవ ప్రతిష్ఠలకూ అభివృద్ధికీ తోడ్పడుతూంది. పత్రికల్లో సీరియల్ నవలల్లో ఇతివృత్తగతంగా పతాకస్థానాలు ఎక్కువగా ఉంటాయి. ప్రతి వారం పక్షం నెల వచ్చేసరికి దశలు దశలుగా ప్రకటితం కావలసినవీ. అప్పటప్పటికి ఆశ్చర్యాన్ని ఔత్సుక్యాన్ని నిలపగలిగే విధంగా ఆపవలసి ఉంటుంది. పాఠకుల్ని తరువాత సంచిక వచ్చేవరకూ ఆరాటపెట్టే విధంగా ఉండాలి. ఏదో సమస్య ఉత్పన్నం కావడమో, ఉన్న సమస్య గురించి ఆలోచనతోనో అనిశ్చిత స్థితితోనో అనుకోని మలుపు తిరిగే సూచనతోనో సందేహస్థితితోనో నిలిచిపోతుంది. ప్రతి సంచికలో కాకపోయినా చాలామార్లు ఈ విధంగా ఉండకపోతే నవలకు సీరియల్ ఆకర్షణ ఉండదు.

నవలను సీరియల్‌కు ఉద్దేశించినదానికీ, ఉద్దేశించనిదానికీ భేదం ఉంటుంది. ఇంకా కావాలనీ, ఇతర కారణాలను పుస్కరించుకొనీ ప్రచారం కోసమో పత్రికల వారి కోరికపైనో మధ్యలో పాఠకుల అభిప్రాయాల్ని మన్నించడం కోసమో, వారి అభిప్రాయాన్ని సేకరించీ లేదా పసిగట్టీ, కథ ఏ విధమయిన మలుపులు తిరిగితే బాగుంటుందో, ఆ విధంగా రచయితలు ఇతివృత్త నిర్మాణంలో ఉత్సుకతను పెంచే మార్పులు చేయడం అప్పుడప్పుడూ తటస్థిస్తుంది.

ఇది ఇట్లా ఉంచి, నవల్లో ఇతివృత్తాన్ని సినిమా తీయడానికి వీలుగా చాక్షుష (visual) మైన ఆవిష్కారానికి అనుగుణంగా రూపొందించడానికి రచయితలు ప్రయత్నించడమూ జరుగుతూంది. ఇందుకోసం ఆ కాలంలో చెలామణిలో ఉన్న రీతుల్ని చొప్పించడమూ గమనించవచ్చు. నవల్లో మనోభావ స్పందనం, పాత్ర చర్య, భాషా స్వరూపం మొదలైన అంశాలతో ఇతివృత్తం పరిపుష్టమవుతుంది. సినిమాలో చాక్షుషమైన భావ రూపాలు (visual images) కు ప్రాధాన్యం ఉంటుంది. దీనికోసం నవల్లో ఇతివృత్తం కత్తిరింపబడుతుంది అంశాల్లో. కొత్తవి ప్రవేశపెట్టబడుతాయి. చాలా సందర్భాల్లో గొప్ప నవలలు సినిమా తీయడానికి తగినవిగా ఉండకపోవడాన్ని గమనించవచ్చు. సినిమా కోసం మార్పులు అవసరమవుతాయి. ఈ మార్పులు రచయిత దృక్పథానికి భిన్నంగా పరిణమించవచ్చు. తెలుగు నవల 'ఏకవీర' సినిమా ఈ సందర్భంలో జ్ఞాపకం వస్తుంది. "వెదరింగ్ హైట్స్"ను యథాతథంగా సినిమా తీసే ప్రయత్నం జరిగింది. విజయం సాధించలేకపోయింది.

సినిమారంగం కొన్ని నవల్లో ఇతివృత్త నిర్మాణంపై కొంత ప్రభావాన్ని నెరపింది. సినిమాను దృష్టిలోపెట్టుకొని వ్రాసే నవలలూ కన్పిస్తాయి. ఆధునిక సమాజంలో వచ్చే

మార్పుల్ని రచనాపరంగా రచయితల గుర్తించి, నవలల్ని నిర్మించడం తెలుగు నవలా వికాసంలో చర్చింపదగిన అంశం.

రచయిత అభిప్రాయాలూ, సిద్ధాంతాలూ ఇతివృత్త స్వరూపంపై ప్రభావాన్ని నెరపుతాయి. ఇతివృత్తంలో మౌలికమైన స్వరూపానికి భిన్నంగా ఏదీ ఉండకూడదనేది నిర్వివాదాంశం. ముఖ్యమైన అంశంతోపాటు అవాంతర సంఘటనలూ హేతుబద్ధంగా తీర్చవలసి ఉంటుంది. ఏదో పనికట్టుకొని లాక్కొని పోతున్నట్లు ఉండకూడదు. సహజంగా సముచితంగా సావయనంగా మొత్తంమీద కళాత్మకతకు లోపం రాకూడదు.

రోజురోజుకీ జీవితానుభవం జిజ్ఞాసాత్మకంగా వైవిధ్యోపేతంగా విస్తృతి చెందే నేటి సమాజంలో, రచయితలో నవ్యమైన ఆలోచనలతో అన్వేషణతో ప్రయోగంతో, ఇతివృత్త నిర్మాణం ఆధునికతను పొందడంలో నవల ప్రతిష్ఠ పెరుగుతూంది. ఇతివృత్తం, నవల్లో రచయిత శ్రద్ధ వహింపదగిన ప్రధాన లక్షణాల్లో ఒకటి.

# 5. పాత్ర స్వరూపం

అక్షరరూపంలో జీవించే వ్యక్తిత్వ రూపాలే నవల్లో పాత్రలు, బహిర్ అంతర్ వ్యక్తిత్వ దర్శనమే పాత్రచిత్రణం. నిత్యజీవితం నుండి ఉద్గమించిన వాస్తవ స్వభావ రేఖలతో స్పందిస్తుంది. అక్కడక్కడా ఎంతో కల్పన చోటుచేసుకోవడమూ జరుగుతుంది. ఎట్టి పరిస్థితుల్లోనూ మానవీయ సంబంధాలను కాపాడుతూ జీవిత యథార్థాన్ని ప్రతిఫలింపజేస్తూ ఉంటుంది. రచన చదువుతూంటే పాత్రల మనస్తత్వం, ప్రవర్తనం, ఆదర్శం పట్ల ఎంతో అభిలాష కలుగుతుంది. వాటి చర్య ప్రతిచర్య ఉద్దేశం ప్రయోజనం పట్ల ఆసక్తి పెరుగుతుంది. కొన్ని పాత్రల్ని ప్రేమిస్తాం, మరికొన్నిటిని ద్వేషిస్తాం. ఒకే పాత్రను ఒకప్పుడు గుండెకు హత్తుకొని, మరొకప్పుడు తీసిపారేయవచ్చు. ప్రపంచంలో వ్యక్తులపట్ల కలిగే అభిప్రాయమే నవల్లోనూ పాత్రల గురించి ఏర్పడుతుంది. వీటి అడుగునుండి జీవితం ఎన్నో వలయాల్లో శ్రేణులుశ్రేణులుగా యథార్థ సదృశంగా నిర్మితమౌతుంది. ఈ నిర్మాణాల పరిశీలనం అంటే మానవ జీవిత భాగాలతో పరిచయం చేసుకోవడమే.

ప్రపంచంలో వ్యక్తులెన్ని విధాలో, పాత్రలూ అన్ని విధాలుగా ఉంటాయి. దీనికి కల్పన కొంత జోడింపబడుతూ కొత్త రూపాన్ని పొందడమూ జరుగుతుంది. నవల చదివాక ఇతివృత్తంతోపాటు జ్ఞాపకం ఉంచుకోదగిన పాత్రలు సృష్టించడం సామాన్యం కాదు. మన స్మృతిపథంలో నిలిచిపోయి, సంభాషణలో ఏదో ఒక సందర్భంలో ప్రసక్తికి వచ్చేంతగా కొన్ని పాత్రలు ప్రసిద్ధిచెందుతాయి. పాఠకుని మనస్సు పాత్రప్రభావానికి గురికావడం ఒక్కటే గీటురాయి. మంచి పాత్రా? చెడు పాత్రా? అనేది వేరే ప్రశ్న. ఇది మంచి పాత్ర, ఇది చెడు పాత్ర అని విభజించడాన్ని ఆధునిక విమర్శకులంగీకరించరు. ఇటువంటి భావాన్ని కలిగించే పాత్రచిత్రణం, రచయిత పాక్షికమైన వైఖరినీ, ఒక్కొక్కప్పుడు పలాయన మనస్తత్వాన్నీ ప్రకటిస్తుందని ఒక అభిప్రాయం. ఇది మంచి ఇది చెడూ అనే నిర్ణయం జీవిత పథాన్ని నిర్దేశిస్తుంది. కాబట్టి తిరస్కరణీయం కాదని సమర్థించేవారి అభిప్రాయం. అభిప్రాయభేదాలెట్లా ఉన్నా నిజజీవితంలోనూ ఎన్నో విషయాల్లో సులభంగా నిర్ణయాలు చేసి గీతలు గీసినట్లు మంచి చెడుల్ని విభజించి ఏర్పాటుచేయడం కుదరదు. ఇట్లా చూడవలసిందీ కాదు జీవితం. ఒక దృక్పథాన్నిబట్టి ఏర్పరచుకొన్న కొన్ని విలువల్నిబట్టి కొన్ని పరిమితుల్లో ఒదిగిపోవడం జరుగుతుంది. ఆ దృక్పథాన్నీ విలువల్నీ ప్రశ్నలకు గురిచేసినపుడు వస్తుంది చిక్కు. పాత్రల మంచిచెడుల నిర్ణయంతో ప్రమేయం లేకుండా రచయిత పాఠకులకే నిర్ణయాన్ని వదిలివేయడం సమంజసమన్న శిల్పదృష్టి

నేటి సాహిత్యలోకంలో బాగా వ్యాప్తిలో ఉంది. తాననుకొన్న "మంచి" పేరుతో ఒక పాత్రను పైకెత్తడం, కొన్నిటిని కిందికి దించడం. "చెడు" పేరుతో తక్కువచేయడం కన్నా రచయిత వివిధ పాత్రల మధ్య ఒకదానితో మరొకటి పనిచేసే తీరులో చర్య, ప్రతిచర్యను పురస్కరించుకొని సంఘర్షణను నిలుపుతూ, సమగతిని కాపాడుతూ, సమానదృష్టిని కలిగి సమగ్రమైన జీవితచిత్రణకు ప్రయత్నించవలసి ఉంటుంది. లోకంలో మంచి–చెడు ; సత్యం–అసత్యం ; ధర్మం–అధర్మం అనే వాటి విషయంలో ఒక నిర్ణయానికీ రావడమంత సులభం కాదు. దీని వెనుకనున్న సామాజిక పరిస్థితుల ప్రాబల్యం, పైకి తెలీని రహస్యాలు, అదుపులేని అవ్యక్త చైతన్యం, ఇతర పాత్రల ప్రవర్తనం, ప్రతివర్తనం, అన్నీ కలిసి అనుకోని దిశల్లోపనిచేస్తాయి. ఈ కారణంగా రచయిత పాత్రచిత్రణంలో ఏదో స్థూలమైన నిర్ణీతమైన అభిప్రాయం కన్నా సూక్ష్మసూక్ష్మంగా వివేచన చేసి యథార్థాన్ని ప్రకాశమానం చేసే దృష్టినీ, సమభావాన్నీ అలవరచుకోవడంవల్ల పాత్రకు న్యాయం జరిగే అవకాశం ఉంది. అపుడే నవల జీవితానికత్యంత సన్నిహితంగా ఉంటుంది. సహజత్వాన్ని కోల్పోదు. ఏ పాత్రకు ఆ పాత్ర ఒక ప్రత్యేకమైన వ్యక్తిత్వంతో జీవిస్తుంది. మానవజీవితం ఎంతో సంక్లిష్టమైంది. నవల్లో దీని ప్రతిఫలనం అనివార్యం. మనిషిలోని స్పర్థ, ఆశ మొదలైన లక్షణాలచేత ఆలోచన ప్రవర్తనం అనేకమైన మార్పులకు నిరంతరం లోనవుతూ ఉంటుంది. జీవితం ఎప్పుడు ఏ మలుపు తీసుకునేదీ నిశ్చయంగా చెప్పడం కష్టం. ఇది వ్యక్తికీ వ్యక్తికీ భేదిస్తుంది. ఒకే వ్యక్తి ఆలోచన, ప్రవర్తన వివిధ సందర్భాల్లో భిన్నభిన్నంగా ఉండవచ్చు. ఏవో కొన్ని సూత్రాలు నిర్దేశించి అందులో నిబంధించిన ఆదర్శరూపాన్ని ఇవ్వడం కుదరదు. సామాజిక రాజకీయ పరివర్తనంవల్ల ఎంతో కాలంగా నెలకొని ఉన్న విలువల్లో మార్పు రావడంతో కొత్త దృక్పథం ఏర్పడి నవల్లో పాత్రచిత్రణకు సంబంధించిన ఆలోచనా వైఖరిలో ఎంతో మార్పు వచ్చింది. దీని వివేచనతో పాత్రలో కలిగే వివిధ సమ విషమ గతుల్ని చిత్రించడంతోపాటు పాత్రలో నిలకడకు భంగం వాటిల్లే పరిస్థితినీ నిరోధించడం అవసరం. ఇది పాత్ర చిత్రణలో రచయిత బాధ్యతను స్మరింపజేస్తుంది.

జీవితం గురించి ఎంతో పరిశీలనతో ఎన్నికజేసి నిర్మించిన అనేక విషయాల సంకలనరూపమే పాత్ర. ఇది ఒక తీరులో శిల్పంచేత యోజితమై వ్యక్తిత్వంగా ప్రకాశిస్తుంది. నిజజీవితంలో మనకు ఆసక్తిలేనివీ, ఇష్టం లేనివీ వదిలేస్తాం. ఇక తెలీనివి సరేసరి. నవల్లో తప్పనిసరిగా అన్నీ చదువవలసి ఉంటుంది. దీనితో అనుభవంలోకి వచ్చి, ఆలోచనకు ఉపక్రమించడం జరుగుతుంది. సాధారణమైన విషయాలు మొదలుకొని ప్రత్యేకాంశాల దాకా విస్తృతమై ఉంటుంది. ఎంతో విస్తృతమైన

జీవితక్షేత్రం ఒక ఖండబింబంగా వివిధ పార్శ్వాల్లో మన ఎదుట సాక్షాత్కరిస్తుంది. పాత్రల రూపంలో తోటి మానవుల్ని గురించి ఎంతో తెలుసుకుంటాం. ఈ స్థితిలో పాత్రలు మనకు సాధారణంగా కన్పించే కేవలం వ్యక్తులుగానే కాక, అర్థవంతమైన అనుభవ పరంపరతో మనలో కొత్త ప్రపంచాన్ని నిర్మిస్తాయి. వ్యక్తులతో లేని పరిచయం వీటితో ఏర్పడుతుంది. పాత్ర సహజత్వాన్ని కోల్పోకుండా విశేషస్ఫూర్తితో జీవితాన్ని పోలిన స్థితి చిత్రణం అనుభవంలోకి రావడానికి రచయిత పాత్ర చర్యను జాగ్రత్తగా నిర్వహించవలసి ఉంటుంది. ఏ ఏ చర్యల ఒత్తిడివల్ల ఏ ఏ పాత్రలు ప్రభావానికి గురి అయ్యేదీ గుర్తిస్తూ మరీ ముందుకు సాగాలి. చర్యకు అవసరమైన పరిసరాలు, పరిస్థితుల కల్పనం బాగా ఉపకరిస్తాయి. నవల్లో కథాప్రణాళికనుబట్టి పాత్ర పరిమితులు నిర్ణీతమవుతాయి. కొన్ని పాత్రలు ఇష్టం వచ్చినట్లుగా సంచరిస్తూ, మరికొన్ని దృష్టిపథంలోనే లేకుండా పోయే ప్రమాదం జరగకూడదు. కాబట్టి రచనలో వాటి స్థానం ప్రయోజనాన్ని బట్టి యోజితమౌతుంది. లేకపోతే నవల్లో సమస్థితి దెబ్బతినే అవకాశం ఉంది.

రచయిత ఎంత తటస్థవైఖరి అవలంబించినప్పటికీ అతని సిద్ధాంతాలు, అభిప్రాయాలు పాత్ర మలుపులపై స్థూలంగానైనా ప్రభావం నెరపకుండా ఉండజాలవు. ఇది నవల్లో ఉద్దేశ క్షేత్రానికి సంబంధించిన పరిధిలోకి వస్తుంది. దీనిలో సహజత్వం ఉంటుంది. ఈ స్థితి వేరు. రచయిత కావాలని పాత్రలో చొరబడి, జోక్యం చేసుకోవడం వేరు. పాత్రను తన ఇష్టం వచ్చినట్లు దాన్ని వ్యక్తిత్వం లేకుండా కుదించి, పెంచి నడపడం వేరు. రచయిత ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహిస్తేనే, జీవిత వాస్తవం చెదరని సహజమైన పాత్రలు విశిష్టంగా అవతరించే అవకాశం ఉంది. ఎంతో ఆలోచన, అనుభవంతో చరిత్రలో అనేక ప్రస్థానాల సమాహారభూతమైన సామాజిక సంస్కృతీ దశలను ఏదో ఒక విధంగా దర్శించే నవల్లో వ్యక్తిత్వ చిత్రణంలో సామాజిక దర్శనం స్ఫుటంగా కన్పిస్తుంది. గొప్ప నవల్లో పాత్రచిత్రణలో వైయక్తికమైన పరిధి నధిగమించిన సామాజిక దర్శనం వెనుకనుండి ప్రకాశిస్తూ ఉంటుంది. ఇది వాస్తవ ప్రపంచంతో నిర్దేశితమైన జీవితదృక్పథం తోనూ కన్పిస్తుంది. ఈ విషయం అట్లా ఉంచి, ఇటీవల వైయక్తికపరిధిలో సాధారణ జీవిత చిత్రణంతోపాటు మనస్తత్వపు లోతుల్లోకి దృష్టి ప్రసరించటంపై అధికమైన శ్రద్ధ కన్పిస్తుంది. సృజనశక్తితో పాటు శిల్పదృష్టి విస్తృత పరిధిలో ప్రవర్తమానం కావడం గమనించవచ్చు.

## II

నవల్లో పాత్ర కొన్ని మాటలతో పరిచయం కావచ్చు. సంఘటనలో పాత్రప్రవర్తన సంభాషణద్వారా ఆవిష్కృతమవుతుంది. పాత్రకు నవల్లో ఒక క్రమ పరిణామరూపం

ఉంటుంది. ఇది ప్రత్యేకమైన సందర్భాల్లో హఠాత్తుగానూ, సాధారణంగా దశదశలుగానూ లేదా కొన్ని మలుపులతోనూ వికాసాన్ని పొందుతుంది. ఈ 'హఠాత్తు'కు వెనుక ఎంతో బలమైన హేతువు ఉండాలి. ఇది సంఘటనక్రమంలో విన్యస్తమై ఉంటుంది. దీనిలో చకితంచేసే ఆశ్చర్యం, టెన్షన్ ఉంటుంది. ఇది దశలుదశలుగా వికాసానికి వెనుక ఎంతో విస్తృతమైన సంఘటనల క్రమం దీర్ఘమైన కాలంపై పరచబడి ఉంటుంది. ఇందులో ఎప్పటికపుడు తొలగిపోయే ఆశ్చర్యం, సడలిపోయే టెన్షన్, కొంత విరామంతో అందుకుంటూ సాగుతాయి. ఒక ప్రవాహరూపంలో ఆవేశం ప్రవర్తిస్తూ ఉంటుంది. నవల విజయం పాత్ర సృష్టిపై చాలా భాగం ఆధారపడి ఉంటుంది. రచయిత ఎంత గొప్పవాడైనప్పటికీ అతని ఇష్టానిష్టాలనుబట్టి కాక, పాత్ర స్వతంత్రంగా స్వయంవ్యక్తిత్వంతో ఆవిష్కృతం అయినప్పుడే, విశిష్టతను కలిగి ఉంటుంది[1]. ఈ నవల్లో పాత్రస్వరూపం ఏమిటి? ఎట్లా ప్రవర్తిస్తోంది? ఇతర పాత్రలతో సంబంధాలెట్లా ఉన్నాయి? ఏ విధంగా మారుతున్నాయి? ఏఏ సమస్యలను ఎదుర్కొంటూంది? ఈ విధంగా అనేకమైన ప్రశ్నలు పాత్ర గురించి పాఠకుని మనస్సులోనిశ్శబ్దంగా సంచరిస్తాయి. అందువల్ల పాత్రచిత్రణం మొదటినుంచీ చివరిదాకా అనేక సంఘటనలతో పరిస్థితులతో ఇతివృత్త నిర్మాణంతో భాగమై పరిణతిని పొందుతూ ఉంటుంది. బహుముఖమైన విశిష్టతను సంతరించుకుంటూ మనలో ఎన్నో ప్రశ్నలకు సమాధానాలను ప్రశ్నల వెనుకనుండి సందేహాలనూ రూపొందింపజేస్తూ ముందుకు సాగుతుంది.

పాత్ర అంతటా వాస్తవికతను నింపుకొని అనుభవంతో స్పందించాలి. పాత్రకు సంబంధించిన గతిలో వేగం తగినవిధంగా కాపాడబడాలి. ఇది మరీముఖ్యం. దీన్ని గురించిన ఆలోచన చేస్తే పాత్రకూ సంఘటనల క్రమానికీ సంబంధం విదితమౌతుంది. హెన్రీ జేమ్స్ మాటల్లో "పాత్ర అంటే ఏమిటి? సంఘటనల నిర్ధారణం, సంఘటన అంటే ఏమిటి? పాత్ర ప్రకాశనం[2]. పాత్ర ఏదో ఒక సంఘటనతో ప్రమేయం కలిగి ఉంటుంది. నవల్లో చర్య ఏ విధంగా జరుగుతూందన్న ఉత్సుకతను నిలిపేది. ఇది పాత్ర ఆలోచన మొదలుకొని ప్రవర్తన దాకా పర్యాప్తమైంది. పాత్రను ఆశ్రయించి ఎన్నో స్మృతులు, ఆలోచనలు అనుభవాలు ఉంటాయి. ఇవి బాహ్యమైన ప్రవర్తనాగతంగా, మానసికమైన స్థితి సమర్పకంగా తీర్చే విధంలో పాత్ర వ్యక్తిత్వం మూర్తిమత్వాన్ని పొందుతుంది. చర్య పాత్రనిహితమైన అనేక సంఘటనలను పురస్కరించుకొని సాగుతుంది.

---

1. "Character must make its own kind but not of our kind" Kleanth Brook - Understanding Fiction.
2. "What is Character? - The determination of Incident. What is Incident? - The determination of Character" - Henry James.

ఎన్నో చర్యలు వివిధ స్థాయిల్లో పరిక్రమిస్తూంటాయి. వివిధ సంఘటనల స్థితుల సమాశ్లిష్టమైన క్రమరీతుల్నిబట్టి గమనంలో వైచిత్రి ఏర్పడుతుంది. వివిధ సందర్భాల్లో సాదృశ్యంగానూ, సమంగానూ, వ్యత్యస్తంగానూ, విషమంగానూ, సంకీర్ణంగానూ అనేక విధాలుగా సాగుతుంది. జీవితంలోవలెనే సంతోషం ప్రక్కనే విషాదం, ఎత్తు ప్రక్కనే పల్లం, గుణం వెంటనే అవగుణం ఈ విధమైన రీతులతో ఒక్కొక్కప్పుడు అనూహ్యమైన పరిణామాలతోనూ ప్రవర్తితమౌతుంది.

మనస్తత్వపరంగానూ మానవజీవితం యొక్క బహుపురాతనమైన పురారూపాల (ఆర్కిటైప్పు) ప్రసారమూ సామూహిక అవ్యక్త చేతన లోతులు స్పృశిస్తూనూ విలసిస్తుంది. ఎన్నో అసాధారణమైన సంక్లిష్టమైన మానసిక స్థితులు రచయితకు తెలిసీ తెలీకుండా విచిత్రమైన సంఘటనలతో 'అనుభవ యాథార్థ్యాన్ని ఆశ్రయించిన పాత్ర వ్యక్తిత్వంలో నిర్మితమౌతాయి. అందువల్ల పాత్ర చర్యకూ ఇతివృత్తానికీ గల సంబంధం చాలా సన్నిహితమైంది. పాత్ర ఎదుర్కోవలసినవి, సంఘర్షణ (కాన్‌ఫ్లిక్ట్), స్తంభన (టెన్షన్). సంఘర్షణ ఉన్నంతవరకూ స్తంభన ఉంటుంది. సంఘర్షణ నుండి బయటపడటంలో పాత్ర వ్యక్తిత్వాన్ని పొందుతూ ఉంటుంది. దీరికో విధం క్రమం ఉంటుంది. ఇది విజయవంతంగా జరగడంలో పాత్ర ఉన్నతికి చేరుకుంటుంది.

సంఘర్షణ - నవల్లో

1) మానవుడు తోటి మానవులతో ఉండే సంబంధాలవల్ల విభేదాలను పురస్కరించుకొనీ ఉండవచ్చు. అనుకోని ఘటనలవల్ల జరగవచ్చు.

2) వ్యక్తిలో జరిగే అంతస్సంఘర్షణ (ఇన్నర్ కాన్‌ఫ్లిక్ట్‌కు చెంది ఉండవచ్చు. ఇది మనస్తత్వ పరమైంది. పాత్రలో అవ్యక్తంగా జరిగే సంఘర్షణ కారణంగా అనుకోకుండా విపరీత పరిస్థితి ఏర్పడవచ్చు. వైయక్తికమైన సామాజికమైన మనోభావాలు పాత్రలో వివిధ పార్శ్వాల్లో బహిర్గతమవుతూ జీవితంలోవలెనే నడిపించే శక్తి కలిగి ఉంటాయి. ఫ్రాయిడ్, ఎడ్లర్, యుంగ్ మనస్తత్వ పరిశోధనలవల్ల రూపొందించిన సిద్ధాంతాల ప్రభావమూ, వాటి ననుసరించిన వివేచనమూ - పాత్రచిత్రణకు మనస్తత్వపరంగా దోహదం చేస్తున్నాయి మనస్సు లోతుల్ని స్పృశింపజేస్తున్నాయి.

3) మానవుడు భౌతికమైన ప్రకృతిని ఎదుర్కోవలసివచ్చే అనేక సంఘటనలకు సంబంధించి ఉండవచ్చు. ఈ సందర్భంలో ఒక్కొక్కప్పుడు ప్రతీకాత్మకంగానూ రూపొందవచ్చు. ఈ విధంగా ఇతివృత్తంలో అనేక సంఘటనల పరంపరలో నిక్షిప్తమైన గతిక్రమం పాత్రచేత స్థితిని పొందుతూ, చర్యచేత వేగవంతమౌతుందన్న విషయం

స్పష్టమౌతుంది. ఇతివృత్తానికీ పాత్రకూ గల సంబంధం ఇటువంటిది.

ఇతివృత్తం ప్రధానమైనవీ, పాత్ర ప్రధానమైనవీ, అభిప్రాయం ప్రధానమైనవీ అని నవల విభజనం మూడు విధాలుగా జరిగినప్పటికీ ఇతివృత్తం, అభిప్రాయం ప్రధానమైన నవల్లోనూ పాత్రకు సముచితమైన స్థానం ఉంటుంది. లేకపోతే కథకు నిశ్చయమైన గమన వైఖరి సిద్ధించదు. లక్ష్యానికి కేంద్రస్థానమూ ఉండదు. ఇది పాత్రవల్లనే అనుభవస్పందనంతో జీవితరూపాన్ని పొందుతుంది.

ఇ.ఎమ్.ఫాస్టర్ ఇతివృత్తం కన్నా పాత్రకే నవల్లో అగ్రస్థానం ఇవ్వడం ఈ సందర్భంలో గుర్తుచేసుకోవచ్చు. ఫాక్‌నర్ పాత్రగురించి చెబుతూ సాధారణంగా తన నవల పాత్రతో మొదలౌతుందనీ ఒకమారు పాత్ర తన కాళ్ళపై నిలబడి కదలటం మొదలుపెట్టగానే తాను దానివెనుక కాగితం పెన్సిలు తీసుకొని అది చెప్పేది చేసేది వ్రాస్తూ పోవడమే తన పని అంటాడు[1].

ఇతివృత్త పరిణామంలో కొందరు వ్యక్తుల స్వభావాలు, మనోభావాలు, ప్రవర్తనలు, ఉద్దేశాలు కలిసే ఒక పరిస్థితిని సృష్టిస్తాయి. ఇది పరస్పరం ఆకర్షణ వికర్షణ ప్రభావంతో పరస్పర వ్యతిరేక గుణాలతో ఏర్పడిన స్వరూపం చేత సంఘటనకు సంఘర్షణ - స్తంభన చేకూరుతాయి. ఈ సంఘటనల నుండి క్రమించేటప్పుడు పాత్ర వ్యక్తిత్వం వివిధ పార్శ్వాలలోనూ లోతునీ ఉన్నతినీ, అన్నిటినీ మించి రామణీయకతను సంతరించుకుంటుంది. వెలుగు రేఖలతో రూపాన్ని పొందుతుంది.

ఇతివృత్తానికి పాత్ర అనివార్యమైంది. పాత్రకు ఇతివృత్తం అవశ్యకమైంది. నవల్లో పరస్పర సమాశ్రయంతో యోజితమౌతాయి. పాత్ర నుండి ఇతివృత్తానికీ ఇతివృత్తం నుండి పాత్రకూ అనేకమైన అనుభవ సంఘటనల పరంపర ప్రసరిస్తూ ఉంటుంది. రచయిత సిద్ధాంతాతో అభిప్రాయాలతో లేదా జీవితానికివ్వదలచుకొన్న విలువలతో పాత్ర చేతనే లక్ష్యానికి దారితీయడం జరుగుతుంది.

## III

పాత్రచిత్రణం స్థూలంగా నవల్లో రెండు విధాలుగా ఆవిష్కృతమౌతుంది. 1) ప్రత్యక్షం లేదా విశ్లేషణాత్మకం, 2) పరోక్షం లేదా నాటకీయం.

ప్రత్యక్షంలో రచయిత పాత్రను నేరుగా వర్ణిస్తూనో వ్యాఖ్యానిస్తూనో చిత్రిస్తాడు. పాత్ర ఆలోచనలను అనుభవాలను స్పష్టంగా వివరిస్తాడు. అపుడపుడూ సాధికారకంగా

1. "It begins with a Character ...... all I can do is to treat along behind him with a paper and pencil" - Faulkner

నిర్ణయాలను ప్రకటిస్తాడు. రచయితకు పాత్రపై విశ్వాసం లేకపోవడంవల్ల ఈ విధంగా జోక్యం కల్పించుకొని తన వ్యక్తిత్వాన్ని ఆపాదిస్తాడని విమర్శకుల అభిప్రాయం. రచయిత వైయక్తికమైన ప్రభావం ఏ మాత్రం లేకుండా ఉండదు. కాని పాత్ర వ్యక్తిత్వాన్ని పూర్తిగా మింగేసేదిగా ఉండకూడదు. ఇందులో స్పష్టత ఎక్కువ. ఈ నవల్లో పాఠకుడు నవల చదివేప్పుడు పాత్ర గురించి పొందే ఆలోచనకూ ఆవేశానికీ సమ్మతంగా ఉండకపోవచ్చు. అక్కడక్కడా పరోక్ష పద్ధతికీ ప్రవేశం లభిస్తూ ఉంటుంది. కాని దీనికి ప్రాముఖ్యం అంతగా ఉండదు. స్థూలంగా వేయిపగడల్లో ధర్మారావు పాత్రను గమనించవచ్చు.

పరోక్షంలో రచయిత తాను దూరంగా ఉంటూ పాత్ర తనంతట తాను ఆవిష్కృత మయ్యేందుకు ఎక్కువగా అవకాశం ఇస్తాడు. ఇది కథనంలో సంభాషణ ద్వారానూ, ప్రవర్తనవల్లనూ జరుగుతుంది. రచయిత జోక్యం లేకపోవడంవల్ల పాత్ర స్వేచ్ఛగా ప్రవర్తిస్తుంది. వెనుకనుండి అనుకోకుండా లేదా అభిప్రాయస్థాపనంలో రచయిత స్వరం సన్నగా విన్పిస్తే విన్పించవచ్చు. ఈ తటస్థవైఖరివల్ల పాత్ర అన్నివిధాలా స్వతంత్రమైన వ్యక్తిత్వంతో పుష్టమౌతుంది. రచయిత చేసే వివరణం, వ్యాఖ్యానం ఏమీ లేకపోవడంవల్ల కేవలం పాత్రల సంభాషణ ప్రవర్తనబట్టి వాటి స్వరూప స్వభావాలు భావించవలసి ఉంటుంది. ఇందులో నాటకీయతకెక్కువ అవకాశం ఉంది. స్థూలంగా అల్పజీవిలో సుబ్బయ్య పాత్రను పరిశీలించవచ్చు.

స్వీయచరిత్రాత్మకం, లేఖాపత్రాల నవలల్లో పాత్రల ప్రమేయం తక్కువగా ఉంటుంది. నవల్లోపై ఆవిష్కార విధానాల్లో దేనికది విడివిడిగా ఉండవచ్చు కాని తరచుగా ఈ రెండింటి సమ్మేళనం గోచరిస్తుంది. ఏదో ఒకదానికి ఉండే ప్రాధాన్యం దృష్ట్యా ఆ విధానానికి సంబంధించిందిగా భావితమౌతుంది. పాత్రల చర్యలోని గమనం, రచనలో కథనం, సంభాషణ రెండింటివల్ల సాగుతుంది. ఇవి విడిగానూ, రెండింటి కలయికతోనూ రూపొందిన లక్షణం పరిశీలనాయోగ్యమైంది. రాచకొండ విశ్వనాథశాస్త్రి అల్పజీవి నవల్లో ఎక్కువభాగం పరోక్షవిధానం అనుసరింపబడింది. ఆధునిక రచయితల్లో చాలామంది దీనిపై ఎక్కువ మొగ్గు కలిగిఉండడమూ గమనించదగింది.

ఇక నవల్లో రచయిత ప్రమేయం గురించి ఆలోచిస్తే, ఎంతైనా పాత్రస్వరూపం వెనుకనుండి రచయిత వ్యక్తిత్వం ఎంతో కొంత స్ఫుటం కాకుండా ఉండడం అసంభవం. అట్లాగైతే, రచయిత అభిప్రాయాలు, ఉద్దేశాలు, సిద్ధాంతాలు ఏ విధంగా ప్రతిపాదితం కావడానికి వీలుందనే ప్రశ్న ఉదయిస్తుంది. ఈ కారణంగా ప్రత్యక్ష పరోక్ష పద్ధతుల సమన్వయాన్ని కాంక్షించేవారూ ఉన్నారు. ఒక అభిప్రాయం – నాటకం కన్నా భిన్నమైన

ప్రక్రియ నవల. దీని ప్రత్యేకత దీనికి ఉంది. దాన్ని రచయిత నిలపాలి. తనకు మధ్య మధ్య దొరికే వివరించే అవకాశాన్ని ఉపయోగించుకోవడంలో దోషం లేదు. నాటకాన్ని దృష్టిలో పెట్టుకొని నవలను పరిశీలించకూడదు. కాకపోతే నవల వివిధ ప్రక్రియల్లోని కొన్ని కొన్ని లక్షణాల సమాహారంగా అవతరించిన స్వతంత్రమైన విశిష్టరూపం. అవును. అయితే ఆ లక్షణాలను ఎంతవరకో అంతవరకే, దీనికి తగిన విధంగా యోజనచేసి, నవల మొత్తం మీద విశిష్ట భావనతో దానికదిగా వివేచించాలనేది. రచయిత పాత్రకు వెలుపలనుండి నిర్వహించడంలోనే అన్నివిధాల కళాత్మకంగానూ నవలకు ఉత్తమస్థాయి చేకూరుతుంది. దీనికీ నవల మొత్తంమీద అభిప్రాయస్థాపనకూ మధ్య భేదం ఉందనేవారి సంఖ్య ఈనాడు ఎక్కువగా ఉంది. ఏ రచన ఐనా రచయిత వ్యక్తిత్వ ప్రభావం నుండి తప్పించుకోలేదు. శిల్పదృష్టితో రెండింటినీ వేరుచేసి చూడాలన్న అభిప్రాయం సమంజసమైంది.

## IV

నవల్లో పాత్రలు రెండువిధాలుగా ఉండవచ్చు. ఒకటి సామాన్యం (సింపుల్), రెండోది సంక్లిష్టం (కాంప్లెక్స్).

సామాన్యంలో పాత్ర మంచిదనీ చెడుదనీ స్థూలంగా వేరుచేయబడి ఉంటుంది. మంచికీ చెడుకీ మధ్య ఘర్షణ ఉంటుంది. చివరకు విజయం మంచికే లభిస్తుంది. ఈ మంచి అనేది అదివరకు ఏర్పడిఉన్న కొన్ని సిద్ధాంతాలనూ విలువలనూ ఆశ్రయించి రూపొందుతుంది. ప్రధాన పాత్ర సర్వసద్గుణసంపూర్ణంగా తీర్చబడుతుంది.

సంక్లిష్టం (కాంప్లెక్స్)లో వ్యక్తి ఎంత గొప్పవాడైనప్పటికీ ఏదో ఒక లోపం వల్ల సంక్లిష్టమైన స్థితిని పొందుతాడు. అతనిలో లోపాలు ఉంటాయి. అవి అతని పతనానికి దారితీస్తాయి. లేదా పెద్దచిక్కుల్లో పెడతాయి. ఈ లోపం ఏదైనా కావచ్చు. అందరినీ అనుమానించే గుణం అవచ్చు. ఎక్కువగా ఆలోచనల్లో కాలం గడుపుతూ క్రియాశీలం లోపించవచ్చు. క్రియాదక్షుడై ఉండి స్వయంగా ఆలోచనాలక్షణం లేకపోవచ్చు. ఏదో మూఢవిశ్వాసం కలవాడై, వివేచన లేకపోవచ్చు. మరేదో ఇలాంటిదే అయి ఉండవచ్చు. ఒక్కొక్క సమయంలో స్వల్పమైందే అసాధారణ స్థితికి దారితీయవచ్చు. ఎన్నో చిక్కులెదురౌతాయి. దీనితో కథ అనూహ్యమైన మలుపులు తిరుగుతుంది. కొత్త సంఘటనలు ఎదురౌతాయి. వీటిని ఎదుర్కొనే ప్రయత్నమూ జరుగుతుంది. దీన్నిబట్టి ఇతర పాత్రల ప్రవర్తనలో మార్పు అనివార్యమౌతుంది. ఈ పరిస్థితుల్లో వివిధ పాత్రల చర్య-ప్రతిచర్యలో ఇతివృత్తంలో మెలగే పాత్ర సంక్లిష్టంగా రూపొందుతుంది. అసమర్థుని జీవ యాత్రలో సీతారామారావు పాత్ర దృష్టికి వస్తుంది.

సామాన్యంలో కన్నా సంక్లిష్టంలో పాత్రచిత్రణం విశేష స్థితిని పొందుతుంది. సామాన్యంలో బాహ్య వర్ణనపై దృష్టి ఉంటే, సంక్లిష్టంలో అంతరమైన వర్ణనకు ప్రాధాన్యం ఉంటుంది.

నవల్లో పాత్ర మరో విధంగానూ వర్గీకృతమైంది - 1) స్థిరమూ (స్టాటిక్), 2)క్రియాత్మకమూ (డైనమిక్).

స్థిరంలో పాత్ర మొదట్లో ఉన్నట్లుగా చివరివరకూ చెప్పుకోదగిన మార్పు లేకుండా ఉంటుంది. ఇది సామాన్యం పాత్రకు దగ్గరగా ఉండేది. క్రియాత్మకంలో పాత్రప్రవర్తనలో చెప్పుకోదగిన మార్పులు వస్తాయి. అవి చిన్నవీ కావచ్చు, పెద్దవీ కావచ్చు. ఇవి శాశ్వతంగా నిలచిపోతాయి. చిన్నవైనా మార్పులు, ప్రభావాన్ని గుర్తించగలిగిన స్థితిలో ఉండాలి. అంటే నవల్లో వీటి ప్రాముఖ్యం మన దృష్టిని ఆకర్షించడమే కాకుండా కథకు చైతన్యాన్నీ, సంతరింపచేసేదిగా ఉంటుందన్నమాట. ఇది పాత్ర వర్తించే పరిధిలోనే జరుగుతుంది. పాత్ర ఎదుర్కొనే పరిస్థితులవల్ల ప్రేరితమవుతుంది. సంప్రదాయధోరణికి భిన్నంగానూ ఉండవచ్చు. పాత్ర ఎదుర్కొనే మంచి-చెడు స్థితుల పరిశీలనం వాస్తవదృష్టితో జరుగుతుంది. దీని ప్రభావం చర్య, ప్రతిచర్యలపై ఎంతో ఉంటుంది. ఈ సందర్భంలో కొంత మనస్తత్వ వివేచనమూ అవసరం ఔతుంది. ఇది సంక్లిష్టం - పాత్రకు సమీపవర్తిగా ఉంటుంది.

ఇ.ఎమ్. ఫాస్టర్ పాత్రను రెండు విధాలుగా విశ్లేషించాడు. మొదటిది - సమం (ఫ్లాట్), రెండోది - ఆవృత్తం (రౌండ్).

మొదటిదైనా సమంలో పాత్ర స్వరూపం ఒకటి ..రెండు లక్షణాలతో సమరేఖలో నిర్ణీతమైపోతుంది. ఇందులో ఆశ్చర్యం గొలిపే లక్షణంగానీ ప్రత్యేకంగా పేర్కోదగిన విశేషంగానీ అంతగా ఉండదు. ఉన్నప్పటికీ హేతువుకు నిలవదు. సమాధానపరచలేదు. పాత్రనిర్మితిలో జీవితంలో హఠాత్ ఘటనలతో తిరిగే మలపులు లేకుండా, ఒకవేళ ఉన్నా ఒకటిరెండు అక్లిష్టంగా, అవి సులభంగా విప్పగలిగినవై సమంగా ఎత్తుపల్లాలు లేకుండా - అవిషమంగా ఉండటం ఇందులోని ప్రత్యేకత. పాత్రనిర్వహణమంతా ఎక్కువగా రచయిత మాటల్లో సాగుతుంది. మధ్యమధ్య వ్యాఖ్యానిస్తూ, విశ్లేషిస్తూ, నిర్ణయం చేస్తూ పాఠకుల్ని రచయిత తాను కోరేదిశగా ప్రవర్తింపజేసే ప్రయత్నం స్పష్టంగా కన్పిస్తుంది. ఇది దాదాపు ప్రత్యక్షపద్ధతికి దగ్గరగా భావించడానికి వీలైంది.

రెండోదైన ఆవృత్తం (రౌండ్)లో పాత్రపరిణామం పేర్కోదగిందిగా ఆవృత్తస్థితిని పొందుతుంది. ఇది బహుముఖాలతో పర్యాప్తమై ఉంటుంది. అనేక సంక్లిష్టస్థితులతో

కూడి ఉంటుంది. సంప్రదాయధోరణికి భిన్నంగా ప్రవర్తిస్తుంది. నాటకీయ లక్షణాన్ని పొందుతుంది. ఈ పాత్రలు ఆవృత్తత్వం లేదా వర్తులత్వంచేతనే జీవిస్తాయి. అంటే జీవితాన్ని బహుస్థలాల్లో స్పృశిస్తూ పాత్ర మలుపులు తిరుగుతూ (విశేషస్థితులలో) కదులుతూ కదులుతూ పేర్కొదగిన వ్యక్తిత్వరేఖలతో గుండ్రంగా (విశిష్టంగా) మొదలైన చోటికి వచ్చి చేరడం అంటే సంపూర్ణతను పొందడం ఇందులోని ప్రధాన లక్షణం. కాబట్టి దీనికి రౌండ్ (ఆవృత్త) అనే మాట సార్థకమౌతుంది.

సమమైన పాత్రలు జీవితాన్ని స్పృశించవని కాదు. ఇది ఒకటి రెండు స్థలాలకు మాత్రమే మితమై ఉంటుంది. రచయిత శక్తినిబట్టి దీనిలోనూ ఎంతో సమర్థవంతంగా నిర్వహించే రచయిత ప్రతిభచేత ఇతర లక్షణాలచేత ఈ పాత్రలు ఎంతో ఆకర్షణతో మనస్సుపై చెరగని ముద్ర వేసి శాశ్వతస్థానాన్ని పొందడమూ ఈ సందర్భంలో గమనించవచ్చు.

నవల్లో సమం (ప్లాట్), ఆవృత్తం (రౌండ్) రెండింటికీ స్థానం ఉంది. అయితే ఒక భేదం గుర్తించవలసి ఉంటుంది. సమం కన్నా ఆవృత్తం వెంటనే ఆకర్షిస్తుంది. క్లిష్టమైన స్థితులనుండి ఉద్గమించే విజయశక్తిగా పాత్ర దీపిస్తుంది. సమపాత్రను ఎంతదూరమైనా పొడిగిస్తూ పోవచ్చు. ఆవృత్తం విషయంలో (ఎంతబడితే అంత) పొడిగిస్తూ పోవడానికి అవకాశం ఉండదు. ఇది తిరిగే మలపులతో కొత్త పార్శ్వాలను పొందుతూ కొత్త ఆకర్షణకు నిలయమౌతూ ఉంటుంది. ఇతివృత్తం వ్యాసపరిధినిబట్టి ఇది ప్రవృత్తమౌతుంది. ఒకటి రెండుకన్నా ఎక్కువ విశిష్ట లక్షణాలతో మలుపులు తిరుగుతూ వలయాకారంతో ప్రవర్తిస్తూ చివరకు మొదటిచోటికి వచ్చి కలవడంతో విశిష్టమైన రూపాన్ని పొందుతూంది. యోజనలో పాత్రకు సంపూర్ణత సిద్ధిస్తుంది. ఇది నవల పరిణామ చరిత్రలో పేర్కొదగిన అంశం.

## V

మానవజీవితం ఎంతో విస్తృతమైందీ, గహనమైందీ, వైవిధ్యవిలసితమైందీ. మనచుట్టూ ఉన్న వ్యక్తులతో సంబంధాలవల్ల కలిగే అనుభవాలు అనేక సంఘటనలకు దారితీస్తూ ఎంతో ప్రభావాన్ని నెరపుతాయి. రచయిత వీటిని పరిశీలించి ఎన్నుకోవడం, తగినవిధంగా కూర్చుకోవడం, అప్పటి అవసరాన్ని, ఔచిత్యాన్ని బట్టి ఉంటుంది. బాహ్యదృష్టితో పాటు అంతర్దృష్టితోనూ చిత్రించే పాత్రస్వరూపంలో సంక్షిప్తంగా ఎన్నో జీవితరహస్యాలు నిక్షిప్తమై ఉంటాయి. ఇవి లోకప్రవృత్తితో సంవదిస్తూనే విశిష్టమైన ధోరణిలో మనల్ని ఆకర్షిస్తాయి. రచయిత సృష్టించిన పాత్ర తక్కువకాలంలో మనకు

ఎక్కువ జీవిత ప్రపంచాన్ని అనుభవంలోకి తెస్తుంది. ఎంత గొప్ప రచయిత అయినా, ఏ నవల్లోనూ మానవుని గురించి, ఆతని జీవితాన్ని గురించీ ఏ పాత్రలోనూ సంపూర్ణమైన రూపాన్ని ఇవ్వలేదు. ఒక్కొక్క రచయిత ఒక్కొక్క నవల్లో ఏదో కొంత భాగం మాత్రమే బింబింప జేస్తాడు. కొద్ది పరిధినీ, కొంత లోతునీ మాత్రమే స్పృశించగలడు. ఎప్పటికపుడు ఎంతో మిగిలే ఉంటుంది. ఆ చెప్పిందే చెప్పడం కాకుండా మిగిలినదాన్ని ఆ తరువాత వచ్చే రచయితలు అన్వేషించవలసి ఉంటుంది. దీనికి చివర అంటూ లేదు కాబట్టి అన్వేషణలో తెలుసుకోదగిందీ, చెప్పవలసిందీ పాత్రచిత్రణలో ఇంకా ఉండనే ఉంటుంది.

ప్రతివ్యక్తీ తన ప్రపంచానికి తానే కేంద్రబిందువు. ఒక్కొక్కరి దృష్టిలో ఒక్కొక్క విధంగా కన్పిస్తుంది. ప్రతి వ్యక్తి జీవితం ఒక స్వయంవ్యక్తిత్వవలయం. వివిధ మనస్తత్వాలుగల అనేకమైన వ్యక్తుల ప్రవర్తనల తీరులో సమాజం ఎంతో సంక్లిష్టంగా ఉండటం సహజం. ఎక్కడికక్కడ కొన్ని పరిమితుల్లో జీవితం గడిపే మానవుల్లో ఎన్నో సూక్ష్మమైన ప్రత్యేకాంశాలతోపాటు అందరికీ లేదా ఎక్కువమందికీ వర్తించే కొన్ని కొన్ని లక్షణాలూ ఉన్నాయి. వేరువేరుగా పేర్కోనవసరం లేని ఎన్నో సందర్భాల్లో వివిధ వ్యక్తులతో పరిచయం స్నేహం బంధుత్వం ఆత్మీయత ఏర్పడుతుంది. దీనికి వ్యతిరేకంగానూ వివిధ స్థాయిల్లో ఏర్పడవచ్చు. వ్యక్తిగతంగానే కాక సామాజికంగానూ అంగీకారంతో తిరస్కారంతో కొన్ని అభిప్రాయాలూ సిద్ధాంతాలు కలిపేవీ విడదీసేవీ ఉంటాయి. ఈ వలయాలను దాటి, ఎక్కువ తక్కువలూ ప్రాంతం వర్ణం దేశం భాష విశ్వాసం అభిప్రాయం, మతం సిద్ధాంతం గురించి భేదాలకతీతంగా మానవతాలక్షణం అన్నికాలాల్లోనూ పనిచేస్తుంది. ఈ మౌలికమైన మానవీయ భావనవల్లనే ఏ భాషకు, ఏ దేశానికీ సంబంధించిన నవల్లోని పాత్రలపట్లనైనా ఆసక్తినీ అభిమానాన్నీ కలిగి ఉండడం సంభవిస్తుంది.

నవల్లో రచయిత ప్రతిభకు నిదర్శనంగా నిలిచే గొప్ప పాత్రల్లో సాధారణమైన అనుభవాన్ని విశేషస్థితికి తీసుకొనివెళ్ళే ఉన్నతమైన స్థాయి ఉంటుంది. పాత్రలో రచయిత సాంఘిక రాజకీయ నైతిక వైయక్తిక ధోరణిగల నిర్మాణరేఖలు స్థూలంగా ఉంటాయి. అతినిదర్శనం పాత్రలో అంతర్లీనమై ఉంటుంది. ఒక పాత్ర లోకంలో ఎందరో వ్యక్తుల లక్షణాల సమాహారరూపంగా ఉండవచ్చు. రచయిత తాను నిర్మించే దాన్నిబట్టి తనకు కావలసిన లక్షణాలను ఎన్నుకోవడం జరుగుతుంది. దీని ఉపయోగంలో విచిత్రమైన మనస్తత్వంపై అనుభవస్పందనపై వెలుగు ప్రసరించడంతో మన ఊహకు మించిన స్వరూపం ఏర్పడుతుంది. ఆకర్షణకు స్థానమౌతుంది. పాత్రసృష్టిలో కొంత కల్పనకూ వీలుచిక్కుతుంది. రచయిత పొందిన అనుభవరూపంపైనే ఇది సాగుతుంది. రచయిత

కోరే మార్పులను పురస్కరించుకొని ఉండవచ్చు. ఎంత వాస్తవమైనా అనుభవమూలమైన వ్యక్తిత్వచిత్రణం యథాతథంగా ఉండదనే అభిప్రాయం ఈ దృష్టితో వెలువరించిందే. ఈ మార్పులు కథా ప్రణాళికనుబట్టి ఉద్దేశగర్భితమై ఉంటాయి. క్రమంగా పాత్రలు రచయిత ఆలోచనాధోరణినీ, దర్శనశక్తినీబట్టి రూపొందుతూ క్రమిస్తాయి. అందువల్ల ఒక రచయిత తీర్చే పద్ధతికీ మరో రచయిత తీర్చే పద్ధతికీ భేదం ఉంటుంది. ఒకదానిలోకి మరొకటి మార్చలేం. ఒకే రచయిత వేరువేరు విధానాలనూ అవలంబించవచ్చు. మానవ స్వభావం సంపూర్ణంగా ఏ వెలుగుతోనూ ప్రకాశించదు. పూర్తిగా ఏ చీకటితోనూ నిండిఉండదు. వెలుగు–చీకటి, ఈ మధ్య ఛాయాభేదాలు, వివిధ వర్ణ కాంతి ప్రసారాలు, పరస్పరం సమున్మేషం పొందే స్థితులతో ఏర్పడే రూపాలెన్నో ఉన్నాయి. జీవితంలో వీటిని సరిగా గుర్తించడం చాలా కష్టమైన పనే. పాత్ర చిత్రణంలో రచయిత సమదృష్టితో ఈ సూక్ష్మభేదాలను జీవనవాస్తవ స్ఫూర్తితో స్పష్టంగా కన్పించే ప్రయత్నమైతే చేయవలసి ఉంది.

ఇతివృత్తంలో సంఘటన–సంభాషణ–వాతావరణం– మొదలైన వివిధాంశాల నుండి పాత్ర క్రమక్రమంగా క్రమిస్తూ చివరకు ఉద్దేశంతో సంపూర్ణమైన స్వరూపాన్ని పొందుతుంది. నవల్లో పాత్ర ఒక ముఖ్యాంశమే అయినప్పటికీ, ఇతర లక్షణాలతో ఎక్కువ తక్కువ అనుబంధం తప్పనిసరిగా కలిగి ఉంటుంది. నవల చదివాక పాత్ర స్మృతిపథంలో నిలవాలి. మనస్సులో కొంతకాలం నిలిస్తే అది ప్రభావం నెరపినదాని క్రిందే లెక్క. సాహిత్యం అక్షరరూపంలో నిలిచే సృష్టి, ఉత్తమపాత్ర సృష్టిని అనుభవంలో దర్శించినపుడు పాఠకునిలో మనస్తత్వపరంగా ఏర్పడి ఉన్న శూన్యవలయం తృప్తి రేఖలతో పరిపూర్ణమౌతుంది. ఉత్తమపాత్ర సృష్టికి గాఢమైన సాహిత్య సంస్కారం, మానవస్వభావ పరిశీలనం, వాస్తవానుభవందానిపై కొంత కల్పనాశక్తి, సృజనశక్తి సమున్మేషంతో పాటు నిర్మాణశిల్పం – నిర్దిష్టమైన లక్ష్యం అవసరం.

మనలో నిరంతరం జీవించే పాత్ర, కొత్త ప్రపంచాన్ని దర్శింపజేస్తుంది. అనుభవస్వరూపాన్ని విస్తృతం చేస్తుంది. కొత్త విలువల్ని నిలుపుతుంది. మనల్ని ఆలోచనకు గురిచేస్తుంది.

# 6. వాతావరణ కల్పనం

## (స్థలం - కాలం - పరిసరాలు)

మానవుని చుట్టూ ప్రపంచం ఉంది. భూమి ఆకాశం సముద్రం అడవీ ఊరు నగరం ఇల్లు ఇంకా ప్రకృతిరూపాలు నివాసస్థానాలు అనేకమైన ప్రయోజనాలు గల భౌతికమైన వస్తువులు, అన్నీ కలిసి పరిసరాల్ని, సాంస్కృతిక స్థితుల్ని భావింపచేస్తాయి ఏదో ఒక విధంగా ఉండేవి, సంబంధం వీడనివీ, ఇంకా ఎన్నో! అనేక సమయాల్లో వీటితో మనకు గల సంబంధంతో పొందే అనుభవాల పరంపర జీవితంతో ముడివడి ఉంటుంది. ఒక్కొక్కప్పుడు అనివార్యమైందీ. ఇది నవల్లో ఎంతో వివరంగా, నాటకంలో కొన్ని పరిస్థితుల్లో కవిత్వంలో సంక్షిప్తంగా దర్శనమిస్తుంది. నవల లక్షణాల్లో వాతావరణ చిత్రణం ఒకటి. ఇది కాలానికీ, స్థలానికీ సంబంధించింది.

కథాగమనంలోని కాలం స్థలం రూపమే వాతావరణం. ఒక కాలంలో ఒక స్థలంలో జీవించిన వ్యక్తుల జీవితగమనంలో అనుబంధంతో విడదీయడానికి వీలులేకుండాను ఉంటుంది. నవల్లో పూర్వభూమిక దృశ్యం, పరిసరాలు, వాతావరణం అనీ, నిర్మితిలో స్వల్పమైన భేదంతో ప్రయుక్తమౌతుంది. వాతావరణం అనే మాట ప్రకృతిగతంగా భౌతికంగా మానసికంగా విస్తృతమైన అర్థాన్ని తనలో ఇముడ్చుకోగల పరిధి కలిగింది. ఇది నవల్లో ఇతివృత్తం పాత్ర ఉద్దేశాలకు సంబంధించిన యోజనాపరమైన ప్రభావం చేత నిర్మాణరూపాన్ని పొందుతుంది. సృజనాత్మక సాహిత్యంలో నవల్లో ఇతరమైన అంశాలను పురస్కరించుకొని దీని ప్రమేయం స్థానం నిర్ణీతమౌతుంది. కాలాన్నీ స్థలాన్నీ ఆశ్రయించి చేసే చిత్రణం వాతావరణకల్పనలో ప్రధానమైంది.

కథల్లో గతిశీలాన్ని ఆశ్రయించిన స్థలం మరియు కాలానికి సంబంధించిన ఈ అంశం నాలుగు విధాలుగా ప్రవృత్తమౌతుంది. 1) సామాజికం, 2) భావనాత్మకం, 3) ప్రకృతిగతం, 4) వస్తుగతం.

మొదటిది సామాజికం. ఇందులో భౌతికమైన సాంఘిక రాజకీయ సాంస్కృతిక చిత్రణం ఉంటుంది. జీవితంలోని ఆచారాలు పద్ధతులు విధానాలు వర్ణితమౌతాయి. గొప్పనవలలు ఒక్కొక్క దృక్పథంతో ప్రాతినిధ్యం వహిస్తాయి. ఫీల్డింగ్–టామ్‌జోన్స్ ఇంగ్లీషు ప్రజల జీవితాన్నీ, విక్టర్ హ్యూగో–లే మిజరబుల్స్ ఫ్రెంచి జీవితాన్నీ, టాల్‌స్టాయ్–వార్ ఎండ్ పీస్ రష్యన్ జీవితాన్నీ ఆ కాలం ప్రభావముద్రతో దర్శింపజేస్తాయి.

తెలుగులో ఉన్నవ మాలపల్లి, విశ్వనాథ వేయిపడగలు పాశ్చాత్యప్రభావంవల్ల గత శతాబ్దిలో అన్ని రంగాల్లో వచ్చే పరివర్తనను చిత్రిస్తాయి. రెండు దృక్పథాల్లో భిన్న ధోరణులల్లో ఆవిష్కృతమయినాయి. మాలపల్లి అట్టడుగునుండి తల ఎత్తి పైకి లేచే శిఖరాలతోనూ, వేయిపడగలు ఒక్కొక్కటీ పైనుండి కూలిపోయే శిఖరాలతోనూ సాక్షాత్కరిస్తాయి. ఈ రెండింటినీ కలిపి పరిశీలిస్తే ఆ కాలంలో ఆంధ్రదేశంలోని ఇంచుమించు భారతదేశంలోని సాంఘిక రాజకీయ సాంస్కృతిక పార్శ్వాలు కనిపిస్తాయి. ఇది రచయిత నవల్లో కాలం స్థలం ప్రభావం నుండి తప్పించుకోలేని స్థితినే కాకుండా దానివల్ల రచనకు కలిగే విశాల పరిధినీ పార్శ్వాలనూ భావింపజేస్తుంది. ఆధునిక నవలల్లో సామాజిక రూపంపై- మధ్య- క్రింది తరగతుల సామాజిక వాతావరణం గ్రామ నగర వలయాల్లో ఎన్నో శ్రేణులు శ్రేణులుగా చిత్రితమై కన్పిస్తుంది.

రెండోది, భావనాత్మకం. ఇందులో మానసికమైన వివిధ స్థితి చిత్రణంతో ఉంటుంది. ఈనాడు మనస్తత్వశాస్త్ర ప్రభావంవల్ల మానసికమైన స్థితి రూపంతో వాతావరణకల్పనం విశిష్టమైన పాత్రను నిర్వహిస్తోంది. అల్పజీవి నవల సమాప్తిలో భయంకరంగానూ మనోహరంగానూ కదలే సముద్రదృశ్యం, కేవలం ప్రకృతివర్ణనకే పరిమితమైంది కాదు. నవలల్లోని పాత్రల చర్య ప్రతిచర్యల పర్యవసానంగా చివరకు అగాధమైన జీవితాన్ని ధైర్యంతో సాహసంతో ఎదుర్కొనే మానవుని ప్రయత్నం ఆశాస్ఫూర్తి దృశ్యచిత్రణంతో మనస్తత్వ సమర్థకంగా కల్పితమైంది. ఇది 'మాబిడిన్' నవల్లో సమిపి&త దృశ్యాన్ని తలపిస్తూంది. ఇంకా నవల్లో హృదయాన్ని స్పందింపచేసే కరుణం, కంపింపచేసే భయం మొదలైనవి భావనామయంగానూ ఉండవచ్చు. మనస్సును కలతపెట్టే విపత్తులకు సంబంధించిన విషాదంతో, మనస్సుకు ఉల్లాసాన్ని కలిగించే రాగంతో, ఉపసంహృతికి దారితీసే శాంతంతో ఈ విధంగా అనేకమైన మనోభావాల సమాకీర్ణలక్షణంతో రూపొందడం ఈ సందర్భంలో మనం గమనించవలసి ఉంటుంది. అవ్యక్తచేతనతోపాటు సామూహిక అవ్యక్తచేతనపై దృష్టి ప్రసరించడంతో లోతును పొందింది. రచయిత శిల్పప్రతిభచేత సూక్ష్మమైన నిర్మాణరేఖలను సంతరించుకుంటూ ప్రసరించడం మనకు బాగా కన్పిస్తుంది. భావనాత్మకం నవలకు గాఢత్వాన్నీ ఆలోచనా వర్ణ చిత్రాన్నీ ప్రసాదిస్తుంది.

మూడోది, ప్రకృతిగతం. ఇందులో ఒకటి కేవలం ప్రకృతివర్ణనం. ముఖ్యంగా పూర్వకాలపు నవలల్లో విరివిగా కన్పిస్తుంది. కథలో విరామంగా మనస్సును కాల్పనిక వాతావరణంతో అలరింపజేస్తుంది. మరొకటి కథాప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని

ఇతివృత్తం పాత్రచిత్రణలో భాగంగా సంఘటన, ప్రవర్తనం ఆధారంగా బహిరంతర్గతమైన చిత్రణలతో లేదా వాటి సూచనలతోనో చేసే ప్రకృతివర్ణనం. ఉదాహరణకు పాత్ర ఎదుర్కొనే కష్టానికి ముందు తుఫాను రావడం, రాబోయే దుఃఖానికి సూచనగా చీకటిని వర్ణించడం, ఒక్కొకపుడు వర్ణనం, పాత్రను ఎంతో శక్తిమంతంగా చేసేదిగానూ ఉంటుంది. ప్రకృతితో మానవుని సంఘర్షణలోనూ ఇది ప్రవృత్తం అవుతుంది. ఇటువంటి సందర్భాల్లోనే కాక ఇంకా అనేక సందర్భాల్లోనూ దృశ్యం ప్రతీకాత్మకతను పొందే అవకాశం ఉంది. “ఏకవీరనవల్లో ఈ విధం ఆరంభం పాత్రగతం గానూ విశ్లేషణ కందుతుంది. అల్పజీవి నవల్లో చివరకు “కదులుతూన్న సముద్రం” జీవితానికి ప్రతీకగా నిలిచేది. వాస్తవ జీవితాన్ని భావింపచేసేది. నవల్లో పరిసర వర్ణనం తప్పనిసరిగా ఉంటుంది.

నాలుగోది వస్తుగతం. ఇందులో చుట్టూ వివిధ వస్తు సముదాయ వర్ణనం ఉంటుంది. ఇది వివిధాంశాలకు ఉపస్కారకంగా చిత్రితమవుతుంది. నవల్లో విషయభాగం దృష్ట్యా వివిధాంశాలు విడివిడిగా పరిశీలనం చేసినప్పటికీ, ఒక ప్రభావం మరోదానిపై ప్రసరిస్తూ ఒకదాని ప్రమేయం మరోదాని ఆవిష్కారానికి దారితీస్తూ, ఇది క్రమంగా పరంపరగా మొత్తంమీద పరిపూర్ణమైన ఏకరూపానికి దోహదం చేస్తాయి. కాబట్టి వాటి ప్రసక్తి విడివిడిగానూ అనివార్యం.

సామాజిక, భావనాత్మక, ప్రకృతిగత, వస్తుగతమైన వర్ణనం రచయిత ప్రజ్ఞనుబట్టి ఉద్దేశాన్నిబట్టి స్థూలరూపం నుండి సూక్ష్మరేఖల వరకూ వాతావరణ నిర్మాణంలో గొప్ప పాత్రను నిర్వహించే అవకాశం కలిగి ఉంటుంది.

## II

అన్ని నవలల్లోనూ వాతావరణకల్పనం ఒక విధంగా ఉండదు. దేని తీరు దానిదే. ఇతివృత్తాన్నిబట్టి పాత్రలనుబట్టి మార్పులు ఉంటాయి. ఒక దేశం నుండి మరో దేశానికీ, ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికీ కథారంగం మారినపుడు పరిసర వర్ణనం సంపూర్ణమైన పరివర్తనం పొందుతుంది. ఆయా దేశాల స్థలాల ప్రజల గురించి బాగా తెలియాలి. ఒక్కొక్కపుడు ప్రత్యేకమైన వృత్తికీ లేదా విషయానికీ సంబంధించి ఉండవచ్చు.

మెల్‌విల్‌వ్రాసిన మాబీడిక్ నవల్లో సముద్రాలపై తిమింగలం వేటకై చేసే సాహసయాత్ర ఇతివృత్తం. సముద్రజీవనానికి సంబంధించిన వృత్తిపరమైన ప్రత్యేక వాతావరణం రూపొందించవలసి వచ్చింది. అనేకమైన వృత్తులను వాటి ప్రసక్తి వచ్చినపుడు

రచయిత ఎంతో శ్రద్ధతో విషయాన్ని పరిశీలించి చిత్రించవలసి ఉంటుంది. మహాశ్వేతాదేవి నవలల్లో గిరిజన జీవన చిత్రణం ఈ సందర్భంలో ఉదాహరణీయం.

సమాజంలో 1) వివిధ తరగతులు, 2) వర్ణం జాతి మతం, 3) వ్యవసాయికం-పారిశ్రామికం-బ్యూరాక్రసీ-రాజకీయం మొదలుగా అనేకం తమ పాత్రను నిర్వహిస్తున్నాయి. ఊరు, నగరం, ఇల్లు, వీధి, ఆఫీసు, ఫ్యాక్టరీ, బడి, స్టేషన్ మొదలుగా ఎన్నో కథాభాగాల్లో సంఘటనలను పురస్కరించుకొనీ పాత్ర చర్యలనుబట్టీ తటస్థపడే పరిసరాలు వేరే ఉన్నాయి.

చారిత్రక నవలల్లో స్థలం కాలం పెద్దపాత్రను నిర్వహిస్తాయి. చారిత్రక నవలా రచయిత పూర్వరంగం విషయంలో దృశ్యచిత్రణంపట్ల ఎంతో బాధ్యతతో ఉపక్రమించవలసి ఉంటుంది. చరిత్రకూ సంస్కృతికీ సంబంధించిన అంశాలను ఎంతో విజ్ఞానంతో నిర్వహించడంవల్ల వస్తువుకు న్యాయం చేకూరుతుంది. ఆయా స్థలాలను దర్శించి వాటికి సంబంధించిన విశేషమైన సమాచారాన్ని సేకరించాలి. సాధారణ పాఠకునికీ తెలీని అందుబాటులోలేని కాలాన్నీ దేశాన్నీ జాతినీ ప్రయత్నంతో పునర్నిర్మించాలి. అద్దంలో ప్రతిఫలించే సంగ్రహరూపంవలె నవల్లో వాతావరణం యోజితం కావాలి. కథాగమనం వెనుకనుండి స్థానిక పరిసరాల చిత్రణం స్పష్టంగా ఆవిష్కృతం కావాలి. ఇందులో సాంఘిక స్వరూపం మనకందని ఎంతో పూర్వకాలానికి సంబంధించింది కావడంచేత ఆ కాలంనాటి జీవితాన్ని పునర్నిర్మించడమే అవుతుంది. ఇది కొన్ని సాక్ష్యాధారాలపై జరగడంవల్ల వాస్తవసదృశస్థితిని పొందుతుంది. అక్కడక్కడా చెదరిఉన్న అనేకాంశాలను సమీకరించి కొంత ఆలోచన చేసి, వీటిమధ్య ఐక్యత చేకూర్చిన కళాసృష్టి కావడంచేత – కొంత కల్పన చోటుచేసుకొంటుంది. ఒక ప్రత్యేకమైన చరిత్ర సంస్కృతీ లక్షణంతో జాతి జీవితాన్ని పునర్నిర్మించడం చారిత్రక నవల్లో కన్పించే ముఖ్యమైన లక్షణాల్లో ఒకటి. గతానికి సంబంధించిన అనేకమైన వికీర్ణాంశాలను సమీకృతం చేసి కొంత కల్పనతో ఐక్యత చేకూర్చి, సజీవరూపాన్ని ఇవ్వడం ఇందులో ముఖ్యం. దీనికి గతానికి సంబంధించిన వాతావరణసృష్టి అవసరం. జార్జి ఇలియట్ వ్రాసిన రోమలా ఇటాలియన్ సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని ఉద్దేశించింది. తెలుగులో విశ్వనాథ, నోరి నరసింహశాస్త్రి ముదిగొండ శివప్రసాద్ మొదలైన రచయితల చారిత్రక నవల్లోనూ ఈ ఉద్దేశం స్పష్టంగా కన్పిస్తుంది. స్వాభిమానాన్ని ఉజ్జ్వలింపజేసే చరిత్ర, సంస్కృతీ – ఆనందాన్ని తరంగితం చేసే కళ – ఈ రెండింటి సమన్వయం పొందే స్థితి చేకూరడానికి సామాజిక నవలల్లోను రచయిత నిర్మాణశక్తిలో కొంత భాగం వాతావరణనిర్మితికి ఉపయోగితం కావలసి ఉంటుంది. వాతావరణ కల్పనం కథారూపానికి నిండుదనాన్ని ఇస్తుంది.

## III

పూర్వం నవలల్లో చాలా వివరంగా స్థానికమైన అంశాలు పరంపరగా చిత్రిత మయ్యేవి. అడవులు పర్వతాలు నదులు వీథులు ఇండ్లు గదులూ, గదుల్లో వస్తువుల అమరిక అన్నీ విపులంగా రచయిత పరిశీలనాశక్తికి నిదర్శనంగా సాగేవి. ఈ పద్ధతిలో ఈనాడు కొంత మార్పు వచ్చింది. రచనలో మధ్యమధ్య విరామవర్ణనలు వదిలేసి, క్లుప్తంగా వర్ణనం అవసరం మేరకు అవలంబింపబడుతూంది. వెంటనే సంభాషణ లేదా కథాగతికి అవసరమైన కథనమో వివరణమో ప్రవృత్తమౌతుంది. ఈ కాలంలోనూ పరిసరాల వర్ణనం తొలగిపోదు. తొలగిపోవడానికి వీలూ లేదు. కాని రచనలో ప్రయోజనం మేరకు లేదా విశేషదృష్టితో స్వీకృతమౌతూంది.

నవల్లో సుదీర్ఘమైన వర్ణనలు కథాగమనానికి అంతరాయమనే ఒక పక్షం వాదం. ఇది పాఠకుణ్ణి మధ్యమధ్య అలరిస్తుంది. అయితే దీనివల్ల ఏ ఇబ్బందీ ఉండదు. దీన్ని అంతరాయమనీ అనుకోకూడదని మరో పక్షం వాదన. దీన్ని నవీనులు అంగీకరించరు.

ఏమైనా ఇతివృత్తంలో స్థానికమైన పరిసరాల చిత్రణం, ఇతివృత్తంతో పరిసరాల సంబంధాన్నిబట్టి ఉంటుందన్నమాట మరచిపోకూడదు. ఏది ఎట్లా ఉండాలన్నది రచయిత నవల మొత్తంమీద అవలంబించే రచనాశిల్పాన్నిబట్టి నిర్ణయించుకోవలసి ఉంటుంది. ఇది రచనా ప్రణాళికలో భాగం. ఒక్కొక్క సందర్భంలో ఒక చిన్న వాక్యంతో దాటివేయవచ్చు. కొన్ని వాక్యాల్లో సంగ్రహంగా చెప్పవచ్చు. దీన్ని సంక్షిప్తం (సమ్మరీ) అంటారు. మరో సందర్భంలో సుదీర్ఘంగా ఉండవచ్చు. ఇది దృశ్యం (సీన్) అవుతుంది. దృశ్యంలో సన్నివేశానికీ రచనలో భాగంగా ప్రాధాన్యం ఉంటుంది. రచన సంక్షిప్తంలో సన్నివేశంలోని అంశాన్నీ, దృశ్యంలో పార్శ్వాన్నీ దృష్టిలో పెట్టుకొని సాగుతుంది. ఇవి కథాగమనంతో సంఘటనల స్థితుల ప్రాధాన్యాన్నిబట్టి అవలంబింపబడతాయి. సంక్షిప్తం దృశ్యం, రెండూ ఈ నవల్లో ప్రక్రియనుబట్టి ఎంతో విస్తృతీ వైవిధ్యం గల జీవితపరిధి ఉండడంవల్ల, ఆయా సందర్భాల్ని బట్టి రెండింటి అవసరమూ ఉంటుంది. ఒక నగరం లేదా వనంలోనుండి పాత్ర ప్రయాణం సాగుతుంది. లేదా ఇతివృత్తంలో ఒక సందర్భంలో ఋతువు మారింది. అపుడు కథలోని ఏ అంశంతోనూ సంబంధం లేకపోతే దాటేయవచ్చు. ఏదో ఏకాన్త సంబంధం ఉన్నా, సంక్షిప్తంగా ఉల్లేఖించవచ్చు. సంగ్రహంగా వర్ణించవచ్చు. ఇదొక పద్ధతి. కథతో సంబంధం లేకపోయినా కల్పించుకొనీ, ఏమాత్రం సంబంధం ఉన్నా దాన్ని అవకాశంగా తీసుకొనీ, ఆ నగరం గొప్పతనాన్నో, ఆ వనం విశేషాలనో లేదా మారే ఋతువు శోభనో సుదీర్ఘంగా వర్ణిస్తూ పోవచ్చు. వేయిపడగల్లో వెన్నెల

వర్ణనం జ్ఞాపకం వస్తుంది. పూర్వకాలం నవలల్లో ఈ పద్ధతి బాగా కన్పిస్తుంది. ఈ విధమైన మధ్యంతర వర్ణనలను పురస్కరించుకొని రచయిత తన వర్ణనాశక్తినీ విజ్ఞానసంపదనూ ప్రదర్శించే ప్రయత్నం జరుగుతుంది. ఈ విధంలో దోషం ఏమీ లేదని కొందరి అభిప్రాయం కూడా. పైన పేర్కొన్నట్లు పాఠకులకు కథనుండి కాస్త విరామానికీ, కొంత విజ్ఞాన పరిచయానికీ, కాస్త ఉల్లాసానికీ ఉపకరిస్తుందని వీరి విశ్వాసం. అభిప్రాయ భేదాలెట్లా ఉన్నా ఇది రచయిత నిర్వహణదృష్టికి సంబంధించింది. దీన్ని కొందరు ఎంతో ఆసక్తికరంగా నిర్వహించిన తీరు కూడా ఈ సందర్భంలో గుర్తించవలసి ఉంది.

స్థానిక పరసరాల చిత్రణం ఇతివృత్త విన్యాసంలోను పాత్రచిత్రణంలోను కళాత్మకమైన సౌందర్యానికి దోహదం చేసే మాట వాస్తవం. దీన్ని ఆధునిక రచయితలు సృజనశక్తిచేత, శిల్పసంవిధానంలో ఎంతో ప్రతీకాత్మకంగానూ రూపొందిస్తున్నారు. చివరకు మిగిలేది నవల్లో ప్రకృతి వర్ణనం, కొన్ని సందర్భాల్లో కోమలి పాత్రను ఉన్మీలనం చేసే విధంగా యోజితమైంది. దయానిధి, కోమలి, సుశీల, నాగమణి బృందం పిక్‌నిక్‌కు వెళ్ళిన సందర్భంలో దీన్ని బాగా గుర్తించవచ్చు. విశ్వనాథ "ఏకవీర" నవల ఆరంభంలో "వైగైనది క్రుంగికృశించిన ప్రోషితభర్తృకవలె ప్రవహించుచున్న"దని నవల్లో ప్రధాన స్త్రీపాత్రను తీర్చిన స్వరూపం స్ఫూర్తికట్టిస్తుంది. ఈ నవల సమాప్తిలోనూ వైగైనది ప్రసక్తి పరిశీలనార్హం అవుతూంది.

వాతావరణ కల్పనం ఇతివృత్తంతోనూ పాత్రతోనూ ఎన్నో విధాలుగా అనుబంధ లక్షణంతో స్థాపితమౌతూంది. ఆధునిక నవలల్లో మనస్తత్వపరంగానూ కొత్తదనాన్ని పొందింది. నవల్లో బలమైన సంఘటనలకు పుష్టికొరకై ఉత్కర్షావహంగా పూర్వభూమిక నిర్మితమవుతుంది. ఇది నిర్దిష్టమైన స్థలంలో ఉద్దిష్టమైన చర్యలతో కూడుకొని ఉంటుంది. దృశ్యంతో, సంక్షిప్తంతో కూడిన వాతావరణకల్పనం నవల్లో విడిగానూ, ఇతివృత్త గమనంతో పాత్రచర్యతో సంశ్లిష్టమై ఉండే విధంగానూ తీర్చడం సామాన్యం కాదు. నవల్లోని వాస్తవికత కేమాత్రం భంగం కలగకుండా ఉండాలి. అందువల్ల ఇది అనుభూతిని సాంద్రతరం చేసి, ఆలోచనను గాఢతరం చేసే శక్తికి అనుగుణంగా కళాత్మకమైన విలువల్ని పెంచుతుంది. నవల సంపూర్ణమైన స్థితికి దోహదం చేస్తుంది. వివిధ కోణాల్లో చక్కగా యోజితమై రూపొందడమనేది రచయిత ప్రతిభపై శిల్పంపై ఆధారపడి ఉంటుంది. వాతావరణకల్పనం నవల్లో నిర్మాణ శిల్పపరంగాను కళాదృష్టితోనూ, రచయిత శ్రద్ధ వహింపదగిన అంశం.

# 7. సంభాషణ

మానవ జీవితం ఇతరులతో సంబంధంపై ఎన్నో విధాలుగా ఆధారపడి సాగే అనుభవాత్మకమైన వాస్తవరూపం. జీవితంలో పరస్పర ప్రయోజనాలు నెరవేర్చుకోడానికి అవలంబించే ఒక సాధనం భాష. భాషాగతంగా, నవల్లో రచనారూపం ప్రధానంగా రెండు విధాలుగా ఉంటుంది. ఒకటి కథనం, రెండోది సంభాషణం. కథనానికి అనుబంధంగా వివరణం, వర్ణనం ఉంటాయి. కథనం వివరణంలోకన్నా వర్ణనలో భాష ఆలంకారికతను పొందుతుంది. నాటకం సంభాషణాత్మకం. నవల్లో నాటకీయతనే గాక వాస్తవ స్థితిగతుల్ని సాధించడానికీ సంభాషణపై శ్రద్ధ అవసరం. ఒక భాషను ఆశ్రయించి ఒక వ్యక్తి మనోభావాలను మరోవ్యక్తికి తెలియజేసే మౌలికమైన విధానం సంభాషణ. కథనం వివరణం వర్ణనం సంభాషణ చదివేప్పటి అనుభవం వేరువేరుగా ఉంటుంది. దీన్ని స్పష్టంగా గుర్తించవచ్చు. వర్ణనలో కాల్పనికతకూ సంభాషణలో వాస్తవికతకూ అవకాశం ఎక్కువ. సంభాషణలో వాస్తవానుభవగుణంతో సాన్నిహిత్యాన్ని భావింపజేసే లక్షణమూ ఉంది. ఇది మనలో జీవిత భాగంగా అనిపిస్తుంది. మనచుట్టూ ఉన్న పరిసరాల్లో మాట్లాడేదీ ఎక్కువ పరిచయం ఉందీ కావడంచేత తటస్థంగా ఉండలేం. సంభాషణలో ఏదో ఒకవిధంగా పరిచయ సాన్నిహిత్యం నుండి అంతర్భాగత్వాన్నీ ఐక్యతాస్థితినీ అనుభవిస్తాం. ఇది పాత్ర తీరునుబట్టీ ఉంటుంది. నవల్లో వివిధ వ్యక్తుల పరస్పర భావప్రకటనంలో సాగే నాటకీయ పద్ధతి వెంటనే ఆకర్షించే ధోరణి కలిగింది. నవల్లో పాత్ర స్వరూపాన్ని సంపూర్ణంగా సాధించేందుకు ఎంతో సహకరిస్తుంది.

ఏ సంభాషణ లేకుండా, కేవలం కథనపద్ధతితోనే నవల రూపొందవచ్చు. ఇది రచయిత నిర్వహణంలో అవలంబించే విధానానికి సంబంధించింది. కాని సాధారణంగా నవల్లో సంభాషణ విధిగా ప్రయుక్తమౌతుంది. దీనికి సమాజ స్వరూపాన్నీ వ్యక్తుల మనస్తత్వాన్నీ బాగా పరిశీలించడం అవసరం. సమాజంలో సామాన్య ప్రజలు మొదలు మేధావుల వరకూ వివిధ స్థాయిల్లో ఉన్నవారు, విభిన్న ప్రాంతాలవారు, అంతస్థులవారు, మాట్లాడే తీరులోని వైవిధ్యాన్నీ ప్రత్యేకంగా గుర్తించవలసి ఉంటుంది. ఇది ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఇతివృత్త పరిణామానికీ పాత్ర అభివ్యక్తికీ తోడ్పడాలి. ఇతివృత్తంలోని వివిధావయవాల సంబంధాన్నీ స్థాపితం చేయగలగాలి. అంతేకాని ఏ సంబంధం లేకుండా లేదా ఏదో సంబంధం కల్పించుకొని వాడే సంభాషణలు ఎంత ఆనందం కలిగించేవైనా ప్రయోజనం సంకుచితమైపోతుంది. పైగా ఇలాంటివి విసుగు

కలిగించేవిగానో, అంతరాయాలుగానో ఉంటాయి. రచయిత ఏదో విధంగా ఇతరమైన విషయాలను చొప్పించే మనస్తత్వమే దీనికి కారణం. దీనివల్ల నవల సంపూర్ణరూపంలోని సుస్వరత దెబ్బతింటుంది. కొన్ని నవలల్లో రాజకీయతాత్త్విక సామాజికమైన అనేక విషయాలను గురించి సుదీర్ఘమైన సంభాషణలు పాత్రముఖతః వెలువడి ఆ పాత్రనే మింగేసే ధోరణిలో ఉంటాయి. ఇది పాత్రచిత్రణం విషయంలో దెబ్బతీస్తుందనడంలో సందేహం లేదు. రచయిత ఈ విధంగా అనేక విషయాలను చొప్పించి విజ్ఞానదాయకంగా సంభాషణ తీర్చడంతో దోషం లేదనే అభిప్రాయమూ ఉంది. ఇది కళాత్మకంగా అనుచితమనీ, వ్యతిరేకించడమూ జరిగింది. పాత్ర ప్రత్యేకతను పురస్కరించుకొని ఎక్కడన్నా సంభాషణ దీర్ఘంగా ఉండవచ్చు. కాని వీలు కల్పించుకొని విజ్ఞాన ప్రదర్శనకు పూనుకోవడం సముచితం కాదనే ఆధునిక విమర్శకుల అభిప్రాయం. ఈ కారణంగా పాత్రచర్యతో అవయవాత్మక సంబంధం కలిగి సంభాషణ అర్థవంతంగా ఉండాలనడం జరిగింది ఒది సమంజసం కూడా.

శిల్పియైన రచయిత చేతిలో సంభాషణ ఇతివృత్తాన్ని ప్రకాశింపజేస్తూ పాత్రను ఆవిష్కరింపజేస్తూ నవల్లోని కళాత్మకమైన సంపూర్ణ స్థితికి దోహదం చేస్తుందనడంలో సందేహం లేదు. సంభాషణలో లోకంలో ప్రవృత్తమయ్యేదాన్ని ఎంతవరకు స్వీకరించాలో పరిహరించాలో రచయిత ఔచిత్యదృష్టితో నిర్ణయించుకోవలసి ఉంటుంది. సృజనశక్తి వెనుకనుండి విమర్శనాదృష్టితో చూస్తేగాని తెలియదు. ఏ భాషలోనైనా సంభాషణ పాత్రల మనోభావాల ప్రకటనంతో జీవిత స్వరూపాన్ని యథార్థస్థితిలో ఆవిష్కరించే ప్రయత్నంలో శక్తిమంతమైన సాధనంగా ఉపకరిస్తుంది.

సంభాషణ నాటకంలో ఉంటుంది. నవల్లోనూ ఉంటుంది. ఈ రెండింటికీ భేదం ఉంది. నాటకంలో సంభాషణకు కాలపరిమితి ఉంటుంది. ప్రదర్శనం నియమితమైన కాలంలో జరగాలి. రంగస్థలంపై పాత్రకూ సంభాషణకూ సమయం నిర్ణీతమై ఉంటుంది. నవల్లో ఈ విధమైన కాలపరిమితిపట్ల నియతి లేదు. అంతమాత్రాన ఎంతబడితే అంత పొడిగించడమూ జరగదు. కాని ఈ విషయంలో చాలావరకు స్వేచ్ఛ ఉన్నమాట నిజం. ఈ భేదం నాటకానికీ నవలకూ సంభాషణ స్వరూపంలో ఎంతో మార్పుకు కారణమౌతూంది. విలక్షణతకు దారితీస్తుంది. ఈనాటి నవల్లో పూర్వంవలె సుదీర్ఘం కాకుండా అవసరానికి మించకుండా క్లుప్తతతో, వేగంతో సంభాషణ తీరు కన్పిస్తుంది. ఎక్కడైనా పాత్ర ప్రత్యేకతనుబట్టి పొడిగింపు అవసరం కావచ్చు. సంభాషణలో సూటిదనం స్పష్టత సహజత్వంతోపాటు వాస్తవికతకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతూంది.

దీని వెనుకనుండి వాతావరణం నిర్మితమవుతుంది. మానసిక స్థితితో ప్రవర్తనకనుగుణంగా మౌఖికంగా బహిర్గతం కావడంతో కథాభాగంలో రచన గొప్పగా రాణిస్తుంది.

## II

నవల్లో తరచు తటస్థపడే సంభాషణలను 1) సాధారణం, 2) ప్రసంగకం, 3) సుదీర్ఘం, 4) సంక్షిప్తం, 5) టెలిగ్రాఫిక్ / అతి సంక్షిప్తం అనీ విభజించవచ్చు.

1) సాధారణం – జీవితంలో వివిధ సందర్భాల్లో మాట్లాడే సామాన్యమైన ధోరణి కలిగిఉంటుంది. ఇందులో వాస్తవచిత్రణం సహజత్వంతో ఎంతో సన్నిహితమైన అనుభవాన్ని కలిగించేదిగా ఉంటుంది.

2) ప్రసంగకంలో పాత్ర సంభాషణ ప్రసంగధోరణిలో ఉంటుంది. ఒక ఊపులో ఉద్రేకంతోనో సాలోచనతోనో సమాచారంతోనో వివరణంతోనే విజ్ఞానప్రదర్శకంగానో ఉంటుంది. దీర్ఘత్వాన్నీ కలిగి ఉండొచ్చు.

3) సుదీర్ఘంలో సంభాషణం కథాంశానికి మాత్రమే పరిమితమై దీర్ఘంగా సాగుతుంది. ప్రసంగకంలో అనేక విషయాలు వివిధ పార్శ్వాల్లో స్పృశింపబడతాయి. సుదీర్ఘంలో అన్యవిషయాల ప్రసక్తి చాలా తక్కువగా ఉంటుంది. ఇది ఉద్రేకంతో ఆలోచనతో కూడుకొంది. రచయితలో ఏదో విషయాన్ని ఇంకా బాగా వివరించాలన్న అభిప్రాయం వల్ల ఈ రకమైన సంభాషణ అవతరిస్తుంది. ఎదుటిపాత్రను పురస్కరించుకొని సందర్భవశంగానే వివృతమౌతుంది. తగిన విధంగానూ ఉంటుంది.

4) సంక్షిప్తంలో కథాగమనంలో వేగాన్ని అధికం చేసే లక్షణం ఉంది. అనవసరమైన వివరాల జోలికి పోకుండా ఆవేశాన్నీ, ఉద్రేకాన్నీ ఎప్పుడూ ఒకేస్థితిలో నిలుపుతూ, ఆలోచనా స్పర్శతో సంగ్రహంగా వాక్యోపవాక్య విన్యాసం ఉంటుంది. కథలో పాత్రపై ప్రధానదృష్టితో అవసరం మేరలో వర్తిస్తూ ఎంతో ప్రభావాన్ని నెరపుతుంది. ఎంతో వ్యంగ్యచమత్కృతినీ ప్రదర్శించే లక్షణం కలిగిఉంటుంది. నాటకీయధోరణికి దగ్గరగా పాత్ర మనస్తత్వంపై ఒరపిడులతో మెరపులతో విలసిస్తుంది.

5) టెలిగ్రాఫిక్‌లో మరీ అతిసంక్షిప్తత ఉంటుంది. మనస్తత్వ ప్రధానమైన నవలల్లో దీన్ని బాగా చూడవచ్చు. కథలో అఖండమైన వేగంతో తీవ్రతతో చిత్రితమయ్యే పాత్ర మానసిక సంక్షోభాన్ని పూర్తిగా వ్యక్తం చేయడానికి వ్యవధానం లేకపోవడంచేత, ఈ ధోరణి అవలంబితమౌతుంది. చాలాభాగం, సంభాషణలో, పదాలమధ్య, వాక్యాలమధ్యన పైకి అనకుండా ఉండీ. ఎదుటిపాత్ర ఆలోచనకు వదిలివేయబడుతుంది. పదాల వాక్యాల

సమన్వయమూ మనస్సులోనే ఏర్పడి భావం సందర్భాన్నిబట్టి రూపుదిద్దుకుంటుంది. ఇది సాధారణ నవలల్లోనూ అక్కడక్కడా విచిత్రమైన సందర్భాల్లో ఉపయుక్తమౌతుంది. చైతన్యస్రవంతీ, అంతరవిశ్లేషణంగల నవలల్లో ఇది ఎక్కువగా కన్పిస్తుంది. ఇది కొంత నాటకీయతను కలిగి ఉంటుంది. శబ్దానికీ వాక్యానికీ మధ్య కొంత ఆలోచన చేయవలసి ఉంటుంది. దీనిచేత సామాన్య పాఠకులకు, అన్నీ విడమరచి చెప్పాలని కోరేవారికీ ప్రీతిపాత్రం కాకపోవచ్చు. ఒకొక్కపుడు వాక్యం అసంపూర్ణంగానూ ఉంటుంది. ఇలాంటి వాక్యాల పరంపర ఉండవచ్చు. ఈ ధోరణి ఒక విశిష్టమైన సంఘటననుబట్టి, ఒక విచిత్రమైన పాత్ర మనస్తత్వాన్నిబట్టి నవలల్లో ప్రయుక్తమవుతుంది. దీనివల్ల ఎక్కువ ఇబ్బందిపడనవసరంలేదు. కాని నవల మొత్తంమీద ఈ లక్షణం ఉన్నపుడు కొంత ఓపిక అవసరమౌతుంది. ఇలాంటివి చాలా తక్కువ.

పైన పేర్కొన్న విధాలన్నీ ఒకే నవల్లో ఉండవచ్చు. దీనివల్ల సంభాషణలో వైవిధ్యం చేకూరుతుంది. అవసరాన్నిబట్టి ఉపయోగంతో ఔచిత్యంతో ప్రయోగశిల్పంచేత ఆకర్షణీయంగానూ విలసిస్తుంది. ఈ ప్రత్యక్ష సంభాషణంతోపాటు నవల్లో పరోక్ష సంభాషణమూ అప్పుడప్పుడు అవసరం అవుతుంది. ఇది ఒక పాత్ర మరో పాత్రతో సంభాషిస్తూ కథలో పూర్వం జరిగింది ప్రసక్తమైనపుడు, దాన్ని యథాతథంగా ఆ పాత్ర అన్నది అన్నట్లుగా సాగే సంభాషణ పద్ధతి.

## III

సంభాషణ వాస్తవానికి దూరంగా కృత్రిమంగా ఉండకూడదు. సమాజంలో వివిధ తరగతులకూ వృత్తులకూ చెందినవారు భిన్నరీతుల్లో మాట్లాడే సంభాషణలనూ వాటి ప్రత్యేకతలనూ గ్రహించి బాగా వడపోసి పరిమితుల్లో ప్రయోగించవలసింది. ఏవో కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే సాధారణ జీవితంలోని ప్రజల సంభాసణ యథాతథంగా స్వీకరిస్తే ఎంతో ప్రభావయుతంగా ఉంటుంది. వాస్తవ జీవితంలో ఒక సంఘటన సందర్భంలో ఎన్నో పునరుక్తులూ ఎంతో అనవసరమైన భాష మనకు వినబడుతుంది. నవల్లో లేదా నాటకంలో ఇందులో కొంత తీసివేసి, ఒక క్రమంతో కూర్చుకొని, అవసరమైతే మార్పులతో ఆ స్థితిని దృష్టిలో పెట్టుకొని కళాత్మకంగా రూపొందించుకోవలసి ఉంటుంది. ఇది యథార్థమైందీ, ఎన్నికచేసిందీ, మార్పులకు లోనైందీ. ఉపయోగంలో రచయిత ప్రయోజనాన్ని ఆశ్రయించి ఉంటుంది. యథార్థజీవితంలోని సంభాషణను రచనలో మొత్తంమీద యథాతథంగా స్వీకరించలేం. అయితే ఒక్కొక్కపుడు ఒక సంఘటనను పురస్కరించుకొని పాత్ర చిత్రణంలో ప్రత్యేకతను

నిలిపేందుకు అక్కడక్కడా కొంత ప్రయుక్తం కావచ్చు. ఇది వాస్తవికతకు దూరం కాకుండా, కళాదృష్టితో ఆకర్షణ కోల్పోకుండా, నిర్వహించడంలో రచయిత నైపుణ్యం తలపుకు వస్తుంది. సహజత్వానికి భంగం రాకుండా చదవడానికి యోగ్యంగా ఆకర్షణీయంగా ఆసక్తిని పెంచుతూ సంఘటన కనుగుణంగా పాత్రకు సముచితంగా సంభాషణ నడపడం నవల్లో ఒక కళే. ఇది సంపూర్ణమైన రచనా శిల్పంలో భాగం. దీనికి నిర్దేశకమైన సూత్రాలేమీ లేవు. కేవలం రచయిత వివేచన, ఔచిత్యం ప్రయోగంపై ఆధారపడింది.

పాత్ర తీరునుబట్టి సంభాషణ మారుతుంది. ఇది 1) ప్రవర్తనాపరంగానూ, 2) మనస్తత్వపరంగానూ ఉంటుంది. బాహ్యమైన వర్తనంలో సంభాషణ, పాత్ర సామాజిక స్థితి పరిసరాలకూ సందర్భానికీ అభివ్యక్తి ధోరణికీ సంబంధించి ఉంటుంది. స్థానిక గుణంతో మాండలికభేదంతోనూ ఉండవచ్చు. ఆంతరమైన మనస్తత్వంలో సంభాషణ పాత్ర మానసికస్థితికీ, ఆలోచనాధోరణినే, ఆవేశరూపానికీ, సంస్కారానికీ, అనుభవ శక్తికీ సంబంధించి ఉంటుంది. అవ్యక్తచేతన సామూహిక అవ్యక్త చేతనల ప్రమేయం కూడా ఉంటుంది. పాత్ర మానసికంగా కలత చెందినపుడు రచనలో సంభాషణ చెదురుచెదురుగా ముక్కలుముక్కలుగా సమన్వయం లోపించీ సాగవచ్చు. ఆవేశాన్ని పొందినపుడు వేగాన్ని పొందుతుంది. ఉద్రేకంలో ధైర్యాన్ని వహిస్తుంది. ఉల్లాసంలో కాల్పనికతను పొందుతుంది. అనుభూతిగాఢత్వం, సాంద్రత చేకూరుతుంది. ఒక్కొక్క సందర్భంలో సంభాసణలో పాట లేదా పద్యం చోటుచేసుకోవచ్చు. వివిధ పాత్రలు ఒకే సందర్భంలో ఒక్కొక్క విధమైన సంభాషణ ధోరణుల్ని అందుకోవచ్చు. ఒకే పాత్ర భిన్న సందర్భాల్లో వివిధ ధోరణుల్ని అవలంబించవచ్చు. ఈ విధమైన వైవిధ్యవిలసితమైన సంభాషణ, నవల్లో వాస్తవికతపై దృష్టితోనే ప్రవేశపెట్టబడుతుంది. జీవితం ప్రధానమైన నవల్లో సందర్భానికి వశమై, పాత్రల్ని ఆశ్రయించే వాస్తవసదృశంగా సంభాషణ రూపొందుతుందన్న విషయం మరచిపోకూడదు.

నవల్లో సంభాషణ ఎన్ని విధాలుగానో ఉపయోగానికి వస్తుంది. 1) కథను ముందుకు నడిపేందుకుగాను కావలసిన వేగాన్ని సాధిస్తుంది. 2) పాత్రల మధ్య జరిగే సంభాషణ అడుగున కదిలే చర్య తెలుస్తుంది. ఇది కథను నడిపించడమే కాకుండా పాత్రలతో సంఘటనలతో ప్రత్యక్షంగానో పరోక్షంగానో సంబంధం కలిగి ఉండి, పాత్ర వికాసానికీ ఇతివృత్త పరిణామానికీ ఉపకరిస్తుంది. 3) పాత్ర ఆవేశాన్నీ మనోభావాన్నీ స్పందననూ ఉద్దేశాన్నీ ప్రకటించడంలో తోడ్పడుతుంది. 4) పరిస్థితులెదురైనపుడు పాత్ర ఎదుర్కొనే సమస్యలో చర్య, ప్రతిచర్య ఏ విధంగా వర్తించేదీ మనోభావాన్ని చక్కగా

ప్రదర్శిస్తుంది. 5) పాత్రల ప్రభావం ఒకదానిపై మరొకటి ప్రసరించే తీరును వివృతం చేస్తుంది. 6) సంఘటనలు ఒకదానితో మరొకటి అంచెలు అంచెలుగా అనుసంధితం కావడానికీ, పాత్ర ప్రవేశానికీ, నిష్క్రమణకూ తోడ్పడుతుంది. 7) పాత్రల్నిబట్టి సంఘటననుబట్టి కథలో నిశ్చయమైన భావానికభిముఖంగా ప్రవర్తింపజేస్తుంది. కథనాన్ని ప్రకాశవంతం చేస్తుంది. 8) రచయిత నాటకీయతను అవలంబించినపుడు ఎంతో వేగయుతంగా ప్రభావశీలంగా కథనదృష్టితో ఆకర్షకంగానూ నిర్మాణానికి తోడ్పడుతుంది. 9) నవల్లో కథావయవసంబంధమైన వివిధాంశాల సంయోజనంలోనూ ఎంతో ఉపకరిస్తుంది. 10) మానవ స్వభావం తీరును అవిష్కరిస్తూ సమాజంలోని జీవితసాదృశ్యాన్ని పొంది నవల్లో పరిపూర్ణతను సిద్ధింపజేయడానికి సహకరిస్తుంది.

వివిధ సందర్భాల్లో పాత్ర వివిధ రీతుల్లో ఎన్నో సామాజిక శ్రేణుల్లో సంభాషణ సాగించవలసి ఉంటుంది. సూటిదనంతో, వ్యంగ్యంతో ఎన్నో అర్థచ్ఛాయలతో సూక్ష్మ సూక్ష్మమైన భేదాలతో వైవిధ్యాన్నీ వైచిత్రినీ ప్రదర్శిస్తూ ఆకర్షణీయంగా ఉండే విధంగా రచయిత నిశితమైన లోకపరిశీలనంచేత, శిల్పదృష్టిచేత శక్తిమంతంగా తీరుస్తాడు. ఈనాడు మారుతూన్న సమాజంలో పల్లెల్లో పట్టణాల్లో నగరాల్లో గడిపే జీవితప్రపంచంలో వివిధ వలయాలు అంతస్థులు, ఇంకా వైయక్తిక, జాతి వృత్తి ప్రాంత పరంగా ఎన్నో ధోరణులను బాగా పరిశీలించవలసి ఉంటుంది. వీటిని తప్పించుకోవడంవల్ల రచనకు న్యాయం చేకూరదు. కాబట్టి రచయిత జీవితంలో సంభాషణల్ని తప్పనిసరిగా శ్రద్ధతో పరిశీలించి, వివేచనతో గ్రహించి కళాదృష్టితో నిర్వహించవలసి ఉంటుంది. నవల జీవితస్వరూపం బింబమూ, చిత్రమూ, విలసనమూ, దర్శనమూ అవడంచేత, వాస్తవ సాదృశ్యస్థితినిబట్టి జీవితంలోవలె నవల్లోనూ దీని ప్రమేయం అనివార్యమౌతుంది.

సంభాషణ పాత్ర వ్యక్తిత్వాన్ని నిలిపేదిగా, సంఘటనకు స్థితి చేకూర్చేదిగా, ఇతివృత్తాన్ని వికసింపచేసేదిగా, ఉద్దేశాన్ని ప్రకాశమానం చేసేదిగా ఉండాలి. దీనితోపాటు పాఠకునిలో అభిలాషను నిలుపుతూ, ఉత్సకతను పెంపొందిస్తూ, సంభాషణ నిర్వహించినపుడే నవల పఠనయోగ్యంగా ఉంటుంది. ఉన్నతమైన ప్రమాణాలతో ఆకర్షణీయమైన స్వరూపాన్ని పొందుతుంది.

# 8. శైలి

పాశ్చాత్య సాహిత్యం ప్రభావంవల్ల సిద్ధించిన విమర్శనాంశాల్లో శైలి ఒకటి. ఇంగ్లీషు పదం "స్టైల్"కు సమానార్థకంలో ప్రయుక్తమౌతూంది. రచయితలకు గల ప్రత్యేకమైన అవేశం మరియు ఆలోచనలనూ లేదా ఆవేశమూ ఆలోచనల్ని పద్ధతి సరిగ్గా వ్యక్తం చేసే భాషా లక్షణం శైలి[1]. ఇందులో శబ్దాలు, వాటి అమరిక, ఆవేశమూ, ఆలోచన, వీటి క్రమ విధానమూ, రచయిత వ్యక్తిత్వం అనే అంశాలున్నాయి. ఇవి భాషనూ, మనఃప్రవృత్తినీ, క్రమవిన్యాసాన్నీ, రచయిత స్వభావరూపాన్నీ భావింపచేసేవి. ఈ లక్షణాల సమన్వయంతో అవతరించే శైలి మొట్టమొదట నవల ఆరంభించగానే వాతావరణంతో పాటు ఆకర్షిస్తుంది. ఇది భాషను ఆశ్రయించి ఉంటుంది. శైలికీ భాషకూ గల సంబంధం విశిష్టమైంది. మొదట పేర్కోదగిందీ. ఈ ఆకర్షణ కళ ఉంటేనే సిద్ధిస్తుంది. కళాత్మకమైన విశిష్టరూపంలోనే రచయిత వ్యక్తిత్వమూ ప్రదర్శితమౌతుంది. సృజనాత్మక ప్రక్రియలో ఇది భాషా ప్రయోగవిన్యాస రూపంలో ప్రత్యేకంగా గుర్తింపబడుతుంది.

నవల మొత్తం వచనరూపం కావడంచేత, పద్యంలో వలె వైవిధ్యప్రదర్శనకెక్కువ అవకాశం ఉండదు. ఉన్నంతలో రచయిత శిల్పవిన్యాసంచేత కథనంలో సంభాషణలో వర్ణనలో వివరణలో ఆ సందర్భాన్ని బట్టి పాత్రనుబట్టి సముచితమైన ధోరణిని అవలంబిస్తాడు. ఒక్కొక్క రచయిత శైలి మొత్తంమీద ఒక్కొక్క విధంగానూ రూపొందుతుంది. ఒకరితో పోలిన వ్యక్తిత్వం మరొకరికి ఉండరు. ఎక్కడన్నా క్వాచితంగా ఏవో కొన్ని సామ్యాలు ఉండవచ్చు. ఒకే రచయిత తన వ్యక్తిత్వంలో ఉండే వివిధ పార్శ్వాల్లో భిన్నరీతులుగా రచనలు చేయవచ్చు. ఇది అతనినైకముఖ నైపుణ్యాన్ని తెలుపుతుంది. అయినప్పటికీ ఒక సాధారణ లక్షణం అంతర్నిహితంగా సర్వత్రా విలసిస్తూ ఉంటుంది. అది పైకి స్పష్టంగా కన్పించకపోవచ్చు. కాని కళాత్మక విధానంలో రచయిత వ్యక్తిత్వాన్ని స్ఫూర్తికి తెస్తుంది. స్థూలంగా శైలి స్వరూపం ఇది.

వ్యక్తికి సంబంధించిన ఆకృతి, మాట, నడక, స్పందన, ఆలోచన, ప్రవర్తన, దృక్పథం అన్నీ లేదా కొన్ని ఒకచోట సమాహారభూతంగా కలసిన బాహ్యాంతర స్వరూపం, సాహిత్య వ్యక్తిత్వాన్ని భావింపజేస్తుంది. మనలో ఒక అభిప్రాయాన్ని ముద్రితం చేస్తుంది.

1. "Style is a quality of language, which communicates precisely emotion and thoughts or a system of emotion or thoughts peculiar to the author".
Middleton Murray - The Problems of Style

ఈ ముద్రలో గాఢత్వం విస్పష్టత, విశిష్టత, వ్యక్తిత్వాన్నిబట్టీ ఆకర్షణీయతను కలిగి ఉంటుంది. నవల్లో శైలి రచయిత ప్రత్యేకమైన విశిష్ట వ్యక్తిత్వాన్ని ఆవిష్కృతం చేస్తుంది. ఒక్కొక్కప్పుడు నవల అపూర్వ విజయానికీ అపజయానికీ శైలి కీలకమైన పాత్ర వహిస్తుంది. శైలిపై అధికారం ఉన్న రచయిత నవల విస్తృత పరిధినీ, వైవిధ్య పార్శ్వాలనూ, ఏ విషయాన్నైనా తనలో ఇముడ్చుకొనే లక్షణాన్నీ ఎంతో నిపుణంగా అవసరాన్ని బట్టి వినియోగించుకుంటాడు.

ఇతివృత్త నిర్మాణం పాత్రచిత్రణం వాతావరణ కల్పనం అభిప్రాయ ప్రకటనం మొదలైన అపరిహరణీయమైన అంశాల్ని శైలి, ఆవిష్కరిస్తుంది. దీనికి భాష ఆశ్రయసాధనం. కవిత్వంలో సంక్షిప్తత గుప్తత వ్యంగ్యంతో సారభూతమైన భావనతో సౌందర్యాకృతి వెలుగుతుంది. నవల్లో దీనికి భిన్నంగా వైపుల్యం, స్పష్టత, వివరణంతో అక్లిష్టమైన అల్లికతో, సౌందర్యరూపం పరచబడి ఉంటుంది. ఎక్కడన్నా ప్రత్యేకమైన ప్రయోజనాన్ని మనస్సులో పెట్టుకొని, వ్యంగ్యస్ఫూర్తి ఉండవచ్చు. ప్రతీకాత్మనూ పొందవచ్చు. దీని పద్ధతి, సులభంగా అవగాహనకు వచ్చే విధంగానే తీర్చబడుతుంది. అసలు నవల ప్రక్రియాస్వరూపంలోనే ఎక్కడికక్కడ విప్పుకొని, అక్కడక్కడా అందుకొని, అల్లుకొనిపోయే సంశ్లిష్టలక్షణం ఉంది. ఈ మౌలికమైన రచనాతత్త్వం శైలీనిర్మాణంలో మిగతా ప్రక్రియలనుండి ఎంతో భేదాన్ని కలిగిస్తుంది. అందువల్ల నవల్లో వచన–సంభాషణ శైలిని పరిశీలంచే దృక్పథం వేరుగ ఉండవలసి వస్తుంది. కవిత్వం లేదా నాటకం కొలమానాలు దీనికి పూర్తిగా అన్వయించవు.

## II

మంచి నవల్లోని శైలిని అనువాదంలో తీసుకొని వచ్చే వీలుందా? అని ప్రశ్న అనువాదంలో మూలరచనలోని శైలి నిస్సందేహంగా లోపించే మాట నిజం. 1) శబ్దాల సహయోగం–వాక్యవిన్యాసం ; 2) ఆలోచన–ఆవేశం ; 3) ఇవి క్రమ విధానంలో ఆకర్షకమైన సామరస్యంతో ఆవిష్కృతం కావడం శైలి అనుకుంటే 1) మొదటిది భాషాగతమైందీ, బాహ్యస్వరూపానికి సంబంధించిందీ. అనువాదాల్లో తీసుకొని రావడం కష్టమైన పనే. 2) రెండోది అంతస్తత్త్వానికి సంబంధించింది కొంత సులభం. ఇది శైలీ నిర్మాణంలో భాగమేనన్న సంగతి మరచిపోకూడదు. 3) మూడోది పై రెండింటియొక్క కలయికచేత ఏర్పడిన రూపమే కాబట్టి దీని విజయం పై రెండిటిపై ఆధారపడిన అభివ్యక్త లక్షణాన్నీ భావింపజేస్తుంది. అనువాదంలో కూడా కొంత ప్రయత్నించి మొదటిదాన్ని కొద్దో గొప్పో సాధించవచ్చు. అది సోదర భాషలైతే అవకాశం ఎక్కువ. సృజనాత్మక

రచనల అనువాద విషయంలో రచయిత తన వ్యక్తిత్వాన్ని పరిహరించుకోవడం కుదరదు. అతడూ రచయిత అయితే, సృజనశక్తి ఉద్గమనాన్ని నిరోధించలేడు. ఏమైనా, మూలరచనలోని భాషాగతమైన సంపూర్ణశక్తినీ, శైలీ రామణీయకతనూ అదే ప్రమాణంలో, రీతిలో అనుభవానికి అందించలేకపోవడం, వాస్తవం.

దీని వెనుకనున్న అంతస్తత్వంతో ఆవిష్కృతమైన అల్లిక (texture) లోని రీతి (pattern)ని కొంత అందుకోవచ్చు. తాను అనువాదం కోరే భాషానుగుణంగా, తన వ్యక్తిత్వం తొంగిచూసే విధంగా శైలి సంపాదితమౌతుంది. ఇది అనివార్యం. అనువాదకుడు అనువాద సందర్భంలో రచనాపరమైన నిమగ్నతవల్ల, అనుగాఢత్వంవల్ల తనకు తెలియకుండానే కన్పిస్తాడు. ఇది ఇతరమైన నవలా లక్షణాలతోనూ ముడివడి ఉంటుందన్న విషయాన్ని మరవకూడదు. విక్టర్ హ్యూగో (ఫ్రెంచి) టాల్‌స్టాయ్, డ్రాస్టోవస్కీ (రష్యన్) మహారచయితల రచనలు ఒక భాషనుండి మరో భాషలోకి, అందులోనుండి తిరిగి ఇతర భాషల్లోకి పరివర్తితం అయ్యేప్పుడు శైలీగతమైన మౌలికతను యథా తథంగా నిలవడం సాధ్యం కాదు అపుడు,ఎట్లా ఆనందించగలుగుతున్నామంటే, శైలితో ముడివడీ, శైలికన్న భిన్నమైన ఇతర లక్షణాల సంవిధానమూ దీనికి దోహదం చేస్తుందన్నమాట. రచనలో ఇతివృత్తం పాత్రచిత్రణం – జీవితదర్శనంతోపాటు స్పందన, ఆలోచన మొదలైన లక్షణాలపై దృష్టీ నవల పరిపూర్ణమైన స్వరూపానికి ఎంతో అవసరం. ఇవి శైలి కన్నా భిన్నమైనవి.

మరోవైపునుండి చూస్తే అనేక విషయాలచేత యోజితమయ్యే, నవల్లోని శైలి ఏకదేశం మాత్రమే. ఒక్కొక్కప్పుడు, అందులోని ఏవైనా స్వల్పమైన లోపాలు శైలిచేత పూరింపబడవచ్చు. సాహిత్యకళకు అవసరమైన మౌలిక లక్షణాల్లో ఒకటైన శైలి, కనీస స్థాయిలో రామణీయకతను సంతరించుకోకపోతే రచన పఠన యోగ్యంగా ఉండదు. విసుగు పుడుతుంది. చివరిదాకా చదివే అభిలాష సన్నగిల్లుతుంది. దీన్ని స్థిరంగా నిలపడం రచయిత కర్తవ్యం. ఇది మంచి శైలిచేతనే సాధ్యం. ఇది అనువాదంలోనూ ఆ భాషలో సాధ్యమే.

## III

నవల్లో శైలికి సంబంధించిన మరికొన్ని అంశాలున్నాయి. ఒక విషయాన్ని గురించి వ్రాసేటప్పుడు దానికి సంబంధించిన సాంకేతిక లేదా ప్రత్యేకమైన శబ్దజాలం–భాష ఉపయోగించవలసి ఉంటుంది. తత్త్వానికీ–శాస్త్రానికీ లేదా ప్రత్యేకంగా వృత్తికీ సమాజంలో అంతస్థులకూ సంబంధించినవి. ఇది "వాతావరణం"తో ముడిపడింది. భాష–శైలి,

వీటిలో ఒకదానినుండి మరోదానిలోకి నవల్లో మారుతూ ఉంటుంది. మాబిడిక్ (మెల్‌విలె)లో తిమింగలాల వేట గురించి వ్రాసేప్పుడు రచయిత ప్రత్యేకమైన క్షేత్రాలను పరామర్శిస్తాడు. పదజాలాన్ని ఉపయోగిస్తాడు. తత్త్వశాస్త్రం నుండి భూగర్భశాస్త్రం దాకా విజ్ఞానాన్ని ప్రదర్శిస్తాడు. సముద్రంపై జీవితం గడిపే వృత్తికారులకు సంబంధించిన వాతావరణంతో కొత్త ప్రపంచాన్ని దర్శింపజేస్తాడు. విషయానికీ భాషకూ శైలికీ సంబంధం ఉంది. మొత్తంమీద ఇది ప్రతీకాత్మకంగా (Symbolic) నిర్వర్తితమైంది. ఇది వేరే విషయం.

ఒక్కొక్కప్పుడు ఒక ప్రాంతంనుండి మరో ప్రాంతానికీ, ఒక దేశం నుండి మరో దేశానికీ కథారంగం మారినపుడు ఆ ప్రాంతంలోని దేశంలోని స్థానికమైన చిత్రణం పురస్కరించుకొనీ భాష-శైలి సంపాదితమౌతుంది. మరొకపుడు రచయిత విజ్ఞానప్రదర్శకమైన శైలి ఉంటుంది. నవల్లో కథనంలోను పాత్రచిత్రణంలోను, కేవల వర్ణనలోనూ శైలి భేదం కన్పిస్తుంది. వేయిపడగల్లో వర్ణనలు (వెన్నెలవర్ణనం ... "అపహరింపబడిన వేదముల కాంతులు మరల బ్రహ్మదత్తములై ప్రకాశించినట్లు...) కల్యాణోత్సవాల సందర్భంలో ఆయా విషయవిజ్ఞాన వివరణంలో శైలి ప్రౌఢంగా, ప్రజ్ఞాసమర్పకంగా ఉంది. ఇదేవిధంగా మాలపల్లిలో రామదాసు తత్త్వచింతనలో మరోవిధంగా కన్పిస్తుంది. విశ్వనాథ, గ్రాంథికంలో నిబిడమైన శైలిని, ఉన్నవ-శిష్టవ్యావహారికం చేత పుష్టమైన శైలినీ పాటించే ధోరణి కన్పిస్తుంది. చివరకు మిగిలేది నవల్లో కోమలి పాత్రతో స్ఫూర్తిమంతంగా ప్రకృతి వర్ణనమూ పరిశీలింపదగింది. ఇదే నవల్లో మరో ప్రయోజనం ప్రతీకాత్మకంగా నిర్వర్తితమైంది. అది వేరే విషయం. పైన పేర్కొన్న రచనల్లో భాష, శైలికి సంబంధించినంతవరకు కొన్ని పరిమితులున్నాయి. ఇట వాతావరణంతో స్థగితం కావడంతో పరిధి విస్తృతమౌతుంది. ఆలాగే ఇతివృత్తంతో పాత్రతో సంబంధం కలగడంతో మరో పార్శ్వంలో భాగమైపోతుంది. అందువల్ల అన్యోన్యాశ్రయం చేత, పరస్పర సంబంధంచేత సంపూర్ణస్థితిని పొందే నవల్లోని శైలిని గురించి ఎంత వ్రాసినా అసమగ్రంగానే ఉంటుంది.

నవల్లో శైలి వాస్తవికం, కాల్పనికం అని రెండు విధాలుగా విశ్లేషించవచ్చు. 1) వాస్తవికం సహజమైన శైలికి, 2) కాల్పనికం ఆలంకారికమైన శైలికీ దారితీసేది. 1)సామాజికమైన అంతస్థులు, ప్రాంతీయమైన వ్యత్యాసాలు ప్రసక్తమైనపుడు రచనలో సహజమైన శైలి సముచితం. ఎన్నో ంశాలకు సంబంధించిన ప్రత్యేకతల చిత్రణంలోనూ చూడవచ్చు. 2) కాల్పనికం రచయిత కల్పనాశక్తిని ప్రదర్శించేది. వర్ణనల్లో ఎక్కువగా

ప్రమేయాన్ని పొందుతుంది. ఇందులో ఆలంకారికతకూ ప్రాముఖ్యం అధికం. కొందరు రచయితలు ఈనాటికీ ఆలంకారికమైన శైలిలో అక్కడక్కడా వాక్యంలో గ్రాంథిక మర్యాదలు వీడని పద్ధతిలో వ్రాసేవారూ ఉండవచ్చు. ఇది ఈనాటి నవలకు తగందీ, నవల పరిణామంలో మౌలికమైన స్వరూప స్థితికి భంజకమైందీ.

శైలిలోభాగ (unit)మైన వాక్యనిర్మాణంలో సుదీర్ఘం, సంగ్రహం, మిశ్రమం అని మూడు విధాలు. 1) కథనం, వివరణం, వర్ణనం ప్రత్యేక సందర్భాల్లో దీర్ఘమైన వాక్యం, 2) కలత, ఆవేదన, బాధ మొదలైన విపరీతమైన స్థితులూ, మనోభావాలు ప్రకటించేందుకూ, సంభాషణలోనూ వేగాన్ని సూచించేందుకు చిన్న వాక్యం ; ఈ రెండింటి మిశ్రమం కథనస్థితికీ పాత్ర స్వభావాన్నిబట్టీ ఉపయుక్తమౌతాయి. భాషా ప్రయోగం, వాక్యవిన్యాసం ఈ రెండూ శైలికి ప్రాథమికమైన విభాగాంగాలు. మొత్తంమీద బాహ్య సౌందర్యాన్ని అనుభవంలోకి తెచ్చేందుకు మొదటిప్రయత్నం వీటివల్లనే కలుగుతుంది.

ఇది ఇలా ఉంచి ఇందులో ధ్వని (Sound) కి సంబంధించిన అంశమూ పేర్కొనవలసి ఉంది. వివిధ సందర్భాల్లో ధ్వనిరీతులు (Sound Patterns) వాక్యస్థాయిలో శైలిని ప్రభావోపేతం చేస్తాయి. నవల్లో లయాన్వితమైన రచనలో, ఒకేవిధంగా ధ్వనించే శబ్దాలు ఒకదాని తరువాత మరొకటి లేదా కొన్ని నియతమైన స్థానాల్లో ఉండేవిధంగా పునరావృత్తం జరిగి (అనుప్రాసయుతమై) ఆలంకారిత సిద్ధిస్తుంది. ప్రత్యేకమైన శబ్దగత ధ్వనిరీతులచేత, లయాత్మకమైన విచిత్రగతులచేత నిబిడమైన శిల్పమూ శైలీ నిర్మాణంలో భాగమే. కేవల వర్ణన సందర్భంలో అలరిస్తుంది. ఇది పాత్ర మనస్తత్వపరమైన చిత్రణలో బాగా విజయవంతమయింది. "అల్పజీవి"లో సుబ్బయ్య పాత్ర వర్తనంలో శైలీ ప్రత్యేకతను గమనించవచ్చు.

## IV

శైలి సహజధోరణితోపాటు కళాత్మకతనూ పొందిన నిర్మాణంచేత హృదయా వర్జకంగా సౌందర్యమయంగా విలసిస్తుంది. ఇది శిల్పవివేచనకనుకూలంగా చేసే ఆలోచనకు సహేతుకమూ సముచితమూ అనిపించాలి. ఉత్తమమైన శైలికి సంబంధించిన అనుభవం రచనలో విస్తృతమవుతుంది. హేతువుకతీతమైన స్థితిని పొందుతుంది. ఇది కవిత్వంలోకంటే నవల్లో విస్తృతమైన పరిధిలో పరచబడుతుంది. కల్పనకంటే వాస్తవానికీ, జీవితసత్యానికి దగ్గరగా ఉండటంవల్ల సాధారణ పాఠకులకెంతో సన్నిహితమవుతుంది. సులభంగా అవగాహనకు రావడానికి వీలుంది. విశిష్టమైన శైలి

పైస్థాయి పాఠకుల్ని అలరిస్తుంది. రచయిత ప్రజ్ఞ, నవల్లో శైలిలో చివరిదాకా అభిలాషను నిలపగలిగిన ఆకర్షణనూ సమాహితపరుస్తుంది.

రచనలో శబ్దాల సహయోగంవల్ల ఏర్పడే ధ్వనికి, వివిధ రీతుల్లో పాఠకుణ్ణి మానసికమైన ఆహ్లాదంతో నిలుపగల శక్తి ఉందని గుర్తిస్తే, ఈ ఆకర్షణ ఎలాంటిదో తెలుస్తుంది. శబ్దయోజనం, వాక్యవిన్యాసం రూపంలో రచయిత వ్యక్తిత్వాన్ని ప్రత్యక్షం చేసే శైలిని జాగ్రత్తగా పరిశీలిస్తే, రచన మొత్తంమీద ఆయా సందర్భాలనుబట్టి కథనం (narration), వివరణం (explanation), వర్ణనం (description), సంభాషణ (conversation), వాదం (argument), చర్చ (discussion), ఉపన్యాస (speech) ధోరణి రూపంలో బహుముఖాలుగా పొందుపరచబడి ఉంటుంది. ఇందులో ఒక్కొక్క విధమైన శిల్పవిధానం కలిగి ఉంటుంది. ఇక్కడ ఒక్కమాట. ఇది మొత్తంమీద ఇతివృత్తంతో, పాత్రతో, కథనంతో అనుసంధితమై ఉంటుందని వేరే చెప్పనక్కరలేదు. దీన్ని ఔచిత్యంతో సందర్భాన్నిబట్టి ఒకస్థాయిలో నిర్వహించగల రచయిత శైలీనిర్మాణంలో ఉన్నత ప్రమాణాలను ఆవిష్కరిస్తాడు. మరోమాట – ఇది నవల్లో చక్కని హాస్యం, ఆనందం, విషాదం, కరుణ మొదలైన మనోభావ సమర్పకమైన విన్యాసంచేత ఎంతో ప్రకాశిస్తుంది. జాగ్రత్తగా పరిశీలిస్తే శబ్దం – బాహ్యసౌందర్యంతో, భాష – అంతర రామణీయకతతో, శైలి ప్రసారాన్ని పొందడం అనుభవానికి వస్తుంది. నవల్లో ఇది విశిష్టమైన అనుభూతికెంతగా ఉపకరించేదీ, ఈ దిశలో చలం శైలి సహృదయలోకానికి సువిదితం.

నవల్లో కళ– శిల్పం పేరిట ఏలాంటి సందర్భంలోనూ సాధారణమైన సంభాషణలోని సహజత్వాన్ని, అభివ్యక్తి విధానాన్నీ త్యాగం చేయకూడదు. అపుడే శైలి ఆ భాషాసౌందర్యాన్ని కలిగి ఉంటుంది. ఈ పరిమితుల్లో విశేషమైన పరిస్థితుల్లో కళాభావనతో అనుభూతి సాంద్రతను పెంపొందించే గుణంతోనూ సంపన్నం కావచ్చు. ముందు భాషలోని నిసర్గమైన లక్షణం నవలకు ఆధారం కావాలన్నదే ప్రస్తుతాంశం. ఆ తరువాతనే శిల్పగతమైన విలువలకు ప్రాధాన్యం ఉండాలి. గొప్ప రచయితలందరూ ఈ రెండింటినీ సందర్భోచితంగా ఉపయోగించారు. సమన్వయ ధోరణితో ప్రయోజనాన్ని సాధించడం గమనించవచ్చు. ఈ దిశలో అంతవరకూ తెలుగు వచనంలో కన్పించని తీవ్రత, తీక్షత, వేగంతో సాగే వాక్యవిన్యాసంతో చలం రచనలు మన దృష్టికి వస్తాయి. ఇందులో భావస్పందన ఎంత వేగంగా ప్రసరిస్తుందంటే, దాన్ని పాఠకుడు అందుకునే లోపల దూరం ప్రవహిస్తుంది. శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి రచనలు మూటగట్టిన తెలుగు

భాషా సౌందర్యాన్నీ కలిగింది. అనేకమైన మాటలు పలుకుబడీ సామెతలూ జాతీయాలతో మనముందు ప్రదర్శితమవుతాయి. రచయితల వ్యక్తిత్వాల్ని బట్టి వైవిధ్యం సహజం.

శైలి నవల్లో వస్తువునుబట్టీ సాహిత్య సంస్కారాన్నిబట్టీ అనేక రూపాలు పొందుతుంది. అయితే సహజత్వంతో వాస్తవికతకు దగ్గరగానూ, కళాత్మకమైన స్థాయిని పెంచేదిగానూ ఉండడంలోనే రచన విశిష్టమైన ప్రమాణాల్ని సాధిస్తుంది. ఒక రచనకు మరో రచనకు భేదంలో మొదట దృష్టికి వచ్చేది శైలి. నవల ఆరంభించగానే ప్రభావం నెరిపే అంశాల్లో "శైలి" ఒకటి. శైలి రచయిత వ్యక్తిత్వాన్నిబట్టి నిర్వహణంలోని శిల్పదృష్టిని బట్టి రూపొందుతుంది. నవల్లో సహజగుణంతోపాటు శిల్పయుతమైన శైలీవిన్యాసం కళాత్మకమైన విలువల్ని పెంచుతుంది. వచనంలో సహజోక్తి మొదలుకొని అలంకారిక రీతి దాకా పార్యాప్తమైందీ.

ఇది సృజనశక్తిలోని స్వతంత్రగుణాన్నీ నవతాస్థితినీ, భావనానుగుణ స్పందన శీలాన్నీ, రచయిత శిల్పశక్తినీ భావింపచేస్తుంది. ఈ విధంగా వివేచిస్తూ పోతే, వ్యక్తుల్ని బట్టి వ్యక్తులెన్ని విధాలో, రచయితలను బట్టి నవలల్లో శైలి అన్నివిధాలన్న అభిప్రాయంలోని ఔచిత్యం, స్ఫూర్తికి వస్తుంది.

# 9. దృష్టికోణం
## (Point of View)

ఒక కథ ఉంది. అది ఇంకొకరికి తెలియాలి. దాని అంతట అది వివరించలేదు. మరి ఎట్లా తెలుస్తుంది? ఎవరో ఒకరు చెప్పాలి. ఆ చెప్పే వ్యక్తి అంటే కథకుడన్నమాట. ఆ కథకు సంబంధంతో ఎక్కడో ఒకచోట నిలచి ఉంటాడు. ఆతడు ఎక్కడినుండి దర్శిస్తున్నాడు? వివరిస్తున్నాడు? అనేది దృష్టికోణంలో ముఖ్యం. ఏయే కోణాల నుండి లేదా స్థానాలనుండి కథ చెప్పబడుతోంది? పాఠకుని కే విధమైన అనుభవాన్ని కలిగిస్తోంది? ఇంకా ఏ విధంగా చెబితే బాగుంటుంది? అనేవి రచయిత స్వయంగా నిర్ణయం తీసుకోవలసినవి.

దృష్టికోణం అంటే కథకుడు (Narrator) ఎక్కడ నిలచి ఉండేదీ దానికి సంబంధించిన అంశం. కథ చెప్పే వ్యక్తి ఉండాలి. ఎక్కడినుండి దర్శిస్తే వివరిస్తే అందంగా ఉండేదీ ప్రయోజనం చేకూరేదీ. ఇది వస్తుస్వరూపమూ, దాని నిర్వహణలో అవలంబించే దృష్టి విధానాన్నిబట్టి ఉంటుంది. కథకునికొక దృష్టికోణం అవసరం. అవసరాన్నిబట్టి దృష్టికోణం మారుతుంది. కథకుడు, కథకు సంబంధంతో ఎక్కడినుండి ఎట్లా దర్శించేదీ నవల్లో సంవిధానానికి (technique) సంబంధించిన అంశం ఔతుంది. ఇది కథ చెప్పడానికి ఉపయోగించే నైపుణ్యాన్ని ప్రదర్శిస్తుంది. ఇది కథనానికి సంబంధించిన శిల్పం. ఇందులో ఎన్నో విధాలున్నాయి, పద్ధతులున్నాయి. రచయిత కోరే తీరునుబట్టి ఉపయోగంలోకి వస్తాయి. కథనంలో వైవిధ్యంతో, విశిష్టమైన తీరులో పాఠకునిలో అభిలాషను, ఆకర్షణను నిలపడమే దీని ప్రయోజనం.

దృష్టికోణం కథనపద్ధతికి చెందిన అంశం. కథకుడు నవల (1) లోపలినుండి కథను చెప్పవచ్చు. ఏదేని పాత్రద్వారా దీన్ని నిర్వహించవచ్చు. (2) బయటినుండి అన్నీ తెలిసిన వ్యక్తిగా కథ సాగించవచ్చు. తనకొక నిర్ణీత స్థానంలో ఉంచుకొని కథ చెప్పవచ్చు. ఈ సంవిధానాలన్నింటి ప్రయోజనమూ నవల్లో చిత్రితమయ్యే వాస్తవ సదృశమైన జీవితాన్ని శిల్పవంతంగా నిర్మించడానికి తోడ్పడడమే.

దృష్టికోణం ఎప్పుడూ ఎంతో కొంత పరిమితమైంది, స్థూలమైన సూక్ష్మమైన అవకాశాలతో ప్రత్యేకత కలిగిందీ. బయటి తలుపు తెరచి గడపదాటి బయటికి దృష్టి ప్రసరిస్తే, లేదా కిటికీ నుండి తొంగిచూస్తే ముందు కొంతదూరంలో ఉన్న వస్తువులు

కన్పిస్తాయి. ప్రక్కలకు చూపులు ప్రసరిస్తే అవైపున ఉన్నవి చూడవచ్చు. వెనుకభాగం కన్పించదు. ఇందుకు వేరే ప్రయత్నం అవసరం. ఈ విధంగా ప్రతిదానికీ ఎక్కడికక్కడ కొన్ని పరిమితులు ఉంటాయి. ఆరుబయట నిల్చి దూరదూరం దృష్టి ప్రసరించి, చెట్లూ-వచ్చిపోయే మనుషులూ కొండలూ అవలోకించవచ్చు. ఒక్కొక్క వస్తువు దగ్గరకు వెళ్ళితే సూక్ష్మసూక్ష్మంగా దర్శించవచ్చు. ఎత్తుకు వెళ్ళి పైనుండి చూస్తే, క్రిందికి నాల్గుదిక్కుల్లోని ప్రపంచం సమీక్షించవచ్చు. అయితే నేలపై ఉన్న వస్తువులు, విస్తృతమైన క్షేత్రంలో దృష్టికి చాలా చిన్నచిన్నవిగా ఎక్కువసంఖ్యలో ఎన్నో కన్పిస్తాయి. వ్యక్తి నిలచిన స్థితినిబట్టీ, దృష్టి ప్రసారాన్నిబట్టీ దగ్గరనుండీ దూరంనుండీ పైనుండీ క్రిందినుండీ దృష్టికోణంతో వస్తుస్వరూపం దృశ్యమానం అవుతుంది. అది బాహ్యమైంది. ఇక అంతరమైంది భావలోకానికి సంబంధించింది వేరే. ఇది ఎంతో సంక్లిష్టమైంది. అప్రత్యక్షమైంది. ఇది నవల్లో ప్రత్యక్షం చేయబడుతుంది.

నవల్లో రచయిత ఆశించే ప్రయోజనాన్నిబట్టి కథనపద్ధతిలో దృష్టికోణం అవలంబించబడుతుంది. దృష్టికోణ ప్రసారాన్నిబట్టి క్షేత్రపరిమితీ, దాని వైఖరినిబట్టి వస్తు సమితి అవగతికి వస్తుంది. పూర్వకాలపు నవలల్లో జీవితక్షేత్రాన్ని స్థూలంగా పరిశీలించే దృష్టికోణంలో రచయితే కథకుడుగా చాలాభాగం చెప్పేవాడు. రానురాను ఈ పద్ధతిలో మార్పు వచ్చింది. కథనంలో కొత్త పోకడలు మొదలైనాయి. స్థూలం నుండి సూక్ష్మసూక్ష్మానికీ, బాహ్యం నుండి అంతఃస్థితికీ మొగ్గు కన్పించడంతో గుణాత్మకమైన మార్పు వచ్చింది. మనస్తత్వస్థానాలపై ఆలోచనతోనూ కొత్తదనాన్ని సంతరించుకుంది. కథనశిల్పంలో కొత్త పార్శ్వాలు ఆవిష్కృతమైనాయి.

ఏ దృక్కోణం నుండి కథనం జరగాలో, మొత్తంమీద ఎలాంటి ప్రభావాన్ని కలిగించదలచిందీ, ఏ ప్రత్యేకతను సాధించడానికి ఏ విధానం అనుసరిస్తే బాగుండేదీ, ఏ విధంగా అభిలాషను అవిచ్ఛిన్నంగా నిలిపేదీ దీనికి సంబంధించిన శిల్పైక్యాన్ని రచయిత జాగ్రత్తగా నిర్ణయించుకోవలసి ఉంటుంది.

## దృష్టికోణం, విధానాలు :

1. నిర్మాణంలో నిర్మాణం (Frame within the frame) : ఈ విధంలో ఒక కథా నిర్మాణంలో మరో కథానిర్మాణం ఉంటుంది. కథనం ఉత్తమపురుషలో ఉంటుంది. ఎవరో ఒకరు కథ మిత్రులకో శ్రోతలకో చెబుతారు. పాత్రనిర్మాణరూపమూ ఇందులో

ఒదిగి ఉంటుంది. రచయిత ప్రమేయానికి అవకాశం ఎక్కువ. కథకుని దృష్టికోణం పరిమితమై ఉంటుంది.

2. తటస్థం (objective) : ఇందులో రచయిత తప్పనిసరిగా బయటనే ఉంటాడు. నవల్లో పైకి ఎక్కడా కన్పించకుండా, ఎక్కడా లేనట్లు విశ్వసింపజేస్తూ తటస్థంగా ఉంటూ పాత్రల్ని ఆయాచర్యల్ని ఆవిష్కరింపజేస్తూంటాడు. రచయితవైపునుండి ఏ అభిప్రాయమూ వివరణమూ ప్రకటితం కాదు. వాస్తవమైన సమాచారంతో, వస్తుగతమైన ఆధారాలతో కథ సాగుతుంది. ఈ విధంలో ఎంతో ప్రభావయుతంగా కథనాన్ని నిర్వహించడానికి అవకాశం ఉంది. ఈ విధంగా దీనికొక విశిష్టత ఉంది.

3. విన్యస్తం (Assigned) : ఈ విధంలో ప్రతిదీ మార్గదర్శకంగా కథనం సాగుతుంది. కథలో జరిగేదంతా ప్రధానపాత్ర చైతన్యం (conscious) పై దృష్టితో రూపొందింపబడుతుంది. కథ ప్రథమపురుష (III person) లో సాగుతుంది.

4. సర్వజ్ఞం (omniscient) : కథకుడు సర్వజ్ఞుడుగా కన్పిస్తాడు. అన్నీ తనకు తెలుసునన్న భావంతో ప్రతి పాత్రపై బాహ్యాంతర్వీక్షణం కలిగి ఉంటాడు. తాను ఉత్తమం అనుకున్న నిర్ణయాన్ని చెబుతాడు. తాను కోరిన సందర్భాల్లో వ్యాఖ్యానిస్తాడు. ఒకే పాత్రకు ఎక్కువభాగం వినియోగింపబడుతుంది. తక్కిన పాత్రలు ఆ పాత్రను అనుసరించేట్లు చేయబడుతుంది. ఒక్కొక్కపుడు రచయిత పాత్రలను అనుసరించకుండా, వెనుకనుండి పరిశీలిస్తూ కథనం కొనసాగిస్తాడు. పాత్ర ఉద్దేశాన్ని తానే పూనుకొని వివరిస్తాడు. ఒక్కొక్కపుడు ఒక విధమైన పరిస్థితుల్లో పాత్రల్ని మనకు తెలీని అందని సామాజిక చారిత్రక వాతావరణంలో నిలుపుతూ, తన సామాజిక నైతిక విశ్వాసాలను స్పష్టంగానో సూచనగానో ప్రకటిస్తాడు. ఈ అపరిమితమైన స్వాతంత్ర్యం వల్ల దీనిలో విస్తృతమైన కోణకటకం (wide-angled lense) దృష్టి ఏర్పడుతుంది. పాఠకుడూ పాత్ర తరువాత పాత్రకు కదులుతాడు, రచయితను అనుసరిస్తూ మెల్లగా క్రమిస్తాడు. ఒక పాత్ర చైతన్య (conscious) స్ఫూర్తి నుండి మరో పాత్ర స్ఫూర్తికి రచయిత పాఠకుణ్ణి లాక్కొనిపోతాడు. ఇందులో రచయిత ప్రదర్శించే అసాధారణమైన వైవిధ్యాన్ని గుర్తించక తప్పదు. పాఠకుడింతకూ దూరంగానే ఉండవలసి ఉంటుంది. అంటే పాఠకుని ఆలోచనకు అవకాశం ఉండదు. పాఠకుడూ పాత్రచర్యకూ మధ్య రచయిత నిలచి ఉంటాడు. పాత్రచర్యకు సంబంధించిన కీలకమైన స్థానాలపై అదుపుతో వివరణం చేస్తూ ఉంటాడు. పాత్రముఖతః లేదా ఏదో సందర్భాన్ని పురస్కరించుకొని తన విజ్ఞానాన్ని ప్రదర్శించడం

ఇందులో విశేషం. ఇదంతా కథకునిలో సర్వజ్ఞత్వాన్ని భావింపజేసేవి. ఒక్కమాటలో చెబితే రచయిత ప్రమేయం ఏదో ఒక రూపంలో అపారంగా ఉంటుంది. అన్ని పాత్రల మానసిక స్థితులపైనా ఈ సర్వజ్ఞత్వం, చివరకు ఒక విధమైన బలవంతపు ప్రవేశంగానూ పరిణమిస్తుంది.

ఒక పాత్రలో రచయిత ఎప్పుడూ స్థిరంగా ఉండడు. విశ్వనాథ మరియు ఉన్నవ నవలల్లో దీన్ని గమనించవచ్చు. ఇది చాలాకాలం నుండి వస్తూన్న కథన శిల్పమే. ఈనాడు రచయిత కథనం చేస్తూంటే పాఠకుడు తన ఆలోచననూ, హేతువునూ నిర్ణయాన్ని కొనసాగిస్తూనే ఉంటాడు. అందువల్ల ఈనాడు సర్వజ్ఞ దృష్టికోణం కన్నా మరో దృష్టికోణం బహుముఖీనం అనుసరింపబడుతూంది.

5. బహుముఖీనం (Multiple) : సర్వజ్ఞ దృష్టికోణం మరియు విన్యస్త దృష్టికోణం ఉపయోగాలు ఇందులో సమ్మేళనం పొంది ప్రత్యేకత కలిగింది. ఆదరణకు పాత్రమయింది. పూర్వకాలం నవలలన్నీ సర్వజ్ఞదృష్టికోణంలోనే సాగాయి. ఇది పాతపద్ధతికిందే లెక్క. రచనాశిల్పంలో నవ్యత్వాన్నీ ఆకర్షణనూ అపేక్షించే కారణంగా బహుముఖీన దృష్టికోణం ఈనాడు ప్రచారంలోకి వచ్చింది.

ఇందులో ఒకే పాత్రను అంటిపెట్టుకొని కథనం జరిపే అవకాశము ఉంది. ఇది ఉత్తమపురుష (I Person) ఉపయోగించి లేదా విన్యస్త (III Person) దృష్టికోణంతోనూ ఉంటుంది. అయితే ఇతర పాత్రల చర్య కొంత లోపిస్తుంది. మరో లక్షణం, రచయిత ఒక పాత్రలో స్థిరపడతాడు. పాఠకుడు ఆ పాత్రలో మరో భూమికలో తిరుగుతుంటాడు. ఈ దృష్టికోణాన్ని మరో పాత్రకు మార్చేవరకు అక్కడే ఉంటాడు. ఈ మార్పులో వేగం ఉంటుంది. అదీ విశేషం. ఇది కుతూహలాన్ని రేకెత్తించే గుణంచేత పుష్టమై ఉంటుంది. ఈ సందర్భంలో రచయిత ఎంతో నైపుణ్యాన్ని ఉపయోగించవలసి ఉంటుంది.

పాత్ర చిత్రణను వివిధ పార్శ్వాల్లో విస్తృతీకరించి, వైవిధ్యాన్ని కూడా చూపడానికి ఉపకరిస్తుంది. ఇంకా ఉపపాత్రల విషయంలోనూ లోతుగా చిత్రించే అవకాశం ఉంది. ముఖ్యంగా ప్రతినాయకుడు ఉన్న కథల్లో, పరస్పర విరుద్ధమైన అభిప్రాయాల ప్రసారం జరిగే సందర్భాల్లో దీని ఉపయోగం ఎంతగానో కన్పిస్తుంది. అనుకూలంతోపాటు ప్రతికూల చిత్రణం సరిగా లేకపోతే సంఘర్షణలో బలం ఉండదు. నవల ఉద్దేశానికీ, పాచిత్రణకూ ఉన్నతి చేకూరదు కాబట్టి ఈ దృష్టితో ఈ విధం ఈనాడు హేతువు, ఆలోచన బలంగా పనిచేస్తున్న సందర్భంలో అనుసరణీయమౌతూంది. పాత్రచిత్రణకు

విస్తృతిని కల్పించే అవకాశం ఎక్కువగా ఉండడంతో పాఠకునిలో పాత్రచర్య (action) ను అగ్రభాగాన నిలిపేందుకూ, కథపట్ల అవధానతను కలిగించేందుకు సహకరిస్తుంది.

ఏకముఖ (Single) దృష్టికోణంలో సూక్ష్మమైన పరిశీలనకూ సమీపస్థితికీ కొంత అవకాశం ఉందేమాట నిజమే కాని క్షేత్రపరిధి నియమితమౌతుంది. బహుముఖ దృష్టికోణంలో కథనంవల్ల సర్వజ్ఞం మరియు విన్యస్తంలోని ఉత్తమలక్షణాలు సమన్వయాన్ని పొందుతాయి. వీటిని బాగా ఆవిష్కరించడానికీ జీవితంలోని సంక్లిష్టతనూ మరియు వైవిధ్యాన్నీ వాస్తవసదృశం (Verisimilitude) గా చిత్రించడానికి ఈ విధం ఎంతో తోడ్పడుతూంది.

దృష్టికోణం ఒక్కొక్కపుడు మానవేతరమైన విషయాల పరంగానూ ఉండవచ్చు. పశుపక్ష్యాదుల కథల్లో, సైన్సుఫిక్షన్‌లో ఈ విధమైన కథనశిల్పం అనుసరింపబడుతుంది.

## II

నవల్లో కథ చెప్పడంలో పూర్వజ్ఞాపకాల పద్ధతి, ఉత్తర ప్రత్యుత్తరాల పద్ధతి ప్రత్యేకంగా పేర్కోదగినవి.

1) పూర్వజ్ఞాపకాలు (Memories) : నవల్లో రంగంలోకి ప్రవేశించి అనేక కార్యాలొనరించే వ్యక్తి కథలో స్వీయస్మృతులు ఆధారంగా కథనం సాగుతుంది. వివిధ స్మృతుల పరంపరలో పైనుంచి క్రిందికిదిగే మెట్లవలె కథ మలచబడుతుంది. ఇది విషయాలపట్ల ఎంతో ఆసక్తిని కలిగించేదిగా, హృదయానికెంతో దగ్గరగా, వాస్తవమైన జీవితానుభవంతో చిత్రితమౌతుంది. 1) ప్రధానపాత్ర సంఘటననెదుర్కొనేప్పుడుఎలాంటి మనోభావాలను పొందిందీ, 2) కథ చెప్పేటప్పుడు ఎలాంటి మనోభావాలకు లోనైందీ, 3) కథలో ఉత్సుకత తగ్గాక, సందేహం తీరాక ఎలాంటి మనోభావాన్ని పొందేదీ – రచయిత గుర్తుపెట్టుకోవలసి ఉంటుంది. పూర్వజ్ఞాపకాల ప్రసారంతో కథనం జరిగేప్పుడు, వాటి అనుభవ ప్రాధాన్యాన్నిబట్టి అక్కడక్కడా పాత్ర వైయక్తికమైన స్పందనల్ని పొందడం జరుగుతుంది. దీనివల్ల వైయక్తిక పరిధి పెరిగి వస్తుక్షేత్రం పరిమితమయ్యే అవకాశం ఉంది. ఇది రచయిత ఉద్దేశాన్ని బట్టి శిల్ప విధానాన్ని బట్టి రూపొందుదుంది.

2) ఉత్తర ప్రత్యుత్తరాలు (Epistolory correspondance) : నవల్లో పాత్రలమధ్య జరిగే ఉత్తరాల రూపంలో కథనం జరుగుతుంది. ఇందులో రచయిత ఒక్కొక్క స్థితిలోని మనోభావాన్ని చిత్రిస్తూ ఉత్తరాల క్రమంలో కథాసూత్రాన్ని ఆవిష్కరించడం జరుగుతుంది. ఇందులో ఇతివృత్త నిర్మాణమూ పరిణామమూ ఉండదు. పాత్రలు తమ

వ్యక్తిత్వాలు ఆధారంగా మాట్లాడుతూ, రచన కొంత నాటకీయ ధోరణి కలిగి ఉంటుంది. ఒక ఉత్తరం మధ్యలో చదవడం మానేస్తే ఏదో లింక్ పోయి వెలితిగానూ ఉండవచ్చు. ఇందులో వాస్తవికతకు దగ్గరగా జీవితచిత్రణం ఉంటుంది. అన్నిటికంటే హృదయ రాగానికి (Sentiment) ప్రతిబింబంగా ఎక్కువ ఆకర్షిస్తుంది.

పాత్రల జీవితంలో కాలమంతా ఉత్తర ప్రత్యుత్తరాలతోనే కథ నడుస్తుంది. ఉత్తరాల అమరికలో ఒక ప్రత్యేకత ఉంటుంది. ఇది కథనాన్ని సాగించే ఆసక్తికరమైన సంఘటనల క్రమంలో పూర్వాపరమైన ఔచిత్యాన్ని దృష్టిలో ఉంచుకొనే ఉండాలి. కథనం చేసేది పాత్రలే. ఏ ఉత్తరానికది విడిగా ఉంటుంది. వీటిలోని కథాసూత్రాన్ని మెలకువతో లాక్కొనిపోవాలి. దీని అల్లిక వేరు. సాధారణమైన నవలకూ ఈ పద్ధతిలో ఉండే నవలకూ నిర్మాణంలో భేదం ఉంది. పాఠకుడు పొందే అనుభవమూ విచిత్రంగా ఉంటుంది. అందువల్ల రచయిత ప్రజ్ఞతో శిల్పదృష్టితో ఆసక్తికరంగా నిర్వహించగలిగినపుడే విజయవంతమౌతుంది.

ఫ్రెంచి రచయితలు ఈ పద్ధతిని ఎక్కువగా ఉపయోగిస్తారు. దీనికి కారణం ఫ్రెంచి భాష దీనికి బాగా తగి ఉంటుందని ఒక అభిప్రాయం ఉంది. చెకోవ్ మొదలైన రచయితలు దీనిపట్ల అంత సద్భావాన్ని కలిగి లేరు. ఈ పద్ధతిలో నవల వ్రాయడంవల్ల ఎన్నో ముఖ్యమైన అంశాలు కోల్పోవడం ఉన్నమాట నిజమే. సాధారణ నవల్లోని సంపూర్ణత లోపించేదీ వాస్తవమే. అయినప్పటికీ ప్రత్యేకమైన అస్తిత్వాన్ని కలిగిందిగా పేరొందింది

ఈ విధంగా రచయితను ఒక చట్రంలో బిగించివేస్తుంది. ఇది దీనిలోని బలహీనతగా పేర్కోవడం జరిగింది. దీన్ని నవల్లో ఒక వెరైటీగాను ఆమోదించినవారూ ఉన్నారు. థామస్ హార్డి వంటివారు దీనిపట్ల సదభిప్రాయాన్ని కలిగినవారు. దీని ఉపయోగాలూ పేర్కొన్నారు. నవల మొత్తంమీద దీన్ని అవలంబించినపుడు సిద్ధించే శిల్పరూపం వేరు.

ఈ పద్ధతిలో 1) ముందు ఒకవైపునుండి చెప్పేది వినడం, 2) తరువాత అవతలి వ్యక్తి ఏమనుకునేది భావించడం, 3) ఆపైన తాను అనుకున్నదే ఐతే తృప్తి, ఆనందం పొందడం, 4) లేకపోతే కారణాలు వెదకడం, సమాధానపడడం, సందేహపడడం నిర్ణయానికి రావడం, మొదలైన ప్రత్యేకమైన స్థితులకు దారితీస్తుంది.

కథనంలో అనుభవ ప్రసారం ప్రధానంగా ఇదొక విశిష్టమైన ధోరణిలో సాగే సృజనాత్మక శిల్పంగానూ పరిగణించడం జరిగింది. మొత్తంమీద దీని సంవిధానంలో

రచయిత నేర్పును ప్రదర్శించడానికీ, ప్రత్యేకమైన అనుభవ సమగ్రతగల కళారూపాన్ని సాధించే మనస్తత్వానికీ అవకాశం ఎక్కువ, ఈ గుణాలవల్ల స్థిరపడింది.

ఈ పద్ధతులన్నీ నవల్లో నవ్యతకోసం వైవిధ్యం కోసం పాఠకునిలో అనుభవ విశిష్టత కోసం రచయితలు చేసే ప్రయత్నాలు.

## III

ఈ పద్ధతుల్లో దేనికది ప్రత్యేకంగా స్వీకరించి కథనం చేయవచ్చు. ఇందులో కొన్నింటి కలయికతోనూ సాగించవచ్చు. కాలగతిలో అనేక కారణాలవల్ల ఒక్కొక్క విధం పాతబడిపోవచ్చు. అయినా కొందరు ఉపయోగిస్తూ ఉండనూ వచ్చు. కొందరు రచయితలు రచనలో తమ అనుభవాన్ని అణచుకోలేక మధ్యమధ్య ప్రకటిస్తారు. పాఠకుల్ని సంబోధిస్తారు. ఇంకా ఏదో వివరణకూ పూనుకుంటున్నారు. ఈనాటి దృష్టి వేరు. దీనికి వ్యతిరేకం. పాఠకులకే దీన్ని వదిలివేయడం జరుగుతుంది. పాఠకులు ఉండాలనే ఉద్దేశం, పాఠకులూ దీన్ని సహించే దశ దాటిపోయారు. అయితే ఆలోచనాపరుల్లో ఒక విమర్శ కూడా ఉంది. రచయిత పాఠకుల స్థాయిలో ఆలోచనకూ అనుభవంలోకీ రావాలనే వ్యాజంతో, సంక్షిప్తతను, సందేహాన్ని సృష్టించి తప్పుకుంటున్నాడనేది. ఈ కారణంగా రచయిత ప్రత్యక్షంగా ఏ జోక్యం లేకుండా కథన సందర్భంలో జాగ్రత్తగా సూచన చేయవచ్చుననీ, అయితే ఈ సూచనను బహు విధాలుగా శిల్పంలో భాగంగానూ చేయవచ్చునన్న మరో అభిప్రాయం ఉంది. ఏమైనా రచయిత ప్రమేయం చాలావరకు తగ్గిపోయి పాత్రలు స్వయంవ్యక్తిత్వాలతో ప్రవర్తించడం ముఖ్యమన్న అంశాన్ని అందరూ గుర్తించారు.

నవల్లో ఏ విధంగా కథనం చేయవచ్చు, వీటిలో ఏ ప్రణాళికకు ఏది మంచిది అనేది రచయిత నిర్ణయించుకోవలసిందే. ఏ దృష్టికోణమైనా రచనా నిర్మాణ క్రమంలో ఎంత సముచితంగా, ప్రయోజనవంతంగా ఉపయుక్తమైందన్నదే ముఖ్యం.

రచయిత ఎంతో లోకాన్ని చూస్తాడు. ఎంతో భావిస్తాడు. ఎందరో వ్యక్తుల్ని పాత్రల రూపంలో మలచి కథనం సాగిస్తాడు. ఇందులో వైవిధ్యం కోరడం సహజం. ఏదేని పాత్రద్వారా ఉత్తమపురుష లేదా ప్రథమపురుషలో కథనం సాగవచ్చు. ఉత్తమ పురుషలో కథనం ప్రత్యేకమైందైనా దీని పరిధి పరిమితమైంది. అయితే పాత్ర ఎంతో సన్నిహితంగా మాట్లాడుతూన్న భావం కలుగుతుంది. ఒక్కొక్కపుడు ఉత్తమ పురుష ప్రథమపురుషల సమీకరణం ప్రత్యేకమైన ప్రభావంకోసం జరగవచ్చు. కథారూపం

పూర్వస్మృతులతో చిత్రితమౌతూ ప్రతీకాత్మకంగానూ నాటకీయంగానూ ఆవిష్కృతం కావచ్చు. వివిధ పాత్రలు వివిధ కోణాల నుండి తమ తమ అనుభవాల్ని పురస్కరించుకొని కథనం సాగించవచ్చు.

రచయితలో కొత్తను అన్వేషించే కోణం, కొత్త కొత్త కథన విధానాలను ప్రవేశపెట్టేందుకూ, ప్రయోగం చేసేందుకూ దారితీస్తుంది. అభిలాషవల్ల శ్రద్ధవల్ల, అనుభవంవల్ల ప్రజ్ఞ సంవిధానంలో సమగ్రత సిద్ధిస్తుంది. కళాదృష్టివల్ల శిల్పంలో విశిష్టత చేకూరుతుంది. ఏ విధానాన్ని అవలంబించినా మొత్తంమీద నవల పాఠకుల్లో ప్రభావాన్ని ప్రకాశవంతం చేయడంలో అనుభవాన్నీ ఆలోచననూ విస్తృతం చేయడంలో భాగంగా పరిణమించడమే చరమ ధ్యేయం.

దృష్టికోణం (పాయింట్ ఆఫ్ వ్యూ) నవల్లో కథకుని దర్శనకేంద్రస్థానం రచయిత అవలంబించే కథనశిల్పస్థానం. నవల్లో ఆకర్షణకూ ఉత్సుకతకూ అందానికీ దారి తీసే నిర్మాణ కోణ రూపం అనవచ్చు.

# 10. ప్రతీక (Symbol) స్వరూపం

సాహిత్యంలో ప్రతీకల ప్రయోగం ఆధునిక కాలంలో విరివిగా కన్పిస్తోంది. ప్రతి సృజనాత్మక ప్రక్రియలోనూ ఎక్కడో ఒకచోట అంతో ఇంతో చోటుచేసుకొని కన్పిస్తుంది. ముఖ్యంగా కవిత్వంలో నవలల్లో కథల్లో నవ్యతకు చిహ్నంగా కళాత్మకమైన శిల్పపరిధిని విస్తృతం చేసే అంశంగానూ గుర్తింపుకు వచ్చింది. ఆధునికయుగంలో మనస్తత్వశాస్త్రంలో విస్తారమైన పరిశోధనలవల్ల ఎన్నో రహస్య విషయాలు బహిర్గతం కావడంతో విజ్ఞానం పెరగడంతో సాహిత్యంలో ప్రతీక విశిష్టమైన స్థానాన్ని పొందింది.

ప్రాచీనసాహిత్యంలోనూ అక్కడక్కడా ప్రతీకల వాడుక లేకపోలేదు. పౌరాణిక వాఙ్మయంలో అనేక సందర్భాల్లో తాంత్రిక మంత్రశాస్త్రాలకు సంబంధించిన ప్రతీక ప్రయోగం కన్పిస్తుంది. మానవుని సంస్కృతిలో మతప్రస్థానంలో, ప్రతీకలకెంతో ప్రాముఖ్యం ఉంది. పురాణగాథల్లో సముద్రం చేతన (కాన్షియస్‌నెస్)కూ, సర్పం ఒకప్పుడు శక్తి (భౌతిక) రూపానికీ మరొకప్పుడు ఆధ్యాత్మికశక్తిలోకి పరివర్తనం చెందే మానసికశక్తికీ, ఇంకొకప్పుడు ధర్మానికీ, చంద్రబింబం మనస్సుకూ ప్రతీకలుగా కన్పిస్తాయి. ధ్యానశక్తి కేంద్రాలుగా మంత్రశాస్త్రంలో ఎన్నో ప్రతీకలు తటస్థపడతాయి. వీటినిగురించి పరిశీలిస్తూ పోతే ఆదిమానవసంస్కృతీగర్భంలోకి ప్రయాణం సాగుతుంది. సమాజశాస్త్రంలో, నృశాస్త్రంలో (Anthropology), జానపదసాహిత్యంలో దీని ప్రాముఖ్యాన్ని అందరూ గుర్తించిందే. ఈ సందర్భంలో ప్రజల విశ్వాసాలకూ ఆచారాలకూ సంబంధించిన ఆసక్తికరమైన అంశాలెన్నో బయటికి వచ్చాయి. టోటమ్, టాబూ, పురాతన సంస్కృతికి సంబంధించిన చిహ్నాలు సంప్రదాయ పురాణ ప్రతీకలుగా నిలిచిపోయాయి.

ఆధునికయుగంలో నవల్లో ప్రతీకల ప్రవేశం విశిష్టమైన పాత్రనే నిర్వహిస్తోంది. ఇందులో నేరుగా చెప్పేదానికన్నా విశిష్టమైన అభివ్యక్తి పద్ధతిలో ఆవిష్కృతం అవుతుంది. ఇది ప్రతీకలనాశ్రయించింది. ఇది ఉద్యమరూపం దాల్చడంచేత ప్రతీకవాదంగానూ వ్యాప్తిలోకి వచ్చింది. ప్రతీక విశిష్టమైన అభివ్యక్తి విధానానికి సంబంధించిన సంవిధానం (టెక్నిక్)గా విమర్శితమైంది. సృజనాత్మక లక్షణంలో భాగంగానూ పర్యాప్తమయింది. ఒక భావం లేదా ఆవేశం ప్రత్యక్షంగా కాక పరోక్షంగా అభివ్యక్తం చేసే కళారూపంగా సృజనకార్యంలో అంతర్లీనమై భాసించే తత్త్వమూ దీనికి చేకూరుతుంది. రచయిత తనలో ఆవహించిన భావప్రపంచాన్నీ, ఆవేశరూపాన్నీ, ఆలోచనాశక్తినీ యథాతథంగా అనుకున్న ప్రమాణంలో అందించడానికి అశక్తంగానూ, అందింపగలిగినా అసంపూర్ణం

గానూ ఉంటుందనుకోవడంవల్ల కాల్పనికాన్ని ఆశ్రయించడం జరుగుతుంది. ఈ ప్రయత్నమే ప్రతీక పట్ల సౌముఖ్యాన్ని కలిగిస్తుంది. ప్రతీకను ఉద్గమింపజేస్తుంది. దీన్ని సముచితంగా యోజితం చేయడంచేత రచయిత తాను భావించింది కొంతవరకైనా సాధించిన తృప్తితోపాటు రచనకూ గుణాత్మకమైన రూపం సిద్ధిస్తుంది.

పందొమ్మిదవ శతాబ్దిలో ఫ్రాన్సులో ఇదొక ఉద్యమంగా విలసిల్లింది. ఈ ఉద్యమంలో ప్రముఖంగా పేర్కొదగిన రచయిత బాద్‌లేర్, దీన్ని కొనసాగించినవారు రిమ్‌బాడ్, వెర్‌లేన్, మలరెమ్‌తోపాటు వెర్‌లేన్, బాదలేర్, అతని అనుయాయులు ('Le Poete Voyant' (The Poet Seer) - Rimband) కవిని ఋషి స్థాయికి తీసుకువెళ్ళారు. కవి వాస్తవప్రపంచానికి వెనుకనున్న అతీతమైనదాన్ని చూడగల శక్తి కలవాడుగా భావించారు. ఆదర్శలోకాన్నీ, ఆలోచనా రూపాన్నీ సూక్ష్మసూక్ష్మంగా రచనలో ప్రవర్తితం చేయడానికి ప్రతీక ఎతో సహాయపడుతుందనీ విశ్వసించారు. వీరి రచనల్లో వైయక్తికమైన ప్రతీకలు గొప్ప చమత్కృతితో ఆకర్షణీయంగా రూపొందాయి. ఈ రచయితల ప్రభావం ఇంగ్లీష్ అమెరికన్ కవులపై బాగా ప్రసరించింది. మొదటి ప్రపంచ యుద్ధం (1914–18) తరువాత కాలం అంతా ప్రతీకవాదమయంగా విలసిల్లింది.

సాహిత్యానికి విలువ చేకూర్చే కొన్ని ఉత్తమ లక్షణాలవల్ల ఆ తరువాతనూ కవిత్వంలో, నవల్లో ప్రకాశించింది. వాటి ఉన్నతికి దోహదం చేసేదిగా నిలిచింది, ప్రాచీనంగా వస్తూన్న సంప్రదాయముద్ర వెనుక ఉంటూనే పాశ్చాత్య సాహిత్య ప్రభావంవల్ల భారతీయ సాహిత్యంలో అందులో తెలుగు నవల్లో ప్రతీకాత్మకత విశిష్టమైన గుణాధానానికి దారితీసిందనడంలో అనుమానం లేదు. పురాణగాథలు మతం, తత్త్వంతో కూడిన సంస్కృతినాశ్రయించిన సంప్రదాయ ప్రతీకలతోపాటు ఆధునిక యుగప్రభావంతోనూ కాల్పనిక వాతావరణంతోనూ వాస్తవ స్ఫూర్తితోనూ, సృజనాత్మక శక్తి ప్రసారానికి తగిన విధంగా ప్రతీకల ప్రయోగం సమృద్ధంగా కన్పిస్తుంది.

ప్రతీక సాహిత్యంలో కళాత్మకమైన విలువల్ని అధికం చేసేదిగానే రాణిస్తుంది. పూర్వం నవల్లో ఎక్కడో అక్కడక్కడ, తెలీకుండానో, తెలిసో చోటుచేసుకునేది. ఈనాడు ప్రయోజనతత్పరతతో విస్తృతంగా ప్రయుక్తమౌతూంది. దీన్ని సమర్థించేందుకు మానవుల క్రియాకలాపమంతా ప్రతీకాత్మకమే అనడం జరిగింది. 1890 తరువాత W.B. Yeats, T.S.Eliot, Dylon Thomas, E.E. Cummings & Wallace Steves. పేర్కొదగినవారు వాస్తవంగా మానవ క్రియాకలాపమంతా ప్రతీకాత్మకమే (Virtually all human activity is symbolic - Tindall) నని సాధారణీకృతం చేసే ధోరణి వ్యక్తమైంది. నవల మానవ

జీవితానికత్యంత సన్నిహితమైంది. కాబట్టి అంతర్గతంగా ప్రతీకను పర్యవసింపజేసే యోచన ఇందులో స్పష్టం. సాహిత్యమంతా ఒక విధంగా ప్రతీకాత్మకమే అన్నట్లే, అదేవిధంగా భాష కూడా అనీ అనడమూ జరిగింది. సాహిత్యం భాషాగతమైంది. మానవులు పరస్పరం మనోభావాలను ప్రకటించేందుకు ఉపయోగించే సాధనం భాష. ఇది ఒక క్రమంలో కొన్ని గుర్తుల ఏర్పాటువల్ల రూపొందింది. ఇది భాషాగతమైన మౌలికమైన అంశాన్ని స్పృశిస్తుంది. భాషాపరమైన దృష్టికీ, సాహిత్యపరమైన దృష్టికీ ఈ సందర్భంలో భేదాన్ని గుర్తించడం అవసరం. ప్రస్తుతం సాహిత్యపరంగా అభిలషణీయం. ప్రతీక సాహిత్యానికి ఆవశ్యకమైందిగానూ పరిగణించడం జరిగింది. నవల్లో ఇది ప్రవేశార్హమైంది గానూ విశదమైంది. ప్రత్యేక స్థితితోనూ సంపన్నమైంది.

సందర్భాన్నిబట్టి 1) గుర్తు, 2) ప్రతీక – పరస్పరం పరివర్తనం చెందుతాయి. మొదటిదాని విస్తరణరూపంగా రెండోది పరిణమించడమూ ఉంది. ఈ స్థితిలో గుర్తునూ, ప్రతీకనూ వేరువేరుగా స్పష్టంగా గుర్తించవచ్చు. గుర్తు (సైన్) పరంపరగా వచ్చేదీ అందరూ అంగీకరించేదీ ఒక నిర్దిష్టమైన భావాన్ని జ్ఞాపకం చేస్తుంది. బాణం ఒక దిశను సూచించేందుకు గుర్తు. ఒక్కొక్కపుడు ఒక విషయంపై ప్రత్యేకంగా దృష్టిని నిలిపేందుకు, గుర్తించడానికి ఉపయోగిస్తుంది. గుర్తుకు నిర్ణీత (ఆర్బిట్రరీ) లక్షణం ముఖ్యం.

ప్రతీక విషయంలోనూ చాలాకాలంగా ఒక అర్థం వాడుకలో ఉండవచ్చు. అది సంప్రదాయ ప్రతీకగా స్థిరపడుతుంది. అయినప్పటికీ సాహిత్యంలో ఆపైన ఇంకా ఊహకు అవకాశం కలిగిస్తూనే ఉంటుంది. మరో సందర్భంలో వేరే అర్థాన్ని స్ఫురింపజేసే అవకాశం తప్పకుండా ఉంటుంది. ఒకే ప్రతీక ఆ తరువాత మరొకరిచేత వాడుకలో సందర్భాన్నిబట్టి కొత్త అర్థాన్ని ఉద్దేశించవచ్చు. ఈ భేదాన్ని స్పష్టంగా గుర్తించి, మొదటిదాన్ని నిర్ణీత (ఆర్బిట్రరీ) ప్రతీక అని, రెండోదాన్ని సాహిత్య (లిటరరీ) ప్రతీక అనీ పేర్కొనడం జరిగింది.

ఒకప్పుడు సంకుచితమై స్థిరపడిన గుర్తు లేదా చిహ్నం, ఆ తరువాత పరిధిని దాటి విస్తృతిని పొంది సాహిత్య ప్రతీకగా ప్రతివర్తనం పొందవచ్చు. ట్రాఫిక్‌ను నిలిపే ఎరుపురంగు అపాయానికి గుర్తు. ఇది సాహిత్యంలోనూ ప్రయుక్తమై నిర్దిష్టపరిధిని దాటి సంఘర్షణకూ విప్లవానికి ప్రతీకగా విస్తృతదశను పొందింది. అదేవిధంగా ట్రాఫిక్‌ను ముందుకు సాగించే క్షేమానికి (నిరపాయానికి) గుర్తు ఐన ఆకుపచ్చ రంగు సమృద్ధికీ, సౌభాగ్యానికి యోజితమైంది.

గుర్తు, ప్రతీక రెండూ ఉపయోగించే సందర్భం, ఆశించే ప్రయోజనం బట్టి వేరువేరు లక్షణాలతో మనకు అవగతికి వస్తాయి. గుర్తు ఒకదానికి బదులు మరొకటి ఒకటి:ఒకటి (1:1) ప్రాతిపదికపై ఉంటుంది. ప్రతీక ఎప్పుడూ ఒకదాని బదులు మరొకటిగా ఉండదు. తనతో సంబంధం వీడకుండా ఆపైన మరో విశిష్టమైనదాన్ని స్మరింపచేస్తుంది, ఆలోచింపచేస్తుంది. ఇది బహ్వార్థకం. గుర్తుకు పూర్తిగా భిన్నమైన స్థితిని పొందుతుంది. వివిధ వ్యక్తుల ఆలోచనాశక్తినిబట్టి ఎన్నో విధాలైన అర్థాలను భావింపచేసే శక్తినీ కలిగి ఉంటుంది. ఒకే ప్రతీక, అర్థసముచ్చయాన్ని ఏకకాలంలో స్ఫురింపజేసే శక్తి కలిగి ఉంటుంది.

ప్రతీక 1) వాస్తవికం అనీ, 2) ఆదర్శకం అనీ రెండు విధాలు. వాస్తవికం మానవజీవితంలో భౌతికమైన ప్రాపంచిక వాస్తవాన్ని ఆశ్రయించింది. కోట రాచరికానికి ప్రతీక. ఇల్లు రక్షణకూ భద్రతకూ ప్రతీక. రెండోది ఆదర్శకం, అతీతం, పరం, దివ్యం, శ్రేయం మొదలుగా ఉత్కృష్టమైన లక్షణాలు కలిగింది. భూమి మాతృశక్తికీ, ఆకాశం ఆదర్శానికీ, హంస ఆత్మకూ ప్రతీకలు. మరోవిధంగానూ విశ్లేషించవచ్చు. ఎంతోకాలం నుండి ఉపయోగంలో ఉంటూ స్థిరపడినవీ, సంస్కృతిలో భాగంగా నిలిచినవీ, పూర్వగాథా సంపన్నమైనవి, సంప్రదాయ (ట్రెడిషనల్) ప్రతీకలు. ఉదయించే సూర్యుడు కొత్త జన్మకూ, అస్తమించే సూర్యుడు మృత్యువుకూ వెలుగు జ్ఞానానికీ, చీకటి అజ్ఞానానికీ, ఆదిశేషుడు విద్యకూ, పాము సంతానానికీ ఇలా ఎన్నో ఉన్నాయి. ఇవే వివిధ సందర్భాల్లో వివిధమైన అర్థాలను భావింపజేస్తూ ఆలోచనకు శక్తినీ దీప్తినీ కలిగిస్తాయి. రచనలో అర్థవిస్తృతికీ భావనవ్యతకూ కారణమవుతాయి.

ఇవి ఒక విధం. మరోవిధంతో రచయిత స్వతంత్రమైన వ్యక్తిత్వాన్నిబట్టి ఎంతో కాల్పనికతనూ, ఆలోచనాస్ఫూర్తినీ సంతరించుకున్నాయి. వైయక్తిక లేదా వ్యక్తిగత (పర్సనల్) ప్రతీకలు. ఇవి మొదట్లో కష్టంగా ఉండొచ్చు. అర్థం కాకపోవచ్చు. కాలం గడిచేకొద్దీ, వాడుకనుబట్టి సుగమత్వాన్ని పొందుతాయి. షెల్లీ, కీట్సు మొదలైన కాల్పనిక కవుల రచనల్లో వ్యక్తిగత ప్రతీకలు చాలా ఎక్కువ. తెలుగులో కృష్ణశాస్త్రిని ప్రముఖంగా పేర్కోవచ్చు. ఒక భావచిత్రంలో పూవు బహ్వార్థకంగా జీవితానికీ, స్త్రీకీ, సౌందర్యానికీ ప్రతీకయై ఉండవచ్చు. చలం "మైదానం" జీవితంలో కోల్పోయే స్వేచ్ఛకు ప్రతీక. విశ్వనాథ "చెలియలి కట్ట" నియతమైన జీవితానికి ప్రతీక.

మెల్‌విలె నవల మాబిడిక్‌లో తిమింగలం బహ్వార్థకమైన ప్రతీకగా నిలిచింది. 1. తిమింగలం అంటే బృహత్కాయంతో శక్తివంతమైన భౌతికరూపం. 2. తెల్లజాతి

రక్తమాంసగతమైన భౌతికరూపం. 3. ఆత్మయొక్క ప్రస్థానం (దీన్ని చాలామంది నిరాకరించారు). 4. నృశాస్త్ర-సాంఘిక-మనస్తత్వపరమైన అర్థాలు. 5. ముఖ్యంగా ఫ్రాయిడ్, యుంగ్ మనస్తత్వపరమైన సిద్ధాంతాల అన్వయం. ఈ విధంగా అనేకమైన విమర్శలు వివిధస్థాయిల్లో వెలువడినాయి. విశ్వనాథ-వేయిపడగలు 1) పరిపూర్ణ సనాతనధర్మానికీ, 2) అవ్యక్త సామూహికచేతనలోని పురారూపానికీ (ఆర్కిటైపు), 3)అధర్మాన్ని సహించని ఆత్మశక్తి నిక్షిప్తమైన భౌతికరూపానికీ, 4) కర్మసాక్షి భౌమాకృతికీ, 5) కుటుంబానికీ చివరకు మిగిలిన రెండు పడగలు దాంపత్య ధర్మానికీ, ఈ విధంగా అనేకమైన వ్యాఖ్యానాలకు అవకాశమిచ్చే ప్రతీకగా నిలిచింది. ఈ ప్రతీకలు వాస్తవానికి దూరమై నిత్యజీవితం నుండి తప్పించుకునే ప్రయత్న పర్యవసానాలనే అభిప్రాయమూ ఉంది. ఇది నిజం కాదు. సాహిత్యంలో అందులోనూ నవల్లో (పై పరిశీలననుబట్టి) జీవితం ఆధారంగా, వాస్తవస్ఫూర్తితోనే ప్రవృత్తమౌతుందన్న విషయం మరచిపోకూడదు. జీవితంలోని అనేక ముఖాలను స్పృశించే లక్షణం దీనికి బాగా ఉంది. నవల్లో భావ జగత్తుకు శక్తివంతమైన అర్థస్ఫూర్తినీ కళారూపానికి గాఢత్వాన్నీ కలిగిస్తుంది.

## II

అదృశ్యమానమైన ఏదేని వస్తువుకో భావానికో దృశ్యరూపసంకేతమే ప్రతీక. మనస్సులోని ఆలోచనలు, ఆవేశాలు నేరుగా వర్ణించకుండా మూర్తమైన (కాంక్రీట్) భావరూపాల పోలికతోనో సూచనతోనో వ్యక్తీకరించే కళారూపం-ప్రతీకవాదం. పాఠకునిలో ప్రకృతంతోపాటు మరో భావప్రపంచాన్ని ఆవిష్కరిస్తుంది.

ప్రతీక నిర్మాణంలో వాస్తవాన్ని వీడకుండానే అతీతమైన భావప్రపంచంలోకి ప్రవేశింపజేసే లక్షణం ఉంది. ఒక్కొక్కప్పుడు మూర్తలక్షణానికి భిన్నంగా వర్ణించే వస్తుసామ్యంలో నిబిడమైన భావనచేత అమూర్త (ఎబ్స్ట్రాక్ట్)మైన లక్షణం చోటుచేసుకోవచ్చు. ప్రతీకలో అర్థం అవగతికి వచ్చేముందు దాని రూపం అనుభవంలోకి వస్తుంది. అనుభవాన్నిబట్టి ఆపైన హేతువు పనిచేస్తుంది. రచయిత సాధారణంగా సమగ్రంగా వ్యక్తంచేయలేని లేదా గుప్తంగా ఉంచదలచుకున్న భావం వాస్తవాన్ని స్పృశిస్తూనే అతీతమైన ప్రపంచంలో మరోరూపాన్ని అందుకోవడం ఇందులో ముఖ్యం. దీనిలో గాఢత్వమూ, గభీరత్వమూ మొదలైన విశిష్టగుణాలు ఒక ప్రమాణంలో ఆలోచనాస్థానీయాలై ఉంటాయి.

రచయిత మదిలో భావం లేదా ఉద్దేశం, పరోక్షంగా అర్థవంతమూ విశిష్టమూ ఐన కళాత్మకరూపంలో, ఆవిష్కృతమై పాఠకుల మనస్సును ఆకర్షిస్తుంది, ఆలోచింప చేస్తుంది. దీన్ని మరొకమారు స్మరిస్తే, రచయిత మనస్సులో నిబిడంగా ఉన్న భావలోకాన్ని

వ్యక్తం చేయడానికి నవల్లో సాధారణ కథాజగత్తు అసమగ్రంగా అనిపించడంవల్ల కళాత్మకతను సిద్ధింపజేసే ఉద్దేశంతోనూ, పాఠకుల్ని ఆలోచింపచేయాలన్న అభిలాషవల్లనూ ప్రతీక అవతరిస్తుందని నిస్సంశయంగా చెప్పవచ్చు. వాస్తవ జగత్తునుండి భావనాజగత్తు లోకి లేదా ఆదర్శలోకంలోకి చొచ్చుకొనిపోయేందుకు చేసే ప్రయత్నమే ఐనా, దీని నిర్మాణ రూపం నవల్లో వాస్తవతలంపైనే స్థిరంగా ఉంటుంది. దీని ఉనికి ఇతివృత్తం-పాత్ర అభిప్రాయం సంఘటనలు వాతావరణం మొదలైన అనేక అంశాలకు సంబంధించి ఉంటుంది. నవల్లో దేన్నైనా మరచిపోవచ్చుగాని ప్రతీకను సులభంగా మరచిపోలేం. దీని ప్రభావం ఎంతో శక్తిమంతమైంది. నవల ఆరంభం నుండి సమాప్తిదాకా, ఆఖరికి పేరుపెట్టడంలోనూ ఏ స్థానంలోనైనా ఉండవచ్చు. ఏ అంశానికైనా దీప్తిని కలిగించేదిగా చేయొచ్చు. ప్రతీక నవల పరిణామంలో ప్రముఖ్యంగా పేర్కొందగింది.

ప్రతీక పూర్వం నుండి అంతో ఇంతో వాడుకలో ఉన్నా దాని స్థానం చాలా పరిమితమైంది. కాల్పనికయుగంలో మనస్తత్వశాస్త్రపరిచయంతో, నవ్యతకోసం అన్వేషణలో, ఆధునిక వాతావరణంతో అతివిస్తృతమైన పరిధినీ వైవిధ్యాన్నీ సంతరించుకుంది. దీనితో ప్రతాకాత్మక నవల వాస్తవంనుంచి కాక కాల్పనికం నుండి అవతరించిందన్న అభిప్రాయం వ్యాప్తిలోకి వచ్చింది. ఇందులో కొంత నిజం లేకపోలేదు. శిల్పవిషయంగా చూస్తే ఒక్కొక్కపుడు వాస్తవభూమినుండి భావలోకానికి మలుపు తిరిగేటప్పుడు భావరూపాలు కొంత అస్పష్టమైన ధోరణినీ, అమూర్తమైన స్థితినీ పొందే వీలుంది. మెలరమ్ పేర్కొన్నట్లు ఈ సందర్భంలో అమూర్తానికీ, మూర్తానికీ మధ్య సాదృశ్య సమ్మేళనం ముఖ్యం. ఇది కవిత్వానికి ఎక్కువగా అన్వయిస్తుంది. నవల్లో ఈలాంటి సందర్భాలు రావు. కవిత్వంలోనే మొదట దీని ప్రవేశం-వ్యాప్తి జరిగింది. ఇటీవల నవల్లో దీనికి ప్రాముఖ్యం లభించింది. నవల స్థాయిని పెంచే, ప్రకాశమానం చేసే అవసరమైన లక్షణంగానూ భావితం అవుతూంది. పూర్వకాలంలో గొప్ప రచయితలు టాల్‌స్టాయ్, విక్టర్ హ్యూగో, బాల్జాక్ మొదలైనవారు ప్రతీకపై ప్రత్యేకమైన దృష్టి లేకుండానే రచనలు చేశారు. ప్రతీకపై దృష్టిలేనివీ, తటస్థమైన దృష్టితో వ్రాసినవీ ఎన్నో ఉత్తమ రచనలు లేకపోలేదు. వారిలో ప్రజ్ఞావిశేషంచేత ప్రతీకలు ప్రవేశించాయి, సాహిత్య సమాలోచనకూ దారితీసాయి తెలుగులో వీరేశలింగం, చిలకమర్తి, ఉన్నవ, బాపిరాజు మొదలుగా పేర్కొనవచ్చు. ప్రతీకపై ప్రత్యేకభావన లేకపోయినా రచనలో అనేక కారణాలవల్ల అనుకోకుండా ప్రతీక చోటు చేసుకుంటుంది కూడా.

జీవితంలో అన్నిరంగాల్లో మార్పులు వచ్చినట్లే సాహిత్యంలోనూ వచ్చాయి. ఈ మార్పులు రాకపూర్వం జీవితం సుఖంగా లేదా? అని ప్రశ్నించవచ్చు. ఇది ఇట్లా ఉంచి ఈ మార్పుల ప్రభావానికి దూరంగా ఉంటూ ఇప్పుడు జీవితంలో సుఖం పొందగలమా? అనేది వేరే ప్రశ్న. మొట్టమొదట ఈ మార్పులను కాదని దూరంగా ఉండలేం. ఆధునిక యుగంలో ప్రతీకవాదం ఒక ఉద్యమంగానూ విలసిల్లడంతో, సాహిత్యంలో దీని ప్రభావం పరిణామంలో భాగమై నిలిచింది. పోనుపోను మార్పును కోరే లక్షణంతోపాటు కళాత్మకతనూ సంతరించుకోవడం విశేషం.

ప్రతీక నవల్లో ముఖ్యంగా ఆసక్తిదాయకమైన ఆధునిక లక్షణంగా పరిశీలనార్హమైన ప్రశస్తినీ పొందింది. ప్రతీకను గుర్తించి శాస్త్రపరిచయంతోనో, సంపూర్ణ పరిజ్ఞానంతోనో అనపేక్షంగానో ఏ విధంగా ప్రయుక్తమైనా, చారిత్రక కారణాలవల్ల అనివార్యంగా వచ్చే మార్పుల్ని తనలో విలీనం చేసుకొని ప్రస్థానం సాగించే నవలలో గుణాత్మకమైందీ, ఉన్నత విలువలకు దోహదం చేసేదీ, ప్రజల మన్ననల్ని పొందిందీ. విమర్శకుల్ని ఆకర్షించిందీ.

## II

నవల్లో ప్రతీక కథాపరిధిలోనే నిర్మాణ రూపంలోనే భావితం కావాలి. కథాపరిధికి భిన్నంగా లేదా ఏ మాత్రం సంబంధం లేకుండా యోజితం కాకూడదు. ఇది సాధారణ విషయం. దీని అవలంబించకపోవడంవల్ల అసలు ప్రయోజనం దెబ్బతింటుంది. అస్పష్టతకు దారితీస్తుంది. పాఠకుల్లో వైముఖ్యాన్ని కలిగిస్తుంది. ఇక విమర్శకులు ప్రతీకకెన్నో అర్థాలు అన్వేషించి ఏదోవిధంగా సమన్వయం చేయాలనే డొంకతిరుగుడు ప్రయత్నమూ చేయకూడదు. తాను ఆలోచించేవి ఎంతవరకు నవలకు సంబంధించినంతవరకు సముచితంగా నిలబడేదీ జాగ్రత్తగా వివేచించాలి.

అధివాస్తవికకవిత్వంలో ప్రతీక నిర్వహించే పాత్ర స్పష్టమే. హేతువుకన్నా అనుభూతికీ, చేతనకన్నా ఉపచేతనకూ ప్రాముఖ్యం ఎక్కువ. ఈ ధోరణి ఎంతో సాంద్రంగానూ వేగంగానూ ప్రసరించింది. నవల్లో అనుభూతిస్పందన వెనువెంటనే ఆలోచనావేగం అందుకుంటుంది. దీనితో ప్రభావరూపం మారుతుంది. నవల క్లిష్టతకన్నా సారళ్యాన్నీ, క్లుప్తతకన్నా వివరణకూ ప్రత్యేకతను పొందింది. నిర్వహణంలో కవిత్వం నుండి భిన్నంగా ఉంది. వస్తువు-ఇతివృత్తం-పాత్ర-సంఘటనలు మొదలైన అంశాల సంబంధంతో సంశ్లిష్టత ఉంటుంది, అయితే సారళ్యానికీ అవకాశం ఎక్కువే. ఈ దృష్టితో చూస్తే వస్తువుకో, భావానికో ప్రాతినిధ్యం వహించే ప్రతీక నవల్లో ఏ మాత్రం కళాత్మకతకు భంజకం కాదు. ఇంకా సమాజంలో మానవీయసంబంధాలు, మనస్తత్వం ప్రవర్తనం -

ప్రభావితం చేసే పరిసరాలు, రచయిత సిద్ధాంతాల ఆవిష్కారంలో ప్రతీక ఎంతో రమణీయంగా ఉపయుక్తమౌతుంది. సాధారణం నుండి గహనమైన విషయాలదాకా దీని వర్తనం వ్యాప్తమైంది. విశిష్టమైన సంక్లిష్టమైన స్థితి లేదా పాత్ర చిత్రణంలో దీన్ని ఉపయోగించినపుడు రచనకు కలిగే కళారూపం ఉన్నతంగా ఉంటుంది.

ఒక ప్రతీక అర్థం ఇదమిత్థమని తేల్చేసి ఆలోచనల్ని మూసేయలేం. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క విధమైన అర్థాన్ని రచయిత ఉద్దేశం, కథాసందర్భం, పాత్రచిత్రణం, సంఘటనతీరు, వాతావరణకల్పనంబట్టి, అనేక విధాలుగా స్ఫూర్తికి వస్తుంది. ఇది పాఠకుని అనుభవశక్తిపైనా, ఆలోచనావైఖరిపైనా ఆధారపడి వుంటుంది. ఇది నియతమైన ఏదో స్థితికి ఒదిగిపోయి సంకుచితం కాకపోవడంవల్ల ఎప్పటికీ నవ్యత, ఆకర్షణ కలిగి ఉంటుంది. అలంకారంవలె ఏదో స్పష్టమైన లక్షణంలో ఒదిగిపోదు. ఏదో లక్షణానికి అన్వయించి చూసుకోవడమూ కుదరదు. దీని అన్వయం సమయోచితంగా చేయవలసి ఉంటుంది. అర్థ సందర్భోచితంగా చెప్పుకోవలసి ఉంటుంది.

మనస్తత్వశాస్త్రంలో ఫ్రాయిడ్, అడ్లర్, యుంగ్-పరిశోధనలవల్ల మానవ జీవితాన్ని గురించి ఎన్నో ఆశ్చర్యకరమైన ఆసక్తికరమైన అంశాలు బయటికి వచ్చాయి. ఫ్రాయిడ్ సైకో-ఎనాలిసిస్‌లో అణచివేతలు, ప్రతిఘటనలు, లైంగికప్రవృత్తులు, కలలు గురించి-అవ్యక్తచేతన వేసే మారువేషాలపై క్షుణ్ణంగా శాస్త్రీయమైన చర్చలు జరిగాయి. ఈ రహస్య శోధనలో, అన్వేషణలో ప్రతీకల పట్టికకూడా సిద్ధం కావడం మరో విశేషం. ఇది ప్రతీకవాదానికి మనస్తత్వపరంగా శాస్త్రీయమైన బలమైన ఆధారాన్ని కలిగించింది. ప్రతీకల నిర్మాణానికి మార్గం సులభమైంది. దీనిపట్ల ఆసక్తిని పెంచింది. ఆలోచనకు దారితీసింది.

అడ్లర్ ఇండివిద్యువల్ సైకాలజీలో వైయక్తికమైన మనస్తత్వం - ప్రవర్తనం (బాల్యం-పరిసరాల ప్రభావంతో రూపొందే) ఆత్మన్యూనత, ఆత్మాధిక్యతాభావం, నవల్లో పాత్రచిత్రణపై గొప్ప వెలుగును ప్రసరించింది. వ్యక్తిగతమైన మనస్తత్వపు లోతుల్ని బాగా ఆవిష్కరించడానికీ ప్రతీకల సహాయం తీసుకోవడమూ జరిగింది.

యుంగ్ సామూహిక అవ్యక్తచేతన (కలెక్టివ్ అన్‌కాన్‌షెస్‌నెస్)లో, పరిశోధనవల్ల ప్రతీక వైయక్తిక పరిధినుండి సామూహిక పరిధిలోకి పయనించడం జరిగింది. సమస్త మానవజాతి మానసికమైన విచిత్రాకృతులకు - సామూహిక అవ్యక్తచేతనలో నిక్షిప్తమైన కీలకాలు కారణాలుగా గుర్తించడంతో ప్రతీక పరిధి చెప్పరానంతటి విస్తృతినీ గభీరత్వాన్నీ పొందింది. వైయక్తిదశనుండి సామూహికదశకు తీసుకువెళ్ళడంతో ఇతర మానవ శాస్త్రాలతో పరిచయమూ అనివార్యమౌతుంది. చేతన-ఉపచేతన-అవ్యక్తచేతన-సామూ

హిక అవ్యక్తచేతన స్థాయిలో ప్రతీకవర్తనం ఎంతో వైవిధ్యవిలసితమైంది. దీనితో నవల్లో సామాజిక చిత్రణం, వివరణంతో పాటు దర్శనరూపానికీ కొత్తలోకం అవతరించింది.

ప్రతీక చేతనకూ – అవ్యక్తచేతనకూ వంతెనవలె అయింది. ఈ రెండింటినీ ఒక విధంగా సంయోజించే చక్కని రూపంగానూ భావితమైంది. ఆధునికయుగంలో కేవలం అభివ్యక్త సాధనంగానే కాక సృజనవికాసంలో అంతర్భాగమై, నవలకు ఉన్నతమైన స్థాయిని సంపాదించిపెట్టింది. ఇది సరియైన ఉపయోగంలోకి రావడం రచయిత ప్రజ్ఞపై ఆధారపడి ఉంది. ప్రతీక, నవల్లో వస్తువులో విస్తృతికీ, ఇతి వృత్తంలో ఎత్తుకీ, పాత్రలో లోతుకీ తోడ్పడుతుందనడంలో సందేహం లేదు. అంతర్గతమైన, అంతర్లీనమైన అంశాల్ని కళాత్మకంగా నిర్వహించడానికెంతో తోడ్పడుతూంది. నవల గురించి సమాలోచనంలో, గుణాత్మకతకు దారితీసే ముఖ్యమైన అంశాల్లో ఇదొకటి. కొత్తను అన్వేషించే మనస్తత్వం, కళాదృష్టిలో విశిష్టత, మనస్తత్వ ప్రకాశనంపై అభిలాషతో నవలను గాఢంగా తీసుకొనే లక్షణంతో ప్రతీక ఎన్నటికీ ప్రాచుర్యాన్ని కలిగేఉంటుంది. నవల్లో గుణాత్మకతకే తోడ్పడుతుంది.

# 11. చైతన్యస్రవంతి (Stream of Consciousness)

చైతన్యస్రవంతి సంవిధానం మనస్తత్వశాస్త్ర ప్రభావంవల్ల సృజనాత్మక సాహిత్యంలో ప్రవేశించింది. కొత్త ప్రపంచాన్ని దర్శించే అవకాశమూ కలిగింది. పాశ్చాత్య సాహిత్యంతో పరిచయం వల్ల కొత్తదనాన్ని అన్వేషించే లక్షణంతో సుప్రసిద్ధ రచయితలు శ్రీశ్రీ, బుచ్చిబాబు, గోపీచంద్, రాచకొండ తమ రచనల్లో దీన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఈ సంవిధానాన్ని తెలుగులో సముచితంగా నిర్వహించిన నవల నవీన్ 'అంపశయ్య' పేర్కోదగింది. దీన్ని నిర్వహించడానికి మనస్తత్వ శాస్త్ర పరిజ్ఞానం అవసరం. దీనితో ఎంత క్షుణ్ణంగా పరిచయం ఉంటే, అంత చక్కగా తమ లక్ష్యమూ పరిమితులూ అర్థమవుతాయి. పాత్రచిత్రణలో లోతునూ వేగాన్నీ కలిగిస్తూ, కొత్తదనాన్ని భావింపజేసే స్థితీ చేకూరుతుంది. ఫ్రాయిడ్, అడ్లర్, యుంగ్ మనస్తత్వశాస్త్రవేత్తల గొప్ప పరిశోధనల కృషి ఫలంగా మనఃప్రపంచానికి సంబంధించిన చైతన్యరూపం గురించి ఎన్నో రహస్యాలు బయటికి వచ్చాయి. ఎంతో ఆలోచనకూ అవకాశం కలిగింది. జీవితాన్ని వెనుకనుండి నడిపే అదృశ్యమాన చైతన్యశక్తుల పాత్ర గురించి, అవగాహనలో సంపూర్ణమైన మార్పు వచ్చింది. ఇది ఆధునిక సాహిత్యానికి పరిహరింపరాని లక్షణంగానూ నిలిచింది.

'చైతన్యం' అనేమాట ఇక్కడ కాంషస్‌నెస్‌కు అనువాదం. దీనికి నానార్థకమైన అర్థాలున్నాయి. ఇందులో కొన్ని 1) అనుభవపూర్వకమైన జ్ఞానరూపం అనీ, 2) మెలకువ అనీ, 3) వ్యక్తి కోరికల ఆలోచనల అనుభూతుల సమాహార రూపం అనీ, 4) ఒక విషయాన్ని గురించి మనస్సుకు గల జ్ఞానం అనీ, 5) ఆలోచన-అనుభూతులకు సంబంధించిన స్ఫూర్తి అనీ, 6) మనస్సుయొక్క క్రియాత్మకమైన స్థితి అనీ, ఎంతైనా వివరిస్తూ పోవచ్చు. ఎంత చెప్పినా ఎంతో కొంత మిగిలే ఉన్నట్లు అనిపిస్తుంది. ఏమైనా సంగ్రహంగా ప్రస్తుత విషయాన్నిబట్టి మనోవ్యాపారం యొక్క శక్తిరూపంగా భావించవచ్చు. కాంషస్‌నెస్ అంటే చైతన్యం అనీ ఈ సంవిధానంలోని పరమమైన ఉద్దేశాన్ని దృష్టిలో పెట్టుకొని, తెలుగులో శ్రీశ్రీ, బుచ్చిబాబు వంటి ప్రముఖులు స్ట్రీమ్ ఆఫ్ కాంషస్‌నెస్ అంటే "చైతన్యస్రవంతి" అనీ ప్రయోగించడం జరిగింది.

ఒక వ్యక్తి చైతన్యంగా ఉన్నాడంటే అతనిలోని మానసికమైన క్రమగతి (మెంటల్ ప్రాసెస్) జరుగుతూందని అర్థం. ఒకరు అచేతనంగా (అన్-కాంషస్)గా ఉన్నారంటే ఈ క్రమగతి విరామాన్ని పొందడమో లేదా నిరోధింపబడడమో జరుగుతుంది. మిక్కిలి గాఢమైన నిద్రలోనూ, స్పృహతప్పినపుడూ ఇది సంభవిస్తుంది. వ్యక్తి చైతన్యంగా ఉన్నాడంటే

అతనికి మానసికమైన స్థితి గురించి జ్ఞానం లేదా ఎరుక (ఎవేర్‌నెస్) కూడా వర్తిస్తుంది. తాను ఆలోచిస్తున్న, అనుభవిస్తున్న జ్ఞానమూ కొంతవరకు ఉంటుంది. బాగా తెలివిలో ఉన్నదానికీ, అసలే తెలివిలో లేనిదానికీ మధ్య ఎన్నో దశలున్నాయి. నిద్ర చెందిన వ్యక్తి కేవలం అచేతనంగా ఉండాలనేం లేదు. ఎందుకంటే అతడు కనే కలలు, వాటిని గురించిన అనుభవ ముద్ర ఒక్కొక్కపుడు నిద్రపోయేప్పుడు పొందిన స్పర్శ, ధ్వని మొదలుగా విపరీతమైన లేదా విశిష్టమైన అనుభవజ్ఞానం ఉంటుంది. అందువల్ల చైతన్యం అంటే వ్యక్తిలో ఎక్కడో స్థిరంగా నిలచి ఉండేది కాదు. అతనిలో మానసికంగా జరుగుతూన్నది, సరిస్తూన్నది అని భావం.

ఫ్రాయిడ్ సిద్ధాంతాన్నిబట్టి చైతన్యస్వరూపం మూడు విధాలు. 1) కాంషస్– మొదటి చైతన్యస్థాయి, 2) ప్రి–కాంషస్ – చైతన్యం క్రిందిస్థాయి. చైతన్యం వెనకనే ఉండేది. వ్యక్తికి ఆ సమయంలో ఒక విషయం జ్ఞప్తికి ఉండకపోవచ్చు. కాని వెంటనే దాన్ని స్మృతిపథానికి తెచ్చుకోగల ఆలోచనకు స్థానమైంది. 3) అన్–కాంషస్ – ఇది చైతన్యం అట్టడుగుకు చెందింది. ఎంతో లోతైంది. సాధారణ పరిస్థితుల్లో బయటికిరాని విషయాలు, ఎప్పటివో ఇందులో పడి ఉంటాయి. ఈ స్థాయి చాలా ముఖ్యమైంది. సాహిత్యంలో ఇది సముద్రంగానూ, సరస్సుగానూ, లోతైయ లోయ, లోయలో సరస్సుగానూ అక్కడి సందర్భాన్నిబట్టి రచయిత ఆశించే ప్రయోజనాన్నిబట్టి ఎంతో ప్రతీకాత్మకంగా చిత్రితమవడం గమనించవచ్చు. నీరు సాధారణంగా అవ్యక్తచేతనకు ప్రతీకగా కనిపిస్తుంది. లోయలో సరస్సు, చేతనలో లోతైనపొరలో దాగిన పురాభావ (అర్కిటయిప్) రూప సంచయాన్ని సూచిస్తుంది. ఇది సామూహిక అవ్యక్తచేతనస్థాయి (లెవెల్) కి చెందింది. ఇది నిస్సందేహంగా పైకి కన్పించని గభీరతతో లోలోన పడివున్న అనేకమైన పురాభావ జాలం నమూనాల (పాట్టర్న్స్, మోడల్స్)తో నిండి ఉందీ, ఎంతో మహనీయమైందనీ మనస్తత్వశాస్త్రవేత్తల అభిప్రాయం.

ఆధునికకాలంలో సృజనాత్మక రచయితలను ఫ్రాయిడ్ – మనస్తత్వ విశ్లేషణం, అడ్లర్ – న్యూనతాభావం, యుంగ్ – సామూహిక అవ్యక్తచేతనం సిద్ధాంతాలు ఎంతగానో ప్రభావితం చేశాయి. జీవిత ప్రపంచంలో ఇంతకుముందు కన్పించని, చూడని ప్రదేశాలపై దృష్టి ప్రసరించి ఎన్నో రహస్యాలు కనుగొనడమూ జరిగింది. ఇంకా మనస్తత్వపరమైన సాహిత్య విమర్శలో ప్రతీకలతోపాటు ఇటీవల ప్రత్యేకంగా పురాభావరూపాలకు సంబంధించిన వివేచన కూడా చెప్పదగిన స్థానాన్ని పొందింది.

ప్రస్తుత విషయానికి వస్తే – ఫ్రాయిడ్ దృష్టిలో అవ్యక్తచేతన విస్మృతమైన, అణచబడిన, అనేక విషయాల సంచయస్థానం. ఈతని సిద్ధాంతం ప్రకారం అవ్యక్తచేతన ప్రత్యేకంగా వైయక్తిక (పర్సనల్) గుణోపేతమైంది. యుంగ్ తన పరిశోధనలతో దీనిపై మరికొంత అభివృద్ధిని సాధించాడు. ఈతని సిద్ధాంతం ప్రకారం అవ్యక్తచేతనయొక్క పై పొర నిస్సందేహంగా వైయక్తికమైంది. దీన్ని ఇతడు వైయక్తిక చైతన్యం (పర్సనల్ కాంషస్) అంటాడు. ఇది లోతైన పొరపై నిలిచింది. ఈ లోతైన పొరగల స్థాయిని సామూహిక అవ్యక్తచేతనగా నిర్ధారించి స్థాపించడంలో ఇతని సిద్ధాంతంయొక్క ఆయువుపట్టు నిక్షిప్తమైంది. ఇది వ్యక్తిగతం కాదు. అందరిలోనూ ఉండేదీ, సర్వసాధారణమైందీ, ఇందులో ఉండేవన్నీ పురాభావరూపాలు[1]. ఇవి బహుపురాతనమైనవి. ఎన్నో యుగాలనాటివి. అసంఖ్యాకమైనవి, ప్రతిరూపాలు, స్వతంత్రమైనవీ. ఇవి కలలో సాక్షాత్కరిస్తాయి. దైనందిన జీవితంలో మన ప్రవర్తనల్లోను, జీవనపద్ధతుల్లోను ఏదో ఒక రూపంలో ప్రతిఫలిస్తాయి.

చైతన్యం యొక్క వివిధమైన పొరల్లో, నిహితమైన దృశ్యాదృశ్య జీవిత ప్రపంచం అంతా – 'చైతన్యప్రవంతి' రచనలో నియతమైన కాలప్రవాహంగా రూపొందుతుంది. అనేక స్థితులతో ఆలోచనాతరంగాలుగా విశిష్టమైన గతిలో దర్శనమిస్తుంది.

**చైతన్య ప్రవంతి – Stream of Consciousness :**

చైతన్యప్రవంతి అనే పదబంధం మనస్తత్వశాస్త్రపరమైంది. దీన్ని విలియం జేమ్స్ తన 'ప్రిన్సిపుల్స్ ఆఫ్ సయికాలజీ' అనే గ్రంథంలో మొదట రూపొందించాడు[2]. ఇది డోరోతీ రిఛాడ్‌సన్ చేత సాహిత్యంలో ప్రయుక్తమైంది. ఈ సంవిధానానికి మార్గదర్శకురాలుగా ప్రశస్తి వహించింది[3]. హెన్రీ జేమ్స్ ద్వారా విమర్శలో సొగసాన్ని పొందింది[4]. వర్జినియావూల్ఫ్ రచనలతో ఒక స్థిరమైన స్థితిని పొందింది[5]. ఈమెలో సుకుమార ప్రవృత్తితో అన్వేషణతో చైతన్యసీమల్ని దర్శించే శక్తి కన్పిస్తుంది. "సామాన్యమైన రోజునీ సాధారణమైన మనస్సునూ పరిశీలిస్తే – మనకు ప్రకాశవంతమైన పరివేషం కన్పిస్తుంది. చైతన్యం ఆరంభం మొదలు చివరి దాకా కొంత స్వేచ్ఛమైన కాంతి సంప్రసారమైన పొర మనచుట్టూ వ్యాపించి ఉంటుంది"[6] అన్న మాటల్లో పై భావం చక్కగా ఉన్మీలితమైంది. 'వేవ్స్'లో వాస్తవికతలో వైయక్తికదర్శనం బాగా కన్పిస్తుంది. జేమ్స్‌జాయ్స్ కృతుల్లో[7], ముఖ్యంగా యులిసెస్ మహాగ్రంథంలో ఇది ఒక శక్తివంతమైన చైతన్యంతో ఉజ్జీవింపజేసిన యులిసెస్, మానవజీవితం యొక్క వ్యంగ్యచిత్రణం, ఇందులో భౌతికమూ, ఇతోధికంగా మానసికమైన భూమికల్లో జీవితంయొక్క స్థూలసూక్ష్మమైన

రూపాలు ఎంతో వివరంగా విశ్లేషితమైనాయి. జీవితంలో ఎదురయ్యే సమస్యలు - మానసికమైన భ్రాంతి, సంఘర్షణ, ఆదర్శాలు వాస్తవానికీ కల్పనకూ మధ్య అంతరం రెండూ కలసే ప్రదేశాలు, చైతన్యం యొక్క వివిధ స్థాయిల్లో ఎంతో నిశితంగా దర్శితమైనాయి. మానవమనస్తత్వ పరిశీలనలో విస్తృతీ, వైవిధ్యమూ, వైచిత్రీ గల గొప్ప రచన.

ఆ తరువాత విలియమ్ ఫాక్‌నర్ మొదలైన రచయితలు దీనికి కొత్తకొత్త పార్శ్వాలతో చిరమైన కీర్తిని ఆర్జించిపెట్టారు. ఫాక్‌నర్‌లో వర్జీనియావూల్ఫ్, ఇంకా జేమ్స్ జాయిస్‌లు చక్కని జీవితాదర్శ సమ్మేళనం గోచరిస్తుంది. ఇతని రచనల్లో పాత్రయొక్క అంతర్దర్శనం ముఖ్యం. లిబిడో యొక్క అవ్యక్త చైతన్యావిష్కారం, స్వప్నవిధాన రూపం మొదలుగా మనస్తత్వ ప్రకాశనం అధికంగా ఉంది. సాహిత్యవిమర్శలో మేస్లిం క్లియర్, దీన్ని మొదట డోరోతీ రిఛార్డ్‌సన్ పై వ్యాసంలో వివేచన చేసింది[10]. ఈనాడు సాహిత్య రంగంలో ఈ సంవిధానం గురించి తెలియకపోవడం అంటే, ఆధునిక లక్షణానికి కొంత లోపం కలిగినట్లే!

## II

చైతన్య స్రవంతి సంవిధానం నవల్లో పాత్ర, మానసికమైన క్రమగతి (మెంటల్ ప్రాసెస్)కి సంబంధించిన అనేకమైన మనస్తత్వపరమైన అంశాలపై నిర్మితమౌతుంది. దీనివల్ల పాత్ర అంతరంగదర్శనం కలుగుతుంది. ఇంతకుముందు తెలీని బయటపడని స్పష్టం కాని ఎన్నో సూక్ష్మమైన విషయపరిశీలనకూ అవకాశం కలుగుతుంది. పాత్రల మనస్తత్వపరమైన అనేక పార్శ్వాలు ఒకటొకటీ ప్రకాశమానం కావడంతో దీని ప్రాముఖ్యం ఇటీవల బాగా గుర్తింపుకు వచ్చింది. ఇందులో స్మృతి (మెమరీ)లో అంతరంగం, అవిచ్ఛిన్నంగా ప్రవహించే చైతన్యంగా రూపొందుతుంది. స్మృతి కీలకమైన పాత్రను నిర్వహిస్తుందని చెప్పవచ్చు. పాత్ర మానసికమైన క్రమగతిని స్మృతి నియమించడంచేత పాత్ర నిర్మాణంలో సంప్రదాయ నవల్లో కన్నా ప్రత్యేకమైన రూపాన్ని పొందుతూంది. ఈ విధమైన రచన చేసే రచయిత, పాత్ర స్మృతి పరంపరా సమయంలో ఆకలంతో ప్రవహించే వ్యక్తిత్వాన్ని సృష్టించే ఉద్దేశం కలవాడవడంచేత, ఇందులో చైతన్యం యొక్క పై పొరలను ఛేదించుకొని వివిధ స్థాయిల్లో అనేక దశల్లోని రహస్యాలను ఆవిష్కరించే ప్రయత్నం జరుగుతుంది. ఇవి అనంతమైనవి.

మనం సాధారణంగా ఊహించలేనివీ, ఇవి ధరించే ఆకృతులు ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. ఉత్సుకతను పెంపొందిస్తాయి. ఈ జీవింలో ఉంటూనే దీని వెనుకనున్న

కొత్త ప్రపంచంలో తిరుగుతూన్న మానసికస్ఫూర్తి కలుగుతుంది. కాబట్టి మనస్సుయొక్క బాహ్యమైన ఆవరణలు క్రమిస్తూ, లోలోపల అడుగున నిహితమైన రూపాలపైనే పాత్ర వ్యక్తిత్వం ఆధారపడి ఉంటుందని చెప్పవచ్చు. చైతన్యరూపం వస్తువిన్యాసానికి స్థానమవుతూంది. చైతన్యం క్రిందిస్థాయి నుండి పై స్థాయివరకూ పాత్ర మనస్తత్వ పరంగా చిత్రించడంలో రచయిత సందర్భానికి తగినవిధంగా వివిధాంశాలు ఎన్నుకునే ప్రజ్ఞ ఎంతో అవసరం.

చైతన్యరూపం రెండు భాగాలు చేస్తే, 1) ఒకటి క్రిందిస్థాయిలో, 2) రెండోది పై (ఉన్నత) స్థాయిలో ఉండేది. కిందిది మసకమసకగా అస్పష్టంగా ఉంటుంది. పైది ప్రకాశవంతంగా ఉంటుంది. మొదటిది వాక్కుకు పూర్వమైన దశ (ప్రీ-స్పీచ్ లెవెల్). ఇది సాధారణంగా మనకందదు. రెండోది వాక్‌దశ (స్పీచ్ లెవెల్)కు చెందింది. మనకందుబాటులో ఉండేది. చైతన్యప్రవంతి రచనలో ఆ అందని స్థాయిలో అస్పష్టంగా మసకమసకగా, ఇంకా కిందికి పోతే విస్మృతమై ఎప్పుడో, లోతుగా చీకటిలో ఉన్న మనస్తత్వపరమైన, జాతి సామూహిక లక్షణయుతమైన ఎన్నో అంశాలు అనేక రీతుల్లో ఆవిష్కృతమౌతాయి.

దీనికి సంబంధించిన ఆలోచన సహజమైన ఉద్గమనంలో, ఏ కత్తిరింపులకూ లోనుకాకుండా నియమితమూ కాకుండా, యథాతథంగా అవలీలగా మనస్సునుండి ప్రసరిస్తాయి. రచనలో కళాత్మకమైన విలువల దృష్ట్యా క్రమబద్ధం చేయబడతాయి. ఇది శిల్పం క్రిందికి వస్తుంది. లేకపోతే సాహిత్యపరంగా వికీర్ణత ఏర్పడుతుంది. వివిధ స్థాయి భేదాలతో ప్రసరించే చైతన్యం పాత్రకు క్రియాత్మకమైన మనోరూపాన్ని ఇస్తుంది. మనస్సు బాహ్యమైన అనేకావరణలు దాటి, చైతన్యంలోపల ఉన్న పొరల్లోకి ప్రవేశించి, అందులో దాగిన వ్యక్తిత్వరూపాలను కనుగొనడం జరుగుతుంది.

మొదటినుండి చివరివరకూ రచయిత ఈ పనిలో కేవలం నిర్వాహకుడు (స్టేజి మేనేజరు)గా మాత్రమే ఉంటాడు. ఏ విధంగానూ పాత్రలను నిర్దేశించడు. ప్రవర్తనను నియమించడానికి పూనుకోడు. ఎంతో తటస్థంగా ఉంటాడు. ఈ కారణంగ ఆ పాత్రలు స్వేచ్ఛగా ప్రవర్తించే అవకాశం ఎక్కువ. ఏ నీతి నియమాలకూ కట్టుబడవు. ఎంతో నిర్భయంగా అభిప్రాయ ప్రకటనం కావిస్తాయి. రచయిత ప్రభావం ఏ మాత్రమూ లేని స్వతంత్రమైన వ్యక్తిత్వాలతో ప్రవర్తించడం దీనిలోని విశేషం. భాష కూడా సాధారణ సూత్రాలకూ నియమాలకూ కట్టుపడదు. సహజమైన ప్రసంగధోరణి కలిగి ఉంటుంది. పదబంధాలు, పదరూపాలు కొత్తగానూ, వాక్యవిన్యాసం ఖండఖండాలుగానూ, ఒక్కొకప్పుడు

దీర్ఘదీర్ఘంగానూ, ఆకర్షణీయంగానూ సహజత్వంతోపాటు శిల్పగుణమూ కలిగి ఉంటాయి. రచన ప్రవాహ సదృశంగా ఆలోచనా తరంగాలతో భావలయతో పరిక్రమిస్తుంది. గతం నుండి వర్తమానంలోకి, వర్తమానం నుండి గతంలోకీ పాత్రలు వస్తూ పోతూ ఉంటాయి. కాలం ఒక క్రమంలోనూ ఉండదు. అయినప్పటికీ రచన మొత్తంమీద, పాత్రస్వరూపాన్ని బట్టి ఒక ఏర్పాటు, ఒక పద్ధతి పర్యాప్తమై ఉంటుంది. ఇక్కడే ఉన్నది ఉన్నట్లుగా లేక కొంత శిల్పత్వాన్ని పొందుతుంది. ఇది సహజంగా రచయిత కళాదృష్టివల్ల జరుగుతుంది.

కాలానికి సంబంధించినంతవరకు రెండు రకాలైన రచనలు కన్పిస్తాయి. 1) కొన్ని రచనల్లో కథ ఒకరోజులో లేదా కొన్ని గంటల్లోనో సమాప్తమౌతుంది. ఒకరోజులో లేదా కొన్ని గంటల్లో ఎంతో కాలాన్ని వివిధ స్మృతి విశేషాలతో నింపడం జరుగుతుంది. వ్యక్తి అనుభవపరంపరలో అనేక సంఘటనలమయమైన ఇతివృత్తం. ఎన్నిటినీ తనలో ఇముడ్చుకొని సావయవపూర్ణమైన ఆకృతిని పొందుతుంది. మరికొన్ని రచనల్లో ఇతివృత్తంతో అనేకమైన సంఘటనల్ని పురస్కరించుకొని సాధారణమైన సంప్రదాయ ధోరణిలో కథ నడుస్తూ, మధ్య మధ్య ఈ సంవిధానం ఆవిష్కృతమౌతుంది. అటు సంప్రదాయగతమైన నవలా పద్ధతిలో, ఈ నవ్యమైన సంవిధానం అనుసంధితం కావడం ఇందులో విశేషం. తెలుగులో అసమర్థుని జీవయాత్ర, అల్పజీవి పేర్కోదగినవి. స్రవంతి విధానానికి మొదటిపద్ధతిలో, అంటే కొన్నిగంటల్లో లేదా ఒకరోజులే జరిగే కాలంలో, మనస్తత్వ ప్రకాశనంతో రూపొందిన ఇతివృత్తం గల కథా నిర్వహణ రూపమే సంపూర్ణమైన ప్రాతినిధ్యం వహిస్తుంది.

నవల్లో సజీవమైన దర్శనశక్తి (లైన్ ఇన్ట్యూషన్)తో చైతన్యదశల్ని ప్రతిఫలింపజేసే స్వభావంతో, ఆకర్షణీయమైన సృజనరూపాన్ని పొందడమనేది, రచయిత సృజనశక్తీ, కళాపరమైన శిల్పదృష్టిపై ఆధారపడి ఉంటుంది.

'చైతన్యస్రవంతి' అనేది రచయిత నుండి ఏ వ్యాఖ్యానమూ ఏ విశ్లేషణమూ లేకుండా పాత్ర మనస్సునుండి నేరుగా ఉద్గమించే కళాత్మకమైన విధానంగా భావితమైంది.

## III

**అంతర్విశ్లేషణం – (Internal Analysis)**

ఒకవేళ రచయిత స్వయంగా వివరించడానికీ, విశ్లేషించడానికీ లేదా వ్యాఖ్యానించడానికీ ఉపక్రమిస్తే అది అంతర్విశ్లేషణం (ఇంటర్నల్ ఎనాలిసిస్) అనే పద్ధతికి

చెందుతుంది[12]. ఎందుకంటే రచయిత ప్రమేయస్పర్శతో పాత్ర రూపొందే వ్యక్తిత్వమే వేరవుతుంది. ఇందులో పాత్ర అంతరమైన జీవితరూపం నేరుగా ఆవిష్కృతం కావడానికి బదులు పాత్రకూ పాఠకునికీ మధ్య రచయిత చోటుచేసుకుంటాడు. దీనితో పాత్ర నిర్మాణంతోనే కాక పాఠకుని మనస్సుపైనా మరో విధమైన ప్రభావాన్ని నెరపుతాడు. ఇది పాత్రలపై మనకొక అభిప్రాయాన్ని కలిగించేదిగా ఉండవచ్చు లేదా రచయిత పాత్రల్ని తన అభిప్రాయానికనుగుణంగా ప్రవర్తింపజేసేదిగానూ ఉండవచ్చు. ఇంకా అనేక విధాలుగా మారవచ్చు. రచయిత అభిప్రాయాలకూ సిద్ధాంతానికీ చెందినవి కావచ్చు. ఏమైనా ఇది సూచనగానూ ఉండవచ్చు. ఇది రచయిత ప్రమేయంగా మారి చివరకు పాత్రలపై ఆధిపత్యం వహించి వాటిని "కీలుబొమ్మలు" చేయడం జరుగవచ్చు. అందువల్ల ఈనాటి నవలా ప్రపంచంలో ఎక్కువమంది దీన్ని అంగీకరించడంలేదు. అయితే అభిప్రాయభేదం ఎప్పుడూ ఉంటుంది. తెలుగులో అల్పజీవి నవల, రచయిత ఎంతో తటస్థంగానూ, ఏ విధమైన ప్రమేయస్పర్శ లేకుండా నిర్వహించే ప్రయత్నం జరిగింది. దీనివల్ల రచనకూ ఎంతో సహజత్వం చేకూరింది. సజీవమైన వాస్తవగుణంతో నిండి "వెరిసిమిలిట్యూడ్" లక్షణం చేకూరుతుంది[13]. అందువల్ల ఈ నవల తక్కినవాటికన్నా ఏదో విలక్షణంగా మనల్ని ఆకర్షిస్తుంది. ఈ ఆకర్షనకు వేరే గుణాలూ లేకపోలేదు.

చైతన్యస్రవంతి రచనలో పాత్రల మనస్సునుండి నేరుగా ఉద్గమనం (డయిరెక్ట్ కొటేషన్) పొందిన రచన నాటకీయత కలిగి ఉంటుంది. సంభాషణకు ప్రాముఖ్యం హెచ్చుగా ఉంటుంది. వాచికంతోపాటు ఆంగికమైన వర్ణనం, హేతుక్రమంలో సంఘటనల ఏర్పాటు శ్రవ్యంతోపాటు దృశ్యానుగుణమైన ప్రత్యక్షీకరణ పద్ధతి మొదలైనవి వేరే కారణాలూ కన్పిస్తాయి. దీన్ని ఒక్కొక్క రచయిత ఒక్కొక్క విధంగా సాధిస్తాడు. ఈ సంవిధానంలో మూర్త (కాన్క్రీట్) లక్షణం ప్రముఖంగా ఉండడమూ పేర్కోదగిన మరో అంశం.

గ్రంథమంతా ఈ విధానమే అవలంబితం కావచ్చు. కొంత భాగం లేదా మధ్యమధ్య ఖండఖండాలుగానూ ఉండవచ్చు. అంతర్విశ్లేషణంలో రచయిత ప్రమేయం ఉంటుంది. ఇందులో అమూర్త (అబ్స్ట్రాక్ట్) లక్షణాని కవకాశం ఎక్కువ.

ఈ సందర్భంలో పేర్కోదగిన మరొకటి – అంతర్భాషణం (ఇంటర్నల్ మానోలాగ్). ఇది స్వగతం కాదు – ఏకాంతభాషణమూ కాదు. దీన్ని చైతన్యస్రవంతిగా భావించే ప్రమాదమూ సంభవిస్తూ ఉంటుంది. ఇందులో మనస్సులో కదలికనుబట్టి ఒక భావం తరువాత మరొకటి క్రమిస్తుంది. మనస్సులో అది వచ్చినది వచ్చినట్లుగా పాత్ర సాధారణ సంభాషణలో రూపొందుతుంది. ఈ సమయంలో బుద్ధి చాలావేగంగా

పనిచేస్తూ ఉంటుంది. మూర్తమైన ఇంద్రియానుభవ ముద్రనుండి అమూర్తమైన ఆలోచనలు, భావరూపాలు (ఇమేజెస్) ప్రసరిస్తూ ఉంటాయి. ఇది చాలా పరిమితమైన పరిధి కలిగింది. పాత్ర తీవ్రమై, అనిర్దిష్టమైన (అన్‌డయిరెక్టెడ్) ఆలోచనాగతికి గురైనపుడూ, ఇంకా స్వప్న విషమ స్థితుల్లోనూ కాల్పనిక ధోరణిలో ఇంద్రియానుభవాన్ని వ్యక్తం చేసేప్పుడూ ఈ విధానం ఉపయుక్తమౌతూంటుంది. పాత్ర మనస్సు లక్ష్యంతో శ్లథమైన (లూజ్) ధోరణిలో పనిచేస్తూ ఉంటుంది. అంతర్భాషణమూ, చైతన్యస్రవతం ఒకటి కాదు. దీనిలో దశాక్రమం (పీరియాడిక్ మానర్) లేకపోవడంవల్ల, అప్పటిస్థితనిబట్టి రచయిత ఎంతో మెలకువతో ఉపయోగించవలసి ఉంటుంది. లేకపోతే అయోమయంగా రూపొందే ప్రమాదం ఉంది. దీన్ని దుజార్డన్ లమోనోలాగ్ ఇంటీరియర్‌గా కనుగొన్నట్లు చెబుతారు. డోస్టొవిస్కి నవల్లో పాత్ర మనస్సునుండి ఖండఖండాలుగా వెలువడిన ఆలోచనాపరంపరలు అంతర్భాషణం పద్ధతిలో ఎంతో కళాత్మకంగా ఆవిష్కృతమైనాయి.

## IV

**నిర్మాణ శిల్పం :**

చైతన్యస్రవంతి రచనా నిర్మాణం అనేక సంఘటనల పరంపరారూపం. దీనికి "ఫ్లక్స్" ప్రవహించే గుణం లేదా క్రియాత్మకత ఆవశ్యకమైన లక్షణం. పాత్రపై దృష్టితో నిర్మితిలో అంతరంగచిత్రణంవల్ల, ఆలోచనలో అవిచ్ఛిన్నస్థితిచేత రూపొందుతుంది. అంతరంగప్రసారం – ఒక క్రమపద్ధతిలో అర్థవంతంగా రూపొందాలి. ఇక్కడ అంతరంగరూపం, జీవితప్రపంచం రెండూ అవినాభావ సంబంధం కలిగివుంటాయి. ప్రాథమిక చైతన్యం (ప్రయిమరీ కాంషస్‌నెస్) ఆవల ఉన్న స్మృతులూ ఆలోచనలూ అనుభూతులూ అన్నీ కలిసి ఏ అదుపూ, అణచివేత లేకుండా ఒక క్రమంలో అంటే గొలుసుగా కాక ప్రవాహంవలె సరిస్తూ ఉంటాయి. దీన్నే బెర్గ్‌సన్ అభిప్రాయానుసారం కాలప్రవాహకత్వాన్నిబట్టి ఫ్లక్స్ అనడం జరిగింది. గొలుసు (చైన్) కూడా అవిచ్ఛిన్నంగా ఉండవచ్చు. ఒక కొక్కానికి మరొకటి చేర్చబడే నిర్మితం అవుతుంది. ఇందులో సహజమైన ఉద్గమనం ఎక్కడుంది? లేదు. శ్రమచేత సాధించిన ప్రయత్నరూపం ఇది. ఇందులో ప్రసారం లేదు. సహజమైన గమనం లేదు. ఇంకా ఈ పదార్థంలో ఘనత్వం ఉంది. నిలకడ ఉంది. అయితే ప్రవాహంలో గతి విశేషం ఉంది. పదార్థంలో ద్రవత్వం ఉంది. అందువల్ల "స్ట్రీమ్" అన్నమాట ఎంతో అర్థవంతంగా ప్రయుక్తమైనట్లు విదితమౌతుంది. పైగా అంతో ఇంతో ప్రవాహం లోతు ఉంటుంది. నీటిలోతు అవ్యక్తచేతన (అన్‌కాంషస్‌నెస్)

కూ, నీటి ఉపరితలం క్రిందిభాగం ఉపచేతన (సబ్‌కాంషస్‌నెస్)కూ ప్రతీకలు. ఇది చాలా ప్రసిద్ధమైందే. రెండు తీరాల మధ్య ప్రవహించే ప్రవాహం మానసికమైన క్రమగతినీ పైకి కన్పించని నియతినీ సూచిస్తుంది. ఈ ప్రవాహప్రక్రియ కాలానుబంధమై ఉండడం విశేషం. అవిచ్ఛిన్నత్వమూ మరీ ముఖ్యం.

ఇందులో భౌతికమైన వస్తువిన్యాసం, అంతరంగ కథనానికి కేవలం ఆశ్రయభూమిగానే ఉంటుంది. అంతరంగకథనం, మనస్తత్వప్రధానమైంది. ఒకటి లేదా అంతకన్నా ఎక్కువ పాత్ర చైతన్యం ఉంటే చైతన్యస్రవంతి సంవిధానం (టెక్నిక్)గా గుర్తించనివారూ లేకపోలేదు[14]. ఈ అభిప్రాయాన్ని గురించి ఆలోచిస్తే ఇందులో పాత్ర సమస్య కేంద్రస్థానం హించడమే హేతువనిపిస్తుంది. దీని ఆవిష్కారంలో విశిష్టత ఉంది. అట్లా ఉన్నదే 'చైతన్యస్రవంతి' సంవిధానమవుతుంది.

1) ఆలోచనా ప్రవాహకత, 2) అచేతనలో భావజాలం – నిరభ్యంతరంగా బయటికి రావడం, 3) మానవ మనస్తత్వ విశ్లేషణం – ప్రకాశనం, చిత్రణం, 4) స్వగతం– స్మృతిపరంపర వర్తమాన తలంపై చరించడం, 5) ప్రధాన పాత్ర మనఃప్రపంచ దర్శనంలో రహస్యాల్నీ, మూలాల్నీ ఆవిష్కరించడం కన్పిస్తుంది.

రచన ప్రధాన పాత్ర స్వేచ్ఛలో మానసిక సంచలనం ఆరంభమై అన్వేషణలో కొనసాగుతూ సజీవదర్శనంగా రూపొందుతుంది. ఇక్కడ పాత్ర సహజత్వానికీ భంగం రాకూడదు. అయితే దీనివెనుకనుండి పనిచేసేవీ వాస్తవాలే మనకు తెలీనివి, అందనివీ కావడంవల్ల ఆశ్చర్యానికి ఆస్కారకాలవుతాయి. ఇది సహజం.

ఈనాటి నవలా రచయితకు మనస్తత్వశాస్త్రంతో అంతో ఇంతో స్థూలమైన పరిచయమైనా అవసరం. ఈ సంవిధానం మనఃప్రపంచాన్ని దర్శించే, పరిశోధించే సాధనమైంది. జీవితంలో అంతఃపార్శ్వాలను గురించి విశ్లేషణమూ, వివేచనమూ దీని సహాయంతో చేయబడుతుంది. ప్రత్యక్షమైన జీవితం నుండి అప్రత్యక్షమైన చైతన్యం వరకూ అంతా అనుభవలోకమే. "అనుభవం ఎప్పుడూ మితం కాదు. అది ఎన్నటికీ సంపూర్ణం కాదు"[15]. మనిషిలో కోర్కెలు, ఆలోచనలు, ప్రవర్తనలతో సంబంధం గల చర్యలు, ప్రతిచర్యలు కలిసి ఏర్పడిన సంఘటనల క్రమం జీవితం. దీని అనుభవం చైతన్యంతో ఉపరితలంపైన సామాన్యమైన పొర నుండీ, అట్టడుగున ఉన్న మహనీయమైన లోపొరవరకూ వాస్తవమైంది. ఈ కారణంగా చైతన్యపుటర (ఛాంబర్ ఆఫ్ కాంషస్‌నెస్)ను అనుభవపుటర (ఛాంబర్ ఆఫ్ ఎక్స్‌పీరియన్స్)గా పేర్కొనడం జరిగింది. ఇది ఒక ముఖం కాదు. ఎన్నో ముఖాలు. సామాన్య వ్యక్తిగా సంఘ సభ్యుడుగా, కుటుంబ

సభ్యుడుగా, మానవుడుగా, ఇలా ఇందులో ఇంకెన్నో! స్నేహితుడు పరిచయస్థుడు, వైయక్తికంగా జాతిపరంగా సంస్కృతిపరంగా మానవతాపరంగా ఎంతో వైవిధ్య విలసిత మైందీ రూపం. దేన్ని కదిలించినా ఒక తరంగంవలె ఉద్గమిస్తుంది. దీన్ని ఒక క్రమంలో కదపడంలో ఒక రీతిగా సంయోజించడంలో బయటికి కన్పించీ కన్పించని పద్ధతిలో నిర్మాణ శిల్పం ఎంతో అవసరమౌతుంది.

స్మృతులు, ఆలోచనలు అనుభవాల వెనుకనున్న మానవ మనోజీవితాన్ని యథార్థ జీవితతలంపై చైతన్యాత్మకంగా ప్రవహింపజేయడంతో ఇతర ప్రక్రియలకన్నా నవల్లో ఈ సంవిధానం బాగా విజయవంతమైంది. ఈ విధమైన నవలలకు సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానమూ ఉంది. పాఠకునికీ దీన్ని గురించిన పరిచయంవల్ల ఇంకా బాగా అనుభవంలోకి తెచ్చుకొని, చైతన్యస్రవంతి విధానాన్ని నవల్లో ఖండఖండంగా సంపూర్ణంగా ఆనందించగలడు. ఆపైన ఆలోచనకూ అవకాశం ఉంది. దీనివల్ల అతడు రచన చదివి పొందే అనుభవానికీ, చేసే ఆలోచనకూ ఎంతో ప్రయోజనకరమైన విస్తృతి కలుగుతుంది. ఇంకా వ్యక్తుల సమాహారమైన సమాజపరంగానూ, ఎన్నో మానసికమైన అవలక్షణాలు తొలగేందుకూ, విషమస్థితుల్ని సరిచేయడానికి ఉపకరిస్తుంది. వ్యక్తుల్లో దాగిన ఎన్నో రహస్య రూపాలను దర్శింపజేస్తుంది. 'మొత్తంమీద గుప్తమైన స్వస్వరూపం అవగతికి రావడంవల్ల మానసికంగా ఆరోగ్యకరమైన వాతావరణానికీ దారితీస్తుంది. అయితే చివర ఒక మాట – సృజనాత్మక సాహిత్యంలో కళాత్మక వివేచనలో, మనస్తత్వ పరమైన పరిశీలనకూ కొన్ని పరిమితులు లేకపోలేదు. ఇది చైతన్యస్రవంతి విధానానికీ వర్తిస్తుంది. సాహిత్యదర్శనంలో ఇదీ ఒక పరిహరింపరాని భాగంగా గుర్తింపజేయడమే ప్రస్తుతాశయం. ఆధునిక నవల్లో చైతన్య స్రవంతి సంవిధానం నిర్మాణ రూపంలో భాగంగా చేరిపోయింది. అంతో ఇంతో సమాలోచన కలుగుతూంది.

సూచికలు :

1. Arche type : (arche) 1. chief type orm odel; original type or pattern; Premordial image - దీన్ని పురా (భావ) రూపం అనడమైంది.
2. William (James) (1842-90) అమెరికన్ తత్త్వవేత్త. ఇతడు తత్త్వశాస్త్రమూ మనస్తత్వశాస్త్రం వ్యాసంగంలో జీవితమంతా గడిపాడు. ఇతని రచనలు – 1) Principles of Psychology, 2) Varieties of religion, 3) The meaning of truth.
3. Dorothy Richardson; Novel. Piligrimage - Dorothy Richardson

invented the fictional depiction of the flow of consciousness - Bowling - It is a psychogical autobiography - Bowling.

4. Henry James (1843-1916) ఆంగ్లో-అమెరికన్ నవలా రచయిత : ఇతని నవలలు - 1) Federick Hudson, 2) Portrait of lady, 3) The Golden Bowl.

5. Virginia woolf : Novels - 1) Mrs. Dolloway, 2) The light house, 3) Waves.

6. "Examine an ordinary mind on an ordinary day ... Life is a luminous halo, a semi-transparant envelope surrounding us from the beginning of Consciousness to the end." Waves.

7. James Joyce : Novels 1) Ulysses, 2) A Portrait of the artist as a young man. రెండో రచనలో పాత్ర స్టీఫెన్ ముసుగులో రచయిత కళారూపంయొక్క పరిణామసిద్ధాంతాన్ని వ్యక్తం చేశాడని - హెరాల్డ్. ఇ. టాలివర్ అభిప్రాయం.

8. William Faulkner : Novels 1) The sound of fury, 2) As I lay dying.

9. Libido - లైంగిక వాంఛా రూపం (ఫ్రాయిడ్)

10. మేసింక్లేర్, Dorothy Ricahrdson వ్యాసంలో "There is no drama, no situation, not a set sense. Nothing happens, it is just life going on and on - It is Mirriams Stream of Consciousness going on and on - Egoist - April, 1918.

11. Stream of consciousness is a method, which gives us a direct quotation from the mind without the author's comment or analysis - Bowling : Stream of consciousness.

12. If the author himself intervenes to interpret, analyse or comment, however he employs a different method which shall be labelled as internal analysis - Bowling.

13. Verisimilitude : (జీవిత) సత్యాన్ని పోలిన రూపం నవల్లో వాస్తవికతకూ రూపకల్పనకూ గల స్థానాన్ని గూర్చి చర్చకు ఆధారమైంది. ఈ సత్యం జీవితం లోని యథార్థస్థితికి సంబంధించింది. ఇది భౌతికం కావచ్చు, మానసికమూ కావచ్చు.

14. Wallace M. Bacon.

15. "Experience is never limited and it is never complete" - Henry James.

# 12. ఉద్దేశం - నిర్దేశం

నవల మానవజీవితం నుండి ఉద్గమిస్తుంది. అనేక సంఘటనలచేత స్థితులచేత పోషితం అవుతుంది. జీవితంలోని ఆవేదనను స్పందిస్తుంది. చింతనను అనురణిస్తుంది. జీవితం గురించి ఆలోచిస్తూ జీవితాన్ని నిర్దేశిస్తుంది. సమాజ భావనలో రచయిత బాధ్యతనూ అనుక్షనం గుర్తుకు తెస్తుంది. మనిషికి ఎదురయ్యే అనేక సమస్యల్ని పరిశీలిస్తుంది, విశ్లేషిస్తుంది, వ్యాఖ్యానిస్తుంది. ఒకొక్కప్పుడు విస్తృతమైన ప్రాతిపదికపై పరిష్కారాన్నీ అన్వేషిస్తుంది, కొత్తవి ప్రతిపాదిస్తుంది. ఈ అన్వేషణం ఎంతో కొంత విజయ రూపాన్ని ధరించడంలో రచయిత అభిప్రాయాలూ సిద్ధాంతాలూ దర్శనమిస్తాయి. ఈ ఆలోచనారూపం రచయిత ఉద్దేశాన్ని నిర్దేశిస్తుంది. జీవితంపై ఉత్సాహం, ఆశ, అభిప్రాయం, ప్రయత్నం, విజయంతో ఒక సిద్ధాంతాన్నీ, వ్యవస్థనూ, ఆదర్శాన్నీ కలిగిస్తుంది. ఇందులో సాంఘికనీతి, తత్త్వం, రాజకీయ స్థితీ, ధోరణీ వివిధ పార్శ్వాలల ప్రవృత్తమై కన్పిస్తాయి. ఇవి కాలక్రమేణ మారుతూ ఉంటాయి.

నవల జీవితంలో తప్పనిసరియైన మార్పుల్ని ఎంతో వేగంగా అందిపుచ్చు కుంటుంది. మార్పు జీవితంయొక్క సజీవమైన అస్తిత్వానికి చిహ్నం. సమాజం మూడు స్థితుల్లో ఎప్పుడూ ప్రవర్తిస్తూ ఉంటుంది. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్కటి ప్రముఖంగా కన్పించవచ్చు. ఇవి సంప్రదాయం, సంస్కరణం, పరివర్తనం అనేవి. ఇవి సంపూర్ణంగా సమాజానికి సంబంధించినవీ, జీవితంలో విడదీయరాని సంబంధం కలవీ. అయితే ఒక్కొక్క రచయితలో ఇవి ఒక్కొక్క నిష్పత్తిలో రూపొందుతాయి. వీటిని ఏ రచయిత సంపూర్ణంగా పరిహరించలేడు. రచయిత వ్యక్తిత్వాన్నిబట్టి, విశ్వాసాలు సిద్ధాంతాలు ఆధారంగా నవల్లో ప్రతిఫలిస్తాయి. ఎప్పటికపుడు కొత్త దృక్పథంతో దర్శితమౌతూనే ఉంటాయి. నిరంతరం ప్రవహించే మానవ సంస్కృతిలో భాగమై కదలిపోతూ ఉంటాయి. వ్యక్తి సమాజంలో భాగం కాబట్టి సమాజ ప్రభావం వ్యక్తిపై అనివార్యమవుతుంది.

నవల్లో ఉద్దేశం కథకు ప్రయోజనాన్ని కలిగిస్తుంది. దీనికి తగిన బలమైన సంఘటనలు పాత్రల నిర్మాణం అవసరం. ఈ అంశాలన్నీ విడివిడిగా కన్పిస్తున్నా రచనలో పరస్పరం అనుబంధంతోనే విలసిస్తాయి. వివిధాంశాలు పరస్పరం అనుగుణంగా యోజితం కావాలి. అన్నీ సమైక్యభావంతో ఒక విశిష్టమైన అనుభవ సమగ్రతను మనలో కలిగిస్తాయి. ఈ అనుభవపరంపరలో ఒక ఆలోచనారూపం తప్పనిసరిగా ఉంటుంది. అదే ఉద్దేశాన్ని స్పృశిస్తూ ఉంటుంది. ఇది అంతర్గతంగానూ ఉండవచ్చు - మధ్యమధ్య

పాత్రసంభాషణల్లో రచయిత మాటల్లోనూ ప్రకటితం కావచ్చు. అయితే అడుగడుగునా ఉద్దేశం తన ఆధిక్యతను ప్రదర్శించకూడదనే అభిప్రాయమూ ఉంది. దీనివల్ల కళాత్మకతను కోల్పోయే ప్రమాదం ఉందనేవారూ ఉన్నారు. దీనివల్ల రచనకు ఎక్కువ ప్రయోజన తత్పరత సిద్ధిస్తుందనేవారూ ఉన్నారు. ఇంచుమించు లోకంలోని వ్యక్తుల ప్రతిరూపాలే పాత్రలు. కొందరు వ్యక్తుల లక్షణాల సమాహారం కావచ్చు. దీనిలో కొంత కల్పన ఉండవచ్చు కూడా. ఇతివృత్తమూ లోకంలోని అనేకమైన సంఘటనల ప్రతిరూపమే. రచయిత పాత్రల్ని మలచడంలో, సంఘటనల్ని తీర్చడంలో, సంభాషణల ప్రయోగంలో, వాతావరణ కల్పనంలో, స్పష్టంగానూ, అస్పష్టంగానూ ఉద్దేశాన్ని భావింపజేయవచ్చు. దీనికి ఎన్నోవిధాలైన మార్గాలున్నాయి. ఎంతో నేర్పుగా అన్ని అంశాల్నీ సుస్థితితో అల్లడంలో నేర్పే కళ. నవల్లో ఉద్దేశం కళారూపంలో జీవితదర్శనశక్తిచేత మహనీయత్వాన్ని పొందుతుంది. ఈ కారణంగా జీవితాన్ని గురించిన ఆలోచన నవలలో సహజమూ, అనివార్యమవుతుంది. కళ పరిహరింపరానిదిగాను అవుతూంది.

## II

జీవితంలో ప్రత్యక్షంగా ఎక్కువ సంబంధం ఉన్న ప్రక్రియ నవల. స్త్రీ పురుషుల సంబంధాలు, మనుషుల ఆలోచనలు, అనుభవాలతో కూడిన భౌతిక-మానసికమైన ప్రపంచాల ప్రతిబింబం. రచయితకు మూలవస్తువు మానవ జీవితం - సమాజం ఎప్పటికపుడు మారుతూన్న పరిసరాలతో, ఇదమిత్థమనీ తేల్చిచెప్పలేని స్వభావ గతులలో వివిధ మానసిక పార్శ్వాలతో వాస్తవరేఖల్లో పయనిస్తుంది. ఒకప్పటి జీవితం, మరొకప్పటికి ఎన్నటికీ నమూనా కాదు. అలాగే నవల కూడా జీవితం తనపై నెరపిన ప్రభావాన్నీ, జీవితంపై తనకుగల అభిలాషనూ రచయిత ఎన్నో విధాలుగా చిత్రించే అవకాశం కలిగి ఉంటాడు. ఇది రచయిత స్వేచ్ఛాపరిధిని విస్తృతం చేసే విధంగా ఉంటుంది. అతనిలోని సిద్ధాంతాలకు ప్రత్యేకమైన భావాలకూ వేదికగా ఉపయుక్తమౌతుంది. ఒక చిన్నకథ సైతం పరిశీలిస్తే, ఈ విధమైన విలువల్ని ఏదో ఒక విధంగా సూచితం చేసేదిగానో, ప్రతిపాదితం చేసేదిగానో ఉంటుంది. ఇది నైతికం కావచ్చు. సాంఘికం కావచ్చు. రాజకీయం కావచ్చు. ఏదైనా కానీ.

వివిధ పాత్రల చర్యలు - ప్రతిచర్యలతో నిబిడమై ఉన్న నవల ఏవో కొన్ని విలువల్ని కలిగి ఉంటుందనడంలో సందేహం లేదు. ఇవి ఎలాంటివి? సమాజాని కెలా ఉపకరించేవి? అనే చర్చ తరువాత అందుకుంటుంది. అన్నీ అందరికీ అంగీకారాలు కావచ్చు, కాకపోవచ్చు. కొన్ని నవలల్లో ఒక ధోరణి బాహాటంగా కన్పించవచ్చు. అందుకే

రచన చేస్తున్నాడా? అని అనిపించవచ్చు. కొన్ని సిద్ధాంతాలపై విశ్వాసం అభిప్రాయాలపై అభిమానంతో – ఇవి అందరికీ తెలియజేయాలన్న ఆరాటం, కారణం కావచ్చు. ఉద్దేశంపై నిశ్చయభావంతో జీవితాన్ని దర్శింపజేసే లక్షణం నవలకు ఉంది. ఏదో ఉబుసుకుపోకకై వ్రాసే నవల్లో దీనికంత పట్టింపు ఉండదు. సాధారణ పరిశీలనలో ఏదో ఒకటి అందకనూ పోదు. గొప్ప నవల్లో అనివార్యంగా కన్పించే అన్వేషణ చింతన కారణంగా జీవితాన్ని గురించి నిర్దిష్టమై ఉద్దేశంలోని ప్రయోజనతత్పరత వీటిలోఉండదు. సామాజిక స్పృహగల పాఠకుడు చదివేప్పుడు ఏదో లోపించినట్లుగానే అనుభవాన్ని పొందుతాడు. దీని కొరతవల్ల అనుభవంలో సంపూర్ణతకు లోపం కలిగేమాట నిజం. నవల చదవడం ముగించగానే కళాత్మకమైన విలువలతోపాటు జీవితం గురించి మనస్సు ఆలోచనలో తప్పకుండా నిమగ్నమౌతుంది. ఇది జీవిత సత్యాన్నీ, సాహిత్యంలో దీనికున్న బలమైన స్థానాన్నీ స్పష్టం చేస్తుంది. ఈ జీవన సాదృశ్యాన్ని నిర్దిష్టమైన మార్గంలో ఆలోచనకు తేవడం – రచయిత దర్శనశక్తికి గీటురాయి.

ఏదో దొరికిన అవకాశాన్ని తీసుకొని ఏవో నైతిన ప్రవచనాలతో, సిద్ధాంతాల చర్చలతో, అభిప్రాయాల వాదోపవాదాలతో నింపే ప్రయత్నం కొన్ని నవలల్లో కన్పిస్తుంది. ఇది కొన్ని పరిమితుల్లో ఉన్నపుడే కళాసౌందర్యాన్నీ ప్రయోజనశక్తినీ పొందుతుంది. రచయిత జీవితాన్ని గురించి ఏమనుకునేదీ, జీవితాన్ని ఏ విధంగా చూసేదీ, ఎలా ఉండాలనుకునేదీ, దీనికవసరమైన స్థితీ అన్నీ రచనలో ఇతివృత్తం పాత్ర సంభాషణ మొదలైన అంశాల నిర్వహణంలోచక్కగా సంయోజనం పొందిన శిల్పంచేత స్ఫూర్తికి తేవడం మరొక పద్ధతి. ఇది సాహిత్యంలో పైదానికన్నా చాలా ఉత్తమమైంది. ఒక్కొక్కప్పుడు సిద్ధాంతాలూ, అభిప్రాయాలు, నైతికమైన విలువలూ ప్రసక్తం కావచ్చు. వివరణమూ అపేక్షించవచ్చు. ఏమైనప్పటికీ, రచయిత నైతికవాది కన్నా సిద్ధాంత ప్రచారకుడుకన్నా కళాకారుడుగా ప్రశస్తిని పొందడమే సాహిత్యజగత్తులో అభిలషణీయం, సమాదరణీయం. మానవ జీవితాన్ని గురించి పరిశీలనం, వివరణం, చిత్రణం, దర్శనం, అన్నీ సృజనాత్మక ప్రక్రియయైన నవల్లో కళాపరంగా సాగడంలోనే విశిష్టత ఉంది. రచయిత ఎంతో ఉన్నతమైన శిఖరం నుండి జీవితాన్ని దర్శిస్తాడు. సాధారణ సత్యాలు వస్తుగతమైన దృష్టితో వ్యక్తం చేస్తాడు. మనస్తత్వ ప్రకాశనం గావిస్తాడు. సైద్ధాంతికంగానూ, విశేష భావ సమర్పకంగానూ పరిశీలిస్తాడు. ఏదైనా రచయిత సృజనరూపంలో భాగం పరిణమించడమే కావలసింది. పాఠకుల మనస్సుపై ఎంతో శక్తివంతమైన ప్రభావాన్ని నెరపే నవల సాధారణ పరిధుల్ని దాటి, విశ్వజనీన లక్షణంతో ఆకర్షించడం ఉత్తమం.

# III

జీవితం నుండి వస్తువు ఎన్నుకోవడం దాని రూపాన్ని సరిదిద్ది వివరించడం ఒక ఎత్తూ, దర్శనశక్తితో ఉదాత్తమైన ఉద్దేశాన్ని నిర్దేశం చేయడం మరొక ఎత్తూ, వాస్తవానుభవాల్ని చిత్రిస్తూ రచయిత ఉద్దేశం నవల్లో ఎక్కడో ఒకచోట ప్రకాశిస్తుంది. నాటకంలో రచయిత ఉద్దేశం పరోక్షపద్ధతిలో పాత్రల ముఖతః స్ఫుటం ఔతుంది. నవల్లో ప్రత్యక్షపద్ధతికీ అవకాశం ఉంది. పాత్రద్వారానే కాక రచయిత నేరుగానూ వ్యక్తం చేసే అవకాశం ఉంది. ఈ ప్రక్రియలోని ఈ ప్రత్యేక గుణం రచయిత ఎంతో మెలకువతో కళాత్మకంగా ఉపయోగించుకోవలసిన అవసరాన్ని పదేపదే గుర్తుకు తెస్తుంది కూడా.

జీవితం నుండి వస్తువు ఎన్నుకోవడం, దీన్ని తన పథకాన్నిబట్టి స్వేచ్ఛగా ఉపయోగించుకోవడం, తాను స్థాపించే భావప్రపంచాన్నీ, సిద్ధాంతాన్ని నిశ్చయించుకోవడం ఇవి రచయిత నవల్లో క్రమించే వివిధ దశలు. జీవితదర్శనాన్ని అవగాహన చేసుకోవడానికి– 1) జీవితవాస్తవం, 2) దాని నైతికత, 3) సామాజిక దర్శనం, 4) ఆదర్శం – అనేవి పరిశీలనార్హాలవుతాయి. వాస్తవమైన నీతికి సంబంధించిన విలువలతో సాధారణ స్థాయికి చెందిన రచయిత ఏదో విధంగా నెట్టుకొనిపోవచ్చు. నవల్లో వాస్తవం జీవితం, కొన్ని విలువలచేత తీర్చబడి, నిర్దిష్టమయిన ఉద్దేశం కేంద్రస్థానాన్ని వహిస్తుంది. సామాజికదర్శనం పొందాలనుకున్నపుడే రచయిత వ్యక్తిత్వానికి సమగ్రత సిద్ధిస్తుంది. మనల్ని ఆకట్టుకుంటుంది.

1) సంప్రదాయమైన విలువల్ని గుర్తించడం, 2) నైతికమైన విలువల్ని కాపాడడం, 3) మానవతావాదాన్ని ఆవిష్కరించడం, 4) సంస్కరణదృక్పథాన్ని కలిగించడం, 5) నిశ్చయమైన సిద్ధాంతాన్నీ వ్యవస్థనూ లక్షించడం – పరిశీలనకు వస్తాయి.

మానవునికీ, సంఘానికీ పరస్పర సంబంధం ఉన్నంతవరకు, సంఘాన్ని గురించి మానవునికీ, మానవుని గురించి సంఘానికీ, ఆలోచన తప్పదు. వ్యక్తుల సమాహారం సంఘమైతే, సంఘంలో ఒక బిందువు వ్యక్తి – సంఘం వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుంది. వ్యక్తి తన వైశిష్ట్యంచేత సంఘానికి రూపాన్ని ఇస్తాడు. ఏ కాలమైనా ఏ వ్యవస్థ ఐనా మనుష్యులందరినీ కలిపేది మానవత. ఏ సాంఘిక వ్యవస్థలోనూ, ఏ రాజకీయ పరిస్థితిలోనూ ఇది పరిహరింపరానిది. ఏదీ మానవతా వ్యతిరేకమైందిగా ఉండటానికి వీలులేదు, ఉండలేదు.

నవల ప్రధానంగా మానవ జీవిత విశ్లేషణం, వివరణం, చిత్రణం, దర్శనం కావడం చేత మానవతాదృష్టి ఉండితీరుతుంది. అయితే దీన్ని అధిగమించి ఉద్దేశాన్ని నిర్దేశించడంలో ప్రయత్నం జరుగుతుంది కూడా. జీవితంలో వలెనే, సాంఘిక రాజకీయ నైతిక మనస్తత్వ ప్రభావాలు ఒకదానిపై ఒకటి ప్రసరిస్తూ ఒక్కొక్క విధంగా నవల్లో సమన్వయం పొందుతూంటాయి.

ఈ భావ ప్రసారం మానవతా కేంద్రంగా నాలుగు విధాలుగా కన్పిస్తుంది -

1) ప్రాచీన సంస్కృతీ పునరుజ్జీవనం
2) సంస్కరణం పరివర్తనంపై అభిలాష
3) ప్రజాస్వామ్య భావన
4) సామ్యవాద దృక్పథం - విప్లవదృష్టి
5) సమన్వయ దృష్టి - స్వయం వ్యక్తిత్వ ప్రకాశనం

ఈ ఐదింటిని అనేక రచనల్లో విడివిడిగానూ, సంకీర్ణంగానూ గమనించవచ్చు. రచయిత విశ్వాసం, సిద్ధాంతం బట్టి నవల్లో ఉద్దేశం నిర్దేశితమౌతుంది. రచయిత వ్యక్తిత్వాన్నిబట్టి జీవితదర్శనం జరుగుతుంది.

"విజయ చరణం బ్రతుకలో నిలిపి మనిషీ సాగిపో,
మానవీయ సూర్యునితో ప్రజాస్వామ్య పతాకతో"

9 789356 925793